DIGITAL LIBRARY OF INDIA

Hosted by
International Institute of Information Technology, Hyderabad

Declaration to be given by the Author/Publisher to D
In-copyright books.

To
The Digital Library of India,
IIIT, Hyderabad

Name of the Author/Publisher: S.B.P.B.K.Sat

Address: Kapileswarapuram
E.G. Dist

City:
State: A.P.
Phone no:
Email:

We are happy to grant permission to Digital Librar
scan all the books published by our organization / writter
permission in this letter also authorizes and grants an N
right to the Digital Library of India to scan, digitize and c
books published by the said publisher / Author in the DLI/
with out any financial implications from DLI

We will continue to retain the copyright for the bo
can make it free to the read for the general public.
provide the above contact information for anyone wishin
the physical book from us.

SL.NO	TITLE	LANGUAGI
1	శ్రీమద్వాల్మీకి రామాయణం ఉత్తరకాండం	TELUGU
2	" " అయోధ్యాకాండం, బాలకాండం	"
3	" " అరణ్య, కిష్కింధ, సుందరకాండం	"
4	" " సుందరకాండం	"
5	" " యుద్ధకాండం	"
6	కబీరుదాసు చరిత్రము	"
7	తిరుప్పావై	"

PS: please add separate sheet for all your titles.

Sincerely,

Signature: [signature] 8/9/08

Name: S.B.P.B.K.SATYANARAYA

Designation: KAPILESWARAPURA

Company: E.G.Dist. A.P.

Date: 8.9.2008

శ్రీమద్వాల్మీకి రామాయణము



బాలకాండము - అయోధ్యాకాండము

శ్రీరస్తు

శ్రీరామచంద్రసద్గురుపరబ్రహ్మణేనమః.

ఐహికాముష్మికఫలప్రదంబును, వాల్మీకిమహర్షిప్రణీతంబును, నగు

శ్రీమద్వాల్మీకిరామాయణము

బాలకాండము-అయోధ్యాకాండము.

ఈ గ్రంథము.

కాశ్యపసగోత్రసంభూతుండును, సీతారామార్యపుత్రుండును,నగు

బరహారు - త్యాగరాయశాస్త్రులచే

నిఖిలజగదుపకారార్థము

యథావాల్మీకముగసులభశైలితో తెనుగునవచనకావ్యముగరచియింపఁబడి

స్వకీయ

గీర్వాణభాషారత్నాకరముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడి ప్రకటింపఁబడియె.

చన్నపట్టణము.

౧౮౯౩ సం॥

౧—వాల్యూము.

ముద్రణాము 2005

ప్రతులు 1000

ప్రచురణ శ్రీ సర్వారాయ ధార్మిక విద్యా ట్రస్టు
కాకినాడ, తూ గో జిల్లా
పిన్ 533 001

సర్వస్వామ్య సంకలితము

ప్రతులకు సర్వారాయ ధార్మిక విద్యా ట్రస్టు
పాలనా విభాగము
కపిలేశ్వరపురం - 533 309
తూ గో జిల్లా

ముద్రణ శ్రీ లక్ష్మి గణపతి బైండింగ్ వర్క్స్
మెయిన్ రోడ్, కొవ్వూరు
ఫోన్ 08813 - 231575

శ్రీరస్తు.

శ్రీరామచంద్రసద్గురుపరబ్రహ్మణేనమః

అవతరణిక

పుణ్యాత్ములారా!

శ్లో॥ ఏకైకమక్షరం ప్రోక్తంమహాపాతకనాశనమ్॥ అని, ఒక్కొకఅక్షరమునుపఠించిన మాత్రముననే మహాపాతకములనుబోగొట్టి ఐహికాముష్మికఫలముల నిచ్చునట్టిదియును, ఆదికవియగు వాల్మీకిమహర్షిచే సంస్కృతభాషయందు శ్లోకరూపముగ రచియింపఁబడినదియును, ఇరువదినాలుగువేల గ్రంథసంఖ్యగలదియునునగు శ్రీమద్వాల్మీకిరామాయణము, అఖిలజనపారాయణోపయుక్తముగనున్నదిగదా; అట్టిశ్రీమద్వాల్మీకిరామాయణము సంస్కృతభాషయందుండుటచే సంస్కృతభాషా పరిజ్ఞాతలకుందప్ప, ఇతరులకుదురవగాహంబని భాస్కరుండనుకవి తెనుగునపద్యకావ్యముగరచియించె. ఆపద్యకావ్యము సుమారుపండ్రెండువేల గ్రంథముగనున్నది. మఱియురంగనాధుడనుకవి తెనుగున ద్విపదకావ్యముగనురచియించె. ఆద్విపదకావ్యము సుమారు పదివేలగ్రంథముగనున్నది. ఇట్లుభాస్కరరంగనాధులు రచియించిన భాస్కరరామాయణమును రంగనాధరామాయణమును వాల్మీకిరామాయణముయొక్క గ్రంథసంఖ్యకంటె తక్కువగ్రంథసంఖ్యగనుండుటచే వర్ణనాంశములుమొదలగువానిని, త్రోసివేసి కథాభాగములను మాత్రము రచియించినట్లు స్పష్టమగుచున్నది. కాబట్టిశ్రీమద్వాల్మీకిరామాయణమును, ఇదివఱకు, ఎవరునుసమగ్రముగ తెనుగుభాషయందు రచియించినట్లు గనబడనందున అఖిలజగదుపకారార్థము తెనుగున వచనకావ్యముగరచియించితిని. తపోధనుఁడగు వాల్మీకిమహర్షియొక్క యభిప్రాయమునంతయు వివరముగ స్త్రీలకుబాలురకుగూడ బోధయగునట్లు సులభశైలితో తెనుగునవచనకావ్యముగ రచియించుటచే సంస్కృతవాల్మీకిరామాయణమునకంటె, ఈతెనుగువచనకావ్యశ్రీమద్వాల్మీకిరామాయణము సుమారుమూడింతల గ్రంథమయ్యె. అట్టియీగ్రంథము ఆచంద్రార్క స్థాయిగానుండునట్లు ముద్రింపించి ప్రకటించినాను.

ఇట్లు

బరూరు-త్యాగరాయశాస్త్రులు.


శ్రీరస్తు.

విషయానుక్రమణిక.

బాలకాండ అయోధ్యాకాండ విషయసూచిక ముగిసెను.

శ్రీరస్తు.

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.



శ్రీ వాల్మీకిరామాయణము - బాలకాండము.

శ్లో॥ వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే। వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా॥

శ్లో॥ కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్। ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్॥

శ్లో॥ గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్। రామాయణమహామాలారత్నం వందేనిలాత్మజమ్॥

—(*) నారదునితో వాల్మీకిముని ప్రశ్నచేయుట. (*)—

ఎల్లప్పుడును తపస్సునందును, వేదాధ్యయనమునందును, మిక్కిలి ప్రీతిగలవాఁడును, తపోవంతులలో నుత్తముఁడును, చక్కఁగ మాటలాడ నేర్చినవారలలో శ్రేష్ఠుఁడును, మునిశ్రేష్ఠుఁడు నగు, నారదమహామునినిఁ జూచి వాల్మీకిమహాముని యిట్లనియె. మునికులోత్తమా! ఇప్పుడీ భూలోకమునందు సకలసద్గుణములను గలిగియున్నవాఁడెవ్వఁడు? మిగులపరాక్రమము గలిగియున్నవాఁడెవ్వఁడు? ధర్మములను దెలిసినవాఁడెవ్వఁడు? చేసినమేలు మఱవక సనరుగలిగి సంచరించువాఁడెవ్వఁడు? నిజముగఁ బలుకువాఁడెవ్వఁడు? ప్రానినకార్యము తుదముట్టువఱకును వదలక ప్రయత్నించువాఁడెవ్వఁడు? సచ్చరిత్రలతోఁ గూడియున్నవాఁడెవ్వఁడు? సర్వజంతువులయందును హితముగలవాఁడెవ్వఁడు? విద్వాంసుఁడెవ్వఁడు? సమర్థుఁడెవ్వఁడు? సర్వ[illegible]లయందును ప్రియముతోఁ జూడఁదగినవాఁడెవ్వఁడు? ధైర్యముగలవాఁడెవ్వఁడు? కోపములేనివాఁడెవ్వఁడు? అసూయ లేనివాఁడెవ్వఁడు? యుద్ధమునం దెవనికోపమునకు దేవతలుగూడ భయమును జెందుదురు? ఈవిషయమును వినవలయునని మిగులఁ ప్రేమగలిగియున్నదనిన మూఁడులోకముల వృత్తాంతములను దెలిసిన నారదమహాముని విని మిగుల సంతోషముతో నిట్లనియె

—* { వాల్మీకిమహామునితో నారదుండు రామాయణమును సంగ్రహముగఁ జెప్పుట. } *—

వాల్మీకిమునివర్యా! నీవడిగిన గుణములనేకములు. ఇన్నిగుణములు లోకమునియందుండుట దుర్లభము. అయినను నాకు దెలిసినవారిలో నిన్నిగుణములను గల వానిని దెలియఁజేసెదను. సావధానుఁడవై వినుము. శ్రీరాముఁడనువాఁ డిక్ష్వాకుకులమునందుఁ బుట్టియున్నాఁడతని నెల్లవారలును జెప్పుచున్నారు.

అతడు నియతస్వభావముగలవాఁడు. అత్యధికమయినపరాక్రమముగలవాఁడు. స్వయముగ ప్రకాశించువాఁడు. నిరతిశయానందుఁడు. ఎల్లలోకములను స్వాధీనముగఁజేసికొనువాఁడు. సర్వజ్ఞుఁడు. మహాశాస్త్రములను సంపూర్ణముగ నెఱిఁగినవాఁడు. మనోహరముగ మాటలాడనేర్చినవాఁడు. శ్రీమంతుఁడు. శత్రువులనిర్మూలనము సేయువాఁడు. ఎగుభుజములు గలవాఁడు. ఆజానుదీర్ఘబాహువులు గలవాఁడు. శంఖమునకుఁ దుల్యమగుకంఠముగలవాఁడు. విపులములగు కపోలములుగలవాఁడు. విశాలమగు ఱొమ్ముగలవాఁడు. సర్వోత్తమమగుధనుస్సుగలవాఁడు. మిగులబలిసిన జత్రుప్రదేశముగలవాఁడు. కామక్రోధాదులనుజయించువాఁడు. సువృత్తమగుశిరస్సుగలవాఁడు. విశాలమగుఫాలతలముగలవాఁడు. అత్యధికమగు విక్రమముగలవాఁడు. అతిదీర్ఘములును నత్యల్పములునుగాని యవయవములుగలవాఁడు. మృదువగువర్ణముగలవాఁడు. బలిసినఱొమ్ముగలవాఁడు. విశాలములగు నేత్రములుగలవాఁడు. అవయవశోభగలవాఁడు. మఱియు ననేకములగు శుభలక్షణములుగలవాఁడు. ధర్మములను జక్కఁగఁదెలిసినవాఁడు. సత్యసంధుఁడు. సర్వకాలములయందును ప్రజలకుహితముగనుండువాఁడు. కీర్తిగలవాఁడు. జ్ఞానసంపన్నుఁడు. శుచిగలవాఁడు. ఆశ్రితులకు స్వాధీనుఁడైయుండువాఁడు. ఆశ్రితజనులను గాపాడుటయం దధికనిష్ఠగలవాఁడు. బ్రహ్మదేవునకుఁదుల్యుఁడు. ఎడతెగనిలక్ష్మిగలవాఁడు. ఎల్లవారలకునుపోషకుఁడు. జీవలోకమునకురక్షకుఁడు. ధర్మమును జక్కఁగఁబరిపాలించువాఁడు. స్వధర్మములనువదలనివాఁడు. బంధుపోషకుఁడు. వేదవేదాంగముల యర్థమును దెలిసినవాఁడు. ధనుర్వేదమును సమగ్రముగ నభ్యసించినవాఁడు. సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞుఁడు. జన్మాంతరీయాది వృత్తాంతములనెఱిఁగినవాఁడు. వ్యవహారసమయములయందు శ్రుతాశ్రుతములను శీఘ్రముగఁదెలిసికొనునట్టి సామర్థ్యముగలవాఁడు. సర్వలోకప్రియుఁడు. సాధువు, కార్పణ్యములేనివాఁడు. అతివిచక్షణుఁడు, మహానదులతో సముద్రముగూడియున్నవిధమున సర్వకాలములయందును సజ్జనులతోగూడియుండువాఁడు. ఆర్యుఁడు, సర్వసముఁడు. సర్వకాలములయందును ప్రియముగఁజూడఁదగినవాఁడు. ఇంక ననేకములగు గుణములుగలవాఁడు. కౌసల్యాదేవికిఁబుత్రుఁడు. గాంభీర్యముచేత సముద్రమునకుసమానుఁడు ధైర్యమునకు హిమవంతుఁడనఁదగియున్నవాఁడు. పరాక్రమమునకు విష్ణుదేవునకుఁదుల్యుఁడు చంద్రునివలె సర్వలోకప్రియదర్శనుఁడు. కోపమునందుఁ గాలాగ్నికిసముఁడు. భూమివలెనోర్పుగలవాఁడు. కుబేరునిచందముగఁ ద్యాగమును జేయువాఁడు. యమునివలె సత్యముగఁబాలించువాఁడు. సత్యపరాక్రమములు గలవాఁడు. అత్యుత్తమగుణములచేత నందఱకంటెఁబెద్దవాఁడు. సర్వకాలములయందును బ్రియమును సేయువాఁడు. ఇట్టి యనేకములగు సుగుణములుగల రామచంద్రుఁడను తనయునిజూచి దశరథుఁడు మహానందమునుబొందిన మనసుగలవాఁడై యువరాజ్యమునం దభిషిక్తునిజేయఁదలఁచె. ఇష్టార్థంబుగఁదలఁచి యభిషేకమహోత్సవంబునకుఁ దగినపదార్థములసంపాదించె. అదియంతయును దెలిసికొని యాదశరథునిభార్యయగుకైక యోర్వలేమితనముచేఁ దనదుభర్తతోనిట్లనియె.

రాజేన్ద్రా! తొల్లి నాకుఁగోరినప్పుడు రెండువరములనిచ్చెదనని చెప్పితివిగదా? ఆవరములరెండును నిప్పుడివ్వవలయు నవియెవ్వియనిన; రామునకు వనవాసమును భరతునకు యౌవరాజ్యమునునివ్వుమనిన విని దశరథుఁడు. సత్యశీలుఁడగుటచే నేమియునుజేయఁజాలక కైకవచనానుసారముగఁ బ్రియపుత్రుఁడగు శ్రీరాముని వనవాసమునకుఁ బంపెను. అంత నా రామచంద్రుఁడు పితృవాక్యమునుబరిపాలించుటకును, సవతితల్లికి బ్రియముజేయుటకును నరణ్యమునకుఁజనియె. అట్లు పోవునపుడతనికిఁ దమ్ముఁడగు లక్ష్మణుఁడును నతనితోఁగూడఁజనియె. ఆలక్ష్మణుఁడతివినయముగలవాఁడు సుమిత్రాదేవికిపుత్రుడు. మఱియునన్నయగురామునియందు మిగులవిశ్వాసముగలవాఁడు. అట్లయ్యిరువురునుబోవునపుడు రామునిభార్యయగు సీతాదేవియునుబయలువెడలిచనియె. అయ్యమ రామునకుఁబ్రాణతుల్యురాలు జనకమహారాజునకుఁ బుత్రిక. సాక్షాద్దేవమాయనుబోలినయది. సర్వలక్షణసంపన్నతగలస్త్రీరత్నము. ఇట్టియంగనారత్నము చంద్రుననుసరించి తిరుగురోహిణిమాడ్కి రామునితోఁగూడఁజనియె.

అట్లు బయలువెడలిపోవుచున్న సీతారామలక్ష్మణుల వెంటనంటి దశరథుఁడును బౌరులును గొంతదూరమువరకు పోయిరి. గంగాతీరమునందలి శృంగిబేరపురమునందు రాముఁడు సూతునివదలె. పిదపనిషాదాధిపతియగు గుహునిఁ గనె. అంతనాగుహునితోఁగూడ సీతారామలక్ష్మణులుసంభాషించియందుండి బయలువెడలియనేకములగు నదులను వనములను నతిక్రమించిభరద్వాజమునివరు ననుమతంబునఁజిత్రకూటంబునుబొందిరి అందురమ్యమగు నావాసమును గల్పించుకొని యావనమునందు దేవగంధర్వులవంటి సీతారామలక్ష్మణులు ముగ్గురును నివసించిరి. ఇవ్విధముగసీతారామలక్ష్మణులు ముగ్గురును జిత్రకూటమునందుండుటను

వినిదశరథుఁడు పుత్రశోకాతురుఁడై యత్యధికంబుగ రోదనంబును జేయుచు మరణమును బొందె. అట్లు దశరథుఁడు మృతినొందిన పిదప వసిష్ఠాది మునివరులు భరతునకు రాజ్యము నేలుకొనుమని బోధించిరి. అట్లు మహాత్ములు బోధించినను వినక యా భరతుఁడు రాముని పాదముల సేవించెదననుచు నరణ్యమునకుఁ బోయి మిగుల మాహాత్మ్యము గలవాఁడును, సత్యపరాక్రమము గలవాఁడును నగు రామునిఁ జూచి వినయముతో సదభిప్రాయముగలవాఁడై యిట్లనియె. అన్నా రామచంద్రా! నీవు ధర్మజ్ఞుఁడవు. కావున నీవు రాజవై రాజ్యభారమును వహింపుమనియె. ఆవచనమును వినియును, పరమోదారుఁడును, మిగులఁ గీర్తిగలవాఁడును, సుముఖుఁడునునగు రాముఁడు పితృవాక్యమును నతిక్రమింపఁగూడదని తలఁచి యంగీకరించక తనదు పాదుకలను భరతునకిచ్చి యనేకవిధములగు నీతులను జెప్పి యాభరతుని బంపె. అట్లు పంపుటచే భరతుఁడు విఫలమైన మనోరథము గలవాఁడై రాముని పాదములకు నమస్కారమును [illegible] బయలు వెడలి నందిగ్రామమునకుఁ బోయి యందు నివసించి రాముఁ డెప్పుడు వచ్చునోయని తలఁచుచుండె. మఱియు నా నందిగ్రామమునందుండియే రాజ్యపరిపాలనను జేయుచుండె. అట్లు భరతుఁడు పోయిన పిదప రాముఁడిందు నివసించితిమేని మాటిమాటికిని నగరవాసులు వచ్చి పిలుతురను తలంపుచేత నందుండి బయలు వెడలి సీతాలక్ష్మణులతోఁ గూడ దండకారణ్యమునఁ బ్రవేశించి రాజీవలోచనుఁడైన యా రాముఁడు విరాధుఁడను రాక్షసుని సంహరించె. పిమ్మట శరభంగ మునివరుని దర్శించె. మఱియు నత్యుత్తముఁడగు నగస్త్యమునివరుని జూచె. అయ్యగస్త్యుని భ్రాతను గూడ నిరీక్షించె. అంతనయ్యగస్త్యమునివరు ననుగ్రహముచేత నింద్రదత్తమగు ధనుస్సును గ్రహించె. మఱియు ఖడ్గమును నక్షయబాణములుగల యంబుల పొదులను గూడ గ్రహించె. ఇవ్విధముగ ఖడ్గచాపతూణీరములను గ్రహించి యా వనమునందలి వనచరులతోఁ గూడఁ దిరుగుచుండె. అట్లు తిరుగు సమయమునం దనేకులగు మునివరులు వచ్చి యందలి రాక్షసుల సంహరింపుమని ప్రార్థించిరి. అంతట నా రామచంద్రుఁడు మహావినయముతో నమ్మునుల వచనములను విని రాక్షసుల సంహరించెదనని ప్రతిజ్ఞను జేసి నగ్నికల్పులును, దండకారణ్యవాసులును, నగు మునివరుల సత్కృత్యములకు విఘ్నములు గలుగకుండునటుల నందలి దుష్టరాక్షసుల ఖండించుచు నయ్యరణ్యమున నివసించియుండునపుడు జనస్థాననివాసియగు శూర్పణఖయను రాక్షసియొక్క ముక్కుచెవులను గోసి విరూపినిఁ జేసె. అదియనేకరూపముల నిచ్ఛానుసారముగ ధరించునట్టి సామర్థ్యముగలది. ఆ చుప్పనాతియొక్క మాటలను విని యుద్ధమునకు వచ్చిన ఖరదూషణ త్రిశిరులను రాక్షసులను సంహరించె. మఱియు నయ్యరణ్యమునందే నివసించి జనస్థాననివాసులగు పదునాలుగు వేల దనుజులను వధించె. అట్లు రాక్షసులను జంపుటను విని రావణుఁడు కోపావిష్టుఁడై మారీచుఁడను రాక్షసుని సహాయముగ వరించె. అమ్మారీచుఁడు బహువిధములగు నీతివచనములను జెప్పె. మఱియు నో రావణా! బలవంతుఁడగు రామునితో వైరము నవలంబించుట యుచితము గాదనియె. రావణుఁడు మరణకాలము సమీపించియుండుటచేత నా మారీచుని వచనములను వినక యా మారీచుని దోడ్కొని రఘురాముఁడు నివసించిన వనమునకుఁ బోయి యందు మాయావృత్తిచే రామలక్ష్మణులను దూరముగఁ బోవునటుల జేసి సీతామహాదేవిని నపహరించి జటాయువను గ్రద్ధను సంహరించె. అట్లు జటాయువు చంపఁబడుటయును, భార్య నపహరించుటయును దెలిసికొని శ్రీరాముఁడు శోకసంతప్తచిత్తుఁడును వికలేంద్రియుఁడును నయ్యె. అట్లు దుఃఖమును బొందుచు జటాయువునకు విధ్యుక్త ప్రకారముగ దహనాదికృత్యములను నెరవేర్చి నరణ్యములయం దెచ్చోట నుండునోయని సీతామహాదేవిని వెదకుచు నా రామలక్ష్మణులు కబంధుఁడను రాక్షసునిఁ జూచె. అద్దనుజుఁడు వికృతాకారుఁడును ఘోరరూపుఁడును నై యుండిన నా రాక్షసుని సంహరించె. అంత నా రాక్షసుఁడు స్వర్గమునకుఁ బోవుచు శబరియనునది ధర్మచారిణియనియును, దానిం జూచుటచే మేలు గలుగుననియును జెప్పె. అంతట శత్రుసంహారకుఁడగు నా రామచంద్రుఁడు శబరిని బొడఁగనె. పిదప నా దశరథరాజనందనుఁడగు రాముఁడు చక్కగ శబరిచేతఁ బూజితుఁడై యందుండి బయలు వెడలి హనుమంతుఁడను వానరోత్తమునితో సంగతుఁడయ్యె. అయ్యాంజనేయుని వచనములను విని సుగ్రీవుతో సఖ్యమును జేసి తనదు వృత్తాంతమును సర్వమును సుగ్రీవునకుఁ దెలియఁజెప్పె. అట్లు మొదటనుండి జరిగిన వృత్తాంతమును సర్వమును విని సుగ్రీవుఁడును రామునితో నగ్నిసాక్షికముగ సఖ్యమును జేసిన రాముఁడు మిగుల సంతోషమును బొందె. పిదప నా సుగ్రీవుఁడు వాలితోఁ దనకుఁ గలిగిన వైరవృత్తాంతమును సర్వమును దెలియఁజెప్పిన యా రాముఁడు వాలిసంహారమును జేసెదనని ప్రతిజ్ఞను జేసె. అంతట నా సుగ్రీవుఁడు వాలిబలమును సర్వమును దెలియఁబరచి వాలిసంహారమును జేయుట దుర్లభమను తలంపుచేత సందేహముగలవాఁడయ్యె. పిదపఁ దనకు నమ్మకము గలుగుటకొఱకు సర్వోత్తమమును, పర్వతసన్నిభమునగు దుందుభిశరీరమును శ్రీరామునకుఁ జూపె. మహాబలుఁడగు రాముఁడా

శరీరమునుజూచినవ్వి యలక్ష్యముగతనదు పాదాంగుష్ఠముచేతఁ బదియోజనములదూరముచిమ్మె. మఱియునొక్కఁడేబాణముచేత నేడుసాలవృక్షములను భేదించె. మఱియు నబ్బాణమాపర్వతమును, పాతాళలోకములలో నాఱవదియగు రసాతలలోకమును భేదించె అట్లు సేయుటకువానరోత్తముఁడగు సుగ్రీవుఁడుమహాప్రీతచేతస్కుఁడును, నమ్మికగలవాఁడునునై శ్రీరామునితోఁగూడఁ గిష్కింధయనుగుహకుఁజనియె. ఇట్లుపోయిస్వర్ణమువలెఁ బ్రకాశించుశరీరముగలసుగ్రీవుఁడు భయంకరముగగర్జించె ఆమహానాదమునువిని యాగృహమునుండివాలి బయలువెడలివచ్చె. వచ్చునపుడువాలిభార్యయగుతార నీవిప్పుడుయుద్ధమునకుబోవద్దు సుగ్రీవుడు పరంధాముడగు శ్రీరామునిసహాయముగ జేసికొనివచ్చియున్నాడనిన పరమధార్మికుఁడగురాముడు నిరపరాధినగునన్ను వధింపఁడని తారనూరార్చె. అట్లుసుగ్రీవవచనానుసారముగ యుద్ధమునందు వాలినిజంపి యావానరరాజ్యమునకు సుగ్రీవునిరాజుగఁజేసె. అంతనాసుగ్రీవుడు తనకుపరిచారకులగు వానరులనందఱఁబంపించి సీతామహాదేవినివెదకి యెచ్చోటనున్నదియునుగనుఁగొనివచ్చుటకు నానాదిక్కులకుఁబంపె. అట్లుసీతాన్వేషణమునకుఁబోయిన వానరులలోబలవంతుఁడగు హనుమంతుఁడు సంపాతివచనములనువిని నూఱామడపరిమితిగలలవణమహాసముద్రమును ననాయాసముగదాటి రావణపాలితమగు లంకాపురమునకుఁబోయి యందశోకవనికామధ్యయందున్నదియును, రామాసక్తచిత్తము గలదియునునగు సీతామహాదేవినిజూచి రాముఁడిచ్చిన యానవాలునొసంగి సకలవృత్తాంతమును దెలియఁజెప్పి యూరడించె. పిదపఁదోరణమునుమర్దించి యైదుగురుసేనాపతులనుద్రుంచి యేడ్గురుమంత్రిసుతులనుయమునికడకనిపి శూరుఁడగునక్షకుమారునివధించి తాఁబట్టువడియె. పిదపబ్రహ్మదేవునివరప్రభావంబున బ్రహ్మాస్త్రమువలన విముక్తుఁడైరజ్జుయంత్రములచేఁ దననుబంధించినరాక్షసుల యపరాధములసహించుచు నారజ్జుబంధములనుండితొలఁగి సీతాదేవియున్నప్రదేశమునుదప్పఁ దక్కినలంకాపురమును సర్వమును దగ్ధముసేసి రామునకుఁబ్రియవృత్తాంతమును జెప్పుటకు మరలనేగుదెంచె. అట్లువచ్చి రామునకుఁ బ్రదక్షిణనమస్కారములొనరించి మహాత్మురాలగుసీతను జూడగంటినని తెలియఁజెప్పినవిని రాముడుమహానందమునుబొంది సుగ్రీవాదివానరసహితముగ సముద్రతీరమునకుఁబోయి సూర్యసంకాశములగు బాణములచేతసముద్రమునకు క్షోభనుగలుగఁజేసిన సముద్రుఁడుమిగులభయమును జెంది తనదునిజస్వరూపమును జూపించినవాడదశరథనందనుండు సముద్రునివచనానుసారముగ నళుఁడనువానరునిచే సేతువునుగట్టించియమ్మార్గమునలంకాపురమునకుఁబోయియుద్ధమునందు రావణునిసంహరించి మిగులలజ్జాక్రాంత చేతస్కయగుసీతామహాదేవినిజూచి యందొకసభనునిర్మించి యాసభయందుఁ గొన్నిపరుషవచనములబల్కిన నవ్వచనములకుసహింపఁజాలక జానకియగ్నియందుప్రవేశించె. అప్పుడగ్నిహోత్రుఁడా సీతవిగతకల్మషురాలనిచెప్పి రామునకునప్పగించె. అంతట రాముఁడు మహానందమునుబొంది దేవతలచేఁబూజితుఁడయ్యె. అట్లుమహదద్భుతమగు రామునికర్మకు చరాచరాత్మకములగు ముల్లోకములవారును సంతుష్టహృదయులైరి. అంతటరామచంద్రుఁడు, విభీషణునిలంకాపురమునకు నభిషిక్తునిఁజేసి రాక్షసేంద్రత్వము నొసంగె. అట్లురాముఁడు కృతకృత్యుఁడగుటచే విజ్వరుఁడై మోదమునుబొందె. పిదపదేవతలవలన వరములనుగొని సుహృత్పరివృతుఁడై పుష్పకవిమానమునెక్కి యయోధ్యాపట్టణమునకుఁ బయనమయ్యె. అట్లు బయలువెడలి సత్యపరాక్రముఁడగు రాముఁడు భరద్వాజాశ్రమమునకువచ్చి భరతునొద్దకు నాంజనేయునంపె మఱియునారామచంద్రుఁడు పూర్వవృత్తాంతమును సర్వమునుజెప్పుచుసుగ్రీవసహితుఁడై పుష్పకమునుడిగ్గి నందిగ్రామమునకుఁబోయియానందిగ్రామమునందు జటనువదలిమరల రాజ్యముతోఁగూడసీతనుబొందె. అప్పుడులోకమంతయును మోదమునుబొందె. తుష్టిపుష్టులుగలదయ్యె మఱియుధర్మస్వభావముగలదియును,నిరామయమును, రోగరహితమును, దుర్భిక్షభయవర్జితమును, నయ్యె.లోకముననేపురుషుఁడును పుత్రమరణదుఃఖమునుబొందువాఁడుగాఁడు. విధవలగుస్త్రీలెవ్వరును లేరు. స్త్రీలందఱునుపతివ్రతలైయుండిరి. అగ్నిభయము గొంచెమైనను గలుగదయ్యె. జంతువులెవ్వియును నుదకమూలయందు మునుఁగుటలేదు. ఇంచుకైనను వాయువువలనిభయములేదు. అటులనే జ్వరకృతభీతియును లేదు. క్షుద్భయములేదు. చోరబాధలన్నియునునశించె. నగరములును రాష్ట్రములును ధనధాన్యములతో గూడినవయ్యె కృతయుగమునందువలె నెల్లవారలును సర్వకాలములయందును సంతుష్టులైయుండిరి. అట్లు మరలనయోధ్యాపురమునకువచ్చినపిదప రాముఁడు భూరిసువర్ణదక్షిణలుగల యనేకములగు నశ్వమేధయాగముల నొనరించె. మఱియును మహాకీర్తివంతుఁడగు రాముఁడుసహస్రకోటి పరిమితిగల గోవులను నపరిమితమగుధనమును బ్రాహ్మణులకు నొసంగి బ్రహ్మలోకమును బొందఁగలఁడు. రాఘవుఁడు రాజ

లకు రాజ్యములనిచ్చి నూఱింతలుగ వారివంశములను స్థాపింపఁగలఁడు. బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులను దమ తమధర్మములయందు నియోగింపఁగలఁడు. పదునొకండు వేలవత్సరములు ప్రజాపరిపాలనమును జేసి వైకుంఠమునుఁ బొందఁగలఁడు. పరిశుద్ధిని గలిగించునదియును పాపములను బోఁగొట్టునదియును, పుణ్యప్రదమును సర్వవేద సదృశమును నగు నీరామచరితమును బఠించినమానవుఁడు సర్వపాపవిముక్తుఁడగును. ఆయుర్వృద్ధికరమును వాస్తవార్థ ప్రతిపాదకమునగు నీరామాయణమును బఠించువాఁ డీలోకమున బుత్రపౌత్రాది వర్గముతోఁగూడ సర్వసుఖములననుభవించి యంతమందు స్వర్గలోకమునుబొంది దేవతలచే బూజింపంబడుచుండును. బ్రాహ్మణుఁడు పఠించెనేని సకలవిద్యాపారంగతుఁడగును. క్షత్రియుఁడు భూమండలాధిపత్యమును బొందును. వైశ్యుఁడు వాణిజ్యమునందు లాభమును బొందును. శూద్రుఁడు శూద్రకులమునందు బూజ్యుఁడగును

ఇట్లు వాల్మీకిఋషిప్రణీతమును, ఆదికావ్యమును, అగు శ్రీమద్రామాయణ బాలకాండమునందలి సంక్షేపమను పేరుగల మొదటిసర్గకు సమముగ సకలకలాకలాప ధురంధరుఁడును, బహూను సీతారామార్య తనూభవుండునునగు త్యాగరాయశాస్త్రిచేత రచియింపంబడిన యాంధ్రవచన కావ్యము సమాప్తము.

వాల్మీకిమహాముని క్రౌంచపక్షి నిజంపిన బోయవానిని శపించుట.

అట్లు సప్పవవిని వాక్యవిశారదుండును ధర్మాత్ముఁడునునగు వాల్మీకిమునివరుఁడు శిష్యగణములతోఁగూడ నారదమునివరునకు విధ్యుక్తప్రకారముగఁ బూజలొనరించె. దేవర్షి యగు నన్నారదుఁడు శాస్త్రోక్తప్రకారమగు పూజలనుబొంది యావాల్మీకిమునివరునిచే ననుమతుఁడై యాకాశమార్గమున ముహూర్తమాత్రములో దేవలోకమునకుఁ బోయె. పిదప నవ్వాల్మీకియును జాహ్నవీనదికిఁ గొంచెపు దూరముననున్న తమసాతీరమునధిష్ఠించె అధిష్ఠించి పంకరహితమగు తీర్థమునుజూచి పార్శ్వభాగమునందున్న శిష్యునకిట్లనియె

శిష్యా భారద్వాజా! నాదువచనమును వినుము. ఇది పంకరహితమైనతీర్థము. రమణీయమును నిర్మలోదకమును గలదియై "సజ్జనుని మనస్సువలె,, నున్నయది. కావున నాయనా! నాదు వల్కలములతోఁగూడ కలశమునిచ్చటనుంచుము. ఉత్తమంబగు నీతమసాతీర్థంబున స్నానంబు సేసెదననియె. ఇట్లు మహాత్ముఁడగు వాల్మీకిచేఁ జెప్పఁబడిన వచనమును విని నిజగురువల్కలాదులనిచ్చె. అట్లు శిష్యుఁడొసంగిన వల్కలమును గైకొని విజితేంద్రియుఁడగు నవ్వాల్మీకిమునివరుఁ డచ్చటనుండు విపులమగు వనమును సర్వమును జూచుచుండఁగ, నవ్వనమునకు సమీపమున మధురధ్వనిచేయుచుఁ బరస్పరసంయుక్తములగు క్రౌంచపక్షిద్వయమును జూచె. అమ్మిథునమునందలి పురుషపక్షిని బాపనిశ్చయుండును వైరనిలయుండును నగు నొకఁడు బోయ యమ్మునిపుంగవుండు చూచుచుండఁగ వధించె. అట్లు చంపఁబడి రక్తముచేత వ్యాప్తమైనశరీరమును గలదియై భూమియందుఁ బొరలుచున్న నిజభర్తను జూచి యయ్యాడుక్రౌంచము దీనారావముతో రోదనము సేసెను. ఎఱ్ఱనిశిరస్సుగలదియును, ప్రశస్తములగు ఱెక్కలు గలదియును, రతిపరవశమైనదియును, మనఃప్రియమైనదియును, సహచారియును, నగు నిజభర్తతో వియోగమును గలదై రోదనము జేయుచున్న యాస్త్రీక్రౌంచము యొక్కడీ నారవమును వాల్మీకి మునివరుఁడు విని సమీపమునందలి నిషాదునిచేఁ జంపఁబడిన యపక్షిరాజమును చూచి ధర్మాత్ముఁడయిన యవ్వాల్మీకి కారుణ్యమును బొందె. అట్లు కారుణ్యమును బొందినపిదప నమ్మునివరుఁడు సహజముగఁ గరుణగలవాఁడగుటవలన రతికాలమునందు జంపుట యధర్మమని తలంచి యాక్రౌంచీదీనారవమును విని యిట్లనియె.

"మానిషాద ప్రతిష్ఠాంత్వ మగమశ్శాశ్వతీ స్సమాః । యత్క్రౌంచ మిథునా దేకమవధీః కామమోహితమ్,, ఓరీ బోయవాఁడా! కామమోహితమగు క్రౌంచపక్షిద్వయమునందొక యక్రమముగ నొకదానిని వధించితివి. కావున నీవు చిరకాలము జీవింపనాఁడవు గావనియె. అమ్మిథునమును జూచుచు నివ్విధముగఁ బలికిన నమ్మునివరుఁ డిట్లు తలఁచె. ఈక్రౌంచపక్షిదంపతులకుఁ గలిగినదుఃఖముచే నార్తుఁడనైన నేనేమి చెప్పితినని విచారించుచు మహాప్రాజ్ఞుఁడును, బుద్ధిమంతుఁడునునగు నమ్మునివరుఁడు తనమనమున నిట్లాలోచనసేయుచు తనదుశిష్యునితో నిట్లనియె

శిష్యా! క్రౌంచపక్షిద్వయమునకుఁ గలిగిన యాపదను జూచి నేనొకవాక్యమును జెప్పితి. అయ్యది నాలుగుపాదములు గలదిగను, సమానాక్షరములు గలదిగను, వీణెయందారోపించి నృత్తగీత వాద్యములతోఁ బాడదగినదిగను నున్నయది. కావున నవ్వచనము శ్లోకమనఁబడును గాని యన్యవిధముగఁ జెప్పఁదగినది కాదనియె అట్లు పలుకుచున్న మునివరువచనమును విని సర్వోత్తమముగనున్నదనుచు సంతుష్టచిత్తుఁడై యవ్వచనమును కంఠస్థము సేసికొనియె. అంతన

న్మునిపుంగవుఁడును సానందమును బొందె. పిదప వాల్మీకి యుత్తమసాతీర్థమున విధ్యుక్తప్రకారముగ మాధ్యాహ్నికస్నానమును జేసి యాకస్మికముగఁ దనవాక్కునుండి బయలువెడలిన ఛందోబద్ధశ్లోకమును స్మరించుచు నిజాశ్రమమునకు బయలువెడలె. అప్పుడు విద్యావినయములుగల భరద్వాజుఁడను శిష్యుఁడు జలపూర్ణమగు కలశము గ్రహించి యమ్మునివరుని వెంబడించె. అంతఁ గొంతసేపటి కమ్మునిముఖ్యుఁడు శిష్యునితోఁగూడ నిజాశ్రమపదమును బ్రవేశించి సుఖాసనాసీనుఁడై యాకస్మికముగ దననోట వెడలిన తొల్లిటి శ్లోకార్థమును గుఱించి చింతించుచుఁ బారాయణాదికృత్యములను వేర్చె.

—(✽) బ్రహ్మదేవుఁడు వాల్మీకి యొద్దకు వచ్చుట (✽)—

అప్పుడచ్చోటునకు లోకకర్తయును, స్వయంభువుఁడును, మహాతేజుఁడును నగు బ్రహ్మదేవుఁ డమ్మునిపుంగవునిఁ జూడఁదలఁచి విచ్చేసె. అట్లు వచ్చిన బ్రహ్మదేవుఁ జూచి యవ్వాల్మీకి మునివరుఁడు శీఘ్రముగ లేచి వాగ్యతుఁడును, ప్రాంజలియును నై, నమస్కరించి మహాశ్చర్యమును బొందుచు నతని మ్రోల నిలిచి యర్ఘ్యపాద్యాదివిధులచే శాస్త్రోక్తప్రకారముగఁ బూజలు సల్పి కుశలప్రశ్నను జేసిన నా బ్రహ్మదేవుఁడు పరమార్చితమగు నాసనమునందుఁ గూర్చుండి మహర్షి యగు వాల్మీకిమునివరుని మఱియొక్క యాసనమునందుఁ గూర్చుండ నియమించె. అట్లు బ్రహ్మననుమతుఁడై యవ్వాల్మీకి నిజాసనమునందుఁ గూర్చుండె. సాక్షాల్లోకపితామహుఁడైన బ్రహ్మదేవుఁడు గూర్చుండి యుండినను నవ్వాల్మీకిమునివరుఁడు యాక్రౌంచమునందే మనస్సు గలవాఁడై యుండె, అట్లు గూర్చుండి యిట్లనియె,

అయ్యా దేవోత్తమా! కిరాతుఁ డొకరుఁడు వైరిగ్రహణబుద్ధిచేతఁ గష్టమగు కార్యము నొక్క దానిం జేసె, కామపరవశమై నిజభార్యతోఁగూడి మనోహరముగ ధ్వనిసేయుచున్న క్రౌంచపక్షి నొక్కదాని నిష్కారణముగ వధించె. అప్పుడు స్త్రీక్రౌంచము మిగుల దుఃఖమును జెందె. దాని యార్తనాదము విని దుఃఖితుఁడనై నేనివ్విధముగఁ బలికితినని జరిగిన వృత్తాంతమును సర్వమును జెప్పె.

—✽ బ్రహ్మదేవుడు వాల్మీకిని రామాయణము రచియింపుమని చెప్పుట. ✽—

అట్లు చెప్పినవిని యా బ్రహ్మదేవుఁడు వాల్మీకినామునియోగంబున దనజిహ్వాగ్రమందు సరస్వతి యవతీర్ణయయ్యెనని యెఱుంగడని పకపక నవ్వుచు నమ్మునిపుంగవున కిట్లనియె. మునికులోత్తమా! నీచే శ్లోకమే నిర్మింపఁబడినది. ఈవిషయమునందు సందేహ మక్కర లేదు. నా యభిప్రాయము వలననే యీ సరస్వతి ప్రసరించినది. కావున నో మునికులోత్తమా! రామునిచరిత్రమును సర్వమును కావ్యముగ రచియింపుము. నీకు నారదుఁడు చెప్పినవిధముగ లోకమునందు ధర్మాత్ముఁడును, గుణవంతుఁడును, ధీమంతుఁడును నగు రామునిచరిత్రను సంక్షేపముగఁ జెప్పుము. రామలక్ష్మణరాక్షసులయొక్కయు సీతాదేవియొక్కయు రహస్య ప్రకాశ చరిత్రలన్నియు నీకు స్పష్టముగఁ దెలియును. మఱియుఁ దెలియశక్యము గాని దేదియును నుండఁజాలదు. సర్వమును నీకు విస్పష్టము గాఁగలదు. నీదు కావ్యమునం దసత్యమించుకైనను నుండదు. కావునఁ బవిత్రమగు రామచరితమును మనోహరశ్లోకబద్ధముగఁ జేయుము. పర్వతములును నదులును నెంతకాలముండునో యంతకాలము దనుక రామాయణకథ లోకములయందుఁ బ్రసిద్ధముగ నుండగలదు. నీచే రచియింపఁబడిన రామాయణకథ లోకములయందుఁ బ్రసిద్ధముగ నుండు నంతవఱకును నీవు నాదు లోకములయందుండఁగలవు పిదప బరలభూలోకమును బొందుదువని చెప్పి యా బ్రహ్మదేవుఁ డచ్చోటనుండియే యంతర్ధానమునొందె. పిమ్మట నవ్వాల్మీకి శిష్యగణముతోఁగూడ నాశ్చర్యమును బొందె అంత నతని శిష్యులు మాటిమాటికిని నాశ్చర్యమును బొందుచుఁ బ్రీతిగలవారై తొలుతటి శ్లోకమును బలుతడవులు గానముసేసిరి. అమ్మహర్షిచే నిబద్ధమగు నా శ్లోకము సమాక్షరములతో నాలుగు పాదములు గలదై యుండుటకు మహాశ్చర్యమును బొందిరి. సమాక్షరములతో నాలుగు పాదములు గలదై వాల్మీకిచే జెప్పఁబడిన యా శ్లోకమమ్మునివరుని శిష్యులచే మాటిమాటికిని బఠింపఁబడుటవలన శ్లోకత్వమును బొందె. అప్పుడు చింతిత పరమాత్మతత్త్వముగల యవ్వాల్మీకిమునివరునకు మాఃపాదయను శ్లోకమువంటి శ్లోకములచే రామాయణమును సర్వమును కావ్యరూపముగఁ జేయవలయునని యెడు బుద్ధి యుత్పన్నమయ్యె. అంతట నమ్మునివరుఁ డనేకశతశ్లోకములతో రామాయణకావ్యమును రచించె. అకావ్యము రసోచితములును నుదారములును నగు వంశస్థాదివృత్తములుగల యది. మఱియు నతిగంభీరార్థముగల యది. అందలి శ్లోకములన్నియును మనోహరములును, సమాక్షరములు గలవియును నై విలసిల్లుచున్నయవి. కావున నుదారబుద్ధియగు వాల్మీకిచేఁ జేయఁబడిన రామాయణకావ్యము యశస్కరమని యెన్నఁబడుచున్నది. మునివరునిచే నిర్మింపఁబడినదియును, రావణవధగలదియును నగు కావ్యము నవినుఁడు. ఇందు సమాస సంధియోగములు సక్కఁగనుండును. ఇత్యాదిసమములును మధురములును సర్థవ్యక్తి గలవియును నగు వాక్యముల

చే బద్ధమై మిగుల మనోహరముగనున్నయది.

ఇట్లు శ్రీమద్బాలకాండయందలి రెండవసర్గము సమాప్తము

—* వాల్మీకి శ్రీమద్రామాయణమును రచియించుటకు బ్రారంభించుట. *—

ధర్మాత్ముఁడగు వాల్మీకి ధర్మసహితమును కథాశరీరమునునగు రామచరితమును నారదునిచే సమగ్రముముగవిని యును వరలవాధీమంతుఁడగు రామునిచరిత్రమునునంతకన్న నధికముగఁ దెలియఁగోరి యాలోచించుచుండె. అట్లు యాలోచించి యమ్మునివరుఁడు కృతాంజలియై యుదకోపస్పర్శనమును జేసి ప్రాచీనాగ్రములగు దర్భలయందుఁ జక్కఁగఁ గూర్చుండి బ్రహ్మప్రసాదరూపమైన శ్రేయస్సాధనము చేత రామాదుల వృత్తాంతమును వెదకుచుండె. అట్లు యోచించి సీతారామలక్ష్మణులయొక్కయు, దశరథునియొక్కయు, సద్దేశమునందలి స్త్రీపురుషులయొక్కయు వృత్తాంతమును, సీతారామాదులయొక్క హాసభాషణచేష్టలును బ్రహ్మనుగ్రహబలముచే సర్వమును దెలిసికొనియె. ఇంతయుగాక తెలియఁదగినసర్వమును యథార్థముగఁ దెలిసికొనియె. సత్యప్రతిజ్ఞుఁడగు రాముఁడు సీతాలక్ష్మణులతోఁ గూడి యరణ్యమునందు సంచరించిన వృత్తాంతమంతయును గోచరమయ్యె.

మఱియు ధర్మాత్ముఁడగు వాల్మీకి యోగనిష్ఠుఁడై జరిగినవృత్తాంతమును సర్వమును గరతలామలకమునువలె గ్రహించె. మిగులఁ దేజోవంతుఁడగు నమ్మునివరుఁ డవ్విధముగ ధర్మమార్గముచేత నాసర్వమును గ్రహించి యభిరాముఁడగు రామునిచరితమును కావ్యరూపముగ నిర్మించుటకు నుద్యుక్తుఁడయ్యె. కామార్థగుణసంయుక్తమును, ధర్మార్థగుణములచే విస్తరమైనదియును, రత్నతుల్యములగు పదములతోఁ గూడిన సముద్రమును, బోలియున్నదియును, సర్వజనుల శ్రోత్రముల కింపయినదియు నగు రామచరితమును నారదుఁడు చెప్పినచొప్పున నవ్వాల్మీకి రచించె.

—(*) శ్రీమద్రామాయణవిషయానుక్రమణిక. (*)—

అది యెట్లనిన సర్వజనానుకూలమగు రామునిజన్మప్రకారము, సర్వోత్తమమగు పరాక్రమ వృత్తాంతము, లోకములకుఁ బ్రియమును గలుగఁ జేయునట్టి రాముక్షమావృత్తాంతము, సౌమ్యత్వ సత్యశీలత్వములు, విశ్వామిత్రసమాగమము, నానాచిత్రకథలు, సీతాకల్యాణము, ధనుర్భేదము, శ్రీరామ పరశురాములసంవాదము, శ్రీరామునిగుణములు, యౌవరాజ్యాభిషేక మహోత్సవము, కైకేయియొక్క దుష్టచరిత్ర, అభిషేక మహోత్సవమునకు విఘ్నము గలుగుట, శ్రీరామునివనవాసము, దశరథుఁడు దుఃఖమునఁ బొందుట, దశరథుఁడు పరలోకమును బొందుట, ప్రకృతిజనులదుఃఖము. ప్రకృతిజనుల విసర్జనము, గుహునితో సంభాషించుట, సూతుఁడు మరలనయోధ్యాపురమునకుఁ బోవుట, గంగానదిని దాటుట.

భరద్వాజమునివరుని బొడఁగనుట, భరతుఁడు వచ్చుట, భరద్వాజమునివరు ననుమతమును బొంది చిత్రకూటమును జూచుట, శాస్త్రోక్తప్రకారముగఁ బర్ణశాలను నిర్మించుట, భరతుఁడు రామునను గ్రహమును బొందుట, దశరథునకు నౌర్ధ్వదైహిక క్రియలను జేయుట, శ్రేష్ఠములగు పాదుకలయందు రాజ్యమునుంచుట, భరతుఁడు నందిగ్రామమునకుఁ బోవుట, దండకారణ్యమునకేగుట, విరాధుని సంహరించుట, శరభంగమునివరునిఁ జూచుట, సుతీక్ష్ణసమాగమము, సీతామహాదేవి యత్రిమునివరునకు భార్యయగునన సూయతోఁగూడ నేకాసనమునందుండుట. చందనసమర్పణము, అగస్త్యమునివరునిఁ జూచుట, జటాయుసమాగమము, పంచవటీగమనము, శూర్పణఖను దర్శించుట, శూర్పణఖతో సంభాషించుట, శూర్పణఖయొక్క ముక్కుచెవులను గోయుట, ఖరత్రిశిరులను వధించుట, రావణుఁడు బయలువెడలివచ్చుట, మారీచవధ, సీతాపహరణము, శ్రీరాముఁడు దుఃఖమును బొందుట, గృధ్రరాజనిబర్హణము, కబంధదర్శనము, పంపాసరోవరమును జూచుట, శబరీదర్శనము, హనుమంతుని బొడఁగనుట, ఋశ్యమూకపర్వతమునకుఁ బోవుట, సుగ్రీవుతోఁ గలియుట, సుగ్రీవునకు నమ్మకమును బుట్టించి స్నేహము సేయుట, వాలిసుగ్రీవుల యుద్ధము, వాలివధ, సుగ్రీవునకు రాజ్యాధిపత్యము నొసంగుట. తారదుఃఖమును బొందుట, సీతాన్వేషణమును జేయించెదనని సుగ్రీవుఁడు చెప్పుట, రామునకుఁ గోపము గలుగుట, సైన్యమును సంపాదించుట, వానరులను నానాదిక్కులకును బంపుట, భూమిసముద్రద్వీపాదివర్ణనము, మహేంద్రపర్వతారోహణము, సముద్రలంఘనము, సముద్రునివచనానుసారముగ మైనాకుని దర్శనము, సింహికను జంపుట, లంకాపురిమున కాధారమగు మలయపర్వతముయొక్క ప్రదేశమును జూచుట, రాత్రియందు లంకలోఁ బ్రవేశించుట. హనుమంతుఁ డొంటిగ విచారమును బొందుట, రావణునిఁ జూచుట, పుష్పకమును దర్శించుట, జలపానప్రదేశమునకుఁ బోవుట, అంతఃపురమును జూచుట, హనుమంతుఁడశోకవనమునకుఁ బోవుట, సీతామహాదేవినిఁ జూచుట, ఆనవాల నొసంగుట, రావణునిఁ జూచుట, రాక్షసస్త్రీలు సీతను బెదరించుట, త్రిజటకు స్వప్నము గలుగుట, సీతాదేవి హనుమంతునకుఁ జూడామణి నొసంగుట, హనుమంతుఁడు

వృక్షభంజనమును జేయుట, రాక్షసస్త్రీలందఱును వృక్షభంజనమును జూచి భయమునొంది పరుగిడుట, కింకరుల నందఱ హనుమంతుఁడు వధించుట, హనుమంతుఁడు పట్టువడుట, లంకాపురమును గాల్చుటచే రాక్షసులందఱును దుఃఖమును బొందుట, హనుమంతుఁడు సముద్రమును దాఁటివచ్చుట, వానరులందఱును మధువనమునందలి ఫలాదులనపహరించుట, హనుమంతుఁడు చూడామణి నొసంగి రామునోదార్చుట, రామచంద్రుఁడు సైన్యసమేతముగ సముద్రతీరమునకుఁ బోవుట, నలుఁడను వానరుఁడు సేతుబంధమును జేయుట, సముద్రమును దాటుట, రాత్రియందు లంకాపురము నాక్రమించుట, విభీషణునితో సాంగత్యమును జేసి రావణవధోపాయమును దెలిసికొనుట, కుంభకర్ణుఁడు చచ్చుట, మేఘనాథుని సంహరించుట, రావణుఁడు నాశము నొందుట, లంకాపురమునందలి సీతను రాముఁడు గ్రహించుట, విభీషణుని రాక్షసరాజ్యమున కభిషిక్తుం జేయుట, పుష్పకమును జూచుట, అయోధ్యాపురమునకుఁ బోవుట, భరతునితోఁ గలిసికొనుట, శ్రీరామపట్టాభిషేక మహోత్సవము, సకలసైన్యమును వదలుట, రాముఁడు దనరాజ్యమును జక్కఁగఁ బరిపాలించుట, సీతను వదలుట, పిదప రాముఁడు సేసిన కృత్యములును, వతనికి సంభవించిన సుఖదుఃఖాదికములను సీతావిసర్జనము మొదలగు భవిష్యత్కథాభాగమును నుత్తరకాండయందు భగవంతుఁడగు వాల్మీకిమహర్షి రచించె.

ఇట్లని బాలకాండమునందలి మూఁడవసర్గము సమాప్తము.

(*) వాల్మీకి కుశలవులకు రామాయణము నుపదేశించుట. (*)

బ్రహ్మప్రసాదలబ్ధ దివ్యజ్ఞానవంతుఁడును, ప్రబంధరచనాసకల వ్యాపారయుతుఁడగు వాల్మీకిమునివరుఁడు రాముఁడు సకలమహీమండలాధిపత్యమును బొంది రాజ్యమును బరిపాలింపుచుండఁగ నతనిచరిత్రను సర్వమునులోకోపకారముకొఱకు విచిత్రములగు పదములతో రచించె. ఇట్టి రామాయణమును నిరువదినాలుగు వేల శ్లోకములును, ఐదునూరుల సర్గలును నాఱు కాండలును గలుగునటుల నిర్మించె. పిదప నుత్తరకాండమునుగూడ రచించె. ఇవ్విధముగ సప్తకాండసహితమగు రామాయణమును వాల్మీకిమునివరుఁడు రచించి యెవ్వఁ డీకావ్యమును బఠించి లోకమునందు వ్యాపింపఁజేయునని పరమాత్మయందు మనసునిడి చింతింపుచుండఁగ మునివేషధారులగు కుశలవులు వచ్చి యమ్మునివరుని పాదములకు నమస్కారము లొనర్చిరి.

అప్పుడవ్వాల్మీకి మునికులోత్తముఁడు ధర్మవంతులును, రాజపుత్రులును, కీర్తివంతులును, సుస్వరసంపన్నులును, నాశ్రమవాసులును, సోదరులును నగు నబ్బాలురఁ జూచి యానందమును బొంది స్వతంత్రుఁడగు నవ్వాల్మీకి మేధావంతులును, సాంగముగ వేదాధ్యయనముఁ జేసినవారలునగు నా కుశలవులకు సీతాచరిత్రమును, రావణవధయును గల రామాయణమను మహాకావ్యమును వేదార్థనిర్వచన ప్రయోజనముకొఱకు దెలియఁజెప్పె. అంత గాంధర్వశాస్త్ర తత్త్వవేత్తలు, మూర్ఛనా స్థానములఁ జక్కఁగ నెఱింగినవారు, గంధర్వద్వయముంబోలిన రూపస్వర సంపదగల యన్నదమ్ములు, సురూపలక్షణములు గలవారు, మధుర స్వరభాషిణులు, మూలబింబమగు రామునిశరీరమువలనఁ బుట్టిన ప్రతిబింబములఁ బోలిన యబ్బాలు లిరువురును పఠనసమయగాన సమయములయందు మధురమైనదియును, గానధ్వనిపరిచ్ఛేదకములగు ప్రమాణములతోఁ గూడినదియును, సప్తవిధములగు స్వరములతో సంయుతమైనదియును, తంత్రీలయసమన్వితమును, శృంగారవీరకరుణాద్భుత హాస్యరౌద్రాదినవరస సమ్మిశ్రితమునునగు రామాయణకావ్యమును గానము సేసిరి.

మఱియు ననిందితులును రామాయణముయొక్క యథార్థమును నెఱింగినవారును, మిగుల నేర్పుగల వారును, బుద్ధిమంతులును, భాగ్యవంతులును, సర్వలక్షణలక్షితులును నగు నా కుశలవులు సకలధర్మములతోఁ గూడి చరిత్రరూపమైన రామాయణకావ్యము నంతయును కంఠస్థముఁ జేసికొని ఋషులును పెద్దలును సభలు జేరియుండఁగ నా సభలయందు వాల్మీకిముని యుపదేశించిన రీతిగ దప్పక గానము సేయఁదొడఁగిరి.

— * కుశలవులు రామాయణమును గానము సేయుట * —

ఇట్లుండఁగ నొకతఱి యనేకఋషీశ్వరులు గుంపుగూడి సభ జేరియుండఁగ నచ్చటికి కుశలవులేతెంచి నవరసములొలుకునట్టుల రామాయణకావ్యమును గానము సేసిరి. అట్లు బాలురచే గానము సేయఁబడిన రామాయణకావ్యమును వినియమ్మునులందఱును కన్నుల నానందబాష్పములు గాఱఁగ మేల్ మేలనుచు కుశలవుల మెచ్చుకొని మహాశ్చర్యమును బొందిరి. పరమధర్మవత్సలులగు నమ్మునులందఱును ప్రశస్తముగ గానము సేయుచున్న యబ్బాలురఁ బలువిధముల ప్రశంసించిరి. ఆహా! యీశ్లోకములను గానము సేయుట మిగుల మనోహరముగ నున్నదనిరి. మఱియు నెప్పుడో జరిగిన వృత్తాంతము నిపుడు జరిగినట్లున్నదనిరి. ఇవ్విధముగ మును లందఱును గొనియాడుచుండఁగ నబ్బాలురు మఱియు

నుత్సాహవంతులై యిరువురును యేకకంఠులై సమమైన లయముగలిగి కవియభిప్రాయము రీతిని నవరసముల నావిష్కరింపుచు షడ్జాదిస్వరములతోఁగూడి రాగయుక్తముగను, మధురముగను నుండునట్లు పాడిరి. అంతనమ్మునివరులలో నొక్కతాపసోత్తముఁడు పరమానందమునుబొంది యబ్బాలురకుఁ గలశమునొసంగె. మఱియొక్కఁడు ప్రసన్నుఁడై వల్కలమునొసంగె. పిదప వాల్మీకిమునివరప్రణీతమగు నికావ్యముమిగుల నాశ్చర్యకరమును, సర్వలక్షణలక్షితమునునగుటచేఁ గవులకు సర్వోత్తమాధారమయ్యె, యథాక్రమముగ నికావ్యముపరిసమాప్తమగుటచేనఖిలజనులకును నానందకారియయ్యె. ఈగీతము సర్వగీతములయందును నుత్తమమైనదయ్యె. ఆయుః పుష్టులనొసంగునదియునుఁ గాక సర్వశ్రుతిమనోహరమనునగు రామాయణకావ్యమును గానముసేసిన యబ్బాలురనెల్లవారును సర్వస్థలములయందును బ్రశంసించుచుండిరి. అట్టి ప్రశంసావచనముల రామచంద్రుఁ డొకానొకప్పుడువిని సోదరులగు నకుశలవులఁ దనయశ్వమేధ శాలకురప్పించె

—(*) రాముని సభయందు కుశలవులు రామాయణమును గానము సేయుట. (*)—

అట్లురప్పించి శత్రుఘాతకుఁడగు రాముఁడు పూజ్యులగునబ్బాలుర యనేకవిధముల కొనియాడి తాను కనకమయమగుసింహాసనమునందు మంత్రిసోదరాది సహితముగఁ గూర్చుండె పిమ్మటని యతుఁడై రూపసంపన్నులగునబ్బాలురఁజక్కఁగఁ బరిశీలించుచుఁ భరతలక్ష్మణశత్రుఘ్నులకిట్లనియె.

తమ్ములారా! ఇయ్యాఖ్యానమునువినుఁడు. దేవవర్చస్కులగు నిబ్బాలురు విచిత్రార్థపదములుగలప్రబంధమును జక్కఁగ గానముసేయుచున్నవారనియె. అంత నకుశలవులు మనోహరమును, రాగవత్తును, దీర్ఘాలాపాదికమును, తంత్రీలయ సమన్వితమును నగునట్లుల గానముసేసిరి. అప్పుడగ్గానము సర్వజనుల గాత్రమనస్సుల కాహ్లాదమును గలుగఁజేసె. మఱియునాసభ్యులకు శ్రోత్రాశ్రయసుఖమును గలుగఁ జేయునదియై ప్రకాశించె. ఆసమయమున రాముఁడు మరలనిట్లనియె. తమ్ములారా! యిబ్బాలురు మునులయ్యును రాజలక్షణలక్షితులుగను గాయకులయ్యును మహాతపస్సంపన్నులుగనునున్నారలు. సీతావిరహదుఃఖితుఁడనగునాకును సౌఖ్యమునిచ్చునదియు మహాప్రభావమునగు సీతాచరిత్రమును జెప్పఁబోయెదరు. కావునమీరును వినవలయునని కోరుచున్నాఁడననియె. అట్లు రామచంద్రుఁడు సెప్పుచున్న ప్రశంసావచనములను విని యబ్బాలురు మహానందమును బొంది రామవచఃప్రేరితులై మార్గము, దేశి యనెడు గానప్రకారముల రెంటిలోను మార్గమను దానినిబట్టి గానముసేసిరి. అంతరాముఁడు శ్రోత్రసుఖానుభవేచ్ఛగలవాఁడై దిగ్గనలేచి నచోరసభంగమగునని మెల్లగసింహాసనమునుండిదిగి సభఁజేరి గానమునువిన నాసక్తమనస్కుఁడయ్యె

ఇట్లని శ్రీమద్బాలకాండయందలి నాల్గవసర్గము సమాప్తము.

—(*) శ్రీరామాయణకథాప్రారంభము (*)—

ఈభూమండలమంతయును జయశాలులగుమనుప్రజాపతిని మొదలుకొని యావంశస్థులచేఁ బరిపాలింపఁబడుచు నితరరాజులకు దుర్లభమైనదిగనుండె. మఱియు నావంశమునందు నఱువదివేలకుమారులతోఁ దండయాత్రవోవుచు సముద్రమునకు సాగరమను పేరుగల్గుటకు గారణభూతుఁడునైన సగరచక్రవర్తియును నుద్భవించె. అట్టిమహాత్ములగు నిక్ష్వాకువంశపు రాజులవంశమునందు రామాయణమను పేరం బ్రసిద్ధమయిన నీమహదుపాఖ్యానముపుట్టె. బ్రహ్మప్రసాదమువలనఁబుట్టిన నీరామాయణమును లోకమునందుబ్రవర్తింపఁజేసెద. కావుననసూయలేనివారలై సమగ్రముగవినుండు

సంతుష్టజనముగలదియును, సమృద్ధమైనదియును, ధనధాన్యములతోఁ గూడినదియునునగు కోసలమను దేశము సరయూనదీ తీరమునఁగలదు. ఆదేశమున సర్వలోకప్రసిద్ధమయిన యయోధ్యయను పట్టణమొకటికలదు. అప్పట్టణము తొల్లి మనుభూపాలునిచేనిర్మింపఁబడినది. అది పదిరెండామడపొడవుగలయది. మూఁడామడవెడల్పుగలది. అధికసంపదగలది. చక్కఁగవిభజింపఁబడినవీథులు పెద్దత్రోవలుగలయది. గొప్పదియును, నగురాజమార్గముచేతఁ బ్రకాశించుచున్నది.

—(*) అయోధ్యాపురవర్ణనము. (*)—

అప్పట్టణమునందెల్లపుడును ముత్యములు, పుష్పములును, జల్లఁబడును. రాజవీథులుప్రతిదినమును జలముచేసేచనముసేయఁబడును, అట్టిపట్టణమును స్వర్గమునందలి యింద్రునివలె, దశరథుడను మహారాజు చక్కఁగఁ బరిపాలించుచుండె. మఱియు నప్పట్టణము ప్రశస్తములగు కవాట తోరణములును, చక్కఁగవిభజింపఁ బడినయంతరాపణములును నానావిధములగు శిలాక్షేపణీ ప్రభృతి యంత్రములును, నానావిధములగు నాయుధములును, బహువిధశిల్పులును, సూతమాగధవంది సందోహములును గలిగియుండె. ఇంతయేగాక యధికసంపదగలదియును,నిరు

సమానశోభగలదియును, మద్యానామ్రవణములు గలదియును, మేఖలాకారములగు ప్రాకారములుగలదియును, దుర్గముచేతగంభీరమైన పరిఘగలదియును, నితరులచే జయింపనలవిగానిదియును, వాజివారణోష్ట్రగోఖర సంశోభితమును, సామంతరాజసంఘములుగలదియును, బలకర్మలచేనావృతమైనదియును, నానాదేశనివాసులగు వణిక్సంఘయుతమగునదియును, రత్నఖచిత ప్రాసాదములుగలదియును, రత్నములుగల పర్వతములచేత శోభితమయినదియును, కూటాగారములచే సంపూర్ణమయినదియునునై, స్వర్గపట్టణమునకుఁ దుల్యమయినదైయుండె. ఇంతయగాక చిత్రములనయష్టాపదాకారముగఁజదరముగనుండె. అత్యుత్తమ స్త్రీల సమూహములుగలదియును, ననేకవిధములగు రత్నములచే సమాకీర్ణమును, విమానగృహశోభితమునునయియుండె. మఱియును కుటుంబవంతులగు గృహస్థులచేనిండియున్నదియును, దోషరహితమయినదియును, సమభూమియందుఁ బ్రకాశించుచున్నదియును, శాలితండులములచేత సంపూర్ణమయినదియును, నిక్షుకాండరసోదయములు గలదియును, దుందుభి, మృదంగవీణాపణవములచే నాదితమయినదియును, సర్వోత్తమమయినదియునునైయుండె. సిద్ధులకుస్వర్గలోకమునందుఁ దపస్సుచేతఁ బొందఁబడిన విమానమువలెనున్నదియును, చక్కఁగ నిర్మింపఁబడిన గృహపాంక్తములు గలదియును,శ్రేష్ఠులగు మానవులచేఁ గూడియున్నదియును,నై వెలింగె.ఆనగరమునందలి రాజశ్రేష్ఠులు మిగులనేర్పుతో నతివేగముగ బాణప్రయోగమును జేయఁగల వారయినను,ధార్మికులగుటవలన నొంటరివానిని, తలితండ్రులును కొడుకులును దోడబుట్టువులును లేనివానిని,కండ్లకగుపడకమఱుగుననుండి ధ్వనిమాత్రముచే గుఱిగాఁ గొట్టదగినవానిని. పరుగెత్తువానిని,జంపువారలు గారనుకీర్తిగ్రహించిరి.

మఱియునయోధ్యాధవరులు, మదించివనమునందు ధ్వనిఁ జేయుచున్న సింహవ్యాఘ్రవరాహములన తీక్ష్ణములగుబాణములచేతను, బలముచేతను, బాహుబలముచేతనుననాయాసముగ వధింపఁగలరు.ఆహితాగ్నులును, గుణవంతులును, ఋగ్యజుస్సామాధర్వణశిక్షావ్యాకరణ ఛందోనిరుక్తజ్యోతిషకల్పంబులనియెడివేదవేదాంగపారంగతులును. సత్యదానరతులును, సత్యసంధులును,మహాత్ములును, మహర్షిప్రాయులునునగుబ్రాహ్మణక్షత్రియవైశ్యులుగలరు.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యయిదవసర్గము. సమాప్తము,

—(*) దశరథమహారాజపౌరజనవర్ణనము. (*)—

అట్టి యయోధ్యాపట్టణమునందు వేదవేత్తయును, ర్వసంగ్రహుఁడును, దీర్ఘదర్శియును, మహాతేజోవంతుఁడును, పౌరజానపదప్రియుఁడును, సర్వలోకప్రసిద్ధుఁడును, బలవంతుఁడును, శత్రుంజయుఁడును,మిత్రవంతుఁడును, విజితేంద్రియుఁడును, ధనములయొక్కయునన్యములగుపదార్థములయొక్కయు సముదాయములచేత నింద్రకుబేరతుల్యుఁడును, మనుభూపాలునివలెఁ బ్రజాసంరక్షణను జేయువాఁడును, నగుదశరథమహారాజునివసించి లోకములను బాలించుచుండె. సత్యసంధుఁడును, ధర్మార్థకామాసక్తుఁడును, నగునాదశరథునిచే నప్పురమింద్రునిచే స్వర్గపట్టణమువలెఁబాలింపఁబడియె.

అప్పురవరమునందుండు మానవులందఱును నివాససౌఖ్యముచేతఁ బ్రీతులును, ధర్మాత్ములును, సకలశాస్త్రశ్రవణముసేసినవారును, లోభబుద్ధిలేనివారును, సత్యముగ మాటలాడువారునునై తమతమధనములచేసంతుష్టులయియుండిరి. మఱియు నప్పురవరంబున నల్పమైనకోశముగలవాఁడొక్కఁడును లేడు. ఇంతయగాక గవాశ్వ ధనధాన్యసంపద లేనివాఁడును, ధర్మార్థకామములు లేనివాఁడును లేఁడు. కాముకుఁడును, కదర్యుఁడును, ఘాతకుఁడును, మూఢుఁడును, నాస్తికుఁడునునగు పురుషుఁడు వెదకిచూచినను దొరకనేరఁడు.అందలి స్త్రీపురుషులందఱును ధర్మశీలురు. అదియునుఁగాక జితేంద్రియులు. సత్స్వభావసదాచార సంపన్నులరు. మహర్షులంబోలి నిర్మలమనస్కులు. కర్ణభూషణములు లేనివారును, శిరోభూషణ హీనులును, పుష్పమాలికా శూన్యులును, స్వల్పభోగవంతులును, నభ్యంగస్నానరహితులు, సుగంధకస్తూర్యాద్యనులేపనములు లేనివారును నప్పురవరంబున దొరకుట దుర్లభము, అన్నాభావముచే నల్పముగ భుజించువారును, దాతృత్వములేనివారును, బాహుభూషణ రహితులును, నుంగోభూషణ హీనులును, హస్తాభరణములు లేనివారును, నాత్మజ్ఞానహీనులును లేరు. అనాహితాగ్నియును, యాజ్ఞికుఁడుగానివాఁడును, నీచుఁడును, దస్కరుఁడును, సంకరకృత్యములు సేయువారును లేరు. అందలిబ్రాహ్మణులందఱును, జితేంద్రియులును స్వకర్మనిరతులునునై యుండిరి, ఇంతయగాక దానాధ్యయనశీలురును, ప్రతిగ్రహమునందు సంకుచితులునునై మెలంగిరి. నాస్తికుఁడును, నసత్యమును బల్కువాఁడును, బహుశ్రుతగానివాఁడును, నసూయగలవాఁడును నశక్తుఁడును, విద్వాంసుఁడు గాని

వాఁడును నప్పురవరమున లేఁడు.

మఱియు నందలివారందఱును షడంగములను దెలిసినవారు. సకలవ్రతములను నవలంబించుదురు. సకలదానములును జేయువారు. దైన్యము చేదుఃఖిత మనస్కులుగారు వ్యాధిగ్రస్తులగు వారును లేరు. మఱియు నందలి స్త్రీపురుషులలో నెవ్వరును గాంతిరూపములును లేనివారు లేరు. ఇంతయగాక యప్పురవరమున రాజభక్తిశూన్యులఁ జూచుటదుర్లభము. నాల్గువర్ణములవారును దేవతాతిథిపూజలనొనర్చుదురు. ఇంతయగాక కృతజ్ఞులును, వదాన్యులును, శూరులును, విక్రమసంయుతులును ననిపేర్వడసిరి. మఱియు నందలిమానవులందఱును దీర్ఘాయుష్యము గలవారు. ధర్మసత్యముల నతిక్రమించనివారు పుత్రపౌత్రాదిసంపదలచే సమృద్ధులు. అందలిక్షత్రియులందఱును బ్రాహ్మణాజ్ఞావర్తులు. వైశ్యులు క్షత్రియానువర్తులు. శూద్రులుస్వధర్మనిరతులై మూఁడువర్ణములవారిని బూజించుదురు.

అట్టిపురమున పూర్వము మనుభూపాలుఁడు పాలించినవిధమున నిక్ష్వాకుకులసంభవుఁడైన నాదశరథమహీవల్లభుఁడు పాలించె. మఱియును నప్పురవర మగ్నికల్పులును, నకుటిలులును, సువర్చస్కులును, సకలవిద్యాప్రవీణులును నగుయోధులచేత, సింహములచేత గుహలవలె నాక్రమింపఁబడియె. కాంభోజదేశోద్భవములును, బాహ్లీకములును, సింధుదేశోద్భవములును, శ్రేష్ఠములునునగు గుఱ్ఱములచే నప్పురవరము నిండియుండె.

వింధ్యహిమాలయాది పర్వతములయందుఁ బుట్టినవియును, మదించినవియును, మిగులబలముగలవియును, పర్వతోపమములునునగు నేనుంగులచే నిండియుండె. అందలి యేనుంగులైరావతమునకంటెఁ గులీనములు. మహాపద్మకులోద్భవములు వామనాంజననామక దిగ్గజంబులకంటె నుత్తమంబులు. మఱియు, భద్రములు, మంద్రములు, మృగములునను మూఁడువిధములగు గజములచేతను, భద్రమంద్రమృగములచేతను, భద్రమంద్రములచేతను, మృగమంద్రములచేతను నప్పురవరము నిండియుండె. పర్వతసన్నిభములును, మత్తములునునగు నుత్తమగజంబులందనేకములు గలిగియుండె.

ఇట్లుసర్వోత్తమములగు చతురంగబలములుగలిగి ప్రపంచమునంతయు బాలింపుచుండిన నాదశరథమహారాజునకు నివాసస్థానమైన యయోధ్యాపట్టణము వెలుపల రెండామడ దూరమువఱకును శత్రురాజుల కెదిరింపనశక్యమై "యయోధ్య,, యనుయథార్థనామముఁ గలిగియుండె. అట్టియయోధ్యాపట్టణము మిగులఁదేజోవంతుఁడును, శత్రుంజయుఁడునునగు నాదశరథమహారాజు "చంద్రుడు నక్షత్రములను గాపాడినమాడ్కి,, ప్రజలకందఱకును సౌఖ్యమునుగలుగఁజేయుచుఁ బరిపాలింపుచుండె.

మఱియు నింద్రునితో సమానుఁడైన నాభూమండలాధిపతియగు దశరథమహారాజుయయోధ్య (ఎదిరింపనశక్యమైనది) అనుయథార్థనామముఁ గలదియును, దృఢములైన ద్వారములును, గడియమ్రాఁకులుఁగలదియును, విచిత్రములగు గృహములుగలదియును, నెల్లప్పుడును మంగళకరమైనదియును, అనేకవేలజనులచే నిబిడీకృతంబైనదియునునగు నాయయోధ్యాపట్టణమునఁబరిపాలింపుచుండె. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యాఱవసర్గముసమాప్తము

మహానుభావుఁడును నిక్ష్వాకువంశోద్భవుఁడును నగు నాదశరథమహారాజునకు మంత్రజ్ఞులును, నింగితజ్ఞులును, ప్రియహితములయందాసక్తిగలవారును, సకలగుణవిశిష్టులును మిగులఁగీర్తిమంతులును బరిశుద్ధులును ననురక్తులును, సర్వకాలములయందును రాజకృత్యములయందాసక్తిగలవారునునగు నెనమండ్రు మంత్రులుగలరు. వారుధృష్టి, జయంతుఁడు, విజయుఁడు, సిద్ధార్థుఁడు, అర్థసాధకుఁడు, అశోకుఁడు, మంత్రపాలుఁడు, సుమంతుఁడును, ననునామధేయములచే నొప్పియుండిరి.

మఱియు నద్దశరథమహీవల్లభునకు వసిష్ఠమహర్షియును, వామదేవమహర్షియును బ్రధానపురోహితులుగనుండిరి. ఇంకననేకమంత్రులును పురోహితులును గలిగియుండిరి. వారందఱునుసమస్తవిద్యలయందు నేర్పరులును, హ్రీమంతులును, కుశలులును, నియతేంద్రియులును, శ్రీమంతులును, మహాత్ములును, శాస్త్రజ్ఞులును, దృఢవిక్రములును, కీర్తిమంతులును, రాజ్యకృత్యములయందప్రమత్తులును, చెప్పినచొప్పుననడుచువారును, ప్రతాపమునందును నోర్పునందునుఁ గీర్తివహించినవారును, చిఱునవ్వుతో సంభాషించువారును, నై ప్రసిద్ధింగాంచిరి.

మఱియును గామక్రోధములవలన నసత్యమునుబలుకువారుగారు వారికిస్వపరవిషయములయందొకటియును దెలియనిదిలేదు మఱియునుస్వపరరాష్ట్రములయందలి మూఁడుకాలముల వృత్తాంతములను చారులవలన సతతమును దెలిసికొనుచుందురు. వ్యవహారములయందు మిగుల నేర్పరులు. స్నేహితుల కృత్యములయందుఁగూడ యుక్తాయుక్తముల నాలోచించుచుందురు సమయమువచ్చినపుడు న్యాయశాస్త్రానుసారముగ సుతులనుగూడ దండింతురు. కోశసంగ్రహణము నందతిసమర్థులు సేనాసముదా

యముసు స్వీకరించుటయందు మిగులనేర్పరులు. శత్రువునైనను దోషములు లేనియెడల హింసించువారుగారు. పరాక్రమముగలవారును, నియతోత్సాహులును, రాజశాస్త్రవేత్తలును నై ప్రసిద్ధిఁగాంచిరి. స్వరాజ్యమునందుండు సజ్జనులసతతంబును గాపాడుచుందురు. బ్రాహ్మణక్షత్రియులను హింసింపకయే బలాబలములవిచారించిశిక్షవిధింపుచుఁ గోశమునుబూరించుదురు.

ఇట్లుశుచిగలవారును, నేకబుద్ధిగలవారునునగు మంత్రులురాజకార్యమును విచారించుచుండఁగ నప్పట్టణమునందును, దేశములయందును, నబద్ధమునుమాటలాడుమనుజుఁడొకరుఁడును లేడు. మఱియునారాజ్యమునఁ బరదారాభిసక్తుఁడగుమానవుఁడు లేడు. ఇంతయగాక సకలరాజ్యమును నధర్మములేనందున బ్రశాంతమైనదై శోభిల్లుచున్నయది. ఆ మంత్రులందఱును శుభ్రవస్త్రధారులును, శోభనాలంకారులును, సుశీలురును, నీతిచక్షుస్సులును, రాజహితమును గోరువారును, రాజనీతియుక్తులును నై మెలంగుచుండిరి. మఱియుగురువులయందలి దోషములనువెదకక గుణములనే వెదకుచుందురు. పరాక్రమమునందుఁ బ్రసిద్ధులగుదురు. విదేశములయందలి కాలత్రయవృత్తాంతమును నెఱింగినవారు. సంధివిగ్రహాదులఁ దెలిసినవారు. నిసర్గసంపదగలవారు. మంత్రగోపనమునందుసమర్థులు మిగులఁదీక్ష్ణమును, సూక్ష్మగ్రాహకమునునగు బుద్ధికుశలతగలవారు. నీతిశాస్త్రవిశేషజ్ఞులు. సర్వకాలములయందును బ్రియముగ సంభాషింతురు.

ఇట్టిగుణములు గలవారగుటచే నందరునెల్ల దేశము లందునుబ్రసిద్ధులైయుండిరి. ఇట్లుండగనాపురుషవ్యాఘ్రుఁడగుదశరథరాజేన్ద్రుఁడును చారచక్షుస్సుఁడై ప్రజలనుధర్మమార్గముచేత రంజింపఁజేయుచును నధర్మమించుకేనియునుండకుండునటులఁ బ్రయత్నించుచును ముల్లోకములయందును సత్యసంగరుఁడనియును, వదాన్యుఁడనియును, ప్రసిద్ధినివహించి భూలోకమునుసర్వమునుబాలించె. అద్దశరథమహారాజునకధికుఁడును, సముఁడునునగు శత్రుఁడొకరుఁడునులేడు. బహుమిత్రులుగలవాఁడు. పరరాజులను సామంతులుగఁ జేసికొనినవాఁడు. నిజప్రతాపముచే దుష్టులనందఱసంహరించినవాఁడునునని ప్రసిద్ధివహించె.

మంత్రాలోచనయందుదనకుమేలుసేయుట కాసక్తిగలవారును, సర్వకార్యములయందును సమర్థులైనవారునునగునమ్మంత్రులతోఁగూడిన నాదశరథమహారాజు "తేజోమయములై పరులబరిభవింప సమర్థములైన కిరణసహితుఁడైయుదయించిన బాలసూర్యునింబోలె,, బ్రకాశింపుచు "స్వర్గమును నింద్రుఁడుపరిపాలించినతెరంగున,, భూలోకమును సర్వమునుబాలించె.

ఇట్లనిశ్రీమద్బాలకాండమునందలియేడవసర్గముసమాప్తము

—*దశరథమహారాజుసంతానరహితుఁడై చింతించుట.*—

ఇట్లుమహాప్రభావముగల యాదశరథమహారాజు సకలధర్మములనెఱింగి ధర్మస్వభావముతో రాజ్యపరిపాలనఁ జేయుచుండినను, వంశకరుఁడగు పుత్రుఁడు జనింపఁడయ్యె. ఇట్లుండగ నాదశరథమహారాజు సంతానము గలుగక పోవుటనుగురించి మిగులఁజింతాక్రాంతుఁడై యశ్వమేధయాగముచేసి దేవతలనారాధింపవలయునని తలంపుగలిగి దృఢనిశ్చయుండై సమర్థులగుమంత్రిపుంగవులఁ బిలిపించి సుమంతుఁడను మంత్రిశ్రేష్ఠునకిట్లనియె.

మంత్రిపుంగవా! గురువులును బురోహితులును నగువారలనందఱ శీఘ్రముగనిచ్చోటునకు బిలిపింపవలయునని యె. అంతనాసుమంత్రుఁడు త్వరితవిక్రముఁడై పోయి వేదపారగులగు సుయజ్ఞవామదేవ జాబాలికాశ్యపులను, పురోహితుఁడగువసిష్ఠుని, నింకననేకబ్రాహ్మణ శ్రేష్ఠులనుఁ దోడితెచ్చె. అట్లువచ్చినవసిష్ఠాది మునివరులనందఱ ధర్మాత్ముడగు దశరథభూవల్లభుఁడుపూజించె. పూజించి ధర్మార్థసహితమును, మృదువునునగు నొకవచనమును బలికె.

మునికులోత్తములారా! పుత్రులకొఱకు సతతమును దుఃఖమును బొందుచున్ననాకుసుఖము గలుగదయ్యె కావునసంతానము గలుగుటకొఱకు నశ్వమేధయాగము సేయవలయునని యొడు బుద్ధినాకుజనించినది. అదికారణముగ శాస్త్రోక్త కర్మానుసారముగ నయ్యశ్వమేధయాగమును జేయ నిశ్చయించుచున్నాఁడను. ఇట్టినాదు మనోరథంబెట్లుదీరును. మీరందఱునాలోచింపుఁడనియె. అవ్వచనములనువిని యావసిష్ఠాదిమునివరులందఱును మేల్మేలనుచుదశరథభూపాలునివచనములను బహువిధములశ్లాఘించి పరమానందమునుఁబొందియిట్లనిరి.

రాజేన్ద్రా! యజ్ఞసంభారములను సంపాదింపుము. యజ్ఞాశ్వమునువదలుము. ఇట్లుసేసితివేని పుత్రులతోఁగూడసకలాభిలాషలను నిశ్చయముగఁబొందఁగలవు. పుత్రులకొఱకు నీకుధర్మార్థసహితమగు బుద్ధిజనించినది కావున నన్నివిధముల నుత్తమగుణములుఁగల కుమారులంబడసెదవని నసమ్మునుల వచనములకుఁ బరమానందమునుబొందె. పిదపసంతోషముచేత వికసితనేత్రములు గలవాఁడై మంత్రులను బిలిపించియిట్లనియె.

వసిష్ఠాదుల అనుమతిని దశరథమహారాజు అశ్వమేధయాగముసేయబ్రయత్నించుట

మంత్రిపుంగవులారా! గురువచనానుసారముగ యజ్ఞసంభారములను సంపాదింపుఁడు, సమర్థులచేరక్షింపఁబడిన యశ్వము నుపాధ్యాయులతోఁగూడ వదలుఁడు. సరయూనదికి నుత్తరతీరమునందు యజ్ఞభూమియుండునట్లు చేయుఁడు. కల్పోక్త శాస్త్రోక్త ప్రకారములుగ శాంతుల నభివృద్ధినొందింపుఁడు.

ఈయశ్వమేధయాగమునం దపాయకరమయిన యపచారముఁగలుగుట కవకాశములేకపోయెనేని యెల్లరాజులును నతిసులభముగజేయుటకు సమర్థులగుదురు. మఱియు బ్రాహ్మణులుగానుండి యాగమునందు బ్రమాదవశమువలన నపచారములు సంభవించుటంజేసి రాక్షసత్వమునొందిన బ్రహ్మరాక్షసులు యాగమునందలి యపరాధములజక్కగానెఱింగియున్నవారగుటచే నాబ్రహ్మరాక్షసులుదోషములవెదకుచు యాగమును జెఱుపంజూతురు. యాగము జెడెనేని కర్తయునునాశనమునుబొందును. కావున నతిసమర్థులగుమీరు యీయజ్ఞమును శాస్త్రోక్తప్రకారముగలోపములేకుండునటుల సమాప్తిని బొందించవలయును. అని నవమ్మంత్రిపుంగవులందఱును దేవరవారి యాజ్ఞాప్రకారము నెరవేర్చెదమని యాదశరథభూవల్లభుని వచనములకానందమునుబొందిరి. అంతనందలి ధర్మజ్ఞులగు వసిష్ఠాదిమునిపుంగవులును నారాజేన్ద్రునాశీర్వచనములచేత వృద్ధినొందించి భవదాజ్ఞానుసారముగఁ జేసెదమనియతనిచేత సుమతులయి నిజనివాసములకుఁజనిరి.

అట్లమ్మునిపుంగవుల నందఱిఁబంపి దశరథ మహీవల్లభుండు మంత్రులనాలోకించి యిట్లనియె, మంత్రిపుంగవులారా! ఋత్విగ్జనులచేఁజెప్పఁబడినవిధముగఁ గ్రతుసంభారములను సంపాదింపుఁడనిచెప్పి యారాజేన్ద్రుఁడు మంత్రిపుంగవులనందఱికిని సెలవొసంగి తానును నిజమందిరమునకుఁబోయెను. అట్లుపోయి తనమనఃప్రియులగు భార్యలనందఱఁగప్పించి నేను పుత్రోత్పత్తికొఱకు నశ్వమేధయాగము చేసెదను. కావునమీరందరు దీక్షనవలంబింపుఁడనియె. అట్టిమనోహరమైన వచనమునుజెప్పుటచేనతిరామణీయకముగల యాస్త్రీలముఖములు హిమాత్యయసమయమునందలి పద్మములవలె ప్రకాశించెను.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందు ఏనిమిదవసర్గము

సుమంత్రుడు దశరథునకు ఋశ్యశృంగుని వృత్తాంతమును దెలియజేయుట.

పిదప సారథియైన సుమంత్రుడు యీవృత్తాంతమునుసం తయుకువిని దశరథమహారాజునుజూచి యిట్లనియె. రాజోత్తమా! యిప్పుడువసిష్ఠాదిమహర్షులచే నుపదేశింపఁబడి నపుత్రప్రాప్త్యుపాయమును నేనుయితిహాసరూపముగవినియున్నాను. పూర్వముభూతభవిష్యద్వర్తమానజ్ఞానాదిమాహాత్మ్యములుగల సనత్కుమారమహర్షి ఋషులందఱునువినుచుండగ నీపుత్రప్రాప్తినిగుఱించి యొక్క కథను జెప్పె. ఎట్లనిన.

కాశ్యపునకుఁ బ్రసిద్ధుడగువిభాండకుఁడును పుత్రుఁడొక్కఁడుగలండు. అతనికి ఋశ్యశృంగుఁడను కుమారుండు పుట్టఁగలఁడు. ఆఋశ్యశృంగ మునివరుఁడు సర్వకాలములయందును వనచరుఁడైవనమునం దే వృద్ధినిబొందుచుండుటవలన నతండు నగరగ్రామములంగాని నితరములగు పదార్థములంగాని నేమియును నెఱుంగడు. లోకమున బ్రసిద్ధముగబ్రాహ్మణులచేఁ గొనియాడంబడెడి బ్రతిత్వముప్రాజాపత్యత్వము నను రెండువిధములగు బ్రహ్మచర్యములను నొందగలఁడు. మఱియు నాఋష్యశృంగమహాముని సతతమునునగ్నిపరిచర్యను, పితృశుశ్రూషను జేయుచు బ్రహ్మచర్యమునందు గొంతకాలమును గడుపుచుండును.

అట్టిసమయమునం దంగదేశములయందుఁ బ్రసిద్ధుఁడును, మహాబలుఁడును, ప్రతాపవంతుఁడును, నగురోమపాదుఁడను రాజొకండుండఁగలఁడు. ఆభూపాలుఁడు ధర్మము నతిక్రమించుటంజేసి మిగులదారుణమైనదియును, భయంకరమైనదియును, సర్వభూతభయావహమునునగు ననావృష్టి దోషముజనించును. అట్టియనావృష్టిగలిగిన నారాజేన్ద్రుఁడు దుఃఖమునొంది బ్రాహ్మణులను, శ్రుతవృద్ధులను బిలిపించియిట్లనిచెప్పఁగలఁడు.

జనోత్తములారా! మీరందఱునుసకలధర్మములను విధినవారు. మఱియును లోకాచారములనెఱింగినవారు. కావున ననావృష్టిదోషనివారణమును, నన్ష్షింపఁదగినదియు నగు ప్రాయశ్చిత్తరూపమగు ధర్మమును దెలుపుఁడనియడుగును. అంత వేదపారగులగు బ్రాహ్మణులిట్లని చెప్పుదురు. రాజేంద్ర! సర్వోపాయములచేతనువిభాండకసుతుఁడగుఋశ్యశృంగుని నిందులకు రప్పింపుఁడు. అట్లు రప్పించి యాఋశ్యశృంగుని ముందునిడుకొని శాస్త్రోక్తప్రకారముగ సమాహితుఁడవై శాంతయను నీకొమార్తెనొసంగుమనిచెప్పఁగరు అంతటవారల వచనమును విని యారాజేన్ద్రుడు నియతతబ్రహ్మచర్య వ్రతస్థుఁడగునమ్మునిపుంగవు నెట్లు తేఁగలను నేనేమిచేయుదును. వీర్యవంతుఁడగు నాఋష్యశృంగు నేయుపాయముచేఁ గొనిరాదగునని విచారమునుబొందును, పిమ్మటబుద్ధిమంతులగు మంత్రులతోడ నాలో

చించి పురోహితామాత్యులఁ బిలిచి సత్కరించి ఋశ్యశృంగునిఁ దోడితెచ్చుటకు పంపును. అప్పుడా పురోహితామాత్యులు రాజవచనమును విని ఖిన్నులై మొగము వాఁచి ప్రచండకోపుండగు విభాండకమహర్షికి భయపడి రాజేన్ద్రునితో నిట్లని నుడువుదురు. రాజేన్ద్రా! మేము పోఁజాలము. ఒకవేళ ధైర్యము నవలంబించి పోయినను దీసికొనిరాఁజాలము. ఆ మునిపుత్రునిఁ గొనివచ్చుటకుఁ దగిన యుపాయములనాలోచించి చెప్పుదుము. అట్టి యుపాయములచే నతని రప్పింపవచ్చును. అట్లు సేయుటవలన దోషమేమియును గలుగనేరదు. అనావృష్టిదోషమును శాంతింపఁ బొందునని సనత్కుమారుఁడు సెప్పెనని చెప్పి సుమంత్రుండు దశరథభూవల్లభునకు మరలనిట్లనియె.

అయ్యా యిక్ష్వాకురాజనందనా! యివ్విధముగఁ బలికిన పలుకులను విని యయ్యంగదేశాధిపతియగు రోమపాదుఁడు వారకాంతలఁ బంపి యామునిపుత్రునిఁ దెప్పించి శాంతయను కన్నియ నొసంగును. అంతట ననావృష్టిదోషము వోవునట్లు పర్జన్యుఁడు వర్షించును. అంత రోమపాదుఁడు ఋశ్యశృంగుని వల్లునిఁ గైకొనును. కావున నీవును ఋశ్యశృంగుని బిలిపించితివేని నీకు సంతానము గలుగునట్లుఁ జేయఁగలఁడు. ఈవిషయమును సర్వమును సనత్కుమారమునివరునివలన నేవింటిననియె. అంతట దశరథమహారాజు మహానందమును బొంది యాసుమంత్రునితో నిట్లనియె.

అయ్యా మంత్రిపుంగవా! పిదప ఋశ్యశృంగుఁ డెట్లు తేఁబడె. ఆవృత్తాంతమును సర్వమును విస్తరించి చెప్పుమనియె.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి తొమ్మిదవసర్గము సమాప్తము.

అవ్విధముగ దశరథమహీవల్లభుం డడిగిన వచనములను విని సుమంత్రుండిట్లనియె. రాజేంద్రా! రోమపాదునిమంత్రులు ఋశ్యశృంగునిఁ గొనితెచ్చిన తెరంగును సర్వమును నావలన వినుము. అట్లు రోమపాదుఁడు సెప్పిన వచనములను విని యాతని పురోహితుఁడు మంత్రులతోఁ గూడుకొని యిట్లనియె. రాజేంద్రా! నిరపాయమగు నుపాయము మాచే నాలోచింపఁబడినది. ఋశ్యశృంగుఁడు వనచరుఁడు. సర్వకాలములయందును దపస్స్వాధ్యాయనమునం దాసక్తుఁడు. స్త్రీలయొక్కయు, విషయములయొక్కయు, సుఖములను దెలిసినవాఁడు గాఁడు. మానవుల చిత్తములకు వికారములను గలుగఁజేయునవియును, సమ్మతములునునగు నింద్రియార్థములచేత నా ఋశ్యశృంగుని నిప్పట్టణమునకుఁ దీసికొనిరాఁగలము. ఈవిషయమును నిశ్చయింపుము. రూపవతులు, నలంకృతులునునగు వేశ్యాంగనల నచ్చోటునకుఁ బంపుము, ఆ వేశ్యాంగనలు వారలచేత సత్కృతులై నానావిధోపాయములచేత నమ్మునిపుత్రుని వంచించిపెట్టి తీసికొనిరాఁగలరనియె. అంత రోమపాదుఁడు పురోహితునితో నట్లు నే సేయుఁడనిన పురోహితుఁడును మంత్రులును వేశ్యల నచ్చోటికిఁ బంపిరి. ఆవారాంగనలును గొప్పదగు నరణ్యమును బ్రవేశించి యమ్మునిపుత్రునాశ్రమమునకు సమీపమున నిలిచి ఋషిపుత్రుఁడును, ధీరుఁడును, సర్వకాలములయందును నాశ్రమవాసియునునగు ఋశ్యశృంగునిఁ జూచుటకుఁ దగిన యత్నమును జేయుచుండిరి. పితృశుశ్రూషణయం దాసక్తుఁడును, నిత్యసంతుష్టుఁడునునగు ఋశ్యశృంగుఁ డాశ్రమమును వదలి రాఁడయ్యె. తపోధనుఁడగు నమ్మునిపుత్రుఁడు జననకాలము మొదలుకొని నగరరాష్ట్రములయందలి యేవిషయమును దెలిసినవాఁడు గాఁడు. స్త్రీపురుషలభేదమును గూడ గుర్తెఱుఁగఁడు. అట్టి మునిపుత్రుఁ డొకదినమున దైవవశముగ నవ్వేశ్యాంగనలుండు చోటునకు వచ్చి యందలి వేశ్యాంగనలను జూచెను. అప్పుడవ్వారకాంతలు, మధురస్వరముగలుగునట్లు గానము సేయువారును, చిత్రవేషములుగల వారునునై యా ఋశ్యశృంగుని యొద్దకు వచ్చి యిట్లనిరి,

అయ్యా బ్రాహ్మణోత్తమా! నీవెవరు? నీవేమినిమిత్తమున నీయడవియందున్నాఁడవు నీ వృత్తాంతమును మేము దెలియఁదలఁచియున్నారము. నీవు, భయంకరమును నిర్జనమునునగు నివ్వనమున నొంటిగ సంచరించుటకుఁ గారణమేమి? ఈవిషయమును మాకుఁ దెలుపుమనిరి. అంతనా ఋశ్యశృంగుఁ డదివఱకెన్నఁడును జూడఁబడనివారును, మనోహరమైన యాకారముగలవారునునగు నవారకాంతలను జూచి యతిస్నేహవంతుఁడై తనదు జనకుని వృత్తాంతమును జెప్పుటకు నుద్యుక్తుఁడయ్యె. మునికులోత్తములారా! యేను విభండకుఁడను మునివరుఁడు తండ్రిగాఁగలవాఁడను. కావున నేనతనికి నౌరసపుత్రుఁడను. ఋశ్యశృంగుఁడను నామధేయము మీలోకమున నాకుఁ బ్రసిద్ధమైయున్నది. ఈవనసమీపమునందే మా యాశ్రమస్థానమున్నది. మీకందఱకును శాస్త్రోక్తప్రకారముగ నతిథిసత్కారమును చేయఁగలను. కావున నే సేయు పూజల నంగీకరింపుఁడనియె.

అంత నవ్వారస్త్రీలందఱును నమ్మునిపుత్రు వచనములను విని యతని యాశ్రమపదమును జూడ సముత్సుకలై యతనితోఁగూడ నయ్యాశ్రమమునకుఁ బోయిరి. అట్లు వచ్చిన వారలకా ఋశ్యశృంగుఁడు విధ్యుక్తప్రకారానుసారముగ నతిథిసత్కారముల నొసంగె. ఇవ్విధముగ నమ్మునిపుత్రుచే

నొసఁగఁబడిన యర్ఘ్యపాద్యాదులను గ్రహించి యందఱును సంతసించిరి. పిదప విభండకమునివరుఁడు దీనిని దెలిసికొనెనేని కోపించి శపించునని భయమునొంది యిచ్చటనిఁకనుండఁగూడదు శీఘ్రముగఁ బోవలసినదని నిశ్చయించి యమ్మునిపుత్రునకిట్లనిరి. అయ్యా మునికులోత్తమా మేము తెచ్చిననిఫలములు ముఖ్యములయినవి. కావున వీనిని గ్రహించి శీఘ్రముగ భుజింపుమనిరి. అట్లు సెప్పి యావారకాంతలందఱును నాఋశ్యశృంగుని గౌఁగలించుకొని హర్షసమన్వితులై కుడుములు మొదలగు ననేకవిధములగు భక్ష్యములనిచ్చిరి. అంత నాఋశ్యశృంగుఁడు వాని నన్నింటని భక్షించి యవి ఫలములనితలఁచె. వనమునం దెప్పుడును నివసించువారల కిట్టి ఫలములెన్నఁడును లభ్యములు గావనియె. మఱియు నెన్నఁడును ననుభవింప లేదనితలఁచె. పిదప నవ్వారాంగనలు యతని జనకుఁడు వచ్చెనేని శపించునని తలఁచి భీతచిత్తులగుచు వ్రతానుష్ఠానమునకుఁ బోవలయునని కారణాంతరములను గల్పించుకొనిపోయిరి. అట్ల వ్వారాంగనలందఱును బోయిన పిదప నవ్విభండకమునిపుత్రుఁడు మనస్సున స్వాస్థ్యము లేక నయ్యంగనలను మునులని తలఁచినవాఁడగుటచే వారివియోగమునకు దుఃఖమును బొందుచుఁ దిరుగుచుండె. అట్లా దినమంతయును గడపి మరుదినముఁ దొల్లి యలంకృతులై కనఁబడిన వారాంగనలుగల ప్రదేశమునకుఁ జనియె. అప్పుడు తమయొద్దకు వచ్చుచున్న మునిపుత్రునిఁ జూచి యావారాంగనలందలను పరమసంతుష్టహృదయలైరి. పిదప నతని సమీపమునకు వచ్చి యిట్లనిరి. మునిపుత్రోత్తమా! మాయాశ్రమపదమునకు రమ్ము. అచ్చట నది మాకు స్వదేశమగుటవలన నీకు నతిథిపూజలచే జక్కఁగ సత్కరింపఁగలమని మనోహరముగఁ బలికిన వచనములను విని యా ఋశ్యశృంగుఁడు వారలతోఁగూడి పోవుటకు యత్నించె. పిదప నయ్యంగనలందఱును నాఋశ్యశృంగుని దోడ్కొనివచ్చుచుండిరి.

అవ్విధముగ మహాత్ముఁడగు ఋశ్యశృంగుని గొనివచ్చుచుండఁగ సకలదేశములకు నాహ్లాదమును గలుగఁజేయుచు మేఘుఁ డతిశీఘ్రముగ వర్షించె. అట్లు వర్షముతోఁ గూడ వచ్చిన మునిపుత్రునిఁ జూచి రోమపాదుఁ డెదురుగ నేగుదెంచి వినయముచే శిరస్సును వంచికొని గద్దియనుండి డిగ్గె. పిమ్మట నారాజేన్ద్రుఁడు న్యాయమార్గానుసారముగ నాఋశ్యశృంగమునివరునికొఱకు నర్ఘ్యమును నొసంగి వారాంగనలచేఁ దెప్పింపఁబడి నందువలనఁగలిగిన దోషనివారణకొఱకమ్మునిపుత్రుని ప్రసాదమును గోరె. పిమ్మట నాఋశ్యశృంగమునివరుని నంతఃపురమునకుఁ బిలుచుకపోయి శాంతమయిన మనసుచే శాస్త్రోక్తప్రకారముగ శాంతయను తనకన్యను నొసంగె. అట్లు కన్యాదానము సేసి పరమానందమును బొందె. ఇవ్విధముగ నాఋశ్యశృంగుఁడు సర్వకామములచేతను బూజితుండై యయ్యంగదేశమునందు నివసించె.

ఇట్లు- శ్రీమద్వాలకాండమునందలి పదియవసర్గము. సమాప్తము.

అట్లు సెప్పి యాసుమంత్రుఁ డిట్లనియె. రాజేన్ద్రా నాదు వచనమును వినుము. అవ్విధముగ సనత్కుమార మునివరుఁడు సెప్పుచు సందర్భానుసారముగ నిట్లనియె. ఇక్ష్వాకువంశమునందు మిగుల ధార్మికుఁడును, శ్రీమంతుఁడును, సత్యపరిపాలకుఁడునునగు దశరథభూవల్లభుఁ డొకఁడు పుట్టఁగలఁడు. అద్దశరథమహారాజునకు నంగరాజుతో స్నేహము కాఁగలదు. అయ్యంగరాజునకు మహాభాగ్యురాలగు శాంతయనుకన్నియయుండును. మఱియు నయ్యంగరాజునకు రోమపాదుఁడను పుత్రుఁ డొకఁడుఁడు ప్రసిద్ధుఁడై యుండఁగలఁడు. అట్టి రోమపాదునొద్దకు మహాయశస్కుఁడగు దశరథభూవల్లభుఁడు పోఁగలఁడు. పోయి యిట్లనినుడువును.

అయ్యా రోమపాదా! శాంతాదేవిభర్త నాదు యజ్ఞమునకు వచ్చునట్లు సేయుము. అతఁడు వలన నాకు సంతానముగలుగఁగలదని నుడువును. అట్లు పలికిన దశరథుని వచనములను విని యారోమపాదుఁడు మనమునఁ జక్కఁగ విచారించి పుత్రవంతుఁడగు శాంతాదేవిభర్తనివ్వఁగలఁడు. అంత నాదశరథుఁ డవ్విప్రునిఁ బ్రతిగ్రహించి సంతాపమును వదలి పరమానందమనస్కుఁడై తానొనర్చెడి యజ్ఞమునకుఁ దీసికొనిరాఁగలఁడు.

మఱియు సత్యధికమగు కీర్తిని సంపాదించుటయం దభిలాషగలవాఁడును, కృతాంజలియునునగు దశరథమహీవల్లభుఁడు బ్రాహ్మణోత్తముఁడగు ఋశ్యశృంగుని సంతానము గలిగించుటకొఱకును యాగము సేయించుటకును స్వర్గము ప్రాప్తించునట్లు సేయుటకును వరించును. అంత నాదశరథుఁ డా ఋశ్యశృంగుని వలనఁ దనయభిలషితమును బొందును. పిదప నద్దశరథున కమిత పరాక్రమములుగల నలుగురుపుత్రులు పుట్టుదురు. అన్నల్వురు వంశమును బ్రతిష్ఠను జేయువారును, సర్వలోకములయందును బ్రసిద్ధులును నగుదురనియె.

ఇవ్విధముగ దేవతలలో శ్రేష్ఠుఁడును, భగవంతుఁడును, సమర్థుఁడును, నగు నాసనత్కుమారమునివరుఁడు మును పటియుగమునం దిట్లు కథను జెప్పెను. కాఁబట్టి యో రాజేన్ద్రా నీవప్పురుషశార్దూలుని సత్కరించి యిందులకుఁగొ

నితెమ్ము. నీవు సకలసైన్యసమేతుఁడవై స్వయముగవచ్చి టునకుఁ బొమ్మనియె.

—ఋష్యశృంగునొద్దకు దశరథమహారాజు యేగుట.—

అంతట దశరథ భూవల్లభుఁడు సుమంత్రుని మాటనువిని వసిష్ఠునికెఱింగించి యాజ్ఞవొంది యంతఃపుర స్త్రీలనుఁదోడ్కొని మంత్రులతోడంగూడుకొని ఋష్యశృంగుండుండు ప్రదేశమునుగూర్చి తరలెను. ఇట్లుపోయి మెల్లమెల్లగ వనములను నదులను నతిక్రమించిపోవుచుండె. పోయి ఋష్యశృంగుఁడుండు దేశమునుబొందె. పొందిబ్రాహ్మణోత్తముఁడును, రోమపాదు నంతికమున నున్నవాఁడును, ఋషిపుత్రుఁడును నగు ఋష్యశృంగుని దీప్తానలమును జూచినవిధముగఁ జూచె.

అంతట నద్దశరథుఁడు పరమమిత్రుఁడగుటవలన రోమపాదుఁడు సంతుష్టాంతరంగుఁడై విధ్యుక్తప్రకారముగఁ బూజించె. మఱియు దశరథాగమనవృత్తాంతమును సర్వమునువిని భవదభీష్టానుసారముగఁ బ్రవర్తింపుమనియె. అంతట నద్దశరథ మహీవల్లభుఁడు ఋషిపుత్రుఁడగు ఋష్యశృంగునకు విధ్యుక్తప్రకారముగఁ బూజలుసల్పె. అప్పుడు ఋష్యశృంగమునివరుఁడు సఖ్యసంబంధములంబట్టి యా దశరథుని మరలఁబూజించె. ఇవ్విధముగ నమ్మునిపుత్రునిచేఁ జక్కఁగఁబూజింపఁబడి యాదశరథుఁ డందునివసించె. అవ్విధముగ నేడెనిమిదినములు నివసించినపిదప దశరథుఁడా రోమపాదున కిట్లనియె. రాజేంద్రా! నీదుపుత్రికయగుశాంత భర్తతోఁగూడ నానగరమునకు విచ్చేయునటుల ననుజ్ఞనొసంగుమనియె. వీరివలన నాకుమహాకార్యముగానున్నదనియె.

అంత నారోమపాదుఁడు బుద్ధిమంతుఁడగు ఋష్యశృంగుని గమనముపకొడంబడి ఋష్యశృంగునకిట్లనియె. బ్రాహ్మణోత్తమా నీవుభార్యతోఁగూడ నయోధ్యానగరమునకుఁబొమ్మనిన నవ్వచనమునువిని ఋష్యశృంగుఁడును నంగీకారంబును బొందె. అంతట నారోమపాదునిచే ననుజ్ఞాతుఁడై భార్యతోడంగూడ బయలువెడలె. అప్పుడు రోమపాదదశరథులు పరస్పరాంజలులను, పరస్పరాలింగనములను జేసికొని యానందమునుబొందిరి. అంతట నద్దశరథ మహీవల్లభుఁడు మిత్రుఁడగు రోమపాదునామంత్రణముసేసి శీఘ్రగాములగు దూతలబిలిపించియిట్లనియె. చారులారా మీరుశీఘ్రముగ నయోధ్యానగరమునకుఁబోయి పౌరులకు నావచనములుగఁజెప్పుఁడు. ఈవిషయంబును సత్యంబును దెల్పుఁడు శీఘ్రముగ మనపురంబును జక్కఁగ నలంకరింపుమనుఁడు. సర్వస్థలముల యందును సుగంధపుజలములు బర్వునట్లుసేయుఁడు. వీధుల యందంతటను జలసేకంబునుగావింపుఁడు పతాకలచే నలంకరింపుఁడనియె. అంత నాదూతలతిత్వరితగమనంబునఁబోయి యావృత్తాంతమును సర్వమును పౌరులకు నెఱింగించిరి. అవ్వృత్తాంతమును విని పౌరులందఱును నగరమును నత్యద్భుతముగ నలంకరించిరి.

—* { దశరథమహారాజు ఋష్యశృంగునిఁదోడ్కొనియయోధ్యకువచ్చుట. }

అంతఁ గొంతసేపటికి దశరథమహారాజు ఋష్యశృంగునితోఁగూడ నలంకృతమగు నిజనగరమును బ్రవేశించె ఆసమయమున శంఖ దుందుభినాదములు భూమ్యంతరిక్షములనిండె. అప్పుడు నగరనివాసులందఱును పరమానందమునుబొంది ఋష్యశృంగసహితుఁడగు దశరథుంబొగడఁగనిరి. మఱియు నింద్రతుల్యుఁడగు నద్దశరథుఁడు సత్కారపూర్వకముగ ఋష్యశృంగునిఁ గొనివచ్చుటకు సంతుష్టచిత్తులయిరి. అంతట దశరథభూవల్లభుఁ డాశాంతాఋష్యశృంగుల నంతఃపురమునకుఁ గొనిపోయి శాస్త్రోక్తప్రకారముగఁబూజించి యమ్మునివరుని రప్పించుటవలనఁ గృతకృత్యుఁడనైతినితలఁచె. అవ్విధముగ భర్తతోఁగూడ వచ్చిన శాంతను నంతఃపుర స్త్రీలందఱును ప్రేమచేఁజూచి పరమానందమునుబొందిరి. అట్లంతఃపురస్త్రీలచేతను, రాజుచేతను నధికముగఁ బూజింపఁబడినశాంత నిజభర్తతోఁగూడఁ గొంతకాల మందునివసించె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందు పదునొకండవ సర్గము ముగిసెను.

(*) దశరథుఁడుఅశ్వమేధయాగముసేయుట. (*)—

ఇట్లు బహుకాలము గడచినపిదప వసంతకాలము సంప్రాప్తమయ్యె. అట్టి వసంతకాలమునందు దశరథమహారాజున కశ్వమేధయాగము సేయవలయునని మిక్కుతూహలముగలిగె. అంతట దేవతయుంబోలె ప్రకాశించుచున్న ఋష్యశృంగునకు శిరసుచేతవందనమును జేసి కులాభివృద్ధ్యర్థముగఁ జేయఁబూనిన యశ్వమేధయాగమునకు ఋత్విజునిగాఁగోరె. అవ్విధముగ సత్కరింపఁబడిన యాఋష్యశృంగుఁ డంగీకారమునుబొందె పిదప సంభారములను సంపాదింపుమనియును, తురగమునువదలుమనియును జెప్పె. అంత నారాజేంద్రుఁడు మంత్రిసత్తముఁడగు సుమంత్రునిబిలిపించియిట్లనియె. అయ్యా మంత్రిపుంగవా! బ్రహ్మవాదులగు ఋత్విజులను శీఘ్రముగ రప్పింపవనియె. అంత నాసుమంత్రుఁడు త్వరితగమనంబునఁబోయి సుయజ్ఞ, వామ

దేవ, జాబాలి, కాశ్యప, వసిష్ఠాదిపురోహితులను, మఱియు నితరులగు బ్రాహ్మణులనురప్పించె, అందువచ్చిన బ్రాహ్మణులందఱును వేదపారగులను కీర్తిగలవారు. అట్లువచ్చిన వారలనందఱ దశరథమహీవల్లభుఁడు శాస్త్రోక్తప్రకారముగఁ బూజించి ధర్మార్థసహితమును నతిమనోహరంబును నగువచనంబులతో నిట్లనియె. విప్రోత్తములారా నేను సతతంబును బుత్రులకొఱకుఁ బరితాపంబును బొందుచుందును. అదికారణముగ నాకుసుఖమేమియును గలిగియుండుటలేదు. కావున నశ్వమేధయాగము సేయవలయుననుబుద్ధిగలిగియున్నయది అందువలన శాస్త్రోక్తమార్గముచేత యజ్ఞమును జేయుటకు నిశ్చయించుచున్నాఁడను. ఋషిపుత్రుఁడగు ఋశ్యశృంగుని ప్రభావముచేతఁ బుత్రులను బొందఁగలను. మదభీష్టంబు నెరవేరుటకుఁ దామందఱును గరుణింపుఁడనిన నవ్వసిష్ఠాది మునివరులందఱును మేల్మేలనుచు నాదశరథభూపాలుని వచనంబులను శ్లాఘించిరి. మఱియు ఋశ్యశృంగాదిమునివరులందఱును నారాజేన్ద్రుతో సంభారములను సంపాదింపుమనిరి.

ఇంతయగాక పుత్రులకొఱకు నీకుధర్మబుద్ధియుదయించుటంజేసి యమితవిక్రములగుపుత్రుల నల్వురఁ బొందుదువనిరి. అట్లువచించెడు విప్రోత్తములవచనమునువిని దశరథుఁడు పరమానందమునుబొందె. పిదప మహానందముతో మంత్రులనుబిలిచి యిట్లనియె. మంత్రిజనోత్తములారా వసిష్ఠాదిమునివరుల వచనానుసారముగ యజ్ఞసంభారములను సంపాదింపుఁడు. సమర్థులచే నధిష్ఠింపఁబడిన యశ్వమును నుపాధ్యాయసహితముగ వదలుఁడు. సరయూనదికి నుత్తరతీరమున యజ్ఞభూమిని నియమింపుఁడు. కల్పోక్తప్రకారముగను యథావిధిగను శాంతులనొనరింపుఁడు. మఱియు నియ్యజ్ఞమును రాజులందఱును జేయనగును. ఇయ్యజ్ఞమునందు దోషమేమియును లేకుండెనేని యపరాధకష్టములు గలుగనేరవు. విద్వాంసులగు బ్రహ్మరాక్షసులియ్యజ్ఞమునందలి దోషములను వెదకుచుందురు ఇయ్యజ్ఞము దోషోపహతమయ్యెనేని కర్తయును నాశనమునుబొందును. కావున శాస్త్రోక్తప్రకారముగ విఘ్నములులేకుండునటుల నియ్యజ్ఞమును సమాప్తిని బొందింపవలయును. యజ్ఞమును పరిసమాప్తినొందించుటకుఁ దగినసామగ్రులను సంపూర్ణముగ సంపాదింపుఁడనియె అంత నమ్మంత్రులందఱును వల్లెయనిరి. పిదప దశరథుని వచనానుసారముగ సకలకార్యంబులను జేసిరి. అంతట నాద్విజులందఱును దశరథమహారాజు ననేకవిధముల స్తోత్రముసేసిరి. అట్లుసేసి వారందఱును బోయినపిదప దశరథుచే ననుమతులై తమతమ నివాసములకుఁబోయిరి. అవ్విధముగ నాబ్రాహ్మణులందఱును బోయినపిదప దశరథమహీవల్లభుఁడు మంత్రులనందఱ వదలి తనయంతఃపురమునకుఁ జనియె.

ఇట్లని, శ్రీమద్బాలకాండమునందలి పదిరెండవసర్గము సంపూర్ణము.

దశరథమహారాజుయాగశాలంబ్రవేశించుట.

అట్లు చైత్రపౌర్ణమాస్యయందు సాంగ్రహణేష్టిని జేసిన పిమ్మట నొకసంవత్సరమునకు మరలవసంతకాలము సంప్రాప్తమయ్యె. ఆసమయంబున వీర్యవంతుఁడగు దశరథమహారాజు సంతానముకొఱ కశ్వమేధయాగము సేయుటకు యాగశాలను బ్రవేశించె. అట్లు ప్రవేశించి బ్రాహ్మణోత్తముఁడగు వసిష్ఠమహామునిని నమస్కరించి యథాశాస్త్రముగఁబూజించి తనకునిర్విఘ్నముగసంతానము గలుగుటకొఱకు నమ్మునివరునితో మధురవచనముల నిట్లనియె. బ్రాహ్మణోత్తముఁడవును మునిశ్రేష్ఠుఁడవును నైన వసిష్ఠా! నాదుయజ్ఞమును శాస్త్రోక్తప్రకారముగఁ జేయింపుము. యజ్ఞాంగములయందు విఘ్నలేశమైనను బొరయకుండునటుల నొనర్పుము. నీవు మాకుఁ బ్రియమైనమిత్రుఁడవు. అదియునుఁగాక పరమగురుఁడవు. ఇయ్యజ్ఞభారమును నీవువహింపవలయును. నీకంటె నన్యులికార్యంబున సమర్థులులేరనినవిని వసిష్ఠమునివరుండు పరమానందమునుబొంది యిట్లనియె. రాజేన్ద్రా భవద్వచనానుసారముగ సర్వమును జేసెదననియె. అట్లుచెప్పి యజ్ఞకర్మనిష్ఠితులగు బ్రాహ్మణులతో నిట్లనియె.

మఱియు నయ్యోద్రవ్యములయందు రాజుచేనియుక్తులై స్వాతంత్ర్యమునుబొందినవారును, వృద్ధులును, పరమధార్మికులును, కర్మలయంతమును బొందించువారును, శిల్పమును జేయువారును, స్రుక్స్రువాదిపాత్రల నిర్మించువారును, లేఖకులును, చిత్రాదులనువ్రాయువారును, వాపీకూపాదులఁద్రవ్వువారును, నటనర్తకులును, పరిశుద్ధులును, శాస్త్రవేత్తలును, బహువిషయములను దెలిసినవారునునగు వారల సంపాదింపుఁడు. అట్లుసేసితిరేని రాజాజ్ఞనెరవేరుననియె. అంతట నెల్లరునువిచ్చేసిరి. అట్లువచ్చినవారలంగని పురుషోత్తములారా యనేకవేలసంఖ్యలుగల యిష్టకలను శీఘ్రముగ సంపాదింపుఁడనియును, బహుగుణాన్వితములగు రాజసదనములను నిర్మింపుఁడనియును, శుభకరములగు బ్రాహ్మణావసథములను గల్పింపుఁడనియును నట్టిమందిరంబుల భక్ష్యాన్నపానాదు లధికంబుగ నుండునటులఁ జేయుఁడనియును, మఱియును బౌరజనమునకును బహువి

స్తృతములగు నావాసములఁగల్పింపుడనియును, శాస్త్రోక్త ప్రకారముగ సత్కరించి యన్నదానము నాజానపదాదులకుఁ జేయుఁడనియును, విలాసార్థముగ నన్నదానము సేయవలదనియును, సర్వవర్ణములవారికిని దగినవిధంబుల సత్కారంబుల నొనరింపుఁడనియును, కామక్రోధాదులవలన నవజ్ఞను జేయఁగూడదనియును, యజ్ఞకర్మలయందత్యంతావేశముతో దిరుగువారును, శిల్పులును, నగువారలకుఁ గ్రమానుసారముగ సత్కారములను జేయుఁడనియును, మఱియు నెల్లవారలకును ద్రవ్యదానాన్నదానములను సంతృప్తిగఁ గావింపుఁడనియును, ఎల్లవారును బరస్పరమిత్రభావంబుచే మెలంగుఁడనియును జెప్పె. అట్లు సెప్పిన వసిష్ఠ మునివరు వచనంబులను విని యెల్లవారును మహానందంబును బొంది యొక్కటిగఁ జేరి యిట్లనిరి మునికులోత్తమా భవద్వచనానుసారముగ సంచరించుట కించుకైనను సందియంబు లేదు. ఎట్టిలోపమును గలుగకుండునటుల భవదనుగ్రహముచే వర్తింపఁగలవారమనిరి. పిదప నవ్వసిష్ఠ మునివరుండు సుమంత్రునిరప్పించి యిట్లనియె.

—※ యజ్ఞమునకు రాజులంబిలువుమని ఆజ్ఞసేయుట. ※—

అయ్యామంత్రిపుంగవా! భూలోకమునందలి ధార్మికులగు రాజులను నాహ్వానము సేయుము. మఱియు బ్రహ్మక్షత్రియ, వైశ్య, శూద్రులనందఱఁ దగువిధముల సత్కారములందనిపిరప్పింపుము. మిథిలాధిపతియును, శూరుఁడును, సత్యవిక్రముఁడును, వేదవేదాంగములనన్నింటిని సమగ్రముగఁ జదివినవాఁడును, పూర్వసంబంధియును, మహానుభావుఁడునునగు జనకచక్రవర్తిని సత్కారఁబూజించి గొనిరమ్ము. మిత్రుఁడును, సర్వకాలములయందును బ్రియముగ సంభాషించువాఁడును, మార్దవముగలవాఁడునునగు కాశీపతిని స్వయముగరప్పింపుము. మఱియును బరమధార్మికుఁడును, వృద్ధుఁడును, మనదశరథభూపాలునకుఁ బ్రియస్నేహితుఁడును నగు కేకయరాజును సపుత్రకముగ నిచ్చోటునకురప్పింపుము. ఇంతియగాక ప్రాగ్దేశవాసులగు సింధుసౌవీరసౌరాష్ట్ర దేశాధిపతులను, దాక్షిణాత్యులగు ననేకరాజులను శీఘ్రముగరప్పింపుము.

మఱియు భూలోకమునందుఁ బ్రియులును, స్నేహితులును నైయుండు, రాజులనందఱ రప్పింపుము. ఎల్లవారును బంధుమిత్రామాత్యసహితముగవచ్చునటులఁ జేయుమనిన నాసుమంత్రుఁడు వల్లెయనియె. పిమ్మట నాసుమంత్రుఁడు శీఘ్రబుద్ధిగలవాఁడగుచు రాజులనందఱ రప్పించుటకుఁ దగిన పురుషులనియమించె. మఱియు ధర్మాత్ముఁడగు సుమంత్రుఁడు వసిష్ఠమునివరు వచనానుసారముగ రాజులరప్పించుట స్వయముగ బయలువెడలి చనియె. అంత నచ్చోటనుండు కర్మాంతికులందఱును యజ్ఞార్థముగ సంపాదించిన ద్రవ్యములనన్నింటిని ధీమంతుఁడగు వసిష్ఠమునివరునకు సమర్పించిరి. పిదప నవ్వసిష్ఠమునివరుఁడు మహానందమునుబొంది యెల్లవారలతోడను నిట్లనియె. పురుషోత్తములారా! ఆదర సత్కారముతోడనైనను, విలాసముతోనైనను ఒరులకివ్వఁదగినవాని నివ్వఁగూడదు. అవమాన పురస్సరముగ నిచ్చునట్టి దాతను సందేహింపక దండింపవలయుననియె. అంతటఁ గొన్నిదినములకు దశరథభూపాలు నిమిత్తముగ నానావిధములగు రత్నములతోఁగూడ రాజులందఱును విచ్చేసిరి.

ఆసమయంబున వసిష్ఠమునివరుఁడు దశరథభూపాలుని మ్రోలకువచ్చి యిట్లనియె. రాజేంద్రా! భవదాజ్ఞానుసారముగ రాజులందఱును విచ్చేసియున్నారు. వచ్చిన రాజోత్తములకుఁ దగువిధంబుల సత్కారములందనిపి సంతుష్టులఁ జేసితిమి. సమాహితులగు పురుషులచేత యజ్ఞోపకరణములగు పదార్థములన్నియును సంపాదింపఁబడి యున్నయవి. కావున నీవు యజ్ఞమును జేయుటకొఱకు యజ్ఞశాలలోనికి విచ్చేయుము. సమీపమునకువచ్చిన సర్వోపకరణములతో నిండియున్న యాయజ్ఞశాల చూచుటకుఁ దగియున్నది. మఱియు నయ్యజ్ఞశాల మనసుచేతనే నిర్మింపఁబడినదికాఁబోలునని యెదుతలంపును గలుగఁజేయుచున్నది. అంతట నద్దశరథభూవల్లభుఁడు వసిష్ఠఋష్యశృంగుల వచనానుసారముగ శుభదివస నక్షత్రాదిసంయుత ముహూర్తమునందు బయలువెడలె. అంతట వసిష్ఠుఁడు మొదలుగాఁగల బ్రాహ్మణోత్తములందఱును ఋష్యశృంగుని ముందునిడుకొని యప్పుడే యజ్ఞకర్మలనాచరించిరి. మఱియు శాస్త్రోక్తప్రకారముగను విధ్యుక్త ప్రకారముగను యజ్ఞవాటమును బొందిరి.

ఇట్లని, శ్రీమద్బాలకాండమునందలి పదమూఁడవ సర్గము సమాప్తము.

—(※) అశ్వమేధయాగప్రారంభము. (※)—

అంత నొక్క సంవత్సరము గడచినపిమ్మట భూప్రదక్షిణమునకేగిన యజ్ఞాశ్వము యజ్ఞశాలలోనికి విచ్చేసె. అప్పుడు సరయూనదియొక్క యుత్తరతీరమునందు దశరథభూపాలు యజ్ఞము ప్రవర్తించె. ఆసమయంబున బ్రాహ్మణోత్తములందఱును ఋష్యశృంగుని ముందునిడుకొని యజ్ఞకర్మను జేసిరి. దశరథభూవల్లభునిచే నాచరింపఁబడుచున్న యమ్మహాయాగమునందు వేదపారగులగు యాజకులందఱును యథాశాస్త్రముగఁ గర్మను జేసిరి.

మఱియుఁ గల్పసూత్రమునందు జెప్పఁబడినరీతిని యథావిధిగను యథాన్యాయముగను బ్రచారమును జేసిరి. శాస్త్రానుసారముగ బ్రవర్గ్యమనుకర్మను జేసి యుపసదమనుసిష్టినిగూడఁ జేసిరి. ఇంతయగాక సమస్తమగుకర్మను శాస్త్రోక్తమార్గము ననుసరించియాచరించిరి. మఱియుబహిష్పవమానాదులచేతఁ దత్తత్కర్మదేవతలనుబూజించి ప్రవర్గ్యోప సదనావసానమునందుఁ బ్రాతస్సవన మాధ్యందిన సవనతృతీయ సవనములను కర్మలనన్నింటిని జేసిరి. ఇంద్రుని కివ్వవలసిన హవిర్భాగము యథాశాస్త్రముగ నింద్రున కివ్వఁబడె. దోషరహితమైన సోమలతయును స్తుతింపఁబడె. మధ్యాహ్నమునఁ జేయఁదగిన సవనకర్మము యథాక్రమముగఁ జరిగె. ఆబ్రాహ్మణశ్రేష్ఠులు మహానుభావుఁడగు దశరథమహారాజుకొఱకు శాస్త్రప్రకారముగఁ దృతీయసవనమునుఁ జేసిరి.

ఆయాగమునందు మంత్రప్రకారముగ హోమము సేయఁబడనిదిగాని తప్పిపోయినదిగాని కొంచమైన నుండలేదు. సర్వమును మంత్రయుక్తముగానే కనుపడుచుండె. విఘ్నము లేమియులేక క్షేమయుక్తముగాజరిగె. ఆయశ్వమేధయాగదివసములందు క్షుత్పిపాసలుగలవారును పండితులుగానిబ్రాహ్మణులును లేరు. మఱియునూర్గురుశిష్యులు లేనివాఁ డెవ్వఁడును లేడు. ఎప్పుడుచూచినను బ్రాహ్మణులును,శూద్రులును,దపస్వులును,సన్న్యాసులును, ముసలివాండ్రును, వ్యాధిగ్రస్తులును, స్త్రీలును, బాలురును, భుజింపుచుండిరి. అట్లు భుజింపుచుండినను రుచ్యతిశయముచే దనివినొందరైరి. అట్లెన్నిదినములు భుజించినను యజమానునకుఁజాలునని యెడుబుద్ధిజనింపదయ్యె అన్నము పెట్టుఁడు యింకనునన్నము పెట్టుఁడు నానావిధములగు వస్త్రములనివ్వుఁడని దశరథమహారాజుచేఁ బ్రీత్యతిశయమువలన రాజపురుషులు ప్రేరేపింపఁబడియాప్రకారముగనొనర్చిరి. ప్రతిదినమును పాకశాస్త్రప్రకారముగ సిద్ధము సేయఁబడిన యన్నము కొండలవలె రాసులురాసులుగ గనుపడుచుండును. నానాదేశములనుండివచ్చినయనేకపురుషులును,స్త్రీలును అన్నపానములచే దృప్తినొందింపఁబడిరి. ఓహోహో! యీయన్నం బెంతరుచిగానున్నది. ఎంతటియుపచారములో నివ్వఁబడుచున్నది. ఇంతటియుపచారములను మే మెన్నఁడు నెఱుంగము. మిగులఁదృప్తిగానున్నది. అన్నదాత సుఖముగనుండుగాకయని యనేకవిధముల శ్లాఘించిరి. ఆవ్వాక్యములను దశరథమహారాజువినియె. భూషణాలంకృతులగు పురుషులు బ్రాహ్మణులకు సమృద్ధిగ నుండునట్లు వడ్డించిరి.

అట్టిపురుషులను మణికుండలాలంకృతులగు మఱికొందఱు సహాయార్థము సేవించిరి. అట్టియెడ నాయాకర్మముల మధ్యకాలమునందుఁ బండితులును, యుక్తి యుక్తముగ మాటలాడువారునునగు బ్రాహ్మణులొండొరులజయింప నిచ్ఛగలవారై యనేకములగు యుక్తివాదములఁ జేసిరి. ఆయశ్వమేధమునందుఁ బ్రతిదినమును ఋత్విజులగుబ్రాహ్మణులు వృద్ధులచేఁ బ్రేరేపింపఁబడి సమస్తకర్మములను యథాశాస్త్రముగఁ జేసిరి. అందుశిక్షావ్యాకరణఛందోనిరుక్త జ్యోతిష కల్పంబులనియెడు షడంగములం దెలియనివాఁడును బ్రహ్మచర్యాది వ్రతములు లేనివాఁడును, విశేషశాస్త్రాభ్యాసము లేనివాఁడును లేడు. ఆదశరథమహారాజుయొక్క సదస్యులైన బ్రాహ్మణులందఱును శాస్త్రవాదమునందు సమర్థులుగనుండిరి. ఆయశ్వమేధమునందు యూపస్తంభములనిలుపునప్పుడు యాఱుబిల్వయూపములను, వాని సమీపమున నాఱు చంద్రయూపములను, నాఱు మోదుగయూపములను, నొకటి శ్లేష్మాలకవృక్షసంబంధమయిన యూపమును, రెండు దేవదారుయూపములను, నిలిపిరి. ఆయూపములలో రెండేసియూపములుగ జాఁచఁబడినచేతులంత వ్యవధానము గలుగునటుల నిలిపిరి. ఆయూపములన్నియును యాగములనెఱిఁగిన వారిచేతను జేయింపఁబడి యాగశాల కలంకారముగనుండునట్లు బంగారముచేనలంకరింపఁబడియె. మఱియు నిరువదియొక్కయూపములును, (అరత్నిమాత్రపరిమాణము) అనగా జాఁచఁబడినచిటికెన వ్రేలుగల పిడికిటితోఁగూడిన యిరువదియొక్కమూరలపొడుగుగల యిరువదియొక్క వస్త్రములచే బ్రతియూపములును నలంకరింపఁబడియె. అన్నియూపములును యెనిమిదంచులుగలిగి శిల్పులచేదృఢముగనుండునట్లు చక్కగాఁ జేయఁబడి యథాశాస్త్రముగ స్థాపింపఁబడె. వస్త్రములచేఁగప్పఁబడి గంధపుష్పాద్యలంకృతములయినవై యాకాశమునఁ దేజరిల్లెడు "సప్తర్షులవలెఁ బ్రకాశించె. ఇటికఱాళ్ళు శాస్త్రోక్తప్రకారముగఁ జేయింపఁబడె. అట్టియిటికఱాళ్ళతో శుల్బకర్మమునందు నేర్పరులగు బ్రాహ్మణులచే నగ్నివేదిఁగట్టఁబడియె. (శుల్బకర్మమనఁగానొంటిపేటగలత్రాడు. అదిసాధనముగాఁగలకార్యము శుల్బమనఁబడును.) ఆకట్టవలసినప్రదేశమును రాజసింహుఁడగు దశరథమహారాజుయొక్క నేర్పరులగు ఋత్విజులు బంగారముతోఁగూడిన ఱెక్కలుఁగలిగి ప్రతిప్రస్తారమునందును మూఁడేసి యిటికఱాళ్ళుండునట్లు బదునెనిమిదియిటికఱాళ్ళతో గరుడపక్షిరూపముగఁ జక్కగాఁగట్టిరి.

ఆయూపస్తంభములయందు శాస్త్రవిధిప్రకారముగ

నాయా దేవతలనుద్దేశించి పశువులును, సర్పములును, పక్షులును, గట్టఁబడెను. పశుబంధము సేయుటయందు మాత్ర మాకాలమునందు ఋత్విజులు శాస్త్రోక్తములగు గుఱ్ఱమును జలచరాదులగు గ్రామజమృగములను నాయూపస్తంభములం గట్టిరి. ఆపశుబంధకాలమునందు యూపస్తంభమునకు మున్నూఱుపశువులును, దశరథ మహారాజుయొక్క యశ్వరత్నమునుఁ గట్టఁబడియె. "సౌవర్ణీభిస్సూచీభిః పత్న్యో శ్వస్యాసిపథాన్ కల్పయంతి" అనుకల్పసూత్రప్రకారము దశరథమహారాజుయొక్క పట్టమహిషియైన కౌసల్యాదేవియాగుఱ్ఱమును బ్రదక్షిణముసేసి మూఁడుబంగారుసూదులచే మిగులసంతోషముతో గత్తివాట్లు వేసె.

మఱియు నాకౌసల్యాదేవి ధర్మేచ్ఛచే సుస్థిరమగుమనస్సుతో యజ్ఞాశ్వముతోఁగూడ నొకరాత్రియంతయు నివసించె. హోతయును, అధ్వర్యువును, నుద్గాతయును, బ్రహ్మయును, నీనల్వురును మహిషిని, పరివృత్తిని, వావాతను, బాలాకలిని గ్రమముగఁ దమహస్తములతో గ్రహించిరి. నియతేంద్రియుఁడును సకలశాస్త్రసంపన్నుఁడును నగు నధ్వర్యువు యజ్ఞాశ్వముయొక్క వపను యెత్తి శాస్త్రోక్తప్రకారముగ బక్వముసేసె. మానవాధిపుఁడగు దశరథమహారాజు తనపాపోపశమనార్థము వపాహోమమునందు వ్రేల్వఁబడుచుండఁగ నాపొగవాసనను శాస్త్రోక్తకాలమున శాస్త్రోక్తరీతి నాఘ్రాణించె. అంతమంత్రవేత్తలగు పదునాఱుగురు ఋత్విజులు మంత్రములనుచ్చరింపుచు విధ్యుక్తప్రకారముగ నయ్యజ్ఞాశ్వముయొక్క యవయవములనన్నింటిని నగ్నిహోత్రమునందు హోమముసేసిరి. ఇతరములగుయజ్ఞములకు హవిస్సుజువ్విగొమ్మలయందు సంస్కరింపఁబడుచున్నది. అశ్వమేధయాగమునకు హవిర్భాగము ప్రబ్బలితీగెలయందు సంస్కరింపంబడుచున్నది. యాగవిధినిదెల్పెడి కల్పసూత్రముచేతను వేదవిధి వాక్యములచేతను నశ్వమేధయాగము మూఁడుదినములు సేయవలయునని యేర్పడియె. ఆయశ్వమేధముయొక్క మొదటిదినము చతుష్టోమమనియు, రెండవదినముఉక్థ్యమనియు, మూడవదినమతిరాత్రమనియు లెక్కింపఁబడియె. ఆయశ్వమేధయాగమునందుఁ బ్రమాణాంతరమునుఁబట్టి శాస్త్రవిహితములగు ననేకయాగములు సేయింపఁబడియెను. జ్యోతిష్టోమమును, నాయుర్యాగమును, రెండతిరాత్రములును, అభిజిద్యాగమును, విశ్వజిద్యాగమును, అప్తోర్యామును జేసిరి. స్వకుల

—(*) ఋత్విజులకుబహుమతులొసంగుట. (*)—

వర్ధనుఁడగు దశరథమహారాజు హోతకుఁదూర్పుదిక్కునందలి దేశమునిచ్చె. అధ్వర్యువునకుఁ బడమటిదిక్కునందలి దేశమునొసంగె. బ్రహ్మకు దక్షిణపుదిక్కునందలి దేశమునుసమర్పించె. ఉద్గాతకు నుత్తరదిక్కునందలి దేశమునిచ్చె. పూర్వము బ్రహ్మచేసృజింపఁబడిన యశ్వమేధమహాయాగమునం దీదక్షిణ నేర్పఱుపఁబడియె.

మఱియును గ్రతువర్ధనుఁడగు దశరథభూపాలుఁడు ఋత్విజులకొఱకు భూమినంతయును దానముసేసె. అంతట నెల్లఋత్విజులును పాపరహితుఁడగు నద్దశరథ భూవల్లభునితో నిట్లనిరి. రాజేంద్రా! నీవొక్కఁడవే యీభూమిని సర్వమును నేలఁదగినవాఁడవు మాకుభూమితో నేమియును బ్రయోజనములేదు. మేము భూపరిపాలనయందు సమర్థులముగాము. మేముసర్వకాలములయందును వేదవేదాంగములను జదువుటయందాసక్తులము. కావున నీవొసంగిన రాజ్యములకన్నింటికినిఁబదులుగ గొంచముగ నేమూల్యంబిత్తువగాక శ్రేష్ఠములగుమణులు, సువర్ణము, గోవులు, మొదలగువానిలో నెద్దానినయిననొసంగుము వానిచే మేము జీవింపఁగలము. మాకుఁ భూమితోఁ బ్రయోజన మేమియును లేదనిరి.

ఇవ్విధముగ వేదపారగులగు బ్రాహ్మణులచేఁ బలుకఁబడిన వచనములనువిని దశరథుఁ డాఋత్విజులకొఱకు లక్షగోవులనొసంగె. నూఱుకోట్లసువర్ణమునిచ్చె. నన్నూఱుకోట్ల వెండినిసమర్పించె. అంత నాఋత్విజులందఱును దమకునొసంగిన దక్షిణాద్రవ్యమునువిభజించి యిచ్చుటకు ధీమంతులగు వసిష్ఠ ఋశ్యశృంగ మునివరులకు నిచ్చిరి. అట్లొసంగునపుడు ఋశ్యశృంగ వసిష్ఠులాభాగములను సముగ శాస్త్రానుసారముగఁ బంచిరి. అంతటనెల్లవారుసంతుష్టచిత్తులై యధికానందమునుబొందిరి. పిమ్మట యజ్ఞమునుజూచుటకు విచ్చేసినబ్రాహ్మణులకు నద్దశరథ మహీవల్లభుఁడు సమాహితుఁడై భూరిసువర్ణ దానమును జేసె.

అప్పుడొకక్క దరిద్రబ్రాహ్మణుఁడు యాచించుటం జేసి యత్యుత్తమంబగు చేతికడియమునొసంగె అంత నాబ్రాహ్మణపక్షపాతియగు దశరథభూపాలుఁడు సాంద్రానందబాష్ప పూరితనేత్రుఁడై భూరిదక్షిణలను గైకొనుటచే సంతుష్టచిత్తులగు బ్రాహ్మణులకందఱకును నమస్కారమును జేసె. పిదప నవ్విప్రులందఱును నద్దశరథునకు నాశీర్వాదములొసంగిరి. ఆయాశీర్వచములను ధీరుఁడునువీరవరుఁడునునగు దశరథుఁడువినయావతుఁడై గ్రహించె. అట్లు పరిగ్రహించి యారఘుకులదీపకుండు ప్రీతచేతస్కుండై పాపమును బోఁగొట్టునదియును, సర్వోత్తమమైనదియును, పుత్రప్రాప్తిద్వారా స్వర్గఫలదాయకమును, నన్యులగు రాజులచేఁ జేయనలవిగానిదియునునగు నశ్వమేధయాగ

మును బొందెను. పొంది ఋశ్యశృంగమునివరున కిట్లనియె. మునికులోత్తమా! వంశాభివృద్ధికరమగు కృత్యమును జేయుటకుఁ దగినవాఁడవు. కావునఁ దగినకృత్యము నాచరింపుమనిన బ్రాహ్మణోత్తముఁడగు నా ఋశ్యశృంగ మునిపుంగవుండు వల్లెయనియె. మఱియు నో రాజేన్ద్రా! వంశోద్ధారకులగు పుత్రులు నల్వురు నీకుఁ గలుగుదురనియె. ఇట్లని, శ్రీమద్బాలకాండమునందలి పదునాల్గవసర్గము సమాప్తము.

(*) దేవతలు యాగమునకు వచ్చుట (*

వేదజ్ఞుఁడును, మేధావియును నగు ఋశ్య శృంగుఁడు కొంతతడవు ధ్యానముసేసి రాఁబోవు వృత్తాంతమును సర్వమును దెలిసికొనువాఁడై యా దశరథ భూపాలున కిట్లనియె. రాజేన్ద్రా! నీకుఁ బుత్రులు గలుగుటకొఱకు శాస్త్రసిద్ధంబై పుత్రోత్పత్తి నిమిత్తంబై యున్న యొకయాగమును నథర్వశిరస్సునందుఁ జెప్పఁబడిన మంత్రములచేత విధ్యుక్తప్రకారముగ నాచరించెదను అని చెప్పి పుత్రనిమిత్తము పుత్రులఁ గలిగించునట్టి యాయాగము ప్రారంభించి తేజోవంతుఁడగు ఋశ్యశృంగుడు వేదోక్త ప్రకారముగ హోమముసేసె. ఆసమయంబున దేవగంధర్వ సిద్ధపరమర్షులు మొదలగు వారందఱును విధ్యుక్త ప్రకారముగ నయ్యిష్టియందలి హవిర్భాగమును గైకొనుటకు నొక్కచోటఁ జేరిరి. అట్లు చేరి యా దేవాదులందఱును దమసభయందు విశ్రమించి యున్నవాఁడును, లోకకర్తయును నగు బ్రహ్మదేవునితో నిట్లనిరి.

దేవతలు బ్రహ్మదేవునితో రావణునివలని బాధలను విన్నవించుకొనుట.

దేవోత్తమా భవదనుగ్రహముచే నభివృద్ధి నొందిన రావణుఁడను రాక్షసుఁడు నిజపరాక్రమంబున నేరిని లక్ష్యముసేయక మమ్ములనందఱ నధికముగ బాధించుచున్నాఁడు వానిని జయింప మేము సమర్థులము గాము తొల్లి నీవు ప్రీతచేతస్కుండవై యా రావణునకు వరము నొసంగితివి. అట్టి వరమును మేమందఱమును పూజించుచు సర్వబాధలను సహించుచున్నారము. ఆదుర్మతియగు రావణుఁ డున్నతపదస్థులగు లోకపాలురను భయపరచుచున్నాఁడు. ఇంతయగాక సర్వ కాలములయందును ద్వేషము నవలంబించును. మఱియు నద్దశకంఠుఁడు స్వర్గలోకాధి పతియగు నింద్రునిఁ బట్టికొనుట కిచ్ఛయించుచున్నాఁడు. నీదువరదానముచేత మోహితుఁడై యేరికిని జయింపనలవి గానివాఁడగుచు ఋషి, యక్ష, గంధర్వ, దేవ, బ్రాహ్మణులను బాధించుచున్నాఁడు. అతనివలని భయముచే సూర్యుఁడు తపించుటలేదు. వాయువు పార్శ్వమునందు సంచరించుట లేదు. చపలములగు నలలుగల సముద్రుఁడును గదలుట లేదు. అదికారణముగ ఘోరదర్శనుఁడగు రావణునివలన మాకందఱకును మిగుల భయము గలిగియున్నది. కావునన తని వధించుటకుఁ దగినయుపాయమును జేయుటకుఁ దగినవాఁడవని యా దేవాదులందఱును మొఱలిడిరి. అంతఁ గొంతసేపు బ్రహ్మదేవుఁడు విచారించి యిట్లనియె.

దేవోత్తములారా దురాత్ముఁడగు నా రావణుని వధించుటకుఁ దగినయుపాయమును యోచించితి. తొల్లి యా రావణుండు దేవగంధర్వ యక్షదానవాదులలో నేరివలనను మరణము సంభవించకుండునటుల వరంబును గోరె. అట్టివరంబును నే నంగీకారముతో నొసంగితి. ఆసమయంబున నద్దశకంఠుఁడు మానవులల్పులగుటచే వారివలన భయము గలుగునని యోచింపమిం జేసి యనునవమానముగనుండు ననియును మానవులవలనఁ జావుగలుగకుండు నటుల వరంబును గోరఁడయ్యె. అదికారణంబుగ నతండు మానవులచేఁ జావఁగలఁడు. అన్యులవలన నతనికి మరణముగలుగ నేరదనియె. ఆవచనమును విని దేవతలు, మహర్షులు మొదలగు వారందఱును బరమానందమును బొందిరి. అప్పుడు మహాతేజోవంతుఁడగు నారాయణుఁ డచ్చోటునకు నేగుదెంచె.

దేవతలు విష్ణుదేవును భూలోకంబున నవతరింపవలయునని ప్రార్థించుట.

వచ్చునపుడు శంఖచక్రగదాద్యాయుధంబులను ధరించియుండె. మఱియుఁ బీతవాససుఁడగుటచే నత్యధికంబుగఁ బ్రకాశించుచుండె. అట్లువచ్చి చతురాననునిచే సత్కరింపఁబడి యచ్చోట నివసించె. ఆసమయంబున బృందారకాదులందఱును సన్నతులై యవ్విష్ణుదేవుని బలువిధంబుల స్తోత్రముసేసిరి. మఱియు నో వాసుదేవా లోకములకు హితము గలుగుటకొఱకు నిన్నుఁ బ్రార్థించుచున్నారము. కావున మదభిలషితంబును దీర్పఁగోరెదము. భూలోకమున నయోధ్యా నామక నగరంబొండుగలదు. అప్పట్టణంబును దశరథుండను భూపాలుండు పాలించుచున్నవాఁడు అతండు సకలధర్మములను దెలిసినవాఁడు. దాతలలో నుత్తముఁడు, మహర్షుల తేజస్సునకీడగు తేజస్సుగలవాఁడు. అతనికి దక్షకన్యలగు హ్రీ, శ్రీ, కీర్తులను, వారికిఁ దుల్యలగు భార్యలు మువ్వురుగలరు. నీవు మాయభిలషితంబును దీర్పుటకొఱకు నీస్వరూపమును నాలుగుభాగములుగ విభజించుకొని యా భూపాలునకుఁ నలువురు పుత్రులుగఁ బుట్టుము. ఆదశరథుని భార్యలయందు మానవుఁడవై జన్మించి వరబలభుజబలములచేత నభివృద్ధి నొందినవాఁడును, లోకకంటకుఁడును, యుద్ధములయందు

దేవతలమగు మాచేజయింప నలవిగాని వాఁడునగు రావణునిజయింపుము. మూర్ఖుఁడగు నారావణుఁడు దేవగంధర్వ సిద్ధవిద్యాధరాదులను సర్వకాలములయందును నిజభుజబలంబుచే బాధించుచుండును ఋషులను, గంధర్వులు, నప్సరస్సులు, నందనవనంబునఁ గ్రీడించుచుండఁగ నారావణుఁడువచ్చి పెక్కుభంగుల బాధించుచుండును. అదికారణంబుగ నబ్బాధకుఁ డాళఁజాలక మునియక్షసిద్ధ గంధర్వులతోఁగూడ మేమందఱము నీవచ్చి నిన్నుశరణుబొందితిమి. మాయందఱకును పరంతపుఁడవగు నీవపరమగతివి. రావణవధార్థముగ మానవలోకమునందుఁ బుట్టుటకు యత్నింపుమనిరి.

(*)విష్ణుదేవతుల కభయమిచ్చుట.(*)

ఇవ్విధముగ బృందారకులందఱును బలికినపలుకులను విని దేవతోత్తముఁడును, దేవేశుఁడును నెల్లలోకములవారిచేతను నమస్కరింపఁదగినవాఁడును నగునారాయణుఁడు బ్రహ్మదేవుఁడు మొదలుగాఁగల దేవతలతో నిట్లనియె. దేవోత్తములారా మీరుభయమును వదలుఁడు మీకు మేలుగలిగెడును. పుత్రమిత్రామాత్య బంధుజనులతోఁగూడ రావణునిసంగరంబున వధించెద. క్రూరుఁడును, దురాత్ముఁడును, దేవర్షులకు భయమును గలుగఁజేయువాఁడును, నగు రావణునిఁజంపి పదునొకండువేల వర్షములు భూలోకమున నివసించెదను. నివసించి భూలోకమును సర్వమును జక్కఁగఁ బాలించెదననియె. ఇవ్విధముగ పర్మాత్మ శేషియగునారాయణుఁడు దేవతలకు వరమొసంగె. పిమ్మటఁ దాను భూలోకంబున నేమానవులయందుఁ బుట్టవచ్చునని యోచించె. అట్లుయోచించి పద్మాయతాక్షుఁడగు నారాయణుఁడు తననునాలుగుభాగములుగ విభజించె. పిదప దశరధభూపాలుని జనకునిఁగావరించె. ఆసమయంబున దేవగంధర్వ రుద్రాప్సరోగణములవారు నారాయణునసనేకవిధముల స్తోత్రముసేసిరి.

పిమ్మటనో దేవదేవోత్తమా! యుద్ధకుఁడును, భయంకరమగు తేజస్సుగలవాఁడును, సర్వాతిశాయియగు దర్పముగలవాఁడును, దేవతలకువిరోధియును, సర్వలోకములనునాక్రందనమును జేయించువాఁడును, తపోవంతులకుఁ గంటకుఁడును, సకలలోకములకును భయమును గలుగఁజేయువాఁడును, సర్వోత్తమమగు పౌరుషముగలవాఁడునునగు రావణునిపుత్రమిత్రామాత్యాది బంధుజనులతోఁగూడసంహరించి స్వర్గలోకమునకురమ్మని యనేకవిధములఁబ్రార్థించిరి. ఇంద్రునిచేఁ బాలింపఁబడుచున్న స్వర్గలోకమును గతదోషకల్మషముగఁ జేయుమనిరి. ఇట్లని, శ్రీమన్నారాయణుఁడు కాలత్రయ వృత్తాంతమును సర్వమును దెలిసినవాఁడయ్యును నాదేవతలతో మృదుమధుర వచనములనిట్లనియె.

బాలకాండమునందలి పదునైదవసర్గము సమాప్తము.

పిమ్మట దేవతలచే నవ్విధముగఁ గొనియాడబడిన నారాయణుఁడు కాలత్రయ వృత్తాంతమును సర్వమును దెలిసినవాఁడయ్యును నాదేవతలతో మృదుమధుర వచనములనిట్లనియె. దేవోత్తములారా రావణునిసంహరించుటకుఁ దగినయుపాయ మెద్ది? నేనేయుపాయమునవలంబించి దురాత్ముఁడగు రావణునిసంహరించుదుననియె, అంతనా దేవతలందఱును నవ్యయుఁడగు నారాయణునకిట్లనిరి. దేవోత్తమా మనుష్యశరీరము నవలంబించి యుద్ధమును జేసి రావణునివధింపుము. ఆరావణుఁడు తొల్లి చిరకాలము బ్రహ్మదేవునిగుఱించి ఘోరమగుతపస్సును జేసె. అంతనాతపమునకు సర్వలోకములకును మొదటివాఁడును, లోకకర్తయునునగు బ్రహ్మదేవుఁడు సంతోషమునుబొందె. అట్లుసంతోషమునబొంది నానావిధములగు భూతములవలనను భయముగలుగకుండునటుల వరమునుగైకొనియె. ఆసమయమునవాఁడుమానవులవలన భయముగలుగకుండునటుల వరమునుగోరఁడయ్యె. అట్టివరమును బ్రహ్మదేవుఁ డత్యంతానందముతో నొసంగె. అప్పుడురావణుఁడు మానవులలక్ష్యముసేయక పితామహ వరప్రభావమున మిగులఁదర్పితుఁడయ్యె. అంతటముల్లోకములకును బాధనుగల్పించుచు ముల్లోకములయందలి యంగనలనుబాధించుచున్నవాఁడు. కావుననట్టివాఁడవశ్యముగ వధింపఁదగినవాఁడు. అతనినివధించుటకు మానవశరీరమునవలంబించుటకున్నన్యమగునుపాయమేదియును లేదనిరి. అంతనా దేవతలవచనానుసారముగ నారాయణుఁడుదశరధభూపాలునిజనకునిగాఁగైకొందుననెను. ఆసమయమునదశరధ భూపాలుఁడును బుత్రహీనుఁడైయుండె. అట్లగుటచేనాదశరధభూపాలుఁడు పుత్రులంబడయునట్టి యాగమునొసరించె. అంతనఁటనారాయణుఁడుభూలోకమున జన్మింపఁదలఁచి చతురాననాదిబృందారకులచే ననుమతుఁడును, నిఖిలబృందారక పూజితుండునునై యంతర్ధానంబునొందె.

దశరధుని యాగాగ్నివలన దేవదూతయుద్భవించుట.

అంత నిక్కడ యజమానుఁడగు దశరధ భూపాలుని యొక్క యాహవనీయాగ్నివలన నిరుపమాన తేజస్సుగలవాఁడును, మహావీర్యముగలవాఁడును, నత్యధికమైన బలముగలవాఁడును, నల్లనిదియును, తెల్లనిదియునునగు వస్త్రమునుధరించినవాఁడును, నెఱ్ఱనిమోముగలవాఁడును, దుందుభిధ్వనికిఁ దుల్యమగు కంఠధ్వనిగలవాఁడును, మృదువు

లగు సింహలోమములకు సమానములగుశ్మశ్రుప్రవరమూర్ధజములుగలవాఁడును, శుభలక్షణములుగలవాఁడును, శ్రేష్ఠములగు నాభరణములచే నలంకరింపఁ బడినవాఁడును, పర్వతశిఖరమువలె నున్నతిగలవాఁడును, మదించిన పెద్దపులి పరాక్రమమువంటి పరాక్రమముగలవాఁడును, సూర్యాకారముగలవాఁడును, ప్రజ్వలించుచున్న యగ్నిజ్వాలకుఁ దుల్యమగునవాఁడును, నగు నొక మహాపురుషుఁడు, దివ్యపాయసముచేతఁ బరిపూర్ణమైనరజితపాత్రను బ్రియురాలినివలెఁ బట్టుకొనివిచ్చేసె. వచ్చి దశరథభూపాలున కిట్లనియె. రాజేంద్రా! యీవచ్చినవాని బ్రజాపతియొద్ద నుండివచ్చిన పురుషునిఁగాఁ దెలియుమనియె.

—* దేవదూత దశరథునకు పాయస మొసఁగుట *—

అప్పు డప్పరమపురుషుని వచనంబులను విని దశరథభూపాలుండు కృతాంజలియై యిట్లనియె. దేవోత్తమా సుఖముగవచ్చితివా? నేనిప్పుడు సేయఁదగినకృత్యం బెయ్యదియో యానతిమ్మనిన నా ప్రజాపతియొద్దనుండివచ్చినమానవుఁ డిట్లనియె. రాజేంద్రా! యశ్వమేధము మొదలగుయాగములచే దేవతలసంతృప్తులఁ జేసితివి. కావున దేవనిర్మితమగునీపాయసము నీకు సంప్రాప్తమయ్యె. దీనికి సంతానమును గలుగఁ జేయు సామర్థ్యముగలదు. మఱియు నధికారోగ్యమును గలుగఁ జేయును. కావున దీనిం బరిగ్రహించి సజాతీయలగు భార్యలు భుజించుటకు నిమ్ము. ఇవ్విధముగఁ జేసితివేని యాభార్యలయందుఁ బుత్రులను బొందుదువు. సంతానార్థముగ నీవి య్యజ్ఞమును జేయుచున్నవాఁడవు. కావున మద్వచనానుసారముగఁ బ్రవర్తింపుమనియె.

అంత నారాజేంద్రుఁడు వల్లెయని వినమితశిరస్కుఁడై దేవాన్నసంపూర్ణమును, దేవదత్తమును, హిరణ్మయమును నగు పాయసపాత్రను పరిగ్రహించె. పిమ్మట నత్యాశ్చర్యకరమయినవాఁడును, ప్రియదర్శనుఁడును నగు నాప్రజాపతి యొద్దనుండివచ్చిన పురుషునకుఁ బరమానందముతోఁ బ్రదక్షిణ నమస్కారములను జేసె. అట్లు సేసి దేవనిర్మితమగు నాపాయసమును బొంది "నిర్ధనుఁడు ధనమును బొంది సంతసించినవిధముగ" సంతోషమును బొందె. అంతట నత్యధికముగఁ బ్రకాశించుచున్నవాఁడును, నద్భుతాకారముగలవాఁడును నగు నప్పరమపురుషుఁడు పాయసప్రదానరూపకర్మను బరిసమాప్తమును బొంది మరల నయ్యగ్నికుండంబునఁ బ్రవేశించి యంతర్హితుఁడయ్యె.

—* దశరథుఁడు పుత్రోత్పత్తికారణమగు పాయసమును భార్యలకిచ్చుట. *—

శరత్కాలచంద్రుని కిరణపుంజముచే నంతరిక్షము నిర్మలముగ శోభించుతెఱంగున నప్పుడద్దశరథు నంతఃపురము హర్షకృతకాంతులచే శోభించె. అంత నద్దశరథమహీవల్లభుఁ డంతఃపురమునఁ బ్రవేశించి కౌసల్యతో నిట్లనియె. అంగనామణీ! యిప్పాయసమును బరిగ్రహింపుము. ఇదిమనకు సంతానప్రదంబని చెప్పి యప్పాయసమునం దర్ధభాగమును గౌసల్యాదేవికి నొసంగె. పిమ్మట యర్ధభాగమునందలి యర్ధభాగంబును సుమిత్రకు నిచ్చె మిగిలిన దానిలోని సగము పుత్రోత్పత్త్యర్థము కైకేయికి సమర్పించె. తక్కిన పాయసమున మృతోపమమగు దానిని యోచించి మరల సుమిత్రకు నొసంగె.

సుమిత్ర కైకేయికన్న నెక్కువగా భుజింప నర్హురాలని యాలోచించి సుమిత్రకిచ్చెను. ఇవ్విధముగ నారాజేంద్రుండు భార్యలకందఱకును వేరువేరుగఁ బంచియిచ్చె. అంత నయ్యంగనామణులందఱును నప్పాయసమును బొంది సంతోషితస్వాంతులై రాజకృతపాయసప్రదానరూపబహుమానము సమానమని యెంచిరి పిమ్మట వారందఱును నయ్యుత్తమపాయసమును భుజించి యగ్నితుల్యమగు తేజస్సుగలవారలును గర్భవతులును నయిరి. అవ్విధముగ సంప్రాప్తకాములును, గర్భవతులును నగు భార్యలఁ జూచి దశరథభూవల్లభుండు స్వర్గంబునను సురేంద్ర సిద్ధగణపూజితుండగు హరివలె స్వస్థచిత్తుఁడై ప్రకాశించె. ఇట్లు బాలకాండమునం దలిపదునాఱవసర్గము సమాప్తము

—* బ్రహ్మదేవుఁడు దేవతలను వానరరూపులుగ బుట్టుండని యాజ్ఞ సేయుట. *—

అవ్విధముగ నారాయణుఁడు మహాత్ముఁడగు దశరథభూపాలునకుఁ బుత్రుండయి పుట్టుట కుద్యుక్తుండైన భగవంతుఁడగు బ్రహ్మదేవుఁడు దేవతలనందఱ రప్పించి యిట్లనియె. దేవోత్తములారా సత్యసంధుఁడగు నారాయణుఁడు మనకుఁ బ్రియమును జేయఁదలఁచి దశరథునకుఁ బుత్రత్వమును బొందియున్నాఁడు. అతండు మహాశూరుండు. అట్టిమహానుభావునకుఁ గామరూపులును బలవంతులును నగు వారల సహాయులనుగా సృజింపుఁడు.

సర్వమాయలనెఱింగినవారును, శూరులును, వాయువేగమునఁ బోలిన వేగముఁగలవారును, నీతివంతులును, బుద్ధిశాలులును, విష్ణుదేవునివలె పరాక్రమశాలులును, నితరులకెదిరింప నలవిగాని వారలును, సర్వయుపాయముల నేర్చినవారును, శ్రేష్ఠమగు సింహశరీరముం బోలు శరీరముగలవారును, సమస్తాస్త్రముల శక్తిగలవారును, అమృతపాన తుల్యులవలె క్షుత్పిపాసారహితులును, మీతో

సమానమగు పరాక్రమముగలవారును, నగు పుత్రులను ముఖ్యులగునప్సరసస్త్రీలయందును, గంధర్వస్త్రీలయందు వానరరూపముగఁ బుట్టునట్లు సేయుఁడు.

ఇంతకుముందుగ నేను జాంబవంతుఁడను వానరోత్తముని సృజించియుంటిని. వాఁడు నేనావలించునపుడు నాదు వక్త్రమునుండి జన్మించె ననియె. అంతనా దేవతలందఱు బ్రహ్మదేవునివచనానుసారముగఁ బ్రవర్తింతమని నిశ్చయించి వానరరూపులగు పుత్రులఁబుట్టించిరి. మఱియు మహాత్ములగు ఋషులును, సిద్ధవిద్యాధరోరగులును, చారణులును, వానరరూపులగు తనయులంగనిరి

——(*) వాలిసుగ్రీవాదివానరులుబుట్టుట. (*)——

అందు దేవేంద్రుఁడు మహేంద్రపర్వతమునకుఁ దుల్యుఁడును, నూర్జితుఁడునునగు వాలినిఁ దనయునిఁగాఁ బడసె. సూర్యదేవుఁడు సుగ్రీవుంగనియె. సర్వోత్తమమగు బుద్ధికుశలతగల తారుఁడను వానరుఁడు బృహస్పతికిఁ బుత్రుఁడయ్యె. అత్తారుఁడు సర్వవానర ముఖ్యులలో సర్వోత్తమమగుబుద్ధి కుశలతగలవాఁడని కీర్తివహించె గంధమాదనుఁడను వానరోత్తముఁడు కుబేరునకుఁ గుమారుఁడయ్యె. విశ్వకర్మ నలుఁడనువానిని దనయుంగాఁబడసె. అగ్నితుల్యకాంతిగల నీలుఁడను వాఁడగ్నికిఁ దనయుఁడయ్యె. అన్నలుఁడు తేజఃపరాక్రమ యశస్సులచే సకలవానరులకంటె నధికుండనిపేర్వడసె. అత్యధికమగు రూపద్రవిణ సంపన్నులగునశ్వినులు మైందద్వివిదనామంబులుగల పుత్రులంగనిరి. వరుణదేవునివలన సుషేణుఁడను వానరోత్తముఁడువుట్టె. వర్షాభిమాన దేవతమహాబలుఁడగు శరభునిఁ బుత్రుఁగాఁబడసె-శ్రీమంతుఁడగు హనుమంతుఁడు వాయుపుత్రుండయ్యె. అతండు వజ్రమువలె నభేద్యుఁడు మఱియును వేగమునందు గరుడునకుఁ దుల్యుఁడు. ఇవ్విధముగ నన్యదేవతలవలన ననేకకోట్లు వానరులుపుట్టిరి. వారందఱును రావణవధయం దభిలాషగలవారలు. మఱియు నపరిమితమగు పరాక్రమముగలవారు. ఇంతియగాక వీరులనియును, విక్రాంతులనియు, గామరూపులనియును ఖ్యాతింగాంచిరి. మహాబలులు. మేరుమందరపర్వతములకుఁ దుల్యములగు శరీరములుగలవారు. భల్లూకవానర గోపుచ్ఛములుగలవారు. మఱియు నే దేవునివలనఁ బుట్టినవారా దేవునకుఁ బరాక్రమాదిగుణములచేఁ దుల్యులు. మఱియు మఱికొందఱువానరులు గోలాంగూలీ పుత్రులయిరి కొందఱు ఋక్షీసంతానమైరి. ఇంకఁగొందఱు కిన్నరీపుత్రులైరి. మఱియు దేవర్షి సిద్ధగంధర్వోరగ గరుడ యక్ష కింపురుషాదులనుండి యనేకవానరు లుద్భవించిరి, వారందఱును గామరూప గమనాదులుగలవారలై విలసిల్లిరి. దర్పబలములచే సింహవ్యాఘ్రములకు సమానులు. అవ్వానరు లందఱును శిలావృక్షాదులతో సంగరంబు సల్పువారు, మఱికొందఱుగోళ్లు కోరలును నాయుధములుగాఁగలవారలు. అందఱును నన్నిశస్త్రాస్త్రములయందును బ్రవీణులు. వారందఱును బ్రత్యేకముగఁ బర్వతవృక్షాదులను చలింపఁజేయఁదగిన సామర్థ్యముగలవారలు. వేగముచేత నదీపతియగు సముద్రమునకుఁగూడ క్షోభను గల్పింపఁగలరు. పాదములచే భూమిఁ ధరింపఁగలరు. మహాసముద్రమును దాటఁగలవారు. అంతరిక్షంబున కెగురుదురు. మేఘములనాక్రమించుదురు. వనములయందు దిరుగు మదముగల మదపుటేనుగుల మదముడిగింపఁగలవారు నందఱుచే గర్జించుచుఁదమ గర్జాధ్వనులచే విహంగమ సముదాయమును భూమియందుఁ బడవేయుదురు. ఇట్టి బలపరాక్రమసంపదలుగల వానరులనేకసంఖ్యలుగ జన్మించిరి. వారిసంఖ్య యింతయనియెన్న నాదిశేషునకైన నలవిగాదు. ఆవానరులలో సుగ్రీవాది వానరశ్రేష్ఠులు ప్రధానములగు వానరయూధముల కధిపతులయిరి. మఱియు నత్యధికబల పరాక్రమములుగల యనేకవానరవీరులను బుత్రులనుగాఁ బడసిరి. మఱియు ననేకవేల వానరులు పర్వతచరియలయందు నివసించిరి. మఱికొందఱు నానావిధములగు పర్వతారణ్య ప్రదేశముల యందుండిరి. పిదప నవ్వానరులందఱును నన్నదమ్ములును, సూర్యేంద్ర పుత్రులునునగు వాలిసుగ్రీవులనధిపతులుగాఁబొందిరి. మఱియును నలనీలహనుమదాదులనుగూడ నధిపతులనుగా గ్రహించిరి. అవ్వానరులందఱును గరుడవిక్రములు. యుద్ధవిశారదులు. మఱియు వారందఱును నధికదర్పమువలన సంచరించుచు సింహవ్యాఘ్రమహోరగాది దుష్టజంతువులను సంహరించుదురు. భల్లూక గోపుచ్ఛములుగల యవ్వానరులనందఱు నత్యధికపరాక్రమముగలవాఁడును, మహాబాహుఁడునునగు వాలి నిజభుజవీర్యముచేతఁ గాపాడుచుండె. నానావిధములగు శరీరములుగలవారును, నానావిధములగు లక్షణములతోఁ గూడినవారునునగు వానరులచేతఁ బర్వతారణ్య ప్రదేశములుగల భూమియంతయును నాక్రమింపఁబడియె. భయంకరములగు శరీరాకారములు గలవారును, మేఘసముదాయములకును, పర్వత శిఖరములకును దుల్యులగువారును, మహాబలులునునగు వానరులు రామసహాయము కొఱకు భూమియందంతటను దిరుగుచుండి. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి పదునేడవసర్గము. సమాప్తము.

—✻ { దశరథమహారాజుయజ్ఞశాలవదలి నగరమునకుఁబోవుట.

అంతనఁట దశరథభూవల్లభు నశ్వమేధయాగము సంపూర్ణమును బొందినపిదప దేవతలందఱును దమతమహవిర్భాగములనుగైకొని నిజలోకములకుఁబోయిరి. అంత నారాజేన్ద్రుఁడు సమాప్తినిబొందింపఁబడిన దీక్షానియమము గలవాఁడును, భార్యలతోఁగూడినవాఁడును, సపరివారసమేతుఁడునునై యయోధ్యానగరములోనికిఁజనియె. పిదప నయ్యజ్ఞమునుజూచుటకు విచ్చేసినరాజులనందఱ విధ్యుక్తప్రకారముగఁబూజించె.

అంతనారాజులందఱును బరమానందమునుబొందియా ఋశ్యశృంగ మునివరునకును వసిష్ఠునకును నమస్కారమునుజేసి తమదేశములకుఁబోయిరి నిజనగరములకుఁ బోవుచున్న యారాజులసేనా సముదాయమంతయును బరమానందమునఁబ్రకాశించె. అట్లుసకలరాజులును తమనగరములకుఁబోయినపిదప దశరథుఁడుబ్రాహ్మణోత్తములనందఱ నిజపురంబునుబ్రవేశింపఁజేసె. పిమ్మట ఋశ్యశృంగమునివరుఁడును నారాజేన్ద్రునిచేఁ బూజితుండై తనభార్య యగు శాంతితోఁగూడ నివాసంబునకుఁజనియె. అంతట దశరథేన్ద్రుఁడు పుత్రోత్పత్తినివిచారించుచు తననగరమునఁ దనవారలతోఁగూడ సుఖంబుండె.

శ్రీభగవదవతారఘట్టము.

అట్లశ్వమేధయాగము సమాప్తమునుబొందినపిదప నాఱుఋతువులతిక్రమించె. అంతనాపదిరెండవ మాసమునందలి పూర్వపక్షమునందలి నవమిపునర్వసూ నక్షత్రముగలదయ్యె. అదివసంబున నైదుగ్రహంబు లుచ్చరాశిస్థితంబులయ్యె. చంద్రుఁడు బృహస్పతినిబొందియుండె. అట్టిశుభదినమునందలి కర్కాటలగ్నమునందు సర్వలోక నమస్కృతుఁడగు జగన్నాథునిఁగౌసల్యాదేవి తనయునిఁగాఁబడసె. అత్తనయుఁడు సర్వలక్షణ లక్షితుండైయుండె. అతండు నారాయణార్ధాంశమగుటచే మహానుభావుఁడును రఘుకుల ప్రవర్ధకుండునునైయుండె. అయ్యపరిమిత తేజోవంతుఁడగుపుత్రునిచేత దేవాధిపతియగునింద్రునిచే దితిప్రకాశించినవిధముగఁ బ్రకాశించె. సత్యపరాక్రముఁడగు భరతుఁడు కైకేయియందుత్పన్నుఁడయ్యె. అతండునారాయణుని నాల్గవయంశముగలవాఁడు. కావున సర్వగుణములునుగలవాఁడైయుండె. అంతఁగొంతసేపటికి సుమిత్రాదేవి లక్ష్మణ శత్రుఘ్నులకుఁదల్లియయ్యె. అయ్యిరువురును వీరులనియును, సర్వాస్త్రకుశలులనియును, నారాయణార్ధాంశగలవారనియును పేర్వడసిరి.

నిర్మలబుద్ధిగల భరతుఁడు మీనలగ్నమునందు పుష్యనామక నక్షత్రముగలకాలమునందు జనించె. లక్ష్మణశత్రుఘ్నులాశ్లేషానక్షత్రముతోఁగూడి కర్కాటకలగ్నంబునఁబుట్టిరి. ఇవ్విధముగ నద్దశరథమహారాజునకు మహాత్ములగునలుగురుతనయులుగలిగిరి. అన్నల్వురును ననురూపులునుగుణవంతులును, ప్రోష్ఠపదనామకనక్షత్ర చతుష్టయతుల్యులునైరి. ఆసమయమున గంధర్వుల వ్యక్తమధురధ్వని గలుగనటుల గానముసేసిరి. అప్సరోగణమునాట్యమునుజేసె. దేవదుందుభులుమ్రోసె. ఆకాశముననుండి పుష్పవర్షంబుగురిసె. అయోధ్యాపురమునందు మహోత్సవముగలిగె. ఆనగరమునందలి వీధులన్నియును నటనర్తక సంకులమగుటచే జనాకులములయ్యె. గానములధ్వనులుగలవయ్యె.

—✻ దశరథుఁడు నామకరణాదులొనర్చుట. ✻—

మఱియుననేకవిధములగు భేరీమృదంగాదితూర్యారావములుగలవయ్యె. అప్పుడు దశరథభూవల్లభుఁడు సూతమాగధాదుల కివ్వఁదగినబహుమానములనొసంగె బ్రాహ్మణుల కపరిమితముగధనమును గోగణములను సమర్పించె. అంతఁబదిరెండవదివసంబున వసిష్ఠమునివరుండన్నల్వురుశిశువులకును గ్రమముగ రామభరతలక్ష్మణశత్రుఘ్నులనునామంబులఁగల్పించె. అంతటదశరథుఁడు బ్రాహ్మణులకును, పౌరులకును, జానపదులకును సమృద్ధిగనన్నదానంబునుజేసె. మఱియు బ్రాహ్మణులకపరిమితముగ రత్నసముదాయములనొసంగె. తనపుత్రులకు నల్వురకునునివ్విధముగ జన్మక్రియలనన్నింటిని సర్వశ్లాఘ్యంబుగనొసరించె. అన్నల్వురిలో రాముఁడు ధ్వజమువలెఁబ్రకాశించుచుండె. తండ్రికిమిగులఁబ్రీతికరుఁడయ్యె సకలభూతములకును బ్రహ్మదేవునివలెసమ్మతుఁడయ్యె.

మఱియునన్నల్వురును మహావీరులును,లోకములకుహితమును జేయుటయందాసక్తిగలవారునునయిరి. ఇంతియగాక జ్ఞానవంతులును, సకలగుణములుగలవారునునైరి. అన్నల్వురిలోపల సత్యపరాక్రమముగలవాఁడనియును,మహాతేజోవంతుఁడనియు రాముఁడు గీర్తివహించె. మఱియు నారాముఁడు చంద్రునివలె సర్వలోకమునకును సమ్మతుఁడయ్యె. గజాశ్వరథముల నధిష్ఠించుటయందు లోకోత్తరసామర్థ్యముగలవాఁడయ్యె. ధనుర్వేదమునం దత్యంతాసక్తుఁడును,పితృశుశ్రూషయందుఁ బ్రీతుఁడునునయ్యె. లోకరంజకుడును,శ్యేష్ఠభ్రాతయునునగురామునకు లక్ష్మణుఁడు బాల్యముమొదలుకొని సర్వకాలములయందును బరమ

త్రుఁడై యుండె. లక్ష్మణుఁడట్లు పరమప్రేమతో సంచరించు టంజేసి రామునకు నిజశరీరముకంటె నధికప్రీతిభాజనుఁడయ్యె. అదికారణంబుగ లక్ష్మణుఁడు నిదురనుబొందనికాలమునందు రాముఁడునునిదురనుబొందఁడయ్యె.

రామునకాలక్ష్మణుఁడు బహిఃప్రాణభూతుఁడై యుండె. లక్ష్మణుఁడు భుజింపకమునుపు రాముఁడునుభుజింపఁడయ్యె. రాముఁడు గుఱ్ఱమునెక్కి వేటకుఁ బోవునపుడెల్ల లక్ష్మణుఁడుధనుర్ధారియై యారాముని వెంటనంటిపోవుచుండును. లక్ష్మణునకుఁ దమ్ముఁడగుశత్రుఘ్నుఁడు భరతునకుఁ బ్రియుఁడై మెలంగుచుండె అదికారణముగ భరతునకునిజప్రాణములకంటె శత్రుఘ్నుఁడధికప్రీతుఁడయ్యె. మహానుభావులును, బరమప్రీతులునునగు నన్నల్వురుచేతను దశరథభూపాలుఁడు దేవతలచే బ్రహ్మదేవుడు ప్రీతుఁడైనవిధముగఁ బ్రీతుఁడయ్యె.

అంతఁగొంతకాలమున కానల్వురుజ్ఞానసంపన్నులును, సకలగుణపరిపూర్ణులును, హ్రీమంతులును, కీర్తిమంతులును, సర్వజ్ఞులును, దీర్ఘాలోచనలను గేయువారును నైరి. ఇవ్విధముగఁ బ్రకాశించు తేజస్సుగలవారును, నధికసామర్థ్యముగలవారునునగు తనయులనుజూచి దశరథభూపాలుఁడు లోకాధిపుఁడగు బ్రహ్మవలె సంతుష్టచిత్తుఁడయ్యె. మానవోత్తములగు నారామలక్ష్మణులు వేదసంబంధముగలస్మృతీతిహాస పురాణములయందాసక్తిగలవారైరి. పితృశుశ్రూషణయందును ధనుర్వేదాభ్యాసమునందును మిగులఁ గుతూహలముతో మెలంగిరి. అంతఁగొన్నిదినంబులకు దశరథభూపాలుఁడు బంధుమిత్రామాత్య పురోహితసహితుఁడై యారామలక్ష్మణ భరతశత్రుఘ్నులకు వివాహకృత్యము సేయవలయునని యాలోచించె. అవ్విధముగమంత్రిపురోహితాదులమధ్యయందు మహాత్ముఁడగు దశరథుఁడువిచారించుచుండఁగ మిగులఁ దేజోవంతుఁడగు విశ్వామిత్రమునివరుఁడచ్చోటునకు నేగుదెంచె.

—*విశ్వామిత్రుఁడుదశరథమహారాజుయొద్దకువచ్చుట.*—

అట్లు రాజదర్శనాకాంక్షియై వచ్చిన విశ్వామిత్రమునిపుంగవుఁడు ద్వారదేశంబుననిలిచి ద్వారపాలకులతో నిట్లనియె. ద్వారపాలకోత్తములారా గాధిపుత్రుఁడగు విశ్వామిత్రుఁడు ద్వారదేశంబుననిలిచియున్నాఁడని మీరాజునకెఱింగింపుఁడనియె. అంత నాద్వారపాలకు లవ్వచనంబును విని సంభ్రాంతచేతస్కులై యతిశీఘ్రముగ రాజమందిరములోనికిఁబోయిరి. పోయి విశ్వామిత్రముని పుంగవుఁడు వచ్చియున్నవాఁడని యిక్ష్వాకువంశసంభవుఁడగు దశరథునకు నెఱింగించిరి. అట్లు ద్వారపాలకుల వచనములనువిని యారాజేంద్రుఁడు మంత్రిపురోహితసహితుఁడై బ్రహ్మదేవునకభిముఖముగఁ బోవు నింద్రునివలె విశ్వామిత్ర మునిపుంగవునకెదురుగఁ జనియె. పోయి ప్రజ్వలించుచున్నవాఁడును, దీప్తతపస్సుగలవాఁడును, తీక్ష్ణనియమముగలవాఁడునునగు విశ్వామిత్రమునిపుంగవునిఁజూచి సంతుష్టవదనుఁడై యర్ఘ్యము నొసంగె. అంతనావిశ్వామిత్రుఁడు శాస్త్రోక్తప్రకారముగ సమర్పించినయర్ఘ్యమును గైకొనియె. అట్లుపరిగ్రహించి యారాజేంద్రుతోఁ గుశలప్రశ్నమడిగె.

మఱియు నగరకోశజనపదబంధుస్నేహితులు కుశలముగనుండిరాయని యడిగె. మఱియునిట్లనియె. రాజేంద్రా సామంత రాజులందఱును నీకు వశంవదులై యున్నారా? శత్రులందఱును జయింపఁబడిరా? దైవమానుషకర్మలన్నియును జక్కఁగ ననుష్ఠింపఁ బడుచున్నవాయనియె. పిమ్మట వసిష్ఠమునివరునిఁజూచి కుశలంబడిగె. మఱియును మహానుభావులగు నితరులకుశలంబునుగూడ విచారించె. అంతట నెల్లవారును సంతుష్టచిత్తులును బూజితులును నై రాజమందిరమునఁ బ్రవేశించి యుచితాసనములయందుఁ గూర్చుండిరి.

—*{విశ్వామిత్రునిదశరథుఁడుసత్కరించి వచ్చినకార్యం బేమనియడుగుట.}*—

పిమ్మటఁ బరమోదారుఁడును, సంతుష్టమనస్కుఁడును నగు దశరథమహారాజు మునిశ్రేష్ఠుఁడగు విశ్వామిత్రునకు విధ్యుక్తప్రకారంబుగఁ బూజలుసల్పియిట్లనియె. అయ్యా మునికులోత్తమా! మీదర్శనము నాకమృతము సంప్రాప్తమైనవిధముగనున్నయది. ఉదకములేనిప్రదేశమునందలివర్షము సంతోషమునుగల్పించుచున్నయది. సద్భార్యలయందు సంతానములేనివానికిఁ బుత్రులుద్భవించుటవలెనున్నయది. నష్టమైనధనము మరలలభించినపుడు సంతోషముగలిగినవిధముగనున్నది. మహోదయకాలమునందు సంతోషముగలుగునట్లు సంతోషమునుగలిగించుచున్నది. కావున భవదాగమనము స్వాగతమనియెంచుచున్నాఁడను. తమకుఁ బ్రియమైనకార్యమెద్ది? నేను జేయఁదగినపనియెద్ది? నాయదృష్టవశమున నీవిచ్చోటునకువచ్చి నాదుకార్యములకుఁ బాత్రభూతుఁడవైతివి కావున నిప్పుడు నాదుజన్మము సఫలమయినది. నాదుజీవనము సుజీవనమయ్యె. తొల్లి నీవు రాజర్షిశబ్దమును వహించి మహాతేజోవంతుఁడవై మెలంగితివి. ఇప్పుడు బ్రహ్మర్షిశబ్దమునుబొంది యెల్లవారలకును బూజనీయుఁడవైతివి. అదికారణముగ భవదాగమనము పవిత్రకరమయినది.

మఱియు నత్యద్భుతమైనది. నిన్నుజూచుటచే నేనుశుభక్షేత్రమును బొందినవాఁడనైతిని. ఇచ్చోటున కేమిప్ర

ప్రయోజనము నపేక్షించి వచ్చినదియును జెప్పుము. నీయభిలషితార్థాభివృద్ధికొఱకు నీచేననుగృహీతుఁడనై యిచ్చయించుచున్నాఁడను. భవదాగమన కార్యమునందు గురులాఘవవిచారమును బెట్టికొనకుము. నేనుసర్వమును సంపూర్ణముగఁ జేయుటకుఁ సిద్ధముగనున్నాఁడను. నీవునాకు దేవతుల్యుఁడవు. నీవువచ్చుటంజేసి నాకుమిగుల నభ్యుదయము గలుగునని యెంచుచున్నాఁడను. అదియునుంగాక సర్వోత్తమమగు ధర్మముగూడ వృద్ధినొందునని తలఁచెదను. ఇవ్విధముగ బుద్ధిమంతుఁడగు దశరథునిచే సవినయముగఁ జెప్పఁబడినదియును, కర్ణములకింపైనదియును, మనోహరమైనదియునునగు వచనమునువిని యత్యధికమయినగుణయశస్సులు గలవాఁడగు నప్పరమమహర్షి పరమానందమునుబొందె. ఇట్లని బాలకాండము నందలి పదునెనిమిదవసర్గము. సమాప్తము.

విశ్వామిత్రుఁడుదశరథునితోతాను వచ్చినకార్యముఁ జెప్పుట.

అవ్విధముగ నాశ్చర్యకరమును, విపులమునునగు దశరథభూపాలుని వచనమునువిని విశ్వామిత్రమునిపుంగవుడుసంతోషముచేతఁ బులకితమైన శరీరముగలవాఁడై యిట్లనియె. రాజేన్ద్రా యీవచనంబులు నీకుఁదగినయవి. నీవు సత్కులప్రసూనుఁడవును, వసిష్ఠమునివరునిచే నుపదేశింపఁబడు వాఁడవును నగుటచే నిట్టివచనములఁ బల్కితివి. నాదుహృద్గతమగు వచనమును జెప్పెదను. నీవుసత్య వచనుఁడవై మత్కార్యమును జేయుము. నేనుసత్ఫలమును బొందుటకు యజ్ఞదీక్ష నవలంబించి యుంటిని. అయ్యజ్ఞమును జెడఁగొట్టుటకుఁ గామరూపులగు నిరువురురాక్షసులు ప్రయత్నమును జేయుచుందురు. అయ్యిరువురును నాదువ్రతము సమాప్తిని బొందకుండు నటులఁ జేయుచుందురు.

మఱియు నయ్యిరువురును మారీచసుబాహు నామములచే నొప్పియున్నవారు. అమ్మారీచ సుబాహులు నాదు యజ్ఞవేదికలయందు రక్తవర్షమును వర్షింతురు. అవ్విధముగ నాయజ్ఞదీక్షకు భంగమును గల్పించుటచే నేనుమిగులశ్రమను బొందుచున్నాఁడను. అదికారణముగనే నయ్యజ్ఞము సమాప్తినిబొందునటులఁ జేయుటయందు నిరుత్సాహుఁడనైతి. నేనుకోపావిష్టుఁడనై వారలశపించి నాదుకార్యమును బరిసమాప్తిని బొందించికొనఁగలను.

విశ్వామిత్రుఁడు రామునితనతోడఁ బంపుమని గోరుట.

అట్టివాఁడనగుట కిదితగిన సమయముగాదు. కావున నారాక్షసుల సంహరించుటకొఱకు, సత్యపరాక్రముఁడును, రాజశ్రేష్ఠుఁడును, కాకపక్షముల ధరించియున్నవాఁడును, నీదుతనయులలో జ్యేష్ఠుఁడునునగు రామునినొసంగుము. ఈరాముఁడు నాదుతేజస్సుచేతఁ గాపాడఁబడుచు యజ్ఞమునకు విఘ్నమును జేయుచున్న సుబాహుమారీచులవధించుటయందు సమర్థుఁడగును. ఈరామునకు బహువిధములగు శ్రేయస్సులనొసంగుదు. ఇంచుకైనను సందియంబులేదు. నేనొసంగు శ్రేయస్సుచే రాముఁడు ముల్లోకంబులయందును శ్రేష్ఠుండని కీర్తిని బొందఁగలవాఁడు. ఆసుబాహుమారీచులు రామునితో సంగరమును జేయుటకు సమర్థులుగారు.

ఆసుబాహు మారీచులఁజంపుటకు రామునికంటెనన్యుఁడగుపురుషుఁడు త్సహింపఁజాలఁడు. అత్యంతవీరులగు నయ్యిరువురను కాలపాశవశమును బొందియున్నవారు. కావునమహాత్ముఁడగు రామునకుఁదగిన వారలుగారు. నీవీసమయమునందుఁ బుత్రులనియెడు ప్రేమను బెట్టికొనఁదగదు. నేనిపుడు రామునిచే నారాక్షసులు వధింపఁబడిరనియె తలఁచుచున్నాఁడను. రాముఁడు మహానుభావుఁడు. అదియునుఁగాక సత్యపరాక్రముఁడు. ఈవిషయమును దపోనిష్ఠులగు వసిష్ఠాదులు నేనును గుర్తెఱుఁగుదుము. రాముని నాకునొసంగుట కిచ్చగించితేని నీకుసర్వోత్తములగు ధర్మలాభములుగలుగుటకు సందియములేదు. నీదుమంత్రులును, వసిష్ఠాదిమునివరులును సమ్మతంబుబొందిరేని రామునినాకునొసంగుము. నీకుమిగులనిష్టుఁడగు రామునినాదు పదిదినములయజ్ఞమును రక్షించుటకొఱకు నొసఁగుము. నాయజ్ఞకాల మతిక్రమింపకుండునటులఁ జేయుము. రామునెట్లువదలుదునని వ్యసనమును బొందకుమనియె.

ఇవ్విధముగ ధర్మాత్ముఁడగు విశ్వామిత్రుఁడు ధర్మార్థసహిత వచనమునుపలికి విరామమునుబొందె. అంతనారాజేన్ద్రుఁ డవ్విశ్వామిత్రుని వచనమునువిని యత్యధికమగుభయమును బొందినవాఁడై తీవ్రమగు దుఃఖమునుబొందె. ఇవ్విధముగ హృదయమనోవిదారణమగు మునివచనమునువిని యారాజేన్ద్రుఁడత్యధికముగ వ్యసనమునుబొందినమనస్సుగలవాఁడయ్యె. మఱియునేమియును దెలియకనిజాసనమునుండి చలనంబునుబొందె. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి పందొమ్మిదవసర్గము సమాప్తము.

దశరథుఁడు రామునిఁ బంపుటకిష్టపడక తానేవచ్చెదనని జెప్పుట.

రాజశ్రేష్ఠుఁడగు నద్దశరథభూవల్లభుఁడు విశ్వామిత్రు

నివచనమునువిని క్షణమాత్రము సంజ్ఞారహితుఁడయ్యె. అంతఁగొంతసేపటికి సంజ్ఞనుబొంది యిట్లనియె. అయ్యా మునికులోత్తమా! పద్మాక్షుఁడగు రాముఁడు పదునైదు సంవత్సరముల వయస్సుగలవాఁడు. కావున రాక్షసులతోఁ గూడ యుద్ధమును జేయుటకుఁ దగినయోగ్యత కలదని నేనెన్నఁజాలను. నేనొక్క యక్షౌహిణీ సంఖ్యగల సైన్యమునకు నధిపుఁడను. కావున నేనీ సైన్యసమేతుఁడనై వచ్చి యా రాక్షసులతోఁగూడ సంగరంబును సల్పెదను. ఇందలి భటులందఱు శూరులును, సకలాస్త్రవేత్తలును నైయున్నవారు. కావున వీరందఱును నా రాక్షసులతో సంగరంబును సల్పుదురు. రాముని దీసికొనిపోవుట యుచితముగాదు. నేనొక్కఁడనే ధనుర్ధారినై యుద్ధరంగమునందు రక్షకుఁడనై యుండెదను.

మఱియు నాకంఠమునఁ బ్రాణములుండువఱకును దనుజులతో సంగరంబును జేసెదను. నేనువచ్చితినేని నీదు వ్రతచర్య నిర్విఘ్నముగ నెరవేరఁగలదు. కావున నేనువచ్చెదను. రాముని వదలుము. రాముఁడతిబాలుఁడు. ఇంతవఱకునితఁడు సర్వమును సమగ్రముగఁ దెలిసినవాఁడుగాఁడు. కావున బలాబలమును గుర్తెఱుఁగఁడు. అస్త్రబలసంపన్నుఁడును, యుద్ధవిశారదుఁడును గాఁడు. కావున నిబ్బాలుఁడు రాక్షసులతో యుద్ధమును జేయుటకు యోగ్యుఁడుగాఁడు. రాక్షసులు కపటముతో యుద్ధమును జేయుదురు. రాముని వియోగమును నేఁ గొంచెముసేపును సహింపఁజాలను. రాముని వదలి నేజీవింపఁజాలను.

కావున నో మునికులోత్తమా! రాముని వదలితివేని నేను జతురంగబల సమేతుఁడనై వచ్చెదను. బాలుఁడగు రాముని వదలి చతురంగబలసమేతుఁడనగు నన్నుఁగొనిపొమ్ము. ఇప్పటికి నాకరువదివేల వత్సరంబులు గడచినవి. రాముని జన్మమునకు నేను మిగులఁ బ్రయాసను బొందితి. అట్టి రామునిఁగొనిపోవుట యుచితముగాదు. నాకు నలుగురు తనయులలో రామునియందధికముగఁ బ్రియముగలిగియున్నది. కావున ధర్మప్రధానుఁడును, జ్యేష్ఠపుత్రుఁడును నగు రామునిఁగొనిపోవుట యుచితముగాదు. ఆ రాక్షసు లెట్టివీర్యముగలవారు? వారెవనిపుత్రులు? ఎట్టిప్రమాణముగలవారు? వారలకుఁ బ్రభుఁడెవ్వఁడు? ఆవృత్తాంతమును సర్వమును నాకుఁ జెప్పుము. అట్లుగాదేని నేను వారలతో సంగరంబును నెవ్విధముగఁ జేయఁగలను? అట్టి రాక్షసులతో రాముఁడెవ్విధముగ సంగరంబును జేయఁగలఁడు? నాదు సైన్యముగూడ రాక్షసులతో యుద్ధమును జేయఁజాలదు. రాక్షసులధికబలవంతులు. కావున నాదుమనవి నంగీకరింపుమనిన విని యవ్విశ్వామిత్రుఁ డిట్లనియె.

—* విశ్వామిత్రుఁడు మారీచ సుబాహువుల వృత్తాంతము సెప్పుట. *—

రాజేంద్రా! పులస్త్యవంశసంభవుఁడగు రావణుఁడను రాక్షసుఁడొకఁడుగలఁడు. వాఁడు బ్రహ్మవలన ననేకములగు వరములనుబొంది మూఁడులోకములను బాధించుచున్నాఁడు. అతఁడు మహాబలుఁడు- మఱియు నత్యధికమైన పరాక్రమము గలవాఁడు- సతతము ననేకకోట్ల దనుజులతోఁగూడియుండును- ఆ రావణుఁడు మిగుల బలపరాక్రమములుగలవాఁడని ప్రసిద్ధిగలిగియున్నది. మఱియు నతఁడు ప్రసిద్ధుఁడగు కుబేరునకు సోదరుఁడు. విశ్రవోమునికిఁ బుత్రుఁడు. ఆ మహాబలుఁడగు రావణుఁడు నాదు యజ్ఞమునకు స్వయముగ విఘ్నమును జేయువాఁడుగాఁడు. మఱియేమనిన నా దశకంఠుఁడు, సుబాహుమారీచులను నిరువురు రాక్షసులను బంపె. ఆ మారీచసుబాహులు యజ్ఞమునకు విఘ్నమును గల్పించుచున్నవారనియె. ఇవ్విధముగ మునివరుఁడు సెప్పిన వచనములను విని యాదశరథభూపాలుఁ డిట్లనియె.

మునికులోత్తమా! దురాత్ముఁడగు నా రాక్షసుని మ్రోల నేనుగూడ నిలువఁజాలను. కావున ధర్మజ్ఞుఁడవైన యో మునికులోత్తమా! నాపుత్రునియందుఁ గృపను జేయుము. అల్పమైన యదృష్టముగల నాకు నీవ గురుఁడవు. దేవ, దానవ, గంధర్వ, యక్షోరగ, పన్నగులలో నెవరును రావణునితో సంగరమును జేయుటకు సమర్థులుగారు. ఇఁక మానవు లెంతటివారు. ఆ రావణుఁడు యుద్ధమునందుఁ బరాక్రమవంతుల వీర్యము నాకర్షించును, అదికారణముగ నేను జతురంగబలములతోఁగూడ రావణుని మ్రోల నుండఁజాలను. నేను నాదు సైన్యమునే గాక తనయులతోఁ గూడఁ బోయినను సంగరమును జేయఁజాలను.

కావున నమరప్రఖ్యుఁడును, యుద్ధశాస్త్రమును దెలియనివాఁడును, బాలుఁడును, నగు నాదు తనయుని నేనెట్లు పంపఁగలను. సుందోపసుందులకుఁ దనయులగు సుబాహుమారీచులు యుద్ధమునందు సమానులరు, అట్టివారు యజ్ఞమును నశింపఁజేయుటకు యత్నించుచున్నారు. కావున నేను బుత్రుని నివ్వఁజాలను. సుబాహుమారీచులు యుద్ధశాస్త్రమును జక్కఁగఁ జదివినవారు. అదియును గాక యనేకములగు యుద్ధములను జేసియున్నవారు. అయ్యిరువురిలో నొక్కనితో నేను చతురంగబలములతోడను గూడి సంగరమును జేయుదుననియె. ఇవ్విధముగఁ బల్కిన వచనములను వినినతోడనే యా విశ్వామిత్రుఁడు మిగులఁ గోపమును బొందె. మఱియు నవ్వచనములనియెడు నాజ్యముచే మహర్షి

యనియెడునగ్నిహోత్రుఁడభివృద్ధినొందె. ఇట్లు బాలకాండమునందలి యిరువదవసర్గముసమాప్తము.

—* రామునిబంపుటలేదనినవిశ్వామిత్రుఁడు కోపంబునొందుట. *—

స్నేహముచేత నాకులమైన యక్షరములతోఁగూడినదియగు నవ్వచనమునువిని విశ్వామిత్రుఁడు కోపముతోఁగూడినవాఁడైయారాజేన్ద్రునకిట్లనియె. రాజేన్ద్రా! ముందుగ నా కార్యమును జేసెదనని చెప్పితివి. అట్టిప్రతిజ్ఞ నిప్పుడు వదలుటకభిలషించుచున్నాఁడవు. రఘుకులమునందుఁ బుట్టినవారివ్విధముగఁ బూర్వోత్తరవిరుద్ధములగు వచనములఁబలుకుట యుచితముగాదు. నీకివ్విధముగఁబలుకుట యుచితమయ్యేనేని నేనునాదునివాసమునకుఁబోయెద. అసత్యమును బలుకునట్టి నీవుబంధుమిత్రామాత్యాదిసహితుఁడవై సుఖముగ నుండుమనియె. అట్లువిశ్వామిత్రుఁడు మహాకోపముచేతఁ బలుకునపుడు భూమియంతయును గంపమునుబొందె. దేవతలందఱును మిగులభయమును జెందిరి. అట్లులోకమంతయును మిగులభయమునుబొందుటనువిని ఋషివర్యుఁడును, సంపూర్ణముగ వ్రతములసల్పినవాఁడును, ధీరుఁడును, నగు వసిష్ఠమునివరుఁడు దశరథభూవల్లభునకిట్లనియె.

{ విశ్వామిత్రునితోఁడ రామునిబంపుమని వసిష్ఠుడుజెప్పుట. }

రాజేన్ద్రా నీవు మానవరూపముసుధరించిన ధర్మదేవతంబో [illegible]లంబునఁబుట్టినవాఁడవు. ధైర్యవంతుఁడవు. మనోహరములగు వ్రతములఁజక్కఁగనాచరించినవాఁడవు. అదియునుంగాక శ్రీమంతుఁడవు. ఇట్టినీవుధర్మమునువదలుటతగదు. ముల్లోకములయందును రాఘవుఁడుధర్మాత్ముఁడనుకీర్తిగలదు. కావున స్వధర్మమునుబొందుము. అధర్మమునవలంబించుట యుచితముగాదు. ముందుగఁజేయుదునని పలికి పిదపఁజేయకుండువాఁడిష్టాపూర్తమును నశింపఁజేసినవాఁడువొందెడు పాపమునుఁబొందును. కావుననిరాతంకముగ రామునివదలుము.

—* వసిష్ఠుఁడువిశ్వామిత్రునిమహిమను దెలుపుట.

ఈరాముడుయస్త్రవిద్యాసమర్థుఁడైనను, లేకయసమర్థుఁడైనను, విశ్వామిత్రునివలన రక్షింపఁబడియుండుటచే "నగ్నిహోత్రరక్షితమగుయమృతమువలె" రాక్షసులు రామునిసాధింపలేరు. విశ్వామిత్రుఁడు ఆకారరూపమగు ధర్మము. పరాక్రమముగలవారిలోశ్రేష్ఠుఁడు. లోకమునందుండెడియందఱికన్నబుద్ధిమంతుఁడు. మిగులతపస్వి. జంగమస్థావరములతోఁగూడిన మూడులోకములయందుగలనానావిధములైన యస్త్రములనెఱుంగును. ఈతఁడెఱిఁగినన్ని యస్త్రముల మఱియెవ్వరిప్పటికెఱుంగరు. ఇఁకమీఁదటను నెఱుంగఁబోరు. దేవతలును, ఋషులును, అసురులును, రాక్షసులును, గంధర్వులును, యక్షులును, కిన్నరులును, మహోరగులును నెఱుంగరు. పూర్వము రాజ్యము నేలుచుండునపుఁడు యీవిశ్వామిత్రునకు భృశాశ్వునకుఁబుట్టిన పరమధార్మికములగు సమస్తాస్త్రములను పరమేశ్వరుఁడిచ్చెను. ఆ భృశాశ్వునియొక్కపుత్రులు దక్షప్రజాపతి కొమార్తెలకుఁ బుట్టినవారు. వారు నానారూపములుగలవారును, మహాపరాక్రమవంతులును, మిగులబ్రకాశించువారును, జయమునుగలిగించువారునునగుదురు. మఱియు నాదక్షప్రజాపతి కొమార్తెలలో సౌందర్యవతులగు జయయనునదియును, సుప్రభయనునదియును, మిగులబ్రకాశించునట్టి యస్త్రశస్త్రములనునూటనిగనిరి. పూర్వము జయయనునది రాక్షసులసైన్యములనుజంపుటకొఱకునధికులును, నమేయులును, కామరూపులునునగు నేబదిమందికొడుకులనుఁగనెను. సుప్రభయనునదియును, జంపువారనెడు పేరుగలవారును, నెదిరింపశక్యముగానివారును, తాక్రమింప నలవిగానివారును, మిగులబలవంతులును, నగు వేలదిమందిపుత్రులను బుట్టించెను. ఈవిశ్వామిత్రుఁడా యస్త్రములనుజక్కఁగానెఱుంగును. మఱియు సకలధర్మములను నెఱిఁగినవాఁడగుటచే గ్రొత్తయస్త్రములనున్నను బుట్టింపసమర్థుఁడు. ఇట్టిపరాక్రమముగలవాఁడును, మహాప్రభావముగలవాఁడును, మిగులకీర్తివంతుఁడును నగును.

కావుననోదశరథమహారాజా! రాముఁడువిశ్వామిత్రునితోఁగూడఁబోవునేని యేమియాపదసంభవించునోయని యెంతమాత్రమును సందేహింపవలదు. విశ్వామిత్రుఁడు స్వయముగానే రాక్షసులనుసంహరించుటయందు సమర్థుఁడు. అయినను నీకొడుకులకు మేలుగలుగుటకై నీయొద్దకు వచ్చి యాచించుచున్నాఁడనిచెప్పిన వసిష్ఠమహర్షి వాక్యములనువిని నారఘువంశశ్రేష్ఠుఁడగు దశరథమహారాజు ప్రసన్నహృదయుఁడై, దేహముప్పొంగసంతసించె. అంతమహాకీర్తిమంతుఁడగు దశరథమహారాజు రామునివిశ్వామిత్రునితోఁగూడబంపుటకుసమ్మతించె. ఇట్లనిశ్రీమద్బాలకాండమునందలియిరువదియొకటవసర్గముగిసెను.

—* దశరథుఁడు విశ్వామిత్రునితోడ రామలక్ష్మణులబంపుట. *—

అట్లువసిష్ఠమహర్షి వచించినదశరథమహారాజుసంతసించితానేలక్ష్మణునితోఁగూడ రామునిరమ్మనిపిలిచె. పిలిచి

తానును గౌసల్యయును, మంగళముగా వించి పురోహితుఁడగు వసిష్ఠమహర్షి చే మంగళప్రదములగు మంత్రములచే నభిమంత్రింపించి శిరమును మూర్కొని ప్రీతిగలమనస్సుతో విశ్వామిత్రునకిచ్చెను.

ఇట్లు రాజీవలోచనుఁడగు రాముని విశ్వామిత్రునకిచ్చిన పిదప దుమ్ములేనిచల్లనిగాలి సుఖముగ వీచె. మహాత్ముఁడగు రాముఁడు విశ్వామిత్రునితోఁ గూడఁబోగానే దేవతలు దుందుభులను మోయించిరి. పువ్వులవానగురిసె. శంఖ దుందుభిధ్వనులుఁగలిగె. ముందుగ విశ్వామిత్రుఁడును వెనుక ధనుర్ధరుఁడగు రాముడును నతనివెనుక పిల్లజుట్టుగలవాఁడును ధనుర్ధరుఁడునునగు లక్ష్మణుఁడును పోయిరి. కుటిలులుగాని యారామలక్ష్మణులు ప్రత్యేకముగ రెండేసియమ్ముల పొదులను ధరించియుండుటచే మూఁడుతలలుగల సర్పముల వలె వెలుఁగుచు ధనుష్పాణులై దశదిశలఁ బ్రకాశింపఁజేయుచు "బ్రహ్మదేవునితోఁగూడిన నశ్వినీదేవతలవలె" మహాత్ముఁడగు విశ్వామిత్రుని వెంబడించిరి.

మఱియు ధనుర్ధరులును, నలంకృతులును, నుడుముచర్మనిర్మితమగు హస్తకవచమును వ్రేళ్లకవచమునుగలవారును, మహాకాంతిగలవారును, బాలురును, సుందరమగు దేహముగలవారును, తోడఁబుట్టువులును, గాంతిచేఁ బ్రకాశించువారును, ననిందితులును, విశ్వామిత్రుని వెంబడించినవారును నగు నారామలక్ష్మణులు "సృష్టిస్థితిసంహారుఁడును నచింత్యుఁడును నగుపరమేశ్వరుననుసరించిన నగ్నిహోత్రజనితులగు స్కందవిశాఖులవలెఁ,, బ్రకాశించిరి. ఇట్లారామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంబడించి యొకటిన్నరయామడ దూరము పోయినపిదప సరయూనదీదక్షిణతీరమందు విశ్వామిత్రుఁడు మధురమయినవాక్కులతో "రామా!" యని పిలిచె.

—*విశ్వామిత్రుఁడు బలాతిబలలనెడివిద్యలం గఱపుట.*—

పిలిచిబిడ్డా! కాలాతిక్రమముగూడదు. జలమునుదీసికొనుము. సమస్తమంత్రములయొక్క స్వరూపములైన "బల,, "అతిబల,, యనెడివిద్యలనుఁ దెలిసికొనుము. ఈవిద్యలనెఱింగితివేని నీకలసటయైనను, దప్పియైనను, మాఱురూపైనను గలుగదు. మఱుపుదగిలియుండినను, నిద్రపోవుచుండినను రాక్షసులు నిన్నుదిక్కింపలేరు. ఈభూమియందు బాహుబలమున నీతోసమానుఁడొక్కఁడైననుండఁడు. ముల్లోకములందును నీతోసమానుఁడునునుండఁడు. పాపరహితుఁడవగు రామా! ప్రపంచమునసామర్థ్యమందును, తెలివియందును, బుద్ధినిశ్చయమందును, నుత్తరప్రత్యుత్తరములయందును నీతో సమానుఁడుండఁడు. సమస్తజ్ఞానమునకు దల్లులయిన బలాతిబలలనెడి విద్యలనెఱింగినపిదప నీతోసమానుఁడిప్పటికిని నిఁకనెప్పటికిని యుండడు. మార్గమునందు బలాతిబలలనుజపించుచుండిన నాకలిదప్పులు గలుగవు. మిగులఁగీర్తియునుగలుగును.

బ్రహ్మదేవునికుమార్తెలగు మహాప్రభావముఁగల బలాతిబలల నెఱుంగుటకు కాకుత్స్థవంశోద్భవుఁడగు నీవేతగినవాఁడవు. నీవుదప్ప మఱియెవ్వఁడును లేఁడు. ఇప్పుడు చెప్పిన సౌభాగ్యాదిగుణములన్నియును నీయందు మెండుగానున్నవి. సంశయము లేదు. తపస్సుచే సంపాదింపఁబడినవి. అనేకములయిన గుణములుగలవియగునని చెప్పిన నారాముఁడు యాచమనము సేసి సంతుష్టహృదయుఁడును శుచియునునై పరమాత్మధ్యానతత్పరుఁడగు విశ్వామిత్రునివలన బలాతిబలలనెడి విద్యలను గ్రహించె. ఇట్లు రాముఁడు విద్యల గ్రహించి విశ్వామిత్రునకు గురువునకు జేయవలసిన వందనాదికార్యములనొనర్చి "శరత్కాలమునందలి సహస్రకిరణుఁడును భగవంతుఁడునునగు సూర్యునివలె" ప్రకాశించె. అంతనా సరయూనదీ దక్షిణతీరమునందు రామలక్ష్మణవిశ్వామిత్రులుమువ్వురును, దగ్గఱఁగఁబచ్చికలతోఁబాన్పులఁబఱచికొని సుఖముగనివసించిరి. దశరథమహారాజుపుత్రులలో శ్రేష్ఠులగు నారామలక్ష్మణులు విశ్వామిత్రునివచనములచేలాలింపఁబడుచుండినందున నారాత్రియంతయు సుఖముగానే యుండె. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యిరువదిరెండవసర్గముసమాప్తము.

—*{సరయూనదీదక్షిణతీరమునందుండి విశ్వామిత్రాదులు అంగదేశమునకుఁబోవుట.}*—

ఇట్లు రాత్రియంతయుఁగడచిన పిదపఁ బ్రభాతకాలమున మహామునియగు విశ్వామిత్రుఁడు నిదురమేల్కొంచి పర్ణశయనమునందుఁబవ్వళించియున్న రామలక్ష్మణులనుఁజూచి యిట్లనియె. కౌసల్యాదేవికి సత్పుత్రుఁడవును, నరశార్దూలుఁడవునునగు రామా! ప్రభాతకాలముగావచ్చినది. ఈశ్వరనియామకమగు నిత్యకర్మలఁ జేయవలయుఁ గావున లెమ్ము. అనిచెప్పినవిశ్వామిత్రుని గంభీరములగువాక్యముల విని పరాక్రమవంతులును రాజపుత్రులునునగు రామలక్ష్మణులు స్నానమొనర్చి యర్ఘ్యములవిడిచి శ్రేష్ఠమయిన గాయత్రీమంత్రమును జపించిరి. పిదప ప్రాతఃకాలకరణీయములగు సంధ్యోపాసన బ్రహ్మసమిదాధానాది కార్యముల నెల్లనెరవేర్చికొని తపోధనుఁడగు విశ్వామిత్రునకు నమస్కరించి సంతోషముతో బ్రయాణమైరి.

ఇట్లు ప్రయాణమై యారామలక్ష్మణులు మంగళకరమగు

సరయూనదీ సంగమమందుగంగానదిన్ని, మహాప్రభావము గలవారును, ననేకవేలయేండ్లుపరమమగు తపస్సుచేసినవారునునగు ఋషీశ్వరులయొక్క పవిత్రములగు నాశ్రమములను, జూచిమిగులసంతసించి మహాత్ముఁడగు విశ్వామిత్రునితోనిట్లనిరి. భగవంతుఁడవైన విశ్వామిత్రమహర్షీ! యీ పుణ్యమగు నాశ్రమంబెవనిది? ఏపురుషుఁడిందు నివసించుచున్నాఁడు? దానినివినవలయునని. మాకుమిగులఁ గుతూహలముఁగలుగుచున్నది. అనినుడివినవిని మునిపుంగవుఁడగు విశ్వామిత్రుఁడు నవ్వియిట్లనియె. ఓరాముఁడా! యీయాశ్రమమెవ్వనిదో దెల్పెదవినుము.

—* అంగదేశమాహాత్మ్యము. *—

పూర్వమున్మన్మథుఁ డాకారముగలవాఁడుగా నుండె. అతనినే కాముఁడనిచెప్పెదరు. దుష్టబుద్ధిగల యామన్మథుఁడు దేవతలకుఁ బ్రభువైన పరమేశ్వరుఁడేచటసమాధినిష్ఠుఁడైతపస్సుచేసి పార్వతీదేవిని వివాహమై మరుద్గణ పరివృతుఁడై తరలిపోవుటకు నిశ్చయించియుండగ నెదిరించె. అంతపరమేశ్వరుఁడుకోపగించి తనమూఁడవనేత్రమునుఁదెరిచిహుంకరించె. అంతపరమేశ్వరునిఫాల నేత్రాగ్నివలన నాదుష్టుఁడగు మన్మథుఁడు దేహంబంతయు భస్మంబుగావింపఁబడి యశరీరుఁడయ్యె.

ఓరాముఁడా! అదిమొదలుకొనిమన్మథుఁడు యనంగుఁడనిప్రసిద్ధినొందె. మన్మథుఁడు శరీరమును వదలినదేశము అంగదేశమనఁబడియె. కావుననిదిపరమేశ్వరుని యాశ్రమము. ఇందునివసింపుచుండు మునులుపరమేశ్వరుని శిష్యులు. వీరలు నిత్యధర్మపరులుగను, పాపరహితులుగను నుండెదరు. అట్టిపరమేశ్వరునియాశ్రమమగునిందు యీరాత్రియంతయువసింపుదము. రేపుపవిత్రములైన గంగాసరయూనదులఁదాటుదము.

—* విశ్వామిత్రులవద్దికి మునులువచ్చుట. *—

ఇపుడుమనమందఱము స్నానముసేసి గాయత్రీజపము చేసికొని హోమంబొనర్చి పరిశుద్ధముగఁ బ్రవేశింపుదమని యనుచుండగ నాయాశ్రమవాసులగు మునులుజ్ఞానదృష్టిచేనీవృత్తాంతమంతయు నెఱింగిమిగులసంతసించి పులకాంకితశరీరములతో రామలక్ష్మణవిశ్వామిత్రుల యొద్దకు వచ్చిముందుగ విశ్వామిత్రునకు నర్ఘ్యపాద్యాతిథ్యముల సమర్పించిపిదప రామలక్ష్మణులనతిథి సత్కారంబులచేసత్కరించిరి. మునులునురామలక్ష్మణ విశ్వామిత్రులచేయుపచరింపఁబడిరి. అంతనతిథులగురామలక్ష్మణ విశ్వామిత్రులనుమునులు కథలచేగొంతసేపు మాటలాడుచుండిసంతోషపడిరి.

పిదపరామలక్ష్మణ విశ్వామిత్రులు మనస్సమాధానముఁబొంది యథాయోగ్యముగసంధ్యనువాసించిరి- సువ్రతులునునాశ్రమవాసులునునగు మునులు రామలక్ష్మణవిశ్వామిత్రులను దమయాశ్రమమునకుఁ దోడ్కొనిరాయిరి. ధర్మాత్ముఁడును మునిపుంగవుఁడునునగు విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను మనోహరములగు కథలచే రమింపఁజేసె. ఇట్లనిశ్రీమద్బాలకాండమునందలి యిరువదిమూఁడవ సర్గముముగిసెను.

—* విశ్వామిత్రాదులు గంగాతీరమునకుబోవుట. *—

అంతసూర్యోదయము కాఁగానే. మహాపరాక్రమవంతులగురామలక్ష్మణులు ప్రాతఃకాలకృత్యముల నేరవేర్చికొనిసిద్ధుఁడుగానున్న విశ్వామిత్రుని మున్నిడుకొని గంగాతీరమునకుఁబోయిరి. మహాత్ములును సంశ్రితవ్రతులునునగునమ్మునులందరును మంచియోడనుదెచ్చి విశ్వామిత్రునితో నిట్లనిరి- మునీంద్రా! నీవురామలక్ష్మణులతోడ నీయోడనెక్కుము. మార్గమునశుభముల నెఱుపుచుఁబొమ్ము- కాలవిళంబము గలగకపోవుఁగాకయనిన విశ్వామిత్రుండట్లనే కానిండనిచెప్పి యాఋషులఁబూజించి రామలక్ష్మణులతోడసముద్రగామినియగు గంగానదినిఁదాఁటనారంభించిరి. ఇట్లుగంగానదీమధ్యమున రామలక్ష్మణవిశ్వామిత్రులు పోవుచుండగనతి సంరంభవర్ధితమగు నొకధ్వనిజనించె. అంత రాముఁడు విశ్వామిత్రునింగాంచి తపోధనా! ఈనదీమధ్యమందుపరస్పరము గలయుచున్న జలముయొక్క శబ్దంబెక్కుడిదనియడిగిన ధర్మాత్ముఁడగు విశ్వామిత్రుఁడుమిగుల సంతసించియిట్లనియె.

—* గంగాసరయూసంగమప్రభావము. *—

నరశార్దూలుఁడవగు రాముఁడా! కైలాసపర్వతమునందు బ్రహ్మదేవుఁ డొకనాఁడు తనమనస్సుచేనొక సరస్సునిర్మించె. అదిమనోనిర్మితమగుటచే మానససరస్సనఁబడియె. ఆసరస్సునందుండి యొకనదిపుట్టె. ఆనదియయోధ్యాపట్టణము నావరించిపాఱుచున్నది. అదిసరస్సునుండిపుట్టుటవలనసరయూనదియని ప్రసిద్ధినొందె. బ్రహ్మమానససరస్సునుండిపుట్టినందున మిగులఁబవిత్రమైనదియయ్యె. అట్టి సరయూనది గంగాజలముతోఁ గలియుటవలన నీయతులమగుధ్వనిజనించె. కావుననీరెండునదులకు నమస్కారముసేయుమనినవిని ధార్మికులగు యారామలక్ష్మణు లిరువురునుగంగాసరయూనదులకు నమస్కరించిమువ్వురును దక్షిణపుతీరముఁజేరి యతిశీఘ్రముగ నడువందొడంగిరి.

ఇట్లు నడచినడచి యొకయడవిమధ్య పోవుచుండగ

నిక్ష్వాకువంశోద్భవుండైన దశరథమహారాజపుత్రుండగు నా రాముఁడు పాదసంచారముచే ద్రొక్కఁబడని భయంకరమగు నడవిం జూచి విశ్వామిత్రునితో నిట్లనియె. తాపసేంద్రా! యీయడవి ప్రవేశింప శక్యముగానిదిగాను, యీలపురుగుల గుంపుచే ధ్వనింపఁజేయఁబడిన శబ్దముగలదిగను, భయంకరములగు క్రూరమృగము శకుంతపక్ష్యాదిదారుణారావముఁగలదిగను, భయంకరధ్వనిగలిగి కుత్సితముగ నఱచుచున్న నానావిధ పక్షులుగలదిగను, సింహములు, పెద్దపులులు, పందులు, ఏనుగులుగలదిగను, చంద్రచెట్లు, ఇనుమద్దిచెట్లు, ఏఱుమద్దిచెట్లు, మారేడుచెట్లు, తుమికిచెట్లు, కలిగొట్టుచెట్లు, రేగుచెట్లచే వ్యాపింపఁబడినదిగను, నున్నది. కావున నాకు మిగుల నాశ్చర్యముగనున్నది. యీభయంకరమగు నడవి పేరేమి? చెప్పవలయునని యడిగిన మహాతేజుఁడగు విశ్వామిత్రమహాముని యిట్లనియె.

——* మలదకరూశదేశముల వృత్తాంతము. *——

పురుషశ్రేష్ఠుఁడవగు రాముఁడా! దేవనిర్మితమువలె నిర్మింపఁబడిన మలదకరూశదేశంబులని మొదు రెండుదేశములు పూర్వము ధనధాన్యసంపదచే వృద్ధిబొందియుండె. తొల్లి యింద్రుఁడు వృత్రాసురుని సంహరించె. అంత బ్రహ్మహత్యాపాపమువలన నశుచిత్వముఁగలిగి క్షుధాతురుఁడై పరితపించుచుండగ దేవతలును తపోధనులు నగు ఋషులును నాయింద్రుని గంగాదిపుణ్యతీర్థములచే నభిషేకించి మంత్రపూతములగు కలశములచే స్నానమొనర్పించి నిచటనతని యశుచిత్వమును నాఁకలిని విడిపించిరి. అట్లు దేవతలును ఋషులును నింద్రుని శరీరమున జనించిన యశుచిత్వమును నాఁకలిని విడిపించి సంతోషితస్వాంతులైరి. ప్రభువగు నింద్రుఁడును నిజదేహజనితమగు క్షుధాదులవదలి పరిశుద్ధుఁడైనందున ప్రీతచేతస్కుఁడై యీ దేశమునకు శ్రేష్ఠమగు వరమొసంగె.

నాదేహమునఁగల్గిన మలమును నాఁకలిని ధరించిన యీదేశములు ధనధాన్యాదిసంపదగలిగి వృద్ధిఁబొందుచు నాదేహమలమును ఖండించుటచే మలదములనియు, కరూశమును గ్రహించుటచే గరూశములనియు లోకమునఁ బ్రసిద్ధినొందుఁగాకయని వరమిచ్చె. అంత దేవతలు ధీమంతుఁడగు నింద్రుఁడు దేశములను బూజించినది చూచి మేలు మేలని యనేకవిధములఁ బొగడిరి. శత్రుసంహారకుఁడవగు రాముఁడా! యీ మలదకరూశములనెడు దేశములు బహుకాలము వఱకు ధనధాన్యసంపదగలిగి వృద్ధినొందియుండె.

——* తాటకావన వృత్తాంతము. *——

అంతఁగొంతకాలమునకు పిదపఁ గామరూపిణియును బుట్టినప్పుడె వెయ్యేనుఁగుల బలముగలదియు నగు నొకయక్షస్త్రీ పుట్టెను. దానిపేరు తాటక. దానికి ధీమంతుఁడగు సుందుఁడను పెనిమిటిగలఁడు. మఱియు రాక్షసుఁడును, నింద్రసమాన పరాక్రమముఁగలవాఁడును, నగు మారీచుఁడను కుమారుఁడుగలఁడు. ఆతాటకామారీచులవలని భయము నీకుగలుగకుండుఁగాక. రాముఁడా! మహాబలపరాక్రమశాలియగు నామారీచుఁడను రాక్షసుఁడు వృత్తబాహుండును, విశాలమైన ముఖముఁ గలిగినవాఁడునునై యతిభయంకరాకారముతోఁ బ్రజల నెల్లప్పుడు వెఱపించుచుండును. ఈమలదకరూశదేశములను దుష్టచారిణియగు నాతాటక నాశముసేయుచున్నది. ఆతాటక యిక్కడికి యొకటిన్నరయామడదూరమున మార్గము నడ్డగించి నివసించుచున్నది. అదే తాటకావనము. కావున మనమీమార్గమున బోఁదగదు.

రాముఁడా! నీబాహుబలముచే దుష్టచారిణియగు తాటకను సంహరింపుము. నాయాజ్ఞవలన నీదేశములను మరల నిష్కంటకముగ సేయుము. భయంకరురాలును, సహింపఁగూడనిదియును, యక్షస్త్రీయునునగు నాతాటకచే నిర్జనముగాఁ జేయఁబడిన నీదేశమునఁ బ్రవేశించుటకు నెల్లరు నుభయపడుచుందురు. ఈవనము భయంకరముగను, విజనముగను నుండుటకు, గారణమును, నిప్పుడెట్లుండునదియు నుసర్వమును దెలియఁ జెప్పితినని విశ్వామిత్రుండనియె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి యిరువదినాలవసర్గము ముగిసెను.

——* తాటక జన్మవృత్తాంతము. *——

అంత నప్రమేయ ప్రభావముఁగల విశ్వామిత్రుని యత్యుత్తమమగు మాటవాలకించి పురుషశార్దూలుఁడగు రాముఁడు మనోహరముగ నిట్లనియె. ఓమునిపుంగవా! యక్షులల్పవీర్యులని చెప్పఁబడుదురు. అందును నబలయగు నీస్త్రీ వెయ్యేనుఁగుల బలం బెక్కడినుంచి ధరించెనని న విశ్వామిత్రుఁడిట్లనియె. ఆతాటకస్త్రీయైనను వరదానబలముచే బలాఢ్యురాలుగానున్నది. అందుకుఁ గారణమును వచించెద వినుము.

పూర్వము పరాక్రమశాలియును, సదాచారసంపన్నుఁడును, నగు సుకేతుఁడను యక్షుఁడొకఁడుగలఁడు. వాడు తనకు సంతానము లేమిం జేసి మహత్తైన తపంబొనర్చె. ఇట్లు తపంబు జేసిన బ్రహ్మదేవుఁడు మిగుల సంతసించి యాయక్షపతియగు సుకేతునకు వెయ్యేనుఁగల బలముఁగల తాటకయను కుమార్తె కలుగునట్లు వరంబిచ్చె. పుత్రుఁడు

గలుగునటులవరమివ్వఁడయ్యె. అట్లుపుట్టిరూపయౌవనములచే ప్రకాశించుచున్న తనకొమార్తెయైనతాటకను ఝర్ఝపుత్రుఁడైనసుందునకిచ్చి వివాహముగావించె.

అంతఁగొంతకాలముఁ గడచినపిదప యక్షస్త్రీయగు తాటక శాపమువలనరాక్షసత్వమునొందినవాఁడును, పరాక్రమశాలియునగు మారీచుఁడనుకుమారునింగనెను. ఇట్లుండఁగ రాముఁడా! సుందుఁడనువాఁడగస్త్యమహర్షితోయుద్ధముసేసి మృతుఁడయ్యె. అంతఁదాటక మిగులఁగోపావేశంబునొంది పుత్రుఁడగుమారీచునితోఁడ యగస్త్యునిసంహరింపఁదలంచి మహావేగముతోనఱచుచు నగస్త్యునిభక్షించుటకైపరిగెత్తివచ్చెను. అంతభగవంతుఁడగు నగస్త్యమహర్షి మొదటమారీచుని రాక్షసుండవుగమ్మనిశపించి పిదప మిగుల గోపోద్దీపితుఁడై తాటకనుజూచి వికృతమగుశరీరమును, ముఖమునుగలిగి మనుష్యమాంసమునుభక్షింపుచుమహాయక్షివై భయంకరాకారముగలిగియుండుముగాకనిశపించె.

అంతట యాతాటక శాపముసహింపక క్రోధోద్రేకముగలదై తొల్లియగస్త్యమహర్షి యునికిపట్టై యుండిన మంగళకరమగు నీదేశమునంతయు నిర్జనముగానొనర్చుచున్నది. ఓరామఁడా! గోబ్రాహ్మణహితార్థమై దురాచారముఁగలదియును, మిగులభయంకరురాలును, దుస్సహమగుపరాక్రమముఁ గలదియును, నగు తాటకను నీవుసంహరింపుము. శాపోపహతయగు నీతాటకను నీవుదప్పమూఁడులోకములయందుండువారలలో నెవ్వఁడును సంహరింపంజాలఁడు. స్త్రీవధ నెట్లుసేయుదునని సంశయింపవలదు. రాజసూనులకు నాలుగువర్ణములవారికి హితవుసేయుట కర్తవ్యము. ఓరామఁడా! ధర్మిష్ఠుఁడయినప్రజాపరిపాలకుఁడగు రాజుచే లోకహితార్థమై క్రూరయుక్తమయినదైనను, అక్రూరమైనదైనను, దోషసహితమైనదైనను, నిర్దోషమైనదైనను, కార్యమునుజేయబడవలయును.

ఇవిరాజ్యభారనియుక్తులకు నిత్యమయినధర్మము. కావున నధర్మాత్మురాలగు తాటకనుజంపుము. ఈతాటకవిషయమై ధర్మమునాలోచింపంబనిలేదు. పూర్వముభూమినిజంపుటకు బ్రయత్నముసేసినవిరోచనుని కుమార్తెయగుమంథరను నింద్రుండుచంపెనని వినుచున్నాము. మఱియును దొల్లిలోకములో నింద్రుఁడేలేకుండు నట్లొనర్పవలయునని తలంచిన శుక్రునితల్లియగు భృగుమహర్షి భార్యావిష్ణుమూర్తిచేమృతినొందెను. రాజపుత్రుఁడవగు రామఁడా! యీచెప్పఁబడినవారును నధర్మాత్ములగు నింకననేకమంది స్త్రీలును మహాత్ములగుపురుషశ్రేష్ఠులచేసంహరింపఁబడిరి.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యిరువదియయిదవ సర్గముముగిసెను.

—— * రాముఁడు తాటకనువధించుట. * ——

ఇట్లుచెప్పిన విశ్వామిత్రుని సార్థకమగు వాక్యమునువిని దృఢవ్రతుఁడును, రాజపుత్రుఁడునునగురాముఁడు ప్రాంజలియై యిట్లనియె. తండ్రిగారియాజ్ఞవలనను, తదాజ్ఞాగౌరవమువలనను, విశ్వామిత్రుఁడాజ్ఞాపించినట్లు లేశమైనను సంశయింపకసేయవలయు. అయోధ్యాపురమునందు మహాత్ముఁడును తండ్రియునగుదశరథునిచే వసిష్ఠాదిగురుమధ్యమున "విశ్వామిత్రమహర్షి చెప్పినట్లుసేయుమని,, నేనాజ్ఞాపింపంబడినవాడను. కావున నాయాజ్ఞోల్లంఘనమొనర్పనలవికాదుగదా? ఇట్లు పితృవాక్యమునువినియున్న పిత్రాజ్ఞాపరిపాలకుఁడగు నేను బ్రహ్మోపదేశకుఁడగు విశ్వామిత్రునియాజ్ఞవలన సంశయింపక తాటకనువధింపుచున్నాను.

గోబ్రాహ్మణహితముకొఱకును, దేశమునకుసుఖముగలుగుటకొఱకును నప్రమేయుఁడవగునీయాజ్ఞాప్రకారముసేయుటకు సిద్ధుఁడుగనున్నాను. అనియిట్లుపలికి యరిందముఁడగురాముఁడు ధనుర్మధ్యమును పిడికిటంబట్టి దశదిశలధ్వనింపఁజేయుచు టంకారముగావించె. అంతనాటంకారధ్వనివిని తాటకావనము నందుండువారలందఱు భయాక్రాంతులైరి. మహాకోపనయగు తాటకయును దిగ్భ్రమనుజెంది యాశబ్దమెక్కడనుండివెడలెనని కొంతదడవాలోచించి కోపసంరక్తలోచనయై యాధ్వనివెడలినదిశనుఁగూర్చిపరుగెత్తెను.

అంతరాముఁడు కోపోద్రిక్తురాలును, వికృతాకారురాలును, నత్యున్నతురాలునునగు నాతాటకంజూచి లక్ష్మణునితోనిట్లనియె. లక్ష్మణా! భయంకరాకారముగల యక్షస్త్రీయగు తాటకనుజూడుము. దీనిని భీతాత్ములగువారుజూచినేని వారిగుండెలుపగలకపోవునా? పగులును కావున నెదిరింపఁగూడనిదియును, మాయాబలసమన్వితురాలును, నగు నీతాటకనిప్పుడు చెవులునుముక్కునుంగోసి పరాభవమునొందించెదజూడుము. ఆడుదియగుటచే జంపుటకిష్టముజనింపదయ్యె. అయినను దీనిచేతులునుగాళ్ళునుసరికిగమనాదులులేకుండఁ జేసెదనని చెప్పుచుండగ తాటకక్రోధమూర్ఛితురాలై చేతులుపైకెత్తుకొని పెడబొబ్బబడుచు రామునిపైకిబరుగెత్తెను.

అట్టియెడ బ్రహ్మర్షియగు విశ్వామిత్రుఁడాతాటకను. "హుం" యనియదల్చి రామలక్ష్మణులకు జయమునుమంగళమునుగల్గుగాకని యాశీర్వదించె. ఆతాటక భయంకర

ముగ దుమ్మును వెదజల్లుచు నాదమ్ముచే బ్రహ్మాండమంతయు నంధకారబంధురంబగు నట్లు సేసిన రామలక్ష్మణులు ముహూర్తకాలము దిగ్భ్రమఁజెందిరి. ఆసమయమున తాటక మాయాసమన్వితయై రామలక్ష్మణులమీఁద గొప్పదైన ఱాళ్ళవానఁగురిపించెను.

అంత రాముఁడు కోపావిష్టుఁడై యాఱాళ్ళవానను తన బాణములవానచే నివారించి పరుగెత్తివచ్చుచున్న యా తాటకయొక్క రెండు చేతులను బాణములచే నఱికెను. అంత తాటక రెండుభుజములు దెగుటవలన మిగుల నలసటనొంది సమీపంబున నఱచుచుండఁగ లక్ష్మణుఁడు కోపావిష్టుఁడై ముక్కును చెవులును గోసె. ఇట్లు చేతులు చెవులు ముక్కును దెగిన నా కామరూపధరురాలగు తాటక యనేకరూపములను ధరించి తనమాయాబలముచే ఱాళ్లవానగురిపించి మోహమునొందునట్లు భయమును గలిగించె. అంతట ఱాళ్ళవానచే నలుదిక్కులు గప్పఁబడుచుండఁగ శ్రీమంతుఁడగు విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులఁజూచి యిట్లనియె.

రాముఁడా! యిదివరకు దయయుంచినది చాలును. సాయంకాలము కావచ్చినది. సాయంకాలమయ్యెనేని పాపిష్ఠురాలును, దుష్టచారిణియును, యజ్ఞవిఘ్నకారియునగు నీతాటక యనేకమాయలం జేయఁగలదు. కావున సాయంకాలమగునంతలోపలనే నీతాటకను మృతినొందింపుము. సాయంకాలములయందు రాక్షసులనెదిరించుట మిగులకష్టమనిన రాముఁడు యెచ్చరికనొంది యెదుటకనుపడకపోయినను శబ్దవేదిత్వముతో బాణప్రయోగము జేయుటయందు దనకుంగల సామర్థ్యమును చూపుచు ఱాళ్ళవానగురిపించుచున్న యా తాటకను బాణములచే నిరోధించె.

ఇట్లు బాణవర్షముచే నడ్డగింపబడిన యా మాయాబలసమన్వితయగు తాటక యఱచుచు రామలక్ష్మణులపైకిఁ బరుగెత్తెను. అంత మిగుల పరాక్రమముతో పిడుగువలె నతివేగంబున బైకిపరుగెత్తివచ్చుచున్న యా తాటకనుచూచి ఱొమ్మునందొక బాణముచేఁగొట్టెను. అంతనది నేలబడి ప్రాణములనువదలె. అట్టియెడ భయంకరురాలగు నాతాటక చంపబడుటచూచి దేవేంద్రుఁడును, దేవతలును రామునింజూచి బలేబలే మంచికార్యము జేసితివని మెచ్చుకొని చక్కగా బూజించిరి. దేవతలును దేవేంద్రుడును మిగుల సంతసించి విశ్వామిత్రునితో నిట్లనిరి.

విశ్వామిత్రుఁడా! నీకు మంగళమగుఁగాక. ఈ తాటకను జంపుటచే దేవేంద్రాదిమరుద్గణములు సంతసించెను. కావున రామునియందనుగ్రహముంచుము. నీవు తపోబలము చే సంపాదించిన సత్యపరాక్రమముగల భృశాశ్వప్రజాపతి కొడుకులైన యస్త్రముల రామునకొసంగింపుము. విశ్వామిత్రుఁడా! ఈ రాముఁడు నియతముగ నీయాజ్ఞాప్రకారము నడుచువాఁడు. కావున పాత్రభూతుఁడగుచున్నాఁడు. మఱియు రాజసూనుఁడగు రామునిచే దేవతలకొఱకు మహాకార్యములు జేయబడవలసియున్నవి యనిచెప్పి దేవతలందఱును సంతసించి విశ్వామిత్రునిబూజించి వచ్చినరీతిగనే పోయిరి. అంత సంధ్యాకాలమయ్యె. అంతట మునివరుఁడగు విశ్వామిత్రుఁడు తాటకసంహారమునకు సంతోషించి మిగులఁ బ్రీతితో రామునిశిరమును మూర్కొని యిట్లనియె.

శుభదర్శనుఁడవగు రాముఁడా! ఈరాత్రియంతయు నీవనమునందే యుండుము. రేపు వేకువ నాయాశ్రమమునకు బోవుదము. ఇట్లు పలికిన విశ్వామిత్రునివాక్యములకు దశరథాత్మజుఁడగు రాముఁడు మిగులసంతసించి యా తాటకావనమునందే రాత్రియంతయు సుఖముగనుండె. ఆవనము నందప్పుడె యా తాటకావనము నిరుపద్రవముఁగలదై "కుబేరుని చైత్రరథమనెడు యుద్యానవనమువలె" మనోహరముగ బ్రకాశించె. ఆ రాముఁడు యక్షునికూతురైన తాటకను సంహరించి దేవతలచేతను సిద్ధులచేతను బొగడబడుచు విశ్వామిత్రునితోడ నాయడవియందు నివసించి మరుదిన ప్రభాతకాలమున మేలుకొలుపఁబడెను. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యిరువదియారవసర్గము ముగిసెను.

—*{ విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు సమస్తాస్త్రములనొసంగుట. }*—

పిదప నారాత్రియంతయు నచ్చటనే నివసించి మహాయశుండగు విశ్వామిత్రుఁడు చిరునవ్వుతో రామునితోడ మధురముగ నిట్లనియె. మహాయశుఁడవగు రాజపుత్రుఁడవయిన రాముఁడా! నేను మిగులసంతోషమునొందితిని. నీకు మంగళమగుగాక. మిగులప్రీతితో నేనిచ్చెడి సమస్తాస్త్రములను గ్రహింపుము. గంధర్వోరగదేవదానవులందరుఁగలసి యొక్కతూరిగ నీపైయుద్ధమునకు వచ్చినను వారలనెల్ల నోడించి జయమునొందునట్టి దివ్యములగు నస్త్రములన్నిటిని నీకిచ్చెదను. ఇదిగో దివ్యమగు శ్రేష్ఠమయిన దండచక్రము. మఱియు ధర్మచక్రమును, కాలచక్రమును, నతిభయంకరమగు విష్ణుచక్రమును, ఐంద్రాస్త్రమును, వజ్రాస్త్రమును, శివదేవతాకమయిన శూలాస్త్రమును, బ్రహ్మశిరోనామకాస్త్రమును, ఐషీకాస్త్రమును, బ్రహ్మాస్త్రమును నిచ్చెదను. మోదకిశిఖరియనెడు రెండుగదలను నిచ్చెదను. ధర్మపాశమును, కాలపాశమును, వరుణపాశమును, వారుణాస్త్రమునను నిచ్చెదను. శుష్కార్ద్రములనియెడు రెండుపిడుగులను



పైశాకాస్త్రమును, నారాయణాస్త్రమునునిచ్చెదను.

అగ్నికేవునకు బ్రియమైనశిఖరమను నాగ్నేయాస్త్రమును, వాయుదేవతాకమగు ప్రథనమను వాయవ్యాస్త్రమునునిచ్చెదను. హయశిరోనామకాస్త్రమును, క్రౌంచాస్త్రమును, విష్ణుశక్తియు, రుద్రశక్తియుననెడి రెండుశక్తులనునిచ్చెదను. రాక్షసులుధరించెడి భయంకరములగు కంకాళకాపాల కంకణములనెడు ముసలాయుధముల నన్నిటినినిచ్చెదను. విద్యాధరదేవతాకమైన వైద్యాధరాస్త్రమును, నందనంబనెడి శ్రేష్ఠమగుకత్తిని, గంధర్వులకుబ్రియమైనమాన ప్రస్వాపన ప్రశమనములనియెడు గాంధర్వాస్త్రములను, సూర్యదేవతాకమగు సౌరాస్త్రమును, గర్వింపఁజేయునట్టి దర్పణాస్త్రమును, శోషింపఁజేయునట్టిశోషణాస్త్రమును, తపింపజేయునట్టి సంతాపాస్త్రమును, నేడ్పింపఁజేయునట్టి విలాపనాస్త్రమును, కందర్పదేవతాకమును నెదిరింపఁగూడనిదియునునగు మదనాస్త్రమును, పిశాచములకుఁబ్రియమై పిశాచదేవతాకమగు మోహనాస్త్రమును, తామసాస్త్రమును, సౌమనసాస్త్రమును, సంవర్తాస్త్రమును, దుర్ధర్షమగు మౌసలాస్త్రమును, సత్యమనెడియస్త్రమును మాయాధరాస్త్రమును, శత్రువుల తేజస్సును బోగొట్టెడిభయంకరమగు తేజఃప్రభమనునస్త్రమును, శిశిరమనుచంద్రదేవతాకమగు సౌమ్యాస్త్రమును, త్వష్ట్రృదేవతాకమగు సుదామనాస్త్రమును, దారుణమగుభగాస్త్రమును, మానవాస్త్రమును, నిచ్చెదను.

మహాబాహుండవగు నోరాముఁడా! యిచ్ఛాధీనమగు రూపముగలవియును, మహాబలముగలవియును, మిగులయతిశయించియున్నవియునగు నీయస్త్రములనెల్ల శీఘ్రముగ గ్రహింపుమనిచెప్పి మునివరుండగువిశ్వామిత్రుఁడు పరిశుద్ధుఁడై ప్రాఙ్ముఖముగానిలిచి శ్రేష్ఠములగు నాయస్త్రములనన్నిటిని రామునకుపదేశించె. దేవతలకుఁగూడఁదెలిసికొననశక్యములగు నస్త్రములనెల్లఁదెలియఁజెప్పె.

—* రామునకస్త్రదేవతలకు సెలవొసఁగుట. *—

అమ్మహాస్త్రములన్నియు రామునకువశముగుటకై ధీమంతుఁడగు విశ్వామిత్రుఁడుజపమొనర్చె. తత్క్షణమునయాస్త్రములన్నియు రామునిస్వాధీనములయ్యె. మఱియు నాయస్త్ర దేవతలందఱు మిగులసంతసించి ప్రాంజలులై రామునితోనిట్లనిరి.

ఓరఘువంశోద్భవుఁడగురాముఁడా! మిగులనతిశయులగు మేము నీకుఁగింకరులమైతిమని చెప్పినకకుత్స్థకులతిలకుండగురాముఁడు వారివినయముల నంగీకరించి హస్తముచేస్పృశించి యస్త్రదేవతలారా! నామనస్సునను సరించి నడుచుచుండురు గాకయని యాజ్ఞాపించి మహాతేజుండగు రాముఁడు సంతుష్టహృదయుఁడై మహామునియగు విశ్వామిత్రునికినమస్కరించి ప్రయాణసన్నాహుండయ్యె. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలియిరువదియేడవసర్గముగిసెను.

—* { విశ్వామిత్రుడుపసంహారమంత్రముల తెలియంజేయుట. }

ఇట్లురాముఁడస్త్రములను స్వీకరించి సంతోషమునొందిపరిశుద్ధుఁడై ప్రయాణముకాఁబోవుచు విశ్వామిత్రునితో నిట్లనియె. భగవంతుఁడవును, మునిశ్రేష్ఠుఁడవునగు నోవిశ్వామిత్రుఁడా! నీవలనసమస్తాస్త్రములను గ్రహించితిని. కావున దేవతలుఁగూడ నన్నెదిరింపలేరు. ఐనను,అస్త్రములప్రయోగమునుమాత్ర ముపదేశించితివి. ఇప్పుడుపసంహారమునుఁగూడ నుపదేశింపవలయుననిన ధృతిమంతుఁడును,సువ్రతుండును, పరిశుద్ధుండును, పూజ్యుఁడునునగు విశ్వామిత్రుఁ డుపసంహార మంత్రముల నుపదేశింపఁదొడంగె.

ఓరాముఁడా! సత్యవంతము, సత్యకీర్తి, ధృష్టము, రభసము, ప్రసిద్ధమైనప్రతిహారతరము, పరాఙ్ముఖము,అవాఙ్ముఖము, లక్షాక్షము,విషమము, దృఢనాభము, సునాభము,దశాక్షము, శతవక్త్రము,దశశీర్షము, శతోదరము, పద్మనాభము, మహానాభము, దుందునాభము, సునాభకము,జ్యోతిషము, కృశనము,నైరాశ్యము, రెండువిధములైనవిమలములు, యోగంధరము, హారిద్రము, దైత్యము, ప్రశమనము,సార్చిరాళి, ధృతి,మాలి, వృత్తిమంతము, రుచిరము, పితృసౌమనసము, విధూతమకరములు, కరవీరకము, ధనము, ధాన్యము, కామరూపము, కామరుచి, మోహము,ఆవరణము, జృంభకము,సర్వనాభము, సంతానము, వరణము, లనునీకామరూపులై ప్రకాశించెడి భృశాశ్వనిపుత్రులైన నీయుపసంహారములనిచ్చెద గ్రహింపుము. నీకు మంగళమగుఁగాక. రాముఁడా! ప్రయోగోపసంహారములకునీవేతగినపాత్ర భూతుఁడవైతివనిన రాముఁడు సంతోషహృదయుఁడై "మంచిదే" యనిచెప్పి యాయుపసంహార మంత్రముల బ్రతిగ్రహించె.

—* { రాముడుపసంహార మంత్రదేవతలకు సెలవొసంగుట. } *—

అంతదివ్యదేదీప్యమానదేహములుగలిగి మూర్తిమంతములై సుఖప్రదాతలైయుండు నామంత్రాధిష్ఠానదేతలందఱును, గొందఱగ్నిహోత్రసదృశులును, గొందఱుపొగవంటివారును, గొందఱుచంద్రసూర్యసమానులును, గొం

దఱునక్రమములైన చేమోడ్పులు గలవారునునై వచ్చి ప్రాంజలులై నరశార్దూలుండవగు రాముఁడా! ఇదిగో మేమున్నారము. నీ కేమి సేయవలయును. ఆజ్ఞాపింపుమని మధురముగఁ బలికిన రాముఁడు వారలం జూచి యోమంత్రాధిష్ఠానదేవతలారా! కార్యముగలిగిన కాలములయందు వచ్చి నామనసు ననుసరించి నాకు సహాయ్యము సేయుఁడు. ఇప్పుడు మీరలు యథేష్టముగఁ బోవచ్చునసిన నామంత్రాధిష్ఠానదేవతలు రామునకు ప్రదక్షిణ మొనర్చి వీడ్కొని వచ్చినరీతిగనే పోయిరి.

అంతరాముఁ డుపసంహార మంత్రములనెల్ల నెఱింగి మార్గమునఁ బోవుచు మహామునియగు విశ్వామిత్రునిఁ జూచి మధురవాక్యములతో నిట్లనియె. ఓపరంతప! ఇచ్చటపర్వతమునకు గొంచముదూరమునందు మేఘమువలె దట్టమైనదియును చూడఁదగినదియును, జింకలచే వ్యాపింపఁ బడినదియును, మనోహరమగు నానావిధధ్వనులుగల పక్షులచే నలంకృతమైనదియును, నగువృక్షములసమూహము ప్రకాశించుచున్నది. ఈవన మెవ్వరిది. నాకువినఁగుతూహలమగుచున్నది. ఓవిశ్వామిత్రమహర్షీ! గగుర్పాటునుగలిగించెడి భయంకరమగు నాతాటకావనమును దాటితిమిగదా? ఈప్రదేశము మిగులసుఖమును గలుగఁజేయుచున్నది. కావున ఋష్యాశ్రమముగ నుండవచ్చునని తెలిసికొంటిని.

ఈయాశ్రమమెవ్వరిదో దానినిసవిస్తరముగ నాకు దెలియంజెప్పవలయు. ఓతాపసేంద్రా! నీవుసేయునట్టి యజ్ఞమును విఘ్నముసేసెడి దురాత్ములును, పాపిష్ఠులును, బ్రహ్మఘాతకులును, దుర్జనతగలవారునువగు మారీచాది రాక్షసులే స్థలమున కేతెంచుదురు. నీవుచేసెడి యజ్ఞమునకంతరాయములు గలుగకుండునట్లు రక్షింపుచు మారీచాది రాక్షసులనే నెచ్చట సంహరింపవలయు. అట్టి యాశ్రమం బెచ్చటనున్నది. దీనినంతయు వినగోరెదను. తెలియఁజెప్పుము. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యిరువదెనిమిదవ సర్గముగిసెను.

వామనమూర్తి యాశ్రమమగు సిద్ధాశ్రమ వృత్తాంతము.

ఇట్లు రాముఁ డడిగిన మహాతేజుఁడగు విశ్వామిత్రుఁడప్రమేయమగు నావనవృత్తాంతమును వివరముగఁ జెప్పదలఁచి యిట్లనియె.

మహాబాహుఁడవగు రాముఁడా! యీప్రదేశమునందు దేవశ్రేష్ఠుండును సర్వలోకాధిపుండును మహాతపస్సంపన్నుఁడును నగు విష్ణుదేవుఁ డనేకనూర్ల యుగములు తపస్సును, యోగమును సిద్ధించుటకొఱకు నివసించెను. ఇది సాక్షాన్నారాయణ స్వరూపుఁడగు వామనుఁడు తనపూర్వాశ్రమమగు నారాయణ స్వరూపుఁడుగా నుండినపుడును పిదపనుఁగూడ వసించినయాశ్రమము. ఇచట మహాతపస్సంపన్నుఁడగు కాశ్యపుఁడు సిద్ధినిబొందె. కావున నిది సిద్ధాశ్రమమనఁబడును. అట్లు విష్ణుదేవుండిచట తపస్సు సేయుచుండు కాలమున విరోచనుని పుత్రుఁడైన బలిచక్రవర్తి మరుద్గణ సహితులును, నింద్రసహితులునగు దేవతలసమూహమును జయించి మూడులోకములయందును ప్రసిద్ధమైనయా దేవతల రాజ్యమగు స్వర్గలోకమును పరిపాలించెను.

ఇట్లు స్వర్గరాజ్యమేలుచున్న బలిచక్రవర్తి యాగము సేయవలయునని ప్రయత్నించి యాగము సేయుచుండగ దేవతలందఱును గుంపుగూడి యగ్నిదేవుని ముందిడుకొని యీయాశ్రమమునందుఁ దపస్సు సేయుచున్న విష్ణుమూర్తికడ కేతెంచి యిట్లనిరి. ఓవిష్ణుదేవుఁడా! విరోచనుని పుత్రుఁడగు బలిచక్రవర్తి యత్యుత్తమమైన యాగమును జేయుచున్నాఁడు. ఆయాగము పూర్తియగుటకు పూర్వమే మనకార్యమును నెరవేర్చుకొనవలయు. బలిచక్రవర్తి యాగము సేయుచుండు కాలమున నెక్కడెక్కడికో బోయి శ్రమపడువారల నెవ్వరింగానము. ఏకాలమునం దెవ్వరువచ్చి యేసి యెంతమట్టుకు తన్నుయాచించుచున్నారో యాక్షణమున దానినంతయు నాయాచకులకు బలిచక్రవర్తి యిచ్చుచున్నాఁడు ఓవిష్ణుదేవుఁడా! పూర్వమెంతెంత కష్టములనుండియో మమ్ములఁ గాపాడితివి. అటులనే యిప్పుడును దేవతలహితార్థము మాయాయోగము ననుసరించి వామనావతారంబెత్తి శుభంబు గలుగునటులఁ గాపాడవలయునని మొఱపెట్టుకొని తమతమస్థానముల కేగిరి.

ఓరాముఁడా! అకాలమున మహాప్రభావముఁగలవాఁడును, అగ్నిసమానకాంతి గలవాఁడునునగు కశ్యపమహర్షి యదితితోఁగూడ దేదీప్యమానముగ వెలుగుచు వెయ్యి దివ్యసంవత్సరములు తపముసల్పినకోరిన వరమొసగుటకు విష్ణుమూర్తి ప్రత్యక్షమయ్యె. అంతప్రత్యక్షమైన మధుసూదనుఁ గశ్యపుఁడు భార్యతోఁగూడ నిట్లని స్తుతించె. ఓవిష్ణుమూర్తీ నీవు తపోయుండవు. తపోరాశివి. జ్ఞానస్వరూపుఁడవు. తపస్స్వభావము గాఁగలవాఁడవు. పురుషోత్తముఁడవు. అట్టినిన్ను సమ్యగనుష్ఠితమగు తపోమాహాత్మ్యముచే జూచుచున్నాను. సమస్తప్రపంచమునకు ప్రభువగు విష్ణుమూర్తీ! యీజగత్తంతయు నీశరీరమునందు గనుపడుచున్నది. నీవు పుట్టుకలేనివాఁడవు. నీవిట్టివాఁడవని తెలిసికొనుటమిగులనశక్యము. కావున నిన్ను శరణుజొచ్చితినని ప్రార్థించిన

నిష్కల్మషుఁడగు కాశ్యపునితో విష్ణుమూర్తి యిట్లనియె.

ఓకాశ్యపుఁడా! నీకుమంగళమగుగాక నీకువలయు వరముఁగోరుము. నేనిచ్చెడి వరమునకు నీవర్హుఁడవు. అనిన నవ్వాక్యములవిని మరీచిపుత్రుఁడైనకాశ్యపుఁడు విష్ణుదేవునితోనిట్లనియె. సువ్రతుండవును, వరదుఁడవునునగునోవిష్ణుమూర్తీ! నిన్నుయాచించుచుండెడునదితికిని, దేవతలకును, నాకును వరమునివ్వవలయు. భగవంతుఁడా! అదితికిని నాకునునీవు పుత్రుఁడుగాఁబుట్టి యింద్రునకుదమ్ముఁడవగుము. శోకార్తులగు దేవతలకుమాత్రము సాహాయ్యమును సేయవలయు. నీయనుగ్రహమువలన నీచేయుత్రవతకార్యము సఫలమునుబొంది యీయాశ్రమము సిద్ధాశ్రమమనిప్రసిద్ధివహించుగాక- ఇచ్చోటనుండియవతారంబొనర్చుటకు వెళ్ళుమని ప్రార్థించెను. పిదపమహాతేజుండగువిష్ణుమూర్తియు దితిదేవియందు పొట్టియాకారముగల యవతారమునొంది విరోచనునిపుత్రుఁడైన బలిచక్రవర్తియొద్దకుఁబోయె.

ఇట్లుపోయి వామనుండును సకల భూతాంతర్యామియునగువిష్ణుమూర్తి సర్వభూతములకు హితముసేయఁగోరి యాబలిచక్రవర్తిని మూడడుగులభూమినియాచించి పుచ్చుకొని తనరెండడుగులచేతనే మూఁడులోకముల నాక్రమించి మూఁడవయడుగునకు బలిచక్రవర్తినిబంధించి ముల్లోకములను మరల దేవేంద్రునకిచ్చె. ఇట్లుమహాప్రభావముఁగలవిష్ణుమూర్తి మరలమూఁడులోకములను నింద్రుని స్వాధీనముగానుండునట్లొనర్చె. సంసారశ్రమమునుబోగొట్టునట్టి యీయాశ్రమమునందు పూర్వమువామనుఁడు నివసించె. నేనును మిగులభక్తిగలవాఁడనై వామనునియొక్క యీయాశ్రమమునందు వాసముచేయుచున్నాను.

పురుషశ్రేష్ఠుఁడవగు నోరాముఁడా! విఘ్నముల నొనర్చెడిరాక్షసులు యీయాశ్రమమునకువచ్చుచున్నారు. ఆ దుర్మార్గులగురాక్షసులను నియ్యాశ్రమమునందేనీవుసంహరింపవలయు.

—※ విశ్వామిత్రునియాశ్రమమగు సిద్ధాశ్రమమునం బ్రవేశించుట.

ఓరాముఁడా! ఇప్పుడుత్తమోత్తమమగు నీసిద్ధాశ్రమమును బ్రవేశించుచున్నారము. నాయనా! యీయాశ్రమము నాకెట్లుస్వంతమో యట్లనేనీకునుసొంతమేను. (అనగాఁ నేనిందుతపస్సుసేయుచుండుటంబట్టి నాకుసొంతమైనది. నీవును రాముఁడుగాజనించుటకు పూర్వమువామనావతారమునందును, అంతకుమునుపును నిందుతపస్సుసేయుచుండినందున నీకునుసొంతమేనను రహస్యాభిప్రాయము గలిగించెను) ఇట్లుమహామునియగు విశ్వామిత్రుండు చెప్పి రామలక్ష్మణులతోడ నాశ్రమమునబ్రవేశించి "మంచునువదలి పునర్వసునక్షత్ర సమన్వితుఁడగుచంద్రునివలె" బ్రకాశించె.

ఆసిద్ధాశ్రమమునందువాసముసేయుచున్న మునులందఱును విశ్వామిత్రునిఁజూచియతనియందలిభక్త్యతిశయముచే మిగులవేగముతో బరుగెత్తిపరుగెత్తివచ్చియర్ఘ్యపాద్యాదులచేఁబూజించిరి. ఆమునులు బుద్ధిమంతుఁడగు విశ్వామిత్రునికొఱకు యథాయోగ్యముగబూజనుజేసి యటులనే రాజపుత్రులగురామలక్ష్మణులకు నాతిథ్యముగావించిరి.

—※ విశ్వామిత్రమహర్షి క్రతుదీక్షవహించుట. ※—

పిదప శత్రుసంహారకులును, రాజపుత్రులునగు రామలక్ష్మణులుముహూర్తకాలమువిశ్రాంతిగావించికొని ప్రాంజలులై మునిశార్దూలుఁడగు విశ్వామిత్రునితోనిట్లనిరి. మునిశ్రేష్ఠుఁడవగువిశ్వామిత్రుఁడా! యిప్పుడేక్రతుదీక్షనువహింపుము. నీకుమంగళమగుఁగాక. ఈసిద్ధాశ్రమముసార్థకమగు పేరుగల్గుటచే సిద్ధిగలదిగయగుగాక. నీయొక్కమాటసత్యముగఁగాకయనిచెప్పిరి. ఇట్లుచెప్పిన రామలక్ష్మణులవాక్యములనువిని మహాప్రభావముగలవాఁడును,నియతేంద్రియుఁడును, మహాత్ముఁడును,నగువిశ్వామిత్రమహర్షి నియమముతోదీక్షనువహించె.

పిదప బాలకులగురామలక్ష్మణులును నారాత్రియంతయుసుఖముగానుండిమిగులనెచ్చరికతో ప్రభాతకాలముననే నిదురమేల్కాంచి స్నానమొనర్చి పరిశుద్ధులై ప్రాతఃకాలసంధ్యావందనముజేసి నియమమునగాయత్రీజపమును గావించికొని కృతాగ్నిహోత్రుఁడై కూర్చుండియున్నవిశ్వామిత్రునకునమస్కరించిరి.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యిరువదితొమ్మిదవ సర్గముముగిసెను.

—※ మునులు రామలక్ష్మణులతో రాక్షసులతోడ యుద్ధమొనర్పదగిన కాలము నెఱింగించుట. ※—

ఇటునమస్కరించి దేశకాలముల నెఱింగి మాటలాడందెలిసినవారును, శత్రువులనణఁగద్రొక్కంజాలినవారునునగు నారాజపుత్రులయిన రామలక్ష్మణులుతగినదేశమునందును తగినకాలమునందును సరిగ్గానే సమయమునుజూచి వి[illegible]మిత్రునితోనిట్లనిరి. మహాప్రభావముగలవిశ్వామిత్రుఁడా! ఏకాలమునందా నిశాచరులగుమారీచసుబాహులను సంహరింపవలయును? ఆ సమయము దాటిపోకుండ [illegible] మాకుచెప్పుము [illegible]గోరెదమనిరి. అంతట [illegible] మునులందఱు [illegible] సంతోషమునొంది [illegible]

యవలయునను గోర్కెచే ద్వరపడుచున్న రాజపుత్రులగు రామలక్ష్మణులతో నిట్లనిరి. ఓ రామలక్ష్మణులారా! మీర లిప్పుడు మొదలుకొని యాఱు రాత్రులు రక్షింపవలయును. ఈ విశ్వామిత్రమహాముని దీక్షవహించి మౌనమునొందియున్నాఁడు. కనుక నతండు మాటలాడడనినుడివిరి.

రామలక్ష్మణులు ధనుర్ధరులై యాగశాలను సంరక్షించుట.

అంతఁ గీర్తివంతులగు రామలక్ష్మణులు మునులు చెప్పిన మాటలను విని యాఱు దివారాత్రములు నిద్రలేనివారలై తపోవనమును రక్షింపుచుండిరి. పరాక్రమశాలులగు రామలక్ష్మణులు శ్రేష్ఠమయిన ధనుస్సును ధరియించి సన్నద్ధులై మునిశ్రేష్ఠుఁడగు విశ్వామిత్రుని రక్షించిరి. ఇట్లు ఐదుదినములును గడచి యాఱవదినము రాఁగానే రాముఁడు లక్ష్మణుం జూచి తమ్ముఁడా! నేఁడు కడపటిదినమగుటవలన నీవు మిగుల నెచ్చరికతో సన్నద్ధుఁడవై యుండుమనియె. యుద్ధము సేయనిచ్చగల రాముఁ డిట్లు పలుకుచుండఁగ ఋత్విజులతోను బురోహితులతోనుం గూడిన యాగవేదిక జ్వలించె. దర్భలును, పానపాత్రలును, సోమపాత్రలును, సమిధలును, పుష్పసమూహములును గల్గి, ఋత్విజులతోను విశ్వామిత్రునితోడను గూడిన నాయాగవేదిక ప్రజ్వలించె. (యాగవేదిక జ్వలించుటయనునది యుత్పాతములలో జేరినదగుటవలన రాక్షసులు వత్తురను నభిప్రాయమును సూచించినదని యెఱుంగునది.)

మారీచ సుబాహులు యజ్ఞవిఘ్నము సేయుటకేతెంచుట.

అంతట నయ్యాగము మంత్రవత్తుగను యథాశాస్త్రముగను జరుగుచుండఁగ నాకాశమునందు భయంకరమగు గొప్ప ధ్వనియొకటి పుట్టె. వర్షాకాలమునందలి మేఘమాకాశమునంతయు నావరించి యంధకారబంధురమగునట్లు గావించురీతి మారీచ సుబాహువులను రాక్షసులాకాశమంతయు గ్రమ్మి మాయనొనర్చుచు బరుగెత్తివచ్చిరి. ఆ మారీచ సుబాహువులును వారియనుచరులగు రాక్షసులును మహాభయంకరులై వచ్చి నెత్తురుప్రవాహమును వర్షించిరి. ఆయాగవేదిక రక్తప్రవాహమున మునిఁగి జ్వలింపుచుండె. అంత రాముఁడు నతిశీఘ్రముగ నెదురుగా బరుగెత్తివచ్చి యాకాశమునం దా రాక్షసులను జూచె. రాజీవలోచనుఁడగు రాముఁడు యతిత్వరితముగఁ బరుగెత్తివచ్చుచున్న యా మారీచసుబాహువులనుఁ జూచి లక్ష్మణునితో నిట్లనియె.

రామలక్ష్మణ మారీచ సుబాహుల యుద్ధము.

లక్ష్మణా! దురాచారులును, మాంసాహారులును, నగు రాక్షసులను "వాయువుచే నెగరఁగొట్టఁబడు మేఘములవలె" మానవాస్త్రప్రయోగముచే నెగిరిపోవునట్టులం జేసెద చూడుమని చెప్పి రాముఁడు మిగుల కోపావేశమునొంది మహాప్రభావముగలదియును, పరమభాస్వరమును నగు మానవాస్త్రమును మారీచుని ఱొమ్మునందు దగులునట్టుల వేసె. ఆ మారీచుఁడు మిగుల నెచ్చరిక గలవాఁడైనను పరమమగు నా మానవాస్త్రముచే సముద్రపుగట్టువకావల నీటియందు నూఱామడదూరమున దోయఁబడియె. అంత రాముఁడు మానవాస్త్రముయొక్క బలముచే గొట్టఁబడి సముద్రపునీటియందఁబడి జ్ఞప్తితప్పి గిరగిర మసి తిరుగుడుపడుచున్న మారీచుని జూచి లక్ష్మణునితో నిట్లనియె. లక్ష్మణా! ధర్మసహితమును తీక్ష్ణమును నగు నీమానవాస్త్రమును చూడుము. ఈ మారీచుని తెలివిదప్పించి తీసికొనిపోవుచున్నదని మఱియు నిట్లనియె.

సుబాహుమృతుండగుట.

అయినను మారీచునకు ప్రాణహానిమాత్రము గలుగదయ్యె. మఱియు నిర్దయులును, దురాచారులును, పాపకర్మరతులును, యాగవిఘ్నకారులును, రక్తపానము జేయువారలునునగు నీరాక్షసులం గూడ సంహరించెదనని లక్ష్మణునితో జెప్పి యగ్నిదేవతాకమగు నాగ్నేయాస్త్రము నెత్తి చూచువారలకత్యంతాశ్చర్యము గల్గునట్లు సుబాహుని ఱొమ్మునఁ జూచి వేసెను. ఆ సుబాహుఁ డయ్యాగ్నేయాస్త్రముచే గొట్టఁబడి నేలంబడి విలవిలతన్నుకొని ప్రాణములు విడిచె. మహాయశస్సంపన్నుఁడును, పరమోదారుఁడును నగు రాముఁడు ఋషులకు సంతోషమును గలిగించుచు మిగిలిన రాక్షసులను వాయవ్యాస్త్రముచే మృతినొందించె. ఇట్లు రాముఁ డయ్యాశ్రమమునందు యజ్ఞవిఘ్నకారులగు రాక్షసుల నెల్ల సంహరించి ఋషులచే "పూర్వము యసురులజయంబున నింద్రుఁడు సత్కరింపఁబడినమాడ్కి" పూజింపఁబడియె.

విశ్వామిత్రుని యాగము నిర్విఘ్నముగ నెరవేరుట.

మహామునియగు విశ్వామిత్రుఁడు యాగము ముగియగానే యుపద్రవములేని దిక్కుల నెల్లఁ జూచి రాముని తోనిట్లనియె. మహాబాహుఁడవును, మహాయశుఁడవును నగు రాముఁడా! నీచే నేఁ గృతార్థుఁడనైతిని. నీతండ్రి నిన్నుఁ బంపిన పనియును గావించితివి. ఈ సిద్ధాశ్రమము నీచే సార్థకమగు నామధేయము గలదిగఁ జేయఁబడియెననియె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి ముప్పదియవసర్గము ముగిసెను.

మునులు రామలక్ష్మణులతోడ మిథిలానగరంబున కేగుట.

అంతఁ బరాక్రమశాలులును, కృతకార్యధురంధరులును

సంతోషిత స్వాంతులునునగు రామలక్ష్మణులు సంతుష్ట హృదయములతో నారాత్రియంతయు నాయాశ్రమమునందునివసించిరి- మరుదినప్రభాతకాలమున నిదురమేల్కాంచిప్రాతఃకాలమున జేయవలసినకృత్యముల నెరవేర్చికొని యుద్ధులును ఋషులయొద్దకుబోయిరి- ఇట్లుపోయిమధుర భాషిణులగు రామలక్ష్మణులు "అగ్నిహోత్రునివలె"ప్రకాశించుచున్న మునిశ్రేష్ఠుఁడగు విశ్వామిత్రునకు నమస్కరించి గంభీరమగువాక్యములతో మధురముగనిట్లనిరి.

మునిశార్దూలుండవగు విశ్వామిత్రుఁడా! కింకరులమగు మేమిదిగోవచ్చి యున్నారము- మేమేమిసేయవలయునో దానినియథేష్టముగ నాజ్ఞాపింపుడనిపలికిరి- రామలక్ష్మణులిట్లువచించిన మహర్షులందఱునువిని విశ్వామిత్రునిపురస్కరించుకొని రామునితోనిట్లనిరి- పురుషశ్రేష్ఠుఁడవగు రాముఁడా! మిథిలానగరమునకు ప్రభువగుజనకమహారాజు పరమ ధర్మిష్ఠంబగు యజ్ఞముసేయఁబోవుచున్నాఁడు- ఆయాగమునకు మేమందఱముఁ బోవుచున్నారము- కావుననీవును మాతోగూడరావలయును- అచ్చటనుండు అత్యద్భుతమగుధనూరత్నమును, సీతను,చూచుటకునీ వేతగినవాఁడవు.

ఈశ్వర ధనుర్మాహాత్మ్యము.

నరశ్రేష్ఠుఁడవగు రాముఁడా! అనిభయంకరమును, అప్రమేయబలమును, పరమభాస్వరమునునగు నావిల్లు పూర్వము యాగకాలమునందు సభలోదేవతలచే నివ్వఁబడెను- ఆవిల్లునెక్కుబెట్టుటకు దేవతలచేతను, గంధర్వుల చేతను,నసురులచేతను, రాక్షసులచేతను, గానేరరు-కావుననెంతప్రయాసనొందినను మనుష్యులచేగానేరరు. రాజవంశోద్భవులును మహాబలిష్ఠులునునగు రాజపుత్రులనేకులు యావింటివీర్యము నెఱుంగంగోరితుద గారోపించుటకే సమర్థులుకారైరి.

నరశార్దూలుఁడవగు రాముఁడా! ఆమిథిలానగరమునందుమహాత్ముఁడగు జనకమహారాజుయొక్క ధనుస్సునుఅత్యద్భుతదర్శనంబునునగు యాగమునుచూడఁగలవు. పూర్వముమిథిలాధిపతియగు దేవరాతుఁడను మహారాజు (దేవరాతుఁడునిమిచక్రవర్తికినారవవాఁడు) గొప్పయాగమువేసి దేవతలమెప్పించి యాదేవతలచే యాగఫలముగ మంచిమధ్యప్రదేశముగల ధనుస్సునుబొందె. ఆధనుస్సుజనకమహారాజుగృహమునందు నానావిధవాసన ద్రవ్యములచేతను, అగరుధూపములచేతను బూజింపంబడుచున్నది. మఱియు నాయుధపూజా మహోత్సవకాలములగు నవరాత్రాదుల యందుప్రధానముగ నర్చింపంబడు ధనువై యున్నది.

ఈప్రకారముగ మునిశ్రేష్ఠుఁడగు విశ్వామిత్రుఁడుసెప్పిఋషిసమూహముతోడను రామలక్ష్మణులతోడంగూడివనదేవతలంగూర్చి "మీకుమంగళమగుఁగాక" నేనుసిద్ధిఁ బొందితిని. కావున నీసిద్ధాశ్రమమును వదలి యుత్తరదిశయందలిగంగాతీరమునందుండు హిమవత్పర్వతప్రదేశమునకుఁబోవుచున్నాఁడను. అనివనదేవతలవీడ్కొని ప్రయాణంబయ్యె. మఱియునావిశ్వామిత్రుఁడనుత్తమమగుసిద్ధాశ్రమమునకుఁ బ్రదక్షిణముసేసి యుత్తరదిశంగూర్చి పోవుటకుపక్రమించె.

విశ్వామిత్రాదులుమిథిలానగరమునకుఁబోవుట

ఇట్లుత్తరదిక్కునకుఁగూర్చి పోవుచున్నమునివరుఁడగు విశ్వామిత్రునిబ్రహ్మవాదులగు మునులునూఱు బండ్లవఱకు వెంటఁబెట్టుకొనియనుసరించిరి. ఆసిద్ధాశ్రమమునందునివసించుచుండు మృగపక్షిసమూహములు మహాత్ముఁడును, మహామునియునగు విశ్వామిత్రుని వెంబడించెను అంతవిశ్వామిత్రుఁడుపక్షులను, మృగములనువీడ్కొని మఱలసిద్ధాశ్రమమునకు బోవునటుల మఱలించెను ఋషులునుబహుదూరము, పోయి సూర్యుండస్తమించుచుండగ సమాహితులై శోణనదముయొక్క గట్టుననివసించిరి. తేజోవంతులగునమ్మునులుస్నానముసేసి సూర్యుండస్తమించినపిదప అగ్నిహోత్రమునందు హోమముసేసి విశ్వామిత్రుని పురస్కరించుకొని కూర్చుండిరి.

రాముఁడును లక్ష్మణసహితుఁడై యామునులఁబూజించి నమస్కరించి ధీమంతుఁడగువిశ్వామిత్రుని ముందరగూర్చుండిరి. పిదపమహాతేజుండును పురుషశ్రేష్ఠుండును నగు రాముఁడు కౌతూహలసమన్వితుఁడై విశ్వామిత్రుని జూచి యిట్లనియె. భగవంతుఁడవగు విశ్వామిత్రుఁడా! సమృద్ధంబగువనముచే ప్రకాశించుచుండునీ దేశంబెయ్యది? నాకువినవలయుననిమిగుల కోరికగలిగియున్నది. నీకుమంగళమగు గాక. ఉన్నటుచెప్పవలయుననియె. అంతసువ్రతుండును, మహాతపుండును, నగువిశ్వామిత్రుండు రామునిచే ప్రేరేపింపఁబడి ఋషులమధ్యమున నాదేశవృత్తాంతము చెప్పఁజెప్ప-దొడంగె. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి ముప్పదియొకటవసర్గము సమాప్తము.

కుశాంబకుశనాభమహారాజులవృత్తాంతము.

మహాతపుండును, దృఢవ్రతుండును, ధర్మజ్ఞుండును,సజ్జనపూజాధురంధరుండును, శౌర్యాదులలోనధికుండును నగుకుశుఁడనుపేరుగల బ్రహ్మపుత్రుండొకడుండెను. ఆమహాత్ముఁడగుకుశుఁడు విదర్భదేశమహారాజపుత్రికను పెండ్లియాడె- ఆవనితామణికులీనయై భర్త్రాజ్ఞానువర్తినియై యుం

డె-ఇట్లుండగవారికి గుశాంబుఁడు, కుశనాభుఁడు, అధూర్తరజసుఁడు,వసువు, అనునలుగురుపుత్రులుజనించిరి. వారు నల్వురునుదండ్రితోసమానులును, గుణాధికులును,దీప్తిమంతులును,మహోత్సాహులును, ధర్మిష్ఠులును,సత్యవాదులుగనుండినందునఁ గుశుండుపుత్రులఁజూచి క్షత్రధర్మమగుప్రజాపరిపాలనేచ్ఛఁజేసినిట్లనియె.

ఓపుత్రులారా! మీరలుప్రజలఁబరిపాలింపుఁడు. పుష్కలముగుధర్మమును బొందగలరనెను. అంతనుహర్షియగుకుశునివాక్యము లాలకించిలోకసమ్మతులగు నానల్వురుపుత్రులును ప్రజాపాలనతత్పరులై రాజధానులుగఁ బట్టములనేర్పఱచుకొనిరి. మహాపరాక్రమవంతుఁడగు కుశాంబుఁడు మాత్రముకౌశాంబియనెడు నగరమును ముఖ్యపట్టణముగ జేసికొనియె. ధర్మస్వభావుఁడగుకుశనాభుఁడు మహోదయమనుపట్టణమును రాజధానిగఁ జేసికొనియె. ఓరాముఁడా! మహీపతియైనఅధూర్తరజసుఁడు పురవరమగుధర్మారణ్యమునురాజధానిగఁ జేసికొనియె. భూపతియైనవసువు మిగులనభివృద్ధిగల గిరివ్రజమనుపట్టణమును రాజధానిగఁ జేసికొనియె.

ఓరాముఁడా! ఇదిమహాత్ముఁడగు నావసుమహారాజుయొక్క-భూమి. ఈపర్వతశ్రేష్ఠములైదును నీభూమిజుట్టునుజుట్టుకొని ప్రకాశింపుచున్నవి. (అందువలననేగిరివ్రజమను పేరుగల్గె) ప్రసిద్ధమైననదియును, మనోహరమైననదియును,మంగళకరమైననదియునునగు శోణనదిమగధదేశమునఁబుట్టిప్రవహింపుచు నీపర్వతములనైదింటినడుమ బుష్పమాలికవలెఁ బ్రకాశింపుచున్నది ఓరాముఁడా! మగధదేశమునఁ బుట్టిననీశోణనది మహాత్ముండగు నావసుమహారాజు దేశములోనిది. ఇదితూర్పుదేశమునుండి పశ్చిమముగఁబ్రవహింపచున్నది ఈప్రాంత్యములనుండు భూములుమిక్కిలిఁ జక్క-గఫలించుచుండును- ఇందెప్పుడుజూచినను పైరులుపెండుగానిండియుండును.

—✽ కుశనాభుని నూర్గురుపుత్రికల వృత్తాంతము. ✽—

రఘునందనా! ధర్మాత్ముఁడును, రాజర్షియునునగు గుశనాభుండుమాత్రము ఘృతాచియనెడు అప్సరసయందుపరమసౌందర్యవతులగు నూర్గురుకొమార్తెలం గనెను. యౌవనవతులును, సౌందర్యవతులును, పుష్పసుగంధభూషణాలంకృతులును, నగునాకుశనాభుని నూర్గురుకొమార్తెలొకనాడుద్యానవనమునకుఁబోయి వర్షాకాలమునందలి మెఱుపులవలెఁ బ్రకాశింపుచు నానావిధములుగ బాటలంబాడుచునాడుచు వీణలవాయించుచుఁ బరమసంతోషంబు నొందియుండిరి.

మఱియుసుందరములగు సమస్తాంగములు గలవారును, భూలోకమునయెందును రూపమున తమతోసరిలేక మెలంగుచున్నవారును, నగునాకుశనాభునికుమార్తె లుద్యానవనభూమియందు మేఘమధ్యమునందలి నక్షత్రములవలె వె

—✽ కుశనాభునినూర్గురుకొమార్తెలను వాయుదేవుడు మోహించి శపించుట. ✽—

లుంగుచుండిరి. ఇట్లుండగసర్వాత్మకుండగు వాయుదేవుడు రూపవంతులును, యౌవనవంతులును, సమస్తగుణసంపన్నలునునగు కుశనాభునిపుత్రికలనుఁజూచి యిట్లనియె. ఓసుందరీమణులారా! మిమ్ములనందఱనుఁజూచి మోహమునొందితిని. మీరునాకుభార్యలుగానుండుఁడు. మనుష్యునియందలి యనురాగమునువదలుఁడు. (అనగాదేవతనైననన్నుఁగైకొనుఁడు) దీర్ఘాయుష్మంతులయ్యెదరు. మనుష్యులయౌవనము మిగులజంచలముగలది. దేవతనైననన్నుఁ బెండ్లియాడితిరేని శాశ్వతమగుయౌవనమునుబొంది దేవతాస్త్రీలుగాగలరనెను అంతనవ్వనితామణులు నూర్గురునునప్రతిహతకార్యనిర్వాహకుఁడగు నవ్వాయుదేవునివాక్యములనువిని పరిహసించి యిట్లనిరి.

దేవతోత్తముఁడవగు నోవాయుదేవుఁడా! నీవుసమస్తప్రాణులలోపల దిరుగుచుందువు మేమందఱముమీయొక్క-ప్రభావమును నెఱుంగుదుము. మమ్ములనెందుకునవమానించెదవు- మేమందఱముకుశనాభునిపుత్రికలము- నిన్నును,నీకుబ్రభువగునింద్రుని, మీమీయధికారస్థానంబులనుండి తొలగింపసామర్థ్యముఁగలవారము- అయినను శపియించితిమేని తపోఫలము దఱిగిపోవునని యూరకున్నాము- దుష్టబుద్ధిగలవాయుదేవుఁడా! మాతండ్రియగుకుశనాభుఁడు నికుమృత్యువుగాఁగాకుండెడిని. సత్యవంతుఁడగు మాతండ్రినియవమానింపకుము ధర్మప్రకారము మాతండ్రియనుమతింగైకొనిభర్తనువరించెదము- మాకుఁదండ్రియేప్రభువు- తండ్రియేపరమదైవము- కావునమాతండ్రి మమ్ములనెవ్వనికిచ్చునోయతండుమాకు భర్తకాగలఁడనియనిరి.

ఇట్టివచనములనువిని మహాత్ముండునుసమర్థుండునునగు నవ్వాయుదేవుఁడు పరమకోపనుండై వారిసమస్తావయవములయందుఁ బ్రవేశించివిఱిచెను - ఇట్లానూర్గురుకన్యకలు నువాయుదేవునిచే విఱువఁబడినవారై భూపతియగు కుశనాభునిగృహమునఁబ్రవేశించి తొట్రుపాటునుసిగ్గునుగలిగి కండ్లనీళ్ళుంగారగ దుఃఖింపుచునేలంబడిరి- అంతరాజగుకుశనాభుఁడు ప్రీతిగల్గించువారును, పరమశోభనలును,విఱువఁబడినవారును, దైన్యముగలవారునునగు పుత్రికలంజూచి చంచలమనస్కుఁడైయిట్లనియె- ఓకుమార్తెలారా! ఇదియే

డికి చెప్పడు? ఏడఁడుధర్మమునతిక్రమించెను. మీరలందఱు నేవని చేగుజ్జులుగాఁ జేయఁబడితిరి. మీ అందరునునన్నుఁజుట్టుకొని యొందుకుపలకరించరు. ఇట్లుగొంత సేపు కుశనాభుం డుదుఃఖించి మనస్సునుసమాధానపఱచెను.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి ముప్పది రెండవసర్గము సమాప్తము.

—* శపింపబడిననూర్గురుపుత్రికలు తండ్రియగు కుశనాభునితో విన్నవించుకొనుట. *—

ఇట్లు చెప్పినధీమంతుఁడగు కుశనాభునివచనములవినిసాష్టాంగముగఁ బాదములమీఁదంబడియిట్లనిరి. నరపాలుండవగునాయనా! సర్వాత్మకుండగువాయుదేవుఁడు మమ్ములదిరస్కరించెను. అశుభంబనియును, ధర్మాధర్మములనియును, యోచింపక మమ్ములబలాత్కారము సేయంబూనెను. అంత మేమందఱము నోవాయుదేవుఁడా! మేము తండ్రిగలవారము. మేము స్వతంత్రులముగాము. మాతండ్రినడుగుము. అతఁడు మమ్ములనీకిచ్చె నేని భార్యలమగుచున్నాము. అనిన నప్పాపానుసరణుండగు వాయుదేవుఁడు మామాటలచెవింబెట్టక నిట్లుగుజ్జలగునట్లు సేసెనని మొఱవెట్టిరి. అంతఁ బరమ ధార్మికుండును, మహాతేజుండును, ప్రభువునునగు కుశనాభుఁ డుత్తములగునూర్గురు కన్యకలనుఁజూచి యిట్లనియె.

›* కుశనాభుడుపుత్రికలనూరడించుట. *‹

పుత్రికలారా! ఓర్పుగలవారు, తమకితరులు అపకారము జేసినపుడు క్షమించుటయేగొప్పకార్యము. ఇప్పుడు మీచేనొనర్పఁబడిన కార్యము మిగులశ్లాఘింపఁదగినదియ. మీరలుపరస్పరము నైకమత్యముగలిగి నావంశమునుగూడరక్షించితిరి. "శ్లో॥ అలంకారోహినారీణాంక్షమాతుపురుషస్య వా" ఓర్పుస్త్రీలకైనను పురుషులకైనను భూషణమువంటిది. క్షమించుటయనునది కలుగుటసాధారణముగఁ గష్టసాధ్యము. అట్టియోర్పురూపైశ్వర్యాదిసంపన్నులగు దేవతలపరాధమొనర్చినపుడు వారియందుకలుగుట మిగులఁగష్టము. మీనూర్వురకును భేదములేక నేకరీతిగఁగలుగుట విశేషదుర్లభము. అట్టియోర్పు మీకుజనించె.

"శ్లో॥ క్షమాదానంక్షమాయజ్ఞఃక్షమాసత్యంహిపుత్రికాః। క్షమాయశఃక్షమాధర్మఃక్షమయావిష్ఠితంజగత్" పుత్రికలారా! దానమువలనను, యజ్ఞమువలనను, సత్యమువలనను, కీర్తివలనను, ధర్మమువలనను గలిగెడిఫలములుక్షమవలనంగలుగును. కావున నీజగత్తంతయునోర్పువలననే యున్నదనిచెప్పె. ఓరాముఁడా! ఇట్లుపలికి గూతుండ్రనువదలి త్రిదశవిక్రముండును, మంత్రజ్ఞుండును నగు గుశనాభుఁడు కన్యాదానముశేయంగోరి యీకన్యకలనేదేశమున నెప్పుడెవ్వనికివ్వవచ్చునని మంత్రులతో నాలోచించె.

చూళియనుమహాముని సోమదయనుగంధర్వస్త్రీకి బ్రహ్మదత్తుడనుపుత్రునియిచ్చుట.

అట్టియెడ మహాతపుండును, నస్ఖలితవీర్యుండును, శుభాచార సంపన్నుఁడునునగు చూళియనుమహర్షి వేదచోదితమగుతపముఁగావించుచుండె. ఓరాముఁడా! నీకుమంగళమగుగాక. ఇట్లు చూళియనుమహర్షి తపముసలుపుచుండఁగనూర్మిళపుత్రికయగు సోమదయనుగంధర్వస్త్రీ చూళిమునియొద్దకువచ్చి యతనిసేవింపుచుండె. ధార్మికురాలగు నాసోమద చూళిమునికి నమస్కరించి యెల్లప్పుడు నతనికిశుశ్రూషసేయుటయే ముఖ్యమైనపనిగాఁ గలిగియుండె. అంతఁగొంత కాలమునకు చూళిమునిసంతోషమునొందె.

ఓరాముఁడా! అట్లుసంతసించి సోమదంజూచియువతీరత్నమా? నేనుకాలయోగముచే సంతుష్టుండనైతిని. నీకు మంగళమగుఁగాక- నీకిష్టమగుగార్యము నేనేమిసేయవలయును- వచింపుమనియె. అంతనాగంధర్వస్త్రీయగుసోమద చూళిమహామునిసంతుష్టుండైయున్నవాఁడనియెఱింగి ప్రీతియుక్తురాలై మధురస్వరముతో వాక్యకోవిదుండగునమ్మునికిట్లనియె. ధర్మిష్ఠుఁడవగు చూళిమహామునీ! నీవుబ్రహ్మవర్చస్సుచే బ్రకాశింపుచునధికుండైయున్నవాఁడవు- మఱియు సృష్టికర్తయగుబ్రహ్మదేవునితో సమానుఁడవు. విశేషతపస్సంపన్నుఁడవు కావున నాకుబ్రాహ్మణశక్తియుక్తుండగుపుత్రునివ్వవలయు- నేనుభర్తలేనిదానను- నీకుమంగళమొదవుగాక- నేనెవ్వనికిని భార్యనైయుండలేదు- నిన్నుశరణుజొచ్చితిని. నాకుఁదపోమహిమచేఁ బుత్రునియిచ్చుటకు నీవసమర్థుండవనియె. అంతనాబ్రహ్మర్షి యగు చూళిప్రసన్నుఁడై తనమనస్సునపుట్టిన శ్రేష్ఠుండగు బ్రహ్మదత్తుఁడను (బ్రాహ్మణునిచేనివ్వఁబడుటవలన బ్రహ్మదత్తుడనఁబడియె) పుత్రునినిచ్చె.

—* కుశనాభుండు తననూర్వురుపుత్రికలను బ్రహ్మదత్తునకిచ్చి వివాహముసేయుట

ఇదియిట్లుండఁగ గుశనాభుండు తనపుత్రికలనెవ్వనికిచ్చి వివాహముసేయవచ్చునని యాలోచించుచుండునెడనాసోమిదపుత్రుఁడయిన బ్రహ్మదత్తమహారాజు మహదైశ్వర్యసంపన్నుఁడై కాంపిల్యమనుపట్టణమును "స్వర్గమునందలిదేవేంద్రునివలె" నేలుచుండె. రాముఁడా! అట్టి బ్రహ్మదత్తునకు పరమధార్మికుఁడగు నాకుశనాభమహారాజు తననూర్వురుకూతుండ్రనిచ్చి వివాహముసేయనిశ్చయించె.

ఇట్లునిశ్చయించి మహాతేజుండును, మహీపతియునగు నాకుశనాభమహారాజు బ్రహ్మదత్తునిపిలిచి సంతోషితాంతఃకరణుండై నూర్వురుకొమార్తెలనునొసంగె. ఓరాముఁడా! దేవేంద్రసమానుండును, మహీపాలుండునునగు బ్రహ్మదత్తుఁడు వరుసనతిక్రమింపక నాకన్యలనందఱపరిణయముసేసికొనియె. అంతనాబ్రహ్మదత్తుఁడు తనహస్తముచే నూర్వురుకన్యలస్పృశించినతోడనే నాకన్యకలు కుబ్జత్వమునువదలి బాధారహితులును, తేజోవంతులునునై ప్రకాశించిరి. కుశనాభుండును వాయుబాధావిముక్తులయిన పుత్రికలంజూచి మహదానందభరితుఁడై మాటిమాటికిసంతోషమునొందుచుండె.

పిదపభూపతియగు గుశనాభుఁడు వివాహమైనతోడనే బ్రహ్మదత్తమహారాజును నతనిభార్యలనూర్వురను ఋత్విజులను గాంపిల్యనగరమునకుఁబంపె. అట్టియెడ గంధర్వస్త్రీయగుసోమిద మిగులసంతసించి కన్యకలనుస్పృశించి కుశనాభునిగొనియాడి తనపుత్రునకుఁ దగినభార్యలు గలిగినందుకైయభినందించుచుండె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి ముప్పదిమూడవసర్గముముగిసెను.

—*కుశనాభుఁడుపుత్రునికొఱకుపుత్రకామేష్టిసేయుట.*—

రాముఁడా! ఇట్లుబ్రహ్మదత్తుఁడు వివాహముసేసికొని తనపట్టణమునకుబోయినపిదప కుశనాభుఁడు తనకుపుత్రులులేనందున పుత్రునిబడయుటకొఱకు పుత్రునినొసంగెడి పుత్రకామేష్టిఁజేసె. పుత్రకామేష్టిజరుగుచుండగ నప్పుడు పరమోదారుండును బ్రహ్మదేవునిసుతుండునునగు కుశనాభునితండ్రియైనకుశుఁడువిచ్చేసి ధరణీపతియగుకుశనాభునితోనిట్లనియె. పుత్రుఁడా! మిగులధార్మికుండును, నీతోసమానుఁడును, గాధియనుపేరునుగలసుతుఁడునీకుద్భవిల్లును. ఆకొమారునిచే బ్రపంచమునందు శాశ్వతమును, స్థిరమునునగుకీర్తినినీవుపొందగలవు. అనియిట్లుకుశనాభమహారాజుతోఁజెప్పి కుశుఁడుతత్క్షణమున నాకాశమార్గమునుబొంది బ్రహ్మలోకమునకుఁబోయె.

* విశ్వామిత్రమహర్షివృత్తాంతము.

అంతఁగొన్నిదినములుఁగడచినపిదప ధీమంతుఁడగుకుశనాభునకు పరమధర్మిష్ఠుఁడగు గాధియనుపుత్రుఁడుపుట్టె. రాముఁడా! అట్టిపరమధార్మికుఁడగుగాధికి నేనుపుట్టితిని. నేను కుశునివంశమునందుపుట్టుటచే గౌశికుండనుపేరుగలవాఁడనైతిని. రాఘవా! సువ్రతయగు సత్యవతియనుపేరుగలజ్యేష్ఠసహోదరినాకుగలదు. ఆవనితారత్నముఋచీకుఁడనుమునికీనివ్వఁబడెను. ఆసత్యవతిభర్తనుసేవించుచుసశరీరముగస్వర్గమునుబొందె. అట్లుస్వర్గమునుబొందిమిగులనుత్కృష్టంబయినకౌశికియనుమహానదిగనయ్యె. నాసహోదరి లోకులకిహలోకపరలోక సుఖములుసిద్ధించుటకొఱకు శ్రేష్ఠమయినదిగను పరిశుద్ధమైనజలముగలదిగను, మనోహరమైనదిగను, నై హిమవత్పర్వతమునుఆశ్రయించె.

రఘునందనా! నేనును నాభగినియగుకౌశికీనదియందు నిరంతరస్నేహయుక్తుఁడనై సుఖముగహిమవత్పర్వతపార్శ్వమునందు వాసముసేయుచున్నాను. ఆసత్యవతిపరిశుద్ధమైనదిగను, సత్యధర్మప్రతిష్ఠితగను, పతివ్రతగను, పూజ్యురాలుగను, కౌశిక్యాభిధానముగలదిగను, నదులలో శ్రేష్ఠురాలుగనునున్నయది. రాముఁడా! నేనుయాగముసేయవలయుననునియమమువలన నాకౌశికీతీరమునువదలివచ్చి సిద్ధాశ్రమమునుబొంది నీపరాక్రమముచేసిద్ధినొందినవాఁడనయితిని. మహాబాహుండవగు నోరాముఁడా! నీవునన్నుదేనిఁజెప్పవలయుననియడిగితివో, అట్టినాయొక్కయు నావంశముయొక్కయు, నీదేశముయొక్కయు, నుత్పత్తినిసవిస్తరముగఁజెప్పితిని.

* రాత్రికాలవర్ణనము. *

రాముఁడా! యిట్టికథలనునేనుజెప్పుచుండినందుననిప్పుడర్ధరాత్రిఁగడచె. నింక నిదురఁబొమ్ము. నీకు మంగళమగుఁగాక. మాకు మార్గమునందు విఘ్నము గలుగకుండుగాక. రఘునందనా! సమస్తవృక్షములుగదలకుండనున్నవి. మృగపక్షులు సంచరించుటవదలి నిదురించినవి. దిక్కులన్నియుఁజీకటిచేవ్యాపింపఁబడినవి. సంధ్యాకాలము మెల్లగాగడిచినది. ఆకాశము సాధారణనక్షత్రములచేతను, అశ్విన్యాదినక్షత్రములచేతను, నిబిడీకృతమైయుండుటచేజ్యోతిర్మంతములగు నేత్రములతోనిండియుండునట్లగుపడుచు నక్షత్రకాంతులచేత బ్రకాశించుచున్నది.

ప్రభువగునోరాముఁడా! చల్లనికిరణములు గలవాఁడును, ప్రపంచముయొక్క చీకటినిపోగొట్టువాఁడును, నగు చంద్రుఁడు తనకాంతిచేలోకమునందలి సమస్తప్రాణులడెందములను సంతోషింపఁజేయుచునుదయించుచున్నాఁడు. రాత్రులయందుసంచరించెడి గుడ్లగూబలు మొదలగు జంతువులును, మాంసమే యాహారముగాగల యక్షరాక్షససంఘములును అచ్చటచ్చట సంచరించుచున్నవి. ఇట్లువచించి మహాతేజుఁడును, మహామునియునగు విశ్వామిత్రుఁడు విరమించె.

—* మునులువిశ్వామిత్రునిబొగడుట. *—

అంత మునులందఱు నవ్విశ్వామిత్రుని మేలుమేలనికొని

యాడి మఱియునిట్లనిరి- కుశునిసంతతియందుజనించినవారి వంశమెల్లపుడును పూజ్యమయినది- ధర్మముసందానసక్తమయినది- కుశునివంశోత్పన్నులగు పురుషశ్రేష్ఠులు పూజ్యులగుస్వభావముగలవారు- బ్రహ్మదేవునితో సమానులు- అట్టి వంశస్థులలో నీవేవిశేషముగ మహాయశుండవు- నదులలో శ్రేష్ఠమగుకౌశికీనది నీవంశమును మిగులబ్రకాశింపఁజేయునది- అనియిట్లు శ్రీమంతుఁడగు విశ్వామిత్రుఁడు మునివరులచేఁ బొగడఁబడి "సంపతహరుడగు సూర్యుఁడస్తమించునట్లు" నిదురనొందె. లక్ష్మణసహితుఁడగు రాముఁడును నిద్రాపరవశుఁడగుటవలన గొంచముగ నాశ్చర్యమునొంది విశ్వామిత్రునిగీర్తించి నిదురించె.

ఇట్లనిశ్రీమద్బాలకాండమునందలి ముప్పదినాలుగవసర్గము సమాప్తము.

—* విశ్వామిత్రమహర్ష్యాదులుపయనమై గంగానదియొద్దకుబోవుట. *—

ఇట్లువిశ్వామిత్రుడు మహర్షులతోడ నదీతీరమునరాత్రియంతయుపరుండి ప్రాతఃకాలమున నిదురమేల్కాంచి యిట్లనియె. దశరథనందనుడవగునో రాముఁడా! చక్కగా దెల్లవాఱినది. ప్రాతస్సంధ్యాకాలము ప్రవర్తింపుచున్నది. లెమ్ము, లెమ్ము. నీకుమంగళమగుగాక. ప్రయాణోన్ముఖుడవుగమ్మనెను. అంతరాముఁడు విశ్వామిత్రుని వచనమునువిని పౌర్వాహ్ణికక్రియల నిర్వర్తించిపయనంబగుట కాసక్తుఁడైవిశ్వామిత్రునింజూచి యిట్లనియె

ఓతపోధనా! ఈశోణనదముమంగళకరమగు జలముగలదిగనున్నది. లోతులేనిది. ఇసుకదిన్నలచే నలంకరింపఁబడినది. కావునమనముయేమార్గముచేదాటుదమనెను. అంతవిశ్వామిత్రుఁడు రఘునందనా! మహర్షులందఱు నేమార్గమునఁబోవుచున్నారో, ఆమార్గముననే పోవునట్లునాచే నిశ్చయింపఁబడినదనిన మహర్షులుధీమంతుఁడగు విశ్వామిత్రునివచనముల నాకర్ణించిసంతృప్తులై నానావిధములగు నరణ్యములఁ జూచుచునేగిరి ఇట్లమ్మునివరులు బహుదూరముపోయి అర్ధదివసంబైనపిదప మునిసేవితయు, నదీశ్రేష్ఠయునగుగంగానదిని వీక్షించిరి.

అంతట నాహంససారససేవితయగు జాహ్నవినిజూచి మునులును, రామలక్ష్మణులునుసంతసించి యాతీరముననివసించిరి- పిదపనమ్మునులుస్నానముగావించి యథాశాస్త్రముగబితృతర్పణముజేసి వైశ్వదేవముమొదలగు అగ్నిహోత్రకార్యములనెరవేర్చి హోమమొనర్చి మిగిలినయమృతతుల్యమగహవిస్సునుభుజించి ముదితమనస్కులై పవిత్రమగు నాజాహ్నవీతీరమున మహాత్ముఁడగు విశ్వామిత్రునిఁజుట్టునుఁబరివేష్టించి కూర్చుండిరి- అంతరాముఁడు విశ్వామిత్రునింజూచియిట్లనియె- మహాత్ముఁడవగువిశ్వామిత్రుఁడా! త్రిపథగామినియగు గంగానదివృత్తాంతమును విననగోరుచున్నాను. ఈగంగనది త్రైలోక్యమును నాక్రమించినదనదీప్రభువగు సముద్రునినెట్లుబొందెనని యడిగిన నమ్మహాముని యగువిశ్వామిత్రుఁడు గంగానదిజన్మాభివృద్ధి వృత్తాంతమునుజెప్పఁదొడంగె.

—* గంగానదివృత్తాంతము *—

రఘునందనా! గైరికాదిధాతువులగనియగు హిమవంతుఁడనెడు పర్వతరాజుకలఁడు- ఆహిమవంతునకు సుమధ్యమురాలును, మేరుపర్వతపుత్రియునగు మనోరమయను భార్యకలదు. వారికి సౌందర్యాతిశయ సంపన్నలగు కొమార్తెలిద్దఱుకలరు ఓరాముఁడా! అందులోజ్యేష్ఠపుత్రిక నామధేయముగంగ. అదేయిది. రెండవదానిపేరు ఉమ. పిదపదేవతలందఱు తమకార్యములనెరవేర్చుకొనవలయుననుకోరికతో హిమవంతునియొద్దికేగి త్రిపథగామినియు, నదియునగు గంగనుయిమ్మనికోరిరి. అంతహిమవంతుఁడు ముల్లోకములమేలుకొఱకు ధర్మమునవలంబించి లోకపావనియు, స్వచ్ఛందపథగామినియునగు తనపుత్రికయైనగంగానదినొసంగె. ముల్లోకములకు మేలుసేయవలయుననుకోరికెగలయాదేవతలు గంగనుగైకొని సఫలమనోరథులైయేగిరి.

ఓరఘునందనా! పిదపహిమవంతుని రెండవపుత్రికయగు ఉమయనునది తపస్సేధనముగాగలిగి యతిభయంకరమగునియమము నవలంబించితపమునర్చె అంతహిమవంతుఁడు లోకనమస్కృతురాలును, సుగ్రతపోధనురాలును పుత్రికయునగు ఉమాదేవిని సౌందర్యాతిశయ సంపన్నుఁడగుబరమశివునకిచ్చె. ఓరాముఁడా! లోకవందితురాలును, నదీశ్రేష్ఠయు,నగుగంగయును, పరమేశ్వరునిభార్యయైనఉమాదేవియును, పర్వతరాజగు హిమవంతునిపుత్రికలు- సుందరిమగు నడకగలవారిలో శ్రేష్ఠుఁడవగు నోరాముఁడా! త్రిపథగామినియగుగంగానది ప్రథమముననాకాశమునుస్థానముగా గలిగినవృత్తాంతమును సర్వమును నెఱింగించితి. అట్టిమౌఢమనోహారిణియు, పాపరహితయు, జలవాహినియు, హిమవత్పుత్రికయు, నగుగంగదేవతానదియై దేవలోకమునొందెను. ఇట్లనిశ్రీమద్బాలకాండమునందలిముప్పదియైదవసర్గము ముగిసెను.

—✻ గంగానది త్రిపథగామినియగుటకు కారణము. ✻—

ఇట్లు విశ్వామిత్రుండు వచించినవీరులగు రామలక్ష్మణులిర్వురు నాకథను శ్లాఘించి విశ్వామిత్రునితో నిట్లనిరి. తాపసోత్తమా! పర్వతరాజగు హిమవంతుని జ్యేష్ఠపుత్రికయైన గంగానదియొక్క ధర్మ్యమును, శ్రేష్ఠమునునగు వృత్తాంతమును వివరించితివి. ఆ గంగానదికి స్వర్గలోకమునందును, మానవలోకమునందును సంభవించిన వృత్తాంతమునంతయు సవిస్తరముగ నెఱింగింపవలయు. నీవిట్టి చరిత్రములను సవిస్తరముగ నెఱుంగుదువు. లోకపావనియగు గంగానది యేకారణముచే మూఁడుమార్గములుగ బ్రవహించె? ధర్మజ్ఞుఁడా! త్రిపథగామినియగు గంగానది యేయేకార్యములొనర్చుటచే నదీశ్రేష్ఠయని ప్రసిద్ధినొందె? అనియడిగిన తపోధనుఁడగు విశ్వామిత్రుఁడు గంగానది కథయంతయు సాకల్యముగ ఋషులమధ్య జెప్పఁదొడంగె.

—✻ పార్వతీపరమేశ్వరులు క్రీడాసక్తులగుట. ✻—

ఓరఘుకులతిలకా! పూర్వము మహాతపుండగు పరమేశ్వరుఁడు పార్వతీదేవిని వివాహంబాడి మోహపరవశుండై రతిక్రీడాసక్తుఁడయ్యె. పరంతపుఁడగు రాముఁడా! ఇట్లు రుఁడు మదనకదనానందవారాంబుధిం దేలియాడుచుండగ దివ్యవర్షశతంబులుగడచె. ఇట్లుగడచియును పుత్రుండు జనింపఁడయ్యె. అంత బ్రహ్మదేవుఁడు మొదలగు దేవతలు యిట్లుమీనకేతనోద్యోగపరతంత్రులుగనుండు పార్వతీపరమేశ్వరుల కుత్పన్నంబయ్యెడు భూతమును నెవ్వరు సహింపఁగలరని భయాకులమానసులై యందఱును పరమశివునికడకేగి నమస్కరించి యిట్లనిరి.

—✻ బ్రహ్మాదిదేవతలు పరమశివుని యొద్దికేగుట. ✻—

దేవదేవుండవును, లోకహితైషణుండవునునగు నో యీశ్వరా! దేవతలమగు మేము నమస్కరించుచున్నాము. అనుగ్రహింపుము. దేవతాశ్రేష్ఠుఁడవగు పరమేశ్వరా! లోకములు నీ తేజోజనితమగు పుత్రుని ధరింపలేవు. కావున నీవు [illegible] గూడ తపంబాచరింపుము. ముల్లోకముల మేలుకొఱకు నీవీర్యమును తేజోమయమగు నీశరీరమునందె ధరింపుము. విడువవలదు. అని యిట్లనేకవిధములఁ బ్రార్థించిన దేవతల వచనములను విని సర్వలోకప్రభువగు పరమేశ్వరుఁడు "మంచిది" అనినుడివి మఱలయిట్లనెను.

ఓదేవతలారా! నేను తేజోమయమగు శరీరమునందె రేతస్సును ధరియించెదను. అట్లనే పార్వతియును శరీరమునందే శోణితమును ధరింపఁగలదు. దేవతలును, పృథ్వియును, నితరములగు లోకములును సౌఖ్యమును బొందుగాక. అయినను నిదివఱకు రేతోనిలయమునుండి జారని రేతస్సును విడుచుటలేదు. ఇప్పుడా స్థానమునుండి చలింపఁబడిన నుత్తమమగు రేతస్సును నెవ్వఁడు ధరింపఁగలఁడు. దేవతలైన మీరు దానిని నాకుఁ జెప్పవలయునని శివుండడిగిన దేవతలిట్లనిరి.

—✻ పరమశివుండు రేతస్సును భూమియందు వదలుట. ✻—

ఓసాంబమూర్తీ! యిప్పుడు చలింపఁబడియుండు రేతస్సును భూమియందు వదులుము. భూదేవి ధరింపఁగలదని సు డివిని సురపతియగు పరమశివుండట్లకాకయని తనవీర్యమును మహీతలమున వదిలె. అంతనా రేతస్సు పర్వతారణ్యసహితయగు ధరిత్రియంతయు వ్యాపించె. పిదప దేవతలు భూమియంతయు బ్రసరింపఁబడిన శివరేతస్సును జూచి భయాక్రాంతులై యేమియుందోచక నగ్నిదేవునిం గాంచి తేజోమూర్తీ! నీవు వాయుదేవునితోఁ గూడి శివునియొక్క రేతస్సును బ్రవేశింపుమనిరి. అంతనగ్నిదేవుఁడు వాయుసమన్వితుఁడై శివుని రేతస్సును బ్రవేశించిననది శ్వేతపర్వతముగనయ్యె.

—✻ కుమారస్వామి యుత్పత్తి. ✻—

పిదప పావకాదిత్య సన్నిభమైనదివ్యమగు తెల్లవనమయ్యె. ఆ తెల్లువనమునందే మహాతేజుండగు కుమారస్వామి జనించె. ఆశిశువునకుఁ గృత్తికలు పాలిచ్చిపోషించుచుండిరి. అందుచేనా కుమారస్వామికి గార్తికేయుండని నామంబుగలిగె. అగ్నిచేధరింపఁబడుటవలన నగ్నిపుత్రుండనఁబడియె. అంత దేవతలును ఋషులును ప్రీతచేతస్కులై పార్వతీపరమేశ్వరుల ననేకవిధములఁ బూజించిరి.

—✻ పార్వతీదేవి దేవతలను, భూదేవిని శపించుట. ✻—

ఓరఘునందనా! యిట్లు దేవతలొనర్చినతోడనే పార్వతీదేవి కోపసంరక్తలోచనయై దేవతలం జూచి యిట్లనియె. దేవతలారా! పుత్రుని గనవలయునని మిగుల గోరికతోఁ జేయుచుండెన సంభోగమును నిలుపుదలజేసితిరి. కావున నిదిమొదలు మీరు స్వభార్యలయందు సంతానము గలుగకపోవుగాకయని శపియించి భూమిని జూచి ఓధరణీ! నీవు నానావిధరూపములుగలిగి యనేకరాజులకు భార్యవు కాఁగలవు. ఓదుష్టస్వభావముగల భూమీ! నాకుఁ బుత్రుఁడు కలగకుండ నటులవిఘాతమొనర్చిన నీవు మదీయకోపకలుషీకృతురాలవై యెన్నటికిని పుత్రునివలనగల్గు సంతోషము నొందకుందువు గాకయని ధరాదేవి శపించె. అంత దేవతలందఱు లజ్జాక్రాంతవదనులై యుండుటను దేవతలకు బ్రభువగు పరమశివుఁడు గాంచి యేమియుం జెప్పక వరుణపాలితమగు పశ్చిమదిశం గూర్చి యేగె.

పార్వతీపరమేశ్వరులుతపమునలుపుటకు హిమవత్పర్వతమునకుబోవుట.

ఇట్లుపరమేశ్వరుఁడుపోయి యుత్తరదిశయందలి హిమవత్పర్వతమును జెంది తత్పర్వతశిఖరమున పార్వతీదేవితోడ గూడ తపమొనర్పఁదొడంగె. ఓరామచంద్రా! పార్వతీదేవివృత్తాంతమును సవిస్తరముగ నెఱింగించితి. ఇక గంగానదివలన కుమారస్వామియుత్పత్తివృత్తాంతమును జెప్పెద లక్ష్మణునితోఁగూడవినుము.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి ముప్పదియాఱవసర్గము ముగిసెను.

దేవతలుసేనానాయకునినియమింపుమని బ్రహ్మయొద్దకేగుట.

ఇట్లుపరమేశ్వరుఁడు తపంబొనర్చుచుండగ దేవతలును ఋషులును తమకుసేనాపతిలేమింజేసి బ్రహ్మదేవునియొద్దికేగిరి. ఇట్లుపోయి యింద్రునితోడను నగ్నిదేవునితోడనుం గూడిన దేవతలందఱును భగవంతుఁడగు పితామహునికి నమస్కరించియిట్లనిరి. ఓకమలోద్భవుఁడా! పూర్వము నీవు మాకురుద్రుని సేనానాయకునిగానొసంగితివి.

అట్టిరుద్రుండిపుడు పార్వతీదేవింగూడి పరమమగుతపము సేయుచున్నాఁడు. విధానజ్ఞుండవగు పరమేష్ఠీ! ఈవిషయమునందులోకహితార్థమైయిఁక సేయవలసినదానినియాలోచింపుము. నీవుదప్పమాకు రక్షకులెవ్వరునులేరని పలికిన విని సర్వలోకపితామహుండగు బ్రహ్మదేవుఁడుమధురవాక్యములచే నూరడించుచు దేవతలంజూచియిట్లనియె.

బ్రహ్మదేవుడుదేవతలనూరడించుట.

దేవశ్రేష్ఠులారా! పార్వతీదేవి శాపగ్రస్తులగుమీరుభార్యలయందు సంతానమునుగనంపలేరు. పార్వతీదేవివచనము వ్యర్థముగానేరదు ఇదిసత్యము. ఇందుకుసంశయింపంబనిలేదు. ఓదేవతలారా! ఇదిగో యాకాశమునందు దిరుగుచుండుగంగానది. దీనియందగ్నిదేవుఁడు శత్రుఘాతకుఁడును దేవసేనానాయకుఁడును నగుపుత్త్రునిబుట్టింపగలఁడు జ్యేష్ఠురాలగు పర్వతరాజుకొమార్తెయైన గంగానదియగ్నిదేవునిచే నివ్వఁబడినగర్భమును బహుమానపురస్సరముగ ధరింపగలదు. అట్లొనర్చుటయు నుమాదేవికి మిగులనిష్టముగనుండును. సందేహములేదు. ఓరఘునందనా! ఇట్లుపలికిన బ్రహ్మదేవుని వచనములాలకించి దేవతలందఱునుకృతార్థులై యాపితామహునికి నమస్కరించిపూజించి యందఱును బయలువెడలి గైరికాదిధాతువులచే బ్రకాశించుచుండెడి కైలాసపర్వతమునకుబోయి యగ్నిదేవునింజూచి పుత్త్రుని బుట్టింపుమని మఱియునిట్లనిరి.

దేవతలగ్నిదేవునిపుత్త్రునిబుట్టింపుమనికోరుట.

(శివాగ్నీంద్రియ ప్రవేశముచేజనించిన శ్వేతపర్వతమే కైలాసపర్వతమనంబడు.) ఓహుతాశనా! యీదేవతలకార్యమునొనర్పుము. హిమవత్పర్వతపుత్త్రికయగు గంగాదేవియందు నీరేతస్సునువదులుమని యాజ్ఞాపించినయగ్నిదేవుండట్లనే కానిండని దేవతలకొఱకుప్రతిజ్ఞజేసి గంగయొద్దికేగి ఓగంగాదేవీ! దేవతలప్రియమును నెరవేర్చుటకై నీవు గర్భమునుధరియింపుమనెను.

గంగాదేవిగర్భముధరించుట.

అంతగంగానదీ యగ్నిదేవునివచనములవిని నదీరూపమునువదిలి సౌందర్యాతిశయసంపన్నమైన స్త్రీరూపమును ధరించె. అగ్నిదేవుండా సుందరవిగ్రహమునుంజూచి మోహపరవశుండై సర్వావయవములవలనను రేతస్సును వెదచల్లె. ఓరామచంద్రా! ఇట్లగ్నిహోత్రుఁడు గంగాదేవియవయవములనన్నిటిని రేతస్సుచేనిండునట్లొనర్చె. గంగాదేవియొక్క యింద్రియములన్నియు రేతస్సుచేనిండింపఁబడెను. అంతగంగాదేవి యారేతస్సువేడిమిచేదహింపఁబడి మిగుల వ్యసనాక్రాంతురాలై సర్వదేవపురోహితుఁడగు నగ్నిదేవునింజూచి యోయనలమూర్తీ! నీరేతస్సు అప్పటప్పటికివృద్ధిఁబొందుచున్నది. నేనుదానినిధరింపలేననగ్ని దేవుండిట్లనియె. ఓగంగాదేవీ! నీగర్భమునుయీహిమవత్పర్వతపాదమునందుంచుమనెను.

గంగాదేవిగర్భమునుధరింపలేకవిసర్జించుట.

మహాతేజుండవగునోరాముఁడా! అంతగంగాదేవి యగ్నిదేవునివచనములవిని నతిభాస్వరమగు నాగర్భమును నింద్రియములచేవిసర్జించె ఇట్లుగంగానదిచేవదలఁబడిన రేతస్సుభూమినిపొంది కరగింపఁబడి పరిశుద్ధముగనుండుస్వర్ణముంబోలినబంగారమును, నిర్మలమును, మంగళకరమునునగు వెండియునయ్యె. మఱియునక్కడనే యారేతస్సుక్షారమువలన రాగియునల్లనియినుమునుబుట్టెను. ఆరేతస్సుయొక్కమలము తగరమునుసీసమునునయ్యె. మఱియునారేతస్సు భూమియందువ్యాపించి నానావిధములయినధాతురూపములుగవృద్ధిబొందె.

ఆగంగాదేవి శ్వేతపర్వతమునందు గర్భమునునిడినమాత్రముననే అందుమొలిచిన రెల్లువనమంతయు నతిప్రకాశముగల స్వర్ణమయంబయ్యె. పురుషశ్రేష్ఠుఁడవగు నోరాముఁడా! అదిమొదలుహుతాశనునితో సమమగుకాంతిగల శ్రేష్ఠమగుస్వర్ణము జాతరూపము (పుట్టినరూపముగలది) యనిపేరొక్కనంబడియె. ఆవనమునందలితృణములునువృక్ష

ములును, చీగెలునుపొదలును, నన్నియునుబంగారంబయ్యె.

——— ✱ కుమారస్వామియుత్పత్తివివరణము. ✱ ———

పిదప కుమారస్వామిజనించె. అంతనింద్రాదిదేవతలు కృత్తికలందఱు నొకటిగాబాలిచ్చి పోషింపుదురనికృత్తికలతోఁజెప్పిరి. అంతనాకృత్తికలు యీశిశువు మాకందఱకును "పుత్రుండగుగాక" అని దేవతలతోఁగూడనుత్తమమగు సంకేతమును జేసికొని పుట్టినట్టుగానేయుండెడి యీశిశువునకుఁబాలిచ్చిరి. పిదపదేవతలందఱు యీకుమారుఁడు కార్తికేయుఁడని మూఁడులోకములయందును బ్రసిద్ధుఁడుకాఁగలఁడు. ఇందుకుసందియములేదనిరి.

అట్టిదేవతలవచనంబులాలకించి యాకృత్తికలుగర్భస్రావమగుచుండగ భూమియందుదయించి యగ్నిహోత్రునింబోలె మిగులగాంతిచేఁ బ్రకాశించుచున్నయాశిశువునుస్నానముసేయించిరి. కకుత్థ్సకులతిలకుఁడవగు నోరాముఁడా! దేవతలు మహాభాగ్యసంపన్నుఁడును హుతాశనసమప్రభుండునునగు కార్తికేయునకుగర్భము స్కన్నంబగుచుండగజనించినవాఁడగుటచే నతనికిస్కందుండనియు నభిధానమొసర్చిరి. అట్లాకార్తికేయునకుస్నానముసేయించినపిదప కృత్తికలకునను త్తమమగుపాలు ప్రాదుర్భవించె.

అంత నాకుమారస్వామి యాఱుమొగములుగలవాఁడై షట్కృత్తికలయొక్క స్తన్యపానమొనర్చె. ప్రభువగు నాకుమారస్వామి యొకదినమునందే స్తన్యపానంబంతయు నొనర్చి కోమలమగుదేహముఁగలవాఁడై పరమేశ్వరపుత్రుండగుటచే తానునులోకవిభుండుకావున తనపరాక్రమముననే రాక్షససేనాసమూహంబులజయించె.

—✱ కుమారస్వామిదేవతలకుసేనానాయకుండగుట. ✱—

అంతనగ్నిమొదలగు దేవతలందఱుయేతెంచి సరిలేని కాంతిచేఁబ్రకాశింపుచున్న యాకుమారుని దేవతలసమూహములకన్నింటకధిపతినిగానభిషేకించిరి. ఓరామచంద్రా! ధన్యమునుబుణ్యమునునగు గంగానదియొక్క స్వర్గమునందలివృత్తాంతమును, అటులనేధన్యముబుణ్యమునగు కుమారస్వామిసంభవమునుజెప్పితిని. కకుత్థ్సాన్వయసంభూతుండవగునోదశరథనందనా! యీభూలోకమునకుమారస్వామియందు భక్తియుక్తుండై యుండువాఁడు దీర్ఘాయుష్మంతుఁడై పుత్రపౌత్రాదులతోడంగూడి సుఖంబుగనుండి యంతమునగుమారస్వామిలోకమునొందును

ఇట్లనిశ్రీమద్బాలకాండమునందలిముప్పదియేడవసర్గము ముగిసెను.

▶✱ సగరమహారాజచరిత్రము. ✱◀

ఇట్లుకుశికాత్మజుండగు విశ్వామిత్రుఁడుకుమారస్వామి వృత్తాంతమునుజెప్పి రామునింజూచిమఱలయిట్లనియె. ఓకౌసల్యానందనా! పూర్వముధర్మస్వభావుఁడును, నతిశూరుండును, అయోధ్యాపట్టణమునకు బ్రభువునైనగుసగరుండనురాజుండె. ఆసగరమహారాజునకు సంతానము లేనందున సంతానముఁగోరుచుండె. అతనికివిదర్భాధిపతిపుత్రికయును, మిగులధార్మికురాలును, సత్యవాదినియును, నగు కేశినియను జ్యేష్ఠభార్యగలదు. మఱియు నీభూలోకముననెక్కడనులేని యత్యంతసౌందర్యసంపన్నురాలును, కశ్యపునికొమార్తెయునునగు సుమతియనుపేరుగల రెండవభార్యగలదు.

—✱ సగరమహారాజుపుత్రులకొఱకుతపస్సుకుబోవుట. ✱—

ఇట్లుండగనాసగరమహారాజు తనభార్యలతోడంగూడి హిమవత్పర్వతమునకుబోయి భృగుప్రస్రవణమను (భృగుమహర్షి చేనధిష్ఠింపఁబడినసెలయేఱుగలది) నొకకొండయందు తపముసేయదొడంగె. ఇట్లుసగరమహారాజునూఱుసంవత్సరములు తపముసేసినపిదప సత్యవంతులలోశ్రేష్ఠుఁడును, బ్రహ్మనుసంధానుఁడునునగు భృగుమహర్షి యాతపమునకుసంతసిల్లి ప్రత్యక్షంబైయిట్లనియె. పాపరహితుఁడవగు నోసగరమహారాజా! నీకువిశేషముగబుత్రులుజనింపఁగలరు. నీవీలోకమునందుమహాకీర్తివంతుఁడవగుదువు.

——— ✱ భృగుమహర్షి సగరునకువరమిచ్చుట. ✱ ———

నాయనా సగరమహారాజా! నీభార్యలలోనొకతె వంశకరుండగుబుత్రునింగనును. ఇంకొకభార్య యఱువదివేలపుత్రులనుగనుననివరంబిచ్చె. ఇట్లుచెప్పినభృగుమహర్షినిసంతసిల్లునటులంజేసి రాచకొమార్తెలగు కేశిని సుమతులుమిగులనుత్సాహముతో కృతాంజలిపుటులైయిట్లనిరి. బ్రాహ్మణోత్తముఁడవైననోభృగుమహర్షీ! మాలోయెవరికొకపుత్రుండుపుట్టును? ఎవరికఱువదివేవురు కొడుకులుగల్గుదురు? దీనిని వినఁగోరుచున్నాము. నీవెట్లుచెప్పితివో అట్లేయగుగాక. అదిమాకిష్టమేననిరి. అంత పరమధార్మికుడగు భృగుమహర్షి యాకేశినీసుమతులవచనములవిని వనితలారా! మీరుస్వేచ్ఛగానేర్పాటుచేసికొనుఁడు;

వంశకరుండగు నొకపుత్రుఁడే కావలయుననుకోరికగలదానికి నట్టిపుత్రుఁడును. మహాబలిష్ఠులును, కీర్తిమంతులును, మహోత్సాహులును, వంశకరులు కానట్టివారును, నగు నఱువదివేవురుగొడుకులు గావలయుననుకోరికగలదానికి నట్లేయఱువదివేవురు సుతులునుగల్గుదురు. కావుననెవరికేవరముకావలయునో నావరమునుకోరుండని నాతపోధనుఁడు మాటంజెప్పె. దశరథాత్మజుఁడవగు నోరాముఁడా! ఇట్లుభృగుమహర్షి బలికినవిని జ్యేష్ఠభార్యయగు

కేశినియనుయువతి సగరమహారాజుసమీపమునఁ దనకువంశకరుఁడగుపుత్త్రుఁడు గావలయుననిగోరె. గరుత్మంతుని తోఁబుట్టువగు సుమతియనురమణి మహోత్సాహులును, గీర్తిమంతులును, నగునఱువేల గొడుకులనుఁగోరె.

—* { భృగుమహర్షి చేవరమువడసి సగరుడు తనపట్టణమునకువచ్చుట. } *—

ఓరఘునందనా! అట్టియెడనాసగరమహారాజు భార్యలతోడభృగుమహర్షి కి ప్రదక్షిణనమస్కారములుచేసి తనపురమునకుఁబోయె. అంతగొన్నిదినములు గడచినపిదపసగరమహారాజు జ్యేష్ఠభార్యయగు కేశిని గర్భమునుధరించి తొమ్మిదిమాసములు నిండినతోడనే యసమంజుఁడనుపేరం బ్రసిద్ధుఁడగుపుత్త్రునింగనెను.

* సగరునకఱువదివేలపుత్త్రులుగలుగుట. *.

పురుషశ్రేష్ఠుఁడవగు నోరాముఁడా! సగరమహారాజు రెండవభార్యయగు సుమతియునుగర్భమునుధరించి "సొరకాయనుబోలిన" నొకగర్భపిండముంగనెను. అంతనాపిండమును భేదించినతోడనేయందుండి యఱువదివేలపుత్త్రులుబయలువెడలిరి. ఇట్లుబయలువెడలిన యాశిశువులనుదాదులునేతిచే నిండినకుండలయందుంచి పెంచుచువచ్చిరి. అంతబహుకాలముగడచినపిదప నక్కుమారులందఱు వయోవంతులైరి. ఇట్లుసగరమహారాజుయొక్క యఱువదివేలమందిపుత్త్రులును యౌవనసౌందర్యసంపన్నులై ప్రకాశింపుచుండిరి.

ఓరఘునందనా! ఇట్లుండగసగరమహారాజు జ్యేష్ఠపుత్త్రుఁడగునసమంజుఁడు నెల్లపుడుబాలురను బట్టుకొనిపోయిసరయూనదీ జలమునందుపడవేసి జలమునందుమునుగుచునుండుబాలురం జూచినవ్వుచుండును. ఇట్లుపాపిష్ఠమగునడతగలవాఁడును, సజ్జనబాధకుండును, నగరవాసుల కనిష్టముసేయుచున్నవాఁడును, నగునసమంజునిసగరమహారాజు పట్టణమునుంచివెడలగొట్టె. ఆయసమంజునకు మిగులఁ బరాక్రమవంతుఁడును, సర్వజనసమ్మతుఁడును, ప్రియంవదుఁడును, నగునంశుమంతుఁడను పుత్త్రుఁడుగలఁడు. నరశ్రేష్ఠుఁడవగు నోరామచంద్రా! అంతబహుకాలముఁ గడచినపిదప సగరమహారాజునకు "యాగముసేయవలయు" ననినిశ్చితమగుతలంపుగల్గె. ఓరామా! అట్టియెడవేదజ్ఞుండగు నాసగరమహారాజుఋత్విజుల సమూహముతోడంగూడి యాగకార్యవిషయమై చేయవలసిననేర్పాటులంజేసి యజ్ఞముసేయదొడంగె. ఇట్లుశ్రీమద్బాలకాండమునందలి ముప్పదియెనిమిదవసర్గ ముగిసెను.

—* సగరమహారాజుఅశ్వమేధయాగముసేయుట. *—

ఇట్లుసగరమహారాజు వృత్తాంతమునుజెప్పిన శ్రీరామమూర్తివిని మిగులసంతసించియగ్నిహోత్రునింబోలె బ్రకాశించుచుండే విశ్వామిత్రమహామునిం జూచియిట్లనియె. ఓవిశ్వామిత్రమహర్షీ! నీకుమంగళమగుఁగాక. మాముత్తాత సగరమహారాజుయాగమునెట్లుసేసె? ఈకథనువిస్తరముగ వినఁగోరుచున్నానని "విశ్వామిత్రస్తుకాకుత్స్థముఖాచప్రహసన్నివ" అంతవిశ్వామిత్రుఁడు నవ్వుచు రామునింగాంచియిట్లనియె. (అనఁగ నీశ్లోకమునందు "ఇవ" అనియుండుటచేనీరామమూర్తి సర్వజ్ఞుఁడైననుదానెఱుఁగనివానివలె నటియించుచున్నాఁడని నవ్వెనని నెఱుంగునది) ఓరామచంద్రా! మహాత్ముండగుసగరచక్రవర్తియొక్కకథయంతయుఁ జెప్పెదవినుము.

పరమశివునిమామయగు హిమవంతుడను పర్వతశ్రేష్ఠమువింధ్యపర్వతమునకు సమీపముననున్నది ఆపర్వతములు మిక్కిలియున్నతములై యున్నందున నొండొరులజూచుచున్నట్లున్నవి. (ఈరెండుపర్వతములకు మధ్యపెద్దపర్వతమేదియులేనందున సమీపముననున్నట్లున్నదనుట) పురుషశ్రేష్ఠుడవగునోరాముఁడా! ఆవింధ్యపర్వతమునకును హిమవత్పర్వతమునకును మధ్యనుండుదేశము యాగకార్యమునందుప్రశస్తమైనది. కావుననాసగరమహారాజు యాగము వింధ్యహిమవత్పర్వతములనడుమజరిగెను. కకుత్స్థవంశోద్భవుండగు నోరాముఁడా! అంతదృఢధన్వుఁడును, శస్త్రానుసారథిని గుఱ్ఱములనుఁగాపాడుకొనుచుఁ బదునొకండువేలవిలుకాండ్రతో బోరువాడునునగు నంశుమంతుఁడు సగరమహారాజుయొక్క యాజ్ఞాప్రకారము యజ్ఞాశ్వమునుసంరక్షింపుచుఁజనియె.

{ దేవేంద్రుఁడు సగరమహారాజుయొక్క యజ్ఞాశ్వము నపహరించుట. } *—

అట్టియెడదేవేంద్రుఁడు రాక్షసాకారముందాల్చి యుక్థ్యముసేయుకాలమునందు (ఉక్థ్యమనగా యాగములోనొకభాగము) అశ్వమేధయాగముసేయుచుండు సగరచక్రవర్తియొక్క యజ్ఞాశ్వమునపహరించె కౌసల్యానందనుఁడవగురాముఁడా! ఇట్లుయజ్ఞాశ్వము నపహరింపంబడినతోడనేదానిని ఋత్విజులందఱునెఱింగి మహాత్ముండగు సగరచక్రవర్తితోనిట్లనిరి. ఓప్రభువర్యుఁడా! మనముఉక్థ్యముసేయుచుండుసమయమున యజ్ఞాశ్వంబతివేగముననపహరింపంబడినది. కావుననపహరించినవానిని మృతినొందించి మఱల నాగుఱ్ఱమునుదీసికొనిరమ్ము. ఇపుడీయాగమునందలియపరాధమువలన మనకందఱకును ననిష్టముసంభవిం

చును. కావునవో మహారాజా! ఈయాగంబెట్లు నిరపరాధముగ నెరవేరునో యట్లుసేయుమనిరి. అంతసగరమహారాజుబుత్త్విజులవాక్యములవిని యాసభయందుండిన యఱువదివేలపుత్త్రులంజూచి యిట్లనియె.

పురుషశ్రేష్ఠులగు నాపుత్త్రులారా! ఘోరాజ్యమగునీయశ్వమేధయాగము మహాభాగులును మంత్రజ్ఞులునునగు ఋత్త్విజులచే ననుష్ఠింపంబడుచున్నది. కావున రాక్షసుల కవకాశములేశమైననుండునటుల నాకగుపడలేదు. ఓపుత్త్రులారా! యజ్ఞాశ్వము నపహరించినవారు వీరని తెలియనందున మీరు పోయి సముద్రమధ్యమందుండెడి భూమియంతయు దిరిగి వెదకుడు. మీకుమంగళమగుఁగాక. సుతులారా! మీరలొక్కొక్కయోజనడగా భూమియంతయు ద్రిగుడు. మీరలుమదీయాజ్ఞ చొప్పున హయమునపహరించిన వానిని వెదకుచు గుఱ్ఱముగుపడువఱకును భూమిని త్రవ్వుఁడు. నేనుయాగదీక్ష వహించియున్నాను. కావున మనుమఁడగు నంశుమంతుని తోడను, ఋత్త్విజులతోడనుగూడి యజ్ఞవాటమునందే తురగసందర్శనము వఱకునుండెదను. పోయిరండు. మీకు మంగళమగుగాక, యనిచెప్పెను.

సగరమహారాజుయొక్క అఱువదివేలపుత్త్రులు భూమిని త్రవ్వుచు గుఱ్ఱమును వెదకుట.

ఓ రామచంద్రా! ఇట్లు చెప్పినసగరుని వాక్యములవిని మహాబలులగు రాజపుత్త్రులు సంతసించి పిత్రాజ్ఞాబద్ధులై భూమియందు వెదకఁబోయిరి. పురుషశ్రేష్ఠుఁడవగు నోరామచంద్రా! ఇట్లుసగరమహారాజనందనులు వెడలిపోయి యొక్కొక్కఁడు నిడుపును వెడల్పునుంగల భూమిని ఒక్కొకయోజనమువంతున వజ్రాయుధములంబోలినఁ గఠినములగు గోళ్ళచేఁ బూమియంతయుఁ ద్రవ్విరి. రఘువరాత్మజుఁడవగు నోరాముఁడా! మఱియు నా రాజపుత్త్రులు వజ్రాయుధముతో సమానములైన శూలముల చేతను, మిగులభయంకరములగు నాగేళ్ళచేతను, భూమియంతయుఁ బగుల్పఁగా నేగొప్పధ్వనిజనించె. రఘుకులతిలకుండవగు నోరాముఁడా! ఇట్లు రాజపుత్త్రులాయుధములచే భూమిని భేదించుటవలన ననేకసర్పములును, ననేక రాక్షసులును, నితరములగు ననేకజంతువులును నలఁగఁగొట్టఁబడి హాహారుమని మొఱవెట్టుచుండఁగ నాధ్వనివినన శక్యమైయుండె. రఘునందనుఁడవగు రాముఁడా! పరాక్రమవంతులగు నా సగరుని పుత్తులు యఱువదివేల యామడ దూరము భూమిని పాతాళమగునట్లు త్రవ్విరి. నరశార్దూలుడవగునో రామచంద్రా! ఇట్లా సగరమహారాజపుత్త్రులు కొండలచే నిండినిబిడీకృతముగనుండు జంబూద్వీపమును త్రవ్వుచు సర్వత్ర సంచరించిరి.

భూమిత్రవ్వబడుటచే దేవతలు భయపడి బ్రహ్మయొద్దకేగుట

అంత దేవతలును గంధర్వులును సురులును, పన్నగులు మొదలగువారందఱును భయభ్రాంతకంపిత శరీరులై బ్రహ్మదేవునియొద్దకుఁబోయిరి. ఇట్లుపోయి మహాత్ముండగు బ్రహ్మదేవుని సంతసింపఁజేసి పరమదుఃఖితులును భయోత్పన్నులునునై యిట్లనిరి. భగవంతుఁడవగు నో సరస్వతీప్రాణవల్లభా! సగరచక్రవర్తిపుత్త్రులచే భూమియంతయు త్రవ్వఁబడుచున్నది. పాతాళలోకమునందు నివసించుచున్న మహాత్ములగు ననేకులు చంపఁబడుచున్నారు. ఆసగరమహారాజనందనులు నగుపడినవారినెల్లఁ నితఁడే మాయజ్ఞాశ్వమునపహరించినవాఁడు, ఇతఁడే యాగమును జెఱచినపాపాత్ముఁడు, అనిచెప్పుచు జంపుచున్నారు. ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి ముప్పదితొమ్మిదవసర్గ ముగిసెను.

——* బ్రహ్మదేవుఁడు దేవతల కభయంబొసంగుట. *——

ఇట్లు దేవతలందఱు మొఱలిడిన బ్రహ్మదేవుఁడు మిగుల భయమునొంది సగరచక్రవర్తిపుత్త్రులు సేయు జననాశనంబునకై దైవబలంబున మోహితులై యున్న దేవతలఁజూచి యిట్లనియె. ఈభూమియంతయు, ధీమంతుఁడగు యే శ్రీమన్నారాయణమూర్తిదో; అట్టివిష్ణుమూర్తి కపిలరూపము ధరించి యీభూమినెల్లప్పుడు భరించుచున్నాడు. కావున నాకపిలరూపధారియగు వాసుదేవుని కోపంబున సగరమహారాజపుత్త్రులందఱు దహింపఁబడగలరు. భూమిద్రవ్వబడుననియు, నల్పాయుష్కులగు సగరనందనులు మరణమునొందగలరనియు, నివియవశ్యముగ గాఁదగినకార్యములనియు, పూర్వమే నిశ్చయింపబడి యున్నవనియు జెప్పెను. అరిందముఁడవగు నోరామచంద్రా! యిట్లుపలికిన బ్రహ్మదేవుని వాక్యములవిని అష్టవసువులు నేకాదశరుద్రులు ద్వాదశాదిత్యులు, నశ్వినులు వీరు మొదలగు దేవతలందఱు మిగుల సంతసించి యథాస్థానంబులకుఁబోయిరి. పిదప మహాత్ములగు సగరమహారాజపుత్త్రులు భూమినిబగుల గొట్టుచుండగ నవశకునమును సూచింపునటుల పిడుగుంబోలిన వాకశబ్దముపుట్టె.

——* సగరపుత్త్రులు యజ్ఞాశ్వము దొరకనందున తండ్రియొద్ద కేగుట. *——

అంతసగరనందనులందఱు భూమిని ద్రవ్వుచుటు ప్రదక్షిణమును జేసి గుఱ్ఱముగానకనందఱు గూడుకొని తండ్రియొద్దకుబోయి యిట్లనిరి. తండ్రీ! మేము భూమియంతయుం దిరిగితిమి. మిగులబలవంతులగు దేవదానవరాక్షస పిశాచోరగకిన్నరుల ననేకులం జంపితిమి. యజ్ఞాశ్వముగాని యజ్ఞా

శ్వము నపహరించినవాడుగాని మాకగుపడలేదు. ఇక నేమి సేయవచ్చును. ఈవిషయమునందు జేయదగినకార్యము నాలోచింపుమనిజెప్పిరి. రఘునందనుఁడవగు రాముఁడా! ఇట్లు కొడుకులుబలికిన పలుకులువిని రాజశ్రేష్ఠుఁడగుసగరమహారాజు మిగుల గోపాక్రాంతుఁడై పుత్రులఁజూచి యిట్లనియె. సుతులారా! మీకుమంగళమగుగాక, మీరుమరల భూతలమును భేదించిత్రవ్వుఁడు. గుఱ్ఱమును, గుఱ్ఱము నపహరించినవానిని వెదకిపట్టుకొని కృతకార్యధురంధరులయి మఱల రండుపొండని వచించిన పూజ్యస్వభావముగల తండ్రియయిన సగరచక్రవర్తియాజ్ఞ శిరసావహించి యఱువదివేల పుత్రులును భూతలమునుగూర్చి పరుగులిడిరి.

సగరపుత్రులుమరలభూమింద్రవ్వి దిగ్గజముల గనుంగొనుట.

అంతసగరమహారాజపుత్రులు భూమినిద్రవ్వుచుండగ పర్వతముతోసమానమై భూతలమును ధరింపుచున్న విరూపాక్షమనెడు దిగ్గజమునుజూచిరి. దశరథాత్మజుఁడవగు నోరామచంద్రా! ఆవిరూపాక్షమను మహాగజము పర్వతములతోడను వనములతోడను గూడియున్న భూమండలమునంతయును శిరంబునం బెట్టుకొని మోయుచున్నది. కకుత్స్థాన్వయ సంభూతుఁడవగు రాముఁడా! ఏకాలమునందు మహాగజమగు విరూపాక్షము శ్రమవలననలసట దీర్చుకొనుటకయి తలను కదలించుచున్నదో యాకాలమునందు భూకంపముగలుగును. ఓరాముఁడా! ఆసగరచక్రవర్తినందనులు దిక్కును పాలించుచుండెడి యావిరూపాక్ష మహాగజంబును బ్రదక్షిణముజేసి పూజించి భూమిని భేదించుకొనిపోయిరి. ఇట్లుపోయి తూర్పు దిక్కునందలి భూమినంతయు భేదించి మఱల దక్షిణపు దిక్కునందలి భూమినిభేదించిరి. అంత సగరమహారాజపుత్రులు దక్షిణపుదిక్కునందును పూజ్యమైన స్వభావముగలదియును, మిగుల పూజ్యమైనదియును, పర్వతమునకుసరియైనదియును, శిరస్సుచేత భూమండలమును ధరింపుచున్నదియును, నగు మహాపద్మంబనెడు మహాగజమునుజూచి మిగులనాశ్చర్యంబునొందిరి. ఇట్లు విస్మయంబునుబొంది మహాత్ములైన సగరచక్రవర్తియొక్క యఱువదివేలమంది పుత్రులును నమ్మహాపద్మంబను మహాగజంబునకు బ్రదక్షిణముసేసి పశ్చిమదిశయందలి భూమింద్రవ్విరి. అంత మహాబలశాలులగు నాసగరమహారాజనందనులు పడమటిదిక్కునందును పూజ్యమైకొండంతటి యాకారముగల సౌమనసంబను దిగ్గజమునుజూచిరి.

సగరచక్రవర్తిపుత్రులు యాసౌమనసమను దిగ్గజమునకు బ్రదక్షిణముసేసి యారోగ్యవార్తనడిగి త్రవ్వుచు బోయి హిమవత్పర్వతంబున్న నుత్తరపుదిక్కునుఁ ద్రవ్వుటకారంభించిరి. రఘువంశోద్భవుఁడవగు నోరామచంద్రా! సగరచక్రవర్తిపుత్రులు యుత్తరదిశయందు మంగళకరమగు దేహముచే నీభూమినిధరించుచు మంచువలెదెల్లగానుండు భద్రంబను దిగ్గజమునుజూచిరి. ఇట్లుజూచియారాజపుత్రులరువదివేలమందియును నాభద్రంబను దిగ్గజమును స్పృశించి ప్రదక్షిణముసేసి మఱలభూమిని ద్రవ్వదొడంగిరి. ఇట్లు సగరచక్రవర్తిపుత్రులు యీశానదిశకుబోయి మిగుల గోపావేశమున భూమియంతయు ద్రవ్విరి.

సగరచక్రవర్తిపుత్రులు కపిల మహర్షిం గనుంగొనుట.

ఓరఘునందనుఁడవగు రాముఁడా! గొప్ప దేహముగలవారును, భయంకరమైన వేగముగలవారును, మహాబలులునునగు నాసగరపుత్రులందఱు నయ్యీశానదిశయందు కపిలరూపధారియగు పురాతనుఁడైన వాసుదేవునిన్ని అతనిసమీపమున దిరుగుచున్న యజ్ఞాశ్వమునుఁజూచి మిగులసంతోషమునొందిరి. ఇట్లుసంతసించి యాసగరరాజపుత్రులు కపిలుని గుఱ్ఱమునపహరించినవానిగా దలంచి కోపాక్రాంతులయి గుద్దళ్ళంజేసి ఖడ్గపాఱలను నాగలులనునానావిధములగు వృక్షములను జాళ్ళనుంగైకొని, నిలు, నిలు, మని యదల్చుచు నాకపిలునిపైకి పరుగెత్తిపోయిరి.

కపిలమహర్షిచే సగరచక్రవర్తి పుత్రులుమృతినొందుట.

ఇట్లుపోయి ఓదుర్బుద్ధీ! మాయజ్ఞాశ్వమును నపహరించినవాఁడవు నీవేగదా; మేము సగరమహారాజపుత్రులను వచ్చియున్నామని యెఱుంగుమనిచెప్పిరి. ఓరామచంద్రా! ఇట్లుపలికిన నాసగరనందనుల మాటల కపిలమహర్షి వినినంతనె రోషారుణితనేత్రుండై ,,హుం,, అనిహుంకారముసేసె. అంత అప్రమేయ ప్రభావముగల నాకపిలునిచే సగరచక్రవర్తి కొడుకులందఱు భస్మరాశీకృతులయిరి.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి నలువదవసర్గ ముగిసెను.

సగరనందనులను, యజ్ఞాశ్వమును, వెదకుటకు అంశుమంతుడు బయలువెడలుట.

రఘునందనుఁడవగు నోరామచంద్రా! పిదప సగరమహారాజు తనపుత్రులు బహుకాలమువరకు రాకపోవుటచే నిజతేజంబున బ్రకాశించుచున్న మనుమఁడైన అంశుమంతునితో నిట్లనియె. ఓయంశుమంతా! నీవుమహాశూరుండ

వు. అస్త్రవిద్యాసంపన్నుఁడవు. పూర్వపురాజులతో సమానమైన పరాక్రమముగలవాఁడవు. కావున నీతండ్రులెక్కడికి బోయినదియును, యజ్ఞాశ్వము నపహరించిన వాఁడెచ్చట నుండునదియును వెదకి తెలిసికొనుము. భూమిలోపల నుండుజంతువులు పరాక్రమముగలవిగను గొప్పవిగను నుండుటచే వానిని సంహరించుటకొఱకు ఖడ్గమును, ధనుస్సును దీసుకొనిపొమ్ము. నీవు నమస్కరింపదగినవారలను నమస్కరింపుచు విఘ్నముసేయువారలనున్ను యజ్ఞాశ్వము నపహరించినవానినిన్ని యమధర్మరాజు వద్దికనిపి నాయాగమును సమాప్తి నొందించుటకొఱకు కృతకార్య దురంధరుఁడవై మరలిరమ్మని చెప్పె. ఇట్లు అంశుమంతుఁడు మహాత్ముఁడగు సగరచక్రవర్తిచే లెస్సగా నాజ్ఞాపింపఁబడి ధనువును ఖడ్గంబునుధరియించి లఘుత్వముగా నేగె. పురుషశ్రేష్ఠుఁడవగు నోరాముఁడా! ఆయంశుమంతుఁడు మహాత్ములగు తనతండ్రులు భూమికి లోపలద్రవ్విన మార్గమునుబట్టియే పోయె.

—* అంశుమంతుఁడుదిగ్గజములఁగనుఁగొనుట. *—

ఇట్లుపోవుచు మార్గంబున దైత్యదానవరక్షః పిశాచపతగోరగాదులచే బూజింపఁబడుచున్న దిగ్గజముంజూచె. అంత అంశుమంతుఁడు దిగ్గజమునకు బ్రదక్షిణముసేసి యారోగ్యవార్తనడిగి ఓగజశ్రేష్ఠమా! నాతండ్రులును, యజ్ఞాశ్వము నపహరించినవాఁడును, ఎచ్చటనున్నారనిఅడిగెను, ఆదిగ్గజము అంశుమంతునిజూచి రాజపుత్రుఁడా! కృతకార్య దురంధరుఁడవై యజ్ఞాశ్వమునుదీసికొని మఱల నీరాజ్యమునకు బోగలవనెను. అట్టిమాటలవిని యంశుమంతుఁడు మార్గముంబట్టిపోయి కడమ దిగ్గజములనున్ను చూచిప్రదక్షిణముసేసి యథావిధిగబూజించితనతండ్రులెచ్చటనుండునదియు, గుఱ్ఱపుదొంగ యెచ్చట నుండునదియు నడిగెను. అట్టియెడ యితరులు వచించెడి వచనముల యభిప్రాయంబెఱింగి సయుక్తముగ మాటలాడనేర్పుగల యాదిగ్గజములన్నియు నంశుమంతుని సత్కరించి నీవుయజ్ఞాశ్వముతోడ మఱల నీరాజ్యమునకు బోగలవనియాశీర్వదించిపంపె. అంశుమంతుఁడు నాదిగ్గజంబులమాటలవిని లఘువిక్రముఁడై తనతండ్రులైన సగరమహారాజపుత్రులు భస్మరాశీకృతులుగ జేయఁబడిన ప్రదేశమునకుబోయె.

—* { అశుమంతుఁడు భస్మరాసులుగ నుండు సగరనందనులఁజూచుట. } *—

ఇట్లుపోయి యదివరలో మిగుల శ్రమనొంది వెదకియు దొరకమింజేసి వ్యసనాక్రాంతుఁడైయున్న యసమంజుని పుత్రుడగు నంశుమంతుడు తనతండ్రులగు సగరమహారాజపుత్రులు మరణము నొందియుండుటంగాంచి రెండింతలు దుఃఖమునుబొంది బొటబొట కన్నీరువిడిచి రోదనమొనర్చె. ఇట్లుపురుషశ్రేష్ఠుఁడగు నంశుమంతుఁడు వ్యసనసాగర నిమగ్నుఁడై రోదనముజేసి యచ్చటనెమిగుల సమీపమునదిరుగుచున్న యజ్ఞాశ్వమునుజూచె. అంత మహాతేజుఁడగు నంశుమంతుడు తండ్రులగురాజపుత్రులకు జలతర్పణముసేయగోరి జలాశయమును బహుదూరము వెదకియు దొరకదయ్యె,

—* అంశుమంతుఁడు గరుత్మంతునిజూచుట. *—

ఇట్లా యంశుమంతుడు బహుదూరము జక్కగా వెదకియు నొక్కకొలనయినను గానక పరితపించుచు వేగమునవాయుదేవునకుసరియైనవాడును తనతండ్రులకు మేనమామయునగుగరుత్మంతునిజూచె. అంతమహాబలుండును వినతాపుత్రుండునునగునాగరుత్మంతుఁడు అంశుమంతునింజూచియిట్లనియె. పురుషశ్రేష్ఠుఁడవగు నోఅంశుమంతుఁడా! నీరిలమరణము సర్వలోకసమ్మతమైనది. కావుననీవుదుఃఖింపకుము. ఓఅంశుమంతుఁడా మహాబలులగునీసగరపుత్రులు అప్రమేయప్రభావముగల కపిలమహర్షిచేభస్మంబుగావింపంబడిరి నీవుప్రాజ్ఞుండవు

శ్లో॥ చండాలాదుదకాత్సర్పా ద్వైద్యుతాద్బ్రాహ్మణాదపి । దంష్ట్రిభ్యశ్చ పశుభ్యశ్చ మరణంపాపకర్మణామ్॥ ఉదకంపిండదానంచ ఏతేభ్యోయద్విధీయతే। నోపతిష్ఠతి తత్సర్వ మంతరిక్షే వినశ్యతి॥ పాపాత్ములగువారలకు చండాలునివలననైనను, జలమువలననైనను, సర్పమువలననైనను, పిడుగువలననైనను, బ్రాహ్మణులవలననైనను, కోరలుగల క్రూరమృగములవలననైనను, మరణముసంభవించెనేని అట్టివారికి జలతర్పణపిండప్రదానాదులనుజేయకూడదు. అట్లుజేసినను అదివారినిజెందదు. అంతరిక్షముననె నశించిపోవును. అనుధర్మశాస్త్రప్రకారము కపిలమహర్షిచే మరణమునొందింపబడిన యీసగరమహారాజపుత్రులకు లౌకికమగుజలతర్పణముసేయదగదు.

—* { గరుత్మంతుడుగంగానదీజలమువలనతర్పణముసేయుమని యంశుమంతునితో జెప్పుట. } *—

మహాబాహుండవును, పురుషశ్రేష్ఠుండవునునగునో అంశుమంతుఁడా! హిమవంతుఁడనుపర్వతరాజునకు జ్యేష్ఠకొమార్తెయొకతెకలదు. అదిగంగానదియనుపేర నదీరూపముగలదై ప్రవహించుచున్నది

కావున నీవానదియందు నీతండ్రులకుజలతర్పణమునుదప్పక సేయవలయును. లోకపావనియునులోకకాంతయునగు నాగంగానదిభస్మరాశీకృతులుగనుండు నీతండ్రులను

దఱిపెనేని సగరమహారాజపుత్రులయిన నఱువదివేలమంది యును స్వర్గలోకము నొందుదురు. పురుషశ్రేష్ఠుఁడవగు నో అంశుమంతుఁడా! నీవు మహాభాగ్యవంతుఁడవు మహావీరుండవు. కావున నీయజ్ఞాశ్వమును దీసికొని సగరునియొద్దకుఁబోయి యాసగరమహారాజుయొక్క యశ్వమేధయాగమును బూర్తిగనెరవేర్పుము.

—* అంశుమంతుఁడు సగరునియొద్దకు వచ్చుట. *—

అనియిట్లు గరుత్మంతుఁడు సెప్పిన మిగుల బరాక్రమవంతుఁడును, మహాయశుండునునగు నాయంశుమంతుఁడతిత్వరితముగ గుఱ్ఱమును దీసికొని మల్లతాతయగు సగరమహారాజు నొద్దకువచ్చెను. రఘునందనుఁడవగు నో రామచంద్రా! ఇట్లాయంశుమంతుఁడు యజ్ఞదీక్షవహించియున్న సగరమహారాజునొద్దకువచ్చి తండ్రులయొక్క వృత్తాంతమును, గరుత్మంతుఁడు వచించినవాక్యములను జెప్పె. అంత సగరమహారాజు అంశుమంతునియొక్క భయంకరములగు మాటలనువిని అశ్వమేధయాగమును యథాక్రమముగను యథాశాస్త్రముగను పూర్తిచేసి తనపట్టణమునకువచ్చి చేరె.

ఇట్లు శ్రీమంతుఁడగు సగరచక్రవర్తి తననగరమునకు వచ్చినపిదప గంగానదిందెచ్చుటకు ననేకవిధములుగ నాలోచించియు నుపాయము దెలియదయ్యె. మహాత్ముఁడగు నా సగరమహారాజు గంగానదిందెచ్చుటకు వేరువిధమైనయుపాయంబేమియు జేయకయె ముప్పదివేలయేండ్లు రాజ్యపరిపాలన మొనర్చి దీర్ఘకాలమునకు స్వర్గలోకము నొందె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి నలువదియొకటవసర్గము సమాప్తము.

—* అంశుమంతుఁడు రాజ్యపరిపాలనముసేయుట. *—

ఓ రామచంద్రా! ఇట్లు సగరమహారాజు స్వర్గలోకమును బొందినపిదప మంత్రులు ధార్మికుఁడగు నంశుమంతునికి పట్టాభిషేకమొనర్చిరి. అంత అంశుమంతుఁడు పూజనీయుఁడుగ రాజ్యపరిపాలనము సేయుచుండగ మిగులశ్రేష్ఠుఁడగు దిలీపుండను పుత్రుఁడుదయించె. ఓ రఘునందనా! ఆయంశుమంతుఁడు తనపుత్రుఁడగు దిలీపమహారాజునకు రాజ్యమునొప్పగించి హిమవత్పర్వతశిఖరమునకేగి గంగానదిందెచ్చుటకుగాను మిగులభయంకరమగు తపంబుసలిపె.

ఇట్లు మహాయశుండగు నంశుమంతుఁడు తపస్సే ధనముగా గలిగి ముప్పదిరెండువేలయేండ్లు తపమునుజేసి స్వర్గలోకము నొందె. పిదప మహాతేజుండగు దిలీపుఁడు తన తాతలయొక్క మరణమును విని మిగులవ్యసనాక్రాంతుఁడై గంగానదిని యేయుపాయముచే దెప్పించవచ్చునని యాలోచించియు దెలియలేదయ్యె. అట్లు దిలీపమహారాజునకు దెలియకపోయినను యెల్లప్పుడును, ఎట్లు గంగానదిందెత్తును? తాతలకు జలతర్పణం బెట్లు సేయుదును? వారల నెట్లు తరంపజేయుదును? అనిచింతింపుచుండె. ఇట్లు విదితాత్ముండును ధర్మచింతాపరుండును నై యాలోచింపుచుండగ నా దిలీపమహారాజునకు పరమధార్మికుఁడగు భగీరథుండను పుత్రుండుజనించె.

మహాతేజుండగు దిలీపమహారాజును అనేకములగు యాగములను జేసి దేవతలనారాధించి ముప్పదివేలయేండ్లు రాజ్యపరిపాలన మొనర్చె. నరశార్దూలుండవగు నో రామచంద్రా! ఆదిలీపమహారాజు తన తాతలనుద్ధరించుటకుపాయము దెలియకయే వ్యాధిగ్రస్తుఁడై కాలధర్మమునొందుటకు సిద్ధుండయ్యె. ఇట్లు కాలధర్మానుగతుండగు నా దిలీపమహారాజు తనపుత్రుఁడగు భగీరథునకు బట్టాభిషేకము జేసి తనచే సంపాదింపఁబడిన పుణ్యకర్మమువలన స్వర్గలోకమునొందె.

—* {దిలీపమహారాజపుత్రుండగు భగీరథుండు గంగానదిందెచ్చుటకు తపంబుసేయుట.} *—

ఓ రఘునందనా! ధార్మికుండును మహాతేజుండును రాజర్షియును, నగు నాభగీరథుఁడు తనకు సంతానము లేనందున రాజ్యభారమును మంత్రులయధీనముజేసి గంగను భూమికిందెచ్చుటయందాసక్తుఁడై తపంబుజేయంబూనె. ఓ రామచంద్రా! ఇట్లా భగీరథుఁడు తపంబుసేయవలయునను గోర్కెతో గోకర్ణక్షేత్రమునకుఁబోయి యూర్ధ్వబాహుండై పంచాగ్నులమధ్యనుండి మాసమునకొకదినము భుజింపుచు జితేంద్రియుండై దీర్ఘకాలము తపము సలిపె. (పంచాగ్నులనఁగా నలుప్రక్కలనాల్గుయగ్నిహోత్రములును, ఆకాశమున వెలుంగు సూర్యుండొకయగ్నియు, నీవైదగ్నిహోత్రములమధ్యనుండి తపముసేయుటయని యెఱుంగవలయు.) మహాబాహుండవగు నో రామచంద్రా! ఇట్లు భగీరథుండతిభయంకరమగు తపముసేయుటచే ననేకవేలయేండ్లుకడచె.

—* {భగీరథుని తపంబునకు మెచ్చి బ్రహ్మదేవుఁడు ప్రసన్నుఁడగుట.} *—

అంత మహాత్ముఁడగు నా భగీరథుని తపంబునకు బ్రజాపతియును, లోకనాయకుండును, భగవంతుఁడునయిన బ్రహ్మదేవుఁడు మిగుల సంతసించి దేవగణపరివృతుండై యా మహాత్ముండగు భగీరథునకు బ్రత్యక్షుంబయి యిట్లనియె. మహాభాగుండవగు నో భగీరథమహారాజా! నీవు చేసిన నతిదుష్కరంబగు తపంబునకు నేను మెచ్చితిని. కావున నీకేమివరము

నవలయునుకోరుమనెను. అంతమిగుల పరాక్రమవంతుఁడును, మహాభాగ్యశాలియునగు భగీరథుఁడుకృతాంజలుఁడై లోకపితామహుండగు బ్రహ్మదేవునితో నిట్లనియె.

—* భగీరథుండు వరముగోరుట. *—

భగవంతుఁడవగు నోబ్రహ్మదేవుఁడా! నీవునాతపంబునకు సంతసించితివేని, నేనుగావించిన తపస్సు సఫలమగునేని, సగరమహారాజ పుత్రులందఱును, నాచే జలతర్పణమును పొందగలరు. మహాత్ములగు నీసగరమహారాజ పుత్రులయొక్క భస్మము గంగానదీజలములచే దడుపఁబడెనేని నాముత్తాతలగు సగరచక్రవర్తి పుత్రులందఱును, అక్షయమగు స్వర్గలోకమునొందుదురు. ఓశారదాప్రాణవల్లభా! ఇక్ష్వాకువంశమునందు సంతానము గలుగవలయు. అట్లు సంతానముగలుగుటచే మాకులము నశింపక శాశ్వతముగనుండును. ఇదియ నారెండవకోరిక. అనగా సగరచక్రవర్తి పుత్రుల దేహభస్మము గంగానదీజలముచే దడుపబడుటయు నాగంగాజలముచే వారికి జలతర్పణముసేయుటయు మొదటిదియనుట, అనియిట్లు భగీరథమహారాజుపలికిన సర్వలోక పితామహుండగు బ్రహ్మదేవుఁడు శుభకరములును, మనోహరములునగు మధురవాక్యములతో నిట్లనియె.

—* బ్రహ్మదేవుడు భగీరథునకువరమిచ్చుట. *—

మహారథుఁడవగు నోభగీరథుఁడా! నీవుకోరిన మొదటికోరిక మిగులదుర్లభమైనది. ఐనను నీకోరికనెఱవేఱుగాక. ఇక్ష్వాకుకులవర్ధనుఁడవగు నోభగీరథమహారాజా! నీకుమంగళమగుగాక. (మంగళమగుగాకయనుటచే బుత్రుండుదయించుగాక యనునర్థము నూహింపదగినది) ఓభగీరథుఁడా! నీవుకోరినగంగానదిహిమవంతునకుబుట్టినది. మఱియు నాగంగానది యతనిపెద్దకూతురు. ఆగంగానదిని ధరించుటకు నీశ్వరుఁడుసమర్థుఁడు. కావున పరమేశ్వరునిప్రార్థింపుము

ఓభగీరథమహారాజా! ఆకాశముననుండిగంగానదిభూమియందుపడుటకుపక్రమించెనేని దానివేగమునుధరణిదేవియోర్వనేరదు. పరాక్రమశాలివగు నోభగీరథుఁడా! ఆగంగానదినిధరించుటకు పరమశివునికన్న నింకొకసమర్థుఁడుండుననినాకుదోఁచదు. కావునపరమశివునిప్రార్థింపుము అనియిట్లులోకకర్తయగు బ్రహ్మదేవుఁడు భగీరథునితోజెప్పి గంగాదేవింజూచి నీవుభగీరథుండు కోరినప్పుడతనివెంటంజనవలయుననివచించి దేవగణపరివృతుండై స్వర్గలోకమునకేగె. ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి నలువదిరెండవసర్గముగిసెను.

—* భగీరథుఁడుపరమశివునిగూర్చితపముసేయుట. *—

ఓరామచంద్రా! ఇట్లుబ్రహ్మదేవుడు వరమొసగియంతర్ధానుఁడైనపిదప భగీరథమహారాజు భూమిమీఁదబొటనవ్రేలికొనతోనిలువఁబడి సంవత్సరకాలముపరమశివునిగూర్చితపస్సుచేసె అంతసర్వలోకనమస్కృతుండును,ఉమాపతియును, నగుపరమేశ్వరుఁడు ప్రత్యక్షమై భగీరథునిజూచియిట్లనియె. పురుషశ్రేష్ఠుఁడవగు నోభగీరథుఁడా! నీవుచేసినతపంబునకు నేనుమెచ్చితిని. నీకోరికనెఱవేఱునట్లు జేసెదను. పర్వతరాజగు హిమవంతునిపుత్రికయైన గంగను నేనుశిరస్సున ధరియింపుచున్నాననివచించె.

—* ఈశ్వరుఁడుగంగానదినిశిరంబునధరించుట. *—

ఓరఘునందనా! పిదప సర్వలోకనమస్కృతురాలును, హిమవంతుని జ్యేష్ఠపుత్రికయునగుగంగానది, మిగులగొప్పయాకారమువహించి దుస్సహమగువేగముతో నాకాశమునుండి మంగళకరమగుపరమశివునిశిరస్సుపైఁబడె. ఇట్లుయాగంగాదేవి పరమేశ్వరునిశిరస్సుపైబడుచునీయీశ్వరుని దుస్సహంబగు నాప్రవాహవేగంబుతో పాతాళమునకుం దీసికొనిపోయెదనని నిశ్చయించె. అంతత్రినేత్రుండును భగవంతుండునునగు పరమేశ్వరుఁడు గంగానదియొక్క గర్వమును దెలిసికొని మిగులగోపావేశుండై గంగనుక్రిందికివిడవక మఱుగువడునట్లుసేయవలయుననిదలంచె.

—* గంగానదిశివునిశిరంబునంబడిభూలోకమునకువచ్చుటకశక్తురాలగుట. *—

రఘుకులతిలకుడవగు నోరాముఁడా! పవిత్రురాలగు నాగంగానది మిగులపుణ్యమును హిమవత్పర్వతముతో సమానమైనదియును, గుహవంటిదియునునగు జటామండలముగల శ్రీపరమేశ్వరునిశిరస్సునందుపడెను. ఇట్లుగంగానది శివునిశిరస్సునంబడి పరమేశ్వరునిజటామండల గహ్వరమునందుదగులుకొని భూమినిబొందవలయుననియనేకవిధములుగఁ బ్రయత్నముసేసియు బయలువెడలుటకు సమర్థురాలుగాదయ్యె. ఈప్రకారముగగంగానది పరమశివునిజటామండలగహ్వరమునందుదగులుకొని యనేకవేలసంవత్సరములు యందే తిరుగుడువడుచుండె. అంతభగీరథమహారాజు గంగానదింగానక మఱలనచ్చటనె ఘోరంబగుతపంబొనర్చె.

—* పరమశివుండు భగీరథుని తపంబునకు మెచ్చి గంగనుభూలోకమునవిడుచుట. *—

రఘునందనుఁడవగునోరామచంద్రా! ఇట్లుభగీరథుండు మఱల తపంబుజేసిన పరమేశ్వరుఁడు మిగులసంతోషమునొంది బ్రహ్మనిర్మితమగుబిందుసరస్సను నొకసరోవరము

నందుగంగానదినివిడిచె. అట్లుగంగానదినివిడిచిననేడు ప్రవాహములుగలిగె. అందుమూడుసంగలుహ్లాదిని, పావని, నళిని, యనిపేరొందనంబడి మంగళకరములగుజలములుగలిగి మిగులశుభకరములయి తూర్పుదిశయందుప్రవహించె- మఱియును, మూడుగంగలుసుచక్షువు, సీత, మహానదియగు సింధువు, యనునామధేయంబులు గలిగి మంగళకరములగు జలములుగలదై పశ్చిమదిశయందు ప్రవహించె. తక్కిన నొక్కటియును భగీరథమహారాజును వెంబడించె.

—* గంగానదిభగీరథమహారాజునువెంబడించుట *—

అంత మహాతేజుండును, రాజర్షియునునగు భగీరథమహారాజు దివ్యంబగు రథంబునెక్కి ముందు నడచిపోవుచుండె. అతనివెనుకందగిలి గంగయునుపోయె.

—* గంగావతరణవైఖరీవివరము. *—

ఓదశరథనందనా! గంగానదిమొదట నాకాశమునుండి పరమశివుని శిరంబుపైబడెను. అందుండి భూమిపయింబడె. అట్లు గంగాజలము భూమిపయింబడుచు భోయను నొకగొప్ప ధ్వనితోడంగూడి ప్రవహించె. అట్టియెడ గుంపులుగుంపులుగబడుచున్న మత్స్యములచేతను తాబేళ్ళచేతను, మొసళ్లచేతను, నితరములగు ననేక జంతువులచేతను భూమి ప్రకాశించె. అంత ఆకాశమునందుండి దేవతలును, ఋషులును, గంధర్వులును, యక్షులును, సిద్ధగణములును భూమిపయింబడిన గంగానదింజూచిరి. అప్పుడు దేవతలు సంభ్రాంతములయిన పట్టణములవలె విశాలములగు విమానములను, గుఱ్ఱములను, శ్రేష్ఠములగు నేనుంగులును వాహనములుగ గలవారలయియుండిరి. మిగుల తేజోవంతులగు దేవతలు లోకమునం దద్భుతమును నుత్తమమునునగు నాగంగావతరణమును జూడగోరిచేరిరి. అట్టియెడ మేఘావృతరహితముగనుండు యాకాశము గంగావతరణము జూడగోరి వచ్చినదేవతల దేహకాంతులచేతను, ఆభరణకాంతులచేతను-నూర్గురుసూర్యు లుదయించి యుండునట్లు ప్రకాశించె- మఱియు నయ్యాకాశము చంచలములగు మొసళ్లచేతను, సర్పములచేతను, మత్స్యములచేతను, గూడి మెఱుపులుగలిగినదివలె వెలింగె. ఇంతియగాక నాకాశము మహావేగముతో వేయువిధములుగ వెదచల్లబడుచున్న తెల్లని నీళ్ళ నురుగులచేతను, హంసపక్షుల సమూహములచేతను, శరదృతువునందలి తెల్లనిమేఘములతోడ గూడియుండుదానివలె ప్రకాశించె. గంగానది కొన్నిచోట్ల మిగులశీఘ్రముగను, గొన్నిచోట్ల వంకరగను, కొన్నిచోట్లదీర్ఘముగను. కొన్నిచోట్లవంగినదిగను, కొన్నిచోట్ల నూర్ధ్వముఖముగను, కొన్నిచోట్ల మెల్లమెల్లగను, ప్రవహించెను (అనగా పల్లపుభూములలో వడిగను, మిట్టపల్లములుగలనేలలో కుటిలముగను, చదరపుస్థలములలో దీర్ఘముగను పల్లముగలచోట్లలో లోనికివంగినట్లుగను, పెద్దబండలు మొదలగునవి తాకినపు డూర్ధ్వముఖముగను, పొడవైనచోట్లమెల్లమెల్లగను బాఱెననియెఱుంగునది.) మఱియుప్రవాహవేగమువలన గొన్నిచోట్లజలను పలుమాఱుజలముచేతనే నెమురుగాగొట్టబడినదై యూర్ధ్వముఖముగ నెగరిమఱల భూతలమునంబడుచుండె॥

శ్లో॥ తచ్ఛంకర శిరోభ్రష్టంభ్రష్టం భూమితలే పునః । వ్యరోచత తదాతోయం నిర్మలంగత కల్మషమ్॥

శ్రీమత్పరమశివుని శిరంబునంబడి భూతలంబునంబడిన గంగానదీజలం బప్పుడు నిర్మలమైనదిగను, పాపరహితమైనదిగను ప్రకాశించె, (గతకల్మషమనగా బోయినపాపముగలదనుటచే స్నానముసేయువారి పాపముల బోగొట్టునదియని యెఱుగునది) అంత ఆకాశమునందుండు దేవతలును, ఋషులును, గంధర్వులును, భూతల నివాసులగు జనులును- పరమశివుని శిరమునందుండి పతితమైనగంగాజలము పవిత్రమైనదని స్నానముసేసిరి- శాపమువలన నాకాశమునుండి భూతలముపైఁబడియున్న వారందఱును గంగానదీజలమునందు స్నానముసేసి పాపముక్తులైరి- ఇట్లు శాపగ్రస్తులయిన వారెల్లరును మిగుల ప్రభావముగల గంగానదీ మాహాత్మ్యముచే బాపవిముక్తులై గగనమార్గమునుబొంది తమతమలోకంబులకేగిరి, మఱియు మిగులప్రకాశించుచున్న నాగంగాజలమునుజూచి లోకము మున్నాటికి సంతసించె. ఆగంగానదియందు స్నానముసేసి బడలికవదిలి సౌఖ్యమునొందె పిదప మహాతేజుండగు భగీరథమహారాజు దివ్యంబగురథంబునెక్కి ముందట బోవుచుండె, ఆగంగానదియు భగీరథునివెనుకనుండి వెంబడించిపోయె.

ఓరామచంద్రా! దేవతలును ఋషిగణములును దైత్యదానవులును, రాక్షసులును గంధర్వులును యక్షులును, కిన్నరులును, నురగములు నప్సరసలు మొదలగు నందఱును సంతోషంబునొంది భగీరథునిరథమును వెంబడించి పోవుచున్న గంగానదిని వెంబడించిరి జలమునందు సంచరించెడి జంతువులన్నియును వెంబడించెను. భగీరథమహారాజు యేమార్గముంబట్టియేగెనో, ఆమార్గము ననుసరించి యశస్వినియును, నదీశ్రేష్ఠురాలును, సర్వపాపప్రణాశినియును,నగు గంగానది పోయెను.

—* జహ్నుమహామునిగంగానదినిపానముసేయుట. *—

ఇట్లు గంగానదిపోవుచుండగ నద్భుతకార్యంబుల నొ

నశ్చైడి జహ్నుమహాముని నమ్మార్గంబునందలి యాశ్రమంబున యజ్ఞముసేయుచుండె- అంతగంగానది యయ్యాగశాలమీదుగ బ్రవహించుటజేసి యయ్యజ్ఞవాటంబంతయు నీళ్ళచేముంపబడియె. ఓరఘునందనా! ఇట్లు తనయజ్ఞశాల నీళ్ళచే మునింగిపోయిన జహ్నుమహర్షి కోపోద్రిక్తుండై యాగంగానదియొక్క నీటినంతయు మిగులనాశ్చర్యంబు గలుగునట్లుగ ద్రావెను.

గంగానదికిజాహ్నవియను పేరువచ్చుటకుగారణము.

అంత దేవతలును, గంధర్వులును, ఋషులును, మిక్కిలి యాశ్చర్యమునొంది మహాత్ముండును, పురుషశ్రేష్ఠుండును,నగు జహ్నుమహర్షినిబూజించి గంగానదిని నతనికి గొమార్తెనుగా నియమించిరి. మహాతేజుండగు జహ్నుమహర్షి దేవతలచేబూజింపఁబడి సంతసించి మరలతనచెవులవలన గంగానదీజలమును బైటకివిడిచె.

శ్లో॥ తస్మాజ్జహ్నుసుతా గంగాప్రోచ్యతే జాహ్నవీతిచ॥ అందువలన గంగానది జహ్నునిపుత్రికయనియును, జాహ్నవియనియును బ్రసిద్ధినొందె. ఇట్లు గంగానదిజహ్నుమహర్షి చెవులవలన విడువంబడిమరల భగీరథమహారాజుయొక్క రథమునువెంబడించివెళ్ళి సముద్రమునుబొంది భగీరథమహారాజుయొక్క కార్యసిద్ధికొఱకు పాతాళలోకమునకుబోయె. రాజర్షియగు భగీరథమహారాజును మహాప్రయత్నంబున గంగానదిందీసికొని దుఃఖసంతప్తమానసుండై భస్మరాసులుగ జేయఁబడియుండు తనతాతలంజూచెను. రఘువంశశ్రేష్ఠుండవగు నోరామచంద్రా! పిదపనదీశ్రేష్ఠమగు నాగంగాజలము భస్మరాశిసమూహమును నీటితోముంచినతోడనే సగరమహారాజపుత్రులు గతకల్మషులయి స్వర్గలోకము నొందిరి.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి నలువదిమూడవ సర్గముముగిసెను,

సగరచక్రవర్తిపుత్రులరువదివేలమందియును స్వర్గమునుబొందుట.

ఇట్లు భగీరథుఁడు గంగానదిని వెంటబెట్టుకొని సముద్రమునుబొంది భూలోకమునుండి సగరచక్రవర్తి పుత్రులుభస్మరాసులుగ జేయబడియున్న పాతాళలోకము బ్రవేశించెను- ఓరఘునందనా! గంగానది పాతాళలోకమునకుబోయి జలముచే సగరచక్రవర్తిపుత్రుల భస్మరాసులను ముంచినతోడనే సర్వలోకనాయకుండగు బ్రహ్మదేవుఁడు భగీరథునిందాచి యిట్లనియె.

గంగానదిభాగీరథియనుటకుగారణము.

నరశార్దూలుండవగు నోభగీరథుఁడా! మహాత్ముఁడగు సగరమహారాజుయొక్క పుత్రులఱువదివేల మందియును, నీచేదరింపఁబడి దేవతలంబోలె స్వర్గలోకమునొందిరి. ఓభగీరథమహారాజా! ఈప్రపంచమునందు సముద్రజలంబెంతకాలముండునో అంతకాలమువఱకు సగరచక్రవర్తి పుత్రులుదేవతలంబోలె స్వర్గలోకముననుండగలరు-మఱియు నీగంగానదియును, నీకుజ్యేష్ఠపుత్రికగానుండగలదు- ఇంకనునీలోకమున నీచేతజేయబడిన నామధేయముచే బ్రసిద్ధినొందియుండగలదు.

శ్లో॥ గంగాత్రిపథగారాజన్ దివ్యాభాగీరథీతి చ। త్రీన్ పథోభావయంతీతి తతస్త్రిపథగాస్మృతా॥ ఓభగీరథమహారాజా! స్వర్గలోకంబున జనించిన నీగంగానది త్రిపథయనియును, భాగీరథియనియును, బ్రసిద్ధి వహించియుండగలదు- స్వర్గము,భూమి,పాతాళములను, మూడుమార్గంబుల బ్రవహించినది, కావున "త్రిపథగ" యనిన్ని చెప్పఁబడియె. మనుజాధిపుఁడవగు నోభగీరథుఁడా! ఈగంగానదీజలముచే నీవునీతాతలకందఱకును జలతర్పణముసేయుము- నీప్రతిజ్ఞనున్ను సమాప్తినొందించుకొనుము.

ఓభగీరథమహారాజా! నీకుబూర్వికుఁడును,మిగులఁ గీర్తివంతుఁడును, ధార్మికులలో శ్రేష్ఠుండును,నగుసగరమహారాజుచే నాకాలమునందీకోరిక నెరవేర్పఁబడదయ్యె. నాయనా,భగీరథుఁడా! అట్లులనేయీలోకమున మహాపరాక్రమవంతుఁడనియు గంగానదిందెచ్చుటకయి మిగుల బ్రయత్నము సేసినవాఁడనియు బ్రసిద్ధినొందిన యంశుమంతుఁడును దనప్రతిజ్ఞను జెల్లింపఁడయ్యె- మహాభాగుండవును అనఘుండవునునగు నోభగీరథుఁడా! రాజర్షియును, గుణవంతుఁడును, మత్సమాన తపస్సంపన్నుఁడును, క్షత్రియధర్మనిష్ఠుండును,నతిపరాక్రమశాలియును,గంగానదిందెచ్చుటకై ప్రార్థించుచున్నవాఁడునునగు నీతండ్రియైన దిలీపమహారాజు సహా యిట్టిప్రతిజ్ఞనుగుఱించి విచారమైన జేయడయ్యె. పురుషశ్రేష్ఠుండవగు నోభగీరథుఁడా! నీకు పూర్వికులెవ్వరును నెరవేర్ప నట్టిప్రతిజ్ఞనునీవు నెరవేర్చితివి. ఈప్రపంచమునందు పరమసమ్మతమగు నుత్కృష్టమైనకీర్తిని పొందితివి- శత్రుసంహారకుఁడవగు నోభగీరథుఁడా! నీచేత ఏగంగావతరణము జేయబడినదో అందుచేతనీవు పూజ్యమైన ధర్మప్రతిష్ఠ జేయఁబడినదానిని పొందినాడవు.

భగీరథుఁడుసగరునిపుత్రులకుగంగానదీజలముచే దర్పణముసేసితనరాజ్యమునకుమరలుట.

పురుష శ్రేష్ఠుండవగు నోభగీరథుఁడా! ఎల్లప్పుడును స్నానముసేయుటకు యోగ్యమయినయీగంగానదీజలమునందు స్నానముసేయుము. అందువలననీవుపరిశుద్ధుఁడవును, పుణ్యవంతుఁడవునునగుదువు. ఓభగీరథ మహారాజా! నీతాతలకందఱకును జలతర్పణముసేయుము. నీకుమంగళమగుఁగాక; నేనునాలోకమునకుబోయెదను. నీవునీరాజ్యమునకుబొమ్ము, అనిసర్వలోకపితామహుండగు బ్రహ్మదేవుండుపలికి దేవలోకంబునకుబోయె.

రఘువంశశ్రేష్ఠుండవగు నోరామచంద్రా! రాజర్షియును,మహాయశుండును,నగు భగీరథమహారాజుపరిశుద్ధుఁడై సగరచక్రవర్తి పుత్రులకుయథాక్రమముగను, యథాన్యాయముగను శ్రేష్ఠమగు గంగానదీజలముచే జలతర్పణముసేసి తనరాజ్యమునకుబోయి సమృద్ధంబగు సంపదగలిగి భూమిని పరిపాలింపుచుండె. ఓరామచంద్రా! ఆభగీరథమహారాజు రాజగుటంజేసి ప్రజలుమిగులసంతసించిరి. మఱియు దుఃఖములులేక విగతజ్వరముగలవారై సమృద్ధంబగుసంపదగలిగి సుఖముగనుండిరి.

గంగావతరణకథాశ్రవణఫలశ్రుతి.

ఓరాముఁడా! నీకు గంగానదియొక్క వృత్తాంతమును సవిస్తరముగవివరించితిని. నీకుమంగళమగుఁగాక. సంధ్యావందనముచేయవలసినకాలంబతిక్రమించుచున్నది. బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రాదులయందెవ్వరైనను, ధనమును,కీర్తిని,దీర్ఘాయువును, పుత్రులను,స్వర్గమును, నొసంగెడియీగంగావతరణోపాఖ్యానమును, వినిపించిరేనియట్టివారిపితృదేవతలును, సకలదేవతలుసంతసింపుదురు. కకుత్స్థాన్వయసంభూతుండవగు నోరామచంద్రా! మంగళకరమగు నీగంగావతరణోపాఖ్యానమును నెవఁడుతదేకనిష్ఠుఁడైవినునో; అట్టివాఁడు సమస్తకోరికలనుబొందును. సకలపాపనివారణుండగును. దీర్ఘాయువుగలవాఁడును, యశస్సంపన్నుఁడునునగు. అనియిట్లు విశ్వామిత్రమహర్షి శ్రీరామునకుంజెప్పె.

ఇట్లుశ్రీమద్బాలకాండమునందలి నలుబదినాలుగవసర్గముసమాప్తము.

రామలక్ష్మణాదులుగంగానదిందాటుట.

ఇట్లు విశ్వామిత్రమహర్షి చెప్పిన రాముఁడు లక్ష్మణునితోఁగూడవిని మిగులనాశ్చర్యపడి విశ్వామిత్రునితో నిట్లనియె. తపస్సంపన్నుఁడవగు నోవిశ్వామిత్రుఁడా! అత్యద్భుతమును, పరమంబును,పావనమును,నగు గంగావతరణవృత్తమును, సముద్రమువృద్ధిబొందింపబడినదియును,మాకుజెప్పితివి. అనిపలికి లక్ష్మణునితోఁగూడ రాముఁడుమంగళకరమగువిశ్వామిత్రునిచే జెప్పఁబడినకథనుగుఱించి తలపోయుచుండగ నారాత్రికాలమంతయునుగడచె. పిదపనిర్మలముగ ప్రాతఃకాలంబయిన శత్రుమర్దనుఁడగురాముఁడు కృతాహ్నికధురంధరుఁడగువిశ్వామిత్రునింజూచియిట్లనియె.

మహాతపుండవగు నోవిశ్వామిత్రుఁడా! మిగులమాహాత్మ్యముగల గంగావతరణోపాఖ్యానమును నీచేవింటిమి. నీచెజెప్పఁబడినకథనంతయు ధ్యానింపుచుండినందున మాకీరాత్రికాలము క్షణప్రాయమైకడచె. ఇప్పుడురాత్రియంతయుఁగడచె. పుణ్యకర్మములుగల ఋషులెక్కఁదగినటుల సుఖముగానుండునట్లు పఱుపబడినపడవలు మిగులప్రభావముగలమీరు వచ్చియుండుటదెలిసియిచ్చటికితేబడియున్నది కావున నీపడవలచేపవిత్రమును నదీశ్రేష్ఠయునగు గంగానదినిదాటుదము. అనియిట్లుమహాత్ముండగు రాముండుపలికిన విశ్వామిత్రమహర్షి ఋషులతోడను, రామలక్ష్మణులతోడనుంగూడి గంగానదినిదాటె. ఇట్లువిశ్వామిత్రమహర్షి గంగానదియుత్తరపుగట్టుచేరి దారినంపవచ్చిన ఋషులనుబూజించి విశ్వామిత్రరామలక్ష్మణులు యాగట్టుననుండియే విశాలయనుపట్టణమునుజూచిరి.

విశ్వామిత్రాదులువిశాలపట్టణమునకుఁబోవుట.

ఇట్లుగాంచి మునిశ్రేష్ఠుండగువిశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతోడంగూడి యతిశీఘ్రంబునమనోహరమును శ్రేష్ఠమును స్వర్గముతోసమానమునునగు నావిశాలయనుపట్టణమునకుఁబోయెను. అంతమహాప్రాజ్ఞుండగు రాముఁడు కృతాంజలుఁడై మహామునియగువిశ్వామిత్రునింజూచి యిట్లనియె. మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! ఈవిశాలయనుపట్టణమును బరిపాలించెడిరాజులవశంబెట్టిది? అట్టివారిచరిత్రమును వినుటకునాకుమిగుల కుతూహలముకలుగుచున్నది. కావునజెప్పవలయునని ప్రార్థించిన మునివరుండగువిశ్వామిత్రుండు విశాలనగరమునునిర్మించిన మహారాజుయొక్కపురాతనచరిత్రమును జెప్పనారంభించియిట్లనియె.

విశాలపట్టణనిర్మాణరాజచరిత్రము.

రఘువంశవర్ధనుఁడవగు నోరామచంద్రా! పూర్వము కృతయుగమునందు దితియొక్కపుత్రులుమిగులబలపరాక్రమసంపన్నులుగనుండిరి. అదితియొక్కపుత్రులు పరాక్రమవంతులుగను,ధార్మికులుగనునుండిరి. నరశ్రేష్ఠుండవగు నోరఘునందనా! మహాత్ములగునాదితికొడుకులకును నదితికొడుకులకును,"మనముమరణములేనివారుగను ముసలితనము

లేనివారుగను నెట్లగుదుమని" యాలోచనఁగలిగె. ఇట్లాలోచనగలిగి మనమందరమునుగూడి పాలసముద్రమునుమథించి "అమృతమును" పొందవలయుననినిశ్చయించిరి. ఇట్లునిశ్చయించి మిగులబలపరాక్రమసంపన్నులగు నాదేవాసురులు పాలసముద్రమునుజిలుకుటకై మందరపర్వతమునుగవ్వముగను వాసుకియనుసర్పరాజును త్రాడుగను నేర్పఱచికొని మథింపఁదొడఁగిరి.

——* సముద్రమథనకథాప్రారంభము. *——

ఇట్లుమథించుటకారంభించి వేయిసంవత్సరములు గడచినపిదప త్రాడుగనుండినవాసుకినిజశిరంబులనుండి విషమునుగ్రక్కుచు మందరపర్వతముయొక్కరాళ్ళనుపటపటమని గొఱికె అంత అగ్నిసంకాశమగు హాలాహలమనువిషముద్భవించిపైకిలేచి దేవాసురమనుష్యులతోడంగూడిన ప్రపంచమునుదహింపఁదొడఁగె ఇట్లుదేవతలు మొదలగువారుదహింపఁబడి యేమియుందోచకశంకరుండును,పశుపతియునగు బరమశివునియొద్దకేగి ప్రణమిల్లి మహేశ్వరా!కాపాడుము, కాపాడుమనియనేకవిధంబులబ్రార్థించిరి.

ఇట్లు దేవతలులోకనాయకుండును దేవదేవుండునునగు పరమశివునింబ్రస్తుతింపుచుండగ నప్పటికిశంఖచక్రధారియగువిష్ణుమూర్తివిచ్చేసి మందస్మితవదనారవిందుండైశూలాయుధధరుండగు పరమేశ్వరునితోనిట్లనియె. దేవతలలోశ్రేష్ఠుండవగు నోపరమేశ్వరుఁడా! నీవు దేవతలకందఱకును మొదటివాఁడవు. కావునదేవతలచే మథింపఁబడినపాలసముద్రమునందు మొట్టమొదటనేదియుద్భవించినను అదినీభాగముగదా; అట్లగుటవలన నోప్రభువా! దీనినినీవు మొదటిపూజనుగాదలంచి యీవిషమును స్వీకరింపుమని యనేకవిధంబులఁజెప్పి సురశ్రేష్ఠుండగువిష్ణుదేవుండంతర్ధానమునొందె. అంతపరమశివుండు దేవతలుభయభ్రాంతి కంపితశరీరులైయుండుటఁగన్గొంచి విష్ణుదేవుండు వచించినవాక్యములనువిని వీరలనెట్లైనను రక్షింపవలయుననిదలంచి యతిభయంకరమగు నాహాలాహలవిషంబువంతయు నొకటియుండగాజేసి "అమృతమునుభక్షించునటుల" మ్రింగె. ఇట్లుదేవదేవుండును సర్వశక్తుండునునగు పరమశివుండు హాలాహలవిషంబునుగ్రహించి దేవతలనీడ్కొనిస్వస్థానంబునకుఁబోయె.

రఘునందనుఁడవగు నోరామచంద్రా! పిదపదేవాసురులందఱును మఱలపాలసముద్రమును మథించుటకుప్రారంభించిరి. ఓరఘునందనా! దేవాసురు లిట్లుమథింపుచుండగ గవ్వముగానున్న మందరపర్వతము నప్పాలసముద్రములో మునింగి పాతాళలోకముంజేరె. అంతదేవతలును, గంధర్వులును యేమియుందోచక మధుసూదనుఁడగు విష్ణుమూర్తినినిట్లనిబ్రస్తుతించిరి. "శ్లో॥ త్వంగతిస్సర్వభూతానాం విశేషేణదివౌకసాం। పాలయాస్మాన్ మహాబాహోగిరిముద్ధర్తుమర్హసి॥" మహాబాహుండవగువిష్ణుదేవుఁడా! సమస్తప్రాణులకు నీవేగతివిగానుండినను విశేషముగ దేవతలను గాపాడదగినవాఁడవు.

కావునమమ్ములనురక్షింపుము. ఇప్పుడుపాలకడలియందుమునింగియున్న మందరపర్వతమును లేవనెత్తుమని అనేకవిధంబులఁబ్రార్థించిరి. అంతహృషీకేశుండగు విష్ణుమూర్తి దేవతలుసేయు ప్రార్థనలనంగీకరించి తాఁబేలుయాకారమునువహించి పాలసముద్రమునమునింగియున్న మందరపర్వతమునులేవనెత్తి వీపుపైననుంచుకొని నయ్యుదధియందెశయనించె. ఇట్లుపురుషోత్తముండును లోకాత్ముండును నగువిష్ణుమూర్తి కూర్మావతారమువహించి తనహస్తములనుపైకిఁజాచి మందరపర్వతముయొక్క శిఖరమునుబట్టుకొని దేవతలమధ్య తానునుండుకొనిమథించె.

దేవతలిట్లువిష్ణుదేవునిసహాయముతోడ మథింపుచుండగ వేయిసంవత్సరములుగడచె. పిదప నప్పాలసముద్రమునందు మొదటదండకమండలధారుండగు "ధన్వంతరి,, యని ప్రసిద్ధుండైన పురుషశ్రేష్ఠుండుద్భవించె. వెనుకరూపలావణ్యసంపన్నులగు నప్సరసలుపుట్టిరి. మనుజశ్రేష్ఠుండవగు నోరామచంద్రా! అప్సరసలనగా నాపాలసముద్రమునందు చిలుకునపుడొకరసముబుట్టె. అట్టిరసమునం దుద్భవించినస్త్రీలు అప్సరసలనబడిరి

ఓరఘునందనా! తేజోవంతులగు నయ్యప్సరసలఱువదికోట్లుజనించిరి. వారలకుపనికత్తెలులెక్కలేకబుట్టిరి. అంత నయ్యప్సరసలను దేవదానవులలోనెవ్వరునువివాహముసేసికొనరైరి. పిదప నెవ్వరుచు బెండ్లాడనందున వారలందఱు వేశ్యలనిచెప్పంబడిరి ఓరామచంద్రా! పిమ్మటసముద్రాధిదేవతయగు వరుణునియొక్క పుత్రికయును, మహాభాగ్యురాలును, సురకధిదేవతయునునగు వారుణియనునవి తన్ను వివాహముసేసికొనువారిని వెదకుచు పాలసముద్రమునందుండి బయలువెడలె. పరాక్రమవంతుఁడవగు నోదశరథనందనా! వరుణకొమార్తెయగు నావారుణిని దితిపుత్రులగు రాక్షసులుగ్రహింపరైరి. దితిపుత్రులగు దేవతలు మాత్రము అనిందితురాలగు నావారుణినిగ్రహించిరి. వారుణినిగ్రహింపనందున రాక్షసులు అసురులైరి. వారుణిని గ్రహించుటచే దేవతలుసురులైరి.

ఇట్లుదేవతలు వారుణినిగ్రహించి మిగులసంతసించిరి. ఓరామచంద్రా! పిదప హయశ్రేష్ఠంబగు నుచ్చైశ్రవంబును,

మణిరత్నంబగు కౌస్తుభమణియును నుత్తమంబగు నమృతమును నుద్భవించె-ఓరామచంద్రా! ఇట్లమృతము మొదలగునవి పుట్టినపిదప నయ్యమృతమునకై దేవదానవులు యుద్ధంబొనర్చిన యిరుతెగలవారలలో ననేకులునశించిరి- ఐనను రాక్షసుల ననేకుల దేవతలు మరణము నొందించిరి.ఓరాముఁడా! అంతదైత్యులును రాక్షసులును తమబలంబెచ్చుటకై వొకటిగజేరిరి. అట్టియెడ త్రైలోక్యమోహనంబగు మహాఘోరంబైన యుద్ధంబువాటిల్లె- అయ్యుద్ధంబున ననేకులునశించినపిదప మహాబలుండగు విష్ణుమూర్తి మహామోహంబును జనింపజేయునట్టి మోహినీరూపంబును తనమాయచేగైకొని నతిత్వరితముగ నమృతమును నపహరించె. అప్పుడయ్యుద్ధమునందు అక్షయుండును, పురుషోత్తముండును,లోకనాయకుండునునగు విష్ణుమూర్తికెవరు యెదురునడచిరో వారెల్లనశింపఁబడిరి- ఎవరు శరణుజొచ్చిరో వారియందు విష్ణుదేవుఁడావేశించియుండె- అంత నద్దేవాసురులకుంగలిగిన నమ్మహాఘోరయుద్ధంబున మిగుల బరాక్రమవంతులగు దేవత లనేకదైత్యులంజంపిరి- ఇట్లు దేవేంద్రుఁడు దితిపుత్రులమరణము నొందించి రాజ్యమును నమృతమునుగైకొని ముదితమనస్కుఁడై మహర్షి చారణాదులతోడంగూడిన సర్వలోకములను బరిపాలించె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి నలువదియైదవసర్గ ముగిసెను.

మరుత్తులజననము.

ఓరామచంద్రా! ఇట్లు దేవాసురయుద్ధంబున దితిపుత్రులందఱు మరణమువొందిన దితిమిగుల వ్యసనాక్రాంతురాలయి మరీచిమహర్షి పుత్రుఁడగు భర్తయైన కశ్యపమహర్షితోనిట్లనియె- మహాత్ముఁడవగు నోకాశ్యపుఁడా! మిగుల బలపరాక్రమ సంపన్నులగు నీపుత్రులు నాకొడుకులనందఱిని సంహరించిరి- కావున దీర్ఘకాలంబు తపంబుజేసి దార్ఢ్యంబుగలిగి యింద్రునిమరణము నొందింపదగిన పుత్రునింబడయ గోరుచున్నాను. కాబట్టి నేను తపంబుసలిపెదను- లోకనాయకుండును-నింద్రునిఁ జంపువాఁడునునగు పుత్రునినీవు నాకొసంగవలయు-అనుజ్ఞయిమ్మని యనేకవిధంబులప్రార్థించె, అంత మహాతేజుండును, మరీచిపుత్రుండునునగు కాశ్యపుండు పరమదుఃఖితురాలగు దితింజూచియిట్లనియె- తపోధనురాలవగు నోదితీ! నీవు కోరినట్లేయగుగాక_ నీకుమంగళము గలుగుగాక-నీకు పుత్రుఁడుదయించువరకు బరిశుద్ధురాలవుగనుండుము-నీకుయుద్ధమునందు యింద్రుని సంహరించునట్టి పుత్రుండుద్భవించును- మఱియు నీవుమిగుల పరిశుద్ధురాలవుగనుండువేని వేయిసంవత్సరములు సంపూర్ణముగ నిండినతోడనే నావలన త్రిలోకాధిపతియగు పుత్రునింబడయగలవు- ఇట్లువచించి మహాప్రభావుండగు కాశ్యపుండుదితిని తనహస్తముచే స్పృశించి దేహమంతయుదడవి నీకుమంగళ మొదవుగాకయని యాశీర్వదించి తపంబుసేయంబోయె- నరశ్రేష్ఠుండవగు నోరాముఁడా! కాశ్యపుండు తపంబునకేగినపిదప దితిమిగులసంతసించి కుశప్లవనమను క్షేత్రమునకుబోయి దారుణంబగు తపంబుజేసె- ఇట్లు దితితపంబుసేయుట కారంభింపగ సహస్రాక్షుండగు దేవేంద్రుడేతెంచి తనగుణాతిశయంబులంజూపుచు నాదితికి పరిచర్యజేయదొడంగె- సహస్రాక్షుండగు దేవేంద్రుఁడు తపంబుసలిపెడి యాదితికి అగ్నిని దర్భలను సమిధలను, జలములను, ఫలములను, గందమూలములను, మఱియునింక నేదికోరిన వాటినెల్లదెచ్చియిచ్చుచు సేవజేయుచుండె- మఱియు నద్దేవేంద్రుఁడు దితియలసియున్నయెడల దేహమునుపట్టుచు, విసరియలసట దీర్చుచు నిట్లుసర్వకాలములయందును నెడతెగక బరిచర్యజేయుచుండె రఘునందనుఁడవగు నోరామచంద్రా! ఇట్లు దితికి దేవేంద్రుఁడు పరిచర్యసేయుచుండగ వేయిసంవత్సరములుగడచుటకు బదిసంవత్సరములు తక్కువగనుండగ దితి సంతోషభరితాంతరంగురాలయి దేవేంద్రునింజూచి యిట్లనియె- దేవతాశ్రేష్ఠుండవగు నోయింద్రుఁడా! మహాత్ముండైన నీతండ్రియగు కశ్యపమహర్షి నాచేబ్రార్థింపఁబడి వేయిసంవత్సరములు గడచినతోడనే నాకు బుత్రుండు గలుగునట్లు వరంబొసంగె-పరాక్రమవంతుడవగు నోయింద్రుఁడా! ఇప్పటికినేను తపంబునకారంభించి తొమ్మనూటతొంబదిసంవత్సరములయినవి- ఇక బదిసంవత్సరములు గడవవలయును- "నీకుమంగళమగుఁగాక" అటుపిమ్మట నీవు తమ్మునింజూడగలవు- నాయనాయింద్రుఁడా! జయోత్సుకుండగు నప్పుత్రునినీకుగాను నేను సమాధానపఱచెదను-నీవు నిర్వ్యసనంబుగ నతనింగూడి ముల్లోకంబుల జయింపఁగలవు- అనియిట్లు దితి దేవేంద్రునితోవచించి సూర్యుండాకాశమధ్యంబును బొందియుండగ (అనగా బగలు రెండుఝాములువేళయనుట) తలతట్టుపాదముల నిడుకొనినిద్రించె- అంత దేవేంద్రుండు అపరిశుద్ధురాలై పాదములతట్టు తలవెండ్రుకలును తలతట్టు పాదములనునిడుకొని శయనించి నిద్రించుచుండెడి దితింజూచి యీయమపరిశుద్ధురాలు గనిదివరకు ధర్మంబులనాచరించి యిపుడు మధ్యాహ్నంబని తలంపక వ్యత్యస్తముగబరుండి నిద్రించుచున్నదనినవ్వి నా కార్యంబు సఫలంబునొందెనని సంతసించె.

ఓరామచంద్రా! ఇట్లు సంతోషంబునొంది మిగుల ధై

గ్వవంతుఁడగు దేవేంద్రుఁడు ఆదితియొక్క శరీరవివరంబగు యోనిద్వారంబుగ గర్భంబునం బ్రవేశించి తద్గర్భంబునందున్న శిశువును నేడుఖండములుగఖండించె- ఓరాముఁడా! నూఱందులుగల వజ్రాయుధముచే దితి గర్భంబునందున్న శిశువును ఖండింపఁగనాశిశువు కర్ణశ్రావ్యంబగు కంఠంబుతో నేడ్వదొడంగె- అంతదితి మేల్కాంచె-ఇట్లుదితిమేల్కాంచినను, మహాతేజుండగు నింద్రుండుగర్భంబునందుండియే నేడ్చుచుండెడిశిశువును, ఏడవకేడువకుమని జెప్పుచుఖండించెను- అట్టియెడదితి చంపకుచంపకుమనిజెప్పిన నింద్రుండు తల్లివాక్యములను గౌరవించి గర్భంబునందుండి బయలువెడలె- బయటికివచ్చి వజ్రాయుధధరుండగు దేవేంద్రుఁడు యంజలిబద్ధుండై దితింజూచి యిట్లనియె- ఓతల్లీ! నీవు అపరిశుద్ధురాలవై పాదములతట్టు తలవెండ్రుకలు గలదానవై నిద్రించితివి-కావుననాకు సమయముదొరుకుటచే యుద్ధంబున నన్నుమరణము నొందింప సమర్థుఁడగు నీశిశువును నేడుఖండములుగ ఖండించితిని- ఓతల్లీ! నేను జేసినదానిని క్షమింపవలయునని ప్రార్థించె.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి నలుబదియాఱవ సర్గముసమాప్తము.

——* మరుత్తులులోకపాలాదులగుట. *——

ఇట్లేడుఖండములుగ ఖండింపంబడిన గర్భంబును దితి చూచి మిగుల వ్యసనాక్రాంతురాలయి యప్పటికిని గొంత దుఃఖోపశమనంబు గావించికొని దురాధర్షుండును, సహస్రాక్షుండునునగు దేవేంద్రునింగాంచి యిట్లనియె. ఓదేవేంద్రుఁడా! ఈశిశువునాయొక్క తప్పితమువలననే యేడుభాగములుగ ఖండింపంబడి వ్యర్థంబయ్యె-కావున నిన్ననంబనిలేదు-ఐననీవిషయమునందు నీవునాకొక ప్రియమైనకార్యము సేయవలయు- ఈశిశుతుండంబులేడును ఆవహ, ప్రవహ, సంవహ, ఉద్వహ, వివహ, పరివహ, ములనెడు వాయువులకు లోకపాలకులుగ నయ్యెడుగాక నాయొక్కపుత్రులగుని య్యేడుగురును మారుతములును నామధేయంబులచే బిలువంబడుచుదివ్యసుందర రూపంబులుగలిగి వాయుసమూహముల కధిదేవతలయి స్వర్గమునందు సంచరింతురుగాక.


ఒకఁడు బ్రహ్మలోకంబునందును- మఱియొకం డింద్రలోకంబునందును. మహాయశుఁడగు మూడవవాఁడు వాయువనుపేర నంతరిక్షమునందును, సంచరింతురుగాక- ఓదేవేంద్రుఁడా! తక్కినవల్వురును,నీయాజ్ఞవలన దేవత్వము నొంది నీవుమారుదః, మారుదః,అని పలుకుచున్నందువలనఁ గలుగుటంజేసి,,మారుతులు,, అనునామధేయముచే బ్రసిద్ధులయి దిక్కులందు సంచరింపగలరు- ఓయింద్రుఁడా! నీకు మంగళమగుఁగాకయని దితిపలికినవిని దేవేంద్రుండు ప్రాంజలుఁడై యిట్లనియె.

ఓతల్లీ!నీవిప్పుడు చెప్పినదంతయు నట్లేజరుగఁగలదు. సంశయింపకుము- నీకు మంగళమొదవుగాక- నీపుత్రులందఱు దేవత్వమునొంది సంచరింపఁగలరని చెప్పెను-ఓరామచంద్రా! ఇదిపూర్వము తపస్సిద్ధురాలగు దితికి దేవేంద్రుఁడుపచరింపుచు నివసించినప్రదేశము-ఇదే యాకుశప్లవనము- ఇప్పుడు విశాలాపురియనుపేరుచే బ్రసిద్ధి నొందినది-పురుషశ్రేష్ఠుండవగు నోరామచంద్రా! ఇక్ష్వాకుమహారాజునకును, నలంబుసయను పతివ్రతాశిరోమణికిని విశాలుండను పుత్రుండుదయించె. అవ్విశాల మహారాజుచేతనే నీవిశాలయను పట్టణమునిర్మింపఁబడెను. ఓరాముఁడా! అవ్విశాలునకు మహాబలుండగు హేమచంద్రుండనువాఁడుదయించె-ఆహేమచంద్రునకు సుచంద్రుడనువాఁడుపుట్టె. ఆసుచంద్రునకు ధూమ్రాశ్వుండను ప్రసిద్ధుండయిన పుత్రుండుగలిగె. ఆధూమ్రాశ్వునకు సృంజయుండనువాఁడుద్భవించె.

ఆసృంజయునకు శ్రీమంతుఁడును- పరాక్రమవంతుఁడునునగు సహదేవుండను వాఁడుగలిగె- ఆసహదేవునికి బరమధార్మికుండగు కుశాశ్వుండనువాఁడుపుట్టె- ఆకుశాశ్వునకు మహాతేజుండును- ప్రతాపుండునునగు సోమదత్తుండనువాఁడుకలిగె-ఆసోమదత్తునకు గాకుత్స్థుండనువాఁడు జనించె-ఆకాకుత్స్థునికిమహాపరాక్రమశాలియును,దేవసమానుండును, దుర్జయుండుమనగు సుమతియను పుత్రుండుదయించి యిప్పుడీవిశాలానగరమునందు నివసింపుచున్నాఁడు- విశాలానగరాధిపతులగు బ్రభువులందఱు, ఇక్ష్వాకుమహారాజానుగ్రహమువలన దీర్ఘాయువును,ధైర్యంబును, వీర్యంబును,గలిగి ధర్మిష్ఠులై ప్రవర్తింపుచుందురు.

{విశాలానగరాధిపతియగు సుమతి విశ్వామిత్రాదులయొద్దకువచ్చుట.}

నరశ్రేష్ఠుండవగు నోరామచంద్రా! మనమియిప్పుడు యిచట నీరాత్రియంతయు సుఖముగ వాసముసేయుదము రేపు ప్రభాతకాలంబున జనకమహారాజునుం జూడబోవచ్చునని రామునితో విశ్వామిత్రమహర్షి చెప్పుచుండగ రాజశ్రేష్ఠుండును, మహాతేజుండును,మహాయశుండును, విశాలా నగరాధిపతియునగు సుమతియను మహారాజు విశ్వామిత్రమహాముని వచ్చియున్నవార్తవిని తత్క్షణంబ బయలువెడలివచ్చి విశ్వామిత్రుని యెదురొక్కొనెను- ఇట్లు సుమతియను మహారాజువచ్చి ఋత్విజులతోడను బంధువులతోడ



అహల్యా శాపవిమోచనము

నుంగూడి విశ్వామిత్రునిజక్కఁగాఁబూజించి ప్రాంజలుఁడై క్షేమంబడిగి యిట్లనియె. ఓవిశ్వామిత్రమహర్షీ! తాము నాదేశమునకువిచ్చేసి నాకుదర్శనంబిచ్చుటచే నేనువిశేష ధన్యుండనయితిని. పూర్ణానుగ్రహము గలవాఁడనయితిని. నాతోసమానుండైన ధన్యుండెవ్వండునునుండడని యనేక విధంబులఁబ్రస్తుతించె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలినలుబదియేడవసర్గము సమాప్తము.

సుమతియనుమహారాజువిశ్వామిత్రునివలన రామలక్ష్మణుల వృత్తాంతమునెఱుంగుట

ఇట్లు రెండోరులు క్షేమసమాచారం బడిగికొనినపిదప సుమతి విశ్వామిత్రునితోనిట్లనియె. ఓవిశ్వామిత్రమహామునీ! నీకుమంగళమగుఁగాక. వైకుంఠధామునితో సమమగుబరాక్రమముఁగలవారును, గజసింహశార్దూలవృషభంబులవంటినడకగలవారును, తామరరేకులుంబోలె విశాలములగు నేత్రములుగలవారును, ఖడ్గమును, తూణీరమును, ధనుస్సును ధరించినవారును, అశ్వినీదేవతలవలె సౌందర్య సంపన్నులును, ప్రాదుర్భవింపుచుండెడియౌవనంబుగలవారును, స్వేచ్ఛగాస్వర్గలోకమునందుండి భూలోకమునకు వచ్చినదేవతలో యనునట్లున్నవారును, నైననీబాలురు కాళ్ళనడకచే నిచటికెట్లునడచివచ్చిరి. ఏకార్యముకొఱకువచ్చిరి. ఎవనికొఱకుయేతెంచిరి. శరీరప్రమాణముచేతను, నింగితాకారములచేతను, చేష్టలచేతను పరస్పరముసమానులై ఆకాశమును చంద్రసూర్యులు భూషింపుచుండెడిమాడ్కి యీ భూలోకమును బ్రకాశింపజేయుచున్నారు.

మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! శ్రేష్ఠములైన ఆయుధములను ధరించినవారును, పరాక్రమవంతులును, నగు నీబాలురిరువురు దుర్గమంబగునీమార్గమునందు నెందుకొఱకువచ్చిరి. వీటినెల్లయథార్థముగవినఁగోరుచున్నాననిన నామాటను విశ్వామిత్రుండువిని తానుసిద్ధాశ్రమమునందుండుటయును, యజ్ఞవిఘ్నముసేయవచ్చిన రాక్షసులు రామలక్ష్మణులచేమడియుటయును, జనకమహారాజు యాగముంజూచుటకు మిథిలానగరముం గూర్చిపోవుటయు మొదలగు జరిగినవృత్తాంతములన్నెల్ల వచించె.

అంతసుమతిమహారాజు మిగులసంతోషమునొంది పూజార్హులును, మహాబలిష్ఠులును, శ్రేష్ఠులును, నతిథులును నైన దశరథమహారాజపుత్రులగు రామలక్ష్మణులను యథాశాస్త్రముగబూజించె. ఇట్లు రామలక్ష్మణులు సుమతివలన మిగుల సత్కృతులుగ బూజింపఁబడియావిశాలాపురియం దొకరాత్రియంతయునుండి యరుణోదయంబున నిదురమేల్కాంచి మిథిలానగరముంగూర్చిపోయిరి. అంతఋషులందఱును రామలక్ష్మణవిశ్వామిత్రులంజూచి యిట్టిమహాత్ములు మిథిలానగరమునకేగుటవలన జనకమహారాజపట్టణము మిగులమంగళకరంబైనదనియును, పుణ్యముజేసినదనియును స్తుతించిరి.

రామలక్ష్మణాదులు గౌతమమహర్షియాశ్రమమునకుఁ బోవుటచే అహల్యాశాపవిమోచనమగుట.

ఇట్లు రామలక్ష్మణవిశ్వామిత్రులుపోవుచు మిథిలానగరమున కతిసమీపంబుననుండు వనమునందొకయాశ్రమంబునుగాంచిరి. ఆయ్యాశ్రమము పురాతనమైనదిగను, నిర్జనముగను, పర్ణశాలమొదలగునవి యేమియులేనిదిగను, మనోహరముగనునుండెను. రాముఁడువిశ్వామిత్రునితోనిట్లనియె. మిగుల తపస్సంపన్నుఁడవగు నోవిశ్వామిత్రుఁడా! కాంతిగలదియు, ఆశ్రమమువలెనుండునదియు, మునివర్జితముగనుండునదియు నగు నీయాశ్రమంబెవ్వరిది? ఇదిమిగులప్రాచీనంబయినదిగనున్నది.

ఇది యెవ్వనియాశ్రమము? చెప్పవలయునని ప్రార్థించిన వాక్యవిశారదుండగు విశ్వామిత్రుండిట్లనియె. రఘునందనుఁడవగు నోరామచంద్రా! సంతోషము. (అనఁగానహల్యాశాపవిమోచనంబగు కాలముసమీపించెనని, సంతోషంబనెననియెఱుంగునది) ఈయాశ్రమంబెవ్వనిదియును, ఏమహాత్ముండగుమునివరునిచే నేకారణమువలన శపింపఁబడెనో అదియును, క్రమముగజెప్పుచున్నానువినుము.

పురుషశ్రేష్ఠుండవగు నోరామచంద్రా! పూర్వముమహాత్ముండగు గౌతమమహర్షి యొక్క యాశ్రమము. ఇయ్యాశ్రమము మిగులశ్రేష్ఠమయినదిగను, దేవతలచేతనుబూజింపంబడుచునునుండెను. మహాయశుండవగునోరాముఁడా! ఆగౌతమమహర్షి తనభార్యయగునహల్యతోడంగూడియీయాశ్రమమునందు అనేకసంవత్సరములు తపంబుసలిపె. ఇట్లుండగ సహస్రాక్షుండును, శచీపతియునగు దేవేంద్రుడు అహల్యపై మోహించి యొకనాఁడు గౌతమమహర్షి యాశ్రమమునందు లేకుండుటనెఱింగి ఋషియగు గౌతమమహామునివలెనే వేషముధరించి యహల్యయొద్దకేతెంచియిట్లనియె.

బ్రహ్మదేవునిచేనతిసుందరముగనుండునట్లు సృష్టింపఁబడిన నోసుందరీమణీ! భోగాసక్తులగువారు ఋతుకాలమునునెదురుచూడవలసినదావశ్యకములేదు. ఓపిడికిటనణగు నడుముగలదానా! నీతోసంభోగమునుమాత్రమేచేయవలయునని కోరుచున్నాను. (అనఁగా, పుత్రోత్పత్తి నాకక్కఱలే

నందువలన నేనుఋతుకాలము నెదురుచూడవలసినదిలేద నెననియెఱుంగునది) ఓరామచంద్రా! అనియిట్లు దేవేంద్రుండుఁ బలికిన దుర్బుద్ధిగలనాయహల్య యింద్రుండు గౌతముని వేషమునుధరించి వచ్చియున్నాఁడనియెఱింగియు దేవతా ప్రముఖుఁడైన నింద్రునియందలిప్రీతిచే సమ్మతించి క్రీడించె. పురుషశ్రేష్ఠుఁడవగు నోరాముఁడా! ఇట్లు క్రీడించినపిదప నాయహల్య కృతకార్యదురంధరయయి దేవేంద్రునితో నిట్లనియె.

దేవలోకనాయకుఁడవగు నోయింద్రుఁడా! నేను కృతార్థురాలనయితిని. ఇఁక నీవుశీఘ్రముగఁబొమ్ము. మానము నిచ్చునట్టివాఁడవగునో దేవేంద్రుఁడా! నిన్నును, నన్నును, సర్వదా రక్షించుకొనుమనిన నింద్రుండు నవ్వుచు అహల్యతో నిట్లనియె. ఇసుకదిన్నెలవంటి మంచిపిఱుందులుగలయహల్యా! నేనుమిగులసంతుష్టుండనైతిని. నేనువచ్చినదారింబట్టి పోయెదనని నుడివెను. ఓరామచంద్రా! ఇట్లు దేవేంద్రుండు యహల్యతో గ్రీడించిపోయివచ్చెదనిచెప్పి గౌతమమహర్షి వచ్చునేమోయని భయభ్రాంతకంపితశరీరుండై త్వరపడుచు బర్ణశాలయందుండిబయలువెడలె.

అంత దేవేంద్రుఁడు మహామునియును, దేవదానవదుర్ధర్షుండును, తపోబలసమన్వితుండును, అప్పుడేకృతస్నానుండై వచ్చుచున్నవాఁడును, దీప్యమానమగునగ్నిహోత్రునివలెనున్నవాఁడును, సమిధలును, దర్భలునుహస్తమునందు గలవాఁడును, మునిపుంగవుండును, ఆశ్రమంబునంబ్రవేశించుచున్నవాఁడును, నగుగౌతమమహర్షినిఁజూచె. ఇట్లుసురపతియగు దేవేంద్రుఁడు గౌతమమహర్షినివీక్షించుటచే భయంబునొంది మొగంబువెలవెలంబోయి తెల్లఁబాఱె. అంతసదాచారసంపన్నుండగు గౌతమమహర్షి మునివేషముధరించుకొని దుర్మార్గకృత్యముగావించిన దేవేంద్రునింజూచి మహాకోపంబునొంది గుడ్లెఱ్ఱంజేసి యిట్లనియె.

ఓరిదుర్బుద్ధీ! నాయొక్క రూపమునువహించి చేయఁగూడనిపనినిచేసితివి. అందువలన నీవువృషణములులేనివాఁడవగుదువనిశపించె. ఇట్లుమహాత్ముండగు గౌతమమహర్షి మహాకోపంబున శపించినతత్క్షణంబున వృషణంబులు తెగినేలంబడియె. గౌతమమహర్షి దేవేంద్రునిట్లుశపించి యహల్యంజూచియిట్లనియె. ఓదుర్బుద్ధిగలదానా! నీవుయీయాశ్రమమునందనేకవేలయేండ్లునివసింపగలవు. ఈయాశ్రమమునందు వాయువునుభక్షించుదానవుగను, నిరాహారురాలుగను, భూతలశాయిగను, తపింపఁబడుచుసమస్తప్రాణులకుఁగాన్పింపకయనుండగలవు. ఇట్లుండగాఁగొంతకాలమునకు వెనుక దుర్ధర్షుండును, దశరథరాజనందనుండును, నగు శ్రీరాముఁడుజనశూన్యంబగు భయంకరంబైన నీయాశ్రమమునకువచ్చును.

అట్టియెడనీవు పరిశుద్ధురాలుకాఁగలవు. దుర్వృత్తిగలయోయహల్యా! అట్టిశ్రీరామునకు నీవుఅతిథిసత్కారముం జేసి యందుచేలోభమోహవర్జితురాలవై సంతోషంబున మరలనాసమీపమున నీస్వస్వరూపమునుదాల్పఁగలవు. అని యిట్లువిశేషతపస్సంపన్నుండును, మహాతేజుండును నగు గౌతమమహర్షి దుష్టచారిణియగు నహల్యనుశపించి యీయాశ్రమమునువిడిచి సిద్ధచారణులచే సేవింపఁబడుచు నతిపుణ్యంబయిన హిమవత్పర్వతశిఖరమునకేగి యందుతపంబుసలిపె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలినలుబదియెనిమిదవసర్గముముగిసెను.

ఓరామచంద్రా! పిదపదేవేంద్రుఁడుతనవృషణములను బోగొట్టుకొని దైన్యమునుఁబొంది విషణ్ణవదనుండైఋషులను చారణులును, అగ్నిదేవుడును, మొదలుగాఁగలదేవతలను జూచి యిట్లనియె. ఓదేవతలారా! నేను మహాత్ముండగు గౌతముండు విశేషతపంబొనర్చుచుండగ నట్టితపోవిఘ్నంబుసేయందలంచి యతనికి గ్రోధంబుగలుగునటుల తపోవిఘ్నంబుజేసి దేవతాకార్యమును జేసితిని. అట్లొనర్చుటం జేసి యమ్మహామునియగుగౌతముండు కోపంబుననన్ను వృషణములులేనివానిగశపించి నదియగాక యహల్యనున్ను పరిత్యజించె.

ఇట్టిగొప్ప శాపంబునిచ్చుటంజేసి యతనితపంబు తఱిగినందున నేనమ్మహామునితపంబు నపహరించినవాఁడనైతిని గదా, అట్లగుటవలన నోదేవతలారా! ఋషులును, చారణులును, మొదలగుదేవతలయిన మీరందఱును, దేవతలకు సాహాయ్యముంజేసిన నాకువృషణంబులుగల్గునట్లు చేయవలయుననిచెప్పె. అంతయగ్నిమొదలగుదేవతలుయింద్రుని వచనంబులవిని సమస్తమరుద్గణంబులతోడంగూడి పితృదేవతలయొద్దకుబోయియిట్లనిరి. ఓపితృదేవతలారా! మీకు యాగమునందు భాగార్థముగకల్పింపంబడియుండు మేషమునకువృషణములుగలిగియున్నవి. కావుననిప్పుడుయింద్రుడు వృషణములులేనివాడుగనుండుటచే నతనికతిశీఘ్రంబున నామేషవృషణంబులనిచ్చివేయుఁడు.

మేషమువృషణములులేనిదైనను,మీకుమిగులసంతోషము నిచ్చుచుండును మానవులు మిమ్ములసంతోషింపజేయుటయానెడు ప్రయోజననిమిత్తము యిచ్చుచున్నారో అట్టివారును మీకువిశేషంబైన సంతోషంబును గల్పించినవారలగు

దురనిరి. అంత యాగభూమికివచ్చియున్న పితృదేవతలు అగ్నిదేవుడుమొదలుగాఁగల దేవతలవచనంబులాలకించి హవిర్భాగంబును గ్రహించుటకొఱకు మేషవృషణంబులను పెకలించి దేవేంద్రునకునిచ్చిరి. కకుత్థ్సాన్వయసంభూతుండవగునో రామచంద్రా! అదిమొదలుకొని పితృదేవతలుహవిర్భాగముకొఱకేతెంచి వృషణములులేనిమేకలనుభుజించుచున్నారు.

ఐనను వానినినొసంగనవారికి వృషణములుగలమేషములనిచ్చిన ఫలంబులనేయిచ్చుచున్నారు. ఓరఘునందనా! అదిమొదలుకొని మహాత్ముండగుగౌతమమహర్షియొక్క తపఃప్రభావముచేత దేవేంద్రుండుమాత్రము మేషవృషణములుగలవాఁడయ్యె. మహాతేజుండవగు నోరాముఁడా! అహల్యాశాపవిమోచనంబు జేయఁదగినవాఁడవు నీవేయగుటవలన పుణ్యకర్మరతుండగు గౌతమమునియాశ్రమమునకురమ్ము. మహాభాగురాలును, దేవతాస్త్రీలతో సమానమైనరూపముగలదియును, నగు నహల్యను తరింపఁజేయుమని విశ్వామిత్రమహర్షి నుడివిన రాముఁడులక్ష్మణసహితుఁడై విశ్వామిత్రమహర్షి నిమున్నిడుకొని గౌతమాశ్రమముఁ బ్రవేశించె.

ఇట్లుప్రవేశించి రాముఁడుమహాదదృష్టముగలదియును, తపస్సుచేఁబ్రకాశింపజేయఁబడిన రెట్టింపుకాంతిగలదియును, దేవదానవమానవులచే సమీపంబునకుఁబోయి తేఱిచూడశక్యముగానిదీప్తిచే దేజరిల్లునదియును, బ్రహ్మదేవునిచేమహాప్రయత్నంబొనర్పఁబడి సృష్టింపఁబడినదియును, దివ్యసుందర రూపముగలదియును, ఇదిమాయావికారమోయనునటుల మోహింపజేయునదియును, తీగెలలోపలమఱుగుపడియుండుటవలన తుషారావృతమైమబ్బుతోగూడిన సంపూర్ణచంద్రుని కాంతియోయనునట్లున్నదియును, సౌమ్యమైచూచుటకలవిగాని యుదకమధ్యమునందుప్రతిబింబించిన సూర్యప్రభవలె వెలుంగుచున్నదియు నగు నాయహల్యంజూచె. ఆయహల్యగౌతమమహర్షివాక్యముచే శ్రీరామదర్శనమగువరకు మూఁడులోకముల యందుండువారికి నదృశ్యురాలైయుండె. రామదర్శనంబయినపిదప నహల్యముల్లోకంబులయం దుండువారి కెల్లరికి గన్పడుచుండె.

—* అహల్యరామలక్ష్మణాదులసత్కరించుట. *—

అంతరామలక్ష్మణు లహల్యపాదములకు నమస్కరించిరి. ఆయహల్యయును, గౌత మహర్షి చెప్పిన వచనములనుదలంచుకొని (అనఁగా రాముడీయాశ్రమమునం బ్రవేశించినతోడనే శాపవిముక్తురాలవగుదువనుటయును, అట్టిరాముని కాతిథ్యంబొసంగుటచే బరిశుద్ధురాలవగుదువనుటయును, ననుట) రామలక్ష్మణులకాతిథ్యమిచ్చుటకై ప్రతిగ్రహించె. ఇట్లుసత్కరించి యాయహల్య మిగులనెచ్చరికతో రామునకుపాద్యము,నర్ఘ్యము,నతిథిపూజనువొసంగెను. రాముండునునాపూజలను యథావిధిఁ గైకొనె.

అంతదేవతలయొక్క భేరీధ్వనులుమ్రోగెను. పువ్వులవానగురిసెను. గంధర్వాప్సరసలునృత్యంబులగావించి పాటలంబాడిరి. దేవతలందఱు తపోబలముచేఁబరిశుద్ధమయినశరీరముగలదియు, గౌతమమహర్షియొక్క యాజ్ఞకులోబడినడుచుకొనునదియును, నగు నాయహల్యంజూచి బాగుబాగనిగొనియాడిరి. మహాతపస్సంపన్నుఁడును మహాతేజుండునునగుగౌతమమహర్షి రాముఁడు తనయాశ్రమమునకువచ్చియున్నాడనినెఱింగి తత్క్షణముననచటికివచ్చి శ్రీరాముని యథావిధిఁబూజించి యహల్యంగూడి సుఖంబుగనుండి తపంబొనర్చుచుండె. రాముడును మహామునియగు గౌతమమహర్షి యొనర్చినపూజను యథావిధిఁ బ్రతిగ్రహించి మిథిలానగరమునుగూర్చిపోయె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి నలువదితొమ్మిదవసర్గముముగిసెను.

విశ్వామిత్రరామలక్ష్మణాదులుజనకమహారాజు యజ్ఞశాలంబ్రవేశించుట.

ఇట్లురాముఁడు లక్ష్మణసహితుఁడై యీశానునిదిశనుఁగూర్చిపోయి విశ్వామిత్రునిబురస్కరించుకొని జనకమహారాజుయొక్క యజ్ఞశాలంబ్రవేశించె. అంతరామలక్ష్మణులు మునిశార్దూలుండగు విశ్వామిత్రునితో నిట్లనిరి. తపోధనుండవగు నోవిశ్వామిత్రమహర్షీ! జనకమహారాజుయొక్కయజ్ఞమునందలి సంభారసామగ్రులనుఁజూడఁజూడఁ వేడుక వొడముచున్నది. ఈయాగశాలయందు నానాదేశనివాసులగు వేదాధ్యయనసంపన్నులయిన బ్రాహ్మణులనేకవేలమంది విచ్చేసియున్నారు. అనేకవేలబండ్లువచ్చినిలిచియున్నవి. అందుచే నిరుకుగలిగియుండుటవలన నెక్కడజూచిన ఋషులుండుస్థానము లగుబడుచున్నవి.

ఓవిశ్వామిత్రుఁడా! మనమెచ్చటనివసింపవచ్చును? ఆస్థానమును నేర్పఱుపుమనిన మహామునియగువిశ్వామిత్రుఁడు రామునివాక్యములవిని జనసంఘములేనిదియును పరిశుద్ధముగనుండునదియును, సమీపమునజలముగలదియును నగు ప్రదేశమునువిడిదిగ నేర్పఱచె.

—*జనకమహారాజువిశ్వామిత్రులయొద్దకువచ్చుట.*—

అంతజనకమహారాజు విశ్వామిత్రుండు వచ్చియున్న వార్తవిని యనింద్యుఁడగు పురోహితుండైన శతానందుని

ముందిడుకొని సవినయంబుగ నతిశీఘ్రంబున విశ్వామిత్రుని నెదుర్కొనె. మహాత్ములగు జనకమహారాజుయొక్క ఋత్విజులును నతిసత్వరంబుగ బూజాద్రవ్యముల గొనివచ్చి ధర్మప్రకారముగ సమంత్రకంబుగ విశ్వామిత్రుని బూజించిరి. ఆవిశ్వామిత్రుఁడును, మహాత్ముఁడగుజనకమహారాజుయొక్క పూజనుస్వీకరించి జనకునింజూచి ఓమహారాజా! క్షేమమా! నీయాగము నిర్విఘ్నముగ నెరవేరుచున్నదా? యనియడిగి యచ్చోటికివచ్చియుండిన ఋత్విజులను, పురోహితుని మునులు మొదలగువారలను యథాన్యాయముగ క్షేమవార్తనడిగెను.

—✽జనకమహారాజువిశ్వామిత్రాదులసత్కరించుట ✽—

పిదపజనకమహారాజు కృతాంజలుఁడై మునిశ్రేష్ఠుండగు విశ్వామిత్రునింజూచి మహాత్ముండవగు నోవిశ్వామిత్రమహర్షీ! నీవీమునిశ్రేష్ఠులతోఁగూడ నియ్యాసనంబునఁగూర్చుండుమనిన విశ్వామిత్రుండు మంచిదని కూర్చుండె. పిదప పురోహితుఁడగు శతానందుఁడును, ఋత్విజులగు మునులునుఁగూర్చుండిరి. మంత్రులతోడంగూడ జనకమహారాజునుఁగూర్చుండె. అంత జనకమహారాజాసనముల యందు యథాన్యాయముగగూర్చుండిన మునులనందఱిని వీక్షించి యందువిశ్వామిత్రునింగాంచి యిట్లనియె.

ఓవిశ్వామిత్రమహర్షీ! నేఁజేయుచుండెడి యాగముల యొక్కఫలమును దేవతలిప్పుడేకదా నాకొసంగిరి. మహాత్ముండవగు భవద్దర్శనమువలన నాయాగఫలంబును నేను సమగ్రంబుగఁబొందితిని. మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! నాయజ్ఞశాలకు నీవుమునులతోఁగూడ వచ్చినందునధన్యుండను, అనుగ్రహింపబడినవాఁడనునైతిని. బ్రహ్మర్షివగు నోవిశ్వామిత్రుఁడా! ఇయ్యాగము పూర్తియగుటకు బండ్రెండుదినములే మిగిలియున్నవని పండితులువచించుచున్నారు. నీవదివఱకిందుండి యటుపిమ్మటహవిర్భాగార్థమై యేతెంచెడిదేవతల వీక్షింపవలయుననిచెప్పి సంతోషముఁబొంది ప్రాంజలుఁడైప్రణమిల్లి మరల విశ్వామిత్రునింబూచియిట్లనియె.

—✽ విశ్వామిత్రునిజనకమహారాజురామలక్ష్మణాదులవృత్తాంతమడుగుట. ✽—

ఓవిశ్వామిత్రమహర్షీ! నీకుమంగళమగుగాక. విష్ణుమూర్తితోసమానమయిన పరాక్రమముగలవారును, గజసింహములవంటినడకగలవారును, పరాక్రమవంతులును, శార్దూలవృషభసమానులును, తామరరేకులంబోలివిశాలములగు నేత్రములుగలవారును, ఖడ్గతూణీరధనుర్ధరులును, సౌందర్యముచే నశ్వినీదేవతలవలె నుండువారును. సమీపించుచున్న యౌవనముగలవారును, స్వేచ్ఛగా దేవలోకమునందుండి భూలోకమునకువచ్చిన దేవతలవలెనున్నవారును, నగు నీకుమారకులిరువురు కాళ్ళచేనడచి యిచటికెట్లువచ్చిరి. ఎవ్వనినిమిత్తమెందుకొఱకువచ్చిరి.

మహామునివగు నోవిశ్వామిత్రుఁడా! శ్రేష్ఠములగునాయుధముల ధరించినవారును, పరాక్రమవంతులును నగు నీబాలురెవనియొక్కపుత్రులు. ప్రమాణేంగితచేష్టలచేఁబరస్పరసమానులరును, పిల్లజుట్టుగలవారును, పరాక్రమశాలురును, చంద్రసూర్యులాకాశంబునుబ్రకాశింపఁజేయురీతిని నీయాగశాలను నలంకరించుచున్నవారును నగు నీబాలకుల వృత్తాంతమును యథార్థముగ వినఁగోరుచున్నాననిన విశ్వామిత్రుండు మహాత్ముండగు జనకమహారాజుమాటను విని వీరలుమహాత్ములనియును, దశరథమహారాజపుత్రులనియును, రామలక్ష్మణులనియును నతనికి నెఱింగించె. మఱియు మహాతేజుండగు విశ్వామిత్రమహాముని, రామలక్ష్మణులు తనతోడంగూడసిద్ధాశ్రమమునకువచ్చుటయు, నచట రాక్షసులను వధించుటయు, సర్వత్ర రాక్షసులు వ్యాపించియుండు నరణ్యమార్గంబున నిర్భయంబుగవచ్చుటయు, విశాలానగరినివీక్షించుటయు, అహల్యనుగనుంగొనుటయు గౌతమునింజూచుటయు, జనకమహారాజ గృహముననుండు ధనుస్సెంతగొప్పదోపరీక్షించుటకై మిథిలానగరమునకేతెంచుటయు, నివిమొదలగుసర్వవృత్తాంతమును జనకమహారాజునకెఱింగించె.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యేఁబదియవసర్గము ముగిసెను.

✽ శతానందుఁడుతనతల్లియగునహల్య మరలగౌతమునింగూడినవృత్తాంతమును విశ్వామిత్రునిఅడుగుట. ✽

ఇట్లు ధీమంతుఁడగు విశ్వామిత్రుండు సెప్పిన నవ్వాక్యములనువిని గౌతమమహర్షియొక్క జ్యేష్ఠపుత్రుండును, తపోకాంతిచే బ్రకాశించుచున్నవాఁడును, మహాతేజుండును, మహాతపస్సంపన్నుఁడును, నగు శతానందుఁడు పులకాంకితశరీరుఁడై రామునింజూచిన మాత్రముననె మిగుల నాశ్చర్యమునొందె. ఇట్లాశ్చర్యమునుబొంది యాశతానందుఁడు సుఖముగఁగూర్చుండియున్న రాజపుత్రులగురామలక్ష్మణులంజూచి విశ్వామిత్రునితోనిట్లనియె. మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! దీర్ఘతపోవంతురాలును, ప్రశస్తమగుకీర్తికలదియును, నగు నాతల్లియైనయహల్యను శ్రీరామునకుంజూపించితివా? మహాతేజురాలును, యశస్వినియునగు నాతల్లియైనయహల్య సమస్తప్రాణులకునుబూ

జింపఁదగినవాఁడైన శ్రీరామునివనోద్భవములగు ద్రవ్యములచేబూజించెనా? మహాతేజుండవగు నోవిశ్వామిత్రుఁడా! నాతల్లియైనయహల్యకు విధిబలంబుచేసంభవించినపురాతనపుచెడుగును యథారీతిగ శ్రీరామునకుం జెప్పితివా? మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! నీకుమంగళమగుఁగాక- శ్రీరామునింజూచుటచేతను, నతనికాతిథ్యంబొసంగుటమొదలగువానిచేతను, నాతల్లియైనయహల్యాదేవి నాతండ్రియైన గౌతమమహర్షింగూడినదా? ఓవిశ్వామిత్రమహర్షి! నాతండ్రియైనగౌతమమహర్షిచేఁ శ్రీరాముఁడుపూజింపఁబడెనా? మహాత్ముఁడగు శ్రీరాముఁడును హిమవత్పర్వతమునుండివచ్చిన గౌతమమహర్షినిం బూజించెనా? కుశికాత్మజుండవగు నోవిశ్వామిత్రుఁడా! మాయాశ్రమమునకువచ్చిన పరిశుద్ధుఁడగునీ శ్రీరాముఁడు శాంతంబగుమనస్సుతో మాతండ్రియగుగౌతమునకు నభివాదనంబొనర్చెనా? అనిశతానందుండడిగిన యావాక్యములనువిని వాక్యవిశారదుండగు విశ్వామిత్రమహర్షి వాక్యకోవిదుండగు శతానందునకిట్లనియె. మునిశ్రేష్ఠుండవగు నోశతానందుఁడా! నేనుకొంచెమైననువిడువక సకలమునుజెప్పితిని. ఏదిచేయవలయునో యాకార్యముల నన్నింటినిజేసితిని. భార్గవవంశమునందు జనించినజమదగ్నిని రేణుకగూడినట్లుయహల్యాదేవిగౌతమునింగూడె. అనియిట్లువిశ్వామిత్రుండు స్పష్టంబుగవచించిన మహాతేజుండగు శతానందుండువిని రామునింజూచియిట్లనియె.

—* శతానందుఁడు రామునితో సంభాషించుట. *—

పురుషశ్రేష్ఠుండవగు నోరామచంద్రా! నీకుస్వాగతమగుగాక- (అనగాసుఖముతోడి రాకయగుగాకనుట) అపరాజితుండగువిశ్వామిత్రమహర్షిని పురస్కరించుకొనిదైవయోగముచే నిచటికివిచ్చేసితివి. ఈవిశ్వామిత్రుఁడు అచింత్యములగు మహత్కార్యంబులఁ జేసినవాఁడు- తపోబలంబుచేబ్రహ్మర్షియయ్యె. అతులప్రభగలవాఁడు- మహాప్రభావసంపన్నుఁడు- మఱియునీవిశ్వామిత్రుని శ్రేష్ఠమైన ప్రాప్యస్థానముగా నీవెఱుంగుదువు- ఓరాముఁడా! మహాతపస్సంపన్నుఁడగు నీవిశ్వామిత్రమహర్షి నీకురక్షకుఁడుగానుండుటవలన నీభూలోకంబున నీకన్నమఱియెవ్వండునుపుణ్యపురుషుండులేడు ఓరామచంద్రా వినుము- మహాత్ముండగునీవిశ్వామిత్రునిబలంబును, జరిత్రంబును- నేలాటిదోదానినంతయుంజెప్పెదసావధానమనస్కుండవైవినుము.

—{ శతానందుఁడు శ్రీరామునకు విశ్వామిత్రుండు మహర్షియైన వృత్తాంతమును జెప్పుట. }—

ఈవిశ్వామిత్రుఁడు ధర్మస్వభావుడుగను, శత్రుమర్దనుఁడుగను, ధర్మశాస్త్రజ్ఞుఁడుగను, సకలవిద్యాసంపన్నుఁడుగను, ప్రజలమేలు గోరువాఁడుగను, రాజుగనునుండి, బహుకాలము భూమిఁబరిపాలింపుచుండె. బ్రహ్మదేవునిపుత్రుండైన కుశుఁడనెడు రాజుండెను. ఆకుశునికిబలశాలియును, బరమధార్మికుండునునగు కుశనాభుండను పుత్రుండుగలిగె. ఆకుశనాభునకు గాధియని ప్రసిద్ధుండైనతనయుండుజనించె. ఆగాధికి మహాతేజుండును, మహామునియునగు నీవిశ్వామిత్రుండుదయించె. మహాపరాక్రమ సంపన్నుఁడగు నీవిశ్వామిత్రుఁడు అనేకవేలయేండ్లు రాజ్యాధిపతియై రాజ్యపరిపాలన మొనర్చె.

—*{ రాజ్యాధిపతిగనుండినవిశ్వామిత్రుఁడు వసిష్ఠాశ్రమమునకుబోవుట. }*—

ఇట్లు భూమినిబరిపాలించుచుండగ నొకప్పుడుమిగుల పరాక్రమముగల విశ్వామిత్రుఁడు చతురంగబలసమేతుండైయక్షౌహిణీసైన్యముతోడంగూడిభూసంచారంబొనర్చె.

ఓరామచంద్రా! ఇట్లీవిశ్వామిత్రుఁడు భూసంచారముగావింపుచు దేశములందును, పట్టణములందును, నదులందును, బర్వతములందును, ఆశ్రమములు మొదలగువానియందును, క్రమముగసంచరించి నానావృక్ష సమాకులంబును, నానావిధమృగగణాకీర్ణంబును, సిద్ధచారణసేవితంబును, దేవదానవగంధర్వకిన్నరులచే బ్రకాశింపజేయఁబడినదియును, మనుష్యులలోమెదిగిన జింకలచే వ్యాపింపఁబడినదియును, నానావిధపక్షిసంఘనిషేవితంబును, బ్రహ్మర్షిదేవర్షిగణములచే సేవింపఁబడినదియును, తపస్సిద్ధినొందినవారును, అగ్నిహోత్రునితో సరియైనవారును, మిగులఁబ్రభావముగలవారును, జలమునేభక్షించువారును, వాయువునుభక్షించువారును, రాలినయాకులనే యాహారముగాగలవారును, కందమూలఫలము లాహారముగా గలవారును, మనోనిగ్రహముగలవారును, కోపమునుజయించినవారును, జితేంద్రియులగువారును, నిట్టివారిచేతను, ఋషులచేతను, జపహోమపరాయణ వాలఖిల్యవైఖానసులచేతను, సర్వత్రప్రకాశింపఁజేయఁబడినదియును, నగువసిష్ఠమహామునియొక్క యాశ్రమమునుబ్రవేశించె. ఇట్లుబ్రవేశించిమహాశూరుండును, మహాబలుండునునగు నీవిశ్వామిత్రుఁడు రెండవబ్రహ్మలోకమువలెనున్న వసిష్ఠమహర్షియొక్క యాశ్రమమునుజూచె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి యేబదియొకటవసర్గము ముగిసెను.

—✽ వసిష్ఠమహర్షి విశ్వామిత్రుని సత్కరించుట. ✽—

ఇట్లాశ్రమంబునం బ్రవేశించి మహాబలపరాక్రమ సంపన్నుఁడగు విశ్వామిత్రుఁడు తపోశ్రేష్ఠుండగు వసిష్ఠమహర్షిం జూచి యతివినయసంపన్నుండగుటవలన నమస్కరించె. అంతట మహాత్ముండగు వసిష్ఠమహర్షి విశ్వామిత్రునింజూచి యోవిశ్వామిత్రుఁడా! నీపరివారంబునకును నీకును స్వాగతంబగుఁగాక. అనిచెప్పి కూర్చుండుట కాసనం బొసంగె. ఆసనంబునందు విశ్వామిత్రుండు గూర్చుండిన మునిశ్రేష్ఠుండగు వసిష్ఠుఁడు ధీమంతుఁడగు విశ్వామిత్రునకు యథాశాస్త్రంబుగ ఫలమూలంబులసమర్పించె. రాజశ్రేష్ఠుండును, మహాతేజుండును, నగువిశ్వామిత్రుఁడు వసిష్ఠమహర్షివలనిపూజను స్వీకరించియిట్లనియె.

ఓతపోధనా! తపస్సు నిర్విఘ్నముగా జరుగుచున్నదా? అగ్నిహోత్రములు క్రమముగజరుగుచున్నవా? శిష్యులు క్షేమముగనున్నారా? వృక్షములు క్షేమముగఁ బెరుగుచున్నవా? అనియడిగె. అంత వసిష్ఠమహర్షి విశ్వామిత్రునింజూచి యోరాజోత్తమా! మీరిప్పుడు అడిగినవన్నియు క్షేమముగానేయున్నవి. అనిచెప్పి మిగులతపోవంతుఁడును, జపము సర్చువారిలో శ్రేష్ఠుండును, బ్రహ్మదేవునిపుత్రుండును, నగువసిష్ఠమహర్షి విశ్వామిత్రమహారాజు సుఖముగాగూర్చుండినపిదప నతనితోనిట్లనియె. పరాక్రమవంతుఁడవును, ధార్మికుండవునునగు నోవిశ్వామిత్రమహారాజా! నీకు క్షేమమా! ప్రజలను ధర్మపద్ధతిని సంతోషపఱచుచున్నావా? "శ్లో॥ న్యాయేనార్జనమర్థస్య వర్ధనంపాలనంతథా। సత్పాత్రేప్రతిపత్తిశ్చ రాజవృత్తం చతుర్విధమ్॥ అనురీతిచే న్యాయముగ ద్రవ్యమును సంపాదించుటయును, దానినభివృద్ధిజేయుటయును, రక్షించుటయును, సత్పాత్రంబునకిచ్చుటయునునివి రాజవృత్తులగుటవలన నిట్టిరాజవృత్తితోడంగూడి రాజ్యపరిపాలన మొనర్చుచున్నావా? శత్రుసంహారకుఁడవగు నోవిశ్వామిత్రుఁడా! నీభృత్యులు నీచే జక్కగా బోషింపఁబడుచున్నారా? వారలు నీయాజ్ఞప్రకారము నీకులోబడి నడుచుకొనుచున్నారా? నీచేశత్రువులందఱు జయింపఁబడిరా? పురుషసింహుండవగు నోవిశ్వామిత్రుఁడా! నీచతురంగబలములకును బొక్కసములకును, స్నేహితులకును, పుత్రులకును, పౌత్రులకును, క్షేమమా? అని వసిష్ఠమహర్షి యడిగినమహాతేజుండగు విశ్వామిత్రమహారాజు వినయాన్వితుఁడై వసిష్ఠమహర్షితో నన్నియును క్షేమముగనేయున్నవని ప్రత్యుత్తరంబిచ్చె.

ఇట్లు ధర్మిష్ఠులగు నవ్వసిష్ఠవిశ్వామిత్రులిరువురును మిగులసంతోషయుక్తులై బహుకాలమువఱకు పరస్పరముగు శలప్రశ్నలగుఱించిన మంగళకరములగు మాటలం జెప్పికొనియుభయులును మిగులసంతోషమునొందిరి- ఇట్లు బహుకాలమువఱకు మాట్లాడుచుండి పిదప మహాత్ముఁడగు వసిష్ఠుడు నవ్వుమొగంబుగలవాఁడై విశ్వామిత్రునింజూచి యిట్లనియె- మహాబలుండవగు నోవిశ్వామిత్రుఁడా! నీసైన్యమునకును అప్రమేయుండవగు నీకును యథాయోగ్యముగ నతిథిపూజను జేయుటకిచ్చయించుచున్నాను- నాప్రార్థననంగీకరింపుము. పూజ్యుండవగు నీవు నేఁజేయఁదలచిన సత్కార్యమగు నతిథిపూజను నంగీకరింపుము- నీవుప్రభుఁడవు. అతిథిశ్రేష్ఠుండవు- నిన్ను బ్రయత్నపూర్వకంబుగఁ బూజింపవలయును- కావున నాకోరిక నెరవేర్పవలయునని వసిష్ఠుండు బలికిన మహామతియగు విశ్వామిత్రమహారాజు వసిష్ఠునితోనిట్లనియె.

ఓతపోధనా! నీవు మిగులప్రేమతో నాతిథ్యముచేసెదనని చెప్పితివి- ఆప్రియవచనములచేతనే నాకాతిథ్యము జేసినవాఁడవైతివి- మహాత్ముఁడవును, మహాప్రాజ్ఞుండవును నగునోవసిష్ఠమహర్షీ నీయాశ్రమమునందుండెడి ఫలమూలములచేతను, నాచమనీయంబుచేతను, భవద్దర్శనముచేతను, నీయన్నివిధములచేఁ బూజింపందగిన నీచేత నతిథిపూజగావింపం బడినవాఁడనైతిని- నేను పోయెదను- నీకు నమస్కారము. స్నేహవాత్సల్యముంచుము- అని విశ్వామిత్రుండు జెప్పిన ధర్మాత్ముండును, ఉదారవంతుఁడునునగు వసిష్ఠమహర్షి విశ్వామిత్రుఁడు వేరువిధమైన విశేషాతిథ్యఁబుకక్కర లేదని చెప్పుచుండినప్పటికిని- బలవంతముజేసి భోజనమునకు నిలువవలెనని నిర్బంధించె

—{ విశ్వామిత్రునకును నతనిసైన్యమునకును వసిష్ఠమహర్షి షడ్రసోపేతంబుగ నన్నంబిడుట. }—

అంత విశ్వామిత్రుఁడు వసిష్ఠునిం జూచి మునిపుంగవుండవగునోవసిష్ఠుఁడా! మంచిది, మహాప్రభావ సంపన్నుండవగు నీకెట్లు యిష్టమో, అట్లే కానిమ్ము- అనియనెను- పిదప మహాతేజుండును, మునివరుండును, విగతకల్మషుండును, నగువసిష్ఠమహర్షి మిగులసంతసించి చిత్రవర్ణములదేహముగల కామధేనువును బిలిచియిట్లనియె- విచిత్రవర్ణదేహముగలయో కామధేనువా! శీఘ్రముగానిటురమ్ము. నావచనంబుల నాలకించి వినుము సైన్యముతో గూడియుండు నీ రాజర్షియగు విశ్వామిత్రునకు శ్రేష్ఠమగు భోజనం బొసంగి సత్కరించుటకు యత్నించుచినాఁను. కావున సకలద్రవ్యంబులను సంపాదింపుము. వలయువానినెల్లం బిలికెడియో కామధేనువా! షడ్రసములయందు నీవచ్చియుండు వారిలోనెవరికెవరికేదేదియిష్టమో దానినంతయు వారివారికిగా నాకొఱ

కు నతిత్వరలోవర్షింపుము. ఓకామధేనువా! రసాయనములతోసుభక్ష్యములతోను, లేహ్యచోష్యవస్తువులతోను, అన్నసమూహమునుసృజింపుము. అతిశీఘ్రంబుగాసృజింపుము.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి యేబదిరెండవసర్గము ముగిసెను.

శత్రుమర్దనుఁడవగు నోరామచంద్రా! ఇట్లుకామధేనువు వసిష్ఠమహర్షిచేఁబ్రార్థింపంబడి యెవరికెవరికేదేదియిష్టమో వారివారికోరికప్రకారము వాటినెల్ల సమకూర్చె. మఱియునాకామధేనువు చెరుకుగడలను, తేనెలను, పేలాలను, అద్భుతములగుపాత్రలతోటి మైరేయములను మద్యములను, మిగులనుత్కృష్టములగుపానకాదులను, నానావిధములగుభక్ష్యంబులనునొసంగె. మఱియు నవ్వసిష్ఠాశ్రమముపర్వతములతో సమానములగు వేడియన్నపురాసులచేతను, పాయసముమొదలగుమృష్టాన్నములచేతను, సూపము, పెఱుగుచేఱులు, నానావిధరుచులుగలుగునట్టి షడ్రసయుక్తంబగు షాడబంబులను భక్ష్యములుగలపాత్రములు, బెల్లముచేఁజేయఁబడినభక్ష్యంబులు, మొదలగువానిచేతను వేలువేలుగనిండింపంబడియె.

ఓరామచంద్రా! ఇట్లునానావిధములగుపదార్థములచే వసిష్ఠుండు విశ్వామిత్రునిసేనయందలి జనులందఱిని దృప్తినొందించిన వారుమిగులసంతసించి దేహపుష్టింగలిగియుండిరి. అంతరాజర్షియగు విశ్వామిత్రుండు వసిష్ఠుఁడుగావించిన యాదరంబునకుసంతోషంబునొంది మిగులఁదృప్తినొందె. ఇట్లువిశ్వామిత్రుండును, నతనియంతఃపురస్త్రీలును, బ్రాహ్మణులును, పురోహితులును, అమాత్యులును, మంత్రులునునౌకరులును నితరులగువారందఱును సత్కరింపఁబడిరి. పిదపవిశ్వామిత్రుండు వసిష్ఠమహర్షింగాంచియిట్లనియె.

—* { విశ్వామిత్రుఁడుకామధేనువునుయివ్వమని వసిష్ఠమహర్షి నియడుగుట. } *—

బ్రాహ్మణోత్తముఁడవగు నోవసిష్ఠుఁడా! మాచేబూజింపందగిన నీవుమమ్ములనుమిగులశ్రద్ధతోసత్కరించి పూజించితివి. నీవుమాటలయందు మిగులసమర్థుండవు అయిననేనొకమాటంజెప్పెదవినవలయు. ఓవసిష్ఠుఁడా! నీకులక్షయావులనిచ్చుచున్నాను. దానికిబదులుగనీవీకామధేనువును నాకొసంగవలయు. మహాత్ముండవగునోవసిష్ఠుఁడా! ఈకామధేనువురత్నముంబోలినది. రత్నములన్నియు రాజులసొమ్ము. కావున నీకామధేనువును నాకిమ్ము. ధర్మంబునువిచారించిచూడగ నీకామధేనువు రాజ్యపరిపాలనంబొనర్చెడి రాజైన నాదియేకాని బ్రాహ్మణుఁడవైననీదికాదు. అనిన మహాత్ముండును, మునిసత్తముండును, ధర్మాత్ముండును నగు వసిష్ఠమహర్షి విశ్వామిత్రునింజూచియిట్లనియె.

—*వసిష్ఠుకామధేనువునుయివ్వడములేదనిచెప్పుట *—

ఓవిశ్వామిత్రమహారాజా! నీవులక్షగోవులనిచ్చినను, ననేకకోట్లగోవులనిచ్చినను, వెండిరాసులనిచ్చినను, కామధేనువునిచ్చుటలేదు. శత్రుమర్దనుఁడవగునోవిశ్వామిత్రుఁడా! ఈకామధేనువు నెల్లపుడు నాసమీపముననే యుండవలసినది. విడువఁదగినదికాదు. ధైర్యముగలవానికి గీర్తిశాశ్వతంబుగగలిగియుండునట్లు నాకీకామధేనువెప్పటికి స్థిరముగనుండవలయు. దేవతలకైనను పితృదేవతలకైనను సమర్పింపందగినదియును, నాయాహారమును, అగ్నిహోత్రంబును, భూతబలియును, దర్శపూర్ణమాసాదియాగంబులును, ఈకామధేనువువలననేయగుచున్నవి.

రాజర్షియగు నోవిశ్వామిత్రుఁడా! స్వాహాకారవషట్కారంబులను మంత్రంబులును, నానావిధములగువిద్యలును, నివిమొదలగుసర్వంబును నీకామధేనువువలననేయగుచున్నవి. ఇందుకుసందియములేదు. సత్యముగాఁజెప్పెదవినుము. ఈకామధేనువేనాసమస్తధనము. మఱియునాకు సదా సంతోషముసేయునదియునిదే. ఓవిశ్వామిత్రమహారాజా! ఇంకననేకకారణంబులునుగలవు. కావున నేనునీకీకామధేనువునివ్వను. అనినవాక్యవిశారదుండగు విశ్వామిత్రుండు మిగులఁబూనికతో నర్థవంతంబుగనిట్లనియె.

ఓవసిష్ఠుఁడా! స్వర్ణనిర్మితమగునడుమునగట్టెడుమోకులచేతను, మెడనుగట్టెడుమోకులచేతను, స్వర్ణాంకుశంబులచేతను, నలంకరింపఁబడిన పదునాలుగువేలయేనుఁగులనిచ్చెదను. స్వర్ణమయమైనవియును, శ్వేతగుఱ్ఱములుగలవియును, నాలుగేసిగుఱ్ఱములుగలవియును, కింకిణీకములచేతను చిఱుగంటలచేతను సలంకరింపఁబడినవియును, నగు నెనిమిదినూఱుల రథంబులనిచ్చెదను. సువ్రతుండవగు నోవసిష్ఠుఁడా! మఱియుకులజంబులును, దేశీయంబులును, మహౌజసంబులునునగు పదునొకండువేల గుఱ్ఱంబులనిచ్చెదను. ఇంకను నానావిధవర్ణములుగలవియును, యౌవనముగలవియునగు నొకకోటిగోవులనీకిచ్చెదను.

బ్రాహ్మణోత్తముడవగు నోవసిష్ఠుఁడా! నీవుగోరున న్నిరత్నంబులనైనను, బంగారంబునైనను నీకిచ్చెదను. నాకు కామధేనువునిమ్మనిన వసిష్ఠుండిట్లనియె. ఓవిశ్వామిత్రమహారాజా! నీవెంతచెప్పినను, కామధేనువునుమాత్ర మిచ్చుటలేదు. ఈకామధేనువేనాకురత్నములరాశి. ఈకామధేనువే నాకు సమస్తధనము. ఈకామధేనువే నాప్రాణము.

ఓవిశ్వామిత్రుఁడా! నాకుదర్శమును, పూర్ణమాసమును, యాగదక్షిణలును, మఱియు నానావిధక్రియలును, ఈకామధేనువేను. నేనుజేసెడిసమస్తసత్కర్మంబులకునునీకామధేనువేమూలము. ఇవ్విషయమునం దొకింతయైననుసందియములేదు. ఊరకప్రయోజనములేనిమాటల మాటలాడుచుండిన నేమియుసార్థకంబులేదు. కావుననీవెన్ని చెప్పినను గోరినవానినన్నింటిని బిఱికెడికామధేనువునిచ్చుటలేదు.

ఇట్లుశ్రీమద్బాలకాండమునందలి యేబదిమూడవసర్గముముగిసెను.

—✻ { విశ్వామిత్రుఁడు బలాత్కారముగ కామధేనువునుతీసికొనిపోవుట. } ✻—

ఓరామచంద్రా! ఇట్లు మునీశ్వరుండగు వసిష్ఠమహర్షి యనేకవిధంబులంజెప్పి కామధేనువునివ్వనందున విశ్వామిత్రుండు బలాత్కారముగ నాకామధేనువునీడ్చె. ఓరఘునందనా! అంతఁగామధేనువు మిగులధైర్యవంతుఁడగు విశ్వామిత్రమహారాజుచేనీడ్వఁబడి దుఃఖితురాలై యిట్లువిలపింపందొడంగె. మహాత్ముండగు వసిష్ఠమహర్షిచే నేనువిడవఁబడితినాయేమి? మిగులదుఃఖముచే భయభ్రాంతకంపితయైన నన్నిట్లుబలాత్కారముగ విశ్వామిత్రునిభటులునీడ్చుకొనిపోవుచున్నారే? మఱియు ధార్మికుండును నాత్మవేత్తయునగువసిష్ఠమహర్షి భక్తురాలును బ్రియురాలును నిరపరాధినియునగు నన్నిట్లు విడిచిపెట్టునంతటి యపకారము వసిష్ఠునకేమిచేసితిని? అనిచింతించె.

శత్రుసూదనుఁడవగు నోరాముఁడా! ఆకామధేనువిట్లనేకవిధంబులఁజింతించి పలుమారునిట్టూర్పులవిడుచుచు నావిశ్వామిత్రునిభటులను నొక్కొక్కపర్యాయమునకునూఱుమందిగ నందఱినివిదిలించి వాయువేగంబుతోమహాత్ముండగు వసిష్ఠునిపాదమూలంబుఁజేరె. ఇట్లుచేరి వసిష్ఠమహర్షిముందఱ నిలువంబడిదుఃఖింపుచు మేఘదుందుభులుంబోలె నఱచుచునిట్లనియె. బ్రహ్మపుత్రుండవును,మహాత్ముండవునునగు నోవసిష్ఠుఁడా! నీవునన్నువిడిచిపెట్టితివా యేమి? ఈరాజభటులు సమీపంబునందుండి నన్నేలయిట్లీడ్చుకొనిపోయెదరని యడిగిన బ్రహ్మర్షియగు నవ్వసిష్ఠుండిట్లనియె.

ఓకామధేనువా! శోకసంతప్తహృదయురాలవైతోబుట్టువలె మిగులదుఃఖింపుచున్న నిన్నెన్నటికిని నేవిడువఁజాలను. నీచేనాకపకృతిఁజేయఁబడలేదు. మిగులబలపరాక్రమసంపన్నుఁడగువిశ్వామిత్రమహారాజు నావద్దనుండినిన్ను బలాత్కారముగదీసికొనిపోయెను. నాకతనితోసరియైన సేనాబలములేదు. అట్లులేకపోయినను తపోబలంబుచేనతనినిగ్రహింపందలంచితినేని రాజ్యంబును బరిపాలించునట్టి ప్రభువుగనున్నాడు. మఱియు నిప్పుడేయాతిథ్యంబును వానొసంగితిని. కావునసంహరింపంగూడదు. రాజునుమరణంబునొందించిన మహాపాతకంబుసంభవించును.

ఓకామధేనువా! ధ్వజసహితములగు నేనుంగులునుగుఱ్ఱములచేఁగట్టబడిన రథసంకులంబులుగలసేనలను నీవిశ్వామిత్రమహారాజు సంపూర్ణంబుగగలిగియున్నాఁడు. కావున నావిశ్వామిత్రుఁడు మిగులబలముగలిగి యున్నాడనిచెప్పినవిని వాక్యస్వారస్యములనెఱింగిన యాకామధేనువు వినీతయై యమితప్రభగల వసిష్ఠమహర్షితోనిట్లనియె. బ్రాహ్మణోత్తముఁడవగు నోవసిష్ఠమహర్షీ "శ్లో॥ నబలంక్షత్రియస్యాహుర్బ్రాహ్మణోబలవత్తరః। బ్రహ్మన్‌బ్రహ్మబలందివ్యంక్షత్రాత్తుబలవత్తరమ్॥" క్షత్రియునియొక్కబల మల్పబలము. బ్రాహ్మణుఁడెక్కుడుబలముగలవాఁడు. మఱియు బ్రాహ్మణబలము క్షత్రియబలంబునకంటె మిగులశ్రేష్ఠమయినది. అధికబలయుక్తమయినది. అనిపెద్దలు వచింపుదురు.

మహాభాగుండవైన నోవసిష్ఠుఁడా! నీయొక్కబల మింతనిచెప్పుటకలవిగాదు. విశ్వామిత్రమహారాజు మిగులబలపరాక్రమసంపన్నుఁడైనను నీతోసమానుండుకాడు. నీవు మహాప్రభావముఁగలవాడవు. ఓవసిష్ఠమహర్షీ ! నీయొక్కమంత్రప్రభావముచే వృద్ధినొందినమహిమగల నన్నునియోగింపుము. దురాత్ముండగు నావిశ్వామిత్రునిగర్వబలమునంతయు నశింపంజేసెదను.

{ విడిపించుకొనివచ్చినకామధేనువసిష్ఠాజ్ఞచేమ్లేచ్ఛులసృజించి విశ్వామిత్రసైన్యమును నశింపజేయుట. }

ఓరామచంద్రా! కామధేనువునిట్లుచెప్పినవిని వసిష్ఠమహర్షి యిట్లనియె. కోరినవస్తువులనెల్లనొసంగెడి యోకామధేనువా! ఈశత్రుబలంబులనెల్ల సంహరించునట్టిసైన్యమును సృజియింపుమని యాజ్ఞయొసంగె. అంత నాకామధేనువు "హుం,, "హుం,, అనిహుంభారవంబుగావించె. ఇట్లు హుంభారవంబొనర్చినతత్క్షణంబున పహ్లవులను మ్లేచ్ఛులు పుట్టిరి. ఇట్లుపుట్టి యామ్లేచ్ఛులు విశ్వామిత్రమహారాజు చూచుచుండగ నతనిసైన్యంబునంతయుం జంపిరి. అంతవిశ్వామిత్రమహారాజు నాశమునొందిన తనసైన్యమునుఁజూచిమిగులగోపంబుతో గ్రుడ్లను గిరగిరంద్రిప్పుచు మ్లేచ్ఛులుండుచోట్లకు తనరథంబునుపోనిచ్చి మహాద్భుతంబులగు శస్త్రములచే నామ్లేచ్ఛులనెల్ల మరణంబునొందించె.

కామధేనువుతనచేసృజింపఁబడినమ్లేచ్ఛులువిశ్వామిత్రునిచేమరణమునొందినపిదపమరలసైన్యమునుసృజించుట.

పిదప కామధేనువు తానుసృజించినపహ్లవులను మ్లేచ్ఛులువేలకొలది విశ్వామిత్రునిచే మృతినొందుటనుజూచి మిగులరోషముతో మరలశకులనుమ్లేచ్ఛులనుసృజించె. అట్టియెడ నాశకసంజ్ఞగల మ్లేచ్ఛులుయవనులతోడంగూడి భూమియంతయునావరించుకొనిరి. మహాప్రకాశముగలవారును, మహావీర్యముగలవారును, సంపంగిపువ్వులకేసరములతో సమమైన కాంతిగలవారును, తళతళమనిమెఱయు దీర్ఘములైనకత్తులును, పట్టసములునుధరించినవారును, స్వర్ణవర్ణముగల వస్త్రములధరించినవారును, నగునాశకసంజ్ఞగలమ్లేచ్ఛులు విశ్వామిత్రమహారాజుయొక్క సైన్యంబుమీదంబడి "భగభగమండెడి నిప్పులుభస్మంబు సేయుచందంబున" ఆసైన్యమునుగాల్చి భస్మంబుసేసిరి. ఇట్లామ్లేచ్ఛులు తనసైన్యమును మరణము నొందించుటనుజూచి విశ్వామిత్రుండు మహారోషంబుతో నమోఘంబులగు నస్త్రములం బ్రయోగించె- అంతనయ్యస్త్ర ప్రయోగంబులచే యవనకాంభోజపహ్లవులను మ్లేచ్ఛులందఱునుకలతనొంది పరుగిడదొడంగిరి.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి యేబదినాలుగవసర్గముముగిసెను.

—✻ కామధేనువుమరల మ్లేచ్ఛులసృజించుట. ✻—

ఇట్లుమ్లేచ్ఛులందఱును విశ్వామిత్రునియొక్క యస్త్రంబుల దెబ్బలకోర్వజాలక పరుగిడుచుండుటను విశ్వామిత్రుండుజూచి కామధేనువుతోనిట్లనియె. ఓకామధేనువా! నీవు మరలయోగమహిమచే యవనాదులసృజింపుమని యాజ్ఞజేసిన నాకామధేనువు హుంభారవముగావించె. ఇట్లు హుంభారవమొనర్చిన నందుండిసూర్యునితో సమానులైన కాంభోజులును, స్తనములవలన, ఆయుధపాణులగుపహ్లవులనువారును, యోని ప్రదేశమువలనయవనులును, పురీషప్రదేశమువలన, శకులనువారును, రోమకూపములవలన, తురకలును, బోయలతోగూడిన హారీతులనువారును,పుట్టిరి.

మ్లేచ్ఛులు విశ్వామిత్రునిసైన్యమును మరణము నొందించుట.

ఓరామచంద్రా! ఇట్లుపుట్టిననామ్లేచ్ఛులు మొదలగువారుకాల్బలములతోడను, ఏనుంగులతోడను, గుఱ్ఱంబులతోడను, రథంబులతోడనుంగూడిన నావిశ్వామిత్ర మహారాజుయొక్క సైన్యంబుపయింబడిక్షణకాలంబులో నందఱినిమరణమునొందించిరి. అంతవిశ్వామిత్రమహారాజుయొక్క పుత్రులునూర్గురును తమసైన్యంబంతయు వసిష్ఠమహర్షిచేనశింపఁబడుటంగాంచి యేమియందోచక మిగులగోపంబుతోగూడియుండువాఁడును, తపోవంతులలోశ్రేష్ఠుండునునగు వసిష్ఠమహర్షియొద్దకు బరుగెత్తిరి.

—✻ వసిష్ఠమహర్షిచే విశ్వామిత్రుని పుత్రులు మరణము నొందుట ✻—

అట్టియెడవసిష్ఠమహర్షి తనయొద్దకుబరుగెత్తివచ్చుచున్నవిశ్వామిత్రునిపుత్రులంజూచి "హుం"అనిహుంకారముసేసె. అట్టిహుంకారముచేవారలందరును దహింపఁబడిరి.

— పుత్రులుమరణమునొందుటచే విశ్వామిత్రుడు విరక్తినొంది తపంబునకేగుట. —

ఇట్లు మహాప్రభావసంపన్నుఁడగు వసిష్ఠమహర్షిచే క్షణకాలంబులో చతురంగబలసమేతులగు తనపుత్రులుభస్మంబగుటను మహాకీర్తిసంపన్నుఁడగు విశ్వామిత్రమహారాజు జూచి లజ్జాక్రాంతవదనుండయ్యె, మఱియు వేగములేని సముద్రునివలె యుద్ధప్రవృత్తిలేనివాఁడయ్యె, కోఱలుపెరకబడినసర్పమువలె శక్తిలేనివాఁడయ్యె. రాహుగ్రస్తుఁడైన సూర్యునివలె తేజోహీనుఁడయ్యె, ఇట్లువిశ్వామిత్రుఁడు మహాఖిన్నుఁడై ఛేదింపఁబడినఱెక్కలుగల పక్షివలెనయ్యె. పోఁగొట్టఁబడిన గర్వోత్సాహములుఁ గలవాఁడయ్యె. మఱియు క్షీణనకెంకేల యాచతురంగబలంబులని విసుకుజెందె. ఇట్లువిసుకుజెందిచనిపోయిన తనపుత్రులలోమిగిలియున్నయొకనిబిలిచి నాయనాపుత్రుఁడా! నీవుక్షత్రధర్మమననుసరించిరాజ్యము బరిపాలింపుచుండుము- నేనుతపంబుజేయుటకరణ్యంబునకు బోయెదనని చెప్పి తానరణ్యంబునకేగె- మహాతపుండగునావిశ్వామిత్రుఁ డీశ్వరానుగ్రహంబు నొందుటకై కిన్నరులును గుహ్యకులునివసింపుచుండెడి హిమవత్పర్వత ప్రాంతప్రదేశమునకుబోయి తపంబొనర్పదొడంగె. ఇట్లుతపంబొనర్చుచుండగ బిదపఁగొంతకాలమునకుదేవేశుండును వరదుండునునగుపరమేశ్వరుఁడు ప్రత్యక్షుండై యిట్లనియె.

ఓవిశ్వామిత్రమహారాజా! నీవుదేనికొఱకు తపముజేయుచున్నావు? నీకేమికోరికగలదోచెప్పుము? నేనువరములనిచ్చువాఁడను? నీకేమివరముగావలయునో కోరుమిచ్చెదను. అనియిట్లుపరమేశ్వరుండుచెప్పిన మహాతపుండగు విశ్వామిత్రుఁడు మహాదేవునకునమస్కరించియిట్లనియె. అనఘుండవగు నోపరమేశ్వరుఁడా! నేజేసినతపంబునకు నీవుసంతుష్టుండవైతివేని అంగములతోను నుపాంగములతోను, ఉపనిషత్తులతోను, గూడినదియు, నుపదేశముచేబొందదగిన రహస్యమంత్రంబులతోనుం గూడినదియునగు ధనుర్వేద

మును నాకుదయచేసియిమ్ము- ఓపరమేశ్వరుఁడా! దేవతలందును, దానవులయందును, మహర్షులందును, గంధర్వయక్షరాక్షసులందును నేయేయస్త్రములుగలవో యాయస్త్రంబులన్నియు నాయందుప్రకాశించు చుండవలయు.

దేవదేవుండవైన నోపరమేశ్వరుఁడా! నాయొక్కవేరైనమఱియొకమనోరథంబునునీయనుగ్రహమువలననగుగాక-అనియిట్లువరంబడిగిన నప్పరమేశ్వరుండట్లనే యగుగాకయనివరంబిచ్చి యంతర్ధానుఁడయ్యె.

విశ్వామిత్రుడుఅస్త్రములబడసియుద్ధమునకు వసిష్ఠాశ్రమమునకువచ్చుట.

అంత మహాబలవంతుఁడును, రాజును, ఋషియునునగువిశ్వామిత్రుఁడు అస్త్రములనుబొంది రాజాంశగర్వముఁగలవాఁడయ్యును నస్త్రబలంబుగలుగుటవలన విశేషగర్వముఁగలవాఁడయ్యె- మఱియునావిశ్వామిత్రుఁడు పర్వకాలమునందు నుప్పొంగెడిసముద్రమువలె, పరాక్రమముచేవృద్ధినొందుచు ఋషిసత్తముండగు వసిష్ఠమహర్షిని జంపఁబడినవానిగానేతలంచె.

విశ్వామిత్రుఁడు వసిష్ఠాశ్రమమును భస్మంబగునట్లు సేయుట.

ఇట్లుతలంచి యావిశ్వామిత్రుండు మహారోషవంతుఁడైవసిష్ఠ మహర్ష్యాశ్రమప్రదేశముఁజేరి స్వతేజస్సుచేతను, అస్త్రములచేతను నాతపోవనమంతయు భస్మంబగునట్లస్త్రప్రయోగముంజేసె, ఇట్లస్త్రప్రయోగముంజేసిన నవ్వసిష్ఠాశ్రమమునందుండు మునులందరును ధైర్యవంతుండగు నవ్విశ్వామిత్రునియొక్క యస్త్రములంజూచి భయంబునొందిగుంపులుగుంపులుగ నలుదిక్కులంబరుగెత్తిరి- ఇట్లు వసిష్ఠమహర్షియొక్క శిష్యులందఱును బరుగెత్తుచుండగ నటులనే మృగములునుబక్షులును, ప్రయోగింపంబడుచున్న యస్త్రములంజూచి మిగులభయంబునొంది తమతమనిలయంబులనుండి వేలువేలుగాబరుగెత్తినవయ్యె మహాత్ముండగునవ్వసిష్ఠమహర్షియొక్కతపోవనము, చెట్లు,పొదలు,మొదలగునవియేమియునులేక శూన్యంబైయుండె- మఱియు నాతపోవనము ముహూర్తకాలము నిశ్శబ్దముగను చవిటిభూమింబోలినదిగనుండె- అంతనవ్వసిష్ఠమహర్షి తనతపోవనంబంతయు నిట్లల్లకల్లోలంబగుటనుజూచియిట్లనియె.

ఓమునులారా! ఓశిష్యులారా! ఓపక్షులారా! ఓమృగములారా! రక్షకుఁడైననేనుండగా మీరేలభయపడి పరుగెత్తెదరు? సూర్యుండుదయించినక్షణంబున మంచుపటాపంచలైసమసిపోవుచందంబున నేనిప్పుడేవిశ్వామిత్రునింజంపెదను- మీరుభయపడవలదు-భయపడవలదు- అనివసిష్ఠమహర్షి చెప్పుచుండె. అట్లువసిష్ఠమహర్షి భయపడవలదనిమున్మాటికిజెప్పుచుండినను నమ్మాటలనులక్ష్యపెట్టక భయంబునొందియందున్నవారందరును పరుగెత్తిపోయిరి-అంతమహాతేజుండును, తపోవంతులలో శ్రేష్ఠుండును, నగునావసిష్ఠమహర్షి మిగులరోషముగలవాడై విశ్వామిత్రునింజూచి యిట్లనియె.

వసిష్ఠమహర్షి విశ్వామిత్రునింజూచినిందించుట.

ఓరిమూఢుఁడా! నీవుబహుకాలమునుండి వృద్ధిఁబొందింపఁబడిన నాయాశ్రమమునునాశముజేసితివి- అందువలననే నీవుదురాచారుండవైతివి- ఇంకనీవుజీవింపనేరవు- అనియిట్లువసిష్ఠమహర్షి మహాకోపంబుతోబలికి యతిత్వరతోడంగూడి పొగలేనిప్రళయాగ్నివలెను, రెండవదగుకాలదండమువలెను, నుండెడుబ్రహ్మదండమును బట్టుకొనియుండె.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యేబదియైదవసర్గముముగిసెను.

వసిష్ఠమహర్షి విశ్వామిత్రునియస్త్రముల నన్నింటిని బ్రహ్మదండంబుచే నశింపఁజేయుట.

అంత మహాబలుండగు విశ్వామిత్రుండు నాగ్నేయాస్త్రముఁజేతంబూని వసిష్ఠమహర్షినిఁజూచినిలునిలుమనియదల్చె- ఇట్లదల్చిన,మహాత్ముండగు నవ్వసిష్ఠమహర్షి రెండవకాలదండముంబలెనున్న బ్రహ్మదండంబెత్తి మహాక్రోధంబుతోనిట్లనియె-క్షత్రియాధముండవగు నోరివిశ్వామిత్రుఁడా! నేనికడనేయున్నాఁడను? నీబలంబెట్టిదోదానిని జక్కగావిస్తరించిచూపుము? ఇప్పుడేనీయొక్కయు, నీశస్త్రముయొక్కయు దర్పమునునశింపఁజేసెదను- ఓరిక్షత్రియాధముఁడా! నీక్షత్రియబలంబెక్కడ? దివ్యంబగునాబ్రహ్మబలంబెక్కడ? శ్రేష్ఠంబగు నాబ్రహ్మబలంబుయొక్క సామర్థ్యముంజూడుము- అనియిట్లువసిష్ఠమహర్షి పలుకుచుండగనవ్విశ్వామిత్రుఁడాగ్నేయాస్త్రముంబ్రయోగించె.

అంతవసిష్ఠమహర్షి భగభగమనిమండుచువచ్చెడి ఘోరంబగు నయ్యాగ్నేయాస్త్రముంబూచి "జలంబుచేజల్లార్పఁబడిన నిప్పువేగమువలె నయ్యాగ్నేయాస్త్రమును తన బ్రహ్మదండముచేతంజల్లార్చె- ఇట్లుచల్లార్చిన నవ్విశ్వామిత్రుండు మిగులగోపాక్రాంతుండై వారుణాస్త్రమును, రౌద్రాస్త్రమును, ఐంద్రాస్త్రమును, పాశుపతాస్త్రమును, ఐషీకాస్త్రమును, నొక్కటేతూరిగ బ్రయోగించె- రఘుకులోత్తముఁడవగు నోరామచంద్రా! విశ్వామిత్రుండిట్లునాలుగస్త్రముల నొక్కసారిగబ్రయోగించి యంతటితోనూరకుండక పైపైనమను దేవతాకమగుమూన

వా స్త్రమును, మోహనాస్త్రమును, గంధర్వ దేవతాక మగు గాంధర్వాస్త్రమును, నిద్రబుట్టించునట్టి స్వాపనాస్త్రమును, ఆవలింతలంబుట్టించునట్టి జృంభణాస్త్రమును, మత్తతను గలుగజేయునట్టి మాదనాస్త్రమును, సంతాపవిలాపంబులు గలుగజేయునట్టి సంతాపన విలాపనాస్త్రమును, శోషణాస్త్రమును, దారణాస్త్రమును, జయింపనలవిగాని సుదుర్జయాస్త్రమును, వజ్రాస్త్రమును, బ్రాహ్మపాశమును, కాలపాశమును, వరుణ దేవతాకమగు వారుణాస్త్రమును, పాశమును, పైనాకాస్త్రమును, ద్వైతమును, శుష్కార్ద్రములనుపిడుగులను, దండాస్త్రమును, పైశాచాస్త్రమును, క్రౌంచాస్త్రమును, ధర్మచక్రమును, కాలచక్రమును, విష్ణుచక్రమును, వాయుదేవతాకమగువాయవ్యాస్త్రమును, మథనమును, హయశిరమును, శక్తిద్వయమును, కంకాళమును, ముసలమును, గొప్పయస్త్రమగు విద్యాధరాస్త్రమును, కాలాస్త్రమును, దారుణమును, త్రిశూలమును, ఘోరాస్త్రమును, కాపాలమును, కంకణమును. ననునీయస్త్రములను బ్రయోగించె.

ఓరామచంద్రా! ఇట్లనేకాస్త్రములం బ్రయోగించినను తపోవంతులలో శ్రేష్ఠుఁడగు నవ్వసిష్ఠమహర్షి ని కొంచమైనను చలింపంజేయనేరక బోవుటంజేసి మిగులనాశ్చర్యంబుగనుండె. బ్రహ్మపుత్రుండగు నవ్వసిష్ఠమహర్షి విశ్వామిత్రునిచేఁ బ్రయోగింపంబడిన యస్త్రముల నన్నింటిని తన బ్రహ్మదండముచే గ్రసింపంబడుచుండునట్లు చేయుచుండె

—* విశ్వామిత్రుఁడుబ్రహ్మాస్త్రప్రయోగము సేయుట *—

అంత విశ్వామిత్రుండు తనయస్త్రంబులన్నియు వ్యర్థంబులగుటంజూచి యేమియుందోచక బ్రహ్మాస్త్రమును బ్రయోగించె. అట్టియెడనగ్నిదేవుఁడు మొదలగు దేవతలును, దేవర్షులును, గంధర్వులును, మహోరగులును, విశ్వామిత్రునిచేఁ బ్రయోగింపఁబడిన బ్రహ్మాస్త్రముంజూచి భయభ్రాంత కంపితశరీరులైరి. మఱియు నాబ్రహ్మాస్త్రమును బ్రయోగించినతోడనే ముల్లోకములును భయంబుచే దల్లడిల్లె.

—* వసిష్ఠమహర్షి బ్రహ్మాస్త్రమును బ్రహ్మదండముచే మ్రింగుట. *—

దశరథరాజనందనుఁడవగు నోరామచంద్రా! అంతట వసిష్ఠమహర్షి యమ్మహాఘోరంబగు బ్రహ్మదేవతాకమైన బ్రహ్మాస్త్రమును, సర్వమును, బ్రహ్మవిద్యవలన జనించిన తేజస్సుచే వృద్ధినొందింపఁబడిన బ్రహ్మదండముచేత గ్రసించె. (అనఁగామ్రింగెను) ఇట్లు బ్రహ్మాస్త్రమును మ్రింగుచున్న మహాత్ముండగు వసిష్ఠమహామునియొక్క స్వరూపము ముల్లోకములవారిని మూర్ఛనొందించునదిగను, భయంకరమైనదిగను, చూడశక్యముగా నిదిగనునుండె. (అనఁగానద్భుతంబగు తేజోరూపంబువసిష్ఠమహర్షికిగలిగె)

మఱియు మహాప్రభావుండగు నవ్వసిష్ఠమహర్షి యొక్క సమస్త రోమకూపములందుండి ,,పొగచే సంకులంబయిన మంటలుగల యగ్నివలె,, భగభగమను నగ్నిజ్వాలలు బయలువెడలె. మఱియు నవ్వసిష్ఠమహర్షి తనహస్తమునందు ధరించియున్న బ్రహ్మదండము ,, బ్రహ్మాస్త్రమును గ్రసించుటచే రెండవ యమదండంబువలెను, పొగలేక జ్వలింపుచుండెడు ప్రళయాగ్నివలెను,,భగ్గుభగ్గుమని మండుచుండె. అంత నియ్యద్భుతకార్యంబులం జూచుచుండిన మునిగణంబులు వసిష్ఠమహర్షి నిట్లుస్తుతించిరి

—* వసిష్ఠమహర్షిని మునులు స్తుతించుట. *—

శ్లో॥ అమోఘంతే బలంబ్రహ్మన్ తేజోధారయతేజసా। నిగృహీతస్త్వయాబ్రహ్మన్ విశ్వామిత్రోమహాతపాః। ప్రసీదజపతాం శ్రేష్ఠలోకాస్సంతుగతవ్యథాః॥,, బ్రాహ్మణోత్తముఁడవగు నోవసిష్ఠుఁడా! నీబలమమోఘంబైనయది. నీప్రభావముచే బ్రహ్మాస్త్రతేజస్సును నుపశమింపంజేయుము. మహాతపుండగు విశ్వామిత్రుఁడు నీచే నిగ్రహింపంబడెను.(అనగానోడిపోయెను)తపోవంతులలో శ్రేష్ఠుఁడవగు నోవసిష్ఠమహర్షీ! ప్రసన్నుఁడవగుము. జనులందఱు వ్యసనములేనివార లగుదురుగాక అనియిట్లనేక విధంబుల స్తోత్రముఁజేసిన మహాతపస్సంపన్నుఁడును, మహాతేజుండును, నగు వసిష్ఠమహర్షి మునీశ్వరులచేఁ బ్రార్థింపంబడి కోపంబును నుపశమింపంజేసె.

—* విశ్వామిత్రుడుబ్రహ్మాస్త్రము వ్యర్థంబగుటకుచింతించుట. *—

అంత నోడిపోయిన విశ్వామిత్రుండు నిట్టూర్పువిడిచి యిట్లనియె. ,,శ్లో॥ధిగ్బలంక్షత్రియబలం బ్రహ్మతేజోబలంబలమ్। ఏకేన బ్రహ్మదండేన సర్వాస్త్రాణి హతాని మే,, క్షత్రియబలం బొకబలంబగునా? (కానేరదు)బ్రాహ్మ్యరూపంబగు తేజోబలమే మిగులశ్రేష్ఠంబయిన బలము. ఇప్పుడీ వసిష్ఠ మహర్షియొక్క బ్రహ్మదండముచేతనే బ్రహ్మాస్త్రంబుదప్ప తక్కినయస్త్రంబుల నన్నింటిని తుత్తుమురుగగొట్టివేసె. కావున నీరెండుబలంబులకుంగల వెచ్చుతగ్గులను జక్కగాదెలిసికొనిన నేత్రరోషముగల నేను బ్రాహ్మణ్యోపాదకంబగు గొప్పతపంబొద్దియో దానిసనుష్ఠించెదను. ఇట్లు శ్రీమద్బాలకాండమునందు ఏబదియారవ సర్గముగిసెను.

— విశ్వామిత్రుండు బ్రహ్మర్షి యగుటకై తపస్సు సేయబోవుట, —

రఘువంశ సంభూతుండవగు నో రామచంద్రా! ఇట్లు సంతాపమునొందిన మనస్సుగలవాఁడును, మనోనిగ్రహము సేయవలయునను తలంపుగలవాఁడును, మహాత్ముండగు వసిష్ఠమహర్షి యొక్క విరోధముగలవాఁడును,నగునవ్విశ్వామిత్రుఁడు నిట్టూర్పును మాటిమాటికిని విడుచుచు నేమియుంజేయనేరక తనభార్యతోడంగూడి దక్షిణదిశంగూర్చిపోయెను. ఇట్లుపోయి శరావతీనదిందాటి దానికిదక్షిణంబుగబోయి ఘోరంబగు తపంబును సర్వోత్కృష్టంబుగనుండునట్లుసలిపె. మఱియునవ్విశ్వామిత్రుఁడు కందమూలఫలంబుల నాహారంబుగాఁ జైకొని యింద్రియనిగ్రహుండై శ్రేష్ఠంబగుతపంబొనర్చె.

—* విశ్వామిత్రునకుబుత్రులుపుట్టుట. *—

అంత నవ్విశ్వామిత్రునకు సత్యధర్మ పరాయణులగు హవిష్యందుఁడు, మధుష్యందుఁడు, దృఢనేత్రుఁడు, మహారథుఁడు, అనునలుగురుపుత్రులు జనించిరి. అట్లుతపంబు జేయుచుండగ వేయిసంవత్సరములుగతించె.అట్టియెడ లోకపితామహుండగు బ్రహ్మదేవుఁడు ప్రసన్నుండై తపోధనుండగు విశ్వామిత్రునితో నిట్లనియె.

—* విశ్వామిత్రునకు బ్రహ్మదేవుడు వరంబిచ్చుట. *—

కుశికాత్మజుండవగు నోవిశ్వామిత్రుఁడా! నీవుచేసిన తపస్సుచే రాజర్షి లోకంబులు జయింపంబడియె. నీచేఁజేయబడిన తపస్సువలన నీవిపుడు రాజర్షి వైతివని తలంచెదము. అనియిట్లు లోకప్రభువును, మహాతేజుండునునగు బ్రహ్మదేవుఁడుపలికి దేవగణంబులతోడ స్వర్గమునుబొంది సత్యలోకమునకుఁబోయె. పిదపవిశ్వామిత్రుఁడు బ్రహ్మదేవుని వాక్యములనువిని సిగ్గుచేఁ దలవంచుకొని మిగుల వ్యసనాక్రాంతుండయి దైన్యమునొంది యిట్లనితలంచె. ఓహోహో; నేనుమిక్కిలి యధికమైనతపస్సుచేసితిని. ఋషిగణములతోడంగూడిన దేవతలందఱును నన్నురాజర్షి వయితివని చెప్పుచున్నారు. ఇంతకాలము నేఁజేసిన ఘోరంబయిన తపస్సునకిదేనాఫలము, నేఁజేసినతపస్సున కిది సరియైనఫలముగాదు. అనితలంచె. కకుత్థ్సకుల వర్ధనుఁడవగు నోరామచంద్రా! మహాతపోవంతుఁడును మహాప్రయత్నముగలవాఁడును, నగువిశ్వామిత్రుఁ డిట్లుమనంబున స్థిరపఱచుకొనిమరల మునుపటికంటె నెక్కువయగు తపస్సుఁజేయ నారంభించె.

—* త్రిశంకుమహారాజు సశరీరస్వర్గము నొందుటకై వసిష్ఠునితో నాలోచించుట. *—

ఇది యిట్లుండగా సత్యవంతుండును, జితేంద్రియుండును, ఇక్ష్వాకుకులవర్ధనుండును, నగుప్రసిద్ధుండైన త్రిశంకువనుమహారాజుగలఁడు. ఓరామఁడా! ఆత్రిశంకుమహారాజునకు దేవతలునివసించెడి స్వర్గలోకమును స్వశరీరంబుతోఁ బొందవలయునని తలంపుగలిగి యందులకుం దగిన యజ్ఞము సేయవలయునని నిశ్చయించె. ఇట్లు నిశ్చయించి వసిష్ఠమహర్షిని బిలిపించి సత్కరించి యిట్లనియె. గురువర్యుండవగు నోవసిష్ఠుఁడా! నేనుశరీరంబుతో స్వర్గమునుబొందుటకుందగిన యజ్ఞమును జేయవలయునని నిశ్చయించితిని. తాను పురోహితులు కనుక నట్టియాగమును జేయింపవలయునని ప్రార్థించిన వసిష్ఠుండిట్లనియె.

—* త్రిశంకుమహారాజువసిష్ఠునిచే నిరాకరింపఁబడుట *—

ఓరాజోత్తమా!నీవుగొంతెమ్మ కోరికలంగోరుచున్నావు. మానవులు శరీరంబుతోడ స్వర్గలోకమును జెందుట మిగులకష్టము. కావుననిక నీవీప్రయత్నమును జేయవలదని ఖండితముగజెప్పి తనయాశ్రమంబునకుఁబోయె. అంత త్రిశంకుమహారాజాప్రయత్నము నంతటితో వదలిపెట్టక ప్రయాణంబై యెట్లయినను శరీరంబుతో స్వర్గముంబొందునట్టి యాగము జేయవలయునను ఘ్రానికతో దక్షిణదిక్కునుగూర్చిపోయె,

—* త్రిశంకువువసిష్ఠునిపుత్రులనుప్రార్థించుట. *—

ఇట్లు మహాపరాక్రమవంతుఁడగు నాత్రిశంకుమహారాజు బహుదూరనుపోయి దీర్ఘతపస్సుగల వసిష్ఠమహర్షి పుత్రులు తపస్సుజేయుచుండెడి యాశ్రమంబును జేరె. ఇట్లు జేరి గురువుచే నిరాకరింపఁబడిన వాఁడగుటవలన సిగ్గుచేకొంచెముగ దలవంచుకొని గురుఁడైన వసిష్ఠమహామునియొక్క పుత్రులకు క్రమముగ నందఱికిని నమస్కరించి కృతాంజలుఁడై యిట్లనియె.

ఓవసిష్ఠమహర్షి పుత్రులారా! శరణాగతుఁడగు నేను శరణాగతవత్సలులగు మిమ్ములను శరణుపొందుచున్నాను. మీకు మంగళమగుఁగాక. మహాత్ముండగు వసిష్ఠమహర్షి చే నిరాకరింపఁబడితిని. మహాయజ్ఞమును జేయవలయు నను కోరిక గలిగియున్నాను. అట్టిమహాయజ్ఞానుష్ఠానమును అనుగ్రహించుటకు మీరుతగుదురు. గురుపుత్రులగు మీకందఱికిని నమస్కరించుచున్నాను. నావిషయమునందు మీరెల్లరును ప్రసన్నులుకావలయు. తపోనిష్ఠులగు బ్రాహ్మణోత్తములయిన మిమ్ములను శిరస్సాష్టాంగ నమస్కారముచేసి యాచించుచున్నాను. నేనుశరీరముతోఁగూడ స్వర్గలోకముబొందునట్టి యజ్ఞమును ప్రసిద్ధులగుమీరు సావధానచిత్తులరై నెరవేరునట్లు జేయింపవలయు. తపోధనులరగు

నో గురుపుత్రులారా! వసిష్ఠమహర్షిచే నిరాకరింపఁబడిన నాకు గురుపుత్రులయిన మీరుదప్ప యజ్ఞసాధనోపాయము వేఱొకటి యున్నట్లగుపడలేదు. ఇక్ష్వాకువంశోద్భవులగు సమస్తరాజులకును పురోహితుఁడగు వసిష్ఠమహర్షి ముఖ్యతారకముగదా? లోకమునందు విద్వాంసులగు పురోహితులెల్లప్పుడును రాజులనుతరింపఁ జేయుచున్నారు. కావున వసిష్ఠమహర్షికివెనుక గురుపుత్రులగు మీరందఱును దైవతములయి నన్నుఁదరింపఁ జేయవలసినవారలు గదా? అనెను.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి యేబది యేడవసర్గ ముగిసెను.

—* త్రిశంకువు వసిష్ఠునిపుత్రులచే నిరాకరింపఁబడుట. *—

ఓ రామచంద్రా! ఇట్లుపలికిన త్రిశంకుమహారాజు వాక్యములవిని వసిష్ఠమహర్షి పుత్రులు నూర్గురును మిగుల కోపాక్రాంతులై యిట్లనిరి. ఓరిదుర్మార్గుఁడవగు త్రిశంకుఁడా! భవిష్యత్కాలవేత్త యగుటంజేసి సత్యము బలుకుటచే గురువువలన నిరాకరింపఁబడితివి. సరేగదా? పిదప గురువునువదిలి వేఱొండాశ్రయము నేలయవలంబించితివి. ఓరీదుష్టుఁడా! ఇక్ష్వాకువంశ సంభవులగు రాజులకందఱికిని పురోహితుండగు వసిష్ఠమహర్షి పరమగురువు. సత్యవంతుండగు నవ్వసిష్ఠ మహామునియొక్క మాట నతిక్రమింప నెవరికిని నలవిగాదు. మహాత్ముండగు నవ్వసిష్ఠమహర్షియే యజ్ఞమును జేయుట కశక్యంబని చెప్పియుండగ నీయజ్ఞమును జేయించుటకు మేమెట్లుసమర్థులమగుదుము. నరశ్రేష్ఠుండవగు నో త్రిశంకుమహారాజా! నీవుమూర్ఖుఁడుగ నున్నావు. మఱలనీవు నీపట్టణమునకుఁబొమ్ము. ముల్లోకములయందును యజ్ఞములఁజేయించుటయందు మహాత్ముండగు వసిష్ఠమహర్షి సమర్థుండని యెఱుంగుము. సాధింపంగూడనట్టి యజ్ఞమును వసిష్ఠమహర్షి కవమానకరంబుగఁ జేయించుటకు మేమెట్లు సమర్థులమగుదుము. అనిచెప్పిరి.

—* త్రిశంకువు వసిష్ఠునిపుత్రులనెదిరించిమాటలాడుట. *—

అంత త్రిశంకుమహారాజు మిగులఁ గోపయుక్తంబుగఁ జెప్పిన వసిష్ఠపుత్రులయొక్క మాటలనువిని మఱలనిట్లనియె. తపోవంతులగు నో వసిష్ఠమహర్షిపుత్రులారా! గురువగు వసిష్ఠమహామునిచే నిరాకరింపంబడితిని. అటులనే గురుపుత్రులగు మీచేతను నిరాకరింపంబడితిని. మీకు మంగళమగుఁగాక. నేనుమఱియొకని పురోహితునిగ నియమించుకొని యెదనని చెప్పె.

—* వసిష్ఠునిపుత్రులు త్రిశంకువునుశపించుట *—

ఇట్లు త్రిశంకుమహారాజు చెప్పగ నవ్వసిష్ఠ మహాముని పుత్రులు మిగులఁ గోపావేశంబుతో నిట్లనిరి. ఓరిదుష్టాత్ముఁడా! నాతండ్రిబ్రహ్మ పుత్రుండును, కులగురుండును నగు వసిష్ఠమహర్షిని నిరాకరించి వేఱొండు వానిని పురోహితునిగ నియమించుకొనియెదనని గర్వంబుచేఁ బలుకుచున్నాఁడవు. కావున "నీవుచండాలుండవగుదువుగాక,, యనిశాపంబిచ్చి తమయాశ్రమమును జేరిరి. ఇట్లువసిష్ఠమహర్షి పుత్రులు శాపంబిచ్చిననాటిరాత్రి గడచినపిదప మరునాడుదయమున త్రిశంకుమహారాజు చండాలత్వమును బొంది నల్లనివస్త్రముల ధరించినవాఁడుగను, నల్లనైనవాఁడుగను, బిరుసైన దేహముగలవాఁడుగను, కుఱచలగు తలవెంట్రుకలు గలవాఁడుగను, శ్మశానమునందుగలపుష్పమాలదండలను, భస్మధారణమును జేయువాఁడుగను, ఇనుముతోఁ జేయఁబడిన సొమ్ములుగలవాఁడుగను, నయ్యె. (అనఁగా పూర్వము రాజుపయోగించియుండినవస్త్రములు మొదలగునవియును, శరీరమునునిట్లయ్యెనని యెఱుంగునది)

ఓ రామచంద్రా! ఇట్లు వికృతాకారముగల చండాలరూపమునొందిన త్రిశంకుమహారాజునుచూచి యతని వెంటవచ్చినపురజనులును, మంత్రులును, భటులును త్రిశంకునివదలిపెట్టిగుంపుగగూడుకొని పరుగెత్తిపోయిరి. ఓరామచంద్రా! అట్టియెడ త్రిశంకు మహారాజు మిగులధైర్యవంతుఁడై వ్యసనముచే దివారాత్రములు దహింపఁబడుచునొంటరిగ వసిష్ఠమహర్షి విరోధియగు తపోధనుఁడైన విశ్వామిత్రమహర్షి యాశ్రమమునకుఁబోయి యతని యెదుట నిలువంబడియె.

—→ { చండాలత్వమునొందిన త్రిశంకువు విశ్వామిత్రునియొద్దకుబోవుట. }

అంతవిశ్వామిత్రమహాముని వసిష్ఠునిచేతను నతనిపుత్రులచేతను నిరాకరింపఁ బడినవాఁడును, చండాలరూపము నొందినవాఁడును, నగు త్రిశంకు మహారాజునుజూచి మిగులకరుణగలవాఁడయ్యె. ఇట్లుపరమధార్మికుండును. మహాతేజుండును, నగునవ్విశ్వామిత్రుఁడు ఘోరరూపమైనచండాలరూపముగలరాజునందు మిగులదయగలవాఁడై యిట్లనియె. ఓ త్రిశంకుమహారాజా! నీకుమంగళమగుఁగాక. నీవుయేమిపని నిమిత్తమిచటకివచ్చితివి? ఏకారణముచే శాపమువలనచండాల రూపమునొందితివి? అనియడిగె. అంత త్రిశంకు మహారాజు, చేమోడ్పుగల వాఁడై వాక్యకోవిదుండగువిశ్వామిత్రునితో నిట్లనియె.

ఓవిశ్వామిత్రుఁడా! గురువగు వసిష్ఠునిచేతను, నతని

పుత్రులచేతను, నిరాకరింపఁబడితిని. ఏయుద్దేశ్యముచే గురువులయొద్దకు బ్రయత్నపూర్వకంబుగ బోతినో, యానామనోరథమునాచేఁ బొందపడకయే యిట్టిజాతిభ్రంశమగు చండాలరూపము నాకుసంప్రాప్తంబయ్యె. సౌమ్యుఁడవగునో విశ్వామిత్రుఁడా! ఈశరీరముతోడస్వర్గమునకుఁ బోవలయునని నాసంకల్పము ఇదివఱకునేను నూఱుయజ్ఞంబులను జేసితిని. ఐనను దానిఫలంబేమియు నాచేఁబొందపడలేదు.

సుముఖుఁడవగునో విశ్వామిత్రుఁడా! ఇప్పుడునీయెదుటసత్యముగా జెప్పుచున్నాను. నాదుక్షత్రధర్మముసాక్షిగానిదివఱకు నేనెన్నఁడును నసత్యమాడినవాఁడనుగాను ఇఁకముందుగనెట్టి విపత్తులువచ్చినను నసత్యమాడంజాలను. నానావిధములగు యాగములునాచేఁ జేయంబడెను. ప్రజలను ధర్మపద్ధతిని బరిపాలించితిని మహాత్ములగు గురువులు మొదలగువారిని మంచియాచారగుణముతోడంగూడిసత్కరించి సంతోషపఱిచితిని.

మునిపుంగవుండవగు నోవిశ్వామిత్రుఁడా! నేనిట్లు ధర్మబుద్ధిగలవాఁడనయి ధర్మసంపాదనకొఱకు యాగముఁ జేయవలయునని కోరగా నాగురువులు సంతసింపరైరి,
శ్లో॥ దైవమేవపరంమన్యే పౌరుషంత్వనిరర్థకమ్। దైవేనాక్రమ్యతే సర్వం దైవంహి పరమాగతిః,, లోకంబున ప్రారబ్ధంబగునదృష్టమే మిగులగొప్పది. పురుషకారంబువలనం బ్రయోజనంబేమియులేదు. ప్రారబ్ధం బగునదృష్టము చేతనే సమస్తమును నాక్రమింపం బడుచున్నది. కావుననట్టియదృష్టమేపరమమైన గతికదా; ఓవిశ్వామిత్రుఁడా! నేనిపుడు దుఃఖసముద్రంబున మునిఁగియున్నవాఁడను. నాపురుషప్రయత్నంబంతయు దైవంబుచేఁ గొట్టుపడియె నీయనుగ్రహమునుఁ గోరుచున్నాఁడను. నాయందుఁ గరుణింపవలయు. నీకుమంగళమగుగాక. నేనుయితరులవద్దికి బోవుటలేదు. నీవుదప్పనన్నురక్షించువారి నెవరినింగానము.నీవుసమర్థుండవగుటచేఁ బౌరుషంబున దైవంబును ద్రిప్పఁగలవు. (అనఁగా నాదురదృష్టమును బోఁగొట్టి నాకోరికనీడేర్పఁగలవనుట)

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి యేబదియేనిమిదవసర్గము ముగిసెను.

—* విశ్వామిత్రుఁడు త్రిశంకువును నూఱడించుట *—

అనియిట్లనేక విధంబులఁ బ్రార్థింప సాక్షాచ్చండాలరూపముగల త్రిశంకు మహారాజుంజూచి మిగులదయగలిగి విశ్వామిత్రుం డిట్లనియె. ఓవత్సా! త్రిశంకుమహారాజా! నీకుస్వాగతమగుగాక. (అనఁగాసుఖముతోడిరాక యగుగాకనుట) నీవుమిక్కిలిధర్మాత్ముండవని యెఱుంగుదును. నీకురక్షకుడను గానగుచున్నాను. నీవురాజశ్రేష్ఠుండవు. భయపడకుము. నేనుపుణ్యకర్ములుగల వారును, యజ్ఞమునకుసహాయము జేయగలవారును, నగుమహర్షుల నందఱిని పిలిపించెదను. అంతనీవుసుఖముగ యజ్ఞముసేయఁగలవు. ఓరాజా! త్రిశంకూ! నీకిపుడుగురువుల శాపంబుచేఁ జండాలరూపముగలిగి యున్నదిగదా! అట్టి యీరూపంబుతోడనే సశరీరుండవై స్వర్గమునొందగలవు. నరాధిపుండవగు త్రిశంకూ! శరణు చొరఁదగినవాఁడనగునన్ను శరణుఁజొచ్చితివి. కావున స్వర్గము నీకఱచేతియందుండునట్లు తలంచుచున్నాను (అనఁగా నతిసులభముగ సశరీరస్వర్గమునొందఁ గలవనుట) అనియిట్లుమహాతేజుండగు విశ్వామిత్రుండు చెప్పిపరమధార్మికులును, మహాప్రాజ్ఞులునునగు తనకొడుకులంబిలిచి యోపుత్రులారా! యజ్ఞమునకుగావలసిన వస్తువులనన్నింటిని నతిశీఘ్రంబుగ సంపాదింపుఁడని యాజ్ఞయొసంగి తనశిష్యుల నందఱిని పిలిచియిట్లనియె.

—{ సశరీరస్వర్గమునకై సేయుయజ్ఞమునకుఋషులనుపిలుపింపుఁడనివిశ్వామిత్రుండాజ్ఞసేయుట. }—

ఓశిష్యులారా! వత్సలారా! మీరీతక్షణంబున బయలువెడలిపోయి శిష్యులతోడను, స్నేహితులతోడనుఁ గూడినవారును, ఋత్విజులును, విద్వాంసులునునగు ఋషిసమూహంబులను పిలుచుకొనిరండు. మఱియు నామాటలవిననంతనే,యెవ్వరైనను అనాదరణజేసి యేమైనను జెప్పిరేనిఅట్టిమాటలనన్నియునాకుఁ దప్పకజెప్పవలయునని చెప్పిన యాశిష్యులందఱు విశ్వామిత్రుని యాజ్ఞనుశిరసావహించి దిక్కులంగూర్చిపోయిరి. ఇట్లుపోయి పిలిచినతోడనే నానాదేశములయందుండి బ్రహ్మవాదులగు ఋషులనేకులువచ్చిరి. పిదపఁబిలువఁబోయిన శిష్యులందఱును వచ్చి కాంతిచేఁ బ్రజ్వరిల్లుచుండెడు విశ్వామిత్రునింజూచి బ్రహ్మవాదులగు మునులందఱును దమతోఁ జెప్పినమాటలనన్నింటినిఁ జెప్పిమఱియునిట్లనిరి.

ఓగురువగువిశ్వామిత్రుఁడా! నీమాటనుజెప్పిన తెఱంగున సేవకులుజేరి బ్రాహ్మణులందఱును వచ్చుచున్నారు. మహోదయుండుదప్ప సమస్తదేశములందుండు మునులు వచ్చియున్నారు. ఐననొక్కవిశేషంబుగలదు. ఏమనిన.మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! మేమువసిష్ఠమహర్షి పుత్రులయొద్దికిబోయి నీవుచెప్పినమాటలఁ జెప్పినతెఱంగున నవ్వసిష్ఠునిపుత్రులు నూర్గురునుమిక్కిలి కోపాక్రాంతు

లై మాటలు దడబడగనిట్లనిరి. ఓమహోదయా! మిగుల బాగుగనున్న
ది. యాగముం జేయువాఁడు చండాలుండట. యాగముం జే
యించువాఁడు క్షత్రియుండగు విశ్వామిత్రుండట. అట్టిచం
డాలునియాగమునందు దేవతలెట్లు హవిస్సునుభుజింపుదు
రో? ఋషులైననెట్లు యార్త్విజ్యమునవలంబించి హోమ
శేషంబగు హవిస్సును భుజింపగలరో? తెలియదు. విశ్వా
మిత్రునిమాటలనువిని మహాత్ములగు బ్రాహ్మణులు చండా
లాన్నమునుభుజించి యెట్లుస్వర్గమునొందగలరు. మునిశా
ర్దూలుండవగు నోవిశ్వామిత్రుఁడా! అనియిట్లుమహోద
యుడు మొదలగు నవ్వసిష్ఠపుత్రులందఱును, మిగులగోపా
వేశంబునొంది గుల్లైత్తంజేసి గిరగిరంద్రిప్పుచు పండ్లుపటప
టంగొఱుకుచు నతికఠినంబుగజెప్పిరి. అనియిట్లుశిష్యులుజె
ప్పిన మునిశ్రేష్ఠుండగు విశ్వామిత్రుఁడుక్రోధసంరక్తలోచ
నుండై మిగులరోషంబుతో నిట్లనియె.

※ విశ్వామిత్రుండువసిష్ఠునిపుత్రులనుశపించుట. ※—

నేనిపు డుగ్రంబగు తపస్సు చేసికొనుచున్నాను. అదు
ష్టుండను, (అనఁగానాయందు దోషంబేమియు లేదనుట)
అట్టి తపోవంతుండనగు నన్నెవరుదూషించెదరో యాదు
రాత్ములగు వసిష్ఠపుత్రులును, మహోదయుండునుభస్మీ
భూతులగుదురుగాక. ఇందుకు సందియంబులేదు. అవ్వసి
ష్ఠునిపుత్రులిప్పుడు యమలోకమునకు దీసికొనిపోబడినవా
రై ఏడునూర్ల జన్మములవఱకు పీనుఁగుమాంసములను దిను
చుందురుగాక. మఱియునవ్వసిష్ఠపుత్రులు ముష్టికులనుహీ
నజాతియందు జన్మించి నిత్యమును కుక్కమాంసమును భ
క్షింపుచు నిర్దయులై వికృతాకారమును వికృతాచారము
నుగలిగి భూలోకమున సంచరింపుదురుగాక. దుష్టాత్ముఁ
డగు నామహోదయుఁడు దూషింపందగని నన్నుదూషిం
చుటవలన నాకష్టాత్ముఁడు సర్వలోకంబులయందును దూ
షితుండై బోయజాతియందు బుట్టగలఁడు. ఆమహోద
యుఁడు ప్రాణులను హింసించుటయందె యాసక్తుఁడైనిర్ద
యుండై బహుకాలముదుర్గతిని నవలంబించియుండఁగలఁ
డు. అనియిట్లు మహాతపస్సంపన్నుఁడగు విశ్వామిత్రమహా
ముని ఋషులమధ్య మహోదయుని, వసిష్ఠునిపుత్రులను
శపియించె.

ఇట్లని శ్రీమద్బాలకాండమునందలియేబదితొమ్మిదవసర్గ
ముగిసెను.

త్రిశంకువును సశరీరస్వర్గమునునొందించుటకై విశ్వా
మిత్రుండు ఋషులతోడ యజ్ఞముసేయుట.

ఇట్లుమహాతేజుండగు విశ్వామిత్రుండు మహోదయు
నితోగూడిన వసిష్ఠునిపుత్రులను దపోబలంబుచే మరణము
నొందినవారిగాజేసి ఋషులమధ్యమిట్లనియె. ఓఋషుఁ
రా! ఇతఁడిక్ష్వాకువంశంబున జన్మించినవాఁడు. ఇతనిపే
రుత్రిశంకువు. మిగులధర్మాత్ముఁడు. మహాదాత. అట్టిరా
జశ్రేష్ఠుండైన నితఁడిపుడుశాపంబుచేఁ జండాలత్వమునొం
దియున్నాఁడు. ఈశరీరంబుతోడనే స్వర్గలోకమునుబొం
దఁగోరుచున్నాడు. కావుననీత్రిశంకుమహారాజు శరీరిగతన
దేహంబుతో స్వర్గమునొందగలఁడో యారీతిగనన్నుంగూ
డి యాగముజరిగింపుడు. అనియె.

ఇట్లుచెప్పిన విశ్వామిత్రునిమాటలనువిని ధర్మజ్ఞులగునా
మహర్షులందఱు తమలోదాము ధర్మయుక్తంబుగ మాట్లా
డుకొనిరి. ఓహోబ్రాహ్మణోత్తములారా! కుశికునివంశ
మునందుపుట్టిన యీవిశ్వామిత్రుఁడు మహాకోపముగల
వాఁడు. ఇతండుచెప్పినకార్యమును మిక్కిలిచక్కగాజేయ
వలసినదే; అందుకుసంశయములేదు. మహాత్ముండగునీవి
శ్వామిత్రుం డగ్నిహోత్రునితోసమానమైనవాఁడు ఇతని
కిఁ గోపముగలుగునట్లుగ నడుచుకొంటిమేని మనలనుశపిం
చును. కావునయజ్ఞమును జరిగింపవలయును. ఈత్రిశంకు
మహారాజు విశ్వామిత్రునిప్రభావముచే నెట్లుసశరీరంబుగ
స్వర్గమునొందగలఁడో యట్లుయాగముసేయింపుఁడు. కా
సిండు. యజ్ఞమును కానిండు. అందఱునునారంభింపుఁడు.
అనియొకరికొకరు సంభాషించుకొని మహర్షులందఱును
యాగమునందయ్యెకార్యములఁజేయనారంభించిరి. మహా
తేజుండగు విశ్వామిత్రుండధ్వర్యుండయ్యె. మంత్రవేత్తలగు
ఋత్విజులును క్రమముగసకలకర్మంబులను మంత్రయుక్తం
బుగను, కల్పసూత్రప్రకారముగను, యథాశాస్త్రముగ
ను, జేసిరి.

విశ్వామిత్రుండుహవిర్భాగములందీసికొనుట
కుమంత్రములచేదేవతలంబిలుచుట.

పిదప నయ్యాగమునందు మహాతపస్సంపన్నుఁడగు వి
శ్వామిత్రుడు సమస్తదేవతలను హవిర్భాగంబుల నిచ్చుట
కొఱకు బహుకాలము మంత్రములచేఁబిలిచె. ఇట్లువిశ్వా
మిత్రుండు హవిర్భాగములకొఱకు బహుకాలముబిలిచిన
ను దేవతలొక్కరైనను రారైరి.

విశ్వామిత్రుండు త్రిశంకువును సశరీరంబుతో
స్వర్గమునకు బంపుట.

అంత మహామునియగు విశ్వామిత్రుండు కోపాక్రాం
తుఁడై స్రువంబెత్తికొని మిగులరోషంబుతో త్రిశంకునిం
జూచియిట్లనియె. (స్రువమనఁగాహోమముచేయు నుప
కరణము) నరేశ్వరుండవైన యోత్రిశంకు మహారాజా!

నాయొక్క స్వార్జితంబగు తపస్సుయొక్క ప్రభావమును జూడుము, ఇదిగో నేను నాతపఃప్రభావముచే నిన్నుశరీరంబుతోడ స్వర్గమునకుఁ బోవునట్లు సేసెదను. ఓత్రిశంకూ! ఇతరులకుఁ బొందనశక్యమైనస్వర్గలోకమును నీవిప్పుడుశరీరంబుతోఁగూడ పొందుము. మఱియు నాచే నార్జింపఁబడిన తపస్సుయొక్కఫలము కొంచమైననున్నదిగదా? అట్టి తపఃఫలముయొక్క ప్రభావముచేత నీవు సశరీరంబుగస్వర్గలోకమును బొందుము. దశరథనందనుండవగు నోరామచంద్రా! అనియిట్లు విశ్వామిత్రమహాముని చెప్పుచుండగ మునులందఱును జూచుచుండ త్రిశంకువు శరీరంబుతోఁగూడ స్వర్గలోకము నొందెను. అట్టియెడ స్వర్గలోకంబునం దుండెడి దేవేంద్రుఁడు దేవతలతోడంగూడి సశరీరంబుగస్వర్గమునకువచ్చిన త్రిశంకువుంజూచి యిట్లనియె.

స్వర్గమునకు వచ్చిన త్రిశంకువును దేవేంద్రుడు మెడపట్టి త్రోయుట.

ఓరిత్రిశంకూ! నీవుమఱల భూలోకంబునకుఁ బొమ్ము. నీవుస్వర్గలోకమునం దుండతగినవాఁడవుకావు. ఓరిమూఢుఁడా! నీవుగురుశాపంబునొందినవాడవు. కావునతలక్రిందుగ భూలోకంబునం బడుము. అనియె. (అనగామరల భూలోకంబునకుఁబొమ్మని తలక్రిందుగఁబట్టి త్రోసిరనుట) అనియిట్లు దేవేంద్రుండు చెప్పినతోడనే త్రిశంకువుతలక్రిందుగ నేలంబడుచు విశ్వామిత్రునింగూర్చి యోతపోధనుఁడా! ఓమునిశ్రేష్ఠుడా! ఓవిశ్వామిత్రుఁడా! నేనుక్రిందబడుచున్నాను. క్రిందబడుచున్నాను. నన్నురక్షింపుము. రక్షింపుమని మొఱవెట్టఁదొడంగె.

—✽ విశ్వామిత్రుండు రెండవస్వర్గలోకమునిర్మించుట. ✽—

అంతవిశ్వామిత్రుండు త్రిశంకుమహారాజుయొక్క యఱపులనువిని మహాఘోషంబుతో నేలబడుచున్న త్రిశంకుంజూచినిలునిలు, అక్కడనేనిలు. అనికూతలంబెట్టె. ఇట్లుచెప్పి మహాప్రభావుండగునావిశ్వామిత్రుండుఋషులమధ్యనుండి దక్షిణపుదిక్కునందలి మార్గమునందు వేరుగసప్తర్షులను సృజించి రెండవబ్రహ్మదేవుఁడో యనందగినట్లు నిలబడియుండె. మఱియు మహాయశుండగు నవ్విశ్వామిత్రుఁడు మిగులగోపాక్రాంతుఁడై యాదక్షిణపుదిశయందే క్రొత్తగా నక్షత్రంబులనుగూడసృజించె. ఇట్లు విశ్వామిత్రుండు మహాకోపంబుతో సప్తర్షులనునక్షత్రములను సృజించియిట్లుతలంచె. క్రొత్తగమఱియొక యింద్రునిగూడ నేర్పఱచెదను. లేనియెడప్రపంచమునం దింద్రుఁడే లేనిదిగ నగుఁగాక. అనియిట్లుతలంచి కోపంబువలన క్రొత్తగదేవతలనుగూడ సృష్టింపనారంభించె.

దేవతలువిశ్వామిత్రుని కోపంబును నుపశమింపం జేయుట.

అంత పరమర్షులును దేవతలును, అసురులును భయభ్రాంతులై మహాత్ముండగు విశ్వామిత్రునియొద్దకువచ్చి యతనిని నూఱడింపుచునిట్లనిరి. మహాభాగుండవును, తపోధనుండవునునగు నోవిశ్వామిత్రుఁడా! గురుశాపగ్రస్తుఁడగునీత్రిశంకుమహారాజు శరీరంబుతోఁగూడ స్వర్గలోకంబు నొందుటకుఁ దగనేతగఁడు. అనియిట్లుదేవతలుపలికిన మునిపుంగవుఁడగు విశ్వామిత్రుఁడు సమస్తదేవతలనుజూచి మిగులపూజ్యంబగు నొకవాక్యంబును జెప్పె.

విశ్వామిత్రుఁడు తానునిర్మించినస్వర్గమునందే త్రిశంకువుండునట్లు దేవతలంగోరుట.

ఓదేవతలారా! మీకుమంగళమగుగాక. ఈత్రిశంకుమహారాజు శరీరంబుతోడ స్వర్గలోకము నొందునట్లుసేసెదనని ప్రతిజ్ఞంజేసితి. అట్టిప్రతిజ్ఞను యథార్థంబగునట్లు సేయనొల్లను. ఈత్రిశంకుమహారాజు శరీరంబుతోడ శాశ్వతంబగుస్వర్గంబునొందుఁగాక. మఱియు నాచేఁగల్పింపఁబడిన యీనక్షత్రంబులన్నియు లోకంబులెంతకాలమువఱకునుండునో, అంతకాలమువఱకు శాశ్వతంబుగ నుండుగాక. ఓదేవతలారా! నేనిప్పుడుచెప్పినవాటినన్నిఁటిని అంగీకరింపవలయునని చెప్పిన దేవతలిట్లనిరి.

—✽ దేవతలువిశ్వామిత్రుండుకోరినవరంబులిచ్చుట.

మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! నీకుశుభంబు గలుగుఁగాక- నీవుసృజించిన యీనక్షత్రంబులన్నియునవాదిగనుండు జ్యోతిశ్చక్రముయొక్క మార్గమునకువెలుపలనన్నివిధములను స్థిరముగనుండుఁగాక- ఈత్రిశంకుమహారాజును తలక్రిందుగ నానక్షత్రములమధ్యంబునఁ బ్రకాశింపుచు దేవతాసమానుఁడైయుండుఁగాక- ఈనక్షత్రంబులును కృతకార్యధురంధరుఁడును, కీర్తిమంతుండును, రాజశ్రేష్ఠుండునునగు త్రిశంకుమహారాజునుస్వర్గము నొందినవానివలెనే యనుసరింపుచునుండుగాక - యనిచెప్పిరి- పిదపమహాతేజుండును ధర్మాత్ముండునునగువిశ్వామిత్రుఁడు దేవతలచేతను ఋషులచేతను బొగడఁబడుచు దేవతలఁజూచి మంచిదిపోయిరండు" అనిచెప్పె పురుషోత్తముఁడవగునో రామచంద్రా! ఇట్లుయాగంబంతయు ముగిసినపిదపమహాత్ములగుదేవతలును,తపోధనులగుమునులునువచ్చినరీతిగయథాస్థానంబులకుఁ బోయిరి-

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి అరువదియవసర్గము గిసెను.

—* విశ్వామిత్రుఁడు పుష్కరతీర్థంబులకుఁబోయి తపంబు జేయుట. *—

అంత మహాత్ముండును, పురుషశ్రేష్ఠుండును నగు విశ్వామిత్రుఁడు యజ్ఞమునకై వచ్చిన ఋషులందఱు పోయిన పిదప తన తపోవనమునందు మునులం జూచి యిట్లనియె- ఓమునులారా! యీ దక్షిణదిశయందు మహావిఘ్నము సంభవించినది- కావున మఱియొక దిక్కునకుఁబోయి యచ్చటనె తపస్సు సేయుచుందము- మహాత్ములగు నో మునులారా! విశాలంబగు పశ్చిమదిశయందలి పుష్కరతీరంబుల తీర్థంబులందు సుఖంబుగఁ దపంబు నాచరింతము- అది తపస్సునకు మిగుల యోగ్యంబైన ప్రదేశముగదా? అని యిట్లు మహాప్రభావుండగు విశ్వామిత్రుండు ఋషులకుఁ జెప్పి పశ్చిమదిశం గూర్చి పోయి యందలి పుష్కరతీర్థముల యొక్క తీరంబునందు ఫలమూలంబుల నాహారంబుగా భక్షింపుచు దురాధర్షంబును భయంకరంబునునగు తపంబుఁ గావింపుచుండె-

—* అంబరీషమహారాజు యజ్ఞంబు సేయుట. *—

ఇది యిట్లుండగా నీకాలమునందే, అయోధ్యాపట్టణమునకుఁ బ్రభువగు నంబరీషుండను రాజొకండు గలఁడు- ఆరాజశ్రేష్ఠుండు యజ్ఞము సేయ నారంభించె- ఇట్లయ్యంబరీషమహారాజు యాగము సేయుచుండగ యజ్ఞపశువును దేవేంద్రుండపహరించె- అంతటఁ బురోహితుండు యజ్ఞపశువుం గానక యంబరీషునితో నిట్లనియె- ఓయంబరీషమహారాజా! ఇప్పుడు నీయొక్క యజాగ్రతవలన యజ్ఞపశువు గనబడదయ్యె- ఇందువలనఁ గలిగెడి దోషంబులు రాజును జంపును- పురుషోత్తముఁడవగు నో యంబరీషుఁడా! ఇవ్వ్యపచారమునకుఁ జేయవలసిన ప్రాయశ్చిత్తము మిగుల విశేషమైనదేను- ఇప్పుడు గనఁబడక పోయిన యజ్ఞపశువును వెదకి తెచ్చుట యుత్తమము- అట్లు లేనియెడల యజ్ఞకార్యారంభమునకుఁ బూర్వమే మనుష్యపశువునైనను శీఘ్రంబుగ దీసికొని రావలయునని పురోహితుండు సెప్పె- పురుషశ్రేష్ఠుండవగు నో రామచంద్రా! ఇట్లు పురోహితుండు సెప్పిన మహాబుద్ధిశాలియగు నా యంబరీషమహారాజనేక వేల పశువులను వెంటఁ దీసికొని పోయి నరపశువును వెదకె.

—* అంబరీషమహారాజు నరపశువు దెచ్చుటకు బోవుట *—

దశరథరాజనందనుఁడవగు నో రామచంద్రా! ఇట్లయ్యంబరీషమహారాజనేక దేశంబులను, గ్రామములను, పట్టణములను, నడవులను, పుణ్యాశ్రమంబులను వెదకి వెదకి నరపశువునెందును సంపాదింపనేరక విసికి తుదకు భృగుతుంగంబను పర్వతంబునకుఁ బోయి యచ్చట పుత్రులతోడను, భార్యతోడను నున్న ఋచీకమహర్షిం జూచె.

ఇట్లు పరాక్రమవంతుడును, రాజర్షియును, మితిలేని కాంతిగలవాఁడును నగు నంబరీషమహారాజు బ్రహ్మర్షియును దపస్సు చేఁ బ్రకాశించుచుండువాఁడునునగు ఋచీకమహర్షిం జూచి నమస్కరించి క్షేమంబడిగి యిట్లనియె- మహాప్రభావుండవగు నో ఋచీకమహర్షీ! నీకు నూఱువేల యావులనిచ్చుచున్నాఁడను- నీ నందిసికొని నీపుత్రుని నాకు యాగపశువగుటకుఁగా నివ్వవలయు- అట్లిచ్చితివేని నేను కృతార్థుఁడనగుదున్నాఁడను- నేనన్ని దేశంబులును దిరిగితిని. యాగమునకుఁ గావలసిన పశువెక్కడను దొరకలేదు- కావున నీ పుత్రులలో నొక్కని క్రయమునకు నాకివ్వవలయునని యనేకవిధంబులఁ బ్రార్థించిన ఋచీకమహర్షి యిట్లనియె.

పురుషశ్రేష్ఠుండవగు నో యంబరీషుఁడా! నీవెంత యిచ్చినను నేను జ్యేష్ఠపుత్రుని మాత్రము విక్రయించుటలేదు- అని చెప్పిన మహాత్ముఁ రాలును, తపస్వినియునగు నా పుత్రుల యొక్క తల్లి యంబరీషుని జూచి యిట్లనియె-

ఓమహారాజా! భగవంతుఁడను, భార్గవుండునునగు నీ ఋచీకమహర్షి పెద్దకుమారుని విక్రయించుటలేదని చెప్పెనుగదా? నేనైతేనో; నాకు మిగుల నిష్టుడును గనిష్ఠుఁడును నైనశునకుఁడను పుత్రుని నిచ్చుటలేదు- "శ్లో॥ ప్రాయేణహినరశ్రేష్ఠ జ్యేష్ఠాః పితృషువల్లభాః। మాతౄణాంతుకనీయాం సస్తస్మాద్రక్షేకనీయసమ్ ॥ నరశ్రేష్ఠుండవగ నో యంబరీషమహారాజా! లోకంబున సాధారణముగ దండ్రులు పెద్దకుమారునియందు ప్రీతి గలిగియుందురు- తల్లులుగడపటి కొడుకునందు ప్రీతిగలిగియుందురు. కావున కడపటికుమారుని నేసంరక్షించెదననియె- దశరథరాజనందనుఁడవగ నో రామచంద్రా! ఇట్లు ఋచీకమహర్షియు సతని భార్యయుఁ జెప్పినమాటలను విని మధ్యముండైన (అనగా రెండవ పుత్రుండైన) శునశ్శేఫుండనువాఁడు తానే యంబరీషమహారాజుం జూచి యిట్లనియె,

ఓయంబరీషమహారాజా! తండ్రి జ్యేష్ఠపుత్రుని విక్రయింపనని చెప్పుచున్నాఁడు. తల్లి కనిష్ఠుఁడైన కడపటివానిని విక్రయింపనని చెప్పుచున్నది- కావున నడిమివానిని విక్రయించినట్లు తలంచుదున్నాను- నడిమివాఁడను నేను కావున నన్నుఁ గొనిపొమ్మనియె- అని యిట్లు శునశ్శేఫుండు చెప్పిన నంబరీషమహారాజు సంతోషంబునొంది లక్షగోవులనిచ్చి శునశ్శేఫుని నందీసికొనియె- ఇట్లు మహాపరాక్రమవంతుఁడును, మహాయశుండును, రాజర్షియునునగు నంబరీషమహారాజత్త్వరితముగ శునశ్శేఫుని రథంబుపై నెక్కించి తన పట్టణంబును గూర్చి పోయె. ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి అఱువదియొకటవ సర్గముగిసెను.

—* { యజ్ఞమునకు పశువుగఁబోవు శునశ్శేపునివిశ్వామిత్రుఁడు దీర్ఘాయువుగలుగ నట్లనుగ్రహించుట. } *—

నరశ్రేష్ఠుండవగునో రామచంద్రా! ఇట్లు మహాయశుండగు నంబరీషమహారాజు శునశ్శేపునిం దీసికొని తననగరమునుగూర్చి పోవుచు మధ్యాహ్నమున మార్గమధ్యమునందలి పుష్కరతీర్థతీరంబున దిగి విశ్రమించె - ఇట్లంబరీషమహారాజు విశ్రమించుచుండగ మహాయశుండును పరమదుఃఖితుండునునగు శునశ్శేపుఁడు పుష్కరక్షేత్రమునకుఁబోయి యందు ఋషులతోఁగూడఁ దపస్సు సేయుచున్న తనమేనమామయైన విశ్వామిత్రమహర్షిం జూచె- అంత శునశ్శేపుఁడు దప్పిచేతను నలసటచేతను వాడినముఖముగలిగినవాఁడై యతిశీఘ్రముగ నవ్విశ్వామిత్రమహర్షి యొక్క యొడియందు పడియిట్లనియె.

మునిశ్రేష్ఠుండవగునో విశ్వామిత్రుఁడా! నాకు దల్లి లేదు. తండ్రియు లేదు- జ్ఞాతులును లేరు- బంధువులును లేరు-మఱి యెవ్వరును లేరు- నీవు సౌమ్యుఁడవు- ఋషిశ్రేష్ఠుఁడవు- ధర్మంబుచే నన్నురక్షింపవలయు- నీవందఱకు నురక్షకుండవు. సకలలోకములకును మేలుకలుగఁ జేయువాఁడవు-

ఓ విశ్వామిత్రుఁడా! ఇప్పుడంబరీష మహారాజుయొక్క యజ్ఞము నెఱవేఱవలయును. నేనును దీర్ఘాయుష్మంతుఁడనై నాశములేని శ్రేష్ఠమైన తపస్సును జేసి స్వర్గలోకమును బొందవలయును. ధర్మాత్ముండవగు నో విశ్వామిత్రుఁడా! నీవు మంగళకరంబగు మనస్సుతో ననాథుండనగు నాకు నాథుఁడవు గావలయు (అనఁగా రక్షకుఁడవు కావలయుననుట) కుమారునిఁ దండ్రి రక్షించువిధమున నన్నీయాపదనుండి తొలగించి రక్షింపవలయునని ప్రార్థించె.

—* విశ్వామిత్రుఁడు తనకొడుకుల శపించుట. *—

అంత మహాతపస్సంపన్నుఁడగు విశ్వామిత్రుఁడు శునశ్శేపుని బహువిధములుగ నూఱడించి తనపుత్రులం జూచి యిట్లనియె. ఓపుత్రులారా! శుభములను కోరునట్టి తండ్రులు దేనినిమిత్తము కొడుకులను పుట్టించుచున్నారో యట్టి పరలోకహితార్థ ముభయులకు మేలుగలుగుటకొఱకిప్పుడు సమయము తటస్థించినది. ఓసుతులారా! మునిపుత్రుండైన యీబాలుఁడు నన్నుశరణుఁజొచ్చినాఁడు. వీనికి ప్రాణదానం బిచ్చి సంతోషముగలుగునట్లు సేయుఁడు. ఓకొడుకులారా! మీరు పుణ్యకార్యములుగలవారలు. మీరందఱును ధర్మమార్గమునందే బుద్ధిగలవారు. నరేంద్రుండగు యంబరీషమహారాజుయొక్క యాగమునకుఁ బశువై యగ్నిహోత్రునకు దృప్తి సేయుఁడు. ఇట్లు సేసితిరేని శునశ్శేపుఁడు రక్షింపఁబడినవాఁడగును. యాగమును నిర్విఘ్నముగ నెఱవేరును- దేవతలును తృప్తినొందుదురు- నామాటను జవదాటక పితృవాక్యపరిపాలనమును సేసినవారగుదుర నెను-పురుషోత్తముఁడవగునో రామచంద్రా! ఇట్లు విశ్వామిత్రుండు సెప్పినన తనిపుత్రులగు మధుష్యందుఁడు మొదలగువారీవాక్యములవిని మిగుల నహంకారంబుతోఁ బరిహాసంబుగా నిట్లనిరి.

ఓతండ్రీ! నీవు పుత్రులగు మమ్ముల రక్షించుటను వదలిపెట్టి వేఱొకనిపుత్రుని రక్షించెదనని చెప్పుచున్నావు- ఇకార్యమును బూడగ భుజించుటకు మంచియన్నముండగ నట్టియన్నమును వదలిపెట్టి కుక్కమాంసమును భక్షించునట్లుగనున్నయది యనిరి- ఇట్లు పుత్రులు చెప్పిన మునిపుంగవుఁడగు విశ్వామిత్రుఁడమ్మాటలను విని మహాకోపంబునొంది కంన్నెఱ్ఱంజేసి నిప్పులం గ్రక్కుచు నిట్లనియె.

ఓరి దుర్మార్గులారా! నామాటనతిక్రమించుటయగాక కొంచెమైనను భయంబులేక ధర్మమువలననుండి నిందితంబైనదియును, దారుణంబయినదియును గగుర్పాటునొందించునదియునునగు మాటం జెప్పితిరి- ఓదురాత్ములారా! మీరందరును వసిష్ఠమహర్షి పుత్రులవలె ముష్టికులను జాతియందు పుట్టి కుక్కమాంసమును దినుచు వెయ్యిసంవత్సరములు పూర్ణమగువఱకు భూమియందు నివసింపంగలరు- అని యిట్లు మునిశ్రేష్ఠుండగు విశ్వామిత్రుఁడు తనపుత్రులను శపియించి మిగుల వ్యసనాక్రాంతుఁడుగనుండు శునశ్శేపునిజూచి యతనికి బాధకలుగకుండునట్లుగ మంత్రించిన విభూతి మొదలగురక్షను చేసియిచ్చి యిట్లనియె-

ఓశునశ్శేపుఁడా! నిన్ను యజ్ఞశాలకుఁ దీసికొనిపోయిన కుసెఱ్ఱనిపుష్పమాలికలు మొదలగునవి ధరింపంజేసి విష్ణుదేవతాకమగు యూపస్తంభమునకు దర్భలచేఁ జేయఁబడిన త్రాళ్ళచే గట్టివేయుదురు - అట్టియెడ నేనిపు డుపదేశింపఁబోయెడు వచనములచే నగ్నిదేవుని స్తోత్రము సేయుమని చెప్పియుపదేశించి మరల యిట్లనియె- ఓమునిపుత్రుఁడవగు శునశ్శేపుఁడా! అంబరీషమహారాజు సేసెడియాగమునందిప్పుడు నేను సెప్పిన దివ్యంబులగు గాథలను రెంటినిమాత్రముగానము సేయుము- అందువలన నీవు దీర్ఘాయుష్మంతుఁడవయ్యెదవని చెప్పె- అంత శునశ్శేపుఁడా రెండు గాథలను జక్కగా గ్రహించి మిగుల నెమ్మదిగలవాఁడై యతిత్వరితముగ నంబరీషమహారాజునొద్దకుబోయి యిట్లనియె-

మహాసత్వసంపన్నుఁడవును, రాజసింహుండవునునగు నోయంబరీషమహారాజా! అతిశీఘ్రంబుగ యజ్ఞశాలకుఁ బోవుదము- యాగదీక్ష ప్రారంభించి యజ్ఞమును నెరవేర్పుము అని చెప్పిన శునశ్శేపుని మాటల నంబరీషమహారాజు విని సంతోషముచే నుప్పొంగుచు నాలస్యము సేయక నతిశీఘ్రం

బుగయాగశాలకువచ్చె. పిదపనంబరీషమహారాజుసదస్యుల యొక్క యనుమతిందీసికొని యాశునశ్శేఫునిదర్భలచేనిర్మింపఁబడిన యొట్టిని వస్త్రముజుట్టిన యజ్ఞపశువునుగాఁజేసి యూపస్తంభమునందుబంధించె.

—* శునశ్శేఫునకునింద్రుఁడుదీర్ఘాయువునిచ్చుట. *—

ఇట్లు శునశ్శేఫుడు యూపస్తంభమునందు గట్టఁబడి విశ్వామిత్రుం డుపదేశించిన శ్రేష్ఠంబులగు గాథలచే నింద్రుని, ఇంద్రునితమ్ముండగునుపేంద్రుని, దేవతలను, యథావిధిగస్తుతించె. ఓరామచంద్రా! శునశ్శేఫుండిట్లురహస్యంబుగస్తుతించినస్తోత్రములచే దేవేంద్రుండుసంతోషించి శునశ్శేఫునకుదీర్ఘాయువునిచ్చె. పురుషశ్రేష్ఠుండవగు నోరఘునందనా! అంతనంబరీషుండును దేవేంద్రునిప్రసాదమువలన యాగఫలంబు విశేషంబుగానొందె. పిదపమహాతపస్సంపన్నుఁడును, ధర్మాత్ముండునునగు విశ్వామిత్రుఁడు పుష్కరక్షేత్రమునందు వేయిసంవత్సరములుతపంబుఁజేసె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి అఱువదిరెండవసర్గ ముగిసెను.

* బ్రహ్మదేవుఁడువిశ్వామిత్రునిఋషివైతివనిచెప్పుట. *

ఇట్లు మహామునియగువిశ్వామిత్రుఁడు తపస్సుకుప్రారంభించి వెయ్యేండ్లు పూర్ణంబుగనిండినతోడనే బ్రహ్మదేవుడు దేవతలందఱును దపఃఫలంబిచ్చుటకు వ్రతాంతస్నాతుండగు విశ్వామిత్రునొద్దకువచ్చిరి. అందుమహాతేజుండగుబ్రహ్మదేవుఁడు విశ్వామిత్రునింజూచియిట్లనియె. ఓగాధినందనుఁడవగు విశ్వామిత్రుఁడా! నీకుమంగళమగుఁగాక. నీవుచేసినశుభకరంబులగు తపస్సులచేనీవు "ఋషి" యని చెప్పఁబడుచున్నావు. అనిచెప్పిబ్రహ్మదేవుఁడు మొదలగు దేవతలు మఱలస్వర్గలోకంబునకుఁబోయిరి. పిదపవిశ్వామిత్రుండును మరలశ్రేష్ఠంబైనతపంబుఁజేసె.

—* విశ్వామిత్రుండుమేనకతోసంభోగించుట. *—

పురుషోత్తముండవగు నోదశరథరాజనందనా! ఇట్లు విశ్వామిత్రుండు మరల తపంబుసేయుచుండగ బహుకాలముగడచె. పిదప నొకనాడు మేనకయనునప్సరస్త్రీపుష్కరతీర్థములకువచ్చి స్నానముసేయుచుండె. అంత మహాతేజుండగువిశ్వామిత్రుఁడు మేఘమునందలి మెఱుపుతీగవలె మెఱయుచు మిగులసౌందర్యంబుచే మనోహరంబుగఁ బ్రకాశింపుచుండెడి యామేనకంజూచె. ఇట్లువిశ్వామిత్రుండు యామేనకంజూచి మోహపరవశుండై దానితోనిట్లనియె.

అప్సరసాంగనయగు నోమేనకా! నీకు స్వాగతమగుఁగాక. (అనఁగాసుఖముతోడి రాకయగుఁగాకనుట) నీవు నాయాశ్రమమగు నిచ్చటనేనివసించియుండి నాతోసంభోగింపుచుండుము. ఓమనోహరీ! నీకుమంగళమగుఁగాక. నేను మన్మథోద్రేకముచే మోహపరవశుండనైయున్నాను నన్ననుగ్రహింపుమనిన నవ్వరారోహయగు మేనకయువిశ్వామిత్రునిమాటలనంగీకరించి యయ్యాశ్రమమునందే నివసించె. రఘువంశోద్భవుఁడవగు నోరామచంద్రా! ఇట్లువిశ్వామిత్రుఁడును మేనకయు నిరంతరమురతిక్రీడలంజేలుచు సుఖంబుగనుండగ బదిసంవత్సరంబులుగడచె. అంతవిశ్వామిత్రుఁడు రతిక్రీడయందు పదిసంవత్సరముల కాలమాగడచిపోవుటనెఱింగి యొకనాడుమిగులసిగ్గువడి వ్యసనంబునొందికోపంబుగలవాఁడై యిట్లనిచింతించె.

ఓహో హో నాతపంబును విఘ్నంబుసేయుట కీకార్యంబునంతయు దేవతలుసేసిరి. మన్మథమోహంబునకులోబడుటచే నొకయహోరాత్రంబువలె పదిసంవత్సరంబులు వ్యర్థంబుగఁగడచిపోయెనని నిట్టూర్పు విడుచుచుఁబశ్చాత్తాపంబునొంది వ్యసనంబునొందియుండె అంతమేనక యావిశ్వామిత్రునింజూడ శపియించువానివలెనున్న దేని యనిభయంబుచే గడగడవడంకుచు యెదుటనిలువఁబడియె. అట్టియెడ విశ్వామిత్రుండు మేనకంజూచి, యోస్త్రీరత్నమా! నీవలనదప్పితంబులేదు. నీవుసుఖముగ నీనివాసమునకుఁబొమ్ము. అనిప్రియవాక్యంబులాడి మేనకనుబంపి తానుహిమవత్పర్వతమునకుఁబోయె.

—* విశ్వామిత్రుఁడుకౌశికీనదీతీరమునకుఁబోయి మఱలతపంబుజేయుట. *—

ఇట్లుమహాయశుండగు విశ్వామిత్రుఁడుహిమవత్పర్వతమునుగూర్చిపోయి కౌశికీనదీతీరంబుజేరి యతిదృఢంబగు సంకల్పంబుజేసి యింద్రియములజయింప నిచ్ఛగలవాఁడై ఘోరంబును నతిభయంకరంబునునగు తపంబుఁజేసె. ఓరామచంద్రా! విశ్వామిత్రుం డిట్లుహిమవత్పర్వతంబున వెయ్యేండ్లు భయంకరంబగుతపంబుఁజేయగ దేవతలునుఋషులును భయభ్రాంత కంపితశరీరులై బ్రహ్మదేవునియొద్దకుఁబోయియిట్లనిరి. ఓపితామహుఁడా! నీపుత్రుఁడుయుగ్రంబుగఁ దపంబుఁజేయుచుండెడు విశ్వామిత్రునొద్దకువచ్చి మహర్షివైతివని చెప్పవలయునని ప్రార్థించిరి.

* బ్రహ్మదేవుడువిశ్వామిత్రునితోమహర్షివైతివనిచెప్పుట. *

అంతబ్రహ్మదేవుఁడు దేవతలతోడఁబైలువెడలి తపోధనుఁడగు విశ్వామిత్రునొద్దకువచ్చి మనోహరంబుగ నిట్లనియె. మహర్షివగునోవత్సా! నాయనా! విశ్వామిత్రుఁడా! నీకుస్వాగతమగుగాక. నీవుచేసినభయంకరమగుతపస్సుచే నేనుమిక్కిలిసంతోషించితిని. నీకుమహర్షిత్వంబిచ్చితిని. అని

చెప్పిన తపోధనుఁడగువిశ్వామిత్రుఁడు బ్రహ్మదేవునిమాటలనువిని దుఃఖమునైనను, సంతోషమునైనను, పొందకచేతులుజోడించుకొని నమస్కరించి సర్వలోకపితామహుండగుబ్రహ్మదేవునితో నిట్లనియె. భగవంతుఁడవగు నోబ్రహ్మదేవుఁడా! నేనుచేసినశుభకరములగు తపంబులకై నీవునాకుమహర్షి యనుపేరిచ్చితివేని నేనుజితేంద్రియుండ నైనట్లగుచున్నది. అనిచెప్పిన విశ్వామిత్రునితో బ్రహ్మదేవుఁడిట్లనియె. మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! నీవు జితేంద్రియుండవుమాత్రము కావు. ఇంకనుబ్రయత్నింపుము. అని చెప్పి స్వర్గంబునకుఁబోయెను.

అంతమహామునియగు విశ్వామిత్రుఁడు చేతులుపైకెత్తుకొని నిరాధారంబుగనిలువంబడి వాయువునుభక్షింపుచుఁ దపంబుఁగావింపందొడంగె. మఱియు నెండకాలమునఁ బంచాగ్నిమధ్యంబునను, వానకాలంబున బయలనిలువంబడియును, శిశిరఋతువునందు రాత్రింబగల్లు నీళ్ళయందుమునింగియును, నీరీతిగ వేయిసంవత్సరములు ఘోరంబగుతపంబును గావించె. ఇట్లుమహామునియగు విశ్వామిత్రుఁ డత్యుగ్రముగఁ దపంబుసేయుచుండగ దేవతలును దేవేంద్రుఁడును మిగులభయంబునొందిరి. దేవేంద్రుం డిట్లుభయంబునొంది దేవతలంగూడుకొని యప్సరస్త్రీయగురంభంజూచి తనకు హితమును విశ్వామిత్రునకహితమునుగలుగుటకై యిట్లనియె. ఇట్లనిశ్రీమద్బాలకాండమునందలి యరువదిమూఁడవ సర్గముగిసెను.

-* ఇంద్రుఁడురంభనువిశ్వామిత్రునొద్దకుబంపుట *—

ఇట్లు దేవేంద్రుండురంభంజూచి రూపయౌవనసంపన్నురాలవగు నోరంభా! నీవిప్పుడు విశ్వామిత్రునొద్దకుఁబోయతనికిమన్మథోద్రేకంబుగలుగునట్లుగఁజేసి నీవలలోఁ దగులుకొనునట్లు సేయవలయు. ఇదిమిగులగొప్పకార్యము. మఱియు దేవతాకార్యము. కావునదీనినీవుతప్పక సేయవలయునని యింద్రుండుచెప్పె. రఘుకులసార్వభౌముఁడవగు నోరామచంద్రా! ఇట్లు ధీమంతుఁడగు నింద్రుండుచెప్పిన నారంభ మిగులసిగ్గుపడి చేతులుజోడించుకొనియిట్లనియె.

ఓదేవేంద్రుఁడా! నన్నిపుడుమిగులఁగష్టసాధ్యమగు కార్యంబునకుఁబంప యత్నించినావు. మహామునియగువిశ్వామిత్రుఁడు మిక్కిలికోపిష్ఠుఁడు. నేనతనియొద్దకుఁ బోతినేని ఘోరంబగుశాపంబుఁబూని శపియించును. ఇందుకుసందియములేదు. ఓసహస్రాక్షుఁడా! అవ్విశ్వామిత్రుఁడుముందువెనుకలంగూడ జూచువాఁడుకాఁడు. అందువలననే శపియించునేమోయను భయముగలుగుచున్నది. కావుననన్ను ననుగ్రహింపవలయుననియె. ఓరామచంద్రా! ఇట్లుచెప్పిమిగులభయంబునొంది గడగడవడంకుచు చేతులుజోడించుకొని యెదుటనిలువంబడియుండు రంభంజూచి దేవేంద్రుడిట్లనియె.

ఓనవమోహనాంగీ! రంభా! నీవుభయపడవలదు. నీకు మంగళమగుగాక. నాయాజ్ఞాప్రకారము నడచుకొనుము. వసంతఋతువునందు నేనుమన్మథునితోడంగూడిరమ్యమగు వృక్షమునందు మనోహరంబైన కోయిలరూపమునొంది నీప్రక్కనుండెదను. ఓరంభా! నీవను నేకములగు శృంగారచేష్టాదిగుణంబులతో మిగులసుందరమగు రూపమును ధరించి తపోధనుండగు నవ్విశ్వామిత్రునిమనస్సు తపంబునందుండి మఱలునట్లు సేయుమనియె. ఇట్లు దేవేంద్రుఁడుచెప్పిన సుందరాంగియగు నారంభ మందస్మితవదనారవిందయై యట్లనేకానిమ్మనియంగీకరించె.

అంతవసంతఋతుకాలంబువచ్చిన రంభమిగులసౌందర్యంబుగనుండున ట్లలంకరించుకొని దేదీప్యమానంబగురూపంబుతో విశ్వామిత్రుని తనవలలోఁ జిక్కించుకొనుటకై బైలువెడలె. ఇంద్రుండును కోయిలరూపంబునొందిమన్మథునితోడంగూడి వెంబడించె. ఇట్లురంభబయలువెడలివిశ్వామిత్రునియొద్దకువచ్చి యెదుటనిలువంబడి దివ్యశారీరంబుతో మనోహరముగబాడందొడంగె. కోకిలయు సుస్వరంబుతో మనోరమ్యముగ గూయదొడంగె.

—* విశ్వామిత్రుఁడురంభనుశపించుట. *—

అట్టియెడవిశ్వామిత్రుండు మనోహరమగు కోకిలధ్వనినివిని కండ్లందెఱచిచూచి మిగులసంతోషంబగు మనస్సుతో నెదుటనిలువంబడియున్నరంభంజూచె. అంతమునీశ్వరుఁడగు విశ్వామిత్రుఁడు యాకోకిలధ్వనివినుటచేతను రంభంజూచుటచేతను, నారంభపాడిన గానమునాలకించుటచేతను, సందేహమునొందె. ఇట్లుసందేహంబుపడి యిప్పనిని దేవేంద్రుండుచేసినదిగాఁదెలిసికొని మిగులఁగోపంబునొంది రంభంజూచియిట్లనియె. ఓసిదుష్టురాలా! రంభా! కామక్రోధలోభమోహంబులజయింపఁ బ్రయత్నించుచుండునన్ను కామవికారంబునందగులుకొనునట్లు జేయయత్నించితివి. కావున నీవుపదివేలసంవత్సరములు ఱాయిగానుండఁగలవు. అనియిట్లుశపియించి మరలనిట్లనియె. ఓదుర్మార్గురాలవగురంభా! నీవట్లు శిలారూపంబుగనుండునెడ మహాతేజుండును తపోబలసమన్వితుండును, బ్రహ్మపుత్రుండును, నగువసిష్ఠమహర్షి నాశాపంబుచే శపియింపంబడిన నీకు శాపమోచనంబుజేయగలఁడు అనియిట్లుమహాతేజుండును, మహామునియునగు విశ్వామిత్రుఁడు శాపంబును

పట్టనేరక రంభనుశపియించి తరువాత యయ్యాయాసంబునను నణుచుకొనలేకంబోయితినే. యనిమిగులంబశ్చాత్తపంబునొందె

పిదప విశ్వామిత్రుని గొప్పశాపంబువలన రంభతా యిరూపంబునొందె. ఇట్లురంభ తాయిమైనతోడనే మన్మథుఁడును, దేవేంద్రుండును యచ్చోటనిలువక బయిగత్తి వెళ్ళిరి. దశరథరాజనందనుఁడవగు నోరామచంద్రా! మహాతేజుండగు నవ్విశ్వామిత్రుఁడు కోపంబుచే రంభనుశపియించుటవలన తపస్సుతఱుగుటనెఱింగి యింకనుజితేంద్రియుండుకానందున మనశ్శాంతినిబొందక యిట్లనిసంకల్పించె. ఇఁకనేనుకోపంబు నొందుటయేలేదు. ఒకరితో మాటలాడుటయును లేదు. అనేకవేలయేండ్లైనను నిట్టూర్పుకూడవిడుచుటలేదు, నేనికమిక్కిలివశక్యముగా జయింపఁబడిన నింద్రియంబులుకలవాఁడనై దేహమునుశుష్కింపం జేసెదను నాతస్సుచే నాకెంతకాలమువఱకు బ్రాహ్మణత్వము సంప్రాప్తంబగునో, అంతకాలమువఱకు ననేకసంవత్సరములైనను నిట్టూర్పువిడవక యాహారవర్జితుండనై యుండెదను. నేనుతపంబుఁజేసెదంగావున నాతపఃప్రభావంబువలన అవయవములు క్షయింపకుండెడుఁగాక యనిసంకల్పించె. ఓరఘునందనుఁడవగు రాముఁడా! మునిశ్రేష్ఠుండగునవ్విశ్వామిత్రుఁ డిట్లుసంకల్పించి వేయిసంవత్సరములు నిట్టూర్పువిడువకను భుజింపకను తపంబుఁజేసెదనని దీక్ష వహించె.

ఇట్లుశ్రీమద్బాలకాండమునందలి యిరువదినాలుగవసర్గ ముగిసెను.

—— విశ్వామిత్రుఁడునియమముగఁదపంబుశేయుట. ——

ఓరామచంద్రా! ఇట్లుప్రతిజ్ఞంజేసి మహామునియగువిశ్వామిత్రుఁడు హిమవత్పర్వతమున నుత్తరపుదిశనువిడిచి తూర్పుదిక్కునకుఁబోయి వేయిసంవత్సరములు మాటలాడకుండునట్లు సంకల్పించి నితరులకుఁజేయ నశక్యంబగుభయంకరంబైన తపంబుగావించె.

మఱియువేయిసంవత్సరములవరకెన్నివిఘ్నంబులుసంభవించినను మౌనివలెనిశ్చలుండైకోపమునొందకతపంబుజేసె. ఓరఘుకులోద్భవుఁడవగు రాముఁడా! ఇట్లుమహావ్రతనిష్ఠుండగునవ్విశ్వామిత్రుఁడు నియమముగతపంబుజేసి వేయిసంవత్సరములు ముగిసినతోడనే అన్నముదినుటకు నారంభించె. అట్టియెడదేవేంద్రుఁడు బ్రాహ్మణవేషంబుధరించి విశ్వామిత్రునివద్దికివచ్చి యిట్లనియె. ఓతపోధనుఁడా! నాకుమిగుల యాకలియగుచున్నది. నేనికతాళలేను. నీవుసిద్ధంబుగ నుంచుకొనియుండు యన్నమును నాకుబెట్టుము. అనియాచించె, అంతమౌనవ్రతుండును, మహాత్ముండును, తపశ్శ్రేష్ఠుండునునగు విశ్వామిత్రుఁడు సందేహమునొందక సిద్ధంబుగనుండు నన్నంబంతయును నాబ్రాహ్మణునకుఁబెట్టి యతండుభుజించినపిదపతనకు, కొంచమన్నమైనను మిగలకపోయినను నాబ్రాహ్మణునితో నేమియుంబలుకకయూరకుండె. ఇట్లుమౌనవ్రతుండై విశ్వామిత్రుఁడును రలవేయిసంవత్సరములు నిట్టూర్పువిడువకతపంబుఁజేసె.

—— విశ్వామిత్రునితపోగ్నిముల్లోకములవ్యాపించుట. ——

ఇట్లూపిరివిడువక తపస్సుశేయుచుండగ నమ్మహాత్ముండగు విశ్వామిత్రునియొక్క తలయందుండి బ్రహ్మాండంబగు పొగబయలువెడలి మూఁడులోకంబులందును వ్యాపించుటచే ముల్లోకంబులును గాల్పంబడినట్లయ్యె. అట్టియెడగంధర్వులు, దేవతలు, పన్నగులు, అసురులు, రాక్షసులుమొదలగువారందఱును నవ్విశ్వామిత్రునితపోగ్నిచే బీడితులై మూర్ఛనొందిరి. ఇట్లుమూర్ఛనొందినదేవతలు కొంతసేపటికి మూర్ఛతెలిసి తేజోహీనులై దుఃఖంబునొంది బ్రహ్మదేవునియొద్దకుఁబోయి యిట్లనిరి.

—— విశ్వామిత్రునితపోగ్నికిదేవతలుసహింపనేరక బ్రహ్మదేవునితో మొఱపెట్టుకొనుట. ——

ఓబ్రహ్మదేవుఁడా! మహామునియగు విశ్వామిత్రుండుశేయుతపస్సునకు విఘ్నంబుసేయఁదలంచి యతండుకామక్రోధాదులకు లోబడునట్లుగ ననేకప్రయత్నంబులం జేసియునవియన్నియు విఫలంబులగుటచే నవ్విశ్వామిత్రుండుతపంబునందు నానాటికిమిగుల వృద్ధినొందుచున్నాఁడు. ఇప్పుడుచూడగా నీవిశ్వామిత్రునియందు కొంచెమైనను పాపం బుండునట్లగఁపడదు. ఓసరస్వతీప్రాణవల్లభ! ఈవిశ్వామిత్రమహామునికోరినవరంబువివ్వకుంటిమేని జంగమస్థావరంబులతోడంగూడిన నీమూఁడులోకములను తనతపోగ్నిచే నశింపంజేయును.

మఱియు నీవిశ్వామిత్రునితపోగ్ని సర్వత్రవ్యాపించుటచే నాలుగుదిక్కులు నల్లకల్లోలంబయ్యె. సమస్తవస్తువులు తేజోహీనంబులయ్యె. సముద్రంబులన్నియుక్షోభింపంబడియె. ఎక్కడనుండుపర్వతంబు లక్కడక్కడనేకూలఁదొడంగె. ఓబ్రహ్మదేవుఁడా! భూమిగడగడ వడంకుచున్నది. గాలిస్తిమితములేక కలతనొందివీచుచున్నది. జనులునాస్తికులోయనునట్లు కర్మలవిడిచిపెట్టియున్నారు. కావునదీనికుపాయంబు నాలోచింపుము. మహర్షియగువిశ్వామిత్రునికాంతిచే సకలలోకంబులును కలతనొందిదిక్కుతెలియక మోహంబుఁజెందినట్లున్నది. సూర్యుఁడు తేజోహీనుఁడై

ప్రకాశించుటలేదు. శతపత్రోద్భవుఁడవగు నోబ్రహ్మదేవుఁడా! మహాత్ముండును, నగ్నిహోత్రుని వంటివాఁడును నగు విశ్వామిత్రమహాముని లోకంబులనన్నింటిని నశింపఁజేయుటకుఁ బూర్వమే యతనికి సంతోషము గలుగునట్లు జేసిన మేలుసంభవించును. అట్లుజేయనియెడల పూర్వముప్రళయాగ్నిలోకంబుల దహించినరీతిగ నీవిశ్వామిత్రుండుతన తపోగ్నిచే మూఁడులోకములను దహింపంజేయును. ఇఁక దేవతల దొరతనమునుగూడ జేసిననుజేయును. కావునని తండుకోరినవరము నివ్వవలయునని మొఱవెట్టిరి అంతబ్రహ్మదేవుఁడు దేవతలమొఱచాలకించి యట్లనేకానిండనియె. పిదపదేవతలు బ్రహ్మదేవునితోడంగూడి మహాత్ముండగువిశ్వామిత్రునియొద్దకుఁబోయి మనోహరంబగువాక్యంబులతోనిట్లనిరి.

బ్రహ్మదేవుఁడు విశ్వామిత్రునితో బ్రాహ్మణుండవైతివని చెప్పుట.

బ్రాహ్మణుఁడవును, ఋషిశ్రేష్ఠుండవునునగు నోవిశ్వామిత్రుఁడా! నీవుచేసినతపంబునకు మేముమిగులసంతోషించితిమి. ఓవిశ్వామిత్రుఁడా! నీవుభయంకరమగు తపస్సుచేసినందువలన బ్రాహ్మణత్వంబునొందితివనిరి. అంతబ్రహ్మదేవుఁడు ప్రత్యేకముగనిట్లనియె. బ్రాహ్మణుఁడవును, శాంతుఁడవునునగు నోవిశ్వామిత్రుఁడా! నేనును దేవతలునుఁ జేరి దీర్ఘాయువునిచ్చెదము. నీకుమంగళమగుగాక. ఇకనీవు యథాసుఖంబుగ వెళ్లుమనియె. అట్టియెడవిశ్వామిత్రుఁడు కండ్లుదెరచి దేవతలను బ్రహ్మదేవునిఁజూచి మిగులసంతోషమునొంది వారలకెల్లఱకి నమస్కరించియిట్లనియె. ఓబ్రహ్మదేవుఁడు మొదలగుదేవతలారా! నాకుబ్రాహ్మణత్వమును, దీర్ఘాయువునుగల్గెనేని, ఓం, అనుప్రణవమును వషట్కారమును, వేదములును, నివినేనొకరికిజెప్పుటకును, యజ్ఞమునందుయాజనత్వమునకునుదగినవాఁడనగుదునుగాక.

విశ్వామిత్రుఁడు వసిష్ఠుఁడు బ్రాహ్మణుఁడవైతివని చెప్పినంగాని యొప్పననుట.

మఱియు నోదేవతలారా! క్షత్రియులకుం దగినవేదములనెఱింగినవారిలోను బ్రాహ్మణులకుండగిన వేదములనెఱింగినవారిలోను శ్రేష్ఠుండును, బ్రహ్మదేవునికొమారుఁడును, నగువసిష్ఠుఁడు మీరిప్పుడుచెప్పినట్లు నన్నుగూర్చి బ్రాహ్మణుఁడవైతివనిచెప్పవలయు. ఓదేవతలారా! నాకోరికయిది- ఈకోరికెను నెరవేర్చితిరేని దేవతలందఱుసుఖముగబోవచ్చుననియె.

అంతదేవతలందఱు వసిష్ఠమహర్షి యొద్దకుఁబోయియోతపోధనుఁడా! నీవిప్పుడుబయలువెడలివిశ్వామిత్రునియొద్దకు వచ్చి "బ్రహ్మర్షి వైతి" వనిచెప్పవలయును. అట్లుచెప్పకపోతివేని లోకంబంతయు నశించుచున్నదనిరి. అట్టియెడ వసిష్ఠమహర్షి దేవతలంజూచి యోహో దేవతలారా! ఇదెక్కడిమాట? విశ్వామిత్రునకును నాకునుబద్ధవైరంబు గలిగియుండగ నేఁజెప్పినంగాని యొప్పుటలేదని చెప్పినాఁడనుట నమ్మందగియుండలేదనిన దేవతలిట్లనిరి. నీవుచెప్పినంగాని యొప్పికొనుటలేదని మున్నాటికింజెప్పెననిరి.

వసిష్ఠమహర్షి విశ్వామిత్రునితో బ్రాహ్మణుండవైతివని చెప్పుట.

అంతతపోవంతులలో శ్రేష్ఠుండును బ్రహ్మర్షియునగు వసిష్ఠమహర్షి సంతోషపఱుపంబడి బయలుదేరి విశ్వామిత్రునియొద్దకువచ్చిసఖ్యంబుగావించి యోవిశ్వామిత్రుఁడా! దేవతలుచెప్పినట్లేయగుగాక. నీవుబ్రహ్మర్షివైతివి. ఇందుకు సందియముఁలేదు. బ్రహ్మర్షికింగల యధికారంబులన్నియు నీకుంగలుగును. అనిచెప్పినదేవతలందఱు సుఖముగవెళ్ళిపోయిరి. ధర్మాత్ముండగు విశ్వామిత్రుఁడును. నుత్తమంబైన బ్రాహ్మణత్వమునఁబొంది మునిశ్రేష్ఠుండును బ్రహ్మర్షియునగు వసిష్ఠమహర్షినిబూజించిన వసిష్ఠుఁడుతనయాశ్రమంబునకుఁబోయె. పిదపవిశ్వామిత్రుండు తనకోర్కెయీడేరినవాఁడై తపస్సుజేసికొనుచు భూమినంతయుసంచరించె.

ఓరామచంద్రా! మహాత్ముండగు నీవిశ్వామిత్రుండిట్లు బ్రాహ్మణత్వంబునొందె. ఓరాముఁడా! ఈవిశ్వామిత్రుండు మునులలోశ్రేష్ఠుఁడు. ఆకారరూపమగుతపస్సు. ధర్మపరుఁడు. మిగులఁబరాక్రమవంతుఁడు. అనియిట్లు బ్రాహ్మణోత్తముడగు శతానందుఁడుచెప్పి యంతటనూరకుండె. ఇట్లు రామలక్ష్మణుల సమీపంబున శతానందుఁడు చెప్పినమాటలను జనకమహారాజువిని చేతులుజోడించుకొని విశ్వామిత్రునింజూచియిట్లనియె.

జనకమహారాజు విశ్వామిత్రుని పొగడుట.

ధార్మికుండవును మునిశ్రేష్ఠుండవునునగు నోవిశ్వామిత్రుఁడా! నీవుకకుత్స్థవంశంబునం బుట్టినరామలక్ష్మణులతోడంగూడి నేఁజేసెడియజ్ఞంబునకువచ్చితివి. కావుననేను నీచేననుగ్రహింపఁబడితిని. ధన్యుండనైతిని. మహాత్ముండవగునీవుదర్శనంబిచ్చి నన్నుపాలించితివి. బ్రహ్మర్షిశ్రేష్ఠులలోశ్రేష్ఠుండవును, మహాభాగ్యముగలవాఁడవునునగు నోవిశ్వామిత్రుఁడా! నీయొక్కదర్శనమువలన నాకనేకగుణంబులుప్రాప్తించినవి. మహాతేజుండును, బ్రాహ్మణుండవునునగువిశ్వామిత్రుఁడా! మిగులశ్లాఘింపఁబడుచున్న. నీమహాతపస్సుయొక్క వృత్తాంతమును నేనును మహాత్ముండగు రాముఁడునువింటిమి. మఱియునీసభయందువచ్చియుండు

సర్వితులును నీయొక్కగుణాతిశయంబులను మిక్కిలి చక్కగావినిరి. ఓవిశ్వామిత్రుఁడా! బ్రహ్మదేవునియొక్కయు, ఉమాపతియగుపరమేశ్వరునియొక్కయు తపోబలగుణంబులవలె,నీతపస్సును నీబలంబునునీగుణంబులును, లెక్కపెట్ట శక్యముగాదు. విభుఁడవైననోవిశ్వామిత్రుఁడా! అత్యాశ్చర్యంబులగు నీయొక్కకథల నింకనువినవలయునని తోఁచుచున్నదిగాని చాలుననితోఁచదయ్యె.

మునిశ్రేష్ఠుండవగువిశ్వామిత్రుఁడా! సూర్యాస్తమయకాలముకావచ్చినది. కావునసాయంకాలమునందుఁ జేయవలసినకర్మలఁ జేయఁబోయెదను. రేపుప్రభాతకాలంబున మఱలనాకు దర్శనంబివ్వవలయు. తపోవంతులలో శ్రేష్ఠుండవగువిశ్వామిత్రుఁడా! నీకుస్వాగతమగుఁగాక. నాకు సెలవిమ్ము. పోయివచ్చెదననిన మునిశ్రేష్ఠుండగువిశ్వామిత్రుఁడుసంతోషించి జనకమహారాజుంబూచి పోయిరమ్మనియాజ్ఞయొసంగె విదేహదేశాధిపతియగు జనకమహారాజును విశ్వామిత్రునితోఁ బోయివచ్చెదనని చెప్పి యతిశీఘ్రంబుగనుపాధ్యాయునితోడను బంధువులతోడనుగూడి విశ్వామిత్రునకుఁ బ్రదక్షిణంబుసేసి వెళ్ళిపోయె. ధర్మాత్ముండైన విశ్వామిత్రుండును రామలక్ష్మణులతోడంగూడి మహర్షులచేసన్మానింపఁబడుచు దనవిడిదికింబోయె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి అఱువదియైదవసర్గ ముగిసెను.

జనకమహారాజు రామలక్ష్మణులకు శివునివిల్లునుచూపించుట.

పిదప మరునాడుదయమున జనకమహారాజు ప్రాతఃకాలమునందు సేయవలసినకృత్యములనెరవేర్చికొని మహాత్ముండగు విశ్వామిత్రుని రామలక్ష్మణులతోడఁ బిలుపించె. అట్లుపిలుపించి ధర్మాత్ముండగు జనకమహారాజు విశ్వామిత్రరామలక్ష్మణులను యథావిధిగబూజించియిట్లనియె. మహాత్ముండవును, అనఘుండవును నగువిశ్వామిత్రుఁడా! నీకు స్వాగతమగుగాక. నీకొఱకునేనేమిసేయవలయు? నీవునాకాజ్ఞాపింపవలయు? నేనెల్లప్పటికిని నీచేనాజ్ఞాపింపఁదగినవాఁడనేకదా? అనినధర్మాత్ముండును,వాక్యవిశారదుండును, నగువిశ్వామిత్రమహాముని మహాత్ముండగు జనకమహారాజుచెప్పినమాటనువిని యిట్లనియె.

మహాపరాక్రమశాలియగు జనకమహారాజా! ఈబాలురిద్దఱుఁను క్షత్రియవంశంబునం బుట్టినవారు. లోకమునందు ప్రసిద్ధికెక్కినవారు. దశరథమహారాజపుత్రులైన రామలక్ష్మణుల వీరు నీధనుశ్శాలయందుండు శివునివిల్లును జూడగోరుచున్నారు. నీకుమంగళమగుగాక. ధనుస్సునుజూపించుము. అట్లుచూపించితివేని నీరామలక్ష్మణులు నావిల్లుంజూచి తమకోర్కెనీడేర్చుకొని యథేష్టముగమఱలఁబోయెదరు. అనినజనకమహారాజు మహామునియగు నవ్విశ్వామిత్రునితో నిట్లనియె.

జనకమహారాజువిశ్వామిత్రునకుశివునివిల్లుయొక్క వృత్తాంతమును జెప్పుట.

ఓవిశ్వామిత్రుఁడా! ఈధనువిచ్చటనుండుట కేమికారణమో దానంజెప్పెదవినుము. పూర్వము నిమిచక్రవర్తికారవపురుషుండైన దేవరాతుండను రాజొకండుండెను. రాజేంద్రునకుఁ బరమేశ్వరుండీధనుస్సును నిక్షేపముగానుంచుకొమ్మనియిచ్చె. తొల్లిదక్షప్రజాపతి యాగముసేయుచుండగ నయ్యజ్ఞమునుధ్వంసముసేయఁదలంచి మహాపరాక్రమవంతుఁడగు పరమేశ్వరుఁడు రోషంబువలనధనుస్సును నెక్కుబెట్టి దేవతలంజూచియిట్లనియె. ఓదేవతలారా! ఈ యాగమునందు నాకివ్వవలసిన హవిర్భాగమును నివ్వరైతిరి. కావున మీతలలను యీధనుస్సుచేనఱికివేసెదననియె.

మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! ఇట్లుపరమేశ్వరుండుసెప్పిన దేవతలందఱును మిగులవ్యసనాక్రాంతులై యేమియుందోఁచక దేవతలకుఁబ్రభువైనపరమశివునకు హవిర్భాగమునిచ్చి సంతోషముగలుగునటులంజేసిరి. అంతపరమశివుండును వారలయందుమిక్కిలి ప్రీతిగలవాఁడై యాధనుస్సును దేవతలకిచ్చె. దేవతలు పరమేశ్వరునిచ్చిన యట్టి యీధనుస్సును మాపూర్వపురుషుఁడైనదేవరాతునకిచ్చిరి అదిమొదలీధనుస్సు మాగృహమునందలి ధనుశ్శాలయందు పూజింపంబడుచున్నది. ఇప్పుడు నేనుయాగముసేయదలంచి నాగలిచేభూమిదున్నుచుండగ నానాగలివలనద్రోవ్వఁబడిన ప్రదేశమునందుండి యొకకన్యకయుద్భవించె.

నేనుయాగభూమిని పరిశుద్ధముసేయుచుండగ నాగటిచాలువలన నుద్భవించుటంజేసి యాకన్యక "సీత" యనునామధేయముచే బ్రసిద్ధినొందె. ఇట్లుభూమివలనంబుట్టిన యాసీతను నాపుత్రికగానుంచుకొని పెంచుచున్నాను. ఈ కూతురు,అయోనిజ. కావున(అనగా యోనియందుపుట్టినది కాదు) కావున పరాక్రమవంతునకే నివ్వవలయుననిదలంచి యెవ్వరికినినివ్వఁబడకయున్నది. మునిశ్రేష్ఠుఁడవగు నోవిశ్వామిత్రుఁడా! అనేకరాజులువచ్చి భూమియందుఁబుట్టి వృద్ధిబొందుచున్న నాకూతురైనసీత నిమ్మనియడిగిరి. ఇట్లు కన్య నడుగవచ్చినరాజులకందఱకును పరాక్రమముగలవానికేనివ్వ నిశ్చయించి నాననిచెప్పి యెవరికినియివ్వనైతిని.

ఓవిశ్వామిత్రుఁడా! పిదప రాజులందఱును గుంపుగా

గూడి యీమిథిలానగరమునకువచ్చి కన్యనువివాహముజేసికొనుటకుందగిన నెట్టిపరాక్రమంబుగావలయునో దానిని వివరముగ దెలియఁజేయుమనిరి. అంత నేను పరాక్రమవిధంబును వివరముగ దెలియజేయుమనికోరిన నారాజులకందఱకు శివునివిల్లును దెచ్చిచూపితిని. పిదప నారాజులాధనుస్సునుజూచి యెత్తుటకైనను, కదలించుటకైనను, శక్తిలేనివారైరి. అంతనే నారాజులపరాక్రమం బత్యల్పంబనితలంచి తిరస్కరించి మీరందఱు వచ్చినమార్గముంబట్టిపొండని చెప్పితిని.

మునిశ్రేష్ఠుండవగు నోవిశ్వామిత్రుఁడా! అంతనారాజులందఱును వారలకే తాముపరాక్రమము లేనివారనెడుసంశయముగలుగుటంజేసి మిగులఁగోపావేశులై మిథిలాపట్టణమును ముట్టడించిరి. ఇట్లురాజశ్రేష్ఠులందఱును మిథిలానగరమునుముట్టడించిన నేనును చతురంగబలసమేతుండనై వారలతో నొకసంవత్సరంబుయుద్ధంబుఁజేసితిని. పిదప నొకసంవత్సరంబైనతోడనే నాసైన్యసామగ్రియంతయు నశించె. అట్టియెడ నేనుమిగులవ్యసనాక్రాంతుండనై దేవతాసమూహంబులనుగూర్చి తపంబుగావించి వారలనుసంతసింపంజేసితిని.

దేవతలును మిగులసంతోషపడి నాకుజతురంగసేనలనిచ్చిరి. అట్టిసేనాబలంబుగలిగి నేనుమరలనారాజులనెదిర్చి యుద్ధంబుఁజేయఁగఁ బాపకర్ములును,వీర్యములేనివారును, సంశయింపఁదగిన పరాక్రమముగలవారును, నగు నారాజులు నాసేనలతోఁ యుద్ధంబుజేయనేరక నవమానంబునొంది దిక్కులకుంబారిపోయిరి. ఇదియనీధనుస్సుయొక్కవృత్తాంతము. సువ్రతుండవగు నోవిశ్వామిత్రుఁడా! పరమభాస్వరమగు శివునిధనుస్సును రామలక్ష్మణులకుంజూపెదను. ఈరాముఁడుశివునియొక్కధనుస్సును నెక్కుబెట్టెనేని యయోనిజయగు నాకూతురైనసీతను దశరథరాజపుత్రుండైన నీరామునకేయిచ్చెదను.

ఇట్లనిశ్రీమద్బాలకాండమునందలి యఱువదియాఱవసర్గముగిసెను.

జనకమహారాజు శివునివిల్లును దెప్పించి రామలక్ష్మణులకుజూపుట.

ఇట్లుచెప్పినజనకమహారాజుంజూచి విశ్వామిత్రుండిట్లనియె. ఓమిథిలాధీశ్వరా! పరమశివునిధనుస్సును నీరామునకుంజూపింపుమనిన జనకమహారాజుమంత్రులంబిలిచి ఓమంత్రులారా! స్వర్గంబునంబుట్టినదియును,గంధపుష్పాదులచే నలంకరింపఁబడినదియును, నగు శివునిధనుస్సును నిచటికిదీసికొనిరండని యాజ్ఞాపించె. అంతమంత్రులు జనకమహారాజాజ్ఞను శిరసావహించి పట్టణంబుప్రవేశించి రాజాజ్ఞాప్రకారము శివునివిల్లుందీసికొని బైలువెడలిరి

మిక్కిలి పొడుగుగలదేహముగలవారును, మహాబలులును, నగు నైదువేలమందిపురుషులు శివునివిల్లునుపెట్టియుండు బండివలెనుండెడి యెనిమిదిచక్రములుగల యినపపెట్టెను నతిప్రయాసముచే నీడ్చుకొనివచ్చిరి. ఇటారాజమంత్రులు శివునివిల్లుపెట్టియున్న యినపపెట్టెనుదీసికొనివచ్చి దేవతలతో సమానుండగు జనకమహారాజుముందరంబెట్టియిట్లనిరి. ఓరాజశ్రేష్ఠుఁడా! జనకమహారాజా! సమస్తరాజులచేతను బూజింపంబడిన ధనుశ్శ్రేష్ఠంబును నిదిగోదెచ్చితిమి.నీవుకోరినప్రకారము రామునకుఁజూపింపవచ్చుననిరి. అంతజనకమహారాజు, చేతులుజోడించుకొని మహాత్ముండగు విశ్వామిత్రుని రామలక్ష్మణులనుజూచియిట్లనియె.

ఓబ్రాహ్మణోత్తముఁడవగు విశ్వామిత్రుఁడా! ఈధనుశ్శ్రేష్ఠము మావంశస్థులగుజనకులచేతను, ఎక్కుపెట్టుటకు శక్తిలేని మహావీర్యులగునితరరాజులచేతను, పూజింపంబడుచుండినది మఱియు దేవతలు,అసురులు, రాక్షసులు,గంధర్వులు,యక్షులు,కిన్నరులు, ఉరగులు, వీరలలోనెవ్వరైనను, ఈధనుశ్శ్రేష్ఠంబును నెక్కుపెట్టంజాలరు. దేవతలుమొదలగువారలకె యిట్లుండగ నీధనుస్సునువంచుటకైనను ఎక్కుపెట్టుటకైనను, బాణమునుగూర్చుటకైనను, అల్లెత్రాడునునీడ్చుటకైనను, కదలించుటకైనను, మనుష్యులలోనట్టి శక్తిగలవారుండరనుట సిద్ధంబేను. మునిపుంగవుడవగు విశ్వామిత్రుఁడా! అట్టిశ్రేష్ఠంబగు శివునిధనుస్సు నిదిగో తేబడియున్నది. దీనిని రాజపుత్రులగు రామలక్ష్మణులకుంజూపుమనియె. అంతధర్మాత్ముండగు విశ్వామిత్రుండు జనకమహారాజుమాటనువిని రామచంద్రునింజూచి రాముఁడా! ఇదుగోవిల్లు. దీనింజూడుమనియె. అంత రాముఁడు బ్రహ్మర్షియగు విశ్వామిత్రుని వాక్యమునువిని విల్లుపెట్టియుండు పెట్టెనుతెఱచి వింటినిజూచి విశ్వామిత్రునితోనిట్లనియె.

రాముఁడుశివునివిల్లునువిరుచుట.

బ్రాహ్మణోత్తముఁడవగు నోవిశ్వామిత్రుఁడా! ఈధనుస్సును చేతందీసికొని యెక్కుపెట్టుటకుఁ బ్రయత్నించెదననిన జనకమహారాజును విశ్వామిత్రమహామునియును, రామునింజూచి మంచిది అట్లనే సేయుమనిరి. అంతరాముఁడు విశ్వామిత్రమహామునియాజ్ఞనొంది కొంచెమైనను బ్రయాసములేక బహుసులభముగ నావింటిని చేతితోనెత్తి దానిమధ్యంబునుబట్టికొనియె. అనేకవేలమనుష్యులుచూచుచుండగ ధర్మాత్ముండగు నారాముఁ డీశ్వరుని ధనుస్సును

బహుసులభముగ నెక్కుపెట్టె. ఇట్లు ధర్మాత్ముండగు నారామచంద్రుఁ డెక్కుఁబెట్టి యాపరమశివుని ధనుస్సును బాణము తెఱఁబూరించె.

మహాయశుండును, పురుషశ్రేష్ఠుండునునగు రాముఁడీశ్వరునియొక్క ధనుస్సును నడుమను విఱిచెను. అట్లు విఱుచుటవలన పిడుగుపడినదోయనునట్లు గొప్పధ్వనిజనించె. పర్వతములుపగులునప్పుడుగలిగెడు భూకంపమువలె భూమిగడగడవడంకె. అట్టియెడ మునిపుంగవుడగు విశ్వామిత్రుఁడును, జనకమహారాజును, రామలక్ష్మణులును, దప్పతక్కినవారందఱును నాశబ్దంబునకు మూర్ఛిల్లి భూమియందుపడిరి. ఇట్లుమూర్ఛిల్లినజనులు కొంతసేపటికి మూర్ఛదేరిరి. అంత వాక్యకోవిదుండగు జనకమహారాజు నిర్భయుఁడై చేతులు జోడించుకొని మునివరుండగు విశ్వామిత్రునిం జూచి యిట్లనియె.

—*జనకమహారాజు సీతను రామునకిచ్చెదనని చెప్పుట.*—

మహాత్ముఁడవగు విశ్వామిత్రుఁడా! దశరథమహారాజపుత్రుండగు రామునియొక్క పరాక్రమమును నేను తెలిసికొంటిని. ఈలోకంబున నీశ్వరునియొక్క ధనుస్సును విఱుచువాఁడొకఁడుండునని నేనిశ్చయింపలేదు. ఈకార్యము దేవతలకుగూడ జేయనశక్యంబైనదగుటవలన నిట్లుజరుగునని తలంచుటకవకాశములేదు. ఈరాముఁడీకార్యము సేయుటమిగులనాశ్చర్యకరము. నాకొమార్తెయైనసీత దశరథమహారాజపుత్రుఁడైన రాముని పెండ్లాడి జనకవంశమునకు కీర్తినికలుగజేయును. సీతను పరాక్రమముగలవానికే యిచ్చెదనని నేను చేసినప్రతిజ్ఞ సత్యంబైనది. నాపంచప్రాణంబులకన్నను నాచే నెక్కువగ సంరక్షింపం బడుచుండునదియు నాకొమార్తెయునైన సీతను రామునికిచ్చెదను.

బ్రాహ్మణుఁడవగు విశ్వామిత్రుఁడా! నీకుమంగళమగుగాక. నామంత్రులతిత్వరితముగ రథంబులనెక్కి యయోధ్యానగరమునకు బోవుటకు సెలవిమ్ము. అట్లయోధ్యకుబోయి యిక్కడ జరిగినవృత్తాంతముల నెల్లవారలకు విన్నవించుటకును, దశరథమహారాజును బిలుచుకొనివచ్చుటకును, సీతను పరాక్రమంబుగల రామునకేయిచ్చుటకై నిశ్చయించుటకును, శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రమునివరునిచే రక్షింపంబడుచున్నవారని దశరథమహారాజునకు జెప్పుటకును, ఈవృత్తాంతములనెల్లవిని సంతోషసముద్రంబున మునింగియుండు నాదశరథమహారాజును నిచటికిబిలుచుకొని వచ్చుటకును, అనుజ్ఞ యిమ్మనియె.

—*జనకమహారాజు యయోధ్యకుదూతలంబంపుట.*—

ఇట్లు జనకమహారాజు అనేకవిధంబులుగ బ్రార్థించినవిశ్వామిత్రమహాముని జనకమహారాజుంజూచి నీయిష్టప్రకారముగ నట్లనేచేయుమనియె. అంతధర్మాత్ముఁడగు జనకమహారాజు వివాహమహోత్సవాహ్వాన పత్రికలను వ్రాసి మంత్రులంబిలిచియిట్లనియె. ఓమంత్రులారా! మీరీపత్రికలం దీసికొని యయోధ్యాపట్టణమునకుబోయి యిక్కడజరిగిన వృత్తాంతమంతయు దశరథమహారాజునకు వివరముగవిశదపఱచి పిలుచుకొనిరండని యాజ్ఞజేసె

ఇట్లుశ్రీమద్బాలకాండమునందలి యఱువదియేడు సర్గ ముగిసెను.

—*జనకమహారాజుదూతలు దశరథునిగనుఁగొనుట.*—

ఇట్లు జనకమహారాజమంత్రులు శుభలేఖలఁ దీసికొనిగుఱ్ఱంబులనెక్కి మూఁడహోరాత్రములు ప్రయాణముజేసి యయోధ్యాపట్టణము బ్రవేశించిరి. ఇట్లుప్రవేశించి దశరథమహారాజ గృహమునకుబోయి ద్వారపాలకులంజూచి యిట్లనిరి. ఓకావలివాండ్రారా! మేముమిథిలానగరమునేలు జనకమహారాజదూతలము. మీదశరథ మహారాజునకు సంతోషవార్త నెఱింగింపవచ్చితిమి. కావునమీరాజుగారితోబోయి చెప్పుడనిరి. అంతనాద్వారపాలకులు గృహములోనికింబోయి దశరథమహారాజుంజూచి మహారాజా! మిథిలాపట్టణపట్టభద్రుండగు జనకమహారాజుయొద్దనుండి దూతలువచ్చియున్నారు. అనుజ్ఞయిచ్చెదరేని లోపలికిబిలుచుకొనివచ్చెదమనిరి. అంతదశరథమహారాజు జనకమహారాజదూతలం దోడ్కొనిరండని సెలవొసంగె.

పిదప ద్వారపాలకులు మిథిలానగరపు దూతలందోడ్కొనిపోయి దశరథమహారాజునొద్ద విడిచిపెట్టిరి. అట్టియెడ జనకమహారాజదూతలు దేవతలతోసమానుండును, ముసలివాడునునగు దశరథమహారాజునుజూచి చేమోడ్పుగలవారై మనోహరములగు వాక్యములతోనిట్లనిరి. ఓదశరథమహారాజా! మిథిలాధీశ్వరుండగు జనకమహారాజునీకును నీయగ్నిహోత్రంబులకును ఋత్విజులకును పురోహితునకును సపరివారజనములకును క్షేమమా? ఆరోగ్యమా? అనిస్నేహంబువలన మధురవాక్యంబులతో మాటిమాటికి నడుగుచుండును. ఇట్లుమిథిలాధిపతియగు జనకమహారాజు క్షేమంబడిగిన పిదపవిశ్వామిత్రుని యనుజ్ఞచే నీతోనిట్లని చెప్పుమనియె.

ఓదశరథమహారాజా! నాకొమార్తెను పరాక్రమముగలవానికే యిత్తునని నేను పూర్వముచేసిన ప్రతిజ్ఞ మీకందఱికిని తెలిసియేయున్నదిగదా! అందుచేగొందఱు రాజులు కోపంబునొంది నాతోయుద్ధంబుచేసి నిర్వీర్యులై పరాజయ

మునొందిరనుటయును తెలిసియేయున్నదిగదా! అట్టి ప్రతిజ్ఞ చేసెవరికిని సాధింపరాని నాపుత్రికయగు సీతనునాభాగ్యంబువలన విశ్వామిత్రుని వెంబడించివచ్చినవాడును, పరాక్రమవంతుడునునగు నీగారాబుపట్టియైన రాముడుసాధించె. దశరథమహీవల్లభా! ఎవరికినికదిలింపనుగూడ శక్యముగాని దివ్యంబగు పరమశివునిధనుస్సు మిగులబరాక్రమవంతుడగు రామునిచేమహాజనసభయందు నడిమికిరెండుతునకలగ విఱువబడియె. పరాక్రమవంతునకే సీతనిచ్చెదనని నేనుచేసియుండిన ప్రతిజ్ఞాప్రకారము మహాపరాక్రమశాలియగు రామునకుసీతనిచ్చెదను. నాప్రతిజ్ఞను నెరవేర్పవలయు నీకార్యమున కనుజ్ఞయివ్వవలయు.

మహారాజా! దశరథభూపాలా! నీవుఋత్విజులతోడను పురోహితునితోడనుగూడి శీఘ్రముగమిథిలానగరమునకు రావలయును. నీకుమంగళమగుగాక. రామలక్ష్మణులంజూడవలయును, నాకోర్కెనీడేర్చి నాకుసంతోషమును సేయవలయును నేనుబుత్రికలవిద్దఱ సంతోషంబునంజూచురీతిగనీవును నీకొడుకులనిద్దఱ సంతోషంబునం జూడగలవు. ఓదశరథమహారాజా! అనియిట్లువిదేహభూపాలుడగు జనకమహారాజును విశ్వామిత్రశతానందుల యాజ్ఞాప్రకారమునునోహరములగు వాక్యములతో జెప్పితినని తమకువిన్నవింపుండనియె. అనియాప్రకారము దూతలుదశరథమహారాజుతో జెప్పి మహారాజగుటచే భయపడియెక్కువమాటలాడకనూరకుండిరి. అంతదశరథమహారాజు దూతలుచెప్పినదానినివిని మిగులసంతోషంబుననుప్పొంగి తనమంత్రులను వసిష్ఠ వామదేవుల జూచి యిట్లనియె.

వామదేవులారా! మంత్రులారా! కౌసల్యానందవర్ధనుడగు మనరాముడు లక్ష్మణునితోడంగూడి విశ్వామిత్రునిచే సంరక్షింపబడుచు విదేహదేశమునందున్నాడు. మహాపరాక్రమవంతుడగు జనకమహారాజురాముని పరాక్రమమును మిక్కిలిచక్కగానెఱింగెను. జనకమహారాజు తనకొమార్తెను రామునకియ్యదలంచి యున్నాడు. కావునజనకమహారాజు చేయదలంచిన నీకార్యము మీకందఱికిష్టంబయ్యెనేని శీఘ్రముగమిథిలాపట్టణమునకు బోవుదము. ఇకనాలస్యము సేయరాదనియె.

అంతమహర్షులును మంత్రులును ఇదిమిగులమంచికార్యము. త్వరగా సేయవలసినదేయనిరి. అట్టియెడదశరథమహారాజు పరమసంతోషంబునొంది మంత్రులుమొదలగువారింజూచి రేపుప్రయాణం బయ్యెదమనిచెప్పి జనకమహారాజమంత్రులైన దూతలనుమిగులసత్కరించె. ఆదూతలును దశరథమహారాజుచే బూజింపంబడి సంతోషంబువలననా త్రియంతయు నచ్చటనెయుండిరి.

ఇట్లుశ్రీమద్బాలకాండమునందలిఅరువదియొనిమిదవసర్గ ముగిసెను.

—{ దశరథమహారాజుతనకొడుకులవివాహనిమిత్త ముమిథిలానగరమునకుబ్రయాణమగుట }—

పిదపరాత్రియంతయు గడచినమరునాడు దశరథమహారాజు బంధువులతోడను ఋత్విజులతోడనుగూడి సంతుష్టుండైసుమంత్రునిజూచి యిట్లనియె. ఓసుమంతుడా! ఇప్పుడు బొక్కసముయొక్క అధికారులందఱును పుష్కలంబుగ ద్రవ్యంబును దీసికొనినానావిధ రత్నంబులతోడంగూడి సిద్ధులై ముందటంబోవలయు. ఈక్షణంబుననె నాయాజ్ఞాప్రకారము చతురంగబలములును, శ్రేష్ఠములగుపల్లకీలును అనగామేనాలును రథంబులుమొదలగునవియన్నియును బయలువెడలవలయు. ఆలస్యముసేయక వసిష్ఠుడు వామదేవుడు జాబాలి, కాశ్యపుడు దీర్ఘాయువుగల మార్కండేయుడు, కాత్యాయనుడు మొదలగుబ్రాహ్మణోత్తములుముందఱబోవలయు. దూతలుత్వరజేయుచుండడము తెలియునుకదా, అనెను. అంతసుమంతుడు రాజాజ్ఞాప్రకారముసకలమునునాయత్తముజేసె. దశరథమహారాజు చతురంగసేనలును ఋషులునువెంటనంటిరాగ బ్రయాణంబయ్యె. ఇట్లుదశరథమహారాజు నాలుగురోజులుప్రయాణముజేసియైదవదినమునందు విదేహదేశమునంబ్రవేశించె.

—*జనకమహారాజుదశరథమహారాజునుసత్కరించుట.*—

అట్టియెడ శ్రీమంతుడగుజనకమహారాజు దశరథమహారాజు తనపట్టణమునకు వచ్చుటనువిని యెదుర్కొనిపోయితోడతెచ్చి యథావిధిగబూజించి సత్కరించివృద్ధుండగు దశరథమహారాజుంజూచి మహాసంతోషంబునదేహంబున గగుర్పాటుకలుగగానిట్లనియె. రఘువంశోద్భవుడవగు నోదశరథమహారాజా! నీకుస్వాగతమగుగాక. నాభాగ్యంబుమంచిదగుటచే నీవిచ్చోటికివచ్చితివి. నీయిద్దఱుపుత్రులయొక్క పరాక్రమముచే సంపాదింపబడినసంతోషమును ననుభవింపగలవు. నాభాగ్యంబువలనమహాతేజుండును మహాత్ముండునునగు వసిష్ఠమహర్షి బ్రాహ్మణశ్రేష్ఠులనందఱంగూడి "నూఱుయాగంబులు సేసిన దేవేంద్రునివలె" నిచ్చటికివిచ్చేసెను. మహాత్ములును, పరాక్రమవంతులలోశ్రేష్ఠులును, నగురఘువంశమునందు బుట్టినవారితోగూడ వియ్యమందుటచే నాభాగ్యంబున నావిఘ్నంబులన్నియునశించినవి. నాభాగ్యంబుచే నాకులంబుపూజింపంబడియె. దశరథమహీవల్లభా! రేపుప్రభాతకాలమున యజ్ఞ

పూర్తియందు ఋషులకుసమ్మతంబగునటుల వివాహము నెఱవేర్పవలయుననియె.

దశరథమహారాజుజనకమహారాజునుమర్యాదజేయుట.

అంతమాటలయందు సమర్థుండగు దశరథమహారాజు ఋషులమధ్య జనకమహారాజుంజూచి యిట్లనియె-ధర్మజ్ఞుండవగుజనకమహారాజా! ఇవ్వదలంచినవాడిచ్చెనేని పుచ్చుకొనువాడప్పుడే పుచ్చుకొనును-కావున ప్రతిగ్రహముదాతయధీనము- నీవిట్లుకన్యాదానమును జేయుటను పూర్వమే వినియున్నాను నీవుచెప్పినప్రకారముచేయుటకు మేము సిద్ధముగనున్నామనెను. అట్టియెడ విదేహదేశాధీశ్వరుఁడగు జనకుడు ధర్మిష్ఠంబునుకీర్తికరంబునునగు నాదశరథునివాక్యంబునువిని మిగులనాశ్చర్యమునొందె.

పిదప మునులయొక్క సమూహములందఱును వొకరికొకరికి సమాగమముగలుగుటవలన మిగుల సంతోషించి యారాత్రియంతయు సుఖంబుగనుండిరి- దశరథమహారాజును తనపుత్రులయిన రామలక్ష్మణులనుజూచి మిగులసంతోషంబునొంది జనకునిచేబూజింపఁబడి సుఖంబుండె మహాతేజుండును ధర్మశాస్త్రతత్వంబుల నెఱింగినవాఁడును నగుజనకమహారాజు యజ్ఞముపూర్తిచేయుటకు కొరతగనుండినకార్యములనన్నింటిని నిర్వర్తించి కొమార్తెలవివాహమునకై ముందుగజేయవలసిన యంకురార్పణముమొదలగు సకలకార్యములను నెఱవేర్చి యారాత్రియంతయు సుఖముగగడపె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి యిరువదితొమ్మిదవ సర్గముగిసెను.

జనకమహారాజు తనతమ్ముఁడగు కుశధ్వజుని పిలిపించుట.

పిదప మరునాడు ప్రాతఃకాలమున వాక్యజ్ఞుఁడగుజనకమహారాజు యాగసంబంధమైనకార్యములనెల్ల నెరవేర్చి మహర్షులతోడంగూడి పురోహితుండగుశతానందునింజూచియిట్లనియె-మహాత్ముండవగు నోశతానందుఁడా! మహాపరాక్రమముగలవాఁడును- నతిధార్మికుండును, నగునాతమ్ముడు కుశధ్వజుఁడనువాఁడొకడుగలఁడు- అతఁడు శత్రురాజులు రాకుండుటకొఱకు చుట్టునుండు యగడ్తలయందు శూలంబులబాతిపెట్టబడినదియును, (లేక సీటియుసిరికచెట్లుగలదియును) పుణ్యంబును మంగళకరంబునైనదియును పుష్పకవిమానముం బోలినదియుననగు, సాంకాశ్యమనెడుపట్టణమునందు ఇక్షుమతీనదినీళ్ళందాగ్రవుచునివసించుచున్నాఁడు- అట్టినాతమ్ముఁడగు కుశధ్వజునిజూడగోరుచున్నాను- అతఁడునాయాగమును సంరక్షించువాఁడు-మహాపరాక్రమ సంపన్నుఁడు- నాతోఁగూడ నీసీతావివాహంబునంగలుగు సంతోషంబుననుభవింప నతండునుసర్హుఁడని శతానందుని సన్నిధియందుచెప్పిన తత్క్షణంబున నతిజాగరూకులగు దూతలు జనకమహారాజు నెదుటవచ్చి నిలిచిరి- అంతజనకుఁడుజూచియిట్లనియె-ఓదూతలారా! మీరతిశీఘ్రంబుగ సాంకాశ్యమునకుఁబోయి నాతమ్మునికదవృత్తాంతమంతయు దెలియజెప్పి తోడ్కొనిరండుపొండనియె- పిదప నాదూతలు జనకునియాజ్ఞశిరసావహించి యతివేగముగనడుచు గుఱ్ఱంబులనెక్కి "ఇంద్రాజ్ఞచే విష్ణుదేవునిరీతిగ,, పురుషశ్రేష్ఠుఁడగు కుశధ్వజునిపిలుచుకొనివచ్చుటకుబోయిరి- ఇట్లుపోయి సాంకాశ్య నగరమును జేరి కుశధ్వజునిజూచి రాముడుశివధనుర్భంగము గావించుటమొదలగు సకలవృత్తాంతములను, జనకమహారాజభిప్రాయంబును దెలియజెప్పిరి- అట్టియెడ నరేంద్రుఁడగు కుశధ్వజుఁడు మహాబలులగుదూతలవలన సకలవృత్తాంతమును దెలిసికొని తత్క్షణంబున బ్రయాణంబై దూతలతోడ మిథిలాపట్టణమునకువచ్చె.

కుశధ్వజుడుమిథిలాపట్టణమునకువచ్చుట,

ఇట్లువచ్చి మహాత్ముండును ధర్మవత్సలుండును నగుజనకమహారాజునకును పురోహితుండగు శతానందునకునునమస్కరించి యుచితసింహాసనంబున గూర్చుండె, మిగుల పరాక్రమశాలురును, అతితేజోవంతులునునగు జనకకుశధ్వజులిద్దఱును ఆసనంబులయందుగూర్చుండి మంత్రిశ్రేష్ఠుండగుసుదామునిపిలిచి యిట్లనియె-మంత్రిశ్రేష్ఠుఁడవగు నోసుదామనుఁడా! నీవుశీఘ్రంబుగబోయి యమితప్రభగలవాఁడును, దుర్ధర్షుండును, మంత్రిసహితుండునునగు దశరథమహారాజును నతనిపుత్రులతోడ దోడ్కొనిరమ్మనెను.

జనకమహారాజువిడిదియందుండు దశరథమహారాజును పిలిపించుట.

అంతసుదామనుడు దశరథమహారాజు విడిదికింబోయి రఘుకులవర్ధనుండగు దశరథమహారాజుంజూచి సాష్టాంగదండప్రణామంబుఁజేసి యిట్లనియె - మహాప్రపరాక్రమవంతుఁడవగు దశరథమహారాజా! మిథిలాధీశ్వరుఁడగు జనకమహారాజు ఋత్విజులతోను పురోహితునితోడంగూడిన నిన్నుపిలుచుకొని రమ్మనియెనని దశరథమహారాజు ఋషిగణ బంధుపరివృతుండై జనకమహారాజు నొద్దకుంబోయి యుచితాసనంబునఁగూర్చుండి పురోహితామాత్యబంధుసహితుండగు జనకమహారాజుంజూచియిట్లనియె.

ఓజనకమహారాజా! మహాత్ముండును ఋషిశ్రేష్ఠుండును నగు వసిష్ఠమహర్షి యిక్ష్వాకువంశము వారికి దైవంబనియు వారియొక్క సమస్తకార్యము లను మాటలాడి నెరవేర్చువాడనియు నీకు దెలిసియేయున్నది - ఈ ధర్మాత్ముండగు వసిష్ఠ మహర్షి విశ్వామిత్రునియనుజ్ఞనొంది మహర్షులతోడంగూడి నావంశమును యథాక్రమముగ జెప్పగలడని దశరథమహారాజు మహాత్ములగు రాజులమధ్య చెప్పి యూరకుండె.

{ వసిష్ఠమహర్షి ఋషులమధ్య దశరథమహారాజు యొక్కవంశమును యథాక్రమముగ జెప్పుట } ॥—

అంత మహాత్ముండును వాక్యవిశారదుండునునగు వసిష్ఠమహర్షి పురోహితునితోడం గూడియున్న జనకమహారాజుంజూచి యిట్లనియె- అవ్యక్తప్రభవుండును, శాశ్వతుండును, నిత్యుండును, అవ్యయుండును నగు బ్రహ్మకలండు, అతనికి మరీచి పుట్టె- ఆమరీచికి కాశ్యపుడు పుట్టె- ఆ కాశ్యపునకు సూర్యుండు పుట్టె- ఆసూర్యునికి మనువు పుట్టె- ఆమనువే రాజ్యాధిపతియై ప్రజలపరిపాలింపుచుండె- ఆమనువునకు నిక్ష్వాకుండు పుట్టె- ఆయిక్ష్వాకుండే యయోధ్యాధిపతులలో మొట్టమొదటి రాజని యెఱుంగుము- ఆయిక్ష్వాకునకు శ్రీమంతుండగు కుక్షియనువాండు పుట్టె- ఆకుక్షికి వికుక్షియనువాండు పుట్టె ఆవికుక్షికి మహాతేజుండును పరాక్రమవంతుండునునగు బాణుండు పుట్టె- ఆబాణునకు మిగుల ప్రతాపముగల యనరణ్యుండను వాండు పుట్టె- ఆయనరణ్యునికి పృథువనువాండు పుట్టె- ఆపృథువునకు త్రిశంకువు పుట్టె- ఆత్రిశంకువునకు దుందుమారుండు పుట్టె- అతనినే యువనాశ్వుండనియు జెప్పుదురు- అతనికి మాంధాత పుట్టె- ఆమాంధాతకు శ్రీమంతుండగు సుసంధి పుట్టె- ఆసుసంధికి ధ్రువసంధియనువాడును - ప్రసేనజిత్తనువాండును నిరువురుకొడుకులు పుట్టిరి- ఆధ్రువసంధికి యశోవంతుండగు భరతుండు పుట్టె- ఆభరతునకు నసితుండనువాండు పుట్టె- అయ్యసితునికి హైహయులును, తాలజంఘులును, శూరులగు శశిబిందువులును శత్రువులై యతనితో యుద్ధముసేయుచుండిరి- అయ్యుద్ధమునందసితుండు యుద్ధముసేయనేరక పరాజితుండై యూరువిడిచి పరుగెత్తిపోయె- ఇట్లసితుండు పరుగెత్తిపోయి హిమవత్పర్వత ప్రదేశంబునం జేరి యల్పసేనంగూడి మంత్రిసహితుండై భృగుప్రస్రవణంబను శిఖరంబున నివసింపుచుండె- అయ్యసితునికి నిరువురుభార్యలుగలరు- వారిరువురును గర్భంబు దాల్చిరియని వినియున్నాను - అందులో నొకతె తనసవతి గర్భంబును నశింపజేయుటకై భక్ష్యంబునందు విషముపెట్టి దీనిం దినుమనియిచ్చె- ఇదియిట్లుండగ నొకనాడు భృగువంశోద్భవుండగు చ్యవనుండను మహర్షి మనోహరమును పర్వతరాజమునునగు హిమవత్పర్వతమునకువచ్చె.

అట్టియెడ నయ్యసితునిభార్యలలో మిగులభాగ్యవంతురాలును, తామరపుష్పములరేకులవంటి కండ్లుగలదియును, సవతిచేనివ్వంబడిన విషముగలభక్ష్యంబును తినినదియును, నగు నారాజభార్య తనకు దీర్ఘాయువుగలపుత్రుండు పుట్టవలయునను నభిప్రాయముతో దేవతాసమానకాంతిగల చ్యవనమహర్షికి నమస్కరించె- సవతికి విషంబుపెట్టిన యయ్యసితుని మఱియొకభార్యయగు కాళిందియననదియును చ్యవనమహర్షియొద్దకువచ్చి నమస్కరించె. అంతనా బ్రాహ్మణోత్తముండగు చ్యవనమహర్షి మొట్టమొదట తనకు నమస్కరించిన విషము భక్షించినదానింజూచి యిట్లనియె.

తామరపువ్వులరేకులవంటి కండ్లుగలమహాభాగ్యశాలివగునో చిన్నదానా! నీయొక్క గర్భమునందు మహాబలుండును, మహావీర్యుండును, మహాతేజుండును, శ్రీమతుండు నునగు సుపుత్రుడు విషముతోగూడినవాండై త్వరలోబుట్టునని యె- అంతం బతివ్రతయగు నారాజభార్య చ్యవనమహర్షికి నమస్కరించి తనస్థానమునకువచ్చె- పిదపం గొన్నిదినంబులకు నసితుండు మరణంబునొందె- విషముదిన్న యయ్యసితునిభార్య భర్తృశోకాతురయై వ్యసనంబునొందియుండగ చ్యవనమహర్షి యనుగ్రహమువలన పుత్రుండు పుట్టె- సవతిచే గర్భవిచ్ఛిత్తికొఱకు విషము నివ్వంబడుటచేతను నవ్విషముతోడనే పుట్టుటచేతను, నాపుత్రుడు సగరుడని ప్రసిద్ధినొందె - ఆసగరునకసమంజుండు పుట్టె- ఆఅసమంజునకు నంశుమంతుండు పుట్టె - ఆయంశుమంతునకు దిలీపుండు పుట్టె ఆదిలీపునకు భగీరథుండు పుట్టె- ఆభగీరథునకు కకుత్థ్సుండు పుట్టె- కకుత్థ్సునకు రఘువు పుట్టె ఆరఘుమహారాజునకు మిగులకాంతిగల ప్రవృద్ధుండనువాండు పుట్టె- ఆప్రవృద్ధుండు వసిష్ఠునిచే మనుష్యులందినుడు రాక్షసుండవుగమ్మని శపియింపంబడియె. అందుచే పురుషాదుండను పేరొందుపేరుగలిగె. అంత రఘుమహారాజపుత్రుండు వసిష్ఠునిచే శపియింపంబడి మరల వసిష్ఠుని శపియించుటకు దోసిటజలములనెత్తికొని శపియింప బ్రయత్నించిన నతనిభార్యయిట్లనియె- మహారాజా! వసిష్ఠుని శపియింపవలదు- అతండు బ్రహ్మపుత్రుండు- మనకర్మంబు మనమనుభవించియే తీరవలయునని నూఱడించినప్పుడు తనదోసిటియందుండిననీళ్ళను తనకాళ్ళమీదం బోసికొనియె.

అటిశాపంబిచ్చుటకై ప్రయత్నించిననీళ్ళగుటవలన నతని పాదములు గల్మషముతోగూడినవయ్యె- అందుచేనతండు

కల్మాషపాదుండని ప్రసిద్ధినొందె- ఆకల్మాషపాదునకు శంఖణుఁడనువాఁడు పుట్టె- ఆశంఖణునకు సుదర్శనుఁడు పుట్టె ఆసుదర్శనునకగ్నివర్ణుఁడు పుట్టె- ఆఅగ్నివర్ణునకు శీఘ్రగుఁడు పుట్టె- ఆశీఘ్రగునకు మరువు పుట్టె ఆమరువునకు ప్రశుశ్రుకుఁడు పుట్టె- ఆప్రశుశ్రుకునకు అంబరీషుఁడు పుట్టె ఆయంబరీషునకు నహుషుండు పుట్టె ఆనహుషునకు యయాతి పుట్టె ఆయ్యయాతికి నాభాగుండు పుట్టె ఈసూర్యవంశమునందలి నహుషయయాతులుగాక చంద్రవంశమునందును వేఱు నహుషయయాతు లిద్దఱుగలరు- ఆనాభాగునకు నజుండు పుట్టె. అయ్యజునకు దశరథమహారాజు పుట్టె- ఈదశరథమహారాజునకు సహోదరులగు నీరామలక్ష్మణులు పుట్టిరి.

ఓజనకమహారాజా! మొట్టమొదటినుండి పరిశుద్ధంబగు వంశంబుగలవారును, మిగుల ధర్మాత్ములును, పరాక్రమశాలురును, సత్యవంతులును, నగు నిక్ష్వాకు వంశమునందు పుట్టినరాజుల సంబంధులగు నీరామలక్ష్మణులకు నీకొమార్తెల నివ్వవలయును- ఈరామలక్ష్మణులును నీకొమార్తెలును రూపయౌవనసౌందర్యంబులకుం దగి యున్నవారు- ఇట్లని శ్రీమద్బాలకాండమునందలి డెబ్బదియవసర్గము ముగిసెను-

జనకమహారాజు తనవంశమును యథాక్రమముగ జెప్పుట.

ఇట్లు వసిష్ఠమహర్షి చెప్పగానే జనకమహారాజు కృతాంజలుఁడై యిట్లనియె- ఓవసిష్ఠమహర్షీ! నీకు మంగళమగుఁగాక- పొగడబడిన మావంశమునుఁగూడ నీవు వినవలయు- మునిశ్రేష్ఠుఁడవగు వసిష్ఠుఁడా! సత్కులమునందు పుట్టినవాఁడు కన్యాదానము సేయునపుడు తనవంశమునంతయు నిరవశేషముగఁ జెప్పవలయు- కావున నావంశమును జెప్పెదవినుము- మూఁడులోకంబులయందును ప్రసిద్ధికెక్కినట్టి కార్యముల జేసినవాఁడును, పరమధర్మాత్ముండును, బలవంతులలో శ్రేష్ఠుండునునగు నిమియనునొక మహారాజుండె- ఆనిమికి మిథియనువాఁడు పుట్టె- అతనిచేత నేయీపట్టణము నిర్మింపఁబడుటవలన మిథిలాపట్టణమనబడియె- అతండె మొదటిజనకుండని ప్రసిద్ధిగాంచె- అతనికి నుదావసువు పుట్టె- ఆయుదావసువునకు నందివర్ధనుఁడు పుట్టె- ఆనందివర్ధనునకు సుకేతువు పుట్టె- ఆసుకేతునకు ధర్మాత్ముండును మహాబలుండునునగు దేవరాతుఁడు పుట్టె- ఆదేవరాతునకు బృహద్రథుండు పుట్టె - ఆబృహద్రథునకు శూరుండును ప్రతాపుండును నగు మహావీరుండు పుట్టె. ఆమహావీరునికి ధైర్యవంతుఁడును సత్యవిక్రముండునునగు సుధృతియనువాఁడు పుట్టె- ఆసుధృతికి ధర్మాత్ముండును- సుధార్మికుండును నగు ధృష్టకేతువు పుట్టె- ఆధృష్టకేతువునకు హర్యశ్వుండు పుట్టె- ఆహర్యశ్వునికి మరువు పుట్టె ఆమరువునకు ప్రతీంధకుఁడు పుట్టె- ఆప్రతీంధకునకు కీర్తిరథుఁడు పుట్టె. ఆకీర్తిరథునకు దేవమీఢుఁడు పుట్టె- ఆదేవమీఢునకు విబుధుఁడు పుట్టె- ఆవిబుధునకు మహీంధ్రకుఁడు పుట్టె- ఆమహీంధ్రకునకు మహాబలుండగు కీర్తిరాతుండు పుట్టె- ఆకీర్తిరాతునకు మహారోముండు పుట్టె- ఆధర్మాత్ముండగు మహారోమునకు స్వర్ణరోముండు పుట్టె- ఆస్వర్ణరోమునకు హ్రస్వరోముండు పుట్టె మహాత్ముండును, ధర్మజ్ఞుండునునగు నాహ్రస్వరోమునకు మేమిరువురము కొడుకులము పుట్టితిమి- అందులో నేను పెద్దవాఁడను- నాతమ్ముఁడు పరాక్రమవంతుఁడగు కుశధ్వజుండు మాతండ్రియైన హ్రస్వరోమమహారాజు పెద్దవాఁడనగు నన్ను రాజ్యమున కభిషిక్తునిం జేసి నాతమ్ముఁడగు కుశధ్వజుని నన్ను రక్షింపుచుండుమని నియమించి తపోవనమునకుఁ బోయె.

ఇట్లు వనమునకుఁ బోయి కొంతకాలము గడిచిన పిదప ముసలివాఁడగుటవలన మరణంబునొందె- పిదప నేను దేవతతో సమానుండగు తమ్ముఁడైన కుశధ్వజుని స్నేహముతో రక్షింపుచు ధర్మంబున రాజ్యభారము వహించి ప్రజాపరిపాలనము జేయుచుంటిని- అంతఁ గొంతకాలము గడిచిన పిదప సాంకాశ్యపురాధీశుండగు పరాక్రమశాలియైన సుధన్వుండను రాజు ముట్టడివేయుటకు నీమిథిలానగరమునకు వచ్చె.

ఇట్లు వచ్చి దూతలను నావద్దికి బంపించి పరమశివునిధనుస్సును, పద్మాక్షియగు సీతను, తనకివ్వవలయునని చెప్పి పంపె- మహాత్ముఁడవగు నోవసిష్ఠుఁడా! అంత నేను పరమశివుని విల్లును సీతను నివ్వడము లేదని చెప్పితిని- అట్టియెడ మాకిరువురికిని ప్రబలయుద్ధంబయ్యె- అయ్యుద్ధంబున సుధన్వుండు నాచే మరణంబునొందె- అంత నేను మిగుల పరాక్రమవంతుఁడగు నాతమ్ముఁడైన కుశధ్వజుని సాంకాశ్యపట్టణమునకు బట్టాభిషిక్తునింజేసితిని- మహాత్ముండగు నోవసిష్ఠుఁడా! వీఁడు నాతమ్ముఁడగు కుశధ్వజుఁడు- నేను జ్యేష్ఠుఁడను- నీవడిగినందుకు నేను మిగుల సంతసించితిని- నీవు కోరినప్రకారము నాకుమార్తెల నిద్దఱ నిచ్చెదను-

నీకు మంగళమగుఁగాక- రామునకు సీతను లక్ష్మణునకు నూర్మిళను నిచ్చెదను- మఱియు, పరాక్రమము గలవానికే నివ్వఁబడునని ప్రతిజ్ఞ జేయఁబడినదియును, దేవతపుత్రికతో సమానురాలును, నగు సీతను, రెండవపుత్రికయైన యూర్మిళను మనోవాక్కాయములచే నిచ్చెదను- ఇందుకు సందియములేదు- ఓదశరథమహారాజా! నేను మిగుల సంతోష

మునొందినవాఁడనైతిని- కావున సీతను- ఊర్మిళను యిచ్చెదను. రామలక్ష్మణులకు సమావర్తనమును జేయింపుము. ఓదశరథుఁడా! నీకు మంగళమగుగాక- నాందీశ్రాద్ధమును గూడజేయింపుము- మహాబాహుండవగు దశరథమహారాజా! ఈ మఘానక్షత్రముగదా? నేటికిమూఁడవదినమగు నుత్తరఫల్గునీనక్షత్రమున వివాహకార్యము జరుగునట్లు ప్రయత్నముసేయుము- రామలక్ష్మణులచే సుఖముగలిగించెడిగోదానాదిదానములఁజేయింపుమనియె-

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి డెబ్బదియొకటవ సర్గముగిసెను-

కుశధ్వజునికుమార్తెలను భరత శత్రుఘ్నులకిమ్మనియడుగుట.

ఇట్లు చెప్పియేమియుం బలుకకనూరకున్నపరాక్రమవంతుఁడగు జనకమహారాజుంజూచి విశ్వామిత్రవసిష్ఠులిట్లనిరి- నరేంద్రుఁడవగునో జనకమహారాజా! ఇక్ష్వాకువంశపురాజుల యొక్కయు విదేహదేశపురాజులయొక్కయు, వంశములు అచింత్యములు- మఱియు వారిమాహాత్మ్యము చెప్పనలవిగానివి- ఇక్ష్వాకువంశపు రాజులకును విదేహదేశపురాజులకును సమానుఁడొక్కఁడునులేఁడు- ఈవివాహరూపమగు ధర్మసంబంధము, ఒండొరులకు దగినకులంబులకు గలుగుటంజేసి తగియున్నది- సీతయునూర్మిళయు రామలక్ష్మణులకుఁ దగియున్నారు- సౌందర్యసంపదచే దంపతులు ఒప్పియున్నారు- రామలక్ష్మణులును సీతోర్మిళలకుఁ దగియున్నారు పురుషశ్రేష్ఠుఁడవగు జనక మహారాజా! ఇంకనుకొంచెము సెప్పవలసియున్నది చెప్పెదము వినుము- సాంకాశ్య పురాధీశుఁడగు నీకుశధ్వజుఁడునీకుఁ దమ్ముఁడు- సకలధర్మముల నెఱింగినవాఁడు- కావున నీధర్మిష్ఠుఁడగు కుశధ్వజునియొక్క సౌందర్య సంపదగల కుమార్తెలనిద్దఱను భార్యార్థముగా వరించుచున్నాము- మిగులఁ పరాక్రమశాలియగుభరతునకును శత్రుఘ్నునకునుకుశధ్వజునికొమార్తెలనిచ్చి వివాహముసేయవలయు- జనకమహారాజా! ఈదశరథమహారాజుయొక్క పుత్రులందఱునురూపయౌవనసంపన్నులు- దిక్పాలురతో సమానులు- దేవతలతో సమానమైన పరాక్రమముగలవారు నిర్దుష్టమగు నిక్ష్వాకువంశము యొక్కయు పుణ్యకర్ముఁడవగునీవంశము యొక్కయు, నీయిరువురులయొక్కయు నిష్కల్మషమగు వంశములకు బంధుత్వముగలుగఁజేసికొని వియ్యమందవలయునని విశ్వామిత్రుండు చెప్పె-

—* వివాహముహూర్తమునిశ్చయించుట. *—

అట్టియెడ జనకమహారాజు విశ్వామిత్రుని వాక్యముల విని వసిష్ఠమహర్షి యాజ్ఞనొంది యంజలీబద్ధుఁడై విశ్వామిత్రవసిష్ఠులంజూచి యిట్లనియె- మునిశ్రేష్ఠులగువిశ్వామిత్రవసిష్ఠులారా! మీరుమాకుసమానమైన వంశముతో సంబంధముసేయుమని మీరలయ్యేయాజ్ఞాపించుచుండుటచే మావంశము ధన్యంబైనదానినిగాఁ దలంచుచున్నాను- మీరుచెప్పినచొప్పుననే నడుచుటకు సందియంబేమియులేదు- మీకుమంగళమగుగాక- శత్రుఘ్నుండును భరతుండునుకుశధ్వజుని కొమార్తెలనువివాహ మాడుదురుగాక- మహామునియగునో విశ్వామిత్రుఁడా! ఒకపగటియందే మహాబలులగు రాజపుత్రులు నల్వురును రాజకొమార్తెల నలుగురినివివాహమాడుదురుగాక- సంతానాధిపతియగు భగుఁడు దేవతగాఁగల యుత్తరఫల్గునీ నక్షత్రదివసమున పగలు వివాహకార్యమును సేయుట యుత్తమంబని పండితులువచింపుచున్నారు- అనియిట్లు జనకమహారాజు సౌమ్యముగఁజెప్పిబద్ధాంజలియై మునివరులగు విశ్వామిత్ర వసిష్ఠులను లేచియెదుర్కొని యిట్లనియె- మహర్షులారా! నాకు కన్యాదాన ఫలంబుగలుగు నటులజేసి నావిషయమునందు మిగులధర్మంబుగట్టికొంటిరి- కావుననేను మీకెల్లప్పటికి శిష్యుఁడనైతిని- మునిపుంగవులగు మీరీమూఁడు సింహాసనములమీదంగూర్చుండి మిథిలానగరమును సాంకాశ్య నగరమును,నయోధ్యానగరమునుపరిపాలింపుఁడు-

శ్లో॥ యథా దశరథస్యేయంతథా యోధ్యాపురీమమ। ప్రభుత్వేనాస్తిసందేహో యథార్హంకర్తుమర్హథ॥

ఈమిథిలానగరము దశరథమహారాజునకెట్లు స్వంతమో, అట్లు నాకునునయోధ్యస్వంతము- కావున మీరీమూఁడురాజ్యములకును ప్రభువులై పరిపాలింపవచ్చును- యథోచితముగఁజేయుఁడనిచెప్పె-

—* దశరథమహారాజువిడిదికిబోవుట. *—

అంతరఘు వంశోద్భవుఁడగు దశరథమహారాజు మిగులసంతసించి జనకమహారాజుంజూచి యిట్లనియె- మీరుమిథిలా నగరమునకుబ్రభువులును సహోదరులునునగు మీగుణంబులబొగడతరంబుగాదు- మీచేమహర్షులును, రాజులసమూహములును పూజింపం బడెను- నీవుమంగళమును బొందుదువుగాక- నీకుమంగళ మగుగాక- (ఇచటమిగులప్రీతిచే రెండుమారులుచెప్పఁబడియె) నేనుయింటికిబోయెదను- నాందీశ్రాద్ధాదికర్మల నన్నింటిని నెఱవేర్చెదను- అని చెప్పిదశరథ మహారాజుజనక మహారాజునువీడ్కొని విశ్వామిత్ర వసిష్ఠులపురస్కరించుకొని శీఘ్రంబుగతనవిడిది

కింబోయె.

—* దశరథమహారాజు నాందిమొదలగునవి సేయుట *—

ఇట్లుబోయి యథావిధిగ నాందీశ్రాద్ధమును నెఱవేర్చి ప్రాతఃకాలమున నెలేచి యాకాలమునందు చేయవలసిన సమావర్తనమును జేయించె నరేంద్రుఁడగు నాదశరథమహారాజు పుత్రులకొఱకు నొక్కొకనిగుఱించి నూఱువేల గోవులవంతున బ్రాహ్మణులకునిప్పించె. ఇట్లు పురుషశ్రేష్ఠుఁడును, పుత్రవాత్సల్యముగలవాఁడునునగు దశరథమహారాజు పుత్రులయొక్క సమావర్తనమునుగుఱించి బంగారు కొమ్ములుగలవియును, పుష్టిగ బాలుకలిగినవియును, లేదూడలతోఁగూడినవియును, పాలుపిండుటకు గంచుపాత్రలతో గూడినవియును నగు నాలుగులక్షలగోవులనున్ను, విశేష ద్రవ్యమునున్ను బ్రాహ్మణులకునిచ్చె. అట్టియెడ దశరథమహారాజు సమావర్తనమును జేసికొనినపుత్రులచేఁ బరివేష్టింపంబడి దిక్పాలురచేఁ జుట్టుకొనబడిన బ్రహ్మదేవునివలెఁ బ్రకాశించె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి డెబ్బదిరెండవసర్గ ముగిసెను.

—* భరతుని మేనమామ దశరథునొద్దకువచ్చుట. *—

ఇట్లు దశరథమహారాజు పుత్రులనిమిత్తము సమావర్తనమును నెరవేర్చినదినమునందే శూరుండగుయుధాజిత్తు దశరథునియొద్దకువచ్చె. సాక్షాద్భరతునికి మేనమామయును కేకయరాజునకు పుత్త్రుఁడునునగు యుధాజిత్తువచ్చి దశరథమహారాజుంజూచి క్షేమంబడిగియిట్లనియె. ఓ దశరథమహారాజా! నీమామగారగు కేకయరాజ్యాధిపతి నీకు క్షేమమా? అనియడుగుమనెను. సర్వదా నీవెవరి క్షేమము గోరుచుందువో, అట్టివారందఱు క్షేమముగనున్నారము. ఇవనొక్క విశేషంబుగలదేమనిన; కేకయరాజ్యాధిపతియగు నాతండ్రి నా మేనల్లుండైన భరతునిఁజూడ గోరుచున్నాఁడు. అందుకొఱకు నేను భరతునిబిలుచుకొనిపోవుటకై యయోధ్యాపట్టణమునకుఁబోతిని. అయ్యయోధ్యయందు మీరెవ్వరునులేరు. విచారింపగా, నీవును నీపుత్రులును వివాహనిమిత్తము మిథిలాపట్టణమునకుఁ బోయియున్నారనివిని నా మేనల్లునిఁజూచుటకొఱకు శీఘ్రముగనిచటికివచ్చితిననెను. అంత దశరథమహారాజు ప్రియుఁడును నతిథియునగు యుధాజిత్తువచ్చుటంజూచి మిగులశ్రేష్ఠములయినసత్కారములచేఁబూజించె.

—* దశరథుఁడు జనకుని యజ్ఞశాలకుబోవుట. *—

ఇట్లు దశరథమహారాజు మహాత్ములగు పుత్రులతోఁగూడ నారాత్రియంతయుఁగడిపె. పిదప సకలకర్మంబుల నెఱింగినదశరథమహారాజు మరునాడు ప్రాతఃకాలమున నేనిదుర మేల్కాంచి తత్కాలోచిత కర్మంబులందీర్చికొని ఋషుల ముస్దిడుకొని జనకమహారాజుయొక్క యజ్ఞశాలకుఁబోయె. రాముండును సర్వాభరణభూషితులగు తమ్ములతోఁ డంగూడి మంగళాచరణసూచకమగు దోరముగట్టుకొని వివాహమునకు యుక్తమైనవిజయంబను ముహూర్తమునందు వసిష్ఠుని నింకననేకమహర్షులను ముందిడుకొని తండ్రి వెంటంబోయి తమ్ములంగూడి తండ్రిసమీపంబుననుండె. అంతమహాత్ముండగు వసిష్ఠుఁడు జనకమహారాజుయొద్దకుఁ బోయియిట్లనియె.

నరవరశ్రేష్ఠుఁడవగు జనకమహారాజా! దశరథమహారాజు మంగళాచరణసూచకమగు దోరముగట్టుకొనిన పుత్రులతోడంగూడి దాతవగు నిన్నెదురుచూచుచున్నాఁడు. దానముసేయువానికిని, దానిని ప్రతిగ్రహించువానికిని సమస్తపురుషార్థములునుగలుగుచున్నవి. కావున నీవు కన్యాదానముజేసి నీవు నీప్రతిజ్ఞను నెరవేర్చుకొనుమనిన మిగులనుదారుండును, ధర్మంబుల నెఱింగినవాఁడును, మహాతేజుండును నగు జనకమహారాజు మహాత్ముండగువసిష్ఠుఁడు చెప్పినమాటనువిని యిట్లనియె.

శ్లో॥ కస్స్థితః ప్రతీహారో మే కస్యాజ్ఞా సంప్రతీక్ష్యతే। స్వగృహే కో విచారో౽స్తి యథా రాజ్యమిదం తవ॥ ద్వారమునందు నా ద్వారపాలకుఁడెవ్వఁడు కావలియున్నాఁడు? లోపలికి రావుటకు నెవరియాజ్ఞకొఱకు నెదురుచూచుచున్నాఁడు? తమస్వంతయింటివిషయమై యేమియాలోచనయున్నది? నీరాజ్యము నీకెట్లుస్వంతమో నాయీరాజ్యమునున ట్లెనీకుస్వంతము. (ఇది దశరథునిగుఱించిచెప్పఁబడినదని నెఱుంగునది) ఓ మునిశ్రేష్ఠుఁడవగు వసిష్ఠుఁడా! నాకొమార్తెలు వివాహమునకు వలయు మంగళకార్యములనెల్ల నెరవేర్చుకొని వేదిమూలమునందు జ్వలింపుచున్న యగ్నిజ్వాలలంబోలె ప్రకాశింపుచున్నారు. నేనైతేనో సిద్ధుఁడనై వేదియందున్నవాఁడనై మీరాకకొఱకు నెదురుచూచుచున్నాఁడను. సకలకార్యములను దశరథమహారాజు నిర్విఘ్నముగ నెరవేర్చుగాక. ఎందుకొఱకు కాలస్యము జేయుచున్నాఁడు? అనిన దశరథమహారాజు కొడుకులంబిలుచుకొని ఋషులసమూహముతోడ యాగశాలంబ్రవేశించె.

—* సీతావివాహఘట్టము. *—

అంత విదేహదేశాధిపతియగు జనకమహారాజు వసిష్ఠమహర్షింజూచియిట్లనియె. ధార్మికుండవగువో వసిష్ఠమహర్షీ! నీవుఋషులతోఁగూడ లోకాభిరాముండగు రామునకు

వివాహకర్మనంతయును జేయింపుమనిన మహాతపుండును మహాత్ముండునునగువసిష్ఠమహర్షి జనకమహారాజుంజూచి యట్లనే కానిమ్మనిచెప్పి విశ్వామిత్రునిధార్మికుండగు శతానందునిముస్సిడుకొని వివాహపందలిమధ్యనే శాస్త్రోక్తముగ వేదినిగల్పించి యావేదికిజుట్టును గంధపుష్పములను, మొలకలతోఁగూడిన బంగారుపాలికెలను, మొలకలతోఁగూడిన అడుగులేనిపాత్రలును, మొలకలతో గూడినమూకుళ్లును, ధూపముతోఁగూడిన ధూపపాత్రలును, శంఖమువలెనుండుపాత్రలును, స్రుక్స్రువములనెడి హోమముసేయుపాత్రలును, అర్ఘ్యపాత్రములును, పేలాలతోనిండింపఁబడినపాత్రలునునుంచి సంస్కరింపంబడినయక్షతలచేనలంకరించె.

మఱియు మహాతేజుండును భగవంతుండునునగువసిష్ఠమహర్షి హోమముసేయునట్టివేదియం దగ్నినిబ్రతిష్ఠించి శాస్త్రోక్తముగను, మంత్రపూర్వకముగను, వొకదానికొకటి మెచ్చుతక్కువలులేకుండునట్లుగ దర్భలనుపఱచి వేదమంత్రములతో దంపతులకు మేలుగలుగుటకొఱకు హోమముసేసె. అట్టియెడజనకమహారాజు సమస్తాభరణభూషితురాలగు సీతనుదోడ్కొనివచ్చి యగ్నిహోత్రమునకును, రామునకునుఎదుటనునిల్పి కౌసల్యానందవర్ధనుఁడగు రామునిజూచియిట్లనియె. శ్లో॥ ఇయంసీతామమసుతాసహధర్మచరీతవ। ప్రతీచ్ఛచైనాంభద్రంతేపాణింగృహ్ణీష్వపాణినా॥ నాయొక్కపుత్రికయైనయీసీత నీకుధర్మపత్నికాఁగలదు. ఈసీతనుబ్రతిగ్రహింపుము. నీకుమంగళమగుగాక. నీహస్తముచే సీతహస్తమునుబట్టికొనుము. ఈసీత పతివ్రతయును, మహాభాగ్యసంపన్నురాలునునై నిన్నునీడవలెనే వెంబడించియుండఁగలదు. అనియిట్లుజనకమహారాజు చెప్పి రామునిహస్తమునందు మంత్రముజెప్పిజలమువిడిచి కన్యాదానముజేసె అట్టియెడ దేవతలునుఋషులును సాధుసాధు అనగా బళేబళేయనిచెప్పిరి. ఇట్లు చెప్పుచుండగ దేవతలభేరులధ్వనిమ్రోగెను. పుష్పవర్షముఁగురిసె. జనకమహారాజిట్లు మంత్రములనుజెప్పి నీళ్ళనువిడిచి యనగా మంత్రజలముతోఁగూడినసీతను రామునకుఁ గన్యాదానముజేసి సంతోషంబుననుప్పొంగుచు నిట్లనియె.

✱ లక్ష్మణభరతశత్రుఘ్నవివాహఘట్టము. ✱ ———

లక్ష్మణుఁడా! రమ్ము నీకుమంగళమగుగాక. నాచేనిశ్చయింపఁబడినప్రకారము నూర్మిళనుపాణిగ్రహణముసేయుము. ఆలస్యముసేయకుము. అనియిట్లు జనకమహారాజు లక్ష్మణునితోఁజెప్పి భరతునితోనిట్లనియె. భరతుఁడా! మాండవియొక్కహస్తమును నీహస్తముచే బట్టుకొనుము. అనిచెప్పి ధర్మాత్ముండగు జనకమహారాజుశత్రుఘ్నునింజూచియిట్లనియె. మహాబాహుండవగు శత్రుఘ్నుఁడా! శ్రుతకీర్తియొక్కహస్తమును నీహస్తముచేబట్టుకొనుము. అని చెప్పిమఱియునిట్లనియె.

ఓ రామలక్ష్మణ భరతశత్రుఘ్నులారా! మీరందఱును మిగులశాంతముగలవారు. చక్కగావ్రతములనాచరించినవారు. కావునభార్యలనుగ్రహింపుఁడు. ఆలస్యముసేయకుఁడనిన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు నలుగురును జనకమహారాజుమాటలనువిని వసిష్ఠమహర్షి యాజ్ఞనొంది నలుగురిచేతులను తమచేతులచేఁదాకిరి. అట్టియెడరఘువంశోద్భవులగువారిలో శ్రేష్ఠులగురామలక్ష్మణ భరతశత్రుఘ్నులు తమతమభార్యలతోడంగూడి యగ్నిహోత్రమునకును వేదికిని, జనకమహారాజునకును, ఋషులకును, ప్రదక్షిణముసేసి శాస్త్రరీతిగ కల్పసూత్రప్రకారము వివాహముసేసికొనిరి.

ఇట్లురామలక్ష్మణభరతశత్రుఘ్నులు సౌందర్యసంపన్నలగు తమభార్యలచేతులంబట్టికొనినతోడనే యాకాశమునందుండి పరమభాస్వరమగు గొప్పపుష్పములవర్షముగురిసెను. స్వర్గంబునభేరీధ్వనులుమ్రోగె. గీతవాద్యములు చెలంగె. అప్సరస్త్రీలాడిరి. గంధర్వులు మధురముగబాడిరి. రఘువంశోద్భవులగు రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల వివాహమునందు పుష్పవృష్టికురియుట మొదలగుననేకాద్భుతములుబొడమెను. ఇట్లునృత్యగీతవాద్యములయొక్క ధ్వని ప్రపంచంబునంతయు వ్యాపించియుండ మహాతేజులగు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు మూడుమాఱు లగ్నికి ప్రదక్షిణముసేసి భార్యలనుపెండ్లాడిరి,

—✱ దశరథమహారాజుపుత్రులతోడవిడిదికిబోవుట- ✱—

పిదప నా రామలక్ష్మణభరతశత్రుఘ్నులు భార్యలతోడంగూడినవారై విడిదికిఁబోయిరి. దశరథమహారాజును ఋషిసంఘములతోడను బంధువులతోడనుగూడి భార్యలతోడంగూడిన పుత్రులంజూచుచు వెంబడించిపోయెను.

ఇట్లుశ్రీమద్బాలకాండమునందలి డెబ్బదిమూడవసర్గము ముగిసెను.

—✱ దశరథుఁడయోధ్యకుబోవుటకుప్రయాణంబగుట- ✱—

పిదప విశ్వామిత్రమహాముని నారాత్రియంతయుంగడచిన ప్రభాతకాలంబునలేచి జనకమహారాజుతోను దశరథమహారాజుతోను, బోయివచ్చెదనని చెప్పి శ్రీరామలక్ష్మణభరతశత్రుఘ్నులను సీతోర్మిళామాండవీ శ్రుతకీర్తులనాశీర్వదించి హిమవత్పర్వతమునకు బోయె. ఇట్లువిశ్వా

మిత్రుఁడు పోయినపిదప దశరథమహారాజు మిథిలాధీశ్వరుఁడగు జనకమహారాజుతో పోయివచ్చెదనని చెప్పి యయోధ్యాపట్టణమునకుఁ బోవ ప్రయాణంబయ్యె. అంత జనకమహారాజు దనకొమార్తెలకు ననేకవేలగోవులను శ్రేష్ఠములగు ననేకకంబళవస్త్రములను, ననేకపట్టువస్త్రములను, భూషణములతో నలంకరింపఁబడిన సుందరములగు నేనుఁగులును, గుఱ్ఱములును, రథములును, పదాతులును, రూపవంతులగు దాసదాసీజనములను, నిచ్చె. మఱియు జనకమహారాజు మిగులసంతుష్టహృదయుఁడై యనేకలక్షల బంగారము, వెండి, ముత్యములు, పగడములు మొదలైన నమితమగు కన్యాధనంబును నిచ్చె.

ఇట్లు జనకమహారాజ పరిమితమగు ద్రవ్యమునిచ్చి కొంతదూరము మార్గము విడుచుటకై వెంబడించిపోయి దశరథమహారాజును వీడ్కొని తనపట్టణమైన మిథిలానగరముఁ బ్రవేశించె. పిమ్మట నయోధ్యాధిపతియగు దశరథమహారాజు చతురంగబలములతోడను, మిగులఁ బరాక్రమవంతులగు కొడుకులతోడను, ఋషీశ్వరులతోడను గూడి యయోధ్యాపట్టణమునకు బోవుచుండె.

—* దశరథునకు మార్గమున దుశ్శకునములగుట *—

ఇట్లు బోవుచుండగ మార్గంబున భయంకరములగు పక్షులు ఘోరముగ గూయఁదొడంగె. అంత దశరథమహారాజాకాశంబున బక్షులు గూయుటయు భూమియందు మృగములు ప్రదక్షిణముగ నడుచుటయు మొదలగు దుశ్శకునములం జూచి వసిష్ఠమహర్షితో నిట్లనియె. ఓ తపోధనుఁడవగు వసిష్ఠుఁడా! ఇదేమి దుశ్శకునములు గనుపడుచున్నవి? క్రూరములగు పక్షులు భయంకరముగ గూయుచున్నవి? మృగములు ప్రదక్షిణముగ నడచుచున్నవి? ఇది యేమి? నా గుండెలదరుచున్నవి? మనస్సునకు వ్యసనము గలుగుచున్నది. చెప్పుమనిన మహాత్ముండగు వసిష్ఠమహర్షి మధురముగ నిట్లనియె.

ఓ దశరథ భూవల్లభా! దీనివలన గలుగు ఫలమును జెప్పెద వినుము. ఇప్పుడు మనకు సంభవింపంబోయెడు ఘోరమగు భయము, ఆకాశమునందలి పక్షుల కూతలచే సూచింపంబడుచున్నది. ఈ భూమియందలి మృగములు ప్రదక్షిణముగ నడుచుటచే నా దుశ్శకునములను నుపశమింపంజేయుచున్నది. కావున నీవు సంతాపమును వదులుము. అని యిట్లు వసిష్ఠదశరథులు మాటలాడుచుండగ నొకగొప్పగాలి బైలువెడలి బ్రహ్మాండంబునంతయు గప్పుకొని మన్నుమిన్నును తెలియక భూమినంతయు వ్యాపించి గడగడవడంకునటులం జేయుచు శుభకరంబులగు గొప్పవృక్షములను క్రిందఁబడద్రోయుచు విఱ్ఱువిఱుమని వీచుటకు ప్రారంభించె.

అట్టియెడ సూర్యుఁడు చీకటిచే గప్పఁబడెను. దిక్కులన్నియు గాఢాంధకారముచే బ్రకాశింపవయ్యె. దశరథమహారాజుయొక్క సేనయంతయును నసాధ్యంబగు దుమ్ముచే గప్పఁబడి మూర్ఛపోయినట్లుండె. వసిష్ఠమహర్షియును నితరులగు ఋషులును, దశరథమహారాజును, నతనికొడుకులును, వీరలుమాత్రము ప్రజ్ఞ గలిగియుండిరి. తక్కిన వారందఱు మూర్ఛఁబోయిరి. ఇట్లు మూర్ఛఁబోయి యా ఘోరంబగు చీకటియందు బూడిదచే గప్పఁబడిన ట్లుండిరి.

—* దశరథుఁడు మొదలగువారు పరశురాముని జూచుట *—

అంతవారందఱు మిగులభయంకరుఁడును, జడలను ధరించినవాఁడును, రాజాధిరాజులను మర్దించినవాఁడును, కైలాసపర్వతమువలె నెదిరింపఁగూడనివాఁడును, ప్రళయకాలాగ్నివలె జ్వలింపుచుండుటచే సామాన్యులకు జూడనశక్యుఁడును, మూపునందు పరశువను నాయుధమును ధరించినవాఁడును, మెఱుపులగుంపులం బోలి తళతళమని మెఱయు బాణంబులను చేతులం బట్టుకొని యుండువాఁడును, త్రిపురాసురులం జంపబోవునట్టి పరమశివుఁడో యనునట్లుండువాఁడును, భృగువంశోద్భవుఁడునునగు జమదగ్నికొమారుఁడైన పరశురాముని జూచిరి.

ఇట్లు మహాభయంకరుఁడును, భగభగమండుచుండు నగ్నిహోత్రమువలె జ్వలింపుచుండువాఁడును, నగు నా పరశురాముని జపహోమపరాయణులైన వసిష్ఠుఁడు మొదలగు ఋషులు జూచి యొకరితో నొకరు మాటలాడుకొనిరి. క్షత్రియులు తనతండ్రిం జంపుటచే గలిగినకోపమువలన నీపరశురాముఁడు మఱల క్షత్రియుల జంపఁడా? ఏమి? ఏలచంపఁడు? ఐననీపరశురాముఁడు పూర్వము క్షత్రియులనందఱను జంపి తనకోపతాపంబులను వదిలిపెట్టియున్నాఁడుగదా? అట్టియితండు మఱల క్షత్రియుల నేల జంపును? అని యిట్లు ఋషులొకరితో నొకరు మాటలాడుకొని యర్ఘ్యము దీసికొని భయంకరమగు దృష్టిగల భృగువంశోద్భవుఁడగు బరశురామునిం జూచి మృదువుగా నిట్లనిరి.

రాముఁడ! రాముఁడా! ఈయర్ఘ్యము గ్రహింపుమని పిలిచి పూజించిరి. అంత ప్రతాపము గలవాఁడును, జమదగ్నిపుత్రుఁడునైన పరశురాముఁడు ఋషులుచేసినపూజను స్వీకరించికొని దశరథమహారాజ పుత్రుండైన రామునింజూచి యిట్లనియె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి డెబ్బదినాలుగవసర్గ ముగిసెను.

పరశురామ శ్రీరామసంవాదము.

ఇట్లు పరశురాముఁడు రామచంద్రునిఁజూచి దశరథపుత్త్రుఁడవగు రాముఁడ! రాముఁడా! నీయద్భుతంబగుపరాక్రమము లోకంబులయందంతటను వినఁబడుచున్నది. శివునివిల్లు విఱుచుటయును, తాటకంజంపుటయు, విశ్వామిత్త్రునియాగంబు రక్షించుటయు, మొదలగునీవుచేసినకార్యములన్నియు విన్నాఁడను. నీవుశివునివిల్లు విఱచుటయనునది మిగుల నాశ్చర్యకరము. మనంబునను చింతింపఁగూడనిది. అట్టియద్భుతకార్యమును చేసినాఁడవనివిని నేను మంగళకరంబైన మఱియొకవిల్లుం దీసికొనివచ్చినాఁడను. మహాభయంకరముగ నుండునదియును, నాతండ్రియగుజమదగ్నివలన నాకివ్వఁబడినదియునగు నీగొప్పధనుస్సును బాణంబునందుఁ బూరించి నీబలంబునుజూపింపుము. ఓ రాముఁడా! నీవీధనుస్సునుపూరించితివేని నీబలంబును మెఱింగి పరాక్రమమునమెచ్చుకొనదగిననీతో ద్వంద్వయుద్ధము సేసెదనని చెప్పె.

—* { దశరథుఁడుతనకొడుకుతో యుద్ధము సేయవలదని పరశురాముని ప్రార్థించుట. } *—

అంత దశరథమహారాజు పరశురామునియొక్క మాటలను విని వ్యసనాక్రాంతుఁడై మొగము వెలవెలంబోయి భయమునొంది చేతులుమొగిడ్చి యిట్లనియె. ఓపరశురాముఁడా! ఇప్పుడు నీవుక్షత్త్రియులయందలి కోపంబునువిడిచిపెట్టి శాంతుఁడవై యున్నవాఁడవు- మఱియు బ్రాహ్మణుండవు- మిగులఁగీర్తికలవాఁడవు- నాపుత్త్రులుబాలురు- కావుననభయంబివ్వుము- నీవుసదా వేదాధ్యయన వ్రతసంపన్నులగు భృగువంశంబునంబుట్టితివి- ఇంద్రునియెదుటను శస్త్రములం దాకుటలేదని ప్రతిజ్ఞఁజేసి శస్త్రములనువిడిచిపెట్టియున్నవాఁడవు- ఇంతియగాక ధర్మపరుండవై కాశ్యపమహర్షికి భూమియంతయునిచ్చివేసి యడవినిఁబొంది మహేంద్రపర్వతమున వాసముసేయుచున్నాఁడవు.

మహామునివగు పరశురాముఁడా! నీవునాసర్వస్వము నశించుటకొఱకే వచ్చితివి- నాపుత్త్రుండైన రాముం డొకఁడు నీచే హతుండయ్యెనేని మేమందఱము నిచటనే ప్రాణములనువిడుతుమని చెప్పె- ఇట్లుదశరథమహారాజు చెప్పుచుండినను ప్రతాపవంతుఁడగు పరశురాముఁడు దశరథమహారాజుమాటలను లక్ష్యముసేయక రామచంద్రునింజూచి యిట్లనియె.

—* { రాముఁడువిఱచినవిల్లుయొక్క వృత్తాంతము పరశురాముడు శ్రీరామునితో చెప్పుట. } *—

ఓరాముఁడా! నీవువిఱచినవిల్లును నిదిగో నాచేనుండు విల్లును నీరెండునుమిగుల శ్రేష్ఠంబులైనవి- మఱియుస్వర్గమునబుట్టినవి- లోకప్రసిద్ధంబులైనవి- దృఢంబులైనవి-సారంబుకలిగినవి- ముఖ్యములైనవి- విశ్వకర్మప్రయత్నముచే నిర్మింపఁబడినవి- నరశ్రేష్ఠుఁడవగు రాముఁడా! ఆధనుస్సులు రెండింటిలో నొకదానిని పరమేశ్వరుఁడు త్రిపురాసురులతో యుద్ధముసేయునపుడు దేవతలయీశ్వరునకిచ్చిరి- దానిచేతనే త్రిపురాసురులు సంహరింపఁబడిరి- అట్టివిల్లునే నీవువిఱిచినది- ఇదిగో నాచేతనుండెడు యిది రెండవది- దుర్ధర్షంబగునీధనుస్సు దేవతలచే మహావిష్ణువునకివ్వఁబడెను.

ఓ రాముఁడా! పరమభాస్వరమగు నీధనుస్సే యావిష్ణుదేవునిది, ఈధనుస్సుకును శివునివిల్లునకుఁగల సారంబుగలదు- పూర్వము దేవతలందఱుఁగూడి శివవిష్ణువులబలంబు నెఱుఁగఁగోరి బ్రహ్మదేవునిఁజూచి శివుఁడెక్కువబలముగలవాఁడా? లేక విష్ణువెక్కువ బలముగలవాఁడా? చెప్పుమని యడిగిరి- అంతలోకపితామహుండగు బ్రహ్మదేవుఁడుతనకు తెలియమింజేసి తత్క్షణంబునవిష్ణువునొద్దకుఁ బోయియిట్లనియె- ఓవైకుంఠవాసా! శివుఁడుతాను మిగులనధికుఁడననియును విష్ణుఁడవగునీవు నిష్ప్రయోజకుఁడవనియును నాతోఁజెప్పెననిన విష్ణువుమిగులఁగోపించి నాబలంబును శివునకుఁజూపించెదను నీవుపొమ్మనియె.

అంతట బ్రహ్మదేవుఁడు కైలాసమునకుఁబోయి యీశ్వరునింజూచి యో శివుఁడా! విష్ణువుతాను మహాబలవంతుఁడననియును, నీవుబలహీనుఁడవనియును, నాతోఁజెప్పెననిన శివుఁడువిష్ణువు చెప్పినట్లుచెప్ప పొమ్మనియె- ఇట్లు బ్రహ్మదేవుఁడు శివవిష్ణువులకుఁ గలహంబుగల్పించిన నా శివకేశవులిద్దరులకు మహారోషంబుగలిగి మహద్యుద్ధంబుజేసిరి- అయ్యుద్ధంబునందు మహావిష్ణువు "హుం" అని హుంకారముసేసె-అంతశివునిధనుస్సు మిగులభయంకరముగు శక్తిగలదియైనను జడమువలె స్తబ్ధత్వమునొందె- ముక్కంటియగుశివుఁడును స్తంభితుఁడయ్యె- అట్టియెడ దేవతలును చారణులును ఋషులునువచ్చి శివకేశవులను ప్రార్థించియిరువురికిని సమాధానంబుజేసిన నయ్యిరువురును శాంతినివహించిరి- ఋషులును దేవతలును విష్ణుదేవునిపరాక్రముచే శివునివిల్లు స్తబ్ధత్వము నొందుటనుజూచి యీశ్వరునికన్నను విష్ణువుమిగులనధికుండని తలంచిరి. మహాయశస్వియగుపరమశివుఁడును మిగులగోపంబునొంది తనవిల్లును బాణంబుతోడ విదేహదేశాధీశుండగు దేవరాతుండను రాజర్షి చేతికిచ్చె.

ఓ రాముఁడా! శత్రుపురంబులజయించునట్టి విష్ణుదేవునిదైన యీధనుస్సును నమ్మహావిష్ణువు భృగువంశోద్భవుఁడగు ఋచీకమహర్షికి నిక్షేపముగ నొసఁగికొమ్మనియిచ్చె

మహాతేజుఁడగు వాఁబుచీకుఁడు నద్భుతకార్యములఁజేయువాఁడును, తనకుకుమారుఁడును, మహాత్ముఁడును, నాకుతండ్రియునునగు జమదగ్నికినీవిల్లంబగుధనువునిచ్చె.

—* పరశురాముఁడు రామునకుతన వృత్తాంతము చెప్పుట. *—

పిదపనొకవాఁడు నాతండ్రియైన జమదగ్ని యాయుధములవిడిచిపెట్టి తపస్సుసేయుచుండగ గార్తవీర్యార్జునుఁడను రాజొకండజ్ఞానముచే నాతండ్రినిజంపె. ఓ రాముఁడా! అట్లు కార్తవీర్యార్జునుఁడు మహాభయంకరంబును, లోకవిరుద్ధంబునునగు కార్యంబైన నాతండ్రింజంపుటను నేవిని మహాకోపంబువొంది యనేకమారులు క్షత్రియజాతినెల్ల సంహరించుచు భూసంచారము గావించి బహుతరంబుగ క్షత్రియులను పేరులేకుండునట్లుఁజేసి భూమినెల్ల నాస్వాధీనంబుజేసికొని యాగముకడపట భూమినంతయు పుణ్యకర్ముఁడును మహాత్ముఁడునునగు కాశ్యపమహర్షికి దక్షిణగానిచ్చి మహేంద్రపర్వతమునకుఁబోయి యచటనివసించుచు దపోబలంబుతోఁగూడియున్నాఁడను.

ఇప్పుడును నేను దేవతలచే సేవింపంబడుచుండు నామహేంద్రపర్వతమునందు తపస్సుసేయుచు మిగులసుఖముగనున్నాఁడను. మహాబలుఁడవగు రాముఁడా! ఇపుడు శ్రేష్ఠమగువీర్యముగల శివునివిల్లు నీవువిఱిచితివనివింటిని. అందువలన నేనిచటికతిశీఘ్రముగవచ్చితిని. ఓ రాముఁడా! ఇదియే యావిష్ణుదేవుని ధనుస్సు. ఇది మిగుల మాహాత్మ్యముగలదియును, నాతండ్రి తాతముత్తాతలనుండి వచ్చినదియును, నగుటచే నీవుక్షత్రియధర్మమవలంబించి దీనిని గ్రహింపుము. శ్రేష్ఠమగునీధనువునందు శత్రుపురములజయించునట్టి బాణమునుగూర్పుము. అట్లీధనువునందు బాణమునుగూర్చుటకు నీకుశక్తిగలిగెనేని నీతోద్వంద్వయుద్ధముసేసెదననియె.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి డెబ్బదియైదవసర్గము ముగిసెను.

—* శ్రీరాముఁడుపరశురామునిభంగపఱచుట. *—

అనియిట్లు పరశురాముఁడుచెప్పిన దశరథమహారాజపుత్రుఁడగు రాముఁడుతండ్రియొద్దనుండువాఁడగుటచే, తండ్రియందలిమర్యాదవలన వినయముగ బరశురామునితోనిట్లనియె. ఓపరశురాముఁడా! నీవుచేసిన కార్యములనన్నింటిని వింటిని. పితృఋణవిముక్తుండవగునిన్ను మెచ్చుకొనవలసినదేను. ఐననీవు నన్నుక్షత్రియధర్మముచేఁ బరాక్రమములేనివానిని గాను, సమర్థుఁడు గానివానిని గాను, దలంచియవమానింపుచున్నావు. ఇఁకమీఁదు నీవివ్విధముగ నితరులందిరస్కరింపకుండునట్లు నా తేజంబును పరాక్రమమును జూపెద చూడుమని చెప్పి యతిశీఘ్రపరాక్రమముగల దశరథమహారాజపుత్రుఁడగురాముఁడు మహారోషంబువొంది, పరశురాముఁడు విష్ణువుయొక్కయవతారమగుటవలననాపరశురామునిహస్తంబునందుండి ధనువునుదీసికొనియె.

ఇట్లు రామచంద్రుఁడు పరశురామునిహస్తమునందుండి ధనువునుదీసికొనునపుడే విష్ణుదేవునిసంబంధమగునప్పరశురామునిశక్తినంతయునీడ్చుకొనెను. ఇట్లీడ్చుకొనిధనువును మోపెట్టి బాణంబునుసంధించి మహారోషంబుతో పరశురామునింజూచియిట్లనియె. జమదగ్నిపుత్రుఁడవగు నోపరశురాముఁడా! నీవుబ్రాహ్మణుఁడవు. మఱియువిశ్వామిత్రునకుబంధుండవు. కావున నాచేబూజింపదగినవాఁడవైతివి. అందువలననీబాణంబును నీమీదంబ్రయోగించి ప్రాణములఁబుచ్చుకొనుటకు సమ్మతింపనైతిని. ఐన నోపరశురాముఁడా! విష్ణుదేవునిదియును, స్వర్గలోకంబునంబుట్టినదియును, శత్రుపురములజయింపగల్గునదియును, శత్రువులబలంబునుగర్వంబును నశింపంజేయునదియును, నగునీవిల్లునందీబాణముసంధింపఁబడినదగుటచే వ్యర్థంబుగ క్రిందపడదు. కావున నీకిపుడుగల్గియుండుకాళ్ళచే నడచుకొనుటకుపయోగించెడుశక్తినైనను, లేకనీవుతపశ్శక్తిచేసంపాదించినతపోఫలంబులగులోకంబులనైనను నీరెండింటిలో నేనినినీవుగోరెదవో దానింగొట్టెదననియె.

అట్టియెడధనుర్ధరుండై మహాకోపంబుతోనుండు రాముని నతండుసేయునద్భుతకార్యమునుజూచుటకు దేవదానవగంధర్వోరగయక్షరాక్షసులు బ్రహ్మదేవునితోఁగూడవచ్చియుండిరి. అంతరాముఁడు శ్రేష్ఠంబగువిష్ణుధనువునుధరించిన లోకంబంతయు స్తబ్ధత్వమునొందె. పరశురాముండు తనతేజంబంతయు దశరథరాజనందనుఁడగురామునిచే గ్రహింపంబడి యుండుటనునెఱింగి మిగుల నాశ్చర్యము బొందె. ఇట్లాశ్చర్యముబొంది పరశురాముఁడు తనశక్తినంతయు రామునితేజస్సనపహరించుటంజేసి జడుండైయేమియుందోఁచక తామరపూరేకులవంటికండ్లుగల రామచంద్రునింజూచి మెల్లమెల్లగనిట్లనియె.

ఓ రాముఁడా! పూర్వము నేనీభూమినంతయుగాశ్యపునకు దత్తముజేయునపుడు ఆకాశ్యపుఁడునన్నుఁజూచి నీవిక నాదేశమునవాసముసేయఁగూడదనిన నట్లేకానిమ్మనియంటిని. నాయాగమునందు నధ్వర్యువుగానుండిన గాశ్యపుఁడుచెప్పినప్రకారము రాత్రికాలములయందు భూమియందునివసించుటలేదనిప్రతిజ్ఞజేసితిని. కావున నీభూమియంతయు గాశ్యపునిదియేగదా? పరాక్రమవంతుఁడవగు నోరామచంద్రా! నేనిపుడు మనోవేగంబునమహేంద్రపర్వతమునకుఁబోవలయు కావున కాళ్ళచేనడచుటకుపయోగించె

డు నాదుశక్తిం గొట్టవలదు. నేను తపంబు చేసి యప్రతిమంబగు లోకంబులను జయించియున్నాఁడను. నీవా లోకంబులను నీ శ్రేష్ఠమగు బాణముచే నాశనము సేయఁగొట్టుము. ఈ విల్లు నారోపించుటవలన నిన్ను నాశము లేనివాఁడును, దేవతలకు ప్రభువును, మధురాసుర సంహారకుఁడునునగు సాక్షాత్ మహావిష్ణువని తెలిసికొంటిని.

శత్రుమర్దనుఁడవగు నో రామచంద్రా! నీకు మంగళంబగుఁగాక. ఈ దేవతలందఱు నిచ్చోటికి వచ్చి యద్భుతకార్యములు సేయువాఁడవును యుద్ధమునం దెదురులేనివాఁడవునగు నిన్నుఁ జూచుచున్నారు. ఓ రామచంద్రా! నీవు ముల్లోకములకును ప్రభువగుటవలన నీచే నేనోడిపోయిన నాకెంతమాత్రమును కొఱంతలేదు. సువ్రతుండవగు రామా! అప్రతిమమగు నీబాణంబును విడువుము. నీవు బాణమును విడిచినపిదప నేను మహేంద్రపర్వతమునకుఁ బోయెదను.

—* పరశురాముఁడు తననివాసమునకుఁ బోవుట. *—

అని యిట్లు పరశురాముండు చెప్పిన పరాక్రమవంతుఁడును శ్రీమంతుఁడును, దశరథమహారాజపుత్రుఁడునునగు రాముఁడు తానెక్కుపెట్టిన శ్రేష్ఠమగు బాణమును విడిచె. అంత జమదగ్నికుమారుఁడైన పరశురాముఁడు తాను తపస్సుచే సార్జించిన లోకములను రాముఁడు కొట్టివేయుటం జూచి యతిసమర్థుండగు రామునిఁ గొనియాడి ప్రదక్షిణము సేసి త్వరితంబుగ పర్వతశ్రేష్ఠమగు మహేంద్రపర్వతమునకుఁ బోయె. అట్టియెడ దిక్కులన్నియు చీకట్లు వీడినవయ్యె. దేవతలును మహర్షులును, హస్తంబున ధరించియుండు ధనుస్సుగల రాముని అనేకవిధముల బొగడిరి.

ఇట్లు శ్రీమద్బాలకాండమునందలి డెబ్బదియాఱవసర్గము ముగిసెను.

—* శ్రీరాముడు తండ్రి మొదలగువారితోడ నయోధ్య జేరుట. *—

ఇట్లు పరశురాముఁడు మహేంద్రపర్వతమునకు బోయినపిదప దశరథరాజనందనుఁడగు రాముఁడు మిగుల శాంతముగలవాఁడై బాణముతోఁ గూడియుండు ధనుస్సును నప్రమేయంబగు మహిమగల వరుణుని చేతికిచ్చె. ఇట్లు వరుణుని చేతికిచ్చి రఘునందనుఁడగు రాముఁడు వసిష్ఠుఁడు మొదలగు ఋషులకు నమస్కరించి భయమువలన దిగ్భ్రమముగలవాఁడైయుండు తండ్రిం జూచి యిట్లనియె. ఓ నాయనా! తండ్రీ! జమదగ్నికుమారుఁడైన పరశురాముఁడు పరుగెత్తిపోయినాఁడు. అయోధ్యాభిముఖమైయుండు రథములును గుఱ్ఱములును నేనుఁగులును బదాతులును నాథుఁడవగు నీచే రక్షింపఁబడుచుఁ బ్రయాణంబగుటకు నభ్యంతరం బేమియును లేదు. మహారాజా! తండ్రీ! నీయాజ్ఞలో నుండెడు సేనల కాజ్ఞాపింపుము.

నీ సేనలు "చాతకపక్షులగుంపు మేఘములవలని జలముఁ గోరుకీతిని" నీయాజ్ఞకై యెదురుచూచుచున్నదియనెను. అంత నరపాలుఁడగు దశరథమహారాజు రాముఁడు చెప్పినమాటను విని తనపుత్రుఁడైన రాముని చేతులతోఁ గౌఁగిలించుకొని శిరంబు మూర్కొని నాయనా! రామచంద్రా! ఏమి చెప్పితివో నాకు తెలియదయ్యె. దానిని మరలఁ జెప్పుమనినఁ బరశురాముఁడు పరుగెత్తిపోయెనని రామచంద్రుండు మరలం జెప్పిన దశరథుండు విని మిక్కిలి సంతోషమునొంది గగుర్పాటుగల శరీరముఁ గలవాఁడై కుమారుని దన్నును పునర్జన్మమెత్తినవారలఁగాఁ దలంచె. పిదప దశరథమహారాజు తనసేనకు శీఘ్రంబుగ నయోధ్యాపట్టణమునకుఁ బోవునట్లాజ్ఞాపించె.

—* పురజనులయోధ్య నలంకరించుట. *—

అంత దశరథమహారాజు ధ్వజపతాకములచే నలంకరింపఁబడి రమ్యంబుగనుండునదియును, సర్వత్ర మ్రోగుచున్న మంగళకరమగు వాద్యములయొక్క ధ్వనిగలదియును, చల్లగనుండునట్లు నీళ్లు చల్లబడిన రాజవీధులుగలదియును, నెల్లెడల వెదచల్లఁబడిన పుష్పములయొక్క వాసనగలదియును, రాజు పురప్రవేశంబగునను సంతోషముచే నానందముఁ జెందియుండు జనులుగలదియును, మంగళములఁ జెప్పుచుండు పురజనులచే నిండింపఁబడినదియును, వేడుకఁ జూడవచ్చిన గ్రామాంతరజనములచే నిండి నిబిడీకృతంబైయుండునదియును, నగు నయోధ్యాపట్టణమును బ్రవేశించె. శ్రీమంతుఁడును మహాయశుండునునగు దశరథమహారాజును అయోధ్యాపట్టణమందలి బ్రాహ్మణులు మొదలగువారు మిగుల దూరమునందే యెదుర్కొని యతనితోఁ గలసివచ్చుచుండిరి. అంత దశరథుఁడు శ్రీమంతులగు పుత్రులు తనవెంటనంటి వచ్చుచుండఁగ హిమవత్పర్వతముతో సరియగు తనగృహమును బ్రవేశించె. రాజగృహమునందుండు జనులందఱు మిగుల సంతోషమువొంది గంధపుష్పాదులచే దశరథునిఁ బూజించిరి.

—* కౌసల్య సుమిత్ర కైకేయి మొదలగువారు కోడండ్ర లోనికి బిలుచుకొనిపోవుట. *—

కౌసల్య సుమిత్ర కైకేయి మొదలగు రాజస్త్రీలు కోడండ్ర లోపలికి బిలుచుకొని పోవుటయుం దానస్తుతై మహాభాగ్యము గలదియగు సీతయు, యశస్వినియగు నూర్మిళయు, కుశధ్వజుని కూఁతుండ్రైన మాండవీ శ్రుతకీర్తులును బిలుచుకొనిపోయిరి. రాజగృహములోనికిఁ బోయి కోడండ్రందఱును మంగళకరములగు నాశీర్వాదములఁ జెంది యతిశీఘ్రంబుగఁ బట్టుచీరలం గట్టుకొని యింటిదేవతల విగ్రహములను బూజించిరి.

పిదప రాజకుమారులందఱును నమస్కరింపఁదగిన వారలనెల్ల నమస్కరించి కుబేరునింటితో సమానమైన తమతమ గృహములను బొంది ధనధాన్యములచే బ్రాహ్మణోత్తముల సంతోషింపఁజేసి రహస్యమున తమభర్తలం గూడి క్రీడించుచు సుఖంబుగనుండిరి. మహాత్ములును, మిగుల పరాక్రమము గలవారును, వివాహంబైనవారును, యస్త్రవిద్యానిపుణులును, ధనవంతులును, స్నేహితులతో డంగూడినవారును, పురుషోత్తములును, రాజనీతిజ్ఞులును, నగురామలక్ష్మణ భరతశత్రుఘ్నులు తండ్రికిశుశ్రూష జేయుచు నప్పుడప్పుడు తమసద్గుణంబులచే దండ్రియగుదశరథునిసంతోషపఱచుచుఁ దండ్రియాజ్ఞాప్రకారము వర్తించుచు, సుఖంబుగనుండిరి.

భరతశత్రుఘ్నులను మేనమామయగు యుధాజిత్తు తన దేశమునకుబిలుచుకొనిపోవుట.

ఇట్లుండఁగఁ గొంతకాలముగడచినపిదప రఘువంశోద్భవుఁడగు దశరథమహారాజు కైకేయీపుత్రుఁడైన భరతునింబిలిచియిట్లనెను. పరాక్రమశాలివగు చిన్నికొమరుఁడా! భరతుడా! కేకయరాజపుత్రుండును, నీమేనమామయునగు యుధాజిత్తు నిన్నుఁదోడ్కొనిపోవుటకు వచ్చియున్నాడు. భరతుఁడా! నీవుసమస్తధర్మంబుల నెఱింగినవాఁడవు. మిథిలాపట్టణమునందే ఋషులమధ్య యుధాజిత్తు నిన్నుఁబిలుచుకొని పోవలయునని ప్రార్థించెనుగదా! నీవిప్పుడతనికి సంతోషముగలుగునట్లు జేయుము. అనియిట్లు చెప్పిన దశరథమహారాజుమాటనువిని కైకేయీపుత్రుఁడైనభరతుఁడు తండ్రియైనదశరథునకును అన్నయగురామునకును నమస్కరించి లక్ష్మణునిగౌగలించుకొని శత్రుఘ్నునితోడంగూడిపోవుటకుఁ బ్రయాణంబయ్యె.

ఇట్లు శూరుండును, పురుషశ్రేష్ఠుడునునగు భరతుఁడు ప్రయాణంబై తల్లులుదశరథుఁడుమొదలగువారితో బోయివచ్చెదనని చెప్పి శత్రుఘ్నునితోడంగూడిపోయెను. భరతుఁడు పోయినపిదప మహాబలులగు రామలక్ష్మణులు దేవతతోసమానుండగు దశరథునిపూజించుచుండిరి. ధర్మాత్ముండగు రాముఁడు తండ్రియాజ్ఞాప్రకారము మేలుగలిగించునవియును, కీడునుదొలగించునవియునగు పురజనులకార్యములనన్నింటిని నెఱవేర్చుచుండెను. మఱియును రాముఁడు తనతల్లులకొఱకు చేయవలసినకార్యములను దల్లులకుచేయుచు, గురువులకొఱకు జేయవలసినకార్యములను నాయాకాలములయందు జాగరూకతతో గురువులకుఁ జేయుచునుండె.

ఇట్లు మంచిస్వభావమును, మంచి నడవడికయుంగల రామునివిషయమై దశరథుఁడు మిగులసంతోషించె. బ్రాహ్మణులును, పురజనులును, ఆదేశమునందుండుసు సర్వజనులును నత్యంత సంతోషంబునొందిరి. మహాకీర్తిగలవాఁడును, సత్యపరాక్రముండును, నగురాముఁడుబ్రాహ్మణులు మొదలగుజనములకు "ప్రాణులకు బ్రహ్మదేవుండెట్లో" అట్లు ప్రపంచంబునందంతయుమిగులప్రియుండైయుండె. మఱియుమనస్వియగు రాముఁడుసీతయందులీనమైనమనస్సుగలవాఁడైసీతతోడంగూడననేకఋతువులయందుక్రీడించుచుసుఖంబుగనుండె. ఇంతయగాక సీతయొక్కమనస్సునందెప్పుడును సమర్పింపబడినవాఁడయ్యె. (అనగా రాముఁడుసీతయందును సీతరామునియందును నధికప్రేమగలవారైరనుట.) రామునకుదండ్రియగు దశరథమహారాజొనగూర్చిన భార్యయగుటంజేసి సీతమిగులప్రియురాలేను. వినయము మొదలగు గుణములచేతను, సౌందర్యాది గుణములచేతను నాసీతయందు రామునకుబ్రీతి నానాటికి హెచ్చుచుండె. సీతకు రామునియందుండు ప్రీతికన్నను రామునకుసీతయందు రెండింతలు ప్రీతిగలిగియుండె. అట్లుండినను రాముఁడు, సీతతనమనంబున నతిరహస్యముగ నునిచికొనియుండు ప్రీతినిగూడ తనబుద్ధివిశేషముచే నడవడికలమూలకముగ దెలిసికొనుచుండె.

మిథిలాపట్టణమున నుద్భవించుటచేతను, పండితుండగు జనకమహారాజు కూతురగుటచేతను, దేవాంగనారూపముతోసమానమైన రూపసౌందర్యాదులుగలిగి లక్ష్మీదేవియోయనునట్లుండుటచేతను, రామునికన్నను విశేషముగ రామునియొక్క హృదయమునందలి యభిప్రాయములను అనగా తనయందు ప్రీతిగలిగియుండుటను తెలిసికొనుచుండెను. రాజర్షియగు దశరథమహారాజ పుత్రుండైన రాముఁడు సౌందర్యముగలదియును, మిగులప్రేమగలదియును, మహారాజకుమార్తెయును, నగుసీతతోడం గూడి "లక్ష్మీసమేతుండగు సర్వవ్యాపకుఁడైన మహావిష్ణుపుంబోలె" ప్రకాశించుచుండెను.

ఇట్లు సకలకళాకలాప ధురంధరుఁడును- బరూరు- సీతారామయ్యతనూభవుఁడునునగు
బరూరు- త్యాగరాయశాస్త్రిచే రచియింపంబడిన యాంధ్రవచనకావ్య
శ్రీమద్వాల్మీకిరామాయణమునందు బాలకాండము-ముగిసెను.

శ్రీరామచంద్రార్పణమస్తు

శ్రీరస్తు.

శ్రీరామచంద్ర సద్గురుపరబ్రహ్మణేనమః.

శ్రీమద్వాల్మీకి రామాయణము

అయోధ్యాకాండము.

ఇట్లు భరతుఁడు మేనమామయింటికిఁ బోవుచుఁ బాపరహితుఁడును, శత్రుసంహారకుఁడునునగు శత్రుఘ్నుఁడు మిగులస్నేహము గలవాఁడగుటచే దీసికొనిపోయెను. ఇట్లు పోయియాభరతుఁడు మేనమామగృహమునందు గుఱ్ఱములకునధిపతియైన మేనమామయగు యుధాజిత్తుచే మిగుల సత్కారముతో బూజింపఁబడుచు "తండ్రి- పుత్రునియం దెట్టి స్నేహముగలిగియుండునో" నారీతిని లాలింపఁబడుచును తమ్ముఁడైన శత్రుఘ్నునితోఁగూడ సుఖముగనివసింపుచుండె.

అట్లు భరతశత్రుఘ్నులు మేనమామగృహమునందు నివసింపుచుఁ గోరినపదార్థములనెల్ల మేనమామచేనిప్పింపఁబడి యనుభవింపుచు సంతోషముగలవారలై యుండినను తండ్రియందు భక్తిగలవారగుటచే మనతండ్రివృద్ధుఁడగుటవలన రాజకార్యంబులనెట్లు నెఱవేర్చుకొనుచుండునో యనియును, నిట్టికాలంబున నతనిను పచరింపుచుండుటకు లభింపదయ్యెననియును, తలఁచుచుండిరి. మహాతేజుండగు దశరథమహారాజును, నితరదేశము నందుండువారును దేవేంద్రవరుణులతో సరియైనవారునునగు పుత్రులైన భరతశత్రుఘ్నులును సర్వదాస్మరింపుచుండె.

మఱియు నాదశరథమహారాజు పురుషశ్రేష్ఠులగు రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల నల్వురియందును "తనదేహమునందు నాలుగుచేతులుగలిగియుండిన నానాలుగుచేతులయందును నేకరీతిగ నెట్లు ప్రీతిగలిగి యుండునో" అట్లు ప్రీతిగలిగియుండె. "ప్రాణులలోపల మిగులగుణవంతుఁడగు బ్రహ్మదేవుఁడు తనతండ్రియగు విష్ణుదేవునియందు నధికప్రీతిగనుండునట్లు" నలువురుపుత్రులలోపల గుణాధికుఁడును, మహాతేజుఁడునునగు రాముఁడు తండ్రియగు దశరథమహారాజునందు మిగులప్రీతిగలిగియుండె.

శ్రీరామగుణాభివర్ణనము.

సనాతనుఁడగు మహావిష్ణువు వరబలంబుచే గర్వించియుండెడు రావణాసురుని సంహరించుటకొఱకు దేవతలచేఁ బ్రార్థింపఁబడి మనుష్యలోకమునందు రాముఁడుగానవతరించెనుగదా! అట్టిపుత్రులలోపల శ్రేష్ఠుఁడును, మితిలేని పరాక్రమము గలవాఁడునునగు, రామునికుమారునిగా బడసికౌసల్య "దేవతోత్తముఁడగు నింద్రునింగన్నయదితిదేవివలె" ప్రకాశింపుచుండె. ఆ రాముఁడుసౌందర్యసంపన్నుఁడును, పరాక్రమముఁగలవాఁడును, అసూయలేనివాఁడును, గుణములలో దశరథునిబోలినవాఁడునై యుండుటచే నిట్టిపుత్రుండెవ్వరికిని గలిగియుండఁడని ప్రసిద్ధిఁగాంచె.

ఆరాముఁడెవ్వరైనను తన్నుఁజూచి పరుషముగమాటలాడిరేని యందుకుమరల పరుషముగ బదులుచెప్పఁడు. ఎల్లప్పుడును శాంతముగలవాఁడగుటచే మృదువుగబదులుచెప్పును. ఎవ్వఁడైనను తనకొకపర్యాయ ముపకారముఁజేసెనేని నయ్యుపకారమును నెల్లప్పుడునుస్మరింపుచు సంతోషము నొందుచుండును. ఎవ్వఁడుగాని తనకునూఱపకారములుజేసినను మంచిమనస్సుగలవాఁడగుటచే వానినెప్పుడునుస్మరింపఁడు. మఱియుసజ్జనులగు మంచియాచారముగల పెద్దమనుష్యులతోను, జ్ఞానవంతులగుగొప్పవారితోను, వయసుచే వృద్ధాప్యమునొందిన ముసలివారితోను శస్త్రవిద్యాభ్యాసము సేయునట్టికాలములగు అకాలములయందుఁగూడ వారికిదగినటుల సదాచారవేదాంతరహస్యసంప్రదాయము మొదలగువానినిగుఱించి మాటలాడుచుండును. మిగులబుద్ధిగలవాఁడును, మధురముగమాటలాడువాఁడును, ఎట్టివానితోనైనను తానె ముందుగమాటలాడువాఁడును, ప్రియమునే చెప్పువాఁడును, పరాక్రమముఁ గలవాఁడును, తనకుగల పరాక్రమమునకొంతమాత్రము గర్వపడనివాఁడునునై యుండె. అబద్ధపుమాటలులేనివాఁడును, విద్వాంసుఁడును, వృద్ధులకునెదురుగాబోయిపిలుచుకొనివచ్చి పూజించువాఁడును, ప్రజలయందుప్రీతిగలవాఁడును, ప్రజలచేప్రీతి నుంచఁబడినవాఁడును, నైయుండె.

ఆ రామచంద్రుఁడు దయగలవాఁడును, కోపంబు వజియించినవాఁడును, బ్రాహ్మణులను నెమ్మదిగఁ బోయి పిలుచుకొని వచ్చి పూజించువాఁడును, దీనులయందు విశేషముగ దయగలవాఁడును, ధర్మజ్ఞుండును, ఎల్లప్పుడును దృఢనియమముగలవాఁడును, పరిశుద్ధుఁడును, (అనగా పరులసొత్తును గోరనివాఁడనుట) నైయుండె. ఇక్ష్వాకుమహారాజవంశమునకుం దగినబుద్ధిగలవాఁడును (వినయదయదాక్షిణ్యాదిగుణములుగలవాఁడనుట) క్షత్రియులధర్మము నే యాధిక్యముగఁ దలంచువాఁడును, ఆక్షత్రధర్మము నేచక్కఁగ ననుష్ఠానము సేసితిమేని విశేషకీర్తియు, స్వర్గమును గలుగునని యెన్నువాఁడును నైయుండె.

తాను పండితుండగుటవలన చెడుపనులయం దాసక్తుండు గానివాఁడును, ధర్మవిరోధములగు మాటలయం దిష్టములేనివాఁడును, యుక్తిగ మాటలాడువారితో సయుక్తముగ మాటలాడుటయందు బృహస్పతివంటివాఁడును నైయుండె. రోగములేనివాఁడును, శ్రేష్ఠమగు యౌవనముగలవాఁడును, రసముగ మాటలాడువాఁడును, దృఢమైనశరీరముగలవాఁడును, దేశకాలములగు రెఱిగినవాఁడును, ఎదటివానిమనోనిశ్చయమును కనిపెట్టువాఁడును, లోకమునం దంతటను సాధువితం డొక్కఁడేయని కీర్తినొందినవాఁడును నైయుండె.

ఇట్లు శ్రేష్ఠములగు గుణములతోడం గూడిన నారామచంద్రుఁడు ప్రజలకు వెలుపటనుండు ప్రాణమువలె మిగుల ప్రియుఁడుగా నుండెను. విద్యావ్రతములవలన స్నానము జేసినవాఁడును (అనగా వేదాధ్యయనాదులం జేసి సమావర్తనము జేసినవాఁడనుట) సాంగముగ వేదములనెఱిగినవాఁడును, విలువిద్యయందును నస్త్రప్రయోగంబులందును తండ్రికన్న శ్రేష్ఠుండైనవాఁడును నైయుండె. ఎల్లప్పుడును మంగళంబులుగలవాఁడును, దోషము లేనివాఁడును, ఎట్టికష్టములయందును దైన్యము నొందనివాఁడును, సత్యముగ మాటలాడువాఁడును, సన్మార్గప్రవర్తకుఁడును, ధర్మార్థములనెఱింగిన పెద్దలగు బ్రాహ్మణోత్తములచే శిక్షింపఁబడినవాఁడును నైయుండె. ధర్మకామార్థములయొక్క తత్త్వము నెఱింగినవాఁడును, మఱపిలేనివాఁడును, క్రొత్తఁగ బ్రకాశించుచుండు బుద్ధిగలవాఁడును, లోకాచారములసంకేతములనెఱింగి న్యాయముగ బ్రవర్తించువాఁడును, విశారదుండును నైయుండె.

మిగుల వినయముగలవాఁడును, తనమనసునందుండు నభిప్రాయము నితరులకు దెలియకుండునట్లు దేహవికారము నొందనివాఁడును, నితరులకు దెలియని యాలోచనగలవాఁడును, సహాయముగలవాఁడును, అమోఘమగు కోపము సంతోషమును గలవాఁడును, (అనగా నతని కోపము గాని సంతోషము గాని వ్యర్థముగఁ బోదనుట) ఇచ్చునట్టియు, నార్జించునట్టియు, గాలముల నెఱింగినవాఁడును, నైయుండె. దృఢభక్తిగలవాఁడును, స్థిరమైనప్రజ్ఞగలవాఁడును, చెడువానిని గ్రహింపనివాఁడును, దుర్వచనములఁ బలుకనివాఁడును, అజాగ్రతలేనివాఁడును, మత్తుఁడు కానివాఁడును, స్వదోషపరదోషముల నెఱిఁగినవాఁడును నైయుండె.

శాస్త్రజ్ఞుఁడును, కృతజ్ఞుఁడును, పురుషుల తారతమ్యముల దెలిసినవాఁడును, ప్రగ్రహానుగ్రహ విచక్షణుండును, నైయుండె. పెద్దలను రాబట్టుకొని పరిపాలింపసమర్థుఁడును, దుష్టుల శిక్షింపసమయ మెఱిఁగినవాఁడును, ద్రవ్యము సంపాదించుటయందు ప్రజలను పీడింపక యనార్జించు నుపాయ మెఱింగినవాఁడును, శాస్త్రోక్తప్రకారముగ నార్జించిన ద్రవ్యంబున మూఁడవపాలైనను, నాల్గవపాలైనను, సెలవు సేయువాఁడును, నైయుండె. న్యాయవేదాంతాదిశాస్త్రసమూహములందును, సంస్కృతప్రాకృతాదిమిశ్రములగు నాటకాలంకారాదిశాస్త్రములందును విద్వాంసులగువారిలో శ్రేష్ఠుండని కీర్తినొందినవాఁడును, అర్థధర్మములను సంపాదించువాఁడును, సుఖమేముఖ్యముగఁ గలవాఁడును, సోమరితనములేనివాఁడును నైయుండె.

విహారార్థములగు సంగీతము మొదలగు శిల్పవిద్యలఁ జక్కఁగ నెఱింగినవాఁడును, శ్లో॥ ధర్మాయ యశసేఽర్థాయ ఆత్మనే స్వజనాయ చ । పంచధా విభజన్ విత్తమిహాముత్ర చ శోభతే॥ ధర్మము, కీర్తి, లౌకికకార్యము, తనయుపయోగము, బంధువులు, స్నేహితులు, యీకార్యములకొఱకు ధనమును విభజింపవలయును కావున నారీతిని విభజింపవలసిన క్రమము దెలిసినవాఁడును, ఏనుఁగులు గుఱ్ఱములమీఁద నెక్కుటయందును, వానిని నడుపుటయనెడు శిక్షయందు మిగుల సమర్థుఁడును, నైయుండె.

ధనుర్వేదము దెలిసినవారిలో మిగుల శ్రేష్ఠుఁడును, విలువిద్య నెఱిఁగి పోరెడివారిలో బాగడబడినవాఁడును, శత్రువుల కెదురుగా నడిచిపోవువాఁడును, శత్రుసంహారము సేయువాఁడును, సేనల నడుపుటయందు విద్వాంసుఁడు నైయుండె. యుద్ధమునందు కోపమునొందిన సురాసురులచే తను నెదిరింపఁగూడనివాఁడును, గుణమగు వానియందు దోషారోపణ సేయనివాఁడును, జితక్రోధుఁడును, గర్వము లేనివాఁడును, మాత్సర్యము లేనివాఁడును, ఒకరి కవమానము సేయనివాఁడును, కాలము ననుసరించి నడవనివాఁడును నైయుండె.

ఇట్లు శ్రీరామచంద్రుండు శ్రేష్ఠములగు గుణములు గలిగి ముల్లోకములయందును పూజ నొందుచునుండె. మఱియు

భూదేవితో సరియైనవోర్పుగలవాఁడును, బృహస్పతికిసరియైనబుద్ధిగలవాఁడును, శచీపతియగుదేవేంద్రునకుసరియైనపరాక్రమముగలవాఁడును నైయుండెను. ఇట్లుసకలజనులకుప్రియంబునుగలిగించునవియును, తండ్రియగుదశరథునకు సంతోషముగలిగించునవియును, సుగుణములుగలిగి "సూర్యుఁడు స్వకీయకిరణములచే ప్రకాశించునటుల" ప్రకాశించుచుండెను. ఇటులసకలగుణసంపన్నుండును, బద్ధవ్రతుండును, సాటివారిచేతను నెదిరింపఁగూడనిపరాక్రమముఁగలవాఁడును, దిక్పాలురతోసరియైనవాఁడును నగు నారాముని భూమిదేవిప్రభువుగాఁ గోరెను.

—* దశరథమహారాజు రామునకుబట్టముగట్ట వలయుననితలంచుట. *—

ఇట్లు చెప్పనలవిగాని యనేకసుగుణములతోఁడంగూడియున్న పుత్రుఁడగురామునింజూచి శత్రుసంహారకుఁడును చాలాకాలముగ జీవించుచున్నవాఁడును, వృద్ధుఁడునునగు దశరథమహారాజిట్లని యాలోచించెను. నేనుజీవించియుండఁగ రాముఁడెట్లు రాజ్యాధిపతికాఁగలఁడు? నేనెప్పుడు పట్టాభిషిక్తుండగు నాప్రియపుత్రుఁడైనరామునిజూడగలను? అని మనంబున నెల్లప్పుడుతలంచుచుండును. మఱియునిట్లనుకొనును. నాపుత్రుఁడగురాముఁడు ప్రజలవృద్ధిగోరుచుండును. సర్వభూతములయందును మిగులదయగలవాఁడు "వర్షము వర్షించుమేఘమువలె" ప్రజలబరితాపమునుబోఁగొట్టువాఁడు. వారలకు నాకన్నను మిక్కిలిప్రియుఁడు. రాముడుపరాక్రమమునందు యమధర్మరాజుతోను దేవేంద్రునితోను సమానుఁడు.

బుద్ధియందుబృహస్పతితోసమానుఁడు. ధైర్యంబునపర్వతముతోసమానుఁడు. నాకన్నను మిగులనధికమగు గుణములుగలవాఁడు. వృద్ధుండనగు నాకీవయసునందు నాపుత్రుండగురాముఁడు భూమండలాధిపతియై రాజ్యపరిపాలనముసేయుచుండఁగ నారామునింజూచుస్వర్గంబునాకుండునట్లుసంభవించునో? సంభవింపదో? అనితలంచుచుండును. ఇట్లుకొన్నిదినములు గడచినపిదప యొకనాఁడుదశరథమహారాజు నానావిధములును, నితరరాజులకు లభ్యంబుగానివియును, నిదివరకుచెప్పఁబడిన నపరిమితములైనవియును, ప్రపంచమునందులోకోత్తరములైనవియును, నిదివరలోచెప్పబడినవాటిలో శేషించినవియును నగుమంగళకరములగు గుణములతోడంగూడినరామునింజూచి యువరాజునుగాఁజేయనిశ్చయించి మంత్రులంబిలిచియిట్లనియె.

—* దశరథుఁడుమంత్రులతోనాలోచించుట. *—

ఓమంత్రిశ్రేష్ఠులారా! స్వర్గమునందును, ఆకాశమునందును, భూలోకమందును, మహాభయంకరములగు నుత్పాతములుగలుగుచున్నవి. నాదేహమునందును వృద్ధాప్యము మిక్కిలిమెండుకొనుచున్నది. కావునరామునకుశీఘ్రముగఁబట్టాభిషేకముసేయవలయును. అనియిట్లుచెప్పిదశరథమహారాజు మహాత్ముఁడును, పూర్ణచంద్రునివంటి ముఖముగలవాఁడును, నగురాముఁడు జనులకుమిగులప్రియుండగుటవలన నతనిపట్టాభిషేకవిషయమునందు జనులుసమ్మతింపరనువ్యసనముపొందపనిలేదనిచక్కఁగానెఱింగెను. ధర్మాత్ముండగు దశరథమహారాజు తనయొక్కయు ప్రజలయొక్కయు మేలుకొఱకును సంతోషముకొఱకును యుక్తకాలమునందు మిగులప్రీతితో రామునకుఁబట్టాభిషేకముసేయవలయునని ప్రయత్నపడెను.

—* దశరథుఁడుసకలరాజులనుబిలిపించుట. *—

ఇట్లుప్రయత్నపడి యనేకపట్టణములయందును, గ్రామంబులయందును నుండుప్రజలను, భూమికిప్రధానులుగనుండురాజులను, సామాన్యులగురాజులనుపిలిపించెను. ఐనను, నతిత్వరితముగ బట్టాభిషేకము గావలసియుండుటవలన దూరమునందుండువారగు కేకయరాజును, జనకమహారాజును బిలిపింపఁడయ్యె. వారలు మిగులప్రీతిగలవారలగుటచే నీప్రియమగురామరాజ్యపట్టాభిషేకవార్తను వెనుకవినగలరనితలంచెను. పిదపతనయాజ్ఞప్రకారముగవచ్చినవారలకు నివసించుటకువిడుదులనుచూపించి నానావిధాభరణములచేత యథాయోగ్యముగ బూజించి "బ్రహ్మదేవుడుప్రజలంజూచుమాడ్కి" వారలనెల్లజూచెను.

ఇట్లు శత్రుమర్దనుఁడగు దశరథమహారాజు జనులనుసత్కరించి తానుసింహాసనంబునఁగూర్చున్నపిదప జనకమహారాజును కేకయమహారాజునుఁదప్పతక్కినలోకసమ్మతులగురాజులు రాజసభంబ్రవేశించిరి. ఇట్లుప్రకాశించుదశరథమహారాజుచే బూజింపఁబడి వివిధసింహాసనములయందు ప్రభువునకెదురుగా ప్రభువుసమీపమునఁగూర్చుండవలసినరీతిగ గూర్చుండిరి. దశరథమహారాజుచేసత్కరింపఁబడినవారును, వినయముగలవారును, నానావిధపట్టణములందుండియు గ్రామములందుండియు వచ్చినవారును, ప్రభువుసెలవిచ్చెడిమాటలను చక్కఁగావినవలయునని మిగులసమీపమున మెల్లమెల్లగవచ్చికూర్చున్నవారును, నగురాజులచేతను ప్రజలచేతను జుట్టబడిన దశరథమహారాజు "దేవతలచేజుట్టబడినమహేంద్రునివలె" ప్రకాశించెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి మొదటిసర్గము ముగిసెను.

—* దశరథుఁడు రామునకుబట్టాభిషేకము సేసెదనని ప్రజలతోడఁజెప్పుట *—

పిదప దశరథమహారాజు సభయందుండు వారలనెల్ల బంగారుచి హితముగలిగించునదియును, సంతోషమునుజనింపఁజేయునదియునునగు వచనమునస్పష్టమైన యర్థముగలుగునట్లుగ నిట్లనిచెప్పదొడంగె. ఇట్లునరేంద్రుఁడగుదశరథమహారాజు భేరీధ్వనితోసరిపోవునదియును, గంభీరంబై ప్రతిధ్వనిగలిగించునదియును, రాజలక్షణయుక్తమైనదియును, నగుస్వరముతోడంగూడి గొప్పధ్వనిచేశబ్దించుచున్న మేఘమువలెనున్నవాఁడై సభయందుండువారలం జూచియిట్లనియె.

ఓరాజశ్రేష్ఠులారా! నాయొక్కయుత్తమమైన యీరాజ్యమును నాకుబూర్వముండిన రఘుదిలీపమహారాజులు మొదలగువారు పుత్రునివలెరక్షింపుచుండిరనునది మీకందఱకు దెలిసినదియేను. ఇక్ష్వాకువంశమునందు పుట్టినరాజశ్రేష్ఠులగునందఱిచేతను బరిపాలింపఁబడినదియును, సుఖముగలిగించునదియును, నగునీరాజ్యమునకు మేలుగలుగునట్లు సేసెదను. పూర్వపురాజులమార్గము ననుసరించువాఁడును, ఎల్లపుడునమిక్కిలజాగ్రతతో బ్రవర్తించువాఁడును, నగునేను నాశక్త్యనుసారము ప్రజలరక్షించితిని. సమస్తజగత్తునకు హితమును సేయుచు శ్వేతచ్ఛత్రాధిపత్యంబు వహించిప్రజలబరిపాలించి యిపుడువృద్ధాప్యుండనైతిని.

అనేకవేలసంవత్సరముల జీవితకాలమునుబొంది ప్రజలబరిపాలించి యీకాలమునకు వృద్ధుండనైతిని. కావుననిశరీరమునకు విశ్రాంతిగలుగునటుల జేయగోరుచున్నాను. ఇఁకశ్రమనొందనేరను- ధైర్యశౌర్యాది రాజప్రభావములచే పౌనర్పసాధ్యంబగునదియును, జితేంద్రియులు కానివారిచే వహింపన సాధ్యంబగునదియును, మిగులగొప్పదియునునగునీరాజ్యభార మిన్నిదినములు వహించి యలసటనొందియున్నాను. ఇట్లుశ్రమనొంది వృద్ధాప్యుండనైయుండునేను ప్రజాపరిపాలనయందు నాపుత్రునినియమించియుంతరంగముగల బ్రాహ్మణులను వసిష్ఠమహర్షి మొదలగువారలనుసమ్మతింపఁజేసిశ్రమదీర్చుకొనగోరుచున్నాను.

నాజ్యేష్ఠపుత్రుఁడగు రాముఁడు పరాక్రమమునదేవేంద్రునితోసమానుఁడు. శత్రుపురములను జయించువాఁడు. సమస్తగుణములయందును నన్ననుసరించి పుట్టియున్నాఁడు. ధర్మాత్ములలోపల శ్రేష్ఠుండును, పురుషోత్తముండును "పుష్యమీనక్షత్రముతోడం గూడినచంద్రునివలెనున్నవాఁడును, నగురాముని సంతోషముతో యువరాజుగాఁజేసెదను.

మఱియు ముల్లోకములును నెట్లు విశేషప్రభువుగలవిగజేయఁబడునో అట్లులక్ష్మీవంతుఁడును, లక్ష్మణాగ్రజుండునునగురాముఁడు (లక్ష్మణాగ్రజుండని నిచటబ్రయోగించుచే తమ్ముఁడగులక్ష్మణునియం దెంతప్రీతిగలిగియున్నాడో ప్రజలయందును నంతప్రీతిగలిగి యుండుననుట) ప్రభువయ్యేనేని మీకువిశేషప్రభువుగ నెన్నందగినవాఁడుగనుండునుగదా; కావుననేను నాజ్యేష్ఠకుమారుఁడైన రామునకీరాజ్యభారమును నప్పగించి రాజ్యంబునకిపుడే మేలుకలుగునటులంజేసి నేనువిశ్రాంతినొందెదను.

శ్లో॥ యదిదంమేనురూపార్థం మయాసాధుసుమంత్రితమ్। భవంతోమేనుమన్యంతాం కథంవా కరవాణ్యహమ్॥

ఓప్రజలారా! నేనిపుడు చేయదలంచిన నీకార్యమువృద్ధుండనగు నాకుచితమనియును, నాచేనిర్దోషముగనుండునట్లు చక్కఁగానాలోచింపఁ బడినదనియును, మీరుతలంతురేనియొప్పికొనుఁడు. లేనియెడల నేనుమాత్రమెట్లుచేయగలను? నేనిపుడుప్రీతితో జేయదలంచిన రామరాజ్యపట్టాభిషేకమునకంటే హితమైనదివేఱే మీకుదోచెనేని దానిని తెలియజెప్పుడు. మధ్యస్థులచే నాలోచింపఁబడి చేయఁబడుకార్యము నాలోచించుటచేత మిగులవిశేషముగఫలముగలదిగ నగునుకదా?

—*రామపట్టాభిషేకమునకు బ్రజలొప్పికొనుట.*—

అనియిట్లు గంభీరంబుగ దశరథమహారాజు చెప్పినసభలోనిరాజులందఱును "వర్షించుచున్నమహామేఘంబునుజూచి సంతోషంబువలన శబ్దించెడినెమళ్ళవలె" మిగులసంతోషముతో దశరథునిబొగడిరి- మహాసంతోషముచే నాసభయందుండుజనులందఱును "బలే,బలే" మంచికార్యముజేయుంబూనితిరని గట్టిగానఱవదొడంగిన నాధ్వనిప్రతిధ్వనిగలిగించునదియును, సంతోషముచే బుట్టినదియునునగుటచే వారుగూర్చుండియుండు విమానరూపమగు గృహమునుగదలించునో యనునట్లుండె- అంతధర్మార్థములనెఱిఁగిన దశరథమహారాజుయొక్క యభిప్రాయమును నన్నివిధములచే దెలిసికొని వసిష్ఠమహర్షి మొదలగుబ్రాహ్మణులును, రాజులునుపట్టణగ్రామవాసులగు బ్రజలతోనాలోచించి యొకటిగామనస్సును దృఢముజేసికొని వృద్ధుండగుదశరథమహారాజును జూచియిట్లనిరి.

ఓదశరథమహారాజా! నీవుయనేకవేలయేండ్లు రాజ్యపరిపాలనముజేసి ముసలివాడవైతివి. కావునరామునికి యువరాజ పట్టాభిషేకము సేయుము. మేముమహాబాహుండును, రఘువంశోద్భవులలో బరాక్రమవంతుఁడును, మహాబలుండును, నగురాముఁడు పట్టపేనుఁగుపై నెక్క-

గాని శ్వేతఛత్రముయొక్క నీడనువచ్చుచుండగా జూడగోరుచున్నాము. అనియిట్లుచెప్పిన దశరథమహారాజు సభలోనివారివాక్యములవిని వారలసంతోషయుక్తంబగు మనస్సునుతెలిసి నెఱుంగనివానివలె వారలవలననేచక్కగా నెఱుంగగోరి మరలయిట్లనియె.

—*దశరథుడుప్రజలయొక్క మనస్సునుశోధించుట.*—

ఓప్రజలారా! నాయొక్కమాటను విన్నంతమాత్రముననే నేనియువిచారింపక రామునికిబట్టాభిషేకము సేయవలయునని కోరుచున్నారు (అనగారాముడు రాజుకావలయునని కోరుచున్నారనుట) కావుననాకుసందేహము గలుగుచున్నది. రామాభిషేకమును మీరెందుకుగోరుచున్నారు. యథార్థముగ జెప్పవలయుననియె. నేనుధర్మము దప్పకభూమిని బరిపాలింపుచుండగ నాపుత్రునియువరాజుగానుండిన జూడగోరెదమని యేలచెప్పెదరు? అనిన నా సభలోనిప్రజలందఱు దశరథమహారాజుతో నిట్లనిరి.

—*ప్రజలురామునిగుణములను విశదముగ దెలుపుట.*—

దశరథమహారాజా! నీపుత్రుడగురామునియందనేక మంగళకరములగు గుణములుగలిగియున్నవి. మఱియుశ్లాఘింపదగిన గుణములుగలవాడును, దేవతతోసరియైనవాడును, ధీమంతుడును, నగురామునియొక్క ప్రియములైనవియును సంతోషమును గలిగింపం జేయునవియును, నగునాగుణములను జెప్పెదమువినుము.

ఓదశరథమహారాజా! రాముడుస్వర్గమునందుబుట్టిన (అనగామనుష్యసంబంధములైనవికావనుట) వీర్యాదిగుణములచే దేవేన్ద్రునితోసరియైనవాడు సత్యపరాక్రమముగలవాడు- ఇక్ష్వాకువంశమునందుపుట్టిన నందఱికంటెను మిగులశ్రేష్ఠుడు. లోకమునందు రాముడే సత్పురుషుడు- సత్యధర్మపరాయణుడు- రామునివలనధర్మము సంపదతో గూడనెడబాయకకలిగియున్నవి- రాముడుప్రజలకు సుఖమునుగల్పించుటయందు చంద్రునితోసమానుడు. ఓర్పునందు భూదేవితోసమానుడు- బుద్ధియందుబృహస్పతికిసమానుడు- వీర్యమునందు దేవేంద్రునికిసమానుడు- ధర్మజ్ఞుడు. సత్యసంధుడు. శీలవంతుడు. అసూయలేనివాడు. ఓర్పుగలవాడు. ఓదార్చువాడు. ప్రియవాక్యములబలుకువాడు. కృతజ్ఞుడు. జితేంద్రియుడు. మిగులతిన్ననివాడు. స్థిరమైనచిత్తముగలవాడు. సదాశుభకరుడు. అనసూయుడు. ప్రియముగ మాటలాడువాడు. సత్యవాది. శాస్త్రాభ్యాసముగల పండితులను, పెద్దలగు బ్రాహ్మణులను సేవించువాడు- ఇట్లుబ్రాహ్మణులసేవించుటచే నీరామునకు శౌర్యవీర్యాదులవలన గలిగినకీర్తియును, తేజంబునువృద్ధిబొందుచున్నవి.

దేవాసురమనుష్యు లుపయోగించుకొనెడి సమస్తాస్త్రములను దెలిసినవాడు. వేదాధ్యయనముజేసి స్నాతకముజేసికొనినవాడు. సంప్రదాయానుసారముగ వేదాంగములతోడ వేదమునుజక్కగానెఱింగినవాడు. గంధర్వవిద్యయందును సంగీతమునందును, మిగులశ్రేష్ఠుడు. మంగళకరమగు వంశమునజనించినవాడు. సాధువు- దీనత్వములేనివాడు. మహాబుద్ధిమంతుడు. మఱియుధర్మార్థములనెఱింగిన శ్రేష్ఠులగుబ్రాహ్మణులచే సర్వవిషయములందును జక్కగబోధింపబడినవాడు. గ్రామార్థమైనను పట్టణమునిమిత్తమైనను యుద్ధముసంప్రాప్తమైనపుడు లక్ష్మణసహితుడైపోయి జయమునొందక తిరిగివచ్చినదియేలేదు- అట్లుజయముబొందివచ్చి రథారూఢుండుగనైనను గజారూఢుడుగనైనను, నై పురజనులను "బంధువులవలె" క్షేమంబడుగును.

మఱియు "తండ్రియైనవాడు తనధర్మపత్నియందు పుట్టినకుమారులను క్షేమంబడిగినట్లు" పురజనులనుజూచి యోప్రజలారా! మీపుత్రులుకుశలముగనున్నారా? మీయగ్నిహోత్రములు నిర్విఘ్నముగజరుగుచున్నవా? మీభార్యలును, శిష్యులును, భృత్యులును, బాగుగనున్నారా? అని క్రమముగా క్షేమంబడుగును- మఱియుమీశిష్యులందఱును జాగ్రతగలిగి సేవజేయుచున్నారా? మిగులజక్కగానధ్యయనము సేయుచున్నారా? అనిసర్వదామమ్ముల నడుగుచుండును. దరిద్రుడుమొదలుధనికునివరకును కొంచమైనను భేదమెంచక నెల్లరినిసమానముగజూచుచు వారికికష్టము సంభవించెనేని తానుమిగులచింతనొందును.

అట్లుసకలజనులకును కోరికెలుకొనసాగునట్టి సంతోషముగలిగెనేని "తండ్రికొడుకులవిషయమై సంతోషించునట్లు" తానును సంతోషించుచుండును. మఱియుసత్యవాది- మహాధనుస్సుగలవాడు. వృద్ధులసేవించువాడు. జితేంద్రియుడు. చిఱునగవుతో మాటలాడువాడు. అన్నింటిచేతను ధర్మమునువిశేషముగ ననుసరించినవాడు, (ఇచటచెప్పినగుణములనే రెండేసిపర్యాయములు చెప్పుటచేనాగుణములను విశేషముగగలవాడని తెలియునది) తన్ననుసరించినవారికి మిగులమేలుగలిగించువాడు- కలహమునం దభిలాషలేనివాడు "బృహస్పతివలె" మాటకుమాటయుక్తిగజెప్పువాడు- సొగసుగుకనుబొమలు గలవాడు. నిడుపైనవియును నెఱ్ఱనైనవియునగు కన్నులుగలవాడు, లోకాభిరాముడు (అనగాప్రజలను రంజింపజేయువాడు) శౌర్యవీర్యపరాక్రమములచే సాక్షాద్విష్ణువే

గుణములుగలవాఁడు. ప్రజాపరిపాలనదక్షుఁడు. కామ క్రోధలోభ మోహాదులను జయించినవాఁడు. భూమినొక్కటనే యేలఁగలఁడని చెప్పనేల? ముల్లోకములనుగూడ నీరాముఁడొక్కఁడే పరిపాలింపఁగలఁడు.

కోపముగలిగెనేని వ్యర్థముగఁబోనివ్వఁడు. (అనఁగా నెవనిపైకోపము వచ్చునో వానితప్పులంబను భవించి యేలీరవలయును) అనుగ్రహముగలిగెనేని వ్యర్థముగఁబోనివ్వఁడు (అనఁగా నప్పుడే భాగ్యవంతునిఁజేయును) దండింపఁదగినవానిని తప్పక దండింపఁజేయును. దండింపఁదగనివానిపైఁ గోపముగూడఁ జేయఁడు. ఎవనియందైనను సంతోషముగలిగెనేని వానిఁడ దగినవానినెల్ల నవారిగనిచ్చి సంతోషింపఁజేయును. శాంతి ప్రధానముగాఁగలవియు, సకలజనులకుఁగోరఁదగినవియు, ప్రజలకు సంతోషముఁగలిగించునవియు, నగుగుణములచే "సూర్యుఁడుతనకిరణములచేఁబ్రకాశించునట్లు" ప్రకాశించుచున్నాఁడు. కావున నిట్టిగుణగణసంపన్నుఁడును, సత్యపరాక్రముఁడును, దిక్పాలురతోసమానుండును నగురాముని ప్రభువుగాఁగోరుచున్నాము.

ఓదశరథమహారాజా! నీభాగ్యవశంబున నీకిట్టిశ్రేష్ఠుఁడగు పుత్రుఁడుపుట్టెను. నీవుమహాభాగ్యసంపన్నుఁడగుటచే "మరీచిపుత్రుఁడగుకాశ్యపునివలె" నీపుత్రునకుసకలసద్గుణములునుగలిగియున్నవి. దేవాసురగంధర్వోరగమనుష్యులును, రాష్ట్రములయందుండువారును, నితరములగుశ్రేష్ఠములైన పట్టణములయందుండువారును, అంతఃపురములయందుండువారును, వెలుపలనుండువారును, మనపట్టణమునందుండువారును, నగుసర్వులును ప్రసిద్ధమైన మంచిస్వభావముగలరామునకు బలమును నారోగ్యమును, దీర్ఘాయువును గలుగవలెనని ప్రార్థించుచున్నారు.

స్త్రీలును, ముసలివారును, యౌవనముగలవారును, సాయంప్రాతఃకాలములయందు సావధానులరై ప్రసిద్ధులైన దేవతలను రామునికొరకుమ్రొక్కుచు నమస్కరించుచుందురు. ఓమహారాజా! దశరథభూవల్లభా! అట్టివారలయొక్క మనోభీష్టము నీచేనెరవేర్పఁబడుఁగాక. నల్లకలువలవంటి శ్యామలవర్ణముగలవాఁడును (అనఁగా నిందీవరశ్యాముండును) సకలశత్రుసంహారకుఁడును నగునీపుత్రుఁడైనరామునియొక్క యువరాజ్యపట్టాభిషేకమునుజూడ మిగులకుతూహలముగలవారమైయున్నాము. నీవుకోరినకోర్కెల నెరవేర్పువాఁడవు. మహావిష్ణువుతోసమానుఁడవు. సకలజనులయొక్క మేలునందు మిగులశ్రద్ధగలవాఁడవు. శ్రేష్ఠములగు గుణములుగలవాఁడవు. కావున నీవతిత్వరితముగ మాహితార్థము సంతోషముతో రామునకు బట్టాభిషేకముసేయుము.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి రెండవసర్గము ముగిసెను.

—*{ప్రజలఅనుమతిని దశరథుడు రామపట్టాభిషేకకాలమునిర్ణయించుట.}*—

ఇట్లుజనులందఱు వికసింపనితామరకమలమువలెచేతులను ముకుళించుకొనినమస్కారముఁజేసిచెప్పిన దశరథమహారాజు వారలనమస్కారములనుస్వీకరించి వారలకుహితమును సంతోషమునుగలుగునట్లుగనిట్లనియె. మీరలు నాకుప్రియుడును, జ్యేష్ఠపుత్రుఁడును నైన రాముఁడు యువరాజ్యాభిషిక్తుఁడు కావలయుననికోరుచున్నారు. కావున నాకుమిగులనాశ్చర్యము. నేనుమిక్కిలిసంతోషముఁగలవాఁడనైతిని. నాయొక్కమహాభాగ్యమును నేనేమనిచెప్పగలను? అనియిట్లుదశరథమహారాజు సభికులగుబ్రాహ్మణులుమొదలగువారలను మనోహరములగుమాటలచేగౌరవించి వసిష్ఠవామదేవులంజూచి యిట్లనియె.

శ్లో॥ చైత్రశ్శ్రీమానయంమాసః పుణ్యఃపుష్పితకాననః। యౌవరాజ్యాయరామస్య సర్వమేవోపకల్ప్యతామ్॥ ఓవసిష్ఠవామదేవులారా! ఇప్పుడుచైత్రమాసమువచ్చియున్నది కదా? ఇదిసకలమాసములలో శ్రేష్ఠమైనది. పుణ్యుఁడైనది. అరణ్యములయందుండుచెట్లన్నియు మనోహరముగఁబుష్పించియుండుకాలము. ఇట్టికాలముననె రామునకుయువరాజ్యపట్టాభిషేకముసేయవలయు. కావునపట్టాభిషేకమునకు వలయుసామగ్రులన్నియు సంపాదింపుఁడనియె. ఇట్లు దశరథమహారాజుచెప్పినతోడనే సభలోని ప్రజలందరు మహాసంతోషంబుతో రామపట్టాభిషేకంబు చూడఁగలిగెంగదాయని గొప్పధ్వనిగావించిరి. ఆజనులయొక్క మహాఘోషము సర్వత్రవ్యాపించె. అంతనా జనులఘోషంబంతయు మెల్లమెల్లగనిలువఁగానే దశరథమహారాజుమునిశ్రేష్ఠులగు వసిష్ఠవామదేవులంజూచియిట్లనియె. మహాత్ములరగు ఓవసిష్ఠవామదేవులారా! రామునియొక్కపట్టాభిషేకమునకు కావలసినయుపకరణసహితమగు క్రియయేదికలదో దానినంతయు నాకానతీయవలయునని.

{వసిష్ఠుడుసుమంత్రుడుమొదలగువారితో పట్టాభిషేకమునకువలయుసామగ్రులను సిద్ధముసేయుడనిచెప్పుట.}

అంతవసిష్ఠవామదేవులు దశరథమహారాజుముందర చేతులజోడించుకొని నిలవంబడియుండుసుమంత్రుఁడుమొదలగువారలంజూచి యిట్లనియాజ్ఞాపించె. ఓసుమంత్రాదులారా! మీరుబంగారుమొదలగువానిని, నవరత్నములను, కా

నుకలను, సమస్తయూలికలను, తెల్లనిపుష్పమాలికలను, పేలాలను, తేనెను, నెయ్యిని, క్రొత్తవస్త్రములను, రథమును, సమస్తాయుధములను, రథగజపదాతులు మొదలగు చతురంగబలమును, శుభలక్షణములుగల యేనుఁగును, తెల్లని చామరంబులను, ధ్వజమును, తెల్లనిగొడుగును, అగ్నిహోత్రముతంటికాంతిగల సూఱుబంగారుపాత్రములును, బంగారుకేశులతో నలంకరింపఁబడిన కొమ్ములుగలవృషభంబును, అవయవములన్నియును గలపులితోలును, వీటినన్నిటిని ప్రాతఃకాలమునకు దశరథమహారాజుయొక్క యగ్నిహోత్రగృహమునందుఁ జేర్పుఁడు.

మఱియు గంధపుష్పాక్షతలు మొదలగునితరపదార్థము లేవేవి కావలయునో వానినన్నిటిని సిద్ధము సేయుఁడు. రాజగృహద్వారములయందును పట్టణద్వారములయందంతట ను చల్లగనుండునట్లు సర్వత్రనీళ్లుచల్లించి ఘుమఘుమమగు వాసనగలుగునట్లు శ్రీగంధము చల్లించి పుష్పమాలికలంగట్టించి సువాసనమెల్లెడలనల్లుకొనునట్లు ధూపములను వేయింపుఁడు. లక్షబ్రాహ్మణులకైనను కొఱతలేకుండునట్లు వ్యంజనసహితముగను పెరుగుతోడను, పాలతోడను, ప్రశస్తమైనయన్నంబును సిద్ధము సేయింపుఁడు. రేపు ప్రాతఃకాలమునందు బ్రాహ్మణులను సత్కరించి యాయన్నముచే సంతర్పణ సేయుఁడు. వారలకు వారికి నేయి, పెరుగు, పేలాలు, దక్షిణ మొదలగువానినొసంగుఁడు. రేపు ప్రభాతకాలమున సూర్యుఁడుదయించినతోడనే స్వస్తివాచనము ప్రారంభింపఁబడును కావున బ్రాహ్మణులను పిలిపింపుఁడు. వారలకెల్లఱికిని యాసనములసిద్ధము సేయుఁడు. ఆయాస్థలములయందు ధ్వజములఁగట్టింపుఁడు. రాజమార్గములయందు చక్కగానీళ్ళుచల్లింపుఁడు.

నటులును, భోగమువారును చక్కగానలంకరించుకొని రాజగృహముయొక్క రెండవతొట్టికట్టునందు సిద్ధముగ నుండునట్లు సేయుఁడు. దేవాలయములందును, నాలుగు త్రోవలు కలియుమార్గములయందును భక్ష్యాదులతోగూడ నన్నమును దక్షిణలను పుష్పమాలికలను బ్రాహ్మణులకును దేవతలకును, ఇచ్చునట్లు నియమింపుఁడు. రాజభటులందఱును దీర్ఘమైనకత్తిని మొలనుబిగించుకొని కవచములనుధరించికొని పరిశుభ్రములగు వస్త్రములుగలిగి మహోదయమగు దశరథమహారాజుయొక్క ముంగిటియందు సిద్ధముగనుండునట్లు సేయుఁడు. అని సుమంత్రాదుల కాజ్ఞాపించిరి.

అంతస్థైర్యసంపన్నులగు వావసిష్ఠవామదేవులు కావలసినకార్యములను సిద్ధము చేసియుంచుఁడని మంత్రులతో చెప్పి శేషించినకార్యములనుఁగూడ దశరథమహారాజునకు దెలియఁజేసినెరవేర్చిరి. ఇట్లు వసిష్ఠవామదేవులు సకలకార్యములను సిద్ధము సేయించి మహాసంతోషయుక్తులై జగత్ప్రీతియగు దశరథమహారాజు యొద్దకుఁబోయి మీరు చెప్పినప్రకారమంతయు సిద్ధము చేయఁబడినదనిచెప్పిరి.

రాముని తనవద్దికి బిలుచుకొని రమ్మని దశరథుండాజ్ఞసేయుట.

అంతమిగులగాంతిగల దశరథమహారాజు సుమంత్రుని జూచి నీవిప్పుడుపోయి విద్యాభ్యాససంపన్నుఁడగు రాముని నతిత్వరితముగ బిలుచుకొనిరమ్మనిచెప్పె. ఇట్లు చెప్పినసుమంత్రుఁడు రాజాజ్ఞాప్రకారము తత్క్షణమునఁబోయి రథికశ్రేష్ఠుఁడగు రాముని రథముపైనెక్కించుకొని పిలుచుకొని మార్గంబునవచ్చుచుండె. అట్టియెడ దశరథమహారాజుయొక్క సభయందున్నపూర్వదేశపురాజులును, నుత్తరదేశపురాజులును, పశ్చిమదేశపురాజులును, దక్షిణదేశపురాజులును, మ్లేచ్ఛరాజులును, నరణ్యపర్వతప్రదేశములందునివసించు నాటవికులను మొదలగువారు "దేవేంద్రుని దేవతలు సేవించునట్లు" దశరథమహారాజును సేవించుచుండిరి.

ఇట్లు దేవతలమధ్యదేవేంద్రునివలెనుండు దశరథమహారాజు మేడపైనుండి రథంబునఁగూర్చుండివచ్చుచున్నరాముని జూచె. గంధర్వరాజువలెనుండువాఁడును, ప్రపంచమునందుప్రసిద్ధినొందిన పౌరుషముఁగలవాఁడును, దీర్ఘబాహుండును, విశేషబలముఁగలవాడును, మదపుటేనుగువలె నడచువాఁడును, చంద్రునివంటి సుందరమైనముఖముగలవాఁడును, చూడఁజూడసంతోషముగలిగించునట్టి యాకారముఁగలవాఁడును, రూపౌదార్యగుణములచే పురుషులయొక్క మనస్సును చూపులను నాకర్షించువాడును, ఎండతాపముచే దపించెడిజనులను సంతోషింపఁజేసెడిమేఘము వలెనున్నవాఁడును, రథముపైనెక్కి వచ్చుచున్నవాఁడును నగు రాముని దశరథుండు నెడతెగక చూచుచుండె.

ఇటుల నెడతెగక చూచుచుండినను ప్రేమరసము హెరుగుచుండుటచే తృప్తినొందదయ్యె. పిదప సుమంత్రుఁడు రాముని రథశ్రేష్ఠమునందుండిదింపె. అంత రాముఁడు దశరథమహారాజునొద్దకుఁబోవుచుండగ సుమంత్రుఁడంజలిబద్ధుఁడై యతని వెనుకను వెంబడించిపోయెను. పురుషోత్తముఁడగు నా రాముఁడు సుమంత్రుఁడు వెంబడించివచ్చుచుండగ కైలాసశిఖరమువలె మిగులయున్నతమై తెల్లగనుండుయా రాజగృహముపైకి నెక్కిపోయెను. ఇట్లు తండ్రియగు దశరథమహారాజునొద్దకుఁబోయి చేతులఁజోడించుకొని వినతుఁడై "రామవర్మా అహంభో అభివాదయే" అని తనపేరును చెప్పుకొనుచు

దండ్రిపాదములకు నమస్కరించె. ఇట్లు నమస్కరించి కృతాంజలిపుటుండై ప్రకర్షనిలువంబడియుండు ప్రియపుత్రుడైన రాముని దశరథమహారాజు చూచి తన చేతితో దగ్గిరికి దీసికొని కౌఁగిలించికొనెను.

—* దశరథుడు రామునితో బట్టాభిషేకము సేసెదనని చెప్పుట. *—

ఇట్లు కౌఁగిలించుకొని నా రామునకు నున్నతంబైనదియు నవరత్నముల చేతను బంగారము చేతను నలంకరింపఁబడినదియు, మనోహరమైనదియునగు పరమమైన యాసనమునందు కూర్చుండుమనియె. అంత రాముం డయ్యాసనమునఁ గూర్చుండి "ఉదయకాలమున మేరుపర్వతము హొందిన సూర్యుఁడు తన కాంతిచే నప్పర్వతమును బ్రకాశింపఁ జేయునట్లు" యయ్యాసనమును దన కాంతిచే బ్రకాశింపఁ జేసె.

మఱియు నా ప్రాసాదమునందు దశరథవసిష్ఠాదులతోఁ గూడిన రాముఁడు "శరదృతువునందు విమలములగు గ్రహనక్షత్రములతోఁ గూడిన ఆకాశమును చంద్రుఁడు ప్రకాశింపఁజేసినటుల" యా సభను ప్రకాశింపఁ జేసె. నరేంద్రుఁడగు దశరథమహారాజు "తాను సర్వభూషణాలంకారుఁడై యద్దంబునఁ దన ప్రతిబింబంబును బూచుకొని యెట్లు సంతోషించునో" అట్లు తనవలెనె నుండు ప్రియపుత్రుఁడైన రాముని జూచుచు సంతసించుచుండె. పిదప పుత్రులు గలవారిలో శ్రేష్ఠుండగు (అనగా శ్రేష్ఠుఁడగు పుత్రుఁడైన రామునిఁ గన్నవాఁడనుట) నా దశరథమహారాజు, చిఱునగవుతోఁ గూడి రామునిం బూచి రామా! యని పిలిచి యిట్లనియె.

—* దశరథుఁడు రామునకు నీతిని బోధించుట. *—

అనగా కాశ్యపుఁడు తన పుత్రుఁడగు దేవేంద్రునిం బిలిచి చెప్పినట్లు తన పుత్రుఁడగు రామునిం బిలిచి యిట్లని యెనని యెంచఁగునది. రామా! నీవు మిక్కిలి యుత్తమురాలగు నా జ్యేష్ఠభార్యయందు పుట్టిన మిగుల యుత్తముఁడవైన పుత్రుఁడవు. శ్రేష్ఠమైన గుణములు గలవాఁడవు. నాకుఁ బ్రియమైన పుత్రుఁడవు. నీవు నీ శ్రేష్ఠమైన గుణముల చే మమ్ములను, నీ ప్రజలను సంతోషింపఁ జేసినావు. కావున నీవు పుష్యమీనక్షత్ర దివసమునాఁడు యువరాజ్య పట్టాభిషేకము నొందుము. కుమారకా! రాముఁడా! నీవు స్వభావము చేతనే మిగుల వినయముగలవాఁడవు. గుణవంతుఁడవు. అట్లు నీవు గుణవంతుఁడవై యుండినను స్నేహంబువలన నీ హితముఁ గోరు నేను చెప్పవలసిన వాటిని జెప్పెద వినుము.

ఇప్పుడు నీకు కలిగియుండు వినయమును కన్న మఱింకను వినయమును నవలంబింపుము. ఎల్లప్పుడును జితేంద్రియుఁడవగుము. స్త్రీ, జూదము, వేట, మద్యము, కఠినపు మాటలు, క్రూరదండన, యొకర్షసద్రవ్యవ్యయము, వీనిని వదిలిపెట్టుము. ప్రత్యక్షముగ దర్శనంబివ్వకూడని కార్యములకు నీవు ప్రత్యక్షము గాక నితరుల వలనను, ప్రత్యక్షముగ దర్శనం బిచ్చి చేయదగిన కార్యములను ప్రత్యక్షుఁ బయ్యును, నెఱవేర్చుచుండుము. మంత్రులు సేనాధిపతులు మొదలగు బ్రజలకందఱకును సంతోషముగ గలిగించుచుండుము. లోకంబున నెవఁడు ధాన్యగృహములయందు ధాన్యములను, ఆయుధాగారముల యందాయుధములను ధనాగారాదులయందు ధనము మొదలగువానిని విశేషముగనుండునట్లు సంపాదించియుంచి జనులందఱు సంతోషించునట్లును జనులకు తనయందనురాగము విశేషముగ గలుగునట్లుగను, రాజ్యపరిపాలనము జేయునో యతనిఁ జూచి యతని మిత్రులు "అమృతమును జెందిన దేవతలవలె" సంతోషము నొందుదురు కావున నీవును మనస్థైర్యము నొంది యట్లు నడుచుకొనుమనియె.

—* ప్రజలు రామపట్టాభిషేకవార్త కౌసల్యతోఁ జెప్పుట. *—

ఇంతలో నా రామునకు మిగుల బ్రియులగు స్నేహితులు రామరాజ్య పట్టాభిషేకవార్తవిని యతిత్వరితముగఁ గౌసల్యవద్దికిఁ బోయి దేవీ! కౌసల్యా! మన రామునికి దశరథమహారాజు యువరాజపట్టాభిషేకము జేయుచున్నాఁడని తెలియఁ జెప్పిరి. అంత స్త్రీలలో మిగుల శ్రేష్ఠురాలగు నా కౌసల్య రామపట్టాభిషేకవార్త దెలిపిన నా రాముని స్నేహితులకు బంగారమును, గోవులను, నానావిధరత్నములను బహుమతిగా నిచ్చె.

పిదప రాముఁడు తండ్రియైన దశరథమహారాజునకు నమస్కరించి రథంబు నెక్కి ప్రజలసమూహముతో నెదుర్కొని పూజింపఁగ మిగుల కాంతిగల తన గృహమునకుఁ బోయె. పుర జనులును దశరథమహారాజువలన దమకిష్టలాభమైన రామాభిషేకవార్తవిని దశరథునితోఁ బోయి వచ్చెదమని చెప్పి త్వరితముగ దమ తమ యిండ్లకుఁ బోయి మహాసంతోషంబున రామ పట్టాభిషేకము నిర్విఘ్నముగ నెఱవేరుటకై తమ తమ యిష్టదైవములం బూజించిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి మూడవసర్గము ముగిసెను.

—* దశరథుఁడు రాముని మరల తన యంతఃపురమునకు బిలుచుకొనిరమ్మనుట. *—

ఇట్లు ప్రజలందరు తమ తమ యిండ్లకు బోయిన పిదప నిశ్చయజ్ఞుఁడును, ప్రభువుఁడునగు నా దశరథమహారాజు మఱల మంత్రులతోఁ గూడ నాలోచించి రేపే పుష్యమీనక్షత్రముగనుక నెఱ్ఱతామరపువ్వులవంటి నేత్రములు గలవాఁడును,

నాపుత్రుండగు రాముఁడు రేపే యువరాజ్యమునందు, అభిషేకింపఁబడుఁగాక యనినిశ్చయించి యంతఃపురమునకుఁబోయెను. ఇట్లంతఃపురమునకుఁబోయి సుమంత్రునింజూచి యిప్పుడే రాముని మఱలనిచటికి బిలుచుకొనిరమ్మనినసుమంత్రుండాతత్క్షణమున రాజాజ్ఞను శిరసావహించి యతిశీఘ్రంబున రామునిగృహమునకుఁబోయి ద్వారపాలకులతో సుమంత్రుండువచ్చియున్నాఁడని రామునకు తెలియఁజేయుండని చెప్పినవారలట్లు రామునిసమీపమునకుఁబోయి చెప్పిరి. అంతరాముఁడు ఓహో యిదియేమియాశ్చర్యము- ఇప్పుడే నేనువచ్చుచున్నానే! మఱలసుమంత్రుఁడువచ్చుటకు కారణంబేమో! అనిసందేహమునొంది సుమంత్రునిశీఘ్రముగ లోపలికిబిలుచుకొనిరండు, అనియాజ్ఞఁజేసె. ద్వారపాలకులు రామాజ్ఞాప్రకారము సుమంత్రునిలోపలికి బోనిచ్చిరి.

అంత రాముఁడు సుమంత్రునిఁజూచి సుమంత్రుఁడా! ఇప్పుడే నీవునన్నుఁబిలుచుకొనివచ్చి యిచటవిడిచిపెట్టిపోతివే! ఇంతలోనీవుమఱల నిచటికివచ్చుటకుఁ గారణమేమి? దానినంతయునాకు సవిస్తరముగఁ జెప్పుమనిన సుమంత్రుఁడిట్లనియె. వత్సా! రామా! దశరథమహారాజు నినుఁజూడవలయుననిపిలుచుకొనిరమ్మనెను. ఇంతకుమించినాకేమియుందెలియదు. దశరథమహారాజువద్దకుఁబోవుటకైనను లేకపోకుండనుండుటకైనను నీవుస్వతంత్రుఁడవు. ఇఁకనీచిత్తము. అనిసుమంత్రుఁడుచెప్పిన రాముఁడు తత్క్షణమునవెలువెడలి దశరథమహారాజగృహమునకుఁబోయిన ద్వారపాలకులచే దశరథుఁడు రాముఁడు ద్వారమునందువచ్చియుండు వార్తనువిని సంతోషాస్పదమగుశ్రేష్ఠమైనమాటను చెప్పుటకులోపలికి బిలిపించెను. అంతరాముఁడు తండ్రి గృహముప్రవేశించుచు దూరమునందుండియేనమస్కరించి యంజలీబద్ధుఁడైతండ్రియగుదశరథమహారాజునుజూచె. ఇట్లువచ్చినప్రియపుత్రుఁడగురాముని దశరథమహారాజు కౌఁగిలించుకొని మనోరమ్యమగు నాసనమునఁ గూర్చుండుమని నియమించి యిట్లనియె.

దశరథుఁడు రామునితో పట్టాభిషేక దీక్షవహింపుమని చెప్పుట.

ఓరాముఁడా! నేనుదీర్ఘాయువుగలిగి బహుకాలముప్రతికి మునలివాఁడనైతిని. నామనోభీష్టములగు కోరికలనెల్ల ననుభవించితిని. మఱియుమిక్కిలియన్నప్రదానంబుతోడనువిశేషమగు దక్షిణలతోడను ననేకపూర్ణ యాగములను జేసినాఁడను. నీవునాకుమిగులఁబ్రియుండవు. లోకమునందునీతోసమానుఁడొకఁడునులేఁడు అట్టినీవునాకుపుత్రుండవై పుట్టితివి. నేననేకదానములను జేసినాను. అనేకయజ్ఞములను జేసినాను. శాస్త్రనిషిద్ధములుగాని సుఖములన్నియు నాచేననుభవింపఁబడెను. యజ్ఞములనుజేసి దేవతలఋణమును, అధ్యయనము జేసిఋషులఋణమును, పుత్రులంగనిపితృఋణమును, వివిధదానములను జేసి బ్రాహ్మణఋణమును సర్వసుఖములననుభవించిశరీరఋణమును దీర్చుకొంటిని.

ఇప్పుడు నీకుపట్టాభిషేకము సేయుటందప్ప మఱేమియుఁజేయవలసినదిలేదు. కావున నేననీకేమిచెప్పుచున్నానో దానినినీవునాకొఱకై చేయవలయును. నిన్నిప్పుడురాజునుగాఁజేయుమని ప్రజలందఱుకోరుచున్నారు. కావున నీకుయువరాజ్యపట్టాభిషేకము జేసెదను. ఇవన్నియుఁగాక యిప్పుడు స్వప్నమునందు అశుభములైనను త్పాతములు గనుపడుచున్నవి- గొప్పధ్వనితోనాకాశమునందుండి పిడుగులతోగూడినమంటలులేని యగ్నిహోత్రములు భూమిపయింబడుచున్నవి- మఱియు నాజన్మనక్షత్రము భయంకరమైన సూర్యాంగారక రాహువులచే నాక్రమింపఁబడియున్నదని జ్యోతిష్కులు చెప్పుచున్నారు.

ఇట్టిదుశ్శకునములుపుట్టుటవలన ప్రాయేణ రాజునకు మృత్యువుగలుగును. అట్లుగాదేని భయంకరమైనయాపద సంభవించును. కావున నాకిప్పుడు కలిగియుండునాలోచన మారుటకుఁబూర్వమే నీవు యువరాజ్య పట్టాభిషిక్తుఁడవగుము. ప్రాణులబుద్ధిమిగుల చంచలములైనవి. కావున బుద్ధిమారుటకుముందే కార్యముఁజక్కఁబెట్టింపుము. నేటిదినముచంద్రుఁడు పుష్యమీనక్షత్రమునకు ముందుదైనపునర్వసునక్షత్రముం గూడియున్నాఁడు. యువరాజ్యపట్టాభిషేకమునకునిర్ణయింపఁబడిన పుష్యమీయోగము రేపటిదినము వచ్చునని జ్యోతిష్కులు చెప్పుచున్నారు. కావుననిప్పుడుపుష్యమీనక్షత్రమున నభిషిక్తుఁడవుగమ్ము. నామనసుమిగులనన్నుత్వరపెట్టుచున్నది. రేపుయువరాజ్య పట్టాభిషేకము జేసెదను.

ఓరాముఁడా! రేపేపట్టాభిషేకమగుటవలన నీవిదిమొదలుకొని నియతాత్ముఁడవై దర్భశయ్యయందు పండుకొనవలయును. భార్యతోగూడనీరాత్రి యుపవాసముండవలయును. ఇట్టిగొప్పకార్యములకు బహువిఘ్నములుసంభవించును కావున నీస్నేహితులుమిగుల జాగ్రతగలవారలై నిన్ను అనేకవిధముల రక్షింపవలయును. రాముఁడా! దూరదేశమునందుండెడు భరతుఁడెప్పటికి పట్టణమునకు రాకయుండునో అదివఱకే నీయొక్క పట్టాభిషేకమునకుఁదగిన కాలమనినాకుఁదోఁచుచున్నది. వినుము నీయొక్క తమ్ముఁడగుభరతుఁడు పెద్దలయాచారమునందున్నవాఁడేను. అన్నయైన

జ్ఞములను జేసినాను. శాస్త్రనిషిద్ధములుగాని సుఖములన్నియు నాచేననుభవింపబడెను.

యజ్ఞములను జేసి దేవతలఋణమును, అధ్యయనము జేసి ఋషులఋణమును, పుత్రులంగని పితృఋణమును, వివిధదానములను జేసి బ్రాహ్మణఋణమును సర్వసుఖముల ననుభవించి శరీరఋణము నుదీర్చుకొంటిని. నేనిపుడు నీకు పట్టాభిషేకము సేయుటం దప్ప మరేమియు జేయవలసినది లేదు. కావున నేను నీకేమి చెప్పుచున్నానో దానిని నీవు నాకొఱకై చేయవలయును. నిన్నిపుడు రాజును గా జేయుమని ప్రజలందఱు కోరుచున్నారు. కావున నీకు యువరాజ్యపట్టాభిషేకము జేసెదను. ఇవన్నియుంగాక యిపుడు స్వప్నమునందు అశుభములైన నుత్పాతములు గనుపడుచున్నవి. గొప్పధ్వనితో నాకాశమునందుండి పిడుగులతో గూడి కమంటలు లేనియగ్నిహూత్రములు భూమిపయిం బడుచున్నవి. మఱియు నాజన్మనక్షత్రము భయంకరమైన సూర్యాంగారకరాహువులచే నాక్రమింపంబడియున్నదని జ్యోతిష్కులు చెప్పుచున్నారు.

ఇట్టి దుశ్శకునములు పుట్టుటవలన ప్రాయేణ రాజునకు మృత్యువు గలుగును. అట్లుగాకేని భయంకరమైన యాపద సంభవించును. కావున నాకిపుడు కలిగియుండు నాలోచన మారుటకు ముందే నీవు యువరాజ్యపట్టాభిషిక్తుడవగుము. ప్రాణులబుద్ధి మిక్కిలి చంచలములైనవి. కావున బుద్ధి మారుటకు ముందే కార్యము నెఱవేర్పింపుము. నేటిదినము చంద్రుడు పుష్యమీనక్షత్రమునకు ముందుదైన పునర్వసునక్షత్రముం గూడియున్నాడు. యువరాజ్యపట్టాభిషేకమునకు నిర్ణయింపబడిన పుష్యమీయోగము రేపటిదినము వచ్చునని జ్యోతిష్కులు చెప్పుచున్నారు. కావున నీవు పుష్యమీనక్షత్రమున నభిషిక్తుడవు గమ్ము. నామనసు మిక్కిలి నన్ను త్వరజేయుచున్నది. రేపు యువరాజ్యపట్టాభిషేకము జేసెదను.

ఓరాముడా! రేపే పట్టాభిషేకమగుటవలన నీవిది మొదలుకొని నియతాత్ముడవై దర్భశయ్యయందు పండుకొనవలయు. భార్యతో గూడ నీరాత్రి యుపవాసముండవలయు. ఇట్టిగొప్పకార్యములకు బహువిఘ్నములు సంభవించును. కావున నీస్నేహితులు మిక్కిలి జాగ్రతగలవారలై నిన్ననేకవిధముల రక్షింపవలయు. రాముడా! దూరదేశమునందుండె భరతుం డెదివఱకే పట్టణమునకు రాకయుండునో; అదివఱకే నీయొక్క పట్టాభిషేకమునకు దగినకాలమని నాకు దోచుచున్నది. ఐనను నీయొక్క తమ్ముడగు భరతుడు పెద్దలయాచారమునందున్న వాడేను, అన్నవైన నిన్ను ననుసరించియుండువాడేను, ధర్మాత్ముండేను, దయాదాక్షిణ్యములుగలవాడేను, జితేంద్రియుడేను, ఇవ్విషయములయందు సందేహము నొందంబని లేదు.

"శ్లో॥ కింతు చిత్తం మనుష్యాణా మనిత్యమితి మే మతిః। సతాంతు ధర్మనిత్యానాం కృతశోభి చ రాఘవ॥" ఓరాముడా! మనుష్యులకు మనస్సు మిక్కిలి చంచలమైనది. ఇది నామహానిశ్చయము. సదాధర్మమునందే బుద్ధిగల పెద్దలు మాత్రము ప్రకారమును దప్పక దలంతురు కొంచమైన భేదబుద్ధి నొందరు. (సతాంతుధర్మనిత్యానాంకృతశోభి చ రాఘవ॥ అను వాక్యమునకు నెల్లప్పుడును ధర్మముం దప్పని సత్పురుషులు గూడ ముందుమించి జరుపబడినకార్యమునకు సంతసింపుదురనియు, జరుగబోవుకార్యమునకు వొప్పికొనరనియు నర్థమని కొందరందురు) అనుటచే పట్టాభిషేకమును భరతునకు గూడ సమ్మతి యుండదను నభిప్రాయముతో నిట్లు చెప్పెనని నెఱుంగునది. కావున రాముడా! పట్టాభిషేకము రేపే జరుగగలదు. అనియిట్లు దశరథమహారాజు చెప్పి సెలవొసంగిన రాముడు తండ్రికి నమస్కరించి తనయింటికిబోయెను.

—* రాముడు పట్టాభిషేకవార్త కౌసల్యకు చెప్పుటకు బోవుట *—

ఇట్లు రాముడు తనయింటికిబోయి తండ్రియగు దశరథమహారాజు చేయదలచియుండు తనపట్టాభిషేకకార్యమును తల్లియగు కౌసల్యాదేవితో జెప్పుటకు తత్క్షణమే బైలువెడలి తల్లివద్దికిబోయెను. అచట రాముడు దేవతాగృహమునందు ధ్యానముం జేయుచున్నదియును, పట్టువస్త్రమును ధరించియుండునదియును, మౌనవ్రతమునవలంబించియుండునదియును, రాజ్యలక్ష్మిని ప్రార్థించుచున్నదియు నగు తల్లియైన కౌసల్యను జూచె.

—* కౌసల్యసమీపమున రామలక్ష్మణసీతా సుమిత్రులు చేరుట. *—

రాముడచ్చోటికి వచ్చుటకు ముందే ప్రియమైన రామాభిషేకవార్తవిని కౌసల్యాగృహమునకు సుమిత్ర వచ్చెను. ఆసుమిత్ర వచ్చినపుడె లక్ష్మణుడును వచ్చెను. అంత చెలులంబంపి సీతను గూడ నచటికి బిలువించిరి. ఆసమయమున కౌ

గొలుచుచుండగ కండ్లుమూసికొని ధ్యానము సేయుచుండె ఆకౌసల్యాదేవి పుష్యమీనక్షత్రమున తనపుత్రునకు యువరాజ్యపట్టాభిషేకము జరుగుచున్నదని విని నిర్విఘ్నముగ నెరవేరుటకై ప్రాణాయామముచేత వేదమునందు చెప్పబడియుండు శ్రీమన్నారాయణమూర్తిని ధ్యానింపుచుండె.

ఇట్లు నియమమున నవలంబించియుండు తల్లియగు కౌసల్యాదేవివద్దికి రాముడు పోయి నమస్కరించి సంతోషముగలి

గింపుచునిట్లనియె. శ్లో॥ అంబపిత్రానియుక్తోస్మిప్రజాపాలనకర్మణి । భవితా శ్వోభిషేకో మే యథా మే శాసనం పితుః ॥ తల్లీ! ప్రజలనుపరిపాలింపుమని తండ్రిచే నేనాజ్ఞాపింపఁబడితిని. తండ్రిగారగు దశరథమహారాజాజ్ఞాప్రకారము రేపు పట్టాభిషేకము జరుగగలదు. కావున నేనును సీతయును నేటి దినము రాత్రి యుపవాసముండవలయునని తండ్రియగు దశరథమహారాజును, ఋత్విజులును నుపాధ్యాయులును నాతోఁ జెప్పిరి. తల్లీ! రేపు పట్టాభిషేకము జరుగుచున్నది కావున నేయేశుభకార్యములు చేయింపవలయునో నా కార్యములనెల్ల నాకును సీతకును నిపుడు చేయింపుమని చెప్పె.

కౌసల్య రాముని దీవించుట

ఇటు రాముఁడు చెప్పిన విని కౌసల్య కండ్లనీరునించి చూచి బహుదినములుగ దాను కోరుచుండిన రామపట్టాభిషేకవార్తవిని యానందబాష్పంబులొలుకుచు మనోహరముగ నిట్లనియె. వత్సా! రామా! నీవు చిరంజీవివికమ్ము. నీశత్రువులు సంహరింపఁబడుదురుగాక. నీవు రాజ్యలక్ష్మితోడం గూడి నాయొక్కయు సుమిత్రయొక్కయు బంధువులనందఱిని సంతోషింపఁజేయుము. పుత్రుఁడా! రామా! మిక్కిలి సంతోషము. నీవు శుభనక్షత్రమునందు నాగర్భంబున బుట్టితివి. కావున నే సకలసద్గుణములుగలిగి తండ్రియగు దశరథమహారాజును సంతోషపెట్టితివి. నేను పుష్కరేక్షణుండగు శ్రీమన్నారాయణుని వ్రతోపవాసాదులచే నారాధించినది సార్థకంబయ్యె. రామా! ఇక్ష్వాకువంశపు రాజులయొక్క రాజ్యలక్ష్మిని నీవిపుడు పొందగలవు. అని చెప్పిన రాముఁడు విని తనప్రక్కను యంజలిబద్ధుఁడై మిగుల యణుకువతో గూర్చుండియుండెడు తమ్ముఁడగు లక్ష్మణునింజూచి చిఱునగవుతోనిట్లనియె.

లక్ష్మణా! నీవు నాతోడగూడ నీరాజ్యమును బరిపాలింపుము. ఈరాజ్యలక్ష్మి నా రెండవ ప్రాణంబగు నిన్నునాశ్రయించియున్నది. లక్ష్మణా! నీవుకోరినపదార్థములను రాజ్యమునకు గలిగెడు ఫలములనున నుభవింపుము. నేను ప్రాణంబునుగాని, రాజ్యమునుగాని నీకొఱకె కోరుచున్నాను. ఇట్లు రాముఁడు లక్ష్మణునితోఁ జెప్పి తల్లులగు కౌసల్యాసుమిత్రులకు నమస్కరించి వారలయనుజ్ఞజెందిన సీతతోఁగూడ తన గృహమునకుఁ బోయె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నాలుగవసర్గము ముగిసెను.

వసిష్ఠుఁడు సీతను రాముని నుపవసింపఁజేయుట.

పిదప దశరథమహారాజు మఱునాడు పట్టాభిషేకము జరుగవలసినదగుటవలన రాముని సీతతోఁగూడ నుపవాసముండుమనినియమించి పురోహితుఁడగు వసిష్ఠుని పిలిపించి యిట్లనియె. ఓతపోధనుఁడవగు వసిష్ఠుఁడా! నీవిపుడు పోయి దృఢవ్రతుఁడగు రాముఁడు భార్యతోఁగూడ యశోరాజ్యసంపదలఁ బొందుటకొఱకు నుపవాసముండునట్లు చేయింపుమనియె. అంత వేదవిదాంవరుఁడును, మహాత్ముఁడును, మంత్రవేత్తయును, దృఢవ్రతుఁడునునగు వసిష్ఠమహర్షి తత్క్షణమున బ్రాహ్మణులకుఁదగిన రథశ్రేష్ఠమునందెక్కి రామునిసమంత్రకముగ నుపవసింపఁజేయుటకై తానే రామునియింటికిఁ బోయెను.

ఇట్లు పోయి మునిశ్రేష్ఠుఁడగు నవ్వసిష్ఠమహర్షి తెల్లని మేఘమునుబోలెనట్టియైన కాంతిగల రామునిగృహమును బొంది రథమునందుండియే మూడు తొట్టికట్లను దాటెను. అంత రాముఁడు వసిష్ఠమహర్షి వచ్చుటం జూచి యతనిని సత్కరించుటకై త్వరపడుచు గృహమునందుండి వెలువెడలి విద్వాంసుఁడగు వసిష్ఠమహర్షియొక్క రథమువద్దికిఁ బోయి తానే చేయిపట్టుకొని రథమునందుండి క్రిందికి దింపెను. పురోహితుఁడగు నవ్వసిష్ఠమహర్షియును, వినయసంపన్నుఁడును, ప్రియమగు మాటలం జెప్పుటకుఁ దగినవాఁడును, నగు రామునింజూచి క్షేమవార్తనడిగి ప్రసన్నముగలవానినిగాఁ జేసి సంతోషింపఁజేయుచు నిట్లనియె.

ఓరాముఁడా! నీతండ్రియగు దశరథమహారాజునకు నీయందనుగ్రహముగలిగి నీకు యువరాజపట్టాభిషేకము సేయుచున్నాఁడు. కావున నీవిపుడు సీతతోఁగూడ నుపవాసముండవలయును. నరేంద్రుఁడును నీతండ్రియునగు దశరథమహారాజు ప్రాతఃకాలమున "నహుషుఁడు యయాతివలె" నీయందు ప్రీతిచేత యువరాజ్యపట్టాభిషేకము సేయఁగలఁడు. ఇట్లు చెప్పి యవ్వసిష్ఠమహర్షి దృఢవ్రతుఁడగు రాముని చేతను, సీతచేతను, సమంత్రకముగ నుపవాసము చేయించెను. ఇట్లు చేయించి రాజగురువగు నవ్వసిష్ఠమహర్షి రామునిచే యథావిధిగఁ బూజింపఁబడి రాముని సమ్మతింపఁజేసి రాముని గృహమునందుండి వెలువెడలెను. పిదపఁ దనయింటియందు రాముఁడు ప్రియముగ మాటలాడెడు స్నేహితులతోఁగూడ కూర్చుని సంతోషింపఁజేయఁబడి యాస్నేహితులనుసమస్తవిధములనొప్పించి యంతఃపురముఁ బ్రవేశించె. అంత రామునియిల్లు సంతోషముతోనుండు పురుషులచేతను స్త్రీలచేతను నిండియుండుటచే "మదించినపక్షుల గుంపులును, మిక్కిలిచక్కగా వికసించిన తామరకమలములును, గలసరస్సువలె" ప్రకాశించెను.

అయోధ్యాపట్టణము మహోత్సాహముతో ప్రకాశించుట.

వసిష్ఠమహర్షి రాజగృహసమానంబగు నతిసుందరంబైన రామునియింటియందుండి వెలువెడలి మార్గంబంతయు జనులచే నిండియుండుటఁ జూచెను. అయ్యయోధ్యాపట్టణమునందలి రాజమార్గములు శ్రీరామపట్టాభిషేకము జూచుటకై వచ్చిన ప్రజలు గుంపులుగ నెచ్చటఁ జూచినను నిండియుండుటచే నామార్గంబున నడుచువారలకు మిగుల నిసకటముగనుండెను. మఱియు నా రాజమార్గములు జనులచే నిండి నిబిడీకృతముగనుండుటవలన వారలసమ్మర్దమువలనను, వారలసంతోషమువలనను గలిగినశబ్దము "సముద్రఘోషముంబోలె" యుండెను.

అయ్యయోధ్యాపట్టణమునందలి రాజమార్గంబులన్నియు నాటిపగటియందు చల్లగనుండునట్లు సర్వత్రనీళ్లుచల్లఁబడినవిగను, నానావిధాలంకారంబులుగలవిగను, అలంకారముకొఱ కరటిచెట్లు పోకచెట్లు మొదలగువానిచేఁ గట్టఁబడినవిగను, ప్రతియిల్లును ధ్వజములు గలవిగనునుండెను. అట్టియెడ నయోధ్యయందుండెడు స్త్రీలును, బాలురను, ముసలివారును, మొదలగుప్రజలందరు రామాభిషేకమును జూడవలయునను కోరికతో నిర్వ్యాపారులై యెప్పుడెప్పుడు తెల్లవారునని యెదురుచూచుచుండిరి.

మఱియు ప్రజాలంకారకారణమును, సకలజనానందవర్ధనంబును, నగునయ్యయోధ్యయందలి రామాభిషేకమహోత్సవమును జనులందఱుఁ జూడఁగోరియుండిరి. రాజపురోహితుఁడగు వసిష్ఠమహర్షి జనసమ్మర్దంబుగలిగియుండెడు రాజమార్గములనుఁ జూచుచు నాజనులగుంపును వేఱువేఱుగవిభజించువానివలె మెల్లమెల్లఁగఁబోయి దశరథమహారాజగృహముఁ జొచ్చె.

ఇట్లుప్రవేశించి తెల్లనిమేఘంబువలెను తెల్లనిపర్వతశిఖరమువలెనుండెడు రాజగృహముయొక్క మేడమీఁదికిఁ బోయి "బృహస్పతి నింద్రువొద్దకుఁబోవునట్లుల" దశరథమహారాజువద్దకేఁగెను. అంతదశరథమహారాజు సింహాసనంబుననుండి దిగ్గనదిగి వసిష్ఠమహర్షిం జూచి వసిష్ఠుఁడా! రాముని నుపవాసముండునట్లు చేయించితివా? యనియడిగె. వసిష్ఠుండును నట్లనే చేయించితినని చెప్పెను. దశరథమహారాజు వసిష్ఠమహర్షిని జూచి యతనిసత్కరించుటకై లేచినపుడే యాసభయందుండినవారందఱు నాసనంబులవిడిచినపుడే లేచిరి. దశరథమహారాజు గురువుచేననుజ్ఞ నొంది సభికులగుంపును వదిలి "సింహము పర్వతగుహం బ్రవేశించునట్లుల" అంతఃపురము బ్రవేశించె. మఱియు దశరథమహారాజు మి-

క్కిలిచక్కఁగా నలంకారముచేసికొనియుండు స్త్రీలచే నిండియుండునదియును, దేవేంద్రునిగృహముతో సమానంబైనదియును, నతిసుందరమును నగునగ్గృహమును "నక్షత్రసమూహముచే జుట్టఁబడిన చంద్రుఁడాకాశమును బ్రకాశింపఁజేయునట్లుల" బ్రకాశింపఁజేసె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నైదవసర్గము ముగిసెను.

శ్రీరాముఁడు నియమము నవలంబించుట.

పురోహితుఁడగు వసిష్ఠమహర్షి తనయిల్లువిడిచిపోయినతోడనే శ్రీరాముఁడు స్నానముచేసి నియతమానసుఁడై విశాలాక్షియగు భార్యయైన సీతతోఁగూడ నారాయణమూర్తిని నుపాసించెను. మఱియు యథాశాస్త్రముగ హవిస్సుయొక్క పాత్రను శిరస్సుచే గ్రహించి జ్వలించినయగ్నిహోత్రమునందు దేవతాశ్రేష్ఠుఁడగు నారాయణమూర్తికొఱకు నేతితో హోమముచేసెను. ఇట్లు హోమముచేయుఁగా మిగిలినహవిస్సును తానుభక్షించి తనయిష్టముఁ గోరుకొని సృష్టిస్థితిసంహారకారణుండగు నారాయణుని ధ్యానముసేయుచు నుత్కృష్టమగు నారాయణదేవాలయమునందు తానే దర్భలం బఱచుకొని సీతతోఁగూడ మౌనవ్రతుండును నిశ్చలంబగు మనస్సుగలవాఁడును నై పరుండెను.

ఇట్లుపరుండి తెల్లవారుటకొకయామముండునపుడే నిద్రలేచి యింటికి సమస్తాలంకారమును చేయించెను. పిదప రాముఁడు వంశావళులఁబొగడెడు సూతమాగధస్తుతిపాఠకులయొక్క శుభకరములైనమాటలను వినుచు ప్రాతఃకాలసంధ్యావందనముఁజేసి మనోనిగ్రహుండై గాయత్రీజపముఁజేసె. ఇట్లు గాయత్రీజపముఁజేసి మధుసూదనుఁడగు విష్ణుమూర్తిస్తోత్రముఁజేసి సాష్టాంగనమస్కార మొనర్చి మఱలస్నానముఁజేసి తెల్లనిపట్టువస్త్రమును ధరించికొని బ్రాహ్మణులచే బుణ్యాహవాచనము జెప్పించెను. అట్టియెడ పుణ్యాహము జెప్పెడి బ్రాహ్మణులయొక్క మధురంబగు నాపుణ్యాహఘోషమును వాద్యములయొక్క ధ్వనితోఁ గూడి యయోధ్యయంతయు శబ్దంబుతో నిండియుండెను.

అయోధ్యాపురినివాసులు మహోత్సాహము నొందుట.

అయోధ్యయందు నివసించెడిజనులందఱు రాముఁడు సీతతోఁగూడ యథావిధిగ నుపవాసవ్రతము చేసినవార్తవిని మిగులసంతోషించిరి. అంతనప్పట్టణమునందుండు జనులందఱు తెల్లవారుటంజూచి రామపట్టాభిషేకము జరుగఁబోవుచున్నదని యతిత్వరగ నరటిచెట్లు మొదలగువానిని దెచ్చిప

ట్టణంబునునలంకరించిరి. మఱియు తెల్లనిమేఘములతోను పర్వతశిఖరములతోను సరిసమానమైన దేవాలయములందును, నాలుగు త్రోవలుకలియుస్థానములందును, రాజమార్గములందును, బౌద్ధాలయములందును, యుద్ధనిమిత్తము ప్రాకారములమీదనకట్టబడియుండు మంటపములందును, విక్రయించుటకై తెచ్చినిండించిన నానావిధవస్తువులుగల వైశ్యులయొక్క అంగళ్ళయందును, గృహస్థులయొక్క సకలసంపత్సమృద్ధిమైనగృహములందును, సమస్తసభలయందును, ఉన్నతములగుచెట్లయందును రామపట్టాభిషేకమహోత్సవమని తెలియుటకుధ్వజములను, వివిధరంగులుగలపతాకములను పెద్దాకులను,(అనగా కొమ్ములులేకకొల్లు) ఎత్తిరి. అప్పటప్పటికిమహోత్సాహముచే గాయకులుపాడిరి. నటనర్తకులు నాట్యాదులను జేసిరి-అగానాదిధ్వనులుజనులకుమనఃకర్ణసుఖావహంబుగనుండుటచే మహాసంతోషముగ వినుచుండిరి.

రామపట్టాభిషేకసమయము సమీపించినతోడనేముంగిళులయందును, నిర్జనములను, జనులొకరికొకరు రామపట్టాభిషేక సంబంధములైనమాటలనే మాట్లాడుకొనుచుండిరి. ఇండ్లయొక్క వాకిళ్ళయందు గుంపులుగాగూడియాడుకొనుచుండు పిల్లవాండ్రుకూడ రామపట్టాభిషేకసంబంధములమాటలనే చెప్పుకొనుచుండిరి. రామపట్టాభిషేకముకొఱకునయోధ్యాపట్టణమునందుండుజనులు రాజమార్గంబులయందంతటను మనోహరముగనుండునట్లు పుష్పములనుజల్లి,గుభుభుమనుయుతి వాసనవచ్చునట్లు సుగంధిధూపములవేసి, మిగులచక్కగనలంకారముచేసి సంపత్కరముగనుండునట్లు చేసిరి

అప్పురజనులు రామపట్టాభిషేకను పూర్తిగానగుటకుముందె రాత్రివచ్చునేమోయనితలంచి ప్రకాశముగనుండునట్లు రాజమార్గంబులయందంతటను నానావిధములైన దీపస్తంభములను వృక్షములవలెనిర్మించిరి. ఇట్లయ్యయోధ్యయందుండెడి వారెల్లగును పట్టణంబును నలంకరించి రామపట్టాభిషేక ముహూర్తసమయమును నెదురుచూచుచుండిరి. మఱియుపట్టణమునందుండు ప్రజలందఱును ముంగిళులయందును కొలువుకూటములందును గుంపులు గుంపులుగగూడి పరస్పరముమాటలాడుకొనుచు ప్రభువగు దశరథమహారాజును నిట్లనిపొగడిరి.

ఓహో హో! ఈదశరథమహారాజుగుణముల నేమనివర్ణింపనగును? తనకువృద్ధత్వము సంప్రాప్తమైనదియాలోచించి రామునికిపట్టాభిషేకము చేయదలంచెను. కావునని క్ష్వాకువంశమునకు సంతోషముగలుగజేయదలంచిన నిమ్మహారాజుమిగులబుద్ధిమంతుడు. "శ్లో॥ సర్వే హ్యనుగృహీతాస్స్మయన్నో రామోమహీపతిః। చిరాయభవితాగోప్తాదృష్టలోకపరావరః॥ ప్రజలయొక్క మెచ్చుతకుపూర్వులనన్నటని జక్క గానెఱింగిన శ్రీరాముడు రాజుగా గాంగలండా? అనిమనముబహుదినములుగా గోరుచుంటిమిగదా? అట్టిరాముడికను మనకుప్రభువుగను రక్షకుడుగను కాంగలడు- కావునమనమందఱము భగవంతునినను గ్రహముబొందినవారమేనని యెన్నవలయును. రాముడు కొంచమైనను గర్వములేనివాడు. విద్వాంసుడు. ధర్మాత్ముడు. తమ్ములయందు మిగులప్రీతిగలవాడు. మఱియు తమ్ములయందెట్లు ప్రీతిగలవాడో, అట్లేమనయందునుమిగులప్రీతిగలవాడు. ఎవనియొక్క యనుగ్రహమువలన శ్రీరామునిపట్టాభిషేకము మనకుజూడగలిగెనో; అట్టిధర్మాత్ముడును పాపరహితుడునునగు నాదశరథమహారాజు చిరంజీవిగ బహుకాలము బ్రతికియుండుగాక- అనియిట్లు పుర జనులు మాటలాడుకొనుచుండుమాటలను,రామపట్టాభిషేకముజరుగుచున్నదను వృత్తాంతమును,విని నానాదేశములనుండివచ్చిన ప్రజలువినిరి.

మఱియు రామపట్టాభిషేకవార్తవిని యుమ్మహోత్సవమునుజూచుటకై నానాదేశంబులయందుండివచ్చినజనులుయయోధ్యాపట్టణమంతయు నిండియుండిరి. ఇట్లయ్యాయోధ్యా పట్టణమునకువచ్చుచుండు ప్రజలయొక్కగుంపులవలనంగలిగినధ్వని పర్వకాలములయం దతివేగముపొందియుండు సముద్రపుఘోషంబోలియుండెను- మఱియుదేవేంద్రుని గృహముతోసరియైన యయోధ్యాపట్టణము, రామపట్టాభిషేకము జూడవలయునను కోరికగలిగి వచ్చియుండు ప్రజలుచేసెడిధ్వనులచేతను, నాప్రజలుగుంపులుగుంపులుగ తిరుగుచుండుటవలనంగలిగిన యాకులంబుచేతను, జలజంతువులచే రొదజేయబడి యాకులంబువొందియుండు సముద్రోదకంబునుంబోలి ప్రకాశించుచుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యాఱవసర్గము ముగిసెను.

—* { మంధర మేడమీదనుండి పట్టణమునుజూచి రామపట్టాభిషేకవార్తవినుట. } *—

ఇట్లయోధ్యాపట్టణంబంతయు మహావిభవముగనుండగ దశరథమహారాజుయొక్క భార్యయైన కైకేయికి, పుట్టింటివారిచే దాసిగానివ్వబడినదియును, నేదేశమునందో జన్మించినదియును, నెప్పుడునుకైకేయి తోడగూడ నుండునదియునునగు, "మంధర" యనునది తానుమాత్రము చంద్రకాంతితో సమానముగ దెల్లగప్రకాశించుచును

డు మేడపైన స్వేచ్ఛగా నెక్కెను.

ఇట్లామంథర మేడపైనెక్కి చల్లగనుండునట్లు నీళ్ళచేత దుపబడిన రాజమార్గములుగలదియును, ఘుమఘుమయని వాసనగలుగునట్లుగ జల్లఁబడిన పుష్పములుగలదియును, నగునయ్యయోధ్యా పట్టణము నాలుగుతట్లును చక్కగాజూచెను, మఱియు నమ్మంథర శ్రేష్ఠములగు పతాకములచేతను, ధ్వజములచేతను, నలంకరింపఁబడినదియును, ప్రజలు స్వేచ్ఛగాబోవుటకై నిర్మింపఁబడిన యుద్దత్రోవలుగలదియును తలకుస్నానముచేసిన జనులచే జుట్టబడినదియును, చేతులయందు పుష్పమాలికలును మోదకములును (అనగా కుడుములు) గలబ్రాహ్మణోత్తములచే సర్వత్రధ్వనింపఁజేయఁబడినదియును, తెల్లగానుండు దేవాలయముల వాకిళులుగలదియును, సమస్తములైన వాద్యములఘోషలుగలదియును, మిగులసంతోషముఁబొందిన జనసమూహముచే నిండింపఁబడినదియును, సర్వత్ర వేదపారాయణధ్వనిచే ఘొల్లుమనిధ్వనింపఁజేయఁబడినదియును, మిగులసంతోషముగల నుత్తమములగు నేనుఁగులును గుఱ్ఱములుగలదియును, నధికముగసంతోషముచే సంభారవముజేయుచుండు వృషభరాజములు గలదియును, అత్యంతసంతోషము నొందియుండు, పురజనులచే నెత్తఁబడినధ్వజములపఙ్క్తి గలదియును, నగునయోధ్యాపట్టణమునుజూచెను.

ఇట్లమ్మంథర పట్టణమునంతయు జక్కగాజూచిసంతోషముచే వికసింపఁబడిన నేత్రములుగలదియును, తెల్లనిపట్టువస్త్రమును ధరించియుండునదియును, మిగులసమీపమునందున్నదియును నగుదాదినిజూచి యిట్లనియె

ఓతల్లీ! దాదీ! రామునియొక్కతల్లి (అనగా కౌసల్య యనుట) ధనముజేర్చిపెట్టుటయందు యాశగలదైనను, నిపుడు మిగులసంతోషముతోడఁగూడి ద్రవ్యమునువిశేషముగ జనులకిచ్చుచున్నది. ఎందుకు? ఈజనులయందెవ్వరినిజూచినప్పటికిని మహాసంతోషముతోఁ గూడియున్నారు, ఎందుకు? మహీపతియైన దశరథమహారాజు విశేషసంతోషమునొందినవాఁడైయేదైన గొప్పకార్యమును జేయబోవుచున్నాడా, యేమి? వీనినంతయునాకు సవిస్తరముగ జెప్పుమనియె, అంతనాదాదితనకు లోపలగలిగియుండు మహాసంతోషమువలన శరీరావయవము లుబ్బిపగుల్పఁబడునోయని యెన్నఁబడినదై గూనిదైన మంథరనుజూచి శ్రీరామపట్టాభిషేకవార్తనిట్లనిచెప్పఁదొడంగె.

ఓమంథరా! దశరథమహారాజు పుష్యనక్షత్రయుక్తముగు రేపటిదినమునందు జితక్రోధుడును, పాపరహితుఁడును, రఘువంశోద్భవుఁడును నగురామునకు యువరాజపట్టాభిషేకము సేయఁబోవుచున్నాఁడన్నది, అంతగూనిదియైనయమ్మంథర దాది చెప్పినమాటలవిని తత్క్షణంబున మహాకోపంబునొంది కైలాసశిఖరము వంటియాకారముగల నమ్మేడపైనుండి యతిశీఘ్రంబుగ క్రిందికిదిగెను, పాపిష్ఠురాలగు నమ్మంథరకోపానలముచే దహింపఁబడుచు కైకేయియొక్క శయనగృహమునకు బిరబిరబోయి కైకేయింజూచియిట్లనియె.

మంథర కైకేయితో రామునకు బట్టాభిషేకము జరుగుచున్నదని చెప్పుట.

ఓమూఢురాలా! లేలెమ్ము? ఎందుకింకను పరుండియున్నావు? నీకిపుడు మహాభయము సంభవింపఁబోవుచున్నది? నీకనేక దుఃఖములు గలగఁబోవుచున్నవే? వానిందెలిసికొనక నీవేలయూరకున్నావు? ఓ అనిష్టురాలా! కైకేయీ! నీవునిశ్చయముగఁ బెనిమిటికి ప్రియురాలవు. నీవే మోమహాభాగ్యముగలదానివలెఁ దలంచుకొనుచున్నావు. అదియునుగాక నిన్ను నీవేమహాభాగ్యురాలని పొగడుకొనుచున్నావు, ఇపుడునీభాగ్యంబంతయు" ఎండకాలమునందలియేటి ప్రవాహమువలె,, చలనమునొంది నశింపఁబోవుచున్నదనియె. అంతకైకేయివ్యసనాక్రాంతురాలును, పాపకార్యములఁజేయ గోరునదియును నగునమ్మంథర చెప్పిన మాటలనువినిమహాదుఃఖమునొంది యిట్లనియె.

మంథరా! నాకుక్లేశము గలుగదా? యేమి? నీవు విషణ్ణవదనురాలుగనుండుటచే మిగులవ్యసనము నొందియున్నావని తలఁచుచున్నాననియె. అంతమాటలాడుటయందు సమర్థురాలగుమంథరమరల మహాకోపంబు నొందినదియై మనోహరమగు కైకేయిమాటలనువిని యిట్లనియె

మఱియుకైకేయియొక్క హితమును గోరునట్టిదానిదైనయమ్మంథర పూర్వమునకన్న మిగులవ్యసనమునొంది వెక్కివెక్కియేడ్చుచు గన్నీరుధారాధారగబ్రవహింప కైకేయికివ్యసనమును రామునిపై విరోధమును గలిగించుటకై యిట్లనియె.

మంథర కైకేయికి దుర్బోధచేయుట.

దేవీ! కైకేయీ! ఇపుడుయెన్నటికిని బ్రతిలేనియొక కార్యము నిన్ను జెఱుపుటకై ప్రయత్నము జేయఁబడియున్నది. అదేమనినయంటివేని? దశరథమహారాజు రామునికియువరాజపట్టాభిషేకముసేయఁ బోవుచున్నాఁడు. నేనెల్లపుడునీహితమును గోరుదానను గావున నాకు రామపట్టాభిషేకవార్తవినినతోడనే యగాధంబైన మహాభయంబుగలిగె మహావ్యసనంబుచే బొటబొటగన్నీరు కారందొడంగె, దేహంబంతయునగ్నిహోత్రముచేదహింపఁ బడినట్లున్నది.

ఇట్టిబాధపడుచునీకు రాఁబోవుచున్నచెడుపును నివృత్తిజేయుటకైయిచ్చటికివచ్చితిని, ఓకైకేయీ! నీకువ్యసనముగలిగినేని నాకు రెండింతలు వ్యసనముగలుగును. నీకుహితముగలిగినేని నాకును హితముగలుగును. ఈవిషయమునందు సంశయింపఁబనిలేదు.

ఓదేవీ! కైకేయీ! నీవుమహారాజకులంబునం దుద్భవించితివి. దశరథభూవల్లభునకు శ్రేష్ఠమైనభార్యవు. ఇట్టిదానవైనను రాజులయొక్క క్రూరతలంపులు నీకేలతెలియదో? ఇదిమహాచిత్రము. నీభర్తయగుదశరథుఁడు ధర్మవాదియనుటయేకాని నిశ్చయముగ రహస్యముగ నపకారముసేయువాఁడు. మనోహరముగమాటలాడు వాఁడనుటయే కాని నిశ్చయముగ మహాక్రూరుఁడు. నీవుశుద్ధమైన స్వభావముగలదానవు. అనగాఁ గపటములేనిదానవు, కావున దశరథుఁడుచెప్పెడిదానినంతయు యథార్థమని నమ్ముచున్నావు. నిన్నతండు మోసముసేయుచున్నాఁడు. ఓకైకేయీ! నీభర్తయగు దశరథుఁడు నీవద్దికివచ్చినప్పుడు నిష్ప్రయోజనములను మృదువైనమాటలను జెప్పినీకుసంతోషమును గలిగించుచుండి యిపుడుకౌసల్యకే ప్రయోజనముతోడంగూడినకార్యమును సేయఁబోవుచున్నాఁడు.

మఱియు నాదుష్టాత్ముఁడగు దశరథుఁడు నీపుట్టింటికి భరతుని బంపివేసి ప్రాతఃకాలమునందు శత్రుబాధలేనిసమయముగఁజూచి రాజ్యమునందు రాముని స్థాపింపఁబోవుచున్నాఁడు (అనఁగా రామునకు రాజ్యపట్టాభిషేకము సేయఁబోవుచున్నాఁడు) ఓబాలా! కైకేయీ! పెనిమిటియనుగపటయుక్తుఁడగు దశరథుఁడు "తల్లిచే మేలుపొందువానివలె,, నీచేహితవుపొందఁగోరి నీతొడపైనలాలింపఁబడుచున్నాఁడు. నీవుదశరథుని సర్పరూపంబగు పెనిమిటియని తలంపక యథార్థమైనపెనిమిటియని దలంచి తొడపైనిడుకొనిలాలించుచున్నావు. సర్పముతన్నెన్నోవిధములపోషింపుచులాలింపుచుండినను గాపాడువారిని గఱచుచందమున నీభర్తనునీవునమ్మిలాలింపుచుండినను నీకుచెరుపుచేయఁదలంచియున్నాఁడు, కావునదశరథుని విషముతోఁ గూడినసర్పంబుగా నెఱుంగుము. లోకంబునసర్పంబును గానిశత్రువును గానిచంపక నుపేక్షించి రేనియేమికీడు సంభవించునో యదేప్రకారముగ నిపుడునీకును నీపుత్రునకునుదశరథుఁడా కీడునుసంభవింపంజేసెను. నిరంతరము సుఖముననుభవింపందగిన దానా! బాలా! (బాలాఅనగా నేమియు తెలియనిదానా అనుట.) కైకేయీ! పుత్రమిత్రబంధుజన పరివారముతోడంగూడిన నీవుపాపిష్ఠుఁడును, అసత్యములైన మనోహరమగు మాటలుగలవాఁడును రామునకుపట్టాభిషేకము సేయఁదలంచిన వాఁడును, నగుదశరథుఁడునిన్నుఁ నిశ్చయముగ జెఱుపఁబ్రయత్నించినాఁడు. చూచువారలకు మిగులనాశ్చర్యము గలిగించునట్టి కంఠముకల దానా! కైకేయీ! కావున నీవుఅతిశీఘ్రంబుగ నీకు మేలుగలుగునట్లుగఁ జేసికొనుము, పుత్రుని, నిన్నును, నన్నును, రక్షించుకొనుట కుపాయంబు వెదకుము.

— మంధరచే కైకేయి రామపట్టాభిషేకవార్తవిని మంధరకు హారమునుబహుమతిసేయుట. —

ఇట్లు మంథరచెప్పినమాటలను శయనించియున్న కైకేయిచక్కఁగావిని మహాసంతోషమునుబొంది "శరత్కాలమునందలి చంద్రరేఖవలె" తత్క్షణమున లేచికూర్చుండె. ఇట్లుకైకేయిలేచికూర్చుండి మిగులసంతోషమునొంది యత్యంతాశ్చర్యముతోఁగూడి గూనిదైనమంథరకు తాధరించియుండు గొప్పవెలగలహారంబునిచ్చె- యౌవనవంతురాండ్రలో మిగులనుత్తమురాలగు నా కైక గూనిదగుమంథరకట్లాభరణంబిచ్చి యాగూనిదానింజూచి యిట్లనియె.

ఓమంథరా! నీవునాకత్యంత సంతోషంబును గలిగించెడిమాటనుజెప్పితివి. కావుననీకొఱకు నేనింకేమి చేయుదునో దానింజెప్పుము- రామునియందైనను, భరతునియందైనను నేను భేదమెంచినదానను గాను- (అనగా రాముఁడును భరతుఁడును నాకిద్దఱునొక్కటియేయనుట) ప్రభువగు దశరథమహారాజు రామునకు పట్టాభిషేకము సేయఁబోవుచున్నాఁడని వినుటవలన మహాసంతోషము నొందితిని, ఓప్రియురాలా! మంథరా! నీవిపుడుచెప్పిన రామపట్టాభిషేకవార్తకంటె నాకుప్రియమైనదానినింకొకటినిజెప్పనేరవు. కాబట్టినాకుమహాప్రియమైన రామపట్టాభిషేకవార్తజెప్పితివి. కావుననీకు విశేషసంతోషమును గలిగించెడి శ్రేష్ఠమైనవస్తువు నింకొకటికోరుము- ఇచ్చెదను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేడవసర్గముగిసెను.

—* మంధర కైకేయికి దుష్టనీతినిబోధించుట. *—

ఇట్లుకైకేయిచెప్పిన మంథరమిగులనసూయనొంది కైకేయియిచ్చిన యాభరణమును విసరిపారవైచి తానెంత చెప్పినను వినలేదని మహాకోపమునొంది అయ్యయో, మహానర్థములు సంభవింపఁబోవుచున్నవేయనిపొటపొటకన్నీరుగార్చుచు కైకేయింజూచియిట్లనియె. కార్యాకార్యములు తెలియని యోమూఢురాలా! మహావ్యసనమును జెందవలసిన యియ్యకాలమునందు సంతోషమునొందుచున్నా

విదేషే! దుఃఖసముద్రమధ్యమున మునిఁగియున్ననిన్ను నీవే తెలిసికొనకున్నావు.

దేవీ! కైకేయీ! ఇప్పుడు నీవుమహావ్యసనమునుబొంది దుఃఖింపవలసియుండగా మహాసంతోషమునొందుచున్నావు- ఇట్టినిన్నుఁజూచి మహావ్యసనముచే పీడింపఁబడినదాననైనను, నిన్నుఁజూడగమనస్సులో నవ్వువచ్చుచున్నది. నీకిట్టిదుర్బుద్ధికలుగుటనుగూర్చి నేనుమిగులదుఃఖించుచున్నాను. మృత్యువుపకారమంటెడు సవతిపుత్రులకు నైశ్వర్యమభివృద్ధియగుచుండగ లోకంబునందు బుద్ధిమంతురాండ్రగు స్త్రీలలోనెవ్వతైనను సంతోషము నొందునా? (ఒందదు) రామునకుతనతో సమానముగ దొరతనము సంభవింపవలసినభరతునివలన మాత్రమేభయము గలుగును. కావునదాని నాలోచింపఁగా నాకుపట్టజాలని దుఃఖమువచ్చుచున్నది. భయము, భయపడినవాని వలననవశ్యముఁగబుట్టుచున్నదిగదా! మహాధనుర్ధరుడగు లక్ష్మణుఁడు రామునిసకల ప్రయత్నములచేతను ననుసరించియున్నాఁడు.

శత్రుఘ్నుఁడును "రాముని లక్ష్మణుఁడనుసరించి యుండెడుమాదిరి,, భరతునిసకలవిధ ప్రయత్నములచేతను ననుసరించియున్నాఁడు. ఓభామినీ! కైకేయీ! పుట్టుకయొక్క క్రమముచేగూడ భరతుఁడు లక్ష్మణశత్రుఘ్నులకంటె ముందుగబుట్టినవాఁడు. కావునభరతునకే రాజ్యప్రాప్త్యధికారముసన్నిహితమైయున్నది. లక్ష్మణశత్రుఘ్నులు కనిష్ఠులుగావున రాజ్యప్రాప్త్యధికారము లేదు. కాబట్టిరాముని గురించి భరతునకేభయముగలగవలసియున్నది. రాముఁడు మిగులబుద్ధిమంతుఁడు. క్షత్రియ ధర్మమగురాజనీతిని చక్కఁగనెఱింగిన పండితుఁడు. చేయవలసిన కార్యములను జక్కఁగానెఱింగి చేయువాఁడు. నీపుత్రుఁడైన భరతుఁడంతటి నేర్పరికాడు. కావున రామునివలననీ పుత్రునకుభయముఁగలుగునని తలంచి భయపడుచున్నాను. కౌసల్యా పుత్రుఁడైన రామునకు రేపుపుష్యమీనక్షత్రమున బ్రాహ్మణశ్రేష్ఠులచే యువరాజ్య పట్టాభిషేకము సేయఁబడును.

కాబట్టి యాకౌసల్యమహాభాగ్య సంపన్నురాలుకదా; మహాసంతోషయుక్తురాలును, ప్రసిద్ధురాలును, సవతులు మొదలగు శత్రువులజయించినదియును, నగుకౌసల్యకునీవు దాసివలె యంజలిబద్ధురాలవై సేవజేయవలసియున్నది. ఇట్లురామునకు రాజ్యపట్టాభిషేకంబయ్యెనేని మేమునునీవును, ఆకౌసల్యపరిచారకులమగుదుము- నీపుత్రుఁడైనభరతుఁడును రామునకుభృత్యుఁడుకావలయు. ఉత్తములైన రామునియొక్క స్త్రీలందరు మహాసంతోషము నొందుదురు. భరతుఁడుదరిద్రుఁడగుటవలన భరతునిభార్యలగు నీకోడండ్రు సంతోషము లేనివారలై యుందురు. అనిమిగుల వ్యసనమునొంది యనేకవిధములబోధించిన మంధరఁజూచి కైకేయి యామంధరమాటలను లక్ష్యపెట్టక రామునియొక్కగుణముల నిట్లనిపొగడఁదొడంగె.

—* కైకేయిరామునిగుణములను పొగడుట. *—

ఓమంధరా! రాముఁడుధర్మజ్ఞుఁడు- పెద్దలచేజితేంద్రియుఁడుగ జేయబడినవాఁడు- ఇతరులుచేసినయుపకారమును మెచ్చుగాదలచువాఁడు- సత్యసంధుఁడు, పరిశుద్ధుఁడు, దశరథమహారాజునకు జ్యేష్ఠపుత్రుఁడు. కావునరాముఁడే యువరాజ పట్టాభిషేకమునకుఁదగినవాఁడు. మఱియురాముఁడుదీర్ఘాయువుగలవాఁడు- సహోదరులను, పరిచారకులను "పుత్రులనుతండ్రి రక్షించుమాదిరి" కాపాడువాఁడు. ఓగూనిదానవైనమంధరా! ఇట్టి రామునిపట్టాభిషేకవార్తవిని సంతోషమునొందక యేలదుఃఖించెదవు. పురుషశ్రేష్ఠుఁడగుభరతుఁడును నూఱేండ్లకైనను రాముఁడు రాజ్యపరిపాలనము జేసినపిదప తండ్రితాతముత్తాతల తరమునుండివచ్చిన రాజ్యమును బొందగలఁడు- ఇదియథార్థము.

మంధరయొక్కదుష్టబుద్ధివదలునట్లు కైకేయి నీతినిబోధించుట.

ఓమంధరా! ఇప్పుడురామపట్టాభిషేకరూపమైన మంగళప్రదమగు కాలమువచ్చినది- ఇఁకముందుభరతపట్టాభిషేకరూపమైన మంగళప్రదమగు కాలమురాఁబోవుచున్నది. ఇటులనొకటివెనుకనొకటి శుభకరములగుకార్యములు జరుగుచుండగా నీవేలవ్యసనపడెదవు? నాకుభరతుండెట్లు బహూకరింపఁదగినవాఁడో? అట్లురాముఁడు రెండింతలు బహూకరింపఁదగినవాఁడు. ఆరాముఁడు కౌసల్యకుజేయుశుశ్రూషకంటెను నాకురెండింతలెచ్చుగా శుశ్రూష సేయుచున్నాఁడు. రామునకురాజ్యమువచ్చెనేని యప్పుడు భరతునకును రాజ్యమువచ్చినట్లేను- రాముఁడుతనట్లు చూచుకొనునో, అట్లేభేదబుద్ధిలేక తమ్ములనుగూడఁజూచుకొనుచున్నాఁడు- అనియిట్లుచెప్పిన కైకేయిమాటలనుమంధరవిని రెండింతలుదుఃఖమునొంది నిట్టూర్పువిడుచుచు కైకేయింజూచియిట్లనియె.

—* కైకేయికిమంధరమరల దుష్టబుద్ధినిబోధించుట. *—

అనర్థమును జూడఁగోరుచున్నదానా! కైకేయీ! నీవు మూర్ఖత్వమువలన భరతునకురాజ్యములేకుండుటచే గలిగెడుదుఃఖముచేతను, సవతికొడుకునకు రాజ్యంబువచ్చుటచేగలిగెడువిపత్తుచేతను దుఃఖించుచు మహాసముద్రంబున

మునుఁగఁబోవుచున్నావు- అట్టి నిన్ను నీవే తెలిసికొనకున్నావు. ఇప్పుడు రాముఁడు రాజ్యాధిపతియయ్యెనేని యతనికి వెనుక నతనికొడుకు రాజ్యాధిపతియగును- భరతుఁ డెన్నటికిని రాజుగా నేరఁడు- రాజవంశమునందు భరతుని పేరే చెప్పంబడదు.

"శ్లో॥ నహి రాజ్ఞస్సుతాస్సర్వే రాజ్యే తిష్ఠంతి భామిని। స్థాప్యమానేషు సర్వేషు సుమహాననయో భవేత్॥" ఓ భామినీ! కైకేయీ! లోకంబున రాజుయొక్క పుత్రులకందఱికి నిరాజ్యాధిపత్యము కలుగ నేరదు- అట్లు రాజపుత్రులందఱు రాజ్యమునకధిపతులైరేని న్యాయము నశించి మహానర్థము సంభవించును. ఓ, అనవద్యాంగీ! కైకేయీ! కావున రాజులు తమకు గుణవంతులగు పుత్రులనేకులుండినను జ్యేష్ఠునకే రాజ్యాధిపత్యంబిచ్చుచున్నారు. (వత్సలే) సాధారణమైనవారియందుగూడ దయగల కైకేయీ! నీయొక్క పుత్రుఁడైన భరతుఁడు, అనాథవలె సౌఖ్యమువలనను, రాజవంశపరంపరవలనను భంగమును బొంది మహాకష్టమనుభవింపఁబోవుచున్నాఁడు. నీయందు మిగుల ప్రీతిగలనేను నీకొఱకిచటికి వచ్చితిని- నీవు నీసవతికి సంపదభివృద్ధియగుచుండఁగ నీసమయమున నాకు బహుమానంబిచ్చునట్టి మాధురాలవగు నీవు మాత్రము నన్నెఱుంగకున్నావు- రాముఁడు శత్రునిశ్శేషంబగు రాజ్యమును బొంది, దేశాంతరమునకైనను, లోకాంతరమునకైనను పంపివేయును- భరతుఁడు చిన్నవాఁడుగానుండునప్పుడే మేనమామగృహమునకు బంపితివి- నిరంతరము సమీపమునందుండుటవలన స్థావరములగు వృక్షాదులయందును స్నేహము గలుగుచున్నది.

అట్లుండఁగ దశరథమహారాజునకు భరతునియందు ప్రీతితప్పిపోవునట్లు ముందు చేయఁబడెను- భరతుననుసరించియుండు శత్రుఘ్నుఁడును నతనితోఁ గూడఁబోయెను- లక్ష్మణుఁడు రామునాశ్రయించియున్నట్లు భరతుఁడు శత్రుఘ్నునాశ్రయించియుండువాఁడు కదా; (అనఁగా శత్రుఘ్నుఁడున్నను దగుప్రయత్నము సేయుననుట)

"శ్లో॥ శ్రూయతే హి ద్రుమః కశ్చిచ్ఛేత్తవ్యో వనజీవిభిః। సన్నికర్షాదిషీకాభి ర్మోచితః పరమాద్భయాత్॥" అరణ్యమునందుండు కష్టెలను నఱికి తెచ్చి విక్రయించి జీవించువారలు ముండ్లు మొదలగునవి చుట్టునుంగలచెట్టును నఱకఁ బ్రయత్నింపఁగ నాముండ్లు మొదలగునవి సన్నిధానమున నుండుటం జేసి యాచెట్టునకుఁ గలభయమును బోఁగొట్టి కాపాడినవని, నీవు వినియుండలేదా? అట్లనే సమీపమునుండిన ప్రీతిగలుగకమానదు- లక్ష్మణుఁడు రాముని రక్షింపఁగలఁడు- రాముఁడును లక్ష్మణుని రక్షింపఁగలఁడు.

ఇట్లు రామలక్ష్మణులకు "అశ్వినీదేవతలవలె" భ్రాతృసంబంధమైన స్నేహము మిక్కిలి కలిగియుండుట లోకప్రసిద్ధమయ్యెయున్నది- కావున రాముఁడు లక్ష్మణునకు కొంచమైనను చెఱుపు చేయఁడు- రాముఁడు భరతునకు మాత్రము తప్పక చెఱుపు చేయును- ఈవిషయమునందు సందేహము లేదు_ కాబట్టి నీపుత్రుఁడైన భరతుఁడు కేకయరాజుయొక్క యింటియందుండియే యడవికిఁ బోయియుండునట్లు సేయుము- ఇదియే నాకు మిగుల సరియైనమార్గముగా దోఁచుచున్నది- నీకును హితమైనదేను- ఇట్లు చేయనిచోఁ బ్రాణహాని సిద్ధముగ సంభవించును.

భరతుఁడు ధర్మముగ బితృసంబంధమయిన రాజ్యమునకధిపతియయ్యెనేని నీయొక్కయు బంధువులకును శ్రేయస్సు కలదు- సుఖము ననుభవించుటకుఁ దగిన నీపుత్రుఁడైన భరతుఁడు రామునకు సవతితల్లిపుత్రుఁడగుటవలన సహజమైన శత్రువు. నిరర్థకుఁడైన భరతుఁడు రాజ్యాధిపతియై సర్వాధికారము నొందియుండు రామునివశమునం దగులుకొని యెట్లు జీవింపఁగలఁడు- నీవు "అరణ్యమునందు సింహముచేదఱుమబడిన గజసమూహములను రక్షించుదానివలె" రామునివశంబునందగులుకొని మిణకరింపంబోవు భరతుని రక్షించుకొనుము. ముందు నీవు నేను మహాభాగ్యవంతురాలను, భర్తకు మిగుల ప్రియురాలను- అనిగర్వించి నీసవతియైన రామమాతయగు కౌసల్యను తిరస్కరించియున్నావు.

అట్లుండఁగ తనపుత్రుఁడైన రాముఁడు రాజ్యాధిపతియయ్యెనేని కౌసల్య తనవైరమును దీర్చుకొనకుండునా- నిన్ను దాసిగాఁ జేసికొని నానాశ్రమలం బెట్టుననుటకు సందేహము లేదు- భామినీ! కైకేయీ! ఎప్పుడైతే రాముఁడు నవరత్నములపర్వతములును నానావిధపట్టణములును గలరాజ్యమునకు ప్రభువగుచున్నాఁడో, అప్పుడే నీవు మిగుల దరిద్రురాలవై నీపుత్రుఁడగు భరతునితోఁ గూడ నవమానమును బొందఁగలవు. మఱియు రాముఁడు రాజ్యాధిపతియయ్యెనేని భరతుఁడు నాశము నొందఁగలఁడు- ఇది యథార్థము- కావున భరతుఁడు రాజ్యాధిపతియగుటకును, శత్రువగు రాముఁడీదేశమును వదలిపోవుటకును నిపుడే యుపాయమును వెదకుము.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనిమిదవసర్గము ముగిసెను.

కైకేయి రామునినడవికిఁ బోవునట్లు చేసెదనని చెప్పుట.

ఇట్లనేకవిధముల మంథర బోధించిన నంత కైకేయిమ

హాకోపమునొంది జ్వలించుచున్న నెత్తుటి ముఖముగలదియై నిట్టూర్పులువిడుచుచు మంథరను జూచి యిట్లనియె. నేనీతక్షణమున రాముని, గృహమునందుండి యడవికిఁబోవునట్లు చేసెదను. భరతుని నతిశీఘ్రముగ యావరాజ్యమునందు పట్టాభిషిక్తునిగ గావించెదను. మంథరా! భరతుఁడు యువరాజ పట్టాభిషేకము వొందవలయును. రామునకు రాజ్యములేకుండ నుండవలయును. ఈకార్యము లేయుపాయముచే నెరవేఱునో దానినిచక్కఁగ నాలోచించి చెప్పుమనెను. అంత పాపిష్ఠురాలగు మంథర కైకేయి చెప్పినమాటనువిని రామునియొక్క పట్టాభిషేకము జెఱుపుటకై కైకేయింజూచి యిట్లనియె. కైకేయీ! నాకు మహాసంతోషమును గలుగజేసితివి. నీపుత్త్రుఁడైనభరతుఁడుమాత్రము రాజ్యాధిపతిగ నెట్లగునో నయ్యుపాయము నిప్పుడే చెప్పెద. నీవు మిగులశ్రద్ధతో వినుము. కైకేయీ నీనిమిత్తమైన ప్రయోజనముకొఱకునుపాయమునావలననే తెలిసికొనగోరుచున్నావు. ఇందుకు కారణంబేమి? నీకయ్యుపాయము జ్ఞాపకమునకు వచ్చినను దాచిపెట్టుచున్నావా యేమి? లేక జ్ఞప్తికి రానేలేదా యేమి? ఓవిలాసినీ! కైకేయీ! అట్లుపాయమును నేనే చెప్పవలయునని కోరికయుండెనేని చెప్పెదనువినుమనెను. అంతఁ గైకేయి మంథరయొక్క మాటలను వినినమాత్రముననే మెత్తగా బఱపఁబడిన పడకనుండి కొంచెములేచి కూర్చుండి మంథరను జూచియిట్లనియె.

మంథరా! భరతుఁడు రాజ్యాధిపతియగుటకును, రామునకు రాజ్యప్రాప్తి లేకుండుటకును వీటికి యుపాయమును నీవేనాకు జెప్పవలయుననిన పాపిష్ఠురాలగు గూనిదైన మంథరరాణియగు కైకేయి చెప్పినమాటలనువిని రామునియొక్క ప్రయోజనమును భంగముజేయుటకై యిట్లనియె. దేవీ! కైకేయీ! ముందు దేవతలకునున సురులకును జరిగిన యుద్ధమునందు నీభర్తయగు దశరథమహారాజు దేవేంద్రునకు సహాయముసేయుటకై రాజులతోడను ఋషులతోడను నిన్నుగూడ పిలుచుకొని దండకారణ్యముఁ బ్రవేశించి దక్షిణదిశంగూర్చిపోయితిమి ధ్వజుఁడగు శంబరాసురుఁడను రాక్షసునియొక్క వైజయంతియను పట్టణమునం బ్రవేశించెనుగదా? అట్లు ప్రవేశింపగ నచట నానావిధమాయోపాయంబులం జేయదగిన శంబరాసురుఁడను రాక్షసుఁడు దేవతలనందఱనుదఱిమి వారలజయించియింద్రునితో యుద్ధంబుజేయుచుండె. అట్టియెడ దేవేంద్రునకు సహాయముగాబోయిన దశరథమహారాజును నతనిసైన్యమును నింద్రునకు సహాయముగ నారాక్షసునితో బగలంతయు యుద్ధముజేసిరి. అంత నస్తమయంబైన సైన్యంబంతయు ఖడ్గములచేతను బాణములచేతను దెబ్బలుతిని యలసి నిద్రించె. అట్లుసైన్యంబంతయు నిద్రించుచున్న నారాత్రికాలమునందు రాక్షసులు పఱతెత్తివచ్చి సైన్యంబునంతయు నఱికివేసిరి. అంత దశరథమహారాజు నారాక్షసులతో మహాద్యుద్ధంబుజేసె. అయ్యుద్ధమునందు దశరథునకు నీవు సారథ్యము సేయుచుంటివి. పిదప దశరథమహారాజాయుద్ధమునందు రాక్షసులచే దేహంబంతయు తునకలగునట్లుగ గొట్టఁబడి మూర్ఛిల్లెను.

ఓదేవీ! కైకేయీ! ఇట్లుమూర్ఛనొందిన నీపెనిమిటని సారథ్యంబుసేయుచున్న నీవుజూచి యుద్ధభూమినివదలి యవతలికిందీసికొనిపోయి యొకరహస్యస్థానమున శైత్యోపచారములనుజేసి రక్షించితివి. అట్టిరహస్యస్థానమునకుఁగూడ యాయసురులుబరుగెత్తివచ్చి దశరథమహారాజును ననేకాయుధములచే గాయములగునట్లు గొట్టిరి. నీవు సమర్థురాలగుటవలన నప్పుడుగూడ దశరథునిమఱియొకచోటికి దీసికొనిపోయి కాపాడితివి. శుభదర్శినీ! కైకేయీ! అట్టియెడ దశరథమహారాజు నీవు రెండుపర్యాయములు కాపాడినందుకు మహాసంతోషమునొంది నిన్నుజూచి. నామనోహరీ! నీవురెండుమారులు నా కుపకారము జేసినందుకునేను మిగుల సంతసించితిని. కావున నీకు రెండువరముల నిచ్చెదగోరుమనెను. అంతనీవు దశరథునిజూచి. ప్రాణనాథా! నీవిపుడిచ్చెదనని చెప్పిన రెండువరములను నేనెపుడు కోరుచున్నానో నాకప్పుడివ్వవలయుననినను మహాత్ముఁడగు దశరథుఁడునునట్లే కానిమ్మనియె. దేవీ! కైకేయీ! ఇవ్వన్నియు నేను చూచియుండలేదు. పూర్వము నీవేనాకీవృత్తాంతమంతయు జెప్పియున్నావుకదా? నేను నీకతిప్రియురాల నగుటచే నావృత్తాంతమును మనస్సులోనే పెట్టుకొనియున్నాను. కాబట్టి యావరములు రెండును నీకిపు డుపయోగించును. ఇపుడు నీవుదశరథుని బలాత్కారముజేసి రామునియొక్క పట్టాభిషేక ప్రయత్నమును నిలుపఁదలజేయుము. నీకివ్వవలసిన రెండువరములలో భరతునకు బట్టాభిషేకము సేయవలసిన దొకవరమును, పదునాలుగేండ్లు రాముని వనవాసమునకు బంపవలసినదొకవరమును. నీరెండువరములను గోరుము. అట్లు రాముఁడు పదునాలుగు సంవత్సరము లరణ్యవాసము జేసెనేని యాకాలంబున రాజ్యాధిపతిగనుండు భరతుని యందు ప్రజలకు దృఢమైనప్రీతికలుగును. పిదప రాముఁడువచ్చినను నతనియందు ప్రీతిగలుగదు. కావున భరతుఁడెప్పటికిని స్థిరముగ రాజ్యపరిపాలనముసేయును. ఓఅశ్వపతిపుత్త్రీ! కై

కేయీ! నీవిపుడు క్రోధాగారంబునకుబోయి (అనగా స్త్రీలకుగోపమువచ్చినప్పుడునివసించుయిల్లు) మహాకోపమునొందిన దానివలె మాసినవస్త్రముల ధరించుకొని భూమిమీదపండుకొనియుండుము. అట్లుండగ నీవద్దికిదశరథమహారాజువచ్చును. అప్పుడునీవుశిరంబెత్తిచూడకుము. మాటలాడకుము. నీవుదశరథమహారాజును జూచినతోడనేభూమిమీదపడిపొర్లి మహావ్యసనముతోనేడ్వుము. నీవు నీభర్తకుసదా ప్రియురాలవు. నీవేమికోరిననది యిచ్చుటకు సిద్ధుఁడైయుండును. ఇందుకుసందేహము నొందబనిలేదు. అమ్మహారాజగుదశరథుడు నీవుకోరితివేని యగ్నిహోత్రమునందు గూడ ప్రవేశించును. దశరథమహారాజు నీపైఁగోపంబుజేయుటకు మహాభయంబునొందును. నీవు కోపంబునొందియుంటివేని నిన్నుజూచుటకుగూడ భయపడును. మఱియు నీయొక్క సంతోషనిమిత్తము ప్రాణములనైనను విడిచిపెట్టును. మహీపతియగు దశరథుఁడు నీయొక్కమాటనుజవదాటనేరడు. ఓమందమైనస్వభావముకలదానా! కైకేయీ! నీయొక్కసౌందర్యబలమును నీవు చక్కగాతెలిసికొంటివేనీవుకోరిన కోరికలనీడేర్చుకొనగలవని యెఱుంగగలవు. నీవు కోపంబునొంది ముష్కరంబుగనుంటివేని దశరథమహారాజు నీకు నానావిధరత్నములను ముత్యములను బంగారమునునీకిచ్చును. దానియందునీవు కొంచమైనను ఆశయుంచకుము. మహాభాగురాలా! కైకేయీ! దేవాసురయుద్ధమునందు దశరథుఁడు నీకిచ్చినట్టివరములను నమ్మహారాజునకుజ్ఞాపకమునకు వచ్చునట్లుచేయుము. మఱియు నీకార్యముఁజెడిపోకుండునట్లుగఁ బ్రయత్నముసేయుము. దశరథుఁడునీవు కోరినవరంబిచ్చెదనని నిన్నులేవికూర్చుండబెట్టెనేని అట్టియెడ యాదశరథమహారాజును సత్యమునందు నిలుచునట్లుగజేసి నేచెప్పెడురెండువరంబులనడుగుము. రాముఁడుపదునాలుగేండ్లు యరణ్యవాసముసేయునట్లును, భరతుఁడు రాజ్యాధిపతియై రాజశ్రేష్ఠుఁడుగనుండునట్లును నీరెండువరముల నడుగుము. రాముఁడు పదునాలుగుసంవత్సరము లరణ్యవాసముసేయునట్లు చేయఁబడినతోడనే నీపుత్రుఁడు రాజ్యమునందు స్థిరముగానిలిచి మూలబలమును స్వాధీనముజేసికొని రాముఁడు మఱలవచ్చినను తానే రాజ్యాధిపతియై తక్కినకాలంబును రాజ్యపరిపాలనము జేయుచుండును. దేవీ! కైకేయీ! నీవుభరతుఁడుపట్టాభిషిక్తుఁడు గావలయునని వరముగోరునపుడు మఱవకరామునినరణ్యమునకును బంపవలయునని గూడవరమునడుగుము. ఇట్లుచేసితివేని నీయొక్కపుత్రునకు సమస్తకార్యములును జేకూరును. మఱియురాముఁడరణ్యవాసము సేయునట్లుచేయఁబడెనేని ప్రజలకును నతనికిని సంబంధము దప్పిపోవుటచే బ్రజలకతనియందను రాగముండదు. రాముఁడు మఱలవచ్చినను నొంటరివాడుగనే యుండఁగలఁడు. నీయొక్కపుత్రుఁడైన భరతుఁడు జయింపఁబడిన శత్రువులుగలవాఁడై రాజ్యాధిపతిఁగాఁగలఁడు. రాముఁడుపదునాలుగుసంవత్సరము లరణ్యవాసముసేసిమఱలివచ్చుటకు లోపల, బుద్ధిశాలియైననీపుత్రుఁడు ప్రజలనువశపఱచుకొని స్నేహితులతోడంగూడి స్థిరముగారాజ్యాధిపతియై యుండఁగలఁడు. నీవుభయంబువదలి దశరథమహారాజును బలాత్కారముజేసి రామపట్టాభిషేక ప్రయత్నమును నిలుపుదలజేయుము అట్లుజేయుట కిదియేసమయమని చెప్పెను. అంత కైకేయి యామంధరచేతఁ దనకు విరోధమైనకార్యమును అనుకూలమైనకార్యముగ బోధింపఁబడి మహాసంతోషము నొంది మంధరనుజూచి యిట్లనెను.

—* దుర్బోధనజేసినమంధరను కైకేయిపొగడుట. *—

సర్వోత్కృష్టమైన దృష్టిగల యాకైకేయి గూనిదగు మంధరయొక్క మాటలకు మిగులనాశ్చర్యమునొంది త్రోవదప్పిన యాడుగుఱ్ఱమువలెఁ బట్టగూడనిదై మహావేశముతో మంధరనుజూచి గూనిదానవైనమంధరా! నిన్ను శ్రేష్ఠమైనమాటల జెప్పుదానిగను, శ్రేష్ఠురాలుగను, నిదివఱకెఱుంగను. ఈలోకంబునంగల గూనివారలలోపల బుద్ధినిశ్చయమందు నీవుమిగులనుత్తమురాలవు. నీవుమాత్రమునాయొక్కవిషయమునందు సదాప్రీతిగల దానవుగను, హితమునుగోరుదానవుగను నున్నావు.

ఓగూనిదానవగుమంధరా! దశరథమహారాజు రామపట్టాభిషేకముజేసి నన్నుజెఱుపఁబ్రయత్నించినదాని నేనెఱుంగనైతిని. ఈప్రపంచమున చెడిపోయిన యవయవములుగలవారును, వంకరైన దేహముగలవారును, మిగులభయంకరమైనవారునునగు గూనివారలనేకులుగలరు. ప్రియదర్శనురాలవగు నీవుమాత్రము వాయువుచేవంగిన తామరపుష్పంబువలె వంగియున్నావు. (అనగాగాలిచే కమలము వంగియున్నను నెట్లుసొగసుగానుండునో అదేరీతిగగూనిగలిగియుండినను మహాసుందరముగనున్నావనుట) మంధరా! నీయొక్క రొమ్ముపట్టుకలిగి మూపులవరకు పొడుగుగానున్నది. దాసి క్రిందనుండు సుందరమైనబొడ్డుగలకడుపు నారొమ్మంత పొడుగుగలిగియున్నది. నాకంతపొడుగులేనందున లజ్జజెందెనోయనునట్లు సన్నముగానున్నది. నీమొల విశాలముగానున్నది. నీకుచములుమిక్కిలిబలిసియున్నవి. నీముఖముకళంకములేని చంద్రునితోసమానముగనున్నది. నీవు మహాశోభాయమానముగ నత్యాశ్చర్యముగ బ్రకాశించుచు

న్నావు. నీయొక్కమొల, మొలనూలిచేనలంకరింపఁబడి ధ్వనింపఁబడుచున్నది. నీయొక్కపిక్కలు మిక్కిలిచక్కగాసుందరములుగనున్నవి. నీపాదములు రెండునునిడుపుగానున్నవి.

మంధరా! నీవునిడుపైనతొడలతోగూడి తెల్లనిపట్టువస్త్రముధరించుకొని తిరుగుచుండుటచే రాజహంసివలెబ్రకాశించుచున్నావు. రాక్షసాధిపుఁడగు శంబరాసురునియందు వేలువేలుగ నేటిమాయలుగలిగియుండెనో యమ్మాయలన్నియు నీయందు రెండింతలై కోట్లుకోట్లుగగలిగియున్నవి. రథముయొక్కసమీపమున నెత్తుగానుండుప్రదేశమువలె నిండానిడుపుగానుండు నీయొక్కగూనులో నీకుగలబుద్ధులును, నీవెఱింగినరాజనీతులును, నీకుగలయనేకమాయలునునివసించియుండునట్లుదలంచుచున్నాను.

ఓగూనిదానవైనమంధరా! భరతుఁడుపట్టాభిషిక్తుఁడైనతోడనే, రాముఁడునరణ్యమునకుఁ బోయినతత్క్షణంబుననే, నీగూనునందు బంగారుహారమునువేసెదను. మఱియును నాకార్యము నెఱవేరినతోడనే మహాసంతోషమునొంది చక్కగాపురమువేసిన బంగారముతో నీగూనుకుకవచమును జేయించివేసెదను. ఓగూనిదానవైనమంధరా! నీయొక్కముఖమునకు నానావిధరత్నములుచెక్కఁబడిన తిలకమును జేయించియలంకరించెదను. మఱియుబంగారముతో జేయఁబడిన మంగళకరములగు మంచియాభరణముల నిచ్చెదను. మఱియునీవు మిగులవెలగలశ్రేష్ఠములైన వస్త్రములనుధరించుకొని దేవతవలెసంచరింపఁగలవు లోకంబునసాటిలేనిముఖముగలనీవు చంద్రునిపరిహసించునట్టి ముఖముగలిగి నాశత్రుజనంబులంజూచి మహాగర్వంబుతో సుందరంబైన నడకగలిగిసంచరింపఁగలవు. ఓమంధరా! నీవెల్లవుడునన్నెట్లుసేవింపుచున్నావో; అట్లేనీకునుసమస్తాభరణభూషితులగు ననేకమందిగూనివాండ్లు నీపాదములకు సేవజేయఁగలరనిచెప్పెను.

ఇట్లుమంధర కైకేయిచేఁబొగడఁబడి తెల్లనిపాన్పునందుపరుండియుండునదియును, "వేదియందలియగ్నిజ్వాలవలె" జ్వలింపుచుండునదియును, నగుకైకేయింజూచియిట్లనియె. మంగళకరురాలవైన యోకైకేయీ! నీళ్ళుస్నియుపోయినపిమ్మట గట్టగట్టుటవలన నేమిప్రయోజనము. కల్యాణీ! నీవీతత్క్షణంబునలేచిపోయి కోపాగారంబునబ్రవేశించిరాజురాకకు నెదురుచూచుచుండుము. వృథామాటలవలనంబ్రయోజనములేదు. అనియిట్లుగూనిదగుమంధర చెప్పిన విశాలాక్షియును, సౌందర్యమదముచే గర్వమునొందియుండునదియును, నుత్తమస్త్రీయును, రాణియునునగు కైకేయి తత్క్షణమునశైలువెడలి మంధరతోడంగూడకోపగృహమునకుబోయి యనేకలక్షలక్రయముఁగల ముత్యాలహారమును, ఉత్తమములును శుభంబులునునగు ననేకాభరణములనుదీసిపారవైచి బంగారువిగ్రహము బోలెఁగలదై (అనగానాభరణము లేమియులేనందున శుద్ధబంగారువిగ్రహమువలెనుండెననుట) యాకోపగృహమున భూమియందుపరుండి మంధరనుజూచి యిట్లనియె.

ఓగూనిదానా! మంధరా! నాకార్యసిద్ధికాకపోయెనేని నన్నిచటనే చచ్చినదానిగానెఱింగి యావార్తదశరథునకైనను నాతండ్రియైనకేకయరాజునకైనను దెలియజేయఁగలవు అట్లుకాదేని రాముఁడడవికిబోవలయును భరతుఁడుపట్టాభిషిక్తుఁడుకావలయును. నాకుదశరథమహారాజు బంగారంబిచ్చినను, ననేకరత్నంబులనిచ్చినను ననేకాభరణంబులనిచ్చినను నేనుబుచ్చుకొనుటలేదు. రామునకుమాత్రముపట్టాభిషేకమయ్యెనేని యిదియేనాకంత్యకాలమని యెఱుఁగుము. అనియిట్లుభరతునితల్లి యగుకైకేయిచెప్పిన, మహాక్రూరములగు మాటలనుజెప్పునట్టి గూనిదగుమంధర దశరథమహారాజుయొక్క యుత్తమభార్యయగు కైకేయింజూచికైకేయికి హితవుగానుండునట్టియు రామునకుగీడుకలుగునట్టియు వాక్యములతో నిట్లనియె. కల్యాణీ! కైకేయీ! రాముఁడీరాజ్యమునకు బ్రభువయ్యెనేని నీవునునీపుత్రుఁడగు భరతుఁడును మిగులవ్యసనముబొందెదరు. ఇదినిశ్చయముగదా? కావుననీకొడుకునకు ప్రభుత్వముగలుగునట్లు ప్రయత్నింపుము. అనియిట్లుచెప్పిన గూనిదగుమంధరయొక్కబాణములవంటిక్రూరములగు మాటలకులోబడి రాణియగుకైకేయి దశరథుఁడు మోసముజేయుదలంచెగదా? యనియాశ్చర్యమునొంది ఱొమ్మునచేతులనిడుకొని కోపాక్రాంతురాలై మంధరనుజూచి యిట్లనియె.

ఓగూనిదానా! మంధరా! నేనీకోపగృహమునందే చనిపోయిననావార్తనైనను దశరథమహారాజునకు దెలుపఁగలవు. కాదేనిబహుకాలము రాముండడవియందు సంచరింపుచుండఁగ భరతుఁడుశాశ్వతైశ్వర్యంబునొంది సుఖముఁగ రాజ్యపరిపాలనము జేయుటనైననుజూడఁగలవు. ఈరెండింటిలోనేదైనను జరుగుటనిశ్చయము. ఇచటనుండిరాముండడవికిబోడేని నేనుపఱపులయందుపరుండను, పుష్పమాలికలనుధరింపను, చందనమునుబూసికొనను, అభ్యంజనముజేసికొనను, అన్నపానాద్యాహారముల బుచ్చుకొనను, మఱియునేవస్తువులును నాకక్కఱలేదు. ప్రాణములనుసహా వదిలిపెట్టెదను, అనియిట్లుకైకేయి మంధరతోమహాభయంకరమగుప్రతిజ్ఞఁజేసి సకలాభరణములను దీసిపారవైచి వట్టినేలయందు "పుణ్యంబంతయు నశించిపోయినపిదప నా

కాశమునుండి నేలపైబడిన కిన్నరస్త్రీవలె" పరుండియుండెను.

అట్టియెడనన్నరేంద్రపత్నియగు కైకేయి యుద్రేకించిన కోపంబను నంధకారముచేనావరింపఁబడిన ముఖముగలదియును, విడువఁబడిన యుత్తమములగు పుష్పమాలికలును, ఆభరణములును గలదియును, మిగులవ్యసనము గలదియును నై, "చీకటిచే వ్యాపింపఁబడి యస్తమయమునొందిన నక్షత్రములుగల యాకాశమువలె" నుండెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొమ్మిదవసర్గ ముగిసెను.

— కైకేయి కోపమునొంది దశరధునిచే వరముల నొందుటకు కోపగృహమునబరుండియుండుట. —

ఇట్లు దేవియైన కైకేయి పాపిష్ఠురాలును గూనిదియునగు మంధరచే మిగులకుత్సితములగు వాక్యములు బోధింపఁబడి "విషలేపనబాణముచేత గొట్టబడిన కిన్నరస్త్రీవలె" పరుండియుండెను. మఱియు విచక్షణురాలగు నా కైకేయి తాను జేయవలసిన కార్యమును మనస్సులో నిశ్చయించుకొని మంధరను జూచి మెల్లగానిట్లనియె.

ఓమంధరా! నీవు నాకొఱకు చెప్పినదంతయు బహుబాగుగ నున్నదనెను. ఇట్లా కైకేయి చెప్పి మిగుల వ్యసనాక్రాంతురాలై మంధరమాటలకులోబడి తాను జేయవలసినదంతయు జక్కగానిశ్చయించుకొని "నాగకన్యకవలె" నిట్టూర్పులువిడుచుచు కొంచముసేపు తనకుసుఖము గలిగించు మార్గమునుగుఱించి యోచించుచుండెను స్నేహితురాలును, కార్యాసక్తురాలును, నగు నామంధర కైకేయి చెప్పిన కైకేయికిగల కార్యనిశ్చయమైనపూనికనువిని కార్యసిద్ధియైనపిదప నెంతటి సంతోషమునొందునో అంతటి సంతసమునొందెను. పిదప కైకేయి మిగులకోపమునొంది చక్కగానిశ్చయించుకొని కనుబొమలు ముడివడవట్టి నేలయందుపరుండెను.

అంతనా కైకేయి చేతఁ దీసిపారవేయబడిన నానావిధవర్ణములుగలపుష్పమాలికలును, దివ్యములైనయాభరణములును నేలపైబడియుండెను. ఇట్లు నేలపైఁబడియుండు నాపుష్పమాలికలును, ఆభరణములును, "ఆకాశమునునక్షత్రములు ప్రకాశింపజేయునట్లు" భూమిని ప్రకాశింపజేసెను. మఱియు తలవెండ్రుకలన్నియు నొకటిగాముడివేసికొని మురికివస్త్రములనుధరించికొని యుండునదియును, కోపగృహమున నేలయందు పరుండియుండునదియునునగు నా కైకేయిమరణమునొందిపడియున్న కిన్నరస్త్రీవలెనే ప్రకాశించుచుండెను. అట్టియెడదశరథమహారాజు రామునకుపట్టాభిషేకముసేయునట్లానతిచ్చి సభవారిచేననుజ్ఞబొందియంతఃపురముబ్రవేశించెను. సకలకార్యస్వతంత్రుఁడగు నాదశరథభూవల్లభుఁడు "ఇప్పుడేగదా రామపట్టాభిషేకవార్తప్రసిద్ధంబాయెను" అని తెలిసికొని యట్టిసంతోషవార్తను కైకేయికిందాను స్వంతముగ దెలియజేయుటకొఱకంతఃపురమునకుబోయెను.

— దశరధుడు కైకేయియొక్క శయనగృహమునకు బోయి అందు కైకేయి లేనందున పరితపించుట —

మిగులయశోవంతుఁడగు నాదశరథమహారాజు "తెల్లని మేఘములుగలదియును రాహుగ్రహముతో గూడినదియును, నగునాకాశమునుగూర్చి చంద్రుండువచ్చునట్లు" శ్రేష్ఠమగు నాకైకేయియొక్క యింటిని బ్రవేశించెను. చిలుకలతోను నెమళ్ళతోను నిండియుండునదియును, హంసక్రౌంచపక్షులయొక్క ధ్వనులతో గూడినదియును, డిండిమాది వాద్యధ్వనులచే ధ్వనించుచుండునదియును, గూనివారును, పొట్టివారునునగు బరిచారికస్త్రీలతో గూడినదియును, అశోకచంపకవృక్షములచే నలంకరింపఁబడిన లతాగృహములతోను నానావిధచిత్రగృహములతోను గూడినదియును, దంతములతోను వెండితోను బంగారముతోనుజేయబడిన తిన్నెలతో గూడినదియును, సర్వదాపుష్పములును ఫలములునుగలవృక్షములచేతను, నడబావులచేతను, బ్రకాశించుచుండునదియును, దంతము వెండి బంగారముతో జేయబడిన శ్రేష్ఠములైన ఆసనములుగలదియును, నానావిధభక్ష్యభోజ్యలేహ్యచోష్యపాయసపానీయాన్నములతో గూడినదియును ఉత్తమములైన స్త్రీలుగలిగియుండుటచే స్వర్గమువలె నుండునదియును, నిట్లుసకలసంపదలతోగూడియుండుతనయంతఃపురమును దశరథమహారాజుబ్రవేశించి శ్రేష్ఠమగుపాన్పునందు తనప్రియురాలగు కైకేయిని కానడయ్యె.

అంతమనుజాధిపుఁడగు నాదశరథమహారాజుమన్మథోద్రేకముగలవాడై పడకయందుతనభార్య లేకుండుటనుజూచిసంభోగముజేయుటకొఱకు గొంతెత్తిఓకైకేయీ! కైకేయీ! యనిపిలిచియెక్కడనున్నావే? యనియడిగిన, పలుకకుండుటచే మిగుల వ్యసనాక్రాంతుఁడాయెను, ఇదివరలోనెప్పుడును నాదశరథమహారాజు అంతఃపురమునకు వచ్చినపుడు దేవియగు కైకేయిశృంగారించుకొనియెదుర్కొనకుండినదిలేదు. దశరథమహారాజును కైకేయిలేక శూన్యంబుగనుండు నాగృహంబును నెప్పుడును బ్రవేశించినదియును లేదు, పిదపదశరథమహారాజుతనస్వకార్యమునే కోరునదియును, బుద్ధిలేనిదియునునగు కైకేయియొక్కయభిప్రాయ

మనుగుత్తుండంగక సాధారణముగ నడుగునట్లు కావలియుండు దానింజూచి ఓకావలియుండుదానా! కైకేయి యెక్కడనున్నదియనియడిగిన నాద్వారపాలకురాలుమిగులభయంబుతో కృతాంజలురాలై యిట్లనియె. దేవ! దశరథమహారాజా! నీదేవియగు కైకేయి మిగులంగోపాక్రాంతురాలై కోపమువచ్చినపుడుండవలసిన గృహమునకుబరుగెత్తిపోయియున్నదనియె.

ఇట్లు ద్వారపాలకురాలు జెప్పినవిని మిగులవ్యసనము నొందియుండు నాదశరథమహారాజు వ్యాకులేంద్రియుఁడై విశేషముగదుఃఖముబొంది తానునుగోపగృహమునకుంబోయి యాయింటియందు క్రిందపడి నేలయందుపరుండియుండునదియును, అట్లునేలయందుపరుండుటకు దగనిశరీరము గలదియును, నగునాకైకేయిని దుఃఖముచేదపింపఁబడుచు జూచెను. మఱియు పాపముసేయనివాడును, ముసలివాఁడునునగు నాదశరథమహారాజు యౌవనవంతురాలును, ప్రాణములకన్న నధికురాలును, రామునినడవికి బంపవలయునను పాపపుసంకల్పముగలదియును, ఛేదింపఁబడినతీగవలెను, ఆకాశమునుండి నేలంబడినదేవతవలెను, క్రిందఁబడద్రోయబడిన కిన్నరస్త్రీవలెను, గగనమునుండి నేలజారిపడినయప్సరస్త్రీవలెను, జనులనుభ్రమింపఁజేయుటకొఱకు సృష్టించివిడువబడినమాయవలెను, కట్టివేయబడినలేడివలెను, అరణ్యమునందు విషలేపనంబగు బాణముచేక్రిందబడద్రోయబడిన యాడయేనుగువలెనునుండు భార్యయైనకైకేయినిజూచెను. ఇట్లుచూచియాదశరథమహారాజు "అరణ్యమునందు క్రిందపడియుండు నాడయేనుగువద్దికి గొప్పదైనమగయేనుగువచ్చి దడవినట్లు" కైకేయినిస్నేహముచే దడవెను. అట్లుతడవుటచేత మహాకామోద్రేకముగలిగి యాదశరథమహారాజు తనచేతులచేజక్కగాదడవి మిగులభయమునొందిన మనసుగలవాఁడై తామరఱేకులవంటినేత్రములుగల భార్యయైన కైకేయినిజూచియిట్లనియె.

ఓకైకేయీ! నీకింతటఁకోపము నాపైవచ్చుటకుదగినకారణమును నేనెంతదూరంబాలోచించినను నాకుజ్ఞాపకమునకు రాలేదు. దేవీ! కైకేయీ! నిన్నెవరైనను దిట్టినారా? ఎవ్వరైననిన్నవమానముజేసిరా? నాకువివరముగఁదెలియజేయుము. ఓకల్యాణీ! నీవిట్లుదుమ్మునేలయందు, పరుండియుండుటవలన నాకుహెచ్చుగదుఃఖముగలుగుచున్నది. నీకుగీడుకలుగకుండునట్లు సంరక్షించుటకునేనుండగ నీవు నామనస్సునువ్యాకులపెట్టుచు "పిశాచముబట్టినదానివలె,, భూమియందు పరుండియున్నావేమే? ఓకైకేయీ! నాయొక్కవైద్యులు సకలకార్యములయందును సమర్థులైమహాసంతోషముగనున్నారు. కావుననీకుగలిగియుండురోగమునుబోగొట్టి సుఖముగలుగునట్లుసేయగలరు. నీవిపుడెవ్వనికి వ్యసనముగలుగజేయం గోరుచున్నావు? నీకెవ్వండిట్టివ్యసనముగలుగజేసెను? నీవెవనికిసంతోషముగలుగజేయవలయునని కోరుచున్నావోయట్టివాని నిపుడేమహాభాగ్యవంతునిగజేయుచున్నాను. ఎవనికివ్యసనముగలుగజేయవలయుననికోరుచున్నావో యట్టివానినిపుడేశిక్షించెదను. దేవీ! కైకేయీ! ఏడవకేడ్వకుము. ఇట్లేడ్చినీదేహమునుశుష్కింపజేసికొనకుము- చంపదగనివానిని చంపవలెననికోరితివేనియిపుడేచంపించెదను- చంపదగినవానినివిడుదలచేయవలయుననికోరితివేని యిపుడేవిడుదలచేయించెదను. దరిద్రుఁడుభాగ్యవంతుఁడుగా కావలయునంటివేని భాగ్యవంతునిగఁజేసెదను. భాగ్యవంతుని దరిద్రునిగ జేయవలయునంటివేని దరిద్రునిగజేసెదను. కైకేయీ! నేనును, నాతోజేరినవారును, మేమెల్లరమునునీకులోబడినవారము. కావుననీవుచెప్పినట్లు నడుచుకొనెదము. నీయొక్కయభిప్రాయమునకువిరోధమును నేనెన్నటికినిజేయను- నాప్రాణంబులబోగొట్టికొనినదైనను నీవిషయమై చేయదగినకార్యంబుండెనేని ప్రాణములత్యజించియైనను నీకోరికనీడేర్చెదను. నీయందునాకువిశేషముగ ప్రీతిగలిగియున్నదని నీకుతెలియునుకావున నీవుసందేహింపవలదు- నీకవశ్యముగసంతోషముగలుగునట్లుచేసెదను- నీవుసందేహముపడవలదు-పుణ్యముమీదనొట్టుబెట్టిచెప్పుచున్నాను. ఎంతవఱకుసూర్యునియొక్క రథచక్రముదిరుగుచున్నదో యంతవఱకనుండెడుభూమండలంబంతయునాస్వంతము- అట్టియీభూమండలమునందు తూర్పుదేశములు, సింధుదేశము, సౌవీరదేశము, సౌరాష్ట్రదేశము, దక్షిణాపథములు, వంగదేశము, మగధదేశము, మత్స్యదేశము, కాశీదేశము, కోసలదేశము, మొదలుగాగల సమస్తదేశములును నిండియున్నవి. ఆదేశములు ధనధాన్యసమృద్ధియును, అజావికముమొదలగునవియును విశేషద్రవ్యమునుగలిగియున్నవి. కైకేయీ! ఆద్రవ్యములయందు నీకేమికావలయునో వానినెల్ల కోరుము- ఇచ్చెదను- ఓశోభనురాలా! కైకేయీ! నీవుమిగులభయపడు స్వభావముగలదానవు- నీవిట్లుభూమియందు పరుండిశ్రమపడుటవలన ప్రయోజనంబేమియులేదు- లేలెమ్ము- దేవీ! కైకేయీ! ఏకారణంబుచే నీకుభయంబుగలిగినదో దానినినాతోజెప్పుము "సూర్యుండుతనతేజంబుచే మంచునుబోగొట్టునట్లు" నీభయంబునుబోగొట్టెదననెను.

ఇట్లనేకవిధంబుల యాకైకేయి దశరథమహారాజుచే నూరడింపఁబడి, రామునినరణ్యమునకు బంపవలయునన స

ప్రియమగు వార్తను జెప్పదలంచి భర్తయగుదశరథమహారాజుచే ననేకశపథములు జేయింపగోరి యింకను విశేష దుఃఖము నొందునట్లు సేయుటకారంభించెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి పదియవసర్గ ముగిసెను.

కైకేయి రామునినడవులకు బంపుమని దశరథునివరమడుగుట.

ఇట్లుభర్తయగు దశరథమహారాజుచేత, ఒట్టునుపెట్టించియింకను దుఃఖపఱుపఁదలఁచిన యాకైకేయి, మన్మథబాణములవలనఁ గొట్టఁబడి మిగులబాధను బొందుచున్నవాఁడును, మన్మథునివేగమునకుఁ దాళఁజాలక కామోద్రేకముగలవాఁడును, భూమినిబరిపాలించు వాఁడునునగుదశరథమహారాజుతో భయంకరమైనమాటను జెప్పఁదలఁచి యిట్లనియె.

ఓప్రాణనాథా! దశరథమహారాజా! నాకురోగము రాలేదు, నన్నెవ్వఁడును, అవమానమునుబొందించలేదు, నామనస్సులో గొప్పకోరికయొకటియున్నది. ఆకోరికను నీవుతీర్చవలయునని నేనుబ్రార్థించుచున్నాను. నాకోరికను నీవునెరవేర్పఁదలఁచితివేని ముందుగఒట్టును బెట్టికొనుము. ఒట్టుపెట్టుకొంటివేని నేనుగోరినదానినిచెప్పెదను, అట్లు చేయనియెడల నేనుజెప్పడములేదనియె, అంతటకామోద్రేకముగల దశరథమహారాజు, చిరునగవుగలవాఁడై, తనకోరికనెరవేరఁగలదను నభిప్రాయముతో కొంచెము గనవ్వుచున్న యాకైకేయియొక్క తలవెండ్రుకలనుచేతితోఁ బట్టుకొని దువ్వుచునిట్లనియె.

మూఢురాలా! కైకేయీ! స్త్రీలలోనీకంటెఁ బ్రియమైనస్త్రీలేదనియును, పురుషులలో పురుషశ్రేష్ఠుఁడగురామునికంటెఁ బ్రియమైనపురుషుఁడులేడనియును నీవెఱుగవా? ఎఱుగుదువుగదా? కాఁబట్టిశత్రువులచేత జయింపనలవిగానివాఁడును, సర్వోత్తముఁడును, పూజింపఁదగినస్వభావముగలవాఁడును, ప్రాణములకంటెఁ బ్రియమైనవాఁడునునగురామునిమీఁద, ఒట్టుపెట్టుకొనియెదను, (అనఁగానీవుచెప్పేదానిని నేనుజేయకపోతినేని శ్రీరామునిజంపినవాఁడనగుదుననుట) కాఁబట్టియిపుడు నీవుదేనినిగోరితివో? దానినిచెప్పుము? కైకేయీ! నేనురామునివదలి క్షణముసేపైనను జీవింపఁజాలనని నీవెఱుఁగుదువుగదా? నీకార్యమునునెరవేర్చకపోతినేని నేనటువంటిరామునిమీఁద, ఒట్టుపెట్టుకొనియెదను, ఓకైకేయీ! నీమాటనునెరవేర్చకపోతినేనినాచేతను, పుత్రులచేతను, నితరులచేతనుగూడ మానవశ్రేష్ఠుఁడగు నేరామునిగోరుదునో యట్టిరామునిమీఁదనొట్టుపెట్టుకొనియెదను, (అనఁగానీయభిలాషను దీర్చకపోతినేని నాప్రాణములకంటెను, పుత్రులకంటెను, మఱియునితరులగు బంధువులకంటెను బ్రియుఁడైనరామునిమీఁద, ఒట్టుబెట్టుకొనియెదననుట) మంగళకరురాలవైన కైకేయీ! నాయొక్కయిటువంటి మనస్సునువిచారించి నన్నుఁగాపాడుము, (అనఁగానిట్లుఒట్టుపెట్టుకొనినవాఁడు కోరికనునెరవేర్చుననుటకు సందేహములేదనియెంచినాతోడఁగ్రీడింపుమనుట) మఱియునోకైకేయీ' ఈవిషయమునుసర్వమును జక్కఁగనాలోచించి నీవేమికోరినదియును జెప్పుము, నేనుమాటనుదప్పువాఁడనుగాను, నీయందునాకుఁగలిగియుండు ప్రేమనుదెలిసికొనిన దానవుగావున నీవునన్ను మఱియొకవిధముగానెంచకుము, నేనునీయభిలాషను దీర్చనేమోయనితలవవద్దు, నీకుఁబ్రియమైనకార్యమునుజేసెదను, అట్లుచేయకపోతినేని నేనుబుట్టిననాటనుండి చేసినపుణ్యముమీదగూడ, ఒట్టునుపెట్టుకొనియెదననియె. ఇట్లుదశరథమహారాజు చెప్పినవచనములనువిని పట్టపురాణియైన యాకైకేయి రామునినడవులకుఁబంపి భరతునకుఁబట్టముగట్టవలయుననియెడు నభిప్రాయముగలదగుటచేత, దృఢముగాఁ దనకోరికనుదీర్చెదనని దృఢమైన యభిప్రాయముతోఁ బలుకుచున్న దశరథమహారాజుతో, చెప్పరానిమాటయనియెఱిఁగియును పక్షపాతమువలనను, సంతోషమువలనను, జెప్పుటకుద్యుక్తురాలయ్యె.

మఱియుకైకేయి దశరథమహారాజు వచనముచేత మిక్కిలిసంతోషించిన మనస్సుగలదై తనకోరికను దీర్చెదననిబాసలుచేసి పలుకుచున్న దశరథమహారాజుతో మిక్కిలిభయంకరమైనదియును, ఎదుటికివచ్చినిలిచియున్నదియునగు, మృత్యువువలెనున్న యొకమాటనుజెప్పెను. దశరథమహారాజా! నీవునాకోరికనుదీర్చెదనని చెప్పుచు, నాకునమ్మకముగలుగుట కొఱకనేకబాసలను జేయుచున్నావు. మఱియునాకోరికను దీర్చెదననిచెప్పుచున్నావు. ఈసంగతులను నగ్నిహోత్రుడు మొదలుగాఁగల ముప్పదిమూఁడుకోట్లదేవతలును,విందురుగాక. చంద్రసూర్యులును, ఆకాశమును, గ్రహములును, రాత్రియును,పగలును, దిక్కులును. జగత్తును, గంధర్వులతోడను, రాక్షసులతోడను గూడుకొనిన యీభూమియును, రాత్రులయందుసంచరించునట్టిభూతములును, గృహములయందలి గృహదేవతలును, మఱియునితరములగుభూతములును నీమాటనువిందురుగాక. అనిచెప్పిఓదేవతోత్తములారా! సర్వకాలములయందును సత్యముగ మాటలాడువాఁడును, అధికమైనప

రాక్రమము గలవాఁడును, సకలధర్మములను దెలిసినవాఁడును, ఎల్లప్పుడును నెచ్చరికగలిగియున్నవాఁడును, నగునీ దశరథమహారాజు నేనుగోరినవరమునిచ్చెదనని బాసచేసి చెప్పుచున్నాఁడు, ఈమాటను మీరందఱును నాకొఱకువిందురుగాక. (అనఁగాదశరథ మహారాజుతన యభిప్రాయమును దెలిసికొనినతోడనే తానుగోరినవరము నివ్వకతప్పిపోవునేమోయనిసకల దేవతలను సాక్షులనుగాఁ బెట్టుచున్నదనియభిప్రాయము) ఈప్రకారముగొప్ప విల్లుగలదశరథమహారాజును పట్టుకొని (అనఁగాతనకోరికను దీర్చునట్లుసేసికొని) మిక్కిలిసంతోషము గలవానినిఁగాజేసె. అట్లుసంతోషముగలవానినిగాజేసి తానుకోరిన వరమునిచ్చువాఁడును, మన్మథవికారము గలవాఁడును, నగుదశరథమహారాజుతోఁ దానుజెప్పఁదలఁచినమాటను నిట్లనిచెప్పె.

ఓదశరథమహారాజా! పూర్వముదేవతలును రాక్షసులును జేసినట్టి గొప్ప యుద్ధమునందు జరిగినవృత్తాంతమునుజ్ఞప్తికిదెచ్చుకొనుము. ఆయుద్ధమునందు శత్రుసైనశంబరాసురుఁడునిన్నుఁగ్రిందఁబడద్రోసె. గదా! అప్పుడునీవుప్రాణమాత్రావశిష్టుఁడవైతివి. గదా! ఓదశరథమహారాజా! ఆసమయమునందు నీవునాచేత రక్షింపఁబడితివి. అట్లునిన్ను రక్షించుటకుఁబ్రయత్నమును జేయుచున్నదానను మిగుల జాగ్రతగలదానను నగు నాకు రెండువరములనిచ్చితివిగదా? సత్యముగలయుద్ధమును జేయువాఁడవును, భూమినిబరిపాలించువాఁడవును, ప్రాణనాథుడవునునగునో దశరథమహారాజా! నీచేతనివ్వఁబడినవరములు నీదగ్గిరనే యుంచఁబడినవి. ఆవరములను నేనిప్పుడు గోరుచున్నాను అందువలన. ప్రతిజ్ఞనుజేసి ధర్మముచేత నాకువరములను నివ్వకపోతివేని నీచేతనేను నవమానింపఁబడినదాననై యిప్పుడేనాప్రాణములను విడిచిపెట్టుదునసెను. అట్టియెడదశరథమహారాజు కైకేయియొక్క మాటమాత్రముచేతనే కైకకు లోఁబడినవాఁడై “ గానరూపమైన మాటమాత్రముచేతవలలోఁ దగులుకొనిన మృగమువలె,, తనకుగలిగెడు కీడునుదెలియంగనందున కైకేయికోరినవరంబిచ్చెదననిధర్మపాశము నంజికుక్కొనెను. పిమ్మటనాకైకేయి కోరిన వరంబిచ్చుటకు సిద్ధముగనుండువాడును, కామమోహితుఁడునునైన దశరథమహారాజుతో నిట్లనియె.

మహీవల్లభా! దేవా! దశరథమహారాజా! అప్పుడునీవు నాకురెండు వరములనిచ్చితివిగదా? ఆవరములనే నేనిప్పుడుగోరుచున్నాను. నామాటను వినుము, ఇప్పుడునీవు శ్రీరామునకుఁ బట్టాభిషేకమును జేయఁదలంచి యందుకుగావలసిన సామగ్రులను సంపాదించితివి. అట్టియభిషేకద్రవ్యములచేతనే నానిమిత్తముగ భరతునకుఁబట్టాభిషేకమును జేయవలయును. మఱియు రెండవవరమును గూడ నేనుబొందుటకు తగినకాలమిదే. కాబట్టిరాముఁడు నారచీరలను, జడలను, మృగచర్మమును ధరించిపదు నాలుగు సంవత్సరములు దండకారణ్యమునందు తాపసుఁడైయుండునట్లు సెలవొసంగుము. ఇట్లుచేసితివేనిభరతుఁడు నిష్కంటకముగ నిప్పుడేయావరాజ్యమును బొందఁగలఁడు. ఇదియెనాకు ముఖ్యమైనకోరికయైయున్నది. నేనునీవిచ్చిన వరములరెంటినే కోరుచున్నానుగాని వేఱేయధికముగాఁ గోరడములేదు. అరణ్యమునకుఁ బోవుచున్నరామునినే నిప్పుడేచూడవలయును. ఓదశరథమహారాజా! రాజాధిరాజవైన నీవుసత్య సంగరుఁడవుగావలయును. (అనఁగాఁ జెప్పినమాటను దప్పఁగూడదనుట.) నీదుకులమును, సదాచారసంపత్తిని, జన్మనుగాపాడుకొనుము శ్లో॥ పరత్రవా సేహివదంత్య నుత్తమంతపోధ నాస్సత్యవచోహితంనృణామ్,, తపోధనులగు మహర్షులు పరలోకమునందు సర్వోత్తమమగు మేలును గలిగించునదిసత్యమేయనియును, సత్యహీనునకుఁ బరలోకమునందు సుఖములేదనియును బలుకుచున్నారుగదా?

ఇట్లు శ్రీమదయోధ్యా కాండమునందలి పదునొకండవ సర్గముగిసెను.

—{ రామునినడవులకు బంపనేరననిదశరథుఁడువిలపించుట. }—

అంతదశరథ మహారాజుకైకేయియొక్క యతిభయంకరమగు వచనమునువినినపిమ్మట మిగుల వ్యసనమునుబొందె. మఱియుక్షణమాత్రము మహాపరితాపముచేత మూర్ఛిల్లెను. అట్లు మూర్ఛిల్లిమరలఁ దెలివొంది“ శ్లో॥ కిన్నుమెయదివాస్వ ప్నశ్చిత్తమోహోపివామమ|అనుభూతోపసర్గోవామన సోవాప్యుపద్రవః,, ఓహో నాకిది స్వప్నమా? లేకమనస్సు యొక్కభ్రమా? కాదేనియనుభవింపఁబడిన వానియొక్క జ్ఞాపకమా? ఇవన్నియును గాదేని మనసునకు నుపద్రవమా? నాకేమియును దోచకయున్నదే? యనిదశరథ మహారాజుచింతించి సుఖమును బొందనివాఁడయ్యె.

ఇట్లుకైకేయియొక్క వాక్యముచేతహతుఁడైన దశరథమహారాజు చాలాసేపటికిఁ దెలివొంది“ యాఁడుపులిసిజూచిన జింకవలె” దుఃఖముగలవాఁడును, చిత్తస్వాధీనములేనివాఁడునునై చాపమొదలగునవి యేమియునులేని వట్టిభూమియందుఁ గూర్చుండి బుస్సుబుస్సుమని నిట్టూర్పుల

ను విడుచుచుండె. మఱియును మంత్రగాని చేయంత్రమండలమునందు మంత్రములచేత బంధింపఁబడి యిటుఅటుకదలనేరక యున్నదియును, అధికమైనవిషముగలది యునునగుపాముపలె బుసకొట్టుచు మహాకోపముగలవాఁడై కంన్నెత్తిచూచి అహాయిదియెంత యాశ్చర్యము ఛీ'' దహింపఁబడుగాక'' (అనఁగా కైకేయిదహించి పోవుగాకనుట.) యనిపలికి మరలదుఃఖముచేత నేమియును దెలియనివాఁడై ఘోరఘోరమున దుఃఖించుచు మూర్ఛనొందెను, అట్లు మూర్ఛనొంది చాలాకాలమునకు బిమ్మటమూర్ఛదేఱి యధికముగ రోదనమునుజేసి మహాకోపము గలవాఁడై గుడ్లుఁగజేసి యందుండి నిప్పులంగ్రక్కుచు దహింపఁజేయువానివలెమండిపడుచు నా కైకేయింజూచి యిట్లనియె.

ఓ క్రూరురాలా! దుష్టనడవడికగలదానా! కులవినాశకురాలా! పాపాత్మురాలా! నీకురాముఁడేమి యపకారమునుజేసినాఁడే? నేనేమియపకారమును జేసినానే? ఓపాపిష్ఠురాలా! రాముఁడెప్పుడును నీకుఁదల్లికిఁజేసిన విధముగశుశ్రూషలను జేయుచుండునుగదే? అటువంటిరామునకేఅనర్థములను జేయఁదలఁచితివిగదా? ఇట్లుచేయుటకుఁగారణమేమి?'' శ్లో॥ త్వంమయాత్మవినా శార్థంభవనంస్వంప్రవేశితా। అవిజ్ఞానాన్నృపసుతావ్యాళీ తీక్ష్ణవిషాయథా,, ఓదుష్టురాలా! నేను తెలివిలేమితనమువలననిన్ను రాజపుత్రి కనుగాఁదలచితినే? విషసర్పమని నెఱుఁగనైతినే? తీక్ష్ణమైన విషముగలసర్పమును గృహములోఁ జేర్చినట్లు కులనాశముకొఱకునిన్ను నాగృహములోనికిఁ దెచ్చియుంచితినే! లోకములోనిసకల ప్రాణులును సర్వకాలములయందును శ్రీరామునిగుణములను గొనియాడుచుందురే? అట్టిరామునియందు నేనేమితప్పును బెట్టివెడలఁ గొట్టుదునే? అయ్యో నేనేమిచేయుదును. కౌసల్యాసుమిత్రలనైనవదలఁగలను. రాజ్యలక్ష్మినైన వదలగలను. ప్రాణములను గూడవదలఁగలను. తండ్రియగు నాయందుఁ బ్రియముగలరాముని నేను వదలఁజాలను. రాముఁడు నాకుఁ బ్రాణము ... ప్రాణమైనవాఁడు. పెద్దకుమారుఁడైన రామునియందు నాకధికమైన ప్రీతిగలదు. రామునిజూడకపోతినేని నాప్రాణముపోవును.'' శ్లో॥ తిష్ఠేల్లోకోవినాసూర్యం సస్యంవాసలిలంవినా। నతురామంవినా దేహేతిష్ఠేత్తుమజీవితమ్,, ఒకవేళసూర్యుని వదలిలోకము బ్రతికియుండినను నుండును, నీళ్లులేకయేపైరులుండినను నుండును. రాముని వదలి నాప్రాణము క్షణమైనను నాశరీరంబుననుండజాలదు. కాఁబట్టియోపాపాత్మురాలా! నీవీయేర్పాటునువదిలిపెట్టుము. నేనునీయొక్క పాదములనైనను తగులునట్లు

నాశిరస్సుచేతనమస్కారమును జేసెదను. నాకొఱకుఁ బ్రసన్నురాలవగుము. ఓపాపాత్మురాలా! మిగులభయంకరమైనయీవిషయమును నీవెట్లుతలఁచితివి. నీవీవిధముగాఁబలికిభరతుని యందునాకుఁ బ్రియముగలదో లేదోయని తెలిసికొనఁదలఁచితివా యేమి? కానిమ్ము. (అనఁగాభరతునియందుఁ బ్రీతియున్నదియును లేనిదియును తెలిసికొమ్మనుట,) మునుపునీవు రాముడునాకుఁ బెద్దకుమారుఁడనియును, అందఱికన్నవెచ్చైన వాఁడనియును, ధర్మజ్యేష్ఠుఁడనియును, నాకుఁబ్రియము గలుగునట్లు చెప్పితివి. ఆ మాటనునీవు సేవకొఱకుఁ జెప్పినదానవగుదువుగాక. (అనఁగానామనస్సునకు సంతోషము గలుగుటకొఱకైనను, లేక, నేనుసర్వకాలములయందును నీకుసేవను జేయుటకొఱకైనను, కాదేనిరాముఁడునీకు శుశ్రూషనుజేయుటకొఱకైనను నీవట్లుచెప్పినదాన వగుదువుగాక యనుట.) అందువలన నీవురామాభిషేకవార్తనువిని దుఃఖముచేతఁదపింపఁజేయఁబడిన దానవైనన్ను మిక్కిలిదుఃఖపెట్టుచున్నావు. నీవితరులబోధనకు లోఁబడితూన్యమైన కోపగృహముననున్న దానవైతివి. నీతిసంపన్నురాలవైన కైకేయీ! పూర్వమునీవు మిగులధర్మబుద్ధిగల దానవైయుంటివి. అట్టినీకిప్పుడిట్టి విపరీతబుద్ధిగలుగుటను జూడగయిక్ష్వాకువంశమునకు గొప్ప యనర్థము సంప్రాప్తమైనట్టున్నది. ఓవిశాలాక్షీ! కైకేయీ! ఇంతకుముందునీవెప్పుడును, అపకారమును జేసినదానవుగావు. నాతోననుచితములయిన మాటలనుగూడ జెప్పినదానవుగావు. అందువలననేను నీవిప్పుడుపలికిన పలుకును సత్యమునుగానమ్మడములేదు, ఓకైకేయీ! నీకురాముఁడు మహానుభావుఁడైన భరతునితోసమానుఁడుగాఁడా? నీవనేకపర్యాయములుమహాప్రియములో రామునికథలను జెప్పుచుందువు. ధర్మభీతిగల యోకైకేయీ! ధర్మాత్ముఁడును, మహాకీర్తిమంతుఁడును, అయిన రాముఁడు పదునాలుగుసంవత్సరముల పర్ణ్యాయినందు నివసించుటకెట్లు సమ్మతించితివి. అత్యంతసుకుమార శరీరంబుగలవాఁడును, ధర్మమునందు దృఢమైనబుద్ధిగలవాఁడును, నగురాముఁడుమిగులభయంకరమగు నరణ్యమునందుండుటకు నీవెట్లుసమ్మతించితివి, శుభలోచనురాలవైనయోకైకేయీ! నీకుశుశ్రూషను జేయుచున్నవాఁడును, మనోహరుఁడును, నగురాముఁడువనవాసమును జేయుటకునీకెట్లుసమ్మతముగలిగెను. రాముఁడెందుకు వనవాసము సేయవలసియున్నది, రాముఁడుభరతునికంటె నధికముగనీకుశుశ్రూషను జేయుచుండునుగదా? కాఁబట్టిభరతునికి నీయందురామునకుఁగల ప్రీతికంటెనెక్కు

వ ప్రేమగలదని నాకుఁదోచకములేదు. నీకుశుశ్రూషను, గౌరవమును, పూజను, రామునికంటె నధికముగా నెవ్వఁడుసేయఁగలఁడు. రాముఁడు సర్వకాలములయందును నీవుసెప్పినపనిని జేయుచుండును, ఈనగరి యందు అనేక వేల మందిస్త్రీలుగలరు. అనేక వేలమంది భృత్యులుగలరు. వీరలలోనెవ్వరును రామునియందు వాస్తవమైన దోషమును గాని, లేనిపోనితప్పులును గాని పెట్టినవారెవ్వరును లేరు. సకలమైన వారలకును రాముఁడుప్రియముగ సంచరించుచుండును. పురుషశ్రేష్ఠుఁడైనరాముఁడు పరిశుద్ధమైనమనస్సుచే సకలజనులకు బ్రియవచనములచేత సంతోషపఱచుచుండును. దేశమునందుండు జనులనందఱను బ్రియవచనములచేతఁ బ్రియులనుగా జేయుచుండును. "శ్లో॥ సత్యేనలోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః। గురూన్ శుశ్రూషయావీరో ధనుషాయుధి శాత్రవాన్,, రాముఁడుసత్యముచేతలోకములను జయించుచున్నాఁడు. దానముచేతదీనులను జయించుచున్నాఁడు. శుశ్రూషచేతగురువులను జయించుచున్నాఁడు. ధనుస్సుచేతశత్రువులను జయించుచున్నాఁడు. (అనఁగాసత్యముగ మాటలాడుచుండుటచేత స్వర్గాదిలోకములన్నియును స్వాధీనములైయున్న వనియు, ధనమునిచ్చి దరిద్రులనందఱను స్వాధీనముగాఁ జేసికొనుచున్నాఁడనియును, శుశ్రూషనుజేసి గురువులకుఁ బ్రియముగలిగించి రహస్యములను జెప్పునట్లుసేసికొనుచున్నాఁడనియును, యుద్ధములయందు ధనుస్సునుధరించిశత్రువులను జయించుచున్నాఁడనియును నెఱుంగునది.) సత్యవ్రతము, దానము, తపస్సు, త్యాగము, మిత్రత్వము, శౌచము, ఆర్జవము, విద్య, గురుశుశ్రూష, అనునవి రామునియందుఁగుదురైయున్నవి.

దేవీ! కైకేయీ! కపటములేనివాఁడును, దేవతలకుసమానుఁడును, మహర్షిసమతేజస్కుఁడును, నగురామునివిషయమై నీవిట్టిక్రూరకృత్యముచు జేయుట కెట్లుసమ్మతించితివి? నీకిట్టిబుద్ధియెట్లుగలిగెను? లోకమునకుఁ బ్రియముగలుగునట్లు మాటలాడునట్టి రామునిగుఱించి నేను క్రూరకృత్యముచు మనస్సునందుఁ గూడఁదలపను. అట్టినేనురామునితో "రాముఁడా నీవు వనమునకుఁబొమ్ము,, అనియెట్లుచెప్పుదును. అతిక్రూరురాలవైన నీవుచెప్పితివని నేనుజెప్పఁగలనా? రాముఁడుక్షమగలవాఁడు. దమము, త్యాగము, సత్యము, కృతజ్ఞత, ధర్మము, అహింస, అనునవిరామునియం దెప్పుడును నివసించియుండును. అట్టిరాముఁనివిడిచితే నాకు వేఱేగతియేమియున్నది.

ఓకైకేయీ! ముసలివాఁడను, ముసలితనముచే చనిపోవుటకు సిద్ధముగనుండువాఁడను, దీనుఁడను, లాలసచేయఁదగినవాఁడను; నగునాయందు దయనుబెట్టుము. సముద్రమువరకుగల భూమియందెంతద్రవ్యము నాకువచ్చుచున్నదో దానినంతయును నీకిచ్చెదను. నీకు రామునియందుఁ గలకోపమునువిడిచిపెట్టుము ఓకైకేయీ నీకుచోసిలియొగ్గినమస్కారమును జేసెదను. నీకాళ్లుపట్టుకొనెదను. రామునిఁగాపాడుము. ఈరామాభిషేకమును గుఱించి నాకధర్మమువచ్చునట్లు సేయకుమనియె. అనియిట్లుపలికి విలపించుచుదుఃఖముచే మూర్ఛనొంది నేలంబొరలుచు రామవివాసనంబువలనఁ గలుగఁబోవు దుఃఖమునమునింగి "కైకేయీ! నాదుఃఖమునుఁబోఁగొట్టుము, నాదుఃఖమునుబోఁగొట్టుమని,, పలుమాఱులు ప్రార్థించుచున్న దశరథమహారాజును జూచిభయంకరమైన యాకారముగల కైకేయిదయలేనిదై మహాభయంకరముగానిట్లనియె.

కైకేయిదశరథుని చెప్పినమాటతప్పి పోకుమని డేగపావురపిట్టకథను చెప్పుట.

పరాక్రమశాలివైన యోదశరథమహారాజా! నాకుమొదటవరములనిచ్చి యిప్పుడు "అయ్యో వరములనిచ్చితినే" అనిపరితాపమును బొందుచున్నావు. ఇట్లుపరితాపమును బొందుదువేని భూలోకమునందు "నేనుధార్మికుఁడను,, అనినీవెట్లుచెప్పఁగలవు? చెప్పినమాటను దప్పువాఁడైనా సత్యవంతుఁడగునా? (కాదు.) కావునఁనిన్నును సత్యవంతునిగా దలపఁదగదు. ధర్మజ్ఞుఁడా! దశరథమహారాజా! అనేకులగు రాజర్షులును, మునిశ్రేష్ఠులును, నగరవాసులును, వచ్చి, దశరథమహారాజా! నీవుపూర్వము కైకేయికి రెండు వరములనిచ్చితివి. గదా? ఆమెకోరినరెండువరములనునివ్వి? ఆవరములకు నీవేమియిచ్చితివి? అనియడిగినప్పుడు నీవుప్రత్యుత్తరమేమని చెప్పుదువు? ఎవతెనాయందను గ్రహించి నేనుబ్రతుకుటకై ప్రయత్నముచేసినన్నుఁ గాపాడినందున నేనిపుడుజీవించి యున్నానోయటువంటికైకేయికి నేనిచ్చెదనని చెప్పినవరములను నివ్వలేదనివారలకు బదులు జెప్పవలసివచ్చునుగదా? ఓమానవాధిపా! దశరథమహారాజా! నీవిపుడుకోరిన వరములనిచ్చెదనని చెప్పి మరలవెంటనే వేఱువిధమైన మాటలనుబలుకుచున్నావు? ఇటువంటినీవు రాజులకందఱకును బాపమును గలుగఁజేయుదువు. (అనఁగానీవంటి రాజులకందఱకును నీవలననపకీర్తిగలుగుననుట.) పూర్వముశిబిచక్రవర్తి, డేగకనుబావురపుపిట్టకును గలిగినవిరోధమునందుఁదనయొక్క మాంసమునునిచ్చెను. ఆవిషయంబును జక్కఁగఁదెలిపెదను, వినుము. పూర్వమొకానాఁ డింద్రుఁడును నగ్నిదేవుఁడును శైబ్యునియొ

క్క యుదారత్వమును పరీక్షింపఁగోరిరి. అంతటనింద్రుఁడు డేగయయ్యె. అగ్నిహోత్రుఁడు పావురపు పిట్టయయ్యె. అంతట డేగ పావురపుపిట్టను భక్షింప వలయునని యెడుకోరికచేత నా పావురపు పిట్టను వెంటనంటి తఱుముకొనిపోవుచుండెఁ. అట్లుతరుముకొని పోయిపోయి యారెండును శిబిచక్రవర్తియొద్దకువచ్చె. అప్పుడు పావురమైన యగ్నిహోత్రుఁడు శిబిచక్రవర్తితో నిట్లనియె.

రాజశ్రేష్ఠుఁడా! నన్నీడేగ చంపవలయు ననియెడుకోరికతో వచ్చుచున్నది. నన్నుఁగాపాడుము. నాకు ప్రాణదానముచేయుము అని యనేక విధములఁ బ్రార్థించి యతనిశరణుఁ జొచ్చె. ఆసమయమున, నాడేగవచ్చి యిట్లనియె. రాజేన్ద్రా! పావురపు పిట్టను నాకు భక్ష్యమునుగా దైవము నిర్మించె. ఇప్పుడు నాకాకలియగుచున్నది. కాఁబట్టి యీపక్షిని నాకిమ్ము. అని యనేక విధములఁ బ్రార్థించె. అప్పుడా శిబిచక్రవర్తి యిట్లనియె.

ఓపక్షికులోత్తమా! నేనునన్ను శరణుఁజొచ్చిన పావురమును నీకివ్వను. నీయాకలిదీరునట్లు నాశరీరము యొక్క మాంసము నేనునిచ్చెదనని శైబ్యుఁడు చెప్పె, అంతనా డేగ నీశరీరమాంసమునే యిమ్మనియె. అందుకుశిబిచక్రవర్తి సంతోషమును బొంది తనదేహము నందలిమాంసముకోసి డేగకిచ్చె. అట్లుచేసి పావురమును గాపాడెనని పౌరాణికులు చెప్పుదురు. ఇవ్విషయంబును నీవునుగు రెఱుఁగుదువుఁగదా? పూర్వము అలర్కుఁడను రాజర్షి నియొక గ్రుడ్డిబ్రాహ్మణుఁడు నిన్నొకవరము నడిగెదననగా నారాజర్షి యిచ్చెదనని చెప్పె. అంతటనా బ్రాహ్మణుఁడు నీకండ్లను నాకిమ్మనియె. ఆమాటనువిని యలర్కుఁడు మహానందమును బొంది తనయొక్క కండ్లను పెఱికియిచ్చి యుత్తమగతిని బొందెనని పురాణములయందు చెప్పియుండుటను నీవెఱుఁగవా? కావునఁ జెప్పినమాటనుదప్పుట యుచితముగాదని నేను జెప్పవలయునా? మఱియును సముద్రుఁడు కూలమునుదాటిరానని ప్రతిజ్ఞనుజేసి కూలమునుదాటి వచ్చుచున్నాఁడా? లేదుగదా? (కూలమనగా చెలియలికట్ట) కాఁబట్టి నీవుముందుగ నేనుగోరినవరముల నిచ్చెదనని చెప్పితివి గనుక యబద్ధమును మాట్లాడకుము. పూర్వపువారి యొక్క యాచారములను నీవుదలఁచుకొనుము, అట్లుతలఁచికొని నావరములను నాకిమ్ము. దుర్బుద్ధిగలదశరథమహారాజా! నీవుధర్మమును విడిచిపెట్టి రామునకు రాజ్యపట్టాభిషేకముమఁజేసి కౌసల్యతోఁగూడ సర్వకాలములయందును గ్రీడించుటకొఱకుఁ గోరుచున్నావు. నేనడిగినదియ ధర్మమైనను, ధర్మమైనను, సత్యమైనను, అసత్యమైనను దానిని నీవుచేసియే తీరవలయును. నీవుచెప్పిచేయ కుండుటయుచితముగాదు. నీవురామునకుఁ బట్టాభిషేకమును జేసెదవేని నీయెదుటనే నీవుచూచుచుండగానే విషముద్రాగి నేనుమరణమును జెందుదును. రాముఁడు రాజగుటచేత రాముని తల్లియగు కౌసల్యకులోకులందఱును నమస్కారమును జేయుచుందురు. అట్లునమస్కారము జేయుచుండుటను వొక్కదినమైనను జూచుచు బ్రతికియుండుటకంటెఁ జచ్చిపోవుటయేమంచిదని నేనుదలఁచుచున్నాను. మనుజాధిపా! దశరథమహారాజా! నామీఁదను భరతునిమీఁదను, ఒట్టును బెట్టుకొనుచున్నాను, రాముని వనములకుఁ బంపుటకంటె నాకుఁ బ్రియమైనది యేదియును లేదు, అనియిట్లు కైకేయి దశరథ మహారాజుతోఁ జెప్పియూరకుండె.

(దశరథుడు కైకేయినినిందించుట.)

అంతటదశరథమహారాజు రాముని వనవాసమునకుఁ బంపుటను గుఱించి బొటబొటగన్నీరుగారగా హారామని గొంతెత్తి యేడ్చుచుండినను కైకేయి బదులుమాట చెప్పదయ్యె. దశరథమహారాజు, రాముని నరణ్యమునకుఁ బంపునట్లును, భరతునకుఁ బట్టాభిషేకమును జేయునట్లును గోరిన యమంగళపువరములను విని దుఃఖసముద్రమున మునిఁగి యేమియును దెలియనివానివలె నిశ్చేష్టితుఁడై కొంతసేపు యేమియును బలుకఁజాలక యూరకుండెను. అటు దశరథమహారాజు తప్పపాటు లేనివాఁడై (అనగా కంటిమీదరెప్పవాల్పక) ప్రియురాలును, అప్రియముగ మాటలాడునదియును, రాణియును నగు కైకేయిని నూరకజూచుచుండెను. చూచి పిడుగువలె హృదయమును బ్రద్దలుసేయునదియును, మనసునకిష్టముగా నిదియును, దుఃఖశోకములను బుట్టించునదియును, భయంకరమై నదియునునగు కైకేయియొక్క వచనమును విని దశరథమహారాజు కొంచెమైనను సుఖమును బొందనివాఁడయ్యె. ఆదశరథమహారాజు తనభార్యయైన కైకేయియొక్క భయంకరమైనదియును. క్రూరమైనదియునునగు నిశ్చయమును, తానుచేసిన శపథమును దలచుకొని హారామా! రామా! యనిగొంతెత్తియేడ్చుచు" నరకఁబడిన వృక్షమువలె" క్రిందఁబడె. అట్లుక్రిందఁబడినష్టచిత్తునివలెను, పిచ్చిపట్టినవానివలెను, సన్నిపాతాదులచేత భేదించిన ప్రకృతికలవానివలెను, వ్యాధిగ్రస్తునివలెను, మంత్రముచేతఁబోఁగొట్టఁబడిన తెలివిగల సర్పమువలెనునుండెను. ఇట్లుదశరథమహారాజు కొంతసేపుఉండి దీనమైనవాక్యములతోఁ గైకేయినిజూచి యిట్లనియె.

ఓకైకేయీ! ఎవరునీకు ఉపాయమువలెఁ గనఁబడుచున్న యీయనర్థమును బోధించిరే? "పిశాచముపట్టినదాని

వలె, నిశ్చయముగా నిట్లు నాయెదుట మాటలాడుచున్నావు. నీకుఁ గొంచెమైనను సిగ్గులేదా, ఛీ యిట్టిమాటలను బలుకవచ్చునా? ఇటువంటి దుష్టస్వభావము, దుఃఖబుద్ధియును గలదానవని మునుపు నాకుఁ దెలియదయ్యె. పూర్వము నీవు మంచిబుద్ధిగలదానవనియును, మంచినడవడిక గలదానవనియును నేను దలఁచుచుందును, అట్టి నిన్ను నివుడు విపరీతబుద్ధిగలదానినిగాఁ దలఁచుచున్నాను, ఓ కైకేయీ! భరతునకుఁ బట్టాభిషేకమును జేసి సింహాసనమందుఁ గూర్చుండఁ బెట్టవలయుననియును, రాముని నరణ్యములకుఁ బంపవలయుననియును వరమునుగోరుచున్నావు? నీకిట్టి విపరీతబుద్ధి యెట్లు పుట్టెను? నీకు దేనివలన నింత భయము గలిగినది? ఓ కైకేయీ! పెనిమిటినైన నాకుఁను, ప్రపంచమునకును, భరతునకును బ్రియమును జేయుదాననై తివేని భరతునకుఁ బట్టాభిషేకమును జేయవలయుననియును, రాముని వనములకుఁ బంపవలయుననియును బుట్టిన తలంపును వదలిపెట్టుము.

ఓ నిర్దయురాలా! పాపసంకల్పురాలా! కుటిలురాలా! దుష్టకార్యముల జేయునట్టి పాపాత్మురాలా! రాముని యందేమి చెడ్డకార్యమును జూచితివి. రాముని యందును నాయందును, ఏమి తప్పు గలదు, నీకు రాముని యందును నాయందును, ఏమి దోషము కనఁబడెను, ఓ కైకేయీ! భరతుఁడు రాముని విడిచి దొరతనమును బొందఁడు. రామునికంటె భరతుఁడధిక ధర్మాత్ముఁడు. బుద్ధిమంతుఁడు. నేను రాముని జూచి "ఓ రాముఁడా! యరణ్యమునకుఁ బోరా" యని చెప్పఁగానే యతని ముఖము వెలవెలఁబోయి గ్రహణకాలమునందు రాహుగ్రస్తమైన చంద్రబింబమువలె నల్లపడునే! అట్టి రాముని ముఖమును నేనెట్లు చూతును? మంత్రులు మొదలగువారితో జక్కఁగా నాలోచించి చేయఁబడినదియును, స్నేహితులతోఁ గూడ నిశ్చయింపఁబడినదియును, అగు రామరాజ్యాభిషేకము సేయవలయునను నాయభిప్రాయము వేరువిధముగఁ ద్రిప్పబడుచుండఁగ (అనఁగా తలక్రిందగుచుండ) శత్రువులచేదన "సైన్యము హతం బగుచుండఁగ జూచుచుండునట్లు" నేనెట్లు చూడఁగలను? రామపట్టాభిషేకమును గుఱించి నానాదిక్కులనుండి వచ్చిన రాజులు నన్నుఁ జూచి యేమి చెప్పుదురు? ఓరి దుష్టుఁడా! రామునకుఁ బట్టాభిషేకమును జేసెదనని చెప్పి యిప్పుడిట్టి విధముగ నరణ్యమునకుఁ బంపుట యుచితమా! యని తిట్టరా? పాపాత్మురాలా! కైకేయీ! నేనీమాటను రామునితో నెట్లు చెప్పుదునే? మఱియును పట్టాభిషేకమునకు వచ్చిన రాజులందఱును దశరథమహారాజు తెలివిలేనివాఁడనియును, దైవవశముచేతఁ జిరకాలము రాజ్యమును జేసినవాఁడుగాని బుద్ధిబలముచేతఁ జేసినవాఁడుగాఁడనియును పరిహసింతురుగదా? మఱియు నోహో పసివాఁడగు రాముఁడు బహుదాగా చిరకాలము రాజ్యమును జేసినాఁడేయని గేలి జేయుదురుగదా? వృద్ధులును, గుణవంతులును, అనేకములగు వేదవేదాంగములను జదివినవారును నగు వారలనేకులు వచ్చి రాముఁ డెక్కడనున్నాఁడని యడిగిరేని నేనేమని చెప్పుదును. "కైకేయి నన్ను బహువిధముల బాధించుట చేత నేను రాముని నరణ్యమునకుఁ బంపితిననిగదా? నిశ్చయముగాఁ జెప్పవలసివచ్చును? అట్లు చెప్పినప్పుడింతకుముందు సభలో పలనెల్లవారలతోను రామునకుఁ బట్టాభిషేకమును జేసెదనని చెప్పినమాటయబద్ధమగును, అందువలన నేనసత్యవంతుఁడనగుదును, నేనిదివఱకు సత్యవంతుఁడనని లోకులు దలఁచుచుందురు, అట్టివారందఱును నన్నేమందురు, నేను రాముని నరణ్యమునకుఁ బంపితినేని కౌసల్య నన్ను గుఱించి యేమని చెప్పును? ఇట్టి యప్రియమును జేసి నేను కౌసల్యకు బదులు మాటనేమని చెప్పుదును.

దేవీ! కైకేయీ! కౌసల్యాదేవి సర్వకాలములయందును నాకు దాసివలెఁ బరిచర్యలను జేయుచుండును, సఖురాలివలె వాదములనాడుచు సంతోషమును గలుగఁజేయుచుండును, భార్యవలె ధర్మకార్యములయందు సహాయమును జేయుచుండును, తోడఁబుట్టినదానివలె మఱియొక స్త్రీని బెండ్లిచేసికొనునప్పుడు లాలనను జేయుచుండును, తల్లివలె నన్నపానాదులను బెట్టి పోషించుచుండును, ఇట్లు నానావిధముల నాకుఁ బ్రియమును జేయుచు నన్ను సేవింపుచున్న కౌసల్యను, నీకుఁ గోపమువచ్చునేమోయని పూజింపకయుండుదును, రోగి యపథ్యాన్నమును భుజించెనేని, ఆయపథ్యాన్నము ఆరోగిని బాధించునట్లు మునుపు నీకుఁ జేసిన మేలంతయును నీదుర్గుణములు బయలుపడఁగానే నన్నిపుడు బాధించుచున్నవి, (అనఁగా నీగుణమును దెలిసికొనలేక నిన్ను గౌరవించడమువలన నీవిట్టి పరుషవాక్యములచేత నన్ను బాధించుచున్నావనుట) మఱియు రామునకపకారమును జేయఁదలఁచి యడవులకుఁ బంపుటను జూచెనేని సుమిత్రాదేవికి నాయందు నమ్మకము పుట్టునా? ఈ దశరథుఁడు మహా దుర్మార్గుఁడనితలఁవదా? నీవు చెప్పినట్లు చేసితినేని నేను లోకులకందఱకును పగవాఁడనగుదును, రాముఁడరణ్యమునకుఁ బోయినతోడనే నేను చనిపోదును, అట్లు నేను చనిపోదునేని నాచావును, రాముఁడరణ్యములకుఁ బోవుటను, ఏకకాలమునందు సీతాదేవి వినెనేని యెంత దుఃఖమును బొందునోగదా? అట్టి దుఃఖమును నేనిప్పుడు తలఁచుకొని మహాదుఃఖమును బొందుచున్నాను. అయ్యో యెంతకష్టకాలము సం

ప్రాప్తమైనది. సీతనన్నుగుఱించి "హిమవత్పర్వతముదగ్గఱకిన్నరునిచేత విడిచిపెట్టఁబడిన కిన్నరస్త్రీవలె" దుఃఖించచునిబోవును, రాముఁడడవులకుఁబోవుటయును, ఇక్కడ సీతయేడ్చుచుండుటయును జూచి నేను చిరకాలము బ్రతుకలేను. కైకేయీ! నేనుజచ్చిపోయినపిమ్మట ముండమోపివై భరతునితోఁగూడి రాజ్యమును చేయఁగలవు, దేవీ! కైకేయీ! రాముఁడరణ్యమునకుఁబోయినపిమ్మట నేను బ్రదుకనుగదా! దక్క-నిరూపముగలదానవును, మంచిగుణములుగలదానవును, నగునిన్ను "చూచుటకు మనోహరముగను, విషముతోఁగూడినదిగనునుండు మద్యమును ద్రాగిదాని దుర్గుణమును దెలిసికొన్నట్లు" నేనుసీవనుకల్లును ద్రాగినట్లు తలఁచుచున్నాను, నీవుయితరులకుగపటమని తెలియనిమంచిమాటలచేత నన్నోదార్చుచు, "బోయవాఁడుమధురమైన గానధ్వనినిగలిగించి మృగములనుస్వాధీనము జేసికొని జంపునట్లు" నన్నుఁస్వాధీనము జేసికొనిచంపుచున్నావు, ఆడుదానిమాటలనువిని యల్పసుఖముకొఱకు కొడుకునునరణ్యమునకుఁబంపితినేని నన్నుఁజూచి రాజవీధులందుఁ బెద్దలందఱును దశరథుఁడు మహాదుష్టుఁడని "కల్లుద్రాగినబ్రాహ్మణుని" నిందించినవిధముగనిందింతురు, ఆహా! యెంతదుఃఖమువచ్చెను, అయ్యో యెంతకష్టమువచ్చెను, రామునినరణ్యమునకుఁబంపుమని నీవుపలుకుచున్న కఠినపుమాటలనువినియును బ్రతికియున్నానే? ఈదుఃఖము పూర్వజన్మమునందలిపాపమువలనఁ గలిగినట్లున్నది, కావున నేయీదుఃఖమును బోఁగొట్టుకొనుటకొఱకు శక్తిలేకయున్నది, పాపిష్ఠురాలా! కైకేయీ! నేను దెలివిలేనివాఁడనై యురిత్రాటిని చిరకాలము కాపాడినట్లు నిన్నుఁ గాపాడితిని, నీవునాకురిత్రాడువలెనైతివిగదే? (అనఁగానురిత్రాడును గాపాడుచుండఁగా నాత్రాడే వానినిజంపునట్లు నీవునన్నుఁజంపుదానవైతివనుట) నేనునీతోఁగ్రీడించుచుండి నిన్నుమృత్యువునుగా దెలియలేకపోతిని, బాలుఁడెవ్వరును లేనప్పుడు జ్ఞానహీనతచే నల్లత్రాచుపామును జేతఁబట్టుకొనియాపాముచేతఁ గరవఁబడిచచ్చినట్లు తెలియకనిన్నుఁ నేను బెండ్లాడినందుకు నీవే నాచావునకు గారణభూతురాలగుచున్నావు. మహాత్ముండైన పుత్రుఁడగు రామునకుఁ దండ్రి జేయఁదగిన సంరక్షణను, దురాత్ముఁడైన నేను దండ్రినిగానుండి చేయనివాఁడనైతిని, ఇట్టిదుర్మార్గుఁడనైన నన్నుజనులందఱునునిశ్చయముగానిందింతురు, లోకములోనెటువంటి దుర్మార్గుఁడైనను, ఆడుదానిమాటనువిని కుమారునినడవులకుఁ బంపినవాఁడుగలఁడా? ఆహా యిది యెంతయాశ్చర్యము, దుర్మార్గుఁడైన దశరథమహారాజు పెండ్లాము చెప్పినమాటలనువిని నరణ్యమునకుఁబంపెను. ఈదశరథుఁడతికాముకుఁడు మూఢుడనినిందింతురు. రాముఁడువ్రతములచేతను, బ్రహ్మచర్యవ్రతములచేతను, గురువులచేతను, కృశింపఁజేయఁబడిసుఖమనునదే యెఱుఁగఁడయ్యె, ఇకమీదభోగంబనుభవించవలసినకాలంబై యుండఁగ నీకాలమునందుఁ గొప్పదగు కష్టమును బొందఁబోవుచున్నాఁడు, (అనఁగా నుపవాసాదివ్రతములను, బ్రహ్మచర్యాదివ్రతములను, ఆచరించిమిక్కిలికష్టములను జెంది గురువులసమీపమునందు సకలవిద్యలను చదువుకొని రాజ్యమును బాలించుటకుఁ దగినసామర్థ్యమునుగలిగించుకొనిన రాముఁడు రాజ్యమును వదలి యరణ్యమునకుఁ బోవలసివచ్చెననుట) నేను రామునింజూచి రాముఁడా! నీవరణ్యమునకుబొమ్ముఅని చెప్పితినేని, మంచిది అట్లనేపోయివచ్చెదనని చెప్పును గాని బదులేమియు జెప్పడు-మఱియు రాముని నడవికిబొమ్మని చెప్పితినేని నేబోవుటలేదని నాకు ప్రతికూలముగ జెప్పిననవ నాకుమిక్కిలి యిష్టముగనుండును అయ్యో, పసివాఁడైన రాముఁడుమాత్రమట్లెన్నటికినిఁ జెప్పఁడే! హా దైవమా! నేనేమిచేయుదును- నిష్కపటుండగు రాముఁడు, తన్నడవికిబొమ్మనిచెప్పుట నాకిష్టములేక చెప్పుచున్నానని నాభావంబును దెలిసికొని నేనడవికిబోవుటలేదని చెప్పఁడు. కావున రామా నీవరణ్యములకు బొమ్మని చెప్పితినేని తత్క్షణమున బైలుదేరిపోవును. రెండవమాట చెప్పడు- రామునరణ్యమునకుఁబంపఁగానే సమస్తజనులచేతను నిందింపఁబడుచున్నవాఁడును, మహాపాపిష్ఠుఁడను, నగునన్ను మృత్యుదేవతసహింపక చంపియమలోకమునకుఁదీసికొనిపోయి ఘోరనరకములయందు ద్రోయించును, అయ్యో కైకేయీ! నన్నెంతదుర్మార్గునిగాఁ జేసితివే? నేను మరణమును బొందుటను రాముఁడరణ్యమునకుఁ బోవుటనువిననతోడనే మిగిలిన నాయొక్క యిష్టజనులకందఱకును నేమికష్టములను గలిగింపఁదలఁచియున్నావోగదా? ఇట్లు కౌసల్యను, నన్నును, రాముని, పుత్రులగు లక్ష్మణశత్రుఘ్నులను, నీవుచంపినతోడనే సుమిత్రయునుదుఃఖమునుబట్టఁజాలకచచ్చిపోవును. ఓకైకేయీ! కౌసల్యను, సుమిత్రను, నన్నును, రామలక్ష్మణశత్రుఘ్నులతోఁగూడఁ జంపి మమ్ములనందఱను నరకమునందుఁబడఁద్రోసి నీవుమాత్రము సుఖపడఁదలఁచియున్నావు కాఁబోలు, అటులనే సుఖమునుబొందుము, అట్లు రామునిచేతను నాచేతనువిడిచిపెట్టఁబడినదియును, శాశ్వతముగుఁ బ్రతిష్ఠగలదియును, దోషగుణములులేనిదియునునగు నిక్ష్వాకుకులమును నీకగలతనొందునట్లు పరిపాలింపగలవు? రాముఁడరణ్యమునకుఁ బోయినపిమ్మట భరతుఁడు సంతోషమునుబొందునేని నేను

మరణము బొందినపుడు నాకుఁ బ్రేతకృత్యములను జేయఁదగఁడు. హాదుష్టురాలా! నాకుశత్రువైన దానా! కైకేయీ! రామునియందు, ప్రేమగలదాన వగుదువే? రాముఁడువనమునకుఁ బోఁగానే నేనుచనిపోదును. పిమ్మటనీవు ముండమోపివై కొడుకుతోఁగూడరాజ్యమును జేయఁదలఁచితివా? యేమి? నీవురాజపుత్రికవని యెడునెపముచేత నాయింటికివచ్చితివి వచ్చినాకపకీర్తియును, నాకులమున కవమానమును నీలోకమున శాశ్వతముగనుండునట్లుచేసితివి. అందువలనఁ బాపాత్ముఁడు సకలభూతములకంటెను హీనుఁడైనట్లునేను నీమూలకముగఁ బరమనీచుఁడనైపోతిని. ప్రభువునునాప్రియకుమారుఁడైన రాముఁడు మాటిమాటికిని, రథములనెక్కియు, ఏనుఁగులనెక్కియును దిరుగుచుండును. అట్టిరాముఁడు మహారణ్యములయందుఁ బాదచారియై యెట్లుసంచరించును, రాముఁడు భోజనమును జేయునపుడు తళతళలాడుచున్న పోగులను ధరించినేని, వంటవారు నేనువంటచేసెదను, నేనువడ్డించెదనని చెప్పుచు, పానముసేయఁదగినదియును, భుజింపఁదగినదియును నగునాహారములను బహుప్రశస్తముగ వండుచు వడ్డింపుదురు. అట్టిపదార్థములను భుజించినరాముఁడు, వగరుగలిగినవియును, చేదైనవియును, కారముగలవియును, నగుపదార్థములను భుజించుచునరణ్యమునం దెట్లుజీవించును మిక్కిలివెలగల వస్త్రములను ధరించియుండు వాఁడును, కూర్చుండునంత సేపును సుఖముగాసరుపుల యందుఁ గూర్చుండువాఁడును, నగు రాముఁడు కాషాయ వస్త్రములను ధరించినవాఁడై భూమియందుఁబరుండి యెట్లునివసింపఁగలఁడు. ఓకైకేయీ! రామునినడవులకుఁ బంపుమనియును, భరతునకుఁ బట్టాభిషేకమును జేయుమనియును, నిట్టిభయంకరమైనకార్యమును గొంచెమైన నాలోచింపక నీకుబోధించినవాఁ డెవ్వఁడు? అనిచెప్పికొంచముసేపూరకుండి హాహాకారముసేయుచు నలుదిక్కులం జూచుచునయ్యో లోకములోనుండు ఆడువారలందఱును నితరులకు దెలియకుండునట్లు గీడునుజేయువారలు. సర్వకాలములయందును దమకార్యములయందే యాసక్తిగలవారు. పరులకార్యమును గుఱించికొంచెమైనను, యోచింపరు, ఛీ లోకములోని స్త్రీలందఱును మండిపోదురుగాక. అనిచెప్పి మఱియునిట్లనియె.

ఐనను లోకములో బతివ్రతలగుస్త్రీలనేకులుగలరు. కావున నేను స్త్రీలనందఱను నిందింపఁజాలను. భరతునితల్లియైనకైకేయిని మాత్రము నిందించెదను. అనర్థమునుగలిగించుదానా! స్వకార్యమునందే యాసక్తిగలదానా! క్రూరురాలా! నన్నుదుఃఖమును బెట్టుటయందు బుద్ధిగలదానా! ఎట్టిదురభిప్రాయము నవలంబించితివే? నేనునీకేమికీడుచేసినానే? సకలలోకములకును మేలునుజేయునట్టిరాముఁడునీకేమికీడుచేసెనే? ఛీ ఛీ దుర్మార్గురాలా! యింతయపకారమును జేయఁదలఁచితివిగదా? మిక్కిలివ్యసనమును బొందుచున్న రామునిఁజూచి లోకమంతయును నామీదమిగులఁ గోపముగలదియగును. తల్లితండ్రు లనురాగముగల వారయ్యును పుత్రులనుగూడవదలి రామునిగుఱించి దుఃఖమునుబొందుదురు. స్త్రీలుతమభర్తలయందు మిగులఁబ్రియముగలవారైనను, భర్తలనుగూడవదలిరామునికొఱకు దుఃఖమును జెందుదురు. దేవతాపుత్రుని యొక్క సౌందర్యమువంటి సౌందర్యముగలవాఁడును, సర్వాలంకారములచేతను నలంకరింపఁబడిన వాఁడునునై రాముఁడు మార్గమునందు వచ్చునపుడుచూచి నేనుబరమానందమును బొందుదును. చూచిమరల యౌవనముగలవానివలె దుముకుచుండును. (అనఁగా నా దేహమునకుఁ బుష్టియును, వీర్యోత్సాహంబులు గలుగుచున్నవనుట.) లోకము, సూర్యుఁడులేకపోయినను, ఇంద్రుఁడువర్షమును వర్షింపకపోయినను, చక్కగానుండునుగాని రాముఁడువనములకుఁబోవుటను జూచినేని మిగులవ్యసనమును జెందిజీవింపజాలవు. మఱియునెల్లవారును మృతినొందుదురు. నాకుఁగీడునుగోరుచు నాకపకారమును జేయుచున్నదానవైన నిన్నునేను దెలియక మృత్యుదేవతను నింటిలోఁబెట్టుకొన్నట్లు నాగృహమునందుంచుకొంటిని. నేనెంతయవివేకపు కార్యమును జేసితిని, మిక్కిలివిషముగల సర్పమును తొడయందుఁబెట్టికొనికూర్చున్నవిధముగ బుద్ధిలేనితనముచేత నిన్నునాతొడమీఁదఁగూర్చుండఁ బెట్టుకొన్నందున నన్నుఁజంపితివి రామలక్ష్మణులతోఁ గూడనేనుమరణమును బొందినపిమ్మటభరతుఁడునీతోఁ గూడభూమినిబాలించుగాక. రాజ్యమునందును, ఈపట్టణమునందును, నున్నజనులను, బంధువులను, జంపిభరతుఁడు ప్రభుత్వమును జేయవలయునని నీకిష్టమున్నట్లుతోచుచున్నది. నీవునాశత్రువులతోఁ గూడిసంతోషముగనుండ వలయునని కోరుచున్నావు కాఁబోలు. దయలేనివ్యాపారముగలదానా! ఆపత్కాలమునందుఁ గొట్టుదానా! ఇప్పుడిచటనీవుమిగుల స్వతంత్రించిమాటను జెప్పుచున్నావు. అందువలననీ నోటిలోనిపండ్లన్నియుజలజలమని రాలిక్రిందఁ బడిపోవును గాక. ఎంతటిపరుషవచనములను బలికితివే? ఇట్టిదుర్మార్గమెందైనఁగలదా? రాముఁడెప్పుడును గీడునుగలిగించునదియును, అప్రియమైనదియును, అగుమాటను గొంచెమైనను జెప్పువాఁడుగాఁడు. రాము

నకు పరుషవచనములను బలుకుట తెలియనే తెలియదు. మనోహరముగ మాటలాడు వాఁడును, సద్గుణములచేత సర్వకాలములయందును, ఇష్టుఁడును, నగు రామునియందుఁ దప్పును బెట్టి దోషముల నెట్లు చెప్పుచున్నావే? కేకయరాజకులపాంసనీ!

కైకేయీ! నీవు మహాదుఃఖమును బొందినను, భగభగమండుచుండు అగ్నిలోబడి మండిపోయినను, తలరాయను బగులఁ గొట్టుకొని చచ్చినను, మహాభయంకరమైనదియును, నాకిష్టము లేనిదియును, అగు నీకోరికను నేను నెరవేర్చను. నీవు చెప్పినపనిని జేయను, మంగళకర్త్రిశో సమానురాలవైనదానా! అసత్యములైన ప్రియవచనములను బలుకుదానవున, మిక్కిలి దుష్టబుద్ధిగల దానవును, నాకులమును నాశనము జేయుదానవును, మనస్సునకు సంతోషమును గలుగఁ జేయనిదానవును, ప్రాణముతోఁగూడిన మనస్సును దహింపఁ జేయుదానవును, నగు నీవిఁక బ్రతికియుండుటను నేను బూతఁజాలను, నీవు మరణమును బొందితివేని నాకు మిగుల యిష్టముగనుండును. ఇఁక నా ప్రాణములుండవు? కొడుకుపోయిన పిమ్మట నాకు సుఖమెట్లు గలుగును? నాకు సంతోషమెట్లుండును? దేవీ! కైకేయీ! నాకుఁ గీడును జేయుటకు నీవు తగవు (అనఁగా నీవు నాకుఁ గీడును జేయఁ గూడదనుట.) నీపాదములకు నమస్కారమును జేసెదననియె. ఇట్లు మహాదీనుడై పలుకుచు నా దశరథమహారాజు, దుష్టురాలగు నాదు దానిచేతిలోఁ దగులుకొని దిక్కులేనివాని వలె బోరుమని కంటియందు ధారధారగ నీరు ప్రవహింపగా నేడ్చుచు కైకేయియొక్క చాచియున్న పాదములకు నమస్కారమును జేయఁబోయిన నా కైకేయి పాదములను నవతలికి త్రిప్పుకొనుటచే పాదములను ముట్టకయే" రోగముగలవాఁడ శక్తిచే క్రిందఁబడి పోవునట్లు,, క్రిందఁబడెను.

ఇట్లు శ్రీమదయోధ్యా కాండమునందలి పదిరెండవసర్గముగిసెను.

—దశరథుడు మహాదుఃఖముచే కైకేయిని ప్రార్థించుట.—

అంత, పాపస్వరూపురాలును, సఫలముగానికోర్కెగలదియును, భయము లేనిదియును, దశరథునకుఁ గలిగియున్న భయమును గుఱించి కొంచమైన నాలోచింపనిదియును, భయమును గలిగించునదియును, నగు నాదుదిమైన కైకేయి, పుత్రశోకమువలనను లోకాపవాదము వలనఁ గలిగెడు దుఃఖమునకుఁ దగనివాఁడును, వట్టినేలయందుఁ బరుండియున్నవాఁడును, అప్రకారము క్రిందపడియుండుటకుఁ దగనివాఁడును" పుణ్యముననశించుటచే స్వర్గలోకమునుండి భూలోకమునకు వచ్చిన యయాతివలెనున్నవాఁడును," నగు దశరథమహారాజును మరల నావరములను నాకిమ్మని యడుగుటకయ్యే, దశరథమహారాజా! దశరథమహారాజా! యనిపిలచి యిట్లనియె.

మహారాజా! దశరథభూవల్లభా! నీవు సత్యముగ మాటాడువాఁడననియును, దృఢవ్రతుఁడననియును నిన్ను నీవే పొగడుకొనుచున్నావు. అట్టినీవు నావరములను మాత్రమివ్వడము లేదని కట్టిపెట్టునుబట్టి మాట్లాడనేల? యనియె. అనియిట్లు పలికినపలుకులను విని దశరథమహారాజు మిగుల గోపముగలవాఁడై క్షణముసేపు మూర్ఛిల్లె. అంతట మరల తెలివిని దెచ్చుకొని యిట్లనియె. హాదుష్టురాలా! కైకేయీ! నీవంటి క్రూరురాలిని నేనెక్కడను జూచినదే లేదు. శత్రురాలా! నేను చనిపోయిన పిమ్మటను, రాముఁడరణ్యమునకుఁ బోయిన పిమ్మటను నీకోరికను నెరవేర్చుకొని నీవు సుఖముగనుండుము. ఆహా యెంత విచిత్రము. అయ్యో నేను స్వర్గమునందు గూడ దేవతలవలన రామునియొక్క క్షేమవార్తను దిరస్కారపూర్వకముగఁ దెలిసికొని యెట్లు సహింపఁగలను. కైకేయికిఁ బ్రియమును జేయఁదలఁచి రాముని నరణ్యమునకుఁ బంపితినని, సత్యంబైన నీమాటను జెప్పితినేని రాముని కిమరునాడు పట్టాభిషేకమును జేయుదునని చెప్పిన మాట యసత్యమగునే? నేను బహుకాలము సంతానము లేక నానావిధములగు వ్రతములనాచరించి యధికకష్టములననుభవించితి. అంతట దైవానుగ్రహముగలవాఁడనై, పూజ్యుఁడును మహాబాహుఁడును, నగు రాముని గొడుకునుగాఁ బొందితిని. అట్టి రాముని నే నెట్లు వనములకుఁ బంపుదును? అతనిని విడిచి నే నెట్లుండును? మహాశూరుఁడును- సకలవిద్యలు నేర్చినవాఁడును, జితక్రోధుఁడును, తామరరేకులవంటి కండ్లుకలవాఁడును, నగు రాముని నే నెట్లరణ్యమునకుఁ బంపుదును. నల్లకలువలయొక్క కాంతివంటి కాంతి గలవాఁడును, ఆజానుబాహుఁడును, అధికమైనబలము గలవాఁడును, లోకాభిరాముఁడును, నగు రాముని దండకారణ్యములకు నే నెట్లు పంపుదును? సుఖములను బొందుటకుఁ దగినవాఁడును. దుఃఖములను బొందుటకుఁ దగనివాఁడును, పండితుఁడును, నగు రాముఁడు దుఃఖములననుభవించుచుండే నేని నే నెట్లు చూచి సహింపఁగలను? దుఃఖపడుటకుఁదగని రామునకు దుఃఖమును గలిగించుటకు మునుపే నేను మరణమును బొందితినేని మిక్కిలి సుఖవంతుఁడనగుదును.

నిర్దయురాలా! పాపాత్మురాలా! కైకేయీ! నాకిష్టుఁడును, సత్యపరాక్రముఁడును, నగు రాముఁడరణ్యము

నశించిపోవలయునని నీకుఁగోరికగలుగుటకుఁగారణమేమి? ఎంత క్రూరకృత్యమును జేయఁదలఁచితివి? నీవిట్లు సేయుట వలననాకపకీర్తియును, అవమానమును, మితిలేకగలుగును.

అని యిట్లుదశరథమహారాజు వ్యాకులంబైన మనస్సుతో హోరుమని ధారాధారగఁగన్నీరువిడిచి యేడ్చుచుండగ సూర్యుఁడస్తమయమునుబొందెను. రాత్రివచ్చె. అంతచంద్రోదయమైనందున నాచంద్రకాంతిచేతనారాత్రి, ప్రకాశించుచుండినను దుఃఖసముద్రమునమునిఁగి రోదనముజేయుచున్న దశరథమహారాజునకు సంతోషమునుగలిగించుటకుశక్తిలేనిదయ్యె, (అనఁగాఁబండువెన్నెలగల యారాత్రియందు దశరథమహారాజు మిక్కిలిగానేడ్చుచుండెననుట) అట్లువృద్ధుఁడైనదశరథమహారాజు వేఁడినిట్టూర్పులనువిడుచుచు రోగాదులచే శ్రమనొందినవానివలె దుఃఖించుచు కండ్లుదెఱచి యాకాశమునుజూచి యిట్లనివిలపించెను.

నక్షత్రములచే శృంగారింపఁబడిన యోరాత్రీ! నీవు సూర్యోదయమును గాకుండునట్లు సేయుము. నాయందు దయగలిగి పగలునురానివ్వక నీవేయుండుము, ఓరాత్రీ! నీకు నమస్కారమును జేసెదను, అట్లుగాదేని నీవుశీఘ్రముగానైనను లేచిపొమ్ము. నీవుపోతివేని నాకుమహాదుఃఖమును గలిగించునట్టిదియును, నిర్దయురాలును, క్రూరురాలును, నగుకైకేయినిజూచుట నాకుసంభవింపకుండును, ఓరాత్రీ! నీవుశీఘ్రముగా వెళ్ళిపో, పోయినయెడల పగలువచ్చును, పగలువచ్చినతోడనే యీదుర్మార్గురాలిని జూడక బయలుదేరిపోదునని రోదనమును జేసె, ఇట్లు దశరథమహారాజుచెప్పి మరలజేతులనుజోడించుకొని కైకేయికినమస్కారమునుచేసి తనయందుదయగలుగునట్లుగ నూరడింపుదునిట్లనియె.

మంగళకరురాలా! కైకేయీ! సదాచారముగలవాఁడను, దుఃఖమును జెందుచున్నవాఁడను, నిన్నుశరణుజెందినవాఁడను, జీవితకాలమంతయుఁగడచి కొంచెముమిగిలియున్న జీవితకాలముగలవాఁడను, ప్రభువును, నగునాయందుదయగలదానవగుము. సుందరమగుపిరుదులుగలదానా! కైకేయీ! ఎవ్వరునులేనిచోట నేనురామునకుఁ బట్టాభిషేకమునుజేసెదనని చెప్పినవాఁడనుగాను. కావుననోబాలా! నీవుమంచిహృదయముగలదానవుగనుకనామాట నసత్యముగఁజేయకుము. మొదటవిన్నవారందఱును నన్నునానావిధములనిందింతురు. నల్లనికడగండ్లుగలదానా! దేవీ! కైకేయీ! ప్రసన్నురాలవగుము, అట్లయితివేని వరబలంబుననివేనాచే రాజ్యమునుబొంది మఱలశాశ్వతమగురాజ్యమునునాయొక్కపుత్రుఁడైనరామునకిచ్చినట్లులోకములందు యత్యధికమైన కీర్తినిసంపాదించుకొనుము, పెద్దపిఱుందులుగలదానా! మనోహరమగు ముఖముగలదానా! సుందరములైన నేత్రములుగలదానా! కైకేయీ! నీవట్లు జేసితివేనినాకును, రామునకును, లోకమునకును, పెద్దలకును, భరతునకును, సంతోషముగలిగించిన దానవగుదువు. మఱియు నోకైకేయీ! లోకులు, మిక్కిలి చెడ్డహృదయముగలదియును, క్రూరురాలునునగుకైకేయి! పరిశుద్ధమైన హృదయముగలవాఁడును, ఎఱ్ఱనినేత్రములుగలవాఁడును, కన్నీళ్ళతోనిండిన కండ్లుగలవాఁడును, అగుదశరథమహారాజుయొక్క, నానావిధములైనదియును, విచిత్రమైనదియును, వినువారికిదయనుగల్గించునదియును, అగువిలాపమునువిని యెంత యేడ్చినను పనిమిటిచెప్పినప్రకారము చేయనేలేదని నిన్నునిందింతురనిచెప్పె. ఇట్లుచెప్పి పూర్వముతనకనుకూలముగానుండి పాతివ్రత్యవ్రతమునవలంబించినకైకేయి, రామునినడవులకుఁబంపుమని కఠినమగు మాటంజెప్పగదాయనిదలంచుకొని యేమిచేయవలసినదియునుదోచక యేడ్చుచు మరలమూర్ఛనుబొంది భూమియందుఁబడెను. ఇట్లుదశరథమహారాజు మిగులదుఃఖముగలవాఁడై నిట్టూర్పులనువిడుచుచుండఁగా రాత్రియంతయునుగడచిపోయెను. అంతప్రభాతకాలంబైనందున సర్వోత్తముఁడైనయాదశరథమహారాజునుభృత్యులు మేలుకొలుపరాగా తన్నుమేలుకొలుపవద్దని మేలుకొలుపువారలతోచెప్పెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి పదమూడవసర్గముగిసెను.

—{ రామాభిషేకమునకునాటంకముసేయవలదని దశరథుడుకైకేయినిప్రార్థించుట. }—

ఇట్లు కొడుకునుగుఱించి మిక్కిలిదుఃఖపడుచున్నవాఁడును, తెలివిలేకభూమియందుఁ బడియున్నవాఁడును, భూమియందుఁబడి పొరలుచున్నవాఁడును, నగునిక్ష్వాకువంశమునందుఁబుట్టిన దశరథమహారాజును పాపాత్మురాలైనయాకైకేయి జూచియిట్లనియె.

దశరథమహారాజా! నీవుమంచుక రెండువరములనిచ్చెదనని ప్రతిజ్ఞనుజేసితివి, అట్లుప్రతిజ్ఞనుజేసి యిపుడుధర్మమునవలంబించి దుఃఖముగలవాఁడవై భూమియందుఁ బడిపొరలుచున్నావు, ఇట్లు (వేషమువేసికొని) వ్యసనమునుబొందుటవలనఁ బ్రయోజనమేమియునులేదు. చెప్పినమాటదప్పక సత్యపరిపాలకుఁడవని కీర్తినివహింపుము. "శ్లో॥ అహుస్సత్యంహిపరమం ధర్మంధర్మవిదోజనాః।

సత్యమాశ్రిత్యహిమయా త్వంచధర్మంప్రచోదితః,, ధర్మవేత్తలు సత్యమునే పరమధర్మమని చెప్పుదురు, కాఁబట్టి నేనుసత్యస్వరూపమగు పరమధర్మమువవలంబించియే వరములనిమ్మనినిన్నుఁ బ్రార్థించితిని. దశరథమహారాజా! పూర్వము భూమికిఁబ్రభువైన శిబిచక్రవర్తి మొదటఁబ్రతిజ్ఞను జేసినందువలనఁ బక్షియైన డేగకొఱకు తనశరీరముగోసిమాంసమునుఇచ్చి యుత్తమలోకమును బొందెననియును, అటులనే యలరుకుఁడను రాజేన్ద్రుఁడును, వేదవేదాంగములను సంపూర్ణముగఁజదివినబ్రాహ్మణుఁడు యాచించినదానినిచ్చెదనని ముందుఁగాబ్రతిజ్ఞను జేసి పిమ్మటఁగొంచెమైననుసందేహింపక తనయొక్కనేత్రముల నూడఁబెరికియిచ్చెననియును. నదులకుభర్తయగు సముద్రుఁడుసత్యమునవలంబించినందువలన సత్యమునుదప్పుట మహాపాతకమనియెంచికట్ట (అనగాచెలియలికట్ట) నతిక్రమించికొంచెమైనను దాటిరాడయ్యెననియును నిదివరకేచెప్పియున్నానుగదా! "శ్లో॥ సత్యమేకపదంబ్రహ్మ సత్యేధర్మఃప్రతిష్ఠితః। సత్యమేవాక్షయా వేదా స్సత్యేనై వాప్యతేపరమ్,, సత్యమనువది పరమప్రాప్యమును, ఓంకారరూపమునునగుపరబ్రహ్మము, సత్యమునందే సకలధర్మములను బ్రతిష్ఠింపఁబడియున్నవి, నిత్యములగు వేదములన్నియును సత్యమేప్రధానమనిచెప్పుచున్నవి, సత్యముగలవాఁడుపరమపురుషార్థమగు మోక్షమునుబొందవచ్చును, కాఁబట్టిఉత్తముఁడవైన యోదశరథమహారాజా! నీవుధర్మమునందుబుద్ధిస్థిరముగానుండినయెడల సత్యముకంటె నధికమైనధర్మమేదియును లేదు, కాఁబట్టిసత్యమునుదప్పకుము, నేనుగోరినవరములను సఫలముగాఁజేయుము, నీవందఱికినివరములనిచ్చువాఁడవుగనుక మొదటనిచ్చెదననిచెప్పిన వరములనివ్వుము, ఇప్పుడుధర్మమునిద్ధించుటకొఱకు నేనుజెప్పినచొప్పున రామునినడవులకుఁబంపుమని నిన్నుగూర్చి ముమ్మాటికిఁజెప్పుచున్నాను. ఆర్యా! దశరథమహారాజా! నీవునావరములను నాకివ్వకపోయినయెడల నేనునీవుచూచుచుండఁగ నీముందరఁ బ్రాణములను విడుతుననియె.

ఇట్లు కొంచెమైననుసందేహింపక కఠినముగబలుకుచున్న కైకేయియొక్కవచనములనువిని మొదటఁగైకకరినముగ కోరినవరములనిచ్చెదనని చెప్పినవాఁడుగావున సత్యమునుదప్పనివాఁడై పూర్వముబలిచక్రవర్తి వామనునకు మూడడుగుల భూమియిచ్చి పిదపయదివిపరీతంబైనను సత్యమునకు బద్ధుండైనట్లుచెప్పినప్రకారము చేయకుండుటకుసరిపడదని తలఁచినవాఁడయ్యె. అట్టియెడదశరథమహారాజు కైకేయికిచ్చెదనని చెప్పి సత్యవాక్యమునుదప్పుటకును, ప్రియపుత్రుఁడగురామునినడవులకుఁబంపుటకును, తోచకబండికాడికిని చక్రమునకునుమధ్య గట్టఁబడినయెద్దువలె దిరుగుడుపడుచున్న మనస్సుతోడను, వ్యసనముచేవెలవెలబోవుచున్న ముఖముతోడను నేమియును జెప్పఁజాలకయూరకుండె మఱియునాదశరథమహారాజుఏడ్చిఏడ్చికలతచాలిన కన్నులుగలవాడగుటచే దిక్కులు తెలియకనంధునివలెనున్నవాఁడయి మహాకష్టమునసలలవలె నుప్పొంగివచ్చెడు దుఃఖమునునడచుకొని కండ్లెత్తికైకేయినిఁ జూచి యిట్లనియె.

పాపిష్ఠురాలా! కైకేయీ! అగ్నిసాక్షిగాఁబూర్వము మంత్రపురస్సరముగా నీహస్తమును గ్రహించితిని, (అనఁగానిన్నుఁబెండ్లిచేసికొంటిని) అటువంటినిన్నుయిపుడువిడిచిపెట్టితిని, నేనిఁకమీఁదట నీకుభర్తనుగాను, నీవునాకుభార్యవుకావు. నాకుఁబుట్టిననీకొడుకైన భరతునిగూడనీతోసమముగవిడిచిపెట్టితిని, కైకేయీ! రాత్రిగడచిపోయినది. సూర్యోదయమగుచున్నది, ఇంకఁరామునిపట్టాభిషేకమునుగుఱించి సిద్ధముజేసినవస్తువులతోడ వసిష్ఠుఁడుమొదలగువారువచ్చి రామునకుఁబట్టాభిషేకమును జేయుమని నన్నుఁద్వరఁబెట్టుదురు. ఇదినిశ్చయము. రామాభిషేకమునకువిఘ్నముగలిగెనేని నాప్రాణములుపోవును, అంతనాకురామునిచేతనే ప్రేతకృత్యములను జేయింపవలయును, దురాచారములుగలదానా! కైకేయీ! రామాభిషేకమునకు నాటంకమునుగలిగించితివేని భరతునితోఁగూడనీవు నాకుఁ బ్రేతకృత్యములను జేయనేకూడదు. పూర్వము రామునకుఁ బట్టాభిషేకమునుజేసెదనని చెప్పినపుడుసకలజనులును, పరమానందమునుబొంది వికసించినముఖముగలవారైరి, మఱియునుసంతోషముచేతఁ గగుర్పాటుగలవారైరి. అట్టిజనులందఱునునిపుడు రామునినడవులకుఁబంపెదననిచెప్పఁగానే దుఃఖముచేతఁ దలలనువంచుకొందురు, అట్టిజనులను నేనెట్లుచూడఁగలను? నేనుజూడఁజాలననియె. ఇట్లుమహాత్ముఁడగు దశరథమహారాజు పలుకుచుండఁగ బుణ్యంబైనదియును, చంద్రునితోనునక్షత్రములతోనుగూడినదియును మనోహరముగఁ బ్రకాశించుచున్నదియును, నగురాత్రిగడచిపోయెను. (అనఁగాదెల్లవారినదనుట) అటుపిమ్మటదురాచారురాలును విశేషముగమాటలునేర్చినదియును,అగుకైకేయిమహాకోపముగలదైదశరథమహారాజునుజూచి కఠినమగుమాటలతోనిట్లనియె అయ్యా దశరథమహారాజా! నీవిట్లువిషరోగముతో సమానమైనకఠినములగు మాటలనేలజెప్పుచున్నావు ఏలయిట్లుసంకటపడియెదవు. వ్యసనమునువదిలియిక్కడికి బుత్రుఁడయిన

రామునిరప్పించుము. నాపుత్త్రుఁడగు భరతునకుఁ బట్టాభిషేకమును జేసి రాముని నడవులకుఁ బంపి నాకుశత్రువులు లేకుండునట్లు సేసి సత్యవాక్యమును బరిపాలించినవాఁడవగుమనియె. అంత "చుఱుకైనచౌకుచేతఁ గొట్టఁబడిన గుఱ్ఱమువలె,, దశరథమహారాజు కైకేయిచే బహుపర్యాయములు కఠినపుమాటలుపలుకఁ బడినవాఁడై కైకేయింజూచి యిట్లనియె. హాకైకేయీ! నేను ధర్మపాశముచేత బద్ధుఁడనైతిని. బుద్ధియు నవశించినది. జ్యేష్ఠపుత్త్రుఁడును, ప్రియుఁడును, ధార్మికుఁడును, నగురాముని జూడవలయునని యిచ్ఛయించుచున్నానని యె. అంతలోనంత సేపటికిఁ దెల్లవారె. సూర్యోదయమయ్యె. పిమ్మటఁబుష్యనక్షత్రయోగముగూడిన ముహూర్తముసమీపించె.

— రాముని పట్టాభిషేకము సేయుటకై వసిష్ఠమహర్షి బైలు వెడలివచ్చుట.

అట్టియెడసకలగుణసంపన్నుఁడగు వసిష్ఠమునివరుఁడు శిష్యులతోఁగూడి పట్టాభిషేకమునకు వలయుసంభారములనుదీసికొని నయోధ్యాపట్టణమును బ్రవేశించె. జలముచే తడుపఁబడినవియును. కసువుచిమ్మఁబడినవియునునగు మార్గములుగలదియును, శ్రేష్ఠములగు టెక్కెములచేనలంకరింపఁబడినవియును, నానావిధములగు పుష్పములు వెదజల్లఁబడినదియును నానావిధములైన పూలమాలికలచే నలంకరింపఁబడినదియును, మహాసంతోషముగల మనుష్యులతోఁ గూడుకొన్నదియును, సకలపదార్థములతో నిండియుండు నంగళ్లుగలదియును, పట్టాభిషేకమును గుఱించినమహోత్సాహముగలజనులుగలదియును, చందనాగరుధూపములచే సకలస్థలములయందును పొగవేయఁబడినదియు, స్వర్గపట్టణమునకు సమానమైనదియును, నగునయోధ్యాపట్టణమును దాటి నానావిధపక్షులతోఁగూడినదియును, పట్టణగ్రామవాసులచే నిండియుండునదియును, బ్రాహ్మణులచే సర్వత్రప్రకాశింపఁ బడుచున్నదియును, యజ్ఞవేత్తలును, ఉత్తమబ్రాహ్మణులును నగుసదస్యులచేతఁజక్కఁగానిండియున్నదియునగు నంతఃపురమును వసిష్ఠమహాముని చూచె. ఇట్లు మునికులోత్తముఁడగునా వసిష్ఠమహాముని చూచి మిక్కిలి సంతోషముతోఁగూడి యంతఃపురములోనికిఁబోయియచ్చటనుండుజనుల నందఱను దాఁటి ద్వారముయొక్క మధ్యప్రదేశమునకు బోయిఅందు, అవటికప్పుడే వచ్చియున్నవాఁడును, దశరథమహారాజునకు మంత్రియును, చూచుటకు మనోహరమైనవాఁడును, నగుసుమంత్రుఁడను సారథిం జూచెను ఇట్లు చూచి మహాతేజోవంతుఁడగు వసిష్ఠమహాముని, పండితుఁడును, తేజనదుపువాని పుత్త్రుఁడును, అగునాసుమంత్రునితోనిట్లనియె.

సుమంత్రుఁడా! నేనువచ్చియున్న సమాచారమునుదశరథమహారాజునకు శీఘ్రముగఁజెప్పుమనియె. మఱియును గంగోదకములతోఁగూడి నవియును, సముద్రోదకములతోఁ గూడినవియును నగుసువర్ణకలశములు రామాభిషేకమునకొఱకుఁ దీసికొనివచ్చితిని చెప్పుము. మేడికొయ్యతోఁ జేయఁబడిన భద్రాసనమును (అనఁగా రాజులు పట్టాభిషేకసమయమునందుఁ గూర్చుండుపీఠమును) రామపట్టాభిషేకముకొఱకుఁ దెచ్చితిమని చెప్పుము. నవధాన్యములును, గంధములును, నానావిధములగు రత్నములును దేఁబడినవని చెప్పుము. తేనె, పెరుగు, నేయి, పేలాలు, దర్భలు, పుష్పములు, పాలు, మనోహరమైన రూపములుగలయెనిమిదిమందికన్యలు, మదపుటేనుఁగు, మొదలగునవి యన్నియును దేఁబడినవని చెప్పుము. మిగులకాంతితోఁ గూడినదియును, నాలుగుగుఱ్ఱములు గలదియును, అగురథమును, కత్తియును, శ్రేష్ఠమైనవిల్లును, మనుష్యులతోఁగూడిన పల్లకియును, చంద్రునితో సమానమైన గొడుగును, తీసికొనిరాఁబడినవని చెప్పుము. మఱియును దెల్లని వింజామరములును, బంగారముచేఁ జేయఁబడినగిండిపాత్రయును, బంగారుపగ్గములచే బంధింపఁబడినదియును, తెల్లనికాంతిగలదియునునగు వృషభమును, తేఁబడినవని చెప్పుము. మెడయందు మేలయిన వెంట్రుకలుగలదియును, నాలుగుపండ్లు మొలిచినదియును, మిగులబలముగలదియును నగునుత్తమమగు ఋషభముగూడఁ దేఁబడినదని చెప్పుము సింహాసనమును, పులితోలును, జ్వలించుచున్నయగ్నిహోత్రమును, దేఁబడినవని చెప్పుము సమస్తమైన వాద్యములయొక్క సముదాయములును, వేశ్యాంగనలును, సర్వాభరణములచే నలంకరింపఁ బడినస్త్రీలును, దేఁబడియున్నది అనేకులగు బ్రాహ్మణులు, వచ్చియున్నారు. గోవులును, పావనములగు మృగపక్షులును, తీసికొనిరాఁబడియున్నవి. పట్టణములయందుండు వారలలోను, పల్లెలయందుండు వారలలోను శ్రేష్ఠులగువారును. వర్తకులును, మఱియును వీధులలోఁ గాపురముండువారును వచ్చియున్నారు వీరలుగాక ప్రియముగ మాటలాడునట్టి నానావిధమనుష్యులును వచ్చియున్నారు. ఎల్లవారును రామపట్టాభిషేకమహోత్సవమును జూడవలయునని యభిలాషగలిగియున్నారు అని చెప్పుము. మఱియు సుమంత్రా! శ్రేయస్కరమైనదియును, పవిత్రమైనదియును, శుభనక్షత్రయోగములు గలదియును, అగుముహూర్తమునందు రాముఁడెంత శీఘ్రముగఁ బట్టాభిషిక్తుఁడగునో యంతశీఘ్రతగలుగునట్లు దశరథమహారాజుతో

చెప్పుమనియె.

వసిష్ఠమహర్షి యాజ్ఞచే సుమంత్రుడు దశరథుని యొద్దకుబోయి నిద్రలేపుట

ఇట్లువసిష్ఠమహాముని చెప్పిన వచనములను సుమంత్రుండు విని రాజశ్రేష్ఠుండగు దశరథమహారాజును స్తోత్రము సేయుచు నంతఃపురములోనికిం బోవె. అట్టియెడ ద్వారపాలకులు దశరథమహారాజునకుఁ బ్రియమును జేయువారలుగావున, సుమంత్రుఁడు లోనికివచ్చునప్పుడు నిరాతంకముగ రానిండని దశరథమహారాజుచే జెప్పఁబడియున్నవాఁడును, రాజులకు సమ్మతమైనవాఁడును, వృద్ధుఁడును, అగు సుమంత్రుని నిరాతంకముగ నంతఃపురములోనికిఁబోనిచ్చిరి. అట్లులోపలికిఁబోయిన సుమంత్రుడు దశరథమహారాజునకుఁ గలిగియున్న యవస్థను దెలియనివాఁడై మిక్కిలి సంతోషమును బుట్టించునట్టిమాటలతో స్తోత్రమును జేయుట కారంభించెను, మఱియుసారథియగు సుమంత్రుఁడు కాలము నతిక్రమించకుండునట్లు దశరథమహారాజుయొక్క గృహమునందుఁ జేమోడ్పుగలవాఁడై జగతీపతియగు దశరథమహారాజు నిట్లుపొగడఁదొడఁగె. రాజోత్తమా! దశరథమహారాజా! సూర్యోదయకాలమునందు దేదీప్యమానుఁడగు సముద్రుఁడు మనస్సంతోషము గలవాఁడై యెట్లుసంతోషించునో యాప్రకారము నీవిపుడు సంతోషమును బొందుము. ఇంద్రుని సారథియగు మాతలి యీసమయమునందే దేవేంద్రుని బొగడెను. ఆయింద్రుఁడు రాక్షసులనందఱను జయించెను. ఆప్రకారమే నేను నిన్ను మేలుకొలుపుచున్నాను. కాఁబట్టి నీవుగూడ శత్రువులను జయింపఁగలవు. ఏప్రకారము, శిక్షావ్యాకరణాది శాస్త్రములతోఁగూడిన వేదములును, స్వయంభువుఁడును, సర్వేశ్వరుఁడును నగు బ్రహ్మదేవుని బోధించునన్నవో యాప్రకారముగానే యిప్పుడు నిన్ను నేను మేలుకొలుపుచున్నాను. సూర్యుఁడు, చంద్రునితోఁగూడ సకలప్రాణులను ధరించియున్న భూమిని నెట్లుమేలుకొలుపుచున్నాఁడో యట్లనే నేనుగూడ నిపుడు నిన్ను మేలుకొలుపుచున్నాను. మహారాజా! దశరథభూవల్లభా! నీవు కృతకౌతుకమంగళుఁడవును, శరీరముచే బ్రకాశించుచున్నవాఁడవునునై, మేరుపర్వతమునుండి సూర్యుఁడు లేచినవిధముగ నతిశీఘ్రముగ లెమ్ము. దశరథమహారాజా! చంద్రసూర్యులును, శివకుబేరులును, వరుణదేవుఁడును, అగ్నిహోత్రుఁడును, ఇంద్రుఁడును, నీకు జయమును గలుగఁజేయుదురుగాక. మాహాత్మ్యముగల రాత్రిగడచిపోయినది. రాత్రికాలమునందు చేయఁదగిన పనులనన్నియును నీవు జేసినవాఁడవైతివి. రాజశ్రేష్ఠుఁడా! దశరథమహారాజా! నీవిఁక మేలుకొని నిఁకజరుగవలసిన కార్యములను జేయుము. రామునిపట్టాభిషేకమును గుఱించిన ద్రవ్యమంతయును సిద్ధమైయున్నది. మహాత్ముఁడగు వసిష్ఠమహాముని పురజనులచేతను, పల్లెలయందుండువారలచేతను, వర్తకులచేతను, సేవింపఁబడుచు బ్రాహ్మణులతోఁగూడ ద్వారదేశమునందు వచ్చియున్నాఁడు. దశరథమహారాజా! రామునకుఁ బట్టాభిషేకమును జేయునట్లు శీఘ్రముగ నాజ్ఞాపింపుము. గోపాలకుఁడులేని పశువులవలెను. నాయకుఁడులేని సైన్యమువలెను. చంద్రుఁడులేనిరాత్రివలెను. ఆఁబోతులేని గోవులవలెను, రాజులేనిరాజ్యము ప్రకాశములేనిదై యుండును. కావున, నీవుశీఘ్రముగవచ్చి సకల జనులకును సంతోషమును గలుగఁజేయుమని సుమంత్రుఁడు దశరథమహారాజును బొగడెను. ఇట్లుసుమంత్రుఁడు మృదుమధురవచనములచే పొగడుచుండఁగ దశరథమహారాజునకుఁ గంతకంతకు దుఃఖంబుహెచ్చి కంటియందుండి నీరుధారధారగ బ్రవహింపఁగ వెక్కి వెక్కి యేడ్చుచుండెను. అట్లు విలపించి పుత్రశోకంబున మునిఁగియున్న వాఁడును, ధర్మాత్ముఁడునునగు దశరథమహారాజు సుమంత్రునింజూచి యిట్లనియె.

మంత్రిపుంగవా! సుమంత్రుఁడా! నేను గైకేయియొక్క మాటలచేత మిక్కిలిదుఃఖమును బొందియుండు నీసమయమున దుఃఖకాలమునందుఁగూడ నీస్తోత్రములచేత నాకు రెండింతలదుఃఖమును గలుగఁజేయుచున్నావనెను. అంతసుమంత్రుఁడు దశరథమహారాజును జూచి యతనియొక్క మహాదీనమైనమాటలనువిని చేమోడ్పుగలవాఁడై యచ్చోటనుండి కొంచెముదూరము తొలఁగిపోయెను. అట్టియెడ దశరథమహారాజు దుఃఖసముద్రమున మునిఁగియుండుటవలన రాముని దోడ్కొనిరమ్మని సుమంత్రునితోఁ జెప్పుటకునోరాకయుండెను. అప్పుడుమహాయోచనపరురాలగు కైకేయి సుమంత్రునిజూచి యిట్లనియె.

కైకేయి రాముని తనవద్దికి బిలుచుకొనిరమ్మని సుమంత్రునితో జెప్పుట.

సుమంత్రుఁడా! దశరథమహారాజు రామునిపట్టాభిషేకమునుగుఱించిన సంతోషముచేత నుత్సాహముగలవాఁడై రాత్రియంతయు, మేలుకొనుటచేతనలసి నిద్రయొక్క వశమును బొందియున్నాఁడు, (అనఁగా నిద్రలో నున్నవాఁడనుట) కావున నోసూతుఁడా! శీఘ్రముగఁబొమ్ము, పోయి రాజపుత్రుఁడును, ప్రశస్తమైనకీర్తిగలవాఁడును, నగు రాముని శీఘ్రముగఁ బిలుచుకొనిరమ్ము, నీకు మంగళమగుఁగాక, ఈవిషయమునందాలోచనను జేయవలదనియె,

ఇట్లు చెప్పిన కైకేయి మాటను సుమంత్రుఁడు విని యొకశుభము కలుగునని పరమానందము బొంది మఱియు నా సుమంత్రుఁడు, కైకేయి రాజాజ్ఞను బొంది చెప్పినదని తలఁచి సంతోషమును బొంది యతివేగముగ బయలు వెడలిపోయెను, అట్లుపోయి యిట్లని యాలోచించెను. రాముఁడు పట్టాభిషేకమునకుఁగా నిచ్చటికి రాఁబోవుచున్నాఁడు, ఇఁకను తామునకుఁ బట్టాభిషేకమహోత్సవము జరుగును, ఇది నిశ్చయము. అని యిట్లు సుమంత్రుం డాలోచించి మహాసంతోషముతోఁ గూడి పొడుగాటి భుజములుగల రాముని జాడవలయునని రాజుచేఁ బయలు వెడలించనియె, అట్లు సుమంత్రుఁడు, సముద్రమునందలి పెద్దలోతుగలగుంటతో సమానమైన యంతఃపురమునుండి బయలు వెడలి ముందు తట్టుజనులచే నిండినియుండు గానున్న ద్వారమును జూచెను. అట్లు చూచి సుమంత్రుఁడు మిగుల వేగముగా బయలు వెడలి ద్వారదేశమును బొందెను, ఆ ద్వారమునకు ముందుగ కానుకలు తెచ్చియున్న రాజులనున్ను, అధికధనము గలవారును, గుంపుచేరియున్నవారును, ద్వారదేశమును బొందియున్నవారును, నగు పురజనులనున్ను జూచెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి పదునాల్గవసర్గము ముగిసెను.

రామపట్టాభిషేకమునకై తెచ్చియుండు సామగ్రులను సుమంత్రుఁడు జూచుట. —

అట్టియెడ వేదవేత్తలగు బ్రాహ్మణోత్తము లారాత్రియంతయు నచ్చటనే నివసించియుండి రాజపురోహితుఁడగు వసిష్ఠమహామునితోఁ గూడినవారై సభను జేసిరి. మంత్రులును, సేనలయందు ముఖ్యాధికారముగలవారును, పట్టణమునందు ముఖ్యులుగనుండు వారును, రాముని పట్టాభిషేకమును జూచుటకొఱకు మిగుల సంతోషించుచు నొకచోటగాఁ జేరిరి, మఱియును సూర్యోదయమైనపిమ్మటఁ బగటియందుఁ బుష్యమీనక్షత్రము రాఁగానే రాముని జన్మలగ్నమైన కర్కటలగ్నమునందు రామునకుఁ బట్టాభిషేకమును జేయుటకొఱకు సకలపదార్థములను బ్రాహ్మణోత్తములు సిద్ధముసేసిరి, బంగారముచేఁ జేయఁబడిన కలశములను గంగోదకముచే నిండించియుంచిరి, అట్టి కలశములును, చక్కగ నలంకరింపఁబడిన భద్రాసనము, పులిచర్మముతోఁ గూడుకొనిన రథమును సిద్ధము సేయఁబడి మిగుల మనోహరముగఁ బ్రకాశించుచుండెను, గంగాయమునలయొక్క సంగమస్థలమునుండి తీసికొనిరాఁబడినవియును ననేకములగు పుణ్యనదులనుండియు హ్రదంబులనుండియు, కూపంబులనుండియు బుణ్యసరస్సులనుండియుఁ దేఁబడినవియునగు నుదకములతో నిండిన కనకకలశములు ప్రకాశించుచున్నవియు, తూర్పుగా బాఱెడి గోదావర్యాదినదులనుండియు నూర్ధ్వముగ బ్రవహించు రుద్రావర్తాదులనుండియు దక్షిణోత్తరములుగ బాఱు శోణాదినదులనుండియు, తేబడినపుణ్యజలములు సిద్ధముసేసిరి. మఱియుఁ దేనెయును, పెరుగును, నేయియును, పేలాలును, దర్భలును, పుష్పములును, పాలును, సిద్ధపఱుపఁబడి ప్రకాశించుచుండెను, పేలాలతోఁ గూడినవియును, పాలుగల యశ్వత్థాదిపత్రములచే మూయఁబడినవియును, తామరపువ్వులతోను గలువలతోను గూడినవియును, పుణ్యజలములచే నిండింపఁబడినవియు నగు బంగారుకలశములును, వెండికలశములును ప్రకాశించుచుండెను. శుభాచారముగలవారలును, సర్వాభరణభూషితులును నగు వేశ్యాస్త్రీలనేకులు చూచువారలకు నానందమును గల్పించుచు బ్రకాశించుచుండిరి, చంద్రకిరణములవలె మిక్కిలి కాంతిగలదియును, బంగారముచేతఁ జేయఁబడినదియును, రత్నములు చెక్కఁబడిన చేయిపిడికలదియును శ్రేష్ఠమైనదియును, నగు రామునియొక్క వింజామరము సిద్ధముగ నుంచఁబడి ప్రకాశించుచుండెను, చంద్రమండలముతో సమమైనదియును, తెల్లనిదియును, సర్వస్థలములయందును తెల్లనికాంతులను గలుగఁజేయునదియును, సంపత్కరమగు పట్టాభిషేకమునకై మందిడఁబడినదియును, నగు శ్వేతచ్ఛత్రము (అనఁగా గొడుగు) సిద్ధమైయచ్చోట మిగుల మనోహరముగఁ బ్రకాశించుచుండెను, తెల్లనియెద్దును, తెల్లనియశ్వమును నచ్చోటునకు సిద్ధముగ దెచ్చియుంచిరి, కాఱుచున్న మదజలముగలదియును, శ్రేష్ఠమైనదియును, రాజోత్తములగు వారెక్కఁ దగినదియును, నగు నేనుఁగును బట్టాభిషేకమునకొఱకు దెచ్చియుంచిరి, మంగళకార్యములను జేయుటకుఁ దగినవారును, సర్వాభరణములను ధరించుకొనినవారలును, నగు నెనిమిదిమంది కన్యలు రాముని పట్టాభిషేకమహోత్సవమును సాగించుటకు నచ్చటకు వచ్చియుండిరి, నానావిధములగు వాద్యవిశేషములును, పలువిధములుగల స్తోత్రపాఠకులును (అనఁగా వందిమాగధులనుట) అచ్చోటునకు వచ్చి తమతమ పనులయందు జాగ్రతనవలంబించియుండిరి. ఇక్ష్వాకువంశపు రాజులయొక్క దొరతనమునందు పట్టాభిషేకమునుగూర్చి యేవిధముగా రత్నములు మొదలగు వస్తువులు సంపాదించుకొని రావలయునో ఆ ప్రకారముగానే సకలరాజులును శ్రేష్ఠమైన రత్నాదివస్తుసముదాయమును దీసికొని యచ్చోటునకు వచ్చి దశరథమహారాజుయొక్క యాజ్ఞానుసారముగ రామపట్టాభిషేక

మహోత్సవమునుజూచుటకు ద్వారదేశమునందొక్కటి గాఁజేరి మనకువచ్చియున్నారని దశరథమహారాజునకె వ్వఁడుచెప్పునో తెలియ లేదేయనిరి. మఱియుమనముదశ రథమహారాజును నింతవఱకుఁజూడకపోతిమి, అతండేమను నో? సూర్యోదయమునునయ్యెనే, బుద్ధిమంతుఁడగు రాము నియొక్క పట్టాభిషేకమునకుఁ గావలసినవస్తువులన్నియు నుసంపాదింపఁబడి సిద్ధముగనున్నవే? యనియచ్చటనున్న రాజులందఱును దమలోఁదాము మాటలాడుకొనుచుండి రి. ఇట్లారాజులందఱును మాట్లాడుకొనుచుండగా, రాజు చేమర్యాదనొందుచుండు సుమంత్రుఁడా రాజులంజూచి యిట్లనియె.

ఓ రాజశ్రేష్ఠులారా! దశరథమహారాజుయొక్క యా జ్ఞచేత రామునిఁదీసికొనివచ్చుటకు నేనతిశీఘ్రముగబయ లువెడలితిని. తాముదశరథమహారాజునకును, విశేషముగ రామునకును బూజింపఁదగినవారలు, ఆయుష్మంతులగు తామందఱును వచ్చియున్నసమాచారమును దశరథమహా రాజుతో "రాజేన్ద్రా! సామంతరాజులందఱును నిన్నుఁజూ చుటకువచ్చియున్నారనియును, నీవెందుకుబయిటికిరాలేద నియును,, చెప్పెదను, అనియిట్లారాజులను జక్కగాసె లంగినసుమంత్రుఁడు వారలతో జెప్పియక్కడనుండి మరలి మరల నంతఃపురద్వారము వద్దకుఁబోయెను. ఇట్లుపోయి యాసుమంత్రుఁడు సర్వకాలములయందును నిరాటంక ముగఁబోఁదగిన యంతఃపురములోపలఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించి రాజేన్ద్రుఁడగు దశరథమహారాజుయొక్క వంశ మునుస్తోత్రముసేయుచు దశరథమహారాజు శయనించి యుండు గృహములోని తెరదగ్గరకుఁబోయి సద్గుణముల తోఁగూడిన యాశీర్వచనములచే దశరథమహారాజును నిట్ల నిస్తోత్రముసేసె.

దశరథునియొద్దకుసుమంతుడురాముని బిలుచుకొనిరాక నేమరలవచ్చుట.

ఓదశరథమహారాజా! సూర్యచంద్రులును, శివకుబేరు లును, వరుణుఁడు, అగ్నిదేవుడు, ఇంద్రుఁడును, నీకువిజ యమునిత్తురుగాక, మిగులమాహాత్మ్యముగల రాత్రియం తయునుగడచిపోయినది, నీవురాత్రిచేయఁదగిన కార్యము లనంతచేసితివైనది, కాఁబట్టియోదశరథమహారాజా! ఇక నుమేలుకొనుము, నిద్రనువదలిచేయఁదగినకార్యములను జే యుము, ప్రజాపరిపాలకుఁడా! దశరథ మహారాజా! బ్రాహ్మణులును, సేనలయందుప్రధానులగువారును, పట్ట ణమునందుండునట్టి పెద్దమనుష్యులునువచ్చి, నిన్నుజూచుట కుఁగోరుచున్నారు, కాఁబట్టియిఁకనుమేలుకొనుము, అని యిట్లుసుమంత్రుఁడుచెప్పిన దశరథమహారాజుమేలుకొని త న్నుబోగడుచున్నవాఁడును, ఆలోచనలయందుఁ బండితుఁ డును, సారథియునునగు నాసుమంత్రునింజూచియిట్లనియె.

సారథివగు సుమంత్రుఁడా! రామునిదోడ్కొనిరమ్మని యిదివఱకే నీతోఁగైకేయి చెప్పియుండెనుగదా? అప్పు డునూరకుండుటచే కైకేయినాయనుమతమును బొందియె గదాచెప్పినదియని నీకుదోచలేదా? నీవేలనాయాజ్ఞ నతిక్ర మించితివి? నేనునిద్రనుబొందనే లేదు, నీవుపోయిశీఘ్రముగ రామునినిక్కడికిఁదీసికొనిరమ్మనియె.

ఇట్లుదశరథమహారాజు కైకేయియొక్క నిమిత్తముగ సుమంత్రునకు మరలరామునిఁ దోడ్కొనిరమ్మని దానా జ్ఞాపించె. అంతటనాసుమంత్రుఁడు దశరథమహారాజుచె ప్పినమాటనువిని దశరథమహారాజునకు నమస్కరించి ఇఁ కరామునకుఁబట్టాభిషేకమగునని మహాసంతోషము తోరా జగృహంబును వదలిబయలువెడలె. అంతనాసుమంత్రుఁ డు నిర్మలంబగుహృదయముగలవాఁడును, గగుర్పాటుగల వాఁడును. సంతసించిన వాఁడునునై, రాజచిహ్నములు వ్రాసినటెక్కెములచేతను, సాధారణ టెక్కెములచేత ను నలంకరింపఁబడిన రాజమార్గమును జూచుచునతిశీఘ్ర ముగఁబోయె. అట్లుబోవుచున్న సుమంత్రుఁడు మహాసం తోషముతో నారాజమార్గమునందు జనులందఱును చెప్పు కొనుచున్న రామపట్టాభిషేకవృత్తాంతమును వినుచుండె. పిమ్మట నాసుమంత్రుఁడు, కైలాసశిఖరములయొక్క కాం తివంటికాంతిగలదియును, ఇంద్రపట్టణముతో సమానమైన దియును, మిగులమనోహరమైనదియు నగు రామునిగృ హమునుజూచె, మఱియునాగృహము గొప్పవగుతలుపులు గలదిగను, అనేకములగుతిన్నెలుగలదిగను ముఖ్యములైన శిఖరములయందు బంగారపుబొమ్మలుగలదిగను, ద్వార ములుమణులచేతను, పవడములచేతను జేయబడినద్వార ములుగలదిగను, శరత్కాలచంద్రునివలె మిగులఁదెల్లని కాంతిగలదిగను, మేరుపర్వతమునందలి గుహతో సరియైన దిగను, గొప్పవగుమణులచే జెక్కఁబడిన బంగారుపూల మాలికలచేత నలంకరింపఁబడినదిగను, ముత్యాలముగ్గులు గలదిగను చందనాగరులచే ధూపింపబడినదిగను, మనో జ్ఞములైనవాసనములుగలిగియుండుటచేదర్దురపర్వతశిఖర మువలెనున్నదిగను, మనోహరముగధ్వనిఁజేయుచున్న సా రసములును, నెమళ్లుగలదిగను, మిగులమనోహరముగఁజే యఁబడిన తోడేళ్ళబొమ్మలుగలదిగను, మిగులనధికమగు నతనకాంతిచే సకలప్రాణులయొక్క నేత్రములకును, మన స్సునకును, ఆనందమును గలుగఁజేయునదిగను, చంద్ర

సూర్యులతోసమానమైనదియును (అనఁగాఁజంద్రుఁడును సూర్యుఁడును బ్రకాశించుచున్నవిధముగఁబ్రకాశించుచుండినదనుట.) కుబేరునిగృహముతో సరియైనదియును. స్వర్గపట్టణముతో సమానమైనదియును, నానావిధములగు పక్షులుగలదియును, మేరుపర్వతముయొక్క శిఖరములతోసమానమైన శిఖరములుగలదియును సమీపమునందున్నవారును, చేమోడ్పుగలవారును, అగుజనులచే నిండియుండు నదియును రామాభిషేక మహోత్సవమును జూడవలయునని యెడు కుతూహలముచేకానుకలంగొనివచ్చి కాచియుండు జనులు గలదియును. (అనఁగా నెల్లవారును రామమందిర సమీపమునందు సంతోషముతోఁ దిరుగుచుండిరనుట.) రామాభిషేకముజరుగునని యెడుసంతోషముచేతఁ బ్రకాశించుచున్న ముఖముగలవారును, ఉత్సాహముగలవారును, అగుజనులచే నలంకరింపఁ బడినదియును, గొప్పమేఘములతోసమానమైన కాంతిగలదియును, మిగులఁబ్రశస్తమైనదియును, చక్కఁగనలంకరింపఁబడినదియును. నానావిధములగురత్నములచే ప్రకాశించుచున్నదియును, గూనివారును, స్వల్పమగు శరీరముగలవారును, అగుజనులుగలదియును నుండెను. ఇట్లుసారథియగు సుమంత్రుఁడు, మనుష్యులచేత నిండియున్న యారాజమందిరమునుజూచుచు, చక్కనివస్త్రములచే నలంకరింపఁ బడిననాలుగు గుఱ్ఱములుగలరథమును, రామునిగృహమున కెదురుగఁదోలుకొనిపోవుచు నచ్చటవచ్చి చూచుచున్నవారిమనస్సులకుసంతోషమునుగలిగించెను. (అనఁగా నెల్లవారును నాలుగుగుఱ్ఱములు గలదియును, చక్కఁగ నలంకరింపఁ బడినదియును నగురాముని తేరునుజూచి మహానందమును బొందిరనుట.) అంతటనాసుమంత్రుఁడుగొప్పదియును, మిగులధనముగలదియును, మృగములచేతను, నెమళ్లచేతను, మిక్కిలియిరుకైనదియును, శ్రేష్ఠమైనదియును, నగురామునిగృహమునందు "దేవేన్ద్రునిగృహము బ్రవేశించినట్లు,, బ్రవేశించి యధికమైనసంతోషముచే తొట్రుపాటుగలవాఁడయ్యె.

మఱియునాసుమంత్రుఁడు కైలాసపర్వతముతో సమానమైనవియును, చక్కఁగనలంకరింపఁబడినవియును, దేవతలగృహములతోఁబోల్పఁదగినవియునునగు, కక్ష్యలయందు, (అనఁగాతొట్టికట్లయందు) ప్రవేశించియిష్టులును, రామునకుసమ్మతముగ సంచరించు చున్నవారును, నగు బహుమంది మనుష్యులనుదాటుకొని యంతఃపురసమీపమునకుఁబోయె. ఇట్లుపోయియా సుమంత్రుఁడుమిగులసంతోషమునొంది, సంతోషమును గలుగఁజేయు నవియును, రాముని పట్టాభిషేకమును గుఱించినవియును, రాజపుత్రుఁడైన రామునకును, సకలజనులకును మంగళములను గలుగఁజేయునట్టివియును, నగుజనులుచెప్పుకొనుచుండు మాటలనువినెను. మఱియునాసుమంత్రుఁడు దేవేంద్రునిగృహముతోసమానమైనదియును, మనోహరములయిన మృగములతోడను, పక్షులతోడనుగూడికొని యుండునదియును మిగులరమ్యమైనదియును, మేరుపర్వతముయొక్క శిఖరమువలెనున్నతమైనదియును, అధికమయిన కాంతిచేఁబ్రకాశించుచున్నదియును, నగురామునియంతఃపురమునుజూచెను. అచ్చోటననేకులగు గ్రామములందుండుజనులు బహువిధములగు కానుకలనుదీసికొని వచ్చి తమతమవాహనములను దిగిచేతులను శిరమునసిడికొని నమస్కరించుచుండిరి. అట్లు నమస్కరించుచున్న వారలిందఱని లెక్కపెట్టుటకు వేయినోళ్లుగలయాదిశేషునకుఁగూడ శక్యముగాకయుండె. కోట్లుకోట్లుగనుండిరి. అట్లుజనసముదాయముచే నిండియున్న ద్వారదేశమునుజూచెను, మఱియుగొప్పదగుమేఘముతోను, పర్వతముతోను, సమానమైనదియును, మదించినదియును. అంకుశమును లక్ష్యపెట్టనిదియును, సహించుటకు నలవిగానిదియును, రాముఁడెక్కఁదగినదియును, మిగుల మనోహరమైనదియును, మిగులనున్నతమైన శరీరముగలదియును, నగుశత్రుంజయమను పేరుగలయేనుఁగును జూచెను. చక్కఁగనలంకరింప బడినవారును, గుఱ్ఱములతోడను, రథములతోడనుగూడినవారును, ఏనుఁగులుగలవారును, ఒక్కటిగాఁ జేరియున్నవారును, మంత్రులలో శ్రేష్ఠులగువారును, సంఖ్యకతిక్రమించి యున్నవారును, రాజులకుఁబ్రియులును నగుమంత్రి పుంగవులనుదాటి సకలసంపదలతోఁ గూడియున్నయంతఃపురములోనికిఁబోయె. మఱియునాసుమంత్రుఁడు పర్వతశిఖరములతోడను, కదలనిమేఘములతోడను, సమానమైనవియును, పెద్దవియగునేడంతస్థులమేడలతోఁ గూడిన యుత్తమగృహముల సమూహముగలదియును, నగునాయంతఃపురములోనికిఁ బోవునపుడెవ్వరును నడ్డగింపరైరి. అట్లెవ్వరిచేతను నడ్డుపఱుపఁబడనివాఁడై" విశేషరత్నములుగల సముద్రము లోనికిమొసలిపోయినట్లు,, నిరాతంకముగఁబోయెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి పదునైదవసర్గ ముగిసెను.

రాముఁడుసుమంత్రునితోఁగూడ కైకేయీదశరథులవద్దకువచ్చుట.

పురాతనవృత్తాంతములను జక్కఁగదెలిసినసుమంత్రుఁడుజనుల చేతనిండియున్నయంతఃపురద్వారమునతిక్రమిం

చి పిమ్మటజనము లేనిదియును, పవిత్రమైనదియును నగు తొట్టికట్టును బొందెను. ఆతొట్టికట్టును, పళపళమని మెరయుచుండు నీఁటెలను ధనుస్సులను ధరించినవారును, యౌవనవంతులును, చక్కఁగఁ బ్రకాశించుచున్నకుండలములుగలవారును, జాగ్రతగలవారును. ఏకాగ్రచిత్తులును, రామునియందు మిగులఁ బ్రియముగలవారును, నగువీరభటులు రక్షింపుచుండిరి. మఱియునచ్చోట సుమంత్రుఁడు, గాషాయవస్త్రముల ధరించినవారును, వృద్ధులును, బెత్తమును చేతులయందు ధరించియున్నవారును, చక్కఁగనాభరణములచే నలంకరింపఁబడినవారును, మిగులజాగరూకులును, కూర్చునియున్నవారునునగు, అంతఃపురస్త్రీజనులకధ్యక్షులనుజూచెను, అప్పుడా కావలివారందఱును మిగులవేగముతో వచ్చుచున్న సుమంత్రునిఁ జూచి రామునకు సంతోషమునుగలిగింప వలయునని యెడు నభిలాష గలవారును, వేగిరిపాటుగలవారును, యతిశీఘ్రముగఁ దాముగూర్చుండియున్న యాసనములనుండి దిగినిలుచుకొని సుమంత్రుని గౌరవించిరి. అట్లునిలిచియున్న కావలివారలనుజూచి మిక్కిలి మంచిస్వభావముగలవాఁడును, వినయసంపత్తిగలవాఁడును, నగు సుమంత్రుఁడా కావలివారలతో నిట్లనియె.

మానవోత్తములారా! సుమంత్రుఁడువచ్చి ద్వారమునందున్నాఁడని రామునితో నతిశీఘ్రముగఁ దెలుపుఁడనియె. అంతటనా కావలి వారందఱును రామునకు సంతోషమును గలిగింపవలయునను కుతూహలముగల వారగుట చేఁ దత్క్షణము లోపలికిబోయి భార్యాసహితుఁడైయున్న రామునింజూచి రామచంద్రా ! సుమంత్రుఁడు వచ్చి ద్వారదేశమునందున్నాఁడని చెప్పిరి, అప్పుడు రాముఁడు తనతండ్రికి నంతరంగస్నేహితుఁడగు సుమంత్రుఁడువచ్చి ద్వారమునందున్న సంగతిని దెలిసికొని దశరథమహారాజునకు సంతోషము గలుగుటకొఱకు నాసుమంత్రునిఁ దానుండు చోటునకు రప్పించె, అంతటసుమంత్రుఁడు కుబేరునితో సమానుఁడును చక్కగానలంకరింపఁబడినవాఁడును, బంగారుమయమైనయుత్తరీయమును ధరించినవాఁడును, పాన్పునందుఁ గూర్చుండియున్నవాఁడును, పందిరక్తమువంటి కాంతిగలదియును, పరిశుద్ధమైనదియును, మంచివాసనగలదియును, శ్రేష్ఠమైనదియునునగు చందనమును ధరించియున్న వాఁడును, శత్రువులను గాల్చివేయువాఁడును, పార్శ్వప్రదేశమునందు వింజామరను ధరించి వీచుచున్న సీతతోఁగూడుకొనియున్న వాఁడుగనుకనే మిక్కిలి ప్రకాశించుచున్నవాఁడును, చిత్రానక్షత్రముతోఁ గూడినచంద్రునివలె వెలుంగుచున్నవాఁడును నగు రామునిఁ జూచెను, అట్లుజూచి వినయ సంపదగలసుమంత్రుఁడు, కోరినకోరికలనిచ్చువాఁడును, తనశరీరకాంతిచే సూర్యునివలెఁ బ్రకాశించుచున్నవాఁడును నగు రామునకు నమస్కారమును జేసె. మఱియును దశరథమహారాజుచే గౌరవింపఁబడుచుండు యాసుమంత్రుఁడు చేమోడ్పుగలవాఁడై రామునింజూచి రామా! నీకువిహరించుటయందును, గూర్చుండుటయందును, సౌఖ్యమేనా? అనెను. మఱియునో రాముఁడా! నీవలనఁ గౌసల్యాదేవిసుపుత్రుఁడు గలదయ్యె. మీతండ్రియగు దశరథమహారాజును గైకేయియును నిన్నుఁజూడవలయునని కోరుచున్నారు. త్వరగా రావలయుననియె. అంతటనధికమైనకాంతిగలవాఁడును, పురుషోత్తముఁడునునగు నారాముఁడు, సుమంత్రుఁడు చెప్పిన మాటలను విని అధికమైనసంతోషముగలిగి సుమంత్రుని మిగులఁ బ్రియముతోఁ బూజించి సీతంజూచి యిట్లనియె.

దేవీ! సీతా! ప్రభువగు దశరథమహారాజును గైకేయియును నాపట్టాభిషేకమహోత్సవ విషయముగ దేనినో యాలోచించుచున్నారు. ఇదినిశ్చయమని నాకుఁ దోచుచున్నది. మదిరేక్షణురాలా! సీతా! దశరథమహారాజునకుఁ బ్రియమునుగలుగఁ జేయునదియును, మిగులసమర్థురాలును నగు కైకేయి దశరథమహారాజుయొక్క యభిప్రాయమును దెలిసికొని నానిమిత్తముగ దశరథమహారాజును బ్రేరేపించుచున్నది. నాకుఁదల్లియును, మేలునుగోరునదియును, సర్వకాలములయందును దశరథమహారాజుతో ననువర్తించుచున్నదియును, కేకయమహారాజునకుఁ బుత్రికయును. నగు కైకేయి సంతోషముగలదై నాకుఁబట్టాభిషేకమహోత్సవము గావలయునని గోరుచుండును, నాయదృష్టముచేత దశరథమహారాజు ప్రియురాలైనభార్యతోఁగూడ నాలోచించి నాకుఁబట్టాభిషేకమహోత్సవమును జేయఁదలఁచి సుమంత్రుని రాయబారినిగాఁ బంపెను. అక్కడనెట్టిసభ చేరియున్నదో యటువంటి దూత వచ్చియున్నాఁడు. (అనఁగా సభలో నాప్తులున్నారు గావున నాప్తుఁడైనదూతయే వచ్చియున్నాఁడనుట.) దశరథమహారాజిప్పుడే నన్ను యౌవరాజ్యమునందు నిశ్చయముగా నభిషేకమును జేయఁగలఁడు. ఇది మహాసంతోషకరముగదా? కాఁబట్టి నేనతిశీఘ్రముగఁబోయి దశరథమహారాజును గైకేయిని, జూచెదను. నీవు పరివారజనముతోఁ గూడ సుఖముగ నాటలాడుకొను చుండుమనియె. నల్లని నేత్రములు గలసీతాదేవి యావిధముగఁ బతిచే గౌరవింపఁబడి పెనిమిటికి శుభముగలుగవలయునని గోరుచు వాకిలివఱకును పెనిమిటితోఁగూడవచ్చి యిట్లనియె.

దశరథరాజనందనా! సకలలోకనిర్మాణకర్తయగు బ్ర

హ్మదేవుఁడు దేవేంద్రునకుఁబట్టాభిషేకమును గావించిన
ట్లు రాజసూయయాగమునుజేయుటకుఁ దగినయధికార
మునుగలిగించునట్టి రాజ్యాధికారమును బ్రాహ్మణులమూ
లకముగ దశరథమహారాజునీకివ్వఁగలఁడు, పిమ్మటఅంతదీ
క్షవహించియుండువాఁడవును, వ్రతసంపన్నుఁడవును, శ్రే
ష్ఠమైనకృష్ణాజినమును ధరించినవాఁడవును, పరిశుద్ధుఁడవు
ను, జింకకొమ్మును జేతధరించియుండువాఁడవును, నగుని
న్ను నేనుజూచుచు సేవింపవలయునని కోరుచున్నాను. వజ్ర
ధారియగునింద్రుఁడు నీనిమిత్తముగఁ దూర్పుదిక్కునందు
ను, యముఁడుదక్షిణదిక్కునందును, వరుణదేవుఁడుపడమ
టిదిక్కునందును, కుబేరుఁడుత్తరదిక్కునందును రక్షించు
చుందురుగాకయనిచెప్పె. పిమ్మట, పట్టాభిషేకముకొఱకు
గావలసిన అలంకారమును జేసికొనినరాముఁడు, సీతాదేవి
నిసమాధానపరచి సుమంత్రునితోఁగూడ గృహమునుండిబ
యలువెడలెను." పర్వతగుహయందుండుసింహముపర్వత
మునుండిబయలువెడలినట్లు, రామచంద్రుఁడుబయలువెడలి
ద్వారమునందునమ్రుఁడును, నమస్కారమును జేయుచు
న్నవాఁడునునగు లక్ష్మణునిజూచెను. మఱియుఁబురుషో
త్తముఁడును, రాజపుత్రుఁడునునగునారాముఁడు మధ్య
తొట్టికట్టునందున్న స్నేహితులనున్ను దనపట్టాభిషేకమ
హోత్సవమును జూడఁగోరివచ్చియున్న వారలనందఱ
నున్నుఁజూచి సమీపమునకుఁబోయి సన్మానించియగ్నివ
లెఁ బ్రకాశించుచున్నదియును, పులితోలుచేతఁగప్పఁబడిన
దియును, రజతమయమైనదియునునగు రథమునెక్కును,
మఱియునారాముఁడు, మేఘధ్వనివంటిధ్వనిగలదియును,
ఇఱుకులేనిదియును, రత్నములచేతను, బంగారముచేతనున
లంకరింపఁబడినదియును, తనయొక్క కాంతిచేత నేత్రము
లకు పళపళమని మిరుమిట్లను గలుగఁ జేయునదియును,
సూర్యునియొక్క కాంతివంటి కాంతిగలదియును, అడ
వేనుఁగు పిల్లలవంటి యుక్తములైన గుఱ్ఱములచే గట్ట
బడినదియును; నగురథమునువేయినేత్రములుగలయింద్రుఁ
డెక్కినట్లు శీఘ్రముగా రథమునెక్కి మిగులగాంతిచే
బ్రకాశించుచు పోయెను. మఱియును కాంతిగల యారా
ముఁ డాకాశమునందు ధ్వనిగలమేఘమువలెదిక్కులను ధ్వ
నింపఁజేయుచు మహేంద్రపర్వతమునుండి చంద్రుడువెడ
లినట్లు గృహమునుండి బయలువెడలిపోవుచుండెను. ఆస
మయమున రామునకుఁ దమ్ముఁడును, సహోదరుఁడును
నగులక్ష్మణుఁడు గొడుగును, వింజామరమును జేతులయం
దు ధరించిరాముని వెనుకపార్శ్వమున నిలిచిరథమునధిష్ఠిం
చి అన్నయగురాముని రక్షింపుచుబోయెను. మఱియురా
ముఁడు బయలుదేరుచుండగనే సర్వస్థలములయందును జ
నసముదాయముయొక్కకలకలమనుశబ్దముబయలువెడలెను,
(అనఁగారామలక్ష్మణసుమంత్రులు రథమునెక్కఁగానేజను
లందఱును మహానందముతోఁ గలకలధ్వనిని జేసిరనుట) అ
ట్లురాముఁడు బైలువెడలిపోవుచుండగ ముఖ్యులైనవారు
ను, గుఱ్ఱములనెక్కినవారును, పర్వతములతో సమానము
లైన యేనుఁగులనెక్కినవారును, వేలవేలుగావెంటనంటి
పోవుచుండిరి. మఱియునారామునియొక్క ముందరఁగవ
చమునుధరించినవారును, చందనమును, అగరును, ధరించి
నవారును, కత్తులను, ఖడ్గములను చేతంబూనినవారును,
శూరులును, రామునకుశ్రేయస్సునుగోరువారును, నగుజ
నులుపోవుచుండిరి, మార్గమున వాద్యములయొక్కధ్వనులు
ను, స్తోత్రపాఠధ్వనులును, శూరులసింహనాదములను, వి
నఁబడినవి, శత్రుమర్దనుఁడును. సర్వాలంకార భూషి
తుఁడునునగురాముఁడు మేడలయొక్కకిటికీలనుండి స్త్రీలు
వర్షించు పుష్పములవర్షమును గైకొనుచుఁబోయెను, మ
ఱియు మేడలయందున్నవారును, భూమియందున్నవారు
ను, మిగులఁజక్కనియవయవములుగలవారును, నగుస్త్రీ
లు, రామునకుసంతోషముగలుగునట్లు నిట్లనిస్తోత్రముసేసి
రి. తల్లికిసంతోషమును గలుగఁజేయునట్టియోరామా! నీత
ల్లియైనకౌసల్యాదేవి యిపుడునిన్నుజూచి నిశ్చయముగసం
తోషించుచున్నది, సఫలమైనగమనము గలవాఁడగుదువు.
తండ్రిసంబంధమైన రాజ్యమునుబొందెడి నిన్నుఁజూచిజ
నులందఱును సంతోషమునుబొందఁగలరని స్తోత్రముసేసి
రి. మఱియునాస్త్రీలందఱును మనోహరురాలగుసీతను స
కలస్త్రీలలో నుత్తమురాలినిగాఁదలంచిరి, (అనఁగానిట్టి
భర్తగల సీతయొక్కభాగ్యము నేమనిచెప్పవచ్చుననుట)
రోహిణిఁజంద్రునింగూడినట్లు సీతరామునింగూడినదిచూడ
గా,నీసీతాదేవిపూర్వజన్మమునందునిశ్చయముగాఘోరమైన
తపస్సు నుజేసియుండవచ్చుననిరి, అనియిట్లుమేడలయొక్క
శిఖరములయందుండు స్త్రీలుచెప్పుకొను ప్రియములగువా
క్యములను రాజమార్గమునబోవుచున్నవాఁడును, పురుషో
త్తముఁడును, నగురాముడువిని యానందమునుబొందెను,
ఆరాముఁడచ్చోటునకువచ్చిన, నగరముయొక్కయు గ్రా
మముయొక్కయు జనులుచెప్పుకొనుమాటలనున్ను, అధిక
సంతోషముతోఁ దనయొక్కయధికారమునుగురించి మిగు
లమనోహరముగ మాటలాడుచున్న జనులవచనములను
న్నువినెను. ఆసమయమునందెల్లవారును సీరాముఁడిప్పుడే
దశరథమహారాజానుగ్రహమువలనవిపులమగురాజ్యలక్ష్మి
నిబొంది మనలనందఱను మిగులదయతోఁగాపాడును. ఇఁ

కమీఁదట మనకోరికలన్నియు నెరవేరఁగలదు చాలాకాలమునకుబిమ్మట నిపుడీరాముడు రాజ్యమునకువచ్చి మనలను గాపాడుట మనము సేసినతపస్సునకు ఫలమనఁవచ్చును. ఈ రామరాజ్యమునందు సకలజనులునుసంతోషమునొందుదురు. దుఃఖమునొందరు. అనియిట్లు సకలజనులును బహువిధములఁబొగడిరి. ఆసమయమునందా రాముఁడు ధ్వనులను జేయుచున్న గుఱ్ఱములచేతను, మదపుటేనుఁగులచేతను, ముందరఁబోవుచున్నవారును, స్తోత్రపాఠములనుజదువుచున్న వందిమాగధులచేతను, సర్వోత్తముగవాద్యములను మ్రోగించువారలచేతను, స్తోత్రముసేయఁబడుచు కుబేరునివలెఁ బ్రకాశించుచుఁబోయెను. మఱియు రాజవీధులయందాడయేనుఁగులును, మగయేనుగులునునిండియుండుటను, జనులచ్చటచ్చట గుంపులుగుంపులుగఁ గూడి రామపట్టాభిషేకమహోత్సవవిషయముగ మహానందముతో మాటలాడుచుండుటను, అలంకారార్థముగ రత్నములు వెదఁజల్లఁబడియుండుటను, వర్తకులుసముద్రములోని రత్నములన్నింటినిగొనివచ్చి విక్రయార్థముగ నంగళ్ళయందుఁ బెట్టికొని విక్రయించుచుండుటను, నిట్లా రాజవీధులుమిగులమనోహరముగ నొప్పియుండుటను, జూచుచుంబోయెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి పదునాఱవసర్గముగిసెను.

పురజనులు రామునిపట్టాభిషేకము గావలయునని కోరి రామునిపొగడుట.

ఇట్లు శ్రీమంతుఁడగు నా రామచంద్రుఁడు రథము నెక్కి స్నేహితులకందఱకును మిగులసంతోషమును గలిగింపుచు పతాకములతోడను, ధ్వజములతోడను నిండియున్నదియును, సర్వోత్తమమగు యగరుధూమముచే ఘుమ్మనువాసనగలదియును, పట్టాభిషేకముఁ జూడవచ్చిన జనులచేనిండినదియునునగు నయోధ్యాపట్టణమును జూచుచుంబోయెను ఆ రాముఁడు మేఘములతోసరిదైనవియును, తెల్లనివియునునగు గృహములచేఁ బ్రకాశింపుఁచున్నదియును, మధ్యప్రదేశమునం దగరుధూమముచే సువాసనగలిగి పరిమళించుచున్నదియును, నగు రాజమార్గమున బ్రవేశించి చూచుచుఁబోయెను. ఆరాముఁడు సర్వోత్తమమైన శ్రీగంధములయొక్కయు, అగరుచెక్కలయొక్కయు, శ్రేష్ఠములైన గంధములయొక్కయు, తెల్లనిపట్టువస్త్రములయొక్కయు సముదాయములచేతను, రంధ్రములు వేయఁబడని ముత్తెములచేతను, సర్వోత్తమములైనవియును, దోషములేనివియునునగు స్ఫటికమణులచేతను, విక్రయింపఁదగినవస్తువులచేతను, నానావిధములగుపిండివంటలచేతను, ప్రకాశింపుచున్న రాజమార్గమును జూచుచుఁబోయెను, ఆ రాముఁడు స్వర్గమునందలి దేవమార్గమువలె మిగులమనోహరమైన రాజమార్గమునుజూచుచును స్నేహితులు చెప్పునట్టి యాశీర్వచనములనువినుచును, సకలజనులను తగుమర్యాదలతో గౌరవించుచును,బోయెను. పెరుగు,అక్షతలు,హవిస్సు, పేలాలు, మొదలగువానిచేతను, అగరుచందనాదిధూపములచేతను, పూలమాలికలచేతనునిండియున్న రాజమార్గమునందుఁ బ్రవేశించిపోవుచుండెను, ఇట్లుమనోహరంబైన రాజమార్గమునందుఁ బ్రవేశించిపోవుచున్న రామునితో నతని స్నేహితు లిట్లనిరి.

రాముఁడా! నీవిపుడు పట్టాభిషిక్తుఁడవై "మీపితృపితామహులు రాజ్యపరిపాలనము జేసినట్లు, నీవును పరిపాలనము జేయుచు నెల్లవారిని గాపాడుము. మేమందఱమును నీవు రాజవైతివేని నీ తాతముత్తాతలకాలంబున ననుభవించినసుఖంబునకన్నను హెచ్చుగసుఖంబనుభవింపఁగలము, ఇపుడు మాకుభోజనములక్కర లేదు. భోగాదులును నక్కర లేదు. స్వర్గాదిపురుషార్థములతోడను బ్రయోజనము లేదు. రాముఁడవై ననీవు పట్టాభిషిక్తుఁడవై మరల నీగృహమునకు నీవు పోవునపుడు చూచితిమేని సర్వభోగములను ననుభవించినట్లు సంతోషపడుదుము. అపరిమితపరాక్రమముగల రాముని పట్టాభిషేక మహోత్సవమును జూచుటకంటె మాకుఁ బ్రియమైనది యేదియును లేదని పలికిరి. అప్పుడు రాముఁడు స్నేహితులయొక్క మాటలన్నియు బొగడుటయందే ముఖ్యతాత్పర్యముగలవైయుండుటచే దాను పరమసంతోషమునుబొందవలసియుండగ రాముఁడు ధీరోదాత్తుఁడుగావునట్టిసంతోషవికారమేమియును లేనివాఁడై రాజమార్గమునందుఁబోవుచుండెను, రాముఁడు మిగులదూరమునకుఁ బోయినప్పటికిని రామునిజూచుచున్నపురుషులందఱును దమనేత్రములను మనస్సును రామునితోఁగూడఁ బంపిరిగాని తమయొద్ద నేయుంచుకొనకపోయిరి, (అనఁగా కంటికిఁ దెలిసినమట్టుకును, మనస్సునకు గోచరమైనమట్టుకును రామునిజూచుచుండిరనుట) కాఁబట్టి రాముఁడు సమీపమునందుండునపుడు సర్వమును వదలి రామునే చూచుచుందురనుటకుఁ గొంచెమైనను సందేహము లేదు. "శ్లో॥ యశ్చ రామం న పశ్యేత్తు యంచ రామో న పశ్యతి। నిందితస్సవసేల్లోకే స్వాత్మాప్యేనం విగర్హతే,, రామునిజూడనివాఁడును, రామునిచేతఁ జూడఁబడినవాఁడును లోకమునందు నిందితుఁడగును. మఱియునట్టివాని యాత్మగూడ నిందితమైనదగును, (అనఁగా నేను రామునిజూడకపోతిని. నాజన్మముకాల్పనా! యని రాముని జూడనివాఁ

డును, రామునిచేతఁజూపఁబడనివాఁడును తన్నుఁదాను నిందించుకొనునఁట) ధర్మాత్ముఁడగు రాముఁడు నాలుగు వర్ణములవారియందును వారివారివయస్సునకుఁ దగినట్టు మర్యాదలుసలుపుచున్నాఁడు. అందువలననెల్లవారును రామునియందు మిగులఁబ్రీతిగలిగియుండిరి. దశరథరాజనందనుఁడైనరాముఁడు నాలుగుత్రోవలుగలయూ స్థలములకును, దేవస్థానములకును, రచ్చచెట్లకును, సభాస్థలములకును, ప్రదక్షిణముచేయుచుఁ బోవుచుండెను. అట్లు రాజపుత్రుఁడైన రాముఁడుపోయిపోయి మేఘబృందములతోఁ సరిపోల్పఁదగినవియును, శుభకరములైనవియును, నానావిధములైనవియును, కైలాసశిఖరములతో సరిపోల్పఁదగినవియును, ఆకాశమునొరయుచున్నవియును, తెల్లనివిమానములవలెనున్నవియునగు ప్రాసాదశిఖరములతోను, రత్నసమూహములతో నలంకరింపఁబడి వర్ధమానమను రాజచిహ్నముతోను, భూలోకముననుండు గృహములన్నిటికంటె నుత్తమముగను, స్వర్గపట్టణముతో సమానముగనునొప్పుచున్నతండ్రియొక్క గృహమునందుఁబ్రవేశించె. ఇట్లుప్రవేశించి పురుషోత్తముఁడైనరాముఁడు, ధనుర్ధారులచేతఁ గాపాడఁబడుచున్న మూఁడుతొట్టికట్లను క్రమముగ రథగజతురగపదాదులతోఁ గూడదాటి అచటఁ రథముదిగి తక్కిన రెండుతొట్టికట్లను పాదచారియైదాఁటెను. దశరథాత్మజుఁడైనరాముఁడు యిట్లుతొట్టికట్లనన్నిటిని దాటితనతోవచ్చినవారలనందఱిని నచ్చటనిలిపి తానుమాత్రమంతఃపురమునకుఁబోయెను. అట్లు రాముఁడంతఃపురములోనికిఁ బోయి తండ్రియొక్కసమీపమునకుఁబోయినతోడనే నతనితోఁగూడవచ్చిన సర్వజనులును పరమానందమునుబొంది "సముద్రుఁడు చంద్రోదయమెప్పుడగునోయని కోరుచున్నట్లు,, రాముఁడుమరలనెప్పుడు బయలువెడలివచ్చునోయని కోరుచుండిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి పదునేడవసర్గము ముగిసెను.

రాముఁడు కైకేయిని దశరథుఁడు వ్యసనము బొందియుండుటకు కారణమేమనియడుగుట.

ఇట్లు రాముఁడంతఃపురములోనికిఁబోయి మంగళకరమైన సింహాసనమునందుఁ గూర్చుండియున్నవాడును, కైకేయితోఁగూడ నున్నవాడును, కాంతిహీనమై వెలవెలబారుచున్నముఖముగలవాడును, నగుతండ్రియైన దశరథమహారాజునుజూచెను. అట్లుచూచిముందుగఁ దండ్రియగుదశరథమహారాజుయొక్కపాదములకు నమస్కారమునుజేసిపిమ్మట కైకేయియొక్కపాదములకు నమస్కారమునుజేసె. అట్టియెడదశరథమహారాజు రామా! యనుమాటనుమాత్రము పలికి కంటియందునీళ్ళుప్రవాహమువలె వచ్చుచుండగ మహావ్యసనమునొంది, దీనుఁడైరామునిజూచుటకు శక్తిలేనివాఁడయ్యె. మఱియొకమాటను జెప్పుటకుఁగూడ శక్తిలేనివాఁడయ్యె. అపుడుమనుష్యులకుఁ బ్రభువైన దశరథునియొక్కపూర్వెప్పుడునులేనిదియును, మహాభయమునుగలిగించునట్టిదియును, నగునారూపమునుజూచి రాముఁడుగూడ "పామునుపాదముతోఁ దన్నినవానివలె,, భయమును బొందెను. మఱియురాముఁడు, దుఃఖముతోఁగూడినయింద్రియములుగలవాఁడును, దుఃఖముచేతను, తాపముచేతనుఁ గృశించియున్నవాఁడును, అధికముగనిట్టూర్పును విడుచుచున్నవాఁడును, దుఃఖముచే వ్యాకులమునొందియున్న చిత్తముగలవాఁడును, కలతనుబొందునట్లుచేయుటకు నలవిగానిదియును, కలఁతనుబొందుచున్నదియునగు, అలలపట్టులుగల సముద్రమువలెనున్నవాఁడును, రాహుగ్రస్తమైన సూర్యునివలెనున్నవాఁడును, అబద్ధమాడినఋషివలెనున్నవాఁడును, నగుదశరథమహారాజునుజూచి మిగులభయమునొందెను. మఱియునారాముఁడు దండ్రియగుదశరథమహారాజుయొక్క యపరిమితమగు నాదుఃఖమునుజూచి "పౌర్ణమాస్యయందు క్షోభనుబొందుచున్న సముద్రునివలె,, వ్యాకులమునొందినవాఁడయ్యె. తండ్రికిఁబ్రియమగు కార్యమును జేయుటయందుయిష్టముగల రాముఁడిట్లని యాలోచించె. ఇదియేమి? ఇప్పుడీదశరథమహారాజు నన్నుఁజూచినతోడనే సంతోషమునుబొందలేదు. ఇట్లుండుటకుఁగారణమేమో తెలియదయ్యె? ఇంతకుముందుదశరథమహారాజు నాయందుఁగోపముగలవాఁడయినను నన్నుఁజూచినతోడనే యానందమునుబొందును. అట్టిదశరథమహారాజిప్పుడునన్నుఁజూచి మహావ్యసనమును బొందుచున్నాఁడు. ఇట్లగుటకుఁ గారణమేమో తెలియదయ్యె. అని యిట్లురాముఁడాలోచించి ధైర్యములేనివాఁడును, దుఃఖముచేతఁ బీడింపఁబడినవాఁడును, దుఃఖముతోఁగూడినముఖకాంతిగలవాఁడునునై నమస్కారమునుజేసి కైకేయిని జూచియిట్లనియె.

తల్లీ! కైకేయీ! నేనవివేకముచేతఁగూడ మాతండ్రికపకారమునుజేయలేదుగదా? మాతండ్రియిట్లు కోపమునుజెందుటకుఁగారణమేమి? ఆకారణము నీకుఁదెలిసియుండెనేని చెప్పుము? నీవుయెట్లైనను మాతండ్రిప్రసన్నుఁడగునట్లుచేయుము, సర్వకాలములయందును నాయందుమిగులఁబ్రేమగల తండ్రిప్రసన్నతనువదలిన మనస్సుగలవాఁ

డును, వెలవెలఁబోవుచున్న మోముగలవాఁడును, దుఃఖముగలవాఁడునునై నాతో మాటలాడకపోవుటకుఁ గారణమేమి? ఇతనికిశరీరమున కేదైనరోగముగాని, మనస్సులో నేదైనవ్యసనముగాని కలిగియున్నదా యేమి? సర్వకాలములయందును జనులకు సౌఖ్యముగలిగియుండుట దుర్లభముగను కనడుగుచున్నాను, పరమసంతోషముతోఁజూడఁదగినవాఁడును, పుత్రుఁడును, నగు భరతునకుగాని మహాబలముగల శత్రుఘ్ననకుగాని మాతల్లులలో నెవ్వరికైననుగాని కీడుగల్గియున్నదా? అట్లుగాక యెల్లవారును సౌఖ్యముతో నున్నారుగదా? మాతండ్రియిట్లు వ్యసనాక్రాంతుఁడయి యుండుటకుఁ గారణమేమి? నేను మాతండ్రికి సంతోషము జేయకయును, మాతండ్రి చేయుమనినగార్యము జేయకగాని యొకక్షణమాత్రముగూడ జీవింపను. "శ్లో॥ యతోమూలంనరః పశ్యే త్ప్రాదుర్భావమిహాత్మనః । కథంతస్మిన్నవర్తేత ప్రత్యక్షేసతిదైవతే,, ఈలోకమునందు మానవుఁ డెవ్వనివలనఁబుట్టునో యతఁడు తండ్రియని చెప్పఁబడును. మఱియనుఁ గారణుఁడనియును జెప్పఁబడును. మఱియునతఁడు దేవుఁడనియును జెప్పఁబడును. అట్టిప్రత్యక్షదైవమునకిష్టుఁడయి యుండనివాఁ డెవఁడు? అందఱును దండ్రికిష్టులయ్యే యుందురు. తల్లీ! కైకేయీ! నీవుగాకోపముచే నభిమానమువలన మాతండ్రి నేమైనఁ గఠినముగాఁ దిట్టితివా? దానిచేత మాతండ్రియొక్క మనస్సు తిరిగిపోయినదా? అట్టికారణమేమియును లేకపోయెనేని మాతండ్రియిట్లుండుటకుఁ గారణమేమి? తల్లీ! కైకేయీ! వీటికన్నిటికిని యథార్థముగ సమాధానమును జెప్పుము. మనుజాధిపతియగు దశరథమహారాజునకు మును పెప్పుడునుగలుగని వికారముగలుగుటకుఁ గారణమేమి? యనియడిగె. అనియిట్లు రాముం డడిగిన కైకేయి కొంచెమైనను సిగ్గులేనిదై మహానుభావుఁడగు రామునితో భయములేక తనకు హితమైనమాటను జెప్పఁదలఁచి యిట్లనియె.

రాముఁడా! నీతండ్రియగు దశరథమహారాజునకుఁ గోపములేదు. ఇతనికిఁ గొంచెమైనను వ్యసనములేదు. ఇతనిమనస్సునందొకకోరిక గలదు. నీవేమందువో యను భయముచేత నీతోఁ జెప్పఁజాలకున్నాఁడు. మిక్కిలి ప్రియుఁడవైన నీతో నప్రియమైనమాటను జెప్పుటకు వ్యసనమును బొందుచున్నాఁడు, అందువలన నితనినోట మాటరాకయున్నది. అదియేమనిన? ఈదశరథమహారాజు నాకిచ్చినవరమును నీవు నెరవేర్పవలసియున్నది. సత్యవ్రతుఁడగు నీదశరథమహారాజు పూర్వము నాకు వరమునిచ్చియున్నాఁడు. అట్లువరదానము చేసి నన్ను గారవించి నీచజనునివలె నిప్పుడు వ్యసనపడుచున్నాఁడు. మఱియు నీదశరథమహారాజు మొదట వరమునిచ్చెదనని చెప్పియిప్పుడు "నీళ్ళుపోయినపిమ్మటఁ గట్టవేయువానివలె" ఏలవరమునిచ్చితినని దుఃఖపడుచున్నాఁడు. 'శ్లో॥ ధర్మమూలమిదంరామ విదితంచసతామపి । తత్సత్యంనత్యజేద్రాజా కుపితస్త్వత్కృతేయథా' రాముఁడా! సత్యము ధర్మమూలమని సత్పురుషులకందఱకును దెలిసినవిషయమే గాని వేరుగాదు. దశరథమహారాజునకు నీకొఱకు నామీఁదఁ గోపము రాకుండునట్లును, నతఁడు సత్యమును దప్పక యుండునట్లును జేయుము. దశరథమహారాజు చెప్పునట్టిమాట మంచిదైనను, చెడ్డదైనను, నీవు తప్పక చేసెదనని చెప్పితివేని సర్వమును నేనే చెప్పెదను. నీవు దశరథమహారాజుచేతఁ జెప్పఁబడినమాటకు విఘ్నమును గలిగింపని యెడల నేనే చెప్పుచున్నాను. దశరథమహారాజు తనయభిప్రాయమును నీతోఁ జెప్పఁజాలఁడనియె. ఇట్లు కైకేయి చెప్పినమాటను విని రాముఁడు (నాయందుగూడ నిట్టిసందేహము గలిగెగదా) అని మిక్కిలి వ్యసనము గలవాఁడయి దశరథమహారాజ సమీపమునందున్న కైకేయితో నిట్లనియె.

అయ్యో, తల్లీ! కైకేయీ! ఛీఛీ! యిట్టిమాటను నాతోఁ జెప్పఁదగదు. నీకు నాయందిట్టి సంశయముపుట్టుటకుఁ గారణమేమి? దశరథమహారాజు చెప్పెనేని యతనిమాటకు జవదాటక యగ్నిహోత్రమునందుఁగూడఁ బడుదును. తీక్ష్ణమైనవిషమును మ్రింగుమనినను మ్రింగుదును. సముద్రమునందుఁ బడుమనినను బడుదును. ఆచార్యుఁడును, రాజును, తండ్రియును, నాకు మేలును జేయువాఁడునునగు దశరథమహారాజేమి చెప్పినను జేయుటకు సిద్ధముగ నున్నాఁను. ఇందుకుఁ గొంచెమైనను సందేహింపవలదు. నీవు పితృవాక్యపరిపాలనను జేయుదువా? యని నన్నడిగినందుకు నేను వ్యసనపడుచున్నాను. నేను తండ్రి చెప్పినట్లు సంచరింపుదునో, లేదో యని నీకు సందేహముగలుగుట యుచితముగాదు. త్రికరణములచేతను నేను మాతండ్రి చెప్పినట్లు సేయుటకు సిద్ధముగనున్నాను. కావున కైకేయీ! దశరథమహారాజునకిష్టమైన విషయమేదియో దానిం జెప్పుము. నేను నిరాటంకముగఁ జేసెదనని ప్రతిజ్ఞను జేయుచున్నాను. "రామోద్విర్నాభిభాషతే,, రాముఁడు రెండువిధములయిన మాటను జెప్పువాఁడు గాఁడని యెఱుంగవా? (అనఁగాఁ నొకకార్యమును జేసెదనని చెప్పి తప్పిపోవువాఁడు గాఁడనుట) అంతట దుష్టురాలగు కైకేయి, కపటములేనివాఁడును, సత్యముగ మాటలాడువాఁడును, నగు రామునితో మిక్కిలి కఠినమైనమాటను జెప్పఁదలచి యిట్లనియె.

రాముఁడా! పూర్వముదేవాసుర యుద్ధమునందుఁ మీ తండ్రియైనయీదశరథమహారాజు దేవతలకుసహాయముగ యుద్ధమును జేయఁదలఁచిపోయెను. అప్పుడాయిరాక్షసులతోఁగూడ యుద్ధమును జేయుచుండె. అప్పుడితనికిఁ బ్రాణాపాయ సమయముతటస్థించె. ఆసమయమునందితను శరీరమునందంతటను గ్రుచ్చఁబడిన బాణములుగలవాడగుటచేత వారలతోయుద్ధమును జేయఁజాలఁడయ్యె. అప్పుడునేనితని శరీరమునందలి బాణములనన్నింటిని ననాయాసముగఁ దీసి బాగుచేసితిని. అందువలననితఁడు నాకు రెండువరముల నిచ్చెదనని చెప్పెను. ఆవరములను నేనిప్పుడు యాచించితిని. ఆవరములెవ్వియనిన; రాముఁడా! నిన్నుదండకారణ్యమునకుఁ బంపుమనియును, భరతునకుఁ బట్టాభిషేకమును జేయుమనియును యాచించితిని. పురుషోత్తముఁడా! రామా! నీవునునీతండ్రియును, సత్యమును బలుకువారనిప్రసిద్ధి నొందఁదలఁచితివేని నేనుచెప్పునట్టి మాటనువినుము. నీవ్వుతండ్రియగు దశరథమహారాజిచ్చిన వరములను సఫలమగునట్లుచేయుము. నీవుపదునాలుగుసంవత్సరము లరణ్యమునసుండుము. రాముడా! యిప్పుడు నీకుఁ బట్టాభిషేకమును జేయుటకొఱకు సంపాదించినవస్తువులచేతభరతునకుఁ బట్టాభిషేకమును జేయవలయును. నీవీపట్టాభిషేకమును వదలి జటాజినములనుధరించి పదునాలుగు సంవత్సరములు దండకారణ్యమునందు నివసింపుము. భరతుఁడయోధ్యానగరమునకు రాజై యుండి నానావిధములగు రత్నములతోఁ గూడినదియును, చతురంగబలముతోఁ గూడినదియును నగుభూమినిబరిపాలింపవలయును. ఈహేతువుచేత నీదశరథమహారాజు నీయందుదయగలవాఁడగుటవలన వ్యసనము నొందినముఖముగలవాఁడై నిన్నుఁజూడఁజాలకయున్నాఁడు. రామా! నరేంద్రుఁడైన దశరథునియొక్క మాటనుదప్పకజేయుము. రాముఁడా! సర్వోత్తమమైన సత్యముచేత నీదశరథమహారాజునుగాపాడుమనియె. (అనఁగాదశరథమహారాజు సత్యముతప్పినాఁడనియపకీర్తి వచ్చునట్లుచేయక నీవరణ్యమునకుఁ బొమ్మనుట.) ఇట్లుమిగుల గఠినములైనమాటలను బలుకుచున్న కైకేయియొక్క పరుషవచనములనువిని రాముఁడు కోపమునొందఁడయ్యె. వ్యసనమునుగూడ జెందఁడయ్యె. మహానుభావుఁడైన దశరథమహారాజు మాత్రము పుత్రునిగుఱించిన వ్యసనముచే మిక్కిలిమనోవ్యథనుజెందె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి పదునెనిమిదవ సర్గముముగిసెను.

కైకేయిచెప్పిన ప్రకారము రాముడరణ్యమునకు బోవుటకు సమ్మతించుట.

శత్రుమర్దనుఁడగు రాముఁడు, ప్రియముగానిదియును, మరణమునకు సమానమైనదియును, నగుకైకేయియొక్క మాటనువిని కొంచెమైనను వ్యసనపడలేదు. అట్లువ్యసనమునుబొందనివాఁడై యాకైకేయింజూచి యినిట్లనియె. ఓకైకేయీ! నీవుచెప్పిన ప్రకారమేయగుగాక. నేనుమాతండ్రియగు దశరథమహారాజుయొక్క ప్రతిజ్ఞనుబరిపాలించుచు జటాజినములనుధరించి యరణ్యమునకుఁ బోయియుండెదను. శత్రువులకెదిరింప శక్యముగాని వాఁడును, శత్రువులను నశింపఁజేయువాఁడునునగు దశరథమహారాజు మునుపటివలె నన్నులాలింపకున్నాఁడు. దీనికిమాత్రము కారణమును దెలియఁగోరుచున్నాను. కైకేయీ! యీవిషయమునకుఁగా నీవునామీఁదఁ గోపపడకుము. నీయెదుటనే జటాజినములను ధరించినవాఁడనైయరణ్యమునకుఁ బోయెదనని నిశ్చయముగాఁజెప్పుచున్నాను. కావున నీవుదిగులునుమాని సంతోషముగలదానవై యుండుము. మేలునుజేయువాఁడును, గురుఁడును, తండ్రియును, తనకుఁ జేయఁబడిన యుపకారము కొంచెమైనను నధికముగాఁదలఁచువాఁడును, రాజునునగు దశరథమహారాజుచేత నాజ్ఞాపింపఁబడినవాఁడను, విశ్వాసముగలవాఁడను, నైన నేను నాతండ్రికి యిష్టమైనకార్యము జేనినిజేయను? ఏమిచెప్పినను జేయుటకు సిద్ధముగనున్నాను. దశరథమహారాజుతానే భరతునకుఁ బట్టాభిషేకమును జేయఁదలఁచియున్నానని నాతోఁజెప్పినవాఁడుగాఁడు. తానే నాకుఁబట్టాభిషేకమును జేసెదనని నాతోఁజెప్పి నీచేతనివ్విధముగాఁ జెప్పించినందుకుఁ జింతించెదను. నాతండ్రియగు దశరథమహారాజుచెప్పిన యబద్ధపువచనమువూత్రము నన్నుదహించుచున్నది, తానే, రాముఁడా! నీవరణ్యమునకుఁ బొమ్మని చెప్పినయెడల నేనుబోనా? నాకితరులు సెప్పకమునుపే నేను నాతమ్ముఁడగు భరతునకుఁ బ్రియముతో నాభార్యయగు సీతనైనను, పరమప్రియములగు ప్రాణములైనను, ధనములనైనను, మఱిదేనినైనను, నిచ్చుటకుసిద్ధముగనున్నాను. కాఁబట్టి తానేయీవిషయమును నాతోజెప్పరాదా? నీచేఁజెప్పించుటకుఁ గారణమేమి? స్వయముగానే తమ్మునకు సర్వమును నిచ్చుటయందుఁ బ్రీతిముగలనేనుమానవోత్తముఁడును, తండ్రియునునగుదశరథమహారాజుచేఁ బ్రేరేపింపఁబడినవాడనగుచుండగానున్న, నీకుమహాసంతోషముగలుగు నట్లుండగానున్న, నీతోనేచెప్పినమాట తప్పుటలేదని ప్రతిజ్ఞఁజేసియుండగానున్న, ఇప్పుడుభరతు

నకు రాజ్యంబుమాత్రమిత్తునని చెప్ప నేల? ప్రాణములనైన నిచ్చుటకు సిద్ధముగనున్నాను. కావున నీవింక సందేహమును వదలి యీదశరథమహారాజును నూరడింపుము. ఈదశరథ మహారాజు ముఖమును వంచుకొని భూమిని జూచుచుఁ గన్నీళ్లను విడుచుచున్నాఁడు. ఇట్లు సేయుటకుఁ గారణమేమి? మేనమామయింటియందున్న భరతుని బిలుచుకొని వచ్చుటకు దశరథమహారాజుయొక్క యనుమతమును బొంది శీఘ్రవేగముగల గుఱ్ఱపురౌతులను దూతలనుగాఁ బంపుము. ఆదూతలు పోయి భరతుని బిలుచుకొనివచ్చునట్లు చేయుము. నేను పితృవాక్యమును గూర్చి యేమియును వేఱువిధముగ నాలోచింపక పదునాలుగు సంవత్సరములు దండకారణ్యమునందు నివసించుటకు నింటినుండి బయలువెడలిపోవుచున్నాను. మఱియును మాతండ్రి చేసిన యాజ్ఞ యుచితమగునా? కాదా? యని విచారించువాఁడను గానని నెను. అనియిట్లు చెప్పుచున్న రామునియొక్క మాటను విని కైకేయి పరమసంతోషమునొంది రాముఁ డరణ్యమునకుఁ బోవునని నిశ్చయముగా నమ్మకముగలదగుటచే రామునింజూచి యిట్లనియె.

రాముఁడా! నీవు చెప్పినట్లే యగుగాక. మిక్కిలి వేగముగల గుఱ్ఱములనెక్కి దూతలు మేనమామయింటియందున్న భరతునిఁ దీసికొనివచ్చుట కతిశీఘ్రముగఁ బోవుదురుగాక. రాముఁడా! వనములకుఁ బోవుటయందాసక్తిగల నీవాలస్యమును జేయుటమంచిది కాదని నేను దలఁచుచున్నాను. రాముఁడా! నీవు శీఘ్రముగా నరణ్యమునకుఁ బోఁదగినవాఁడవు. కావున నాలస్యము సేయక యరణ్యమునకుఁ బొమ్ము. పురుషోత్తముఁడవైన యోరామా! దశరథమహారాజు రాముఁడు నామాట నెరవేర్చునో నెరవేర్చడో యని సిగ్గుపడి నీతో మాటలాడలేక తలవంచుకొనియున్నాఁడు గాని వేఱు కాదు. కావున నీవు శీఘ్రముగ నరణ్యమునకుఁ బోతివేని యీదశరథమహారాజు సిగ్గువదలి ముఖమునెత్తుకొని తిరుగులాడును. రాముఁడా! నీవడవికిఁ బోక యెంతసేవు పట్టణములో నుందువో యంతవఱకును నీ తండ్రియగు దశరథమహారాజు స్నానభోజనములను జేయఁడని, కైకేయిఁ జెప్పె. అంత దశరథమహారాజు కైకేయి చెప్పిన మాటను విని సహింపలేనివాఁడై హా రామా! నేను దహింపబడుదునుగాక. ఎంతకష్టము వచ్చెనని నిట్టూర్పునువిడిచి యపరిమితమైన దుఃఖముగలవాఁడై మూర్ఛనొంది బంగారముచే నలంకరింపఁ బడియున్న శయ్యయందు విరుచుకొనిబడెను. అంతట రాముఁడు, మూర్ఛిల్లిపడిన దశరథమహారాజును లేవఁదీసెను. అట్లు రాముఁడు లేవఁదీసి కైకేయిచే ద్వరపెట్టఁబడినవాఁడగుటవలన చబుకుచేతఁ గొట్టఁబడిన శ్రేష్ఠమగు గుఱ్ఱమువలె వనమునకుఁ బోవుటకు మిగులఁ ద్వరగలవాఁడయ్యె. అంతట రాముఁడు దుష్టురాలగు నాకైకేయియొక్క భయంకరమైన వచనమును విని కొంచెమైనను వ్యసనము లేనివాఁడై కైకేయిం జూచి యిట్లనియె.

తల్లీ! కైకేయీ! నాకు ద్రవ్యమునందాసక్తి లేదు. జనులతోఁ గూడఁ జేరియుండవలయునను గోరికయును లేదు. నేను ఋషులతో సమానుఁడనని యెన్నుము. మఱియు నేను ధర్మమును మాత్రమే యవలంబించియున్నానని తెలిసికొనుము. పూజ్యుఁడైన దశరథమహారాజునకు నింకను బ్రియమైనది యేదియో చెప్పుము. అట్టిదానిని ప్రాణత్యాగము జేసియైనను జేయుటకు సిద్ధముగనున్నాను. కావున నట్టి కార్యమేదియైనఁ గలదేని చేసినట్లే నీవు తలంపుము. "శ్లో॥ నహ్యతో ధర్మచరణం కించిదస్తి మహత్తరం। యథా పితరి శుశ్రూషా తస్య వా వచనక్రియా॥" తండ్రికి శుశ్రూషను జేయుటకంటెను, తండ్రి చెప్పిన కార్యముఁ జేయుటకంటెను నధికమైన ధర్మమేదియును లేదు. నేను, పూజ్యుఁడైన దశరథమహారాజు చెప్పకపోయినను, నీయొక్క మాట వలన నిప్పుడు నిర్జనమైన యరణ్యమునందుఁ బదునాలుగు సంవత్సరములుండెదను. హా కైకేయీ! నీబుద్ధిని గుఱించి నేనేమని చెప్పుదును. నీవే నాకు సర్వోత్తమమైన ప్రభుత్వముగలదానవై యుండియు, నీవెట్లు చెప్పిన నేనట్లు సేయుటకు సిద్ధుఁడనై యుండియు, నీవే నన్నరణ్యమునకు బొమ్మని చెప్పక దశరథమహారాజును వరంబిమ్మని కోరితివిగదా? కైకేయీ! నాయొక్క గుణములను గొంచెమైనను విచారింపకపోతివి. నేను తల్లియగు కౌసల్యకును, భార్యయగు సీతకును నీవృత్తాంతమును జెప్పి పిమ్మట దండకారణ్యమునకుఁ బోయెదను. కావునఁ దల్లితోడను భార్యతోడను చెప్పి వారి యనుమతమును బొంది పోవువఱకును నీపట్టణమునందుండుటకు నాజ్ఞనొసంగుము. ఇట్లు చెప్పుటచేతఁ బెక్కుదినములుండుదునని తలఁపకుము. ఈదినమునందే బయలువెడలిపోయెదను. "శ్లో॥ భరతః పాలయేద్రాజ్యం శుశ్రూషేచ్చ పితుర్యథా। తథా భవత్యా కర్తవ్యం సహి ధర్మస్సనాతనః॥" తల్లీ! కైకేయీ! భరతుఁడు రాజ్యమును బాలించుచుఁ దండ్రియగు దశరథునకు శుశ్రూషను జేయునట్లు జేయుము. ఇది యనాదియైన ధర్మము. కావున నిట్టి ధర్మమును గూడఁ దప్పిపోకుమని చెప్పెను. అనియిట్లు మృదుమధురమగు మాటలచే రాముండు చెప్పిన సప్పరమ ధర్మంబగు మాటలను దశరథమహారాజు విని దుఃఖము రెట్టించుటం జేసి యట్టి దుఃఖ

మును నడంచుకొనలేక కంటియందుండి నీరుధారధారగ బ్రవహింపగ వెక్కి వెక్కి హా రామా! రామా! యనిగట్టిగా రోదనమును జేసెను. అట్లు తెలివిఁదప్పి వెక్కి వెక్కి యేడ్చుచున్న తండ్రియొక్కయు, దుష్టురాలగు కైకేయియొక్కయు, పాదములకు నమస్కారమును జేసి మహాకాంతిగలవాఁడగుచు నింటినుండిబయలువెడలెను. అట్లు రాముఁడు తల్లిదండ్రులగు కైకేయికిని, దశరథమహారాజునకును బ్రదక్షిణ నమస్కారములను జేసి యంతఃపురమునుండి బయలునకువచ్చి ద్వారదేశమునందున్న స్నేహితులనందఱును జూచెను. అట్టియెడ సుమిత్రానంద వర్ధనుఁడగు లక్ష్మణుఁడు, యీసంగతినంతయు నెఱింగి కన్నీళ్లచేతనిండిన నేత్రములుగలవాఁడును, మిగుల కోపముగలవాఁడునునై యారామునితోఁగూడ వెంబడించెను. ఆసమయమునం దారాముఁడు పట్టాభిషేకమునకుగా సంపాదింపఁబడిన సామగ్రులకుఁ బ్రదక్షిణనమస్కారమును జేసి యాసామగ్రులను నేత్రములతోఁగూడ జూడకనే, దశరథమహారాజుయొక్క ప్రతిజ్ఞను పరిపాలించుటయం దాసక్తిగలవాఁడై మెల్లగాబయలు వెడలిపోయెను. లోకకాంతుఁడగు శ్రీరాముని ముఖకాంతి విశేషకాంతిగలుగుటవలన నా రామునకు రాజ్యభ్రష్టతగలిగినను" రాత్రులయందు చంద్రునికాంతి నశింపనివిధమున,, కొంచమైనను నాశమునొందదయ్యె. రాజ్యమును వదలి యడవులకుఁ బోవుటయందుఁ బ్రియముగలనా రామునకు, "లోకవ్యవహారమును సర్వమును వదలిపెట్టిన యోగికిఁ జిత్తవికారము గలుగనట్లు,, కొంచెమైనను చిత్తవికారము కలుగదయ్యె. అధికమైనధైర్యముగల రాముఁడు మంగళకరమైనగొడుగును, చక్కగా నలంకరింపఁబడిన చామరములను, విడిచిపెట్టెను. మఱియును తనస్నేహితులను, రథమును, పట్టణమునందుండునట్టి జనులను గూడవదలెను. ఇట్లు వదలి దుఃఖమును నడఁచుకొని యింద్రియములను స్వాధీనము జేసికొని యీయమంగళకరమైన వార్తను జెప్పుటకొఱకుఁ దల్లి యగు కౌసల్యయొక్క గృహమునకుఁ బోయెను. రామపట్టాభిషేకమును గుఱించి శృంగారించుకొని నచ్చోటికివచ్చియుండు జనులకు నాసమయమునందు సత్యవాదియగు రామునియొక్క ముఖమున గొంచమైనను వికారముగనపడలేదు. "శరత్కాలమునం దధిక కాంతితోఁగూడిన చంద్రుఁడు తనయొక్క కాంతిని వదలనట్లు,, మహాబాహుఁడగు రాముఁడు సాధారణంబుగ దనకుగల సంతోషమును గొంచెమైనను వదలడయ్యె. ధీరాత్ముఁడును, గొప్పకీర్తిగలవాఁడును, నగు రాముఁడచటనుండు జనులనందఱ మృదుమధురవచనములచే గౌరవించుచుఁ దమ్ముఁడగు లక్ష్మణునితోఁ జేరియుండెను. రామునకు సమానుఁడును, మహాపరాక్రముఁడును నగు లక్ష్మణుఁడు తనమనస్సునందుఁగలిగిన వ్యసనమునడఁచుకొనుచు రామునితోఁ గూడఁబోయెను. అంత రాముఁడు మిగుల సంతుష్టులగు జనులతోఁగూడిన తల్లిగృహమునందుఁ బ్రవేశించి యప్పుడు సంభవించిన కార్యనాశమును గుఱించి యిట్లని తలఁచె. ఓహో యిక్కడ మనము దుఃఖచిహ్నములతోనుంటిమేని తల్లియగు కౌసల్యాదేవియును, తక్కిన స్నేహితులును బ్రాణత్యాగమును జేసికొనుదురని తలఁచి దుఃఖమును సర్వమును మనస్సునం దేయణఁచుకొని ముఖమునం దేమియును వికారములేనివాఁడుగ నుండెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి పందొమ్మిదవ సర్గము ముగిసెను.

—{ రాముఁడు కౌసల్యాదేవి యొద్దకుబోయి యరణ్యవాసము జేసివచ్చెదనని చెప్పుట. }—

అట్లు పురుషోత్తముఁడైన రాముఁడు కైకేయీదశరథులకు మ్రొక్కి జేమోడ్పుగలవాఁడై యంతఃపురమునుండి బయలువెడలగానే యచ్చోటనుండు యంతఃపురస్త్రీలందఱును కైకేయిచెప్పిన పరుషవచనములను వినియును, రాముఁడుపోవుటను జూచియును నయ్యో యెంతకష్టము వచ్చె. హా రామా! రామా! యనిగొంతెత్తి గట్టిగా నేడ్వ దొడంగిరి. అప్పటిరోదనధ్వని ధూమ్యంతరిక్షములయందంతటను నిండి యెల్లవారలహృదయములను ఝల్లుమనునట్లు సేసె. మఱియు నిట్లని యేడ్చిరి. తండ్రియగు దశరథమహారాజుచే ప్రేరేపింపఁబడకయే యంతఃపుర జనులమగు మాకుఁ జేయఁదగిన పనులను జేయుటయందు రక్షకుఁడగు రాముఁడూరువిడిచి యరణ్యవాసము జేయబోవుచున్నాఁడే! యనియాస్త్రీలందఱును ఘోరంబుగా రోదనంబును జేసిరి. రాముఁడు కౌసల్యయందెట్లు ప్రియముగలవాఁడో యట్టులనే మాయందుఁబుట్టిన నాటనుండి ప్రియముగలవాఁడే! తననుదిట్టినను రాముఁడుగోపమును జెందువాఁడుగాఁడే! కోపమునుగలిగించువానినివిడుచుఁచుగోపించు వారలనందఱను మంచిమాటలచేనూరడించువాఁడే. అట్టి రాముఁడిప్పుడుయూరువిడిచిపోవుచున్నాఁడే, ఏమిసేయుదు, మేమిసేయుదము. సమస్తప్రాణులకును సంతోషమును గలుగజేయువాఁడును, జీవనాధారుఁడునునగ, రాముని దశరథమహారాజు తెలివిలేనివాఁడై వెడలగొట్టి సమస్తప్రాణివర్గమును భక్షించుచున్నాఁడే! ఆహా దశరథమహారాజెంత బుద్ధిహీనుఁడయ్యెనే, అనియిట్లు రాజభార్యలందఱును మూడలనెడఁ

బాసినయావృలవలెనేడ్చుచు భర్తయగుదశరథమహారాజును అనేకవిధముల నిందించుచు దుఃఖించిరి. మఱియును నెల్లవారలకును వినఁబడునట్లు దుఃఖమునుబట్టనేరక గట్టిగా రోదనమునుజేసిరి. పుత్రశోకముచే మిగులఁదపించుచుండెడి యాదశరథమహారాజంతఃపురమునందుఁ గలిగినదియు, భయంకరమైనదియును నగునాస్త్రీలరోదనధ్వనిని దుఃఖంబెక్కుడవాడై పరుపునందేపడి మూర్ఛనుబొందెను. ఆస్త్రీల యేడ్పును రాముఁడునువిని మిక్కిలి దుఃఖముగలవాఁడై యేనుఁగువలె నిట్టూర్పులను విడుచుచు నింద్రియములను స్వాధీనముజేసికొని, తమ్ముఁడగు లక్ష్మణునితోగూడి తల్లియొక్క యంతఃపురము నకుఁబోయెను. అట్లుపోయియా రాముఁ డంతఃపురద్వారమునందుఁ గూర్చున్నవాఁడును, పరమపూజితుఁడును, వృద్ధుఁడును నైన వాకిటిపురుషుని, నతనిఁ జుట్టుకొనియున్న ననేకపురుషులనుజూచెను. ఆసమయమునం దాద్వారపాలకు లందఱును రామునిజూచి యతిశీఘ్రముగ లేచినవారై జయశీలురలో గొప్పవాఁడగు రామునితో నీకుజయముగలుగునుగాక. యనియాశీర్వదించి జయజయ శబ్దములనుగ్పిరి. రాముఁడట్లాద్వారపాలకులచే నాశీర్వదింపఁబడిన వాఁడగుచు మొదటితొట్టికట్టును దాటి రెండవతొట్టి కట్టునుజూచెను. అచ్చట వేదవేదాంగవేత్తలును, వృద్ధులును, దశరథమహారాజుచేఁ బూజింపఁబడినవారును నగుబ్రాహ్మణులనుజూచెను. చూచియాబ్రాహ్మణులకందఱకును నమస్కారములనుజేసి మూఁడవతొట్టికట్టునకుబోయెను. అచ్చటముసలివారలగు స్త్రీలును, చిన్నవయస్సుగల స్త్రీలును, కావలియుండిరి. రాముఁడు వారలనందఱనుజూచి తగువిధంబున సన్మానించెను. అప్పుడా స్త్రీలందఱును బరమానందముతో రామునకాశీర్వాదముజేసి మహావేగముతో నంతఃపురములోనికిబోయి రాముఁడు వచ్చియున్నాఁడని, కౌసల్యాదేవితోఁ జెప్పిరి, అప్పుడుపట్టపుదేవియగు కౌసల్యాదేవియును నారాత్రినంతయు నియమముతోగడపి ప్రభాతముకాఁగానే పుత్రునకు మేలుకలుగవలయునని విష్ణుదేవునకుఁ బూజనుజేయుచుండెను, సర్వకాలములయందును వ్రతములజేయుటయందు మిక్కిలికోరికగల నాకౌసల్యాదేవి యాసమయమునందుఁ దెల్లనిపట్టువస్త్రమును గట్టుకొనినదియును, మిగుల సంతోషము గలదియును, మంగళాలంకారములు గలదియునునై యగ్నిహోత్రమునందు హోమమును బ్రాహ్మణులచే జేయించుచుండెను, అట్టియెడ రాముఁ డంతఃపురమునందుఁ బ్రవేశించి యగ్నిహోత్రమునందు హోమముజేయించుచున్న కౌసల్యాదేవినిఁజూచెను. మఱియు వారాముఁ డచ్చోటసిద్ధముగ నుంచియుండు దేవపూజాసామగ్రినిఁజూచెను. మఱియురఘునందనుడగు రాముఁడు, పెరుగును, అక్షతలను, నేతిని, కుడుములను, హవిస్సుల పేలాలను, తెల్లనిపువ్వుమాలికలను, క్షీరాన్నమును, నువ్వులను, బెల్లమును, సమిధలను, పూర్ణకుంభములను జూచెను. ఆరాముఁడు, తెల్లనిపట్టువస్త్రమును గట్టుకొనినదియును, వ్రతములచే కృశించినదియును, దేవతాస్త్రీలయొక్క కాంతివంటి కాంతిగలదియును, నీళ్లచేతవిష్ణుదేవుని దృప్తిఁబొందించుచున్నదియును, (అనగావిష్ణువును గుఱించి తర్పణంబు సేయుచున్నదనుట.) తల్లియునునగు కౌసల్యాదేవినిజూచెను. అంతకౌసల్యాదేవియును, చిరకాలమునకువచ్చినవాఁడును, తల్లియగుతనను సంతోషపరచువాఁడును, పుత్రుఁడును, నగురామునిఁజూచి పరమసంతోషముగలదై "ఆడుగుఱ్ఱము తనబిడ్డనుయెదుర్కొనునట్లు, యెదుర్కొనెను. అప్పుడారాముఁడెదుర్కొనిన కౌసల్యాదేవికి నమస్కారమునుజేసె. అంతనకౌసల్యాదేవి యారాముని గౌఁగలించికొని శిరస్సునముద్దుపెట్టుకొని పుత్రవాత్సల్యము గలదికావున శత్రువులకు నెదిరింపఁగూడనివాఁడైన తనపుత్రుఁడగు రామునింజూచి సంతసమును హితమునుగలుగఁజేయునట్టిమాటనుజెప్పఁదలచి యిట్లనియె.

పుత్రుఁడవైన రాముఁడా! నీవు, వృద్ధులును, ధర్మశీలురును, మహానుభావులును, రాజశ్రేష్ఠులును నైనవారలవలెఁ జిరకాలముజీవింపుదువుగాక. మఱియును రఘుకులమునందలివారలు సహజముగసంపాదించుచువచ్చిన కీర్తిధర్మములను నీవుగూడసంపాదింపుదువుగాక. రామా! సత్యప్రతిజ్ఞుఁడును, తండ్రియునునగు దశరథమహారాజును జూడుము. ధర్మాత్ముఁడైన దశరథమహారాజు యిపుడేమిగులబాల్యముగల నిన్నుయౌవరాజ్య పట్టాభిషిక్తునిఁగాఁ జేయదలంచియున్నాఁడని కౌసల్యాదేవిచెప్పెను. అట్లుచెప్పి వత్సా! రామా! భోజనమునుజేయుమని పీటనువైచె. అప్పుడురాముఁడు తల్లివైచినపీటనుజేతితోఁ దాకి సిగ్గుచే గొంచెముగఁ దలవంచుకొని చేతులనుజోడించినమస్కారమును జేసి తల్లియగుకౌసల్యాదేవినిచూచి యిట్లనియె.

స్వభావముచేతనే వినయముగలరాముఁ డప్పుడుతల్లియందలిగౌరవమువలనఁ మిక్కిలివినయము గలవాఁడును, దండకారణ్యమునకు బోవుటకుబ్రయాణమైనవాఁడును నై యావృత్తాంతమును సర్వమును జెప్పి తల్లియొక్కయాజ్ఞను బొంది పోఁదలఁచియిట్లనియె.

తల్లీ! నిశ్చయముగా నీకేమియుఁ దెలియకయున్నది. ఇపుడుమహానర్థము సంభవించియున్నదే! ఇప్పుడుసం

భవించిన నీయాపద నీకును సీతకును, లక్ష్మణునకును, మహాదుఃఖమును గలుగఁజేయును. నేను దండకారణ్యమునకుఁ బోవుచున్నానే, నాకీయాసనముతో నేమి ప్రయోజనము. తల్లీ! నాకు విష్టరాసనమునకుఁ దగిన కాలము వచ్చియున్నదే, (ఇరువదైదు దర్భలచేఁ జేయఁబడిన యాసనము విష్టరాసనమనఁబడును) నిర్జనారణ్యమునందుఁ బదునాలుగు సంవత్సరములు నివసింపఁబోవుచున్నానే! తేనె కందమూలఫలములచే జీవించుచు "మునులవలె" నామిషమును వదలి బ్రదుకఁబోవుచున్నానే! మహారాజగు మా తండ్రి దశరథుఁడు, భరతునకు యౌవరాజ్యము నిచ్చుచున్నాననియును, నన్నుఁ దాపసినై దండకారణ్యమునకుఁ బొమ్మనియును నాజ్ఞ జేసినాఁడే! కావున నేను పదునాలుగు సంవత్సరములు దండకారణ్యమునందు కందమూలఫలములను దిని బ్రదుకఁబోవుచున్నానే! యని చెప్పెను. అంత పట్టపుదేవియగు నా కౌసల్యాదేవి యరణ్యమునందుఁ గొడ్డలిచే నరకఁబడిన యేపిచెట్టుయొక్క కొమ్మవలెను, స్వర్గమునుండి భూలోకమునందు జారిపడిన దేవతాస్త్రీవలెను నతివేగమునఁ దటాలున గ్రిందఁ బడి మూర్ఛిల్లెను. దుఃఖమును బొందుటకుఁ దగనిదియును, దుఃఖముచే నరటిచెట్టువలెఁ గ్రిందఁ బడియుండునదియును, దిగ్భ్రమఁ జెందియున్నదియును, నగు కౌసల్యాదేవిని రాముఁడు లేవనెత్తెను. మరియు నా రాముఁడు, పొరలి లేచినదియును, బరువును మోయుచున్న యాఁడుగుఱ్ఱమువలెనున్నదియును, దుమ్ముచే గప్పఁబడిన యవయవములు గలదియును, నగు కౌసల్యాదేవిని రాముఁడు హస్తముచేత దడవెను. ఇట్లు మహాదుఃఖముచేఁ బీడింపఁబడినదియును, సుఖమునకుఁ దగినదియును, నగు నా కౌసల్యాదేవి తన్ను సేవించుచున్నవాఁడును, పురుషశ్రేష్ఠుఁడునునగు రామునిఁ జూచి లక్ష్మణుఁడుగూడ వినుచుండగ నిట్లనియె.

కుమారుఁడా! రామా! నీవు నన్ను దుఃఖపెట్టుటకుఁ బుట్టితివి. నీవు పుట్టకుంటివేని నేను సంతానము లేనిదాననై సుఖముగా నుందును. అపుడు సంతానము లేకపోయెనే, అను దుఃఖము మాత్రమే యుండును గాని యిట్టి దుఃఖము గలుగదుగదా! "శ్లో॥ ఏక ఏవ హి వంధ్యాయాః శోకో భవతి మానసః। అప్రజాస్మీతి సంతాపో న హ్యన్యః పుత్ర విద్యతే,, గొడ్డురాలికి బిడ్డలు లేరనియెడు దుఃఖమొక్కటియే తప్ప మఱియొక దుఃఖమేదియును లేదు. నిస్సంతానురాలికిట్లు క్రిందబడి యేడ్చునట్టి దుఃఖము గలుగదుకదా? రామా! నాకుఁ బెనిమిటియగు దశరథుఁడు సుఖమును బెట్టఁదగిన కాలమునం దతనివలన నేను సుఖమును గాని, మంగళములను గాని పొందినదానను గాను. ఐనను పుత్రుఁడు పుట్టినపిమ్మట పుత్రుని మూలకముగానైన సుఖమును బొందవా? యని తలఁచుచుంటిని. ఇఁక అట్టి యపేక్షతోఁ గూడిన నేను శ్రేష్ఠురాలనయ్యును నాకంటెఁ దక్కువవారును, హృదయమును భేదించునట్టివారును, నగు సవతులయొక్క యనేకములైనవియును, దుఃఖమును గలుగఁజేయునవియును, నగు మాటలను వినవలసివచ్చె. వారు అవమానకరమైన యనేకమాటలాడుదురు. స్త్రీలకింతకంటె నధికమైన దుఃఖమేమి కావలెను. నా దుఃఖమును శోకమును యిటువంటివని చెప్పనలవి గావు. నా దుఃఖమున కంతము లేదు. తండ్రీ! రామా! నీవు దగ్గర నున్నప్పటికిని నీవు చూచుచుండఁగానే తిరస్కరింపఁబడుచున్నాను. ఇఁక నీవు దూరమునకుఁ బోయినపిమ్మట నాకు మరణమే నిశ్చయము. సర్వకాలములయందును భర్తచేతఁ దిరస్కరింపఁబడినదాననైతిని. మఱియు నుపయోగము లేనిదానను గాఁ జేయఁబడితిని. ఇఁక నుగ్రకైకేయియొక్క దాసీజనమునకు సమానురాలనైనను, నంతకంటెఁ గూడఁ దక్కువదాననైన, నగుదును. మఱియు నాకు సేవకుఁడుగా నుండువాఁడు గాని, నా వెంబడి పరిచారార్థముగఁ దిరుగువాఁడు గాని కైకేయియొక్క పుత్రునిఁ జూచి భయముచేత నాతో సంభాషించుటకుగూడ సమ్మతమును బొందఁడు. హా, పుత్రుఁడా! గతిలేనిదాననగు నేను సర్వకాలములయందును గోపముగల కైకేయియొక్క కఠినమగు మాటలను విని యెట్లు సహింతును? రామా! పదునేడు సంవత్సరములనుండి పుత్రుఁడవైన నీకు యౌవరాజ్యము వచ్చునని యును, నా వ్యసనము నశించుననియును, సంతోషముచేఁ గాలమును గడుపుచుంటిని. (అరణ్యకాండమునందు రాముఁడరణ్యమునకు వచ్చునపు డిరువది సంవత్సరములవాఁడని చెప్పినదాని నుపనయనకాలము మొదలుకొని యిరువది సంవత్సరములని పెద్దలర్థమును జేసిరి. ఉపనయనము రెండవజన్మము గనుక పెద్దలు సేసినయర్థము యుక్తమైనదేను) రామా! నేను ముసలిదాననైతిని. ముసలిదాననైన నేను నీ పుత్రశోకము నెట్లు సహింతును. సవతులు చిరకాలము నన్ను బాధింతురు. ఆ బాధ నెట్లోర్తును. పూర్ణచంద్రునివలెఁ బ్రకాశించుచుండెడు నీ ముఖమును జూడకపోవుటచేత మహాదుఃఖముగలదాననగుదును. మఱియు వ్యసనమైన జీవనము గలదాననగుదును. ఇట్టి కష్టములను నే నెట్లు సహింతును. నీ క్షేమమునకుగా నేననేకములగు నుపవాసములను జేసితిని. అనేకవిధముల దేవతల ధ్యానించితిని. అనేకశ్రమలకోర్చి యనేకపుణ్యకార్యములను జేసితిని. ఇట్లు నానావిధములగు కష్టములను బొంది నిన్నుఁ బెంచితిని. నా కష్టములన్నియును నిష్ఫలములయ్యె. అయ్యో, నేనెంతదరిద్రురాలను. రామా! నీ

వుదండకారణ్యమునకుఁబోయెదనని చెప్పినమాటనువినియును నాయొక్క హృదయము, వర్షాకాలమునందు మహానదినీళ్లయొక్క వేగమువలనఁ బొడ్డువిరిగిపడినట్లు బ్రద్దలుగాకయుండుటవలన మిగులఁ గఠినమైనహృదయమని తలఁచుచున్నాను. రోదనమును జేయుచున్నను లేడిని సింహము బలాత్కారముగఁ బట్టి చంపునట్లు యముఁడిట్టి దుఃఖమును బొందియున్ననన్ను నిప్పుడే జంపకపోవుటవలన నాకు మరణము లేదని నిశ్చయముగఁ దలఁచుచున్నాను. యమలోకమునందు నాకు స్థలముగూడ లేదేమో! నాహృదయ దేహము లిటువంటి దుఃఖమును బొందియును నాశము నొందకపోవుటవలన నినుముతోఁ జేయఁబడినవేమో. అకాలమునందు మరణముగూడఁ గలుగదనుట నిజముగానే యున్నదే! నేను సంతానముకొఱకుఁ జేసిన వ్రతములును, దానములును, ధ్యానములును, ఘోరమగు తపస్సును, చవిటిభూమియందు వేసిన విత్తనమువలె,, గొంచెమైనను ఫలింపకపోవుటవలన నిట్టి దుఃఖము మాత్రము నన్ను మిగుల బాధించుచున్నది. లోకములో నెప్పుడైనను దుఃఖముచేతఁ గృశించియున్నపుడు తానుగానే యేకాలమునందు మరణము నొందఁదగునేని నేనుగూడ "దూడను వదలిన యావువలె,, నిన్ను వదలియుండ నేరక వ్యసనమును బొందుచు నిప్పుడే ప్రాణములను వదలి యమలోకమునకు బోదును. చంద్రునితో సమమగు ముఖకాంతిగల రామా! నీవు దండకారణ్యమునకుఁ బోయిన పిమ్మట నేను జీవించియుంటినేని నా జీవనము నిరర్థకమైనదగును, మఱియు గుత్సితమైనదియు నగును. కాఁబట్టి దూడను వెంబడించి పోవునట్టి యావువలె,, నేనుగూడ దండకారణ్యమునకుఁ బోవుచున్న నీతోగూడ వచ్చెదననియె. అనియిట్లు చెప్పి యా కౌసల్యాదేవి దుఃఖమును సహింపలేక కుమారుఁడడవికి బోయిన పిమ్మట తనకు సంభవించెడు గొప్పదగు దుఃఖమును గుఱించి యాలోచించి దశరథుని యాజ్ఞకులోఁబడియున్న పుత్రునిఁ జూచి కిన్నరస్త్రీవలె "కంటినుండి నీరు ప్రవాహమువలె బ్రవహించుచుండగ'' వ్యసనమును బట్టజాలక గట్టిగా రోదనమును జేసెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యిరువదవసర్గము ముగిసెను.

——❀ కౌసల్యారామలక్ష్మణుల సంవాదము. ❀——

అటు మహావ్యసనముఁ జెందుచున్న రాముని దల్లియగు కౌసల్యాదేవిం జూచి లక్ష్మణుఁడు మిగులదుఃఖముగలవాఁడై యాకాలమునకుఁ దగినమాటలను జెప్పఁదలఁచి యిట్లనియె.

అక్కా! కౌసల్యాదేవీ! రాముఁడు ఆడుదానియొక్క మాటనువిని రాజ్యలక్ష్మిని వదలి యరణ్యమునకుఁ బోవుట నాకును సమ్మతముగనుండలేదు. చంచలమగుమనసుగలవాఁడును, వృద్ధుఁడును, విషయలోలుఁడును, ప్రేరేపింపబడుచుండువాఁడును, కామోద్రేకముగలవాఁడును, నగు దశరథమహారాజేమి చెప్పఁడు! విషయములయందుఁ బ్రియముగలవాఁడు కావున బుద్ధివిహీనుఁడై యుక్తాయుక్తముల నాలోచింపక నన్నియును జెప్పును. కావున నట్టిమాట ప్రకారము నడచుట మిగుల ననుచితము. ఏమితప్పును జేయుటచేఁ బుత్రుని దండ్రులరణ్యమునకుఁ బంపుదురో, యట్టితప్పును రాముఁడేమియును సేయలేదు. కావున రాముఁడు రాజ్యమును వదలిపోవుట యుచితముగాదు. రామునకుఁ బరమశత్రువైనవాఁడును, రామునిచేత నధికముగఁ నగౌరవము నొందినవాఁడును, నెట్టివాఁడైనను రామునియందు దుర్గుణములుగలవని చెప్పడములేదు. పరోక్షమునందఁగూడ రాముని దుర్గుణములను జెప్పఁగ నేనెప్పుడును వినియుండలేదు. దేవతలతో సమానుఁడును, కపటములేనివాఁడును, ఇంద్రియములను జయించినవాఁడును, శత్రువులకుఁగూడఁ బ్రియమైనవాఁడును, నగు పుత్రుని నిష్కారణముగ ధర్మశీలుఁడగువాఁ డెవ్వడైనన రణ్యమునకుఁ బంపునా! పంపఁడు. కావున ముసలివాడయ్యును పసివానివలె యుక్తాయుక్తముల నాలోచింపక చెప్పుచున్నవాఁడును, పెద్దల యాచారమును వదలినవాఁడును, నగు నీదశరథుని మాటను రామునికంటె నితరుఁడగు పుత్రుఁడెవ్వఁడు సరియని తలఁచి యతనిమాట ప్రకారముగఁ బ్రవర్తించును! కావున యుక్తాయుక్తముల నాలోచింపక చెప్పుచున్న దశరథుని మాటను రాముఁడు విననక్కఱలేదని చెప్పి రామునిఁ జూచి యిట్లనియె.

రామా! ఇపుడు దశరథుఁడు నిన్నరణ్యమునకుఁ బొమ్మనిన సంగతి యెవరికిని దెలియదు. కాబట్టి యిపుడే నాతోగూడ నీవు వచ్చి రాజ్యంబునంతయు నీయధీనమును జేసికొనుము. నేను ధనుస్సును ధరించి నీ ప్రక్కన నిలువంబడియుండగా యమునివలెగనబడుచుండు నీయెదుట నిలుచుటకుగాని నీయాజ్ఞను దాటుటకుగాని నెవడు శక్తిగలవాఁడగును! రామా! ఇయ్యయోధ్యాపట్టణమునందుండు జను లెవ్వరైనను విరోధము చేసిరేని యట్టివారి శిరములను నీతీక్ష్ణములగు బాణములచే ఖండించి యయ్యయోధ్యయం దొక్కఁడైనను లేకుండునట్లు చేసెదను. "మృదుర్హి పరిభూయతే,, మంచి

వాఁడందఱిచేతను నవమానింపఁబడునను సామెతగలదు. కావునమ్మృదుత్వము నవలంబించుట యుచితముగాదు. ఇప్పుడుభరతునిపక్షముగ మాటలాడువారలను, భరతున కుహితమును గోరువారలను నేనువధించెదను. విశేషముగఁజెప్ప నేల. ఇంకనెవ్వరడ్డమువచ్చినను వధించెదను. దుష్టుఁడైనమాతండ్రి కైకేయిచే బ్రేరేపింపఁబడి నాకుశత్రువుగవచ్చెనేని యతనింగూడ నిస్సందేహముగవధించెదను. అట్లుగాదేని బంధించివేయుదము. "శ్లో॥ గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః। ఉత్పథంప్రతిపన్నస్య కార్యం భవతి శాసనమ్,, గురువైనను గర్వోద్రిక్తుఁడై కార్యాకార్యములను దెలియకదుర్మార్గమునందుఁ బ్రవర్తించెనేని శిక్షింపఁదగినవాఁడగునని ధర్మశాస్త్రము బోధించుచున్నది. కావునదశరథుని వధించినను, బంధించినను పాపముగలుగనేరదు. పురుషశ్రేష్ఠుఁడా! రామా! ఈదశరథమహారాజు ముఖ్యముగనీకు రాఁదగిన రాజ్యమును కైకేయికేమి కారణముచే, నేబలమునుబట్టి యివ్వఁదలఁచియున్నవాఁడో, యటువంటికారణ మొక్కటియును గనఁబడలేదు. శత్రుశాసనా! రామా! మనమిరువురితో బద్ధవైరమును బెట్టుకొని భరతునకు రాజ్యమిచ్చుట కీదశరథునకేమి శక్తిగలదు. కౌసల్యా! వాస్తవముగా నేను, నాయన్నయగు రామునిమీఁద మిగులఁ బ్రియముగలవాఁడను. ఈవిషయమునకుఁగా నేనుసత్యమును జేసెదను. మఱియునాధనుస్సుమీఁదను, దానముమీఁదను, యాగముమీఁదను ఒట్టుఁబెట్టి ప్రమాణమును జేసెదను. నన్నురామునకు జ్ఞాతినిగాఁ దలఁపకుము, తల్లీ! కౌసల్యా! రాముఁడు జ్వలించుచున్న యగ్నియందుఁ బ్రవేశించినను, భయంకరమైన నరణ్యమునందుఁ బ్రవేశించినను నేనతనికిముందుగఁ బ్రవేశింతునని యెన్నుము. నేనునీదుఃఖమును, "ఉదయించిన సూర్యుఁడు చీకటినిఁబోఁగొట్టునట్లు" పరాక్రమముచే బోఁగొట్టుదును. దేవివైననీవును, రాముఁడును, నాదుపరాక్రమమును జూడుఁడనియె. అనియిట్లు మహాత్ముండైన లక్ష్మణుఁడుచెప్పిన మాటనువిని దుఃఖసముద్రమున మునిగియుండు కౌసల్యాదేవి తనయధికముగు రోదనమునకంతము గలుగునేమోయని తలంచుచు మరలదుఃఖమును బట్టనేరక నేడ్చుచు రామునింజూచి యిట్లనియె.

పుత్రుఁడా! నీతమ్ముఁడగు లక్ష్మణుఁడుచెప్పినట్టి మాటలను నీవువింటివిగదా? ఈవిషయమునందు నీకుఁ బ్రవర్తించుట కిష్టముంటినయెడలఁ బిమ్మటఁ జేయఁదగిన కార్యములనుజేయుము. నాకుసవతియగు కైకేయిచెప్పిన యధర్మవు వచనమునువిని యధికముగదుఃఖించుచున్న నన్నునిక్కడవిడిచిపెట్టి నీవరణ్యమునకు బోవుట యుచితముగాదు. ధర్మజ్ఞా! రామా! నీవుపరమధార్మికుఁడవు. కావుననీకు ధర్మముగ సంచరింపవలయునని కోరికయున్నయెడల నీవిక్కడనేయుండి నాకుశుశ్రూషనుజేయుము. మాతృశుశ్రూషకంటెనధికధర్మములేదు. కావుననాకుశుశ్రూషనుజేయుచు నిక్కడనేయుండుము. "శ్లో॥ శుశ్రూషుర్జననీం పుత్ర స్వగృహే నియతో వసన్। పరేణతపసాయుక్తః కాశ్యపస్త్రిదివంగతః,, తొల్లికాశ్యపుఁడను బ్రాహ్మణుఁడింటియందే నివసించి తల్లికిశుశ్రూషనుజేసి మిగులతపస్సును బొంది స్వర్గమునకుఁబోయెను. రామా! నీకుదశరథుఁడెట్లుపూజ్యుఁడో నేనును నీకట్లేపూజ్యురాలనుగదా? కావున నేనునిన్నువనమునకుఁ బొమ్మనియాజ్ఞ నివ్వను. నాయనుమతములేక నీవుదండకారణ్యమునకుఁ బోఁగూడదు. నీవు నన్నువదలిదండకారణ్యమునకుబోయినపిమ్మటనాకుబ్రతుకేల? సుఖమేల? నీతోగూడగడ్డిపోఁచల భక్షింపుచుండిన నాకంతియచాలు. ఇట్లుదుఃఖించుచున్న నన్నువదలి నీవరణ్యమునకుఁబోతివేని నేను అన్నము నీరును వదలిపెట్టి ప్రాణములను విడిచిపెట్టుదును. పుత్రుఁడా! సముద్రుఁడధర్మమువలన పిప్పలాదమునికిఁజేసిన యపకారమువలన బ్రహ్మహత్యనుబొంది మిగులఁ గష్టములను జెందినట్లు నేనునీకొఱకు ప్రాణముల విడిచిపెట్టితినేని నన్నువదలిపోవుటయను నధర్మమువలన సకలలోకప్రసిద్ధమగునరకమును బొందుదువనియె. అనియిట్లుబహువిధముల విలపించుచున్నదియును, దీనురాలును, తల్లియునునగు కౌసల్యాదేవియొక్కవచనమునువిని ధర్మాత్ముఁడగు రాముఁడు ధర్మయుతముగ నిట్లనియె.

తల్లీ! తండ్రియొక్కమాట నతిక్రమించుటకు నాకుసామర్థ్యములేదు. కావుననీకు సాష్టాంగనమస్కారమును జేసి ప్రార్థించెదను. నేనుదండకారణ్యమునకుఁ బోవుచున్నాను. కావుననన్నుఁబోనిమ్ము. తల్లీ! పూర్వముదివ్యజ్ఞానముగలవాఁడును, అనేకవ్రతముల నాచరించినవాఁడును, ధర్మమునుదెలిసినవాఁడును, పండితుఁడును, తండ్రియొక్క వాక్యానుసారముగఁ బ్రవర్తించువాఁడును, నగుకండువను మునీశ్వరుఁడుగూడఁ దండ్రిమాటకు జవదాటక గోవునుగూడ సంహరించెను. మఱియును పూర్వము మాకులమునందుఁ బుట్టినసగరచక్రవర్తియొక్క యాజ్ఞచేనతని పుత్రులుభూమినిద్రవ్వి తమప్రాణములను బోఁగొట్టుకొనిరి. మావంశపువారు తండ్రివచనమునువిని ప్రాణములనుగూడఁ బరిత్యజించియుండగా నేను గొంచెముకాలము వనములయందుండఁదగదా? తండ్రియొక్కవచ

నానుసారముగఁ బ్రవర్తించునట్టివాఁడను, జమదగ్నిమహామునికి బుత్రుఁడును నైన పరశురాముఁడు తండ్రిమాటనువిని గొడ్డలిచే దల్లియగు రేణుకాదేవిని నరికెను. కావున నేను తండ్రిమాటను విని యరణ్యమునకుఁ బోవుటవలన దప్పితమేమియును లేదు. తల్లీ కౌసల్యాదేవీ! యిప్పుడు నాచే జెప్పబడిన వారిచేతను, ననేకులగు నితరులైన దేవసమానులచేతను, పితృవాక్యపరిపాలన చేయఁబడినది. కాఁబట్టి నేను మాత్రమెట్లు పితృవాక్యమును బరిపాలింపకుందును? తల్లీ! పితృవాక్యమును బరిపాలించువాఁడను నేనొక్కఁడనే కాదుగదా? ఇంకను ననేకులు పితృవాక్యమును బరిపాలించినవారలను నీకుఁ జెప్పితినిగదా? నేనిదివఱకెప్పుడును లేనిదియును, పూర్వాచారమునకు విరుద్ధమైనదియును నగు కార్యమును నీకొఱకుఁ జేయుచున్న వాఁడను గాను. పూర్వీకులంగీకరించి యాచరించిన మార్గమునే నేనుగూడనంగీకరించి యాచరించుచున్నాను. కావున నాయందేమియును దోషములేదు. భూలోకమునందుఁ జేయఁబడుచున్నదానికి నేను వ్యతిరిక్తముగఁ జేయుచున్న వాఁడను గాను. లోకములో నెవ్వఁడును తండ్రియొక్క వచనానుసారముగఁ బ్రవర్తించి చెడదుగదా? (అనఁగా నొకవేళఁ దల్లిమొదలగువారికి దుఃఖమును గలుగఁ జేయునట్టిదైనను పితృవాక్యమును బాలించువానికి దోషమేమియును గలుగదని యభిప్రాయము.) కావున నేను బితృవాక్యమునకు వ్యతిరిక్తముగ సంచరించువాఁడను గానని చెప్పి చక్కఁగా మాటలాడువారలలో నుత్తముఁడును, ధనుర్ధారులలో శ్రేష్ఠుఁడును నగు రాముడు సమీపమునందున్న లక్ష్మణునింజూచి యిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! నీకు నాయందు మిగుల స్నేహముగలిగి యుండుటయును, నీకు సర్వోత్తమమైన పరాక్రమము గలిగియుండుటయును, మఱియును నీయందు బలమును మాహాత్మ్యమును సర్వోత్తమముగ నున్నవనియును, నేనెఱుఁగుదును. శుభలక్షణా! లక్ష్మణా! సత్యముయొక్కయు, శాంతియొక్కయు రహస్యమును దెలియకపోవుటవలన నాతల్లియగు కౌసల్యాదేవికి సహింపగూడని దుఃఖము గలుగుచున్నది. నీవు సత్యముయొక్కయు, శాంతియొక్కయు రహస్యములను దెలిసినవాఁడవయ్యును నిట్లేల పలుకుచున్నావు? "ధర్మోహిపరమో లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితం। ధర్మసంశ్రితమేతచ్చ పితుర్వచనముత్తమమ్,, లోకమునందు ధర్మము శ్రేష్ఠమైనదిగదా? ధర్మమునందు సత్యము నిలిచియున్నది. తండ్రియగు దశరధుని వచనము ధర్మయుతముగనున్నది. కావున నేను బితృవాక్యము చొప్పునఁ బోయెదను. మఱియును నేను దశరథుని యాజ్ఞాప్రకారము దండకారణ్యమునకుఁ బోయెదనని కైకేయితోఁ జెప్పినాను దశరథునాజ్ఞయు నైనది. కావున సత్యపరిపాలనంబును బితృవాక్యపరిపాలనంబును జేయుటకంటె నుత్తమంబగు కార్యం బేదియును లేదు. "శ్లో॥ సంశ్రుత్యచ పితుర్వాక్యం మాతుర్వా బ్రాహ్మణస్య వా। న కర్తవ్యం వృథా వీర ధర్మమాశ్రిత్య తిష్ఠతా,, తండ్రితోనైనను, తల్లితోనైనను, బ్రాహ్మణునితోనైనను, మీరు చెప్పిన కార్యమును జేసెదనని చెప్పినపిమ్మట ధర్మమునందుఁ బ్రియముగలిగి సంచరించువాఁడు చెప్పిన మాటను వ్యర్థముగఁ జేయఁగూడదు. కావున నేను దండ్రియగు దశరధునితోఁ జేసెదనని చెప్పితిని. కాబట్టి నేను దండకారణ్యమునకుఁ బోయెదను. నేను దండ్రిచెప్పిన దానికి వ్యతిరిక్తముగ సంచరింపఁజాలను. తండ్రియగు దశరథమహారాజుయొక్క యనుమతమును బొంది కైకేయి నాతోఁ జెప్పినదిగాని, వేరొండుగాదు. అందువలన నో లక్ష్మణుఁడా! క్షత్రధర్మము నాశ్రయించినదియును, పగాజ్యముగానిదియును, నగు నీదుష్టబుద్ధిని వదులుము. ఇఁకను ధర్మబుద్ధి నవలంబింపుము. క్రూరత్వమును బొందకుము. నామతమును నీవుగూడ నవలంబింపుము. అని చెప్పెను. (నీతిమార్గముకంటె ధర్మమార్గ మెక్కుడైనది గాన లక్ష్మణుఁడు చెప్పిన రాజనీతిమార్గము నవలంబింపక రాముఁడు ధర్మమార్గము నవలంబించెనుగాన నీతినిమాత్రమే యాశ్రయింపవలయునుగాని ధర్మమార్గమున వలంబింపఁగూడదను నాస్తికమత ముఖండింపఁ బడినదని యీచోట గోవిందరాజులు వ్యాఖ్యానమును జేసిరి) లక్ష్మణునకన్నయగు రాముఁడు స్నేహమువలనఁ దమ్ముఁడగు లక్ష్మణునితో నిట్లు చెప్పి ప్రాంజలియై కౌసల్యాదేవికి సాష్టాంగనమస్కారము చేసి వినయముతోఁ గూడినవాఁడై యిట్లనియె.

తల్లీ! కౌసల్యాదేవీ! ఇచ్చటనుండి నేనరణ్యమునకుఁ బోవుచున్నాను. నాకనుజ్ఞ యిమ్ము. నాకాజ్ఞనివ్వకపోతివేని నాప్రాణములమీఁద ఒట్టుపెట్టుకొనిన దానవగుదువు. కావున నాకేమియును విఘ్నములును గష్టములును గలుగకుండ నట్లాశీర్వచనమును జేయుము. నేను బదునాలుగు సంవత్సరములరణ్యమునందు వసించి పూర్వము రాజర్షి యగు యయాతి స్వర్గమును వదలి భూలోకమునకు వచ్చినట్లు మరల నీయయోధ్యాపురమునకు వచ్చెదను, తల్లీ! కౌసల్యాదేవీ! నీవు నీదుఃఖమును మనస్సునందే యణఁచికొమ్ము. అధికముగ వ్యసనమును బొందకుము. మా తండ్రి చెప్పిన చొప్పున దండకారణ్యమునందుఁ బదునాలు

గు సంవత్సరములనునుండి మరలవచ్చుటకివచ్చెదను. అమ్మా! కౌసల్యాదేవీ! నీవు, నేను, సీత, లక్ష్మణుఁడు, సుమిత్ర, యీజనమండలమును మాతండ్రియగు దశరథమహారాజు చెప్పినచొప్పున సంచరింపవలయును. మఱియు దశరథునియాజ్ఞకు లోఁబడియుండవలయును. ఇదిసనాతనమగుధర్మము. కావుననోతల్లీ! పట్టాభిషేకమునకుసంపాదింపఁబడిన ద్రవ్యములనన్నిఁటినివదలి దుఃఖమునుమనస్సునందేయణచుకొని ధర్మయుతమైనదియును, వనవాసమునుజేయుటకు నిశ్చయింపఁబడినదియునగు నాబుద్ధిననుసరింపుమని చెప్పె. అనియిట్లురాముఁడుచెప్పిన పట్టపుదేవియును, రామునకుఁదల్లియునునైన కౌసల్యాదేవి, అట్లు రామునిచేఁ బలుకఁబడుచున్నదియును, ధర్మముతోఁగూడినదియును, కలతలేనిదియును, దృఢమైనదియును నగునీమాటనువిని చచ్చిపోయి మరలకొంతసేపటికి తెలివితెచ్చుకొని రామునిఁజూచి మరలనిట్లనియె.

పుత్రుఁడా! నిజధర్మముచేతను, స్నేహముచేతను, నీకుఁదండ్రియగు దశరథునివలెనే, నేనుగూడ గురువైనదానను. నేను నీవుదండకారణ్యమునకుఁ బోవుటకుసమ్మతింపలేదు. నీవుపోగూడదు. ఇట్లు మిగులదుఃఖమును బొందుచున్న నన్నువదలిపోవుటకుఁ నీకుఁదగదు. నీవునన్నువిడిచిపోయినపిమ్మట నేనుబ్రతికియున్నందున లాభమేమి? నాకుఁ బరలోకమెక్కడిది? పితృలోకమునందు దొరకునట్టి స్వధ, (లేకసుధఅనగా అమృతము) దొరికినను నాకుసంతోషముగలుగదు. నాకుమోక్షములభించినను రుచింపదు. ఈసమస్తజీవలోకము ముందరనుండుటకంటె నీయెదుట క్షణమాత్రమున్నను జాలును. నీయెదుటనుంటనేని నాకుఁ బరమసంతోషము. అనియిట్లుచెప్పికౌసల్యాదేవిదుఃఖింపఁగ "మానవులు కొలవికట్టెలచేత మార్గమునడ్డపెట్టి నప్పుడామార్గమునందుఁ బ్రవేశించినయేనుఁగువలె" రాముఁడుదుఃఖమును గలిగించునట్టి తల్లియేడ్పులనువిని యధికముగఁబరితాపమును బొందెను. మఱియునారాముఁడు ధర్మమార్గమునందే వర్తింపవలయునను తలంపుగలవాఁడై స్మృతిలేకయున్న తల్లినిన్ని మిగులదుఃఖమును బొందుచున్న లక్ష్మణునిన్నిఁజూచి, ధర్మయుతమగు వచనమునుజెప్పెను. అట్టిమహాసంకటకాలమునందు దుఃఖమునణచుకొని ధర్మయుతమగు మాటనుజెప్పుటకు రాముఁడొక్కఁడేతగునుగాని మఱియొక్కఁడుతగఁడు. లక్ష్మణా! నేనుసర్వకాలములయందును నీయొక్కభక్తిని పరాక్రమమును గుర్తెఱుఁగుదునుగదా? నీవునాయభిప్రాయమును దెలిసికొనకయే తల్లితోఁగూడఁజేరి నాకుదుఃఖము గలుగునట్లుచేయుచున్నావు. ఇట్లునన్ను బాధింపఁదగునా? నాయనా! లక్ష్మణా! లోకమునందు ధర్మముజేయువానికి ధర్మము, అర్థము, కామము, నిమ్మోక్షమును గలుగునని చెప్పఁబడినవి గదా? ఆధర్మార్థ కామములన్నియును పుత్రవతియగుభార్య భర్తయందు వశ్యురాలై యున్నవిధముగ ధర్మమునందుఁ బ్రతిష్ఠింపఁబడియున్నవి. (అనఁగా సద్గుణములుగలభార్య భర్తయందుఁ బ్రియముగలదై యుండి యోగ్యులగుపుత్రులనుగని సద్గతినిగలుగఁజేయునట్లు ధర్మార్థకామములువరాటిని ధర్మమొక్కటియే కలుగఁజేయునని యెఱుంగవలయును) ఏకర్మమునందు ధర్మార్థకామములు మూఁడును, గలుగవో యటువంటికర్మను జేయఁగూడదు. "శ్లో॥ ద్వేష్యోభవత్యర్థ పరోహిలోకే కామాత్మతాఖల్వపినప్రశస్తా,, అర్థమునందుమాత్ర మాసక్తిగలిగి కర్మల నాచరించువాఁడు లోకమునందు నింద్యుఁడగును. కామమునందే కోరికగలిగి కర్మలనాచరించుటయును ప్రశస్తముగాదు. ఆచార్యుఁడును, రాజును, తండ్రియును, ముసలివాఁడును,నగుదశరథుఁడు కోపమువలనఁగాని, సంతోషమువలనగాని, కామమువలనగాని యేపనినిజెప్పినను జేసియే, తీరవలయును. తండ్రిచెప్పినకార్యమును ధర్మాత్ముఁడగువాఁ డెవ్వఁడుచేయఁడు? ధర్మాత్ముఁడగువాఁడు తండ్రిచెప్పినకార్యము నవశ్యముగఁజేసియే, తీరును. కావున లక్ష్మణా! ధర్మమార్గమునందు సంచరింపవలయునను కోరికగల నేనుతండ్రియాజ్ఞను నెట్లునెరవేర్పకుందును. తండ్రియొక్కయాజ్ఞను సర్వమును సరిగాఁజేసెదను. నాయనా! లక్ష్మణా! మనకిద్దఱకును నాజ్ఞాపించుటయందు దశరథమహారాజుగురుఁడు. మనకాజ్ఞజేయుటకుఁ దగినప్రభువు. తల్లియగుకౌసల్యాదేవికి దశరథమహారాజుభర్త. కావున నీమెభర్తనువదల నావెంటరాఁదగదు. ధర్మమునకుఁ బ్రభుఁడైనవాఁడును, స్వమార్గమునందు సంచరించువాఁడును, నగునాదశరథమహారాజు జీవించియుండగ నీకౌసల్య "విధవాంగనవలె" నావెంట నంటివచ్చుటకు తగదని లక్ష్మణునితోఁజెప్పి కౌసల్యను జూచియిట్లనియె.

దేవీ! కౌసల్యా! దండకారణ్యమునకుఁ బోవుచున్న నాకాజ్ఞయిమ్ము. కూతురిపుత్రుఁడిచ్చిన పుణ్యవిశేషమువలన యయాతి మరల స్వర్గలోక సుఖముల ననుభవించుటకు స్వర్గమునకుఁబోయినట్లు నేనుబదునాలుగుసంవత్సరము లరణ్యమునందునివసించి మరలసుఖములననుభవించుట కిచ్చుటకివచ్చునటుల నాశీర్వచనములజేయుము. ఓకౌసల్యాదేవీ! నేనుకేవలరాజ్యముకొఱకు నధికమైనఫలమును గలుగఁజేయునట్టి కీర్తినిబోఁగొట్టుకొనుటకు సమ్మతింపను.

మఱియు నో తల్లీ! బ్రతుకఁబోవునదంతయు కొంచముకాలమేను, దీనికొఱకుఁగా, నధర్మమునాశ్రయించి నీచమైన భూమిని పాటుబడి సంపాదనము సేయుటకు నాకు సమ్మతములేదు. అనియిట్లు పురుషోత్తముఁడగు రాముఁడు తల్లిని నూరడింపుచుఁ దనపరాక్రమమువలననే దండకారణ్యమునకుఁ బోఁ దలఁచి పిమ్మటఁ దమ్ముఁడగు లక్ష్మణునకుఁ దనమనస్సులోనుండు తాత్పర్యమునంతయు తెలియచేసి మనస్సునందే తల్లికిఁ బ్రదక్షిణ నమస్కారము జేసినట్లు భావనను జేసెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యిరువదొకటవసర్గ ముగిసెను,

రాముఁడు లక్ష్మణునితో గోపమునొందకుమని చెప్పి నీతినిబోధించుట.

పిదప నధికధైర్యముగల రాముఁడు దుఃఖముచేఁ గుఱ దీనుఁడుగ నుండువాఁడును, నధికమగు కోపముగలవాఁడును, "నిట్టూర్పులను విడుచుచున్న మహాసర్పమువలెను న్నవాఁడును" కోపముచే గొప్పవిగాఁ జేయఁబడిన నేత్రములుగలవాఁడును, స్నేహితుఁడును, తమ్ముఁడును, ప్రియుఁడును, నగు లక్ష్మణునిదగ్గరకువచ్చి ధైర్యముచే దుఃఖమువలనగలిగిన మనోవికారము నణఁచుకొనుచు లక్ష్మణునింజూచి యిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! నీవు తండ్రియగు దశరథమహారాజుమీఁది కోపమును, అన్నయగు రామునకిట్టికష్టము వచ్చినదే నేనేమి చేయుదు ననువ్యసనమును, విడిచిపెట్టుము. మఱియును ధైర్యమున నవలంబించి రామపట్టాభిషేకమున కిట్టిభంగము గలిగెగదా యను నవమానము నువదలి యుత్తమమగు సంతోషమును బొందుము. మఱియునిప్పుడు నాపట్టాభిషేకమహోత్సవముకొఱకుఁ జేసియుంచు నలంకారములను వదులుము. తమ్ముఁడా! లక్ష్మణా! నాయొక్క యభిషేకముకొఱకుఁ దగినపదార్థములను సంపాదింపవలయునని గలిగినయుత్సాహమును వదలి నావనవాసమునకుఁ దగిననారచీరలు మొదలగువానిని దీసికొనివచ్చుటయందు మిగుల సంతోషము గలవాఁడవగుము. మఱియు నన్ను సంతోషముతో నడవులకుఁ బంపుటకు బ్రయత్నింపుము. నాకుఁ బట్టాభిషేకము కాకపోయెనేయని పరితాపమును బొందుచున్న నాతల్లియొక్క మనోవ్యథను బోఁగొట్టుము. అదియెట్లనినఁ "గౌసల్యాదేవీ! రాముఁడు పదునాలుగు యేండ్లే గదా! యరణ్యమున నుండవలసినది. పిమ్మటమరల నిచ్చటికివచ్చునుగదా! పదునాలుగుసంవత్సరములనఁగా నెంతమాత్రము! చూచుచుండగానే వచ్చును. కండ్లుమూసికొని యేవిధముగనైనఁ గాలమును గడుపుము. వ్యసనమును జెందకుమని" యనేకవిధముల ధైర్యము చెప్పుము. లక్ష్మణా! నేను తల్లియగు కౌసల్యాదేవియొక్క భయంకరమైనదుఃఖమును క్షణమును సైపనైనను సహింపఁజాలను. నేను బుట్టిననాటనుండి తెలిసియైనను, తెలియకనైనను, తల్లిదండ్రులకుఁ గొంచెమైన నపకారమును జేయలేదు. చేసినట్లు నాకుజ్ఞప్తియు లేదు. (అనఁగా బుట్టిననాటనుండి నేను దల్లిదండ్రులకుఁ గొంచెమైన నపకారమును జేసియుండలేదు) సత్యముగ మాటలాడువాఁడును, సత్యాభిసంధుఁడును, సర్వకాలములయందును సత్యమైనపరాక్రమముగలవాఁడును, పరలోకమునందు హానిగలుగునేమోయని భయమును బొందువాఁడును, మనకుఁదండ్రియగునట్టి దశరథమహారాజు భయము లేనివాఁడగుఁగాక. ఇప్పుడు నేను బట్టాభిషేకమును వదలి యడవులకుఁ బోకపోతినేని దశరథమహారాజు కైకేయికిఁ దానిచ్చినవరములు నెరవేరకపోయినందుకు మనస్తాపమును బొందును. అట్లు మనస్తాపమును బొందెనేని యది నన్ను మిగులబాధించును. లక్ష్మణా! కావున నేను పట్టాభిషేకకార్యమునువిడిచి యిప్పుడే యిచ్చోటనుండి యడవులకుఁ బోవుటకిచ్ఛయించుచున్నాను. నేను దండకారణ్యమునకుఁ బోయిన పిమ్మటఁ గైకేయి కృతార్థురాలై సంతోషమును బొందును. మఱియు నుఁదనపుత్రుఁడగు భరతునకు నిర్విఘ్నముగాఁ బట్టాభిషేకమును జరిగించును. నేను నారచీరలను, కృష్ణాజినమును, జడలను, ధరించి యరణ్యమునకుఁ బోతినేని కైకేయియొక్క మనస్సునకుఁ బరమసంతోషము గలుగును. కావున నేను శీఘ్రముగా నరణ్యమునకుఁ బోయెదను. దశరథమహారాజు సత్యమునువదలఁజాలక మిగులఁ బ్రియుఁడనైన నేనరణ్యమునకుఁ బోవుటకుగూడ సమ్మతమును బొందెను దశరథమహారాజుదుఃఖమునుబొందునట్లు సేయఁగూడదు. కావున నేను శీఘ్రముగ నడవికిఁ బోయెదను. లక్ష్మణా! నన్ను దండకారణ్యమునకుఁ బంపుటకును, నాతండ్రి నాకిచ్చిన రాజ్యమునుదీసికొనుటకును కైకేయి కారణముగాదు. ఇవి యన్నియును దైవయోగమువలన గలిగినవనియెఱుంగవలయును. దైవయోగమువలనఁ గైకేయికిటువంటిబుద్ధి పుట్టినదని నేను నిశ్చయముగాఁ జెప్పఁగలను. అట్లుగాదేని నాయందు మును పుసర్వకాలములయందును మిక్కిలి ప్రియముగలదై దయావంతురాలైయుండు కైకేయికి నన్ను బాధింపవలయునని యెడు బుద్ధిగలుగుటకుఁ గారణమేమి? లక్ష్మణా! నేనిదివఱకెప్పుడును దల్లులయందు, సవతితల్లికన్న

తల్లియనియును, భేదబుద్ధిగలవాఁడనుగాను. కైకేయియును, సవతికొడుకనియును, తనకొడుకనియును, భేదములేకనాయందును భరతునియందును సమమైనప్రేమగలదై యుండును. కావున దైవయోగముకాదేని కైకేయికిట్టిదుర్బుద్ధినొందుటకుఁ గలుగును. నేనుసర్వకాలములయందును గైకేయియందుఁ బ్రియముగలవాఁడనై యుందును. కైకేయియునునాయందుఁ బరమప్రేమ గలదైయుండును. అట్లుప్రియము గలదైయుండుతల్లి దైవయోగముచేత గాని యెడల నన్నునడవులకుఁ బొమ్మనియును, భరతునకుఁ బట్టాభిషేకమును జేసెదననియును నెట్లుచెప్పును. చెప్పనే చెప్పదు. కావునదీనికి దైవయోగమే కారణముగాని మఱియొక కారణమేమియునులేదని యెఱుంగవలయును. రాజపుత్రికయగుకైకేయి మిగుల గుణవంతురాలు. అట్టిమహనీయురాలుతనకు సహజమైన మంచిగుణముతోఁ గూడియుండినయెడల నిట్టిదుర్వచనములను జెప్పునా? మఱియునుభర్తయెడల నెట్లునడుచుకొనవలయునో యావిషయము రు సకలమును దెలిసికొని సర్వకాలములయందును బ్రవర్తించుచుండును. నామీదమిగులఁ బ్రియముగలదైయుండును. అట్టికైకేయిపూర్వము వరాఁ డెనిమిటియందు గౌరవములేనిదై నాయందలి ప్రియమునువదలి" నీచస్త్రీవలెఁ" బెనిమిటియొక్క లజ్జాభయములనువదలి తనకును, తనభర్తకును మిగులనిష్టుఁడనైననన్ను నడవికిఁబొమ్మని చెప్పునా? చెప్పనే చెప్పదు. కావునదైవయోగమువలన నిట్టిదుర్భాషలు పలికినదిగాని బుద్ధిపూర్వకముగఁ జెప్పినదకాదు. "శ్లో॥ యదచింత్యంతు తద్దైవం భూతేష్వపినహన్యతే, వ్యక్తం మయి చతస్యాంచపతితోహివిపర్యయః॥, దైవముయొక్క మహిమ యిట్టిదనియెన్న నలవిగాదు. సకలభూతము లొక్కటి గాఁజేరినను లేకయొక్కొక్కటియే యైనను దైవబలమును బోఁగొట్టఁజాలవు. (అనఁగాసకల భూతములును దైవబలమునకులోఁబడిపోవుననుట.) ఇందుకుసందేహములేదు. చూడుము. మిగులగుణవంతురాలగు కైకేయికిదుర్బుద్ధిపుట్టినది. మఱియుననేకులచేతను వసిష్ఠాదిముని వరులచేతనుగూడ నిశ్చయింపఁబడిన నాపట్టాభిషేకము వొక్కకైకేయివలన నిలిచిపోయినది. కాఁబట్టి దైవబలమునకెందును నెదురులేదని యెఱుంగవలయును. లక్ష్మణా! దైవమున్నదనుటకేమి హేతువుగలదు? ఒకవేళదైవమున్ననేమి? పురుషయత్నముచేత దైవయత్నమునేల నివారింపఁగూడదని యనియెదవేమో? అట్లుచెప్పఁగూడదు. మనకుదైవము కనఁబడకపోయినను కార్యముచేత దైవమున్నట్లు తలఁపవలయును. మనముమిగులఁ బూనికతోసకల సాధనములను బెట్టుకొని చేయఁదలచిన కార్యములు చెడిపోవును. కొన్నికార్యములు పూనికనవలంబింపక చేసినను సిద్ధించును. అట్లాకార్యములు సిద్ధించుటకుఁ గారణమేమియును గనఁబడదు. కావుననీరెండును దైవమువలననేయగుచున్నవని మనముతలఁపవలయును. కాఁబట్టిమిగులశ్రమపడిచేసిన కార్యముచెడి పోవుటయును, శ్రమపడకచేసిన కార్యము చక్కఁబడుటయును, విచారింపఁగ దైవముకంటె నితరమగుకారణ మేమియును గనఁబడదు. అందువలన దైవమనునది యొకటి గలదని యనుమానప్రమాణముచేతమనము నిశ్చయింపవలయును. అట్టిదైవము, కార్యమును జేయువానికంటె కగఁబడదు. ఇక్కాలమను కూలముగనుండునో? ప్రతికూలముగ నుండునో యదియును దెలియదు. రాఁబోయెడిసంగతి యెవ్వనికిఁదెలియును. ఎట్టివానికిని దెలియదు. కార్యముచెడినపుడు మాత్రము తెలియును. అనఁగానప్పుడు దైవముమనకుఁ బ్రతికూలముగ నున్నదని యెఱుంగవలయును. అప్పుడుమనము దైవమునకేమి ప్రతీకారమును జేయఁగలము. కార్యముచెడిపోవుటకు మునుపుమనకు దెలిసినయెడలఁగదా? యేమైన ప్రతీకారమును జేయవచ్చును? అనుమాన ప్రమాణముచేతఁ దెలిసియును బురుషుఁడేమియును జేయఁజాలఁడు. కావునదైవానుకూలముగవచ్చుచుండు సుఖదుఃఖముల ననుభవించియే తీరవలయునుగాని మఱియేమియును జేయజాలము. "శ్లో॥ సుఖదుఃఖేభయక్రోధౌ లాభాలాభౌ భవాభవౌ, యచ్చకించిత్తథాభూతంనను దైవస్యకర్మతత్॥ సుఖదుఃఖములను, భయక్రోధములను, లాభాలాభములను, భవాభవములను, మొదలగునవియును గలుగుటకుఁ గారణమేమియును గనఁబడదు. కావునవీటి కన్నింటికిని దైవమేకారణమని తెలియవలయును. "శ్లో॥ ఋషయోప్యుగ్రతపసో దైవే నాభిప్రపీడితాః, ఉత్సృజ్యనియమాంస్తీవ్రాన్భ్రశ్యంతే కామమన్యుభిః॥ భయంకరమైన తపస్సును జేయునట్టిఋషులుగూడ దైవముచేతఁ బీడింపఁబడినవారై తీక్ష్ణములగు నియమములనువదలి కామక్రోధములనవలంబించి భ్రష్టులగుచున్నారు. "శ్లో॥ అసంకల్పితమేవేహయదకస్మాత్ప్రవర్తతే, నివర్త్యారంభమారబ్ధంనను దైవస్యకర్మతత్॥ మఱియు నీలోకమునందే బహుదినములనుండి యనేకవిధములఁ బ్రయత్నమునుజేసిన కార్యమునెరవేరక యుండుటయును, విడుకుఁ దలవనికార్యముసిద్ధించుటయును జూడఁగదానికిదైవమే కారణమనితోఁచుచున్నది. యథార్థమైన యీబుద్ధిచేత నేనేనామనస్సునునిరోధించితిని. అందువలన నాపట్టాభిషేక మహోత్సవమున

కు విఘ్నముగలిగినను నాకుఁబరితాపము పుట్టలేదు. కావున నీవును బరితాపము లేనివాఁడవై నాయభిప్రాయము ననుసరింపుము. శీఘ్రముగఁ బట్టాభిషేకము కొఱకు జేసికొన్న యలంకారమును బరిత్యజింపుము. మఱియు నభిషేకమునకుఁ జేయుచుండు కార్యములను నిలిపివేయుము. లక్ష్మణా! పట్టాభిషేకమునకు సంపాదింపబడిన సమస్తములైన యీకలశములందలి యుదకములచేతనే నాకుఁ దపోవ్రతమునకుదగిన స్నానము కాఁగలదు. అదిబాగుగ లేదు. రాజ్యపట్టాభిషేకముకొఱకు తీసికొని రాబడినసీ కలశోదకములతో నాకేమిప్రయోజనము. నేను దెచ్చుకొనిన యుదకమే నావ్రతమున కుపయోగపడుగాక. అనఁగా నేనేయుదకమును దెచ్చుకొని వ్రతస్నానమును జేసెదను. లక్ష్మణా! రాజ్యలక్ష్మినన్నుఁ బొందనందుకు దుఃఖమును బొందకుము. రాజ్యమునందుండుటచేతఁ బ్రజాపరిపాలనాది ధర్మములు గలుగును. వనములందుండుటచేతఁ దపస్సుమొదలగు ధర్మములను జేయవచ్చును. కావున రాజ్యము నందుండుటయును, వనమునందుండుటయును సమానమేను. అయినను విచారింపఁగ రాజ్యమునందుఁ గలుగునట్టి జనులయొక్క సంబంధమైన దుఃఖములేకపోవుటం జేసియును, పితృవాక్యపరిపాలన ధర్మంబధికంబుగ నుండుటచేతను, వనవాసమే యధికమైనదని యెంచెదను. లక్ష్మణా! ఇప్పుడుసంభవించిన కార్యవిఘ్నమునందుఁ బినతల్లియగు కైకేయి దైవయోగ మిట్లుండుటవలన నప్రియవచనములను జెప్పుచున్నదిగాని మఱియొక్కటి కాదు. కావున నిప్పుడు పట్టాభిషేకంబునకుఁ గైకేయి విఘ్నము జేసినదని తలఁపఁగూడదు. విఘ్నముచేసినది దైవముగాని మఱియొకటిగాదు.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండము నందలి యిరువదిరెండవసర్గము ముగిసెను.

లక్ష్మణుఁడు దశరథుని మీఁద కోపమునొంది తాన రామునకు పట్టాభిషేకము జేసెదనని చెప్పుట

ఇట్లు రాముఁడు చెప్పుచుండఁగా విని లక్ష్మణుఁడు పలుమారులు తలవంచుకొని మనస్సుచేత దుఃఖసంతోషములకు నడుమనున్నవానివలె దుఃఖసంతోషములను బొందకయుండె. మఱియును పురుషశ్రేష్ఠుఁడగు నాలక్ష్మణుఁడప్పుడు కనుబొమలయొక్క మధ్యప్రదేశమునందు బొమలుముడివేసి యధికమైన కోపముగలవాఁడై "బిలమునందున్న సర్పమువలె,, నిట్టూర్పును విడిచెను. అప్పుడుబొమ ముడిచేత భయంకరమైయున్న లక్ష్మణుని ముఖము "కోపోద్రిక్తమైన సింహముయొక్క ముఖమువలె,, చూచువారలకు మిగుల భయమును గలుగఁజేయుచున్నదయ్యె. అట్టియెడ లక్ష్మణుఁడు "ఏనుగుతనతొండమును విదలించునట్లు,, కోపమునఁ దనయొక్క కొనచేతిని విదలించుచు మెడనుముందరి భాగమునకును, వెనుకటిభాగమునకును, క్రిందిభాగమునకును ద్రిప్పుచు కడకంటిచేత నడ్డముగాఁజూచుచు నన్నయగు రామునితో నిట్లనియె.

అన్నా! రామచంద్రా! నీవుసమస్తనీతులను దెలిసినవాఁడవు. అట్టినీవు పితృవాక్యముచొప్పున సంచరింపకపోవుటవలన ధర్మహానిగలుగు ననియును, నేనుధర్మమార్గము ననుసరింపకపోతినేని లోకులందఱును ధర్మమును విడిచిపెట్టుదురనియును, భ్రమబొంది రాజ్యమును వదలియరణ్యమునకుఁ బోవుట యుచితముగాదు. శూరులయందును, రాజులయందును నుత్తముఁడవైన యోరామా! మిగులఁబలపరాక్రమాదిగుణములుగల నీవుకూడ దుర్బలమగు దైవమును మహాప్రబలముగాఁ జేయుచున్నావే? విచారింపఁగనీకుకూడ భ్రాంతిగలిగినట్లు తోచుచున్నది. భ్రాంతిలేకుండినయెడల నీయట్టిమహానుభావుఁ డిట్టిమాటలనుజెప్పఁడు. దీనులనాశ్రయించి యుండునట్టిదియును, శక్తిలేనిదియు నునగు దైవమును ఎందునిమిత్తముగఁ బొగడెదవు? కైకయును, దశరథుఁడును పాపిష్ఠులని నీకుఁదోచకుండుటకుఁ గారణమేమి? అయ్యిరువురును పాపకృత్యములను జేయువారుగనుక వారివచనానుసారముగ సంచరించుట యనుచితమని తోఁచుచున్నది. మఱియు నీవు వారిమాటప్రకారము నడవకపోవుటవలన నీకు దోషమేమియును లేదు-ధర్మాత్మా! రామా! లోకములోనఁగొందఱు ధర్మమార్గముగఁ బ్రవర్తించెదమనియును, ధర్మకార్యములను జేసెదమనియును, కపటవేషములను వేసికొనితమకార్యములు నెరవేరుటకొఱకుఁ బ్రియవార్తలను జెప్పుచుందురు. అటులనే కైకయును, దశరథుఁడును స్త్రీయందుమిగులఁ బ్రియముగలవారివలె కపటముగనభినయించి రహస్యముగ నీకపకారమును జేయుటకాలోచనను జేసినసంగతి నీకుఁదెలియలేదా? నేనుపలుమారులు చెప్పవలయునా? రామా! దశరథుఁడు కైకకువరములిచ్చి బహుదినములైనదినిజమయ్యెనేని దశరథుఁ డిన్నిదినములు నుపేక్షను జేసియుండఁడు. ఇదివఱకే యావరముల నిచ్చియుండును. ఇదివఱకెప్పుడును నాప్రస్తావమేరాలేదు. అట్లుగాకపోతే పోనిమ్ము, ఆవరముల నిచ్చుటకిదియేనా తగినసమయము. ముందుగానీకుఁ బట్టాభిషేకము జేసెదనని చెప్పి పిమ్మట నీవరప్రసక్తివచ్చెను. ఇదియంతయును బా

డఁగా భరతునకు రాజ్యము నివ్వవలయును. అట్లుసేయుటకు రాముని నరణ్యమునకుఁ బంపకపోతే సాధ్యముగాదు.

కావున నేను రామునకుఁ బట్టాభిషేకమును జేసెదనని ప్రకటించెదను. ఆసమయమున నీకు నేను వరముఁ నిచ్చియున్నట్లును, ఆ రెంటికిని రాముని నడవులకుఁ బంపుమనియును, భరతునకుఁ బట్టముగట్టుమనియును ప్రార్థింపుము. అప్పుడు నేను సత్యమును వదలలేనివానివలెనభినయించి రాముని నరణ్యమునకుఁబంపి భరతునకు రాజ్యమునిచ్చెదనని దశరథుఁడు కుట్రయుక్తి జేసి కైకేయితో ముందుగానే యీవిషయమంతయును జెప్పిపెట్టినట్లు తోఁచుచున్నది. అట్లుగాదేని యెప్పుడో యిచ్చిన వరములను దశరథుఁ డిన్ని దినములివ్వకుండునా? (ఉండఁడు) కైకేయి యిన్నిదినము లడగకుండునా? (ఉండదు) ఇదివఱకుఁ గైకేయి యెన్నిమారులో అడిగియుండును. దశరథుఁడు ధర్మము నెఱిఁగినవాఁడుగాన నింతకుమును పే యిచ్చియుండును. అవ్విధముగఁ గాకపోవుటవలనఁ గైకేయియును, దశరథుఁడును, కృత్రిమముగ యోచించిరనుటకు సందేహములేదు. మహాపరాక్రమశాలివగు రామా! జ్యేష్ఠపుత్రుఁడవైన నీకుఁబట్టాభిషేకమును జేయక నీతమ్ముఁడగు భరతునకు రాజ్యమిచ్చుట లోకవిరుద్ధమైనపనిగాదా? కైకేయియును దశరథుఁడును లోకవిరుద్ధమైనకార్యమును జేయఁబూనిరి. ఇట్టిదుష్కృత్యమును జూచి నేను సహింపఁజాలను. నేను జేయఁదలఁచిన కార్యమును జేయుదును. దానికిమాత్రము నన్ను క్షమింపవలయును. మిగులబుద్ధిమంతుఁడవగు రామా! నీకేధర్మశాస్త్రవచనముచేతఁ బట్టాభిషేకమును వదలి యరణ్యమునకుఁ బోవలయునని బుద్ధిపుట్టినది? ఏధర్మశాస్త్రవచనమునం దిట్టిదుష్కార్యమును జేయకపోవుటవలన దోషముగలుగునని చెప్పియున్నది? అట్టివచనములను జెప్పుము? అట్టివచనములెందును లేవు. కావున నీవిట్లు రాజ్యమును వదలి యరణ్యమునకుఁబోవుట నాకిష్టము లేదని ముమ్మాటికిని జెప్పుచున్నాను. అన్నా! రామచంద్రా! నీవు కపటముగ వర్తించువారికి బదులుజేయుటయందు మిగులసమర్థుఁడవు. ఇట్టినీవు, కైకేయియొక్క వలలోఁ జిక్కి దురాలాపముల నాడుచున్న దశరథుని వచనానుసారముగఁ బ్రవర్తింపవచ్చునా? నీవీ విషయమున కంగీకరింపక పరాక్రమంబును జూపవలయును గాని దశరథుని మాటను వినఁగూడదు. ముందుగ నీకుఁ బట్టాభిషేకమును జేసెదనని చెప్పిన దశరథుఁ డిప్పుడు భరతునకుఁ బట్టాభిషేకమును, నీకు వనవాసమును జేయఁదలఁచియున్నాఁడు. ఇట్లు కపటబుద్ధితోఁ జేయుటను నీవు తెలిసికొనక పోవుటవలన మాత్రము నాకు దుఃఖము గలుగుచున్నది. మఱియును స్త్రీలోలుఁడును మహాకాముకుఁడునునగు దశరథుని మాటను విని యరణ్యమునకుఁ బోవుట లోకవిరుద్ధమైనధర్మమే గాని మఱియొకటిగాదు. కామపరతంత్రులై నీకెప్పుడును నపకారమును జేయవలయునని తలఁచుచుఁ దల్లిదండ్రులను వేషమును వేసికొనిన, నీకైకేయీదశరథులు శత్రువులుగాని మఱియొకటికాదు. మఱియు నయ్యిరువురును గామపరవశులై కోరరానిదానిని గోరుచున్నారు. అట్టివారి కోరికను నెరవేర్పఁగూడదని యెంచక నెరవేర్పవలయునని నీవు మనసులోఁ దలఁచుట విచారింపఁగ బాగుగనుండలేదు. ఆకైకేయీదశరథుల కిట్టిదుష్టతలంపుగలుగుట దైవకృతమే గాని వారలకు స్వభావముచేతఁ బుట్టినబుద్ధిగాదని నీవు తలఁచుచున్నావు. అది సరికాదు. నేనెన్నివిధముల యోచించినను దైవము ప్రమాణమని నాకుఁ దోఁచలేదు. పరాక్రమహీనుఁడును, తెలివిమాలినవాఁడును మాత్రము దైవమును ననుసరించును గాని పరాక్రమవంతులును, బుద్ధిమంతులునునగువారు తమసామర్థ్యముచేతఁ గార్యమును సాధింతురుగాని దైవముమీఁద భారమును బెట్టి యూరకుండరు. "శ్లో॥ దైవంపురుషకారేణ యస్సమర్థః ప్రబాధితుం । నదైవేనవిపన్నార్థః పురుషస్సోవసీదతి,, తనపౌరుషముచేత దైవమునణఁగ ద్రొక్కుటకుఁ దగినసామర్థ్యముగలవాఁడు దైవమునకు వెఱచి తనకార్యములను బాడుసేసికొని దుఃఖపడఁడు. లోకులందఱును నిప్పుడు దైవబలమే గొప్పదో పురుషబలమే గొప్పదో చూతురుగాక. దైవము ప్రబలమా? పురుషకారము ప్రబలమా? యను సందేహమును దీర్చెదను. నీపట్టాభిషేకమహోత్సవమునకు విఘ్నమును గల్పించిన దైవమును నిప్పుడు నాపౌరుషముచేత హతముసేసి లోకులకందఱకును నిదివఱకుఁ గలిగియున్న మూఢతలంపును బోఁగొట్టెదను. "అంకుశమును లక్ష్యము సేయక గొలుసులను దెంచుకొని మదబలముచేత గర్వించి మహావేగముతో పరుగెత్తుచున్న యేనుఁగును సమర్థుఁడగు మావటివాఁడు తన సామర్థ్యముచేత మరలించువిధముగ" నేనుగూడ నిప్పుడు దుర్నివారమని నీచేతఁ జెప్పఁబడుచున్న దైవమును ద్రిప్పెదను. నీవు చూడుము. మఱియు నో రామచంద్రా! సకలదిక్పాలును నొక్కటియై వచ్చినను, ముల్లోకములును నొక్కటియైనను, నేను నాయొక్క పరాక్రమమును జూపి నీపట్టాభిషేకమహోత్సవమును నెరవేర్చెదను. మిగుల ముసలివాఁడగు దశరథుఁ డేమిసేయఁగలఁడు. రామచంద్రా! నీవు పదునాలుగు సంవత్సరములు వనవాసమును జేయవలయునని రహస్యముగ యోచించి యేర్పఱచినవారెవ్వరో యట్టి పాపిష్ఠులనందఱును పదునాలుగు సంవత్సరము లరణ్యము

నందుండునట్లు సేసెదను. అట్లు సేసి నీపట్టాభిషేకమునకు విఘ్నమును గావించి తనపుత్త్రుఁడైన భరతునకు రాజ్యప్రాప్తి కలగవలయునని కోరుచున్న కైకేయికిని దశరథునకును గలిగియున్న పేరాశను బోఁగొట్టెదను. రామా! కైకేయీదశరథులకు మిగుల దైవసహాయము గలిగియున్నదే! మనకా దైవము మిగుల ప్రతికూలముగనున్నదే; కాఁబట్టి కైకేయీదశరథులను మనము జయించుట దుస్తరమని తలఁతువేమో! అట్లు తలఁపఁగూడదు. నాతో విరోధించినవానికి దైవమెంత యనుకూలముగానున్నను నేమియును ప్రయోజనము లేదు. ఆదశరథుడు నాపౌరుషమునకు లోఁబడి వ్యసనపడునే గాని తప్పించుకొనఁజాలఁడు. ఇట్లు సకలరాజ్యసుఖము ననుభవించి వేయిసంవత్సరములైన పిమ్మట నీవు వానప్రస్థాశ్రమమునకుఁ బొమ్ము. అట్లు పోయిన పిమ్మట నీకొడుకులు రాజ్యమును పరిపాలింతురు. ఎప్పటికిని భరతునకు రాజ్యపాలనాధికారము గలుగనేరదు. రాజగువాఁడు తనకు శక్తిగలమట్టుకు రాజ్యమును బరిపాలించి పిమ్మటఁ బ్రజలను పుత్త్రులకొప్పగించి "పుత్త్రోత్తములారా! మీపుత్త్రులను మీరు గాపాడినట్లు ప్రజలను గూడఁ గాపాడుఁడని చెప్పి తాను వనవాసమునకుఁ బోవలయును,, ఇది పూర్వులగు రాజర్షులందఱును నాచరించిన యాచారము. శాస్త్రమునందునునిటులనే చెప్పఁబడియున్నది. ధర్మాత్మా! రామా! ఇప్పుడు దశరథమహారాజుయొక్క మనస్సు మిగుల చపలముగానున్నది. నేను మహాసాహసముతో రాజ్యమును గైకొనుటకు యత్నింతునేని రాజ్యమునం దెన్నివిధములైన భేదములు గలుగునో ఆభేదములనన్నిటిని నేనొక్కఁడెట్లు సమాళించుకొనఁగలనని భయపడి నీవీరాజ్యమును గోరకుందువేమో! యట్టిసందేహము పోవునట్లు చెప్పెదను. అట్లు రాజ్యమునందు భేదములుగలిగినేని వానినన్నిఁటిని నేను బోఁగొట్టెదను. అట్లు సేయకపోతినేని వీరలోకమునకుఁ దగనివాఁడనగుదునని ప్రతిజ్ఞనుజేసెదను. వెలియలికట్టు సముద్రమును పొంగి రాకుండునట్లు సేయువిధముగ నేనుగూడ నీరాజ్యమునందేమియును గలతలుగలుగకుండ నుండునట్లు చేసెదను. కావున నీవు వసిష్ఠమహర్షి మొదలగువారితో నాలోచించి పట్టాభిషేకమును జేసికొనుము. పిమ్మట నాసాహసమును జూడుము. విరోధముచే వచ్చురాజులనందఱ నేనొక్కఁడనే సంహారము సేయుదును. అట్టిసామర్థ్యము నాకుఁ గలదని నీవు గూడ నెఱుఁగుదువుగదా! నేను విశేషముగఁ జెప్పనేల. నాచేతులు రెండును యుద్ధము సేయుటకుఁ గలిగినవిగాని శృంగారముకొఱకుఁ గలిగినవి కావు. నేను శత్రువులనందఱను వధించుటకు ధనుస్సు నుధరించియున్నానుగాని యలంకారార్థముగ ధనుస్సునుధరించినవాఁడను గాను. నాకత్తి శత్రువులఁ జంపుట కుపయోగించునే గాని శృంగారముగా మొలయందుఁ గట్టుకొనుటకుఁ గాదు. నాయంబులపొదిలోపలయుండు బాణములు శత్రువులను సంహరించుట కుంచఁబడినవి గాని యూరక బిభీషికలకుఁ గాదు. ఇప్పుడు నాచేఁ జెప్పఁబడిన యీనాలుగాయుధములును శత్రుసంహారమునకే గాని మఱియొకందుకుఁ గాదు. నాకు శత్రువగువాఁడు జీవించియుండెనేని నేనోర్వఁజాలను. మఱియును మెఱుపువలె తళతళ మెరయుచుండు దీక్ష్ణమైనకత్తిని చేఁబూని దేవేంద్రుఁడడ్డముగవచ్చినను లక్ష్యముసేయక సంహారము సేయుదునుగాని యూరకుండను. మఱియు నేను యుద్ధమును జేయునపుడేనుఁగులను, గుఱ్ఱములను, మనుష్యులను నాఖడ్గముచేతఁ జిత్రవిచిత్రములుగ ఖండించి భూమియందుఁ బడవేసితినేని మానవులకు సంచరించుటకు నలవిగాకయుండును. ఇప్పుడు శీఘ్రముగా నాకత్తిచేత నఱకఁబడు శత్రువుల గజములు నెత్తురును గ్రక్కుచు మండుచున్న కొండలవలెను, మెఱుపులతోఁగూడిన మేఘములవలెను గన్పట్టుచు నేలయందు పడియుండఁగలవు. నేనుడుముయొక్క చర్మముచేత నిర్మింపఁబడిన కవచమును నల్లెత్రాటియొక్క దెబ్బ తగలకుండనుండుటకై వ్రేళ్ళకుఁ దొడుగుకొని ధనుస్సునుధరించి యుద్ధమున కాయత్తుఁడనైతినేని యెవ్వఁడు గర్వించి నేను బురుషుఁడనని నన్నెదిరింపఁగలఁడు? యుద్ధసన్నద్ధుఁడనైన నన్నుఁ జూచి యెల్లవారును స్త్రీలవలె భయముచేతఁ బరుగిడుదురు గాని యెవ్వఁడును నాయెదుట నిల్వఁజాలఁడు. నేను యుద్ధమునందు మహాబలవంతుఁడగువానిమీద నొక్కబాణమును, నీచజనులమీద నొక్కబాణమును, నిట్లు మనుష్యులు గుఱ్ఱములు నేనుంగులు మొదలగువానిమీద బాణములను బ్రయోగించి మర్మస్థానములను జించి చెండాడెదను. మహాప్రభో! రామా! నాయొక్క యస్త్రముల మాహాత్మ్యమును జూడుము. ఇప్పుడే దశరథమహారాజును రాజ్యములేనివానిగను నిన్ను రాజ్యాధిపతిగను జేయుటకు సామర్థ్యము గలవిగానగును. రామా! చందనమును బూసికొనుటకును, భుజకీర్తులను నలంకరించుకొనుటకును, యాచకులకు ధనమిచ్చుటకును, స్నేహితులకు శత్రువులవలని బాధలుగలుగకుండునట్లు కాపాడుటకును, తగినవియును, సుత్తమములును నైన నాబాహువులు రెండును నిప్పుడు నీపట్టాభిషేకమునకు విఘ్నమును జేయువారలను బరుగెత్తిపోవునట్లు జేయుటకు యత్నించుచున్నవి. రామచంద్రా! నీశత్రుఁడైనవాఁ డెవ్వఁడు? నేనిప్పుడెవ్వని ప్రాణముల బుచ్చుకొనవలయును? ఎవనికీర్తి లేకుండ జేయవలయును? ఎవ్వనియొక్క

స్నేహితులను జంపవలయునా? ఈభూమియంతయు నీ స్వాధీనమగు నట్లాలోచించి మాత్రము నాకాజ్ఞాపింపుము. నేనునీకుఁగింకరుఁడనుగాని మఱియొక్కటిగాదని లక్ష్మణుఁడు చెప్పి కండ్లనీళ్లుబొటబొట రాల్చెను. అంతరఘువంశ వర్ధనుఁడగు రాముఁడు లక్ష్మణుని కండ్లనీళ్లను దుడిచి యనేకమాఱులూరడింపు మాటలను జెప్పియిట్లనియె. తమ్ముఁడా! లక్ష్మణా! నీ వెప్పుడును తిన్నదనముగలవాడవేను? అట్టినీవిప్పుడుఏమి నిమిత్తముగ నిట్లుకోపమును జెందితివి? నేనుతండ్రియైన దశరథమహారాజుయొక్క మాటను జవదాటను. కాబట్టి తండ్రిచెప్పినట్లే చేయుటకుసిద్ధముగున్నానని తెలిసికొనుము. ఇట్లుసేయుటకంటె నుత్తమమైన ధర్మమేదియును లేదు.

ఇట్లుశ్రీమదయోధ్యా కాండమునందలి యిరువదిమూడవసర్గముముగిసెను.

రాముడుతనతోగూడయడవికి రాతగదనికౌసల్యకునీతినిబోధించుట.

అనియిట్లురాముఁడు, తండ్రియగు దశరథమహారాజు చెప్పిన చొప్పున సంచరించుటకు నిశ్చయించి దృఢచిత్తుఁడై యుండుటనుజూచి కౌసల్యకన్నీరు ధారధారగ గారరోదనమును జేయుచు ధర్మిష్ఠమగు నీవచనమునుబలికె. హా దైవమా! నేనేమిచేయుదును. నాపుత్రుఁడగు రాముఁడెప్పుడును దుఃఖమును బొందినవాఁడుగాఁడు. మఱియును ధర్మాత్ముఁడు. సకలప్రాణులకును యిష్టములగు మాటలనే చెప్పుచుండును. దశరథమహారాజునకును, నాకునుజన్మించినవాఁడు. ఇట్టిసద్గుణములుగల రాముఁడు పండినేలరాలిన ధాన్యకణముల నేర్చుకొని యేవిధముగ జీవింపఁగలఁడు. సకలబంధువులును దివ్యమగు మృష్టాన్నములను భుజింపుచుండఁగ రాముఁడువనమునందు కందమూల ఫలములను భక్షింపుచునెట్లు జీవింపఁగలఁడు. దశరథుఁడు, గుణవంతుఁడును, సకలప్రాణులకును ప్రియమైనవాఁడును, నగురాముని నరణ్యమునకుఁ బంపుచున్నాఁడు. అనునిట్టిమాటను వినినను, లోకములో నెవ్వరునునమ్మరు. తండ్రియగువాఁడిట్టి దుష్కృత్యమును జేయునా? యనిసందేహముగల వారగుదురు. ఒకవేళనిశ్చయమేయని తెలిసికొనిరేని యెల్లప్రాణులును మహాభయమును బొందుననుటకు సందియములేదని చెప్పి రామునింజూచి యిట్లనియె. రామా! నీవుసమస్త ప్రాణులకు నిష్టుఁడవయ్యును ఏమినిమిత్తముగ దైవముచేత నరణ్యమునందు నివసింపఁబోవునట్లుచేయఁబడుచున్నావోగదా? లోకమునందు సమస్త కార్యములకును మూలకారణమైన యాదైవముమిక్కిలి బలముగలదియనిచెప్పుటకుఁగొంచెమైనను సందేహములేదు. పుత్రుఁడా! రామా! ఇఁకనీవుయిక్కడనుండి యడవికిబోతివేని నేనొంటరిగ నుండవలయునుగదా? హా రామా! అట్లు వొంటరిగ నుండుటవలన నాశరీరమునందు పుట్టినశివగపడకుండ బోవుటయనునదే గాలిగాను, నాయేడ్పువలన గలిగెడువ్యసనమే కట్టెలుగను, కండ్లనీళ్లే యాహుతిగాను, చింతయను నుష్ణంబెపొగగాను, గలిగినిట్టూర్పులచే వృద్ధిజేయబడి చెప్పుటకలవిగాని మహాదుఃఖమనెడు అగ్నిహోత్రము" శిశిరఋతువునందు దావానలముపొదను క్రమముగా దహించునట్లు,, ఒంటరిగనుండునన్ను శుష్కింపఁజేసిదహించును. పుత్రుఁడా! రామా! గోనువృతన గూడపోవునట్టి మార్గమునను సరించిపోవునుగాని దూడనువదలియుండునా? (ఉండదు.) కావుననీవెక్కడికి బోయెదవో నేనక్కడికి వచ్చెదను. నేనొంటిగనిక్కడ నుండఁజాలనని కౌసల్యాదేవి రామునితోఁజెప్పి విలపించె. ఇట్లు అనేకవిధముల దీనాలాపములను బలుకుచున్న తల్లిమాటలనువిని పురుషోత్తముఁడగు రాముఁడు మిక్కిలి దుఃఖమును బొందుచున్న తల్లింజూచియిట్లనియె.

తల్లీకౌసల్యా! దశరథమహారాజు మొదటఁగైకచేత వంచింపఁబడియున్నాడు. నేనుదండకారణ్యమునకుఁ బోవుచున్నాను. నీవుగూడనాతో వచ్చెదననిచెప్పుచున్నావు. ఇట్లునీవుగూడవచ్చెదవేని దశరథుఁడీ మూడువిధములయిన దుఃఖములచేతను సిద్ధముగమరణమును బొందును. "శ్లో॥ భర్తుఃకిల పరిత్యాగోనృశంసః కేవలంస్త్రియాః। సభవత్యానకర్తవ్యో మనసాపివిగర్హితః,, స్త్రీలుభర్తను వదలినయెడల మహాపాపముగల వారగుదురు. కావుననీవు భర్తనువదలవలయునను ధర్మవిరుద్ధమగు కార్యమును మనస్సునందుఁగూడఁ దలంపఁగూడదు. అట్లుతలఁచుట మిక్కిలినిందితమైనపని. మఱియు నాతండ్రియగు దశరథమహారాజు బ్రతికియుండు నంతవఱకును నీవతనికి శుశ్రూషలను జేయుచుండుము. అట్లుసేయుటయేనీకు శాశ్వతమైనపరమ ధర్మముగాని మఱియొక ధర్మమేదియును లేదు. కావున నీవుధర్మమును వదలుట యుచితముగాదనిచెప్పె. అప్పుడు శుభదర్శనురాలగు కౌసల్యాదేవి, రాముఁడుచెప్పినమాటలనువిని మిగుల సంతోషమునుబొందె. మఱియునెట్టివారి దుఃఖములను బోఁగొట్టునట్టి రామునిఁజూచి యోరామా! నీవుచెప్పినట్లే చేసెదననియె. ధర్మవంతులలో నుత్తముఁడగు రాముఁడిట్లు చెప్పినవిని మహానందమునుబొంది యధికముగ వ్యసనమును జెందుచున్న తల్లియగు

కౌసల్యాదేవితో మరలనిట్లనియె.

తల్లీ! కౌసల్యా! మనమిరువురమును మాతండ్రియగు దశరథమహారాజు చెప్పినట్లు సేయవలయును. ఈపనిమనకు విధికృత్యమని తెలిసికొనుము. ఆదశరథమహారాజు మనకందఱకునురాజు. మఱియునుమనలను రక్షించువాఁడు. గురువు. ఇంతియుగాక పూజ్యుఁడు. అధిపతి. ప్రభువు. కావున మనమందఱమును దశరథమహారాజునకు లోఁబడిసంచరింపవలసినది విధియైయున్నది. నేనీపదునాలుగు సంవత్సరములును మహాసుఖముగాఁ గాలమునుగడపెదను పిమ్మటమిగుల సంతోషముచేత నీయాజ్ఞకులోఁబడి యుండెదనని రాముఁడు చెప్పెను. ఇట్లురాముఁడు సెప్పినమాటలనువిని కౌసల్యాదేవి పుత్రునియందు మిగులఁబ్రేమగలదియగుటవలన, కండ్లనుండినీళ్లు ధారధారగ బ్రవహింపగ వెక్కి వెక్కి యేడ్చుచు, మిగులదుఃఖమును బొందుచు రామునిఁజూచి యిట్లనియె. నాయనా! రామా! నాకుశత్రువులైన సవతుల మధ్యనుండుటకు నామనసొప్పుటలేదు. నిన్నువిడిచి నేనుండజాలను. కావుననన్ను నీతోఁగూడఁదీసికొనిపొమ్ము. రాముఁడా! నీవుదశరథునియాజ్ఞానుసారముగ నరణ్యమునకుఁ బోవుటకు దృఢముగా నిశ్చయించియుంటివేని యడవియందలి లేడివలెనున్న నన్నుఁగూడఁ నరణ్యంబునకుఁ దీసికొనిపొమ్ము. అడవులయందుఁ బుట్టినలేడి యడవులయందు సంతోషముతోఁ దిరుగుచున్న విధముగ నేనుగూడ నిన్నేమియును బాధింపక సంతోషముతోఁ దిరుగుచుందు, నని చెప్పెను. ఇట్లు చెప్పిరోదనమును జేయుచున్న తల్లినిజూచి రాముఁడుగూడ మహావ్యసనమునొందుచునిట్లనియె.

శ్లో॥ జీవంత్యాహిస్త్రియాభర్తాదైవతం ప్రభురేవచ॥ తల్లీ! జీవించియున్నంత వఱకును నాడుదానికిభర్తయే దేవుఁడని నెఱుంగవలయును. మఱియునాడుది పెనిమిటనిదప్ప నితరులనాశ్రయింపఁగూడదు. దశరథమహారాజు నాకెట్లోనీకునునట్లె ప్రభుఁడైయున్నాఁడు. మఱియులోకమును సర్వమను బాలింపఁదగినవాఁడును, ధార్మికుఁడును, నగుదశరథమహారాజు మనకునాథుఁడైయున్నాఁడు. కావుననీవనాథవుగాలేదే? నీకేమికొదవ? ఇట్టినీవనాథవలెయెందుకు భయమును బొందుచున్నావు? ఒకవేళనాకుఁ బెనిమిటవలన భయములేదుగాని సవతులవలన భయముగలుగునని చెప్పుదువేమో? యట్లు చెప్పుటయుచితముగాదు. రాజుగానుండఁబోయెడు భరతుఁడుమిగుల ధార్మికుఁడు. మఱియును సకలప్రాణులకును బ్రియమును జేయువాఁడు. కావుననీయందు మాతృభక్తినుంచి నిన్నురక్షించుచుండును. కావుననీవు భయమును బొందకుము. ఒకవేళభరతుఁడు ధర్మాత్ముఁడయినను, కైకేయియొక్క మాటలనువిని కీడునుజేయునని దలఁతువేమో? యట్లు తలఁపఁగూడదు. భరతుఁడు సర్వకాలములయందును ధర్మమునందధికమైన ప్రియముగలవాఁడు. కావుననతఁడు పరులుసెప్పిన వచనములనువిని ధర్మశాస్త్రవిరుద్ధమగు మార్గమునందుఁ బ్రవర్తింపఁడు. కావుననీవు సర్వకాలములయందును శుశ్రూషను జేయుచుండును. నేను దండకారణ్యమునకుఁ బోయినపిమ్మట నీవుకొంచెమైనను బొరపాటులేక దశరథమహారాజునకుఁ బరిచర్యలనుజేయుము. పుత్రదుఃఖముచేత నాతండ్రియగు దశరథమహారాజు వ్యసనమును బొందకుండునట్లు చేయుము. మంచిమాటలచే నూరడించుము. ఉపచారములను జేయుచుండుము. భయంకరమైన యీపుత్రశోకముచేత మాతండ్రియగు దశరథమహారాజు చచ్చిపోవును. కావుననీవతనికిఁ బరమభక్తితో నిష్టమైన యుపచారములను జేయుచుండుము. "శ్లో॥ వ్రతోపవాసనిరతాయానారీ పరమోత్తమా। భర్తారంనానువర్తేతసాతు పాపగతిర్భవేత్,, ఆడుది వ్రతోపవాసములను జేయుచుఁబరమోత్తమురాలయినను, భర్తకుశుశ్రూషలను జేయనియెడల భర్తృలోకమును బొందలేక పోవుటయేగాక పాపలోకమునుగూడఁ బొందును. "శ్లో॥ భర్తుశ్శుశ్రూషయానారీలభతేస్వర్గముత్తమం। అపియానిర్నమస్కారానివృత్తాదేవపూజనాత్,, బ్రాహ్మణులు మొదలగు పెద్దలకు సర్వకాలములయందును నమస్కారములను జేయకుండినను, దేవతలనుబూజింపకపోయినను, భర్తకుభక్తితో శుశ్రూషను జేయునట్టియాఁడుది యుత్తమలోకమును బొందును. కావుననాఁడుది భర్తకుఁబ్రియమును జేయుటయందాసక్తిగలదై సర్వకాలములయందును భర్తకుశుశ్రూషను జేయవలయును. ఈధర్మము లోకమునందు పెద్దలచేతనాచరింపఁబడుచున్నది. వేదమునందుఁగూడ నీధర్మము శ్రేష్ఠమైనదని చెప్పఁబడినది. స్మృతులును నీవిధముగా చెప్పుచున్నవి. అమ్మా! కౌసల్యా! నేనుదండకారణ్యమునుండి మరలనిక్కడకు వచ్చువఱకును నాక్షేమమునకుగా హోమములచేతను, పుష్పాదులచేతను దేవతలనుసర్వదా పూజింపుచుండుము. మఱియు బ్రాహ్మణోత్తములకు నానావిధములగు దానములచేత సంతృప్తిని గలిగింపుచుండుము. ఇట్లునేను వచ్చువఱకును గాలమును నిరీక్షింపుచుండుము. మఱియు ననేకములగు వ్రతనియమములు గలిగిమాంసాదులను విడిచిపెట్టి పరిశుద్ధమగు నాహారమును భుజింపుచుఁ భర్తయ

గు దశరథమహారాజునకు శుశ్రూషను జేయుచుందుము. ఇట్లు సేయుచు నీపదునాలుగు సంవత్సరములును గాలమును గడుపుచునుందుము. నేనుదండకారణ్యమునుండి మరల వచ్చిన పిమ్మటధర్మవంతులలో నుత్తముఁడగు దశరథమహారాజు జీవించియున్నయెడల నీకోరికెలనన్నింటిని దీర్చికొనవచ్చునని చెప్పెను. ఇట్లురాముఁడు సెప్పినమాటలను విని కౌసల్యాదేవి, కన్నీళ్ల చేతనిండిన కన్నులుగలదియై, పుత్రదుఃఖముచేతఁ బీడింపఁబడు దుఃఖమునణచుకొని రామునితో మరలనిట్లనియె.

పుత్రా! రామా! నీవుమిగులఁ బరాక్రమము గలవాఁడవు. కావున నీకెందును భయములేదు. నీవువనంబునకుఁబోవలయునని గట్టిగాఁ బట్టుపట్టియున్నావు. నీయభిప్రాయమును ద్రిప్పుటకు నాకుశక్తిలేకపోయె. కాఁబట్టియే కాలమునతిక్రమింప గూడదనియును, కాలముమిగుల బలముగలదియనియును దోఁచుచున్నది. పుత్రుఁడా! రామచంద్రా! నీవునిశ్చలచిత్తుఁడవై వనమునకుఁబొమ్ము. నీకుసర్వస్థలములయందును మంగళములే గలుగుఁగాక. నీవుమరల వనమునుండి రాగానే నాదుఃఖమంతయుఁబోయి నాకు సుఖముగలుగుఁగాక. మహాభాగుఁడవైన యోరామా! నీవుపితృవాక్య పరిపాలనను జేసి కృతార్థుఁడవై పితృఋణమును దీర్చుకొనిదండకారణ్యమునుండి మరలవచ్చినపిమ్మటనేను మహాసౌఖ్యమననుభవింపఁగలను. రామా! నేనెన్నివిధముల హితోపదేశమును జేసినను నామాటలనువినని వ్వాక నిన్నునరణ్యములకుఁబంపుచున్న దైవమెంతబలముగలదాయని నామనస్సునం దాశ్చర్యముగలుగుచున్నది. ఆ మహాదైవము మిగుల బలవంతుఁడుగదా? మహాబాహుఁడా! పుత్రుఁడా! రామా! నీవువనములకుఁబొమ్ము పోయిమరలసుఖముగావచ్చి మంచిమాటలచేత నన్నునోదార్పఁగలవు. నీవుజడలను, నారచీరలనుధరించి వనమునుండి మరలివచ్చుకాలము (అనఁగాఁబదునాలుగు సంవత్సరములును) ఇప్పుడేగడచిపోయి నీవురాఁదగిన కాలమిప్పుడేవచ్చినయెడల నాకుమిగులసంతోషముగా నుండునని చెప్పె

పిమ్మట నాకౌసల్యాదేవి, తండ్రిచెప్పినచొప్పున రాముఁడరణ్యమునకుఁ బోవుచున్నాఁడనినిశ్చయముగాఁ దెలిసికొని మంగళకరములగు లక్షణములతోఁగూడియున్న రాముని జూచి మిగులయాదరముతో ననేకవిధముల నాశీర్వదించెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యిరువదినాల్గవసర్గముగిసెను.

—✻ కౌసల్యరామునిఆశీర్వదించియడవికిపంపుట. ✻—

అటుపిమ్మట మంచిస్వభావముగల కౌసల్యాదేవియాదుఃఖమును సర్వమునువిడిచి జలముచేతఁ గన్నీళ్ళుదుడుచుకొని పరిశుద్ధురాలై యాచమనమును జేసి రామునకు మంగళాశీర్వచనములను జేసి యిట్లనియె.

రాముఁడా! నీవు నేనెన్నివిధములఁ జెప్పినను నామాటలనువినక యరణ్యమునకుఁ బోవనిశ్చయించియున్నావు. కావున నీయిష్టప్రకారముగ నరణ్యమునకుఁబొమ్ము. పోయియచ్చోటనేయుండక పదునాలుగుసంవత్సరములును గడచినతోడనే మరలనిప్పట్టణమునకురమ్ము. సజ్జనులయాచారమునువదిలిపెట్టకుము. పుత్రుఁడా! రామచంద్రా! నీవు స్థైర్యముచేతను, నియమముచేతను ధర్మమునువదలక సంచరింపుము సర్వకాలములయందును సంతోషముగలవాఁడవై యుండుము. అట్టిధర్మము సర్వకాలములయందును నీకుగీడుకలుగకుండఁ గాపాడఁగలదు. పుత్రుఁడా! నీవుదినదినమందును, నాలుగుమార్గములు కలియుత్రోవలయందును, దేవాలయములయందును, నే దేవతలకునమస్కారమును జేయుచుందువో యాదేవతలు దండకారణ్యమునందు మహర్షులతోఁగూడసంచరించెడు నీకేవిధమైనగీడునుగలుగకుండునట్లు సర్వకాలములయందును గాపాడుచుందురుగాక. ధీమంతుఁడగువిశ్వామిత్రమహర్షి నీకిచ్చినదివ్యాస్త్రములన్నియును సకలసద్గుణసంపన్నుఁడవగు నిన్నుసకలప్రదేశములయందును, సర్వకాలములయందును గాపాడుచుండునుగాక. మహాబాహుఁడవును, పుత్రుఁడవునైన యోరాముఁడా! ధర్మమునుదప్పక నీవుసేయుచుండెడుపితృశుశ్రూషయును, మాతృశుశ్రూషయును, నీయొక్క సత్యవ్రతమును, నీకేమియునుబాధగలుగకుండునట్లు కాపాడుగాక. పురుషోత్తముఁడవైనయోరామా! దండకారణ్యమునందుండునట్టిసమిధలును, దర్భలును,పవిత్రములును, (అనగాదర్భముళ్లు) నగ్నివేదికలును, దేవస్థానములును, దేవపూజనుజేయుటకై యేర్పఱిచిన నానావిధప్రదేశములును,పర్వతములును, పెద్దవగువృక్షములును,చిన్నవగువృక్షములును, మడుగులును, పక్షులును, సర్పములును, సింహములును, నిన్నుఁగాపాడుచుండుగాక. సాధ్యులును, విశ్వేదేవులును, వాయువులును, మహర్షులును, నీకుశుభములను గలుగఁజేయుచుందురుగాక. సకలలోకములకును నాధారభూతుఁడైన విరాట్పురుషుఁడును, బ్రహ్మదేవుఁడును, నీకుశుభములనిత్తురుగాక. మఱియుఁబన్నిద్దఱగుసూర్యులలోఁ జేరినపూషయును, భగుండును, నర్య

ముందును, నీకుశుభములనిచ్చుచుందురుగాక. అవ్విధముగ నేయింద్రుఁడు మొదలగుదిక్పాలురనిమిదిమందియును నీకుశుభములను గలుగఁజేయుచుందురుగాక. వసంతాది ఋతువులును, శుక్లకృష్ణపక్షములును, చైత్రాదిమాసములును, ప్రభవాదిసంవత్సరములును, రాత్రులును, పగళ్లును, ముహూర్తములును, సర్వకాలములయందును నీకుశుభములను గలుగఁజేయుచుండుఁగాక. పుత్రుఁడవైనయో రాముఁడా! ధ్యానయోగధర్మములు నీకేకష్టములును రాకుండునట్లు కాపాడుచుండుఁగాక. భగవంతుఁడగుకుమారస్వామియును, చంద్రుఁడును, బృహస్పతియును, వసిష్ఠాదిసప్తర్షులును, నారదమునివరుఁడును నీకేవిధములగుకష్టములును గలుగకుండునట్లు గాపాడుచుందురుగాక. పుత్రుఁడా! సుప్రసిద్ధములగుదిక్కులును, దిక్పాలురును, నేనుజేయునట్టిస్తోత్రములచేతఁ బ్రసన్నులై యరణ్యమునందు నిన్నెల్లపుడును గాపాడుచుందురుగాక. సమస్తములగుమహేంద్రాదికులపర్వతములును, లవణాదిసముద్రములును, కుబేరుఁడును, వరుణదేవుఁడును, స్వర్గాంతరిక్షభూములును, గంగాదిసకలనదులును, నశ్విన్యాదినక్షత్రములును, నంగారకాదిగ్రహములును, ఆయాఅభిమానదేవతలును, రాత్రింబగళ్లును, సంధ్యలును, వనమునందున్ననీకేకష్టములును గలుగకుండునట్లు సేయుదురుగాక. పవిత్రములగుఆఱుఋతువులును, మాసములుపదిరెండును, సంవత్సరములరువదియును, కళలును, గాష్ఠలును, నీకరణ్యమునందుసుఖమునిచ్చుఁగాక. మఱియునో రాముఁడా! నీవుధర్మబుద్ధిగలవాఁడవై పితృవాక్యపరిపాలనకొఱకు మునివేషమునుధరించి దండకారణ్యమునకుఁబోవుచున్న నీకు దేవతలును, నసురులును, సర్వకాలములయందును సుఖములనిచ్చుచుందురుగాక. పుత్రుఁడా! మిక్కిలిభయమును గలుగఁజేయువారును, క్రూరకర్మలనాచరించువారును, నగు రాక్షసులవలనను, పిశాచములవలనను, నానావిధములగు క్రూరమృగములవలనను, నీకుభయము గలుగకయుండుఁగాక. ప్రవేశించుటకుఁగూడ నలవిగాకయుండునట్టి యరణ్యమునందలికోఁతులును, తేళ్లును, నీగలును, దోమలును, సర్పములును, నింకనుయితరములగుపురుగులును, నిన్నుబాధింపకుండుఁగాక. పుత్రుఁడా! గొప్పవగునేనుఁగులును, సింహములును, పెద్దపులులును, ఎలుఁగుబంటులును, మఱియునితరములగు కోరలుగలమృగములును, భయంకరములైనయెనుబోతులు మొదలుగాఁగలకొమ్ములుగల మృగములును, వనములయందుసంచరించుచున్న నీకుఁగీడును గలుగఁజేయకుండుగా . పుత్రుఁడా! రామా! మనుష్యమాంసముదినునట్టి మృగములు నిన్నుబాధింపకుండుగాక. నాచేతఁబూజింపఁబడుదేవతలు నీకుదేనివలనను గీడుగలుగకుండునట్లుసేయుచుండుదురుగాక. కుమారుఁడా! నీకు మార్గములు శుభమునుగలుగఁజేయునవియగుఁగాక. నీపరాక్రమములును సఫలములగుగాక. రాముఁడా! సర్వసంపదలకొక్కయు సిద్ధికొఱకు నీవుమంగళములు గలవాఁడవై యరణ్యమునకుఁబొమ్ము. రాముఁడా! అంతరిక్షమునందుండుదేవతలును, భూమియందుండుదేవతలును, మఱియు నితరులగుదేవతలును, నీకుశుభములను గలుగఁజేయుఁగాక. ఇంతయగాక నీకుశత్రువులగు దేవతలుగూడ నీకుశుభములనుజేయుదురుగాక. రాముఁడా! బృహస్పతియును, చంద్రుఁడును, సూర్యుఁడును, కుబేరుఁడును, యముఁడును, నేనుజేయునట్టిపూజకు సంతోషమువొందినవారై దండకారణ్యమునందు వసించుచున్న నిన్నురక్షింపుదురుగాక. రాముఁడా! నీవునదులలో స్నానమునుజేయుకాలమునందు, అగ్నిదేవుఁడును, వాయుదేవుఁడును, అగ్నిహోత్రమువలనఁగలిగెడు పవిత్రమగుపొగయును, విశ్వామిత్రమునివరుఁడు నీకుపదేశించినమంత్రములును, నిన్నురక్షింపుచుందుగాక. సమస్తలోకములకును నధిపతియగుబ్రహ్మదేవుఁడును, సకలజీవులనుపోషించునట్టినారాయణుఁడును, ఋషులును, మఱియునితరులగు దేవతలును, వనములయందునివసించుచున్న నిన్నురక్షింపుచుందురుగాక. సర్వోత్తమమగుకీర్తిగలదియును, విశాలములగునేత్రములుగలదియునునగు కౌసల్యాదేవి యివ్విధముగరామునకు ననేకములగు మంగళాశీర్వచనములజేసి పూలమాలికలచేతను, నానావిధములగు స్తోత్రపాఠములచేతను, దేవతలనందఱఁబూజించెను. మఱియునకౌసల్యాదేవి రామునకుశుభములు గలుగుటకొఱకుఁ బ్రజ్వలించుచున్న యగ్నిహోత్రమునుదీసికొనివచ్చి మహానుభావుఁడగుబ్రాహ్మణునిచేయథావిధిగ హోమమును జేయించెను. స్త్రీలలోనుత్తమురాలగు నకౌసల్యాదేవి హోమముకొఱకు, నేయి, తెల్లనిపుష్పమాలికలు, సమిధలు, తెల్లనియావాలు, మొదలగువాని తెప్పించెను. పిమ్మట నాఋత్విజుఁడు (అనగా హోమముసేయువాఁడు) సకలకీడులును నశించుటకొఱకును, నాయురారోగ్యైశ్వర్యాభివృద్ధిగలుగుటకొఱకును, యథావిధిగహోమమునుజేసి మిగిలిన హవిస్సుచే బాహ్యబలినిజేసెను. మఱియునుఋత్విజుఁడగునాబ్రాహ్మణుఁడు, తేనె, పెరుగు, యక్షతలును, నేయియును, దక్షిణలనిప్పించిబ్రాహ్మణులచేతఁబుణ్యాహవాచనమునుజేయించె. మఱియును రామునకునరణ్యమునందు

మంగళములు గలుగునట్లనేకవిధములైన యాశీర్వచనమంత్రములను జపియించెను. పిమ్మట సత్యకమైన కీర్తిగల రాముని తల్లియగు కౌసల్యాదేవి బ్రాహ్మణోత్తముఁడగు నాఋత్విజునకు గొప్పదక్షిణనిచ్చి రామునిజూచి యిట్లనియె.

రామా! "శ్లో॥ యన్మంగళం సహస్రాక్షే సర్వదేవనమస్కృతే। వృత్రనాశనమ భవత్తత్తేభవతు మంగళమ్॥ యన్మంగళం సుపర్ణస్యవినతా కల్పయత్పురా। అమృతం ప్రార్థయాన స్యతత్తేభవతు మంగళమ్। అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతోవజ్రధరస్యయత్। అదితిర్మంగళం ప్రాదాత్తత్తే భవతు మంగళమ్॥ త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణోరమితతేజసః। యదాసీన్మంగళం రామ తత్తే భవతు మంగళమ్॥ ఋతవస్సాగరా ద్వీపావేదా లోకాదిశశ్చతే। మంగళాని మహాబాహో దిశంతుశుభ మంగళాః॥ సకలదేవతలచేతను నమస్కరింపఁబడినవాఁడగు దేవేంద్రునకు వృత్రాసురుఁడు నశించుటవలన నెట్టిమంగములు గలిగెనో యటువంటి మంగళములు నీకుఁగలుగునుగాక. పూర్వము వినతయనునది తనపుత్రుఁడగు గరుత్మంతుఁడమృతమును దీసికొని రాఁబోయిన సమయమునం దెట్టువంటి శుభములు గలుగునటుల నాశీర్వదించెనో యటువంటి శుభములు నీకుఁగలుగుఁగాక. అమృతము పుట్టుటకొఱకు సముద్రమును మథించునపుడు రాక్షసనాశకుఁడును, దేవతలకుఁ బ్రభుఁడుననగు నింద్రునకెట్టువంటి మంగళములు గలుగునటుల నాశీర్వదించెనో యటువంటిమంగళములు గలుగునటుల నాశీర్వదించుచున్నాను. కావుననీకు మంగళము గలుగుఁగాక. మూఁడులోకములను నతిక్రమించుచున్నవాఁడును, నపరిమితమగు తేజస్సుగలవాఁడును, వామనావతారము నవలంబించినవాఁడును నగువిష్ణుదేవునికే మంగళములు గలిగెనో యటువంటి మంగళములు నీకుఁగలుగుఁగాక. మఱియునో రాముఁడా! త్రివిక్రమావతారమునందు బలిచక్రవర్తియిచ్చిన మూఁడడుగుల భూమిని గొలుచుకొనునప్పుడు మితిలేని ప్రభావముగల విష్ణుదేవునకే మంగళములుగలిగెనో యటువంటి మంగళములు నీకిప్పుడు గలుగుఁగాక. మహాబాహుఁడవైన యోరాముఁడా! సహజముగా మంగళములకును, మంగళద్రవ్యములకును, శుభమును గలుగఁజేయు నట్టిసామర్థ్యము గలవియగు వసంతఋతువు మొదలగు ఋతువులును, సముద్రములును, ద్వీపములును, వేదములును, లోకములును, దిక్కులును, నీకుసర్వకాలములయందును మంగళముల నిచ్చుచుండుఁగాకయని కౌసల్యరామున కాశీర్వచనములను జేసె. అనియిట్లు విశాలనేత్రములుగల కౌసల్యాదేవి యాశీర్వచనములను జేసి రాముని శిరస్సునందు మంగళాక్షతలనుంచెను. ఇంతయగాక రాముని శరీరమునందు సుగంధములను బూసెను. మఱియునసేక పర్యాయలు పరీక్షింపఁ బడుటచేత విశ్వసనీయమని నిశ్చయింపఁ బడినదియును, శరీరమునందుఁ దగులుకొనిన బాణమును బయలునకుఁ దీయునట్టి సామర్థ్యము గలదియును, నగు విశల్యకరణియను మూలికను రాముని చేతియందు రక్షణార్థముగ రక్షనుగట్టెను. మఱియు దానిని గట్టునపుడు చెప్పవలసిన మంత్రములను జెప్పుచుగట్టెను. అప్పుడు కౌసల్యాదేవి దుఃఖసముద్రమునందు మునిఁగియున్నదయ్యె. అట్లుమునిఁగి యుండియును ప్రయాణకాలమునందు అమంగళపు కార్యమును జేయఁగూడదు కావునమనస్సునందు దుఃఖమున్నను నణఁచుకొని బయలునకు నోటిచేత మాత్రము శుభవచనములను జెప్పఁదలఁచి తొట్రుపాటు తోనిట్లనియె.

మఱియు నాసమయమునందు మిగుల ప్రియముగల కౌసల్యాదేవి రాముని శిరమును ముద్దుపెట్టుకొని కౌగిలించుకొని పుత్రుఁడా! నీవుపితృవాక్య పరిపాలనను జేయఁదలఁచిన వాఁడవగుటచేత ధన్యుఁడవై సుఖముగానడవికిఁబొమ్ము. మఱియు వత్సా! రామా! నీవేవిధమైన రోగములను జెందక సర్వప్రయోజనములను బొందినవాఁడవై యతిశీఘ్రముగ నీయయోధ్యా నగరమునకువచ్చి రాజమార్గమైన రాజ్యమును నవలంబించియుండఁగా నిన్నుఁజూడఁగలను. నేను నాదుఃఖవిచారములు నశింపఁగాఁ సంతోషముచేతఁ బ్రకాశించు ముఖముతోఁ గూడినదాననై పూర్ణచంద్రుఁడు దయించునట్లు వనమునుండి మరలివచ్చిన నిన్ను శీఘ్రముగఁ జూడఁగలను. రామా! పితృవాక్యమును బరిపాలించి యరణ్యమునువదలి యిక్కడకువచ్చి సింహాసనము నధిష్ఠించియున్న నిన్ను నేను మఱల నతిశీఘ్రముగఁ జూడఁగలను. రాముఁడా! వనమునుండి యిక్కడకువచ్చిన సమస్తమంగళ ద్రవ్యములను బొందినాకును, నాకోడలగు సీతకును, సకలకోరికలను నెరవేర్చుము. ఇప్పుడు నీయిష్టప్రకారము దండకారణ్యమునకుఁబొమ్ము. రాముఁడా! ఇప్పుడు నాచేతఁ జక్కఁగఁ బూజింపఁబడిన దేవగణములును, శివుఁడుమొదలగు దేవతోత్తములును, మహర్షులును, సకలభూతములును, రాక్షసులును, నీకుఁజిరకాలము శుభములను గలుగఁజేయుచుందురుగాకయని కౌసల్యాదేవి రామునితోఁజెప్పె. ఇట్లాకౌసల్యాదేవి చెప్పి పట్టరాని దుఃఖముచే కన్నీళ్లుగారగా దుఃఖించుచు రాము

నకు శాస్త్రోక్తప్రకారముగ నాశీర్వచనములను జేసి రక్షార్థముగ రాముని జుట్టునుదిరిగి అనేకతూరులు గొగలించుకొనియె. అట్లుకౌసల్యాదేవి రామునకు రక్షణకలుగుటకొఱకుఁ బ్రదక్షిణమును జేసినపిమ్మట నధికమైన కీర్తిగల యారాముఁడు తల్లియగు కౌసల్యయొక్క పాదపద్మములకు నమస్కారములజేసి యదిమహాదుఃఖ కాలమైనను, గాంతిమంతుఁడు గావునతనయొక్క కాంతిచేతఁబ్రకాశించుచు సీతాదేవియొక్క యింటికిఁబోయెను.

ఇట్లుశ్రీమదయోధ్యా కాండమునందలి యిరువదైదవ సర్గము ముగిసెను.

రాముడుసీతాదేవితోఅడవికిబోయివచ్చెదన నిచెప్పుట.

అట్లురాజపుత్రుఁడగు రాముఁడు తల్లివలన మంగళాశీర్వచనములనుబొంది కౌసల్యకు నమస్కరించి ధర్మయుతమగు మార్గము నవలంబించి వనమునకుఁ బోవనిశ్చయించి తనయొక్క కాంతిచేతఁ దేజరిల్లుచు మనుష్యులతో నిండియుండు రాజమార్గమునందుఁ బ్రవేశించెను. అట్లుప్రవేశింపఁగానే గుణవంతుఁడగు రాముని నచ్చటనుండు వారలందఱును జూచిరి. అట్లుచూడగానే వారలమనస్సులు రామునియందలి ప్రేమాతిశయముచే మిగులఁగంప మును బొందెను. అప్పుడు పట్టాభిషేకము కొఱకునియమముతో నున్నసీతాదేవికి రాముని వృత్తాంత మేమియును దెలియకుండె. అందువలన సీతాదేవియొక్క మనస్సునందు రామునకు యౌవరాజ్య పట్టాభిషేకమే జరుగుననియెడు తలంపు గలిగియుండెను. కావునసీతామహాదేవి స్వయముగ దేవతాపూజనుజేసి రాజునకుఁ బట్టాభిషేకమైన పిమ్మటఁ బట్టపుదేవి చేయవలసిన కార్యముల నెఱిఁగినదియును, రాజులనడవడిక నెఱింగినదియుఁ గావున రాజపుత్రుఁడగు రాముని నెదురుచూచు చుండెను. అప్పుడు రాముఁడీ దుఃఖవృత్తాంతము నెట్లుచెప్పుదునని విచారంబునొందె. అట్లువిచారపడుచుఁ జక్కగా నలంకరింపఁబడి మహాసంతోషమును నొందియుండు జనులతోనిండిన తనగృహమునందుఁబ్రవేశించె. అట్లువచ్చిన రామునిజూచి సీతామహాదేవి తత్క్షణమునలేచి భయముచేత వడఁకుచు మహాదుఃఖమునొంది వ్యసనసముద్రమున మునిగియున్నవాఁడును, చెనిమిటియునునగు రామునిఁజూచె. మఱియును ధర్మాత్ముఁడగు నారాముఁడు సీతనుజూడఁగానే మనస్సులోనున్న దుఃఖమును మిలనేర్పుతో నడచుకొనుటకు శక్తిలేనివాఁడయ్యె. కావునరామునియొక్క దుఃఖమాసమయమునఁ బయలుపడెను. దేహమునందంతటను జెమటగలవాఁడును, వెలవెలఁబోవుచున్న మోముతోగూడిన వాఁడును, దుఃఖపూరితుఁడునునగు రామునిఁజూచి సీతాదేవియధికముగ దుఃఖమునుజెంది యిట్లనియె.

ప్రభో! నీవిప్పుడేమి నిమిత్తముగ నిట్లుదుఃఖమును బొందుచున్నావు. రామా! విద్వాంసులగు బ్రాహ్మణులు, బృహస్పతియధి దేవతగాఁ గలదియును, సంపదలను గలుగఁజేయు నదియును, నిప్పుడు పట్టాభిషేకమునకుఁ దగినదని వసిష్ఠాదిముని వరులచేత నిర్ణయింపఁ బడినదియును, నగుపుష్యమీ నక్షత్రమిప్పుడే వచ్చియున్నదని చెప్పుచున్నారే? నీవిటువంటిమంగళ కాలమునందెందుకొఱకుదుఃఖమును బొందుచున్నావు? సుందరమగు నీముఖము నూరుశకలములు గలిగినదియును రుగువలెఁ దెల్లనిదైయుండు శ్వేతచ్ఛత్రముచేతఁ గప్పఁబడినదైనను ప్రకాశింపకున్నది అదెందుకు? మఱియునో రామచంద్రా! పద్మములకు సమానమైన నేత్రములు గలనీముఖము చంద్రునివలెను హంసవలెను, తెల్లఁగానుండునట్టి వింజామరములచే విసరఁబడకుండుటకుఁ గారణమేమి? పురుషోత్తమా! రామా! వాచాలకులైన స్తోత్రపాఠకులును, పూర్వవృత్తాంతములను జక్కగా నెఱిగినవారును, వంశావళినిగీర్తించు నట్టిసూతులును మాగధులును, మిగులసంతోషముతో నిప్పుడు నిన్నుఁ గీర్తింపకుండుటకుఁ గారణమేమి? మఱియును వేదవేదాంగవేత్తలగు బ్రాహ్మణులు, శిరస్స్నానమును జేసి పవిత్రుఁడవైయున్న నీశిరస్సునందుఁ దేనెయును, పెరుగును, శాస్త్రోక్తప్రకారముగఁ దీర్థోదకముతోను నభిషేకమును జేయింపకుండుటకుఁ గారణమేమి? రామా! మంత్రులు మొదలగు వారందఱును, వీధులలోముఖ్యులుగ నుండువారలును, పట్టణముల యందలివారును, నలంకరింపఁబడినవారై నిన్నువెంబడించి రాకుండుటకుఁ గారణమేమి? ఉత్తమమైన వేగముగలవియును, బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినవియును, నగునాలుగు గుఱ్ఱములను బూన్చియుత్సవముకొఱకు నలంకరింపఁబడిన పుష్పరథము నీయెదుట నడవకున్నదేమి? మహాపరాక్రమముగలవాఁడా! రామా! నల్లనిమేఘమువలెను, పర్వతమువలెను బ్రకాశించుచు శ్రీమంతమై శుభలక్షణములతోగూడిన పట్టపేనుఁగు నీవువీధియందుఁ బోవుచుండగ నీముందర లేకయుండుటకుఁ గారణమేమి? ప్రియదర్శనా! రామచంద్రా! నీవుబంగారముచే విచిత్రముగ శృంగారింపఁబడిన సింహాసనమును ముందరఁబెట్టుకొని వీరవరులతో వీధివెంబడి నూరేగకుండుటకుఁ గారణమేమి? ఇదిపట్టాభిషేక



పతివ్రతయైన తాను సుఖ దుఃఖములలో రాముని వీడనని సీత పలుకుట

కాలవగుటచే నెంతసంతోషముగా నుండదగియుండు నోయంత దుఃఖముగనున్నావే? ఇదేమి? ఇదివఱకెన్నడును నిటువంటి దుఃఖమును బొందినవాఁడవుగావే? నీయందు సంతోషమేమియును గనఁబడలేదే? నీకిప్పుడిటువంటి వ్యసనము వచ్చుటకుఁ గారణమేమి? యనిసీతాదేవి యడిగియనేక విధములవిలపించెను. ఇట్లనేకవిధముల విలపించుచున్న సీతాదేవినిఁజూచి రాముఁడిట్లనియె.

సీతా! పూజ్యుఁడును, తండ్రియును, నగుదశరథమహారాజు నన్నుఁబట్టణమునువదలి యరణ్యమునకుఁబొమ్మనియె. సీతా! నీవు మిగులఁబావనమైన కులమునందుఁబుట్టినదానవు. మఱియును ధర్మమును జక్కఁగఁదెలిసినదానవు. అదియునుగాక సర్వకాలములయందును ధర్మయుతముగ సంచరించుదువు. ధర్మవంతులలో నుత్తముఁడగుజనకచక్రవర్తికిఁ గుమార్తెవు. కాఁబట్టి నీవుధర్మమును దప్పుదానవుగావు. నాకీవనవాస మెట్లుకలిగినదో దానిఁజెప్పెద. ఆవిషయమును జక్కఁగఁదెలిసికొనుము. నాతండ్రియగుదశరథమహారాజు సత్యమునుదప్పువాఁడుగాఁడు. కావునఁబూర్వము యుద్ధకాలమునందుఁ బ్రాణములను గాపాడినకైకేయికి గొప్పవగువరములను రెంటినిచ్చెను. ఇప్పుడు దశరధునియాజ్ఞ చొప్పున నాకుఁబట్టాభిషేక మహోత్సవ మాసన్నమైయుండఁగాఁ గైకేయిపూర్వమడిగిన రెండువరములను తనకిపుడిమ్మనినడిగినది. దశరథుఁడుధర్మమునుదప్పనివాఁడుగావున నాకైకేయికిలోఁబడెను ఆరెండు వరములలో నొకవరమునకుఁగా, నేనుదండకారణ్యమునందుఁ బదునాలుగుసంవత్సరము లుండవలెను. రెండవవరమునకుఁగా, భరతునకిప్పుడే నాతండ్రియగు దశరథమహారాజు యావరాజ్య పట్టాభిషేకమును జేయుటకునిశ్చయించెను. కావున నేనిప్పుడు విజనమగు వనమునకుఁ బోవుటకు బ్రయత్నపడి నిన్నుఁజూచిపోవుటకై యిచ్చటికివచ్చినాను. భరతునిసమీపమునందు నన్నెప్పుడును నీవుశ్లాఘింపఁగూడదు. "శ్లో॥ బుద్ధియుక్తాహి పురుషానసహంతేపర స్తవమ్,, శ్రీమంతులగుమానవులు తమయెదుటనితరులగుపురుషులను గొనియాడుచుండినసహింపరు. కావుననోసీతా! నీవుభరతునిముందర నాగుణములను గొనియాడఁగూడదు. ఎప్పటికిని నిన్నుఁగాపాడవలయునను తలంపు భరతున కెంతమాత్రమును ముఖ్యకృత్యమైయుండదు. సాధారణముగాదయచేత భరతుఁడు నిన్నుఁబోషింపవలసినవాఁడేగాని మఱియొకటిగాదు. నీవుభరతునకు ననుకూలరాలవై యుండనియెడల నిన్నుగాపాడదు. కావున నీవుభరతున కనుకూలురాలవై యుండుము. అట్లుసేసితివేని నీవుభరతునిసమీపమునం దుండఁగలవు. కాదేనియుండనేరవు. మానవపతియగు దశరథమహారాజనాదిగవచ్చుచున్న యావరాజ్యమును భరతున కిచ్చియున్నాఁడు. కావుననోసీతా! నీవాభరతునకును, దశరథమహారాజునకును, విశేషముగ సంతోషముగలుగునట్లు సేయుచుండుము. నేనుగూడఁ దండ్రియగు దశరథ మహారాజుయొక్క ప్రతిజ్ఞాపరిపాలనముకొఱకుఁగా నిప్పుడే యరణ్యమునకుఁ బోయెదను. కావుననీవు మంచిమనస్సుతో దృఢచిత్తురాలవై యుండుము. పాపరహితురాలవును, మంగళస్వరూపురాలవును, నైనయోసీతా! నేనుమునులచే సేవింపఁబడు దండకారణ్యమునకుఁ బోయినపిమ్మట నీవు వ్రతములనవలంబించి యుపవాసములను జేయుచునుండుము. నీవు దినదినమునందును బ్రాతఃకాలమునందు నిద్రనులేచి శాస్త్రోక్తప్రకారముగ దేవతలనుబూజించి మనుష్యులకందఱకును బ్రభువైన దశరథమహారాజునకు నమస్కారమును జేయుచుండవలయును. నాకుఁదల్లియును సర్వకాలములయందును ధర్మమునే యాచరించునదియును, వృద్ధురాలును, దుఃఖసముద్రమునందు మునిఁగియున్నదియును, నగుకౌసల్యను నీవుసర్వకాలములయందును గౌరవించిపూజింపుచుండుము. మిగిలిననాతల్లులందఱును, నీచేముఖ్యముగానమస్కరింపఁదగినవారు. మఱియునాతల్లులందఱును స్నేహప్రణయ సంభోగములచేత నాకుసమానలని యెఱుంగుము. సీతా! నాకుఁబ్రాణములకంటె నధికమైనప్రేమగలవారలగు భరతశత్రుఘ్నులను నీవువిశేషించి సహోదరులనుపుత్రులను జూచునట్లు చూడుము. ఒకానొకప్పుడైనను నీవుభరతున కపకారమును జేయకుము. భరతుఁడీదేశమునకును, మనకులమునకును ప్రభువుగావున నతనికపకారము సేయుటయుచితముగాదు. "శ్లో॥ ఆరాధితాహి శీలేన ప్రయత్నైశ్చోపసేవితాః । రాజానస్సంప్రసీదంతి ప్రకుప్యంతివిపర్యయే,, సీతా! లోకములోనిరాజులుతమకనుకూలముగాఁ బ్రవర్తించి యాలస్యాదులులేక సర్వకాలములయందును దమను సేవించువారలయందుఁ బ్రియముగలవారలై యుందురు. అట్లుగాదేని మిగులఁగోపముగలవారగుదురు. "శ్లో॥ ఔరసానపిపుత్రాన్హి త్యజంత్యహితకారిణః । సమర్థాన్సంప్రగృహ్ణంతి జనానపినరాధిపాః,, రాజులు తమయొక్క జ్యేష్ఠపుత్రులైనను, విరుద్ధములగు కార్యములను జేయుచుండిరేని నట్టివారిపై మిగులఁ గోపమునుజెంది వదలిపెట్టుదురు. సాధారణజనులైనను, తమకుహితమును జేయుచు, సకలకార్యములయందును సమర్థులైయుండిరేని యట్టివారలను రాజులుపరిగ్రహింతురు.

కావున, కల్యాణీ! సీతా! నీవు రాజైన భరతునకు విరుద్ధములగు కార్యములను జేయని దానవును, ధర్మమునం దాసక్తిగలదానవును, సత్యవ్రతమునం దాసక్తిగలదానవును, నై యిచ్చటనే నివసించియుండుము. నామనోహరీ! సీతా! నేను, మహారణ్యములయం దుండుటకుఁబోవుచున్నాను. కావున నీవు స్త్రీయగుటవలన నిచటనే యుండుము. నీవెవ్వరికిని నపకారమును జేయవలదు. మఱియు నీయం దెవ్వరికిని గోపముగలుగకుండునట్లు ప్రవర్తింపుము. నేనింతకంటె నీకు జెప్పవలసిన మాటయేదియును లేదు.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యిరువదాఱవ సర్గము ముగిసెను.

సీతాదేవి రామునితో తానుగూడ యడవికివచ్చెదనని చెప్పుట.

అనియిట్లు రాముఁడు చెప్పినపిమ్మట ప్రియమగుమాటలను జెప్పునదియును, ప్రియకృత్యములను జేయునదియును, నగు సీతాదేవి పెనిమిటియగు రాముని వచనములను విని స్నేహముచేతనే మిక్కిలికోపమును జెంది పెనిమిటియగు రామునిజూచి యిట్లనియె.

రామా! ఇదియేమి? నీవిట్లు మాటలాడుచున్నావే! నీవు చులకఁదనముచేత మాటలాడుచున్నావు? రాజోత్తముఁడవైనయో రామా! నీవు పరిహసింపఁదగినట్టిదియును, ఉపయోగములేనిదియును నగు మాటను జెప్పుచున్నావు ఇదియేమి విచిత్రముగనున్నదే? నీవెన్నఁడును నిటువంటిమాటలను జెప్పినవాఁడవు గావు? నేనెన్నఁడును నీనోట నిటువంటి మాటలను వినియుండలేదు. "శ్లో॥ ఆర్యపుత్రపితామాతా భ్రాతా పుత్రస్తథాస్నుషా। స్వానిపుణ్యాని భుంజానాస్స్వంస్వం భాగ్యముపాసతే॥ ఆర్యపుత్రా! రామా! తండ్రియును, దల్లియును, దోఁబుట్టువును, కొడుకును, కోడలును, వీరుమొదలగువారందఱును, దమతమపుణ్యపాపములఫలముల తాముతామనుభవించుచు వానివలనఁ దమకుఁగలుగు శుభాశుభకర్మలనున్న యనుభవించుచున్నారు. "శ్లో॥ భర్తృభాగ్యంతుభార్యైకా ప్రాప్నోతిపురుషర్షభ,, పురుషర్షభా! రామా! భార్యభర్తకర్ధశరీరమగుటచే భర్తకుఁగలుగు శుభాశుభములనే తాననుభవించుచుండునుగాని యన్యములననుభవించదు. (అనఁగా భార్య, భర్తసుఖమునుబొందిన యెడల సుఖమునుబొందును, భర్తదుఃఖమును బొందినయెడలఁ దానుగూడ దుఃఖమును బొందును) కావున నిన్నడవికిఁబొమ్మని చెప్పుటచేతనన్నుఁ గూడ నరణ్యమునకుఁ బొమ్మని చెప్పినట్లేయైనదిగాని వేఱొకటిగాదు. "శ్లో॥ నపితానాత్మజో నాత్మా నమాతాన సఖీజనః। ఇహప్రేత్య చ నారీణాం పతిరేకోగతిస్సదా॥ రామా! స్త్రీలకు దండ్రి, కొడుకు, తల్లి, చెలికత్తెలు, మొదలగువారలలో నెవ్వరును రక్షకులు గానేరరు. మఱియును స్త్రీలు దమంతటఁ దాముండుటకును స్వతంత్రులునుగారు. ఈలోకమునందును, బరలోకమునందును స్త్రీలకు సర్వకాలములయందును భర్తయేగతియని పెద్దలు చెప్పుదురు. రామా! నీవిప్పుడే దుర్గమంబైన యరణ్యమునకుఁ బోవ యత్నించితివేని నేను నీకంటె ముందుగ బయలువెడలి నీపాదములకు బాధగలుగకుండునట్లు దర్భాంకురములనొత్తుచు మెత్తగనుండునట్లు చేయుచుందును. మఱియు నీదు పాదములకు నొప్పిలేకుండునట్లుగ జేయుచుందును. నేనట్లు చేసితినేని వెనుకనడచుచున్న నీపాదములకు బాధలేకుండును. రామా! నీవు మిగులఁ బరాక్రమముగలవాఁడవు కావున నీకొక్కఁడను భయముగలుగనేరదు. నన్నొక్కదానినేగాదు, నావంటివారల ననేకులఁ గాపాడుదువు. నేను రావలదని చెప్పినను వినకవచ్చుచున్నదేయని యనఁగూడదు? నామాటనుగూడ వినలేదని కోపమును బొందవలదు? ఈవిషయమై యీర్ష్యను, అసూయను, "త్రాగగా మిగిలినయుదకమును వదలివేయునట్లు,, వదలివేయుము. నాయందు నమ్మకముంచి నన్నుఁగూడ నీవెంటఁ దీసికొనిపొమ్ము. నేను నీకేమియును నపకారము జేసినదానను గాదుగదా? "శ్లో॥ ప్రాసాదాగ్రైర్విమానైర్వా వైహాయసగతేనవా। సర్వావస్థాగతాభర్తుః పాదచ్ఛాయా విశిష్యతే॥ మేడలమీఁద సంచరించుటకంటెను, విమానములయందుఁ దిరుగుటకంటెను, అష్టసిద్ధులనుబొంది యాకాశమునందు సంచారము జేయుటకంటెను, సర్వకాలసర్వావస్థలయందును నొక్కరీతిగాఁ బెనిమిటితోఁగూడ సంచరించుచు నతనిపాదములకు సేవను జేయుచుండుటే స్త్రీకి పరమధర్మము. ఈవిషయమును గుఱించి నాయొక్క తల్లిదండ్రులు విశేషముగ నాకుపదేశించియున్నారు. నేను నడచుకొనవలసినవిషయమును నాకిప్పుడెవ్వరును బోధింపనక్కఱలేదు. నాకిదివఱకే నాతల్లిదండ్రులు జక్కఁగనుపదేశించియున్నారు. అరణ్యము, ప్రవేశించుటకు శక్యముగానిదైనను, పెద్దపులులు, తోడేళ్లు మొదలగు నానావిధములైన మృగములతో నిండినదైనను మఱియెట్టిదైనను, నేను వచ్చుటకు సిద్ధముగనున్నాను. నేను నీతోఁగూడ నరణ్యమునందుఁ బ్రవేశించుటకుఁ గొంచెమైనను భయమును బొందుదానను గాను. నాకు మూఁడులోకముల ప్రభుత్వము దొరికినను నక్కఱలేదు. పెనిమిటివగు నీకు శుశ్రూషను జేయుటకంటె నాకు పరమమైన ధర్మమేది

యును లేదు. నేను నీకు శుశ్రూషను జేయుచు నరణ్యమునందు " మా తండ్రి యింటనున్న విధముగ,, సుఖముగ నుండుదును. పరాక్రమవంతుఁడవైన యో రామా! నేను నీకు సర్వకాలములయందును శుశ్రూషను జేయుచున్న దాననై నియమముగఁ దపసును జేయుచు మధురములగు తేనియలయొక్క ఘుమఘుమయని పరిమళించుచున్న వాసనలుగల వనములందు నిన్నుఁ గూడి వినోదముగ క్రీడించుచుందును. నా మానమును జక్కఁగ గాపాడువాఁడా! రామా! నీవు దండకారణ్యమునందు నన్నొక్కదానినే గాదు మఱియు ననేకులను గాపాడఁగలవు. ఇట్టి నీవు నన్నుఁ గాపాడుట నీకెంత మాత్రము? కావున నో రామా! నేనిప్పుడే నీతోఁగూడ నరణ్యమునకు వచ్చెద. ఈ విషయమునందుఁ గొంచెమైనను సందేహింపవద్దు. ఇవ్విధముగ నరణ్యమునకు నీతోఁగూడ రావలయునని దృఢముగ నిశ్చయించియున్న నన్ను నిచ్చట విడిచిపోవుటకు నీకలవిగాదు. రామా! వనమునందు మంచియన్నము దొరకదు? కందమూలఫలాదులను భుజింపవలసి వచ్చును? కావున నిక్కడనే యుండుమని చెప్పెదవేమో? దానికి నేను భయపడను. నేను సర్వకాలములయందును గందమూల ఫలాదులనే తినియెదను. మంచియన్నమే నాకక్కఱలేదు. దీనికి సందేహింపవలదు. రామా! నేను నీకేమియును వ్యసనము గలుగకుండునట్లు నీతోఁగూడ నరణ్యమునందు సంచరించెదను. మిగుల బుద్ధిమంతుఁడవును, సాధుఁడవును నైన నీతోఁగూడ నుండుటచేతఁ గొంచెమైనను భయములేని దాననై నదులను, పర్వతములను, నీళ్లు నిలిచియుండునట్టి పల్లపు ప్రదేశములను, మఱియు ననేక విధములగు వనములను జూడవలయునని కోరుచున్నాను. మఱియు నో రామా! నేను మిగులఁ బరాక్రమవంతుఁడవైన నిన్నుఁ గూడి కొంచెమైనను భయము లేని దాననై హంసలును, నీటికోళ్లును గలిగి మనోహరముగ వికసించియుండునట్టి తామరకొలఁకులను జూచుచు సుఖముగ నుండవలయునని కోరుచున్నాను. విశాలాక్షా! రామా! నేను తామర చెంగడియుండు శీతోదకములుగల కొలకులయందే స్నానమును జేసెదను. మఱియు నా తామరలుగల మడుగులయందు నిన్నుఁ గూడి పరమసంతోషముచే క్రీడింపఁగోరుచున్నాను. ఇట్లు నీతోఁగూడ నరణ్యమునందు సంచరించుచు నూరువేలయేండ్లైనను, ఇన్నియేండ్లైనదని తలఁపక యుండెదను. కావున పదునాలుగు సంవత్సరము లెంతమాత్రము. అతిత్వరలో గడచిపోవును. నిన్ను వదలి స్వర్గలోకమునందుఁ గూడ యుండుటకు నాకిష్టము లేదు. పురుషోత్తముఁడా! రామా! నాకు స్వర్గలోకము నందుండుట సంభవించినను, నీవు లేనిదినేనుండు దానను గాను. కావున నేను దండకారణ్యమునందుఁ బ్రవేశించుటకుఁ గొంచెమైనను భయమును జెందను. అట్టి యరణ్యమునందుఁ గోతులున్నను, ఏనుంగులున్నను, మఱియును పెద్దపులులు మొదలగు ఘాతుక మృగములున్నను భయమును బొందక నీతోఁగూడ సంచరించెదను. "శ్లో॥ వనే నివత్స్యామి యథా పితుర్గృహే। తవైవ పాదా వుపగృహ్య సంయతా॥", నేనవశ్యముగ నీతోఁగూడ నరణ్యమునకు వచ్చెదను. నేను నీ పాదముల నాశ్రయించి వ్రతనియమము గలదాననై " తండ్రిగృహమునందున్న విధముగ,, సుఖముగ నుండెదను. రామా! నేను నిన్నుఁ దప్ప నితరుల నెవ్వరిని దలయెత్తి చూచుదానను గాను. మఱియును సర్వకాలములయందును నీయందుఁ బ్రియముగల దానను. నన్ను వదలి నీవు పోయిన యెడల నేను మరణమును బొందుదును. ఇది నిశ్చయము. ఇటువంటి నన్నవశ్యముగ నీతోఁగూడ నరణ్యమునకుఁ దీసికొనిపొమ్ము. నా మనవి నంగీకరింపుము. నన్నుఁ గొనిపోవుటవలన నాచేత నీకేమియును గష్టము గలుగనేరదని యె. అని యిట్లు పలుకుచున్న సీతాదేవి యొక్క మాటలను పరమధర్మాత్ముఁడగు రాముఁడు విని సీతాదేవిని నరణ్యమునకుఁ దీసికొనిపోవుట కిష్టము లేనివాఁడయ్యె. మఱియు నా సీతను దోడ్కొని పోక పట్టణమునందె నిలుపుటకొఱకు వనవాసమునందుఁ గలుగునట్టి దుఃఖములను గుఱించి విశేషముగ జెప్పదొడంగె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యిరువదేడవ సర్గము ముగిసెను.

— { రాముడు సీతతో నరణ్యములయందు కలుగు కష్టములను జెప్పి రావలదని చెప్పుట. } —

ఇట్లనేక విధముల సీతాదేవి చెప్పినప్పటికిని ధర్మము నెఱింగిన వాఁడును, ధార్మికుఁడునునగు రాముఁడు వనములయందుఁ గలిగెడి దుఃఖమును దలఁచుకొని సీతను తనతోఁగూడ నరణ్యమునకుఁ దోడ్కొనిపోవుటకు సమ్మతము లేనివాఁడయ్యె. మఱియును ధారధారగ బ్రవహించుచున్న కన్నీళ్లచే నిండిన కండ్లుగల సీతను మరల నూరడించి సీతను నరణ్యమునకు రాకుండునట్లు సేయఁదలఁచి యిట్లనియె.

ఓ సీతా! నీవు మిగుల గొప్పదియును, పావనమైనదియును నగు కులమునందుఁ బుట్టిన దానవు. మఱియును సర్వకాలములయందును ధర్మమునందాశ గలదానవు. కావున నీవిక్కడనే యుండి మనస్సునకు దుఃఖము గలుగఁజే

సికొనక సుఖముగలుగునట్లు చేసికొని నీకుఁదగిన ధర్మముల నాచరింపుము. నీమనస్సు వచ్చినట్లు విధినిషేధములను వదలి సంచరింపకుము. అబలా! సీతా! నీవు నేను చెప్పినట్లు చేయవలసినదేగాని నీయిష్టానుసారముగ స్వతంత్రురాలవై ప్రవర్తింపఁగూడదు. కావున నామాటలను వినుము. అడవియందనేక విధములగు కష్టములుగలవు. నేనునీకా కష్టములన్నిఁటిని జెప్పెదను. నిశ్చలచిత్తము గలదానవై శ్రద్ధతో వినుము. సీతా! వనవాసమునకు నేనుగూడ వచ్చెదనను బుద్ధినివిడిచి పెట్టుము. ఇట్టిసంకల్పమునుగూడఁ జేయకుము, దుర్గమమైన యరణ్యమునందుఁ బ్రవేశించువారికనేకములగు కష్టములు గలుగునని పెద్దలుచెప్పగా నీవువిని యుందువుగదా? నీయొక్క హితమును గోరియే నేనీమాటను జెప్పుచున్నాను గాని నిన్నుగ్రక్షించుట మిగులకష్టముగాదు. అరణ్యము నందుండుటచేత నెప్పటికిని వ్యసనముగలుగును గాని సుఖమేమియును గలుగనేరదని నేనునిశ్చయముగ జెప్పగలను. కొండకాలువలయొక్క ధ్వనులును, పర్వత గుహలయందుండు సింహములయొక్క ధ్వనులును, వినుటమహాకష్టము. కావున నరణ్యమునందుండుట మిగుల దుఃఖకరము. సీతా! జనులులేని ప్రదేశములయందు భయములేక యిచ్చవచ్చినట్లు తిరుగుచు మదించియుండు సింహములు, పెద్దపులులు మొదలగుదుష్టజంతువులు మనలను జూచినతోడనే మిగుల సంతోషముతో మనలనుజంపుటకొఱకు మనయొద్దకువచ్చును. కాఁబట్టియరణ్యములో నుండుటమిగులఁ గష్టమనియెంచెదను. మఱియునరణ్యములో నానాస్థలములయందు సర్వకాలములయందును మొసళ్లుగలిగి యుండుటచేతను, బురదతోఁగూడి యుండుటచేతను, మదపుటేనుఁగులకుఁ గూడదాఁటశక్యముగాని నదులుగలవు. అటువంటి నదులనుమనము దాటనేలేము. కావున నరణ్యమునందుండుట మిగులగష్టము. అరణ్యమునందలి మార్గములు, తీగెలతోడను, కంటకములతోడనునిండి, మహాభయంకరములగు నడవికోళ్లయొక్క ధ్వనులతోఁగూడి త్రాగుటకు నీళ్లుకొంచెమైనను లేకప్రవేశించుటకు శక్యముగాకయుండును. కావుననరణ్యమునందుండుట మహాకష్టమనియెంచెదను. పగలియందు కందమూలఫలముల ననుభవించిరాత్రులయందు భూమియందుఁ దమంతటఁ దామేరాలిన యాకులను బఱచుకొని శయనించి నిద్రింపవలయును. కావుననడవిలోనుండుట కష్టము. సీతా! అహోరాత్రములును మహానియమముతోఁగూడి వృక్షములనుండి రాలినపండ్లను భక్షించి సంతోషము పొందవలయునేకాని వేఱుపదార్థములేమియుం దొరకవు- అందువలన నరణ్యములో నుండుటకష్టము. సీతా! దండకారణ్యములోనికిఁ బోయినపిమ్మట శక్తియున్నను మట్టుకు నుపవాసములను జేయవలయు. మఱియు నారచీరలనుధరించి జటాధారులై యుండవలయును. ప్రతిదినమునందును దేవతలకును, పితృదేవతలకును, ఆయాకాలములయందు వచ్చినయతిథులకును, శాస్త్రోక్తప్రకారముగఁ బూజను జేయవలయును. మఱియు సర్వకాలములయందును నియమముతోనే నుండవలయును, ఇంతియగాక దినదినమందును ప్రాతర్మధ్యాహ్న కాలములయందు ముమ్మారును స్నానమును జేయవలయును. కాబట్టియరణ్యమునందుండుట మిగులఁగష్టమని తలఁచెదను. వానప్రస్థులైనమునీశ్వరులు చేయుప్రకారముగఁ దానేగోసి తెచ్చిన పువ్వులచేతఁ బ్రతిదినమందును నగ్నివేదికకుఁ బూజను జేయవలయును, నీవుపసిదానవు. కావునట్టి మహాకష్టమైన పనులను జేయఁజాలవు. కాఁబట్టివనములోనుండుట దుఃఖకరము. ఓసీతా! వనములయందు నివసించువారలు భోజనపదార్థములను నియతముగాఁ జేసికొని సర్వకాలములయందును ఫలములుమొదలగునవి యెంతవఱకు దొరుకునో యంతవఱకే తృప్తిఁబొందుచుండవలయును. కావున నరణ్యమునందుండుట మిగులఁగష్టము. అరణ్యములయందెల్లపుడును గాలియధికముగా వీఁచుచుండును. రాత్రులయందుఁ జీకటియును నధికముగానుండును. సర్వకాలములయందును మితిలేనియాకలి కలిగియుండును. ఇంతియగాక యధికభయము గలిగియుండును. కావునవనములో నుండుట మహాకష్టము. సీతా! నానావిధములైన రూపములుగలయనేక సర్పములుమిగుల గర్వమువలన భూమియందంతటను సంచరించుచుండును. మఱియు నింతకంటె దుఃఖమింకొకటిగలదు నీవుస్త్రీవి. మహాభయము నొందుదువు. కావున నరణ్యమునందుండుట మిగులఁగష్టమని యెంచుచున్నాను. సీతా! నదులవలె వంకరవంకరగాఁ బోవునవియును, నదులయందే నివసించుచుండునవియును, నగుగొప్పపాములు మార్గమును నావరించుకొని యుండును. అట్లుండుటచేత మిగులభయము గలుగును. అందువలన నింతకంటెఁ గష్టము వేఱేమి కావలయును. కావుననరణ్యనందుండుట మహాకష్టము. అబలా! సీతా! మిడుతలును, తేళ్లును, పురుగులును, నడవియీఁగలును, దోమలును, సర్వకాలములయందును బాధించుచుండును. నీవాడదానవు. కాఁబట్టియిటువంటి కష్టములను సహించియుండలేవు. కావునవనములోనుండుట మహాకష్టము. మఱియునో సీతా! వనములయందుఁ వృక్షముల కొమ్మ

లు దట్టముగా వ్యాపించి యొకటితోనొకటి యొగసుకొని యుండును. దర్భలును, తెల్లునుమిగుల దట్టముగా మొలిచియుండును. కావున నడిచిపోవుటకుఁ గొంచెమైనను మార్గమే కనఁబడదు. అందువలన వనములోనుండుట మిగులఁగష్టము. ఇంతయుగాక యరణ్యాన నందుండువారల కనేకములగు శరీరకష్టములుగలవు. నానావిధములగు మహాభయములును గలుగును. కావునవనములోనుండుట మిగులఁగష్టము. ఓసీతా! క్రోధలోభముల నువదలవలయును. తపస్సునుజేయుటయందేబుద్ధినుంచవలయును. మహాభయంకరములగు సింహముమొదలగునవియగపడినప్పుడు భయపడఁగూడదు. కావుననరణ్యమునందుండుట మిగులఁగష్టము. సీతా! వనమునకు రావలయుననియెడు కోరికనువదలుము. అదియునుఁగాక నీవువనవాసముచేయుటకుఁ దగినదానవునుగావు. నేనెన్నివిధముల నాలోచించిచూచినను నరణ్యములయందుండుట మిక్కిలి కష్టమనియే తోఁచుచున్నదని రాముఁడుచెప్పె. ఈప్రకారముగ మహాత్ముఁడగురాముఁడు సీతాదేవినినరణ్యమునకుఁ దోడ్కొనిపోవుట కింతమాత్రముసు నిష్టములేనివాఁడయ్యె. అప్పుడుసీతామహాదేవి రామునివచనములనుసమ్మతింపక దుఃఖముగలదై యారామునిఁజూచి మరల నిట్లనియె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యిరువదెనిమిదవసర్గముగిసెను.

{ సీతాదేవి యనేకనీతిమాటలనుజెప్పి రామునితోఁగూడ యరణ్యమునకు వచ్చెదనని చెప్పుట. }

ఇట్లు శ్రీరాముఁడు చెప్పినమాటలనువిని యాసీతాదేవి మిగులదుఃఖమునుజెంది కన్నీరుధారధారగ బ్రవహింపుచుండ రామునిజూచి మృదుమధురమైన మాటలతో నిట్లనియె.

రాముఁడా! నీవిప్పుడరణ్యవాసమునందు ఏదోషములు గలవనిచెప్పితివో యవియన్నియును దోషములుగావు. నీవు నాకు సహాయముగనుండుటచేత నవియన్నియునునాకుగుణములేయగునని తలంచుచున్నాను. రాముఁడా! వనమునందలివేళ్లును, సింహములును, గజములును, పెద్దపులులును, శరభమృగములును, పెద్దవగు చమరమృగములును, బల్లూకములును, మఱియుసడవులలోనుండు నితరమృగములును, నివన్నియు నిదివఱకెన్నడును జూడఁబడనిదియును, మిగుల మనోహరమైనదియును, నత్యద్భుతముగ నున్నదియునునగు నీరూపమువంటి రూపమును నిదివఱకెన్నడును జూచియుండవు. కావుననీరూపమునుజూడఁగానే భయముచేత నవతలికి దొలగిపోఁగలవు. మఱియును భయముగలుగున మయమునం దెల్లవారును భయమును బొందుదురుగదా? కావున నాకాదుష్టజంతువులవలన భయముగలుగనేరదు. ఇంతయగాక నిన్నునరణ్యమునకుఁ బొమ్మనిచెప్పుటచేత నన్నుఁగూడ నరణ్యమునకుఁ బొమ్మనిచెప్పినట్లయ్యె. కావునదశరథు నాజ్ఞాప్రకారము నేనుగూడ నీతోనరణ్యమునకుఁరాదగియున్నాను. రామా! నీవునన్నిక్కడనే వదలిపోతివేని నేనుప్రాణత్యాగమును జేసికొందును. భర్తనువదలి భార్యజీవించుట యుచితముగాదుగదా? రాముఁడా! నేనునీయొద్దనున్నపుడు దేవతలకధిపతియగు నింద్రుఁడుగూడ నన్నునవమానింపఁజాలఁడు. "శ్లో ॥ పతిహీనాతు యానారీ నసాశక్ష్యతిజీవితుమ్,, స్త్రీలుభర్తనువదలి బ్రదుకఁజాలరుగదా? రాముఁడా! నీవీవిషయమును నాకనేకమారులు బోధించియున్నావు. ఇంతయేగాకమహాప్రాజ్ఞా! రామా! నేనీవిషయమును మాతండ్రిగృహమున బ్రాహ్మణోత్తములగువారనేకులుచెప్పఁగవినియున్నాను. కావుననేనవశ్యముగ నీతోఁగూడనరణ్యమున నుండవలయును. మఱియునుజ్యోతిశ్శాస్త్రవేత్తలు నేనుపుట్టినలగ్నమునుబట్టి నేనుగొన్నిదినము లరణ్యమున నుందునని చెప్పియున్నారు. ఆవిషయమును నేనుజక్కగవినియున్నాను. మిగులబలవంతుఁడవైనయోరామా! నేనుబూర్వము సాముద్రికశాస్త్రమును జదివినబ్రాహ్మణులవలన నాకుఁ గొన్నిదినము లరణ్యవాసముగలుగునని వినియున్నాను. అదిమొదలుకొని నేనెప్పుడెప్పుడువనమునకుఁబోదునా? యని మిగుల సంతోషముగలదాననై యున్నాను. శాస్త్రవేత్తలగు బ్రాహ్మణులుచెప్పినచొప్పున నేనుగొంతకాలమరణ్యమున నుండవలసినదేకదా? ప్రాణనాథా! రామా! నేనునీతోఁగూడ నరణ్యమునకు రావలసినదేగాని వేఱుగాదు. వనమునకుఁబోవుట కింతకంటె వేఱువిధమైన యుపాయమేమియును లేదు. నేనిప్పుడునీతోఁగూడ నరణ్యమునకు వచ్చి యాబ్రాహ్మణులమాటను సత్యముగఁజేసెదను. వనవాసమునం దనేకములగు కష్టములుగలవని నాకునుదెలిసియున్నది. నీవుమిగులఁ బరాక్రమవంతుఁడవు. నీకేమియు నట్టికష్టములుగలుగవు. మనోధైర్యములేనివారి కనేకములగు కష్టములుగలుగును. మఱియు నాకువివాహముగాకమునుపు నేనునాతండ్రియింటనుండునపుడొకనాడునాతల్లియొద్దనుండఁగా సదాచారసంపన్నురాలగు తపస్విచేసికొను నొకస్త్రీవచ్చెను. వచ్చినన్నుఁజూచినాకుఁగొంతకాలము వనవాసముసంభవించునని చెప్పియుండెను. ఆ

మాటలను నేనువినియుంటిని. మహాప్రభో! రామా! ఇంతయగాక నేనునీకనేకవిధముల శుశ్రూషలనుజేసి సంతోషమును గలిగించియున్నాను. కావున నాకోరికను నీవు నెఱవేర్పవలయును. నేనునిన్నుఁగూడి యరణ్యమునకుఁబోయి యక్కడనుండవలయునని కోరుచుందును. రామా! నేను వనమునకు నీతోడరావలయునని మిగులఁగోరికగలదాననై యున్నాను. నీకుమంగళములుగలుగుఁగాక. పరాక్రమశాలివగు నీవు వనమునకుఁబోయి యందుండఁగా నీకుశుశ్రూషను జేయుచుండవలెనని నాకుమిక్కిలి కోరికగలిగియున్నది. పరిశుద్ధాత్ముఁడవైన యోరామా! నేనుభర్తవైననీయందలి స్నేహవశముచేత నీతోఁగూడనరణ్యమునకువచ్చి పాతివ్రత్యమునుసల్పుచుఁ బాపములనుబోగొట్టుకొనఁదలఁచియున్నాను. మఱియు కృతార్థురాలనయ్యెదను. "భర్తాహిమమదైవతమ్" నేను పెనిమిటినే దేవునిగాఁదలఁచుచున్నాను. కావున నాకుఁ బెనిమిటికంటె నధికుఁడగు దేవుఁడులేఁడు. రామా! ఈలోకమునందేగాక పరలోకమునందుఁగూడ నాకుఁ బెనిమిటియే దైవము. కావున నాకెప్పుడును నీతోఁగూడసంబంధముగలిగియుండును. మహాకీర్తిగలబ్రాహ్మణులు చదువుకొనుచుండఁగా పుణ్యకరములగు వేదవాక్యములను వినియున్నాముగదా? "శ్లో॥ ఇహలోకేచపితృభిర్యా స్త్రీయస్య మహామతే। అద్భిర్దత్తా స్వధర్మేణ ప్రేత్యభావేపితస్యసా॥ మహాబుద్ధిగలరామా! తండ్రిమొదలగువారిచేత నీలోకమునందు ఏస్త్రీయే పురుషునకుఁ దమవర్ణాశ్రమధర్మముల ననుసరించి యుదకదానపూర్వకముగ నివ్వఁబడునో యాస్త్రీకిఁబరలోకమునందుఁగూడ నాపురుషుఁడే భర్తగానుండునని యెడు నర్థమును తెలిపెడి వేదవాక్యమును వినియున్నాముగదా? ఇట్లు వేదమునందుఁ గూడఁ జెప్పియుండఁగ నీవు, సదాచారసంపన్నురాలను, పతివ్రతను, భార్యను నగు నన్ను నిప్పుడు వనమునకుఁ దోడ్కొనిపోవుట కేలసంశయించెదవు. రామా! నేనునీయందధికమైన ప్రియముగలదానను. పతివ్రతను. నన్నెక్కడ వదలిపెట్టిపోయెదవోయని వ్యసనమునుబొందియున్నదానను. సుఖమువచ్చినను, దుఃఖమువచ్చినను, ఒక్కటేతీరుగా నుండవలయుగాన నేనుసుఖదుఃఖములను సమముగా నేతలఁచుచుందును, నీకుసుఖముగలిగినప్పుడు నేనుసుఖమును బొందుదును. నీకుదుఃఖముగలిగినప్పుడు నేనుగూడ దుఃఖమునుబొందుచుందును. కావున నన్నవశ్యముగ నరణ్యమునకుఁబిలుచుకొనిపొమ్ము. ఇట్లుమహావ్యసనముచేతఁ బరితాపమునుబొందుచున్న నన్నునీతోఁగూడ నరణ్యమునకుఁదీసికొనిపోకపోతివేని నేనువిషపానమును జేసినైనను, నిప్పులోఁబడినైనను, నీళ్లలోదుమికినైనను, ప్రాణములనువిడిచిపెట్టెదనని సీతామహాదేవి రామునితోఁ జెప్పెను. ఇట్లనేకవిధములఁ దన్నువెడపెట్టక తోడ్కొనిపొమ్మని రాముని ననేకవిధములఁ బ్రార్థించె. అప్పుడుమహానుభావుఁడగు రాముఁడిట్లని తలంచె.

నేనేమిచేయుదును వనములోజనులెవ్వరును నుండరేఁ? ఈసీత మిగులసుకుమారమైన దేహముగలదే? అచ్చటదీని నెట్లుగాపాడుదునను నధిపాపముగలవాఁడనై యాసీతను వనమునకుఁ బిలుచుకొనిపోవుటకుఁ గొంచెమైనను సమ్మతిలేనివాఁడనయ్యె. అంత సీతాదేవి, తన్నడవికిబిలుచుకొనిపోవుటకు సమాధానములేని ప్రాణనాథుఁడైన రాముని మాటనువిని దుఃఖమునుబట్టజాలక కండ్లనుండినీళ్లు ధారధారగ ప్రవహింపగ వెక్కివెక్కి యేడ్చుచుండె. ఆకన్నీటిచే భూమియంతయు దడుపబడియె. ఇట్లుమహావ్యసనమును బొందుచున్నదియును, నెఱ్ఱని పెదవులుగలదియును, నగుసీతను పట్టణమునందేనిలుపఁదలచి యనేకవిధముల సీతను నూరడించె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యిరువదితొమ్మిదవసర్గము ముగిసెను.

—* { సీతాదేవి తన్నడవికి బిలుచుకొనిపొమ్మని స్నేహముచే రామునిదూరుట. } *—

అట్టియెడ జనకమహారాజకుమార్తెయైన సీతాదేవిని రాముఁడనేకవిధముల నూరడించె. అట్లనేకవిధముల నూరడింపఁబడియును రామునితోఁగూడ నరణ్యమునకుఁబోఁదలచి పెనిమిటియగు రామునిఁజూచి యిట్లనియె.

మఱియు సీతాదేవి మిగులదుఃఖమును బొందియున్నది కావున విశాలమగుఱొమ్ముగల రామునిఁజూచి స్నేహముచేతనధికముగఁ గోపమునుజెంది తిరస్కారపూర్వకముగనిట్లనియె.

రాముఁడా! నీయందుసౌందర్యముమాత్రము గలదు. అందువలననిన్నుఁజూచి లోకులుభ్రమించుచున్నారేగాని నీయందుపౌరుషం బేమియులేదు. తండ్రియగుజనకమహారాజు, నీవిట్లున్నావని గాపాడనేరక భార్యనగునన్ను నిక్కడవదలిపోవుటవినెనేని నాయల్లుఁడుపురుషుఁడు గాఁడనియును, ఆడదానివలెనున్నాఁడనియును, పురుషవేషమును వేసికొని నన్ను మోసపుచ్చి నాకూతును వివాహమాడెననియును దప్పకతలఁచును. రాముఁడా! నీవునన్నువదలి యరణ్యమునకుఁబోతివేని జనులందఱునుజూచి భార్యనువదలిపెట్టిపోయిన రామునియందు సూర్యునియందువలెఁ

ప్రసిద్ధమగు తేజస్సు లేదని నీయందు లేని నిందను గల్పింతురు. మఱియును రాముఁడు పురుషునివలె నుండలేదని యెంతురు. అందుకుమన మేమి సేయుదము. రాముఁడా! నీవుమనస్సునందేమి తలంచుకొని యిట్లువ్యసనమును జెందుచున్నావు? మఱియును మహాశూరుఁడవగు నీకు దేనివలన భయము గలిగియున్నది? నాకునీవేగతి. నీవుతప్ప వేఱేగతిలేదు? ఇటువంటి నన్నువిడిచిపోవుట కిచ్ఛయించుచున్నావు. ఇట్లుసేయుటతగునా? మిగులఁ బరాక్రమవంతుఁడవైనయో రామా! సావిత్రియను నంగనామణి పాతివ్రత్యముచేత ద్యుమత్సేనుని పుత్రుఁడైన, పెనిమిటియగు సత్యవంతుని నాశ్రయించి యమధర్మరాజునొద్దకుఁ బోయిన విధముగ నేనుఁగూడ నిన్నువదలక నీతోఁగూడ నరణ్యమునకు వచ్చెదనని యెఱుఁగవలయును. పాపరహితుఁడవైన రామా! కులనాశము కొఱకుఁబుట్టిన దుష్టస్త్రీవలె నేనెప్పటికిని మనస్సునందుఁగూడ నిన్నుఁదప్ప నితరులను జూచుదానను గాను. కాఁబట్టినీతోఁగూడ వనమునకు వత్తునుగాని నిన్నువిడిచి యొకనిమిషమైననుండఁజాలను. రాముఁడా! నూతనమగు యౌవనము గలదానను. పతివ్రతను. భార్యనునగు నన్నునీవు, "లోకములోఁ దనభార్యను నితరులకిచ్చి జీవించునట్లువలె,, నితరులకు నివ్వఁగోరుచున్నావు. పాపరహితుఁడా! రామా! నీవుయేనికిఁ బ్రియముగ నడువుమని నాతోఁజెప్పుచున్నావో? మఱియును నెవనికిఁ బట్టాభిషేకము జరుగఁగోరి నీవుతండ్రియగు దశరథమహారాజుచే నిగ్రహింపఁబడితివో? యటువంటి భరతునకు సర్వకాలములయందును వశ్యుఁడవై యతండాజ్ఞాపించునట్టిపనులను నీవుజేయుచు నుండుము. నేనునిన్నను సరించెదను. కావున నన్నుమాత్రము భరతునకుఁ బరిచర్యలను జేయుచుండుమనిచెప్పుట సరికాదు. మఱియును సకలశాస్త్రములను గుర్తెఱిఁగిన నీవునన్ను నిక్కడవదలి వనమునకుఁ బోఁగూడదు. నీవుతపోవంతుడుగ నుండినను, వనముల యందుండినను, స్వర్గము నందుండినను నేను నీతోఁగూడ నుండవలసిన దాననేగాని నీవులేక నేనేమియు చేయఁగూడదు. నేనునీవెంటనంటి వచ్చునపుడు వనములెంత భయంకరములైనను, "నుద్యాన వనములయందు సంచరించు విధముగ,, నిర్భయురాలనై యుందును. మఱియు నరణ్యములయందుఁ బర్యటించు నప్పుడుగూడ నీయొద్ద నుండుటచేతఁ బాన్పునందుఁబరుండు విధముగానే తలఁతునుగాని వేరువిధముగాఁ దలఁపను. మఱియు నెంతమాత్రమును నలసటను బొందను. మఱియునో రామా! మార్గములోనున్న దర్భమొక్కలును, ఱెల్లుదుంపలును, ముండ్లదుబ్బులును, ముండ్లచెట్లును నీసమీపమునందున్న నాకు దూదివలెను, జింకతోలువలెను స్పృశించుటకు మృదువుగాను సుఖముగా నుండునుగాని కఠినములుగా నుండవు. ఓప్రాణనాథా! రామా! వనములయందు గొప్పగాలి వలన బుట్టునట్టి దుమ్ము నాకపకారమును జేయఁజాలదు. కావున నేనాదుమ్మును మిగులశ్రేష్ఠమైన చందనమునుగాఁ దలంచుకొనెదను. వనవాసమును జేయగోరురామా! నాకు, వనములయందు లేతపచ్చికలు మొలిచియుండు నేలమీఁదఁ నీతోఁగూడఁ బరుండుటకంటె నీచిత్రకంబళములతోను జైఁబఱచెడు వస్త్రములతోడను గూడినశయ్యలయందిక్కడఁ బరుండుటవలనఁ గలిగెడు సుఖమధికముగాదు. ఇచ్చటయుండుట నాకుసుఖముగాఁ దోఁచదు. అరణ్యమునందు నీవుపత్రమూల ఫలాదులలో దేనినిస్వల్పముగా నిచ్చినను "దానినమృత,, రసమువలెదలఁచి యధికానందమును బొందుదును. నేనరణ్యములయందు ఆయాఋతువులయందుద్భవించెడి పువ్వులను ధరించి ఫలములను భుజించుచు సుఖముగానుందును. నేనునాతల్లిదండ్రులను దలఁచుకొని వ్యసనమును బొందను. నీవునన్ను నరణ్యమునకుఁ గొనిపోయిన పిమ్మట నీకునావలనఁ గొంచెమైనను గష్టము గలుగనివ్వను. కావున నన్నురక్షించుటయందు నీకేమియును గష్టములేదు. కాఁబట్టి నన్నుబిలుచుకొనిపొమ్ము. రాముఁడా! నీతోడగూడ నుండడమే నాకుస్వర్గము. నిన్నువిడనాడి యుండుటయే నాకునరకము. నీయందిట్టియధికమైన ప్రీతిగలనన్నును బిలుచుకొనిపొమ్ము. ఇట్లనేకవిధముల బలుకుచున్న నామాటలను వినక నీతోఁగూడ వచ్చుటకు నిశ్చయించుకొనియున్న నన్నుఁ దోడ్కొనక యే వనమునకుఁ బోతివేని నేనంతమాత్రమును శత్రువులగు భరతుడు మొదలగు వారివద్ద నుండనేరను. ఇప్పుడు నీయెదుట నీవుచూచుచుండఁగానే విషమును ద్రాగి ప్రాణములను వదలెదను. ప్రాణనాథా! రామా! అట్లుగాక యిప్పుడు నేనుచావకపోయినను నీవ్రదండకారణ్యమునకుఁ బోయినపిమ్మటనైనను మరణమును బొందుదును. కావున నట్టిదుఃఖము రాకమునుపే (అనఁగా నీవునన్ను విడిచిపోకమునుపే) ప్రాణత్యాగమును జేసికొనుట మంచిదని తలఁచెదను. ఈభర్తృవియోగ దుఃఖమును క్షణమాత్రముగూడ సహింపఁజాలను. ఇట్టినేనుభర్తనువదలి, పదియును, అందుపైన మూడును, ఆపైననొకటియును, ఇవన్నియుగూడి పదునాలు గగుచున్నది. కదా? ఈపదునాలుగు సంవత్సరములును, ఎట్లుసహింపఁ గలననియో.

ఇట్లనేకవిధముల సీతాదేవి మిగుల కరుణ గలుగునట్లు

విలాపవచనములనుబల్కి మిక్కిలి ఆయాసమునొంది మహాదుఃఖముతో విలపించుచు పెనిమిటియగు శ్రీరాముని గట్టిగా కౌగలించుకొని కంటినుండి నీళ్లు ప్రవాహమువలె ప్రవహింపగ బ్రతిధ్వనిగలుగునట్లు హోరుమని వేడ్వదొడంగె. మఱియు నా సీతాదేవి, శ్రీరాముఁడు చెప్పినకర్ణకఠోరములైన మాటలనువిని విషముపూయబడిన బాణముచే గొట్టఁబడి రోదనముజేసెడి యాడయేనుఁగువలెఁ దాళఁజాలనిదై యధిపలకెన్నఁడును నశుభశంక చేవదలని కన్నీళ్లనువిడిచె. అప్పుడా సీతాదేవి నేత్రములనుండి కన్నీరుధారధారగా బ్రవహించుచుండుటచే గన్నులయందలి కాటుక యంతయునుబోయె. అందువలన స్ఫటికములవలె నిర్మలములై బయలు వెడలుచున్న కన్నీటిబిందువులు కమలములనుండి యుదకబిందువులు జారుచున్నవిధముగ జారుచుండె. మఱియు నిర్మలమైన చంద్రబింబమువలెఁ బ్రకాశించుచున్నదియును, విశాలములైన నేత్రములుగలదియును, పద్మమువంటి ముఖముగలదియును, నగుసీతాదేవియొక్క ముఖమునందు కన్నీరుకమ్ముకొని యుండుటచే నుదకమునుండి బయలునకుఁ దీసినపద్మమువలె వాడినవర్ణము గలదయ్యె. అట్లుమహా దుఃఖమునుబొంది మూర్ఛను బొందిన దానివలెఁ గ్రిందఁబడిన సీతాదేవిని రాముఁడు బాహువులచే గౌగలించుకొని తిన్నని మాటలచే నూరార్చుచు నిట్లనియె.

నా ప్రాణనాయకీ! సీతా! నీవుదుఃఖమును బొందకుము. నీకుదుఃఖమును గలిగించునట్టిది స్వర్గమైనను నాకక్కఱలేదు. సమస్తలోకములను సృజించి ఆయుఃపరిమాణాదులను వ్రాయునట్టి బ్రహ్మదేవునకు ఎచటను భయములేనట్లు నాకెందును భయములేదు. నేను దేనివలనను భయమునుబొందువాఁడనుగాను. సుందరమైన ముఖముగలదానా! సీతా! నేనునిన్ను నరణ్యమునందు రక్షించుటకు సామర్థ్యము గలవాఁడనైనను, నీమనసునందలి యభిప్రాయము నంతయు దెలిసికొనక యింతవఱకు నీవు నాతోఁగూడ నరణ్యంబునకు వచ్చుటకు సమ్మతిలేనివాఁడుగనుంటిని. ఓసీతా! నీవునాతోఁగూడ యరణ్యమునందుండ దలయునని నిశ్చయించియున్నావు? కావున నెట్టికష్టకాలము నందైనను ధైర్యమును వదలనివాఁడు కీర్తినివిడిచిపెట్టినట్లు నేనునిన్నింకమీఁద విడుచుటలేదు. ఏనుఁగుతొండము వంటితొడలు గలదానా! సీతా! పెనిమిటి యేస్థలమునకుఁ బోయినను భార్యకూడా బోవలయునని నీవు ధర్మముగఁజెప్పితివి. అధర్మము పెద్దలచే నాచరింపఁబడిన దేగాని యన్యముగాదు. తొల్లిసువర్చలయనునది సర్వకాలములయందును సూర్యుని ననుసరించియుండెను. అటుల నేనీవును నాతోఁగూడ నరణ్యమునకురమ్ము. నేను పెద్దల ధర్మంబు ననుసరించి నిన్నడవికి దీసుకొని పోయెదను. సీతా! నేనుమా తండ్రియగు దశరథునిమాటను చెల్లించెదనని చెప్పిన సత్యమును, తండ్రియగుదశరథు నాజ్ఞయు నన్నడవికిఁదీసుకొని పోవుచున్నవి. కావున నేను గొంచెము సేపైనను నిచ్చటనుండను. ముఖ్యముగ నిప్పుడె యరణ్యమునకుఁ బోయెదను. సుందరమగు పిరుదులు గలదానా! సీతా! తల్లిదండ్రులకు వశ్యుఁడుగా నుండుటకంటె వేఱు ధర్మంబు లెవ్వియు నక్కఱలేదు. కావున నిట్టిధర్మమును వదలి జీవించియుండుట నాకిష్టముగాదు. "శ్లో॥ అస్వాధీనం కథం దైవం ప్రకారైరభిరాధ్యతే। స్వాధీనం సమతిక్రమ్య మాతరం పితరం గురుం,, తనకాజ్ఞలు మొదలగు వానినిజేసి తానుజేసిన మంచికార్యములకు తత్క్షణమున సంతోషము నొందునట్టి తల్లి, తండ్రి, గురువు, అనుదేవతలను వదలిపెట్టి మననేత్రముల కగపడకగోపమునుగాని సంతోషము మొదలగువాటినిగాని మనకుదెలియ జేయుటకు శక్యములేని దేవతల నెవ్విధముగ నారాధింపవచ్చును. సుందరములగు క్రీగన్నులుగలదానా! సీతా! తల్లి, తండ్రి, గురువు, అనునీముగ్గురును, మూఁడులోకములు. కాబట్టి వీరల పూజించినవాఁడు నిరాటంకముగ మూఁడులోకములను జయించును. కావునవీరలకంటె పరమమైన దైవమెందునులేదు. అందువలన నేనువారలను సర్వకాలములయందును సేవించెదను. సీతా! తండ్రికి శుశ్రూషజేయుట, పరలోకమునకు బలమునుగల్పించి హితమును జేయునట్టి సత్యములనైనను, దానమానములనైనను, సంపూర్ణదక్షిణతోఁ జేయునట్టి యజ్ఞములనైనను బరలోకమునకు బలమును గలిగించువానిగాఁ దలఁచుటయుచితముగాదు. "శ్లో॥ స్వర్గోధనం వా ధాన్యం వా విద్యాః పుత్రాస్సుఖానిచ। గురువృత్త్యనురోధేన నకించి దపిదుర్లభమ్॥ స్వర్గము, ధనము, ధాన్యము, విద్య, పుత్రుఁడు, సుఖము, మొదలగునవి యన్నియును దల్లిదండ్రులకు శుశ్రూషను జేయువానికి సిద్ధించును. కావునఁ బితృశుశ్రూషతో సమానమైనవి యేవియును లేవనితెలియంగ వలయును "శ్లో॥ దేవగంధర్వగోలోకాన్ బ్రహ్మలోకం తథాపరాన్। ప్రాప్నువంతి మహాత్మానో మాతాపితృపరాయణాః॥ మాతాపితృవులకు విడువకశుశ్రూషను జేయుచుండు మహానుభావులు దేవగంధర్వ గోలోకాది లోకములను బొందుదురనుట కించుకయును సందేహములేదు. మఱియును మాతాపితృవులను బరమభక్తితో సేవించువాఁడు బ్రహ్మ

లోకమునుగూడఁ బొందును. కావునసకలలోక సుఖములకును గారణుండైన నాతండ్రినాకేమి యాజ్ఞ నిచ్చుచున్నాఁడో నేనాప్రకారముగ నడుచుకొనుట కిచ్ఛయించుచున్నాను. అట్లుతండ్రియాజ్ఞానుసారముగసంచరించుట సనాతనధర్మము. కావున నేనవశ్యముగఁ దండ్రిచెప్పినట్లు సంచరించెదను.

సీతా! నాకింతవఱకును నిన్నుదండకారణ్యమునకుఁ బిలుచుకొనిపోవచ్చునని తోఁచలేదు. నీవుపతివ్రతవగుటచేత నేనరణ్యములోనేయుండెదనని నాతోఁగూడనరణ్యమునకువచ్చుటకు దృఢముగ నిశ్చయించుకొని యున్నావు. ఇప్పుడు నీయభిప్రాయము చక్కఁగఁదెలిసినది. కావుననిన్నుఁ దోడ్కొనిపోయెదను. మదిరేక్షణురాలా! సీతా! నీవరణ్యము నందుండుటకుఁగానే యిటువంటి మిగులసుకుమారములైన యవయవములతోఁ బుట్టినావుకాఁబోలు. నీవుభయమునుబొందునట్టి గుణముగలదానవైనను, నాతోఁగూడవచ్చుటకు నిశ్చయించుకొనియున్నావు. కావుననాతోఁగూడరమ్ము. నీకేమియునుభయముగలుగదు. నాతోఁగూడవచ్చి యరణ్యమునందే ధర్మములనాచరింపవచ్చును. ప్రాణనాయకీ! సీతా! నీకిప్పుడు పెనిమిటితోఁగూడఁబోవలయునని యభిప్రాయముగలిగియున్నది. ఇదినీకులమునకును నాకులమునకును గీర్తినిగలిగింప దగినయాచారమైయున్నది. అదియునుఁగాక యెల్లవారిచేతనుగొనియాడఁదగియున్నది. చక్కనిపిరుదులుగలదానా! సీతా! నీవిఁకమీఁదట వనవాసమునకుఁ దగినకార్యములను జేయుము. ఇఁకనీవులేకపోయినయెడల నాకుస్వర్గమునందుఁగూడనుండుటకు నిష్టములేదు. బ్రాహ్మణులకు ననేకవిధములగురత్నములనిమ్ము. మఱియునెవ్వరెవ్వరు దేనిదేనినియాచింతురో దానినంతయును వారలకిమ్ము. ఆలస్యముసేయకుము. పునఃశీఘ్రముగరమ్ము. ఆప్రకారముగ బ్రాహ్మణులకు దానముసేసినపిమ్మట మిక్కిలివెలగలనగలను, నుత్తమములైన వస్త్రములను, మఱియును రమణీయములును, గ్రీడించుటకు నుపయోగకరములునునయిన కొంటమొట్లను, పాన్పులును, వాహనములును, నావియునియును, నీవియునియును భేదమెంచకసర్వమును మనపనివాండ్రకిమ్మని రాముఁడు సీతతోఁజెప్పెను.

అంతసీతాదేవి, తానుగూడయరణ్యమునకువచ్చుటకుఁ దనపెనిమిటియగు రాముఁడుసమ్మతించెనని తెలిసికొనినతోడనే మహానందమునుబొందెను. పిమ్మటఁబెనిమిటిచెప్పినవిధముగ దానములనుజేయనారంభించెను. అంతటమిగుల గొప్పకీర్తిగలదియును, చక్కనిమనస్సు గలదియునునగుసీతాదేవి, రాముఁడుచెప్పినమాటనువిని మిగులనానందమునుబొందెను. మనంబునభిన్నముగ నాలోచననుజేయక ధార్మికులగువారలకు ధనములను రత్నములను నిచ్చువచ్చినట్లిచ్చుటకు బ్రారంభించెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదవసర్గముగిసెను.

—* { లక్ష్మణుడు తానుగూడ యరణ్యమునకు వచ్చెదనని రామునితోఁజెప్పుట. } *—

ఆప్రదేశమునకు రామునితోఁగూడవచ్చియుండిన మహాకీర్తిమంతుఁడగు లక్ష్మణుఁడదివఱకు సీతారాములకుజరిగినసంవాదమునువిని యిట్లనియోచించె. ఆహా, రాముఁడు తనదేహములోసగమైన సీతకూడవచ్చుటకు ననేకవిధప్రయత్నములచేత మిగులఁగష్టముగా నంగీకరించినాఁడే! ఇట్టిరాముఁడు నావిషయములోనంగీకరించునో, యంగీకరింపఁడో, యనిభయపడి కన్నులనీరుగారఁగా దుఃఖమునుబట్టఁజాలక విలపించుచుయున్నయగు రామునివద్దకుబోయి రామునిపాదములను గట్టిగాఁబట్టుకొని సీతారాములను జూచియిట్లనియె.

అన్నా! రామా! దుష్టమృగములును, ఏనుఁగులునుమెండుగనుండునట్టి వనమునకుఁబోవలసినదేయని నిశ్చయింతువేని నేనుమీకిరువురకునుముందుగ ధనుర్ధారినై నడచెదను. నీవునాచే సేవింపఁబడుచుఁ బక్షులును, మృగసమూహములును, కలకలధ్వనినిజేయుచుండఁగా మనోహరములైయుండునట్టి యనేకయడవులయందు దిరుగుము. రామా! నిన్నువదలినపిమ్మట నాకుదేవలోకముయొక్క స్వాధీనమైనను, దేవత్వముదొరికినను, సర్వలోకైశ్వర్యములులభించినను నాకక్కఱలేదని లక్ష్మణుఁడుసెప్పె. ఇట్లుసుమిత్రాదేవిపుత్రుఁడగు లక్ష్మణుఁడు రామునితోగూడ వనవాసమునుజేయుటకు నిశ్చయించుకొనెను. అపుడురాముఁడనేకములగు మృదువైనమాటలచే నతనినిరావలదనివారించెను. అంతలక్ష్మణుఁడురామునింజూచి మరలనిట్లనియె.

అన్నా! రామా! పూర్వమేనేను సీతోఁగూడ వనమునకువచ్చుటకు సమ్మతించితివి. అట్టినీవిపుడు నన్నువనమునకు రాకూడదనిచెప్పుచున్నావు. ఇదియేమి? పాపరహితుఁడా! రామా! నేనునీతోఁగూడ వనమునకువచ్చుట కపేక్షించియుండఁగా రాకూడదనిచెప్పుచున్నావు. అదెందుకు? నాకుసంశయముగలిగియున్నది. కారణముతెలుపుమని లక్ష్మణుఁడుపలికె. అంతమిగులఁ బరాక్రమవంతుఁడగురాముఁడు తనముందరయంజలీబద్ధుఁడై నేనరణ్యమున

కువచ్చెదను, నేనరణ్యమునకువచ్చెదనని,, ప్రార్థించుచుని లుచుకొనియున్నవాఁడును, ఎట్టికష్టదశవచ్చినను భయమునుబొందనివాఁడును, నగులక్ష్మణునింజూచి యిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! నీవుమిగులనుత్తమమైన మనస్సుగలవాఁడవు. పరమధార్మికుఁడవు. అదియునుఁగాకమహాపరాక్రమశాలివి. సర్వకాలములయందును సన్మార్గమునందుప్రవర్తించువాఁడవు. మఱియునునాకుఁయిష్టుఁడవు. ప్రాణతుల్యుఁడవు. వశ్యుఁడవు. అదియునుఁగాకతమ్ముఁడవు. ఇంతియగాకస్నేహితుఁడవు. కావున, నీవరణ్యమునకుఁ నాతోఁగూడవచ్చితివేని నాకుసౌఖ్యముగలుగునుటకుఁ గొంచెమైననుసందియములేదు. లక్ష్మణా! ఇప్పుడునీవు నాతోఁగూడవత్తువేని పిమ్మటఁగౌసల్యాసుమిత్రలనెవ్వరుపోషింతురు? వారియిద్దరునుదిక్కులేనివారై మరణమునుబొందుదురు. కావునవారలఁబోషించుటకుఁగా నీవు రావలదనిచెప్పుచున్నాను. భూమిమీఁదదేవేంద్రుఁడు వర్షమువర్షించువిధముగఁ దనవారలఁగోరికలనన్నింటిని దీర్చునట్టి సామర్థ్యముగల దశరథమహారాజిప్పుడు కైకేయివలలోఁబడి కామపాశమునందుఁ దగులుకొనియున్నాఁడు. అశ్వపతియగు కేకయమహారాజుయొక్క పుత్రికయైనకైకేయి యీరాజ్యమును సర్వమునుబొందినపిమ్మటఁ బుత్రవియోగముచేత దుఃఖమునుబొందుచున్న తనసవతులనుమఱింతయధికముగ దుఃఖపెట్టును. మఱియును వారలకేమియును మేలునుజేయదు. భరతుఁడు రాజ్యమునుబొందిన పిమ్మట మహాగర్వముగలవాఁడగును. అదియునుఁగాక కైకేయీయాజ్ఞాప్రకారము జరుగవలసినవాఁడైయుండును. కావునఁబుత్రవియోగముచే దుఃఖమునుబొందుచున్న కౌసల్యాసుమిత్రలనుగుఱించి కొంచెమైనను యోచింపఁడు. మనస్సునందు తలవనుగూడఁదలవఁడు. కాఁబట్టిలక్ష్మణా! నీవిక్కడనేయుండి దశరథమహారాజు దయనుసంపాదించికొనియైనను లేకస్వంతముగానైనను పూజ్యులైనకౌసల్యాసుమిత్రలను బోషించుచుండుము. కావుననాకుబదులుచెప్పక నేనుజెప్పినట్లునడుచుకొనుము. లక్ష్మణా! నీవుసకలధర్మములను జక్కగానెఱిఁగినవాఁడవు; నీవునేనుచెప్పినట్లుచేయుదువేని నాయందువిశేషభక్తిగలవాఁడవని తలంతును. మఱియును దల్లినిబూజించుటవలన పరమమైనధర్మమును బొందుదువు. లక్ష్మణా! నీకుగలధర్మబుద్ధినిజూచి మనకులమునందుఁ బుట్టినవారందఱును మహాసంతోషమునుబొందుదురు. కావుననాకొఱకు నేనుజెప్పినట్లుచేయుము. మనముఉభయులము లేకున్నయెడల మనతల్లికిగొంచెమైనను సుఖముగలుగదనిచెప్పె. అనియిట్లురాముఁడుచెప్పగానే మాటలాడనేర్చినలక్ష్మణుండు రామునింజూచిమఱల నిట్లనియె.

అన్నా! రామా! నీవుమిగులఁ బరాక్రమముగలవాఁడవు. నీయొక్కబలపరాక్రమమునకుభయపడిభరతుఁడుకౌసల్యాదేవిని, సుమిత్రాదేవిని, మిగులశ్రద్ధతోఁబూజించుచుండును. ఈవిషయమునందుఁ గొంచెమైనను సందేహము లేదు. ఇంతియగాక యింకనుజెప్పెదను. వినుము. కౌసల్యనునితరులుపోషింపవలయునా? ఇదివఱకాకౌసల్యాదేవిని నాశ్రయించియుండువారే ఆమెయనుగ్రహమువలన ననేకవేలగ్రామములను బొందియున్నారు. మఱియునాకౌసల్యాదేవి నావంటివారల ననేకులఁగాపాడఁగలదు. కావునమిగులఁ గీర్తివంతురాలగు కౌసల్యాదేవి, తన్ను, నాతల్లియగుసుమిత్రాదేవిని, మఱియునావంటివారల ననేకులను గాపాడుకొనఁగలదు. కావుననీవువారివిషయమగు సందేహమునుమాని నన్నునీకుఁబరిచారకునిగాఁ జేసికొనుము. ఇవ్విధముగఁజేయుటవలన ధర్మలోపంబేమియునుగలుగదు. నీవిట్లుచేయుటవలన నేనుగూడఁగృతార్థుఁడనగుదును. నన్నుసేవకునిగాగ్రహించితివేని నీకునుగొంచెము ప్రయోజనముగలుగును. నేనుధనుస్సును, బాణములను, ధరించిగుద్దలిని, గంపను, దీసికొనినీకంటెముందుగ త్రోవనుజూపుచుఁబోయెదను. ఇంతియగాక నేనునీకుసర్వకాలములయందును, కందమూలఫలములను దీసికొనివచ్చినీకిచ్చుచుందును. మఱియునింకను మునులుభక్షించు పదార్థములనుగొని వచ్చియిచ్చెదను. నీవును, సీతయును, కొండచరియలయందుఁ వినోదముగక్రీడింపుచుండవచ్చును. నేనునీవుమేలుకొనియుండుసమయమునందును, నిదురనుజెందియుండుసమయమునందును, సకలకార్యములను జేయుచుండెదనని చెప్పె. అనియిట్లు లక్ష్మణుఁడుచెప్పగానే రాముఁడు మిగులసంతోషమునుబొంది లక్ష్మణునింజూచిమఱలనిట్లనియె.

లక్ష్మణా! నీకిట్టియభిప్రాయముగలదేనినీవిప్పుడెపోయి నీస్నేహితులకందఱకునుపోయివచ్చెదనని జెప్పిరమ్ము. లక్ష్మణా! జనకచక్రవర్తియొక్క యాగమునందు మహానుభావుఁడగువరుణదేవుఁడు మిగులఁబ్రియముచేత మనకిచ్చినవియును, మిగులశ్రేష్ఠములైనవియును, చూచువారలకధికముగ భయమునుగలుగఁజేయునవియును, నగుధనుస్సులను, దివ్యములయినవియును, భేదింపకూడనివియును, నగుకవచములను, సర్వకాలములయందును నెన్నిబాణములనుదీసినను దరగకుండెడిఅక్షయతూణీరములను, బంగారముచేశృంగారింపఁబడి సూర్యునివలెఁ బ్రకాశించుచున్న ఖడ్గ

ములును, మొదలగువాని నన్నింటిని మనకులగురువగు వసిష్ఠమహామునియొక్క గృహంబున నునిచియున్నాను. నీవు పోయివాని నన్నింటిని నతిశీఘ్రముగఁ దీసికొనిరమ్మనియె. అనియిట్లు రాముఁడుచెప్పిన లక్ష్మణుఁడు పరమసంతోషము గలవాఁడై యరణ్యమునందుండుటకు నిశ్చయించి మిత్రులసమీపమునకుబోయి వారలతోఁజెప్పి యిక్ష్వాకు వంశమునకు కులగురువైన వసిష్ఠమహాముని యింటియందుండెడు శ్రేష్ఠములైన యాయుధములను దీసికొనివచ్చె. అట్లుదీసికొనివచ్చి లక్ష్మణుఁడు స్వర్గలోకమునందుఁ బుట్టినవియును, సర్వోత్తములగు రాజులచేతఁ బూజింపఁబడినవియును, పుష్పమాలికలచేత నలంకరింపఁ బడినవియును, నగువాయుధములను రామునకుఁజూపె. అప్పుడుమిగుల ధైర్యవంతుఁడగు రాముఁడు లక్ష్మణుఁడుదెచ్చినసమస్తాయుధములను దీసికొని పరమానందంబునుబొంది మరలలక్ష్మణునితో నిట్లనియె.

సౌమ్యస్వభావముగల లక్ష్మణా! నేనునీకొఱకెదురు చూచుచుండునట్టి తగినసమయమునందే వచ్చితివి. శత్రువుల దపింపఁ జేయువాఁడా! లక్ష్మణా! నేనుసీతతోఁగూడ నాయొక్కధనమును సర్వమును దపోవంతులకును బ్రాహ్మణులకును నివ్వవలయునని గోరుచున్నాను. కావుననిక్కడనుండువారలలో దృఢమైన గురుభక్తిగలవారును, మహానుభావులును నగుబ్రాహ్మణులకును, మఱియునన్నాశ్రయించియుండువారలకును ముందిచ్చిన దానికంటెనిపుడు విశేషముగ దానమును జేయఁ గోరుచున్నాను. నీవిప్పుడతి శీఘ్రముగఁబోయి బ్రాహ్మణోత్తముఁడును, వసిష్ఠమహామునికిబుత్రుఁడును నైన సుయజ్ఞుని మిగుల శీఘ్రముగఁ బిలుచుకొనిరమ్ము. నేనావసిష్ఠమహర్షి బుత్రుఁడగు సుయజ్ఞుని, మఱియు నితరులయిన బ్రాహ్మణులనుబూజించి నరణ్యమునకుఁ బోవెదనని రాముఁడు సెప్పెను.

ఇట్లు శ్రీమదయోధ్యా కాండమునందలి ముప్పదొకటవ సర్గము ముగిసెను.

సీతారామలక్ష్మణులు తమ ద్రవ్యమునంతయు దానము జేయుట.

అనియిట్లు అన్నయగు రాముఁడు చెప్పిన మిగులశుభమైనదియును, నిష్టమైనదియును నగునాజ్ఞనుబొంది లక్ష్మణుఁడు, సుయజ్ఞునిగృహమునకుఁ బోయెను. మఱియువా లక్ష్మణుఁ డగ్నిహోత్ర గృహమునందున్న సుయజ్ఞునిజూచి నమస్కారముజేసి యిట్లనియె.

స్నేహితుఁడా! సుయజ్ఞా! రాముఁడు వనవాసమును జేయఁబోవుచున్నాఁడు. కావుననీవిప్పు డతనిగృహమునకు వచ్చి యతిదుర్లభమగు రామునికార్యమును జూడుమనిచెప్పెను. అంతనా సుయజ్ఞుఁడు సంధ్యోపాసనను జేసి యథోక్తమైన సంపదగలవియును, మిగుల మనోహరమైనదియును, నగు రాముని గృహమునందు లక్ష్మణునితోఁగూడ బ్రవేశించె. అట్లువచ్చి జ్వలింపుచుండెడి యగ్నిహోత్రమువలెఁ బ్రకాశించుచుండు వేదవేత్తయైన సుయజ్ఞునకు రాముఁడు నమస్కారమునుజేసి సీతతోఁగూడ నాసుయజ్ఞునకుఁ బ్రదక్షిణమును జేసె. అట్లుప్రదక్షిణముజేసి రాముఁడు, సర్వోత్తమములైన బాహుపురులును, మణులచేఁ జెక్కఁబడిన బాహుపురులును, మనోజ్ఞములైన కుండలములను. సువర్ణముచేత నిర్మింపఁబడిన మణిమాలికలును, కంకణములును, నింకననేక విధమణులను సుయజ్ఞునకిచ్చెను. పిమ్మట నారాముఁడు సీతచేఁ బ్రేరేపింపఁబడి సుయజ్ఞునితో నిట్లనియె.

సౌమ్యుఁడా! సుయజ్ఞా! నాభార్యయగుసీత, యీసమయమునందు నీభార్యకు ముత్యాలహారమును, సువర్ణమయమగు కంఠసూత్రమును, బంగారుమొలనూలును, నివ్వఁదలఁచియున్నది. కావున నీభూషణములను దీసికొని పోయి నీభార్యకివ్వుము. మిత్రుఁడా! విచిత్రములగు నంగదములను, శుభములగు కేయూరములను, నీసీతనీభార్యకిచ్చినపిమ్మట వనమునకునాతోఁగూడ రావలయునని యపేక్షించుచున్నది. ఇంతియగాక సర్వోత్తమమగు నాస్తరణముగలిగి నానావిధములగు రత్నములచే నలంకరింపఁబడిన మంచమునుగూడ నీసీతనీకివ్వవలయునని కోరుచున్నది. తీసికొనుము. ఇంతయగాక నా మేనమామనాకిచ్చినశత్రుంజయమను పేరుగల యేనుఁగనొకటికలదు. దానితోఁగూడనింకను వేయియేనుఁగులను నీకిచ్చెదనని జెప్పె. అనియిట్లు రాముడు చెప్పగానే సుయజ్ఞుఁడు రాముని మాటలను విని వానినన్నింటిని దీసికొని రామునకును సీతకును, లక్ష్మణునకును మంగళాశీర్వచనములం జేసె. అంతటఁబ్రియముగ మాటలాడువాఁడును, మిగుల జాగ్రతగలవాఁడును, బ్రియుఁడును, దమ్ముఁడునునగు లక్ష్మణునిఁజూచి బ్రహ్మదేవుఁడు దేవేన్ద్రున కాజ్ఞ జేయునట్లు,, నిట్లనియాజ్ఞాపించె. లక్ష్మణా! నీవిప్పుడేపోయి యగస్త్య విశ్వామిత్రులను నిరువురబ్రాహ్మణోత్తములను బిలుచుకొనివచ్చి "పైరులను నీటచేతఁదృప్తిని బొందించిన విధముగ,, రత్నములచేతఁ బూజించి తృప్తినిబొందింపుము. మానదా! మహాబాహూఁడా! లక్ష్మణా! మఱియు ననేకవేల యావులను, అవారిగ వెండిబంగారమునునిచ్చి మిగులసంతోషము

గలుగునట్లు చేయుము. మఱియు నేబ్రాహ్మణుడు సర్వకాలములయందును, శ్రద్ధతో గౌసల్యాదేవి నాశీర్వదించుచుండునో, అట్టి తైత్తిరీయ శాఖం జదువువారలకు ఆచార్యుండును, పండితుడును, వేదములను చక్కగ దెలిసినవాడును, నైయుండునో యట్టి బ్రాహ్మణుడు తృప్తిని బొందునటుల వాహనములను, దాసదాసీజనములను, బట్టువస్త్రములను నిమ్ము. లక్ష్మణా! సారథియును, మనతండ్రియైన దశరథునకిష్టుడును నగు చిత్రరథుడను సారథి చిరకాలముగ మనయింటనున్నవాడు. కావున నీవీసారథికి నుత్తమములగు రత్నములను, వస్త్రములను, ధనములను, మఱియు ననేకములగు చిన్నపశువులను, వేయియావులను నిచ్చి సంతోషము గలుగునట్లు సేయుము. లక్ష్మణా! కఠశాఖను జదువువారును, గాలాపశాఖను జదువువారును, పలాశదండధారులును నగు బ్రహ్మచారులు మొదలగు వారందఱును సర్వకాలములయందును, వేదపారాయణను జేయుచుందురు. వారు వేదాధ్యయనమును జేయువారేగాని యెవ్విధమైన నితరకార్యములను జేయువారుగారు. వారట్టివారలయ్యును గొంచెము సోమరితనముగలవారు. మఱియు రుచ్యమైన యాహారమును గోరుచుందురు. పూజ్యులగు వారలుగూడ వారల సన్మానింపుచుందురు. కావున వారికిగూడ ఎనుబది బండ్ల రత్నములనిమ్ము. ఆబండ్లయందు సంపూర్ణముగ నానావిధరత్నములనుంచుము. ధాన్యమును మోయునట్టి యెద్దులను వేయింటినిమ్ము. దున్నుటకు దగిన సామర్థ్యముగల యెద్దులనిన్నూఱింటిని నిమ్ము. మఱియు లక్ష్మణా! వారు భోజనమును జేయుటకు బాలు, పెరుగు, నేయి, మొదలగు వానికొఱకు వేయిపశువులనిమ్ము. ఇంతయేగాక యనేకులగు బ్రహ్మచారులు గౌసల్యాదేవి నాశ్రయించి యున్నారు. కావున వారలలో బ్రతివానికిని వేయివేయి గోవుల వంతుననిమ్ము. లక్ష్మణా! మనకు తల్లియగు కౌసల్యాదేవి సంతోషించునట్లు నీవు సకలవిధములచేతను, నాబ్రాహ్మణుల నెల్లరిని బూజింపవలయుననియె, అనియిట్లు రాముండు చెప్పినపురుషశ్రేష్ఠుడగు లక్ష్మణుడు" కుబేరునివలె,, నాధనమును సర్వమును రాముడు చెప్పినవిధముగ దానే బహుశ్రద్ధతో బ్రాహ్మణోత్తములకిచ్చె, పిమ్మట రాముడు తనయెదుట గన్నీరు గారగ నేడ్చుచున్న పరిచారకులను జూచి వారందఱును సుఖముగా జీవించుటకొఱకు ఒక్కొకనికిని నధికముగ ధనమునిచ్చి యిట్లనియె.

భృత్యులారా! నేనును, లక్ష్మణుడును వచ్చువఱకును, నాయింటియందును, లక్ష్మణునియింటియందును, నెవ్వరును లేకుండునట్లు సేయక సర్వకాలములయందును గావలియుండుడు. మఱియును చక్కగ గాపాడుచుండుడని చెప్పి, ఇట్లు రాముడు వ్యసనమును బొందుచున్న పరిచారకులకు జెప్పి యాతట ధనాధికారులను జూచి ధనమును దీసికొనిరండియని యాజ్ఞాపించె. అంత నాపరిచారకులందఱును రాముని ధనమును సర్వమును దీసికొనివచ్చి యిచ్చిరి. ఆధనరాశియంతయును మిక్కిలియధికమైయుండుటచే జూచువారల కాశ్చర్యమును గలిగించుచుండె. అంత బురుషోత్తముడగు రాముడు లక్ష్మణునితోడంగూడి ధనమును సర్వమును దరిద్రులగు బ్రాహ్మణబాలురకును, ముసలివారలకును నిచ్చెను. ఇట్లు రాముడు తనధనమునంతయు దానము సేయుచుండె. అట్టికాలమునందా పట్టణసమీపమున పింగళవర్ణముగల త్రిజటుడను నొక బ్రాహ్మణోత్తముడు నివసింపుచుండెను. ఆత్రిజటుడు సర్వకాలములయందును, గొడ్డలిని, గుద్దలిని, దోటిని, ధరించి కందమూలఫలములను సంపాదించుకొని తనకుటుంబమును బోషించుకొనుచు జీవింపుచుండె. ఇట్లుండగ యౌవనవంతురాలగు నాబ్రాహ్మణుని భార్య రాముడు ధనమును దానము సేయుచుండు సమాచారమును విని దారిద్ర్యముచే బరితపించుచు బసివారలగు పుత్రులను బిలుచుకొని వృద్ధుడగు నాత్రిజటుని యొద్దకువచ్చి యిట్లనియె.

మునిశ్రేష్ఠుడా! ఇపుడు నీ చిన్న గొడ్డలిని, గుద్దలిని, నవతలబెట్టి ముందుగ నేను చెప్పెడిమాటలను వినుము. ధర్మజ్ఞుడగు రాముని కీ నీకుటుంబమును జూపింపుము. చూపితివేని యేదైనను గొంచెము ద్రవ్యమునిచ్చును. అతనితో నీయొక్క దారిద్ర్యమును సర్వమును జెప్పికొనుము. అనియిట్లు భార్య చెప్పిన నాత్రిజటుడు విని సంతోషమునొంది యత్యధికముగ జీర్ణమైయుండినదియును, కప్పుకొనుటకును పయోగింపనిదియును, నగు వస్త్రమును గప్పుకొని రామునియిల్లు వుండెడి దారినిబట్టిపోయె. ఇట్లుపోయి యాత్రిజటుడు జనసమూహమునందు తనబ్రహ్మవర్చస్సుచేత భృగ్వంగిరసులు ప్రకాశించినవిధముగ బ్రకాశించుచుండె. అట్టిమహానుభావుడగు నాత్రిజటుడు రాముని యంతఃపురములోనికి బోవునపుడు ఐదవతొట్టికట్టువఱకును ద్వారపాలకు లెవ్వరును నడ్డగింపరైరి. అట్లెవ్వరిచేతను నడ్డగింపబడనివాడై రామునియొద్దకుబోయి యిట్లనియె,

ఓ రాజపుత్రుడా! రామా! నేను పరమదరిద్రుడను. మఱియు ననేకపుత్రులుగలవాడను. ఉంఛవృత్తిచేత వనమునందు నిత్యమును జీవించుచుందును. కావున నాయందు గొంచెము కరుణగలవాడవై నన్ను జూడుము. అనియిట్లు

ఆత్రిజటుఁడు చెప్పిన రాముఁడువిని పరిహాసములగుమాటలఁజేసెనిట్లనియె.

బ్రాహ్మణోత్తమా! నేనొకవేయిగోవులనుగూడ నీకివ్వను. మఱియును నీవు నీచేతికఱ్ఱనువిసరివేయఁగా నెంతదూరముపోవునో యంతకంటె నధికదూరమునందుఁ డఁదగిన గోవులనిచ్చెదనని చెప్పెను. ఆమాటలనువిని యాత్రిజటుఁడు పరమానందమునుబొంది యతిత్వరితముగలవాఁడై తనచినిగినవస్త్రమును నడుమునఁగట్టుకొని యతివేగముగ నొకకఱ్ఱను గిరగిరఁద్రిప్పి తనబలముకొద్ది విసరివైచెను. అట్లుఆత్రిజటుఁడు విసరివేయఁగానే యాకఱ్ఱ సరయూనదియొక్క యావలిగట్టుననున్న యనేకవేలగోవులనుదాటి యచ్చోటనున్న యాబోతునొద్దఁబడె. ఆసమయమునందు ధర్మాత్ముఁడగు రాముఁడు త్రిజటునిఁజూచి కౌఁగలించుకొని సరయూనదిగట్టుననతనికఱ్ఱపడిన స్థలమునుండి యాగోవులనన్నిఁటిని గొల్లవాండ్రచేత నాత్రిజటునియొక్క యాశ్రమమునకుఁదోలించె. పిమ్మట రాముఁడు గర్గమహర్షి వంశమునందుబుట్టిన యాత్రిజటుని నూరడించుచు నిట్లనియె.

మునిశ్రేష్ఠుఁడా! నేను వేడుకార్థముగ నిట్లుపలికితిని కావునఁ గోపమును జేయకుము. మునికులోత్తమా! నీతేజస్సు మిగుల గొప్పదిగానుండుటనుజూచి యాతేజస్సును విశదముగాఁ దెలిసికొనఁదలఁచినవాఁడనై నేను నీతోఁగొయ్యను ద్రిప్పివైవుమని చెప్పితిని. ఇంతయగాని మఱియొకటిగాదు. నీకింకను నేమైనను గోరికగలదేని తెలుపుము. నీకోరికను దీర్చెదను. నేనీవిషయమును నిజముగా జెప్పుచున్నాను. నీవేమియును లజ్జనుబొందకుము. విశేషముగఁజెప్పనేల. నాకేమేమిధనముగలదో యాధనమును సర్వమునునిచ్చెదను. మఱియు నాధనమంతయును బ్రాహ్మణులనిమిత్తముగ సంపాదింపఁబడినదేగాని యన్యముగాదు. నాధనమంతయును మీవంటివారియందు వినియోగమయ్యెనేని నేను సంపాదించినందుకు సఫలమైనట్లుతలఁచెదను. ఇంతయగాక నాకుసంతోషమును గీర్తియునుగలుగునని రాముఁడు చెప్పెను. అంతటమునిశ్రేష్ఠుఁడగు నాత్రిజటుఁడును నతనిభార్యయును నయ్యావులందోలుకొని మిగులసంతోషమునొందినవారై మఱియు నితరములగుపదార్థములను గోరకయే మహానుభావుఁడగు రామునకుఁ గీర్తి, బల, సంతోష, సుఖములుగలుగునటుల నాశీర్వచనములను జేసిరి. అంతట నా రాముఁడు సంపూర్ణమైన మనోరథముగలవాఁడై వారివారికిఁ దగినవిధముగ గౌరవించి తానుధర్మమునుదప్పక తనపరాక్రమముచే నార్జించినధనమును సర్వమును స్నేహితులకిమ్మని యాజ్ఞాపించె. మఱియు నారాముఁ డయోధ్యాపట్టణమునందలి స్నేహితులు, బ్రాహ్మణులు, భృత్యులు, భిక్షమెత్తుకొని జీవించువారు, మొదలగువారలకును వారివారికి దగినవిధముగ గౌరవించి వారివారికిఁ దగినధనములను నిచ్చి తృప్తిబొందునట్లు జేసెను. ఆజనులందఱును బరమానందమును బొందిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదిరెండవసర్గముగిసెను.

※ జనులు దశరధ మహారాజును గైకేయిని నిందించుట. ※

ఆప్రకారము రామలక్ష్మణులు సీతతోఁగూడ బ్రాహ్మణులు మొదలగువారికి విశేషముగధనమునుయిచ్చిరి. పిదప యారామలక్ష్మణులు సీతనుఁగూడబిలుచుకొని తండ్రియగు దశరథమహారాజును జూచుటకుఁబోయిరి. మఱియు నారామలక్ష్మణులు నానావిధపుష్పసరములచే శృంగారింపఁబడిన యాయుధములను ధరించియుండిరి. ఆయాయుధములన్నియును సీతకుసమీపమునందుండుటచే నధికముగఁబ్రకాశించుచుండె. ఆసమయమునందు రామునిపట్టాభిషేక మహోత్సవమునుజూచుటకు శృంగారించుకొనియున్న జనసమూహమంతయును, సంతోషములేనివారై మిగులనాశ్చర్యమునుబొందుచు మిద్దెలమీదను, విమానశిఖరములమీదను నెక్కి యాసీతారామలక్ష్మణులను జూచుచుండిరి. నానావిధజనులచేత నిండియున్నవీధులయందు నడిచిపోవుటకు గొంచెమైనను మార్గములేకయుండె. అందువలన నేకులు మేడలమీద నెక్కి దీనులై యారామునిఁజూచుచుండిరి. పాదచారియును, ఛత్రచామరాది చిహ్నములు లేనివాఁడును, నగురామునిజూచి జనులందఱును దుఃఖపూరితచిత్తములుగలవారై యనేకవిధములవిలపించుచుతమలోఁదాము మాటలాడుకొనుచుండిరి. ఇదివఱకు రాముఁడు బయలువెడలెనేని చతురంగబలములును నతనివెంటనంటివచ్చుచుండును. అట్టిరాముఁడిప్పుడొంటరిగఁ బాదచారియై సీతాలక్ష్మణులతోగూడఁ బోవుచున్నాఁడేః అయ్యయో యెంతకష్టకాలమువచ్చెనని యెల్లవారును దుఃఖించిరి. మఱియు నిట్లనుకొనిరి. అహోయీరామునిగుణములను మనమేమనిపొగడఁగలము. ఈరాముఁడు సకలైశ్వర్యములనునను భవింపుచుండెను. మఱియు నెవ్వరేమికోరినను నిస్సందేహముగ నిచ్చుచుండును. ధర్మగౌరవమువలనఁ దండ్రిమాటను నబద్ధమును జేయఁగూడదని తానుకష్టమును బొందుటకుఁగూడ సమ్మతించెను. అహోయీరాముని యోగ్య

తను మనకేమనికొనియాడఁగలము. ఇంతకుముందుయాకా
శమునందుండు భూతములుగూడ నీసీతాదేవినిజూచుటకు
శక్తిలేనివైయుండును. ఆసీతాదేవినిప్పుడు రాజమార్గ
మునందలి జనులందఱునుజూచుచున్నారు శరీరమునకు
శ్రేష్ఠమైన మైపూతబూసికొనుటకుఁ దగినదియును, ర
క్తచందనములను సేవించునదియును, నగుసీతాదేవినిక
శీఘ్రకాలములోనే గాలియునెండయును, కృశించిపోవున
ట్లుసేయును. విచారింపఁగా నిప్పుడుదశరథ మహారాజున
కుఁ బిశాచముపట్టినట్లున్నదని నిశ్చయముగఁదోచుచున్నది.
కాఁబట్టియే యిట్టిమాటనుజెప్పెను. కాదేనియిట్టిమాటల
నుజెప్పునా? పిశాచముపట్టనియెడల సర్వకాలములయందు
ను రామునియందధికప్రియముగల దశరథుఁడిట్టిదుర్వచన
ములనుబలుకునా? పలుకఁడు. గుణహీనుఁడైన పుత్రునిగూ
డనరణ్యమునకుఁ బంపుదురా? యనినిందింతురు. అదియ
టుండనిమ్ము. మఱియునశేకములగు సచ్చరిత్రలచేతలోక
కములనన్నింటిని జయించిన సత్పుత్రుండగు రామునినర
ణ్యమునకుఁబంపుదురా? అహింస, దయ, విద్య, సత్స్వ
భావము, దమము, ఓర్పులను నాలుగుణములును పురు
షోత్తముఁడగు రామునియందుస్థిరముగానున్నవి. మఱి
యునియ్యాలుగుణములును నెడతెగక రామునియందెల్లపు
డునుండును. ఇట్టిరామునకుఁ గష్టకాలమువచ్చుటచేత స
కలజనులకును గష్టములుగలిగె. మఱియునెల్లవారును "జ
లజంతువులు యెండకాలమునందుఁ బరితపించువిధముగఁ"
బరితపించుచున్నారు. లోకాధిపతియగు నీరామునికిదుఃఖ
ముగలుగుటచే నీలోకమంతయును దుఃఖమునుబొందుచు
న్నది. "అడుగువేరును ద్రెంచివ్రేసినపిమ్మట ఫలపుష్పాదు
లతోఁగూడ చెట్టుయెండిపోవువిధముగ" నీరామునినరణ్య
మునకుఁబంపినపిమ్మట లోకమంతయును నశించిపోవును.
మనుష్యులనియెడు వృక్షమున కీరాముఁడుమూలమువంటి
వాఁడు. జనులందఱును పుష్పము ఫలము పత్రము, శాఖ
వీటితోసమానులు. మఱియునీరాముఁడు ధర్మసారుఁడు.
ఇంతయగాక యత్యధికమైనకాంతిగలవాఁడు. కావునమన
మిట్టిరాముని వదలియుండఁజాలము. కాఁబట్టిమనముమన
భార్యలను, బంధువులనుగూడబిలుచుకొని లక్ష్మణునివలెశీ
ఘ్రముగ రాముఁడుపోవుమార్గమునుబట్టిపోవుదము. మఱి
యునుద్యానవనములను, క్షేత్రములను, గృహములను, వ
దలి రామునితోఁగూడసమానముగ సుఖదుఃఖములనుబొం
దుచుఁ బరమధార్మికుఁడగు రామునివెంటనంటిపోదము.
మనమందఱమును బోయినపిమ్మట మనగృహములన్నియు
ను, పాడుపడినవగును. మనగృహములయందలి నిక్షేప
ములన్నియును పెల్లగింపఁబడును. ముంగిళ్లుచెడిపోవును.
ధనధాన్యములన్నియును బయలుదొంగిలించుకొని పోవుదు
రు. పరుపులుఆసనములు మొదలగు ముఖ్యవస్తువులన్నియు
ననపహరింపఁబడును. ఇట్లగుటచేత దుమ్ముచేనిండియుం
డును. అందువలనగృహదేవతలు గృహములనువిడిచిపోవు
ను. అంతటనెలుకలు పందికొక్కులు గృహములయందుఁ
బ్రవేశించి కన్నములనువేయును. పొగ్గుటయును, నీళ్లు
చల్లుటయును లేకుండుటవలన గృహములన్నియును నపవి
త్రములైయుండును. వంటలేకపోవుటవలన పొగలేనివగు
ను. బలికర్మలును, మంత్రహోమ జపతపములు మొదలగు
నవిలేనందునఁ గొంచెమైనను ప్రకాశింపనివై క్షామాదిదు
ష్కాలములయందుఁ బాడుపడినగృహమువలె మనయిం
డ్లన్నియును బాడుపడినవగును. మఱియునుగృహములయం
దలి కుండలన్నియునుబగిలిపోయి యాపెంకులుమాత్రము
యిండ్లయందుఁ బడియుండును. ఇవ్విధముగఁ బాడుపడిన
మనగృహములను మనముపోయినపిమ్మటఁ గైకేయిపరిపా
లించునుగాక. రాముఁడరణ్యమునకుఁ బోయినపిమ్మటనర
ణ్యమంతయును పట్టణమగును. రామునితోఁగూడమనమ
రణ్యమునకుఁబోయినపిమ్మట నీయయోధ్యానగరమరణ్య
మగును. మనమందఱమును నరణ్యమునకుఁ బోయినపిమ్మ
టమనకుభయపడి పాములు బిలములనువదలి పఱుగె
త్తిపోవును. సింహములుదమనివాసములను వదలిపోవును.
మృగములును బక్షులును పర్వతప్రాంత్యములకుఁ బోవు
ను. ఆసర్పాదిజంతువులన్నియును దమనివాసములు వదలి
మనచే విడువఁబడిన యీయయోధ్యానగరమునందుఁ బ్ర
వేశించుఁగాక. ఇవ్విధముగనైన పిమ్మట కైకేయి పుత్ర
మిత్రబంధుజనులతోఁ గూడుకొని సర్పములు, పులులు,
మొదలగు జంతువులచేత నిండినదియును, తృణమున్మాం
సము మొదలగునవి ఆహారముగాఁగల ప్రాణులుగలది
యునునగు నీదేశమును బరిపాలించుఁగాక. మనమంద
ఱము రామునితోఁగూడ నరణ్యమునకుఁ బోయి
యక్కడ సుఖముగనుందము. ఇట్లునానావిధ జనులచేతఁ
జెప్పఁబడుచున్న వాక్యములనువినియును రాముఁడు తన
హృదయమునందు గొంచెమైనను వికారములేనివాఁడ
య్యె. మదపుటేనుఁగుయొక్క పరాక్రమమువంటి పరా
క్రమముగలవాఁడును, ధర్మాత్ముఁడునునైన రాముఁడుకై
లాస శిఖరమునకుసమానమై కాంతిగలతండ్రియొక్క గృ
హమును దూరముగనుండిజూచి తత్క్షణమే ప్రదక్షిణము
నుజేసెను. అంతనారాముఁడు పరాక్రమవంతులచే గా
పాడఁబడుచున్న రాజగృహమునందుఁ బ్రవేశించికొంచె

ముద్వారమునందు దుఃఖితుఁడై నిలుచుకొనియున్న సుమంత్రునిఁ జూచెను. అవ్విధముగ రాముఁడు తండ్రియగు దశరథమహారాజుయొక్క యాజ్ఞను సంపూర్ణముగ నెరవేర్పఁదలఁచి తండ్రినిఁ జూచుటకుఁ బోవుచుండె. అట్లు పోవుచు మార్గములోఁ దన్నుఁ జూచి యధికముగ నేడ్చుచున్న జనులను జూచి కొంచెమైనను దుఃఖమును బొందకుండుటయు గాక నవ్వుచున్నవానివలె సంతోషముతో నుండెను. మహానుభావుఁడును, మిగుల ధైర్యముగలవాఁడును, దశరథమహారాజునకుఁ బుత్త్రుఁడును, నరణ్యమునకుఁ బోవుటకు నిశ్చయించుకొనియున్నవాఁడును, నగు రాముఁడు, తన్నరణ్యమునకుఁ బొమ్మని దశరథుఁడు చెప్పినది మొదలుకొని దుఃఖమును బొందుచున్న సుమంత్రునిఁ జూచి తండ్రితోఁ దాను వచ్చుటను దెలుపుటకై యెదురు చూచుచుఁ గొంతసేపు నిలుచుండె. మఱియు నా రాముఁడు పరమధర్మాత్ముఁడు గావునఁ దండ్రియొక్క యాజ్ఞచేత వనమునకుఁ బోవుటకు నిశ్చయించుకొనినవాఁడై సుమంత్రునితో నిట్లనియె. సుమంత్రుఁడా! నేను వచ్చి వాకిటియందున్నానని దశరథమహారాజునకుఁ దెలుపుమనియె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదియూడవసర్గము ముగిసెను.

రాముఁడు దశరథమహారాజునకు దుఃఖోపశమనముఁ జేసి యరణ్యమునకు బోయివచ్చెదనని చెప్పుట.

అటుపిమ్మటఁ దామరఱేకులవంటి నేత్రములుగలవాఁడును, శ్యామలవర్ణముగల దేహముగలవాఁడును, స్వల్పమైన నడుముగలవాఁడును, మహానుభావుఁడునునగు రాముఁడు సారథియగు నా సుమంత్రునిఁ జూచి నేను వచ్చియున్నానని మా తండ్రితోఁ జెప్పుమనియె. అంతనా సుమంత్రుఁ డధికమగు దుఃఖముచే వ్యాకులమైన యింద్రియములుగలవాఁడై శీఘ్రముగ లోపలికిఁ బోయి నిట్టూర్పులను విడుచుచున్న దశరథునిఁ జూచె. అట్టి యెడ దశరథుఁడు రాహుగ్రస్త సూర్యబింబమువలెను బూడిదచే గప్పఁబడిన యగ్నిహోత్రమువలెను నిస్తేజస్కుఁడైయుండె. మఱియుఁ గాంతిహీనునివలెను, నీళ్లులేని చెఱువువలెను బ్రకాశింపకుండెను. మిగులఁ బండితుఁడగు నా సుమంత్రుఁడు, అధికముగ దుఃఖమును బొంది రామునిబేర్కొని రోదనమును జేయుచున్న దశరథమహారాజును జూచినతోడనే చేతులను ముకుళించుకొని శిరస్సునందుఁ బెట్టుకొని యతని సమీపమునకు బోయెను. ఇట్లు సమీపమునకు బోయి యా సుమంత్రుఁడు దశరథమహారాజునకు జయముగలుగునటుల ఆశీర్వచనములను జేసి భయముచేఁ దడఁబడుచు మెల్లగా మధురవాక్యములతో నిట్లనియె.

రాజేన్ద్రా! దశరథమహారాజా! పురుషోత్తముఁడును, నీకుఁ బుత్త్రుఁడునునైన రాముఁడు తన ధనమును సర్వమును బ్రాహ్మణులకిచ్చి నిన్నుఁ జూచుటకొఱకు వచ్చి వాకిటియందు నివసించియున్నాఁడు. సత్యపరాక్రముఁడగు నా రామునకిప్పుడు దర్శనమునిమ్ము. అతఁడు తన స్నేహితులతో నందఱితోడను జెప్పి వారియనుమతమును బొంది వచ్చియున్నాఁడు. ఇప్పుడు నీతోఁ గూడఁ జెప్పిపోవుటకు వచ్చియున్నాఁడు. మహాప్రభో! దశరథమహారాజా! కిరణములతోఁ గూడిన సూర్యునివలె సకలరాజగుణములచేతను బ్రకాశించుచున్న రాముఁడు మహారణ్యమునకుఁ బోవుచున్నాఁడు చూడుము. అని యిట్లు సుమంత్రుఁడు చెప్పిన సత్యవాదియును, ధర్మాత్ముఁడును, సముద్రునివలె గాంభీర్యముగలవాఁడును, ఆకాశమువలె నిర్మలమైనవాఁడును, అగు దశరథమహారాజు సుమంత్రునిఁ జూచి యిట్లనియె.

సుమంత్రుఁడా! ఇప్పుడిక్కడనున్న నా భార్యలనందఱిని బిలుచుకొనిరమ్ము. నేను నా భార్యలతోఁ గూడుకొని ధార్మికుఁడగు రాముని జూడఁ గోరుచున్నానని చెప్పెను. అంతనా సుమంత్రుఁ డంతఃపురమున కతిశీఘ్రముగఁ బోయి దశరథుని భార్యలనందఱఁ జూచి యిట్లనియె.

ఓ తల్లులారా! మిమ్ముల దశరథమహారాజు పిలుచుచున్నాఁడు. కావున మీ రందఱును శీఘ్రముగ దశరథునొద్దకు రండనియె. అప్పుడా దశరథుని భార్యలందఱును రాజాజ్ఞానుసారముగఁ జెప్పుచున్న సుమంత్రుని మాటలను విని దశరథుని యాజ్ఞను శిరసావహించి దశరథుఁడుండు గృహమునకు బయలువెడలిరి. అంతటఁ బతివ్రతలగు దశరథుని భార్యలు (౩౫౦) మూఁడునూరుల యేబదిమందియును, రాముఁడు వనమునకుఁ బోవుచున్నాఁడని యెడు దుఃఖముచే నెఱ్ఱగానుండు నేత్రములుగలవారలై కౌసల్యను జుట్టుకొని మెల్లగా నడచుచుఁ బోయిరి. అట్లు వచ్చుచున్న భార్యల నందఱిం జూచి దశరథమహారాజు సుమంత్రునితో నిట్లనియె.

సుమంత్రుఁడా! నా పుత్త్రుఁడగు రామునిఁ బిలుచుకొనిరమ్మనియె. అంతట నా సుమంత్రుఁడు సీతారామలక్ష్మణులను బిలుచుకొని యతిశీఘ్రముగ దశరథునొద్దకు వచ్చెను. అప్పుడు దశరథమహారాజు మిక్కిలి దూరంబుననుండి చేతులు ముకుళించుకొనివచ్చుచున్న పుత్త్రునిఁ జూచి మహాదుఃఖముగలవాఁడై భార్యలతోఁ గూడ నాసనమునుండి లేచెను. అట్లు దశరథమహారాజు రామునిఁ జూచి యతివేగంబున లేచి యతని కభిముఖముగాఁ బోయెను. అట్లు పోవుచు నత్యధికమగు దుః

ఖము గలవాఁడగుటవలన రామునియొద్దకుఁ బోఁజాలక మూర్ఛితుఁడై క్రిందఁబడెను. అప్పుడు రాముఁడును మహారథుఁడైన లక్ష్మణుఁడును, దుఃఖముచేతఁ దెలివిఁదప్పి క్రిందబడిన దశరథుని లేవనెత్తుటకై వెంటనే నేలకువ్రాలిరి. ఆ సమయమునందు దశరథుని భార్యలందఱును దేహమునందలి భూషణములన్నియును మ్రోయగా హాహాకారములు సలుపుచు హా రామా! రామా! యని గొంతెత్తి గట్టిగా యేడ్వసాగిరి. అప్పుడు సీతారామలక్ష్మణులు మువ్వురును నా దశరథునిఁ జేతులతోఁ గ్రుచ్చియెత్తి కన్నులనుండి నీరు ధారధారగ బ్రవహింపగ రోదనంబును జేయుచుఁ బాన్పునందుఁ గూర్చుండఁ బెట్టిరి. అంతఁ గొంతసేపటికి దశరథుఁడు తెలివొందెను. అప్పుడు రాముఁడు చేతులను ముకుళించుకొని తండ్రియగు దశరథుని జూచి యిట్లనియె.

తండ్రీ! దశరథమహారాజా! నీవు మాకందఱకును ప్రభుఁడవు. కావున నిప్పుడు నీయాజ్ఞనుబొంది నేను దండకారణ్యమునకుఁ బోఁదలఁచియున్నాను. నీవిట్లు వ్యసనమును జెందక ప్రసన్నదృష్టిచేత నన్నుఁ జూడుము. సీతాలక్ష్మణులు నా వెంటనంటివచ్చుచున్నారు. కావున వారలకుఁగూడ నాజ్ఞయిమ్ము. వీరికి నేననేక కారణములను జూపి యరణ్యమునకు రావలదని చెప్పితిని. ఎంత చెప్పినను వారు సమ్మతింపక నిశ్చయముగ నాతోఁగూడ వచ్చుటకు నిర్ణయించుకొనియున్నారు. మానదుఁడా! దశరథమహారాజా! నీవీదుఃఖమును విడిచి నాకును, సీతాలక్ష్మణులకును బ్రహ్మదేవుఁడు ప్రజలకనుమతియిచ్చినట్లు మాకాజ్ఞయిమ్మనియె. అట్లు అతిశీఘ్రముగా వనవాసమునకు బోవుటకు ఆజ్ఞయిమ్మని కోరుచున్న రామునిఁ జూచి దశరథమహారాజిట్లనియె.

రామా! నేను గైకేయికి వరమునిచ్చుటచేత మోహమును జెందియున్నాను. నీవిప్పుడు నన్ను తిరస్కరించి యయోధ్యాపట్టణమునకు బ్రభుఁడవుగావచ్చుననియె. అంత ధర్మాత్ములలో నుత్తముఁడగు రాముఁడు దశరథమహారాజు చెప్పినమాటలను విని చేతులను ముకుళించుకొని యిట్లనియె.

తండ్రీ! దశరథమహారాజా! నీవనేకసంవత్సరములనుండి భూమిని బరిపాలించుచున్నావు. అటువంటి నీవు నన్ను సత్యమునకుఁ దప్పినవానినిగాఁ జేయవలదు. (నావలన నీవుగూడ నసత్యవంతుఁడవు గాఁగూడదు) నేనవశ్యముగ నరణ్యమునకుఁబోయి యందు నివసించెదను. దశరథమహారాజా! నేనరణ్యమునందు పదునాలుగు సంవత్సరములు సుఖముగా నివసించియుండి ప్రతిజ్ఞను నెరవేర్చుకొనిన పిమ్మట మఱల నిప్పట్టణమునకు వచ్చి నీపాదముల నాశ్రయించియుండెదనని రాముఁడు చెప్పెను. ఆ మాటలను విని సత్యపాశముచే గట్టబడిన యా దశరథమహారాజు, వ్యసనముచే నేడ్చుచు నతిదీనుఁడై యేకాంతమునందుఁ గైకేయిచేతఁ బ్రేరేపింపఁబడినవాఁడగుటవలనఁ బ్రియపుత్రుఁడగు రాముని జూచి యిట్లనియె.

తండ్రీ! రామా! నీకిహపరలోక సుఖములు గలుగుఁగాక. మరల నియ్యయోధ్యాపట్టణమునకు వచ్చుటయును గలుగుఁగాక. రాముఁడా! నీకు మార్గము శుభకరమైనదియును, కష్టములేనిదియును, గొంచెమైనను భయములేనిదియును నగుఁగాక. తండ్రీ! రామా! నిన్నుఁ జూచినతోడనే రఘుకులమునందుఁ బుట్టినవారలకందఱకును మహాసంతోషము గలుగును. నీవు మంచిస్వభావము గలవాఁడవు. మిగుల ధర్మాత్ముఁడవు. కావున నీబుద్ధిని మారునట్లు సేయుటకుఁ గొంచెమైనను శక్యముగాదు. అయినను పుత్రుఁడా! నేనిప్పుడు చెప్పుమాటను మాత్రము వినుము. నీవెట్లయినను నిప్పుడరణ్యమునకుఁ బోఁగూడదు. ఈ రాత్రియంతయును నిక్కడనే యుండుము. నిన్నుఁ జూచుచు సుఖముగా నొక్కదినమైనను నుండెదను. మఱియు నో రాముఁడా! నీవీదినమంతయును నీతల్లియగు కౌసల్యను జూచుచు నిక్కడనే యుండుము. మేము నీయభిలాషలన్నియును దీరునట్లు చేసి నీవు తృప్తి నొందునట్లు చేసెదము. పిమ్మట రేపటి ప్రాతఃకాలమునందు నీవరణ్యమునకుఁ బోవచ్చును. రామా! నాకు సంతోషము గలుగుటకొఱకుఁగా నీకిష్టమగు పదార్థములను, పరమప్రియులగు బంధుమిత్రాదులను, వదలి యరణ్యమునకుఁ బోవుచున్నావే! ఇటువంటి కఠినకార్యమును నెవ్వరును జేయఁజాలరు. రామా! నీవరణ్యమునకుఁ బోవుట నాకెంతమాత్రమును నిష్టమే లేదని సత్యముగ జెప్పుచున్నాను. అయినను గూఢాభిప్రాయముగలదియును, బూడిదచేఁ గప్పఁబడిన యగ్నికి సమానమైనదియును, నగునాడుదానిచేత మోసముపోయినవాఁడను మాత్రమగుచున్నాను. రాముఁడా! అట్లు నేనెవతెచేత మోసబోతినో అట్టి మోసకత్తెయైన కులాచారధర్మములను జెఱుపునట్టి యీ కైకేయియొక్క మాటను విని సఫలముగాఁ జేయుటకిచ్ఛయించుచున్నావు. ఇట్టి పరమధార్మికుఁడవగు నిన్నుఁ జూడఁగా నాకు మిగుల నాశ్చర్యము గలుగుచున్నది. పుత్రుఁడా! రామా! నాకుఁ బెద్దకొమారుఁడవగు నీవు నాకసత్యదోషము గలుగకుండునట్లు చేయఁదలఁచుచున్నావు. ఇట్లు చేయుట యెంతయాశ్చర్యముగాదు. మిగుల నాశ్చర్యమే యని దశరథుఁడు రామునితోఁ జెప్పె. ఇట్లు మిగుల దుఃఖాక్రాంతుఁడై చెప్పుచున్న తండ్రిమాటలను విని రాముఁడును లక్ష్మణుఁడును మహాదుఃఖమును జెంది రోదనమును జేసిరి. అంత రాముఁడు దశరథుని

జూచియిట్లనియె.

రాజోత్తమా! దశరథమహారాజా! మీరిప్పుడుచెప్పినట్లు నేనుమంచిపదార్థములను భుజించినను, నట్టిపదార్థములను నేవునాకెవ్వఁడిచ్చునని? కావుననేనిప్పుడు మంచి పదార్థములను గోరుటవ్యర్థమనితలఁచెదను. అందువలన నాకేమి కోరికయును లేదు. నేనుమఖ్యముగ నిప్పుడే యరణ్యమునకుఁ బోవలసినది. ఇప్పుడునాచేత జనులతోడను, ధాన్యములతోడను, సంపూర్ణముగనిండియున్న నీదేశము విడువఁబడెను. కావుననీభూమినిసర్వమును భరతునకిమ్ము. అరణ్యమునకుఁ బోవలయుననియెడు నాసంకల్పమిప్పుడెంతమాత్రమును మారుపాటును బొందదు. వరములనిచ్చునట్టియోదశరథమహారాజా! నీవుమహాసంతోషముననైకేయి కేమేవరములనిచ్చియున్నావో దానినిసర్వమునుగౌరతలేకయుండునటుల నాకైకేయికిచ్చి సత్యవంతుఁడవగుము. నీయాజ్ఞాప్రకారముగ నరణ్యమునందు మునులతోఁగూడఁ బదునాలుగుసంవత్సరములు నివసించియుండినీయాజ్ఞనునెరవేర్చెదను. నీవుకొంచమైనను సందేహించవలదు. భరతునకు రాజ్యమునునిమ్ము. దశరథమహారాజా! నాకుఁదండ్రియగు నీయాజ్ఞనునెరవేర్చుటయందుఁ గలుగునంతటిసంతోషము సకలభూమండలాధిపత్యమునందుఁగాని, మఱిదేనియందుఁగాని కలుగదు. రాజశ్రేష్ఠుఁడా! నీవీదుఃఖమునువదలుము ఈప్రకారముగఁ గన్నీరుగార్చుచువ్యసనపడవలదు. నదులకధిపతియైన సముద్రుఁడెప్పుడునుగలతను బొందునా? నీవునుసముద్రునివంటి గంభీరముగలవాఁడవు. కావుననిట్లుదుఃఖించుట యుచితముగాదు. నాకు రాజ్యమునక్కఱలేదు, సుఖమునక్కఱలేదు. మఱియు నితరములగుపదార్థములును నక్కఱలేదు. ప్రాణమునందుఁగూడ నాకుఁగొంచెమైనను నభిలాషలేదు. పురుషోత్తముఁడవైన యోదశరథమహారాజా! నీవును, సత్యమును, నాకుగావలసినదని నీయెదుటసత్యముమీఁదను సుకృతముమీఁదను ఒట్టుబెట్టిచెప్పుచున్నాను. మహాప్రభో! దశరథమహారాజా! ఇక్కడక్షణమాత్రమైన నేనుండను. నీవీదుఃఖమును మనస్సునందుఁబెట్టుకొనుట యుచితముగాదు. నా సంకల్పమెన్నటికిని మారుబాటునుబొందదు. దశరథభూవల్లభా! నన్నునరణ్యమునకుఁబొమ్మని కైకేయిప్రార్థించినది. ఆకైకేయిచెప్పినచొప్పున నేనరణ్యమునకుఁ బోయెదనని బాసనుజేసితిని. కాఁబట్టినేనిప్పుడు సత్యమునుపరిపాలించుటకొఱకు నడవికిఁబోయెదను. దశరథమహీవల్లభా! నీవుమమ్మునుగుఱించి దుఃఖమునుబొందుచుండకుము. మేము నిర్వికారమైన మృగములతోడంగూడి నానావిధములగుపక్షులయొక్క మనోహరములైనధ్వనులనువినుచు సుఖముగానరణ్యమునందు సంచరించెదము. తండ్రీ! దశరథమహారాజా! దేవతలకుఁగూడఁ దండ్రియేదైవమని చెప్పఁబడియున్నదిగదా? కావుననేను దండ్రియేదైవమని యెంచినాను. కాఁబట్టితండ్రివగు నీయాజ్ఞను నెరవేర్పఁదలఁచియున్నాను. నరసత్తమా! దశరథమహారాజా! పదునాలుగుసంవత్సరములును నడవులయందుండివచ్చిన పిమ్మటనన్ను నీవుచూడఁగలవు. కావుననీవిదుఃఖమును వదలుము. పురుషోత్తమా! దశరథమహారాజా! ఎలుంగెత్తియేడ్చుచున్న జనులనందఱను నోదార్చవలసిననీవే యివ్విధముగదుఃఖమునుబొందుచున్నావేమి? ఇట్లుదుఃఖమునుబొందవచ్చునా? నేనువదలినపట్టణమును, రాజ్యమును, భూమిని, మఱియు నితరములగుపదార్థములను సర్వమును భరతునకు నిమ్ము. నేననీయాజ్ఞాప్రకారముగ నరణ్యమునకుఁబోయి చిరకాలముండెదను. దశరథమహారాజా! ఈభూమియంతయును, పర్వతములచేతను, పట్టణములచేతను, వనములచేతను నిండియున్నయది. మఱియును హద్దులుగలిగియుండుటచేత సుఖకరమైయున్నది. కాఁబట్టి యిట్టిభూమినినేలుట భరతునకు సులభమైయుండును. కావునభరతుఁడే యీభూమిని సర్వమునుఏలుగాక. నేనుపూర్వమునీవుచెప్పినప్రకారము నడవులకుఁబోయెదను. నిష్కల్మషుఁడా! దశరథమహారాజా! నాకుసజ్జనసమ్మతమగు నీయాజ్ఞనుపరిపాలించుటయందుఁ గుతూహలముగలుగునట్లు సర్వోత్తమములగు కోరికలయందుఁగాని, మఱియునితరములగు నాకిష్టమైనవస్తువులయందుఁగాని ప్రియములేదు. కావున నేనడవులకుఁబోవుటవలన మిగులఁగష్టములనుబొందుదునని నీ వింతమాత్రమును భయపడవలదు. మఱియునధికముగదుఃఖమునుబొందకుము. అనఘా! దశరథమహారాజా! మహానుభావుఁడవగు నీకసత్యదోషముగలుగునేని సర్వకామములను, సుఖమును, సీతను, విశేషముగఁజెప్పనేలప్రాణములనుగూడవిడుతును. ఇటువంటినేను నీరాజ్యమునుగోరినని చెప్పనేల ఎట్లయినను నీసత్యవ్రతము చెడిపోకుండవలయును. నేనునానావిధవృక్షములుగల యడవికిఁబోయి యచటనే కందమూలఫలములను భక్షించుచుండెదను. మఱియుఁ బర్వతములను, నదులను, కొలఁకులను, జూచుచు సుఖముగా విహరించెదను. నీవీదుఃఖమునువదలి సుఖముగనుండుమనిచెప్పె. అనియిట్లు రాముఁడుచెప్పినమాటలను దశరథమహారాజువిని దుఃఖమునుబొంది తాపముచేతను, వ్యసనముచేతను బరితపించుచుఁ బుత్రునిగౌఁగలించుకొని తెలివిఁదప్పి మూర్ఛితుఁడై క్రిందఁబడి చేష్టలుదక్కియుండెను.

అట్టియెడ కైకేయియొక్కతె తప్పఁ దక్కిన రాజభార్యలందఱును నొక్కటిగాఁ జేరి హాహాయని మిక్కుటమైనధ్వని గలుగునట్లు యేడ్చిరి. ఆసమయమునం దచటనున్నసుమంత్రుఁడును మహావ్యసనమునుబొంది రోదనమును జేయుచు మూర్ఛితుండయ్యె. మఱియు నచ్చోటనుండు జనులందఱును హాహాకారంబులుసలుపుచు రోదనంబును జేసిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదినాల్గవ సర్గముగిసెను.

సారథియగు సుమంత్రుఁడు కైకేయిని నిందించుట.

అంతఁ గొంతసేపటికి సుమంత్రుఁడు తెలివొంది మహాకోపముచేఁ దలనువిదిర్చికొని యనేకపర్యాయములు నిట్టూర్పులువిడుచుచు నొకచేతిని మఱియొకచేతియందుఁ బెట్టుకొనినలుపుచు పండ్లుపటపటఁగొఱుకుచుఁ గోపముచేతఁ గన్నులనెఱ్ఱఁగఁజేసి యందుండినిప్పులం గ్రక్కువానివలెనుండె. అప్పుడతనిశరీరము మిగులనెఱ్ఱనిదైయుండె. మునుపటియాకారమును వదిలెను. మఱియు మహాపరితాపము గలవాఁడయ్యె. ఇట్లుండి దశరథునకుఁ గైకేయిమీఁదఁ గోపము గలిగియుండుటనుజూచి తీక్ష్ణములయిన బాణములతో సమానములైనమాటలచేతఁ గైకేయియొక్కహృదయము గడగడవణఁకునట్లు సేయువానివలెను, బాణంబులచేత మర్మస్థానములను భేదించువానివలెను నాకైకేయియొక్కగుట్టును బట్టబయలుసేయుచు నిట్లనియె.

ఓకైకేయీ! నీకుభర్తయును, స్థావరజంగమాత్మకమగు ప్రపంచమునకంతటికి మహాప్రభువునునగు దశరథమహారాజును విడిచిపెట్టితివిగదా? ఇట్టినీకీలోకమునందుఁ జేయరానిపని యేదియునులేదు. నీవెటువంటిదుష్కార్యములనైనను జేయుదువనుటకు సందేహమేమియునులేదు. దేవేంద్రునివలె నితరులకుఁ జయింప నలవిగానివాఁడును, పర్వతములమాడ్కిఁజలనమును బొందనివాఁడును, సముద్రమువలె క్షోభనుబొందనివాఁడును, నగుదశరథమహారాజునకుఁగూడ దుఃఖముగలుగునట్లు చేసితివి. కావుననీవు పెనిమిటినిజంపుదానవు. మఱియును నశింపజేయుదానవు. "శ్లో॥ నావమంస్థాదశరథం భర్తారంవరదంపతిం। భర్తురిచ్ఛాహినారీణాం పుత్రకోట్యావిశిష్యతే" సకలజనులను గాపాడునట్టివాఁడును, వరములనిచ్చువాఁడును, పెనిమిటియును, నగుదశరథమహారాజును నవమానింపకుము. స్త్రీలకు భర్తసంతోషించుట కోటిమందిపుత్రులకంటె నధికమైనదనియెఱుఁగుము. లోకమునందు రాజునకు అంత్యకాలము వచ్చినప్పుడు పుత్రులు వారివయస్సు ననుసరించి జ్యేష్ఠుఁడు రాజ్యమునొందుటయును, నితరులైనతమ్ములు మొదలగువారలతనిననుసరించుచుండుటయు వాడుకగాజరుగుచుండునుగదా? ఆప్రకారమే జ్యేష్ఠుఁడగుటవలన నిక్ష్వాకుకులమునకుఁ బ్రభువుకాఁదగిన రామునివిషయమై యాధర్మమును జెఱిపి మహానర్థము సంభవించునట్లు చేసితివి. నీపుత్రుఁడగుభరతుఁడు రాజగుఁగాక. అతఁడే భూమినిబరిపాలించుచుండుఁగాక. రాముఁడెక్కడకుఁ బోవునో మేమును నక్కడకే పోయెదము. నీదేశమునం దొక్కబ్రాహ్మణుఁడైన నుండఁడు, అట్లొక్క బ్రాహ్మణుఁడు గూడనుండుటకుఁ దగనికార్యమును జేయుచున్నావు. నీవిట్టి మహాక్రూరకృత్యమును జేయఁదలఁచినతోడనే యీభూమి పటపటమని బ్రద్దలుగాకయున్నదే? దీనినిబూడఁగానాకు మహాశ్చర్యముగలుగుచున్నది. మహాతీక్ష్ణములై చూచువారలకు భయమునుగలుగజేయునట్టి "నీవుమండిపోదువుగాక" అనిచెప్పెడిమహర్షుల శాపవాక్యములయినను, రాముని నరణ్యమునకుఁబంపుచున్న నిన్నుసంహరింపకున్నవే? ఆహా యిదియెంతయాశ్చర్యము. లోకములోనెవ్వఁడైనను, తియ్యనిఫలములనుయిచ్చునట్టి మామిడిచెట్టును గొడ్డలిచేతనఱికి వేపచెట్టునకుఁ బాలనుపోసి పెంచునా? ఒకవేళఁ బెంచినను నట్టివృక్షము తియ్యనిఫలములనుయిచ్చునా? ఇవ్వదు. ఇంతియగాక చేదుఫలములనేయిచ్చును. కాబట్టి రామునినరణ్యమునకుఁబంపి కైకేయికిసంతోషముగలుగునట్లుజేయుటచే దశరథునకుఁగష్టమేగాని కొంచెమైనను సుఖముగలుగనేరదు. ఓకైకేయీ! నీయొక్కబుద్ధినాకు బాగుగాఁ దెలిసియేయున్నది. నీతల్లిగుణమెటువంటిదో నీగుణముకూడ నట్టువంటిదైయున్నది. వేపచెట్టువలనఁ దేనెపుట్టదనుసామెత నిజమేగదా? దుర్మార్గురాలికిమంచికూతురెట్లుపుట్టును. నీతల్లిచేసిన దుర్మార్గకృత్యములనన్నిటిని మునుపువినియేయున్నాము. అందువలననాకుబాగాతెలియును- ఓకైకేయీ యొకరహస్యప్రసంగతిం జెప్పెదను చెవియిచ్చివినుము. వరములనిచ్చునట్టి సామర్థ్యముగల యొకమహానుభావుఁడు నీతండ్రికిశ్రేష్ఠమగు నొక్కవరమునిచ్చెను. ఆవరమువలన భూలోకములోనుండెడి పశుపక్షిమృగాదులు యేమాటనుమాట్లాడుకొనినను దెలియుచువచ్చెను. అందువలన నీతండ్రి పశుపక్షిమృగాదుల భావలనుగూడఁ దెలిసికొనెను. అట్లుండనొక్కనాఁడు కాంతిమంతుఁడగు నీతండ్రి పండుకొనియుండగా సమీపమునం దొక్కచీమ మఱియొకచీమతో పలికినపలుకును దెలిసికొనెను. అట్లుతెలిసికొని యాచీమయొక్కయభిప్రాయమును

మాటిమాటికినిదలఁచుకొనినవ్వుచుండె. అప్పుడునీతల్లి, పెనిమిటినవ్వుటనుజూచి తన్నుజూచి పరిహాసమును జేయుచున్నాఁడనితలఁచి మరణమునుబొందఁదగినంతకోపమును దెచ్చుకొని పెనిమిటితో నిట్లనియె. శాంతుఁడవైనయోమహారాజా! నీవిప్పుడేమినిమిత్తముగ నవ్వితివో యాకారణమును జెప్పుమనియె. అంతనారాజుయిట్లనియె.

ఓప్రాణనాయకీ! నేనిప్పుడునవ్వుటకుఁ గారణమును జెప్పఁగూడదు. ఒకవేళఁజెప్పితినేని నాకుమరణముగలుగును. ఇందుకేమియును సందేహములేదు. కావుననేనుజెప్పననియె. అంతటనోకైకేయీ! నీతల్లి నీతండ్రియగు మహారాజునుజూచి యిట్లనియె. ఓప్రాణనాథా! నీవుబ్రదికినను సరే! లేకనీవుచచ్చిపోయినను సరే! దానితో నాకుఁబనిలేదు. కావుననీవునవ్వుటకుఁ దగినకారణమును జెప్పుము. నీవునన్నుఁ బరిహసించినదియును, లేనిదియును దెలిసికొనవలయునని జెప్పెను. ఆమాటలనువిని భూపరిపాలకుఁడైన నీతండ్రియగు కేకయమహారాజు భార్యచెప్పినమాటనువిని యేమియునుజేయనేరక తొల్లితనకు వరమునిచ్చిన మునియొద్దకుఁబోయి యావృత్తాంతమును సర్వమును జెప్పెను. ఆవృత్తాంతమునువిని యట్టివరమునిచ్చిన కేకయమహారాజుంజూచి యిట్లనియె.

కేకయమహారాజా! నీభార్యచచ్చునేని చావనిమ్ము. నీవెంతమాత్రమును నీసంగతిని జెప్పకుమనిచెప్పె. ఆరాజేన్ద్రుఁడావచనమునువిని యతిశీఘ్రముగ నీతల్లినిదిరస్కరించి కుబేరునివలెసుఖముగా సంచరింపుచుండె. పాపపుకార్యములను జేయుదానా! కైకేయీ! నీవుగూడనీతల్లివలెనే దుర్మార్గపుస్త్రీలయొక్క మార్గము నవలంబించి మోహముచేత దశరథునకుఁ గీడునుగలుగునట్లు సేయుచున్నావు. "శ్లో॥ సత్యశ్చాద్యప్రవాదోయం లౌకికఃప్రతిభాతిమా । పితౄన్సమనుజాయంతే నరామాతరమంగనాః॥ కుమారులకుఁ దండ్రిగుణములువచ్చును. కుమార్తెలకుఁ దల్లిగుణములువచ్చునని లోకమునందుఁ జెప్పుకొనుసామెత యిప్పుడునిజమయ్యె. సామెతయెప్పటికైన నబద్ధమగునా? కానేరదు. అయినను నావచనములనువిని నీకుఁ బెనిమిటియగు దశరథమహారాజునకు విధేయురాలవగుము. దశరథమహారాజుయొక్క కోరికప్రకారముగ నీవును రామునకు పట్టాభిషేకము సేయుటకొప్పుకొనుము. ఇప్పుడు రాముఁడరణ్యమునకుఁబోవునని యిచ్చటయుండుజనులందఱును మిగులదుఃఖమును జెందుచున్నారు. ఇట్లుదుఃఖించుచున్నయీపట్టణవాసులును గ్రామవాసులునునగు జనులనుగాపాడుము. నీవుపాపాత్ములుచెప్పినమాటనువిని దేవేంద్రునితోసమానుఁడును, లోకమునకధిపతియును, పెనిమిటియునునైన దశరథమహారాజునకధర్మముగలుగునట్లు సేయకుము. ఓకైకేయీ! నిష్కల్మషుఁడును, శ్రీమంతుఁడును, పద్మపత్రములవంటివిశాలములైన నేత్రములుగలవాఁడును, నగుదశరథమహారాజు నీకువాగ్దత్తముసేసినదాని నివ్వకుండువాఁడుగాఁడు. దశరథుఁడుసత్యసంధుఁడుగావున నెట్లయినను నీవరములనునీకిచ్చి సంతోషమునుగలుగఁజేయును. పుత్రులలోజ్యేష్ఠుఁడును, మిగులనుదారుఁడును, సదాచారసంపన్నుఁడును, తనకులధర్మమగు క్షత్రియధర్మమునుదప్పక నడుచుకొనువాఁడును, సకలప్రాణులనుగాపాడుకొనువాఁడును, బలవంతుఁడును, మఱియునిట్టియనేకసుగుణములుగలిగి పట్టాభిషేకమునకుఁ దగియున్నవాఁడును, నగురామునకుఁబట్టాభిషేకము సంభవించునట్లు సేయుము. ఓకైకేయీ! రాముఁడుదశరథమహారాజును వదలి యరణ్యమునకుఁబోయెనేని నీకులోకమునందు శాశ్వతమైనయపవాదముగలుగును. సకలసద్గుణసంపన్నుఁడగు రాముఁడే రాజ్యమునుబాలింపుచుండుఁగాక. నీవీపరితాపమునువిడువుము. రాముఁడరణ్యమునకుఁ బోయినపిమ్మట నీయయోధ్యానగరమునందు యోగ్యుఁడగువాఁడెవ్వఁడును నివాసమును జేయఁడు. రాముఁడుయౌవరాజ్య పట్టాభిషిక్తుఁడైనపిమ్మట మహాపరాక్రమవంతుఁడగు దశరథమహారాజు పూర్వపుయిక్ష్వాకువంశపు రాజులమార్గమునవలంబించితపోవనమునకుఁబోవును. ఇట్లుదశరథుఁడరణ్యమునకుఁ బోవుటయేగదా సదాచారపద్ధతియనిచెప్పి చేతులంగట్టుకొనినిలుచుండియుండెను. ఇవ్విధముగనాసుమంత్రుఁడురాజసభయందు, మృదువైనమాటలచేతను, తీక్ష్ణములైనమాటలచేతను, కైకేయినెన్నివిధములక్షోభింపఁజేసినను, నాకైకేయి కొంచమైనను క్షోభనుబొందదయ్యె. మృదువైనమాటలనువినుటచేత మనస్సైననుగరగనిదయ్యె. ఇంతియగాక ముఖమునునుండు క్రూరవర్ణము కొంచెమయినను దగ్గకపోయెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదైదవసర్గముగిసెను.

—{ సిద్ధార్థుఁడను దశరథమహారాజుమంత్రి కైకేయినినిందించుట. }—

అంతట నాదశరథమహారాజు వరదానవిషయమైతాను జేసినప్రతిజ్ఞనుదప్పించుకొననేరక కంటనుండినీరుధారధారగాబ్రవహింపగమహాదుఃఖమునుబొంది వెచ్చనినిట్టూర్పులనువిడుచుచు సుమంత్రునిఁజూచిమాటిమాటికి నిట్లనియె.

సుమంత్రుఁడా! వనములయందు రామునకు సేవను జేయుటకొఱకు రత్నరాసులతోఁగూడఁ జతురంగసైన్యము నతిశీఘ్రముగాఁ బంపుము. తమమృదుమధురములగుమాటలచేత మనస్సునురంజింపఁ జేయునట్టి వేశ్యాస్త్రీలను రాముఁ వెంటఁబంపుము. ఇంతియగాక ధనవంతులగు వైశ్యుల చ్చటచ్చటనంగళ్లను బెట్టికొని సకలపదార్థములను విక్రయించునట్లు సేయుము. మఱియు రామునివెంటనంటి పోవు సైన్యముల నలంకరించిపంపుము. ఆసైన్యమంతయును నంగళ్ళ వారిని గాపాడునట్లు సేయుము. రాముని నాశ్రయించుకొని యెవ్వ రెవ్వరు జీవించుచుందురో? యెవ్వరితో రాముఁడు పరీక్షార్థము క్రీడించుచుండునో వారలకందఱకును విశేషముగ ధనమును నిమ్ము. వారలనందఱను నీరామునితోఁ గూడఁ బంపుము. మఱియును శ్రేష్ఠములగు నాయుధముల నుధరించినవారును, పట్టణవాసులును, నూనెమొదలగువానిని గొనిపోవునట్టి బండ్లును, వనమునందు మార్గమును జూపుటయందు దగినసామర్థ్యముగల బోయవారలను రాముని వెంబడించిపోవునట్లు సేయుము. అట్లు సేసితివేని రాముఁడు చతురంగబలముతోడను గూడి విహరింపుచు వనములయందలి యేనుఁగులు మొదలగు క్రూరజంతువులను జంపుచు వనములయందలి తేనెను ద్రావుచు ననేకవిధములగు నదులను జూచుచు రాజ్యంబును గుఱించి తలఁచుకొనక సుఖముగా నుండును. నాధాన్యకోశధనకోశములను గూడ వనమునకుఁ బోవుచున్న రాముని వెంటఁబంపుము. రాముఁడు పుణ్యక్షేత్రములయందు యాగమును జేయుచు శాస్త్రోక్తదక్షిణలనిచ్చుచుఁ జతురంగసైన్యములతోడను, ఋషులతోడను గూడి సుఖముగా నివసించుచుండుఁగాక. మహాబాహువుఁ డగు భరతుఁ డిచ్చటనుండి యయోధ్యను బరిపాలింపుచుండుఁగాక. శ్రీమంతుఁ డగు రాముని సకలసంపదలతోఁ గూడ నరణ్యమునకుఁ బంపుమని యాజ్ఞ జేసె. ఇట్లు దశరధమహారాజు చెప్పినమాటలను విని కైకేయి మహాభయముగలదయ్యె. మఱియు శోషించినముఖముగలదయ్యె. డగ్గుత్తికకలదై నోటమాటరాదయ్యె. ఇట్లు కైకేయి మిగుల దుఃఖమును జెంది భయముగలదియును, శోషించినముఖముగలదియును నై దశరథమహారాజున కెదురుగా వచ్చి యిట్లనియె.

సత్పురుషుఁడా! దశరథమహారాజా! త్రాగబడినసారముగల మద్యమువలెనున్న యీరాజ్యమును గైకొనుటకు భరతుఁడు సమ్మతమును బొందఁడు. జనశూన్యంబైన నీరాజ్యమునందు భరతుఁడుండి యేమి చేయవచ్చును? కావున నీవివ్విధముగఁ జేయుట యుచితముగాదనియె. ఇట్లు కైకేయి లజ్జలేనిదై కఠోరములగు మాటను జెప్పఁగా విని దశరథమహారాజు విశాలనేత్రములుగల యాకైకేయిం జూచి యిట్లనియె.

ఓకైకేయీ! నీవు నాకు భార్యవుగావు. మఱియేమనినశత్రురాలవు. నన్నుఁగొప్పబరువును మోయుమని చెప్పితివి. నీమాటప్రకారముగ నేను బరువును మోయుచుండఁగా నింకను నన్నెందుకు బాధించెదవు. ఓసీ దుర్మార్గురాలా! ఇప్పుడు నేను రామునితోఁగూడ సకలసైన్యమును బంపఁదలఁచినవాఁడనైతిని. ఇట్లు పంపఁగూడదని పూర్వమే నీవేల నన్ను యడుగకపోతివి యని దశరథుఁడుఁ జెప్పె. అంతవరాంగన యగు కైకేయి దశరథమహారాజు కోపముతోఁ జెప్పినమాటను విని వేఱువిధము చేదనకోరికను జెఱుపఁదలఁచెనని రెండింతలు కోపముగలదై దశరథమహారాజును జూచి యిట్లనియె.

ఓమహారాజా! పూర్వమునందు నీవంశములోని సగరుఁడను వాఁడు తనజ్యేష్ఠపుత్రుఁడగు నసమంజసుఁడను వానినరణ్యమునకుఁ బంపెనుగదా? అప్పుడాయసమంజసుఁడు చతురంగబలముతోఁగూడి యరణ్యమునకుఁ బోయెనా? లేదే! కావున నరణ్యమునకుఁ బంపుమనఁగా ధనహీనునిగాఁ జేసి పంపుమనియర్థము గాదా? ఆయసమంజసుఁ డేవిధముగ నరణ్యమునకుఁ బోయెనో యావిధముగానే రాముఁడు గూడ నిర్ధనుఁడై యరణ్యమునకుఁ బోవలయునని చెప్పె. ఇట్లు చెప్పుచున్న కైకేయి మాటలను విని దశరథమహారాజిట్లని తలఁచె. ఆహా! యీనీచురాలు పూర్వమడుగని దానినిగూడ నిప్పుడు డడుగుచున్నదే? ఇది యెంత క్రూరురాలు. ఇది భగ్గుమని మండిపోవుఁగాక యని చెప్పె. అవ్విధముగఁ గైకేయి చెప్పుటను జూచి యక్కడనున్న వారందఱును మిగులనసహ్యము పొందిరి. అవ్విధముగ వారందఱును నసహ్యమును జెందినను గైకేయి మాత్రము కొంచెమైనను వారిని లక్ష్యము సేయనిదయ్యె. ఆసమయమునందు అచ్చటనున్న వారలలో ముసలివాఁడును, బరిశుద్ధుఁడును, దశరథునకు ప్రియుఁడునునగు సిద్ధార్థుఁడను దశరథమహారాజుయొక్క మంత్రి కైకేయిం జూచి యిట్లనియె.

ఓకైకేయీ! దుర్మార్గుఁడగు నసమంజుఁడు మార్గమునందాటలాడుకొనుచుండు పిల్లకాయలను బట్టితెచ్చి సరయూనదీజలంబులయందుఁ బడవైచుచు నట్టిదుష్కృత్యముచేత సంతోషముగ గ్రీడించుచుండెను. అట్లుండుటచేతఁ బట్టణవాసులందఱును, నసమంజుని క్రూరకృత్యమును జూచి కోపముగలవారై సగరచక్రవర్తితో నిట్లనిరి. ఓసగరచక్రవర్తీ! నీవు సర్వకాలములయందును రాజ్యమును వృద్ధినిఁ బొందించువాఁడవుగదా? ఇప్పుడు నీవసమంజునినైన నుంచుకొనుము, అట్లుగాదేని మమ్ములనైన నుంచుకొనుము. ఇవ్విధము

గఁజేయవేని మేమూరునువిడిచిపోయెదము. కాదేనివానిని వెడలఁగొట్టి మమ్ములనైననుంచుకొనుమని చెప్పిరి. అంతసగరచక్రవర్తి వారలనందఱఁజూచి యోజనులారా! మీకందఱకును నిట్టిభయముగలుగుటకుఁ గారణమేమియో చెప్పుడనెను. అంతవారిట్లనిరి.

మహారాజా! ఈయసమంజుఁడు బుద్ధిలేనివాఁడైయాటలాడుకొనుచుండు మాకొడుకులనుబట్టి సరయూనదియందుఁ బడవైచి వారుతేలుచుండగ బరమసంతోషము వొందుచున్నాఁడనిచెప్పిరి. అంతనాసగరచక్రవర్తి ప్రజలుచెప్పిన మాటనువిని వారలకుసంతోషమునుజేయఁగోరి ప్రియపుత్రుఁడగు నసమంజునివదలెను. మఱియునాసగరచక్రవర్తి యయ్యసమంజుని, పైగుడ్డతో వానిభార్యనుగూడచేర్చిరథంబుపైనెక్కించి యతనియావజ్జీవముపట్టణమునకు రానీయవలదు. ఈపాపాత్ముని నరణ్యములోనేయుండునట్లు సేయుఁడని తనభృత్యులకాజ్ఞాపించె. అంతనయ్యసమంజుఁడుగుద్దలిని, చిన్నగంపనుదాల్చి పాపిష్ఠునివలెనన్నిదిక్కులకుందిరుగుచుఁ బర్వతములయందలి గహనప్రదేశములయందు ప్రవేశించికందమూలఫలములను ద్రవ్వుకొనిజీవించుచుండెను. ఇట్లుతనపుత్రుఁడు మహాపరాధమునుజేయుటచేతఁ బరమధర్మాత్ముఁడగు సగరచక్రవర్తియతనిని విడిచిపెట్టెను. ఇప్పుడునీవురాముని నరణ్యమునకుఁ బంపుచున్నావే? అట్లురాముఁడేమియును దప్పునుజేయలేదే? రామునియందుఏదుర్గుణమునుగనఁబడలేదే? చంద్రునియందు మలినములేనివిధముగరామునియందంతమాత్రమును దోషముగనుపడలేదు. ఓకైకేయీ! నీకురామునియందుఏదైన దోషముగుపడెనేని దానినిప్పుడు నిశ్చయముగాఁజెప్పుము. అట్లుచెప్పితివేని పిమ్మటరాముని నరణ్యమునకుఁబంపవచ్చును. నిర్దోషుఁడును, పరమధర్మాత్ముఁడునునగువానిని వెడలఁగొట్టుదువేని యట్టియధర్మము దేవేంద్రునిసంపదనుగూడ నశింపజేయును. సుందరాంగీ! కైకేయీ! కావుననీవిఁకమీఁద రామునిసంపదనుగుఱించి విఘ్నమునుజేయకుము. అధర్మదోషము వచ్చుననుటగాదు. నీవులోకాపవాదమునకైనను భయపడవలయునుగదా? యనిసిద్ధార్థుఁడను మంత్రి చెప్పినయచ్చోటనున్న దశరథమహారాజు సిద్ధార్థుఁడుచెప్పినమాటలనువిని దుఃఖముచేమిగులహీనమగు స్వరముచేత మాటలుతడబడ కైకేయింజూచి యిట్లనియె.

ఓపాపిష్ఠురాలా! కైకేయీ! యీసిద్ధార్థుఁడుచెప్పిన మాటలనుగూడవినవుగదా? ఇట్లునీచమార్గము నవలంబించినీచవుచేష్టలుసేయుదు నామేలునుగాని, నీమేలునుగాని యెఱుంగవు. కావుననీకార్యము మంచిదికాదు. నేనిప్పుడే సుఖమును, రాజ్యమునుబరిత్యజించి రామునితోఁగూడఁ బోయెదను, నీవుభరతునిరాజునుగాఁ జేసికొనియతనితోఁ గూడసుఖముగా రాజ్యమునేలుచుండుమనియె.

ఇట్లుశ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదాఱవ సర్గముముగిసెను.

{సీతారామలక్ష్మణులకు నారచీరలను కైకేయి తెచ్చియిచ్చినదానినివసిష్ఠమహర్షిచూచి కైకేయినినిందించుట.}

అట్లుసిద్ధార్థుఁడు చెప్పినమాటలువిని, గురువులయొద్దవినయముగా సంచరించుసామర్థ్యముగల రాముఁడుసవినయముగా దశరథునిఁజూచి యిట్లనియె.

దశరథమహారాజా! సకలభోగములను వదలిసర్వమంగళములను బరిత్యజించివనములయందుఁ గందమూలఫలములను భుజించిజీవించునట్టి నాకీసేనమొదలగువానివలనఁ బ్రయోజనమేమి? ఒకనికిసర్వోత్తమమగు నేనుఁగునిచ్చివేసి దానినడుమునఁగట్టెడు మోకునందుఁ గోరికయుంచుకొనునేని అట్టివాడుయుత్తమగజము పోయినపిమ్మటనాత్రాడుతోనేమిలాభమును బొందఁదలచుచున్నాఁడనవచ్చును గజముపోయినపిమ్మటఁ ద్రాటితోఁబ్రయోజనమేమియును లేదు. మఱియునో దశరథమహారాజా! నీవుసత్పురుషులలోనుత్తముఁడవు. మదపుటేనుఁగును విడిచిపెట్టినవానికి దానిత్రాటితోనేమియును బ్రయోజనములేనట్లు రాజ్యమును, సకలపదార్థములను, ధనమును, భోగములనువదలినపిమ్మట నాకీసైన్యముమొదలగుదానితోఁ బ్రయోజనమేమియునులేదు. కావుననిప్పుడునాకు నీవుయివ్వఁదలఁచిన వానినన్నటిని నేనుభరతునకివ్వఁదలచియున్నాను. నాకునారచీరలనుమాత్రము తెచ్చియివ్వవలయును, నేనిఁకమీఁదటనరణ్యమునకుఁబోయి పదునాలుగు సంవత్సరములచ్చట నివాసమునుజేయవలయును. అట్టివనవాసమునకు దగినవియును, కందమూలఫలములను దెచ్చికొనుటకు సాధనములైనవియునునగు గుద్దలి, పుటిక, అనురెంటినిమాత్రమివ్వవలయునని రాముఁడుదశరథునితోఁజెప్పెను. ఆసమయంబుననకైకేయి యచ్చటిజనులందఱును జూచుచుండఁగఁ గొంచెమైనను సిగ్గులేనిదైబిరబిరబోయి తానేనారచీరలనుదెచ్చియిచ్చి రాముఁడా! ఈనారచీరలంగట్టుకొమ్మనియె. అంతఁబురుషోత్తముఁడగు నారాముఁడుకైకేయివలన నానారచీరలనురెంటిని గ్రహించియదివఱకు ధరించియున్నమృదువైన వస్త్రములనువదలి ఋషులవలెనానారచీరలనుధరించె. అప్పుడందఱును జూచుచుండఁగలక్ష్మణుఁడుగూడ రామునివలెమృదువైన వస్త్రములనువదలి

మునులు ధరింపఁదగిననారచీరలనుధరించె. అంతటఁ బట్టుపీతాంబరమును ధరించియున్నసీతాదేవి తానుగట్టుకొనుటకుఁ దెచ్చియిచ్చిననారచీరను జూచి,వలనుజూచినలేడివలెమిగుల భయముగలదయ్యె. శుభలక్షణములు గలదియును, ధర్మజ్ఞురాలును, నగుసీతాదేవి కైకేయియిచ్చిన నారచీరలనుమహావ్యసనముచేతఁ బుచ్చుకొనికన్నుల నీరుప్రవాహమువలె బ్రవహింపగారోదనముజేయుచు" గంధర్వరాజువలెఁ బ్రకాశించుచున్న" పెనిమిటియగురామునిఁజూచి యిట్లనియె.

ప్రాణనాథా! వనములయందుసంచరించునట్టి మునిభార్యలునారచీరల నేవిధముగఁగట్టుకొందురు. ఆవిధమును నాకుఁజెప్పుము. చెప్పినయెడల నేను నారచీరనుగట్టుకొనియెదనని చెప్పె. అవ్విధముగసీతాదేవి నారచీరనుగట్టుకొనుటకుఁ దెలియనిదై యేమియునుదోఁచక భ్రాంతినిబొందియుండె. మఱియునచ్చటజనక మహారాజపుత్రికయగు సీతాదేవియానారచీరల రెంటిలోనొకదానిని కంఠమునందుఁబెట్టుకొని మఱియొకదానినిజేతఁ బట్టుకొనిధరించుకొనుటకు దెలియనిదైసిగ్గునొంది యూరకుండె. అట్లుండుటనుజూచి ధార్మికుడగు రాముఁడతి త్వరితముగసీతయొద్దకువచ్చి సీతాదేవికట్టుకొన్న వస్త్రముమీఁద మునిపత్నులుగట్టుకొనఁదగినవిధముగ నారచీరనుగట్టిచూపెను. అవ్విధముగనుత్తముడగు రాముడుసీతకునారచీరను గట్టుటనుజూచి యంతఃపురమునందలి స్త్రీలందఱునుగన్నీరు గారఁగాగొంతెత్తిగట్టిగా రోదనమునుజేయదొడంగిరి. అంతనయ్యంతఃపురస్త్రీలందఱును మిగుల నాయాసంబునుబొందిమిగులకాంతితో బ్రకాశించుచున్న రామునిఁజూచి యిట్లనిరి.

రాముఁడా! నీవరణ్యమునకుఁ బోవలసినదనియాజ్ఞాపింపఁబడియున్నదిగాని సీతనుగూడనరణ్యమునకుఁ బొమ్మనియాజ్ఞాపింపఁ బడలేదుగదా? కాబట్టిసీతను మాత్రమిచటవిడిచిపెట్టిపొమ్ము- నీవువచ్చువఱకునీకుబదులుగ సీతనైననుజూచుచు సంతోషించుచుండెదము. మహాప్రభో! రామా! నీవులక్ష్మణుని మాత్రముబిలుచుకొని యరణ్యమునకుఁ బొమ్ము ఈసీతపరమమంగళస్వరూపురాలు. ఇమ్మహాదేవిమునివలె నరణ్యమునవసింపఁదగినదిగాదు. పుత్రుడా! రామా! నీవుధర్మమార్గమును దప్పకసంచరించువాడవు. కావుననినెప్పుడెంత ప్రార్థించిననునీవికడనుండువాఁడవుగావు. నీవుసమ్మతింపకపోయినను సీతనైననిచ్చోటవిడిచిపొమ్ము మా ప్రార్థనంగీకరింపుమని యంతఃపురస్త్రీలనేకవిధముల రామునిబ్రార్థించిరి. అప్పుడుదశరథమహారాజపుత్రుఁడైన రాముఁడు యంతఃపురస్త్రీలెన్నివిధముల చేతఁజెప్పినను వారిమాటలనువినుచు సీతకువనవాసమునకుఁదగిన నారచీరనుగట్టెను. ఆసమయమునందు దశరథమహారాజునకు గురుఁడగువసిష్ఠమహాముని యాసీతాదేవినారచీరను గట్టుకొనుటనుజూచి సీతనువారించికైకేయింజూచి యిట్లనియె.

ఓదుష్టాత్మురాలా! కులవినాశకురాలా! కైకేయీ! నీవధికప్రసంగపు కార్యమును జేయుచున్నావు; నీవుదశరథమహారాజును మోసముచేసివరములను గైకొంటివి. ఏవరమునుగైకొంటివో యంతటతోనిలువకమఱియును క్రూరత్వమునవలంబించుచున్నావు. సదాచారహీనురాలా! కైకేయీ! సీతాదేవి, యిప్పుడువనమునకుఁ బోవలసినపనియేమియునులేదు. ఇంతయగాకసీతాదేవి, యిప్పుడురామునకు సిద్ధముగానున్నసింహాసనమునెక్కి రాజ్యమును బరిపాలింపఁగలదు. గృహస్థులకందఱకును భార్యస్వరూపమువంటిదని వేదమునందుఁ జెప్పఁబడియున్నది. సీతాదేవిరామున కాత్మస్వరూపముగావున రాముఁడుపరిపాలింపఁదగిన భూమినియేలుచుండును. ఇట్లుగాకయీసీతాదేవి యరణ్యమునకుఁ బ్రయాణమైపోయెనేని మేమందఱమును సీతతోఁగూడనరణ్యమునకుఁ బోయెదము. ఇంతయగాక యీపట్టణమునందుండు వారలందఱును నరణ్యమునకుఁబోదురు. రాముఁడుతనభార్యయగు సీతతోఁగూడఁ బోయినస్థలమునకు సేనాపతులందఱునుబోదురు మఱియు భరతశత్రుఘ్నులుగూడ నారచీరలను ధరించుకొనియరణ్యమునకుఁబోయి వనవాసమును జేయుచున్న అన్నయగు రామునకు శుశ్రూషను జేయుచుందురు. అంతటదురాచారురాలవును, ప్రజలకుఁగీడునుజేయుదానవును, నగునీవొక్కతె వేయిచ్చటనుండిజనశూన్యమై పాడువడియుండు భూమినిచెట్లతోఁగూడ పరిపాలింపుచుండుము. దశరథమహారాజుగూడ దాసీదాసాదిసహితముగా నీపట్టణమున నున్నవారందఱును రామునివెంబడించిపోవుదురు. రాముడురాజుగానుండనిచోటు కొంచెమైనను రాజ్యమనిచెప్పఁబడదు. ఇంతయగాకరాముఁడులేని దేశమరణ్యముగానే యుండును. రాముఁడరణ్యముననుండిన నదిరాజ్యమేయగును. భరతుఁడుదశరథమహారాజుయొక్క గర్భమునందుపుట్టిన వాఁడగునేనితనకుప్రీతిపూర్వకముగాఁ దండ్రియివ్వనిభూమిని బరిపాలింపఁడు. తండ్రికివిరోధముచేసిన నీయందుఁ గొంచెమైనసుభరతునకు మాతృభక్తిగలిగియుండదు. నీవీభూలోకముననుండి యాకాశమునకెగిరిపోయినను తండ్రికులమునఁబుట్టినవారి సదాచారమునుజి

కొడుకగాఁబుట్టిన భరతుఁడుగొంచెమైనను నీవుకోరినప్రకారముచేయఁడు. రాముని నాశ్రయింపనివాఁడు లోకమునందేయుండఁడు. అట్లుండఁగాఁదమ్ముఁడైన భరతునకు అన్నయగురామునియందు స్నేహమధికముగా నేలనుండకపోవును? నీవురాజ్యమునిచ్చినను భరతుడురామునియందలి ప్రియముచేతనిన్ను శత్రురాలినిగాఁదలంచును. కాఁబట్టినీవుభరతునియందుండు ప్రియముచేతనింతటి క్రూరకృత్యమును జేసి రాజ్యమును సంపాదించియిచ్చినప్పటికిని నీకుభరతుఁ డపకారమును జేయును. ఓకైకేయీ! నీవింకనతిశీఘ్రముగానే రామునివెంటనంటిపోవునట్టి పశువులను, ఏనుఁగులను, జింకలను, పక్షులను, నతనితోఁగూడబోవుటకిచ్ఛయించుచున్నట్లున్న వృక్షములను జూడఁబోవుచున్నాను. ఓకైకేయీ! ఇఁకనీవునీకోడలయిన సీతకుమంచియాభరణములనిమ్ము. ఇమ్మహాదేవికినారచీరలు తగియుండలేదనిచెప్పి వసిష్ఠుఁడు, సీతాదేవి, నారచీరనుగట్టుకొనుచుండఁగా వలదనియడ్డగించెను. అట్లువారించిమరలఁ గైకేయితోనిట్లనియె.

ఓకైకేయీ! నీవీరామునొకఁడే యరణ్యములోనివసింపజేయవలయునని కోరినావుగాని మఱియొకవిషయమునైనను ఈసీతనరణ్యములో నుండవలెననియైనను కోరినదానవుగావు. కావునసర్వకాలములయందు నలంకారమునకుఁదగినట్టియీ సీతాదేవి సర్వాభరణములచేతను నలంకారచేసికొనినదై యడవియందురామునితోఁగూడ వనవాసమును జేయునుఁగాక. కాఁబట్టి యిట్టికార్యమున కంగీకరింపుము. రాజపుత్రికయగు సీతాదేవి, శ్రేష్ఠములగువాహనములతోడను, పరిచారకులతోడను, ననేకవిధములయిన వస్త్రములతోడను, సమస్తసామగ్రులతోడను గూడఁబోనిమ్ము. నీవువరములనడుగునప్పుడీసీతగూడవనములోనుండవలయునని నీవడిగినదానవుగావని వసిష్ఠుఁడు కైకేయితోఁ జెప్పెను. బ్రాహ్మణోత్తముఁడును, దశరథమహారాజునకుఁగులగురువును, మహాత్ముఁడును, నైనవసిష్ఠమహాముని యీప్రకారము చెప్పుచున్నప్పటికిని పెనిమిటినివెంబడించి వనమునకుఁబోవనిశ్చయించిన సీతాదేవితనయొక్కయభిప్రాయమును వదలినదయ్యె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదేడవసర్గముగిసెను.

దశరథమహారాజు కైకేయిని నిందించుట

సర్వలోకములకును నాథుఁడగురాముఁడు నాథుడుగాఁ గలిగినదైనను ననాథవలె నారచీరను ధరించుచున్న యాసీతాదేవినిఁజూచి యచ్చటిజనులందఱును ఓదశరథుఁడా! "నీవుమండిపోదువుగాక,, ఇట్టివరమునుగూడనిత్తురా! యనినిందించిరి. అవ్విధముగనెల్లవారును దన్నునిందించుటనుజూచి దశరథుఁడు మహాదుఃఖమునుబొంది తనయొక్కప్రాణమునందును, తానుచేయుధర్మమునందును, తనకీర్తియందును, యిష్టములేనివాఁడయ్యె. అట్లుధర్మకీర్తులయందుఁ బ్రియములేని దశరథమహారాజు వెచ్చనినిట్టూర్పులనునిగుడించి యాకైకేయింజూచియిట్లనియె.

ఓకైకేయీ! సీతాదేవినారచీరను ధరించుకొనిపోఁదగినదికాదు. ఈసీతమిగులమృదువైన శరీరముగలది. అదియునుఁగాక మిగులచిన్నవయస్సుగలది. కావునసర్వకాలములయందును సుఖముగానుండఁదగినది. ఎంతమాత్రమును వనములోనుండఁదగినదికాదని నాకులగురుఁడగువసిష్ఠమునివరుఁడు చెప్పినమాటసత్యము. ఈసీతాదేవి, నారచీరనుధరించుకొని జనులమధ్య దేహముదెలియక యొకానొకతాపసస్త్రీవలెనున్నదే? కరుణింపదగినదియును, రాజోత్తముఁడగు జనకచక్రవర్తికిఁ గుమార్తెయునునగు నీసీతయెవ్వరికపకారమును జేసినది. జనకమహారాజుకుమార్తెయగు నీసీతయిప్పుడునారచీరలను విచ్చివేయనిమ్ము. ఈవిధముగాసీతగూడ నారచీరలనుధరించి యరణ్యమునకుఁబోవునని మునుపునీకునేను వరములనిచ్చియుండలేదు. కావున రాజపుత్రికయగు సీతసకలాభరణములనుధరించి సర్వరత్నములతోడంగూడి సుఖముగానరణ్యమునకుఁ బోనిమ్ము. నాకుమరణకాలము సమీపించినందున నేనునీవడిగినదానిని దప్పకచేసెదనని ఒట్టునుపెట్టుకొని ప్రతిజ్ఞనుజేసితిని. అంతటనీవజ్ఞానముచేత రామునివనమునకుఁ బంపవలయుననియు, భరతునకభిషేకింప వలయుననుటయే కావలయుననికోరితివి. ఏమిసేయవచ్చును. వెదురులతనపుష్పముచేతఁ దానుదహింపఁబడునట్లు నాప్రతిజ్ఞచేతనే నేనుదహింపఁబడితిని. పాపాత్మురాలా! నీచురాలా! కైకేయీ! రాముఁడొకవేళయేమైనఁ గొంచెముఅపకారమును నీకుఁజేసియుండునేని యీసీతనీకేమికీడుచేసినది. లేడికన్నులవలె సుందరములైన కన్నులుగలదియును, సౌమ్యస్వభావముగలదియును, కరుణింపదగినదియును నగునీసీత నీకేమి యపకారముచేసినది. పాపిష్ఠురాలా! నీకురాముని నడవులకుఁబంపుటచేతఁ దృప్తికలుగలేదా? ఇంకనునివ్విధముగ నిర్దయురాలవై పాపములనుజేయుటవలనఁ బ్రయోజనమేమి? కైకేయీ! నీవికొడుకుఁబట్టాభిషేకమునకు వచ్చినరామునిఁజూచి రాముఁడా! నీవునారచీరలను ధరిం

చుకొని యరణ్యమునకుపోయి పదునాలుగుసంవత్సరములు నివసింపుమని చెప్పితివే? నేనునీమాటనువిని రాముని నరణ్యమునకుఁబంపుటకు నిశ్చయించితినిగాని సీతయరణ్యమునకుఁ బోవుటనుగురించి కొంచెమైనను ప్రతిజ్ఞను జేసియుండలేదు. నీవెంతక్రూరురాలవో? సీతనారచీరలను ధరించుకొనుచుండఁగాఁ జూడవలయునని యభిలషించుచున్నావు. నాచేనీవెంతవఱకు వరమునుబొందితివో యంతటితో నిలువక, నరకమునుబొందగోరుచున్నావని చెప్పెను. అంతటమిగుల ధైర్యశాలియగు నాదశరథమహారాజు యిట్లు చెప్పితనదుఃఖమునకుఁ గొంచెమైనను అంతముఁగానక దుఃఖసముద్రమునమునిఁగి మిగులవ్యసనముగలవాఁడగుటచేభూమిమీదబడె. ఇట్లు క్రిందపడి లేచి తలవంచుకొని కూర్చుండియున్న తండ్రినిజూచి రాముఁడువనమునకు బోవుటకు ప్రయాణమై యిట్లనియె.

ధర్మాత్మా! దశరథమహారాజా! నాతల్లియైనయీకౌసల్యాదేవి మిగులకీర్తివంతురాలు. ఇంతయగాక మిక్కిలి ముసలిది. మఱియు శ్రేష్ఠమైన స్వభావముగలది ప్రియపుత్రుండనైన నన్ను అరణ్యమునకుఁ బంపుచున్నప్పటికినినన్నేమియును నిందింపకనిన్నుఁజూచుచున్నది. దశరథమహారాజా! నీవువరములనిచ్చువాఁడవు. నేనువనమునకుఁబోయిన పిమ్మట నాతల్లియగుకౌసల్య దుఃఖసముద్రమునందుఁ బడియుండును. ఇదివఱకెన్నఁడు నెవ్విధమైన దుఃఖమునను భవించియుండలేదు. కావుననాతల్లియగు కౌసల్యపుత్రదుఃఖముఁబొందకుండునట్లు పూజ్యుఁడవైన నీవుపూజింపుచుండుదువేని యీకౌసల్యాదేవినన్నుఁ దలఁచుకొనుచు నిన్నాశ్రయించి బ్రతికియుండును. దేవేంద్రసమానుఁడా! దశరథమహారాజా! పుత్రునియందు మిగులప్రియముగలనాతల్లియగు కౌసల్యనువనమునకుఁ బోయినపిమ్మట దుఃఖముచేగృశించి ప్రాణములనుత్యజింపకుండునట్లు నీవుకౌసల్యయందుదయను జూపుచుండవలయునని చెప్పెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదెనిమిదవసర్గముగిసెను.

—* దశరథమహారాజు సుమంత్రునితో రాముని వనమునందువిడిచిరమ్మని చెప్పుట. *—

అట్లు రాముఁడు చెప్పినమాటలను భార్యలతోగూడదశరథుఁడువిని మునివేషమును ధరించియున్నరామునిఁజూచి పరమదుఃఖమునుబొంది దశరథమహారాజు మూర్ఛనుబొందెను. అత్యంతమగుదుఃఖముగల యాదశరథమహారాజు మునివేషమును ధరించియున్నరాముని జూడనేరకపోయెను. అతికష్టముచేతఁజూచి దుఃఖముచేత నేమియునుబలుకజాలకయూరకుండె. మఱియునుమహాబాహుఁడగు దశరథమహారాజు మిక్కిలిదుఃఖముగలవాఁడై కొంతసేపు మూర్ఛనుబొందినట్లుండి రామా! రామా! యనిరామునే మాటిమాటికితలచుకొనుచు రోదనమునుజేసె. అట్లు రోదనమును జేసి యిట్లనియె.

హారామా! నేనుపూర్వజన్మములందనేకులగు బిడ్డలనుజంపియుందును. జీవహింసయును మెండుగఁజేసియుందును. కావుననేనాకిటువంటి పుత్రదుఃఖముసంప్రాప్తమైనది. ''నైవా౽నత్వేవానాగతేకాలేదేహాచ్చ్యవతిజీవితమ్'' మరణకాలమురానిది యెట్టివానికిని దేహమునుండి ప్రాణముదొలఁగిపోదు. అగ్నిహోత్రునకు సమానుఁడగునాపుత్రుఁడుమృదువులైన వస్త్రములనువిడిచిపెట్టి మునులుకట్టుకొనునారచీరలనుధరించి నాముందరనిలిచియున్నాఁడు. ఇట్లునిలిచియుండగాఁజూచుచుఁ గైకేయిచేత శ్రమనొందుచున్నప్పటికిని నాకుమరణముగలుగకున్నది. ఇవ్విధముగఁ గపటవ్యాపారమునవలంబించి తనకార్యమును బాగుచేసికొనుటకుఁగా ననేకవిధముల బ్రయత్నించుచున్న యీకైకేయికొఱకు నీజనులందరును వ్యసనమునుబొందుచున్నారుగదా? హాదైవగతికేమిచేయవచ్చునని దశరథమహారాజు రోదనమునుజేసె. అంతనాదశరథుఁడిట్లనేకవిధములదుఃఖించి కంటినుండినీరు ప్రవాహమువలె,, ప్రవహింపుచుండఁగా రామా! యనిపిలిచి యంతటమాటలాడనేరకయూరకుండె. అంతఁగొంతసేపటికిదశరథమహారాజు తెలివిదెచ్చుకొని కంటినుండినీరు ప్రవహింపుచుండఁగా సుమంత్రునిఁజూచి యిట్లనియె.

సుమంత్రుఁడా! నీవుముందుగఁబోయి వినోదముగానెక్కఁదగిన యొకరథమునకు శ్రేష్ఠములైన గుఱ్ఱములను గట్టియిక్కడకుఁదెచ్చి మహాత్ముఁడగు నీరామునినెక్కించుకొనిపోయి యీరాజ్యమునకవతలనుండునట్టి వనమునందు వదలిపెట్టిరమ్ము. తల్లిదండ్రులిరువురునుజేరి గుణవంతుఁడును, శౌర్యవంతుఁడును, నగుపుత్రునినరణ్యమునకుఁ బంపుచున్నారే? గుణముగలవారలకు గుణములుగలుగుటకిదియేఫలముగాబోలు. నాయందుసత్యముమొదలగు గుణములులేకపోయెనేని నేనివ్విధముగ రాముని వనమునకుఁ బంపనుగదా? కాబట్టిగుణములును గొన్నికాలములయందుఁ గష్టమునుగలుగఁజేయునని దశరథమహారాజుచెప్పె. అంతనాసుమంత్రుఁడు రాజాజ్ఞాప్రకారముగ శీఘ్రముగాఁబోయి రథమునుశృంగారించి గుఱ్ఱములనుగట్టి తీసికొనివచ్చె. మఱియునాసుమంత్రుఁడు రామునింజూచిరా

మా! సువర్ణముచేత నలంకరింపఁబడినదియును, శ్రేష్ఠములగు గుఱ్ఱములనుగట్టినదియును, నగురథంబాయుత్తముగానున్నదని చేతులుముకుళించుకొనిచెప్పె. అంతనాదశరథమహారాజుఏదేశంబునందు ఏకాలంబునందుఏకార్యములను జేయుటయందు మిగులసామర్థ్యముగలవాఁడుగనుండునో అట్టినిశ్చయవంతుఁడును, మిగులఁబరిశుద్ధతగలవాఁడును,నగుధనాధ్యక్షుని శీఘ్రముగరప్పించి యిట్లనియె.

ధనాధ్యక్షుఁడా! ఇప్పుడుసీతయరణ్యమునకుఁ బోవుచున్నది. పోయిపదునాలుగు సంవత్సరము లక్కడనుండును. ఈపదునాలుగు సంవత్సరములకును గావలసినంత శ్రేష్ఠములగు వస్త్రములును, శ్రేష్ఠములయిన యాభరణములును, శీఘ్రముగాదీసికొనివచ్చియిమ్మని ధనాధ్యక్షునకాజ్ఞాపించెను. అంతటనాధనాధ్యక్షుఁడు దశరథుఁడుచెప్పినప్రకారముగ ధనాగారమునకుబోయిదశరథుఁడుచెప్పినపదార్థములనన్నిఁటిని దీసికొనివచ్చిపదునాలుగు సంవత్సరములకును గావలసినంత సీతాదేవికియిచ్చెను. మిగులసౌందర్యముగల సీతాదేవి, యడవులకుఁబోవఁబయనమై యనేకవిధములగు నాయాభరణములను సుందరములగు నవయవములయందు ధరించుకొనిశృంగారించుకొనియె. ప్రాతఃకాలమునందు క్రొత్తవియైనకిరణములతో నుదయించుచున్న సూర్యునికాంతిచేత నాకాశము ప్రకాశించువిధముగఁ జక్కగశృంగారించుకొనియున్న సీతాదేవియొక్కదేహకాంతిచేత నాప్రదేశమంతయునుప్రకాశించె. అప్పుడత్తగారగు కౌసల్యాదేవి కపటమగునాలోచనములనుజేయనట్టి యాసీతనుచేతులతోగ్రుచ్చియెత్తి కౌఁగిలించుకొని శిరమును ముద్దుబెట్టుకొని యిట్లనియె.

“శ్లో॥ అసత్యస్సర్వలోకేస్మిన్ సతతంసత్కృతాః ప్రియైః। భర్తారంనానుమన్యంతేవినిపాతగతంస్త్రియః,, తల్లీ!సీతా! ఈలోకమునందంతటను, దుష్టస్త్రీలుతమపెనిమిటితాముకోరినవస్తువులనిచ్చిసంతోషమునుగలుగఁజేయుచున్నప్పటికిని ఆపెనిమిటికిఁ గష్టకాలము వచ్చినప్పుడు కొంచెమైనను లక్ష్యమునుజేయరు. మఱియును“శ్లో॥ ఏషస్వభావోనారీణామనుభూయపురాసుఖం। అల్పామప్యాపదం ప్రాప్యదుష్యంతిప్రజహత్యపి,, మొట్టమొదట సుఖమును ననుభవించినప్పుడు యోగ్యతగలవారలుగానుండి కావలసినంతసుఖము ననుభవించిపిమ్మట పెనిమిటికిదారిద్ర్యముమొదలగు నాపదలుసంభవించినప్పుడు దుష్టస్వభావముగలవారై తమభర్తనువిడువవలయుననితలంతురు. ఇదిస్త్రీలకందఱకును సహజమైనగుణము.“శ్లో॥ అసత్యశీలావికృతా దుర్గ్రాహ్యహృదయాస్తథా। యువత్యఃపాపసంకల్పాః క్షణమాత్రాద్విరాగిణః॥ స్త్రీలుసర్వకాలములయందును నబద్ధమునేయాడుచుందురు. ఇంతయగాకవికారమైన బుద్ధికలిగిప్రవర్తింతురు. వారిమనస్సునెఱుంగుటమహాకష్టము. వారుసర్వకాలములయందును పాపమునే చేయుటకు యత్నించుచుందురు. కొంచెముపకారమునుజేసినను, నదివఱకున్నప్రీతినిసర్వమును విడిచిపెట్టుదురు. కావునవారిని నమ్మగూడదు. “శ్లో॥ నకులంనకృతంవిద్యాంనదత్తంనాపిసంగ్రహమ్ । స్త్రీణాంగృహ్ణాతిహృదయమనిత్యహృదయాహితాః॥ స్త్రీలమనస్సు, మంచికులమునుగాని, మేలునుగాని, విద్యనుగాని, ధనాదులనుగాని, లోకసన్మానమునుగాని, మఱియేసుగుణమునుగాని లెక్కింపదు. వారిమనస్సుసర్వకాలములయందును మిగులఁజపలముగానుండును. కావునవారలనమ్మఁగూడదు.(ఈమాటలచే కౌసల్యాదేవికైకేయినికపటముగానిందించెను)శ్లో॥సాధ్వీనాంహిస్థితానాంతు శీలేసత్యేశ్రుతేశమే। స్త్రీణాంపవిత్రంపరమంపతిరేకోవిశిష్యతే॥ మఱియునోసీతా! నేనివ్విధముగఁజెప్పినందుకుఁ గోపమునుజెందక యిప్పుడునేనుచెప్పినవిధముగ దుర్గుణములనువదలి సదాచారమునవలంబించి సత్యమునుదప్పకపెద్దలుపదేశించినవిధముగఁ బ్రవర్తించునట్టి పతివ్రతాస్త్రీలకుఁ బత్రుఁడైనపెనిమిటియొక్కడే శ్రేష్ఠుఁడగుచున్నాఁడు. కావున నీవును బెనిమిటినినేదైవము గాఁదలంపుము. నీవుదుష్టస్త్రీలబుద్ధినవలంబించి నీపెనిమిటినిర్ధనుఁడై వనములయందు సంచరించుచున్నాఁడని నాకుమారునినగౌరవింపవలదు. దరిద్రుఁడనియును, ధనికుఁడనియును విచారింపక రామునిదైవమునుగాఁ జూచుకొనుచుండుమనిచెప్పెను. అట్లుచెప్పుచున్నకౌసల్యాదేవియొక్క మాటలు ధర్మయుతములై యున్నవని సీతాదేవితెలిసికొనితనయెదుటనున్న కౌసల్యాదేవినిఁజూచి చేతులనుముకుళించుకొని యిట్లనియె.

పూజ్యురాలవైనయోయత్తా! నీవునాకేవిధముగ నాజ్ఞాపించుచున్నావో యావిధముగానే నేనుసంచరించెదను. భర్తవిషయమై నేనేవిధముగనుండవలయునో యావిధమంతయును పెద్దలవలనవినియున్నాను. కావుననాకుసర్వమును దెలిసియేయున్నది. ఆర్యా! పూజ్యురాలవైననీవునన్ను దుష్టస్త్రీలతోసమానముగఁజేయవలదు. ప్రకాశముచంద్రునివదలని విధముగనేనుధర్మమునువిడువను “శ్లో॥ నాతంత్రీవాద్యతే వీణానాచక్రోవర్తతేరథః। నాపతిస్సుఖమేధేత యాస్యాదపిశతాత్మజా,, తంత్రులులేనివీణవాయింపఁబడదు. చక్రములేనిరథముకదలఁజాలదు. నూర్గురుకొడుకులున్నను పెనిమిటిలేకపోయెనేని స్త్రీలకుసుఖముగ

లుగదు. "శ్లో॥ మితందదాతిహిపితామితం మాతామితం సుతః। అమితస్యహిదాతారం భర్తారంకానపూజయేత్,, తండ్రిమితముగానిచ్చును. తల్లియును మితముగానేయిచ్చును. పుత్రుఁడునుమితముగానేయిచ్చును. భర్తయమితముగానిచ్చును. అట్టిభర్తనుపూజింపని స్త్రీదుష్టురాలనిచెప్పఁబడుటకు సందేహములేదు. నేనుపాతివ్రత్యధర్మము నాశ్రయించి యున్నదానను. ఇంతియగాక మహాపతివ్రతాస్త్రీలవలనసకల ధర్మములనువినియున్నాను. ఇటువంటినేను పెనిమిటినెందుకవమానింతును. కొంచెముగూడనవమానింపను. స్త్రీలకుఁబెనిమిటియేగదా? దేవుఁడనిచెప్పెను. అట్లుసీతాదేవిచెప్పిన మహాసంతోషకరములగు మాటలనువిని పరిశుద్ధమగుసత్వగుణముగల కౌసల్యాదేవిరాముఁడు వనమునకుఁబోవుచున్నాఁడేయనియెడు వ్యసనమును, సీతమహాపతివ్రతగా నున్నదేయనియెడుసంతోషమునుగలదయ్యె. అట్లుసంతోషముగలదయ్యును గన్నులనీరుప్రవహింపగా ఘోదుఘోదుమనియేడ్వదొడంగె. అంతటపరమధర్మాత్ముఁడగు రాముఁడుతల్లులందఱిచేతను, మిగుల గౌరవముగఁ బూజింపఁబడుచుండు తనతల్లియగుకౌసల్యనుజూచి చేతులుముకుళించుకొని ప్రదక్షిణనమస్కారమునుజేసి యిట్లనియె.

అమ్మా! కౌసల్యా! నేనరణ్యమునందుండఁదగిన పదునాలుగుసంవత్సరములును నతిశీఘ్రముగానే గడచిపోవును. నీవుదుఃఖమునుబొందకుము. నాతండ్రియగు దశరథమహారాజును చక్కఁగఁజూచుకొనుము. మఱియునోతల్లీ! నీవుకొంచెముసేపు కన్నులనుమూసికొని నిద్రనుబొందుము. ఇంతలోఁబదునాలుగుయేండ్లును గడచిపోవును. పిమ్మటనిచ్చటకు వచ్చిమిత్రులతోఁగూడి సంపూర్ణకాముఁడనైయున్న నన్నుఁజూడఁగలవనిచెప్పెను. అనియిట్లురాముఁడు తల్లియగుకౌసల్యతో సవినయముగాఁజెప్పి పిమ్మటఁదనతల్లులను మున్నూటయేబదిమందిని లక్షించిచూచెను. దశరథనందనుఁడగురాముఁడు, తనతల్లులవలెమిగుల దుఃఖము నొందియున్న యాతల్లులకందఱకును నమస్కారమును జేసిధర్మయుతమగు వాకవాక్యమును జెప్పెను. ఓతల్లులారా! చిరకాలపరిచయదోషముచేతనైనను, అజ్ఞానముచేతనైనను, నేనేమైనయపరాధమును జేసియుంటినేనిదానిని మీరందఱును క్షమింపవలయును. మీయందఱివలనను నడవికి బోవుటకుసెలవు దీసికొనుచున్నానని చెప్పెను. దశరథుని భార్యలందఱును నిట్లురాముఁడుచెప్పిన ధర్మయుక్తమగు మాటలనువినిరి. మఱియు నాదశరథునిభార్యలందఱును రాముఁడివ్విధముగఁజెప్పినమాటనువిని యాదుఃక్రౌంచపక్షులవలె మనోహరమగుకంఠధ్వనితో ఘొారుమనియేడ్వదొడంగిరి. పూర్వముసర్వకాలములయందును మ్రోయింపఁబడుచుండు మద్దెలలయొక్కయు నుదుకలయొక్కయు, మేఘములను వాద్యవిశేషములయొక్కయు, ధ్వనులచేఁబ్రకాశింపుచుండు దశరథునిగృహమాసమయమున నచ్చటనుండునట్టి జనులందఱును నాపదనొందిమిగుల వ్యసనముచేదుఃఖింపుచుఁ గైకేయినినిందింపుచు రాముని, బ్రస్తుతించుచునానావిధవాక్యము లాడుకొనుచు నుండుధ్వనిచే గూడియుండెను. మఱియునాస్త్రీలయొక్క రోదనధ్వనులచేనిండియుండెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి ముప్పదితొమ్మిదవసర్గముగిసెను.

——సుమిత్రాదేవిలక్ష్మణునకునీతినిబోధించుట——

అంతట సీతారామలక్ష్మణులు ముగ్గురును జేతులను ముకుళించుకొని దశరథునకునమస్కరించి ప్రదక్షిణముజేసివృద్ధులగు తల్లిదండ్రులను విడిచిపోఁజాలక యధికముగ దుఃఖమునుజెందిరి. మఱియునారాముఁడు సకలధర్మములను దెలిసినవాఁడుగావున దశరథునియాజ్ఞలేనిదే సీతాలక్ష్మణులను దనవెంటఁదోడ్కొని పోఁగూడదనితలఁచిదశరథునియాజ్ఞనుబొంది, పిమ్మటఁదల్లినివదలి పోవలసివచ్చెనేయనియధికముగ దుఃఖముగలవాఁడై తల్లియగుకౌసల్యాదేవికి నమస్కారమును జేసెను. అన్నయగురాముఁడు నమస్కారమును జేయుటనుజూచి వెంటనేలక్ష్మణుఁడుగూడఁ గౌసల్యాదేవికి నమస్కారమును జేసెను. అవ్విధముగ లక్ష్మణుఁడుముందుగఁ గౌసల్యకునమస్కారముజేసి పిమ్మటఁదనతల్లియగు సుమిత్రాదేవిపాదములకు నమస్కారమునుజేసెను, అప్పుడుసుమిత్రాదేవి మిగులదుఃఖమునుబొందుచు లక్ష్మణునిహితమునుగోరి, తనకునమస్కరించిన మహాబాహుఁడగు లక్ష్మణునిచేతులతోయెత్తి శిరంబును ముద్దుపెట్టుకొనియిట్లనియె.

పుత్రుఁడా! లక్ష్మణా! నీవుమిత్రుఁడగు రామునియందుఁ బ్రియముగలవాఁడవైదైవముచేత వనవాసముకొఱకు సృజింపఁబడితివి. కావుననీవరణ్యంబునకుఁబోయి నీయన్నయగురాముఁడు భార్యతోఁగూడవనమునందలి విచిత్రములనుజూచుచుఁ బరవశుఁడైపోవునపుడు నీవేమఱియుండఁదగదు. నిష్కల్మషుఁడా! లక్ష్మణా! రాముఁడునీకన్నయగుటవలన ధనములేనివాఁడైనను, ధనవంతుఁడైనను, నీకుఁబూజ్యుఁడు. సకలలోకములయందును గనిష్ఠుడుజ్యేష్ఠునకు లోఁబడియుండుట వృద్ధాచారమైయుండుట

నీవెఱింగినదేను. ఇవ్విధముగ జ్యేష్ఠుని ననుసరించుటయును, దానముసేయుటయు, యజ్ఞములయందు దీక్షనువహించుటయు, యుద్ధమునందుశరీరమును విడుచుటయును, మొదలగునవియన్నియును, మీవంశమునందుసనాతనధర్మములుగ వచ్చుచున్నవనిచెప్పెను. ఇట్లుసుమిత్రాదేవి రామునితోఁగూడ నరణ్యమునకుఁబోవ నిశ్చయించినవాఁడను, రాముఁడుదక్కమఱియును బ్రియమైనపదార్థములేనివాఁడును, నగులక్ష్మణునకుఁజెప్పి మాటిమాటికి నీవరణ్యమునకుఁబొమ్మనిచెప్పి, అట్లుచెప్పి మఱియునిట్లనియె.

శ్లో॥ రామందశరథంవిద్ధి మాంవిద్ధి జనకాత్మజామ్। అయోధ్యామటవీం విద్ధిగచ్ఛ తాతయథాసుఖమ్। పుత్రుఁడా! నీవురామునిదశరథునిగాఁదెలిసికొనుము. జనకమహారాజునకుఁ బుత్రికయగుసీతను నన్నుదలఁచినట్లు తలపుము. అరణ్యమును నయోధ్యాపట్టణమునుగా నెన్నుము మఱియును సుఖముగానరణ్యమునకుఁబొమ్మనియె. అట్లుసుమిత్రచెప్పినపిమ్మటవినయమునుసదాచారమునుజక్కగానెఱింగిన సుమంత్రుఁడు మహావినయముగఁ జేతులను ముకుళించుకొని దేవేంద్రునిసారథియైన మాతలియింద్రునితోఁజెప్పినవిధముగ రామునింజూచియిట్లనియె.

రాజపుత్రుఁడవును, మిగుల కీర్తిగల వాఁడవునునైన యోరాముఁడా! నీవురథమునెక్కుము. నీకుశుభములుగలుగుఁగాక. నీవెక్కడకుఁ దీసికొనిపొమ్మనియెదవో యచ్చోటునకుఁగొనిపోయెదను. నీవరణ్యమునందుఁ బదునాలుగు సంవత్సరములుండవలయునుగదా? కైకేయినీకుఁజెప్పినవిధముగ నీవుపదునాలుగుసంవత్సరములును నరణ్యమునందుండుట కారంభింపవలయునుగదా? యనిసుమంత్రుఁడుచెప్పె. అప్పుడుమిగులసుందరములగు పిరుదులుగలసీతాదేవిసొగసుగా నలంకారమునుజేసికొని సంతోషముగు మనస్సుచేత సూర్యునివలెఁ బ్రకాశించుచున్న రథమునెక్కె. అంతటసువర్ణముతోనలంకరింపఁబడి యగ్నిహోత్రమువలెఁ బ్రకాశించుచున్న యారథముమీఁదరామలక్ష్మణులుగూడనెక్కిరి. అప్పుడుదశరథమహారాజు రాముఁడరణ్యమున నుండవలసినకాలమునులెక్కఁబెట్టి సీతాదేవికి వస్త్రాలంకారములను, రామలక్ష్మణులకు నాయుధంబులను, కవచములను,నిచ్చె. అంతసుమంత్రుఁడు, దశరథుఁడుసీతారామలక్ష్మణులకిచ్చిన యాభరణములను, చిన్నపుటకను, గుద్దలిని,రథమునకుమధ్యనునిచి, సీతారామలక్ష్మణులు ముగ్గురునురథమునెక్కినతోడనే శుభలక్షణములతోఁగూడి, వాయువేగముతోసమానమైన వేగముగలగుఱ్ఱములనతిశీఘ్రముగాఁదోలె. అట్లురాముఁడుచిరకాలము యరణ్యమున నివసించుటకుఁబోయినతోడనే పట్టణముననుండుసకలజనులును, మూర్ఛనుబొందిరి. ఇంతయగాక యేనుఁగులు, గుఱ్ఱములు మొదలగునవికూడ మూర్ఛనొందెను. మఱియును రామునిపట్టాభిషేక మహోత్సవమును, జూచుటకు వచ్చినగ్రామాంతరవాసులుగూడ మూర్ఛను బొందిరి. అంతనయ్యయోధ్యాపట్టణమునందలి జనులందఱునుగలతనొందినచిత్తముగలవారై తొట్రుపాటుచేతనేమియునుదోఁచక యిటుఅటుతిరుగుచుండిరి. ఏనుఁగులు దుఃఖాతిశయముచే మహాకోపమునొంది మదించికేకలువేయుచుండినవి. గుఱ్ఱములుయాభరణముల ధ్వనిసెలంగనిట్టిటు పరుగులెత్తదొడంగె. అప్పుడయోధ్యాపట్టణమునందంతటనుగలకలమని మహాధ్వనియతిశయించె. అంతటనప్పట్టణమునయున్న బాలవృద్ధులుమొదలగు సకలజనులును మిగులదుఃఖమునుబొంది దాహముగొన్నవారు జలమున్నచోటునకుఁబోయినవిధముగ రామునివెంటనంటి పరుగెత్తిరి. అప్పుడాజనులలోఁగొందఱు రామునిరథముయొక్కయిరుప్రక్కలయందును, మఱికొందఱురథముయొక్కవెనుకభాగమందును, పట్టుకొని, రామునిజూచుచుముఖములనిండఁగన్నీరుగారఁగారథమువెంటఁబోవుచు గొంతెత్తిగట్టిగా నిట్లనిరి.

సారథివైనయోసుమంత్రుఁడా! గుఱ్ఱములయొక్కపగ్గములనులాగిపట్టిమెల్లమెల్లగబోనిమ్ము. మేమురామునిముఖమునుజూచెదము. ఇఁకమీఁదట రామునిముఖమును జూడఁబోవుటలేదు. ఆహా దేవతాపుత్రునివంటిరాముఁడరణ్యమునకుఁబోవుచుండఁగాఁ గౌసల్యాదేవియొక్కమనస్సు పటపటమనిపచ్చిపోకున్నదే? కావునఁగౌసల్యమనస్సు, ఇనుముతోఁజేయఁబడినదేహో యనితోఁచుచున్నది. సీతాదేవియునునీడవలెఁ బెనిమిటిననుసరించిపోవుచున్నది. కావునసీత కృతకృత్యురాలనినెంచెదము. మఱియునీసీతధర్మమునాశ్రయించినదై మేరుపర్వతమును సూర్యునియొక్కకాంతి వదలకుండునట్లు వదలకున్నదనిచెప్పిలక్ష్మణుని ఉద్దేశించి యిట్లనిరి. లక్ష్మణా! నీవుదేవసమానుఁడగునన్నయైన రామునకు సర్వకాలములయందును బరిచర్యనుజేయదలఁచితివి కావుననీవునుకృతార్థుఁడవైతివి. కావుననోలక్ష్మణా! నీవీరామునివెంటనంటి పోవడమనునదియేదిగలదో, అదియేనీకుమహాతపస్సిద్ధి. నీవువేఱేతపస్సు చేయబనిలేదు. ఇదియే నీకుగొప్పదైనఅభ్యుదయము. ఇదియేనీకుస్వర్గలోక సుఖములనుగలిగించును. అనియిట్లుజనులందఱును బలుకుచున్నవారలై రామునివెంటనంటిపోవుచుండి యునుదమకన్నులనుం

ది ప్రవాహమువలె బ్రవహింపుచుండు నీటిని నణఁచుకొనఁ జాలరైరి. ఆసమయమునందు దశరథమహారాజు మిగుల దుఃఖము గలవాఁడై యధికముగ రోదనమును జేయుచున్న భార్యలతోఁ గూడఁ బుత్రునిఁ జూడఁదలంచి గృహమునను౦డి బయలు వెడలెను. అంతటనందలి స్త్రీలందఱును "మగ యేనుఁగును బంధించుటచేత నాడయేనుంగులు రోదనమును జేయునట్లు,, రోదనమును గావించిరి. అందువలన నారోదనధ్వని భూమ్యాకాశములయందంతటను వ్యాపించెను. అట్టియెడ రామునకుఁ దండ్రియును, శ్రీమంతుఁడును, నగు దశరథమహారాజు రాముడు వనవాసమునకుఁ బోవుటవలన గలిగిన దుఃఖముచే "గ్రహణకాలమునందు రాహువుచే బట్టుపడిన చంద్రునివలె,, క్షీణదశను బొందెను. మఱియు శ్రీమంతుఁడును, మితిలేని ధైర్యము గలవాఁడును, దశరథమహారాజ నందనుఁడును, నగు రాముఁడు జనులందఱు తనను వెంబడించి వచ్చుటను జూచి సారథితో, రథమును శీఘ్రముగాఁ దోలుము శీఘ్రముగా దోలుమని చెప్పెను. అప్పుడందలి జనులందఱును నో సూతుఁడా! రథమును మెల్లగా దోలుము మెల్లగాఁ దోలుమనిరి. ఇవ్విధముగ రెండు తగలవారును జెప్పిన మాటలను విని యా సుమంత్రుఁ డేమియును జేయఁజాలనివాఁడై యుండెను. అట్లు మహాబాహుఁడగు రాముఁడు వనమునకు బయలు వెడలఁగానే జనసమ్మర్దము వలన బయలు వెడలిన దుమ్మంతయును జనుల యొక్క కన్నీటిచేత నణఁగినదయ్యె. అట్లు వీధులలోని దుమ్మంతయును నణఁగిపోవునట్లు రాముని ప్రయాణకాలమునందయోధ్యలోని జనులందఱును హాహాకారములతో రోదనమును జేసిరి. ఇట్లు దుఃఖాక్రాంతులై కొంతసేపు మూర్ఛను బొందిరి. మఱికొంతసేపు దుఃఖముచేఁ బీడింపబడిరి. ఆసమయమునందు "చేపలు గదలించుటచే తామరకమలములనుండి యుదకము కాఱినట్లు,, స్త్రీల నేత్రములనుండి వ్యసనముచేఁ గన్నీరు గాఱినదయ్యె. అప్పుడు శ్రీమంతుఁడగు దశరథమహారాజు యొక్క పట్టణమునను౦డు మానవులందఱును నొక్కటే విధముగ దుఃఖించుచుండడమును జూచినతోడనే మును పటికంటె రెండింతలు దుఃఖము గలవాడై "వేళ్లు నఱికినతోడనే వృక్షము నేల గూలినట్లు,, గ్రిందబడెను. ఇట్లు రాముని వెంటనంటి పోవుచుఁ గృశించి పోనేరక యధిక దుఃఖముతో నేలఁబడియున్న దశరథమహారాజును జూచి జనులందఱును నేడ్వ దొడఁగిరి. కొందఱు హా కౌసల్యా! యనియు, కొందఱు హా రామా! యనియు రోదనమును జేసిరి. అప్పుడు రాముఁడా రోదనధ్వనిని విని వెనుకపార్శ్వమునందు తిరిగి చూచి మిగుల దుఃఖము గలవారై తన వెంబడి వచ్చుచున్న తల్లిదండ్రులను జూచెను. మఱియు త్రాడుచే బంధింపఁబడిన గుఱ్ఱపుపిల్ల తనతల్లినిఁ జూచువిధముగ ధర్మమను త్రాడుచే బద్ధుఁడైయుండుటవలన తల్లిదండ్రులను జక్కఁగాఁ జూడక యోరకంటిచే జూచినవాఁడయ్యె! మఱియు నా రాముఁడు, వాహనములనెక్కఁ దగిన వారయ్యును, నడచి వచ్చుచున్నవారును, వ్యసనమును బొందుటకుఁ దగినవారు గాకయును, వ్యసనమును బొందుచున్నవారును, పరమసుఖమును బొందఁదగినవారయ్యును, సుఖములేనివారలును నైయున్న తల్లిదండ్రులను జూచి శీఘ్రముగా రథమును దోలుమని సుమంత్రునితోఁ జెప్పెను. మఱియు పురుషోత్తముఁడగు నా రాముఁడవ్విధముగ మిగుల దుఃఖమును బొందుచున్న తల్లిదండ్రులను జూచి శూలముచేతఁ బొడువఁబడిన యేనుఁగవలె నధికముగఁ బీడింపఁబడి తలిదండ్రులను చూడనేరకయుండెను. గృహమునందు గట్టఁబడియుండు నావు దూడయందధికముగు ప్రేమగల ఆవు మిగుల వేగముచేత నింటికి బరుగెత్తిపోవునటుల రాముని తల్లియగు కౌసల్య రథమునొద్దకతి వేగముగఁ బరుగిడివచ్చె. అట్లు మహావ్యసనముతో నేడ్చుచు రథము వెంటఁ బరుగెత్తి వచ్చుచు హా రామా! హా సీతా! హా లక్ష్మణా! యని రోదనమును జేసెను. మఱియు నా సీతారామలక్ష్మణులను గూర్చి యధికముగ దుఃఖమును బొంది శరీరము తెలియక కన్నులనుండి నీటిని గార్చుచు నాట్యమును జేయుచున్న విధముగనున్న తల్లియైన కౌసల్యను రాముఁడు మాటిమాటికిఁ జూచెను. దశరథమహారాజును, నిలువండి, నిలువండియని యఱచెను. అప్పుడు రాముఁడు శీఘ్రముగా రథమును బోనిమ్మనియె. అట్లిరువురును రెండువిధములుగఁ జెప్పుటచేత నిలుచుటకును, బోవుటకును, దోవఃచక్రముల యొక్క మధ్యనుండువానివలె డోలాయమాన మానసుఁడయ్యె, ఆసమయమునందు సుమంత్రునితో రాముఁడిట్లనియె. సుమంత్రుఁడా! దశరథుఁడు నా మాటను వినకపోవుటకుఁ గారణమేమని యడిగెనేని యా జనసమూహములో నీమాట నాకు వినఁబడలేదని చెప్పుము. మనమిచ్చటనుంటిమేని చిరకాలము దశరథుని దుఃఖమును జూడవలసివచ్చును. చిరకాలము తల్లిదండ్రుల దుఃఖము చూచుటకు శక్యముగాదని రాముఁడు సుమంత్రునితోఁ జెప్పెను. అవ్విధముగ రాముఁడు చెప్పిన మాటను సుమంత్రుఁడు విని రాముని వెంటనంటి వచ్చుచున్న యంతఃపురజనమునకు రామునివలన అనుజ్ఞ నిప్పించి గుఱ్ఱములు తమంతటఁ దామే యతివేగముగాఁ బోవుచున్నను మఱింత వేగముగాఁ దోలెను. ఆసమయమునందు రాజసంబంధులగు జనులందఱును రామునకుఁ బ్రదక్షిణమును జేసి వెనుకకు మరలిరి. అవ్విధముగా నేమఱికొందఱును మరలినప్పటికిని మానవులుగాఁ బుట్టినవారలలో నెవ్వరికిని కన్నులలోని నీరును, మనస్సునందలి దుఃఖమును శాంతిని బొందదయ్యె. అప్పుడమంత్రు

లుదశరథమహారాజునుజూచియిట్లనిరి.

మహాప్రభో! దశరథమహారాజా! "శ్లో॥ యమిచ్ఛేత్పునరాయాంతం నైనం దూరమనువ్రజేత్। ఇత్యమాత్యా మహారాజ మూచుర్దశరథం వచః,, లోకములో బ్రయాణమునకుఁబోయినవాఁడు మరలశీఘ్రముగా రావలయునని తలఁచువారు మిగులదూరము వెంబడింపరాదని చెప్పిరి. ఆసమయమునందు శరీరమంతయును చెమటచేఁదడిసి మిగుల వ్యసనమునుబొందియున్న దశరథమహారాజు భార్యతోఁ గూడుకొనినవాఁడై మంత్రులుసెప్పిన శాస్త్రోక్తవచనము నువిని యంతటరామునితోఁగూడఁబోకనిలిచి తనకత్యంత ప్రియపుత్రుఁడగు రామునిఁజూచుచుండెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలువదవసర్గముముగిసెను.

రాముఁడరణ్యమునకుపోయి నపిమ్మటపురవాసులువిలపించుట.

అంతట, పురుషోత్తముఁడగు రాముఁడు చేతులనుముకుళించుకొని నమస్కారమును జేయుచువనమునకుఁబయనమైపోఁగానే యంతఃపురమునందుండు స్త్రీలందఱును గొప్పధ్వనిగలుగునట్లు రోదనమును జేసిరి. దిక్కులేనివారును, దుర్బలులును, దయఁదలఁపఁదగినవారును, నగుమాబోటివారలకురక్షకుఁడును, ప్రాణసమానుఁడును, సకలలోకములకును బ్రభుఁడునునగు, రాముఁడెక్కడకుఁ బోవుచున్నాఁడోగదాయని దుఃఖించిరి. మఱియు నారాముఁడుయితరులు లేనిపోనినేరములను దనపై నారోపించినను గోపమునజెందకయును, నితరులకుఁగోపమువచ్చునట్లు మాటలాడకను నుండునే? యనిరి. కోపముగలవారల కోపమును మంచిమాటలచేత శాంతనిబొందించునే, ఇతరులు దుఃఖపడునప్పుడు వారలదుఃఖముబోవునట్లు మంచిమాటలనుజెప్పి శాంతినిబొందించునే, అనియిట్లుపలువిధముల రామునిగుణముల నభివర్ణించియేడ్వదొడఁగిరి. మఱియు నోరామా! నీవెక్కడకుఁబోతివిఓహోరామా! నీవునన్నుగన్నతల్లియగు కౌసల్యయందెవ్విధముగఁ బ్రియముగలిగియుండుదువో అటులనేమాయందును ప్రియముగలిగియుండుదువే! అనియునేడ్చిరి. కైకేయిపెట్టినకష్టముల ననుభవింపఁజాలక దశరథమహారాజు, సకలజనులకును, ప్రపంచమునకును రక్షకుఁడైనరామునియరణ్యమునకుఁ బంపఁగానే, రాముఁడేమియును జెప్పకతండ్రిబాధనుజూచి సైరింపఁజాలకయరణ్యమునకుఁ బయనమైపోయెనే! అయ్యో ఆరాముడిప్పుడెక్కడకుఁ బోయెనోగదా; యనిరోదనమును జేసిరి. ఆహాదశరథమహారాజెంత బుద్ధిహీనుఁడయ్యె. సకలజీవజంతువులకును బ్రియమైనవాఁడును, మిగులధర్మస్వభావముగలవాఁడును, సత్యవ్రతుఁడును, నగురామునిరణ్యమునకుఁబంపుచున్నాఁడే? యనియంతఃపురస్త్రీలందఱును వాక్కపెట్టున కంటియందుండి నీరుధారధారగబ్రవహింపగ రోదనమును జేసిరి. ఇవ్విధముగ రాజాంతఃపుర స్త్రీలందఱును దూడనువిడిచినయావులవిధముగ దుఃఖముచేత దేహముదెలియక హా, హా, యనిపెడబొబ్బలిడుచు రోదనమును జేసిరి. మఱియునధికమైన ధ్వనిగలుగునటులఱచిరి. ఇట్లుపుత్రవియోగమువలనఁ గలిగినదుఃఖముచేత నధికముగ రోదనమును జేయుచున్నరాజాంతఃపుర స్త్రీలయొక్క భయంకరమైనరోదనధ్వనిని పుత్రశోకాతురుండగు దశరథమహారాజువిని రెండింతలు దుఃఖముగలవాడైతానును రోదనమునుజేసె. ఆవిధముగరాముఁడరణ్యమునకుఁ బోయినసమయమునందుఁ గలిగినదుఃఖముచేత నాపట్టణమునందలి గృహస్థులందఱును సూర్యాస్తమయమగుటనుగూడఁ దెలిసికొనఁజాలక హోమములను జేయరైరి. మఱియునాపట్టణములోనొక్కరైనను గృహములయందన్నమును వండుకొనరైరి. ఇతంయగాకసకలకార్యములను వదలిదుఃఖసముద్రమునందు మునిఁగియుండిరి. ఏనుఁగులుగూడ నాహారమునువదిలిపెట్టెను. గోవులుతమదూడలకుఁ బాలివ్వకపోయెను. తల్లులుదమబిడ్డలు దగ్గరకువచ్చినప్పుడు కొంచెమైననుసంతోషమును బొందరైరి.

మఱియునిక్ష్వాకువంశమునకు మొదటివాఁడును, ఆకాశమునందు నక్షత్రస్వరూపమునున్న వాఁడును, నగుత్రిశంకువును, అంగారకుఁడును, బృహస్పతియును, బుధుఁడును, మఱియు నితరములగు క్రూరగ్రహములును, దృష్టిసమాగమములచేతఁ జంద్రునిఁబొందిరి. నక్షత్రములును, గ్రహములును, తేజోవిహీనములైయుండెను. కోసలదేశనక్షత్రమయిన విశాఖానక్షత్రము పొగతోఁగూడినదానివలె మిక్కిలిమలినముగలదైకనఁబడియె. రాముఁడరణ్యమునకుఁ బోఁగానే యయోధ్యాపట్టణమంతయును, వర్షాకాలమునందు, మేఘసమూహముతోఁగూడి మహావాయువేగముచేత సముద్రముప్పొంగించలనముగలదైనట్లుచలనముగలదయ్యె. (అనఁగాఁబట్టణమంతయును అల్లకల్లోలమయ్యె) మఱియుసకల, దిక్కులును, వ్యాకులములై చీకట్లుక్రమ్మినవిధముగఁ బ్రకాశహీనములైయుండెను. ఇంతయగాకనక్షత్రములును, గ్రహములును గాంతిహీనములయియుండెను. పట్టణమునందున్నజనమంతయును నిష్కారణముగానే దైన్యమునుబొందెను. ఇంతయగాక యాపట్టణ

ములలోని వారలలో నొక్కఁడైనను ఆహారవిహారముల యందు మనసుగలవాఁడు గాఁడయ్యె. అయోధ్యాపట్టణమునందలి వారందఱును దుఃఖపరంపరలచేతఁ దపింపఁజేయఁబడినవారై నిట్టూర్పులను విడుచుచు నయ్యో దశరథమహారాజా! నీవలననఁగదా యింత కలిగెనని రోదనమును జేసిరి. రాజమార్గమునందున్న జనులందఱును కన్నీటిచేత వ్యాకులమైన ముఖముగలవారైరి. ఆపట్టణమునందు ఎల్లవారు నదుఃఖసముద్రమునందు మునిఁగియుండిరిగాని యొక్కఁడైనను సంతోషముగలవాఁడు లేడయ్యె. ఆసమయమునందు గాలిచక్కఁగా గొట్టదయ్యె. చంద్రుఁడు చల్లనివాఁడుగా నుండక భయంకరుఁడై కనఁబడెను.

సూర్యుఁడు ప్రకాశములేనివాఁడై యెండకాయఁడయ్యె. ఇవ్విధముగ లోకమంతయును వ్యాకులమును బొందియుండె. మఱియు నప్పుడు పుత్రులకుఁ దల్లులయందు ప్రియము లేకయుండె. భర్తలు భార్యలమీఁది ప్రియమును విడిచిపెట్టిరి. అన్నదమ్ములు ఒకరియందొకరు ప్రేమలేనివారైరి. విశేషముగఁ జెప్పనేల. అందఱును తమపనులను వదలిపెట్టి రామునిగుఱించియే విచారించుచుండిరి. మఱియును రాముని స్నేహితులందఱును మిగుల వ్యసనముచేత నేమియునుదోచక చిత్తభ్రమకలవారై క్రిందఁబడి లేవఁజాలకపోయిరి. అంత దేవేంద్రుఁడు లేకపోవుటచేత నదనదీసముద్రపర్వతాదులతోఁగూడిన భూమియంతయును వ్యాకులమునొందినట్లు రాముఁడు లేకపోవుటచే నయోధ్యాపట్టణమంతయును వ్యాకులమును బొందినదయ్యె. ఇంతయగాక యేనుఁగులును, గుఱ్ఱములును, భయదుఃఖములచేత ధ్వనులుసేయుచుండె. ఆమహాధ్వని భూమ్యాకాశములు నిండియుండె. అందువలన భూమియంతయును చలనంబును బొందె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలుబదియొకటవ సర్గము ముగిసెను.

దశరథమహారాజు కైకేయినిదూషించుట.

ఆరాముఁడరణ్యమునకుఁ బోవునప్పుడు మార్గమధ్యమందు రథముపోవుటవలనఁ గలిగిన దుమ్ము, ఎంతవఱకుఁ గనఁబడుచుండెనో యంతవఱకును దశరథమహారాజు విడువక రామునిఁ జూచుచుండె. మఱియు నాదశరథమహారాజు, ఇష్టుఁడును, అధికధర్మస్వభావము గలవాఁడును, పుత్రుఁడును, అగు రాముఁడు పోవునంత దూరమును దుమ్ము కనఁబడుచుండుటచేతఁ దాను పుత్రునిఁజూచుట కొఱకే యా దుమ్మునెల్ల వృద్ధిఁబొందినదోయని యూహించినవాఁడయ్యె. అంతఁ గొంతసేపటికి రథవేగమువలన గలిగెడు దుమ్ముకూడఁ గనఁబడకపోయెను. అప్పుడు దశరథమహారాజు మిగుల దీనుఁడును, అధికమైన దుఃఖము గలవాఁడును నై మూర్ఛనొంది క్రిందఁబడియెను. దశరథుఁడు క్రిందఁబడఁగానే యతనిని లేవనెత్తుటకుఁ గౌసల్యాదేవియు దశరథుని కుడిహస్తమును బట్టుకొనియె. భరతునియందుఁ బ్రియముగలిగిన కైకేయియు నతని వామపార్శ్వమున నుండె. నీతిమంతుఁడును, ధర్మమును దెలిసికొనినవాఁడును నగు నాదశరథమహారాజు ఆసమయమునందు దనవామభాగమునందున్న కైకేయినిఁ జూచి యధికమైనబాధగలవాఁడై యిట్లనియె.

ఓకైకేయీ! నీవు మహాదుష్టురాలవు. కావున నాయవయవములను ముట్టవలదు. నిన్నుఁ జూడవలయునని కూడ నాకుఁ గోరిక లేదు. నీవు నాకు భార్యవుగావు. బంధురాలవుగావు. నీవు నాకు చుట్టమవును గావు. కావున నీకును నాకును నేవిధమైన బంధుత్వము లేదు. ఇంతయగాక యోకైకేయీ! నిన్నెవ్వరాశ్రయించినారో యట్టివారలకును నేను బ్రభుఁడను గాను. అట్టివారు నాకు భృత్యులును గారు. నీవు ద్రవ్యమునందు మాత్రమే యాసక్తిగలదానవు. మఱియు నీకుఁ గొంచెమైనను ధర్మమునందాసక్తి లేదు. నేనగ్నిసాక్షికముగ నిన్నుఁ బెండ్లియాడుటయును, నీతోఁగూడ నగ్నికిఁ బ్రదక్షిణముసేయుటయును నీరెండువిధములగు సంబంధములు నికమీదట నాకీలోకమునందుగాని పరలోకమునందుగాని యుపయోగింపకపోవుఁగాక. కావున నేనిప్పుడు నీసంబంధమును వదలిపెట్టుచున్నాను. భరతుఁడు రామునకర్హమయిన యీరాజ్యమును బొంది సంతోషమును బొందెనేని యతఁడు పితృదేవతలకొఱకిచ్చిన పిండోదకాదులు పరలోకమునందు నన్నుఁ బొందకుండుఁగాక. (అనఁగా భరతుఁడు నాకుఁ బుత్రుఁడుగాక పోవుఁగాకయనుట.) అనిచెప్పి యూరకుండె. ఆసమయమునందు వ్యసనముచేతఁ గృశించియున్న కౌసల్యాదేవి దుమ్ముతోఁగూడియున్న దశరథమహారాజును లేవనెత్తి యతనిం ద్రిప్పికొనిపోయె. ధర్మాత్ముఁడగు దశరథమహారాజు ఋషివేషముధరించి యరణ్యమునకుఁ బోయిన రాముని మాటిమాటికిఁ దలఁచుకొని బుద్ధిపూర్వకముగ బ్రాహ్మణునిఁ జంపినవాఁడు దుఃఖమును బొందువిధముగను, భగభగమండుచుండు అగ్నిచేతఁ దాఁకినవానివిధముగను నధికపరితాపమును బొందుచుండె. అంతట మాటిమాటికి దిరిగి చూచుచు నధికముగ దుఃఖమును బొందుచున్న కౌసల్యాదశరథులు రాహుగ్రస్తుఁడైన సూర్యునివలె కాంతిహీనులైరి. ఆదశరథుఁడు ప్రియపుత్రుఁడగు రాముని మాటిమాటికిఁ దలఁచుకొని యధికముగ దుఃఖముగలవాఁడై

రోదనమును జేయుచుండె. మఱియు నాదశరథమహారాజు, మిగులఁబ్రియపుత్రుండగు రాముఁడు పట్టణముయొక్క యెల్లను దాటి పోయెనని తెలిసికొని మిగులదుఃఖముగలవాఁడై యిట్లనియె.

అయోధ్యా నాకుమారుని దీసికొనిపోయిన శ్రేష్ఠములైన గుఱ్ఱములయొక్క యడుగులుకనఁబడుచున్నవిగాని నాపుత్రుండగు నామహానుభావుఁడు గనబడుటలేదు. మిగులఁబరిమళముగల చందనమును శరీరమునందు నలఁదుకొనిన సౌందర్యముగల స్త్రీలువింజామరలువీవగా మిక్కిలి మెత్తనిపరుపులయందు మృదువులగుతలగడలను బెట్టుకొని నిద్రించునట్టి నాపుత్రుఁడిప్పుడేయరణ్యమునందు ఏచెట్లక్రిందనిద్రను బొందుచున్నాఁడోగదా? అయ్యో చెట్లక్రిందఁబరుండి రాళ్లనో కొయ్యలనో తలగడలనుగాఁబెట్టుకొని యున్నాడేమో? అయ్యో నేనేమిచేయుదును. సకలసౌఖ్యములను బొందినట్టి నాపుత్రుఁడికమీఁదట మిగులదుఃఖముగలవాఁడై శరీరమునందంతటను దుమ్మునిండియుండఁగా నిట్టూర్పులనువిడుచుచుఁ గొండకాలువల సమీపమునందుండి యేనుగులునిద్రను మేలుకొంచినవిధముగ నేలపైనుండి నిదురనువిడిచిలేచి సంచరింపఁగలఁడు. ఆహా నాపుత్రునకిట్టికష్టములువచ్చెనేయని యధికముగరోదనముజేసె, అయ్యో, వనమునందుండువారలు, దీర్ఘబాహువులుగలిగి లోకములకన్నిటికిని బ్రభుఁడైనరాముడు దిక్కులేనివానివలె నేలమీఁదఁబరుండిలేచి పోవుటనుజూడఁగలరు. ఇట్లగుటకు సందేహమేమియును లేదు. అయ్యో, జనకచక్రవర్తికిఁ బ్రియపుత్రికయగుసీత సర్వకాలములయందును సౌఖ్యముల ననుభవించుటకుఁదగినది. అట్టిమహనీయురాలిప్పుడు ముండ్లమీఁదఁ దనమృదుపాదములను బెట్టి బాధనుబొందుచు నరణ్యమునందుఁబోఁగలదు. ఇందుకేమియును సందేహము లేదు. అయ్యో, ఎప్పుడునువనములయందు సంచరించుటను నెఱుగనిసీతవనములయందు భయమునుబొందునని నిశ్చయముగాఁదోఁచుచున్నది. ఇంతయగాక యరణ్యములయందుఁ గ్రూరమృగములయొక్క ధ్వనులనువినియధికముగ భయమునుబొందును. ఇట్లగుటకుసంశయమేమియును లేదని మహాదుఃఖముతోవిలపించి మరలఁగైకేయినుద్దేశించియిట్లనియె.

ఓకైకేయీ! నీకోరికనెఱవేరెనుగదా? ఇఁకనీవుసీకోరికలను దీర్చుకొనుము. ఇకమీఁదటవిధవవై రాజ్యమునేలుము. నేనుబురుషోత్తముఁడగు రామునివదలిజీవింపఁజాలను. ఇకనాకుబ్రదుకవలయునని యభిలాషయును లేదనిచెప్పి యధికముగరోదనముజేసె. ఈవిధముగదశరథమహారాజు మిగులదుఃఖమునుబొందుచు జనసముదాయముచేతఁ జుట్టఁబడినవాఁడై బంధుమరణమునొందిన పిదపస్నానమును జేసినవానివలె మిగులదీనుఁడై యయోధ్యానగరమునందుఁ బ్రవేశించె. మఱియు నాదశరథమహారాజు నాలుగుత్రోవలుగలిసిన వీధులయందును, గృహద్వారములయందును, మనుష్యులెవ్వరును లేకుండుటనుజూచి మిగులదుఃఖమును జెందె. అంగడివీధులన్నియును మూయఁబడియుండె. దేవాలయములను దెఱవరైరి. దేహదార్ఢ్యముగలిగి నడుచుటకు సామర్థ్యముగల మానవులందఱును పట్టణమునసుండక రామునివెంటఁబోయిరి. నడవలేనివారందఱును నధికముగరోదనమును జేయుచుండిరి. రాజమార్గములయందు కొద్దికొద్దిగజనులు సంచరించుచుండిరి. అట్టియయోధ్యాపట్టణమునుజూచి దశరథమహారాజు మిగులదుఃఖాక్రాంతుఁడై సూర్యుఁడుమేఘమునందుఁ బ్రవేశించినవిధముగ గృహమునందుఁబ్రవేశించెను సీతారామలక్ష్మణులు లేకపోవుటచేత దశరథమహారాజు" మహాసర్పము గలిగియుండుటవలనఁ బ్రవేశింపనలవిగాకయున్నదై గరుత్మంతునిచే నాసర్పమపహరింపఁబడిన పిదపబ్రవేశించుటకు సాధ్యమైయున్న గొప్పమడుగువలెనుండు,, గృహమునందుఁబ్రవేశించెను. ఇట్లుప్రవేశించి యాదశరథమహారాజు గద్గదస్వరముతో రోదనమును జేయుచు మహావ్యసనముగలవాఁడగుటవలననితరులకు సాధారణముగలిదెయని హీనస్వరముతో భటులనుజూచి యిట్లనిరి.

ఓభటులారా! నన్ను రామునితల్లియగు కౌసల్యాగృహమునకుఁదీసికొనిపొండు. మఱియొకచోటనుండుటకు నాకిష్టములేదు. నామనఃపరితాపము మఱియొకచోటఁ శాంతినిబొందదనియె. అనియిట్లుదశరథమహారాజు చెప్పినమాటనవిని యతనికిమార్గమును జూపుచున్నభటులు గౌసల్యయింటికి ఆదశరథునిగొనిపోయిరి. అప్పుడాదశరథమహారాజు మహాదీనుఁడై కౌసల్యాగృహమునఁ బ్రవేశించి శయ్యయందుఁ బరుండి మిగులఁబరితాపముగలవాఁడైయుండె. ఇట్లుతనకు గలిగియుండు పరితాపమునుమనస్సునందుయిముడ్చుకొనఁజాలక యధికముగదుఃఖమునుబొంది రోదనమును జేయుచుండె. సీతారామలక్ష్మణులు లేకపోవుటవలననాయిల్లుచంద్రుడులేని రాత్రివలెగాంతిహీనమైయుండె. మహావీర్యవంతుఁడగునా దశరథమహారాజు కాంతిహీనమైయున్న గృహమునుజూచి చేతులుపైకెత్తుకొని గొంతెత్తిహారామా! నన్నువదలిపోతివా? యనిగట్టిగామాటిమాటికి యఱచుచు రోదనమునుజేసె. హారామా! మరలనీవరణ్యమునుండి వచ్చువఱకును బ్రతికియుండినిన్నుఁజూచి యాలింగనాదిసు

ఖములననుభవించి పరమానందమునుబొందు వారుకృతార్థులగుదురు. నేనట్టువంటిపుణ్యమును జేయలేదు. ఇట్లుదశరథమహారాజు విలపించుచుండగ నస్తమయుడై గాళరాత్రివలె మహాభయంకరమైన రాత్రివచ్చెను. అంతదశరథమహారాజు అనిశకాలమున నర్ధరాత్రసమయమందుఁ గౌసల్యనుజూచి యిట్లనియె.

ఓకౌసల్యా! నాదృష్టియింకను నాప్రియపుత్రుడైన రామునిమీఁదనేయున్నది. ఇప్పటికినినాదృష్టి నాయధీనముగాకయున్నది. కాబట్టినేనునిన్నుఁగూడఁ జూచుటకుశక్తిలేకయున్నాను. నీవునాయందు కరుణయుంచుము. యాడుదానిమాటలనువిని యింతటిక్రూరకృత్యమును జేసినాడని కోపమునుబొందకుము. నన్నుమన్నింపుము. ఇవుడునీచేతిచేత నన్నుఁజక్కఁగాస్పృశింపుము. ఇట్లుచేసితివేని నాసంతాపముకొంచెముతగ్గునని తోచుచున్నదనిచెప్పె. ఆమాటనువినికౌసల్యాదేవిరాముని నేమాటమాటికిదలఁచుకొని యధికముగ దుఃఖమునుబొందుచున్న యాదశరథమహారాజునుజూచి యతనియొద్దకూర్చుండి మిగుల దుఃఖముగలదై నిట్టూర్పులువిడుచుచు మిగులవ్యసనమునుజెందె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలువదిరెండవసర్గముగిసె.

కౌసల్యాదేవి పుత్రదుఃఖమును దశరథునితో జెప్పుకొనివిలపించుట.

విప్పుటఁబుత్రశోకార్తురాలగు కౌసల్యాదేవిశయ్యమీఁదఁబరుండి దుఃఖముచేతనధికముగఁ గృశించియున్న దశరథునిజూచి యిట్లనియె.

మహారాజా! పురుషోత్తముఁడగు రామునకుమహాకపటముగల కైకేయియను కృష్ణసర్పము విషతుల్యమైన యాపకారముచేసినది. ఇకమీఁదటఁగుబుసమునువదలిననల్లత్రాచుసర్పమువలె సంతోషముచేత విహరింపఁగలదు. సుందరములగు నవయవములుగల కైకేయిరాముని నన్యాయమునకుఁ బాపునట్లుచేసి తనమనోరథములను దీర్చుకొనినదై మనస్సంతోషమునుబొంది గృహమునందుఁబ్రవేశించిన దుష్టసర్పమువలె మునుపటికంటెనధికముగా నన్నుభయపెట్టుచును. ఇట్టిక్రూరకృత్యముకంటె రామునకన్నమునుబెట్టక భరతునకుఁ బరిచారకునిగాఁ జేసిన మొదలఁగొంచెము మేలుగానుండును. అట్లుచేసెనేనిరాముఁడు పట్టణమునభిక్షమెత్తికొని భుజించియైనను భరతునకుఁబరిచారకమును జేయుచుండును. అట్లయ్యేనేనిరాముఁడు నాచెంతఁజేయుచుండునుగదా? నీవుకైకేయిమాటనువిని రాముఁ సింహాసనమునందుండి బడద్రోసి పర్వకాలమునందాహితాగ్నియగువాఁడు హవిర్భాగమును దేవతలకివ్వక రాక్షసులకిచ్చినవిధముగ, కైకేయికి సింహాసనమునిచ్చితివి. కైకేయిమాటలకు మిగులమోహమును బొందితివిగదా? మహాగంభీరముగల ఏనుఁగువలెమందముగా నడుచువాఁడును, మహాబాహుఁడును, ధనుర్ధారులలో శ్రేష్ఠుఁడును నగు రాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ నరణ్యమునందుఁ బ్రవేశించుచున్నాఁడు. ఇదివరకెన్నఁడును యరణ్యవాసదుఃఖముల ననుభవింపని సీతారామలక్ష్మణులను, కైకేయిమాటలనువిని యరణ్యమునకుఁబంపితివి. సీతారామలక్ష్మణులికమీఁద నరణ్యమునందధికమయిన దుఃఖమునుబొందుదురు. మిగులదుఃఖముతో వనములయందెట్లు సంచరింపుదురు. సీతారామలక్ష్మణుల కిదియుత్తమమగు యౌవనకాలము. కావుననిప్పుడువారు సకలైశ్వర్యములను ననుభవింపఁదగినవారు. అట్టివారుసకలైశ్వర్యముల ననుభవింపఁదగినకాలమునందు అరణ్యమునకుఁబంపితివి. ఇప్పుడువారుదరిద్రులవలె మిగులదీనులై కందమూల ఫలాదులనుదినుచు యడవులయందెట్లుందురు.

ఇప్పుడేపదునాలుగేండ్లును గడచిపోయి సీతారామలక్ష్మణులు తమప్రతిజ్ఞనునెరవేర్చుకొని యెల్లవారిచేతను కొనియాడఁబడుచువచ్చి నాకన్నులకుఁగనఁబడిరేని నేను ధన్యురాలనగుదును. నాకంతటియదృష్టముగలుగునా? అట్లయ్యేనేని నేనుకృతార్థురాల నగుదునుగదా! మిగులఁబరాక్రమవంతులగు రామలక్ష్మణులు, నిద్రనువిడిచిలేవఁగానే యతిశీఘ్రముగాను, క్షేమముగాను, మనపట్టములోనికివచ్చి యున్నాగనిమనరాజ్యమునందుండు జనులంగలనుపట్టణాలంకారమును జేయుటనుజూచితినేని మహానందముగల దాననగుదునుగదా? మఱియు నధికసంతోషముగల జనులచేతనెత్తఁబడిన ధ్వజములుగలిగియొప్పుచున్న మహాకీర్తిగల యయోధ్యాపట్టణములోనికి సీతారామలక్ష్మణులెప్పుడు వత్తురోయను కుతూహలముగల దాననగుదునోగదా? అరణ్యమునుండి మరలివచ్చిన సీతారామలక్ష్మణులనుజూచి యీపట్టణమునందలి జనులందఱును "పున్నమనాటి చంద్రునిఁజూచి సముద్రము పొంగువిధముగ, నెప్పుడుపొంగుదురోగదా? మహాబాహుఁడును, మహావీరుండును నగురాముఁడు, "వృషభరాజముగోవుతోఁ గూడినవిధముగ, సీతాసమేతుఁడై రథమునెక్కి యీయయోధ్యాపట్టణమున కెప్పుడువచ్చునోగదా? శత్రుసంహారమును జేయుటకుఁదగిన సామర్థ్యముగలవారును, నాకుఁబుత్రులును నగురామలక్ష్మణులు పట్టణప్రవే

ణమును జేయుచుండఁగా రాజమార్గమునందు వారిమీఁ
దయనేకవేలజనులెప్పుడు పేలాలనుజల్లుదురో గదా! ఎప్పుడు
రామలక్ష్మణులుమరలనిక్కడకువచ్చి మిగులరమణీయము
లకర్ణకుండలములతోఁ బ్రకాశించుచుందురో గదా! మఱియు
మిగులఁబొడవులగు ధనుస్సులుఖడ్గములను ధరించినవారు
గావునశిఖరములుగలపర్వతములవలెఁ బ్రకాశించుచు నీ
యయోధ్యాపట్టణమును బ్రవేశించుచుండఁగా నేనెప్పుడు
చూడఁగలనో? గదా? సీతారామలక్ష్మణులు, కన్యలకును,
బ్రాహ్మణులకును, గ్రమముగఁబుష్పఫలములనిచ్చుచు మ
హానందముతో నయోధ్యాపట్టణమునకెప్పుడు ప్రదక్షిణ
మును జేయుదురో గదా? జ్ఞానముచేతవృద్ధుఁడును, యౌ
వనముచేత దేవతలవలెనుండువాఁడైదేఁడ్లవాఁడును, ధర్మా
త్ముఁడును, నగురాముఁడుమూడు సంవత్సరముల వయ
స్సుగలబాలునివలె నాటలాడుచునాయొద్ది కెప్పుడువచ్చు
నోగదా? పురుషశ్రేష్ఠుఁడా? దశరథమహారాజా! నే
నుబూర్వజన్మమునందు, బిడ్డలుతల్లులయొద్దఁ బాలుద్రాగ
కుండునట్లు తల్లులయొక్క స్తనములను బ్రద్దలుసేసియుందు
ను. కావుననేనాకిట్టికష్టముగలిగినది. కాఁబట్టినేనట్లు సేసి
యుందుననుటకు సందేహమేమియునులేదు. మఱియును
బురుషోత్తముఁడవైన యోదశరథమహారాజా! లేదూడగ
లగోవువలె బుత్రునియందు మిక్కిలిప్రియముగలనన్నును,
సింహము, దూడనుజంపిగోవును దూడనులేనిదానినిగాఁ
జేసి దుఃఖపెట్టినట్లు,, కైకేయిబలాత్కారముగా రాము
నినరణ్యమునకుఁబంపి పుత్రహీనురాలినిగాఁజేసినది. అ
య్యో నేనీదుఃఖమునెట్లుసహింతునని కంటినుండి నీరుధా
రధారగ బ్రవహింపగ వెక్కివెక్కియేడ్చుచు మరలని
ట్లనియె.

ఓదశరథమహారాజా! నేనుఅనేకవేలయేండ్లు దేవతా
రాధనజేసి లేకలేకయొకబిడ్డనుగంటిని. అట్టినాపుత్రునకు
లోకములోసద్గుణములెన్నిగలవో యవియన్నియును గలి
గియున్నవి. అంతయగాకసకలశాస్త్రములనుజదివి పండి
తులలోనుత్తముండని ప్రసిద్ధింగాంచె. అట్టిపుత్రునివిడిచి
నేనెట్లుజీవింపఁగలను. మహాబాహుఁడును, పరాక్రమవం
తులలోనధికుఁడునునగు నాపుత్రునిఁజూడకపోతినేని నేనిక
బ్రతుకజాలను. "ఎండకాలమునందు రెండింతలు కాంతి
గల భగవంతుఁడైనసూర్యుఁడుతనయొక్క కిరణములచేత
భూమినిఁదపింపఁ జేసినవిధముగఁ,, బుత్రవియోగదుఃఖ
మువలనఁబుట్టిన యగ్నిహోత్రముప్రజ్వరిల్లినన్నధికముగఁ
దపింపఁ జేయుచున్నదనిచెప్పి హా రామా! రామా! యని
యనేకవిధములవిలపించె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలుబదిమూఁడ
వసర్గముగిసెను.

సుమిత్రాదేవి కౌసల్యనూరడించుట.

ఇట్లుదుఃఖమునుబొంది విలపించుచున్న స్త్రీలలోశ్రే
ష్ఠురాలైన కౌసల్యనుజూచి ధర్మస్వభావముగలసుమిత్రా
దేవి ధర్మయుతముగఁజెప్పఁదలఁచి యిట్లనియె.

పూజనీయురాలా! కౌసల్యాదేవీ! నీకుమారుఁడగు
రాముఁడుసకల సద్గుణములునుగలవాఁడు. ఇంతయగాక
పురుషోత్తముఁడని కీర్తినివహించెను. అట్టిపురుషశ్రేష్ఠుని
గుఱించి నీవెందుకువ్యసనంబునుబొందెదవు? ఇట్లువ్యసన
మును బొందుటయుచితముగాదు. పూజ్యురాలా! కౌస
ల్యాదేవీ! మహాబలుఁడును, నీకుఁబుత్రుఁడును, నగురా
ముఁడు తండ్రినిసత్యవాదినిగాఁ జేయఁదలఁచి రాజ్యమును
వదలి యరణ్యమునకుఁబోయెను. సజ్జనులచేతనాచరింపఁ
బడినదియును, పరలోకమునందుఁ బరమసుఖమునుగలిగిం
చునదియును, నగుపితృవాక్యపరిపాలన ధర్మమునవలంబిం
చి రాముఁడరణ్యమునందున్నాఁడు. కావునరామునిఁగు
ఱించి యొకప్పుడును విచారమునుబొందఁదగదు. సర్వభూ
తములయందును దయగలవాఁడును, నిష్కల్మషుఁడును న
గులక్ష్మణుఁడు సర్వకాలములయందును పురుషోత్తముఁ
డగు రామునకుఁబరిచర్యనుజేయుచున్నాఁడు కావునలక్ష్మ
ణకిది యొకమహాలాభకార్యము లక్ష్మణునకింతకంటె న
ధికమగు పుణ్యకార్యమేదియునులేదు. సర్వకాలములయం
దును సుఖమునేపొందుటకుఁదగిన సీతాదేవియరణ్యవాస
మునందలి దుఃఖమును దెలిసినదయ్యును ధార్మికుఁడును, నీ
కుఁబుత్రుఁడును నగురాముని ననుసరించి పోయినదన్న్య.
లోకమునందంతటను మనవంశమునకు మహాకీర్తినిఁదెచ్చ
నట్టివాఁడును, మహాశక్తిమంతుఁడును, ధర్మసత్యములేసేన
ముగాఁగలవాఁడును, నగురామునకరణ్యమునందేమియు
ను నాపదగలుగనేరదు. సకలశత్రువులను సంహరించి జ
యమునొంది లోకోపకారములగు కార్యములనేకములను
జేసి మరలఁబరమానందముతో నిక్కడకువచ్చును సూ
ర్యుఁడు, రామునియొక్కపరిశుద్ధతను, మాహాత్మ్యమును
జూచి తనకిరణములచేత రామునకుఁగొంచెమైనను, పరి
తాపమును గలుగనివ్వఁడు రామునిమంచిగుణములకు సం
తసించివాయువు సుఖకరముగాను, సమశీతోష్ణముగలు
గునట్లుగాను, రామునిమీఁదవీచుచుండును. కావునరా
మునకరణ్యములయందు సుఖమేగలుగును గాని కష్టములుగ

లుగనేరవు. చంద్రునివలె నిష్కల్మషుఁడగు రామునిసద్గుణములకు సంతసించి రాముఁడు రాత్రికాలమునందు శయనించియుండఁగాఁ జంద్రికవలె బ్రియముగలవాఁడై చల్లనికిరణములను గలిగించి యతనికి సంతోషమును గలుగఁజేయును. మఱియునో కౌసల్యా! రాముఁ డధికమైన పరాక్రమముగలవాఁడు. పూర్వము మనరాముఁడు దానవోత్తముఁడగు శంబరాసుర పుత్రునిఁ జంపె. అప్పుడా కార్యమునకు సంతోషించి బ్రహ్మదేవుఁడు రామునకు దివ్యాస్త్రముల నిచ్చె. కావున శూరుఁడగు నా రామునకు నరణ్యమునందుఁ గొంచెమైనను గష్టము గలుగనేరదు. ఆ రాముఁ డరణ్యమునందు గృహమునందువలెనే సుఖముగా నుండును. కావున నీవు భయమును బొందకుము. రాముని యొక్క బాణములకు లక్ష్యమైన శత్రువులందఱును నాశమును బొందుచున్నారే? అటువంటి రాముని యాజ్ఞకు భూమియంతయు ను నెందుకు లోఁబడకుండును? లోఁబడుననుటకు సందేహ మేమియును లేదు. రాముని శరీరకాంతియును, నతని వీర్యమును, నతని గొప్పబలమును, గుఱించి యాలోచింపగా రాముఁడు పదునాలుగు సంవత్సరములును, నరణ్యములయందు విలాసముతోఁ గడుపు. పిమ్మట నీ యయోధ్యా పట్టణమునకు వచ్చి రాజ్యభారమును బొందునని నాకు నిస్సంశయముగఁ దోఁచుచున్నది. మఱియు నో కౌసల్యా! మన రాముఁడు సూర్యునకు సూర్యుఁడు. అగ్నిహోత్రునకు నగ్నిహోత్రుఁడు. ప్రభువునకుఁ బ్రభుఁడు. సంపదకు సంపద. కీర్తికిఁ గీర్తి. శాంతమునకు శాంతము. దేవతలకు దేవత. భూతములకు భూతము. ఇటువంటి మాహాత్మ్యముగల రామునకు దేశమునందైనను, పట్టణమునందైనను విరోధముగఁ బ్రవర్తించువారు లేరు. అయోధ్యాపట్టణమునందలి జనులందఱును దుఃఖము యొక్క యతిశయము చేతఁ గొట్టఁబడినవారై బయలు వెడలుచున్న రామునిఁ జూచి కన్నీళ్లను విడుచుచున్నారు. ఇట్టి జనులందఱును, పురుషోత్తముఁడగు రాముఁడు సీతతోడను, భూమితోడను, లక్ష్మితోడను, గూడినవాఁడై శీఘ్రముగానే పట్టాభిషిక్తుఁడగుటను జూచి యానందబాష్పములను విడుతురు. శత్రువులచేతఁ బరాజయమును బొందనివాఁడును, కుశచీరధారియును, ప్రభువును నగు రాముఁ డరణ్యమునకుఁ బోవుచుండఁగాఁ బతివ్రతయగు సీత రాముని వెంబడించెను వెంటనే రాజ్యలక్ష్మియు వెంబడించెను. కావున నట్టి రామునకు దుర్లభంబగున దేమియును లేదు. ధనుర్ధారులలో నుత్తముఁడగు లక్ష్మణుఁడు, ఖడ్గమును, బాణములను, మఱియు నితరములగు దివ్యాస్త్రములను ధరించి రాముని ముందరఁ బోవుచుండఁగా రామునకీ లోకమునందు దుర్లభమైన కార్యం బేదియైన నుండునా (ఉండదు) ఓ కౌసల్యా! నీవు పితృవాక్యానుసారముగఁ బదునాలుగు సంవత్సరములును నరణ్యవాసమును జేసి రాముఁడు వచ్చుటను జూచి పరమానందమును బొందఁగలవు.

నీవిట్లు జ్ఞానహీనురాలవై దుఃఖించుట యుచితముగాదు నా మాటలను సత్యములుగా నమ్ముము. అనిందితురాలా! కౌసల్యా! రాముఁడు పదునాలుగు సంవత్సరములును గడచిన పిమ్మట నిక్కడకు వచ్చి మంగళకరములగు నీ పాదపద్మములకు నమస్కారమును జేయును. అట్లు నమస్కారమును జేయుచున్న రాముని జూచి చంద్రుని జూచిన విధముగ నానందమును బొందుదువు. కావున నో కల్యాణీ! నీవు దుఃఖమును బొందకుము. రాముఁడు మరల నీ యయోధ్యా పట్టణమునకు వచ్చి రాజ్యపట్టాభిషిక్తుఁడై యధికమైన సంపదతోఁ బ్రకాశించును. అట్టి రామునిఁ జూచి యతిశీఘ్రముగ నానంద బాష్పములను విడువఁగలవు. ఓ కౌసల్యా నీవు దుఃఖమును బొందకుము. రామున కేవిధమైన యమంగళమును గలుగదు. కాఁబట్టి నీ విట్టివిధముగా వ్యసనముగలదానవై మహాదుఃఖమును బొందుట యుచితముగాదు. సీతాలక్ష్మణుల తోడం గూడివచ్చిన రాముని శీఘ్రముగానే చూడఁగలవు. నిష్కల్మషురాలా! కౌసల్యా! నీవు మావంటి వారల నోదార్పఁదగినదానవై యిట్లు దుఃఖమును బొందుచున్నావేమి? నీ విట్టివిధముగ దుఃఖమును బొందిన యెడల మా దుఃఖమును శాంతిని బొందించువారెవ్వరు. ఓ కౌసల్యా! మహానుభావుఁడగు రాముఁడు నీకుఁ బుత్రుఁడయ్యె. అట్టి సుపుత్రుఁడు గల నీవిట్టి విధముగ దుఃఖమును బొందవచ్చునా? దుఃఖమును బొందఁదగదు. లోకమునందు రామునికంటె ధర్మాత్ముఁ డెవ్వఁడు గలఁడు. రాముఁడు మరల నియ్యయోధ్యాపట్టణమునకు వచ్చి మిత్రులతోఁ జేరినవాఁడై నీకు నమస్కారము జేయుచుండగాఁ జూచి నీవు శీఘ్రముగానే, వర్షాకాలమేఘము దకములను విడుచు విధముగ నానందబాష్పములను వదలగలవు. కోరిన కోరికల నిచ్చుటయందుఁ దగిన సామర్థ్యముగల నీ పుత్రుఁడు శీఘ్రముగా నిప్పట్టణమునకు వచ్చి మహామృదువులైనవియును, బలిసినవియును నగు తన చేతులచేత నీ పాదములను బిసుకఁగలఁడు. శూరుఁడును మిత్రులతోఁ గూడినవాఁడును నగు రాముఁ డిచటికి వచ్చి తన గోత్రనామధేయములను జెప్పుచు నీకు నమస్కరించు నెడ, నీవు రాముని మీఁద నానందబాష్పములను, పర్వతముల మీఁద మేఘములు వర్షించిన విధముగ వర్షింపఁగలవని చెప్పి యోదార్చెను. ఇట్లు వాక్యోపచారమునందు నేర్పుగల సుమిత్రాదేవి నానావిధవాక్యముల చేత నివ్విధముగ నూరార్చుచు

నదై మఱియుంగొన్నిమాటలను గూడఁజెప్పి యూరకుండె. అట్లు చెప్పినసుమిత్రాదేవియొక్క మాటలనువిని నతోడనే శరత్కాలమునందు మేఘములునశించినవిధముగ రామునితల్లియగు సుమిత్రాదేవియొక్క దుఃఖమంతయును నాశమునుబొందె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలుబదినాలుగవసర్గముగిసెను.

పురజనులు రాముని వెంటబడి యరణ్యమునకు బోవలదని చెప్పుట.

వనవాసమునకుఁ బోవుచున్నవాఁడును, మహాత్ముఁడును, సత్యపరాక్రముఁడును నగు రామునితోఁగూడ నప్పట్టణవాసులగుజనులందఱును నరణ్యమునకుఁబోఁదలఁచి బయలువెడలిరి. రామునిమిత్రులును, దశరథమహారాజును, బలాత్కారముగ వెనుకకుమరలి వచ్చినను, రామునిరథమువెంబడించి పోయినవారు మాత్రముకొంచెమైనను రాముని రథమునువిడువరైరి. ఆరాముఁడు గొప్పకీర్తిగలవాఁడును, మంచిగుణములు గలవాఁడునుగావున నయోధ్యాపట్టణమునందలి జనులకు షోడశకళాపరిపూర్ణుడగు పున్నమచంద్రునివలెఁ బ్రియముగలవాఁడై యుండె. మఱియుజనులందఱును నరణ్యమునకుఁబోఁగూడదని రామునితోననేకవిధములఁజెప్పిరి. అట్లెన్నివిధములఁజెప్పినను వారిమాటలను వినకయరణ్యమునకుఁబోయెం. రాముఁడు పరమస్నేహముచేతఁ దన్నుబోవలదని చెప్పుచున్నజనులను, తనపుత్రులనుజూచిన విధముగఁబ్రియముతోఁజూచి యిట్లనియె.

జనులారా! స్నేహితులారా! అయోధ్యాపట్టణమునందుండునట్టి మీకందఱకును, నాయందుసర్వోత్తమములగుప్రీతి బహుమానములుగలవుగదా? అట్టిప్రీతిబహుమానములను భరతునియందుంచుఁడు. కైకేయికిఁబ్రియపుత్రుఁడగు నాభరతుఁడుమీకిష్టములును, మేలును, నగుకార్యములను మిగులఁబ్రియముతోఁ జక్కఁగాఁజేయుచుండును. ఆభరతుఁడువయస్సుచేతఁ జిన్నవాఁడైనను జ్ఞానముచేతవృద్ధుఁడు. పరాక్రమగుణాన్వితుఁడయ్యును మృదుత్వముగలవాఁడు. మఱియునమీకెవ్విధమైన భయముగలిగియున్నను బోఁగొట్టఁదగినవాఁడు. ఇంతయగాక మీకనుకూలుఁడగు రాజు. మఱియునాభరతుఁడు సకలరాజగుణములును గలవాఁడు. దశరథమహారాజుచేత యువరాజుగా నేర్పఱుపఁబడినవాఁడు. కావునమీకును, నాకును, తక్కినవారలకును, ప్రభువగుదశరథుని యాజ్ఞచొప్పునఁ బ్రవర్తింపవలయును. నేనరణ్యమునకుఁబోవుటచేత దశరథమహారాజు మిగులఁబరితాపమునుబొందును. కావునమీరందఱును వాస్తవముగనాకుఁ బ్రియమునుజేయఁదలఁచితిరేని మాతండ్రియగు దశరథమహారాజు పరితాపమును బొందకుండునట్లుసేయుఁడు. ఇదినాకుఁబరమప్రియమైనకార్యము. "శ్లో॥ యథాయథా దాశరథిర్ధర్మ ఏవాస్థితోऽభవత్। తథాతథా ప్రకృతయో రామంపతిమకామయన్॥ అనియిట్లు రాముఁడు ధర్మయుతముగ మాటలాడినకొలఁది పట్టణవాసులందఱును రామునేరాజునుగాఁ గోరుచుండిరి. (అనఁగా రాముఁడు పరమధార్మికుఁడగుటవలన నతఁడేరాజుగానుండవలయునని జనులందఱునుగోరుచుండిరనుట.) రాముఁడులక్ష్మణునితోఁగూడ, గన్నీటిచేతవ్యాప్తమై దుఃఖసముద్రమున మునింగియున్నజనమును, తనగుణములచేతఁ గట్టియీడ్చినవిధముగనాకర్షించె. (అట్లురాముండెంత చెప్పినను వినక వెంబడించియే పోవుచుండిరి) అందులో జ్ఞానముచేతను, వయస్సుచేతను, కాంతిచేతను, వృద్ధులైనకొందఱు బ్రాహ్మణులుముసలితనముచేత వణఁకుచున్నశిరస్సులుగలవారలై. (అనఁగామిగులముసలితనముచేతఁ దలలనువణఁకించుచు) రామునిరథమునకుగట్టియుండు, మిగులవేగముగలిగి ఉత్తమజాతియందుఁ బుట్టినగుఱ్ఱములను నుద్దేశించియిట్లనిరి.

ఓగుఱ్ఱములారా! మీరు వెనుకకుమరలుఁడు. మీరతివేగముగఁబోవుట యుచితముగాదు. మనకందఱకును బ్రభువగురాముని విషయమై మేలును, జేయుఁడు. గుఱ్ఱములుసకలజంతువులయందును నుత్తమములైనవియును, పరులమాటలను జక్కఁగ గ్రహించునట్టి సామర్థ్యముగలవియును నగుటచేత నోగుఱ్ఱములారా! మీకుమామాటల యర్థము చక్కఁగాఁ దెలియుచున్నది. కావునమీరుమాప్రార్థనల నంగీకరించి శీఘ్రముగా వెనుకకుమరలుఁడు. ఓగుఱ్ఱములారా! మీకుయజమానుఁడైన రాముఁడు పరమధర్మాత్ముఁడు. ఇంతయగాక నిర్మలమైన మనస్సుగలవాఁడు. అదియునుగాక మహాపరాక్రమవంతుఁడు. మఱియును దృఢమైనయభిమానముగలవాఁడు. కాఁబట్టియట్టిరాముని మీరుపట్టణమునకుఁ దీసికొనిరావలసినదికాని యరణ్యమునకుఁ దీసికొనిపోఁదగదని ముసలిబ్రాహ్మణులందఱును రామునిరథమునకుఁ గట్టిన గుఱ్ఱములతోఁ జెప్పిరి. ఇవ్విధముగ మహావ్యసనముతోఁబలుకుచున్న వృద్ధబ్రాహ్మణులనుజూచి రాముఁడతిశీఘ్రముగ రథముననుండిదిగె. అట్లుదిగియాముసలి బ్రాహ్మణులు మిగులదూరమునందున్న వారలగుటచేత వారియొద్దకుఁబోఁదలచి వారలనూరార్చుటకు వెనుకనుఁబోతి

నేని ప్రతిభంగమగుననియును, వారలయొద్దకుఁ బోకపోతినేని దోషముగలుగుననియును, తలఁచి రాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ నావృద్ధబ్రాహ్మణులు దగ్గిఱకువచ్చువఱకును మెల్లమెల్లగనడచుచుండె. రాముఁడు, పరమదయాళువును, సదాచారమును గోరువాఁడుగావునఁ దానురథముమీదనుండి కాలినడకచేతవచ్చుచున్న బ్రాహ్మణులనాశ్వాసించుటకు సమ్మతింపఁడయ్యె. ఆసమయమునందా బ్రాహ్మణులందఱు నడచిపోవుచున్న రామునిఁజూచి వేగిరపాటుతోఁగూడిన మనసుగలవారును, మిగులసంతాపమును బొందినవారలునునై రామునిగూర్చి యిట్లనిరి.

ఓరాముఁడా! ఈబ్రాహ్మణులకుఁ జక్కఁగా సేవనుజేయునట్టి నిన్ను బ్రాహ్మణులందఱును వెంబడించివచ్చుచున్నారు. మఱియునగ్నిహోత్రములను నరణులయందారోపించియాయరణులను వీరుమీఁదవైచికొనివచ్చుచున్నారు. కావుననోరామా! వీరలనుజూడుము. రాముఁడా! మాకువాజపేయయాగమునందు లభించినవియును, శరత్కాలమునందలి మబ్బులవలెఁ దెల్లగానున్నవియును, నగు తెల్లనిగొడుగులతోఁగూడ నీముసలిబ్రాహ్మణులు నీవెంట వచ్చుచున్నారు. వీరలనుజూడుము. ఓరాముఁడా! నీకు గొడుగులేకయున్నవి. కావుననేము నీతోఁగూడ వచ్చి నీకెండసోకునప్పుడు మేమువాజపేయ యాగముచేసినప్పుడు మాకులభించిన యీగొడుగులనుబట్టి నీకెండగలుగకుండునట్లుచేసెదము. వత్సా! రామా! తండ్రీ! సర్వకాలములయందును వేదవేదాంగములయందుఁ బ్రవర్తించునట్టిమా మనస్సులిప్పుడు వనవాసమును జేయుటయందుఁ బ్రవర్తించుచున్నవి. మాకుఁబరమధనములగు వేదములుమాహృదయములయందే యుండియున్నవి. భార్యలుతమపాతివ్రత్యవ్రతముచేతఁ గాపాడఁబడుచున్నవారై గృహమునందే యుండగలరు. నిన్నేవిధముగానైనమరల నయోధ్యాపట్టణమునకుఁ బిలుచుకొనిపోవలయునని తలచియున్నాము. కావుననీవిఁకమీఁద నరణ్యమునకుఁ బోఁగూడదు. కాఁబట్టినీవీసంకల్పమును వదలుము. పరమధార్మికుఁడవగు నీవే బ్రాహ్మణుల ప్రార్థనను నెరవేర్చుటయనియెడు ధర్మమును జేయుటయందుఁ గోరికలేనివాఁడవగుదువేని దీనికంటెనుత్తమమగు మఱియేధర్మమును జేయఁదలఁచియున్నావు? చలనరహితమైన ధర్మానుష్ఠానముగలవాఁడవైన యోరామా! హంసలవలెఁ దెల్లనివియును, భూమియందుఁ [illegible] దుమ్ముగలవియును, నగుతలవెండ్రుకలుగల మాచేతఁ బ్రార్థింపఁబడినవాఁడవైతివి. కావునవెనుకకుమరలుము. వత్సా! రామా! అనేకులగు బ్రాహ్మణులు యజ్ఞములను జేయుటకొఱకయోధ్యాపట్టణమునకు వచ్చియున్నారు.

కావుననీవీయజ్ఞములను సమాప్తినొందించుటకయోధ్యాపట్టణమునకు రావలసియున్నది. కాఁబట్టివెనుకకురమ్ము. నీవురాకపోయినయెడల యాగములకువిఘ్నములను గలిగించినవాఁడవగుదువు. రామా! స్థావరజంగమాత్మకములగు భూతములన్నియును నీయందుభక్తిగలవైయున్నవి. కావుననాభూతములన్నియును నీవయోధ్యాపట్టణమునకు రావలయునని కోరుచున్నవి. ఇవ్విధముగయాచించుచున్న భక్తులయందు భక్తినిజూపుము. మిగులగొప్పవృక్షములన్నియును వేళ్లనుబెఱికికొని సీతోఁగూడవచ్చుటకు శక్తిలేనివై వాయువేగముచేత మహాశబ్దముతో గూడియుండుటనుబూడగా మనముగూడరామునివెంట నంటిపోవుటకు లేకపోయెనేయని రోదనమును జేయుచున్నవానివలెనున్నవి. సర్వభూతదయాళుఁడవగునిన్నును, పక్షులుగూడ నాహారవిహారసంచారములనువిడిచి, వృక్షములయందేకూర్చుండినిన్ను నయోధ్యాపట్టణమునకురమ్మని యాచించుచున్నవని యావృద్ధబ్రాహ్మణులు రామునితోఁజెప్పిరి. ఇవ్విధముగరోదనమును జేయుచున్న యాబ్రాహ్మణులమాటలను వినక మెల్లగాబోవుచున్న రాముని "ఇదిసరిగాదు,, వృద్ధబ్రాహ్మణుల నూరడించకపోవుటయుచితముగాదని నివారించుదానివలె,, తమసానది రామునకడ్డముగవచ్చె. అంతటసుమంత్రుఁడు శ్రమనొందియున్నగుఱ్ఱములను రథమునుండివిప్పి యలపుదీర్చుటకై నేలయందు పొరలునటుల జేసి యుదకమును ద్రాగించి యుదకముచేతఁ జక్కఁగాఁగడిగి యాతమసానదీతీరంబున గుఱ్ఱములను మేతకొఱకుఁ ద్రిప్పుచుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలుబదినాల్గవ సర్గముగిసెను.

రాముడుతమసానదీతీరమునని వసించుట.

అంతరాముఁడు మనోహరమగు తమసానదీతీరమును జేరిసీతనుజూచి లక్ష్మణునితో నిట్లనియె.

లక్ష్మణా! వనమరణ్యమునందు నివసింపవలసిన పదునాలుగుసంవత్సరములలో మొదటిదినమిప్పుడు వచ్చియున్నది. నీకుశుభముగలుగుఁగాక. ఇఁకమీఁదటనీవుయింటిని గాని యింటివార్తను గాని స్మరింపగూడదు. మఱియు నోలక్ష్మణుఁడా! తమతమస్థానములకునఱుచుచు వచ్చుచున్న పశుపక్షిమృగాదులచేత వ్యాప్తములైన యీయడవులన్నియును, రోదనమును జేయుచున్నట్లున్నవి. నీవీయరణ్యము

లనుజూడుము. నాతండ్రియగు దశరథమహారాజుయొక్క రాజధానియైన యయోధ్యానగరమునందుండు స్త్రీలును, పురుషులును, నరణ్యమునకుఁబోయిన మనలనుగూర్చి యెక్కువ యధికముగ దుఃఖమునుబొందుచుందురు. ఇందుకుఁ గొంచెమైనను సందేహములేదు. పురుషోత్తముఁడా! లక్ష్మణా! జనులందఱును మనగుణములనుజూచి దశరథమహారాజునందును, నీయందును, నాయందును, భరతశత్రుఘ్నులయందున, నధికముగఁబ్రియము గలిగియున్నారు. నాకు, నాతల్లిదండ్రులను దలఁచుకొనుటచేత నధికముగ దుఃఖమువచ్చుచున్నది. ఆతల్లిదండ్రులవ్విధముగ ననేకపర్యాయములు రోదనమునుజేయుచుఁ గండ్లనుజెడఁగొట్టుకొన్నవారై గ్రుడ్డివారలగుదురు. మఱియు నోలక్ష్మణా! భరతుఁడు పరమధార్మికుఁడు. కావునధర్మార్థకామముల తోఁగూడిన మాటలనుజెప్పి నాతల్లిదండ్రులనోదార్చునని నాకుఁదోఁచుచున్నది. లక్ష్మణా! భరతునిమంచిగుణములను దలఁచుకొనినసమయమునందు మాత్రము నాకుఁదల్లిదండ్రులను గుఱించిమిగుల దుఃఖముగలుగుటలేదు. పురుషోత్తముఁడా లక్ష్మణా! నీవునాతోఁగూడ నరణ్యమునకువచ్చుటవలన మంచిపనినిజేసినవాఁడవైతివి. నీవురాకుండువేని సీతనుసంరక్షించుట నాకుమిగులఁగష్టముగానుండును. లక్ష్మణా! నేనీరాత్రియందు దకపానమును మాత్రముజేసెదను. ఈయరణ్యమునందు భక్షింపఁదగినపదార్థము లనేకములున్నను నాకిప్పుడ నీళ్లుత్రాగడమునందుఁ దప్పమఱిదేనియందును నిష్టముగలిగియుండలేదు. ఇట్లురాముఁడు లక్ష్మణసుమంత్రులతోఁజెప్పి మరలనిట్లనియె.

సుమంత్రా! నీవుగుఱ్ఱములను జాగ్రతగజూచుకొనుచుండుమనియె. ఆమాటలనువిని సుమంత్రుఁడస్తమయమునుబొందినపిమ్మట గుఱ్ఱములనుబంధించి యాగుఱ్ఱములకు గావలసినంతగడ్డి వేసి రామునిసమీపమునందుండెను. పిమ్మట నాసుమంత్రుఁడు, సాయంకాలీనసంధ్యావందనాది కార్యములనుజేసికొని రాత్రియగుటనుజూచి రామలక్ష్మణులకు పండుకొనుటకు స్థలమునుసిద్ధముజేసెను. అప్పుడు రాముఁడు తమసానదీతీరమునందుఁ జెట్లయాకులతోఁజేయఁబడిన పాన్పునుజూచి సీతాలక్ష్మణులతోఁగూడఁబరుండె. అంతటలక్ష్మణుఁడు, రాముఁడుభార్యతోఁగూడఁ జక్కగానిద్రను బొందుటనుజూచి సుమంత్రునితో రాముని మంచిగుణములనన్నిఁటిని వర్ణించిచెప్పె. ఇవ్విధముగలక్ష్మణుఁడు సుమంత్రునకు రాముని మంచిగుణములను నభివర్ణించిచెప్పుచు నారాత్రినిసర్వమునుగడిపె. అంతఁగొంతసేపటికి సూర్యోదయమయ్యె. రాముఁడుతనతోఁ గూడవచ్చిన పురజనులతోఁగూడను గోవులసముదాయముతోఁగూడను తమసానదీతీరమున నారాత్రియంతయునుగడిపె. మఱియునుమిగులఁ దేజోవంతుఁడగు రాముఁడు ప్రాతఃకాలమునకు ముందుగనిద్రనువదలి మంగళకరములగు చిహ్నములతోఁగూడియున్న, తమ్ముఁడగు, లక్ష్మణునిఁజూచి యిట్లనియె.

లక్ష్మణా! ఈపురజనులందఱును మనయందుండునట్టి ప్రియముచేత గృహములయందభిలాషనువదలి చెట్లక్రిందఁబడినిద్రనుబొందుచున్నారు. వీరిఁజూడుము. ఈపురజనులందఱును మనలమరలనయోధ్యాపట్టణమునకు రమ్మనియనేకవిధములఁ బీడించుచున్నారు. వీరుచెప్పటనుబట్టి చూడఁగా మనమయోధ్యాపట్టణమునకుఁబోనియెడల వీరుప్రాణములను వదలునట్లుతోఁచుచున్నది. కావున మనమయోధ్యాపట్టణమునకుఁ బోకపోతిమేనివీరలుమనను బహువిధముల నిర్బంధింతురని తోఁచుచున్నది. కాఁబట్టియోలక్ష్మణా! వీరునిద్రనుండి మేలుకొనుటకుఁ బూర్వమునందేమనము రథమునెక్కి నిర్భయముగాఁబోవుదము. మనమిట్లుచేసినయెడల మనయందుఁబ్రియముగల యీపురజనులందఱును నికమీఁదనివ్విధముగఁ జెట్లక్రిందఁబడి నిద్రనుబొందకుందురు. ఇంతియగాక తమగృహములకుఁబోయి సుఖముగనిద్రనుజెందుదురు. మఱియును మనపట్టణమునందుండునట్టి రాజపుత్రులగువారు తన్నాశ్రయించినవారికిగష్టము గలిగెనేని పోఁగొట్టవలయును. మఱియుతమపట్టణముననుండు జనులుదుఃఖమును బొందుచుండఁగాఁ దాముచూచియును నూరకుంటయుచితముకాదు. కావుననిశ్చయముగ వీరిదుఃఖమును బోఁగొట్టవలయునని తోఁచుచున్నదనిచెప్పె. అంతటలక్ష్మణుఁడు పరమధర్మస్వరూపుఁడైన రామునిఁజూచి యిట్లనియె.

అన్నా! రామా! నీవుప్రాజ్ఞుఁడవు. కావుననీమాట సర్వోత్తమముగనున్నది. కాఁబట్టినాకును నీవుచెప్పినవిధముగానే ప్రవర్తించుటకిష్టముగలిగియున్నది. కావునశీఘ్రముగ రథమునెక్కుమనియె. ఆమాటనువిని శ్రీమంతుఁడగు రాముఁడుసుమంత్రునిజూచి యిట్లనియె.

సుమంత్రుఁడా! నీవుమిగుల సామర్థ్యముగలవాఁడవు. కావుననీవురథమును సిద్ధముసేయుము. నేనురథారూఢుఁడనై యరణ్యమునకుఁబోయెదను. కావునశీఘ్రముగాఁ బొమ్మనియె. అట్లురాముఁడు చెప్పినమాటలనువిని సారథియగుసుమంత్రుఁడు శీఘ్రముగరథమునకు శ్రేష్ఠములగు గుఱ్ఱములనుబూన్చి రామునిసన్నిధానమునకువచ్చి చేతులుముకుళించుకొని రాజోత్తమా! రథముసిద్ధమైయున్నది. రథి

కులలోనుత్తముఁడవును, మహాబాహుఁడవును నైనయో రామా! ఇదిగో రథము సర్వసిద్ధమైయున్నది. కావున నీవు సీతాలక్ష్మణులతోఁగూడి యీరథము నెక్కుమనియె. అంతట నారాముఁడు ధనుస్సుఖడ్గము మొదలగు నాయుధములను ధరించి రథము నెక్కి యధికమైన వేగమును, సుడులును గల తమసానదిని దాటెను. మఱియును మహాబాహుఁడును, శ్రీమంతుఁడును, నగు రాముఁడు తమసానదిని దాటి యవతలితీరమునకు రథము చేరిన తోడనే దిగి శుభకరమును, ముండ్లు లేనిదియును, భయశీలురకుఁగూడ భయమును గలుగఁ జేయనిదియును నగు గొప్పమార్గమును బొందె. అప్పుడు రాముఁడు తనవెంట వచ్చినవారలను మోసము సేయఁదలఁచి సుమంత్రునిఁ జూచి యిట్లనియె.

సుమంత్రుఁడా! నీవు రథమునెక్కి కొంతసేపు త్తరపు దిక్కునుగూర్చి పొమ్ము. అట్లు నీవు చేసినయెడల నీ పురజనులందఱును నేనయోధ్యాపట్టణమునకే పోతినని తలఁతురు. కావున నీవు శీఘ్రముగా నుత్తరపు దిక్కు ననుసరించి కొంతదూరము పోయి మరల రథమును మరల్చుకొని మఱియొక మార్గమున రమ్ము. ఇట్లు సేసినయెడల పురజనులందఱును మన మెక్కడకుఁ బోయినదియును దెలియఁజాలనివారై మరల నయోధ్యాపట్టణమునకుఁ బోదురు. కావున నో సుమంత్రుఁడా! నీవెచ్చరికగలవాఁడవై నేను జెప్పినవిధముగఁ జేయుమని చెప్పె. అట్లు రాముఁడు చెప్పిన మాటలను సారథియగు సుమంత్రుఁడు విని రాముఁడు సెప్పినవిధముగఁ జేసి రథము తోడ మరలివచ్చి రాముని సన్నిధానమునందు వచ్చినిలిచెను. అంతట రఘుకులవర్ధనుఁడగు రాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ రథము నెక్కె. అంతట సుమంత్రుఁడు తపోవనమార్గమునకుఁ బోవుదారినిగూర్చి గుఱ్ఱములనడిపెను. అట్టియెడ సుమంత్రుఁడు ప్రయాణసమయమునందు మంగళసూచకముగ కొంచెముసేపు త్తరపుదిక్కునుగూర్చి రథమును బోనిచ్చె. అప్పుడు, మహారథుండగు రాముఁడు సారథిఁ తోఁగూడ రథాధిరూఢుఁడై యరణ్యమునకుఁ బోయె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలుబదియాఱవసర్గ ముగిసెను.

పురజనులు రాముఁడు పోయిన దారి తెలియవిలపించుట.

అంతఁగొంతసేపటికా పురజనులందఱును మేలుకొని యచ్చట రాముఁడు లేకుండుటనుఁజూచి యధికమైన దుఃఖమును బొంది నిశ్చేష్టితులై మూర్ఛబోయిరి. అంత నా పురజనులందఱును, వ్యసనమువలనఁ గన్నులనుండి నీరు ప్రవాహమువలె గారుచుండఁగ నాలుగుదిక్కులయందును బరిశీలించి చూచిరి. అట్లు చూచి రాముఁడు కనఁబడకపోవుటయే గాక రథము యొక్క వేగమువలన నగుబడెడు దుమ్మైనఁగూడఁ గనఁబడనందుకుఁ బరితాపముగలవారైరి. ధీమంతుఁడును రాముఁడు గనబడకపోవుటచేత రామునియందు మిగులఁ బ్రియముగల యా పురజనులందఱును పరమదుఃఖముచే బీడింపఁబడిన ముఖములం గలిగి మహాదీనులై దీనస్వరముతో నిట్లనియేడ్చిరి.

అయ్యో! మనమందఱమును దేహమును మఱచి నిద్రను బొందుటవలనఁగదా రాముఁడు మనలవిడిచిపోయె. మిగుల విపులమగు ఱొమ్ముగలవాఁడును, మిక్కిలి పొడవులగు భుజములుగలవాఁడును, నగు రాముఁడిఁక మీఁద మనకుఁ గనఁబడఁడుగదా? అయ్యో! మనకీపాపిష్ఠి నిద్రయేల వచ్చెను? ఈ నిద్రచేఁ గలఁబడిపోన? మనమెంత మోసపోతిమి? మహాబాహుఁడగు రాముఁడెప్పుడును భక్తులగువారలను మోసముసేయనట్టి స్వభావముగలవాఁడును. దయావంతుఁడునునగు రాముఁడు భక్తులమైన మనలనిప్పుడు వదలి యెట్లుపోయెనో గదా? లోకములో దండ్రులు తమజ్యేష్ఠపుత్రులను గాపాడుకొను విధముగ మనలను సర్వకాలములయందును గాపాడునట్టివాఁడును, రఘుకులోత్తముఁడును నగు రాముఁడిప్పుడు మనలను వదలి యరణ్యమునకుఁ బోవుటకుఁ గారణమేమి యోగదా? మనమిచ్చటనే మరణమును బొందుదము. కాదేని యుత్తరదిక్కును గూర్చిపోయి మహాప్రస్థానమును జేయుదము. రాముఁడు లేకమనము జీవించుటవలన గొంచెమైనను బ్రయోజనములేదు. కావున నిశ్చయముగఁ బ్రాణములను వదలుదము. ఇక్కడ చక్కగా నెండిన పెద్దపెద్ద క్ర్యాయలనేకములుగలవు. ఆకొయ్యలతోఁ జితిని నిర్మించి దానియందగ్నిహోత్రమును వెలిగించి యాయగ్నియందుఁ బ్రవేశింతము. అట్లు గాక మనమయోధ్యాపట్టణమునకుఁ బోతిమేని యందలిజనులందఱు రామునిక్షేమవార్తనడుగుదురు. అప్పుడు మహాబాహుఁడును, నసూయారహితుఁడును, ప్రియముగ మాటలాడువాఁడును, నగు రాముని సీతాలక్ష్మణులతోఁగూడ నరణ్యమునవదలివచ్చినామని గదా? చెప్పవలసివచ్చును? ఇట్టి కఠినవార్తను మనమెట్లు చెప్పుదుము. మనము సీతారామలక్ష్మణులను వదలి యయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించిన తోడనే యచ్చటనుండునట్టి స్త్రీలు, బాలురును, ముసలివారును, మఱియునితరులును, నధికమగు దుఃఖమును బొంది సంతోషము లేనివారగుదురు. మనమందఱమును మనోనిగ్రహముగలవాఁడును, వీరులలోనుత్తముఁడును, నగురాముని తోడఁగూడ నయోధ్యాప

ట్టణమునుండి బయలు వెడలినాము. అట్లుబయలు వెడలి యిప్పుడు రాముని విడిచి మనమెట్లయోధ్యాపట్టణమునకుఁబోవచ్చునని వారందఱును నొకచోటఁ జేరి రోదనమును జేసిరి. అట్లువారందఱును, దూడలనువదలిన గోవులవిధముగ మిగులదుఃఖము నుబొందిరి మఱియును జేతులను పైకెత్తికొని హా రామా! దశరథరాజనందనా! రఘుకులోత్తమా! రామచంద్రా! యని రాముని యనేకవిధములనభివర్ణించుచు రోదనమును జేసిరి. అట్లు రోదనమును జేసి యా రాముని రథముపోయిన మార్గమునుబట్టి కొంతదూరము పోయిరి. అట్లుపోయి మార్గము తెలియకపోవుటచేత మునుపటికంటె నధికముగ దుఃఖమునుబొందిరి. అట్లు దుఃఖమును జెంది మరలనిట్లని తలఁచిరి. అయ్యో రాముని రథముయొక్క మార్గము జాడ తెలియక పోయెనే ఇది యేమి? ఇఁక మన మేమి చేయుదము. అయ్యో దైవమా! నీవుగూడ మాయందు దిక్కైలవిరోధమును సాధించుచున్నావు. అనియిట్లనేకవిధముల దుఃఖమును బొంది యేమియును జేయఁజాలక తాముపరుండియుండిన స్థలమునకు మరలివచ్చిరి అవ్విధముగ నాపురజనులందఱును మనస్సునందు దుఃఖమతిశయింపఁగాఁ బూర్వము తాము వచ్చిన దారినిఁబట్టి దుఃఖవంతులగు సత్పురుషులతోఁ గూడిన యయోధ్యాపట్టణమునకుఁ బోయిరి. అట్లుపోయి యా ముసలివారందఱును, గృహమునకుఁ బోవుటకు యిష్టములేకపోవుటవలన మహావ్యసనముతో ఆపట్టణమును జూచినతోడనే అయ్యో రామరహితమైన పట్టణములోనికిఁ బోవలసివచ్చెనే యనికన్నులనుండి నీళ్లను గార్చుచు నిట్లనిరి.

అయ్యో యీ యయోధ్యాపట్టణము రాముఁడు లేకుండుటచేత గాంతిహీనమైయున్నది. గరుత్మంతుడు సర్పముల నుదిని వేసినపిమ్మట మడుగులో నిర్భయముగఁ బ్రవేశించునట్లు యికనెల్లవారును నిర్భయముగ నయోధ్యాపట్టణమునఁ బ్రవేశింతురు. మన మేమి చేయఁగలమని కన్నులనీరు గారగా రోదనమును జేసిరి. అట్లు రోదనమును జేసినవారై చంద్రుడు లేని యాకాశమువలెను, జలములేని సముద్రమువలెను, నయ్యయోధ్యాపట్టణము, రాముడు లేకుండుటచే దుఃఖమునుబొందుచున్న యా పురజనులకు కాంతిహీనమైనదైకనఁబడియె. కొంచెమైనను సంతోషములేని యా పౌరులందఱును, నధికముగ దుఃఖమును బొందుచు విశేషధనముగల తమ గృహములయందుఁ బ్రవేశించి పరమదుఃఖముగలవారగుటచే దమ యెదుటనున్నవారలనుగూడ తమవారైనదియు నితరులైనదియు దెలిసికొనలేకపోయిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలుబదేడవసర్గము ముగిసెను.

అయోధ్యాపట్టణమునందు స్త్రీలు రాముఁడు లేని రాజ్యమును జూచి విలపించుట.

అవ్విధముగ నాపురజనులందఱును రామునితోఁగూడఁ గొంతదూరముపోయియును రాముని దోడ్కొని రాలేక పోవుటవలన నధికమైనదుఃఖముగలవారై కన్నులనీళ్లు గార్చుచుండిరి. మఱియును గొందఱు మరణమును బొందఁదలఁచినవారై ధైర్యమునువదలి మూర్ఛనొందిరి. అంతట గొందఱు తమతమ గృహములకుఁ బోయి దారాపుత్రులను జూచి కన్నీళ్లు గాఱగా దుఃఖించిరి. ఇంతియగాక మిత్రులు మొదలగువారు వచ్చి తమను పలుకరించినను సంతోషములేనివారైరి. ఎన్నడు చూడని వస్తువులు లభించినను నానందము లేనివారైరి. అప్పట్టణమునందుండు వ్యాపారము జేయువారెవ్వరును నంగళ్లను బెట్టరైరి. అగ్నిహోత్రము మొదలగు పుణ్యకర్మలను నందఱును వదలిరి. గృహస్థులు తమగృహములయందు వంటనుగూడఁ జేయరైరి. మఱియు నాపురజనులు బహుకాలమునుండి కనఁబడని యమూల్య రత్నాదులప్పుడు కనఁబడినను సంతోషమును బొందరైరి. దశరథుని జ్యేష్ఠపుత్రుఁడైన రామునకిట్టిగతి సంభవించినదని జ్యేష్ఠపుత్రుఁడు దగ్గఱకు వచ్చినప్పుడు తల్లులు కొంచెమైనను సంతోషములేనివారైరి. ప్రతియింటియందును స్త్రీలు పరమదుఃఖముచేత రోదనమును జేయుచుండి. మఱియు నంకుశములచేత మావటివాండ్లు యేనుఁగులను బొడిచిబాధించువిధముగ నిండ్లకువచ్చిన భర్తలను గఠినవాక్యములచేత నిందించిరి.

అట్లుపలికి అయ్యో యిఁకను రాముఁడు గనఁబడఁడుగదా! ఇఁకమీఁద మీకు గృహములచేతఁగాని, భార్యలచేతఁగాని, ధనముచేతఁగాని, పుత్రులచేతఁగాని, సుఖములచేతఁగాని, ప్రయోజనమేమి? గలదు. వనమునందు సీతారాములకు శుశ్రూషను జేయుటకుఁ బోయిన లక్ష్మణుఁడొకఁడే సత్పురుషుఁడుగాని మఱియొకఁడెవ్వఁడును సత్పురుషుఁడు లేడు. అడవులయందు రాముఁడు ఏ యేనదులయందును, నే యే తామరకొలఁకులయందును, మఱియు నితరములగునే యేమడుగులయందును స్నానమును జేయునో యా వియన్నియును మిగుల బుణ్యము జేసినవనుటకు సందేహము లేదు. మిగుల రమణీయములగు చెట్లుగల యడవులును, జలప్రాయప్రదేశములుగల యేరులును, గొప్పనెత్తములుగల కొండలును, రామునకు మహాసంతోషమును గలుగఁజేయుచుండును, రాముఁడరణ్యమునకుఁ బోయినను, పర్వతమునకుఁ బోయినను, మఱి యెచ్చటికిఁ బోయినను, అవియన్నియును దమయొద్దకుఁ బ్రియుఁడైన యతిథివలె వచ్చిన యా రాముని నవశ్యముగఁ బూజించును. శిరస్సులయందుఁ బరి

మళించుచున్న పుష్పములుగలవియును, ననేకములగుపూలగుత్తులచేతఁ బ్రకాశించుచున్నవియును, తుమ్మెదలగుంపుతో నిండియున్నవియును నగువృక్షములు రామునివనమ్మునకవశ్యముగ మహాసంతోషమును జేయఁగలవు. పర్వతములన్నియును నకాలమందుఁగూడ మనోహరములగు పుష్పములను, ఫలములను రామునకుఁజూపి సంతోషమును గలుగఁజేయును. పర్వతములు రాముడు కోరినప్పుడెల్ల నానావిధములగు కొండకాలువలనుజూపి నిర్మలములగు నుదకముల నివ్వఁగలవు. మఱియును పర్వతములమీదనుండు వృక్షములు రామునకు సర్వకాలములయందును మహాసంతోషమును గలుగఁజేయుచుండును. రాముఁడుండుస్థలమునందు భయముపరాభవము మనకుగలుగవు. దశరథపుత్రుఁడగు రాముఁడు మహావీరుఁడగుటచేత భయపరాభవములుగలుగవనుటకు కొంచమైనను సందేహములేదు. మనమింకమగూడ నాలస్యమును జేయుదుమేని రాముఁడుమఱింత దూరముపోవును. కాబట్టియిప్పుడే రామునియొద్దకుఁబోవుదమని తమభర్తలతోఁజెప్పి మఱియునిట్లనిరి.

ఓప్రాణనాయకులారా! రామునిపాదసేవమనకు మిక్కిలిసుఖమును గలుగజేయును. మఱియుమనకుఁ బ్రభుఁడును. గతియును, బరమగతియును నారాముఁడేగానియన్యుఁడొకఁడునులేఁడు. కావునమనమందఱమును నరణ్యమునకుఁబోవుదము. పోయినపిమ్మట మేముసీతకుఁబరిచర్యను జేసెదము. మీరురామునకుఁ బరిచర్యను జేయుఁడు. అడవియందు రాముఁడుమీయోగక్షేమములను జేయును. మాయోగక్షేమములను సీతాదేవిచేయుచుండుననిరి. ఇట్లు అయోధ్యాపట్టణమునందుండునట్టి స్త్రీలందఱునుమిగుల దుఃఖముగలవారై తమభర్తలతోఁజెప్పిరి. ఇట్లందఱునువిరక్తులైయుండఁగ, రాముఁడులేకపోవుటచేత నప్రశస్తమైనదియును। దుఃఖవంతులగు జనులుగలదియును, మనోహరముగానిదియును, మనస్సునకునధికమగు దుఃఖమునుగలుగఁజేయునదియును, నగునయోధ్యాపట్టణమునందు మఱియొకరుఁడెవ్వఁడుండును. అవ్విధముగఁజెప్పి మఱియు నిట్లనిరి.

ఇఁకమీఁదఁగైకేయి విధవరాలైయన్యాయముగ రాజ్యపరిపాలనను జేయుచుండును. ఇట్టియన్యాయరాజ్యమునందుండ వలసివచ్చుటచేత నిఁకమీఁదమాకుఁ బ్రాణములమీఁదగూడనాశలేదు. కైకేయియైశ్వర్యము కొఱకుఁగాఁ బుత్రుఁడగు రాముని, భర్తయగుదశరథునిగూడఁ, బరిత్యజించినదే? అట్టిపాపాత్మురాలగు కైకేయియిఁకతనరాజ్యమునం దెవ్వరినిబాధింపదు? సకలజనులనుబాధించును. కావునఁగైకేయియొక్క రాజ్యమునందుఁ గైకేయిబ్రతికియుండఁగా మేముబ్రతికియున్నంతవఱకును బరిచర్యయుచుండవలసివచ్చును. అట్లుండుటకు మాకుఁగొంచమైన నిష్టములేదు. ఇకమీదరాముడులేని యీరాజ్యమునందుమేముండమని మాపుత్రులసాక్షిగఁజెప్పుచున్నాము. అహా! యీకైకేయి కొంచెమయినను దయలేనిదై దశరథరాజనందనుఁడగు రాముని నరణ్యమునకుఁ బంపినదే! అట్టియన్యాయప్రవర్తకురాలును, దుష్టస్వభావముగలదియును నగుకైకేయియొద్ద నెవ్వఁడు సుఖముగాజీవింపఁగలఁడు. అందఱును నికమీదదుఃఖమునుబొందియే జీవింపవలసివచ్చును. ఈరాజ్యమంతయును నాధారములేకప్రభువులేనిదై మిగుల నుపద్రవమును బొందియున్నది. అహా! అదుదియైన, యొకకైకేయినిమిత్తముగ నీరాజ్యమంతయును నశింపవలసివచ్చెఁగదా! రాముఁడరణ్యమునకుఁ బోవుటవలనఁగలిగిన దుఃఖముచేత దశరథుఁడుమరణమునుబొందును. దశరథుఁడు మృతినొందినపిమ్మటఁ బట్టణమునందంతటను రోదనమధికమగును. కావునవోపురుషశ్రేష్ఠులారా! నశించినపుణ్యముగలవారును, మిగులదరిద్రులును, నగుమీరందఱును జక్కఁగనాలోచించి విషమునుద్రాఁగుడు. అట్లుగాదేని రామునితోఁగూడ నరణ్యమునకైనఁ బోదమురండు. ఇదియును జేయఁజాలని యెడల నేదేశమునకుఁబోయినచో మీపేరుగూడఁదెలియకుండునో యట్టిదేశమునకుఁ బొండు. కపటముచేత సీతాలక్ష్మణులతోఁగూడ రాముఁడరణ్యమునకుఁబంపఁబడెను. ఇఁకమనముమాత్రము, పశువులనుజంపువానిముందఱఁ బశువులున్నవిధముగ భరతుని మ్రోలనున్నాము. చంద్రునివంటి ముఖముగలవాఁడును, నల్లనివాఁడును, మిగులబలిసియుండు మూపులసంధులుగలవాఁడును, ఆజానుబాహుఁడును, కమలములవంటి కండ్లుగలవాఁడును, లక్ష్మణునకన్నయును, ముందుగభాషించిపిమ్మట నవ్వువాఁడును, మనోహరుఁడును, సత్యవాదియును, మహాబలుఁడును, శాంతుఁడును, సర్వలోకమునకును జంద్రునివలెఁ జల్లఁగఁబాడఁదగినవాఁడును, పురుషోత్తముఁడును, మదించినయేనుఁగుల పరాక్రమమువంటి పరాక్రమముగలవాఁడును, మహారథుఁడునునగు రాముఁడునిశ్చయముగ నరణ్యములను ప్రకాశింపఁజేయును. అట్టిరాముఁడు మనలనందఱువదలి యడవులకుఁబోయెనే, అయ్యో! యిఁకమనకు దిక్కెవ్వరని యాపట్టణమునందలి స్త్రీలందఱునుదమభర్తలతోఁజెప్పియొక్కపెట్టున దిక్కులు బ్రద్దలగునట్లుగొంతెత్తిగట్టిగానేడ్చిరి. మఱియు నయోధ్యాపట్టణమునందలి యాస్త్రీలందఱును నానావిధముగవిలపించుచు మిగులదుఃఖముగల

ఱాగైమరణసమయమున మనకేఁగట్టిగా ననుచిరి. ఇట్లయోధ్యయందుండు స్త్రీలందఱును రామునిగుఱించి తమగృహములయందు దుఃఖించుచుండఁగా సూర్యాస్తమయమయ్యె. అంతట రాత్రివచ్చెను ఆసమయమునందాహితాగ్నులు అగ్నులను బ్రజ్వలింపరైరి. బ్రాహ్మణులు వేదాధ్యయనములను గాని పురాణపఠనములను గాని చేయరైరి. కాఁబట్టి యయ్యయోధ్యాపట్టణమంతయును జీకట్లుక్రమ్మినట్లయ్యె. ఆసమయమునందాపట్టణమునను౦డు వర్తకులెవ్వరును నంగళ్ళను బెట్టరైరి. పట్టణములోనెవ్వనికిని సంతోషముగలుగకుండె. రాముఁడొకఁడు లేకపోవుటవలన నందఱును దిక్కులేనివారలై యుండిరి. ఇట్లగుటచేత నాయయోధ్యాపట్టణము నక్షత్రములు లేనియాకాశమువలెఁ బ్రకాశహీనమై యుండె. మఱియు నాప్రకారము పట్టణములోనిస్త్రీలందఱును రామునినిమిత్తముగ నాతురముగలవారై పుత్రులును సహోదరులును నడవికిఁబోయిరేని యెట్టులరోదనమును జేయుదురో యావిధముగ రోదనమును జేసిరి. అందలిస్త్రీలకందఱకును రాముఁడు పుత్రులకంటె నధికప్రియముగలవాఁడై యుండె. అప్పుడాయయోధ్యాపట్టణమంతయును నృత్తగీతాద్యుత్సవములు లేనిదయ్యె. సంతోషములేనిదియును, మూయఁబడినయంగళ్లుగలదియును నయ్యె. ఇవ్విధముగనుండుటచేత నప్పట్టణము “కొంచెమునీళ్లుగలమహాసముద్రమువలె,, సద్దులేనిదయ్యె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలుబదెనిమిదవసర్గముగిసెను.

రాముడు దండకారణ్యమునకు బోవుచు సకలగ్రామములను దాటిపోవుట.

పురుషోత్తముఁడగు రాముఁడు తండ్రియాజ్ఞనుస్మరించుచు మఱునాడు సూర్యోదయమునకు ముందుగానే మిగుల దూరముపోయె. అట్లుపోవుచుండఁగానే మంగళకరమైన యారాత్రియంతయును గడచిపోయె. పిమ్మటఁ బ్రాతఃకాలసంధ్యనువార్చి యుత్తరకోసలదేశముయొక్క దక్షిణపుహద్దును జేరె. రాముఁడు విత్తనములుచల్లుటకొఱకుఁ జక్కఁగాదున్నఁబడియున్న పొలములుగలయూరులను, పుష్పించియుండువనములను, జూచుచుఁ గొప్పగొప్ప గ్రామములయందును, చిన్నచిన్నగ్రామములందును నివసించుజనులు ఒకరితోనొకరు మాటలాడుకొనునట్టిమాటలనువినుచు శీఘ్రముగాను మెల్లగానుబోయె. శ్రేష్ఠములగుగుఱ్ఱముల చాతుర్యముచేత మిగులదూరముపోయినను పోయినట్లుతోఁచదయ్యె. అట్టియెడగ్రామములయందుండు జనులుఒకరితోనొకరిట్లని మాటలాడుకొనుచుండిరి. ఓమిత్రులారా! “దశరథమహారాజెంత దుర్మార్గుఁడనవచ్చును. మన్మథపరవశుఁడై పుత్రునినరణ్యమునకుఁబంపె. ఈదశరథమహారాజు మండిపోవునుగాక. అయ్యో కైకేయి, యెంతటిక్రూరురాలనవచ్చును. ఎంతపాపాత్మురాలో చూడండి. దుర్మార్గురాలు. సర్వకాలములయందును పాపసంకల్పురాలు. కావుననే ధర్మస్వభావముగలవాఁడును, పండితులలోనుత్తముఁడును, దయగలవాఁడును, జితేంద్రియుఁడును, నగు రామునినడవికిఁబంపినది. కాఁబట్టికైకేయి మహాదుర్మార్గురాలనవచ్చును. ఆహా యీక్రూరాత్మురాలు కులస్త్రీలు యెంతమర్యాదగనుండవలయునో ఆమర్యాదనువదలి యెంతదుష్టకార్యమును జేసినది. మహానుభావురాలును, జనకచక్రవర్తికిఁ గుమార్తెయునునగు సీతాదేవి సర్వకాలములయందును సుఖమును బొందుటకుఁదగినది. అయ్యో యిట్టి వంటిసీతాదేవి యడవులయందుఁ గష్టములనెట్లనుభవించును? అయ్యో దశరథమహారాజెంత దయలేనివాఁడయ్యె. పుత్రుఁడనికూడఁ బ్రేమనుంచక, సకలలోకప్రియుఁడును, తనకుఁగూడఁ బ్రియుఁడును నిష్కల్మషుఁడునునగు రాముని నరణ్యమునకుఁబంపెనే? ఆహా మన్మథోద్రేకముగలవాఁ డెట్టి క్రూరకృత్యమును జేయఁడని,, గ్రామములందుండువారలందఱును నిందించుచుండిరి. పరాక్రమశాలియును, కోసలదేశాధిపతియును, నగు రాముఁడు, అట్లుపెద్దపెద్దగ్రామములయందును, చిన్నచిన్నగ్రామములయందును, నుండునట్టిజనులు చెప్పుకొనుచున్న యామాటలనాలకించుచుఁ గోసలదేశమును దాటిపోయె. అటుపిమ్మట నా రాముఁడు, పరమపావనోదకముగల వేదశ్రుతియను నదిని దాఁటి దక్షిణపుదిక్కునకభిముఖుఁడైపోయె. అట్లుపోయి యా రాముఁడు మంగళకరమైన యుదకములుగలదియును, గోవులతోఁగూడిన జలప్రాయప్రదేశములుగలదియును, సముద్రమును బొందునదియును, నగుగోమతీనదినిదాఁటెను. మఱియు నా రాముఁడు గుఱ్ఱములతిశీఘ్రముగాఁబోవుటచే నతిత్వరగా గోమతీనదినిగూడదాటి మనోహరముగా ధ్వనిఁజేయుచున్న నెమళ్లచేతను, హంసలచేతను, బ్రకాశించుచున్న స్యందికానదినిదాఁటె. అట్టియెడ రాముఁడు, పూర్వము, వైవస్వతమనువుచేత నిక్ష్వాకుమహారాజున కివ్వఁబడినదియును, నధికమైనదియును, ననేకదేశములతోఁ గూడినదియునునగు కోసలదేశమును సీతాదేవికిఁజూపె. మదించినహంసయొక్క ధ్వనివంటిధ్వనిగలవాఁడును, శ్రీమంతుఁడును, పురుషోత్తముఁడును, నగు రాముఁడు మిగులశీఘ్రముగా సుమంత్రునిజూచి యిట్లనియె.

ఓసారథీ మరలనేనెప్పుడువచ్చి సరయూనదియొక్కసమీపమునందలి పుష్పితవనమునందు వేటాడుదునోగదా? నాతల్లిదండ్రులతోఁగూడ నానందముగ నెప్పుడువిహరింతునోగదా? వేటాడుటపరలోకమునందు సుఖమునుగలుగఁజేయునట్టి ధర్మముగాకపోయినను, నీలోకమునందు రాజోత్తములకుఁ గ్రీడార్థమైనధర్మమగుటచేత నధికమగుసంతోషమునుగలిగించును. శ్రాద్ధాదికాలములయందు మానవులకుఁగోరఁదగినదియును, ధనుర్ధారులకుఁ బరమప్రేమాస్పదమైనదియును, శూరులకభ్యాసపాటవమును గలుగఁజేయునదియును, నగువేటనుసరయూనదియొక్క ప్రాంతప్రదేశములయందు కొంచముగాసలుపుటకు గోరుచుందును. నేనెప్పుడునుసర్వదా వేటాడుటలేదు. అయినను వేట రాజర్షులకు సమ్మతమైనదగుటవలన నాకునులోకమునందిట్టిక్రీడ యింకొకటిలేదని తోఁచుచున్నదని చెప్పె. అట్లా రాముఁడు వేటాడువిషయములనుగుఱించి మృదువగుమాటలచేత సారథియగుసుమంత్రునితోఁజెప్పుచు నామార్గము నతిక్రమించె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నలుబదితొమ్మిదవసర్గముగిసెను.

—* { రాముఁడుకిరాతరాజగు గుహునియొక్క శృంగిబేరపురమునకుబోవుట. } *—

ధీమంతుఁడును, లక్ష్మణునకన్నయునునగు రాముఁడు, గొప్పదియును, మనోహరమును, నగుకోసలదేశమును దాటిపోయి యయోధ్యాపట్టణముప్రక్క తిరిగిచూచి చేతులనుముకుళించి నమస్కారమును జేసి యిట్లనియె.

కకుత్స్థమహారాజ వంశమునందుఁ బుట్టినవారలచేతఁ బరిపాలింపఁబడిన ఓయయోధ్యాపట్టణమా! నేను దండకారణ్యమునకుఁబోవుచున్నాను. కావుననీయాజ్ఞనుగోరుచున్నాను. మఱియును నిన్నుఁబాలించుచున్న దేవతలయనుమతమునుగూడఁబొంది పోఁదలఁచిప్రార్థించుచున్నాను. నేను మాతండ్రియాజ్ఞాపించినవిధముగాఁ బదునాలుగుసంవత్సరములును నరణ్యమునందుండి నాతండ్రియగుదశరథమహారాజుయొక్క ఋణమునుదీర్చుకొనినపిమ్మట నాతలితండ్రులతోడంగూడి నిన్నుఁజూచుచున్నానని యయోధ్యాపట్టణమునుప్రార్థించె. పిమ్మట నెత్తురువలె నెఱ్ఱనైననేత్రములుగలరాముఁడు కుడిభుజమునెత్తి కన్నీళ్ళచేతనిండిన ముఖముతోఁగూడి, దీనుఁడైయన్యగ్రామముల యందుండునట్టి జనులనుద్దేశించి యిట్లనియె.

ఓజనులారా! మీరందఱును నాయందుఁ దగినవిధముగ దయను, నాదరమునుజూపితిరి. మీరుతాపస్వభావముగల దుఃఖముతో చిరకాలముండుటన్యాయముగాదు. కావున మీరందఱును మీగృహములకుఁబోయి మీమీకార్యములను జూచికొనుఁడని రాముఁడాగ్రామవాసులతోఁజెప్పెను. అంతనాయాగ్రామజనులందఱును మహానుభావుఁడగునారామునకుఁ బ్రదక్షిణనమస్కారములను జేసి మిగులభయము గలుగునట్లుగా రోదనమును జేయుచు రామునిజూడకనే యుండుటకు సమ్మతములేనివారై యక్కడక్కడనిలిచినిలిచి రామునిఁజూచుచుఁబోయిరి. అవ్విధముగఁ దన్నువదలలేకయేడ్చుచున్న జనులకు, "సాయంకాలమునందు సూర్యుఁడు కనఁబడకఁబోవువిధముగ" రాముఁడుమిగులశీఘ్రముగఁ గంటికగపడకపోయెను. అంతనవ్విధముగఁ బురుషోత్తముఁడగునారాముఁడు రథాధిరూఢుఁడైయుండియే, ధనధాన్యములచే నిండియుండునదియును, బహుధర్మిష్ఠులగుజనులుగలదియును, మంగళకరమును, భయరహితమును, సుందరమునునగు, యజ్ఞశాలలతోడను, యూపస్తంభములతోడను గూడినదియును, నుద్యానవనములతోడను, మామిడితోఁపులతోడను నిండియున్నదియును, సంతోషవంతులును, ధనధాన్యవంతులునునగు మానవులుగలదియును, గోవులసమూహముతో నిండియుండునదియును, రాజులచేతమనోహరముగఁ జూడఁదగినదియును, సర్వకాలములయందును వేదఘోషముచే విలసిల్లుచున్నదియునునగు కోసలదేశమును దాటిపోయెను. మఱియు ధైర్యవంతులలో నుత్తముఁడగురాముఁడు, మనోహరములగునుద్యానవనములతో నిండియున్నదియును, సంతసింపదగినదియును, నధికముగఁబ్రకాశముగలదియును, రాజశ్రేష్ఠులనుభవింపఁదగినదియునునగు నాకోసలదేశముయొక్క మధ్యమార్గమునుబట్టిపోయెను. అట్లుపోయియారాముఁడు, మూఁడులోకములయందును సంచరించుచున్నదియును, మనోహరమైనదియును, పావనమైనయుదకము గలదియును, ఋషిగణముచే సేవింపఁబడుచున్నదియును, పవిత్రకరమైనదియునునగు గంగానదినిజూచె. అట్లుచూచి శ్రీమంతములగు దగ్గరనుండుఆశ్రమములచే నలంకరింపఁబడినదియును, అప్పటప్పటనుండునట్టి మడుగులయందుమహాసంతోషముచే జలక్రీడలనుసలుపుచున్న నప్సరస్త్రీలచేఁబ్రకాశించుచున్నదియును, మంగళకరమైనదియును, దేవతలు దానవులు గంధర్వులు కిన్నరులు మొదలగువారిచేతను, వారిభార్యలచేతను, విలాసార్థముగ సేవింపఁబడినదయ్యును నెప్పటికినిచెడని జలములుగలదియును, దేవతలుక్రీడింపదగిన ననేకపర్వతములును, దేవతలువిహరింప

దగిన ననేకఉద్యానములును, ప్రశస్తములగు భూములును గలదియును, దేవతలకొఱకునాకాశమునందు సంచరించుచున్నదియును, సర్వలోకప్రసిద్ధమయినదియును, దేవపూజార్థముగఁ బద్మములనిచ్చుచుండునదియును, నొకానొకస్థలమునందుఁ బెద్దపెద్దఱాళ్లపైఁ బ్రవాహంబుబడుటచేతఁ గలిగెడిశబ్దములేగొప్పనవ్వుగాను, ఆయుదకపునురుగులే చిఱునవ్వులుగాను, మఱొకస్థలమునుండి పల్లమునకుఁబోవు ప్రవాహమేతలజడగాను, గలదైఉత్తమస్త్రీవలెఁ గనఁబడుచున్నదియును, మఱియునొకచోనుందరములగు సుడులుగలిగియుండునదియును నిశ్చలముగనుండుటచేత గాంభీర్యముగలదానివలె నున్నదియును, మఱియొకచోట నధికమగు వేగముచేతఁ బ్రవహించుచున్నదియును, నొకానొకచోట గంభీరమైనధ్వనిగలదియు, నొకచోట మహాభయంకరమైన శబ్దముగలదియును, ఉదకమునందు స్నానముజేయుచున్న దేవతలతోఁగూడినదియును, నిర్మలములగుకలువపువ్వులచే బ్రకాశించుచున్నదియును, నొకొకచోటఁ బెద్దపెద్దయిసుకతిన్నెలుగలదియును, మఱియొకచోటనిర్మలమైన యిసుకగలదియును, నడుమనడుమమనోహరముగాఁ గూయుచుదిరుగుచుండెడు హంససారసచక్రవాకములచేతను, మఱియునితరములగు పక్షులచేతను బ్రకాశించుచున్నదియును, తనతీరములయందువరుసగాఁ జెట్లుమొలిచియుండుటచేతఁ బుష్పహారములను వేసికొనినదానివలెఁ గనఁబడుచున్నదియును, మఱియొకచోటవికసించిన కలువపువ్వులచేత వ్యాప్తమైనదియును, నింకొకచోటఁ గమలములతోనిండినదియును, మఱియొకచోటఁ దెల్లనికలువలుగలదియును, మఱియొసగముపుష్పించి మొగ్గలుగానుండు నితరపుష్పములును విశేషముగాఁగలదియును, నొకచోఁబుష్పములయందలి పరాగములచేత నెఱ్ఱగానుండుటవలన మదముతోఁగూడియుండునట్లు కనఁబడుచున్నదియును, గొంచెమైనను మాలిన్యములేకుండుటవలన వైడూర్యమణివలె తెల్లగాస్వచ్ఛమైన యుదకముగలదియును, మఱియుదిగ్గజములును, మదించినయడవియేనుఁగులును, దేవతలెక్కునట్టి మత్తగజములును, ఘీంకారముజేయఁగా నాధ్వనిచేనిండిన తీరభూములయందలి యుద్యానవనములుగలదియును, పండ్లను, పువ్వులను, చిగురులను, పొదలను, పక్షులను, గప్పఁబడియుండుటవలన నలంకరించుకొనినస్త్రీవలెఁ జూడఁదగినదియును, నీటికోతులచేతను, మొసళ్లచేతను, నీటిపాములచేతను, వ్యాప్తమైనదియును, విష్ణుపాదమువలనఁ బుట్టినదియును, దివ్యమైనదియును, పాపరహితమైనదియును, పాపములనునశింపజేయునదియును, భగీరథమహారాజుయొక్క తపోబలముచేత పరమేశ్వరుని జటాజూటమునుండి భూలోకమునకువచ్చినదియును, సముద్రునకు భార్యయైనదియును, నగునాగంగానదిని మహాబాహుఁడగు రాముఁడుశృంగిబేరపుర సమీపమునందుఁజూచె. అట్లు మహారథుఁడగు రాముఁడలలతోడను, సుడులతోడను బ్రకాశించుచున్న యాగంగానదినిజూచి సారథియగు సుమంత్రునితో నిట్లనియె.

ఓసారథీ! మనమిప్పుడిచటనే నివసించియుందము. ఈగంగానదికి సమీపమునందుఁ బుష్పములును, చిగురుటాకులును గలయింగుదీవృక్షము. (అనగాఁ గారచెట్టు) గలదు. ఇదిమిగులవిశాలముగను, రమణీయముగను నున్నది. కావుననేటికి మనమిచ్చోటనేయుందము. ఇందుండినదులలో శ్రేష్ఠమైనదియును, గౌరవింపఁదగిన యుదకములు గలదియును, మంగళకరమైనదియును, దేవదానవ గంధర్వమానవులచేతను, పక్షులచేతను, బూజింపఁదగినదియును నగునీగంగానదిని జూతమనిచెప్పె. అనియిట్లురాముఁడు చెప్పినవచనమునువిని సీతాలక్ష్మణసుమంత్రు లంగీకరించిరి. పిమ్మటసుమంత్రుఁడు రథమును నాగారెచెట్టుదగ్గరకుఁ బోనిచ్చెను. అంతఇక్ష్వాకువంశమునందుఁ బుట్టినవారలను సంతోషింపఁజేయునట్టి రాముఁడుమిగుల సుందరమైయాయింగుదీవృక్షము దగ్గరకుఁబోయి సీతాలక్ష్మణులతోఁ గూడ రథమునుండిదిగె. అంతటసుమంత్రుఁడును రథమునుండిదిగి శ్రేష్ఠములగు గుఱ్ఱములనువదలి చెట్టుక్రిందఁ గూర్చున్న రామునియొద్దకుఁ జేతులనుముకుళించుకొనివచ్చి యనేకవిధములగు నుపచారములుజేయుచుండె. ఆసమయమునందుకూడ రామునకుఁ బ్రాణస్నేహితుఁడును, బోయకులమునందుఁ బుట్టినవాఁడును, మహాబలవంతుఁడును నిషాదులకధిపతియును, గుహుఁడనుపేరుగలవాఁడును నగుకిరాతరాజొకఁడుండెను. అట్టిగుహుఁడు పురుషోత్తముఁడగు రాముఁడుతనదేశమునకువచ్చిన సమాచారమునువిని కులవృద్ధులను, మంత్రులను, మఱియునితరులగువారలను వెంటరాఁగా రామునిసమీపమునకువచ్చె. ఆట్లువచ్చి కొంచెముదూరముగా వినయముతోనిలుచున్నయాగుహునకెదురుగా రామలక్ష్మణులుపోయిరి. అప్పుడు గుహుఁడు మిగులవ్యసనముగలవాఁడై రామునిఁగౌఁగలించుకొని యిట్లనియె

రామా! నీకయోధ్యాపట్టణ మెటువంటిదో నాపట్టణమును నీకటువంటిదియే. కావుననీవీపట్టణమునందుండుము. మఱియును నీకునేనుజేయదగిన పనులేవియోచెప్పు

ము. వానినన్నింటిని జేయుటకు సిద్ధముగనున్నాను. మహాబాహుఁడవైన యోరామా! నీయట్టిమహాత్ముఁడును, ప్రియుఁడునునగు నతిథి యెవ్వనికిఁగలుగును. నీవిక్కడకువచ్చుట నేనుపూర్వజన్మమునందు జేసినపుణ్యముయొక్క ఫలమేగాని మఱియొకటగాదని జెప్పె. అట్లు చెప్పియాగుహుఁడు, మిగులరుచిగలవియును, నానావిధములగు నన్నము మొదలైన పదార్థములను, మఱియునితరములగు పూజాద్రవ్యములను దెప్పించి రామునిజూచి యిట్లనియె.

మహాబాహుఁడవైన యోరామా! నీకుస్వాగతమగుఁగాక. ఈనారాజ్యము సర్వమును నీకుసమర్పించితిని. కావుననిఁకమీఁదట మేమందఱమును నీకుబంటులము. నీవుమాకందఱకును ప్రభుఁడవు. కావునమమ్ముఁబాలింపుము. రాజ్యమును నేలుము. ఇదిగో భక్ష్యభోజ్య లేహ్యములతోఁగూడ నన్నమును దెప్పించితిని. మిగులమెత్తనిశయ్యలును వచ్చియున్నవి. ఇంతియగాక గుఱ్ఱములకాహారద్రవ్యములనుగూడ దెప్పించితిననియె. ఇవ్విధముగ మహావినయముతోఁగూడి చెప్పుచున్నయాగుహునిమాటలకు సంతోషించి రాముఁడిట్లనియె.

మిత్రుఁడా! గుహుఁడా! నీప్రియమగుమాటలచేతనే మేము పూజింపఁబడితిమి. పరమానందమునఁగూడఁ బొందితిమి. నీవుమాయందలి స్నేహముచేతఁ బాదచారివైవచ్చుటచేతను, మాయందలిస్నేహమును జూపుటచేతను, పరమసంతోషము బొందితిమని చెప్పియాగుహునిఁ దనభుజముచేతఁగట్టిగా నాలింగనముసేసికొని పరమానందమున నిట్లనియె.

గుహుఁడా! అదృష్టవశముచేత బంధువులతోఁగూడ రోగరహితుఁడవైవచ్చిన నిన్నుఁజూచితిని. మిత్రుఁడా! గుహుఁడా! నీరాజ్యమునందు బాధలేమియును లేకయున్నదా? నీస్నేహితులందఱును క్షేమముగనున్నారా? నీధనమంతయును నాశమునుబొందకున్నదా? ఇంతియగాకనీధనము నానాటవృద్ధినిఁబొందుచున్నదా? నీవిప్పుడుప్రియముచేత నాకొఱకుసిద్ధముచేసి తెచ్చినపదార్థముల నన్నింటినిమరలనీకేయిచ్చితిని. నేనిప్పుడునీవుతెచ్చిన పదార్థములను పరిగ్రహింపను. నేనునారచీరలను జటలనుధరించి కందమూలఫలములనుభుజించుచు, ధర్మమునందెచ్చరికగలిగి వనములయందుదిరుగుచు తపస్సునుజేసికొనుచు నుండవలసినవాఁడను. ఇప్పుడునాగుఱ్ఱములకుఁ గావలసినమేతను, ధాన్యమునుమాత్రము గ్రహింతును. ఈపదార్థములచేతనే నేనుజక్కఁగాఁ బూజింపఁబడితిని. నీవునన్నుఁ బూజించినవాఁడవైతివి. ఈగుఱ్ఱములు దశరథమహారాజునకు మిగులఁబ్రియమైనవి. కావుననీగుఱ్ఱములు తృప్తిని బొందునట్లు సేయుదువేని నన్నుబూజించిన వాఁడవగుదువని రాముఁడుచెప్పె. అంతటనాగుహుఁడక్కడనేయుండి పరిచారకులనుబిలిచి యిట్లనియె.

పరిచారకులారా! యీగుఱ్ఱములకుఁజక్కఁగాఁ బాలు నీరును ద్రావింపుఁడు. లేతగడ్డిదెచ్చి వేయుఁడు. ఇంకను గావలసిన యుపచారములను జేయుఁడని యాజ్ఞచేసెను. పిమ్మటనారాముఁడు నారచీరయే యుత్తరీయముగాఁగలవాఁడై సాయంకాలీనసంధ్యనుపాసించి లక్ష్మణునిచేతఁ దేఁబడినయుదకమును నాహారముగాఁజేసికొనెను. (అనఁగానుదకపానమును జేసెననుట.) పిమ్మటనారాముఁడు కాళ్ళనుగడిగికొని భార్యతోఁగూడ భూమియందుశయనించె. అటుపిమ్మటలక్ష్మణుఁడు నారచెట్టుయొక్క మొదటియందుఁగూర్చుండె. అట్లుకూర్చుండి సీతారాములకేమియును నపాయమురాకుండఁ గావలినిగాచుచుండె. అంతటగుహుఁడు సుమంత్రునితోఁడను లక్ష్మణునితోడను సంభాషించుచు. దానునుధనుర్ధారియై యతిజాగ్రతగలిగి రామసంరక్షణార్థముగ మేలుకొనియుండె. పిమ్మటనివ్విధముగ శయనించినవాఁడును, మిగులబుద్ధిమంతుఁడును, సర్వోత్తమమైన కీర్తిగలవాఁడును, మిగులఁబూజ్యమైన స్వభావముగలవాఁడును, అదివఱకెప్పుడును దుఃఖమునను భవింపనివాఁడను, సుఖమునకుఁదగినవాఁడను, దశరథమహారాజునకుఁ బుత్రుఁడునునగు నారాముడు భూమిపైబరుండి యుండినందున సుఖముగనిద్రబట్టక నారాత్రి చిరకాలమునకు నతిక్రమించినదానివలెనుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేబదవసర్గ ముగిసెను.

లక్ష్మణుడు గుహునితో తమకష్టములను జెప్పుకొనిదుఃఖించుట.

అంతటగుహుఁడు, అన్నయైనరాముని సంరక్షించుటకొఱకు నిష్కపటముగా మేలుకొనియున్న లక్ష్మణునిఁజూచి మిగులవ్యసనముగలవాఁడై యిట్లనియె.

తండ్రీ! లక్ష్మణా! ఇదిగో యీశయ్యనీ నిమిత్తముగవేయఁబడినది. మిగులమృదువుగనున్నది. దీనియందుఁగొంచెము నీవు సుఖముగఁబరుండుము. నీవు రాజపుత్రుఁడవుగనుక చిరకాలముకష్టమును భవించుటకును, మేలుకొనియుండుటకును దగినవాఁడవుగావు. కావునదీనిపైఁబరుండి మార్గాయాసమును దీర్చికొనుము. మేమందఱమును దుఃఖమును బొందుటకుఁ దగినవారము. నీవుసుఖమునుబొందుటకుఁ

దగినవాఁడవు. రాముని రక్షించుటకొఱకు మేమందఱమును నీరాత్రియంతయును మేలుకొనియుండెదము. నాకీభూలోకమునందు రామునికంటెఁ బ్రియమైనది యేదియును లేదు. ఈవిషయమును నేను సత్యముగాఁ జెప్పెదను. ఇట్టియభిప్రాయము నాకు దృఢముగ లేకపోయెనేని నేనన్నతమువలనఁ గలిగెడు పాపమును బొందినవాఁడగుదును. లక్ష్మణా! నేనిరాముని యనుగ్రహమువలన గొప్పదగుకీర్తిని బొందుదును. మఱియుకధికమగుధర్మమును, ధనమును బొందుచున్నాను. కావుననో లక్ష్మణా! సీతతోఁగూడ శయనించినవాఁడును, ప్రియస్నేహితుఁడును, నగురాముని నేను ధనుష్పాణినై నావారలతోఁగూడుకొని కావలినిగాయుచుందును. నేను రామసంరక్షణయందుఁ జాగ్రతగలవాడనై యుందును. కావున నీవు నిర్భయముగ నిదురనుబొందుము. నేను సర్వదిక్కులనుండియు నుపద్రవముగలుగకుండునట్లు రామునిఁగాపాడుచుందును. నేను సర్వకాలముయందును నీవనమునందే సంచరించువాఁడను. కావున నాకుఁదెలియక యిచ్చట నేశత్రుఁడును రాఁజాలఁడు. ఇంతయగాక మాకిక్కడనుండు రహస్యస్థానములన్నియును జక్కగాఁదెలిసియున్నవి. కావున మేము చతురంగబలమునుగూడ లక్ష్యము సేయువారము గామనియా గుహుఁడు లక్ష్మణునితోఁ జెప్పె. అట్లు గుహుఁడు చెప్పిన మాటలను విని లక్ష్మణుండిట్లనియె.

పరమధార్మికుఁడవగు నీచేత మేము గాపాడఁబడుచుంటిమేని మాకేమియును భయముగలుగదు. కిరాతరాజవల్లభా! గుహుఁడా! రాముఁడు సీతతోఁగూడ భూమియందుఁబరుండి నిదురనుబొందియున్నాఁడు. మిగులసుఖమును బొందుటకుఁదగిన రాముఁడు భూమియందుఁ బరుండియుండుటను జూచుచున్న నాకు నిద్రయెట్లువచ్చును? రాముఁడివ్విధముగ దుఃఖమును బొందియుండుటను జూచుచుండుటచేత నాకుఁబ్రాణమునందుఁగూడ నాశలేదు. కావుననిఁక నేనెట్లు సుఖముగా నిద్రను బొందుదును? దేవాసురులొక్కటై వచ్చినను యుద్ధమునందు వారలజయించునట్టి రాముఁడు సీతతోఁగూడ భూమియందుఁబరుండియున్నాఁడు. చూడుము. మహాపరాక్రమవంతుఁడగు రాముఁడిట్లు నేలపైఁబచ్చికమీఁదఁబరుండియుండఁగా నేనెట్లు నిద్రను బొందుదును. ఈరాముఁడు దశరథునకు సమానమైన లక్షణములుగలవాఁడు. ఇంతయగాక పరమప్రియుఁడు. మఱియు నానావిధములగు తపోదానాదులచేతఁ బొందఁబడినవాఁడు. ఇటువంటి రాముఁడివ్విధముగ నరణ్యమునకువచ్చుటచేత దశరథుఁడిఁకమీఁద జీవింపఁడనితోఁచుచున్నది. ఇఁకమీఁద శీఘ్రముగా భూమియంతయును నాథుడులేనందున విధవకాఁగలదు. ఇట్లగుటకేమియును సందేహములేదు. పట్టణమునందలి స్త్రీలందఱును, రాముఁడా! యని పెద్దధ్వనిగలుగునట్లు అఱచియఱచి శ్రమచేత నేమియుఁదోఁచకనూరకుందురు. మఱియు మరణమును బొందుదురు. కాఁబట్టియిఁకమీఁద రాజభవనమంతయును నిశ్శబ్దమైనది కాఁగలదు. ఈరాత్రియందే, దశరథమహారాజు కౌసల్యాసుమిత్రలతోఁగూడ మరణమును బొందునని నిశ్చయముగాఁదోఁచుచున్నది. నాతల్లియగు సుమిత్రాదేవి తనకు మఱియొకపుత్రుఁడగు శత్రుఘ్నుఁడున్నాఁడు గావున నొకవేళ జీవించినను జీవించును. సుమిత్రాదేవి విషయమునందు నాకేమియును దుఃఖములేదు. రామునివంటి మహానుభావుని బుత్రునిగాఁగనిన కౌసల్య మరణమును బొందునేయని నాకుమిగుల దుఃఖము గలుగుచున్నది. ప్రేమానురాగముగల జనులచే నిండియుండు, జనులకందఱకు సంతోషమును గలుగఁజేయునట్టి యయోధ్యాపట్టణము రాజువ్యసనమును బొందినదై యిఁకమీఁద నశించిపోఁగలదు. (అనఁగా నయోధ్యాపట్టణములోని జనులందఱును దశరథమహారాజు మరణమును బొందుటవలనఁ గలిగిన దుఃఖముచేతఁ జచ్చిపోదురనుట.) మహానుభావుఁడును, ప్రియుఁడును, జ్యేష్ఠపుత్రుఁడును నగు రామునిఁ జూడక మహాత్ముఁడును, వృద్ధుఁడును నగు దశరథుఁడెట్లు ప్రాణములను పెట్టికొనియుండును. ప్రాణధారణను జేయలేక మరణమును బొందును. అట్లు దశరథమహారాజు మరణమును బొందినపిమ్మటఁ గౌసల్యగూడ మరణమును బొందును. కౌసల్య మరణమును బొందినపిమ్మట నాతల్లియగు సుమిత్రగూడ మృతినొందును. అదియంతయును నటుండనిమ్ము. జరిగిపోయినది జరిగిపోయినదే? జరిగినవానినిఁదలఁచుటవలనఁ బ్రయోజనములేదు. అయ్యో! నాతండ్రియగు దశరథమహారాజు రామునకుఁ బట్టాభిషేకమును జేయవలయునని యెడు కోరికను దీర్చుకొనకయే నాశమును బొందునేయని నాకుమిగుల దుఃఖము గలుగుచున్నది. “శ్లో॥ సిద్ధార్థాః పితరం వృత్తంతస్మిన్కాలేహ్యుపస్థితే। ప్రేతకార్యేషు సర్వేషుసంస్కరిష్యంతి భూమిపమ్,, తల్లిదండ్రులకు మరణకాలమువచ్చినపుడు ధన్యులగుపుత్రులు సమీపమునందుండి ప్రేతకర్మలనన్నింటిని సంపూర్ణముగఁజేయుదురు. మేము దురదృష్టముగల వారమగుటవలన మాతండ్రియొక్క మరణకాలమునందు మేము దగ్గరనుండి ప్రేతకార్యములను జేయుటకు సంభవింపనేరదు. మనోహరములగు ముంగిళులయొక్క ప్రదేశములుగలదియును, చక్కగావిభజింపఁబడిన రాజవీధులుగలదియును, మేడలును, మిద్దెలునుగలదియును, వేశ్యాస్త్రీరత్నములచేతఁ బ్రకాశించు

చున్నదియును, రథములు, గుఱ్ఱములు, గజములు మొదలగువానిచేత వ్యాప్తమగుటచేతనిఱుకైన మార్గములుగలదియును, మంగళవాద్యములయొక్క ధ్వనులచేతధ్వనింపఁజేయఁబడినదియును, సర్వమంగళములచేతను నిండియున్నదియును. హృష్టులును, పుష్టులును, నగుజనులచేత వ్యాప్తమైయున్నదియును, ఆరామములచేతను, నుద్యానవనములచేతను రమ్యముగఁబ్రకాశించుచున్నదియును, సకలకాలములయందును జనసమూహమువలన జేయఁబడునుత్సవములచే బ్రకాశించుచున్నదియును, మాతండ్రియగు దశరథమహారాజునకు రాజధానియునునగు నయోధ్యాపట్టణమునందు సుఖవంతులగు వారు సంచరించుదురు. మాయదృష్టమువలన దశరథమహారాజు జీవించియుండెనేని మేము వనవాసముచేసి వచ్చినపిమ్మట మహానుభావుఁడును, సత్యవ్రతుఁడునునగు మాతండ్రినిజూడఁగలము. ఇట్టిభాగ్యము మాకుగలదా? యేమి? రాముఁడు వనవాసమును జేసినపిమ్మట సత్యప్రతిజ్ఞుఁడగు మాతండ్రి క్షేమవంతుఁడైయుండెనేని యతనితోఁగూడ మేమయోధ్యాపట్టణమును బ్రవేశింతుమనియె. ఇట్లు మహానుభావుఁడును, దుఃఖముచేతఁ బీడింపఁబడినవాఁడును పలువిధములవ్యసనమును బొందుచున్నవాఁడును, నగులక్ష్మణుఁడు డివ్విధముగ జెప్పి నిలుచుకొనియుండగానె. యారాత్రికడచిపోయె. ఇవ్విధముగ లోకప్రియుఁడగు లక్ష్మణుడు చెప్పిన సత్యవచనములనువిని గుహుఁడు ఉత్తమస్నేహముఁగలవాఁడు గావున మిగులదుఃఖమును, మనోవ్యథనుబొందె. ఇంతయగాక జ్వరముగల యేనుఁగువలెఁగన్నీళ్లను ధారధారగవదిలి రోదనము జేసె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేబదొకట వసర్గముగిసెను.

సీతారామలక్ష్మణులు నోడమీద నెక్కి గంగానదిని దాటుట.

అంతటఁగొంత సేపటికిఁ దెల్లవారె. అట్లు తెల్లవారినపిమ్మట విశాలమగువక్షస్థలముగలవాఁడును, మహాకీర్తిగలవాఁడును నగురాముఁడు శుభలక్షణములుగల లక్ష్మణునితోనిట్లనియె.

నాయనా! లక్ష్మణా! సూర్యోదయకాలమైనది. రాత్రియంతయును గడచిపోయినది ఇదిగో మిగుల నల్లనికోకిలకూయుచున్నవి. అరణ్యమునందుఁ గేకలను వేయుచున్న నెమళ్లయొక్క ధ్వనులు వినఁబడుచున్నవి. కావుననిఁకమీఁద సముద్రగామియును, శీఘ్రగామియును, నగుగంగానదిని దాటుదమని లక్ష్మణునితోఁజెప్పె. మిత్రులకుసంతోషమును జేయునట్టి లక్ష్మణుడు రాముని మాటను విని యోడలేనిదిగంగానదిని దాటుట దుర్లభమని తలఁచి యాయభిప్రాయమును గుహునితోడను, సుమంత్రునితోడను జెప్పెను. అట్లు చెప్పి తాను రామునొద్ద నిలిచియుండె. అట్లు రాముఁడు చెప్పిన మాటలనువిని యాగుహుఁడు శీఘ్రముగాఁదనమంత్రులనుబిలిచి వారలతోనిట్లనియె.

ఓభటులారా! యీరాముని మహాసులభముగా దాటించునదియును, మిగులమనోహరమైనదియును, దృఢమైనదియునునగు నెుక్కయోడను దీసికొనిరండు. ఆయోడను తెడ్డు మొదలగు దానితోడను, కర్ణధారునితోడను జతపఱచిరప్పింపుఁడని గుహుఁడు చెప్పె. అట్లు గుహుఁడు సెప్పిన మాటలనువిని యాభటులు మనోహరమైన యోడను రేవులోనికిఁ దెచ్చి గుహునకు సమర్పించిరి. అంత నాగుహుఁడు రామునిఁజూచి చేతులను ముకుళించుకొని మహావినయముగలవాఁడైయిట్లనియె.

రామచంద్రా! ఓడవచ్చి సిద్ధముగనున్నది. ఇఁక నిప్పుడు నేను జేయఁదగినకార్యము యేదైనయున్నయెడల నాజ్ఞాపింపుఁడు. పురుషోత్తముఁడవును, దేవపుత్రునితోసమానుఁడవును సత్యవ్రతుఁడవును, నైనయోరామా! సముద్రగామినియగు నీగంగానదిని దాటుటకు సిద్ధముగనున్న యీయోడను నెక్కుము. అనియిట్లు గుహుండు చెప్పిన నారాముఁడు గుహునితోనిట్లనియె.

స్నేహితుఁడా! నీమూలకముగ నాకోరికలన్నియు నుదీరినవి. కావుననిఁక శీఘ్రముగ నీయోడను నెక్కెదము. కాఁబట్టి మమ్ములనోడలోనికిఁ జేర్పుమనియె. అట్లు చెప్పినపిమ్మట నారామలక్ష్మణులిరువురును, కవచములనుధరించి యమ్ములపొదులను, ఖడ్గములను, వహించి దనుర్ధారులై గంగానదిని దాటుటకు బయలువెడలనడచుచుండిరి. అప్పుడు సీతాదేవికూడ నారామలక్ష్మణుల వెంబడించిపోవుచుండె. ఆసమయమునందు సూతుఁడు, ధర్మజ్ఞుఁడగు రాముని సమీపమునకు మహావినయముగలవాఁడై వచ్చి దోసిలియొగ్గి యోరామా! నేనిప్పుడు చేయఁదగిన పనియేమి యనియె ఆవచనమునువిని దశరథనందనుఁడగు రాముఁడు తనకుడిచేతి నాసుమంత్రునిఁదాకుచు నిట్లనియె.

సుమంత్రుఁడా! నీవు శీఘ్రముగా మఱల నయోధ్యాపట్టణమునకుఁబొమ్ము. పోయి దశరథమహారాజునొద్దనే మఱల జాగ్రతగానుండుము. నీవింతదూరము నన్ను రథమునెక్కించుకొని దీసికొనివచ్చితివిగదా? ఇక్కడవిడిచిపెట్టితివిగదా? ఇఁక నీవు దశరథునొద్దకుఁబొమ్ము. ఇఁకమీఁద నేను

రథమునువిడిచి పాదచారినై యరణ్యమునకుఁ బోయెదనని చెప్పె. అట్లు రాముఁడు చెప్పి యనుజ్ఞనిచ్చినపిమ్మట సుమంత్రుఁడు రామునిఁజూచి రామునివదలిపోవలసివచ్చనే యనియధికమైనవ్యసనముగలవాఁడై పురుషోత్తముఁడును, నిక్ష్వాకువంశవర్ధనుఁడునునగు రామునితో నిట్లనియె.

రామచంద్రా! నీవునీచజనునివలెభార్యతోడను, తమ్మునితోడను నరణ్యమునందుఁదిరుగవలసివచ్చె. ఇట్టికష్టమును ద్రిప్పివేయుట కీలోకమునందేపురుషుఁడును సమర్థుఁడుగాకయున్నాఁడుగదా! ఆహా, దైవయోగము నేమనవచ్చును. మహాశ్రద్ధతో బ్రహ్మచర్యవ్రతమును సల్పి వేదాధ్యయనమునుజేసి దయయునునార్జవమునుగలిగియున్న నీకుయిట్టికష్టమురాగానీలోకమునందింకెవ్వనికిఁ గష్టముగలుగదు! కాఁబట్టి' శ్లో॥ నమన్యే బ్రహ్మచర్యేస్తి స్వధీతేవాఫలోదయః। మార్దవార్జవయోర్వాపిత్వాంచేద్వ్యసనమాగతం,, బ్రహ్మచర్యవ్రతమువలనను, నియమపూర్వకముగ వేదాధ్యయనమును జేయుటవలనను, మృదుస్వభావము గలిగియుండుటవలనను, నిష్కపటముగ నుండుటవలనను, ప్రయోజనములేదనియెంచెదను. అట్లుగాదేని నీయట్టి మహానుభావునకిట్టికష్టములుగలుగునా! కలుగవు. కావుననే బ్రహ్మచర్యాదులవలనఁ బ్రయోజనము లేదని తోఁచుచున్నదని చెప్పి మఱియునిట్లనియె.

పరాక్రమవంతుఁడవైన యోరామా! నీవుభార్యయగుసీతతోడను, తమ్మునితోడనుగూడినవాఁడవై యడవియందునివసింపుచు మూఁడులోకములను జయించిమంచిగతినిఁ బొందఁగలవు. మేమునీచేతనుగూడవంచింపఁబడినవారమై పాపస్వరూపురాలగు కైకేయియొక్క స్వాధీనమునుబొందఁగలము. అయ్యో మేమందఱమును గైకేయిచేతహతమైతిమని రామునితోఁ జెప్పెను. ఇట్లు సారథియగు నాసుమంత్రుఁడు చెప్పి ప్రాణసమానుఁడగు రాముఁడిఁకమీఁద బహుదూరముపోవునే యనితలఁచి యధికమైన దుఃఖముగలవాఁడై చాలాసేపురోదనమును జేసె. అట్లుకొంతసేపురోదనమును జేసి కన్నీరుగారుటవలన నాచమనమును జేసి పరిశుద్ధుఁడైయున్న సుమంత్రునిఁజూచి రాముఁడుమాటిమాటికినిమిక్కిలిమధురముగానుండునట్టిమాటలతో నిట్లనియె.

సుమంత్రుఁడా! సారథీ! ఇక్ష్వాకువంశమునందుఁ బుట్టినవారలకు నీతోసమానుఁడైన స్నేహితుఁడు వేఱొకఁడు దొరకఁడు. కాబట్టి దశరథమహారాజు మమ్ములఁదలఁచి వ్యసనమునుబొందకుండునట్లు చేయుము. మాతండ్రియగు దశరథమహారాజు శోకోపహతచిత్తముగలవాఁడును, వృద్ధుఁడును, అతికాముకుఁడును,నై యున్నాఁడు. కావుననే నేనివ్విధముగఁ జెప్పుచున్నాఁను. మహానుభావుఁడును, చక్రవర్తియును, నగుదశరథమహారాజు కైకేయికిఁబ్రియమును జేయుటకొఱకు నేకార్యమును జేయుమని యాజ్ఞాపించునో యాకార్యముల నన్నిఁటిని జేయుము. అట్టిపనులను జేయుటయందుకొంచెమైనను సందేహమునుబొందకుము. లోకములోఁగావలసినకార్యములనన్నిటిని నెరవేర్చుకొని తృప్తులైయుండుటకొఱకేకదా! రాజులు రాజ్యములను బరిపాలించుదురు. కావున రాజును, మాతండ్రియునునగు దశరథమహారాజుయొక్క కోరికలకు విఘ్నమును జేయకుము. సుమంత్రుఁడా! మాతండ్రియగు దశరథమహారాజు దుఃఖమును బొందకుండునట్లును, దుఃఖముచేతఁ బరితాపము నొందకుండునట్లును నీవుసంచరింపుము. ఇదివఱకెన్నఁడును దుఃఖమును బొందనివాఁడును, ప్రభువును, వృద్ధుఁడును, పూజ్యుఁడును, జితేంద్రియుఁడునునగు మాతండ్రితో నమస్కారముజేసి నేనుజెప్పితిననియీమాటను జెప్పుము. సీతాలక్ష్మణులును నేనును, అయోధ్యాపట్టణమును వదలివచ్చినందువలనవ్యసనమునుబొందడములేదనియును, వనములయందు సుఖముగనున్నామనియును జెప్పుము. పదునాలుగుసంవత్సరములును గడచిపోయినపిమ్మట సీతాలక్ష్మణులతోఁగూడ మరలివచ్చిననన్ను శీఘ్రముగాఁజూచియానందమునుబొందఁగలవని చెప్పుము. మఱియు నోసుమంత్రుఁడా! ఈవిధముగా మాతల్లిదండ్రులకును నితరులగుతల్లులకును జెప్పుము. ఇంతయగాక మాసవతితల్లియగు కైకేయితో మేమరణ్యములందుసుఖముగా నున్నామనియును, శీఘ్రముగాఁబదునాలుగుసంవత్సరములనుగడపివచ్చి దర్శనమును జేయఁగలమని చెప్పుము. సుమంత్రుఁడా! మాతల్లియగు కౌసల్యతో మాశుభవార్తను జెప్పుము. మఱియును సీతాలక్ష్మణులును నేనును నామెపాదములకు నమస్కారమును జేసితిమని చెప్పుము. ఈవచనములను సీతాలక్ష్మణులు గూడఁజెప్పిరని చెప్పుము. ఈమాటనుదశరథునితోఁగూడఁజెప్పి భరతుని దోడ్కొనిరమ్మని చెప్పుము. అట్లు భరతునిరప్పించి రాజోచితస్థానమగు సింహాసనమునందు నిలువుమని చెప్పుము. భరతుని యువరాజపట్టాభిషిక్తునిగాఁ జేసి యతనినాలింగనమును జేసికొని మేమరణ్యమునకువచ్చుటవలనఁ గలిగినదుఃఖమును బోఁగొట్టుకొమ్మని చెప్పుము. మఱియును, దశరథమహారాజునందెట్లువర్తింతువో యావిధముగానే తల్లులందఱియందును భేదములేకవర్తింపుమని భరతునితో నేనుచెప్పినట్లు జెప్పుము. సీతల్లియగు కైకేయికంటె సుమిత్రనధికముగాఁ జూచుకొమ్మనుము. సుమిత్రనుజూచినవిధముగా నేనాతల్లియగు కౌసల్యనఁజూచునుము. తండ్రికిసంతోషము గలుగుటకొఱకు

నీవు యావద్రాజ్యమును బొందెదవు. కావునఁ దండ్రికిని యిహపరలోకములయందు శాంతియు ననుసుఖమును గల్పింపఁగలవని భరతునకుఁ జెప్పుము. ఇట్లు చెప్పి నీవయోధ్యాపట్టణమునకుఁ బొమ్మనియెను. అప్పుడు సుమంత్రుఁడు దుఃఖాక్రాంతుఁడై రామునివచనముల నన్నింటినివిని స్నేహమువలన రామునితో మరలనిట్లనియె.

రఘుకులోత్తమా! రామా! నేను స్నేహముచేత నుపచారహీనముగఁ జెప్పినదైనను భక్తుఁడు చెప్పుచున్నాఁడని క్షమింపవలయును. రామా! నిన్ను నిక్కడ వదలి, నీవు లేకుండుటచేతఁ ''పుత్రవియోగముచే నేడ్చుచున్న దానివలెనున్న'' యయోధ్యాపట్టణమునకు నొంటిగా నేనెట్లు పోదును. అప్పు డయోధ్యాపట్టణములోని వారందఱును రాము నెక్కించుకొని వచ్చుచున్న నారథమును జూచిరి. ఇప్పుడు రామహీనమగు నారథమును జూచిరేని వారలహృదయము పటపటమని పగలదా? శూన్యమైన నారథమును జూచి యయోధ్యాపట్టణమంతయును దైన్యమును బొందును. మఱియు నెల్లవారును, "సేనానాయకుఁడు చంపఁబడుటచేతఁ జావుపడియున్న సైన్యమును బోలియున్న,, సారథిమాత్రముగల యారథమును జూచి మిగులవ్యసనమును జెందుదురు. ఇప్పు డయోధ్యాపట్టణమునందలి జనులందఱును దూరదేశమునందున్నవాఁడవైనప్పటికిని నిన్ను మనస్సుచేత తమయెదుటనున్నవానినిగా ధ్యానము జేయుచు నిశ్చయముఁగ నిరాహారులగుదురు. రామా! నీవు యరణ్యమునకు వచ్చుటకు బయలువెడలినప్పుడు నీవు ప్రయాణమై పోవుచున్నావను దుఃఖముచేత జనులకుఁ గలిగిన పరితాపమును సర్వమును నీవే చూచియున్నావుగదా? నీవరణ్యమునకు బయలుదేరివచ్చినపుడు పట్టణములోనివారెంత వ్యసనమును జెందినారో యిప్పుడు వారందఱును నీవు లేనిరథమును దోలుకొనిపోవుచున్న నన్నుఁ జూచి నూరింతలధికముగా నేడ్తురు. నేను మా తల్లితో నేమని చెప్పుదును. అమ్మా నీకుమారుని మేనమామయింటియందు విడిచివచ్చినాను. నీవు వ్యసనమును బొందకుమని చెప్పుదునా? నేనిటువంటి యసత్యమును జెప్పఁజాలనే? అయ్యో, మిగుల వ్యసనకరమైనమాటను నేనెట్లు చెప్పుదును. నీపుత్రుని నడవిలో విడిచిపెట్టి వచ్చినానమ్మా యని నేనెట్లు చెప్పుదును. అనఁగా నీకొడుకును మేనమామయింటియందు వదిలివచ్చినానని యబద్ధమును జెప్పుటకును లేదు. నీకొడుకును నడవులలో విడిచిపెట్టివచ్చినానని కఠినమైన సత్యమైనమాటను జెప్పుటకును లేదు. ఇఁక నేనేమి చేయుదును. సీతాదేవిని, లక్ష్మణుని నిన్నును వహించుచు నా చేదోలఁబడు నీయుత్తమాశ్వంబు లిప్పుడు మీరు లేనిరథము నెట్లు లాగికొనిపోవును. కాఁబట్టి నిష్కల్మషుఁడా! రామా! నీవులేక నేనొంటిగా నయోధ్యాపట్టణమునకుఁ బోఁజాలను. నేనుగూడ వనవాసమును జేయుదును. నేనును నీతోఁగూడ నుండుటకు నుజ్ఞ నిమ్ము. ఇట్లు యాచించుచున్న నన్ను వదలితివేని నీవు వదలినతోడనే నేనీరథముతోఁగూడ నగ్నిజ్వాలాంతరమునందుఁ బ్రవేశించెదను.

రామా! నేనిక్కడ నేయుండుట కంగీకారమును బొందుము. అట్లయిన నేనిక్కడనుండి నీకపకారము సేయునట్టి వనములయందు సంచరించుచుండు క్రూరములైన మృగములను నీరథము నెక్కి సంహరించుచుందును. నీదయచేత నేను నీకు రథమును దోలి దానిచేఁ గలుగుసుఖము ననుభవించితిని. ఇఁక మీఁద నీదయవలన నీతోఁగూడ యరణ్యవాసమును జేయుచు నీకు శుశ్రూషను జేయుచుండుటవలనఁ గలిగిన సుఖమును గూడ ననుభవింపఁ గోరుచున్నాను. నేనీయడవులయందు నీతోఁగూడ నుండవలయునని కోరుచున్నాను. కాఁబట్టి నీవు నావద్ద నేయుండుమని చెప్పినయెడల విని యానందింపఁ గోరుచున్నాను. కావున నో రామా! నా మనోరథమును దీర్పుము. పరాక్రమవంతుఁడవైన రామచంద్రా! ఈగుఱ్ఱములును నరణ్యములో నుండునట్టి నీకుఁ బరిచర్యను జేయుచుండు నేని యుత్తమలోకమును బొందఁగలవు. నేను వనమునందు నివసించి నీపాదపద్మములకు వంగి సేవను జేసెదను. నీవు లేనిది నేనయోధ్యాపట్టణమునందే గాదు దేవలోకమునందుఁ గూడ నుండఁజాలను. ''పాపాత్ముఁడు స్వర్గపట్టణమునకుఁ బోలేనియట్లు,, నీవు లేనిది నేనయోధ్యాపట్టణములోనికిఁ బోజాలను. మనము పదునాలుగుసంవత్సరములును నరణ్యమునందుండిన పిమ్మట మరల నిన్నీరథముమీఁద నెక్కించుకొని యయోధ్యాపట్టణమునకుఁ బరమానందముతోఁ బోవలయునని కోరుచున్నాను. నేను నీతోఁగూడ నిక్కడ నేయుంటినేని పదునాలుగుసంవత్సరములును క్షణమాత్రములోఁ గడచిపోవును. అట్లుగాక నేను నిన్ను వదలి యయోధ్యయందే యుంటినేని యీపదునాలుగుసంవత్సరములును కోటిసంవత్సరములుగా నుండును. భృత్యులయందు మిగుల బ్రియముగలయో రామా! భక్తిగలవాఁడను, భృత్యుఁడను, మర్యాదనవలంబించియున్నవాఁడను, రాజపుత్రుఁడవగు నీయాజ్ఞ ననుసరించి ప్రవర్తించువాఁడనునైన నన్ను నీవు విడిచిపెట్టఁగూడదు. కావున నామనవి నంగీకరింపుమని చెప్పె. భృత్యులయందు మిగుల దయగలవాఁడగు రాముఁ డివ్విధముగ దీనుఁడై యాచించుచున్న సుమంత్రునితో నిట్లనియె.

ప్రభువునందధికమైన విశ్వాసముగలవాఁడా! సుమంత్రుఁడా! నీకు నాయందధికమగు భక్తి గలదని నేనెఱుగుదును. నేను నిన్నుఁ బట్టణమున కెందునిమిత్తముగాఁ బంపుచున్నానో

డానిని చెప్పెదవినుము. నీవు మరల నయోధ్యాపట్టణమునకుఁ బోనియెడల మాతల్లియగు కైకేయికి సందేహముగలిగియుండును. కావున నీవు నేను లేని రథమును దోలుకొనిపోతివేని యామె రాముఁడడవికిఁ బోయినాఁడనియును నిఁక రాఁడనియును నమ్మకముగలదియగును. అట్లు నమ్మకము గలదయ్యెనేని దశరథుఁడబద్ధువరములనివ్వలేదని నిశ్చయము గలదగును. పిమ్మట మాతండ్రి సత్యవంతుఁడని నమ్మును. నీవు నన్ను వదలక యిక్కడ నేయుంటివేని నా పినతల్లియైన కైకేయి తనపుత్రునకు దొరతనము రాలేదనియే తలఁచుచుండును. నీవు నన్ను వదలి యయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించుటను జూచెనేని భరతునిచేతఁ జక్కఁగా రక్షింపఁబడినదియును, వృద్ధిపొందినదియునునగు, తనపుత్రునియొక్క రాజ్యమును జూచి యానందమును బొందును. ఇట్టి యానందమును నాపిన్నతల్లియగు కైకేయికి గలిగించుటయే నాకు ముఖ్యమైన పని కాఁబట్టి నిన్నుఁ బొమ్మని చెప్పుచున్నాను. కావున నాకును, దశరథునకును బ్రియమును గలిగించుటకొఱకు నీవిప్పుడే యయోధ్యాపట్టణమునకుఁ బొమ్ము. నీతో నేనే యేమాటలను జెప్పితినో ఆమాటలనన్నింటిని కొంచెమైనను మరవక వారివారితోఁ జెప్పుమని చెప్పెను. ఇట్లు రాముడు సూతునితోఁ జెప్పి మఱియు ననేకవిధముల నా సుమంత్రుని నోదార్చె. పిమ్మట ధైర్యశాలియగు రాముఁడు గుహునింజూచి హేతుగర్భవిశేషణములుగల మాటలతో నిట్లనియె.

గుహుఁడా! నేనిప్పుడు జనులు నివసింపుచుండు చోటనుండుట యుచితము గాదు. ఆశ్రమమునందుండవలసిన దవశ్యకము గదా! మాతండ్రియొక్క యాజ్ఞయును ఆశ్రమమునందుండవలయుననియే గదా! కావున నేను దపోవంతుల కుచితమైన వ్రతమును నియమపూర్వకముగ ధరించితిని. మఱియును సీతాలక్ష్మణులకు మేలుగోరువాఁడనై జడలను ధరించిపోయెదను. కావున మఱ్ఱిపాలను దెప్పింపుమనియె. అంతనా గుహుఁడు, రాజపుత్రుఁడగు రామునికొఱకు మఱ్ఱిపాలను శీఘ్రముగఁ దీసికొనివచ్చె. అప్పుడు రాముఁడు ముందుగ నామఱ్ఱిపాలచేత లక్ష్మణుని జడలను ధరించుకొనునట్లు చేసి పిమ్మటఁ దానుగూడ జడలను ధరించె. ఇట్లు మహాబాహుఁడును, పురుషోత్తముఁడును నగు రాముఁడుగూడ జడలను ధరించె. అంతట నా రామలక్ష్మణులు నారచీరలను, జటల సమూహమును ధరించుటవలన, ఋషులతో సమానులుగ నుండిరి. అట్లు ఋషివేషములను ధరించిన యాయన్నదమ్ములిరువురును పూర్వముకంటెనధికముగఁ బ్రకాశించిరి. అంతట నా రాముఁడు లక్ష్మణునితోఁ గూడ వైఖానస వ్రతమగు వానప్రస్థవ్రతము నంగీకరించి స్నేహితుఁడగు గుహునిజూచి యిట్లనియెను.

గుహుఁడా! రాజ్యమును బాలించుటయధిక కష్టముగల కార్యము. కావున నీవు చతురంగబలమునందును, ధనాగారమునందును, దుర్గములయందును, రాజ్యమునందును, బహుజాగ్రతతో బ్రవర్తింపవలయునని చెప్పె. అంతట నిక్ష్వాకువంశోద్భవుఁడగు రాముఁడు గుహునితో నీవు పోయిరమ్మని చెప్పి కొంచెమైనను వ్యాకులత్వమును బొందనివాఁడై సీతాలక్ష్మణులతోఁ గూడుకొని శీఘ్రముగఁ బోయె. అట్లు ప్రయాణమై బయలువెడలిన రాముఁడు నదీతీరమునందున్న యోడను జూచి గంగానదిని శీఘ్రముగఁ దాటఁదలఁచి లక్ష్మణుని జూచి యిట్లనియె.

పురుషోత్తముఁడా! లక్ష్మణా! నీవు ముందుగ మెల్లగా నీ యోడ నెక్కుము. పిమ్మటఁ బూజ్యురాలగు నీ సీతను మెల్లగా నెక్కింపుమనియె. అంతట లక్ష్మణుఁడన్నయగు రామునియొక్క యాజ్ఞను శిరసావహించి మిగుల మతిమంతుఁడగుటవలన ముందుగా నా యోడలోపల సీతను నెక్కించి పిదపఁ దానెక్కుటయే రాముని యభిప్రాయమని తలఁచి రాముని మనస్సునకు విరోధము గలుగకుండునట్లుగా సీతాదేవిని నోడయందెక్కించె. అట్లు సేసి పిదపఁ దానా యోడ నెక్కె. అటుపిదపఁ దేజోవంతుఁడును, లక్ష్మణుని కగ్రజుఁడును నగు రాముఁడును నా యోడ నెక్కె. అట్లు ఆముగ్గురును వోడ నెక్కిన పిమ్మట బోయవాండ్రకధిపతియగు గుహుఁడు ఓడను నడుపుఁడని తనబంధువులకాజ్ఞాపించె. మహాతేజోవంతుఁడగు రాముఁడు ఓడనెక్కిన పిమ్మట బ్రాహ్మణులచేతను, క్షత్రియులచేతను, జపింపఁదగిన "దైవీంనావం,, అను నావారోహణమంత్రమును తనకు మేలుగలుగుటకొఱకు జపము జేసెను. మఱియు నా రాముఁడు సీతతోఁగూడ నాచమనమును జేసి దేహమంతయును గగుర్పాటు నొందగా శాస్త్రోక్తప్రకారముగ నా గంగానదికి నమస్కారమును జేసె. అప్పుడపరిమితకాంతిగల లక్ష్మణుఁడుగూడ గంగానదికి నమస్కారమును జేసె. అంతట నా రాముఁడు చతురంగబలముతోఁ గూడియున్న గుహునిఁ బోయిరమ్మని చెప్పి యోడలోఁ గూర్చుండి యోడను నడుపుఁడని నావికులకాజ్ఞాపించె. అంతట నావికులందఱును మిగుల జాగరూకతతో సుందరములగు తెడ్లచే శీఘ్రముగ నోడను గడపిరి. అంతట నా యోడ శీఘ్రముగానే యవతలిగట్టునకుఁ బోయెను. అట్లు పోవునప్పుడు గంగానదీమధ్యమునకుఁ బోయినతోడనే యనిందితురాలగు సీతాదేవి చేతులను ముకుళించుకొని గంగానదినిగూర్చి యిట్లనియె.

శ్లో॥ పుత్రో దశరథస్యాయం మహారాజస్య ధీమతః। ని

దేశంప్రాప్య త్వేమం గంగే త్వదభిరక్షితః॥ చతుర్దశహి వర్షాణి సమగ్రాణ్యుష్య కాననే । భ్రాత్రా సహ మయా చైవ పునః ప్రత్యాగమిష్యతి॥ తతస్త్వాం దేవి సుభగే క్షేమేణ పునరాగతా । యక్ష్యే ప్రముదితా గంగే సర్వకామసమృద్ధినీ॥ త్వం హి త్రిపథగా దేవి బ్రహ్మలోకం సమీక్షసే । భార్యా చోదధిరాజస్య లోకేస్మిన్ సంప్రదృశ్యసే ॥ సా త్వాం దేవి నమస్యామి ప్రశంసామి చ శోభనే । ప్రాప్తరాజ్యే నరవ్యాఘ్రే శివేన పునరాగతే ॥ గవాం శతసహస్రాణి వస్త్రాణ్యన్నం చ పేశలమ్। బ్రాహ్మణేభ్యః ప్రదాస్యామి తవ ప్రియచికీర్షయా॥ సురాఘటసహస్రేణ మాంసభూతోదనేన చ। యక్ష్యే త్వాం ప్రయతా దేవి పురీం పునరుపాగతా॥ యాని త్వత్తీరవాసీని దైవతాని వసంతి చ । తాని సర్వాణి యక్ష్యామి తీర్థాన్యాయతనాని చ ॥ పునరేవ మహాబాహుర్మయా భ్రాత్రా చ సంగతః । అయోధ్యాం వనవాసాత్తు ప్రవిశత్వనఘోనఘే॥ ఓగంగానదీ! మిగులబుద్ధిమంతుఁడును, పూజ్యుఁడును, నగుదశరథమహారాజునకుఁ బుత్రుఁడైన యీ రాముఁడు నీచేత రక్షింపబడినవాఁడై పదునాలుగు సంవత్సరములను సంపూర్ణముగ వనములయందుండి తండ్రియాజ్ఞను ముగించి తమ్మునితోడను మరల నెప్పటికిఁ గడకు వచ్చునో యాసమయమునందు నిన్నుఁ జూడగలను. మంగళప్రదురాలవైన యోగంగాదేవీ! తల్లీ ! నేను క్షేమముగా వచ్చినదాననై సర్వకామములను బొందినదాననగుచు నిన్నుఁ బూజింపఁగలను. ఓగంగాదేవీ! నీవు స్వర్గమర్త్యపాతాళలోకములయందుఁ దిరుగుదానవు గావున బ్రహ్మలోకమును గూడఁ జూచుచున్నావు. సముద్రునకు భార్యవు. కావున నీలోకమునందు మాకందఱకును గనఁబడుచున్నావు. మంగళములనిచ్చునట్టి దానవైన యోగంగాదేవీ ! నేను నీకు నమస్కారమును జేసెదను. మఱియును నిన్ను స్తుతించెదను ఓగంగాదేవీ! పురుషోత్తముఁడగు రాముఁడు కుశలముగా మరల నిక్కడకు వచ్చి పట్టాభిషిక్తుఁడు కాగానే నేను నీకుఁ బ్రియమును జేయవలయునని మెదు కోరికగలదాననై బ్రాహ్మణులకనేక మాఁపలగోవులనిచ్చెదను. మఱియును మేలిమియగు వస్త్రములను దానము జేసెదను. ఇంతియగాక మృష్టాన్నదానమును జేసెదను. ఓగంగాదేవీ! నేను మరల క్షేమముగాఁ బట్టణమునకు వచ్చినపిమ్మటఁ బరిశుద్ధమగు మనస్సుతో వేయిబానల మద్యమును, మాంసపురాసులను సమర్పించెదను. మఱియు ననేకవిధములఁ బూజించెదను. ఇంతియగాక నీతీరమునందున్న సకలదేవతలను, తీర్థములను గూడఁ బూజించెదను. పాపరహితురాలవైన యోగంగాదేవీ! నిష్కల్మషుఁడును, మహాబాహుఁడునైన రాముఁడు నాతోడను లక్ష్మణునితోడ నువనవాసమునుండి మరల నయోధ్యాపట్టణమునకు క్షేమముగా వచ్చునట్లు మాకాశీర్వచనమును జేయుమని యనేకవిధములఁ బ్రార్థించెను. ఇట్లు పూజ్యురాలగు సీతాదేవి ప్రార్థించుచుండఁగా నాయోడ మిగుల వేగముగా దక్షిణతీరమునకు బోయి చేరెను. అట్లు తీరమునకు వచ్చినతోడనే పురుషోత్తముఁడగు రాముఁడు నావనుండి సీతాలక్ష్మణులతోఁ గూడఁ దిగి యచ్చటనుండి బయలు వెడలిపోయెను. అటుపిమ్మట మహాబాహుఁడగు రాముఁడు సుమిత్రానందవర్ధనుఁడగు లక్ష్మణునితో నిట్లనియె.

లక్ష్మణా! నీవిఁక జనులుండెడు స్థలమునందైనను జనులులేనిస్థలమునందైనను మిగుల జాగ్రతతో నమ్ముల గాపాడుచుండవలయును. ఇదివరలో మన మెన్నఁడు జూడని నిర్జనమగు నరణ్యములలో సంచరించుదుము. కావున బహుజాగ్రతతో నమ్ముల రక్షింపవలయును. వత్సా! లక్ష్మణా! నీవు ముందరఁ బొమ్ము. నీవెనుక నీతోఁ గూడ సీత వచ్చుచుండును. నేను నిన్ను సీతను జూచుచు వెనుకభాగమునందు వచ్చుచుందును. పురుషోత్తముఁడవగు నో లక్ష్మణా! ఈవనమునందు మన మొకరినొకరు రక్షించుకొనుచుండవలయును.

"శ్లో॥ నహి తావదతిక్రాంతా సుకరా కాచన క్రియా,, ఏకార్యమైనను చెడిపోయిన పిమ్మట బాగుసేయుట సులభము గాదు. కావున ముందుగా నే మనము జాగ్రతతో నుండవలయును. ఇప్పటికి సీతాదేవికి కూడ వనవాసము యొక్క దుఃఖము దెలియఁగలదు. ఇప్పుడీసీత నిర్జనమైనదియును, పంటభూములు, తోటలు లేనిదియును, మిట్టపల్లములుగలదియును, చఱియలుగలదియునునగు నరణ్యప్రదేశములయందుఁ బ్రవేశించును. కావున వనవాస దుఃఖమును దెలియఁగలదని చెప్పె. ఆవిధముగ రాముఁడు చెప్పిన వచనములను విని లక్ష్మణుఁడు ముందుగ నడచె. అతని వెంట సీతయును బోయె. ఆసీతకు వెనుకభాగమునందు రాముఁడు పోవుచుండె. కరుణింపందగినవాఁడగు సారథియైన సుమంత్రుఁడు రాముఁడు శీఘ్రముగా గంగానదియొక్క యవతలిగట్టునకుఁ బోవుటను జూచుచుండె. అంతటఁ గొంతసేపటికి మిగులదూరముగాఁ బోవుటవలన సీతారామలక్ష్మణులా సుమంత్రునకుఁ గనఁబడరైరి. అప్పుడు సుమంత్రుఁడధికమైన దుఃఖముచేతఁ గన్నీళ్లు విడిచె. దేవేంద్రునియొక్క ప్రభావమువంటి ప్రభావముగలవాఁడును, మహానుభావుఁడును, కోరినకోరికల నిచ్చువాఁడును, నగు నా రాముఁడు గొప్పదియగు గంగానదిని దాటినపిమ్మటఁ గ్రమముగ మంచిపైరుల పంక్తులుగలదియును. సర్వసమృద్ధులచేతను నిండినదియును, సంతసించినది యునునగు వత్సదేశమునకుఁ బోయె. అంతట రామలక్ష్మ

ఆకలిగలవారైపందిని, మనుబోతును, దుప్పిని, నల్లచారలదుప్పిని, జంపిపరిశుద్ధమైనయామాంసమును గ్రహించి సాయంకాలమునందొకచెట్టుక్రిందికిఁబోయిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేబదిరెండవసర్గ ముగిసెను.

రాముడు తనతల్లియగు కౌసల్యాదేవినిదలఁచుకొని వ్యసనపడుట.

పరులనుసంతోషపెట్టువారలలోపల శ్రేష్ఠుఁడగు రాముఁడా వృక్షముక్రిందఁ బ్రవేశించినపిమ్మట సాయంకాలసంధ్య నుపాసించె. అట్లుసంధ్యావందనమును జేసియా రాముఁడు లక్ష్మణునిఁజూచియిట్లనియె.

నాయనా! లక్ష్మణా! మనము సుమంత్రునిచేత విడువఁబడినపిమ్మట బహిర్దేశమునందొక్క రాత్రివచ్చినది. అయ్యో మనమొంటిరిగానీరాత్రి నెట్లుగడుపుదుమని వ్యసనమును బొందకుము. ఇది మొదలుకొని మనము పొరఁబాటులేక రాత్రులయందు మేలుకొనియుండవలసినది. మఱియు నో లక్ష్మణా! సీతయొక్క యోగక్షేమములు మనయిరువురియందును నుండియున్నవిగదా? ఈరాత్రినిమిగులఁబ్రయాసముచేత మనము గడుపుదము. మఱియును మనచేత సంపాదింపఁబడినయాకులు మొదలగువానిని భూమియందుఁబఱచుకొని పరుండెమెట్లయిననీరాత్రినిగడుపదమని రాముఁడు జెప్పె. గొప్పదగు హంసతూలికాతల్పమునందుఁబరుండుటకుదగిన రాముఁడు భూమియందుఁబరుండిలక్ష్మణునికొఱకుఁ బావనములగు నీతికథలను జెప్పఁదొడంగె. వత్సా! లక్ష్మణా! దశరథమహారాజు నేటిరాత్రిమిగులదుఃఖమును బొందుచునిద్రించును. కైకేయి సఫలమైనమనోరథముగలదియగుటచేత సంతోషమును బొందుటకుఁ దగియున్నది. రాణియగునా కైకేయి మేనమామయింటినుండివచ్చిన భరతునిఁజూచి యిక భరతునకు రాజ్యమువచ్చుటకు సందేహములేదని దశరథుని ప్రాణములను దీయకుండునుగదా? దిక్కులేనివాఁడును, ముసలివాఁడును, నాచేతవిడువఁబడినవాఁడును, కామోద్రేకుఁడును, కైకేయివలలోఁదగులుకొనినవాఁడునునగు దశరథుడు దేనిని జేయఁడు? కైకేయిచేతియందుఁదగులుకొన్నవాఁడేమి చేయఁగలఁడు? ఇప్పుడు మనకుఁ గల్గినకష్టమును, దశరథునకుఁగలిగినబుద్ధిభ్రమను జూడఁగా ధర్మార్థములను రెండు విధములగు పురుషార్థములకంటెఁగామమే గొప్పదైనదని దలఁచుచున్నాను. లక్ష్మణా! లోకములో మూర్ఖుఁడుగూడ మనతండ్రియగు దశరథమహారాజువలె భార్యానిమిత్తము గదనయిష్టానుసారముగ ననుసరించునట్టి పుత్రునివిడుచునా? ఎట్టిమూర్ఖుఁడైనను నిష్టానుసారముగా సంచరించునట్టిపుత్రునివిడువఁడు. ఇఁకమీఁదఁ గైకేయి తనపుత్రుఁడగు భరతుఁడు మహారాజుగా, సకలసంపదలతోఁగూడిన కోసలదేశమును సర్వమును బాలించుచు భార్యతోఁగూడ సుఖమును బొందఁగలఁడనియును, మనము వనమునకువచ్చినపిదప తన పుత్రుఁడొక్కఁడే సమస్తరాజ్యమునకు నద్వితీయుఁడైయుండునియును, ముఖ్యప్రభువగుననియును సంతోషమును బొందఁగలదు. మఱియునో లక్ష్మణా! "శ్లో॥ అర్థధర్మౌ పరిత్యజ్యయః కామమనువర్తతే। ఏవమాపద్యతే క్షిప్రం రాజా దశరథోయథా,, అర్థధర్మములను విడిచిపెట్టి కామమునందుమాత్రము ప్రవర్తించువాఁడు దశరథునివలె నతిశీఘ్రముగ నాశమును బొందును. వత్సా! లక్ష్మణా! ఈకైకేయి, దశరథుని నాశముకొఱకును, మనమరణ్యమునకుఁబోవుటకొఱకును, భరతునకు రాజ్యమువచ్చుటకొఱకును మనయింటికి వచ్చినదని నేనుదలఁచుచున్నాను. ఇప్పుడీకైకేయి, సౌభాగ్యమదముచేత శరీరమును మఱచినదైనన్నుగుఱించి కౌసల్యాసుమిత్రలను బాధింపకుండునా? బాధించుననియే తోఁచుచున్నది. లక్ష్మణా! నన్నుగుఱించి సుమిత్రాదేవి వ్యసనమును బొందకుండుఁగాక. మనమింకవిశేష దూరముఁగఁ బోయినపిమ్మట మిగులఁగష్టముగనుండును. కావుననీవిచ్చట నుండియేఉదయమైనతోడనే మరల నయోధ్యాపట్టణమునకుఁబొమ్ము. యీసీతతోఁగూడ నేనొక్కఁడనే దండకారణ్యమునకుఁబోయెదను. లక్ష్మణా! కౌసల్యాదేవియయోధ్యయందుదిక్కులేనిదైయున్నది. కావుననీవు రేపు తెల్లవారగానే యయోధ్యాపట్టణమునకుఁబోయి యామెకుసహాయుఁడవైసంచరింపుము. కైకేయినీచములగుదుష్టకర్మలనాచరించుస్వభావముగలది. కావున ద్వేషమును నెరవేర్చుకొనుటకన్యాయకార్యమును జేయునుగదా? యనితోఁచుచున్నది. లక్ష్మణా! నీవుధర్మజ్ఞుఁడగుభరతునకు నాతల్లినిసమర్పింపుము. అతఁడుధర్మజ్ఞుఁడుగావునఁజక్కఁగా గాపాడును. లక్ష్మణా! నాతల్లియగుకౌసల్యాదేవి పూర్వముజన్మాంతరమునకొందఱిస్త్రీలకును వారియొక్కపుత్రులకును, నెడబాటుగలుగునట్లుచేసియుండును. ఇదివాస్తవము. కావున నేయిట్టికష్టములుగలిగినది. కౌసల్యాదేవి బహుకాలముగననేకకష్టములుపడినన్నుపెంచిపెద్దవానిని జేసి యికను నాపరిచర్యాదిసుఖములననుభవింపదలంచియుండగానట్టితల్లినివదిలిపెట్టివచ్చితిని. నేనుమండిపోవుదునుగాక. లక్ష్మణా! నేనునుతల్లికినంతములేని దుఃఖమునుగలుగ జేయుచున్నాను. ఇట్లు నావలెదుఃఖమునిచ్చునట్టిపుత్రునిలోకములో ఏయాఁడుదియును గనకుండుగాక. లక్ష్మణా! మనమరణ్య

మునకువచ్చునప్పుడు కౌసల్యచేఁ బోషింపబడుచుండిన గోరు
వంకపిట్టచిలుకతో నిట్లనియె.

ఓచిలుకా! నీవుదుర్మార్గురాలగు కైకేయియొక్క పాద
మును గొఱుకుమనియె. దానిని నేనువింటిని పక్షిజాతియగు
గోరువంకపిట్టగూడఁ దన్నుబోషించినదను విశ్వాసముచేతఁ
గౌసల్యకుఁ జేయఁదలఁచినంతప్రియమునుగూడ గర్భమునఁ
బుట్టినకుమారుఁడనైన నేను జేయఁజాలనైతిని. కావున నాజన్మ
మువ్యర్థమైనదని తలఁచుచున్నాను. శత్రువులను నశింపఁజే
యుటకుఁదగిన సామర్థ్యముగలయో లక్ష్మణా! మిక్కిలిదుః
ఖించుచున్నదియును, కొంచెమైన యదృష్టముగలదియును,
పుత్రహీనురాలును, నగుకౌసల్యకుఁబుత్రుండనైన నేను
గొంచెమైనను ప... మును జేయనివాఁడనైతిని. ఇటువంటి
పుత్రునివలనఁ దల్లులకుఁ బ్రయోజనమేమిగలదు. అల్పభా
గ్యురాలును, నాకుఁదల్లియును నగు కౌసల్యాదేవి నేనువదలివ
చ్చుటచేత మితిలేనిదుఃఖసముద్రమునందు మునిగి యధికమగు
దుఃఖమునుబొందును. లక్ష్మణా! నేనుగోపమునుబొందితి
నేని యొక్కఁడనే నాబాణములచేత నయోధ్యాపట్టణమునొ
క్కదానినే గాదు భూమినిగూడ బాణములచే నిండింపగలను.
అయినను ఇప్పుడు పరాక్రమమును జూపుటకుఁ దగినకాలము
గాదు. నిష్కల్మషుఁడా! లక్ష్మణా! నేనధర్మము వచ్చునేమో
యనియును, పరలోకమునకు హానివచ్చుననియును భయ
ముగలవాఁడనైతిని. కావున నేనిప్పుడు రాజ్యాభిషిక్తుఁడన
గుటకు సమ్మతమును బొందనివాఁడనైతిననియె. ఇవ్విధముగ
నారాత్రియందు నిర్జనమగు నరణ్యమునందుఁ జెప్పియనేకవిధ
ముల దుఃఖించి కన్నీళ్ళచేత వ్యాప్తమైన ముఖముగలవాఁడై
యేమియుఁ జెప్పఁజాలక యూరకుండె. ఇట్లు మంటలు లేనియగ్ని
హోత్రునివలెను, వేగములేని సముద్రమువలెను, విలపించి
విలపించి యూరకున్న రామునిఁ జూచి లక్ష్మణుఁ డిట్లనియె.

ధనుర్ధారులలో నుత్తముఁడవైనయో రామా! నీవు బయ
లువెడలివచ్చిన పిమ్మట నయోధ్యాపట్టణము, చంద్రుఁడు లేని
రాత్రివలెఁ గాంతిహీనమైనదగును. ఇట్లగుటకుఁ గొంచెమైన
నుసందేహము లేదు. రామా! నీవు పరితాపమును బొందుట
యుచితము గాదని నేనుదలఁచుచున్నాను. నీవివ్విధముగ వ్య
సనమును బొందితివేని నాకును సీతకును నధికమైన దుఃఖముగ
లుగును. నీళ్ళను వదలి మత్స్యము జీవింపలేని విధముగ సీతయు
ను, నేనును, నిన్ను వదలి జీవింపఁజాలము. విశేషముగఁ జెప్ప
నేల. నిన్ను వదలి క్షణముసేపు గూడ జీవింపఁజాలము. రాము
డా! నాకిప్పుడు, తండ్రి, శత్రుఘ్నుఁడు, సుమిత్ర, స్వర్గము, ఇ
వి మొదలగువానిలో నేదియును నీవు లేనిది నాకు రుచింపవు. మ
ఱియేవియును నాకిష్టమైనది గాదని లక్ష్మణుఁడు రాముని నోదా
ర్చె. అంతట ధర్మవత్సలులగు నా రామలక్ష్మణు లిరువురును, సు
ఖము గాఁ గూర్చున్నవారలై సమీపమునందలి మఱ్ఱిచెట్టుక్రిం
ద లక్ష్మణునిచే నేర్పరుపఁబడి, దగ్గరదగ్గరగానున్న శయ్యల
యందు పరుండిరి. ఇట్లు శత్రువులను దపింపఁజేయునట్టి సామ
ర్థ్యముగల రాముఁడు లక్ష్మణునిచేతఁ జెప్పఁబడినదియును,
నుత్తమంబును, శ్రేష్ఠమును, నగుమాటను బరమాదరము
తో విని చాలాకాలము వానప్రస్థధర్మము నవలంబించి పదునా
లుగు సంవత్సరములు వనవాసము నే జేయుటను గోరె. అటు
పిమ్మట నధికమగు బలముగలవారును, రఘుకులమును వృద్ధిని
బొందించువారును నగు నారామలక్ష్మణు లిరువురును, కొండ
చరియలయందుండునట్టి సింహములవలె భయసంభ్రమము లే
మియును లేనివారైరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేబదిమూడవ
సర్గము ముగిసెను.

సీతారామలక్ష్మణులు భరద్వాజాశ్రమమునకు బోవుట.

అవ్విధముగ సీతారామలక్ష్మణులు ముగ్గురును నా మఱ్ఱి
చెట్టుక్రింద మంగళకరమగు నారాత్రిని సర్వమును గడపిరి. అం
తఁ గొంతసేపటికి సూర్యోదయమయ్యె. అట్లు సూర్యోద
యమైనతోడనే యాచోటనుండి బయలుదేరిపోయిరి. అధి
కమైన కీర్తిగల యారామలక్ష్మణులు, మిగుల భయంకరమైన
నమ్మహారణ్యమునందుఁ బ్రవేశించి యాయడవియం దక్కడ
క్కడమును పెప్పదున బాడనట్టి, నానావిధములైన, భూ
భాగములను, మఱియును మనోహరములగు దేశములను
జూచుచు యమునానది గంగానదియందుఁ బ్రవేశించినస్థల
మునకుఁ బోయిరి. అవ్విధముగ నారాముఁడు క్షేమముగాఁ
బోవుచు మార్గమధ్యయందనేక విధములగు వృక్షములను జూ
చుచుఁ బోవుచుండె. అంతఁ గొంతసేపటికి సూర్యుఁడు
పూర్వదిక్కును వదలి పశ్చిమదిశకుఁ జారెను. అప్పుడారా
ముఁడు లక్ష్మణునిఁ జూచి యిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! ప్రయాగక్షేత్రమునకు నాలుగు
దిక్కులయందును భగవంతుఁడగు నగ్నిహోత్రుని యొక్క
ధ్వజమగు ధూమము వ్యాపించియున్నది. చూడుము. కావు
న మనము భరద్వాజ మునిశ్రేష్ఠుని యొక్క ఆశ్రమము దగ్గర
కు వచ్చినట్లు తోఁచుచున్నది. మఱియు నో లక్ష్మణా! మన
ము నిశ్చయముగా గంగాయమునలయొక్క మధ్యప్రదేశ
మునకు వచ్చితిమి. ఇది నిశ్చయము. ఒకయుదకము మఱి
యొకయుదకముతోఁ గలియునప్పుడు గలుగునట్టి ధ్వని వినఁ
బడుచున్నది. కావున నిజముగ మనము గంగాయమునలనడి

మిదేశమునకు వచ్చితిమి. వనములయందలి పదార్థములవలన జీవించువారలచేఁ బగులఁగొట్టఁబడిన కొయ్యలుగనఁబడుచున్నవి. చక్కఁగా జూడుము. మఱియును భరద్వాజాశ్రమమునందుండు మునులచే ఘోషింపబడుచుండు నానావిధములగు వృ ములు గనఁబడుచున్నవని రాముఁడు లక్ష్మణునితోఁ జెప్పె. అంతట ధనుర్ధారులలో నుత్తములగు నా రామలక్ష్మణు లిరువురును, సూర్యుఁడు పడమటికిఁ గ్రుంక వ్రేలాడుచుండఁగానే గంగాయమునల సంధియందున్న భరద్వాజాశ్రమమును బొందిరి. అట్లు భరద్వాజాశ్రమములోఁ బ్రవేశించినపిమ్మట రాముఁడందలి మృగములను పక్షులను భయపెట్టుచుఁ గొంచెము దూరము పోయి పిమ్మట భరద్వాజమునివరుని సమీపమునకుఁ బోయెను. అట్లు పోయినపిమ్మటఁ బరాక్రమవంతులగు నా రామలక్ష్మణు లిరువురును, సీతతోఁగూడ భరద్వాజమునివరుని దర్శనంబును గోరుచుఁ గొంచెము సేపు సీతతోఁగూడ దూరమునందే యుండి కాచియుండిరి. పిమ్మటఁ గొంతసేపటికి రాముఁడు లోనికిఁ బోయి మహానుభావుఁడును, శిష్యసముదాయముచేఁ జుట్టఁబడినవాఁడును, మిగులఁ దీక్ష్ణమగు నియమము గలవాఁడును, ధ్యానపరుఁడును, తపస్సుచేఁ బొందఁబడిన జ్ఞానదృష్టి గలవాఁడును, పూజ్యమైన యదృష్టము గలవాఁడును, నగు భరద్వాజమునివరునిఁ జూచి చేతులు ముకుళించుకొని సీతాలక్ష్మణులతోఁగూడ నమస్కారమును జేసె. అట్లు నమస్కారమును జేసినపిమ్మట లక్ష్మణునికన్నయగు రాముఁడు తన్ను నిట్లని తెలిపికొనియె. (అనఁగాఁ దనసంగతి నంతయు నిట్లని తెలిపెను) మహాత్ముఁడవగు భరద్వాజుఁడా! మేము దశరథునకుఁ గుమారులము. రామలక్ష్మణులను నామములు గలవారము. ఈచిన్నది రాముఁడనగు నాకు భార్యయగు సీత. ఇది జనకచక్రవర్తికిఁ గూతురు. నేను నిర్జనములగు తపోవనమునకు రావలసివచ్చుచుండుటచే నాతోఁ గూడ వచ్చుచున్నది. నేను దండ్రియాజ్ఞను బొంది యడవులకు వచ్చుచుండఁగా నాతమ్ముఁడగు నీలక్ష్మణుఁడు గూడ నాతో వచ్చుచున్నాఁడు. మఱియు నితఁడుగూడ నావలెనే వనవాసముకొఱకు దృఢమైనవ్రతము గలవాఁడయ్యె. షడ్గుణైశ్వర్యసంపన్నుఁడవగు నో భరద్వాజమునివర్యా! మేము తండ్రిచేత నాజ్ఞాపింపఁబడి తపస్సును జేయుటకు వనమును బ్రవేశించెదము. ప్రవేశించి కందమూలఫలములనే భుజించెదమనిఁ జెప్పె. ధర్మబుద్ధిగల భరద్వాజుఁడు, ధీమంతుఁడును, రాజపుత్రుఁడును, నగు రాముని మాటలను విని సన్మానించుటకొఱకు గోవును మఱియు నితరమగు నర్ఘ్యోదకాదికమును దీసికొనివచ్చె. మఱియును దపోవంతులలో నుత్తముఁడగు భరద్వాజుఁడు సీతారామలక్ష్మణులకొఱకుఁ గందమూలఫలాదులను, నానావిధములగు నన్నపానాదులను సమర్పించె. ఇంతయగాక యా సీతారామలక్ష్మణులు నివసించుటకుఁ దగినవాసస్థానమునుగూడ గల్పించె. మృగములచేతను, పక్షులచేతను, మునులచేతను, చుట్టఁబడియున్న భరద్వాజమహాముని రామునిం జూచి రాముఁడా! నీకు స్వాగతమగుఁగాకయని పూజించె. మఱియు నా భరద్వాజమునివరుఁడు తానిచ్చినయర్ఘ్యము గైకొని కూర్చున్న రామునిఁ జూచి ధర్మయుతమగు మాటను జెప్పఁదలఁచి యిట్లనియె.

కకుత్స్థకులసంభవా! రామా! చిరకాలమున కిక్కడకు వచ్చిన నిన్నుఁ జూచితిని. నేనింతకాల ముండక పోయిన యెడల నాకు నీదర్శనము గాదుగదా? నిన్ను నిష్కారణముగ దశరథుఁ డరణ్యమునకుఁ బొమ్మనియెనను వార్తనుగూడ వింటిని. మహానదులగు గంగాయమునల మధ్యయందున్న యీప్రదేశము జనరహితమైనదియును, పవిత్రమైనదియును నైయున్నది. ఇంతయగాక యీప్రదేశము పుణ్యమైనది. రమణీయమైనది. కావున నీవిక్కడ సుఖముగా నుండుమనియె. ఇట్లు భరద్వాజమునీశ్వరుఁడు సెప్పినమాటను విని సకలజీవజంతువులకును హితమును జేయుటయం దిష్టముగల రాముఁడు శుభకరమగు వాక్యమును జెప్పఁదలఁచి యిట్లనియె.

మహాత్ముఁడవగు భరద్వాజమునివర్యా! ఈప్రదేశము పట్టణమునందున్నవారలకును, గ్రామమునందున్న జనులకును సమీపముగనున్నది. మమ్ముఁ జూడవలయునను గోరికగలజనము మేమిక్కడనుండుటను దెలిసికొని యెల్లవారును సులభముగ నీయాశ్రమమునకు వత్తురు. కావున నేనిక్కడ నుండుటకు సమ్మతమును బొందను. కాఁబట్టి యో మునిశ్రేష్ఠుఁడా! జనకచక్రవర్తికిఁ బుత్రికయును, సర్వకాలములయందును సుఖమును బొందుటకుఁ దగినదియును, నగు నీసీతకు నే ప్రదేశమునందు సుఖముగ నుండునో యటువంటి శ్రేష్ఠప్రదేశమును యోచించి యాజ్ఞాపింపుము. మఱియు నట్టిదేశ మేకాంతముగ నుండునట్లు యోచించి చెప్పుమనియె. ఇట్లు రాముఁడు సెప్పిన వాక్యమును విని భరద్వాజమహాముని యిట్లనియె.

తండ్రీ! రాముఁడా! పూజ్యులగు ఋషులచేత సేవింపబడినదియును, పవిత్రకరమైనదియును, సుఖముగఁ జూడఁదగినదియును, కొండముచ్చులచేతను వానరులచేతను, ఎలుగుబంట్లచేతను నిండియున్నదియును, గంధమాదనపర్వతముతో సమానమైనదియును, చిత్రకూటమను నా

మధేయముచేఁ బ్రసిద్ధినొందినదియునునగు పర్వతమొకటి కలదు. అదియిక్కడకుఁ బది క్రోసుల దూరముననున్నది. అచ్చోటునీవు నివసించుటకుఁదగియున్నది. మానవుఁడెప్పుడు చిత్రకూట పర్వతశిఖరములనుజూచునో యదిమొదలుకొని పాపబుద్ధిలేనివాఁడై మంగళకరములగు కార్యములయందే బుద్ధిగలవాఁడగును. అక్కడననేకులగు ఋషులు నూఱుసంవత్సరములు తపస్సునుజేసి కపాలముమాత్రము మిగిలియుండు శిరస్సుతోఁగూడ స్వర్గమునెక్కిరి. (అనఁగానందలిమునులందఱును స్వర్గలోకములకుఁ బోయిరనుట) రామా! నేనావాసస్థానమును, జనరహితమైనదానినిగాను, నీకుసుఖమునుగలిగించు దానినిగాను, తలఁచుచున్నాను. అట్లుగానిమొడల వనవాసమును జేయుటకొఱకు నాతోఁగూడనుండుమని యాభరద్వాజమునివరుఁడు చెప్పె. ఇట్లుచెప్పి ధర్మవేత్తయగు భరద్వాజుఁడు సీతారామలక్ష్మణుల ముమ్వురకును, వారుకోరినయుపచారము లన్నియును జేసి పరమానందమును గలిగించె. అట్లురాముడు ప్రయాగక్షేత్రమునందు భరద్వాజమునివరుని సేవించుచు, నానావిధములగు మాటలనుజెప్పుచుండగఁ బవిత్రమైనరాత్రివచ్చె. మఱియును సుఖమునకుఁ దగినవాఁడును, సీతాలక్ష్మణులతోఁ గూడుకొనినవాఁడును, కకుత్స్థకులసంభవుఁడును, నగురాముఁడు మిగులనలసి మనోహరమగు భరద్వాజమునివరు నాశ్రమమునం దారాత్రియంతయును సుఖముగానుండెఁ. పిమ్మటఁ బురుషోత్తముఁడగు రాముఁడారాత్రి గడచినపిమ్మట భారద్వాజ మునిశ్రేష్ఠునొద్దకుఁబోయె. అట్లుపోయి ప్రకాశించుచున్న కాంతిగల భరద్వాజ మునివరునిఁజూచి యిట్లనియె.

సత్యశీలుఁడవును, మహాత్ముఁడవునునగు నోభరద్వాజమునివర్యా! నీయాశ్రమమునందీరాత్రిని సర్వమునుసుఖముగాఁగడిపితిమి. ఇఁకమేఁదట మేమునివసించుటకుఁ దగినచోటునకుబోవుట కాజ్ఞయిమ్మనియె. అట్లురాత్రియంతయునుగడచినదని రాముఁడుచెప్పగానే భరద్వాజమునివరుఁడు తేనెయును కందమూలఫలములును సమృద్ధిగనుండు చిత్రకూట పర్వతమునకుఁ బొమ్మని మఱియునిట్లనియె.

మహాబలుఁడవైనయోరామా! చిత్రకూటపర్వతమునీకునివాసమునకుఁ దగినదని నేనుతలఁచుకొన్నాను. రామా! ఆ చిత్రకూటపర్వతము నానావిధవృక్షములతోఁ గూడినదిగను, కిన్నరోరగులచేత సేవింపఁ బడినదిగను, నెమళ్ళ యొక్కకూతలచేతఁ బ్రతిధ్వనిగలదై చేయఁబడినదిగను, గజశ్రేష్ఠములచే సేవింపఁబడుచున్నదిగను, పుణ్యమైనదిగను, మనోహరమైనదిగను, నానావిధములగు కందమూలఫలములతోఁ గూడినదిగనున్నది. కావుననాచిత్రకూటపర్వతమునకుఁబొమ్ము. మఱియూనాచిత్రకూట పర్వతము మిగులఁబ్రసిద్ధమైనది. రామా! ఆచిత్రకూటపర్వతమునం దనేకయేనుఁగులును, మృగములసమూహములును, తిరుగుచుండును. అట్లుతిరుగుచున్న మృగములనన్నింటినిఁ జూడఁగలవు. మఱియునునీవు సీతతోఁ గూడ నదులయందును, కొండకాలువలయందును, పర్వతముమీఁదిప్రదేశములయందుండు, చిన్నచిన్నగుహాలయందును, పెద్దపెద్ద గుహాలయందును, సంచరించుచు మనసునందు అపరిమితానందమును బొందఁగలవు. మిగులబలిసియున్నవై మనోహరముగఁగూయుచున్న చీకుఁగోక్కిరలతోను, కోయిలలతోడను, మృగంబులతోడను, మదపుటేనుగులతోడను గూడియున్నదియును, జలప్రవాహములుగలదియును, కావుననే మిగులసుందరమైనదియును, మంగళకరమునునగు చిత్రకూటపర్వతమునకుఁబోయి యక్కడనొకయాశ్రమమును నిర్మించికొనియుండుమని భరద్వాజమునివరుఁడు రామునకుఁజెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేబదినాల్గవ సర్గముగిసెను.

సీతా రామలక్ష్మణులు చిత్రకూట పర్వతమునకు బోవుట.

శత్రుమర్దనులును రాజపుత్రులునునగు రామలక్ష్మణులారాత్రియం దచ్చటసుఖముగానివసించి ప్రాతఃకాలమునం దాభరద్వాజమునివరునకునమస్కరించి యతనియాజ్ఞనుబొంది చిత్రకూటపర్వతమునకుఁ బోయిరి. అప్పుడా భరద్వాజమహాముని సీతారామలక్ష్మణులకు మంగళాశీర్వచనములను జేసె. మఱియునుబయనమైపోవుచున్న యాసీతారామలక్ష్మణులతోఁగూడఁ "తండ్రి, కొడుకులవెంబడిబోయినవిధముగ,, వెంటనంటిపోయె. అట్లుపోయి యాభరద్వాజమునివరుఁడు సత్యపరాక్రముఁడగు రామునితోనిట్లనియె.

పురుషోత్తములయిన యోరామలక్ష్మణులారా! మీరు ముందుగా గంగాయమునా సంధిస్థలమునకుబొండు. పిమ్మటనక్కడ గంగానదీ జలవేగముచేతదిరిగి పడమరతట్టు ప్రవహించుచున్న యమునానదిననుసరించి పొండనిచెప్పిమఱియు నిట్లనియె.

ఓరామలక్ష్మణులారా! మిగులవేగముతోఁగూడినప్రవాహముగల యమునానదీసమీపమునకుఁబొండు. అట్లు

యినసకలజనుల చేతను సంచరింపఁబడుచున్న యమునానదియొక్క రేవునుజూచెను. పిమ్మట మీరే తెప్పనొకదానిని నిర్మించుకొని సూర్యునకుఁబుత్రికయగు నాయమునానదిని దాటుఁడు. అట్లు దాటి ఆనదీతీరమందు మిగులఁబెద్దదియును, పచ్చనియాకులుఁగలదియును, నానావిధములగు వృక్షముల చేత వృద్ధినొందినదియును, సిద్ధుల చేత సేవింపఁబడినదియును, శ్యామమను పేరుగలదియును నగు నొకమఱ్ఱిచెట్టుకలదు. మీరామఱ్ఱిచెట్టుయొద్దకుబోయి నమస్కారమును జేయుఁడు. అట్లు చేసి మంగళకరములైన యాశీర్వచనములను జేయునట్లు సీతను ప్రార్థింపుమని చెప్పెను. ఆమఱ్ఱిచెట్టుయొక్క సమీపమునకుఁ బోయిన పిమ్మట సీత యలసియుండునేని యక్కడఁగొంచెము సేపుకూర్చుండి యలసటదీర్చుకొనవచ్చును. అక్కఱలేని యెడల నక్కడనుండకనే ప్రయాణమైపోయినను బోవచ్చును. అక్కడనుండి క్రోసెడు దూరము పోయిన పిదప మోదుగుచెట్ల చేతను, రేగుచెట్ల చేతను, నిండియున్నదియును, యమునాతీరమునఁబుట్టిన వెదుళ్ళ చేత నురమ్యమైనదియును, నల్లనిదియును నగు నరణ్యమును జూడఁగలరు. అదియే చిత్రకూటపర్వతమునకుఁ బోవలసినట్టి త్రోవ. నేనా మార్గమున ననేకపర్యాయములు చిత్రకూటపర్వతమునకుఁ బోయియుంటిని. ఆమార్గము మిగుల మనోహరముగాను నడుచుటకు మృదువుగానునుండును. మఱియు నామార్గమునందుఁ గార్చిచ్చు మొక్క బాధలేకయుండునని రామునకుఁ జెప్పె. ఇవ్విధముగ నా భరద్వాజమహాముని చిత్రకూటమునకుఁ బోఁదగిన మార్గమును దెలియజెప్పి వెనుకకు మరలి తనయొక్క యాశ్రమమునకుఁ బోయె. ఆమునివరుఁడు పోవునపుడు రాముఁడు నమస్కారమును జేసి పోయిరమ్మనియె. పిదప రాముఁడు లక్ష్మణునింజూచి యిట్లనియె.

లక్ష్మణా! భరద్వాజమునివరుఁడు మనయందు మిగుల కరుణగలవాఁడగుటచేత మనము కృతార్థులమైతిమనియె. పిమ్మట పురుషోత్తములును, ధైర్యవంతులును, నగు నా రామలక్ష్మణులివ్విధముగ మాటలాడుకొని సీతను ముందునిడుకొని యమునానదియొద్దకుఁబోయిరి. అట్లు మిగుల వేగముగఁబ్రవహించునట్టి యమునానదియొద్దకుఁబోయినతోడనే యా సీతారామలక్ష్మణులు ముగ్గురును నీనది నెట్లు దాటవచ్చునని నాలోచించిరి. ఇట్లాలోచించి యా రామలక్ష్మణు లిరువురును గొయ్యలను దెచ్చి వానికెండిన వెదుళ్ళను జతపఱచి దారమునకు బదులుగా వట్టివేళ్ళనుపయోగించి పెద్ద తెప్పనొకదానిని నిర్మించిరి. అటుపిమ్మట నధికమైన పరాక్రమముగల లక్ష్మణుఁడు ప్రబ్బలితీగెలను, నేరేడుకొమ్మలను, నఱికి సీతకు సుఖమును గల్గించునట్టి యాసనమును జేసె. అంతదశరథమహారాజునకు గుమారుఁడైన రాముఁడు నిరుపమానురాలగు లక్ష్మివలెనున్నదియును, కొంచెము సిగ్గుపడుచున్నదియును, నగు సీతను నోడమీఁదికి నెక్కించె. పిమ్మట వా రాముఁడా తెప్పయందు సీతాదేవికిఁ బార్శ్వభాగమునందు వస్త్రములను, సొమ్ములను, గుద్దలిని, మేకతోలుగప్పఁబడిన బుట్టికను, మఱియునితరములగు నాయుధములను గూడఁ బెట్టె. పిమ్మట దశరథమహారాజునకుఁ బుత్రులగు నా రామలక్ష్మణులిరువురును, ముందుగా సీతాదేవి నెక్కించి తామును నెక్కి మిగులఁ బ్రయత్నముతోఁ నానదిని దాటిరి. అంత సీతాదేవి తెప్ప యమునానదియొక్క మధ్యప్రదేశమునకుఁ బోయినతోడనే నదికి నమస్కారమును జేసి యిట్లని ప్రార్థించె.

"శ్లో॥ స్వస్తి దేవి తరామి త్వాం పారయేన్మే పతిర్వ్రతం। యక్ష్యే త్వాం గోసహస్రేణ సురాఘటశతేన చ॥ స్వస్తి ప్రత్యాగతే రామే పురీమిక్ష్వాకుపాలితామ్॥ ఓయమునానదీ! ఓదేవీ! నేను నిన్ను దాటుచున్నాను. నాకు శుభము గలుగుఁగాక. నేను వనవాసవ్రతమును సమాప్తిఁబొందించితినేని వేయి గోవుల చేతను, నూరు మద్యభాండముల చేతను, నిన్నుఁ బూజించెదను. రాముఁ డిక్ష్వాకులమువారి చేతఁ గాపాడఁబడుచున్న యయోధ్యాపట్టణమునకు రాగానే నీకు యావులను, నూరు మద్యభాండములను నిచ్చి పూజించెదనని మిగుల వినయముతోఁ బ్రార్థించె. అట్లు వరవర్ణినియగు నా సీత చేతులను ముకుళించుకొని యమునానదినిఁ బ్రార్థించుచు దక్షిణపుదిశయందుండు తీరమును జేరె. అవ్విధముగ నా సీతారామలక్ష్మణులు, అలలయొక్క పఙ్క్తులుగల యానదీతీరమునందుఁ బుట్టిన నానావిధములగు వృక్షముల చేతఁ దెప్పను నిల్పించుకొని సూర్యుని పుత్రికయగు నాయమునానదిని దాటిరి. అట్లు ఆ సీతారామలక్ష్మణులు యమునానదిని దాటినవారై తెప్పను విడిచి యాయడవినుండి బయలుదేరి పచ్చని యాకులుగలదియును, నల్లనిదియును నగు మఱ్ఱిచెట్టు దగ్గరకు బోయిరి. అట్లా మఱ్ఱిచెట్టువొద్దకుఁ బోయిన పిమ్మట సీతాదేవి యిట్లనియె.

"శ్లో॥ నమస్తేస్తు మహావృక్షే పారయేన్మే పతిర్వ్రతమ్। కౌసల్యాం చైవ పశ్యేయం సుమిత్రాం చ యశస్వినీమ్॥ ఓ మహావృక్షమా! నీకు నమస్కారమును జేసెదను. నా భర్తయగు రాముఁడు పదునాలుగు సంవత్సరములు సేయఁదగిన వనవాసవ్రతమును నెరవేర్చుకొని కీర్తివంతులగు కౌసల్యాసుమిత్రలను జూచునట్లు సేయుమని ప్రార్థించుచు నా సీతాదేవి చేతులను ముకుళించుకొని యావృక్షమునకుఁ బ్రదక్షిణనమస్కారమును జేసె. అప్పుడు రాముఁ డవ్విధముగ వృక్షమును యాచించుచున్నదియును, నిందింపఁబడనిదియును, ప్ర

యురాలును, విధేయురాలును, నగుసీతనుజూచిలక్ష్మణునితోనిట్లనియె.

భరతాగ్రజా! పురుషశ్రేష్ఠా! లక్ష్మణా! నీవుసీతను దీసికొనిముందరఁబొమ్ము. నేనాయుధములతోఁ గూడమీ వెనుకవచ్చెదను. మఱియునీసీతకేయేవస్తువులయందుఁ ఇచ్ఛ యాముగలుగునో, మఱియునేయేపత్రఫలపుష్పాదులను గోరునోవానినన్నింటిని దెచ్చియిచ్చుచుండుమనిలక్ష్మణునితోఁ జెప్పె. అంతటనాసీతాదేవిరామలక్ష్మణులకుమధ్యఁ బోవుచుండె. అట్లుపోవుచున్నయాసీతాదేవిమదపుటేనుఁగులమధ్యఁబోవుచున్న యాడయేనుఁగువలెఁ బ్రకాశించుచుండె. అబలురాలగునాసీతాదేవి యదివఱకెన్నఁడును చూడనివృక్షమును, పొదలేనిచెట్టును, మునుపెప్పుడును జూడఁబడనిదియును, పూలచేనొప్పుచున్నదియును, తీగెలను, మఱియునసేకములగు పదార్థములనుచూచుచు రామునినడుగుచుండె. మఱియునాలక్ష్మణుఁడుసీతాదేవియడిగినట్టి రమణీయములును, నానావిధములును, పుష్పములచేతనిండియున్నవియును, నగుచెట్లమండలను. తత్క్షణముదీసికొనివచ్చియిచ్చుచుండె. అప్పుడుజనకరాజపుత్రికయగు సీతాదేవి, నానావిధములైనయిసుకయును, ఉదకమునుమనోహరముగాఁగూయుచున్నహంసపక్షులుసారసపక్షులునుగలయమునానదినిఁజూచి పరమసంతోషమునొందె. పిదపనన్నదమ్ములగు నారామలక్ష్మణులుయమునానదీతీరమునందలియడవియందుక్రోసుదూరముపోయిభక్షింపదగిన ననేకములగుమృగములను జంపిభుజించిరి. దైన్యములేనివీక్షణములుకలయాసీతారామలక్ష్మణులునెమళ్ళయొక్క సమూహముచేత ధ్వనింపఁజేయఁబడినదియును, కోఁతులతోడను, ఏనుఁగులతోడను, గూడినవియును, సుందరమైనదియునునగు నయ్యరణ్యమునందుఁ గ్రీడించి మిట్టపల్లములులేనియేటిగట్టునకుఁబోయిరి. పిమ్మటయిష్టమగువాసస్థానమునకుఁబోవ నిశ్చయించిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలియేబదైదవసర్గ ముగిసెను.

— { సీతారామలక్ష్మణులు చిత్రకూటపర్వతమునందు పర్ణశాల నిర్మించుకొని నివసించుట. } —

అంతనారాత్రియంతయునునందు నివసించియారాత్రియతిక్రమించినపిమ్మటరాముఁడు, గొంచెమునిదురించియున్నలక్ష్మణునిమెల్లగా మేలుకొలిపె. శత్రుమర్దనుఁడవగునోలక్ష్మణా! మనోహరముగాఁ గూయుచున్న వనపక్షులయొక్కధ్వనినివినుము. ఇఁకమనముబయలుదేరుదము. మనము బయలుదేరిపోవుటకుఁదగినసమయమైనదని రాముఁడులక్ష్మణునితోఁజెప్పె. అప్పుడునిదురించియున్న యాలక్ష్మణుఁడన్నచేతమేలుకొలుపఁబడినిదురను, సోమరితనమును, మార్గముననడచుటవలనఁ గలిగినయాయాసమును విడిచిపెట్టెను. అంతటసీతారామలక్ష్మణులుమువ్వురును నిద్రనువదలిమంగళకరమగుయమునానదియందుస్నానమునుజేసిభరద్వాజమహాముని చెప్పినవిధముగాఁ జిత్రకూటపర్వతమునకుఁ బోఁదగినదారినిపట్టిపోవుచుండిరి. అట్లురాముఁడుయుక్తకాలమునందుఁ ప్రయాణమైనవాఁడై కమలములవంటికన్నులుగలసీతాలక్ష్మణులతోనిట్లనియె.

ఓసీతా! యిప్పుడువసంతఋతువువచ్చినది. కావుననేయిప్పుడువృక్షములన్నియునుపుష్పించియున్నవి. ఎఱ్ఱనిపుష్పములనిమోదుగచెట్లు జ్వాలలచేతమనోహరముగఁ బ్రకాశించుచున్నవియును, మఱియునుదమపుష్పములచేతఁ బూలమాలికలనుధరించినవానివలెనానందమును గలుగఁజేయుచున్నవియునునగు, మోదుగువృక్షములనుజూడుము. ఇంతయగాక వికసించినపుష్పములుగలిగి, మానవులచేత సవింపఁబడుచుఫలములచేతనుఆకులచేతను వంగియున్నజీడివృక్షములనుజూడుము. ఇట్టివృక్షములక్రింద నుండుటచేతమనముసుఖముగాజీవింపదగునని చెప్పి లక్ష్మణునుద్దేశించియిట్లనియె.

లక్ష్మణా! తేనెటీగలసమూహముచేఁ జేర్పఁబడినాలుగేసి తూములతేనెగలతేనెతెట్టెలుచెట్టుచెట్టునందును వ్రేలాడుచున్నవి. చూడుము. మఱియుసుందరమై మనోహరమైనయీవనమునందువానకోయిల యొకటికూయుచున్నది. అదికూయుటనుజూచినెమలిగూడఁ గేకలువేయుచున్నది. ఇదియంతయునెంతవిచిత్రముగానున్నదో చూడుము. ఇతయగాక. యేనుఁగులగుంపుతోఁగూడినదియును, మనోహరముగఁ గూయుచున్నపక్షులతోనిండియుండినదియును, మిక్కిలిపొడవుగనుండుశిఖరములుగలదియును, నగుచిత్రకూటపర్వతమిదిగో చూడుము. కొంచెముదూరముగఁ గనఁబడుచున్నది. నాయనా! లక్ష్మణా! మిట్టపల్లములులేనినేలగలదియును, మనోహరమైనదియును, నానావిధములగువృక్షములచేతఁగప్పఁబడినదియును, పావనమైనదియునునగు చిత్రకూటపర్వతముయొక్కవనమునందు మనమువిహరింతమనియె. అట్లురాముడుచెప్పినపిమ్మటనాసీతారామలక్ష్మణులుమువ్వురును పాదచారులైపోవుచు సుందరమును, రమణీయమునునగుచిత్రకూటపర్వతమునొద్దకుఁబోయిరి. అంతనాసీతారామలక్ష్మణులుమువ్వురును, అనేకవిధములగుపక్షులసముదాయముతోఁ గూడినదియును, నానా



రాముడు సీతకు నారచీర ధరింపజేయుట

విధములగు ఫలములుగలదియును, సుందరమైననదియును, సమృద్ధమయినదియును, రమ్యమైనయుదకముగలదియును, నగునాచిత్రకూటపర్వతమునకుఁబోయిరి. అట్టిపర్వతమునందుఁబ్రవేశించినతోడనే రాముఁడుమహానందమునుబొంది లక్ష్మణునితోనిట్లనియె.

సౌమ్యుఁడా! లక్ష్మణా! ఈపర్వతము మిగులమనోరమ్యముగనున్నది. మఱియుననేకవిధములగు వృక్షములతోడను, తీగెలతోడనుగూడి, మిగులమనోహరముగ నున్నది. ఇంతియగాక యనేకవిధములగు కందమూలఫలములుగలదైయున్నది. కావునమిగుల సుందరముగనున్నదని నాకుఁదోఁచుచున్నది. మఱియునధికమైన ప్రభావముగల మహానుభావులగుమునులును నీపర్వతమునందు నివసించుచున్నారు. కావుననిదిమనమునివసించుటకుఁ దగియున్నది. సత్స్వభావముగలలక్ష్మణా! ఈపర్వతమునందు మనమువిహరింతమనిచెప్పె. అంతటనాసీతారామలక్ష్మణులు మువ్వురును నాపర్వతమునకుఁ జేతులనుముకుళించి నమస్కారమును జేసిరి. పిమ్మటనచ్చోటనున్న వాల్మీకాశ్రమమునకుబోయి ధర్మాత్ముఁడగు నవ్వాల్మీకిమహామునికి నమస్కారమును గావించిరి. అట్లునమస్కారమును జేయుచున్న సీతాలక్ష్మణులను మువ్వురినిజూచి ధర్మవేత్తయగు నావాల్మీకిమహాముని సంతోషముగలవాఁడైపూజించి సుఖముగావచ్చితిరా? యనియడిగి కూర్చుండుడని నియమించె. అట్టియెడ సకలకార్యములయందును సమర్థుఁడును, మహాబాహుఁడును, లక్ష్మణునకన్నయును, నగురాముఁడు తనవృత్తాంతమంతయు విశదముగా వాల్మీకిమహామునికిఁ దెలిపి లక్ష్మణునిజూచి యిట్లనియె.

సౌమ్యుఁడా! లక్ష్మణా! శ్రేష్ఠములై గట్టిగానుండు మ్రాకులను దీసికొనిరమ్ము. తెచ్చిగృహమునొక్కదాని నిర్మింపుము. నాకిచ్చటనుండుట కిష్టముగలిగి యున్నదనియె. అవ్విధముగఁ జెప్పినమాటనువినిలక్ష్మణుఁడు నానావిధములగువృక్షములను దీసికొనివచ్చి పర్ణశాలనునిర్మించె. అంతటరాముఁడునిశ్చలమును, కట్టఁబడిన యావరణగలదియును, చూచుటకు యింపుగానున్నదియును, నగునాపర్ణశాలనుజూచి తనకుసేవను జేయుచున్నవాఁడును, మిగులజాగరూకతగలవాఁడును నగులక్ష్మణునితోనిట్లనియె.

నాయనా! లక్ష్మణా! మనమునల్లయిఱ్ఱిమాంసమును దీసికొనివచ్చి పర్ణశాలను, పర్ణశాలాధిష్ఠాన దేవతలను బూజింతము. చిరకాలము సుఖముగనుండగోరు, వారలు వాస్తుపూజనుజేసి గృహమునందుఁ బ్రవేశింపవలయునని పెద్దలుపలుకుదురు. సుందరములగు కన్నులుగలలక్ష్మణా! నీవుశీఘ్రముగా నల్లయిఱ్ఱినిఁజంపి యిక్కడకుఁ దీసికొనిరమ్ము. శాస్త్రమునందుఁజెప్పఁబడిన కార్యమునుజేయకుండ నుండకూడదు. నీవునుధర్మమును యోచించుకొనుము. ఈవిషయము నీకునుదెలిసేయున్నదిగదాయని రాముఁడుచెప్పె. శత్రువీరులఁజంపుటయందుఁ దగినసామర్థ్యముగలలక్ష్మణుఁ డన్నయొక్కమాటను దెలిసికొని శాస్త్రమునందు చెప్పఁబడినప్రకారముగఁజేసె. అంతటరాముఁడు పరమానందమునుబొంది యాలక్ష్మణునితో నిట్లనియె

లక్ష్మణా! ఈనల్లయిఱ్ఱిమాంసమునువండుము, దీనిచేత గృహదేవతలనుబూజింతము. ఇదిమంచిముహూర్తము. ఈదినముయజమానునకు ధైర్యముగలిగించు దినముగనున్నది. కావునఆలస్యము సేయఁగూడదనిజెప్పె. అట్లురాముండుజెప్పినఁ బ్రతాపవంతుఁడగు నాలక్ష్మణుఁడు పరిశుద్ధమైన నల్లయిఱ్ఱినిజంపి మండుచున్న యగ్నిహోత్రమునం దామాంసమును జక్కగావండెను. పిమ్మటనాలక్ష్మణుఁడగ్నియందుఁ జక్కఁగాఁగాల్పఁబడిన యామాంసమును బక్వమైనదానినిగాఁదెలిసికొని పురుషోత్తముఁడగు రామునిఁజూచి యిట్లనియె.

అన్నా! రామచంద్రా! ఈనల్లయిఱ్ఱిమాంసమును నల్లయిఱ్ఱినివండి నల్లేవండితిని. కావున దేవతుల్యుఁడవైన యోరాముఁడా! నీవిఁకనీమాంసముతో వాస్తుదేవతనుబూజింపుమనిచెప్పె. అంతయజమానునకు నుండవలసిన సకలగుణములునుగలవాఁడును, సకలమంత్రవేత్తయును, నగురాముఁడు స్నానమునుజేసి నియమముగలవాఁడై వాస్తుయాగమును సమాప్తినిబొందించునట్టి మంత్రములనన్నింటిని సంక్షేపముగాఁబఠించి వాస్తుకర్మను సమాప్తిఁబొందించె. మఱియునారాముఁడు సకలదేవసమూహములను జక్కగాఁబూజించి పరిశుద్ధుఁడైగృహమును బ్రవేశించె. అప్పుడురాముఁనిమనస్సు పరమసంతోషముగలదయ్యె. మఱియునారాముఁడు వైశ్వదేవబలిని, రుద్రదేవతాకమైనబలిని, విష్ణుదేవతాకమైనబలినిచేసి వాస్తుపురుషశాంతినిగలిగించునట్టి మంగళములనునడపుచు జపమునున్యాయపూర్వకముగాఁజరిపి పిమ్మటనదీస్నానమునాచరించి పాపమునుబోఁగొట్టునట్టి యుత్తమబలినిజేసె. అంతటనారాముఁడు, ఆవేదికలను, దేవాలయములను, అగ్నిహోత్రగృహములను, నాశ్రమమునకుఁదగినట్లా గృహమునందునిర్మించె. అంతటశుభలక్షణములుగల యారామలక్ష్మణులిరువురును, వనమునందుగలపూలచే నిర్మింపఁబడిన మాలికలచేతను, ఫలములచేతను, గడ్డలచేతను, వండినమాంసములచేతను, జలములచేతను, వేదోక్తములగు జపములచేతను,

దర్భలచేతను, మంచివగుసమిధలచేతను, శాస్త్రోక్తప్రకారముగ సకలధాతములను దృప్తిబొందించి మిగులసుందరమగుపర్ణశాలలోనికి సీతతోఁగూడఁ బ్రవేశించిరి. అంతట సీతారామలక్ష్మణులు ముగ్గురును, నివసించుటకొఱకు చెట్లయాకులచేతఁ గప్పఁబడినదియును, మనోహరమైనదియును, శాస్త్రములయందుఁజెప్పినట్లు నిర్మింపఁబడిన వంటయిల్లు మొదలగుప్రదేశములుగలదియును నెచ్చుగా గాలిలేనిదియునునగు నాపర్ణశాలలోనికి, దేవతలుసుధర్మయను దేవసభయందుఁ బ్రవేశించినట్లుప్రవేశించిరి. అప్పుడుజితేంద్రియులగు నాసీతారామలక్ష్మణులుముగ్గురును, నానావిధములగు మృగములయొక్కయు, పక్షులయొక్కయు సముదాయములచేత నిండినదియును, అనేకవిధములగుపుష్పములగుత్తులుగల వృక్షములతోఁ గూడినదియును, ఏనుఁగులచేతను, మఱియునితరములగు మృగములచేతను ధ్వనిగలుగునట్లు చేయఁబడినదియును, నగునాయడవియందు సుఖముగా గ్రీడింపుచుండిరి. మఱియునారాముఁడు, మిక్కిలిసుందరమైన చిత్రకూటపర్వతమునున్ను, చక్కనిరేవుగలిగి, మృగములతోడను, పక్షులతోడనుగూడిన మాల్యవతీనదినిన్ని, చూచిగగుర్పాటునొందిన శరీరముగలవాఁడై పరమానందమునఁ బొందె. అట్టిసంతోషమును బొందుటవలనఁ బట్టణమునువదలి యడవియందుండ వలసివచ్చెనే యను దుఃఖమునుగూడ వదలినవాఁడయ్యె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేబదాఱవసర్గముగిసెను.

—* గంగానదీతీరమునసీతారామలక్ష్మణులను వదలిపెట్టిసుమంత్రుఁడయోధ్యకువచ్చుట. *—

అంతనటగుహుఁడు, రాముఁడు గంగానదియొక్కగట్టునకుఁబోఁగానే యపరిమితమగు దుఃఖముచేతఁబీడింపఁబడి చిరకాలముసుమంత్రునితోఁ గూడ మాటలాడియేమియును జేయఁజాలక తనయొక్కగృహమునకుఁబోయె. అట్లుపోవునపుడు సుమంత్రునిఁగూడఁ దనయింటికిఁదోడ్కొనిపోయె. అంతఁగొంతసేపటికి గుహునిచారులు, సంచారముచేసివచ్చి సీతారామలక్ష్మణులు భరద్వాజమహామునియొద్దకుఁబోవుటయును, నమ్మునివరునితోఁగూడఁ బ్రయాగక్షేత్రముననుండుటయును, పిమ్మటఁజిత్రకూటపర్వతమునకుఁబోవుటయును మొదలుగాఁగలసంగతులను సుమంత్రునకుఁజెప్పిరి. పిదపసుమంత్రుడు గుహునియనుమతమునుబొంది రథమునకు గుఱ్ఱములనుబూన్చి యధికమైన దుఃఖముగలవాఁడై యయోధ్యాపట్టణమునకుఁ బోయె.

అంతనాసుమంత్రుఁడు మార్గమునందుఁ బుష్పములయందలి పరిమళములగు సువాసనగలవనములను, నదులను, గొలంకులను, గ్రామములను, పట్టణములను, జూచుచుఁబోయె. అంతటనాసుమంత్రుఁడు గుహునిదేశమైన శృంగిబేరపురమునుండి బయలువెడలిన మూఁడవ నాటి సాయంకాలమున నయోధ్యాపట్టణమునకుఁబోయి యధికముగదుఃఖమునుబొందుచున్న జనులుగల యయోధ్యాపట్టణమును జూచె. అధికమైనదుఃఖముగల యాసుమంత్రుఁడు ధ్వనిలేనిదియును, పాడుపడినట్లున్నదియునునగు నయోధ్యాపట్టణమునుజూచి రెండింతలు దుఃఖముగలవాఁడై యిట్లని చింతించె.

ఏనుఁగులు, గుఱ్ఱములు, జనులు, రాజులు, మొదలగువానితో నిండియున్న యీయయోధ్యాపట్టణమంతయును రాముడులేకుండుటవలన గలిగెడుదుఃఖమను నగ్నిచేత దగ్ధమైపోలేదే? ఇదియేమి? అయ్యో యిదియేమి? పట్టణమంతయును నిశ్శబ్దముగనున్నదే? దశరథమహారాజెట్లున్నాఁడో గదా? యనిచింతించుచు నతివేగముగగుఱ్ఱములనుదోలి పట్టణద్వారమునుజూచుచు నగరములోనికిఁబోయె. అట్లులోనికిఁబోవునపు డప్పట్టణమునందలి జనులందఱును జూచి రాముఁడెక్కడ నెక్కడనుచు గుంపులుగుంపులుగా నెదురొని యడుగుచుండిరి. అప్పుడందలిజనులతోఁ సుమంత్రుండిట్లనియె.

మానవశ్రేష్ఠులారా! నేనురాముని గంగానదియొక్క దక్షిణతీరమునవిడిచి యతనిచేననుమతిని బొందివచ్చినానని యాజనులకుఁ బ్రత్యుత్తరమును జెప్పె. అంతటనాజనులందఱును సీతారామలక్ష్మణులు గంగానదిని దాఁటిపోయిరనిచెప్పినమాటనువిని హా రామా! రామా! యనుచునందఱును నొక్కపెట్టునరోదనమును జేసిరి మఱియునందలి జనులందఱును గుంపులుగుంపులుగాఁజేరి చెప్పుకొనుచుండు మాటల నాసుమంత్రుఁడువినియె. మఱియునందలిజనులందఱును రామునిఁజూడకపోవుటచేత హతులమైతిమనుకొనిరి. దానయజ్ఞవివాహములయందును, గొప్పవగుసభలయందును ధార్మికుఁడగురామునినిఁకఁజూడలేముగదా? యనిరోదనమును జేసిరి. ఇదివఱకురామునిచేత నిప్పట్టణములోనున్న మనమందఱమును దండ్రిచేతఁ బరిపాలింపఁబడిన విధముగఁ బాలింపఁబడితిమి. అట్టిరాముఁ డిప్పుడుమనలనువదలిపోయె. ఇట్లురామునిచేతఁ విడువఁబడిన మనకేదియుచితమైయుండును? ఏదియిష్టమైయుండును? ఏదిసుఖమునుగలిగించును? ఇఁకనుమనమేమిచేయుదము? మనలనిఁకఁ బోషించువాఁడెవ్వఁడని జనులుచెప్పుకొను మాటల

నాసుమంత్రుఁడువినిరెను. అట్లువినుచు నాసుమంత్రుఁడంగ శృనదుమపోవుచుఁ గిటికీలయందుండితస్నుఁజూచుచు రామ వియోగముచేత దుఃఖమునుబొందుచున్నస్త్రీలయొక్కయే ఢ్పునువినియెను. అట్లుసకలజనులయొక్కరోదనధ్వనినివినుచు నాసుమంత్రుఁడు వారలఁజూడనేరక శిరమునువంచుకొని రాజమార్గమునఁబోయి దశరథమహారాజునివసించుగృహ మునకుపోయెను. అట్లుపోయిశీఘ్రముగ రథమునుంచిదిగిరా జగృహములోనికిబోయిపరమదుఃఖమునుబొందియున్న ద శరథమహారాజును జూచుటకొఱకువచ్చియున్న పెద్దమను ష్యులచేత నిండియున్ననేడుతొట్టికట్లను దాటిపోయెను. అటు పిమ్మటనందలిరాజస్త్రీలందఱును మేడలమీదను, ఏడంతస్థుల మేడలమీదను, రాజగృహములమీదనునెక్కి, సుమంత్రుని జూచిరాముండు లేకుండుట నెఱింగిమహావ్యసనముతో హారామా! రామా! యనిరోదనమును జేసిరి. మఱియునందలిస్త్రీలందఱును నధికమైనదుఃఖముగలవారై కన్నీళ్ళచే తఁగలత నొందిననేత్రములుగలవారలగుచు నొకరినొకరు చూచుకొనుచుండిరి. మఱియునాసుమంత్రుఁడు, రామవియోగదుఃఖముచే గృశించియున్నస్త్రీలందఱును మేడలయందుమెల్లమెల్లగ జెప్పుకొనుచుండుమాటలనువినియెను. మఱియు నాస్త్రీలుఈసుమంత్రుఁడు తొలుత రామునితోఁగూడఁబోయి యిప్పుడు రామునినెక్కడనోవిడిచివచ్చెనే! ఇతనుగౌసల్యాదేవినాపుత్రునెక్కడవదలివచ్చితివని యడిగినయెడల నేమిచెప్పునోయనిచెప్పుకొనుచుండిరి. ఆహాసద్గుణసంపన్నుఁడగుపుత్రుఁడు వనమునకుఁబోయినపిమ్మటఁగూడకౌసల్యాదేవిజీవించియున్నదే! ఇదిమిక్కిలికష్టము ఇట్టిదుఃఖముగలిగినవారు జీవించియుండుట మిగులనాశ్చర్యముగనున్నదనిదశరథునిస్త్రీలనుకొనిరి ఇవ్విధముగఁ జెప్పుకొనుచున్నస్త్రీలవచనములనువిని యెల్లవారునుదుఃఖమునుబొందినవారైయుండుటవలనమండుచున్నట్లుమనసునకుఁ గనఁబడుచున్నయంతఃపురములోనికి నాసుమంత్రుఁడుపోయెను. అవ్విధముగ నాసుమంత్రుఁడు తెల్లనిదగునెనిమిదవ తొట్టికట్టునందుఁబ్రవేశించె. అట్లుప్రవేశించిదైన్యమునుబొందియున్నవాఁడును, దుఃఖితుఁడును, పుత్రదుఃఖముచేత వెలవెలబోయినముఖముగలవాఁడునునగు దశరథమహారాజునుజూచె. అంతట నాసుమంత్రుఁడు కూర్చుండియున్నయాదశరథునిసమీపమునకుఁబోయినమస్కారమును జేసి రాముఁడుచెప్పినమాటల నన్నింటినిఁజెప్పె. అప్పుడుపుత్రుఁడగురామునిదుఃఖముచేఁ బీడింపఁబడియున్నయాదశరథమహారాజా మాటలన్నింటినివిని నిర్నిమిత్తముగాభ్రాంతినొందినచిత్తముగలవాఁడై భూమియందుఁబడె. అట్లురాజ్యాధిపతియగు నాదశరథమహారాజుభూమియందుఁబడి మూర్ఛనుబొంది యుండుటనుజూచి యంతఃపురమునందలియాడువారలందఱును చేతులుపైకెత్తియొక్కపెట్టునరోదనమును జేసిరి. ఆ సమయమునందుఁ గౌసల్యసుమిత్రతోఁగూడుకొనినదై క్రిందబడియున్నభర్తను లేవఁదీసియిట్లనియెను.

మహానుభావుడవైన యోదశరథమహారాజా! ఎట్టివారికిని జేయశక్యముగానికార్యమును జేయునట్టిరాముఁడుపంపగానతఁడు నివసించుచుండుయరణ్యంబుననుండి వచ్చినదూతయైనయీసుమంత్రునితోనేలమాటలాడవు? దశరథమహారాజా! నీవుయిప్పుడుమహాక్రూరకార్యమును జేసి యెట్లుమాట్లాడుదునని సిగ్గునుబొందుచున్నావేమి? నీకిట్లైనను పుణ్యముగలుగును. కావునదుఃఖమునుబొందకుము. దుఃఖించుటవలనగొంచమైననుప్రయోజనములేదు. ఓదశరథమహారాజా! నీవుకైకేయియొక్కభయమువలన రాముని వృత్తాంతమునుసుమంత్రునినడుగకున్నావేమో? ఆకైకేయి యిప్పుడిక్కడలేదు. నీవుభయపడవలదు. రామునివార్తలనడుగుమని కౌసల్యచెప్పె. అట్లుచెప్పిమహాదుఃఖాక్రాంతురాలగునాకౌసల్య నేమియును జెప్పనేరకక్రిందఁబడెను. ఇవ్విధముగఁజెప్పియేడ్చుచుభూమియందుఁబడినయాకౌసల్యను, దశరథునిఁజూచియందలి స్త్రీలందఱునుగొంతెత్తినధికమైనధ్వనిగలుగునట్లుగారోదనమును జేసిరి. అవ్విధముగనంతఃపురస్త్రీలందఱునురోదనమును జేయుటనుజూచి యాపట్టణమునందలిముసలివారలును, యౌవనవంతులును, స్త్రీలును, మఱియునితరులగువారునురోదనమును జేసిరి. ఆ సమయమునందప్పుడుమరలరాముఁడరణ్యమునకుఁబోవునప్పటివలెనధికమైనరోదనధ్వనిగలిగె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలియేబదియేడవసర్గముగిసె.

సుమంత్రుడు దశరధునకు రాముని వృత్తాంతమును జెప్పుట.

అంతఁ గొంతసేపటికి దశరథమహారాజు మూర్ఛఁదేరి సుమంత్రుని వైపునకుఁదిరిగి రాముని సమాచారము నడుగుటకై సుమంత్రునిఁబిలిచె. అప్పుడుసుమంత్రుఁడు రామునిగూర్చియేయధికముగ రోదనమును జేయుచున్నవాఁడును, మిగుల ముసలివాఁడును, సంతాపమును బొందినవాఁడును, నూతనముగాఁబట్టువడినయేనుఁగువలెనున్నవాఁడును, నిట్టూర్పులనధికముగ విడుచుచున్నవాఁడును, రామునేధ్యానముసేయుచున్నవాఁడును, మహారోగముపచ్చినయేనుఁగువలెనున్నవాఁడునునగు దశరథమహా

రాజునకు నమస్కారమును జేసి చేతులుముకుళించుకొని సమీపమునకువచ్చె, అప్పుడాదశరథమహారాజు పరమదుఃఖితుఁడై సమీపమునకువచ్చినవాఁడును, మార్గమునందలిదుమ్ముచేతవ్యాప్తమైనశరీరముగలవాఁడును, కన్నీళ్ళచేఁదడపఁబడిన ముఖముగలవాఁడును, దీనుఁడునునగు నాసుమంత్రునితోనిట్లనియె.

సూతుఁడా! ధర్మాత్ముఁడును, ఇదివఱకుమిక్కిలిసుఖమునసుభవించినవాఁడును, నగురాముఁడెక్కడ నివసించియున్నాఁడు. ఏచెట్టుక్రిందఁ గూర్చుండియున్నాఁడు? దేనిని భక్షించుచున్నాఁడు? సుమంత్రుఁడా! దుఃఖములనుబొందుటకుఁదగనివాఁడును, మెత్తనిశయ్యలయందుఁబరుండఁదగినవాఁడును, రాజకుమారుడునునగు రాముఁడిప్పుడెక్కడదిక్కులేనివానివలె నేలయందుఁ బడియున్నాఁడు? అట్టిసుఖవంతుఁ డెట్లు నేలయందుఁబడియుండెను? ఇదివఱకురాముఁ డుబయలువెడలెనేనియతనితోఁ గూడఁజతురంగబలములునుబోవుచుండునుగదా? అటువంటరాముఁ డిప్పుడివ్విధముగనిర్జనమగు నరణ్యమునందున్నాఁడు? సుమంత్రుఁడా! క్రూరమృగములచేనిండియుండునదియును, కృష్ణసర్పములతోఁగూడినదియునునగు నడవిలోనికి రాజపుత్రులగురామలక్ష్మణులుసీతతోఁగూడ నెట్లుపోయిరి? సుమంత్రుఁడా! రాజపుత్రులగు రామలక్ష్మణులు మృదువైనశరీరముగలదియును, కరుణింపఁదగినదియునునగుసీతతోఁగూడరథమునుండిదిగిపాదచారులైయడవికెట్లుపోయిరి. ఓసూతుఁడా! "అశ్వనీదేవతలుమందరపర్వతమునందుఁ బ్రవేశించినట్లు" నాపుత్రులగురామలక్ష్మణులు పాదచారులైయడవియందుఁ బ్రవేశించుటనుజూచుటచేనీవుకృతకృత్యుఁడవైతివి. ఓసుమంత్రుఁడా! రాముఁడేమనిచెప్పెను. లక్ష్మణుఁడేమనిచెప్పెను? వనమునందుఁబ్రవేశించునప్పుడు సీతయేమనిచెప్పెను. సుమంత్రుఁడా! రాముఁడెక్కడఁగూర్చుండెను. ఎచ్చోటఁబరుండెను. నాకీవిషయమును వివరముగాఁజెప్పుము. సుమంత్రుఁడా! "పూర్వముయయాతి స్వర్గమునుండి క్రిందికిపడునప్పుడు దేవేంద్రునిఁ దనకు సత్సహవాసము గలుగఁజేయుమని ప్రార్థించుకొని సత్సహవాసమమునుబొంది దుఃఖమునువదలిన విధముగా" నేనుగూడరామునిచరిత్రలనువినుట చేతఁగొంచెముగాదుఃఖమును బోఁగొట్టుకొనిజీవించెదదననిఁజెప్పె. ఇట్లు దశరథమహారాజడిగిననాసుమంత్రుఁడుకన్నీళ్లుగలవాఁడై డగ్గుత్తికతోదశరథమహారాజుంజూచియిట్లనియె.

దశరథమహారాజా! రాముఁడుధర్మమువదలకఁ జేతులముకుళించుకొనినీకొఱకు నమస్కారమునుజేయుచు నాతోనిట్లనియె.

సూతుఁడా! పరమాత్మతత్వమును దెలిసినవాఁడును, శిరస్సుచేతనమస్కరించుటకుఁదగినవాఁడును, మహానుభావుఁడునునగు దశరథమహారాజుయొక్కపాదములు నాకు నమస్కరించుటకుఁదగియున్నవని నామాటలనుగాదశరథునితోఁజెప్పుము. మఱియునాసాష్టాంగ నమస్కారములనుగూడఁజెప్పుమనియె. సుమంత్రుఁడా! నావచనముగా నంతఃపురస్త్రీలకందఱకునుదగినవిధముగా నమస్కారములనుజేసితినని చెప్పుము. మఱియునంతఃపురస్త్రీలకు నాక్షేమమునుగూడజెప్పుమనియె. సూతుడా! పొరబాటులేక మాతల్లియగు కౌసల్యకుక్షేమమును, ముందుగాఁజెప్పి పిమ్మట నానమస్కారములనుజెప్పుము. మఱియునాచేతఁ జెప్పఁబడుచున్నయిఁకొకమాటనుగూడఁజెప్పుమనియె. ఏమనిన, అమ్మాకౌసల్యా! ధర్మనిత్యురాలవగుము. మఱియునుదగినకాలమునందగ్నిగృహములయందుఁ బ్రియముగలదానవగుము. ఇంతయగాకదేవుఁడగుదశరథమహారాజుయొక్కపాదములను దేవునిఁబూజించువిధముగఁ బూజింపుమనికౌసల్యతోఁజెప్పుమనియె. మఱియునాతల్లులయందఱియందునుమానాభిమానములనువదలి సమముగాఁ బ్రవర్తింపుమనియె. మఱియుతల్లీ! కౌసల్యా, దశరథమహారాజును, పూజ్యురాలగుకైకేయిని అనుసరించి నడువుమనియె. కుమారుఁడగుభరతునియందు రాజునందుఁ బెట్టఁదగినగౌరవమును బెట్టుమనియె. రాజులుధనముచేతజ్యేష్ఠులుగావునరాజధర్మములనెఱిఁగిసంచరింపుమనియె. ఇవ్విధముగఁదల్లికిఁజెప్పుమనిచెప్పిమరలనిట్లనియె.

సుమంత్రుఁడా! నీవునామాటనుగా భరతునకునాక్షేమమును దెల్పుమనియె, తల్లులందఱియందును సమానముగఁబ్రవర్తింపుమని నేనుజెప్పినట్లు భరతునకుఁ జెప్పుమనియె. మహాబాహువుఁడును, నిక్ష్వాకువంశమునకు సంతోషమును గల్పించువాఁడునునగు భరతునితోముఖ్యముగా మరవక నింకొకమాటను జెప్పుమనియె. ఏమనిన— వత్సా! భరతుఁడా! నీవుయావరాజ్యాభిషిక్తుఁడవై రాజ్యమునందున్న తండ్రియగుదశరథమహారాజునుఁ గాచియుండుము. రాజగుదశరథుఁడు మిక్కిలివృద్ధుఁడైయున్నవాఁడు, కావుననతని నిర్బంధింపకుము. మఱియునోభరతుఁడా! నీవుతండ్రియొక్కయాజ్ఞను బ్రవర్తింపఁజేయుచునే యావరాజ్యమునవలంబించి సకలైశ్వర్యముల ననుభవింపుమని భరతునకుఁ జెప్పుమనిచెప్పె. అట్లుచెప్పినపిమ్మట రాముఁడుమరలనన్నుఁజూచి కండ్లనుండినీళ్ళు ధారధారగఁబ్రవహింపగా దుఃఖించుచు భరతునితోనిట్లని జెప్పుమనియె.

భరతుఁడా! పుత్రుఁ గోరుచున్నదియును, నాకుఁదల్లియునునగు కౌసల్యను దల్లినిచూచినవిధముగానే చూడుమనియె. దశరథమహారాజా! ఇవ్విధముగఁ గీర్తివంతులలో నుత్తముఁడగు రాముఁడు నాతోఁ జెప్పుచు నధికదుఃఖమువలన నెఱ్ఱనైననేత్రములుగలవాఁడై బొటబొటగన్నీళ్ళనువిడిచె. ఆసమయమునందు లక్ష్మణుఁడుమాత్ర మధికమైనకోపమునుజెంది నిట్టూర్పులనువిడుచుచు నిట్లనియె.

ఏమికారణముచేత నీరాముఁడు వనమునకుఁబంపఁబడెను. దశరథమహారాజుదుర్మార్గురాలగు కైకేయియొక్క యాజ్ఞనవలంబించి మమ్ములననేకవిధములగు కష్టములకుఁ బాత్రులనుగాఁ జేసెనుగదా? ఇట్టిశిక్షను మాకువిధించుటకు మేమేమితప్పు జేసితిమోగదా? ఆహా దశరథుఁడు గామపీడితుఁడై యెంతటిక్రూరకార్యమును జేసెను. రాముని నరణ్యమునకుఁబంపుట రాజ్యలోభముచేతనైనయెడల దోషముగలుగుటసరేగదా? కైకేయికివరములిచ్చుటకుగా మమ్ముల నరణ్యమునకుఁ బంపఁబడినను దోషమేయగుచున్నది. అట్లుకాదేని కైకేయి రాముని నరణ్యమునకుఁ బంపుమని చెప్పినను, నేను రాముని నరణ్యమునకుఁబంపనని యేల చెప్పఁగూడదు. ఇవ్విధముగ రామునివదలుటకుఁ గారణమేమియు నగనఁబడదు. కావున దశరథుఁడిట్టి కార్యమును ప్రభుత్వమదముచే స్వేచ్ఛముగాఁ జేసినాఁడుగాని వేఱుగాదని తోఁచుచున్నది. బుద్ధిమాంద్యమువలన నాలోచింపక చేయఁబడినదియును, లోకవిరుద్ధమైనదియును, నగు రామునియొక్క యరణ్యవాసము మిగులఁబరితాపమును గలిగించును గావున నిప్పుడు దశరథునకుఁ బరితాపమును బుట్టించునని తోఁచుచున్నది. నేనుమాత్రము దశరథునియందుఁ దండ్రియందుఁగల లక్షణములేవియును లేనందున నతనిని మనస్సునందుగూడ స్మరింపను. నాకు రాముఁడే భ్రాతయు, నన్నయు, ప్రభువును, బంధువుఁడును, దండ్రియునుగాని యన్యుఁడెవ్వఁడునుగాఁడు. సమస్తలోకమునకుఁ బ్రియుఁడును, సర్వలోకములకును మేలును జేయవలయునని కోరువాఁడును, నగు రామునివిడిచిన యోదశరథమహారాజా! సకలజనులకును నీయం దెట్లభిమానము గలుగునని చెప్పుమనియె. మఱియును లోకాభిరాముఁడును, ధర్మమునాచరించువాఁడును, నగు రాముని నరణ్యమునకుఁబంపి సర్వజనులను విరోధముజేసికొనిన నీదశరథుఁ డెట్లు రాజ్యాధిపతిగానుండగలఁడు అని లక్ష్మణుఁడు నీతోఁ జెప్పుమనియె. దశరథమహారాజా! మంచిస్వభావముగల సీతాదేవి, నిట్టూర్పులనువిడుచుచు మైమఱచినదియును, చిఱునవ్వులేనిదియునునై దయ్యముపట్టినదానివలెఁ గదలనిదియును, నాశ్చర్యమును బొందినదియును నై ఏమియును జెప్పనేరక యూరకుండె. ఇదివఱకెన్నఁడును దుఃఖమును బొందనిదియును, రాజపుత్రికయును, కీర్తిగలవారిలో నుత్తమురాలును, నగుసీతాదేవి దుఃఖముచేత నేడ్చుచు నన్నుఁగూర్చి కొంచెమైనను మాటలాడక యూరకుండె. మఱియు నా సీత శుష్కింపఁబడిన ముఖముగలదై భర్తయగు రామునిఁ జూచుచు నేను ప్రయాణమై బయలువెడలుటను జూచి బొటబొటకన్నీళ్ళను విడిచె. అవ్విధముగానే రాముఁడును గన్నులనిండ నీళ్ళను దెచ్చుకొని క్రిందఁబడువానివలెఁ గనఁబడియె. అప్పుడు లక్ష్మణుఁడు దీర్ఘములగు నిజబాహువులచేత నన్నుఁగాఁగ రామునిఁ బట్టుకొనియె. ఆసీతయా విధముగానే రోదనమును జేయుచు రథమునున్న నన్నుఁ జూచుచుండెనని సుమంత్రుఁడు సీతారామలక్ష్మణుల వృత్తాంతమును సర్వమును దశరథమహారాజునకుఁ జెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేబదెనిమిదవ సర్గముగిసెను.

—* దశరథమహారాజు రామునిగూర్చి విలపించుట. *—

ఇట్లు మంత్రులలో నుత్తముఁడగు సుమంత్రుఁడను సారథి చెప్పినమాటలను దశరథమహారాజువిని మరల సుమంత్రునిఁ జూచి సుమంత్రుఁడా! మిగిలినసమాచారమును జెప్పుమని యడిగె. అంత సుమంత్రుఁడు దుఃఖాక్రాంతుఁడై బొటబొటకన్నీరుగార్చుచు రాముని సంగతినంతయు వివరముగఁ జెప్పఁదలఁచి యిట్లనియె.

దశరథమహారాజా! మహాపరాక్రమవంతులగు నా రామలక్ష్మణులు జడలనుధరించి నారచీరలను గట్టుకొని గంగానదిని దాటి ప్రయాగక్షేత్రమును గూర్చిపోయిరి. అట్లుపోవునప్పుడు లక్ష్మణుఁడు ముందరఁబోవుచుండె. అతనివెనుక సీత నడచుచుండె. అయ్యిరువురిని గాపాడుచు రాముఁడు వారలవెనుక పోవుచుండె. అవ్విధముగఁ బోవుచున్న సీతారామలక్ష్మణులను జూచి నేను దుఃఖముచేత స్వాధీనతలేనివాఁడనై మరలితిని. రాముఁడు వనమును గూర్చిపోగానే మరలినపిమ్మట నా గుఱ్ఱములు కన్నీళ్ళను గార్చుచు నడవఁజాలనివయ్యె. అటుపిమ్మట నేను రాజపుత్రులగు నా రామలక్ష్మణులకిరువురకును నమస్కారమును జేసి రథము నెక్కి యధికముగ దుఃఖమును బొందుచు బయలువెడలితిని. అంతట రాముఁడు మరల నన్నుఁ బిలుచునేమో యను కోరికచేత శృంగిబేరపురమునందు గుహునియింట మూఁడుదినములు వసించితిని. దశరథమహారాజా! నీదేశమునందు పుష్పములు చిగుళ్ళుగల వృక్షములుగూడ రామవియోగదుఃఖమును

పొందినవైవాడిపోయె. మఱియునదులును, నీళ్ళుండుపల్లములును, రామవియోగదుఃఖముచేతఁ దపింపఁజేయఁబడిన యుదకములుగలవయ్యె. వనములును, ఉపవనములును, ఎండిపోయిన యాకులుగలవయ్యె. మఱియునుజంతువులే వియ్యానుకదలుటలేదు. క్రూరమృగములుగూడ నాహారమునుభుజించుటలేదు. ఇవ్విధముగ రామవియోగదుఃఖముచేతఁ బీడింపఁబడిన వనమంతయును నిశ్శబ్దమైయున్నది. దశరథమహారాజా! తామరకొలఁకులన్నియును నగపడనితామరాకులుగలవియును, తపింపఁజేయఁబడిన కమలములుగలవియును, లీనమైనపక్షులును, మత్స్యములునుగలవయ్యె. మఱియునీళ్ళయందుఁ బుట్టినపూలును, మెరకనేలయందుఁ బుట్టినపూలును, మఱియుఫలములును నిప్పుడుమునుపటివలె సుగంధముతో బ్రకాశించుటలేదు. మఱియునోదశరథమహారాజా! మనయయోధ్యాపట్టణమునందలి యుద్యానవనములన్నియును, నాశనమునుబొందినపక్షులుగలవయ్యె. పురుషోత్తముఁడా! దశరథమహారాజా! ఉద్యానవనములన్నియును నాకుఁజూడఁగాఁ గాంతివిహీనములై కనఁబడుచున్నవి. ఇంతయగాక యీయయోధ్యాపట్టణమునందుండువారలలో నొకఁడును సంతోషమును బొందడములేదు. అయ్యాదశరథమహారాజా! మనపట్టణములోనుండుజనులందఱును రామునిఁజూడనిదుఃఖముచేత మాటిమాటికినిట్టూర్పులనువిడుచుచున్నారు దశరథమహారాజా! రాముఁడులేని నారథమునుజూచి రాజమార్గమునందలి జనులందఱును గన్నీళ్ళను గార్చుచు రోదనమును జేసిరి. మఱియుస్త్రీలందఱును మిద్దెలయందును, విమానములయందును, ప్రాసాదములయందునునుండి హాహాకారములనుసలుపుచు హారామా! రామా! యనిరోదనమును జేసిరి. ఇంతయగాక మనపట్టణమునందలిస్త్రీలందఱును, మిగులవిశాలములును, నిర్మలములునునగు తమనేత్రములయందుండి బొటబొటగన్నీరుగారగా నొకరినొకరు చూచుకొనుచుండిరి. మనపట్టణములోనుండునట్టి శత్రువులకుశత్రువులును, మిత్రులకుమిత్రులును, ఉదాసీనులకుదాసీనులును, కొంచెమయినను భేదములేక రాముడులేనిదుఃఖముచేత రోదనమును జేసిరి.

కావుననోదశరథమహారాజా! మనయయోధ్యాపట్టము సంతోషమునొందని మనుష్యులుగలదియును, దుఃఖమునుబొందిన యేనుఁగులును, గుఱ్ఱములునుగలదియును, దుఃఖధ్వనిగలదియును, క్షీణించినదియును, నిట్టూర్పులుగలిగి సధ్వనిగలదియును, సంతోషములేనిదియును, రాముని నరణ్యమునకుఁ బంపుటవలనఁగలిగినదుఃఖముచేతవ్యసనమును బొందినదియునై పుత్రహీనురాలగు కౌసల్యవలె, కాంతిహీనమైయున్నదనియె. ఇట్లుసుమంత్రుడుచెప్పిన నాదశరథమహారాజువీనిమహాదీనుఁడైదీనమైనకంఠస్వరముతోఁ గంటనుండినీరుధారధారగబ్రవహించుచుండగా సుమంత్రునిఁ జూచియిట్లనియె.

సుమంత్రుఁడా! పాపమునుజేయునట్టి వంశమునందుఁ బుట్టినదియును, పాపస్వభావముగలదియును, నగు కైకేయి, నీవురామునినరణ్యమునకుఁ బంపుమనినన్నడిగె. ఆసమయమునందాలోచనలనుజేయుటయందుసమర్థులగుముసలివారలతోనాలోచనను జేయనైతిని. మఱియునోసుమంత్రుడా! స్నేహితులు, మంత్రులు, మొదలగువారితోనాలోచింపనైతిని. మనపట్టణమునందలివారలతోనైననాలోచింపనైతిని. ఇట్లుసేయక స్త్రీమూఢవలను చేనాక్షణము రాముని నరణ్యమునకుఁబంపితిని. సూతుఁడా! నిశ్చయముగానీవ్యసనము మనవంశము నశించుటకువచ్చినది. ఇట్లగుటకుసందేహముకొంచెమైనను లేదు. సూతుఁడా! నీకునేనెప్పుడైననుపకారముజేసియుండు నేనియాయుపకారమునకుబదులుగా నన్నురాముడుండుచోటునకుఁదీసికొనిపొమ్ము. నాప్రాణములు నిచునట్లుతోచలేదు. కావునశీఘ్రముగఁగొనిపొమ్ము. ఇప్పుడుగూడ నాయాజ్ఞచెల్లునేని నేనాజ్ఞాపించితినని చెప్పి రామునిమరల నిక్కడకుఁదీసికొనిరమ్ము. నేను రామునివిడిచిజీవింపజాలను. అట్లుగాదేనియో సుమంత్రుఁడా! మహాబాహుఁడగు రాముఁడు మిక్కిలిదూరము పోకమునుపే నన్నురథముమీద నెక్కించుకొని రామునొద్దకుఁదీసికొనిపొమ్ము. గుండ్రమైనపండ్లుగలవాఁడును, పెద్దవిల్లుగలవాఁడును, లక్ష్మణునికంటెముందు బుట్టినవాఁడును, నగు రాముఁడు సీతతోఁగూడనెక్కడనుండునో నన్నక్కడకుఁదీసికొనిపొమ్ము, అక్కడకుఁ దీసికొనిపోతివేని నేను రామునిఁ జూచి బ్రతుకుదును. సుమంత్రుఁడా! ఎఱ్ఱనికన్నులుగలవాఁడును, మహాబాహుఁడును, రత్నకుండలములుగలవాఁడును, నగు రామునిఁజూడకుందునేని నేనుయమధర్మరాజు పట్టణమువకుద్వరలోబోదును. మఱియునోసూతుఁడా! నేనుమరణావస్థనుబొందితిని. ఇట్టియవస్థగలకాలమునం దిక్ష్వాకుకులమునందుఁ బుట్టిన రామునిఁజూడనైతిని. ఇంతకంటెనాకు నధికదుఃఖమేమిగలదు. అయ్యోనే రామునిగన్నులారఁజూడకయే మరణమునుబొందుదును గాఁబోలునని చెప్పి హారామా! హాలక్ష్మణా! తపోవంతురాలావైదేహీ! హాసీతా! నేను దిక్కులేనివానివలె మరణమునుబొందుచున్నాను. ఈవృత్తాంతము మీకేమియును దెలియదుగదా? యనిదశరథుఁడు పరమదుఃఖమునుబొందె. ఇవ్విధ

ముగ నాదశరథమహారాజు దుఃఖపూరితమైన బుద్ధిగలవాఁడును దాటఁగూడని దుఃఖసముద్రమునందు మునిగినవాఁడును, నై కౌసల్యనుజూచియిట్లనియె.

రాణివైనయో కౌసల్యా! నేను రామవియోగమువలనగలిగినదుఃఖసముద్రమునందు మునిఁగితిని. దేవీ! కౌసల్యా! రామునిదుఃఖము మిక్కిలిగొప్పదియైయున్నది. రామదుఃఖమనియెడు వైశాల్యముగలదియును, సీతాపరిత్యాగమనుగట్టును బొందినదియును, నిట్టూర్పులనియెడు తరంగములును, సుళ్లునుగలదియును, కన్నీళ్లనియెడు నురుగునీళ్లచేతఁ గలకఁబాఱినదియును, చేతులువీచుటయనియెడుమత్స్యములసమూహముగలదియును, రోదనధ్వనియనియెడుపెద్దధ్వనిగలదియును, విరియఁబోసికొనఁబడిన తలవెండ్రుకలనియెడు పాచిగలదియును, కైకేయియనియెడుబడబాగ్నిగలదియును, నాకన్నీళ్లవేగమువలనఁ బుట్టినమంథరయొక్కమాటలనియెడు పెద్దమొసళ్లుగలదియును, క్రూరురాలగు కైకేయియొక్కవరములనియెడు జలసమృద్ధిగలదియును, రామునివనమునకుఁ బంపుటయనియెడు నిడుపుగాఁ గలదియును, నగుదుఃఖసముద్రమునమునిగియుండు నేనురాముని జూడకబోతినేని యీదుఃఖసముద్రమును దాటఁజాలను. అయ్యో నేనన్యాయంబుగ నీదుఃఖసముద్రమునందు మునిఁగి చచ్చిపోవుచున్నానేయనిచెప్పి మఱియునిట్లనియె.

సుమంత్రుఁడా! నేనిప్పుడులక్ష్మణునితోఁ గూడనుండు నాపుత్రుఁడైన రామునిఁజూడమనసుగలవాడయ్యునుజూడఁజాలకున్నానే. దీనికంటెనశుభంబేమి కావలయునని చెప్పి దశరథమహారాజు ఘోడుఘోడున విలపించె. మహాకీర్తిశాలియగు నాదశరథమహారాజవ్విధముగ విలపించుచుశయ్యయందుఁబడి మూర్ఛనొందె. ఇవ్విధముగ దశరథమహారాజు రాముని నిమిత్తముగమిగులఁ గరుణముగా రోదనమునుజేసి మూర్ఛనుబొందినపిమ్మట దశరథమహారాజు మూర్ఛనొందుటనుజూచి రామునకేమి యాపదవచ్చునోయను భయముపొంది యుండుటయేగాక మఱల దశరథునకేమియాపద సంభవించునోయను భయముగూడఁ గలదః

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలియేబదితొమ్మిదవసర్గము ముగిసె.

సుమంత్రుఁడరణ్యమున నివసించుసీతాదేవి వృత్తాంతమును జెప్పుట.

పిమ్మటఁ గౌసల్యాదేవి "దయ్యముపట్టినదానివలె,, భూమియందుఁబడి మాటిమాటికినిబొరలుచుఁ బ్రాణములులేనిదానివలెనున్నదగుచుసుమంత్రునిగూర్చియిట్లనియె.

సుమంత్రుఁడా! రాముఁడున్నచోటునకునన్నుఁగొనిపొమ్ము. అచ్చటనేసీతాలక్ష్మణులుగూడనుందురు. గావుననన్నక్కడకుఁగొనిపొమ్ము. ఆసీతారామలక్ష్మణులను వదలినేనక్షణమాత్రముగూడఁజీవింపఁజాలను. సుమంత్రుఁడా! శీఘ్రముగారథమునుమరలమరలింపుము. నన్నురథముమీఁదనెక్కించుకొని దండకారణ్యమునకుఁ దీసికొనిపొమ్ము. నన్నుసీతారామలక్ష్మణులునివసించుచుండు చోటునకుఁబిలుచుకొనిపోకపోతివేని నేనుయమలోకమునకుఁ బోదునని చెప్పె. ఇట్లుకౌసల్యాదేవిచెప్పఁగా సుమంత్రుఁడు చేతులను ముకుళించుకొనికన్నీళ్లుధారధారగ బ్రవహింపగా గద్గదస్వరముగలవాఁడై యతికష్టముగాఁ గౌసల్యను ఓదార్చుచునిట్లనియె.

అమ్మాకౌసల్యా! నీవుదుఃఖమునుబొందకుము. మఱియునురామునకేమి సంభవించునోయను భ్రాంతినివదలుము. ఇంతయగాక దుఃఖమువలనఁ బుట్టినవ్యాకులత్వమును విడిచిపెట్టుము. రాముఁడుకొంచెమైనను సంతాపమును బొందకవనమునందు నివసింపఁగలఁడు. మఱియునోకౌసల్యా! ధర్మజ్ఞుఁడగులక్ష్మణుఁడుగూడ జితేంద్రియుఁడై యడవియందు రామునియొక్కపాదములనుసేవించుచుఁ బరలోకసుఖమును సంపాదించుకొనుచున్నాఁడు. సీతాదేవి నిర్జనారణ్యమునందు నివసించియును నింటియందున్నదానివలెనే కొంచెమైననుభయములేనిదై యడవియందేయుండుటకిష్టముగలదైయున్నది. ఆసీతకొంచెమైనను దైన్యమునుబొందలేదు. కావునవిచారింపఁగా సీతాదేవివనవాసమునకుఁదగినదానివలెనే నాకుఁదోఁచుచున్నది. పూర్వమునందుమనసీతాదేవి యుద్యానమునందెట్లు విహరించుచుండెనో యట్టులనే నిర్జనమగువనమునందుఁగూడఁ విహరించుచున్నది. పూర్ణచంద్రునివంటిమోముగలదియును, మహాపతివ్రతయును, సుందరియునునగు సీతాదేవిరామాధీనమైనమనస్సుగలదైనిర్జనారణ్యమునందు" బాలికవలెఁ" క్రీడించుచున్నది. (అనఁగాఁబసిబిడ్డవలెనాడుకొనుచున్నది.) మఱియునిసీతయొక్కమనస్సును, జీవితమును రామాధీనమైయున్నది. రాముఁడులేనియెడల నీయయోధ్యాపట్టణము సీతాదేవికరణ్యమువలె నుండునని చెప్పి యాసుమంత్రుఁడు మరలనిట్లనియె.

అమ్మా! కౌసల్యా! సీతాదేవి అయోధ్యాపట్టణమునకుఁ గ్రోసుమారముపోయివిహరించుదానివలెనున్నది. మఱియును, మార్గమధ్యమందుసంతోషముతో గ్రామములను, పట్టణములను, నదులను, నానావిధములగువృక్షములనుజూ

చి రామునినైనను, లక్ష్మణునినైనను, వాని పేరులనడిగి తెలిసికొనిరమ్మని చెప్పియా మహాత్ముడు సీతకై కేయినిగుఱించి యొక్క మాటను జెప్పెననియా మాటను జెప్పదలఁచి, యా మాటను జెప్పితినేని యీ కౌసల్యాదశరథులు మిగులను బొందుదురేమోయని సందేహించి సీతకై కేయినిగుఱించి చెప్పినవిధమునఁ జెప్ప, యంతలో నా సంగతిని నేను మఱచిపోతిననియె. పొరబాటున నోరుజాఱి వచ్చిన యా మాటను గప్పిపెట్టి, కౌసల్యాదేవికి సంతోషమును గలిగించునట్టి మనోహరమైన నింకొక మాటను జెప్పదలఁచి యిట్లనియె

అమ్మా కౌసల్యా! విశేషకాలము మార్గము నునడచుటచేతను, విశేషముగా గాలికొట్టినను, పెద్దపులులను జూచినను, ఎండవేడిమి కలిగినను, చంద్రకిరణములవలె మృదువైన సీతాదేవియొక్క శరీరకాంతి వికారమునొందకున్నదనియె. మఱియు నో కౌసల్యా! కమలమునకు సమానమైనదియును, పూర్ణచంద్రతుల్యమైన దేహకాంతిగలదియునునగు నా సీతాదేవియొక్క మొగము కొంచెమైనను వాడిపోకయున్నది. లక్షారసమువలె నెఱ్ఱని కాంతిగల యాదేవియొక్క పాదము లిప్పుడు లక్షలేకపోయినను, వనములో నడతెగక సంచరించుచున్నను దామరమొగ్గల కాంతివంటి కాంతిగలవై మిగుల మనోహరముగఁ బ్రకాశించుచున్నవి. మఱియు నిప్పటికి భూషణములయందలి యాశవలన సకలాభరణములను ధరించుకొని యందెలమ్రోతకు దగిన విలాసముగలదై యా సీతాదేవి యరణ్యమునందుఁ బోవుచున్నది గాని దుఃఖముగలదానివలెఁ బోవుచుండడము లేదు. రామునిబాహువులచే రక్షింపబడుచుండుటవలన నా సీతాదేవి యేనుఁగును జూచినను, సింహమును, జూచినను, పెద్దపులినిజూచినను, భయమును బొందడము లేదు. ఆ సీతారామలక్ష్మణులు ముగ్గురు నరణ్యమునందుండవలసివచ్చెనేయను దుఃఖముగలవారు గారు. కావున మనము వారలగుఱించి దుఃఖమును బొందుట యుచితము గాదు. మఱియు నా సీతారామలక్ష్మణులను గుఱించిగాని, యీ దశరథునిగుఱించిగాని, మనను గుఱించి గాని దుఃఖమును బొందఁదగదు. రాముఁడు పితృవాక్యపరిపాలనను జేసెను కీర్తి సూర్యచంద్రులున్నంతవఱకును నుండును గాన మనమీవిషయమునందు సంతోషమునే బొందవలయును. ఆ సీతారామలక్ష్మణులు ముగ్గురును దుఃఖమును వదలి సంతోషముచేత ఋషీశ్వరుల యాచారము నవలంబించి తండ్రిచేసిన ప్రతిజ్ఞను బరిపాలించుచున్నారని సుమంత్రుఁడు చెప్పె. ఇట్లు సుమంత్రుఁ డెన్నివిధముల నోదార్చినను, పుత్రశోకముచేతఁ గృశించిన యా కౌసల్యాదేవి హా పుత్రుఁడా! హా రామా! యని విడువక యేడ్చుచునే యుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యఱువదవసర్గము ముగిసెను.

—(కౌసల్యాదేవి సీతారామలక్ష్మణుల గుఱించి దశరథుని నిందించుట.)—

పరమధర్మాత్ముఁడును, లోకాభిరాముఁడునునగు రాముఁడు వనమును బొందఁగానే కౌసల్య యపరిమితమగు దుఃఖముచేత రోదనమును జేయుచుఁ బెనిమిటియగు దశరథుని జూచి యిట్లనియె.

దశరథమహారాజా! నీవు మిక్కిలి దయగలవాఁడవని ముల్లోకములయందును బ్రసిద్ధమైన కీర్తిని బొందితివి. అట్లు సుప్రసిద్ధమగు కీర్తికంటెను అతిశీఘ్రముగా ముల్లోకములయందును వ్యాపించునట్టి యపకీర్తిని బుట్టించు కార్యమును జేసితివి. మానవోత్తముఁడవైన యో దశరథుఁడా! సుఖముగా నింతవఱకు వృద్ధిబొందిన రామలక్ష్మణులు సీతతోఁ గూడ నరణ్యమునందుండి వనవాసదుఃఖము నెట్లు సహింతురు. పూర్ణముగ యౌవనమును బొందినదియును యౌవనమధ్యస్థురాలును, సుకుమారశరీరము గలదియును, సుఖమునే పొందఁదగినదియును, నగు మన సీత యడవులయందు సంచరించుచు నందలి శీతోష్ణముల నెట్లు సహింపఁగలదు. దశరథమహారాజా! ఎంతటి క్రూరకృత్యమును జేసితివి. విశాలములైన నేత్రములుగల సీతాదేవి యిదివఱకు మిగుల రుచిగల యన్నము గాయలతోఁ గూడినదియును, మిక్కిలి మనోహరమైనదియునునగు నాహారమును దినుచుండెనుగదా? అటువంటి సీత యికమీఁద బిత్తకపండైన తృణధాన్యము నెట్లు భక్షింపఁగలదు. మఱియు ననిందితురాలగు సీతాదేవి, గానములయొక్కయు, వాద్యములయొక్కయు ధ్వనిని వినుచుండెను. అట్టి సీత యికమీఁద మాంసమే యాహారముగాగల సింహములయొక్క ధ్వని నెట్లు వినఁగలదు. దేవేంద్రునియొక్క టెక్కెముతో సమానుఁడును, గొప్పవగు భుజములుగలవాఁడును, మహాబలుఁడును, నగు రాముఁడు తనపరిఘతో సమానమైన బాహువును, దలగడగాఁ బెట్టుకొని యెక్కడఁ బడి నిద్రించుచున్నాఁడో కదా? దశరథమహారాజా! కమలముయొక్క వన్నెవంటి వన్నెగలదియును, సుందరములగు తలవెండ్రుకలయొక్క కొనలుగలదియును, పద్మగంధమువలెఁ బరిమళించుచున్న నిట్టూర్పు వాయువుయొక్క గంధముగలదియును, కమలములవంటి కండ్లుగలదియును, రామునియొక్క ముఖము నే నెప్పుడు చూడఁగలను. దశరథమహారాజా! నా హృదయము వజ్రసారమైనది. అందు కేమియును సందేహము లేదు. అట్లుగాదేని రాముఁడు పోయినతోడనే నా మనస్సు వే

యుపకీయులుగా నుండువా? నాతోను గనుక నాపుత్రదయముచేసను చేసినిప్పుడు బతికినదనుటకుఁ గొంచెమైనను సందేహము లేదు. సర్వకాలములయందును సుఖమును బొందుటకుఁ దగినవారును, నాకు బంధువులును, నగు సీతారామలక్ష్మణులను నిర్నిమిత్తముగ నరణ్యమునకుఁ బంపితివి. అనాయుధిదయులేకచేసిన కార్యమనుటకు సందేహమేమైనఁగలదా? దయాహీనుఁడవై యెంతటియకార్యమును జేసితివి. దశరథమహారాజా! రాముఁడు పదునైదవసంవత్సరమునందు మరల నీయయోధ్యాపట్టణమునకు వచ్చెనేని భరతుఁడు రాజ్యకోశములను రామునకిచ్చునని నాకుఁదోచలేదు.

శ్లో॥ భోజయంతికిలశ్రాద్ధేకేచిత్స్వానేవబాంధవాన్। తతఃపశ్చాత్సమీక్షంతే కృతకార్యాద్విజర్షభాన్॥ తత్రయేగుణవంతశ్చ విద్వాంసశ్చద్విజాతయః। నపశ్చాత్తేభిమన్యంతే సుధామపిసురోపమాః॥ బ్రాహ్మణేష్వపితృప్తేషు పశ్చాద్భోక్తుంద్విజర్షభాః। నాభ్యుపైతుమలంప్రాజ్ఞాశ్శృంగచ్ఛేదమివర్షభాః॥ లోకములో బ్రాహ్మణులలోఁగూడఁగొందఱు తమసామ్మతమవారికే చేరవలయునని యెడునాశతో శ్రాద్ధములయందుముందుగాఁ దమబంధువులకే యన్నమును బెట్టెదరు. పిమ్మటఁ దమకార్యములనెరవేర్చుకొని బ్రాహ్మణోత్తములగువారల కన్నమును బెట్టుదురు. ఆబ్రాహ్మణులలోఁగూడగుణవంతులును, పండితులును, దేవతలతోసమానులునునగు బ్రాహ్మణోత్తములు గొందఱు శ్రాద్ధకాలములయందుఁ బిమ్మటఁబెట్టెడునన్నమును భుజించుటకుసమ్మతింపరు. మొదటభోజనమును జేసి తృప్తినిబొందినవారు బ్రాహ్మణోత్తములేమైనను, పండితులగుబ్రాహ్మణులు "ఆబోతులుతమకొమ్ములను నఱకుటను సమ్మతింపనివిధముగఁ" బిమ్మటిభోజనమునకు సమాధానమునుబొందరు. మానవాధిపా! దశరథమహారాజా! జ్యేష్ఠుఁడును, శ్రేష్ఠుఁడుననగురాముఁడు ముందుఁగఁగనిష్ఠుఁడైన తమ్మునిచేననుభవింపఁబడిన రాజ్యమునననుభవించుటకు సమ్మతించుననినాకుఁదోచదు. ఉత్తముఁడగువాఁడుతమ్ముఁడనుభవించినదాని నేలఁగోరును. "పెద్దపులియితరమృగములచేత ననుభవింపఁబడి విడిచిపెట్టఁబడిన మాంసమునుభుజింపనివిధముగ" నరవ్యాఘ్రుఁడైన రాముఁడుగూడ నితరునిచేభుజింపఁబడిన రాజ్యమునుగోరునని నాకుఁదోచలేదు. తోచదనిచెప్పనేల? "రాముఁడనుభవింపనే యనుభవింపఁడు. హవిస్సు, నేయి, పురోడాశము, దర్భలు, ఖాదిరములగుయూపస్తంభములు, మొదలగువానినితొలుత నొకయజ్ఞమునందుపయోగించినపిమ్మట మఱియొకయజ్ఞమునందు వానినేయుపయోగింపరుగదా? ఆప్రకారముగానే రాముఁడు పరులనుభవించిన రాజ్యములభించినను, "మఱియొకనిచే ననుభవింపఁబడిసారముగలమద్యమువలెను" "నశించినసోమలతగలయజ్ఞమువలెను" దానినెంతమాత్రమును గోరఁడు. అతికోపనుఁడగురాముఁడీయవమానమునుపొందనేర్చఁడు. ఆరాముఁడు కోపోద్రిక్తుఁడయ్యెనేని మందరపర్వతమునుగూడఁదనబాణములచేత తుత్తునియలుగఁజేయును. అటువంటిసామర్థ్యముగలవాఁడయ్యును, పితృగౌరవమువలన నిన్నుఁజంపుటకు సమ్మతములేనివాఁడయ్యె. చంద్రుఁడు, సూర్యుఁడు, నక్షత్రములు, మొదలగునవిగలయాకాశమునుగూడ నారాముఁడు క్రోధోద్రిక్తుఁడయ్యెనేని క్రిందఁబడవేయును. ఇంతయగాక యనేకములగునదనదీసముద్రపర్వతాదులతోఁగూడిన భూమినిసర్వమును క్షోభనుబొందింపఁగలఁడు. స్వర్గమునున్న క్రిందపడద్రోయఁగలఁడు. అటువంటిసామర్థ్యముగలరాముఁడు పితృగౌరవముచేత నీమాటనుజవదాటనివాఁడయ్యె. "మిక్కిలిబలముగలపెద్దపులి తనతోకనునితరుఁడు దాఁకుటను సహింపనివిధముగ" రాముఁడుగూడనిటువంటి యవమానకరమగు కార్యమును సహించువాఁడుగాఁడు. ముల్లోకములునొక్కటైవచ్చి యుద్ధమును జేసినను రాముఁడుభయమును బొందువాఁడుగాఁడు. అట్టిసామర్థ్యముగలవాఁడయ్యును ధర్మవిహీనమగులోకమునుధర్మిష్ఠముగాఁ జేయుచున్నాఁడు. మఱియునో దశరథమహారాజా! మహాపరాక్రమశాలియును, మహాబాహుఁడును, నగునీరాముఁడు, ప్రళయకాలమునందలి యగ్నిహోత్రము, పంచమహాభూతములను దహించువిధముగ సువర్ణమయములగుబాణములచేత సముద్రములనైనను దహింపఁజేయఁగలఁడు. అట్టిసామర్థ్యముగలవాఁడును, సింహబలుఁడును, ఆబోతుయొక్కనేత్రములవంటి విశాలములగునేత్రములుగలవాఁడును, పురుషోత్తముఁడును, నగునీరాముఁడు, తండ్రివగునీచేత, "మత్స్యములుఁదనబిడ్డలను జంపినవిధముగఁ" గొట్టఁబడెను. (అనఁగాఁ జేపలు తమబిడ్డలనుదామేచంపినట్లు నీబిడ్డనునీవెచంపితివి) ఓదశరథమహారాజా! పరమధర్మాత్ముఁడగు నీకుమారుని నరణ్యమునకుఁబంపితివిగదా? ఇటువంటినీకుఉత్తములగుద్విజులచే ననుష్ఠింపఁబడినదియును, శాస్త్రములలోఁజెప్పఁబడినదియును, సనాతనంబునునగు ధర్మమునీకెట్లుగలుగును. "శ్లో॥ గతిరేకాపతిర్నార్యా ద్వితీయాగతిరాత్మజః। తృతీయాజ్ఞాతయోరాజం శ్చతుర్థీనేహవిద్యతే,, దశరథమహారాజా! స్త్రీలకు మొదటిగతి ముఖ్యముగా భర్తయనియుందురు. రెండవదిపుత్రుఁడు. మూడవదిజ్ఞాతులు.

నాల్గవగతి యీప్రపంచమునం దేదియును లేదుగదా? ఈ మూఁడుగతులయందును, నీవు నాసవతికి వశ్యుడవైతివిగావున నీవు నాకుగతియని చెప్పుటకు వీలులేదు. రాముఁడుండ లేదాయెనిన నతఁడరణ్యమునకుఁబోయె. ఇప్పుడు నీవున్నావుగనుక నేను రామునితోఁగూడ నరణ్యమునకుఁబోక నిలిచితిని. నీవుండగా నితరబంధువుల నాశ్రయించుట నాకుచితమైనధర్మముగాదు. కావున సకలవిధములచేతను నీవు నన్ను నాశమువొందిన దానినిగా జేసితివి. ఇఁక నాకుగతి యెవ్వరు. నీవనేకరాజ్యములతోఁ గూడిన యీకోసలదేశమును సర్వమును నాశనమగునట్లు జేసితివి. మఱియు నీవు మంత్రులతోఁ గూడ హతుఁడవైతివి. కొడుకుతోఁగూడ నేనును నీచే హతమైతిని. మనమందఱమును హతులమగుటచేత మనపట్టణములోనున్నవారందఱును హతులైరి. ఇందఱనిట్లు చంపి పుత్రుఁడగు భరతునకును, భార్యయగు కైకకును, సంతోషమును గలిగించితివి. ఆహా యెంతటి క్రూరకృత్యమును జేసితివని కౌసల్య బహువిధముల దశరథుని నిందించె. ఆదశరథమహారాజవ్యధముగఁ గౌసల్యాదేవి పలికిన కఠినవాక్యములను విని మూర్ఛనొందె. అంతఁగొంతసేపటికి మూర్ఛదేరి యంతటదుఃఖమునకుఁ గారణభూతమైనదియును, పూర్వమునందు దాను జేసినదియును నగు పాపకృత్యమును దలఁచుకొని యధికముగ దుఃఖమును బొందె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యరువదొకటవసర్గముగిసెను.

—{ కౌసల్య తాను నిందించినందుకు మన్నింపుమని దశరథుని ప్రార్థించుట. }—

ఇట్లు దశరథమహారాజు, మహాదుఃఖముతోఁ గూడినదియును, కోపముగలదియును, రామునకుఁదల్లియును, నగు కౌసల్యచేత జెప్పఁబడిన కఠినమైనవాక్యమును విని యధికముగ దుఃఖముగలవాఁడై జరిగినకార్యములనెల్ల యాలోచించె. అట్లు కొంచముసేపు ఆలోచించి వ్యాకులేంద్రియుఁడై మరలమూర్ఛనొందె. అట్లుమూర్ఛనొంది శత్రుమర్దనుడగు నాదశరథుఁడు చిరకాలమునకు మూర్ఛఁదేఱె. మఱియు నాదశరథుఁడు మూర్ఛదేరినతోడనే వెచ్చనినిట్టూర్పులను వదలుచుఁ దనప్రక్కనున్న కౌసల్యను జూచి మరల విచారమును బొందెను. అట్లు విచారమును బొంది యాదశరథమహారాజు పూర్వమరణ్యమునందుఁ దాను శబ్దవేదియను విద్యచేతఁ జేసిన క్రూరకృత్యమును జ్ఞప్తికి తెచ్చుకొనెను. అట్లావిషయము జ్ఞప్తికివచ్చినతోడనే దుఃఖవంతుఁడైయున్న యాదశరథమహారాజు పుత్రుఁడగు రామవియోగదుఃఖముచేతను, మునుపటికంటె నధికముగఁ బరితాపమునొందుచుండె. రాజేన్ద్రుఁడగు నాదశరథమహారాజట్లు రెండువిధములగు దుఃఖములచేతను బరితాపముగలవాఁడును, వణఁకుగలవాఁడును నగుచుఁ దలవంచుకొని చేతులను ముకుళించుకొని నోదార్చుటకొఱకుఁ గౌసల్యను జూచి యిట్లనియె.

ఓకౌసల్యా! నీవు ప్రసన్నురాలవగుము. నేను జేతులను ముకుళించియడుగుచున్నాను. నీవు పగవారలయందుఁగూడ దయగలదానవును, మంచిమనసుగలదానవును గదా? మఱియు నోకౌసల్యా "శ్లో॥ భర్తాతుఖలు నారీణాం గుణవాన్ నిర్గుణోపివా। ధర్మంవిమృశమానానాం ప్రత్యక్షం దేవి దైవతమ్,, ఓకౌసల్యాదేవీ! ధర్మస్వభావముగల స్త్రీలకుఁ బెనిమిటి గుణవంతుఁడైనను, నిర్గుణుండైనను, నతఁడే ప్రత్యక్షదైవమని పెద్దలు పలుకుదురు. ఓకౌసల్యా! నీవు సర్వకాలములయందును ధర్మస్వభావముగలదానవు. లోకమునందలి గుణాగుణములను జక్కఁగఁ దెలిసినదానవు. ఇటువంటి నీ వెంతదుఃఖమును బొందియున్నను, నాకు మహాదుఃఖమును గలిగించునట్టి కఠినమైనమాటలచే నిందింపదగదని జెప్పె. ఇట్లు అతికరుణముగాఁ జెప్పిన దశరథుని మాటను కౌసల్యాదేవి విని వర్షాకాలమునందు జలదారులు క్రొత్తజలమును వదలువిధముగఁ గన్నులనుండి మహాప్రవాహమువలె జలమును వదలె. మఱియు నా కౌసల్యాదేవి యధికమైనభయముచేత దుఃఖమును బొందుచు గమలమునకుఁ దుల్యమగు దశరథమహారాజుయొక్క నంజలిపుటమును నెత్తియందు బెట్టుకొని సంభ్రమముచేతఁ దొట్రుపడుచు నిట్లనియె.

ప్రాణనాథా! దశరథమహారాజా! ప్రసన్నుఁడవగుము. క్షమింపుము. శిరస్సుతో నమస్కారమును జేసి ప్రార్థించెదను. నేను గ్రిందఁబడినదాన నగుచున్నాను. భర్తవగు నీచేత నేను యాచింపఁబడినదాననైతిని గానఁ బాపిష్ఠురాలనైతిని. కావున నీవు నన్ను జక్కగా మర్దింపవచ్చును. "శ్లో॥ నైషాహిసా స్త్రీభవతి శ్లాఘనీయేన ధీమతా। ఉభయోర్లోకయోర్వీర పత్యాయాసంప్రసాద్యతే॥ పరాక్రమవంతుఁడవైన యోదశరథమహారాజా! స్తోత్రార్హుఁడగు పెనిమిటిచేత స్తోత్రము జేయఁబడిన యాడుది రెండులోకములయందును సౌఖ్యమును బొందఁజాలదని పెద్దలు పలుకుదురు. ధర్మాత్మా! దశరథమహారాజా! నేనును ధర్మమును గుర్తెఱుఁగుదును. నీవు సత్యవాదివనియును నెఱుఁగుదును. అయినను నేను పుత్రశోకముచేత దేహము జలియక యనుచితమైన కొన్నిమాటలనంటిని. కావున మన్నింపవలయును. "శ్లో॥ శోకోనాశయతే ధైర్యం శోకోనాశయతే శ్రుతం। శోకోనాశయతె సర్వం నాస్తిశోకసమోరిపుః,, దశరథ

ధూవల్లభా! దుఃఖముచేతధైర్యమునశించిపోవును. దుఃఖముచేతవిద్యయునునాశమునుబొందును. మఱియుదుఃఖముచేతసర్వము నాశమునుబొందును కావునదుఃఖమువంటి శత్రువెవ్వఁడునులేడు. మఱియు నోదశరథమహారాజా! "శ్లో॥ శక్యఆపతితస్సోఢుంప్రహారోరిపుహస్తతః। సోఢుమాపతితశ్శోకస్సుసూక్ష్మోపినశక్యతే,, శత్రువుయొక్కచేతనుండి తటాలునఁబడినదెబ్బనెట్లయినను సహింపవచ్చును. అటులనేతటాలునవ్యసనముగలిగెనేని యదిమిగులస్వల్పమైనను సహింపశక్యముగాదు. మహాపరాక్రమముగలయోదశరథమహారాజా! ధర్మమునెఱిఁగినవారును, వేదములనుజక్కఁగఁజదివినవారును, ధర్మార్థములయందు సంశయములేనివారును, నగుమునీశ్వరులుగూడ దుఃఖమువచ్చునప్పుడుజ్ఞానములేనివారగుదురు. రాముఁడుఅరణ్యవాసమునుజేయుటకుఁబోయి నేటికైదుదినములైనవి. సంతోషములేక పుత్రశోకముచేత దుఃఖమునుబొందుచున్ననాకీయైదుదినములును నైదుసంవత్సరములవలె నున్నవి. మఱియునారామునేసర్వకాలములయందును జింతించుచున్ననామనస్సనంవలి యీదుఃఖమునదులయొక్కయుదకముచేతసముద్రోదకమువలె వృద్ధిబొందుచున్నదనియె. ఇవ్విధముగ కౌసల్యాదేవిమంగళకరమగు మాటలనుజెప్పుచుండఁగానే సూర్యుఁడస్తమయమునుబొందె. అంతఁగొంతసేపటికిరాత్రివచ్చె. అంతటనాదశరథమహారాజు రాణియగుకౌసల్యచెప్పినమాటలచేత నూరడింపఁబడి పరిమదుఃఖముగలవాఁడయ్యునునిదురనుబొందెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలియిరువదిరెండవసర్గముగిసె.

దశరథమహారాజు తానుఋషిపుత్రుని చంపిన వృత్తాంతమునుకౌసల్యతోచెప్పుట.

అటుపిమ్మటనాదశరథమహారాజు క్షణమాత్రములోపలనేమెళకువగలవాఁడై యధికమైన దుఃఖముగలవాఁడగుచువిచారమునుబొందె. అంతటనాదశరథమహారాజు రామలక్ష్మణులనడవికిఁబంపుటచేత "రాహుగ్రస్తసూర్యునివిధముగ,, మహోపద్రవమునుబొందె. మఱియును రాముఁడుసీతాదేవితోఁగూడయరణ్యమునకుఁ బోయినపిమ్మటఁగోసల దేశాధీశ్వరుడగునాదశరథమహారాజుతానుమునుపుచేసినపాపమునుదలఁచుకొని నల్లనికడకంట్లుగల కౌసల్యతోఁ దానుపూర్వముచేసిన పాపకృత్యమునుజెప్పఁదొడంగె. ఇట్లురాముఁడరణ్యమునకుఁబోయినయీఆఱవనాటియర్ధరాత్రియందు తానుజేసినపాపమునుదలఁచుకొనుచుండె. పుత్రశోకార్తుఁడైన యాదశరథమహారాజు తనపాపమునుజ్ఞప్తికిదెచ్చుకొనిపుత్రశోకముచేతఁ బీడింపఁబడినకౌసల్యనుగూర్చియిట్లనియె.

"శ్లో॥ యదాచరతికల్యాణి శుభంవా యదివాశుభం। తదేవలభతేభద్రేకర్తాకర్మజమాత్మనః,, మంగళస్వరూపిణివగునో కౌసల్యా! లోకములో మానవుఁడెటువంటిపాపకార్యమునుజేయునో యటువంటికర్మకుఁదగినఫలమునుబొందును. ఎటువంటిపుణ్యకార్యమునుజేయునో దానికిఁదగినపుణ్యఫలమునుబొందుననుటనిశ్చయము. "శ్లో॥ గురులాఘవమర్థానామారంభే కర్మణాంఫలం। దోషంవాయోనజానాతి సబాలఇతిచోచ్యతే,, లోకములోనెవ్వఁడుకార్యములను ప్రారంభించునపుడు కార్యములయొక్కయెచ్చుతక్కువలనుగుణదోషములను గుర్తెఱుఁగఁడో అట్టివానినేపండితులుమూఢుడనిచెప్పుదురు. "శ్లో॥ కశ్చిదామ్రవణంఛిత్వాపలాశాంశ్చనిషించతి। పుష్పందృష్ట్వాఫలేగృధ్నుస్సశోచతిఫలాగమే,, లోకములోనెవ్వఁడు, మిగులగొప్పగాను, మనోహరముగాను నుండుమోదుగుపువ్వులనుజూచియీపుష్పమునకుఁదగినఫలములే యీచెట్లవలనఁబుట్టునని యెంచి, చిన్నచిన్నపువ్వులుగలమామిడిచెట్లవలనచిన్నచిన్నఫలములేగదాపుట్టునని యామామిడిచెట్లనునఱికిమోదుగచెట్లకునీళ్ళనుబోసిపెంచుచువచ్చి తుదకుదానుతలచినట్లు ఫలములనుబొందలేక వ్యసనమునుబొందును. "శ్లో॥ అవిజ్ఞాయఫలంయోహికర్మత్వేవానుధావతి। సశోచేత్ఫలవేళాయాంయథాకింశుకసేచకః,, లోకములోనేపురుషుఁడుకార్యములయొక్కఫలములనెఱుంగకమనస్సునకుదోచినట్లెల్లకార్యములనుజేయునో యట్టివాఁడుమామిడివృక్షములనఱికిమోదుగుచెట్లనుబెంచినవానివలెదుఃఖమునుబొందును. అటులనేమర్మతినగునేనుగూడమామిడిచెట్లనునఱికిమోదుగుచెట్లకునీళ్ళనుబోసినవాఁడనైతిని. ఫలకాలమునందురామునివదలిపిమ్మట దుఃఖమునుబొందుచున్నాను. ఓకౌసల్యా! ఈలోకములోచిన్నప్పుడు నేనుజనులచేతశబ్దమునెఱిఁగికొట్టివేయువాఁడనని ప్రసిద్ధినిగాంచితిని. ధనుష్మంతులలోమిక్కిలిశ్రేష్ఠుఁడుగనుంటిని. అట్టినేను బాల్యమునందొక పాపమునుజేసియున్నాను. మఱియు నోకౌసల్యా! ఈలోకమునందుఁబిల్లవానిచేత నజ్ఞానమువలనవిషముభక్షింపఁబడినట్లు నేనుగూడనవివేకమువలన నిటువంటిదుఃఖమునుగలిగించునట్టి పాపమునుజేసితిని. మఱియులోకములోనజ్ఞానుఁడగు పురుషుఁడు పువ్వులుమంచిదిగానుండుటచేత ఫలములుగూడమంచిదిగానుండుననితలఁచినవిధముగానేనుగూడ భ్రాంతిగలవాఁడనై మృగమ

నిత్యలఁచుపోని గతిగాఁబట్టిబాణమువేసి మునిపుత్రునిఁ
జంపిదానికిఁ దగినఫలమునులోక ప్రసిద్ధము గానుండునట్లు
సుభవించుచున్నాను. మొట్టమొదట మంచిఫలముగలుగున
నితలంచిదుష్కార్యమును జేసినందు కిట్టిఫలముననుభవించు
చున్నాను దేవీ! కౌసల్యా నేనుచిన్నతనమునకూ్రరకార్యము
నుజేసినప్పుడునిన్నప్పటికి వివాహము జేసికొనలేదు. ఆకాల
మునందుమాతండ్రిగారుజీవించియుండిరి. నేనుయువరాజప
ట్టాభిషిక్తుడనైయుంటిని. అట్టికాలమునందొకప్పుడుకామము
ను, మదమునువృద్ధిబొందించునట్టి వర్షాకాలమువచ్చిన
దయ్యెఁ. సూర్యుఁడు, తనకిరణములచేత భూమియందలి
యుదకములనుగ్రహించి భూమినితపింపఁజేసి ప్రేతపతి
యగు యమునియొక్క దిక్కును, (అనఁగాదక్షిణదిక్కు
న) బొందె. అంతటనుష్ణమునశించె. అప్పుడుచల్లనిమేఘ
ములుదయించె. అంతటఁగప్పలును, చాతకపక్షులును, నె
మళ్లును, పరమసంతోషమునుబొందె. ఆసమయమునందు
పక్షులన్నియును దడిసిన తెక్కలఘుఁదిభాగములుగలవై
స్నానమును జేసినవానివలెనుండె. అట్లుతెక్కలుతడు
పఁబడినవై వానగాలిచేతఁగదల్పఁబడిన కొమ్మలుగలవృ
క్షములను మిగులఁగష్టముతో నెక్కినవయ్యె. భూమిమీద
పడినదియును, పడుచున్నదియును, నగునుదకముచేతఁగ
ప్పఁబడికదలమెదలలేక మదపుటేనుఁగునిశ్చలమైన సము
ద్రమువలెఁ బ్రకాశించినదయ్యె జలములుసహజముగఁ
దెల్లనివయ్యెను, గైరికాదిధాతువులు మిశ్రములగుటచే
తనొక్కచోటఁదెల్లనివియును, మఱియొక్కచోట నెఱ్ఱ
నివియును, నైకార్చిచ్చుయొక్కబూడిదతోఁగూడిన సర్ప
ములువలెఁ గుటిలముగాఁబ్రవహించినవయ్యె. నిర్మలము
లగుజలములు వర్షముగురియుటచేత బురదతోఁగూడి నెఱ్ఱ
నివైమిట్టపల్లములయందునుగూడఁ బ్రవహించుచుండె. ఇట్లు
సర్వప్రదేశములును సుఖకరంబుగనుండు కాలమునందునా
కువేటాడవలయుననికోరికగలిగె. అంత నేనుధనుర్బాణము
లనుధరించిరథమునెక్కి సరయూనదియొడ్డునకుఁబోతిని. అ
ట్లుపోయిజితేంద్రియుఁడనైననేనునీళ్లుత్రాగను ప్రదేశము
నకు నేనుగైనను, దున్నపోతైనను, మఱియేదైనను వచ్చిన
యెడలబాణముచే గొట్టవలయుననితలఁచియుంటిని. అ
ట్టిదురభిప్రాయముగలవాఁడనై నేనారాత్రియంతయును స
రయూనదియొక్క రేవునందురహస్యముగా ధనువునెక్కు
పెట్టుకొనిమిగులజాగ్రతతోఁ బొంచియుంటిని. అచ్చట నేను
రహస్యముగానుండినాకువినవచ్చినశబ్దమునుగుఱిపట్టి యా
సరయూనదీతీరమునకువచ్చినయడవి మృగమునొక్క
దాని, మఱియొకకూ్రరమృగమునుజంపితిని. అటుపిమ్మట
ఁజీకటిపడు నారాత్రిసమయమునందు నదీజలమునఁదొ
క్కనుముంచుకొనుచుండు బుడబుడమనునొక శబ్దమునువిం
టిని. ఆధ్వనియేనుగయొక్క ధ్వనివంటి ధ్వనిగలదిగనుం
డె. ఆధ్వనిమాత్రము నాదృష్టిగోచరముగాని స్థలమున
నుండివినవచ్చెను. ఆధ్వనినివిని నేను యొక్కడనో నొకయే
నుగుజలపానము జేయుచున్నది. కావుననాయేనుగను జం
పవలయునని తలంచితిని. అట్లుతలంచి నేనుశబ్దవేదిత్వశక్తి
గలవాఁడగుటవలన నీశబ్దంబింతదూరమునందుండియే వచ్చి
యుండునని నిశ్చయించి మహాప్రకాశముగలిగి సర్పము
తోసమానముగనుండు బాణమునెత్తి యేనుఁగుమీదబా
ణమునేయగోరిధ్వనినిగూర్చిగుఱిపెట్టిబాణమునుప్రయోగిం
చితిని. అయ్యో, కౌసల్యా! నేనేమిచెప్పుదును. ఆతత్క్షణము
ననేనేదిక్కునఁదీక్ష్ణమగుబాణమును బ్రయోగించితినో యా
దిక్కుననుండి యొకఋషిపుత్రునియొక్కదీనధ్వని వినఁబడి
యె. మఱియునాబ్రాహ్మణపుత్రుడు నాబాణముచేత భే
దింపఁబడిన మర్మస్థానముగలవాడైహాతండ్రీ! చచ్చితినిగ
దా! యనికూతబెట్టె. అట్లుబాణమును బ్రయోగించినతో
డనేకలిగిన యాఋషిపుత్రునియొక్క కూతనువింటిని. ఆసమ
యమునందాఋషిపుత్రుఁడు నేనుతపోవంతుడనైన ఋషి
పుత్రుఁడనైతినే, నాయట్టివానియందెట్లు బాణము ప్ర
యోగింపఁబడెను. ఈబాణమును బ్రయోగించిన వాఁడె
వ్వఁడైయుండవచ్చును. నేనెవ్వనికేమి యుపకారము నా
జేసితిని. అయ్యో, నేనునీళ్ళనుదీసికొనిపోవుట కీయర్ధరా
త్రమునందునిర్జనమైనయరణ్యమునకువచ్చితిని. ఇట్లువచ్చిన
నిరపరాధినగునన్నెవ్వఁడో బాణముచేతఁగొట్టె ఎవ్వనికి
నేనేమి యపకారమును జేసితిని. ఇతరులకుఁగొంచెమైనను
హింసనుజేయకవనములయందు కందమూలఫలములనువి
నుచుఁగాలమునుగడుపుచు ఋషిపుత్రుడనైయుండునన్నా
యుధముచేతనెట్లుచంపెను. జటలభారమునుధరించినవాఁ
డను, నారచీరలును, కృష్ణాజినమునువస్త్రములనుగాధరిం
చినవాఁడను, నగునన్నుఁజంపుటచేత నెవ్వనికేమిలాభము
గలుగును. నేనెవ్వరికేమియపకారమును జేసితిని. నిష్ఫలమై
న మహానర్థకారణమగు కార్యము నెవ్వఁడు సేసె.

ఇవ్విధముగ నిష్కారణముగ నన్నుఁజంపినవానిని లోక
ములోనివారందఱును గురుభార్యనుబొందినవానిని నిందించి
నట్లునిందింతురు. నన్నుఁజంపినాప్రాణములను బోగొట్టె
నే, యసినాకుదుఃఖములేదు. నేనుజచ్చినపిమ్మటనాతలిదం
డ్రులను రక్షించువారలెవ్వరును లేరేయని నాతలితండ్రులఁ
దలఁచుకొని నేనుదుఃఖమును బొందుచున్నాను. అయ్యో
యిఁకనాతల్లిదండ్రులకుదిక్కెవ్వరు. నేనుమరణమునుబొం

దినపిమ్మట యెుకాలము నాచే గాపాడఁబడిన నాతల్లిదండ్రులిఁకమీఁద నేవిధముగ జీవింపఁగలరు. అయ్యో, నాతల్లిదండ్రులిరువురు వృద్ధులు. వారికి నేనాధారముగా నుంటిని. ఇటువంటి నన్నుఁ జంపిన మూర్ఖుఁడు నాతల్లిదండ్రులను గూడఁ జంపినవాఁడయ్యె. అయ్యో, మేము ముగ్వురము నొకబాణముచేతఁ జంపఁబడితిమిగదా? యనియె. అట్లు పలుకుచున్న మునిపుత్రుని యొక్క మాటలను వింటిని. దుఃఖకరమైన యాధ్వనిని వినినతోడనే యధర్మభయమువలన నామనస్సునకధికమైన పరితాపము గలుగుటచే నాచేతులలోనుండిన ధనుర్బాణములు క్రిందఁబడియె. నేనాయర్ధరాత్రసమయమునందు అవ్విధముగ విలపించుచున్న యామునిపుత్రుని దీనాలాపములను విని యేమియుదోఁచక తడబడుచున్నవాఁడనై యధికవ్యసనమును బొంది తెలివిఁదప్పినవాఁడనైతిని. అంతఁగొంతసేపటికిఁ దెలివొంది పరమదుఃఖము గలవాఁడనయ్యును ధైర్యమును దెచ్చుకొని యక్కడకుఁబోతిని. పోయి సరయూతీరంబున బాణముచేతఁ గొట్టఁబడి నేలఁబడి జడలను విరియఁబోసికొని కుండలోనుండి కొంచెము నీళ్ళు క్రిందబడి యానీళ్ళచేఁ దడపఁబడినవాఁడును, రక్తముచేతను, దుమ్ముచేతను, వ్యాప్తమైన దేహముగలవాఁడును, బాణపీడితుఁడునై పడియున్న మునిపుత్రునిఁ జూచితిని. అప్పుడా మునికుమారుఁడు, మహాభయమును బొంది, దిగులుపడియున్న నన్నుఁ జూచి చుఱచుఱమని "తననేత్రకాంతిచేత దహింపఁజేయువానివలె నున్నవాఁడై" కఠినమగు నొక్కమాటను నాతోనిట్లనియె.

ఓదశరథమహారాజా! వనమునందు నివసించుచున్న నేను నీకేమి యుపకారమును జేసితిని. నేను తల్లిదండ్రులకై దాహశాంతికొఱకుదకమును దీసికొనిపోవలెనని వచ్చితిని. ఇవ్విధముగ వచ్చిన నన్ను అన్యాయముగఁ జంపితివి. ఇట్లు చంపుటకుఁదగినంత తప్పును నేనేమి చేసితిని. నీవొక్కబాణముచేత నామర్మస్థానమును బగులఁగొట్టితివి. ఈబాణముచేత నేముసలివారునునగు నాతల్లిదండ్రులను గూడఁ గొట్టినవాఁడవైతివి. దుర్బలులును, ముసలివారును, గ్రుడ్డివారును, దాహముచేఁ బీడింపఁబడినవారును నగు నాతల్లిదండ్రులు నేను నీళ్ళను దీసికొని వత్తునని నన్నెదురుచూచుచు మిగులఁగొప్పదియగు దాహేచ్ఛను నడఁచుకొనియుందురు. ఎంతతపస్సు చేసినను, ఎంతవిద్యను నేర్చుకొనినను ప్రయోజనములేదు. అధికమగు తపస్సును జేసికొనుచు, సకలవిద్యలను జదివిన నేను మాతండ్రికిఁగూడఁ దెలియకుండఁ గ్రిందఁబడియున్నానుగదా? ఒకవేళఁ దెలిసికొనినను, సామర్థ్యములేనివాఁడును, దుర్బలుఁడును, నడవలేనివాఁడునునగు నాతండ్రియేమిచేయఁగలఁడు. "ఒకచెట్టు క్రిందఁబడుచుండగా దానిసమీపమునందున్న వృక్షము క్రిందఁబడుచున్న వృక్షమును బట్టుకొనఁజాలనివిధముగా" నాతండ్రి నాకేమియును సాహాయ్యమును జేయఁజాలఁడు. ఓదశరథమహారాజా! ఇప్పుడే నీవు మాతండ్రియొద్దకుఁబొమ్ము. పోయి యీవృత్తాంతమును జెప్పుము. ఇట్లు చేసితివేని "యధికమైన కార్చిచ్చు వనమును దహించునట్లు" కోపముగల నాతండ్రి నిన్ను దహింపఁడు. ఇట్లు చేయకపోతివేని యవశ్యముగ నిన్ను దహించును. నాతండ్రియున్న యాశ్రమమునకుఁ దీసికొనిపోవునట్టి కాలిబాటమార్గమిదియే. ఈమార్గముచేత నీవుపోయి యామహానుభావుని అనుగ్రహము గలుగునట్లు జేసికొనుము. అట్లు సేసితివేని నిన్నతఁడు శపింపకుండును. ఓదశరథమహారాజా! నాశరీరమునందు గ్రుచ్చుకొనియుండెడు యీబాణమును బెరికివేయుము. ఇది నామర్మస్థానమును, నదీవేగము, మెత్తనై పొడవుగానున్న తీరమును బీడించువిధముగ, బీడించుచున్నదనియె. ఆమాటను విని నేనయ్యో యీబాణముండుటచేత నీమునిపుత్రుఁడు బాధను బొందుచున్నాఁడు. బాణమును బెరికివేయుదునేని మరణమును బొందును. నేనేమి చేయుదునని బాణమును బెరికివేయుటనుగుఱించి యాలోచించుచుంటిని. అంత నాఋషికుమారుఁడు ఇంతటి క్రూరకార్యమును జేసితినేయనియును, బ్రహ్మహత్య గలుగునో, యేమో యనియును దుఃఖమును బొందుచున్న నామనస్సునందలి యభిప్రాయమును దెలిసికొనియె. మఱియు నామునిపుత్రుఁడు పరమబాధనొందుచు మహాదుఃఖముగలవాఁడును, దేహమంతయును దిరుగుడువడుచున్నవాఁడును, నేలఁబడిపొరలుచు మరణకాలమును బొందియున్నవాఁడునునై నన్నుఁ జూచి యిట్లనియె.

ఓదశరథమహారాజా! నేను ధైర్యముచేత దుఃఖమును బోఁగొట్టుకొని స్థిరచిత్తుఁడనగుచున్నాను. నీవు నీమనస్సులో బ్రహ్మహత్య వచ్చునేమోయను భయమును వదలుము. నీకు బ్రహ్మహత్యాదోషము గలుగనేరదు. కావున సందేహమును విడువుము. ఓదశరథమహారాజా! నేను బ్రాహ్మణుఁడను గాను. నీమనస్సునకు దుఃఖము గలుగకుండుఁగాక. నేను శూద్రస్త్రీయందు వైశ్యునకుఁబుట్టిన కరణుఁడనువాఁడను. కావున భయమును బొందకుమని చెప్పె. ఇవ్విధముగ నతికష్టముతో నీమాటలను జెప్పె. మఱియును నతఁడు బాణాభిహతుఁడగుటచేతఁ దిరుగుఁడుపడుచున్నవాఁడును, నొకప్పుడు నిశ్చేష్టితుఁడును, ఒకొప్పుడు నేలయందుఁబడి తన్నుకొనుచున్నవాఁడును, మఱియొకప్పుడు దేహమును ముణుదుకొన్నవాఁడును, నై యుండె. అట్లు బాధను బొందుచున్న

మునిపుత్రునిశరీరమునందు నాటుకొన్నబాణమును నేను బెరికివేసితిని. అంతటనతఁడునన్నుఁజూచుచుఁ బ్రాణములను వదలెను. మంగళస్వరూపురాలవగునోకౌసల్యా! ఆసమయమునందిట్లతికష్టముచేత రోదనమునుగావించి యంతటితో మాటలాడఁజాలక నిట్టూర్పులనువదలుచున్నవాఁడును, జలములచేతఁ దడిసియున్నవాఁడును, జీవస్థానమునందుబ్రణముగలవాఁడును, సరయూనదిగట్టున బడియున్నవాఁడునునగు మునికుమారునిఁజూచి యధికముగదుఃఖముగలవాఁడనైతిని.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యరువదిమూడవసర్గముగిసెను.

— దశరథమహారాజునుమునీశ్వరుడుశపించుట. —

ధర్మాత్ముఁడును, రఘుకులోద్భవుఁడునునగు నాదశరథమహారాజు తానుపూర్వమునం దక్రమముగా మునికుమారునిఁ జంపినవృత్తాంతమును స్మరణకుఁదెచ్చుకొనినవాఁడై కౌసల్యనుజూచి యప్పుడుకూడ యధికముగదుఃఖమునుబొందినవాఁడగుచు నిట్లనియె.

ఓకౌసల్యా! నేను దెలివిలేనివాఁడనై యిటువంటిగొప్పపాపమును జేసితిని. ఆపాపమును వ్యాకులేంద్రియుఁడనై నేనొక్కడనే చేసితిని. ఇటువంటినాకు మేలుగలిగెడువిధమెట్లని కొంతసేపుదుఃఖించి పిమ్మటఁగొంతసేప గ్యమును దెచ్చుకొనినవాఁడనైతిని. అంతటసరయూనదీజలముచేత నింపఁబడిన నీళ్ళకడవనుదీసికొని యామునిపుత్రుఁడు సూచినమార్గమునఁబోయి యతనితండ్రియుండు నాశ్రమమునఁజేరితిని. అట్లుపోయియక్కడ బలహీనులును, వృద్ధులును, అంధులును, దిక్కులేనివారలును, ఱెక్కలుతెగినపక్షులవలెనున్నవారును, పుత్రుఁడేమిత్రముగాఁగలమాటలతోఁ గాలక్షేపమును జేయుచున్నవారును, నడచుటకుఁగూడ శక్తిలేనివారును, నామూలకముగఁ బుత్రవిషయకమైన యాశగలవారును, నేవిధమైనప్రయత్నమును జేయలేనివారును, దిక్కులేనివారలవలెనున్నవారును, నగు నాఋషికుమారుని తల్లిదండ్రులనుజూచితిని. ఆమునిపుత్రునిఁజంపుటచేత నధికమైనదుఃఖముగలవాఁడను, భయముచే తదిగులుపడిన బుద్ధిగలవాఁడును, నగు నేనాయాశ్రమస్థానమునుబొందినతోడనే నాదుఃఖము మిగులనధికమయ్యె. అప్పుడామునీశ్వరుఁడు నాపాదములయొక్క చప్పుడునువిని తోడనేయిట్లనియె.

నాయనా! కుమారుడా! నీవేలత్వరితముగా నుదకమునుదెచ్చియివ్వలేదు. విచారింపగా నీవింతసేపు జలక్రీడను జేయుచున్నట్లుతోఁచుచున్నది. నాయనా! పుత్రుఁడా! నీవెందునిమిత్తముగ నింతసేపుజలక్రీడనుజేసితివి. ఈవిషయమునుసర్వమును జెప్పుము. నీవింతసేపు రాకపోవుటచేత నీతల్లిమిక్కిలియధికముగా దుఃఖమునుబొందుచున్నదే. కావునఓనాయనా! కుమారుడా! శీఘ్రముగా నాశ్రమములోనికిరమ్ము. పుత్రుఁడా! నీకునీతల్లియేమైన నపకారమును జేసెనా? నేనేమైననపకారమును జేసితినా? చేయలేదుగదా? ఒకవేళఁజేసినను నీవుతపోవంతుఁడవుగావున నావిషయమును మనస్సునందుఁబెట్టకుము. మేముదిక్కులేనివారముగనుక మాకునీవేదిక్కు. మాకునేత్రములులేవుగనుక నీవేమాకునేత్రమువైతివి. మాప్రాణములన్నియును నీయందుఁబ్రియమునుబొందియున్నవి. ఇటువంటిమాతోనీవెందుకుమాటలాడవని యాఋషియడిగె. అంతనేనాఋషినిఁజూచి మిక్కిలిభయమునుబొందితిని. అట్లుభయమునుబొందినవాఁడనగుచు గద్గదస్వరముతోనిట్లనిచెప్పితిని. నేనువ్యాపారములచేతను, మనస్సుయొక్కకార్యమును, వాక్బలమును, అణఁచుకొనియామునితోఁ బుత్రవ్యసనమునుగలిగించునదియును, భయమునుగలిగించునదియును నగుమాటనుయిట్లనిచెప్పితిని.

ఓమునీశ్వరుఁడా! నేనుదశరథుఁడనువాఁడను. నేనుమహాత్ముఁడవగు నీకుఁబుత్రుఁడను గాను. నాపూర్వకర్మమువలనసజ్జనులచే నిందింపదగిననీదుఃఖమిప్పుడువచ్చినది. మహాత్మా! ఋషీశ్వరుడా! నేనునీళ్లుత్రాగెడుప్రదేశమునకువచ్చినక్రూరమృగములను, గజములను జంపఁదలఁచి విల్లుచేతియందుధరించుకొని సరయూనదియొక్క యొద్దనకువచ్చితిని. అట్లువచ్చియక్కడనొక్కచోటఁ బొంచియుంటిని. అప్పుడానదీజలమునందునీటియందుబుడబుడమనునొకధ్వనివినఁబడెను. ఆధ్వనినిగజధ్వనినిగాఁదలఁచియాధ్వనినే గుఱిపెట్టిబాణమును బ్రయోగించితిని. అంతట నేను నదీతీరమునకుఁబోయి ఱొమ్మునబాణము నాటుటచేతఁబ్రాణములుపోయినట్లు నేలఁబడియున్న ఋషిపుత్రునిఁ జూచితిని. మహానుభావా! మునీశ్వరుఁడా! నేనుశబ్దమును గుఱిగాఁజేసి యేనుఁగును జంపవలయుననియెడు కోరికచేతనుదకమునందుఁ బాణమునుబ్రయోగించినబాణము నీపుత్రునియొక్క ప్రాణములనుబోగొట్టెను. అంతటనేనతనియొద్దకుఁబోతిని. పోయినఁబిమ్మట బాణవేదననుసహింపఁజాలక యాబాణమును బెఱికివేయుమనియె. అట్లుచెప్పుటచే నతనివాక్యప్రకారమునే నాబాణమును బెఱికివేసితిని. ఆబాణమును బెఱికివేసినతోడనే యతఁడునాతల్లిదండ్రులు

గ్రుడ్డివారలేవారలగాపాడువారలెవ్వరుశేరేయని యిమ్ములఁగూర్చిదుఃఖించుచు స్వర్గమునకుఁబోయెను. ఋషీశ్వరా! నేనవివేకమువలననతిశీఘ్రముగనీపుత్రుసఁ జంపితిని. నేను జేసినపని జెలిపితిని ఇఁకమీఁదఁ జేయఁదగినదని యేదియో దానినిమహాత్ముఁడవగునీవే తెలుపవలయును. నేనవివేకముచేత నిట్టికార్యమును జేసితినికనుక మన్నింపుమని ప్రార్థించె. అంతటమహాత్ముఁడగు నామహర్షి దుఃఖకరమును, భయంకరమునునగు నామాటనువిని కోపమును నణచుకొనఁజాలఁడయ్యె. మఱియును మహాతపస్సంపన్నుఁడగు నామహర్షి మహాదుఃఖముతో ముఖమునిండఁ గన్నీళ్లుగారఁగా రోదనమును జేయుచు నిట్టూర్పులను విడుచుచుఁ జేతులనుముకుళించుకొని సమీపముననున్ననన్నుఁ జూచి యిట్లనియె.

దశరథమహారాజా! ఈయమంగళకార్యమును నాతో నీవే చెప్పకయుఁ కొకరిచేతఁ జెప్పించియుంటివేని యిదివఱకు నీతలకాయలక్షతునకలై యుండును. దశరథమహారాజా! ప్రభువైనవాఁడు బుద్ధిపూర్వకముగ నితరులఁజంపినను, విశేషించి వానప్రస్థులఁజంపినను దేవేంద్రపదవినిబొందియున్నప్పటికిని భ్రష్టుఁడగుననుటకు సందియము లేదు. తపోవంతుఁడగు బ్రహ్మవేత్తను బుద్ధిపూర్వకముగఁ దెలిసిచంపినవానితలతత్క్షణమున ఏడుతునకలుగ బగులును. నీవవివేకమువలననీకార్యమును జేసితివి గావున నీశిరస్సు బ్రద్దలుగాకయున్నది. నీవు తెలిసియేయీపనిని జేసియుందువేని యిదివఱకు మీయిక్ష్వాకుకులమంతయును నాశనమైయుండును. నీవునశించుదువని చెప్పనేల? యనియాఋషీశ్వరుఁడు జెప్పి మఱియునిట్లనియె.

దశరథమహారాజా! మమ్ములను మాపుత్రుఁడు చచ్చిపడియున్నచోటునకుఁ గొనిపొమ్ము ఇప్పుడు నెత్తురుచేతఁ దడసిబడియున్న శరీరముగలవాఁడును, తొలఁగినకృష్ణాజినమును వస్త్రముగలవాఁడును, నగు నాపుత్రునిఁజూడవలయును. మఱియును నాపుత్రుఁడుస్మృతితప్పినవాఁడును, యమునిస్వాధీనతను బొందినవాఁడును, తొలఁగినకృష్ణాజినమును వస్త్రములుగలవాఁడును, నగుపుత్రునిఁజూచుట కిచ్ఛయించుచున్నామని చెప్పె. అంతట నేను బరమదుఃఖితులగు నాదంపతులనుసచ్చోటికిఁ గొనిపోయి వారలు గ్రుడ్డివారలు గావున నే నాదంపతుల కామునిపుత్రుని కళేబరమును జేతితో తాకించి చూపితిని. అంతటఁ దపోవంతులగు నాదంపతులు పుత్రునిశరీరమును దడివి మూర్ఛిలిరి. పిమ్మట నా కళేబరమునందుఁ బడి కొంతసేపు రోదనమును జేసిరి. అట్లు రోదనమును జేయుచు నామునీశ్వరుఁడిట్లనియె.

నాయనా! పుత్రుఁడా! నన్నుఁజూచి నమస్కారము నేలచేయవు. ఏమియును బలుకకున్నావేమి? నిర్నిమిత్తముగ నేలఁబడియున్నావేమి? నామీఁద నేమైనఁ గోపముగలదా యేమి? ధర్మస్వభావముగలయోపుత్రుఁడా! నామీఁద నీకుఁ బ్రియము లేకపోయెనేని పోనిమ్ము. నీతల్లి యిక్కడకువచ్చియున్నది. తల్లినైన జూడుము. యమ్ముల నాలింగనము జేసికొనకున్నావేమి? తిన్ననిమధురములగు వచనములను జెప్పుమా కుసంతోషమును గలిగింపుము. కుమారుఁడా! ఇఁకమీఁదట నెవ్వఁడర్ధరాత్రసమయమునందు లేచి వేదమును శాస్త్రములను, నాయాశ్రమమునందుఁ జదువువారెవ్వరు. ఇఁకమీఁద నెవ్వఁడు మనోరమ్యముగాఁ జదువుచుండుటను విని నేనానందమును బొందుదును. ఇఁకమీఁదట నెవ్వఁడు స్నానమును జేసి సంధ్యనువార్చి యగ్నిహోత్రకర్మ నాచరించి నావద్దఁ గూర్చుండి పుత్రశోకముచేత దుఃఖమును బొందుచున్న నన్నునూరడించును. పుత్రుఁడా! ఇఁకమీఁదఁ గందమూలఫలములను బ్రియముతోఁ గొనివచ్చి ప్రియమైనయతిథినిఁ బూజించినట్లు నన్నుఁ బూజించును నేను కర్మలను జేయుటకు శక్తిలేనివాఁడను గదా? ఇఁక నాచేతఁ గర్మలను జేయించువాఁ డెవ్వఁడు. ఇప్పుడు నాకు నేనిదివరకు సంపాదించిన ద్రవ్యమేమియును లేదా? ఇఁక నేనేమి పెట్టుకొని జీవించుదును. ఇఁకమీఁదఁ గఱ్ఱను పట్టుకొని నాకు మార్గమును జూపించుచు నన్నుఁ దీసికొనిపోవువాఁ డెవ్వఁడు. అయ్యో కొడుకా! నన్ను దిక్కులేనివానిని గాఁ జేసిపోతివి గదా? వత్సా, కుమారుడా! దిక్కులేనిదియును, గ్రుడ్డిదియును, ముసలిదియును, నీయందధికమైన ప్రేమగలదియును నగు నీతల్లిని నీవు పోయిన పిమ్మట నే నెట్లుగా పాడఁగలను. పుత్రుఁడా! నీవు పోకుము. ఇక్కడ నేనిలిచియుండుము. లేవు నీతల్లిని నన్నును గూడఁ దీసికొని యమునియొద్దకుఁ బొమ్ము. అడవియందు దిక్కులేనివారమును, పుత్రహీనులమును, దీనులమును, దుఃఖముచేతఁ బీడింపఁబడుచున్నవారమును, నగు మేమిరువురమును శీఘ్రముగా నేయమునియొద్దకు రాఁగలము. కావున మేముగూడ యమునియొద్దకువచ్చి యోయమధర్మరాజా! మేము గ్రుడ్డివారము. మమ్ములఁ గాపాడువాఁ డెవ్వఁడును లేడు. కాఁబట్టి మాపుత్రుని మాకివ్వమని ప్రార్థించెదము. మఱియును ధర్మాత్ముఁడవును, లోకపాలుఁడవును, గొప్పదగుకీర్తిగలవాఁడవును, నగు నో యముఁడా! యివ్విధముగ దుఃఖమును బొందుచున్నమాకు మాపుత్రునిచ్చి శాశ్వతమైన యభయదానమును జేయుమని ప్రార్థించెదము. ఇట్లు ప్రార్థించితిమేని దయాళువగు యముఁడు నిన్ను మాకిచ్చివేయును. పుత్రుఁడా! నీకేమియును బాపమును జేసినవాఁడవు గావు. నీవన్యా

యామునఁ గాపకర్ముఁడగు నీదశరథునిచేతఁ జంపఁబడితివి. కాఁబట్టి యవివేకమువలన నీవేమైనఁ బాపమును జేసియున్న నొతలనదియంతయును నశించిపోవును. కావున నీవు సత్యబలముచేత యుద్ధమును జేసి చచ్చినవీరులు పోవునట్టి యుత్తమలోకమునకుఁ బొమ్ము. పుత్రుఁడా! యుద్ధములయందు వెనుకకు మరలనివారును, ఎదురుతిరగనివారును, పైవచ్చిన శూరులు పోవునట్టి యుత్తమలోకమునకుఁ బొమ్ము. సగర, శైబ్య, దిలీప, జనమేజయ, నహుష, దుంద మారులను మహారాజులు మొదలగు వారుపొందియున్న యుత్తమలోకములను నీవు గూడఁ బొందుము. పుత్రుఁడా! సమస్తసజ్జనులకును, స్వాధ్యాయతపస్సులను జేయువానికిని, భూమిదానమును జేయువానికిని, అహితాగ్నికిని ఏకపత్నీవ్రతము నవలంబించినవానికిని, గోసహస్రములను దానముసేసిన వానికిని, గురువును బోషించువానికిని, పుణ్యక్షేత్రములయందు దేహన్యాసమును జేసినవానికిని గలిగెడు లోకమునకుఁ బొమ్ము. తపస్సంపన్నులమగు మాకులమునందుఁ బుట్టినవాఁ డెవ్వఁడును, దుర్గతిని బొందువాఁడు గాఁడు. నాకుమారుఁడవైన నిన్నుఁ జంపిన దశరథమహారాజుమాత్రము దుర్గతిని బొందునని యామునీశ్వరుఁడు దుఃఖించె. ఇట్లా ఋషీశ్వరుఁడు కరుణ ననేకవిధముల దుఃఖించె. అట్లు దుఃఖించి పిమ్మటఁ గొంతసేపటి కమ్మునీశ్వరుఁడు భార్యతోఁ గూడఁ బుత్రునకు దకదానక్రియలను జేయుటకు యత్నించె. ఆసమయమునందు ధర్మవేత్తయగు నామునిపుత్రుఁడు, తనపుణ్యకర్మవశమున దివ్యరూపమును బొంది దేవేంద్రుఁడు తన్ను వెంబడించి రాఁగా రథము నెక్కి స్వర్గమునకుఁ బోయె. మఱియు నాఋషికుమారుఁడు దేవేంద్రునితోఁ గూడినవాఁడై దనతల్లిదండ్రులను జూచి యిట్లనియె.

ఓతలిదండ్రులారా! నేను బరమభక్తితో మీకు శుశ్రూషను జేయుటవలనఁ బూజ్యమగు పదవిని బొందితిని. మీరు గూడ శీఘ్రముగానే నాయొద్దకు రాఁగలరని యామునిపుత్రుఁడు జెప్పె. జితేంద్రియుఁడగు నామునిపుత్రుఁ డివ్విధముగఁ జెప్పి సర్వోత్తమమగు విమానము నెక్కి యతిశీఘ్రముగ స్వర్గలోకమునకుఁ బోయె. అంతట నతనితల్లిదండ్రు లిరువురును బ్రేతకార్యములను సంపూర్ణముగఁ జేసిరి. పిమ్మట జేతులను ముకుళించుకొని సమీపముననున్న నన్నుఁ జూచి యిట్లనిరి. దశరథమహారాజా! మాకొక్కఁడే పుత్రుఁడు. మాపుత్రు నొక్కనిఁ జంపి మమ్ములఁ బుత్రహీనులనుగాఁ జేసితివి. కావున నీవే బాణముచేత మాపుత్రునిఁ జంపితివో యాబాణముచేత నేమమ్ములఁ గూడఁ జంపుము. ఇట్లు సేసితివేని మేము దుఃఖములేనివారమగుదుము. ఓదశరథుఁడా! నీవు విచారించక యవివేకమువలనఁ బరిశుద్ధహృదయుఁడగు నాపుత్రునిఁ జంపితివి గావున నేనిప్పుడు నీకు దుఃఖకరమును, భయంకరంబునునగు శాపమునిచ్చెదను. దశరథుఁడా! నాకు మరణకాలమునందుఁ బుత్రదుఃఖమును గలిగించితివి గావున నీవుగూడ మరణకాలమునందుఁ బుత్రదుఃఖమును బొందఁగలవు. పుత్రుని గురించినవ్యసనముచేత మరణమును బొందఁగలవు. దశరథుఁడా! క్షత్రియుఁడవగు నీవజ్ఞానమువలన మునిపుత్రునిఁ జంపితివి గావున నీకు బ్రహ్మహత్యాప్రయుక్తమహాపాపము మాత్రము సంభవింపదు. ప్రాణములనపహరించుటయందుఁ దగినసామర్థ్యముగలదియును, భయంకరమైనదియును నగుకాలము నీకు శీఘ్రముగానె రాఁగలదని యామునివరుఁడు నాకు శాపంబిచ్చెను. ఇవ్విధముగ నమ్మునియును, నతనిభార్యయును నాకు శాపమునిచ్చి హాపుత్రుఁడా! యని పెద్దయెలుంగున రోదనమును జేయుచు చితిని జేర్చి యందుబడి మరణమును బొందిరి. దేవీ కౌసల్యా! బాల్యమునందు శబ్దవేదివిద్యచేత నేఁ జేసినపాపము పుత్రదుఃఖమును బొందుచున్న నాకిప్పుడు జ్ఞప్తికి వచ్చినది. ఓకౌసల్యా! లోకములో నపథ్యము జేయుటచేత రోగము వచ్చినట్లు పాపకృత్యమును జేయుటవలన నాకిటువంటి దుఃఖము సంప్రాప్తమైనది. కావున మంగళస్వరూపురాలవగు నోకౌసల్యా! నేనిప్పుడీపుత్రదుఃఖమును బట్టఁజాలకయున్నాను. ఈపుత్రదుఃఖమును బట్టఁజాలకపోవుటచేత నాప్రాణము లిప్పుడు పోవుచున్నవి. ఆమునీశ్వరుని శాపము వ్యర్థము గాలేదు. ఓకౌసల్యా నాకుఁ జూపు తప్పిపోవుచున్నది. కాఁబట్టి నీవు నాకంటికిఁ గనఁబడడము లేదు. కావున నన్ను గట్టిగాఁ బట్టుకొనుమని దశరథమహారాజు కౌసల్యతోఁ జెప్పి యధికముగ రోదనము జేయుచు మరల నిట్లనియె.

ఓకౌసల్యా! నేను దయాహీనుఁడనై రాముని నరణ్యమునకుఁ బంపితినే! పాపాత్ముఁడగు నాకీకార్యము తగినదిగానే యున్నది. రాముఁడు నామాటకు మారాడక యప్పుడే యడవికిఁ బోయె. అట్లుపోవుట పరమధార్మికుఁడగు రాముని కొక్కనికే చెల్లును గాని మఱియొకనికిఁ దగదు. ఆహా రాముఁ డెంతధర్మాత్ముఁడనవచ్చును. లోకములో బుద్ధిమంతుఁడగువాఁడు దుష్టనడవడికగల పుత్రునిఁ గూడ విడువఁజాలఁడు. అడవికిఁ బొమ్మని కఠినముగాఁ జెప్పుచున్న తండ్రిమీఁదఁ గోపమును జెందక పరమసంతోషముతో నరణ్యమునకుఁ బోవునట్టి పుత్రుఁడు రామునికంటె నితరుఁ డెవ్వఁడు గలఁడు. ఓకౌసల్యా! రాముఁ డొక్కమాటు నన్ను చేతులారఁ దాకకపోయినను, రాముఁ డిక్కడకు రాకపోయినను నాకు సంతోషము గలుగదు. చచ్చినపిమ్మట బంధువులను జూడ

నేరముగదా! అయ్యో నేను ప్రియపుత్రుఁడగు రామునివిడిచి దిక్కులేనివాఁడనై తినిగదా! ఓకౌసల్యా! నేనునిన్నుఁగం డ్లతోఁజూడనేరకున్నాను. నాకుస్మృతి తప్పిపోవుచున్నది యమదూతలువచ్చి నన్నుఁద్వరగారమ్మని పిలుచుచున్నారు నేనుమరణకాలమునందు ధర్మజ్ఞుఁడును, సత్యపరాక్రముఁ డునునగు రామునిఁజూచుటకిచ్చి పెట్టుకొనలేదే! నాకింతటి కంటెదుఃఖమేమిగలదు. అప్రతిహతమైన వ్యాపారములు గల రామునిజూడకపోవుటవలనఁ గలిగినదుఃఖము, సూర్య కాంతి భూమిలోనియుదకమునుబీల్చు విధముగ నాప్రాణ ములను నీడ్చుకొనిపోవుచున్నది. నేటికిఁబదునైదవసంవత్స రమునందు మహాసౌందర్యముగలవాఁడును, మంగళకరము లగు కుండలములుగలవాఁడును, మనోహరముగఁజూడఁద గినముఖముగలవాఁడును, నగురాముని నెవ్వరుచూతురో వారుదేవతలేగాని యెంతమాత్రమును మనుష్యులనిచెప్పఁ దగరు. (అనఁగా నాయట్టిదౌర్భాగ్యులకు రామదర్శనము గాదనుట) తామరరేకులవంటి నేత్రములు గలవాఁడును, మంచిదంతములుగలవాఁడును, సుందరమైనముక్కుగలవా డును, చక్కనికనుబొమలుగలవాడును, చంద్రతుల్యమగు ముఖముగలవాఁడునునగు రామునిధన్యులగువారు జనులు జూడఁగలరు. వనవాసమునుసల్పి మరలనయోధ్యాపట్టణ మునకువచ్చినరాముఁడు, మార్గమునువదలి యుచ్చను బొందినశుక్రుఁడు ప్రకాశించునట్లు ప్రకాశించుచుండఁగాఁ జూచునట్టిపుణ్యవంతులు పరమానందమును బొందుదురు. ఓకౌసల్యా! చిత్తమోహముచేత నాహృదయము మహా దుఃఖముగలదై నశించునట్లుతోఁచుచున్నది. నాకిప్పుడుశబ్ద స్పర్శరూపరస గంధజ్ఞానముగలుగుటలేదు. చమురుపోయి నపిమ్మట దీపపుకాంతులుతగ్గిపోవునట్లు నాచిత్తనాశమగు టచేఁగాఁబోలు నాయింద్రియములసామర్థ్యము నశించి పోవుచున్నది. నదీవేగముగట్టును నశింపజేయువిధముగఁబు త్రదుఃఖమువలనదిక్కులేనివానివలెనున్ననన్నుమిక్కిలిగాబా ధించుచున్నదనిచెప్పి యిట్లురోదనంబునుజేసె. హా రాముఁ డా! మహాబాహుఁడా! నాదుఃఖమును నశింపజేయువాఁ డా! హా ప్రియుఁడా! హా నానాథుఁడా! హా పుత్రుఁడా! యిప్పుడెక్కడకుఁ బోతివిరాయని రోదనమునుజేసె మ ఱియునయ్యో కౌసల్యా! హా తపస్వినివగు నో సుమిత్రా! ఘా తకురాలవును, కులనాశకురాలవునునైనయో కైకా! నే నుచచ్చిపోవుచున్నానే, చచ్చిపోవుచున్నానే,యని రోదన మును జేయుచు నాదశరథమహారాజు కౌసల్యాసుమిత్రలస మీపమున హా రామా! రామా! యనుచుమరణమునుబొం దె. ఆదశరథమహారాజు ప్రియపుత్రుఁడగు రామునివనవాస మునకుబంపుటవలనఁ గలిగినదుఃఖముచేత నధికముగబీడిం పఁబడి యర్ధరాత్రియందుఁ బ్రాణములనువిడిచె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యరువదినాల్గ వసర్గముగిసెను.

దశరథమహారాజు మరణమునుబొందుటను దెలిసికొనినంతఃపురజనులువిలపించుట.

అంతట నారాత్రియంతయును గడచినపిదపఁ బరదిన ప్రాతఃకాలమునకుముందుగ నాదశరథమహారాజుగృహ మునకుస్తోత్రపాఠకులును, సకలభూషణాలంకృతులును, వంశావళినిగీర్తించువారును, మంగళపాఠకులును, శ్రేష్ఠ మగువిద్యగలవారును, స్తోత్రముసేయుటయే స్వభావము గాఁగలవారును, గానమునుజేయువారును, తమతమకార్య ములను వేరువేరుగఁజేయుచు మరణమునొందియున్న రా జుయొక్కయింటివద్దికివచ్చిరి. వచ్చియాసమయమునందు రాజును స్తోత్రముసేయుచు గొంతెత్తిగట్టిగా నాశీర్వచ నమునుజేసిరి. వారిస్తోత్రధ్వనులు రాజగృహములయందం తటనువ్యాపించె. అంతటవంశావళిఁగీర్తించువారు రాజు నుబొగడుచుండఁగాఁ దాళములనువేయువారలు, కొంత సేపుయిదివరలలోనున్నరాజులును, నీదశరథమహారాజును జేసిన ఆశ్చర్యకరమగు కార్యములనువర్ణించి తాళములను వేయుచుండిరి. ఆచేతితాళధ్వనులనువిని చెట్లకొమ్మలయం దును, పంజరములయందునున్న పక్షులన్నియును, మేలు కొని మనోహరముగాశబ్దింపదొడంగె. మఱియునట్లుచె ప్పుచున్న పుణ్యకరమగుశబ్దములును, వీణాగానములును, నాశీర్వాదనాదములును, పాటలయొక్కధ్వనులును, నా రాజగృహములయందంతటనునిండినవయ్యె. అటుపిమ్మటఁ బరిశుద్ధములకు నాచారములుగలవారును, సేవించుటయం దుఁబండితులును స్త్రీనపుంసకులునునగు నంతఃపురసేవకు లునుసేవించిరి. స్నానపద్ధతినిజక్కగా నెఱిఁగినవారు, స్నానమునుజేయుటకుఁ దగినకాలమునందు శాస్త్రోక్తప్ర కారముగఁ బసుపునుచందనమునుగలిపిన యుదకమునుదీసి కొనివచ్చిరి, మఱియును యౌవనవంతులగుస్త్రీలు, తైల ము, నలుగుపిండిమొదలుగాఁగల మంగళకరములగుబూ సికొనుటకు దగినవస్తువులును ఉదయకాలమున భక్షింపద గినఔషధములు మొదలగువస్తువులును, వస్త్రాభరణకను మాదులును, తీసికొనివచ్చిరి. ఆరాజసంబంధులగుభృత్యు లందఱును సకలలక్షణసంపన్నులై శాస్త్రోక్తప్రకారము గసలంకారములనుజేసికొని సకలగుణసంపన్నులై ప్రకా శించుచుండిరి. మఱియునారాజకీయజనులందఱును, సూ

గ్యోదయమగునంతలోపల యుక్కలిసంతోషము గలవారై రాజుబయలునకు రాకపోవుటకుఁ గారణమేమయియోయని యోచించుచుండిరి. మఱియు రాజున కేమియాపదసంభవించెనోయని సందేహముగలవారైరి. అటుపిమ్మటనంతఃపురమునసంచరింపదగిన స్త్రీలందఱునువచ్చి యాదశరథమహారాజును తిన్ననిమధురవాక్యములగు వాక్యములచేత మేలుకొలిపిరి. అవ్విధముగనిద్రమేలుకొలిపినను లేవకపోవుటచేత నాస్త్రీలందఱునునప్పటికిఁ దగినకార్యములను వినయముచేతను, ఉపాయముచేతను, మెల్లగాదశరథమహారాజును దమచేతులతోఁదాఁకి యుచ్ఛ్వాసనిశ్వాసములు లేకుండుటను దెలిసికొనిరి. మఱియు నాస్త్రీలునిద్రయొక్క లక్షణములను జక్కఁగా దెలిసినవారగుటవలన యుచ్ఛ్వాసనిశ్వాసములులేని దశరథునిజూచి యిదినిద్రగా నుండదే యనుకొనిరి. అంతనాపరిచారికలందఱును, వణకుచున్నశరీరములుగలవారలై రాజునకుఁ బ్రాణములున్నవో లేవో యని సందేహముగలవారైరి. మఱియును మహాప్రవాహమున కెదురుగనున్న తృణాగ్రములయొక్క కొనలవలెగడగడ యనివణఁకుచుండిరి. అట్లాస్త్రీలందఱును దశరథునిజూచి భయముచేతవణకుచు కొంతసేపటికిదశరథుఁడు మరణమునుబొందెనని నిశ్చయించిరి. ఆసమయమునందుఁ గౌసల్యాసుమిత్రలలసినిద్రించియుండుటచే మరణమునుబొందినవారలవలె మెళకువలేనివారలై పడియుండిరి. మఱియు నాకౌసల్యాదేవి, కాంతిలేనిదియును, దెల్లఁబాఱినదేహముగలదియును, దుఃఖముచేతఁ గృశించినదియును, నైయుత్పాతముయొక్క పొగచేతఁగప్పఁబడినననక్షత్రమువలెఁ బ్రకాశహీనయైయుండె. మొదటదశరథుఁడుమృతుఁడగుటవలనఁ గాంతిహీనుఁడైయుండె. అతనికివెనుకఁగౌసల్య, కన్నీళ్లుగాఱనేడ్చియున్నది కావునఁ, గాంతిలేనిదైయుండె. పిమ్మటసుమిత్రయును నావిధముగానే కాంతిహీనయైయుండె. అప్పుడాస్త్రీలందఱును నావిధముగానేనిద్రనుబొందియున్న కౌసల్యాసుమిత్రలను జూచిరి పిమ్మటనిద్రపోయి మరణమునొందిన దశరథమహారాజును జూచిరి. అంతటను త్తములగు నాయామువారందఱును మిగులదుఃఖముగలవారై యరణ్యమునందు మగయేనుఁగు వచ్చిపోవుటచేత దుఃఖమునుబొందుచున్న యాఁడయేనుఁగులవిధముగగట్టిగానేడ్వదొడంగిరి. అట్లుస్త్రీలందఱును రోదనమునుజేయుచుండఁగా నారోదనధ్వనినివిని కౌసల్యాసుమిత్రలు తత్క్షణమున మేలుకొని నిద్రనువదలిరి. అంతట నాకౌసల్యాసుమిత్రలు దశరథమహారాజునుజూచి తమచేతులతోఁ స్పృశించి చనిపోయియున్నందున హాప్రాణనాథా! యనికేకలువేయుచుఁ గ్రిందఁబడిరి. అప్పుడుకోసలరాజకొమార్తెయగు నాకౌసల్యాదేవి భూమియందుఁబడి పొర్లిగింతలుపెట్టుచుదుమ్ముచేగప్పబడినశరీరముగలదైయాకాశమునుండి క్రిందఁబడిననక్షత్రమువలెఁ గాంతివిహీనయైయుండె. దశరథమహారాజు మరణమునొందగానే యాస్త్రీలందఱును, కొట్టఁబడిభూమియందుబడిన నాడయేనుఁగువలెనున్న కౌసల్యనుజూచిరి. అంతటఁగైకేయిమొదలుగాఁగల దశరథునిభార్యలందఱును దశరథుఁడుమరణమునుబొందిన వృత్తాంతమును దెలిసికొని యక్కడకువచ్చి యధికమైనదుఃఖముగలవారై రోదనమునుజేయుచు చేష్టాహీనులై క్రిందఁబడిరి. అవ్విధముగఁ గైకేయిమొదలగువారందఱునువచ్చి రోదనమునుజేయఁగానే యారోదనధ్వని కౌసల్యాసుమిత్రల రోదనధ్వనితోఁగలసి యాయింటియందంతటనువ్యాపించె. అంతటగొప్పధ్వనిగలిగె. మఱియును బూర్వమునం దధికసంతోషముఁగూడిన జనులుగలయా రాజగృహమంతయును దశరథమహారాజు మరణమును బొందఁగానే యందుండువారందఱును, మహాభయముగలవారైరి. మఱియునునధికమైన భ్రాంతిగలవారైరి. ఆగృహమునం దెక్కడఁజూచినను రోదనధ్వను లతిశయించె. బంధువులందఱును బరమదుఃఖముగలవారైయుండిరి. మఱియునెంతమాత్రమును సంతోషములేక కొందఱుమహాదీనులైచూచుచుండిరి. అంతటనారాజస్త్రీలందఱును దశరథమహారాజును మరణమునుబొందినవానిగా నిశ్చయించియధికముగ రోదనమునుజేయుచుండిరి. అవ్విధముగనధికముగ దుఃఖముగలవారగుటచేతఁ జేతులనెత్తుకొని అనాథవలె రోదనమును జేయుచుండిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యఱువదైదవసర్గముగిసెను.

దశరథుడుమరణమునుబొందుటనువిని అయోధ్యాపట్టణమునసుండుజనులువిలపించుట.

ఆదశరథమహారాజు మరణమునుబొందినవాఁడై చల్లగానుండుయగ్నిహోత్రమువలెను, నీళ్లులేనిసముద్రమువిధముగాను, కాంతిహీనుఁడగు సూర్యునిచందమునను, నుండె. అవ్విధమునున్నదశరథమహారాజునుజూచి కౌసల్యాదేవికన్నులనిండ నీళ్లుధారధారగా బ్రవహింపఁగా దుఃఖమునుబట్టఁజాలకదశరథునిశిరస్సును దనతొడమీఁదఁబెట్టుకొని కైకేయినిజూచియిట్లనియె.

కూరాత్మురాలా! కైకేయీ! ఇఁకనీకోరికలనన్నిఁటినినిరాతంకముగఁదీర్చికొనుము. దశరథమహారాజు మరణ

మును బొందెనుగదా? ఇఁక మీఁదను నీ రాజ్యమును ఏలవచ్చును. కైకేయీ! నా కొడుకగు రాముఁడరణ్యమునకుఁ బోయెనుగదా? నన్నుఁ గాపాడునట్టి భర్తయగు దశరథమహారాజును మరణమును బొందె. కావున నతిభయంకరమగు మార్గమున దోడులేని నాడు దానివలెనున్న నేను యిఁక జీవింపఁజాలను. ధర్మహీనురాలగు కైకేయికంటె మఱియొక యాడుదియెవ్వతె తనకు దేవుఁడైన భర్తను వదలి జీవించుటకు సమ్మతించును. లుబ్ధుఁడగువాఁడు విషముష్టిఫలమును జూచి యిదియొక ఫలమేయని తలచి యాఫలమును దినుటవలనఁ గలిగెడు చెఱుపును గడపట దెలిసికొనిన విధముగ నో కైకేయీ! నీవు గూని దానివచనములను విని రఘుకులమును సర్వమును నశింపఁజేసితివి. వరములనివ్వవలసిన మాట యబద్ధమై దురభిప్రాయముతో దశరథుఁడు కైకేయీవచనములను విని యరణ్యమునకు సీతారాములను బంపెననువార్తను జనకచక్రవర్తి వినెనేని యాజనకచక్రవర్తి యవశ్యముగా నావలెనే పరితాపమును బొందును. జీవించియుండియున్న, నయోధ్యాపట్టణమునకు మృతుఁడైనవాఁడును, ధర్మస్వభావము గలవాఁడును, తామరరేకులవంటి కండ్లుగలవాఁడునునగు రాముఁడిప్పుడు నేను పెనిమిటి లేకపోవుటచేత దిక్కులేనిదాననైయున్నానను సంగతిని నెఱుఁగఁడుగదా? దశరథుఁడు మరణమును బొందెనను విషయమునుగూడఁ దెలిసియుండఁడుగదా? ఆప్రకారముగా నేకరుణింపఁదగినదియును, జనకరాజునకుఁ బుత్రికయును, దుఃఖమును బొందుటకుఁ దగనిదియును, నగు సీత యధికమైన దుఃఖముగలదై భయమును బొందియుండఁగలదు. సీత, రాత్రులయందు, వనములోఁ బుట్టినవియును, భయంకరములైనవియునునగు మృగములఱచుచుండఁగా విని మిగుల భయముగలదై రాముని నాశ్రయింపఁగలదు. ముసలివాఁడును, పుత్రహీనుఁడును, నగు నా జనకమహారాజు సీతావృత్తాంతమును దలఁచుకొని శోకాక్రాంతుఁడై ప్రాణపరిత్యాగమును జేయును. పతివ్రతనగు నేనిప్పుడే మరణమును బొందెదను. ఈదశరథుని శరీరమును గౌఁగిలించుకొని యగ్నిహోత్రమునందుఁ బ్రవేశించెదనని చెప్పి కౌసల్య యధికముగా రోదనమును జేసె. అట్టియెడ వ్యవహారమునందు నియుక్తులగు నంతఃపురస్త్రీలు, తపస్వినియును, మిక్కిలి దుఃఖముచేఁ బీడింపఁబడినదియును, నగు నా కౌసల్యను, దశరథమహారాజుయొక్క కళేబరము దగ్గరనుండి మఱియొకచోటునకుఁ దీసికొనిపోయిరి. అంతట మంత్రులందఱును వచ్చి వసిష్ఠమహర్షి మొదలగు వారియనుమతమును బొంది దశరథుని కళేబరమును తైలద్రోణియందుంచి పిమ్మట రాచకార్యములన్నింటిని జరుప దొడంగిరి. మఱియు నామంత్రులు సకలధర్మములను దెలిసినవారుగావునఁ బుత్రహీనముగ దశరథునకు సంస్కారమును మాత్రము సేయక యూరకుండిరి. మఱియు దశరథుని కళేబరమును జెడకుండ తైలపక్వము జేసి రక్షించిరి. మంత్రులందఱును దశరథుని కళేబరమును తైలద్రోణియందుఁ బెట్టుటను జూచినతోడనే యందలి స్త్రీలందఱును నయ్యో దశరథుఁడు మరణమును బొందినాఁడే! యని మిగుల నధికముగా రోదనమును జేసిరి. మఱియు నా స్త్రీలందఱును దీనస్వభావము గలవారై చేతులను బైకెత్తుకొని కండ్లనిండ నీళ్లు గారఁగా మిగుల దుఃఖము గలవారై యితరులకుగూడ వ్యసనము గలుగునట్లు రోదనమును జేసిరి. హా దశరథమహారాజా! మేమందఱమును మొదటఁ బ్రియవాదియును, సత్యసంధుఁడునునగు రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించియే వ్యసనమును బొందుచున్నామే? ఇట్లు దుఃఖమును బొందుచున్న మమ్ముల విడిచి నీవుగూడఁ బోతివా? యని పెద్దగొంతెత్తి రోదనమును జేసిరి ఓ దశరథుఁడా! మేము రాముని వదలుకొంటిమి. పెనిమిటివగు నీవును మరణమును బొందితివి. ఇఁక మీఁదట దుష్టస్వభావము గలదియును, పతిఘాతకురాలునునగు నీ కైకేయి యొద్ద నెట్లుందుమని రోదనమును జేసిరి. సర్వకాలములయందును మనకందఱకును బ్రభుఁడును, సత్స్వభావము గలవాఁడును, శ్రీమంతుఁడును, నగు నా రాముఁడు రాజ్యలక్ష్మి నివిడిచి యరణ్యమునకుఁ బోయెనుగదా? మఱియు నో దశరథమహారాజా! మేము రామునితో సమముగ నిన్నుగూడ వదలి యధికమైన దుఃఖము గలవారమై కైకేయి వలన నానావిధములగు బాధలను బొందుచు నేవిధముగ జీవింపఁగలము. దశరథమహారాజా! భర్తవగు నిన్నును, మహారాజగు రాముని, మహాబలుఁడగు లక్ష్మణుని, గూడ వదలుకొన్నదియును దుష్టస్వభావము గలదియునునగు నీ కైకేయి మమ్ముల నాదరముచేత వదలిపెట్టునని చెప్పనేల యని యంతఃపురస్త్రీలందఱును రోదనమును జేసిరి. మఱియు నా దశరథుని యొక్క భార్యలందఱును నధికముగ దుఃఖము గలవారై కన్నీళ్లు గారఁగా రోదనమును జేయుచు నేలఁబడి పొర్లింతలు పెట్టిరి. ఆసమయమున దశరథమహారాజు లేకపోవుటచేత నాయయోధ్యాపట్టణము చంద్రుఁడు లేని రాత్రివలెను, విధవయగు స్త్రీవలెను, కాంతివిహీనమైయుండె. కన్నీళ్లు గారఁగా నేడ్చుచున్న జనులతోఁ గూడినదియును, హాహాకారములను జేయుచున్న స్త్రీలతోఁ గూడినదియును, పాడుపడిన ముంగిళ్లు గలదియును, గృహమధ్యప్రదేశములు గలదియును నగు నాయయోధ్యాపట్టణము పూర్వమువలెఁ బ్రకాశము లేనిదై కాంతిహీనముగనుండె. మనుష్యులకుఁ బ్ర

భుత్రైన దశరథమహారాజు పుత్రదుఃఖమువలన మరణమును బొందంగానే రాజభార్యలందఱును, నేలయందుఁబడియుండిరి. ఆసమయమునందు సూర్యుండుశీఘ్రముగానస్తమయమునుబొందెను. అంత గొంతసేపటికి రాత్రివచ్చెం. చీకటుగ్రమ్మె. ఆసమయమునందు దశరథమహారాజునకు స్నేహితులగువారు దశరథమహారాజునకు దహనాదిసంస్కారములను జేయకుండుటమంచిదిగాదనియును, నేవిధముగానైనఁజేయవలయుననియును నాలోచించి దహనాదిసంస్కారములను జేయుటకు బ్రయత్నించిరి. అట్లుయత్నింపఁగానే దశరథునిబంధువులందఱును పుత్రులు లేనప్పుడు దశరథమహారాజునకు దహనాదికృత్యములను జేయుట యుచితముగాదనిరి. అట్లుచెప్పినపిమ్మటనందఱును నేకీభవించియాదశరథునికళేబరమును, తైలద్రోణియందుఁబెట్టిరి. మహానుభావుఁడగు దశరథమహారాజులేకపోవుటచే నాయయోధ్యాపట్టణము, సూర్యుఁడులేకపోవుటచే ప్రకాశహీనమైననాకాశమువలెను, నక్షత్రములులేని రాత్రివలెను, ప్రకాశింపకుండెను. మఱియు నాపట్టణమార్గములయందును, చత్వరములయందునుజనులందఱును గన్నీళ్లుగారఁగారోదనమును జేయుచుండిరి. అట్లుదశరథమహారాజుమరణమును బొందినసమయమునందా పట్టణమునందలి స్త్రీలునుపురుషులును నొక్కటిగాఁజేరి భరతునియొక్కతల్లియైనకైకేయిననేకవిధములనిందించుచునధికమైనదుఃఖముగలవారైరి. మఱియునఁగొంచెమైనను సుఖమునుబొందరైరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలియరువదాఱవసర్గము ముగిసెను.

— { వసిష్ఠవామదేవులు మొదలగువారు భరతునిపిలుపింపవలయునని సభజేసియాలోచించుట. } —

అంతనయ్యయోధ్యాపట్టణమునందు నాటిరాత్రియేడ్పులచేతసంతోషములేనిదియును, కన్నీళ్లచేతగద్గదత్వమును బొందినకంఠస్వరములతోఁగూడినదియును, నగుటచేతననేకసంవత్సరములకాలమువలెనుండెను. (అనఁగానారాత్రి నిఅందలి జనులందఱును మిక్కిలిదుఃఖముచేతఁగడపిరనుట.) అవ్విధముగనెల్లవారునురోదనమును జేయుచుండఁగానే యారాత్రియంతయును గడచిపోయెను. అంతఁగొంతసేపటికి సూర్యోదయంబయ్యె. అప్పుడు రాజును నేర్పఱచవలసిన బ్రాహ్మణులందఱును వచ్చియొక్కచోటసభను జేసిరి. ఆ సభయందు మార్కండేయ, మౌద్గల్య, వామదేవ, కాశ్యప, కాత్యాయన, గౌతమ, జాబాలి, మొదలుగాఁగల మహానుభావులగు బ్రాహ్మణోత్తములందఱును గూర్చుని యుండిరి. అంతనాబ్రాహ్మణులందఱును మంత్రులతోఁ గూడఁగూడుకొని రాజపురోహితుఁడును, శ్రేష్ఠుఁడును నగువసిష్ఠమహామునితో వేరువేరుగానిట్లనిరి. వసిష్ఠమునివర్యా! ఈరాత్రినంతయును మిగులదుఃఖముచేతననేకనూరులసంవత్సరములనుగడపినవిధముగ గడపితిమి. దశరథమహారాజుమరణమునుబొందుటచేత నొక్కరాత్రిగడవడమునానేక నూరులసంవత్సరములుగడచినట్లయ్యె. మహారాజగు దశరథుఁడుస్వర్గస్థుఁడయ్యె. రాముఁడరణ్యమునకుఁబోయెను. మహాతేజోవంతుఁడగులక్ష్మణుఁడు రామునితోఁగూడనరణ్యమునకుఁబోయెను. శత్రుమర్దనుడగు భరతశత్రుఘ్నులిరువురును, కేకయదేశమునందు తమతల్లినిగన్నతండ్రియగు తాతయింటియందు నివసించియున్నారు. ఇప్పుడీపట్టణమునకురాజెవ్వఁడును లేఁడు. కావుననోవసిష్ఠమునివర్యా! రఘుకులమునఁబుట్టినవారలలో నిప్పుడొకనిని పట్టణమునకు రాజునుగానియమింపుము. రాజులేకపోయెనేనిరాజ్యమునకుహానిగలుగును. అరాజకమగురాజ్యమునకుహానిగలుగుననుటనీవెఱింగినదేగదా? అరాజకమగురాజ్యమునందుమేఘుఁడుమెఱుపుగలవాఁడును, మహాధ్వనిగలవాఁడునునగుచు దివ్యమగునుదకమునువర్షింపఁడుగదా? మఱియునరాజకమగురాజ్యమునందువిత్తనములుచల్లఁబడవు. ఇంతియగాకరాజ్యమరాజకమయ్యెనేని యట్టిరాజ్యమునందుభార్యాభర్తలొకరికొకరువశ్యులైయుండరు. అరాజకరాజ్యమునందుధనముండదు. భార్యలనుబరులీడ్చికొనిపోదురు. వీనికంటెమిగులభయంకరమగు నబద్ధమెండగును. రాజులేనిరాజ్యమునందు అసత్యమె మెండుగగలిగియుండునని పెద్దలుపలుకుదురుగదా? రాజులేనిదేశమునందు మానవులందఱును భయముగలవారగుటచేత సంతోషహీనులైయుందురు. మఱియును సంతోషహీనులగుటచేతనే సభలను, రమ్యములగు నుద్యానవనములను, దేవాలయములను, జేయరు. దేవాలయములను నిర్మించితిమేనియందు దొంగలుచేరుదురని భయమునుబొందుదురు. మఱియును రాజులేనిరాజ్యమునందు బ్రాహ్మణులుయజ్ఞంబులను జేయఁజాలకయుందురు. మఱియుమిగుల భయముగలవారలగుదురు. ఇంతియగాక జితేంద్రియులును, సంశ్రితవ్రతులునునై సత్రయాగములను జేయకయూరకుందురు. రాజులేనిదేశమునందు, ద్రవ్యవంతులయ్యును యజ్ఞమును జేయునట్టి బ్రాహ్మణులు యజ్ఞదక్షిణలనుసంపూర్ణముగనివ్వరు. రాజులేనిదేశమునందు రాజ్యాభివర్ధకులగునటనర్తకగాయకులు సకలజనులకును సం

తోషముసుగలుగఁజేయునట్టి యుత్సవసమాజములను వృద్ధి బొందింపరు. రాజులేని దేశమునందుఁ గ్రయవిక్రయవ్యాపారములచేత జీవించువారలకైనను, దాయభాగాదివ్యవహారములుగలవారలకైనను, కొంచెమైనను బ్రయోజనముగలుగకుండును. మఱియు నితిహాసపురాణాదులను జెప్పిజీవించువారలు వినువారివలనఁ గ్రమమైనఫలమును బొందఁజాలరు. రాజులేని దేశమునందు, కన్యకలు సువర్ణాభరణములచే నలంకరింపఁబడి సాయంకాలమున నుద్యానవనములకుఁ బోయి యందుఁ గ్రీడించుటకు భయమును బొందుదురు. రాజులేని దేశమునందు మానవులందఱును, జారచోరులవలన భయముగలవారలై వేగముగాఁ బోవునట్టి సామర్థ్యముగల గుఱ్ఱములనెక్కి భార్యలతోఁ గూడ విహారార్థముగ నరణ్యములకుఁ బోకయుందురు. రాజులేని రాజ్యమునందు దొంగలభయముగలవారై కృషిచేతను, గోవులచేతను జీవించునట్టి వైశ్యులు నిర్భయముగా వాయుసంచారముకొఱకుఁ దలుపులను దెరచికొనక మందిరములయందే నివసించి యధికముగ దుఃఖమును బొందుదురు. మఱియును రాజహీనమగు రాజ్యమునందుఁ గట్టఁబడిన ఘంటలుగలవియును, ప్రశస్తములైన కొమ్ములుగలవియును, నరువదిసంవత్సరముల వయస్సుగలవియును, నగు నేనుఁగులు రాజమార్గములయందు సాధుతనముగలవై సంచరింపవు. రాజులేని దేశమునందు బాణవిద్యను, శస్త్రవిద్యను నేర్చుటయందుఁ గుతూహలముగలవారు సర్వకాలములయందును విద్యాభ్యాసమును వదలియుందురు. ఇంతయగాక వారు బాణములను నభ్యాసార్థముగ వేయుచుండఁగా నవిచ్ఛిన్నముగఁ బుట్టునట్టి యఱచేతినాదము వినఁబడదు. రాజులేని దేశమునందు వర్తకమును జేసి జీవించువారలు నానావిధములగు విక్రయింపఁదగిన ద్రవ్యములను దీసికొని దూరదేశమునకు వ్యాపారార్థముగఁ బోయి క్షేమముగ రాజాలమని ప్రయాణములను జాలించుకొందురు. దానివలన సకలమానవులకును గష్టములు గలుగును. అరాజకమగు దేశమునం దొక్కఁడే సంచరించువాఁడును, ఇంద్రియనిగ్రహముగలవాఁడును, అస్తమయమెక్కడగునో యక్కడనే నివసించి పరమాత్మధ్యానమును జేయువాఁడును, నగు సన్యాసికూడ సంచరించుటకు భయపడును. అరాజకమగు దేశమునందు యోగక్షేమములు జరగవు. అరాజకమయిన దేశమునందలి సేనలు యుద్ధమునందు శత్రువులను జయింపక యూరకుండును. మఱియు నరాజకమగు దేశమునందుండు మానవులందఱును చక్కఁగా శృంగారించుకొని సంతోషముతో శ్రేష్ఠములైన గుఱ్ఱములచేతను, రథములచేతను, శీఘ్రముగా విహారమును జేయుటకొఱకు బయలు వెడలరు. అరాజకమైన దేశమునందు శాస్త్రవిశారదులగు విద్వాంసులందఱును, వనములయందును, నుపవనములయందును, శాస్త్రవిచారములను జేయక యూరకుందురు. అరాజకమగు దేశమునందు మానవులందఱును నియతులై దేవతలను బూజింపకుందురు. మఱియును పువ్వుల మాలికలను మోదకములను భక్ష్యపదార్థములను దేవతానివేదార్థముగ సంపాదింపకుందురు. అరాజకమగు దేశమునందు రాజపుత్రులందఱును చందనముచేతను, నగరుచేతను, బూయఁబడిన శరీరములుగలవారలై వసంతఋతువునందు వృక్షములు ప్రకాశించునట్లు ప్రకాశింపకుందురు. మఱియును నీళ్ళులేని నదులును, పచ్చికలేని వనములును, గొల్లవాఁడులేని గోవులును, బ్రకాశింపనివిధముగ రాజులేని రాజ్యము కొంచెమైనను, ప్రకాశింపకుండును. మఱియు రథమునకు ధ్వజమే విధముగఁ బ్రకాశమును గలిగించునో, యగ్నిహోత్రమునకు ధూమమే విధముగా గుఱుతుగా నుండునో, యావిధముగా నేమనకందఱకును బ్రకాశమును గలుగఁజేయువాఁడగు దశరథమహారాజు యిప్పుడు మరణమును బొందెను. అరాజకమగు దేశమునందు "ఒకమత్స్యమును మఱియొకమత్స్యము భక్షించువిధముగ" ఒకరిద్రవ్యమును మఱియొకరు అపహరింతురు. వర్ణాశ్రమధర్మములను లక్ష్యముసేయక పరలోకభయమును వదలి యిష్టానుసారముగ సంచరించునట్టి నాస్తికులు రాజశిక్షచేత సజ్జనులగుదురు. రాజులేకపోయెనేని నాస్తికులందఱును యథేచ్ఛముగా సంచరించుదురు. దేహమునకుఁ గన్నెట్లు ప్రధానముగనుండునో యటులనే రాజు రాజ్యముయొక్క సత్యధర్మముల కాధారుఁడైయుండును. మఱియు రాజ్యమునందలి యుపద్రవములనన్నింటిని దీర్చి క్షేమమును గలిగించును. శ్లో॥ రాజాసత్యంచధర్మశ్చ రాజాకులవతాంకులమ్ । రాజామాతాపితాచైవ రాజాహితకరోనృణామ్ ॥ రాజే సత్యధర్మములని పెద్దలు పలుకుదురు. రాజే కులవంతులకుఁ గులము. లోకమునకు రాజే తల్లియును, దండ్రియునునై యుండును. మానవులకందఱకును రాజు హితకరుఁడై యుండును. కావున నే యముఁడును, కుబేరుఁడును, దేవేంద్రుఁడును, మహాబలముగల వరుణదేవుఁడును, రాజుకంటె నెక్కువవారనఁబడుదురు. మఱియు నున్యాయాన్యాయములను విమర్శించునట్టి రాజు లోకమునందు లేకుండునేని లోకమంతయును చీకటిగలదియగును. లోకమునం దేవిధమైన కార్యమును జరుగదని చెప్పి మఱియు నమ్మునులందఱును వసిష్ఠమహామునితో నిట్లనిరి.

మహాత్మా! వసిష్ఠా! దశరథమహారాజు జీవించియున్న సమయమునందుఁ గూడ సముద్రము చెలియలికట్టను దా

టిరాజువిధముగ నీమాటను గొంచెమైన నతిక్రమించినవారము గాము. ఇఁక నిప్పుడు దశరథమహారాజు మరణమును బొందియుండగ నీమాట నతిక్రమింపమని చెప్ప నేల. కావున బ్రాహ్మణోత్తమా! వసిష్ఠుడా! నీవు మా సమాచారమును విని రాజు లేకపోవుటవలన రాజ్యమంతయును నరణ్యతుల్యముతో సమానముగ నుండును. కావున రఘుకులమునందుఁ బుట్టినవారలలో నెవ్వనినైన నొక రాజకుమారుని మాకు రాజునుగాఁ జేయుమనిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యఱువదేడవ సర్గము ముగిసెను.

దూతలు భరతుని బిలుచుకొనివచ్చుటకు కేకయరాజు దేశమునకు బోవుట.

అవ్విధముగ మార్కండేయుడు మొదలగు మహర్షులు చెప్పినమాటను విని వసిష్ఠమహాముని, స్నేహితులు, మంత్రులు, బ్రాహ్మణోత్తములు మొదలగువారల నందఱను జూచి యిట్లనియె.

ఓ పురుషశ్రేష్ఠులారా! ఇప్పుడు భరతుఁడు తమ్ముఁడగు శత్రుఘ్నునితోఁగూడ నధికమయిన సుఖముగలవాఁడై మేనమామయింటియందున్నాఁడు. కావున నిప్పుడు మహాపరాక్రమశాలులగు నా భరతశత్రుఘ్నులగు నిర్వురను బిల్చుకొనివచ్చుటకై శీఘ్రముగాఁ బోవునట్టి దూతలు వేగముగల గుఱ్ఱములనెక్కి మహావేగముగఁ బోవునట్లు చేయుఁడు. దశరథమహారాజే భరతునకు రాజ్యమునిచ్చియున్నాఁడు గదా? కావున మనము రాజ్యము నెవ్వనికిత్తమని విచారింపనక్కఱలేదనియె. ఆవచనమును విని మార్కండేయుడు మొదలగు మునిశ్రేష్ఠులందఱును నొక్కమాటగా భరతుని బిలిపించుట యేయుక్తమని చెప్పిరి. అవ్విధముగ నెల్లవారును నేకవాక్యముగఁ జెప్పినమాటను విని వసిష్ఠమహాముని దూతలను బిలిపించి యిట్లనియె.

ఓ సిద్ధార్థుఁడా! విజయుఁడా! జయంతుఁడా! అశోకుఁడా! నందనుఁడా! ఇక్కడకు వచ్చి నా మాటలను వినుఁడు. మీరు సేయవలసిన కార్యమును జెప్పెదను. సావధానులరై వినుఁడు. మీరందఱును మిగుల వేగముగల గుఱ్ఱములనెక్కి యతిశీఘ్రముగా రాజగృహమను పట్టణమునకుఁ బోయి కొంచెమైనను దుఃఖములేనివారలగుచు నేను జెప్పినట్లని భరతునకుఁ జెప్పుఁడు. భరతుఁడా! పురోహితుఁడగు వసిష్ఠుఁడును, మఱియు నితరులగు మంత్రులందఱును నీతో క్షేమమును జెప్పుమన్నారని చెప్పుఁడు, కావున జాగుసేయక యతిశీఘ్రముగ రమ్మని చెప్పుడు. రాముఁ డరణ్యమునకుఁ బోయెననియును, తండ్రియగు దశరథుఁడు మరణమును బొందెననియును, రఘుకులమునకుఁ బెద్దయనర్థము వచ్చెననియును, జెప్పవలదు. ఈవిషయమును గొంచెముగానైనను సూచనను జేయఁగూడదు. కేకయరాజునకును, భరతునకును, పట్టువస్త్రములను, మఱియు నితరములగు భూషణములను శీఘ్రముగాఁ దీసికొనిపొండని వసిష్ఠమహాముని దూతలకాజ్ఞాపించె. అంతట నాదూతలు మార్గభక్ష్యమును దీసికొని మిగుల వేగముగల గుఱ్ఱములనెక్కి కేకయదేశములను గుఱించిపోవుటకు ప్రయాణమై తమయిండ్లకు బోయి చెప్పివచ్చుటకు బోయిరి. అట్లుపోయి చెప్పివచ్చి ప్రయాణమునకుఁ దగిన కార్యములనన్నింటిని నెరవేర్చుకొని వసిష్ఠమహామునియొక్క యాజ్ఞను బొంది బయలు వెడలిపోయిరి. అట్లు బయలు వెడలినవారలై మొదట దక్షిణోత్తరమార్గముగా నున్న అపరతాలపర్వతమును జూచిరి. దానికి బశ్చిమమున దక్షిణోత్తరముగ బ్రలంబపర్వతముండుటను గనుంగొనిరి. అపర్వతము వంకరగా నున్నదనుటను దెలిసికొనిరి. కావున నాగూఁతలు ముందుగా నయోధ్యనుండి పశ్చిమాభిముఖులై కొంతదూరముఁ బోయి యపరతాలపర్వతముయొక్క దక్షిణపుచివరను నతిక్రమించిరి. పిమ్మట నపరతాల ప్రలంబపర్వతముల నడుమ మాలినీతీరమార్గమునఁ గొంతవరకు నుత్తరముగాఁ బోయిరి. అంతటఁ బ్రలంబపర్వతోత్తరభాగమునందుండి పశ్చిమముగా బోయిరి. అంతట హస్తినాపురము జేరి యందున్న గంగానదిని దాటిరి. ఇట్లు గంగానదిని దాటి కురుజాంగలదేశముయొక్క నడిమిభాగమును బట్టి పాంచాలదేశమునకుఁ బోయి యక్కడనుండి పశ్చిమాభిముఖులై వెడలిపోయిరి. పిమ్మటఁ బాంచాలదేశమునందుండు చిన్నచిన్న దేశములను దాటి జలపూర్ణములగు కొలనులను, నిర్మలములగు నుదకములుగల నదులను జూచుచుఁ గార్యవశముచేత నెక్కడను నిలువక యతిత్వరితముగఁ బోయిరి. మఱియు నా దూతలు మహావేగముగ బోవుచు స్వచ్ఛమగు జలములు గలదియును దివ్యమగు ననేకపక్షులతోఁ గూడినదియును జనసమూహముతో నిండియుండునదియును నగు శరదండయను నదీతీరమునకు బోయిరి. అట్లుపోయి యా శరదండానదిని దాటి దానికుత్తరముగనున్న దేవతాధిష్ఠానములు గలదియును, సత్యోపయాచనమను పేరుగలదియును, నగునీరవృక్షమునొద్దకుఁ బోయిరి. పిమ్మట సకలలౌకికలను నెరవేర్చునట్టి యావృక్షమునకుఁ బ్రదక్షిణనమస్కారములను జేసిరి. అంతటఁ గుళింగమను పట్టణమునకుఁ బోయిరి. పిమ్మట నభికాలమను పట్టణమునకుఁ బోయిరి. అంతట బోధిభవన పర్వతమునందుఁ బుట్టినదియును, తండ్రితాతలవలన ననుభ

వింపఁబడినదియును, పావనమైనదియును, నగునిక్షుమతీనదిని దాటిరి. అట్లు దాటినవారలై దోసిలితో నాజలమును ద్రాగువారును, వేదపారగులును, నాయిక్షుమతీనదీతీరముననివసించుచుండువారును, నగు బ్రాహ్మణోత్తములను జూచిరి. పిమ్మట బాహ్లీకదేశములను జూచిరి. అంతటను దామమను పర్వతమును బొడఁగనిరి. పిమ్మట నాదూతలు బాహ్లీకదేశసుదామపర్వతములమధ్యభాగమును బట్టిపోవుచు విష్ణుపాదాంకితమైన పవిత్రమగు స్థలమును, విపాశయను పుణ్యనదిని, శాల్మలీవృక్షమును, జూచుచు నదులను, నడబావులను, చెఱువులను, నీళ్లు నిలిచిన పల్లపుప్రదేశములను, కొలనులను, దాటి నానావిధములగు సింహవ్యాఘ్రమృగములను జూచుచు భర్తయొక్క యాజ్ఞను బొందియున్న వారలగుటచేత మిగులఁ బెద్దదియగు మార్గమునందుఁ బోయిరి. అటుపిమ్మట నాదూతలు మిక్కిలి మారమగు మార్గమున నడచుటచే గుఱ్ఱములు అలసటనొందననుసతిత్వరితముగ గిరివ్రజమను పట్టణమునకుఁ బోయిరి. మఱియు నాదూతలందఱును భర్తయగు దశరథునియొక్క ప్రియము కోఱకును, రాజకులమును గాపాడుట కొఱకును, రాజవంశమును వృద్ధిని బొందించుటకొఱకును, బూనికతో బ్రయత్నమును జేయుచున్నవారలగుటచేత ననాదరమును జేయక నతివేగముగఁ బోయి యా రాత్రియందే గిరివ్రజమను నా కేకయ రాజపట్టణమునందుఁ బ్రవేశించిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యరువదేనిమిదవసర్గము ముగిసెను.

భరతుఁడు దుస్స్వప్నములను గనుట.

ఇట్లా దూతలు గిరివ్రజమను పట్టణమునకుఁ బోయిన నాఁటిరాత్రియం భరతునకు దుఃఖకరమగు నీవృత్తాంతమంతయును స్వప్నమునందు గనబడెను. అవ్విధముగ రాజాధిరాజగు దశరథమహారాజునకుఁ బుత్రుఁడగు భరతుఁడా రాత్రి తెల్లవారగానే మిగుల దుష్టమగు నాస్వప్నమును దలఁచుకొని మిగులఁ బరితాపమును బొందెను. అప్పుడు సంతోషకరములగు మాటలను జెప్పుటయందు మిగుల సామర్థ్యము గలవారును, స్నేహితులును నగువారు, భరతుఁ డెందువలన నోపరితాపమును బొందుచున్నాఁడని దెలిసికొని యావ్యసనమును బోఁగొట్టుటకుఁగా మనోహరమైన కథలను సభయందు జెప్పుచుండిరి. అందుఁ గొందఱు దుఃఖశాంతికొఱకు వీణలను వాయించుచుండిరి. కొందఱు నృత్యములను జేయుచుండిరి. మఱికొందఱు నాటకములను ప్రబంధముల నభినయించుచుండిరి. కొందఱు నానావిధములగు హాస్యములను జేయుచుండిరి. అప్పుడు రఘువంశమునందుఁ బుట్టినవాఁడును, మహానుభావుఁడును, నగు భరతుఁడు, సభాయోగ్యములగు నవ్వించుమాటలను జేయుచున్నవారలును, ప్రియముగ మాటలాడుచున్నవారును నగు స్నేహితులవలన సంతోషమును బొందనివాఁడయ్యె. మఱియు నాసభయందుండువారలలో భరతునకు అంతరంగస్నేహితుఁడగు వాఁడొకఁడు భరతుని జూచి యిట్లనియె.

మిత్రుఁడా! భరతుఁడా! నీవు స్నేహితులచేత సేవింపఁబడుచున్నవాఁడవయ్యును సంతోషమును బొందకుండుటకుఁ గారణమేమి? యని యడిగె. అవ్విధముగ నడుగుచున్న స్నేహితుని జూచి భరతుఁ డిట్లనియె.

స్నేహితుఁడా! దేనినిమిత్తముగ నాకు వ్యసనము గలిగియున్నదో దానిం జెప్పెదను. సావధానుఁడవై వినుము. నేను నేటిరాత్రియందుఁ గలలో మలినుఁడును, విఱియఁబోసికొనిన తలవెండ్రుకలు గలవాఁడును, పర్వతాగ్రమునుండి మలినమగు పేడగుంటయందుఁ బడినవాఁడును నగు నాతండ్రిని జూచితిని. మఱియు నాతండ్రియగు దశరథుఁ డట్టి పేడగుంటయందు మునుఁగుచు తేలుచు దోసిలిచేత నూనెను ద్రావుచున్నవానివలెఁ గనఁబడెను. మఱియును మాటిమాటికి నవ్వుచుండెను. ఇట్టి వికారములు గల తండ్రిని నేను స్వప్నమునందుఁ జూచితిని. మఱియును గలలో నాకుఁ గనఁబడిన దశరథుఁడు నువ్వులన్నమును భక్షించుచుండెను. మఱియును మాటిమాటికి శిరస్సు క్రిందుగనున్నవాఁడగుచు నూనెచేతఁ దడుపఁబడిన శరీరము గలవాఁడై యుండెను. మఱియు తైలకూపమునందు మునుఁగుచున్నట్లు కనఁబడెను. మఱియు నో స్నేహితుఁడా! నేను స్వప్నమునందే సముద్రము నెండినదానినిగాను, చంద్రుని భూమిమీదఁ బడినవానినిగాను, ప్రపంచమంతయును చీకటిచేతఁ గప్పఁబడి గాఢాంధకారముగా నుండునట్లును, రాజెక్కఁదగిన యేనుఁగుయొక్క దంతము తుత్తునకలైనట్టుగాను, భగభగమండుచున్న యగ్నిహోత్రమును చల్లారినదానినిగాను, భూమి బ్రద్దలుగా బగిలినట్లుగాను, వృక్షములన్నియు శుష్కించి యెండిపోయినవానినిగాను, కొండలన్నియును నాశనమై యందుండి పొగలై లు దేరునట్లుగాను చూచితిని. మఱియు నో మిత్రుఁడా! నల్లని శరీరము గలవారును, గోరోచనపుఛాయగలవారును నగు స్త్రీలు యినుము చేతఁ జేయఁబడిన పీఠమునందుఁ గూర్చుకొని నల్లని వస్త్రములను ధరించిన నాతండ్రియగు దశరథమహారాజును గుఱించి పకపకమనినవ్విరి. మఱియు నా ధర్మాత్ముఁడై నదశరథమహారాజు ఎఱ్ఱనిపుష్పమాలికలను, మైపూఁతగల

వాఁడును, మహోత్సరపడుచున్నవాఁడును, నైగాడిదెలఁగట్టి
నరథము నెక్కి దక్షిణాభిముఖముగఁబోయెను. ఎఱ్ఱనియు రక్త
వస్త్రమును గట్టుకొనినదియును, వికారమైనముఖముగలది
యునునగు నొకరాక్షసస్త్రీ దశరథమహారాజును బరిహా
సమును జేయుచు దశరథునిఁబట్టుకొని యీడ్చుచుండుటను
స్వప్నమునందుఁజూచితిని. చెలికాఁడా! ఈరాత్రియందు
నేనిట్టిదుస్స్వప్నమును గంటిని. ఈస్వప్నఫలమును విచారిం
పఁగా రాముఁడైనను, నేనైనను, లక్ష్మణుఁడైనను, దశ
రథుఁడైనను మరణమును బొందుదుమని తోఁచుచున్నది. ఏ
మానవుఁడు స్వప్నమందు గాడిదెలతోఁగూడిన వాహనము
నెక్కి పోవునో యామానవుని శరీరము శీఘ్రముగా జితియం
దుంచబడి యతిత్వరలో పీనుగబొగనుజూడవచ్చును. ఇట్టి
స్వప్నమును గనుటవలన నేను మిగుల దుఃఖముగలవాఁడనై
యున్నాను. కాఁబట్టియే మిమ్ములఁ గౌరవింపలేదు. నా
గొంతెండుచున్నది. నామనస్సునందుఁగొంచెమైనను సుఖ
ములేకయున్నది. నాకు భయముగలుగుటకుఁ దగినకారణ
మిప్పుడేమియును గనఁబడలేదు. అయినప్పటికిని భయముగ
లిగియున్నది. కావున నేగద్గదస్వరముగలవాఁడనైతిని. నా
దేహకాంతి తగ్గి తెల్లఁబారినది. నేనే నన్ను దూషించుకొను
చున్నాను. కారణము తెలియకున్నది. నానావిధమయిన
దియును, నిదివఱకెన్నఁడును స్మరింపనిదియును, నగునీదు
స్స్వప్నమునుజూచి, మిగుల దూరమున నున్నదశరథమహా
రాజును దలంచుకొని నామనస్సునకు మిగులభయముగలుగు
చున్నదని భరతుఁడు తనదుస్స్వప్నవృత్తాంతమును సర్వము
ను దనస్నేహితునకు జెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యిరువదితొమ్మి
దసర్గముగిసెను.

దూతలు భరతుని అయోధ్యాపట్టణమునకు రమ్మని ప్రార్థించుట.

అవ్విధముగ భరతుఁడు తనదుస్స్వప్నవృత్తాంతమును
జెప్పుచుండఁగా నయోధ్యాపట్టణమునుండి బయలువెడ
లినదూతలలసినవాహనములుగలవారై మిగులభయంకర
మగునగడ్తగలదియును, మిగుల మనోహరమైనదియునున
గు రాజగృహమును బ్రవేశించిరి. అట్లు ప్రవేశించినపిమ్మట
రాజపుత్రుఁడగు కేకయరాజుచేతఁ బూజితులై యతనిపా
దములకు నమస్కరించి యతనియనుమతమును బొంది భర
తునొద్దకుఁ బోయి యిట్లనిరి.

రాజనందనా! పురోహితుఁడగు వసిష్ఠమునివరుఁడు
కుశలమును జెప్పెను. మంత్రులందఱును కుశలమును జెప్పిరి.
నీతో మిగుల శీఘ్రముగా సంభాషింపవలసియున్నదఁట. కా
వుననిన్ను శీఘ్రముగాఁ బిలుచుకొనిరమ్మనిరి. కాఁబట్టి నీవతి
శీఘ్రముగ బయలువెడలిరమ్ము. ఆలస్యమును జేయకుము.
విశాలాక్షుఁడవైన యోభరతుఁడా! మిక్కిలి మంచివియు
ను, మిగుల వెలగలవియును, నగు నాభరణములను వస్త్ర
ములను మీమేనమామకొఱకుఁ బంపిరి. కాఁబట్టి వీనిని మీమేన
మామకిమ్మని చెప్పిరి. రాజనందనుఁడవైన యోభరతుఁ
డా! యిక్కడ నీతల్లికి తండ్రియైన తాతకివ్వఁదగిన నీవస్త్రాభ
రణములు సరిగా నిరువదికోట్లు వెలగలవి. నీమేనమామ
కివ్వఁదగినవియును, నంతటి వెలగలదేను. అట్లుగా నేనిపది
కోట్ల ధనమునకుఁ దగ్గిన వెలగలవి గావని భరతునితోఁ
జెప్పిరి. అంతట స్నేహితులయందుఁ బ్రియముగల భరతుఁ
డావస్త్రములనన్నింటి నిగ్రహించి యాదూతలకుఁ దగినవిధ
ముగ సత్కారమును గావించి యిట్లనియె.

ఓదూతలారా! నాతండ్రియగు దశరథమహారాజు కు
శలముగనున్నాఁడా? మహానుభావులగు రామలక్ష్మణులుని
రామయులై యున్నారా? బుద్ధిమంతుఁడగు రామునకుఁ ద
ల్లియును, పూజ్యురాలును, ధర్మమునందుఁ బ్రియముగలది
యును, ధర్మములను దెలిసినదియును, సర్వకాలములయం
దును ధర్మమునే చూచుచున్నదియును, నగు కౌసల్యాదేవి
రోగరహితురాలై సుఖముగానున్నదా? లక్ష్మణునకును, వీ
రుఁడగు శత్రుఘ్నునకును దల్లియును, ధర్మములను బాగుగఁ
దెలిసినదియును, రెండవతల్లియును నగు సుమిత్ర రోగరహి
తురాలై సుఖముగానున్నదా? సర్వకాలములయందును ద
నప్రయోజనము నే కోరునదియును, సర్వకాలములయందు
ను గోపముగలదియును, తాను సర్వజ్ఞురాలనని గర్వమును
బొందునదియును, నాకుఁదల్లియు నగు కైకేయి రోగర
హితురాలై సుఖముగనున్నదా? మీరువచ్చునపుడు నాతల్లి
యగు కైకయేమైన సమాచారమును జెప్పెనా? యనియె. ఇ
వ్విధముగ మహానుభావుఁడగు భరతుఁడు చెప్పినమాటల
నువిని యాదూతలందఱును మిగుల వినయముతో నాభర
తునిజూచి యిట్లనిరి.

మానవోత్తముఁడవైన యోభరతుఁడా! నీచే నడుగఁబ
డినవారలు కుశలముగనున్నారు. పద్మము హస్తమునందుఁ
గల మహాలక్ష్మి నిన్నుఁ బొందవలయునని కోరుచున్నది. కా
వున రథమును సిద్ధము జేయింపుమనిరి. అవ్విధముగఁ జెప్పిన
దూతలవచనములను వినివారలను జూచి మరలనిట్లనియె.

ఓదూతలారా! దూతలువచ్చి నన్ను శీఘ్రముగా రమ్మని
పిలుచుచున్నారని మాతాతయగు కేకయరాజుతోఁ జెప్పి
వచ్చెదనని యాభరతుఁడు దూతలతోఁ జెప్పె. రాజనంద

నుఁడగు భరతుఁడు దూతలతో నివ్విధముగాఁ బలికి దూతలచేఁ బ్రేరేపింపఁబడినవాఁడై తాతయొద్దకుఁ బోయి యిట్లనియె.

మహారాజా! కేకయభూపాలా! మాతండ్రి నన్నుఁ బిలుచుకొనిరమ్మని దూతలను బంపె కావున నేను మాతండ్రియొద్దకుఁ బోయెదను. నాకాజ్ఞ నిమ్ము. మరల నీవు తలంచినపుడు నేను వచ్చెదననియె. ఇవ్విధముగ భరతుఁడు చెప్పిన మాటలను విని యతని తాతయగు కేకయమహారాజు భరతుని శిరస్సును ముద్దుపెట్టుకొని యిట్లనియె.

నాయనా! వత్సా! భరతా! నీవు పోయివచ్చుట కనుజ్ఞనిచ్చుచున్నాను. కావున నీవు పోయిరమ్ము. నీవలనఁ గైకేయి సుపుత్రుఁడు గలదయ్యె. నీవు పోయినతోడనే నీతల్లియగు కైకేయితోడను, తండ్రియగు దశరథునితోడను, నేను క్షేమమున నడిగితినని చెప్పుము. పురోహితుఁడగు వసిష్ఠమునివరునితోడను, మఱియు నితరులగు బ్రాహ్మణులతోడను, ధనుర్ధారులలో నుత్తములును, నన్నదమ్ములగు రామలక్ష్మణులతోడను నేను కుశలము నడిగితినని చెప్పుమని చెప్పె. అంత నా కేకయమహారాజు ఇట్లు చెప్పి భరతునిఁ బూజించి యేనుఁగులలో నుత్తమములగు నేనుఁగులను, నానావర్ణములుగల కంబళములను, మఱియు నుత్తమమగు తోళ్ళను నిచ్చె. మఱియు నా కేకయమహారాజు రెండువేల వరహాలను, పదునారునూరుల గుఱ్ఱములను, నింకను నధికమైన ధనమును నిచ్చె. మఱియుఁ గేకయదేశాధిపతియగు నా యశ్వపతిమహారాజు, మిగుల నిష్టులును, నమ్మఁదగినవారలును, గుణవంతులలో నుత్తములును, నగు మంత్రులను భరతునితోఁగూడఁ బోవుటకు నియమించె. ఆసమయమునందు భరతుని మేనమామయగు యుధాజిత్తు భరతునియందలి ప్రియముచేతఁ జూచుటకు మహాసంతోషమును గలిగించునవియును, ఇరావతమను పర్వతమునందుఁ బుట్టినవియును, నింద్రశిరమను పర్వతమునందుఁ బుట్టినవియును, చక్కఁగా నలంకరింపఁబడినవియును, శీఘ్రగమనమునందు మిగుల సమర్థములైనవియును, నగు గాడిదెలను, విశేషధనమును నిచ్చె. మఱియు నా యుధాజిత్తు రాజమందిరమునందుఁ బెంపఁబడినవియును, పెద్దపులుల బలమువంటి బలముగలవియును, కోరపండ్లే యాధారముగాఁ గలవియును, పెద్దశరీరముగలవియును నగు కుక్కలనున్ను యిచ్చెను. ఆసమయమునందుఁ గైకేయీపుత్రుఁడగు భరతుఁ డయోధ్యాపట్టణమునకుఁ ద్వరగాఁ బోవలయునను నభిప్రాయముగలవాఁడగుటచేత కేకయదేశాధిపతిచే నివ్వఁబడిన ధనమును జూచి సంతోషమును బొందనివాఁడయ్యె. మఱియు నప్పుడు భరతుని హృదయమునం దధికమైన విచారము గలిగియుండె. తనకు దుస్స్వప్నము గలుగుటయును, వెంటనే దూతలు వచ్చుటను యోచించి యేమియును దోచనివాఁడయ్యె. అంతట మహాభాగ్యవంతుఁడగు నా భరతుఁడు మానవులచేతను, గజములచేతను, గుఱ్ఱములచేతను, వ్యాప్తమైయున్న తనయింటినుండి బయలువెడలి సర్వోత్తమమగు రాజమార్గమునందుఁ బ్రవేశించె. అంతట మిగుల బుద్ధిశాలియగు భరతుఁడు రాజమార్గమును దాటి యంతఃపురమునొద్దకుఁ బోయె. అంతట శ్రీమంతుఁడగు నా భరతుఁడు నిరాతంకముగ నంతఃపురమునందుఁ బ్రవేశించె. ప్రవేశించి తాతయొక్కయు, మేనమామయొక్కయు ననుమతమును బొంది శత్రుఘ్నునితోఁగూడ రథమునెక్కిపోయె. అప్పుడు సేవకు లనేకు లుత్తమములగు చక్రములుగల యనేకనూరుల రథములతోడను, ఒంటెలతోడను, గుఱ్ఱములతోడను, పదాతులతోడను, గూడుకొనినవారై భరతుని వెంబడించిరి. అవ్విధముగ మహాత్ముఁడగు భరతుఁడు పూజ్యుఁడగు తాత తనవెంట పంపించిన మంత్రులచేతను, సైన్యముచేతను గాపాడఁబడుచు, శత్రుఘ్నునితోఁ గూడుకొని, "ఇంద్రలోకమునుండి సిద్ధుఁడు బయలువెడలినవిధముగఁ" బయలువెడలె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదవసర్గ ముగిసెను.

భరతుఁడు నానావిధ దేశములను దాటి యయోధ్య జేరుట.

అట్లు బయలువెడలిన పిమ్మట రఘుకులోద్భవుఁడగు భరతుఁడు తూర్పుదిక్కు కభిముఖముగా బయలువెడలి ముందుగా సుదామమను పేరుగల నదిని దాఁటె. పిమ్మట మిగుల సంతోషమును గలుగఁజేయునదియును, మిక్కిలి వెడల్పుగలదియును, పశ్చిమాభిముఖముగఁ బ్రవహించుచున్నదియును, శతద్రువమను పేరుగల నదిని దాఁటె. ఇక్ష్వాకుకులనందనుఁడును, శ్రీమంతుఁడును, ద్యుతిమంతుఁడును నగు నా భరతుఁ డా రెండునదులను దాటిన పిమ్మట నేలాధానమను పేరుగల గ్రామమున నున్న నాయేలానదిని దాటె. పిమ్మట సత్యసంధుఁడును, శుచియును, శ్రీమంతుఁడును నగు నా భరతుఁ డపరపర్వటదేశమునకు వచ్చె. అట్లు వచ్చి యా దేశమునకు సమీపమునందుఁ బ్రవహించుచున్నదియును, ఱాళ్ళను నాకర్షించునట్టిదియును, నగు శిలావహమను పేరుగల నదిని దాటె. అంతట దానికి నాగ్నేయదిక్కున నున్న శల్యాకర్తనమను గ్రామమును, తొలుతఁ దాను దాటిన శిలావహానదిని జూచుచుఁ జైత్రరథమను నరణ్యమునందలి పెద్దపెద్దకొండలను జూచె. పిమ్మట యాకొండలనున్ను దాటి సరస్వతీనదిని దానిసమీపమునందున్న మఱియొక నదిని దాటె. అట్లు దాటి వీరిమ

త్స్యదేశముల కుత్తరమునసుండునట్టి భారుండుమనుమహారణ్యమునందుఁబ్రవేశించె. అంతవాభరతుఁడాయరణ్యమునుగడచి యధికమైనవేగముగలదియును, సంతోషమునుగలుగఁజేయునదియును, కొండలనడుముగాఁబవహించుచున్నదియును, నగుకుళింగమను పేరుగలనదిని, యమునానదినిదాఁటె. అట్లుదాటియప్పుడు తనవెంబడివచ్చుచున్న సైన్యమునకుఁ గొంచెము సేపుఅలసటదీర్పదలఁచె. అటుతరువాత కళింగా యమునానదులసంగమస్థలమునందు గుఱ్ఱములయలసటనుదీర్చి నీళ్ళచేతగుఱ్ఱములనుదోమించి తానునునకుఁడస్నానమునుజేసె. అంతటజలపానమునుజేసి యిఁకమీఁదటమార్గమున నీళ్లుదొరకవని తెలిసికొని నెల్లవారలకును గావలసినంతయుదకమును సంగ్రహించుకొనియక్కడనుండిబయలువెడలె. పిమ్మటశుభకరుఁడును, రాజపుత్రుఁడును, నగుభరతుఁడు పూర్వమెన్నఁడును జూడనియాయరణ్యమును తానేనుగుమీదనెక్కికొని "వాయువుగగనమును దాటినవిధముగ" దాటెను. అంతటరఘుకులోద్భవుఁడగు భరతుఁడు ప్రసిద్ధమైన ప్రాగ్వటమనుపట్టణమునందలి యంశుధానమనుస్థలమునందు దాటుటకుశక్యముగాని గంగానదినిశీఘ్రముగాదాటెను. అవ్విధముగఁ బ్రాగ్వటమనుపట్టణమునందు గంగానదినిదాటికుటికోష్ఠికయను నదియొద్దకుఁబోయె. పోయిచతురంగబలములతోఁగూడ నానదినిదాటి వెంటనేబలవర్థనమనుపట్టణమునకుఁబోయెను. పిమ్మటనాభరతుఁడు తోరణమనుగ్రామముయొక్క దక్షిణభాగముచేత జంబూప్రస్థమను గ్రామమునకుఁబోయె. అంతటనాగ్రామమునుండిబయలువెడలి మిగులరమ్యమగు వరూథమనుపట్టణమునకుఁబోయె అట్లుపోయినపిమ్మట నాగ్రామసమీపమునందున్నదియును, రమ్యమైనదియునునగు నరణ్యమునందుఁ గొంచెముసేపునివసించె. పిమ్మటనాభరతుఁడు అక్కడినుండిబయలువెడలికదంబవృక్షములతోనిండియున్న ఉజ్జిహానపట్టణముయొక్క ప్రాంతమునందున్న యుద్యానవనమునుజూచె. మఱియునాభరతుఁడు కదంబవృక్షములను, సాలవృక్షములను, చూచినతోడనే తనసైన్యమునకు సర్వమునకును తిన్నగారావచ్చునని నను జ్ఞనిచ్చి తానతివేగముగలగుఱ్ఱములనెక్కికొని యధికత్వరగలవాఁడైపోయె. పిమ్మటనాభరతుఁడు సర్వతీర్థమను గ్రామమునకుఁబోయియందుఁగొంచెముసేపునివసించి పిదపనుత్తానికయనునదిని దాఁటె. మఱియునానాపథములగు నదులనుగూడదాటె. పర్వతములయందుఁబుట్టినగుఱ్ఱములచేత వానినన్నిటినిదాటి హేమఁగువీపుమీదనెక్కి కుటికయనునదినిమాత్రము దాఁటె. అట్లుదాఁటికొంతదూరముపోయి మానవోత్తముఁడగునాభరతుఁడు లౌహిత్యనగరమునకుఁబోయె. అట్లుపోయికపీవతియను పేరుగలనదినిదాటె. అంతనాభరతుఁడు కొంతదూరముపోయి యేకసాలమనుపట్టణమునందు స్థాణుమతీనదినిదాటె. పిమ్మటవినతయను నగరమునకుఁబోయి దానిసమీపమునందున్న గోమతీనదినిదాఁటె. అక్కడనుండిబయలువెడలి కళింగనగరసమీపమునందలి సాలవనమునుబొందె. అప్పుడాభరతుఁడు అలసినగుఱ్ఱములుగలవాఁడయ్యును, నాయరణ్యమునుదాటి మరునాటిసూర్యోదయకాలమునకు మనువుచేతనిర్మింపఁబడిన యయోధ్యాపట్టణమునజూచె. పురుషోత్తముఁడగుభరతుఁడు మార్గమునందేడుదినములుగడపి యెనిమిదవనాటి ప్రాతఃకాలమునందయోధ్యాపట్టణమునుజూచి సారథితోనిట్లనియె.

సారథీ! పావనములయిన యుద్యానవనములు గలదియును, సర్వోత్తమమగుకీర్తికలదియును, పాండువర్ణనుగమ్మ తికగలదియును, యజ్ఞములనుజేసిన బ్రాహ్మణులతోఁగూడినదియును, వేదవేదాంగవేత్తలగు బ్రాహ్మణోత్తములచేవ్యాప్తమైనదియును, మఱియునుసర్వసమృద్ధులగు బ్రాహ్మణులచేవ్యాపింపఁబడినదియును, రాజర్షియగు దశరథమహారాజుచే బరిపాలింపఁబడినదియును, నగునీయయోధ్యాపట్టణము దూరముననుండియే మనకుఁగనఁబడుచున్నది. చూడుము. యోచించిచూడగా బూర్వమువలెనుండక గాంతిహీనమైయున్నట్లు కనఁబడుచున్నది. అందువలన సంతోషములేనిదానివలె యున్నట్లుతోఁచుచున్నది. పూర్వమయోధ్యాపట్టణముయొక్క నాలుగుతెట్లును స్త్రీపురుషుల కలకలధ్వనులు దూరమునకేవినఁబడుచుండును. ఇప్పుడట్టిధ్వనివినఁబడడములేదు. విచారింపఁగాసద్దుమణిగినట్లున్నది. సాయంకాలముమొదలుకొని ప్రాతఃకాలమువఱకును నానావిధజనులచేత బహువిధములుగఁ గ్రీడింపఁబడుచున్న యుద్యానవనములు నిర్మానుష్యముగనున్నట్లు కనఁబడుచున్నవి. (అనగానుద్యానవనములయందెవ్వరును గ్రీడించుటలేదని తోఁచుచున్నదనుట) ఇప్పుడాయుద్యానవనములన్నియును గాముకులచేతవిడువఁబడినవై యేడ్చుచున్నవానివలెనున్నవి. మఱియునోసారథీ! అయోధ్యాపట్టణమడవియైనట్లులున్నది. ఇప్పుడీపట్టణమునందు మునుపటివలెనేయేనుఁగులను, గుఱ్ఱములనునెక్కిజనులు వచ్చుచుఁబోవుచున్నట్లు కనఁబడుటలేదు. పూర్వమునం దుద్యానవనములుమదించినవియును, సంతోషమునుగలిగించునవియును, రతిసంయోగములయందు మిగులగుణవంతములైనవియునునై ప్రకాశించుచుండును. అటువంటియుద్యానవనములిప్పుడునిరానందములై ప్రకాశహీ

నములై యున్నవి. మార్గమునకు సమీపమునందు రాలిన యాకులుగల వృక్షములన్నియును నేడ్చుచున్నట్లు కనఁబడుచున్నవి. ఇప్పుడు ప్రాతఃకాలమైనప్పటికిని మదించిన మృగపక్షులయొక్క మధురమైనదియును, రాగయుక్తమైనదియు నునగు ధ్వని వినఁబడడము లేదు. పూర్వము ప్రాతఃకాలము కాఁగానే మృగములును, పక్షులును, మిగుల మనోహరముగ ధ్వనిని జేయుచుండును. ఇప్పుడు మునుపటివలెనే యీ యయోధ్యాపట్టణమునందుఁ జందనాగరు గంధములయొక్క ధూపములతోఁ గూడినదియును, నిరుపమానమైనదియును, శుభకరమైనదియును, మనోహరమైనదియును నగు గాలి వీచుట లేదు. మునుపు యీ పట్టణమున సర్వకాలములయందును, మిగుల గంభీరమైన భేరీమృదంగవీణాదులయొక్క ధ్వని వినఁబడుచుండును. అట్టిధ్వని యిప్పుడు వినఁబడలేదు. మఱియు నశ్వములను దెలుపునవియును, క్రూరములైనవియును, మనోహరములు గానివియును, నానావిధములును నగు దుర్నిమిత్తములు గనపట్టుచున్నవి. కావున నా మనస్సునకు మహావ్యసనము గలుగుచున్నది. ఓ సారథీ యేవిధముచేత విచారించి చూచినను నా బంధువులు కుశలముగా నుండలేదని తోఁచుచున్నది. దుఃఖమునకుఁ దగిన కారణము లేకపోయినను నా మనస్సున నిట్టి దుఃఖము పుట్టెను. కావున నేదియో యనర్థము సంభవించియుండునని తోచుచున్నది. అవ్విధముగఁ జెప్పి యా భరతుఁడు మిక్కిలి దుఃఖముగలవాఁడును, ఆయాసమును బొందిన మనస్సుగలవాఁడును, కలతనొందిన యింద్రియములుగలవాఁడును, నై యిక్ష్వాకువంశోద్భవులగు రాజులచేఁ బాలింపఁబడిన యయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించె. బడలిన గుఱ్ఱములుగల యా భరతుఁడు వైజయంతమను పేరుగల ద్వారముచేఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించునపుడు ద్వారమునందున్న కావలివారలు దిగ్గన లేచి జయమే వా, యని పలికిరి. అద్వారపాలకులచే జయశబ్దములను నడుగబడి భరతుఁడు వ్యాకులమైన మనస్సుగలవాఁడై ద్వారమునందున్న యా జనములను బూజించి తనకుఁ బ్రియుఁడును, తన తాతయగు కేకయాధిపుఁడగు నశ్వపతికి సారథియును నగువానితో నిట్లనియె.

నిష్కల్మషుఁడవైనయో సారథీ! నన్నేమినిమిత్తముగ నిక్కడకు మిగుల శీఘ్రముగ రప్పించిరో? ఆ కారణము తెలియకున్నది. కావున నే నామనస్సునందు అశుభశంక గలిగియున్నది. అదియునుఁ గాక నా మనస్సునందలి సహజధైర్యము నాశమైనది. సారథీ! పూర్వము నేను, రాజుమరణమును బొందినప్పుడెట్టి యమంగళములు గలుగునని వినియుంటినో యట్టి యమంగళము లిప్పుడు గనఁబడుచున్నవి. మఱియును రాజమ రణచిహ్నములే కనఁబడుచున్నవి. కుప్పనూడ్చక పోవుట వలన పరిశుద్ధముగా నుండనివియును, మూయఁబడని తలుపులుగలవియును, సర్వవిధములచేతను కాంతిహీనములైనవియును, బలికర్మలు లేనివియును, ధూపసమ్మోదములు లేనివియును, భోజనమును జేయని కుటుంబములుగలవియును, నిస్తేజసులగు జనులుగలవియును, సంపద లేనివియును, నై గృహస్థుల గృహములు కనఁబడుచున్నవి. దేవాలయములన్నియును మునుపటివలెఁ జక్కఁగఁ బ్రకాశించుచుండడము లేదు. మఱియు నిప్పుడు దేవాలయములన్నియును, పుష్పమాలికలు మొదలగువానిచేత నలంకరింపఁబడియుండలేదు. దేవాలయములయొక్క ముంగిలిప్రదేశముల నూడ్చబడియుండలేదు. మఱియును దేవాగారములన్నియును శూన్యములై యున్నవి. ఇప్పుడు దేవపూజలు నశింపఁబడియున్నవి. (అనఁగా దేవపూజల నెవ్వరును జేయడము లేదు.) యాగసభలును నటులనే యున్నవి. పుష్పమాలికలనమ్మునట్టి యంగళ్ళయందుఁ బుష్పమాలికలగుబడలేదు. ఇప్పుడీపట్టణమునందలి వర్తకులందఱును వ్యసనముతోఁ గూడిన మనస్సులుగలవారు, వ్యాపారము లేనివారుగను, నైయున్నారుగాని పూర్వమువలెఁ జక్కఁగ సంతోషముతోఁ బ్రవర్తించడము లేదు. అటులనే దేవాలయములయందును, రచ్చమంటపములయందును, పక్షులసముదాయములన్నియును దీనములై యున్నవి. మఱియు నిపట్టణమునందిప్పుడు స్త్రీపురుషాత్మకమైన జనమంతయును, మలినస్వభావముగలదై యున్నది. మఱియును గన్నీళ్ళను గార్చుచున్నది. ఇంతయగాక దుఃఖముగలదియును, విచారమునందు మునిఁగియున్నదియును, కృశించినదియును, పరితాపముగలదియును నై యున్నది. ఇవ్విధముగ సర్వమును వికారమును బొందియున్నట్లు నాకుఁ గనఁబడుచున్నదని భరతుఁడు సారథితోఁ జెప్పె. ఇవ్విధముగ నా భరతుఁడు దీనమానసుఁడై సారథితోఁ జెప్పి యా యనిష్టములనన్నిటిని జూచుచు రాజగృహమునకుఁ బోయె. మఱియు నా భరతుఁడు జనులు లేని చతుష్పథములును, గృహములును, రాజమార్గములుగలదియును, దుమ్ముచేతఁ గప్పఁబడుటవలన నెఱ్ఱనైన వాకిలియందలి తలుపులదారుబంధములుగలదియును, ఇంద్రపట్టణమగు నమరావతితో సమానమైనదియును, నగు నయోధ్యాపట్టణమును జూచి యధికముగ దుఃఖమును బొందినవాఁడయ్యె. మఱియును పూర్వమెప్పుడును నయోధ్యాపట్టణమునందుఁ గనఁబడనివియును, మనుష్యునకు నిష్టములుగానివియును నగు నపశకునములను జూచి వంపఁబడిన శిరస్సుగలవాఁడును, దీనమయిన మనస్సు గలవాఁడును, సంతోషము లేనివాఁడును, మహానుభావుఁ

డును నైనభరతుఁడు తండ్రిగృహమునకుఁబోయెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదొకటవసర్గ ముగిసెను.

—{ భరతుని తోడ కైకేయి దశరథమహారాజు మరణమును బొందెనని చెప్పుట. }—

అట్లుపోయినపిమ్మట నా భరతుఁడు తండ్రియంతఃపురమున దండ్రి లేనందున తల్లియింటియందున్నాఁడేమోయని తలఁచి యచటికి వెడలఁబోయెను. అప్పుడా కైకేయి దేశాంతరమునుండి వచ్చిన పుత్రునిఁ జూచినతోడనే పరమసంతోషముగలదై సువర్ణమయమగు నాసనమును వదలి లేచెను. అప్పుడు ధర్మస్వభావుఁడైనయా భరతుఁడు ప్రకాశహీనమైన తల్లిగృహమునందుఁ బ్రవేశించినతోడనే మంగళకరములగు తల్లిపాదములకు నమస్కారమును జేసెను. అంతనా కైకేయి పుత్రుని యొక్క శిరంబును ముద్దుపెట్టుకొని యాలింగనమును జేసికొనియెను. పిమ్మట యశోవంతుఁడగు నా భరతుని దొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని సంగతులనడుగుట కారంభించి యిట్లనియెను.

వత్సా! భరతుఁడా! తాతయింటినుండి బయలు వెడలి యెన్నిదినములైనది. అతివేగముగా వచ్చుచున్న నీకు మార్గమునందాయాసము విశేషముగాఁ గలుగలేదుగదా? నాయనా! భరతా! పూజ్యుఁడును నీకు మేనమామయును, నగు యుధాజిత్తు కుశలముగనున్నాఁడా! మఱియును నీకు దూరదేశమునందుండుటవలన సుఖముగనున్నదిగదా? ఆవిషయమంతయును సవిస్తరముగ నాకుఁ జెప్పుమని యడిగెను. ఇవ్విధముగఁ గైకేయి చెప్పిన మాటలను విని రాజపుత్రుఁడును, తామరపూవులవంటి నేత్రములుగలవాఁడును, నగు నా భరతుఁడు పరమసంతోషముతో నడిగిన విషయములనన్నింటిని జెప్పి యిట్లనియెను.

అమ్మా! నేను మాతామహుని గృహమునుండి బయలువెడలి నేటికేడవదినమైనది. మీ తండ్రి క్షేమముగనున్నాఁడు. నా మేనమామయును కుశలముగనున్నాఁడు. శత్రుమర్దనుఁడగు కేకయమహారాజు నాకిచ్చిన ధనమును దీసికొనివచ్చుచున్న గుఱ్ఱములను నేనుగులను మార్గమునందలయుటచేత మెల్లగా వచ్చుచున్నవి. వానిని మెల్లగా వచ్చునట్లు నియమించి నేను మాత్రము ముందుగా వచ్చితిని. రాజగు దశరథమహారాజుచేఁ బంపఁబడిన దూతలు నన్నుఁ దొందరపెట్టుటచేత నేను శీఘ్రముగా వచ్చితిని. నే నొక విషయము నడిగెదనో యావిషయమును దాచక చెప్పుము. తల్లీ! బంగారు చేత నలంకరింపఁబడిన నీ శయ్యాశూన్యముగ నుండుటకుఁ గారణమేమి? ఇచటఁ గాదశరథమహారాజు క్షేమముగనున్నాఁడని నాకుఁ దోచడము లేదు. నా తండ్రియగు దశరథమహారాజు సాధారణముగాఁ దల్లివగు నీ యొక్క శయ్యయందే యుండును. నేను దశరథమహారాజును జూచుటకు వచ్చి యునన్ను హానియడుగనఁబడలేదు. నాకీ విషయమును జెప్పుము. నేను శీఘ్రముగ నా తండ్రి పాదపద్మములకు నమస్కారమును జేయవలయును. ఒకవేళ మా తండ్రియగు దశరథుడు గౌసల్యాగృహమునందుండియున్నాఁడా? యనియడిగెను. అనియిట్లు భరతుఁడడిగిన కైకేయి రాజ్యలోభముచేత మోహితురాలగుటవలన నే విషయమును దెలియని యా భరతుని తోడ నయిష్టమైనమాటను యిష్టమైనమాటనుగాఁ దలఁచి యిట్లనియెను.

మహానుభావుఁడును, తేజోవంతుఁడును, యాయజూకుఁడును, సత్పురుషులకుగతియునునగు దశరథుఁడు సకలభూతములును బొందునట్టిగతిని బొందెను. (అనఁగా మరణమును బొందెననుట.) ధర్మబుద్ధిగలవాఁడును, నుత్తమకులమునందుఁ బుట్టినవాఁడును, పరిశుద్ధుఁడునునగు నా భరతుఁడు తల్లి చెప్పిన కఠినవాక్యమును విని తండ్రియొక్క మరణదుఃఖమును బట్టఁజాలక తత్క్షణమున క్రిందఁబడి మూర్ఛ నొందెను. అంతలో తెలివొంది మహాబాహుఁడును, సర్వోత్తమమైనపరాక్రమముగలవాఁడును, నగు భరతుఁడయ్యో నేను హతమైతినిగదా, యనియెను. మఱియును దీనముగ మాటలాడుచున య్యోయని చేతులెత్తి హా తండ్రీ! యనియేడ్చుచు నేలఁబడి మరల మూర్ఛనొందెను. అటుపిమ్మట నధికమైన కాంతిగల భరతుఁడు పితృమరణదుఃఖముచేతఁ గప్పఁబడిన కాంతిగలవాఁడయ్యెను. మఱియును పితృమరణదుఃఖముచేఁ బీడింపఁబడినవాఁడును, భ్రాంతిచే తెసుఁడునునై యధికముగ రోదనమును జేసె అట్లు రోదనమును జేయుచు నిట్లనియెను.

అయ్యో నా తల్లియొక్క శయ్యయందుఁ బరుండి దశరథభూవల్లభుఁడు శరత్కాలరాత్రియందుఁ జంద్రుఁడు ప్రకాశించువిధముగ ప్రకాశించుచుండెను. అటువంటి నా తండ్రి శయ్యయందు లేకపోవుటచేత నిది చంద్రుఁడు లేని శరత్కాలరాత్రివలె నిస్తేజస్కమైయున్నయది. మఱియు నిప్పుడు బుద్ధిమంతుఁడగు నా తండ్రిచేత విడువఁబడిన యీ శయ్య చంద్రుఁడు లేనియాకాశమువలెను, జలము లేని సముద్రమువలెను, ప్రకాశహీనమైయున్నదని రోదనమును జేసెను. అధికమైన దుఃఖముచేత బాధింపఁబడుచున్నవాఁడును, జయశీలురలో నుత్తముఁడును, నగు భరతుఁడు గద్గదస్వరముచేతఁ గన్నీ

ళ్ళు

కొని ఘోరముఘోరముగ దుఃఖించెను. అవ్విధముగ దుఃఖమును బొందుచున్నవాఁడును, దేవతలతో సమానుఁడును, నేల

యుండఁబడియున్నవాఁడును, యరణ్యమునందు గొడ్డలిచే నరుకఁబడిన మద్దిచెట్టుయొక్క బోదెవలెనున్నవాఁడును, మదపుటేనుఁగువలె నున్నవాఁడును, చంద్రసూర్యులతో సమానుఁడును, శోకపీడితుఁడునునగు భరతుని లేవఁదీసి యిట్లనియె.

మహాకీర్తిగల రాజపుత్రుఁడా! భరతా! లెమ్ము లెమ్ము! ఎందుకుఁ బరుండెదవు? సభాపూజ్యులగు నీయట్టిసత్పురుషులివ్విధముగ దుఃఖమును బొందఁదగదు. మిగులబుద్ధిమంతుఁడా! భరతా! దానయజ్ఞాధికారముగలదియును, సత్స్వభావ వేదవాక్యముల ననుసరించునదియునునగు నీబుద్ధి మందరపర్వతమునందలి సూర్యునియొక్క కాంతివలె సర్వకాలములయందును బ్రకాశించుచుండును. ఇటువంటిబుద్ధిమంతుఁడవగు నీవివ్విధముగ దుఃఖమును బొందనగునా? యనియె. ఇట్లు కైకేయి చెప్పుచుండినను భరతుఁడు చాలసేపు నేలఁబడి పొర్లిపొర్లి యేడ్చి యనేకవిధములగు వ్యసనములుగలవాఁడై తల్లితో నిట్లనియె.

అమ్మా కైకేయీ! నన్ను బిలిపించుటచేత దశరథమహారాజు రామునకుఁ బట్టాభిషేకము నేఁ జేయునో, లేక తాను యజ్ఞము నేమైనఁ జేయునేమో, యని తలఁచితిని. అట్టియభిప్రాయముతోడనే బహుశీఘ్రముగ మార్గమునందు నడచితిని. అటువంటి నాయభిప్రాయ మిప్పుడివ్విధముగా వ్యత్యయమును బొందెను. సర్వకాలములయందును నాకుఁ బ్రియములును, హితములునునగు కార్యములను జేయుటయందుఁ గోరికగల తండ్రినిఁ జూడకపోవుటచేత నామనస్సు బ్రద్దలగుచున్నది. అయ్యో, నేనేమి చేయుదును. అమ్మా! నేను లేనిసమయమునందు దశరథమహారాజు మరణమును బొందెనుగదా? ఏవ్యాధిచేత మరణమును బొందెను. తండ్రియగు దశరథునకుఁ బరలోకక్రియలను సల్పిన రామాదులందఱును ధన్యులైరి. అయ్యో, నేనుగూడఁ దండ్రియగు దశరథునకుఁ జేతులారఁ బరలోకక్రియలను జేయనైతిని. అయ్యో దశరథమహారాజు నేనిక్కడకువచ్చినసంగతిని నెఱుఁగడుగదా? నేనువచ్చినసంగతిని దెలిసికొనెనేని నాతండ్రియగు దశరథుఁడు నాశిరస్సును ముద్దుపెట్టుకొనునుగదా? మా తండ్రి నాశరీరముమీఁది దుమ్మును దుడుచుచుండును. ఎట్టిదుష్కరకార్యములైనను సులభముగఁ జేయునట్టి నాతండ్రియొక్కయాహస్తము సుఖస్పర్శగలదైయుండును. అటువంటిహస్త మిప్పుడెక్కడనున్నది. నాకెవ్వఁడన్నయును, దండ్రియును, బంధువును, నైయుండునో, మఱియు నెవ్వనికి నేనుదాసుఁడనైయుండునో యటువంటిరాముఁ డెక్కడనున్నాఁడు. నాదుఃఖమును సర్వమును బోఁగొట్టఁదగిన రామునకు నేనువచ్చియుండుటను దెలుపుము. శ్లో॥ పితా హి భవతి జ్యేష్ఠో ధర్మమార్యస్య జానతః,, ధర్మములను నెఱిఁగినవానికి అన్నయగువాఁడే గదా? తండ్రి. కావున నా యన్నయుండుచోటును జెప్పుము. నేనిప్పుడా మహనీయుని పాదములకు నమస్కరించి పితృమరణదుఃఖమును బోఁగొట్టుకొనియెదను. తల్లీ! కైకేయీ! ధర్మములను జక్కఁగఁ దెలిసినవాఁడును. ధర్మమునందే స్థిరముగనుండువాఁడును, సత్యసంధుఁడును, దృఢవ్రతుఁడును, పూజ్యుఁడును, బ్రభువును, సత్యపరాక్రమముగలవాఁడును తండ్రియునునగు దశరథమహారాజు మరణకాలమునందేమని చెప్పెను. మఱియు నన్నుగూర్చి యేమి చెప్పెను. మహానుభావుఁడును, నాకుఁ దండ్రియు నైనగు దశరథమహారాజుయొక్క కడపటి యాజ్ఞను జక్కఁగా వినవలయునని కోరికగలిగియున్నది. కావున ఓయమ్మా! నాకోరికను దీర్చికొనియెదననియె. ఇవ్విధముగఁ బలుకుచున్న భరతునితోఁ గైకేయి జరిగినవృత్తాంతమును సర్వమును యథార్థముగాఁ జెప్పఁదలఁచి యిట్లనియె.

తండ్రీ! భరతా! మంచిగతిగలవారలలోపల శ్రేష్ఠుఁడును, మహాత్ముండును, నగు దశరథమహారాజు, హా రామా! హా సీతా! హా లక్ష్మణా! యని విలపించుచుఁ బరలోకమును బొందెను. నీతండ్రియగు దశరథమహారాజు పాశములచేత మహాగజము బంధింపఁబడినవిధముగ యమునిపాశములచేతఁ జుట్టఁబడి సీతారామలక్ష్మణులను గుఱించి విలపించుచు మఱియు నీమాటను చెప్పి ప్రాణములను విడిచెను. ఏమనిన. ఎవ్వరు మరల నిక్కడకువచ్చిన సీతను, రాముని, మహాబాహువగు లక్ష్మణునిఁ జూతురో వారు ధన్యులగుదురని నీ తండ్రియగు దశరథమహారాజు మరణకాలమునందుఁ జెప్పెనని చెప్పె. అని యిట్లు కైకేయి చెప్పిన భరతుఁడు విని రెండవతూరి కైకేయి చెప్పిన రాముఁడింటలేఁడను నప్రియవచనమునకు మిగులదుఃఖమును బొందెను. ఇట్లధికమైనదుఃఖముగలవాఁడై మరలఁ దల్లిని జూచి యిట్లనియె.

అమ్మా కైకేయీ! కౌసల్యానందవర్ధనుఁడును, ధర్మాత్ముఁడును, నగు రాముఁడు, తమ్ముఁడగు లక్ష్మణునితోడను, భార్యయగు సీతతోడను నిప్పుడెక్కడకుఁ బోయెను? ఆవిషయమును సర్వమును సంపూర్ణముగఁ జెప్పుమనిన విని యాకైకేయి, మిక్కిలియనిష్టమునుగలుగఁ జేయునదియును, మిక్కిలి కఠినమైనదియును నగువచనము, భరతునకు సంతోషమును గలుగఁ జేయునను నభిప్రాయముతో రామునివృత్తాంతమును యథార్థముగఁ జెప్పుటకుఁ బ్రారంభించె. పుత్రుఁడా! భరతా! రాజనందనుఁడగు రాముఁడు, నారచీరలను, జడలను ధరించి దండకమను పేరుగల మహారణ్యమునకు సీ

కాలక్ష్మణులతోఁగూడఁ బోయెననియె. ఆవచనమునువిని భరతుఁడు తనకులమువారి నిర్మలచరిత్రలను దలఁచుకొని యన్నయగు రాముఁడు పూర్వులయాచారమునకు విరుద్ధముగ సంచరించుటవలన నిట్టియాపదగలిగెనేమోయను భయముగలిగి మరల కైకేయినిజూచి యిట్లనియె.

అమ్మా! కైకేయీ! రాముఁడు బ్రాహ్మణుల ద్రవ్యమునేమియును నపహరింపలేదుగదా? రాముఁడు నిష్కారణముగ ధనికులనైనను, దరిద్రులనైనను జంపలేదుగదా? రాజపుత్రుఁడగు రాముఁడు పరభార్యలనుబట్టలేదుగదా? మఱియేకారణమువలన "వేదవేదాంగవేత్తయగు బ్రాహ్మణునిఁజంపినవానివలె" రాముఁడు ఘోరమగు దండకారణ్యమునకుఁబోయెను. ఆవిషయమును సర్వమును దెలుపుమనియె. అంతటనా కైకేయి, స్త్రీలకు సహజమైనస్వభావమగు చాపల్యముచేత మనస్సునుదాఁచలేక తాను జేసినదుష్కృత్యమును సర్వమును యథార్థముగఁజెప్పుటకారంభించి యిట్లనియె.

అవ్విధముగ, మహానుభావుఁడగు భరతుఁడడిగినమాటనువిని తానుమూఢురాలగుటచేత నతనియభిప్రాయమును దెలియఁజాలక పండితురాలనని వృథాగర్వముగలదై యిట్లనియె.

నాయనా! భరతా! రాముఁడు బ్రాహ్మణులద్రవ్యమునపహరింపలేదు. ధనికులనుజంపలేదు. దరిద్రులనునాశమునుబొందింపలేదు. ఇంతియగాక మఱియేవిధమయినపాపకృత్యమునుగూడఁజేయలేదు. రాముఁడు పరులభార్యలను నేత్రములతోఁగూడఁజూడఁడు. నీతండ్రియగు దశరథమహారాజు రామునకుఁబట్టాభిషేకమును జేయవలయునని యభిలషించి దానికిఁదగినకార్యములను సిద్ధము జేయుచుండె. ఆసంగతినినేనువిని రామునినరణ్యమునకుఁ బంపుమనియును, నీకుఁబట్టాభిషేకమును జేయుమనియును యాచించితిని. అంతటదశరథమహారాజు సత్యవ్రతమునువదలఁజాలక నేనుగోరినవిధముగఁజేసె. పిమ్మటసీతాలక్ష్మణులతోఁగూడ రామునినరణ్యమునకుఁబంపె. అంతటగొప్పదగుకీర్తిగలవాఁడును, భూమినిబాలించువాఁడునునగు దశరథమహారాజు ప్రియపుత్రునిఁజూచుట యిఁకసంభవింపదేమని యధికమైనదుఃఖముగలవాఁడై మరణమునుబొందె. కావునధర్మజ్ఞుఁడవైనభరతుఁడా! నీవిప్పుడు రాజ్యమునవలంబించి భూమినిబరిపాలింపుము. నిన్నురాజునుగాఁజేయఁదలఁచి నేనీకార్యమును సర్వమునుజేసితిని. పుత్రుఁడా! నీవుశోకమునుబొందకుము. సంతాపమును జెందకుము. ధైర్యమునాశ్రయింపుము. ఈపట్టణమంతయునునీయధీనమైనది. కావున నేవిధమైనకొందరయును లేనివాఁడవై పరిపాలనను జేయుము. మఱియు నోపుత్రుఁడా! శాస్త్రవేత్తలగు వసిష్ఠాది బ్రాహ్మణోత్తములతోఁగూడి యతిశీఘ్రముగ నదీనసత్వముగల దశరథమహారాజును సంస్కరించి నీవుపట్టాభిషిక్తుఁడవగుము.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదిరెండవ సర్గముగిసెను.

—{ తండ్రిమరణమునువిని భరతుడు కైకేయిని నిందుంచుట. }—

అవ్విధముగ భరతుఁడుతండ్రియొక్కమరణవృత్తాంతమును సర్వమును కైకేయివలనవిని యన్నదమ్ములు దండకారణ్యమునకుఁ బోవుటను దెలిసికొని యధికమైనదుఃఖముచేఁబరితపించుచునిట్లనియె.

ఓకైకేయీ! పితృహీనుఁడను, భ్రాతృశూన్యుఁడను నైననాకిఁకమీఁద రాజ్యమువలననేమి ప్రయోజనము గలదు. అయ్యో, అన్నయును లేక తండ్రియును లేక నేనుదిక్కులేనివాఁడనై హతుఁడనైతినిగదా? కైకేయీ! నీవుదశరథమహారాజునుజంపితివి. రామలక్ష్మణులను సీతాసహితముగ నరణ్యమునకుఁబంపితివి. ఇట్లుచేయుటచేతశోకదుఃఖముమీఁదనింకొకదుఃఖమునుగల్పించినదాననైతివి. ఇంతియగాకపుండుమీఁదక్షారము బెట్టినట్లయ్యె. ఓకైకేయీ! నీవుకులనాశముకొఱకుఁ గాళరాత్రివలె మాయింటఁజేరితివి. మాతండ్రి తెలియకనిప్పువంటినిన్ను ఆలింగనము జేసికొనియె. తెలియకనిన్నుఁ బెండ్లిచేసికొని నందుకుతుదకుమరణమునుబొందె. ఓపాపస్వభావముగలదానా! మాతండ్రినినిష్కారణముగఁజంపితివిగదా? ఓకులనాశకురాలా! బుద్ధిలేక మోహమువలననిఁకమీఁదమాకులము వారలలోనెవ్వరునుసంతోషమునుబొందకుండునట్లుచేసితివిగదా? సత్యసంధుఁడును, నధికమైనకీర్తిగలవాఁడునునగు దశరథమహారాజునిన్నుఁబొందియిప్పుడు తీవ్రదుఃఖమునుసహింపఁజాలకమరణమునుబొందెనుగదా? ధర్మాత్ముఁడును, మహారాజునునగునాతండ్రినినెందుకుఁజంపితివే? రామునినేమినిమిత్తముగ నరణ్యమునకుఁబంపితివే? ఆహాయెంతదుష్కృత్యమునుజేసితివి? ఓపాపిష్ఠురాలా! నాకుఁదల్లివగు నీవలనఁ గౌసల్యాసుమిత్రలిరువురును పుత్రదుఃఖమునుబొందింపఁబడినవారైరి. ఇట్టిదుఃఖముగలయాయిరువురునిఁకనెట్లుజీవింపఁగలరు. గురువుయొద్ద నెట్లుసంచరింపవలసినవి యనుదక్కఁగనెఱిఁగినవాఁడును, ధర్మాత్ముఁడును, పూజ్యుఁడునునగు రాముఁడేవిధముగాఁదనతల్లికి శుశ్రూషను జేయునో యావిధముగా నేనీకును శుశ్రూషను జేయునుగ

దా? మఱియు నావిధముగానే దీర్ఘాలోచనగలదియును, నాకుఁ బెద్దతల్లియును, నగుకౌసల్యాదేవి ధర్మమార్గమును దప్పకనీయందుఁ దల్లియందువలెనే, యుండునుగదా? ఓపాపాత్మురాలా! బుద్ధిమంతులలో నుత్తముఁడును, కౌసల్యకుఁ బుత్రుఁడునునగు రాముని నారచీరలు మొదలగువానిని ధరించుకొనునట్లు చేసి యరణ్యమునందు నివసించుటకుఁ బంపితివి. అట్లుపంపి కొంచెమైనను దుఃఖమును బొందక యెట్లున్నావు? కొంచెమైనను పాపమును జేయనివాఁడును, బుద్ధిమంతులలో నుత్తముఁడును, అధికమైనకీర్తిగలవాఁడును. నగు రాముని నారచీరలే వస్త్రములుగలవానినిగాఁ జేసి యరణ్యమునకుఁ బంపితివే? ఇట్లు పంపుటకేమి కారణమును జూచితివి. నేను రామునియందుఁ బరమభక్తిగలవాఁడనై యున్నానని లుబ్ధురాలవగు నీకుఁ దెలియదు కాఁబోలు. ఓపాపాత్మురాలా! రాజ్యలోభముచేత గొప్పకీడును దెచ్చితివిగదా? నేను బురుషోత్తములగు రామలక్ష్మణులను జూడక యెవరిబలముచేత రాజ్యమును బాలింతును. నేను రాజ్యమును బాలింపను. మహాబలుఁడును, ధర్మస్వభావముగలవాఁడును, నగుదశరథమహారాజు, "మేరుపర్వతము తనవద్దనున్న వనమునువలెనే" సర్వకాలములయందును బ్రియముగలవాఁడును, బలవంతుఁడునునగు రామునినే యాశ్రయించినవాఁడయ్యె. అటువంటి నేనీమహాభారమును, "దూకమొద్దు మోయఁదగిన బరువును మోయలేనివిధముగ" మోయఁజాలను. ఈరాజ్యభారమును నేను నాతేజస్సుచేత భరింపఁజాలను. నామీఁద నీభారమును మోపితివి. నీవు మోపినప్పటికి నీభారమును మోయఁజాలను. ఒకవేళ సామదానాద్యుపాయములచేతఁగాని, బుద్ధిబలముచేతఁగాని నేనీరాజ్యభారమును మోయుటయందు సమర్థుఁడనైనను, పుత్రునకు రాజ్యమునిచ్చి సంతోషమును బొందదలఁచుకొన్న నీకు సంతోషమును మాత్రము గలుగనివ్వను. రామునకు నీయందుఁ "దల్లియందువలెనే" గౌరవముగలదు. ఆరామునకట్లు లేకుండెనేని పాపస్వభావముగలనిన్నిపుడే వదలిపెట్టుదును. (అనఁగా రామునకుఁ దనతల్లియందువలెనే నీయందుఁ గూడఁ బ్రియముగలిగియుండుటవలన రామునకెక్కడ నాయందాగ్రహముగలుగునోయని నిన్నిప్పుడే విడుచుటకు భయమును బొందుచున్నాను రామునకు నీయందు మర్యాదలేదేని నిప్పుడే నిన్ను వదలిపెట్టుదు ననుటకు సందేహము లేదు) సర్వకాలములయందును బాపకృత్యములనే చేయవలయునను తలంపుగలదానా! సదాచారహీనురాలా! కైకేయీ! మాపూర్వులకెవ్వరికిని బుట్టని యీదుర్బుద్ధి నీకెట్లు పుట్టినది? మావంశమునందనాదిగా జ్యేష్ఠపుత్రునే రాజ్యమునందుఁ బట్టాభిషిక్తునిఁగాఁ జేయుదురు. కనిష్ఠులందఱును జ్యేష్ఠునకు సహాయముగనుందురు. ఓసీ, ఘాతకురాలా! నీవు రాజధర్మమును జూచినదానవుగావు. రాజులయాచారముయొక్క శాశ్వతమైనస్థితినిగూడ నీవెఱుంగవు. నీవు దుష్టురాలవగుటచేత సదాచారమునందు నీకుబుద్ధి పుట్టలేదు. రాజులయాచారమును విచారింపఁగా ననాదిగా రాజ్యమునందు జ్యేష్ఠుఁడభిషిక్తుఁడగుచుండునుగదా? ఇది రాజులకందఱకును సహజధర్మమైయున్నది. ఈధర్మము రఘుకులమువారియందు విశేషముగ జరిగివచ్చుచున్నది. ధర్మము నాశ్రయించియుండువారును, సత్కులముతోను, సదాచారపరంపరతోను, గూడినయిక్ష్వాకుమహారాజవంశము వారియొక్క "మంచియాచారముగలవారమనుగర్వమును" నీవు నేటితో నశింపజేసితివి (అనగా మాయిక్ష్వాకువంశమునందు బుట్టినరాజులు సదాచారసంపన్నులమని గర్వపడుచుండిరి. అది నిన్ను మాతండ్రి పెండ్లియాడుటవలన నేటితో నశించెను) నీతండ్రియొక్కవంశమునందును జ్యేష్ఠుఁడగువానికే పట్టాభిషేకమును జేయుచున్నారు. మఱియు వారలు పూజ్యమైన స్వభావముగలవారు. అట్లుండఁగ నీకు మాత్రమెందుకు యిట్టిదుర్బుద్ధిపుట్టినదో తెలియలేదు. పాపనిశ్చయురాలా! కైకేయీ! నేను నీకోరికను మాత్రము సఫలమగునట్లు చేయుటలేదు. నీవిపుడు నాప్రాణములుపోవునంతటి దుఃఖకరమగు కార్యమును గావించియున్నావు. కైకేయీ! ఇదిగో నీవు చూచుచుండగనే, నేనిప్పుడే యరణ్యమునకుబోయి నిష్కల్మషుఁడును, బంధుజనప్రియుఁడును నాకన్నయును, నగురాముని బిలుచుకొనివచ్చెదను. అట్లుపిలుచుకొనివచ్చి మహాకాంతిచే బ్రకాశించుచున్న నాయన్నయగు రామునకు నేను స్థిరమైనమనసుగలవాఁడనై దాసుఁడనుగానుండెదను. అనియిట్లు చెప్పి యాభరతుఁడు శోకాతురుఁడై దుఃఖమును గలిగించునట్టివియును, దీనములైనవియును నగుమాటలచేతఁ గైకేయిని ఖండించుచు "గుహయందుండు సింహమువలె" హారామా! హాతండ్రీ, యనిమిక్కిలి పెద్దగాఁ గూతవేసె. అనఁగాఁ బెద్దగాఁగొంతెత్తి యెల్లవారును వినునట్లు రోదనమును జేసె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదిమూడవ సర్గముగిసెను.

భరతుఁడు కైకేయిని నానావిధముల నిందించుట.

అప్పుడు భరతుఁడవ్విధముగాఁ దల్లియగు కైకేయిని ననేకవిధములనిందించి కోపావిష్టుఁడై మరలనిట్లనియె.

క్రూరురాలా! దుష్టాత్మురాలా! కైకేయీ! నీవుధర్మమార్గమునువదలితివి. కావుననిఁక రాజ్యమునుండి భ్రష్టురాలవగుము. నీవు రాజ్యభ్రష్టురాలవై మరణమును బొందిననన్నుఁగూర్చి యేడ్వుము. ఓదుర్మార్గురాలా! నీవేమికారణముగ దశరథమహారాజును జంపితివే? పరమధార్మికుఁడగు రామునిఏమినిమిత్తముగ నరణ్యమునకుఁబంపితివే? ఏమికారణమును గనఁబడలేదు. దశరథుఁడును, రాముఁడును నీదుష్టగుణములనే మైననిందించిరా? ఓకైకేయీ! ఈకులమునకుహానినిగల్పించి భ్రూణహత్యాపాపమును సంపాదించుకొంటివి. కావుననీవు ఘోరనరకమును బొందుము. నీవు పాపాత్మురాలవగనుక పరలోకమునందుఁగూడ భర్తృసమాగమమును బొందవు. ఓపాపాత్మురాలా! కైకేయీ! నీవుమిక్కిలిదుష్టతనమునవలంబించి సర్వలోకములకును బ్రియుఁడగు రామునినరణ్యమునకుఁబంపి ఘోరకృత్యమును జేసితివి. ఇట్టిదుష్కృత్యమును జేసి నాకుఁగూడభయమునుగల్పించితివి. నీనిమిత్తముగ మాతండ్రియగుదశరథుఁడు మరణమును బొందె. రాముఁడరణ్యమునకుఁబోయెను. ఈజీవలోకమునందు నేను నీమూలకముగ నపకీర్తిపాలయితిని. నాకునీవుతల్లిరూపముగా సంభవించి నశత్రురాలవును, క్రూరురాలవును, రాజ్యమునుగోరుచున్నదానవును, భర్తనుజంపినదానవునైతివి. ఓకైకేయీ! నేనునీతో మాట్లాడఁదగదు. పాపాత్మురాలవైనయో కైకేయీ! దుష్టచారిణురాలవగు నీసంబంధమున కౌసల్యాసుమిత్రలును, మఱియునితరులగుతల్లులును, నధికమగుదుఃఖముగలవారైరి. సర్వకాలములయందును సత్యపరాయణుఁడును, ధర్మాత్ముఁడునునగు రామునినడవులకుఁబంపుటను, పుత్రదుఃఖమువలన నాతండ్రియగుదశరథుఁడు మరణమునుబొందుటయునుజూడఁగానీవు, మిక్కిలిబుద్ధిమంతుఁడును, ధర్మరాజును, నగునశ్వపతిమహారాజునకుపుత్రికవనితోఁచలేదు. కేకయమహారాజకులమును జెరుపఁబుట్టిన రాక్షసివికాని, వేరుకాదు. నీవుపాపకర్మయేముఖ్యమైన పనిగాఁగలదానవైతివి. నీమూలకముగనేనుబితృభ్రాతృహీనుఁడనైతిని. మఱియుసర్వలోకములకును ననిష్టమునుగలుగఁజేసినవాఁడనైతిని. పాపకృత్యములను జేయుటయందే నిశ్చయముగలదానవును, నరకలోకమునకుఁబోఁదగినదానవునైనయో కైకేయీ! ఇప్పుడుధర్మవతులలో శ్రేష్ఠురాలగు కౌసల్యనుబుత్రహీనురాలినిగాఁ జేసితివి. ఇట్టిపాపాత్మురాలవగు నీవేలోకమును బొందఁగలవు. క్రూరురాలవైనయో కైకేయీ! నీవు కౌసల్యానందనుఁడగు రాముడుపరిశుద్ధుఁడనియును, బంధువులఁబాలించువాఁడనియును, జ్యేష్ఠుఁడనియును, తండ్రితోసమానుఁడనియును, తెలియలేకపోతివి. "శ్లో॥ అంగప్రత్యంగజః పుత్రో హృదయాచ్చాపిజాయతే। తస్మాత్ప్రియతమో మాతుః ప్రియత్వాన్నతుబాంధవః॥" ఓకైకేయీ! పుత్రుఁడగువాఁడు పాదాదికేశాంతములగు సకలావయవములవలనను బుట్టినవాఁడు. ఇంతయగాక హృదయమువలనఁ గూడఁబుట్టినవాఁడు. కావునఁదల్లికిబుత్రుఁడనియును ప్రియతముఁడనియును జెప్పఁబడును. బంధువుగాదు. కాఁబట్టియే స్త్రీలకుఁబుత్రశోకముకంటె నధికమయినదుఃఖము లేదని పెద్దలుచెప్పుదురు. తొల్లియొకనాఁడు దేవతలచేతఁ బూజింపఁబడినదియును, ధర్మములను జక్కఁగఁ దెలిసినదియును, నగు కామధేనువు, నాఁగేటని మోయుచుండుటచేత నాబరువునకుఁ జాలఁజాలక భూమియందుఁబడిమూర్ఛఁబొందియున్న పుత్రులనుజూచె. (అనగాభూమినిదున్నుచున్న యెద్దులను జూచె) అట్లుమధ్యాహ్నమువఱకును దున్ని యలసిపడియున్న తనకొడుకులిట్టివిధముగ శ్రమనొందుచున్నారే యని దుఃఖమునొందికండ్లనిండనీళ్లుగారఁగా రోదనమును జేసె. అటుపిమ్మట నాకామధేనువునకుఁ గ్రిందిభాగమునందుఁ బోవుచున్నవాఁడును, మహానుభావుఁడునునగు దేవేంద్రునిశరీరమునందుఁ బరిమళముగలవియును, చల్లనివియునునగు కామధేనువుయొక్క కన్నీటిబిందువులుపడియె. అప్పుడు దేవతలకధిపతియును, పరమైశ్వర్యవంతుఁడునునగు నింద్రుఁడుమిక్కిలిపరిమళముగల యాకన్నీటిబిందువులను జూచికామధేనువుయొక్క కన్నీటిబిందువులనుగాఁ దలఁచె. పిమ్మటనయ్యింద్రుఁడు నలుదిక్కులయందునుజూచితుదకుఆకాశమునందు మిగులదుఃఖమునుబొంది రోదనమును జేయుచున్న కామధేనువునుజూచె. అవ్విధముగదుఃఖమునుబొందుచున్న కామధేనువునుజూచి వజ్రపాణియగు దేవేంద్రుఁడుగూడనధికమయినదుఃఖముగలవాఁడై చేతులనుముకుళించుకొని యాకామధేనువుతో నిట్లనియె.

ఓకామధేనువా! దేవతలమగుమాలో నెవ్వనివలనను, నీకుగొప్పదగుభయము లేదు. నీవేమినిమిత్తముగ దుఃఖమును బొందుచున్నావు. నీవుసర్వులకునుహితమునుగోరుదానవుగదా? నీవివ్విధముగవ్యసనమును బొందుటకుఁదగిన కారణమును జెప్పుమనినవిని యాకామధేనువు బుద్ధిమంతుఁడును, వాక్యవిశారదుఁడునునగు నింద్రుని జూచిగంభీరస్వభావముతో నిట్లనియె.

ఇంద్రుఁడా! ఎప్పటికిని నమంగళము కలుగకపోఁగాక. దేవతలగుమీలో నెవ్వనివలనను నాకుభయముగలుగలేదు. దేవేంద్రుఁడా! దున్నెడువానిచేఁబీడింపఁబడినవియును, కృశించ

నవియును, దుఃఖమునుబొందినవియును, సూర్యకిరణములచేనధికముగఁ దపింపఁజేయఁబడినవియును నాబిడ్డలునునగు దున్నలుండెడు నీయెద్దులనుజూచి నేనుమిగుల దుఃఖమునుబొందుచున్నాను. మఱియు నాపుత్రులనుగుఱించి నేనుదుఃఖసముద్రమునందుమునిఁగివ్యసనపడుచున్నాను. అయ్యో, నాబిడ్డలగునీయెద్దులివ్విధముగా గష్టమునబొందుచున్నవేయని దుఃఖమునుబొందుచున్నాను. పుత్రులయందుండెడుప్రేమ మఱియెక్కడనునుండదుగనుక వ్యసనపడుచున్నాననియె. అంతటనింద్రుఁడనేకవేలపుత్రులుగలదియును, పుత్రులకుఁ గలిగినకష్టమునుజూచి దుఃఖించుచున్నదియునునగు కామధేనువునుజూచి పుత్రునికంటెఁబ్రియమయినది లోకంబున నేదియునులేదనితలఁచె. ఓకైకేయీ! మఱియును సర్వకాలములయందును తనకుయీడులేని చరిత్రలుగలదియును, సర్వోత్తమురాలును, నిత్యమంగళగుణములుగలదియును, నగుకామధేనువు తనయిచ్ఛచేత సర్వమును గలిగించునట్టిశక్తిగలదగుటవలన ననేకవేలమందిపుత్రులనుగనియె. అటువంటికామధేను విద్దఱుపుత్రులుకష్టమునుబొందుటనుజూచి దుఃఖించెనే.

కావునఓకైకేయీ! రాముఁడొక్కఁడేపుత్రుఁడుగాఁగల కౌసల్య యెంతదుఃఖమునుబొందునో యోచింపుము? కౌసల్య యధికముగదుఃఖమును బొందుననిచెప్పనేల? ఒక్కఁడేపుత్రుఁడుగాఁగలదియును, పతివ్రతయునునగుకౌసల్యనీచేఁబుత్రహీనురాలుగ జేయఁబడియె. కావుననీవు యిహలోక పరలోకములయందు దుఃఖమునుబొందఁగలవు. నేనన్నయగురామునకును, తండ్రియగుదశరథమహారాజునకును, సకలమైనయీప్రజను కీర్తివృద్ధినిబొందించుటకిచ్ఛయించుచున్నాను. ఇందుకు సందేహమేమియునులేదు. (అనఁగానేనురామునకును, దశరథునకును, బ్రజను జేసి యిహపరలోకములయందుఁ గీర్తినిబొందెదననుట) నేనుమహాబలుఁడును, కౌసల్యానందవర్ధనుఁడును, నగురామునిఁదీసికొనివచ్చి పట్టాభిషిక్తునిగాఁజేసి పిమ్మటనేనుమునివేషమునవలంబించి యరణ్యమునకుఁబోయెదను. పాపసంకల్పురాలా, పాపాత్మురాలా! కైకేయీ! నీవుచేసిన యీపాపపుకార్యమును నేనుసహింపజాలను. నేనులోకులందఱును నేడ్చుచుండఁగా నిట్టిదుష్కృత్యమును జేయుటకు సమ్మతమును బొందువాఁడనుగాను. ఓకైకేయీ! నీవగ్నిహోత్రమునందుదుముకుము. అట్లుగాదేనినీవుబుద్ధిపూర్వకముగా దండకారణ్యమునకైనను బొమ్ము. ఇదియును గాదేని గొంతుకునురివేసికొనిచచ్చిపొమ్ము. ఇమ్మాటికంటెనీకువేరేయుపాయమునుగతిలేదు. సత్యపరాక్రమముగల రాముఁడుమరలనిక్కడకువచ్చినయెడల నేనుబాపరహితుఁడనైకృతార్థుఁడనయ్యెదననియె. ఇవ్విధముగాభరతుఁ డధికముగఁ గోపమునుబొంది సర్పమువలెనిట్టూర్పులనువిడిచి యుకవియందు, తోమరములచేతను, నంకుశములచేతను, గొట్టఁబడినయేనుఁగు తటాలున నేలంబడినవిధముగఁ గ్రిందఁబడియె. మఱియునప్పుడుశత్రుమర్దనుఁడును, రాజనందనుఁడును, మిగులనెఱ్ఱని నేత్రములుగలవాఁడును, వీడినవస్త్రముగలవాఁడును, చిందరవందరగనెగురఁగొట్టఁబడిన సకలాభరణములుగలవాఁడును, నైయుత్సవాంతమందు దేవేన్ద్రునియొక్కధ్వజము నేలఁబడినవిధముగ నాభరతుఁడుగ్రిందఁబడియె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదినాల్గవ సర్గముగిసెను.

—{ కౌసల్యతోభరతుడు కైకేయిచేసిన దుష్టకార్యము తనకుసమ్మతములేదని ఒట్టుపెట్టుకొనుట. }—

అంతటఁ బరాక్రమవంతుఁడగు నాభరతుఁడు చిరకాలమునకుఁదెలివొంది భూమిమీఁదనుండిలేచె. పిమ్మటకన్నులనుండినీళ్లుగార్చుచు దీనురాలగుతల్లినిఁజూచి మంత్రులనడుమ, తల్లియగుకైకనునిందించె. నేనొకానొకప్పుడును రాజ్యమునుగోరినవాఁడనుగాను. నేనుదల్లితో రాజ్యమునుగుఱించి యెన్నఁడునయోచించినవాఁడనుగాను. నాపట్టాభిషేకమునకై కైకేయిదశరథమహారాజుతో నాలోచించినదియును నేనెఱుగను. నేనుదూరదేశమునందు శత్రుఘ్నునితోఁగూడనుంటిని. మహాత్ముఁడగురాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ నరణ్యమునకుఁబోవుటనుగూడఁ దెలిసినవాఁడనుగానని చెప్పి భరతుఁడధికముగ గట్టిగారోదనమును జేసె. అవ్విధముగ రోదనమును జేయుచున్న, మహానుభావుఁడగుభరతునికంఠధ్వనినివిని కౌసల్యసుమిత్రతోనిట్లనియె.

ఓహో కౌసల్యా! క్రూరమగుకార్యమును జేసిన కైకేయియొక్కపుత్రుఁడగు భరతుఁడువచ్చినాఁడే? నేనుదీర్ఘాలోచనుజేయునట్టి యాభరతునిఁజూడవలయునని కోరికగలదాననైతిననియె. ఇవ్విధముగసుమిత్రతోఁజెప్పి యాకౌసల్య వెలవెలఁబోవుచున్నమోముగలదియును, కృశించినదియును, మలినమయినదియును వణఁకుచున్నదియును, స్మృతిలేనిదియును, నైభరతుఁడున్నచోటునకుఁబోయె. అప్పుడు రామునితమ్ముఁడగుభరతుఁడు తమ్ముడగుశత్రుఘ్నునితోఁగూడఁ గౌసల్యయున్నచోటునకువచ్చె. అంతనాకౌసల్యనుజూచి భరతశత్రుఘ్నులిరువురును నపరిమితముగదుఃఖమునుబొందిరి. పిమ్మటదుఃఖార్తులై మూర్ఛనొంది క్రిందఁ

బడినదియును, రోదనమును జేయుచున్నదియును, పూజ్యురాలును, మంచిమనస్సుగలదియును, నగుకౌసల్యనుజూచి భరతశత్రుఘ్ను లధికముగదుఃఖమునుబొందినవారై శోకించుకొనిరి. అంతఁగొంతసేపటికిఁ గౌసల్య తెలివినొంది యధికముగదుఃఖముగలదై భరతునితోనిట్లనియె.

వత్సా! భరతా! రాజ్యకాముఁడవైన నీకునిర్బాధకముగ రాజ్యమంతయునులభించినది. అయ్యో, కైకేయి చేసిన క్రూరకార్యమువలన నీకు రాజ్యములభించినది. క్రూరకృత్యములనే యాలోచించునట్టి కైకేయి నాపుత్రుఁడగు రాముని నారచీరలే వస్త్రములుగాఁగలవానినిగాఁజేసి యడవులయందు నివసింపవలసినవానిగా నియమించినది. అట్లుచేయుటవలనఁ దనకేమిలాభమో తెలిసినదిగాదు. ఈకైకేయి హిరణ్యనాభుండగు నాపుత్రుఁడెక్కడనున్నాఁడో యక్కడకుఁ శీఘ్రముగా నన్నుఁదఱిమివేయుననిదోఁచుచున్నది. అధికమైనకీర్తిగల రాముఁడుండుచోటునకుఁబోవలయునని నాకుఁగూడ నాశగలిగియేయున్నది. ఇంతయేల? నేనే సుమిత్రతోఁగూడి దశరథునగ్నిహోత్రమును ముందిడుకొని రాముఁడుండుచోటునకుఁ బయనమయ్యెదను. అట్లుగాదేని పురుషోత్తముఁడును, నాకుఁబుత్రుఁడుననగు రాముఁడెక్కడఁ దపస్సును జేయుచున్నాఁడో యాచోటునకు నీవైననుబిలుచుకొనిపోయి నన్నువిడచిపెట్టిరమ్ము. మిగులవిస్తీర్ణమైనదియును, ధనధాన్యములచేతనిండినదియును, ఏనుఁగులచేతను, గుఱ్ఱములచేతను, రథములచేతను, సంపూర్ణముగనిండియుండు రాజ్యమును కైకేయినీకు సంపాదించియిచ్చినది. కావుననీవిఁకమీఁద నిష్కంటకముగ రాజ్యమును బాలింపుమనియె. ఇవ్విధముగనా కౌసల్య క్రూరములగువాక్యములచే "గాయముమీఁద సూదులతోబొడిచినట్లు" వలెనే భరతుని మాటలచేబొడిచె. అప్పుడామాటలనువిని భరతుఁడుతొలుతనే మిగులదుఃఖముగలవాఁడగుటచే మఱింతదుఃఖముగలవాఁడయ్యె. అప్పుడాభరతుఁడు మహాదీనమైనమనసుగలవాఁడై కౌసల్యయొక్క పాదములయందుఁబడియె. అట్లుపడిస్మృతిలేనివాఁడై యనేకవిధంబుల రోదనమును జేసి పిమ్మటఁగొంతసేపటికి తెలివినిదెచ్చుకొనియుండె. ఈప్రకారముగ భరతుఁడు చేతులనుముకుళించుకొని యధికముగ రోదనమును జేయుచు నానావిధములగుదుఃఖములచే నావృతమైన నాకౌసల్యనుజూచి యిట్లనియె.

ఆర్యే! కౌసల్యా! ఏమియును దెలియనివాఁడను, పాపరహితుఁడనునగు నన్నునేమికారణమువలన నిందించుచున్నావు. నాకు రామునియందుఁగల యధికమైననిశ్చలభక్తి నీవు దెలిసికొనియేయున్నావుగదా? నాయందుదోషమేమియును లేకుండుటనెఱిఁగియును నిందించెదవేల? సత్యసంధుఁడును, సత్పురుషులలో శ్రేష్ఠుఁడును, రాముఁడరణ్యమునకుఁబోవుటకు నేనుసమ్మతించితినేని నేనుగురుముఖముగా శాస్త్రానుసారముగనేర్చుకొనిన వివేకమంతయును నాకుఁగొంచెమైనను ఫలింపకపోవుగాక. తల్లీ! కౌసల్యా! నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటకుసమ్మతించితినేని మిగులఁబాపములను జేసిన నీచులకును భృత్యత్వమును వహించుటవలన నెట్టిపాపమువచ్చునో యట్టిపాపమును నేనుఁ బొందినవాఁడనగుదును. సూర్యునకెదురుగా మూత్రపురీషములనువిడుచుటవలనఁ గలిగెడుపాపమును బొందుదును. నిదురబోవుచున్నగోవును, కాలితోఁదన్నుటవలనఁ గలిగెడుపాపమును బొందినవాఁడనగుదు. రాముఁడరణ్యమునకుఁబోవుటనుగుఱించి నాకుసమ్మతముండినయెడల నేను, భృత్యునిచేత గొప్పపనిని జేయించుకొని వానికిద్రవ్యమునివ్వని పాపాత్ముఁడు పోవులోకమునకుఁ బోయినవాఁడనగుదును. రాముఁడరణ్యమునకుఁబోవుట నాకుసమ్మతమైయుండునేని నేను, ప్రజలనందఱను బుత్రులనుగాపాడినవిధముగాఁ గాపాడునట్టిరాజునకపకారమును జేయునట్టి పాపాత్ముఁడు పోయెడులోకమునకుఁ బోయెదను. నేను రాముఁడడవికిఁబోవుటనుగుఱించి సమాధానమునుబొందితినేని యాఱవభాగపుపన్నునుగ్రహించి ప్రజలనుధర్మయుతముగఁ బరిపాలింపనిరాజుపోయెడు పాపలోకమునకుఁబోదును. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటనుగుఱించి సమాధానమునుబొందితినేని సత్రయాగమునందుఁ దపోవంతులకు యజ్ఞదక్షిణనిచ్చెదనని ప్రతిజ్ఞనుజేసి దక్షిణనివ్వని సోమయాజిపోవునట్టి పాపలోకమునకుఁబోదును. రాముఁడడవికిఁబోవుట నాకిష్టమైయుండునేని సేన, గజములు, గుఱ్ఱములు, రథములుమొదలగువానితో నిండియున్నదియును, జనులచేతనిండినదియును, నగుయుద్ధమునందుఁ బరాక్రమమునవలంబించి యుద్ధమునుజేయక వెనుకకుఁదిరిగినశూరుఁడుపోయిన పాపలోకమునకుఁబోదును. రాముఁడు దండకారణ్యమునకుఁ బోవుటనుగుఱించి నేనుసమాధానమునుబొందితినేని ప్రయత్నపూర్వకముగ శాస్త్రముచేత నుపదేశింపఁబడిన శాస్త్రమును నాశనమును జేసినవాఁడుపోవునట్టి పాపలోకమునకుబోదును. మఱియు నేను రాముఁడువనమునకు బోవుటనుగుఱించి యిష్టముగలవాఁడనైతినేని విపులమయినభుజములుగలవాఁడును, సూర్యచంద్రులతేజస్సుతో సమానమయినతేజస్సుగలవాఁడును, నగురాముఁడు సింహాసనమునందుఁగూర్చుండి రాజ్యమునుబాలించుటనుజూచి యానందమునుబొందెడుభా

గ్యము నాకుఁ గలుగకపోవుఁగాక. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి యంగీకారము బొందియుంటినేని క్షీరాన్నమును, నువ్వులతోఁ గలిపిన బెల్లమును, మేకమాంసమును, దేవతలకైనను, పితృదేవతలకైనను, నివేదింపక యొంటరిగా భుజించువాఁడు పొందెడు పాపమును బొందువాఁడ నగుదును. మఱియును తలిదండ్రులు గురువు మొదలగువారిని నిందను జేసిన పాపాత్ముఁడు పోవు లోకమునకుఁ బోదును. రాముఁడరణ్యమునకుఁ బోవుట నాకిష్టమైయుండు నేని నేను గోవును బాదముతోఁ దాకిన పాపమును బొందుదును. గురునిందను జేసిన పాపమును బొందఁగలను. మిత్రద్రోహమును జేసిన పాతకుఁడు పోవు లోకమునకుఁ బోదును. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటయందిష్టము గలవాఁడనై యుంటినేని దుష్టాత్ముఁడనై నమ్మకమువలన రహస్యమునందుఁ జెప్పిన విషయమును బయలు పెట్టినవాఁడ నగుదును. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి యిష్టముగలవాఁడనై యుంటినేని లోకములో నెవ్వరికిని నుపకారమును జేయనివాఁడను, పరులు సేసిన యుపకారమును మఱచినవాఁడను, బలవంతముగఁ దువఁబడిన ప్రాణములుగలవాఁడను, సిగ్గులేనివాఁడను, లోకమునందెల్లవారలకును ద్వేషుఁడను గాఁగలను. (ఇవన్నియు మహాదోషంబులు) నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి సమ్మతముగలవాఁడనైతినేని బిడ్డలును, భార్యలును, భృత్యులును, చూచుచుండఁగా వారలకుఁ బెట్టక భక్ష్యభోజ్యాదిపదార్థములను భుజించువాఁడు పోవు లోకమునకుఁ బోదును. రాముఁడరణ్యమునకుఁ బోవుట నాకిష్టమైయుండు నేని సమానమైన భార్యను బొందక ధర్మక్రియలను జేయక సంతానములేనివాఁడనై మృతుఁడ నగుదును గాక. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటయందు సమాధానమును బొందియున్నవాఁడనై యుంటినేని యల్పాయుస్సుగలవాఁడను, పుత్రహీనుఁడను, దుఃఖితుఁడనునై మరణమును బొందుదును గాక. మఱియును రాజులను, స్త్రీలను, బాలురను, వృద్ధులను, జంపిన పాపమును బొందినవాఁడ నగుదును. ఇంతియ గాక భృత్యులను రక్షింపని పాపమును బొందినవాఁడ నగుదును. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గురించి సమాధానమును బొందియుంటినేని సర్వకాలములయందును, లత్తుకను, మద్యమాంసములను, లోహమును, విక్రయించి యాద్రవ్యముచేత కుటుంబమును గాపాడువాఁడు పోయెడు లోకమునకుఁ బోదును. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గురించి సమాధానముగలవాఁడనై యుంటినేని సమీపమునందు శత్రువులకు భయమును గలిగించునట్టి యుద్ధమును వదలి పరుగెత్తి పోవుచు చంపఁబడిన పిఱుఁడు పోవునట్టి పాపలోకమునకుఁ బోదును. రాముఁడరణ్యమునకుఁ బోవుటను గురించి నేను సమాధానమును బొందియుంటినేని తలపుఱ్ఱెను జేతియందుఁ బట్టుకొనినవాఁడను, గుడ్డపేలికలను గట్టుకొనినవాఁడను, భిక్షమెత్తికొని జీవించువాఁడను, పిచ్చిపట్టినవాఁడనునై భూమియందు సంచరింపుదును గాక. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గురించి యిష్టమును బొందియుంటినేని సర్వకాలములయందును కామక్రోధములకులోఁబడి మద్యపానమును జేసి స్త్రీపరవశుండై జూదమాడువాఁడు పోవునట్టి నరకలోకమునకు బోదును. రాముఁడరణ్యమునకుఁ బోవుటను నేనెఱిఁగియుంటినేని నా మనస్సు ధర్మమార్గమునందు బ్రవర్తింపక అధర్మమునందే సర్వకాలములయందును బ్రవర్తించుచుండుఁ గాక. మఱియు పాపిష్ఠులకే నా ద్రవ్యమంతయు వినియోగమగుగాక. నేను రాముఁడడవికిఁ బోవుటను గురించి యిష్టమును బొందియుంటినేని నాచేఁ సంపాదింపఁబడిన సకలధనములును దొంగలచే నపహరింపఁబడుగాక. రాముఁడరణ్యమునకుఁ బోవుట నాకిష్టమైయుండు నేని ప్రాతస్సాయం సంధ్యలయందు నిద్రించు పాపాత్ముఁడు పోయెడు లోకమునకుఁ బోవువాఁడ నగుదును. మఱియును గృహములను దగులఁబెట్టువాఁడును, గురుభార్యను బొందినవాఁడును, మిత్రద్రోహమును జేసినవాఁడును నెట్టి పాపమును బొందునో యట్టి పాపముగలవాఁడ నగుదును. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి సమాధానమును బొందినవాఁడనైతినేని దేవతలకును, పితృదేవతలకును, తల్లిదండ్రులకును శుశ్రూషను జేయనివాఁడ నగుదు. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి సమాధానమును బొందియుంటినేని సత్పురుషులచేత విడువఁబడినవాఁడ నగుదును. సత్కర్మవలన భ్రష్టుఁడ నగుదును. నేను రాముని నరణ్యమునకుఁ బంపుటకు సమాధానమును బొందియుంటినేని మాతృశుశ్రూషను జేయని పాపమును బొందఁగలను. దీర్ఘబాహుఁడును, విశాలాక్షుఁడు నగు రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి నేనేమియును నెఱుంగను. నేను రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి నెఱిఁగియుంటినేని మాతృశుశ్రూషను సేయనివాఁడు పొందునట్టి లోకమును బొందుదును. మఱియు ననేకులగు పుత్రులుగలవాఁడను, దరిద్రుఁడను, జ్వరరోగపీడితుఁడను మహాదుఃఖముగలవాఁడను గాఁగలను. నేను ఆర్యుఁడగు రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి యెఱిఁగియుంటినేని స్తోత్రమును జేయుచున్నవారలును, మీఁదిభాగమును జూచుచున్న నేత్రములుగల

వారును, దీనులును, నగుయాచకులకోరికను వ్యర్థముగఁ జేసినవాఁడనగుదు. నేను ఆర్యుఁడగు రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి సమాధానముగలవాఁడనై యుంటినేని సర్వకాలములయందును ధర్మశూన్యమైన బుద్ధిగలవాఁడను, కఠినుఁడను, కపటవృత్తిగలవాఁడను, అపరిశుద్ధుఁడను, రాజులకు భయపడువాఁడను, మోసముచే జీవించువాఁడను నగుదునుగాక. నేను బూజ్యుఁడగు రాముఁడరణ్యమునకుఁ బోవుట నాకిష్టమైయుండునేని ఋతుస్నాతయును, ఋతుకాలమున సమీపమునకు వచ్చినదియును, పతివ్రతయునునగు భార్యను వదలిపెట్టినవాఁడు పొందెడు అధోలోకమునకుఁ బోదును. నేను పూజ్యుఁడగు రాముఁడరణ్యమునకుఁ బోవుటకు సమ్మతించియుంటినేని ధర్మమును వదలినవాఁడను, మూఢుఁడనునై స్వంతభార్యను వదలి పరభార్యలను బొందినవాఁడు పోవు పాపలోకమునకుఁ బోవువాఁడనగుదును. నేను బూజ్యుఁడగు రాముఁడరణ్యమునకుఁ బోవుట నెఱింగియుంటినేని ధర్మపత్నియందు సంతానము నొందక వేశ్యాపరవశుండైన బ్రాహ్మణుఁడు పొందునట్టి పాపలోకమును బొందఁగలను. నేను బూజ్యుఁడగు రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి సమాధానమును బొందియుంటినేని త్రాగుటకు యోగ్యమగు జలమును నిందించువాఁడును, విషమును బెట్టి పరులను జంపువాఁడును ఏ లోకమును బొందునో యట్టిలోకమును బొందినవాఁడనగుదును. నేను బూజ్యుఁడగు రాముఁడరణ్యమునకుఁ బోవుటను గుఱించి సమాధానమును బొందియుంటినేని బ్రాహ్మణునకుఁ జేయఁదలఁచిన ఉపకారమునకు విఘ్నమును గావించువాఁడు పోవు పాపలోకమునకుఁ బోఁగలను. మఱియును బశువులు ప్రసవించిన పదిదినములలోపలనే పాలు పిండినవాఁడు పోవు పాపలోకమునకుఁ బోఁగలను. నేను బూజ్యుఁడగు రాముఁడడవికిఁ బోవుటను గుఱించి సమాధానమును బొందియుంటినేని నీళ్లను ద్రాగుటకు మిగుల నాసతోఁ బ్రవర్తించుచున్న వానికి నీళ్లు ద్రాగుటకివ్వక శ్రమపఱచిన పాపాత్ముఁడు పోవు లోకమునకుఁ బోవువాఁడనగుదును. రాముఁడరణ్యమునకుఁ బోవుట నాకిష్టమై యుండునేని యిరువురు జగడమాడుచుండఁగా స్నేహముచేత నందొకనికి మాత్రము, ఉపాయమును జెప్పువాఁడు పొందెడు పాపలోకమును బొందఁగలనని భరతుఁడొట్టు పెట్టుకొనెను. రాజపుత్రుఁడగు భరతుఁడు, భర్తయును పుత్రుఁడును లేక దుఃఖించుచున్న కౌసల్య నుద్దేశించి యిట్లు పలికి యూరడించుచు మహానమ్మకమును గలుగునట్లు సేయుచు నా రామవియోగదుఃఖముచేతఁ బీడితుఁడై క్రిందఁబడియెను. అట్లు సహింపఁగూడని యొట్లుచేతఁ గట్టుకొనిన వాఁడును, స్మృతిలేనివానివలెనున్నవాఁడును, శోకముచేతఁదపింపఁజేయఁబడినవాఁడును, నగు భరతునితో నా కౌసల్య యిట్లనియె.

పుత్రా! భరతుఁడా! నీవు మిగుల ఘోరములగు నొట్లు చేతఁ నిన్ను దిట్టుకొనుటవలన నా ప్రాణములిప్పుడే శరీరమునుండి లేచిపోవుచున్నవి. కావున నాకు దుఃఖము నుపటకం బెహెచ్చగుచున్నది. వత్సా! భరతుఁడా! నా అదృష్టవశమువలన నీ మనస్సు గూడ లక్ష్మణుని మనస్సువలె ధర్మమార్గమును వదలకున్నది. పుత్రుఁడా! నీవు సత్యప్రతిజ్ఞగలవాఁడవై సత్పురుషులు పొందెడిలోకములను బొందఁగలవని కౌసల్య భరతునితోఁ జెప్పె. ఈవిధముగాఁ జెప్పి మహాబాహుఁడును, భ్రాతృవత్సలుఁడునునగు భరతుని తొడయందుఁ గూర్చుండఁబెట్టుకొని కౌఁగలించుకొని యధికముగ రోదనమును జేసెను. ఇవ్విధముగ విలపించుచున్నవాఁడును, దుఃఖముచేతఁ బీడింపఁబడినవాఁడును, మహానుభావుఁడును, నగు భరతుని యొక్క మనస్సును మోహమువలనను, దుఃఖసంరోధమువలనను, చలించినదయ్యె. మఱియు నధికముగ విలపించుచున్నవాఁడును, స్మృతిలేనివాఁడును, నశించిన బుద్ధిగలవాఁడును, నేలయందుఁబడినవాఁడును, మిగుల నిట్టూర్పులను విడుచుచున్నవాఁడును, నగు భరతున కా రాత్రియంతయును దుఃఖముచేత నేగడచిపోయెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదైదవసర్గ ముగిసెను.

భరతుడు దశరథమహారాజుయొక్క కళేబరమును దహనము సేయుట.

అంతట మఱుదినప్రాతఃకాలమునందు వాక్యకోవిదుఁడగు వసిష్ఠమహాముని యవ్విధముగ విలపించుచున్నవాఁడును, కైకేయికిఁ బుత్రుఁడునునగు నా భరతునితో నిట్లనియె.

గొప్పకీర్తిగలవాఁడా! రాజపుత్రుఁడా! భరతుఁడా! విశేషముగ దుఃఖమును బొందనేల. నీకు మంగళమగుఁగాక. ఇప్పుడు దశరథమహారాజునకుఁ జేయఁదగిన యుత్తరక్రియలను జేయుమనియె. ధర్మవేత్తయగు భరతుఁడు వసిష్ఠమునివరుఁడు చెప్పినమాటను విని ధైర్యమును దెచ్చుకొనినవాఁడై సమస్తమైన ప్రేతకార్యములను జేయఁదొడంగెను. మఱియు నా భరతుఁడు, తైలద్రోణిలోనుండి బయలునకు లేవఁదీయఁబడి భూమియందుంచఁబడినవాఁడును, పచ్చనివర్ణముగల ముఖముగలవాఁడును, నిద్రించినవానివలెనున్నవాఁడును, భూపతియునునగు దశరథమహారాజు శరీరమును,

నానావిధములగు రత్నములచేత నలంకరింపఁబడినదియును, సర్వోత్తమమైనదియునగు శయ్యయందుఁ బరుండఁబెట్టి నతోడనే యధికమైన దుఃఖముగలవాఁడై యిట్లని రోదనము చేసెను. తండ్రీ! దశరథమహారాజా! నేను దూరదేశమున నున్నసమయమునందు, ధర్మజ్ఞుఁడగు రాముని, మహాబలుఁడగు లక్ష్మణుని ఏమినిమిత్తముగ నరణ్యమునకుఁ బంపితివి? ఇట్లు పంపుటను గుఱించి నీయభిప్రాయమేమి? ఓ దశరథమహారాజా! సుఖకరమైన వ్యాపారములను జేయువాఁడును, పురుషసింహుఁడును నగు రామునిచేత విడువఁబడుటవలన మిగుల వ్యసనమును బొందుచున్న మమ్ములనందఱ వదలి నీవెక్కడకుఁ బోయెదవు? నాయనా! తండ్రీ! దశరథమహారాజా! నీవు మరణమును బొందితివి? రాముఁడరణ్యమునకుఁ బోయెనుగదా? ఇఁక నీ రాజ్యమునకు హాని రాకుండునట్లు గాపాడువారెవ్వరుగలరు? తండ్రీ! నీవు మరణమును బొందుటచేత నీ భూమియంతయును, విధవాంగనవలెఁ బ్రకాశింపకున్నది. మఱియు నీపట్టణమంతయును నీవు లేకపోవుటచేతఁ జంద్రహీనమైన రాత్రివలెఁ బ్రకాశింపకున్నదని విలపించె. ఇవ్విధముగ విలపించుచున్నవాఁడును, దీనమానసుఁడును నగు భరతుని జూచి మునిశ్రేష్ఠుఁడగు వసిష్ఠమహాముని మరల నిట్లనియె.

మహాబాహుఁడవైన యో భరతకుమారా! ఈదశరథమహారాజునకుఁ జేయఁదగిన ప్రేతకార్యములన్నింటిని ముందుగ నిర్విచారముగాఁ జేయుమని చెప్పె. అట్లు చెప్పిన వసిష్ఠమహామునియొక్క మాటను విని భరతుఁడు మంచిదియని గౌరవించి చేయఁదగిన కృత్యములయందు ఋత్విక్పురోహితుని, ఆచార్యులను త్వరజేసెను. అంతట నా ఋత్విజులందఱును, దశరథమహారాజుయొక్క శ్రౌతాగ్నులను శాస్త్రోక్తప్రకారముగ నగ్నిహోత్రగృహమునుండి బయలునకుఁ దీసికొనివచ్చిరి. అంతటఁ బరిచారకులు మృతుఁడైన దశరథమహారాజుయొక్క శరీరమును పల్లకియందు బెట్టి కండ్లనుండి నీరు ధారధారగ బ్రవహింపగ రోదనమును జేయుచు మహాదుఃఖముతో దశరథమహారాజు కళేబరమును మోసికొనిపోయిరి. అప్పుడు పట్టణములోనిజనులందఱును, పల్లకిమీదఁ బెట్టి తీసికొనిపోఁబడుచున్న దశరథమహారాజునకు ముందఱ వెండిని, బంగారమును, నానావిధములగు వస్త్రములను వెదచల్లిరి. మఱియు నితరులును నానావిధముగానే చందనాగరుగుగ్గిలమును, సరళమను ధూపమును, పద్మకమను సుగంధికాష్ఠమును, దేవదారువులను, మఱియు నితరములగు నానావిధగంధద్రవ్యములను, దీసికొనివచ్చి వెదచల్లుచుండిరి. పిమ్మట చితిపేర్చియందు చోటునకుఁ బోయిరి. అట్లుపోయి యా ఋత్విజులు దశరథమహారాజును చితిమధ్యయందుఁ బెట్టిరి. పిదప దశరథమహారాజున కగ్నిహోత్రమును సమర్పించి ఋత్విజులు జపించిరి. అంతట నా ఋత్విజులలో సామగానమును జేయువారలు ఆప్రదేశమునందు శాస్త్రోక్తప్రకారముగ సామములను బాడిరి. మఱియు నప్పుడా దశరథుని భార్యలందఱును తమతమ మర్యాదలకుఁ దగినవిధముగఁ బల్లకీలచేతను, నితరములగు వాహనములచేతను, ముసలివారలచేతను, చుట్టుకొనఁబడినవారై పట్టణమునుండి యచ్చటకుఁ బోయిరి. మఱియు నాసమయమునందు ఋత్విజులును, దుఃఖముచేతఁ దపింపఁజేయఁబడిన కౌసల్య మొదలుగాఁగల స్త్రీలును నగ్నిచయనమును జేసిన దశరథమహారాజునకు ప్రదక్షిణముగాఁ దిరిగిరి. అక్కడ నాసమయమునందు దుఃఖముగలవారును, పలువిధముల నితరులకు దుఃఖము గలిగించునట్టి మాటలను జెప్పుచు నేడ్చుచున్నవారులును నగు స్త్రీలయొక్క రోదనధ్వనులు "స్త్రీక్రౌంచపక్షులధ్వనులవలె" వినఁబడియె. అటుపిమ్మట నా దశరథుని స్త్రీలందఱును, మహాదుఃఖముతో రోదనమును జేయుచున్నవారలును, స్వాధీనమును దప్పినవారలునైరి. మఱియును మాటిమాటికి విలపించి వాహనములనెక్కి సరయూనదీతీరమునకు వచ్చిరి. అంత నా రాజస్త్రీలును, మంత్రులును, పురోహితులును, భరతునితోఁగూడ నుదకదానమును జేసిరి. పిమ్మటఁ బట్టణమునందుఁ బ్రవేశించి కన్నీళ్లు ప్రవహింపగ నేడ్చుచు నేలయందుఁ బరుండి పదిదినములను గడపిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదియవసర్గముగిసెను.

భరతశత్రుఘ్నులు దశరథమహారాజునకస్థిసంచయనము సేయునపుడు విలపించుట.

అట్లు పదిదినములును గడచినపిమ్మట రాజపుత్రుఁడగు భరతుఁడు పరిశుద్ధతను బొందె. పదిరెండవదినము రాగానే శ్రాద్ధకర్మలను జేసె. ఆశ్రాద్ధకర్మలను జేయుసమయమునందు భరతుఁడు బ్రాహ్మణులకు సంపూర్ణముగ ధనము ధాన్యము అన్నము వస్త్రములను, అనర్ఘ్యములును నానావిధములును నగు రత్నములను నిచ్చెను. మఱియును భరతుఁడా సమయమునందు మేకలసమూహమును, విశేషముగ వెండిని, అనేక గోవులను, దాసదాసీజనమును, వాహనములను, మిగులఁ బెద్దపెద్ద గృహములను, దశరథమహారాజుయొక్క యౌర్ధ్వదేహక్రియల నుద్దేశించి బ్రాహ్మణులకొఱకిచ్చె. అంతటఁ బదుమూడవదినముయొక్క ప్రాతఃకాలమునందు మహాబాహుఁడగు భరతుఁడు దహనప్రదేశమును శోధించుటకొఱకు అనఁగా నస్థిసంచయనమును జే

యుటలో నతఁడు శ్మశానమునకువచ్చి శోకమూర్ఛితుఁడయ్యె. పిమ్మట ధ్వనిచేతఁగప్పఁబడిన కంఠముగలవాఁడై యనేక విధములవిలపించె. (అనఁగాఁబెద్దగాగొంతెత్తి రోదనము నుజేసె) మఱియునాభరతుఁడు, మిక్కిలిదుఃఖమునుబొం దినవాఁడై తండ్రియొక్కచితిసమీపమునం దిట్లనివిలపించె.

ఓతండ్రీ నన్నుఎవ్వరికప్పగించితివి. నీవుముందుగానే నాయన్నయగు రామునినరణ్యమునకుఁబంపితివే. పిమ్మట నీవుగూడ నన్నువదలిపోతివే. ఇఁకనేనెవ్వరి పాలగుదును. మఱియును రాజవైనయోతండ్రీ! అనాథురాలగు కౌస ల్యకుఁబుత్రుఁడగు రామునినరణ్యమునకుఁ బంపితివి. అటు వంటినాతల్లియైన కౌసల్యనువదలి నీవెక్కడకుఁబోతివి. హాతండ్రీ! యనివిలపించుచు భరతుఁడుభస్మమై యెఱ్ఱగా నున్నదియును, దహింపఁబడినయెముకలుగలదియును, తం డ్రియొక్కశరీరమును నశింపఁజేసినదియును, నగునాచితిని జూచినతోడనే గట్టిగానేడ్చుచు దుఃఖమునుబొందె. ఆభ రతుఁడట్లు చితినిజూచినతోడనే యేడ్చుచు "లేవఁదీయఁబ డుచున్నదియును, జాఱినదియునునగు నింద్రునియొక్క యంత్రబద్ధమగు ధ్వజమువలె" తటాలున భూమియందుఁ బడెను. అట్టియెడనతనియొక్కమంత్రులందఱును పుణ్యవ్ర తుఁడగుభరతునిలేవదీయుటకు "పుణ్యమునశించి క్రిందఁబడి న యయాతినిలేవనెత్తుటకు నతనితోఁగూడ ఋషులందఱు నువారిలినవిధముగా" నేలవ్రాలిరి. అట్లుమూర్ఛితుఁడై క్రిందఁబడినభరతునిఁజూచి శత్రుఘ్నుఁడుగూడ శోకము చేతఁబీడింపఁబడి దశరథమహారాజునుస్మరించుచు మూర్ఛ నుబొందిక్రిందఁబడియె. అట్లుక్రిందబడి యాశత్రుఘ్నుఁడు తండ్రియొక్కగుణములను నవయవములనుతలంచి మితిలేని దుఃఖముగలవాఁడును, శరీరముమరచినవాఁడునునై పిచ్చి వానివిధముగ నిట్లనిరోదనమునుజేసె. అయ్యో, మేమంద ఱమును, మంథరయేకారణముగాఁగలదియును, కైకేయి యనియెడు క్రూరమగుమొసలిచే వ్యాకులమైనదియును, వ రదానమయమైనదియును, మిగులఁదీక్ష్ణమైనదియును, క్షో భింపజేయుటకు శక్యముగానిదియునునగు దుఃఖసముద్ర మునందుమునిగితిమి. తండ్రీ! దశరథమహారాజా! నీచేతస ర్వకాలములయందును బుజ్జగింపఁబడినవాఁడును, మృదు వైనశరీరముగలవాఁడును, బాలుడును, రోదనమునుజే యుచున్నవాఁడును, నగుభరతునివదలి నీవెక్కడకుఁబోతి వి? నాయనా! దశరథమహారాజా! మాకిష్టములగు భోజ్యపదార్థములను, పానార్హములగువస్తువులను, మి గులరమణీయములగు వస్త్రాభరణములనుదీసికొనుమని బల వంతముజేయుచుందువుగదా? అట్టినీవిపుడెక్కడికిబోతివి? ఇఁకనుమాకట్టువంటి వస్తువులనిచ్చువాఁడెవ్వఁడుగలఁడు. రాజవును, ధర్మజ్ఞుఁడవును, మహాత్ముఁడవును, నగునీవు మరణమునుబొందునపుడీ భూమి బ్రద్దలుగాకయుండుటను జూడఁగా బ్రళయకాలమునందుఁగూడ నీభూమిబ్రద్దలు గాదనితలఁచుచున్నాను. తండ్రియగు నీవుమరణమునుబొం దితివి. అన్నయగురాముఁ డరణ్యమునకుఁబోయె. ఇఁకను నేనుబ్రదుకుటవలనఁ బ్రయోజనమేమి? కావుననిఁకమీఁదన గ్నిహోత్రమునందుఁబ్రవేశించి ప్రాణపరిత్యాగమునుజే సెదను. తండ్రియునుఅన్నయును లేనివాఁడనై యిక్ష్వాకు పాలితమగు నయోధ్యాపట్టణమును బ్రవేశింపఁజాలను. కావుననిఁకఁ దపోవనమునకు బోయెదనని రోదనమును జేసె. ఇట్లువిలపించుచున్న యాభరతశత్రుఘ్నులయొక్క విలాపవచనములనువినియును. దుఃఖమునుజూచియును, స హింపఁజాలకవారితోఁగూడ వచ్చినవారందఱును నధికము గదుఃఖమునుబొందిరి. భరతశత్రుఘ్నులుదుఃఖమునుబొం దినవారగుటచేత నలసినవారలై "కొమ్ములువిరిగినయెద్దు లవలెఁ" గ్రిందఁబడిరి. మఱియుశరీరమునందుస్మృతిలేని వారైపొర్లిగింతలుపెట్టిరి. పిమ్మటఁబ్రశస్తమైన స్వభావ ముగలవాఁడును, సర్వజ్ఞుఁడును, రఘుకులమువారికిఁ బు రోహితుఁడును, నగువసిష్ఠమహామునిభరతునిలేవనెత్తియి ట్లనియె.

మహాప్రభో! భరతుఁడా! నీతండ్రియగుదశరథమహా రాజుమరణమును బొందినేటికిఁ బదమూఁడుదినములైనది. ఇఁకనుఅస్థిసంచయనకర్మమాత్రము మిగిలియున్నది. ఈకర్మ నుగుఱించియాలస్యమునుజేయుట యుచితముగాదు. శ్లో॥ త్రీణిద్వంద్వాని భూతేషు ప్రవృత్తాన్య విశేషతః। తేషు చాపరిహార్యేషు నైవంభవితుమర్హసి॥ ఆకలిదప్పులు, శోక మోహములు, జరామరణములును అనియెడు పిశాచములు సకలజంతువులను భేదములేక బాధించుచున్నవి. ఇవిలేని జంతు వీలోకమునందేమియును లేదు. కావునసహజమైన దానికి నీయట్టిమహానుభావుఁడు మూఢునివిధముగదుః ఖించుటతగదని వసిష్ఠమహామునిజెప్పె. అట్టియెడసుమం త్రుడుశత్రుఘ్నునిలేవనెత్తి ప్రసన్నునిగాఁజేసియిట్లనియె.

దశరథరాజనందనా! శత్రుఘ్నా! సకలజంతువులకును జననమరణములు సహజములై యుండుటను నీవెఱుంగుదువుగదా? కావునమృతుఁడైన మీతండ్రినిగుఱించి దుఃఖించు టయుచితమని నాకుఁదోచలేదు. కావుననిఁకదుఃఖమును మాలింపుమనియె. అంతటశ్రేష్ఠమైన కీర్తిగలవారును, పు రుషోత్తములునునగు భరతశత్రుఘ్నులు లేచినవారై మ ఱలవానచేతను, గాలిచేతను నలసటనొందిన యింద్రధ్వ

జములవలెఁ బ్రకాశించుచుండిరి. ఆసమయమునందుమం త్రులును, కన్నీళ్ళనుదుడుచుకొనినవారలై యెఱ్ఱనినేత్రములుగలవారును, దైన్యముగలుగునట్లు మాటలాడుచున్న వారలును, నగుభరతశత్రుఘ్నులను జేయఁదగినకార్యములనుగుఱించిత్వరపెట్టిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదియేడవ సర్గముగిసెను.

—{ మంధరనుదండించుటకు బ్రయత్నించిన శత్రుఘ్ననివలదనిభరతుడునివారించుట. }—

పిమ్మటలక్ష్మణునకుఁదమ్ముఁడగు శత్రుఘ్నుఁడు, ఇంటికిఁబోయినపిమ్మట రామునిసమీపమునకుఁ బోవలయునని తలఁచుచున్నవాఁడును, దుఃఖితుఁడునునగు భరతునిజూచి యిట్లనియె.

అన్నా! భరతా సకలభూతములకును దుఃఖముగలిగినవుడు దుఃఖమునుబోఁగొట్టువాఁడగు రాముఁడుతనదుఃఖములను బోఁగొట్టుకొననేరడనిచెప్పవలయునా? అటువంటిమహాబలుఁడగురాముఁడిప్పుడుసీతాదేవితోగూడ నరణ్యమునకుఁబోయెం. అధికమైన బలముగలవాఁడును, అధికమగు పరాక్రమముగలవాఁడును, నగులక్ష్మణుఁడుతండ్రియగుదశరధునినిగ్రహించి రామునినరణ్యమునకుఁబోకుండఁగఁజేయఁగూడదా? దుర్మార్గప్రవర్తకురాలగు కైకేయియొక్కవశమునుబొంది దుర్మార్గమునందుఁ బ్రవేశించినదశరథమహారాజును, న్యాయాన్యాయములను విచారించి నిగ్రహించుట యుచితకృత్యమేగదా? అట్టిపనిలక్ష్మణుఁడు సేయవలసియుండగా జేయకపోవుటకుఁ గారణమేమియో తెలియదయ్యెనని చెప్పె. ఇట్లుశత్రుఘ్నుడు భరతునితోఁజెప్పుచున్నసమయమునందుమంధర సర్వాభరణములచేతనునలంకృతురాలై సైవవశముచేత నాభరితశత్రుఘ్నులున్నయింటికిఁదూర్పుభాగముననున్న వాకిలిసమీపమునకు వచ్చె. అంతనామంధర సర్వోత్తమమగు చందనముచేతఁబూయఁబడినశరీరముగలదై రాజయోగ్యములగు వస్త్రములనుధరించి నానావిధములగు దివ్యమైనసొమ్ములచే నలంకరింపఁబడియుండె. మఱియు నామంధర నానావిధవర్ణములుగల మొలనూళ్ళచేతను, నితరములగు ననేకాభరణములచేత నలంకరింపఁబడినదై త్రాళ్ళులచేత బంధింపఁబడినయాఁడుకోతివలెనుండె. అంతద్వారపాలకులు మిగులవేగముగా పాపములను జేయునదియును, దయలేనిదియును, గూనుగలదియునునగు మంధరనుజూచి శత్రుఘ్నునొద్దకుఁబట్టుకొనితీసికొనివచ్చియిట్లనిరి.

దశరథరాజనందనా! శత్రుఘ్నా! రాముఁడెవ్వతెమూలకముగనరణ్యమునకుఁబోయెనో, ఎవతెమూలకముగదశరథమహారాజు మరణమునుబొందెనో, యటువంటి క్రూరకృత్యమును జేసినదియును, పాపిష్ఠురాలును, నగునీమంధరనునీయిష్టమువచ్చినట్లుదండింపుమనిరి. దృఢవ్రతుడగుశత్రుఘ్నుడా ద్వారపాలకులమాటలనువిని యధికమైన దుఃఖముగలవాఁడై యంతఃపురమునందుసంచరించువారలతోనిట్లనియె.

ఓయంతఃపురవాసులారా! ఈదుర్మార్గురాలు నాయన్నయగురామునకు మహాదుఃఖముపుట్టించినది. మఱియు నునాతండ్రియగు దశరధునకుమరణమునుగల్పించె. కావుననీక్రూరురాలు తాను జేసినక్రూరకర్మకుసదృశమగు ఫలముననుభవించుఁగాక. అనిశత్రుఘ్నుండుచెప్పి సఖీజనముచేతఁజుట్టఁబడియున్ననాకుబ్జనునతిశీఘ్రముగాఁబట్టుకొనెను. అట్లుశత్రుఘ్నుడుపట్టుకొనఁగా నేయాకుబ్జయాయిల్లంతయును ప్రతిధ్వనియిచ్చునట్లుగట్టిగానఱచె. అప్పుడామంధరయొక్కసఖీజనమంతయును, మిగులదుఃఖముగలవారై శత్రుఘ్నునకుఁ గోపమువచ్చియున్నదని తెలిసికొని విచ్చలవిడిగానలుదిక్కులకునుబరుగెత్తిపోయిరి. అంతటనామంధరయొక్కచెలికత్తియలందఱునునివ్విధముగా నాలోచించిరి. దయగలదియును, మనోహరముగ మాటలాడునదియును, సకలధర్మములను దెలిసినదియును, మిగులగొప్పదగుకీర్తిగలదియును,నగుకౌసల్యయొద్దకుఁబోయిరక్షింపుమనిప్రార్థింపుదము. మనకందఱకును నాకౌసల్యయే రక్షకురాలగునని యాచెలికత్తెలందఱును నొకరితోనొకరాలోచించిరి. అప్పుడుశత్రువులనుదపింపఁజేయునట్టిసామర్థ్యముగలశత్రుఘ్నుఁడు, మహాకోపముగలవాడును నెఱ్ఱనికండ్లుగలవాడునునై కుబ్జయొక్కయొత్తో యనిరోదనమును జేయుచున్నమంధరను నేలఁబడవైచి బరబరనీడ్చుకొనిపోయెం. అట్లుశత్రుఘ్నుఁడుమంధరనుబట్టి యీడ్చుకొనిపోవుచుండగా మంధరయొక్కశరీరమునందున్న యాభరణములన్నియును, భిన్నాభిన్నములుగ గ్రిందఁబడియె. అప్పుడాయాభరణములన్నియు వెదజల్లబడినట్లుండుటచే నారాజగృహమంతయును, శరత్కాలమునందలి నిర్మలములగు నక్షత్రములుగల యాకాశమువలెఁ బ్రకాశించె. మఱియును పురుషోత్తముఁడును, మిగులబలముగలవాఁడును, నగుశత్రుఘ్నుఁడుకోపముచేత బలాత్కారముగా మంధరనుబట్టుకొనియామంధరనువిడిపింపవచ్చినకైకేయిని బలువిధములనిందించి మిగులఁగఠినములగు వచనములఁబలికె. ఆసమయమునందుఁ గైకేయిశత్రుఘ్నుఁడుపలికినకఠినవ

శనములనువిని యధికమైనదుఃఖముగలవాఁడై, మిగులభయముతో శత్రుఘ్నుఁ డేమిసేయునో యని యాలోచించి భరతునొద్దకుఁబోయి శరణుఁజొచ్చె. అప్పుడుభరతుఁడు కైకేయియొక్కపరితాపమునుజూచి మహాకోపముతోనున్నశత్రుఘ్నునితో నిట్లనియె.

తమ్ముఁడా! శత్రుఘ్నా! సకలప్రాణులలోపల స్త్రీలనువధింపఁగూడదు. కావుననీవు శాంతమును దెచ్చుకొనుము. మఱియునో తమ్ముఁడా! ధర్మాత్ముఁడగు రాముఁడు మాతృహత్యను జేసినయెడల నింద్యుఁడని నాకుఁదోఁచెనేని నేనిదివఱకే కైకేయినిజంపియుందును. కావున రాముఁడు మనముఖమునుజూడఁడేమోయను భయముచేత, పాపాత్మురాలగు కైకేయినిజంపకవిడిచితిని. కాఁబట్టినీవుగూడ నీదుర్మార్గురాలినిజంపకవదలిపెట్టుము. తమ్ముఁడా! శత్రుఘ్నా! మనమీకుబ్జనుజంపితిమేని, ధర్మాత్ముఁడగురాముఁడు మనతో మాట్లాడనుగూడ మాట్లాడఁడు. ఇందుకేమియును సందేహములేదు. అనియిట్లుభరతుండుచెప్పిన లక్ష్మణానుజుఁడగుశత్రుఘ్నుఁడువిని కోపమునువదలి సామంథరను న్నువదలెను. ఆసమయమునందామంథర కైకేయియొక్క పాదములయందుఁబడినమస్కారమును జేసి యధికముగ దుఃఖమునుబొంది నిట్టూర్పులనువిడుచుచు గట్టిగారోదనమును జేసె. అప్పుడు భరతునితల్లియగు కైకేయి శత్రుఘ్నుడు త్రిప్పటపెట్టుటచేతఁ జచ్చిబ్రతికినట్లు తలఁచుచున్నదియును, మిగులదుఃఖమును బొందియున్నదియును, వలలోఁదగులుకొన్న క్రౌంచపక్షివలె గడగడవణఁకుచున్నదియును, నగుమంథరనుమెల్లగానూరడించె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదెనిమిదవ సర్గముగిసె.

— భరతుఁడడవియందున్నరాముని బిలుచుకొనివచ్చి పట్టాభిషేకముసేసెదనని చెప్పుట. —

అంతటఁబదునాలుగవదినముయొక్క ప్రాతఃకాలమునందు రాజునుగాఁ జేయఁదగినవారలందఱు నొక్కచోట జేరియాలోచించుకొని భరతునొద్దకువచ్చి యిట్లనిరి.

దశరథరాజనందనా! భరతుఁడా! మనకందఱకును గురుశ్రేష్ఠుఁడగుదశరథమహారాజు జ్యేష్ఠుఁడగురాముని, మహాబలుఁడగు లక్ష్మణునినరణ్యమునకుఁబంపెను. పిమ్మటఁదాను మరణమునుబొందె. అధికమైనకీర్తిగలవాఁడవును, రాజపుత్రుఁడవునునగునో భరతుఁడా! నీవుమాకందఱకును రాజవగుము. ఇన్నిదినములు రాజులేనిదయ్యును మనరాజ్యము దైవయోగముచేతఁబరులపాలుగాకయున్నది. కావుననాలస్యముసేయక నీవుపట్టాభిషిక్తుఁడవగుము. ఓభరతుఁడా! పట్టాభిషేకయోగ్యమగుపదార్థములను సర్వమును, తీసికొనినీబంధుజనులందఱును నిన్నెదురుచూచుచున్నారు. పట్టణవాసులగుజనులుగూడ నెదురుచూచుచున్నారు. మఱియునోభరతుఁడా! తండ్రితాతలనాటనుండి వచ్చినదియును, చంచలముగానిదియును, నగురాజ్యమును గ్రహింపుము. నీవీరాజ్యమునందభిషిక్తుఁడవగుము. పట్టాభిషిక్తుఁడవై మమ్మనందఱఁగాపాడుమని చెప్పిరి. అప్పుడాభరతుఁడు దృఢవ్రతుఁడై పట్టాభిషేకమహోత్సవముయొక్క పదార్థములకుఁ బ్రదక్షిణమును జేసి యాజనులనుజూచి యిట్లనియె

ఓసత్పురుషులారా! మావంశమునందుఁ జిరకాలమునుండి పెద్దకుమారుఁడు రాజ్యమునకుఁదగినవాఁడు. మావంశముయొక్కన్యాయమిట్లుండఁగా సమర్థులగుమీరందఱును, నిట్లుచెప్పుటతగునా? రాముఁడుమాయందఱిలోపల జ్యేష్ఠుఁడు. కావునరాముఁడుపట్టాభిషిక్తుఁడై రాజ్యమునుబాలించునట్లుసేయుఁడు. రామునకుబదులుగనేనుబదునాలుగుసంవత్సరములునునరణ్యమునందునివసించెదను. చతురంగములుగలదియును, మిగులబలముగలదియును, నధికమైనదియును, నగుసేననుసమకూర్పుఁడు. నేనీసైన్యమునుసర్వమును వెంటఁబెట్టుకొని జ్యేష్ఠుఁడును, తోఁబుట్టువునునగు రామునిఁదీసికొనివచ్చెదను. ఇపుడుసేకరింపబడియుండుపట్టాభిషేకపదార్థములను సర్వమునుదీసికొని రామునినిమిత్తముగనరణ్యమునకుఁబోయెదను. అట్లుపోయి అక్కడనేపురుషోత్తముఁడగురామునకభిషేకమును గావించి "యజ్ఞశాలనుండియగ్నిహోత్రమును గృహమునకుఁదీసికొనివచ్చువిధముగ" రామునిమనపట్టణమునకుదీసికొనివచ్చెదను. నేనుమాయమ్మయను సంజ్ఞనుధరించిన కైకేయికోరికసఫలముగాక యుండునట్లుసేసెదను. నేనుప్రవేశింపనలవిగానియడవియందునివసించెదను. రాముఁడికమీఁదటరాజుగాఁగలఁడు.

మఱియు నోమానవోత్తములారా! శిల్పులచేతమార్గమునందలి మిట్టపల్లములను సమముగాఁ జేయింపుఁడు. ఇంతయగాక మార్గమునందు మావెంబడి దుర్గప్రచారమును దెలిసిన రక్షకభటులు వచ్చునట్లుసేయుఁడు. నేనుబోయి రాముని దోడ్కొనివచ్చెదనని యభిషేకమును జేయింపవచ్చినవారితోఁ జెప్పె. ఇవ్విధముగరామునిగుఱించి మాటలాడుచున్నవాఁడును, రాజపుత్రుఁడును, నగుభరతునితో నచ్చోటునకు వచ్చినజనమంతయును సర్వోత్తమమైనదియును, శుభకరమైనదియునునగు మాటను జెప్పఁదలఁచి

యిట్లనిరి.

దశరథరాజనందనా! భరతుఁడా! నీవు జ్యేష్ఠభ్రాతయగు రామునకు రాజ్యమునివ్వవలయునని తలఁచుచున్నావు. కావున నిటువంటి ధర్మస్వభావముగల నీకుఁబద్మమునందు నివసించునట్టి లక్ష్మి ప్రసన్నురాలై సర్వకాలములయందును నీయొద్దనే యుండుగావుతమని రాజ్యాభిషేకకర్తలగు ఋత్విక్పురుషులుఁ జెప్పిరి. మఱియునందలివారందఱును రాముని మరలఁ దోడ్కొనిరావలయునని చెప్పుచున్న భరతునియొక్క సర్వోత్తమమగుమాటను వినినవారగుటవలన మఱల యిట్లనిరి.

ఓహో రాజనందనా! నీవిపుడుచెప్పినమాటలు మిగులమనోహరముగనున్నదనిచెప్పి యాపూజ్యులగు రాజ్యాభిషేకకర్తలందఱును సంతోషమువలన నేత్రములనుండి యానందబాష్పములనువదలిరి. అంతనామంత్రులందఱును రాజ్యాభిషేకకర్తలును, సభాసదులునునగు వారలతోఁగూడఁ బరమానందమునుబొంది దుఃఖమునుబోఁగొట్టుకొని భరతునిజూచి యిట్లనిరి.

పురుషోత్తముఁడవైన యోభరతుఁడా! నీవిపుడుచెప్పిన మాటలనువిని రాజభక్తిగల జనమంతయును, శిల్పులును, రాముని యొద్దకుబోవునట్టి మార్గములను చక్కబెట్టుటకుగాను పరమసంతోషముతోఁ బోవుచున్నదని చెప్పిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదితొమ్మిదవసర్గ ముగిసెను.

జనులు రాముడున్నచోటునకు బోవుటకుమార్గములనేర్పఱచుట.

అటుపిమ్మట భూప్రదేశములనన్నింటిని జక్కఁగఁదెలిసినవారును, సూత్రములననుసరించి చేయఁదగినకార్యములను జేయుటయందు మిగులసామర్థ్యముగలవారును, తమతమకార్యములను జేయుటయందుఁ జాగ్రతగలవారును, యుద్ధములయందు కొంచెమైనను భయములేనివారును, త్రవ్వుటయందధికమగుసామర్థ్యముగలవారును, యంత్రములను జేయుటయందు నేర్పుగలవారును మ్రానులను జెక్కుటయందు నేర్పుగలవారును, మార్గములను జేయువారలును, వృక్షములనునరకుటయందు శక్తిగలవారును, బావులను ద్రవ్వుటయందుశక్తిగలవారలును, సన్నపుపనిజేయుటయందు మిగులనేర్పుగలవారును, వెదురుపనులను జేయుటయందుశక్తిగలవారును, సకలకార్యములయందును సామర్థ్యముగలవారును, మార్గమునుజక్కఁగ నదివఱకేచూచియున్నవారలును, నగుమానవులందఱును బయలుదేఱిరి. అంతట నాజనసమూహమంతయును సంతోషమువలన నాప్రదేశమునుగూర్చి పోవుచుండిరి. అప్పుడాసైన్యమంతయును, "పర్వకాలములయందు మిగులవేగముతోవచ్చుచుండెడుసముద్రమును" బోలియుండెను. మఱియునుమార్గమును జేయుటయందుఁ బండితులగువారందఱును, తమసమూహమునుబొంది నానావిధములగుసాధనములతోఁ బయలువెడలిరి. అంతటవారందఱును, లతలను, గుల్మములను, స్థాణువులను, ఱాళ్ళను, మఱియు ననేకవిధములగు వృక్షములను ఛేదించి మార్గమునుజక్కఁజేసిరి. (అనఁగా నరణ్యమును సర్వమునుమార్గమునుగాఁజేసిరి) అంతఁ గొందఱు వృక్షములులేనిప్రదేశములయందు వృక్షములను బాతిపెట్టిరి. మఱికొందఱు మార్గమునకడ్డముగవచ్చినవృక్షములనుగొడ్డండ్లచేతను, గడ్డపారలచేతను, ఱంపములచేతను ఛేదించిరి. మఱియునధికమైనబలముగల మఱికొందఱు మార్గమునందు దట్టముగమొలిచియున్న యవురుగడ్డినిదగ్ధముసేసిరి. అట్లుసేసిమార్గమునందు నడుచుటకుదారినేర్పఱచిరి. మఱికొందఱు మన్నుచేతబావులను, మిగులఁబెద్దవగు రంధ్రములనుపూడ్చివేసిరి. అటుపిమ్మటఁగొందఱుసకలప్రదేశములయందును, పల్లపుప్రదేశములను సమముగాఁజేసిరి. అప్పుడుమఱికొంద ఱాయాప్రదేశములను, కట్టఁదగినవారధులు మొదలగువానినిగట్టిరి. మఱియును జూర్ణముసేయఁదగినవానిని జూర్ణముసేసిరి. పగులఁగొట్టఁదగినవానిని బగులఁగొట్టిరి. మఱికొందఱు మిగులశీఘ్రముగా నానావిధములగు నల్పప్రవాహములను జలములుగలవానినిగాఁజేసిరి. (అనగానీళ్లునిలిచియుండునట్లు కట్టలుగట్టిరి) సముద్రమునకుఁ దుల్యములగు ప్రవాహములను నానావిధ పాయలనుగానుజేసిరి. మఱియును నిర్జలప్రదేశములయందు శ్రేష్ఠములైనవియును, నానావిధములైనవియును, సంపూర్ణముగ నుదకములుగలవియును, వేదికలచేత నలంకరింపఁబడినవియునునగు బావులను ద్రవ్విరి. అంతటనాసైన్యమంతయును, బాగుసేసినమార్గము చక్కఁగాఁబుష్పించిన వృక్షములుగలదియును, మదించినవియును, మనోహరముగాఁ గూయుచున్నవియునునగు పక్షులుగలదియును, పతాకములచేనలంకరింపఁబడినదియును, చందనోదకముచేఁ దడపఁబడినదియును, నానావిధములగు పుష్పములచే నలంకరింపఁబడినదియును, దేవతలమార్గమునుబోలియున్నదియునునై మిగులరమణీయముగ నుండెను. అప్పుడాసైన్యమునందలి యధికారులందఱును దమబుద్ధికిఁదోచినవిధముగ నాజ్ఞాపించి మిగులఁబ్రియమును గలిగించునవియును, రమణీయములును, నగుప్రదేశములలో మహాను

భావుఁడగు భరతునకుఁ బ్రియమగు ప్రదేశమునందు నానావిధములగు నలంకారములను జేయించిరి. జ్యోతిశ్శాస్త్రవేత్తలగువారలు మిగుల శుభకరములగు నక్షత్రములయందును, మంచిముహూర్తములయందును మహానుభావుఁడగు భరతుఁడు ప్రవేశింపఁదగిన ప్రదేశములయందు విడుదలను నియమించిరి. మఱియు నామార్గమునం దధికమగు నిసుకలు గలవియును, అగడ్తలచేతఁ జుట్టఁబడినవియును, నింద్రకీలపర్వతములతో సమానములయినవియును, వీథలలో నుత్తమములగు పదార్థములచేఁ బ్రకాశించుచున్నవియును, దేవాలయముల పఙ్క్తులచేత వ్యాపింపఁబడినవియును, సున్నముచేతఁ బూయఁబడిన ప్రాకారములచేఁ జుట్టఁబడినవియును, టెక్కెములచే నలంకరింపఁబడినవియును, చక్కఁగా నిర్మింపఁబడిన రాజవీథులుగలవియును, మిగులఁ బొడవులైనవియును, నాకాశమునందు వ్యాపించుచున్నవిధముగ నున్నవియును, గువ్వగూడులగ్రములయందుఁ గలవియును, నగు నాశిబిరములన్నియును, నింద్రనగరమువలె మిగుల రమణీయతగలవై ప్రకాశించుచున్నవయ్యె. పిమ్మట నానావిధములగు వృక్షములతోఁ గూడిన యడవులుగలదియును, శీతలములును, నిర్మలములును నగు నుదకములుగలవియును, గొప్పవగు మత్స్యములచేత నిండియున్నవియును, నగు గంగానదియొద్దకుఁ బోయిరి. అట్లు గంగానదివఱకును రమ్యములగు శిబిరములను నిర్మించి యటుపిమ్మట మార్గము మిగుల గహనమగుటచేత శిబిరములను నిర్మింపరైరి. అవ్విధముగ శిల్పులచే నిర్మింపఁబడిన మహానుభావుఁడగు భరతుని మార్గము రాత్రులయందు నక్షత్రములతోడను, చంద్రునితోడను గూడినదై ప్రకాశించుచున్న యాకాశమువలె మిగుల మనోహరముగఁ బ్రకాశించుచుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనుబదవసర్గ ముగిసెను.

భరతుఁడు వందిమాగధులచే నిద్రమేలుకొలుపఁబడి దశరథునితలంచుకొని విలపించుట.

అటుపిమ్మట నభ్యుదయ ప్రారంభముగల రాత్రియందు వాక్యవిశేషములను జక్కఁగాఁ దెలిసిన వందిమాగధులు మంగళకరములగు స్తోత్రపాఠములచేత భరతుని స్తోత్రముసేసిరి. మఱికొందఱు రాత్రికాలమునందు జాములను దెలుపుటకొఱకు నుంచిన భేరిని కనకదండములచేతఁ గొట్టి ధ్వని గలుగునట్లుసేసిరి. మఱియు ననేకనూరుల శంఖములను భంభంబని పూరించిరి. ఇంతియగాక నానావిధధ్వనులు కాహళములు మొదలుగాఁగల వాద్యములను మ్రోయించిరి. మిగులఁ బెద్దదియును, గగనమును నిండించుచున్న ధ్వని గలదియును, నగు మంగళవాద్యధ్వని భరతునకు మునుపటికంటె నధికమగు దుఃఖమును గల్పించె. అంతఁ గొంతసేపటికి మేలుకొని యా భరతుఁడు మంగళవాద్యములను మ్రోయింపఁదగదు నేను ప్రభువును గాదని నివారించె. అట్లు సేసి శత్రుఘ్నునితో నిట్లనియె.

నేను రాజును గాదు. కావున నో శత్రుఘ్నా! నేను మంగళవాద్యధ్వనులచేత మేలుకొనఁదగినవాఁడను గాను. తమ్ముఁడా! శత్రుఘ్నా! కైకేయిచేత లోకమునకు గొప్పదగు నపకారము జేయఁబడినది. ఈవిషయమును జూడుము. దశరథమహారాజు సకలదుఃఖములను నాయందుఁ బెట్టి తాను స్వర్గలోకమునకుఁ బోయిచేరె. మహానుభావుఁడును ధర్మరాజును నగు దశరథమహారాజుయొక్క ధర్మమే కారణముగాఁ గల యీ రాజ్యలక్ష్మి జలమునందోడ నడుపువాఁడు లేని యోడవలె నల్లాడుచున్నది. మనకందఱకును బ్రభుఁడును మిగుల గొప్పవాఁడును, నగు రాముఁడు ధర్మమును గొంచెమైన నాలోచింపని నా తల్లియైన కైకేయిచేత వనమునకుఁ బంపఁబడియె. అయ్యో నేనేమి సేయుదునని భరతుఁడు బహువిధముల విలపించుచు స్మృతిలేనివాఁడై తటాలున నేలఁమీఁదఁబడియె. అవ్విధముగఁ గ్రిందఁబడి పొర్లిపొర్లి యేడ్చుచున్న భరతునిఁ జూచి యందలి స్త్రీలందఱును, దుఃఖము గలుగునట్లుగాను, గొప్పధ్వని గలుగునట్లుగాను రోదనమును జేసిరి. అవ్విధముగ భరతుఁడు మొదలగువారు రోదనమును జేయుచున్న సమయమునందు రాజధర్మముల నెఱిగినవాఁడును కీర్తివంతుఁడును నగు వసిష్ఠమహాముని యిక్ష్వాకునాథుని సభయందుఁ బ్రవేశించె. అంతట ధర్మస్వభావముగల వసిష్ఠమహాముని శిష్యసముదాయముతోఁ గూడి సువర్ణమయమైనదియును, మిగుల సుందరమైనదియును, శ్రేష్ఠములగు మణులచేత నిండినదియును, దేవసభను బోలియున్నదియు నగు సభను బ్రవేశించె. అట్లు ప్రవేశించి సర్వవేదములను దెలిసినట్టి యా వసిష్ఠమహాముని సుఖకరమైన శయ్యచేత గప్పఁబడినదియును, సువర్ణమయమైనదియును, నగు నాసనమునందుఁ గూర్చుండి దూతలం బిలిపించి యిట్లనియెను.

ఓ దూతలారా! మీరు శీఘ్రముగఁ బోయి యికమీఁదట జరగవలసిన రాజకార్యమును గుఱించి యాలోచింపవలసియున్నది కావున నేను బిలిచితినని బ్రహ్మక్షత్రవైశ్యులను, మంత్రులను, గణాధ్యక్షులను బిలుచుకొనిరండు. మఱియు ను రాజునకంతరంగులయిన భృత్యులతోఁ గూడిన శత్రుఘ్నుని, మహాకీర్తిమంతుఁడగు భరతుని, యుధాజిత్తను పేరు

గలమంత్రినిసుమంత్రునిగూడఁ దోడ్కొనిరండు. ఇంతియ గాక రాజకార్యములయందుఁ బ్రియముగలయితరులనుగూడ శీఘ్రముగఁ దోడ్కొనిరండనివసిష్ఠమహాముని యాజ్ఞాపించె. అట్టియెడదూతలుపోయి యెల్లవారలకును దెలిపిరి అంతటనెల్లవారునుదమతమగౌరవమునకుఁదగినవిధముగ రథగజవాహనములతోఁగూడబయలువెడలివచ్చుచుండిరి. అట్లు వచ్చుచున్నజనులయొక్క హలహలాశబ్దము భూనభోంతరముల యందంతటనువినఁబడియె. ఆమహాధ్వనియెల్లవారలకునుమహాదాశ్చర్యమునుగలుగఁజేసె. అట్టికలకలధ్వనితోనెల్లవారునువచ్చిరి. అప్పుడుభరతుఁడుగూడననేకవేల మందితోవచ్చుచుండె. అట్లువచ్చుచున్నభరతునిఁజూచియెల్లవారును దేవతలింద్రునకునమస్కరించువిధముగనమస్కారమును జేసిరి. మఱియునుదొల్లిదశరథమహారాజునకెవ్విధముగ నమస్కారమునుసల్పిరోయావిధముగ నమస్కారములను జేసిరి. అధికమైనమత్స్యములును, నీటియందుండుపచుగులును, కలిగి, మణులును, శంఖములును, స్థూలమైనయిసుకగాఁగలదియును, నిశ్చలమైనజలముగలదియునునగుసముద్రమునందలిమడుగువలె దశరథునిపుత్రులచేఁ బ్రకాశించుచున్నఆసభపూర్వము శశరథుఁడున్నసమయమునందెట్లుప్రకాశించెనోయావిధముగాఁబ్రకాశించె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనుబదొక్కటవసర్గముగిసెను.

భరతుడు పురజనులతోడను చతురంగబలముతోడను రాముని యొద్దకు బోవుట.

అంతబుద్ధిమంతులలోనుత్తముఁడగుభరతుఁడుపూజ్యులగుజనులయొక్కసమూహముచేతఁ బూర్ణమైన యాసభను బూర్ణిమాచంద్రుఁడుబృహస్పతిమొదలగు గ్రహములతోఁగూడినరాత్రినిజూచువిధముగఁజూచి,, యధికమైనసంతోషమునుబొందె. మఱియుసర్వోత్తమమగు నారాజసభయందుఁబూజ్యులగు వారికిఁదగినవిధముగ ఆసనములుగల్పింపఁబడియుండె. మఱియువారలయొక్కవస్త్రాలంకారాదులచేత నధికముగఁ బ్రకాశించుచుండె. మఱియునప్పుడువిద్వాంసులచేతఁ బూర్ణమైనదియును, మిగులరమణీయమైనదియును, నగునాసభ, ''శరత్కాలమునందుఁ బూర్ణచంద్రునితోఁగూడినరాత్రివలెఁ,, బ్రకాశించుచుండె. ఆసమయమునందుసకలధర్మములను దెలిసినవాఁడును, పురోహితుఁడునునగువసిష్ఠమహాముని యాసభయందుండురాజులను, సకలమైనజనులను, భరతునిఁజూచిమృదుమధురమగుమాటలతోనిట్లనియె.

నాయనా! భరతుఁడా! మనకందఱకునురాజగు దశరథమహారాజుధర్మమునుదప్పకపరిపాలించుచు దనధాన్యములచేతఁబూర్ణమైనదియును, సమృద్ధమైనదియునునగు భూమినినీకిచ్చిస్వర్గమునకుఁబోయె. మఱియునవ్విధముగా సత్యమునందుఁ బ్రియముగలరాముఁడు సత్పురుషులయొక్కధర్మమును, దలఁచుచుఁదండ్రియొక్కయాజ్ఞను, ''చంద్రుఁడువెన్నెలనువిడువని విధముగవిడువనేరక,, నరణ్యమునకుఁబోయె. కావునఁదండ్రియగుదశరథుఁడును, భ్రాతయగురాముఁడును, లేని, నిష్కంటకమగు రాజ్యమును మంత్రులకానందమునుగల్పించుచు ననుభవింపుము. త్వరలోఁబట్టాభిషిక్తుఁడవుగమ్ము. మఱియును త్తరదేశపురాజులును, పశ్చిమదేశపురాజులును, దక్షిణదేశపురాజులును, సింహాసన హీనులగురాజులును, (అనగాసామాన్యపురాజులు) పశ్చిమదేశవాసులగుయవనులును, సముద్రమధ్యస్థద్వీపవాసులగురాజులును, ననేకకోటిసంఖ్యలుగల రత్నములనునీకుఁగానుకనుగాఁదెచ్చిరి. వానినన్నింటిని నీకిచ్చుటకుసిద్ధముగనున్నారనియె. అనియిట్లువసిష్ఠమహాముని చెప్పిన మాటనువినిధర్మజ్ఞుఁడగుభరతుఁడుదుఃఖమునందు మునిఁగినవాఁడై ధర్మమునందలియభిలాషచేత మనస్సునందు రామునిస్మరించె. అట్లుమనస్సున రామునిదలఁచుకొని కలహంసయొక్కకంఠధ్వనివలెమనోహరమైన కంఠధ్వనిగలవాఁడును, యౌవనవంతుఁడును, నగునాభరతుఁడు రాజ్యముమొదలగువాటియందుకోరికలేకమహాదుఃఖముతోకన్నీరుధారధారగ బ్రవహింపగా గట్టిగనాసభనడుమనేడ్చె. మఱియువసిష్ఠమహాముని నిట్టికఠినమైనవాక్యములజెప్పవచ్చునా? యనియతనినినిందించె. బ్రహ్మచర్యవ్రతమునాచరించువాఁడును, వేదాధ్యయనానంతరమందుఁ జేయఁదగినస్నానమునుజేసినవాఁడును, మిగులనుత్తమమైనబుద్ధిగలవాఁడును, వేదములయందలియర్థమును దెలిసినవాఁడును, ధర్మమునందుఁ బ్రయత్నమును జేయుచున్నవాఁడును, వేదోక్తధర్మానుష్ఠానమును జేయుచున్నవాఁడును, నగురామునియొక్కరాజ్యమునునెవ్వఁడపహరించును. నిజముగ దశరథునకుఁబుట్టినవాఁడుతనయన్నకుఁ జేరవలసిన రాజ్యమునపహరించునా? ఈరాజ్యమంతయును రామునిది. నేనును రామునివాఁడనే. కావునవోమునిశ్రేష్ఠుడా! నీవీవిషయమునందు ధర్మమును జెప్పవలయును. మఱియును పెద్దవాఁడును, శ్రేష్ఠుఁడును, ధర్మస్వభావుఁడును, దిలీపునితోడను, నహుషునితోడను, సమానుఁడైనవాఁడును, నగురాముఁడుదశరథునివలె రాజ్యమునుబొందుటకుఁదగును. మఱియునోవసిష్ఠమహామునీ! నేనుదుష్టులచేతసేవిం

పఁబడినదియును, స్వర్గలోకమునకు హానికలుగఁజేయునదియును, నగుపాపమును జేసితినేని యిక్ష్వాకువంశమునందుఁబుట్టినవారలలోఁ గులము జెఱుపఁబుట్టినవాఁడననియపకీర్తినిఁబొందుదును. నాతల్లియగు కైకేయి చేసినవిధముగానే నుకూడఁ బాపకృత్యమును జేయుటకు సమ్మతినిబొంది యుండలేదు. నేనిక్కడనేయుండి కృతాంజలుఁడనై మహారణ్యమునందున్నరామునకు నమస్కారము సేయుచున్నాను. నేను రామునే సేవించెదను. సజ్జనులలో శ్రేష్ఠుఁడగురాముఁడే మనకందఱకును రాజైయుండఁ దగును. ఇంతయేగాక రాముఁడు మూఁడులోకములయందునుగూడ ప్రభుత్వమును బొందుటకుఁ దగినవాఁడనియె. ఆవచనమును వినియా సభయందున్న వారలందఱును బరమానందమును బొంది యాసభవారెల్లరును రామునియందే తమచిత్తముల నునిచి యానందబాష్పములను విడుచుచు నాహా, భరతుఁడు ధర్మయుతముగ సంభాషించెనని భరతునివాక్యములను గొనియాడిరి. అప్పుడు భరతుఁడు మరల నిట్లనియె.

ఓవసిష్ఠమునివర్యా! పూజ్యుఁడగు రాముఁడొకవేళ వనమునుండి రాకపోయెనేని నేనుగూడ లక్ష్మణునివలె రామునితోఁగూడ నరణ్యమునందే నివసించెదను. సజ్జనులును, సద్గుణముల నవలంబించినవారును, నగుసభికులయొక్క యెదుటబలాత్కారముగనైనను మరలించుటకు నానావిధములగు నుపాయములను జేసెదను. మార్గమును జక్కఁగఁ జేయుటయందు శక్తిగలవారును, మార్గమునందుఁ గాపాడుటయందు సామర్థ్యముగలవారును, కూలికొఱకు గ్రామములనుండి వచ్చినవారలును, నగువారలననేకుల నేను ముందుగానే, మార్గమును బాగుసేయుఁడని పంపితిని. కావున నేను రామునొద్దకుఁ బోవలయునని మిగులఁ గుతూహలముగలవాఁడనై యున్నానని చెప్పె. భ్రాతృవత్సలుఁడును, ధర్మాత్ముఁడును, నగు భరతుఁ డిట్లు చెప్పి సమీపమునందున్నవాఁడును, నాలోచనను జేయువారలలో మిగుల సమర్థుఁడును, నగుసుమంత్రునిఁ జూచి భరతుఁ డిట్లనియె.

సుమంత్రుఁడా! నీవు శీఘ్రముగఁ బోయి నేను జెప్పితినని చెప్పి చతురంగబలములను బయనమును జేయించి తీసికొనిరమ్ము. ఆలస్యము నేమియును జేయకుమని చెప్పె. అవ్విధముగ మహానుభావుఁడగు భరతుఁడు సెప్పినమాటను విని యధిక సంతోషముగలవాఁడైయా సుమంత్రుఁడు భరతుఁడు సెప్పిన విధముగ నెల్లవారలకు నాజ్ఞ సేసె. అంతట సకలజనులును, గణాధ్యక్షులును, నావృత్తాంతమును విని రాముఁడరణ్యమునుండి మరలివచ్చునుగదాయని పరమానందంబును బొందిరి. అటుపిమ్మటఁ బ్రతిగృహమునందును భృత్యులు మొదలగువారిభార్యలు తమభర్తలకు రామునొద్దకుఁ బోవలసినప్రయాణము గలిగినదను సంతోషముచేత భర్తలను బయనముగండని యధికముగఁ ద్వరపెట్టిరి. అంతట సేనాధ్యక్షులందఱును పరమసంతోషముగలవారై గుఱ్ఱములను, గోవులను, రథములను, బండ్లను, గజములను, కాల్బలములను, మఱియును గావలసినవానిని సన్నాహము సేసిరి. అప్పుడా భరతుఁడు సన్నద్ధమైనయా సైన్యమును జూచి వసిష్ఠమునివరుఁడొద్దనుండఁగానే ప్రక్కనున్నసుమంత్రునిఁ జూచి సుమంత్రుఁడా! నారథమును గూడఁ దీసికొనిరమ్మనియె. అంతనా సుమంత్రుఁడు భరతునియొక్క యాజ్ఞను స్వీకరించి సంతోషమును బొంది యుత్తములగు గుఱ్ఱములను గట్టి నరథమును దీసికొనివచ్చె. అప్పుడు రఘుకులమునందుఁ బుట్టినవాఁడును, సర్వకాలములయందును ధైర్యము నవలంబించినవాఁడును, మిగుల గొప్పదగు ప్రతాపముగలవాఁడును, దృఢమైనదియును, సత్యమైనదియును నగు విక్రమము గలవాఁడును, నగుభరతుఁడు మంచిమాటలను జెప్పుచు మహారణ్యమునకుఁ బోయినవాఁడును, నధికమైనకీర్తిగలవాఁడును, నగు రాముఁడు ప్రసన్నుఁడగుటకొఱకు యోచించి సుమంత్రునిఁ జూచి యిట్లనియె.

సుమంత్రుఁడా! శీఘ్రముగా లేచి సైన్యమంతయును నొక్కచోటఁ జేరుటకు సేనాధ్యక్షులయొద్దకుఁ బొమ్ము. నేను శీఘ్రముగాఁ బోయి లోకముయొక్క హితముకొఱకు నరణ్యమునందున్నయా రాముని ప్రసన్నునిగాఁ జేసి తోడ్కొనివచ్చుటకిచ్ఛయించుచున్నాననియె. ఆవచనములను విని సుమంత్రుఁడు భరతునియాజ్ఞను శిరసావహించి తనకోరికలన్నియును ఫలించుటచేఁ బరమసంతోషమును బొంది ప్రజలలో ముఖ్యులగువారలకును, సేనానాయకులకును, స్నేహితులకును, మఱియు నితరులకును, శీఘ్రముగ బయనమై రావలయునని భరతునియాజ్ఞం దెలిపె. అంతటఁ బ్రతిగృహమునందలి బ్రాహ్మణులును, క్షత్రియులును, వైశ్యులును, శూద్రులును, లేచి, యొంటెలను, గాడిదెలను, రథములను, నేనుఁగులను, మంచికులమునందుఁ బుట్టినగుఱ్ఱములను గూర్చుకొని ప్రయాణమై వచ్చిరి.

ఇట్లు శ్రీమద[illegible]ధ్యాకాండమునందలి యెనుబదిరెండవసర్గముగిసెను.

భరతుఁడు సకలసైన్యముతో గంగానదీతీరము జేరుట.

అటుపిమ్మట భరతుఁడు ప్రాతఃకాలమునందు లేచి యు శ్రేష్ఠమగు రథము నెక్కి రాముని జూడవలయునని మెయు న

భిలాషచే శీఘ్రముగా బయలు వెడలిపోయెను. మఱియు నాసమయమునందు, మంత్రులును, పురోహితులును మొదలగు వారందఱును సూర్యునియొక్క రథమునకు సమానమైన నశ్వములను బూన్చిన రథముల నెక్కి భరతునకు ముందుగా నడచిరి. మఱియును భరతునాజ్ఞానుసారముగ నయోధ్యా పట్టణమునందలి యేనుఁగులలోఁ దొమ్మిదివేల యేనుఁగులు యిక్ష్వాకువంశమునందుఁ బుట్టిన భరతునితోఁగూడ బయలువెడలె. మఱియు నరువదివేలరథములును, నంతియసంఖ్యగల ధనుస్సులుగలవారును, నానావిధములైన నాయుధములుగల యోధులును, ప్రయాణమైపోవుచున్నవాఁడును, కీర్తిగలవాఁడును, రాజపుత్రుఁడును నగు భరతునితోఁ గూడ బయలు వెడలిరి. మఱియు రాజభృత్యులయందు లక్షమంది గుఱ్ఱముల నెక్కికొని ప్రయాణమై పోవుచున్నవాఁడును, సత్యసంధుఁడును, జితేన్ద్రియుఁడును, నగు భరతునితోఁ గూడ బయలు వెడలిరి. మఱియుఁ గైకేయియును, సుమిత్రయును, కౌసల్యయును, రాముని దోడ్కొని వచ్చుటను గుఱించి మహాసంతోషమును బొంది యానముల నధిష్ఠించి బయలు వెడలిపోయిరి. అమ్మువ్వురిలోఁ గైకమాత్రము తెలివిలేక తాను జేసిన దుష్కార్యమునకు మిగుల బరితాపమును బొందుచు నందఱికంటె ముందుగా బయలు వెడలె. మఱియును బూజ్యులగు జనులయొక్క సమూహము లక్ష్మణుని తోఁగూడిన రాముని జూచుటకు రామునియొక్క నానావిధములైన కథలను నొకరితో నొకరు చెప్పుకొనుచు సంతుష్టచిత్తముగలవారై బయలు వెడలె. మఱియు నవ్విధముగ బయలు వెడలిన వారందఱును మేఘమువలె నల్లగా నున్నవాఁడును, మిగుల గొప్పవగు భుజములు గలవాఁడును, స్థిరమైన బలముగలవాఁడును, దృఢమైన వ్రతము గలవాఁడును, సర్వలోకములయందలి దుఃఖమును నశింపఁ జేయువాఁడును, నగు రాముని నెప్పుడు చూడఁగలమని తలఁచిరి. సూర్యుఁడు సర్వలోకములయందలి చీకటిని బోఁగొట్టువిధముగ రాముఁడు మనలఁ జూచినతోడనే మన దుఃఖమును సర్వమును బోఁగొట్టునని చెప్పుకొనిరి. మఱియు నానగరవాసులందఱును, నివ్విధముగా శుభకరములగు కథలను జెప్పుకొనుచు సంతోషమును బొందినవారై యొకరినొకరు కౌఁగలించుకొనుచుఁ బోయిరి. మఱియు నిష్టులగు మఱికొందఱు వర్తకులుగూడ నావిధముగానే సంతోషకరములగు కథలను జెప్పుకొనుచు రాముని జూచుటకుఁ బోయిరి. మఱియును రత్నములను సానబెట్టువారలును, మంగళకరులగు కుంభకారులును, వస్త్రములు నేయు సాలెవారలును, నాయుధముల ధరించి జీవించువారలును, నెమలిపింఛములు మొదలగువానిచే విసనకఱ్ఱలు మొదలగువానిని జేయువారును, అంపవృపనులను జేయువారలును, రత్నములు, కొయ్యలు, మొదలగువానికి రంధ్రములను గల్పింప సమర్థులగువారును, దంతపుపనిని జేయుటయందు సమర్థులగువారును, సున్నపుపనిని జేయువారలును, గంధద్రవ్యముల నాశ్రయించి జీవించువారలును, ప్రసిద్ధులగు స్వర్ణకారులును, కంబళులను శోధించుటయందు సమర్థులగువారలును, తైలాభ్యంగాదిస్నానములను జేయించుటయందు నేర్పుగలవారలును, శరీరమర్దనమును జేయువారలును, వైద్యులును, గృహములయందు సుగంధిద్రవ్యములచేత ధూపములను వేయుటయందు నిపుణత్వముగలవారును, మద్యములను జేయుటయందు సామర్థ్యముగలవారును, వస్త్రములను తుకుకుటయందు సామర్థ్యముగలవారలును, కుట్రవుపనిని జేయువారలును, గ్రామములయందును, పల్లెలయందును, ప్రధానులగువారలును, స్త్రీలతోఁగూడ సాంగత్యమును గలిగించుటయందు నేర్పుగలవారును, చెంబడివాండ్రును, బయలు వెడలిపోయిరి. ఇంతియగాక సమాధియుక్తులును, వేదములను జక్కఁగఁ దెలిసినవారును, సదాచారముచేఁ బూజ్యులును, నగు బ్రాహ్మణులనేకవేలమంది యెద్దుబండ్ల నెక్కి, రామునొద్దకుఁ బోవుచున్న భరతునితోఁగూడఁ బోయిరి. మఱియును గొందఱు చక్కగా నలంకారమును జేసికొని నిర్మలములగు వస్త్రముల నుధరించుకొని రక్తచందనమును శరీరమునందలఁదుకొని నానావిధములగు వాహనముల నెక్కి భరతునితోఁగూడఁ బోయిరి. మఱియు నవ్విధముగానే సంతోషముచేత రోమాంచితశరీరములుగలవారలై సైనికులనేకవేలమంది రాముని దోడ్కొనివచ్చుటకుఁ బోవుచున్నవాఁడును, భ్రాతృవత్సలుఁడును నగు భరతునితో బయలు వెడలిపోయిరి. అట్లు రథములను, గుఱ్ఱములను గజములను నెక్కి బయలు వెడలినవారందఱును బహుదూరము ప్రయాణము జేసి రామునకు మిత్రుఁడును, బంధుజనముచేఁ జుట్టబడినవాఁడును, స్వదేశమున నెవ్విధమైన ప్రమాదము గలుగకుండునట్లుగ బరిపాలించుచున్నవాఁడును నగు గుహుఁడు నివసించియున్న శృంగిబేర పట్టణముయొక్క సమీపమునందు గంగానదిని జూచిరి. భరతునితోఁగూడ బయలు వెడలిన యాసైన్యమంతయును, చక్రవాకములచేత నలంకృతమైయున్న గంగాతీరమును బొందిరి. మనోహరముగ మాటలాడుటయందు మిగుల సమర్థుఁడగు భరతుఁడు తన వెంబడి వచ్చుచున్న సైన్యమును, మంగళకరమయిన యుదకముగల గంగానదిని జూచి మంత్రులతో నిట్లనియె.

మంత్రిశ్రేష్ఠులారా! సకలసైన్యమును నేను జెప్పితినని

చెప్పి యిచ్చటవిడిసియున్నట్లు సేయుఁడు. ఇప్పుడిక్కడఁగొంత సేపువిశ్రమించి రేపుగంగానదిని దాటుదమనియె. మఱియు నేను గంగానదియందుదిగి స్వర్గస్థుఁడైన దశరథమహారాజునకు స్వర్గసౌఖ్యముగలుగుటకై యుదకతర్పణమును జేయఁదలఁచియున్నాననియె. ఇట్లుభరతుఁడు చెప్పుచున్న వాక్యములకు సమ్మతించి యామంత్రులు మిగుల జాగరూకతతోఁ దమయిష్టానుసారముగ వెంటవచ్చిన సైన్యమునకు సర్వమునకును, విడుదలనుగల్పించిరి. అప్పుడాభరతుఁడు గొప్పనదియగు గంగానదినిననుసరించి డేరాలచేఁబ్రకాశించుచున్న సైన్యమునకు సర్వమునకును, తగినయేర్పాటులను జేయించె. పిమ్మటభరతుఁడు మహానుభావుఁడగు రామునిదోడ్కొనివచ్చుటకుఁ దగినయుపాయముల నాలోచించుచుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనుబదిమూడవసర్గ ముగిసెను.

భరతుని సమీపమునకు గుహుడు వచ్చుట.

అట్టియెడ కిరాతరాజగు గుహుఁడు గంగానదినినాశ్రయించి దిగియున్నసైన్యమునుజూచినతోడనే మిగులఁద్వరగలవాఁడై తనబంధువులతో నిట్లనియె.

బంధువులారా! ఈగొప్పసైన్యమంతయును జూచుటకు సముద్రమువలెగనఁబడుచున్నది. ఎంతమారమాలోచించినను, మనస్సుచేతఁగూడ నీసైన్యముయొక్క తుదనుగనుఁగొనుట దుర్లభమైయున్నది. ఇదిరామునితమ్ముఁడగు భరతునిసైన్యముగ నుండవచ్చును. దుర్బుద్ధిగలయాభరతుఁడు స్వయముగానేవచ్చినాఁడు. ఆభరతుఁడు గొప్పశరీరముగలవాఁడైయుండును. మఱియు కాంచనవుచెట్టుయొక్క రూపమువంటి రూపముగల ధ్వజముతోఁగూడిన రథమునందుఁ గూర్చుండియుండును. ఈభరతుఁడు చెంబడివాండ్రనుబట్టుకొనునో, లేకమనలనుబంధించునో, యనియాగుహుఁడు సందేహమునుబొందె. మఱియునుకైకేయిపుత్రుఁడైన భరతుఁడురాజుగానుండఁదగిన రామునియొక్క దుర్లభమును, సంపూర్ణమును, నైనరాజ్యమును తానపహరించి శాశ్వతముగ బరిపాలింపగోరి తండ్రియాజ్ఞనుబొంది యరణ్యమునకుఁబోయిన దశరథనందనుడగు రామునిజంపుటకు బయలువెడలి పోవుచున్నాఁడు. దశరథపుత్రుఁడైనరాముఁడు మనకుస్నేహితుఁడు. ఇంతయగాక మనకుఁబ్రభువు. కావునమీరందఱును నర్థకామములుగోరువారలును, సన్నాహముతోఁగూడినవారలునునై గంగాతీరమునందుండుఁడు. ఇంతయగాక చెంబడివారలందఱును గంగానదినిబొంది సైన్యసమేతులును, మాంసమూలఫలాశనులును, నగుచు నోడలయందేభుజించుచు నతినిరక్షించుచు నుండునట్లు సేయుఁడు. నేడును రేపును గాపాడియుండినయెడలఁబిమ్మటిసంగతిని దెలిసికొందము. ఐదునూరులయోడలనుసన్నద్ధముచేసి యాయోడలయందుయావనవంతులును, బలవంతులునునగు చెంబడివార లనేకనూరులునివసించి యుద్ధసన్నద్ధులై యుండునట్లు సేయుఁడు. ఈభరతుఁడు రామునియందు దుర్మార్గప్రవర్తనను జేయకయుండెనేని యప్పుడుమనసైన్యమంతయును నోడలనువదలిరావచ్చును. అట్లుగాక యీభరతుఁడు రామునియెడల దుర్మార్గమును జేసెనేని మనమందఱమును నేకీభవించి సైన్యసమేతముగ నాశమునుబొందింతమనియె. ఇవ్విధముగ బోయవాండ్రకురాజైన గుహుఁడుచెప్పి మత్స్యములను, మాంసములను, మధువును, కానుకనుగాఁదీసికొని భరతునకెదురుగాఁబోయె. అటుపిమ్మట మిగులనధికమైనప్రతాపముగలవాఁడును, వినయమును జక్కగనెఱిగినవాఁడును, నగుసుమంత్రుఁడు, తామున్నచోటునకు వచ్చుచున్నగుహునిఁజూచె. అట్లుచూచినతోడనే వినయముగలవాఁడై భరతునితో గుహుఁడు వచ్చుచున్నాఁడనిచెప్పి మఱియునిట్లనియె.

మఱియునో భరతుఁడా! నిషాదరాజగునీగుహుఁ డనేకవేలబంధుజనులతోఁగూడఁ గూడుకొనివచ్చియున్నాఁడు. ఇతఁడుమిగులవృద్ధుఁడు. దండకారణ్యసంచారమునందు బహుసమర్థుఁడు. నీకన్నయగు రామునకుఁ బరమమిత్రుఁడు. కకుత్స్థకులసంభవా! భరతుఁడా! కావుననీవునిషాదపతియగు నీగుహునకు దర్శనమివ్వవలయును మనరామలక్ష్మణులున్నచోటుయితనికిఁ జక్కగాఁ దెలిసియుండుననిసుమంత్రుఁడు భరతునితోఁజెప్పె. అంతనాభరతుఁడు సుమంత్రునిమాటలనువిని గుహుని నేనుజూచుటకు శీఘ్రముగఁదీసికొనిరమ్మనియె. అప్పుడాగుహుఁడు బంధుజనముతోఁగూడ భరతాజ్ఞనుబొంది భరతుఁడున్నచోటునకుఁ బోయె. పోయినపిమ్మటనాగుహుఁడు మహావినయముగలవాఁడై భరతునిగూర్చి యిట్లనియె.

దశరథరాజనందనా! భరతా! మాదేశమంతయునునీపేరుచేఁబ్రసిద్ధమునొందియున్నది. నీవువచ్చుటను మేము ముందుగాగుఱుతెఱిఁగియుండకపోవుటచే మేమువంచితులమైతిమి. ఇదివఱకుముందుగానీవుసపరివారముగ నిక్కడకువచ్చుట మాకుఁదెలిసియుండునేని మాశక్త్యనుసారముగనభ్యుత్థానాదిక్రియలను జేసియుందుము. అట్టిభాగ్య

ముహూకుఁగలుగలుగలేము. అయినను నీ దాసుఁడనగు నా యింటియందు నివసించుటకుఁ బ్రార్థించెద. నిషాదులమగు మాచేత భక్తిపురస్సరముగ సంపాదింపఁబడినకందమూలఫలాదులను, నార్ద్రమాంసమును, శుష్కమాంసమును, నానావిధములగు వనమునందుపుట్టినపదార్థములను గ్రహించుటకుఁ బ్రార్థించెదను. మఱియు నీసైన్యమునకు సర్వమునకును, జక్కఁగ నన్నపానాదులను బెట్టి యీ రాత్రియందిక్కడ నివసించునట్లాజ్ఞఁ జేయుము. ఇంతయగాక నానావిధములును, కోరఁదగినవియునునగు పదార్థములచే మాచేతఁ బూజింపఁబడినవాఁడవై రేపటిదినమువఱకును నిక్కడనుండుటకుఁ బ్రార్థించుచున్నానని గుహుఁడు చెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనుబదినాలుగవ సర్గము ముగిసె.

భరతుఁడు గుహునితో రామునికపకృతి సేయుటకు రాలేదని చెప్పుట.

పండితులలో నుత్తముఁడగు భరతుఁడిట్లు గుహుఁడు సెప్పినమాటలను విని బోయవారలకుఁ బ్రభువగు గుహునితో సార్థకమగు మాటలను జెప్పఁదలఁచి యిట్లనియె.

ఓ నిషాదాధిపతీ! గుహుఁడా! నాయన్నకు పరమమిత్రుఁడా! నీవొక్కఁడవయ్యే నామహాసేనను సర్వమును బూజించుటకుఁ గోరికగలవాఁడవైతివి. కావున నీవు మమ్ములఁ బూజించినట్టుగానే సంతోషము గలిగియున్నదని గుహునితోఁ జెప్పె. మహాతేజుఁడగు భరతుఁడీవిధముగా గుహునితోఁ జెప్పె. అట్లు చెప్పి మరల శ్రీమంతుఁడగు భరతుఁడు కిరాతవల్లభుఁడగు గుహునితో నిట్లనియె.

గుహుఁడా! నేను భరద్వాజాశ్రమమునకుఁ బోఁదలఁచితిని. నే నా భరద్వాజాశ్రమమునకే మార్గమునఁ బోవచ్చును. గంగాజలముచేత వ్యాప్తమైన యీదేశము బహుదుర్లభమైగనఁబడుచున్నది. మఱియు నీగంగాజలమును గూడగా నేనెట్లు దాటఁగలనని దోఁచుచున్నదని భరతుఁడు గుహునితోఁ జెప్పె. అంతట నడవియందు సంచారమును జేయునట్టి గుహుఁడు రాజపుత్త్రుఁడును, బుద్ధిమంతుఁడును, నగు భరతుని యొక్క మాటను విని చేమోడ్పుగలవాఁడై యిట్లనియె.

మహాకీర్తిగలయో భరతుఁడా! నావారలగు చెంబడివారలందఱును, ధనుర్ధారులై మిక్కిలి జాగరూకతగలవారై నీతోఁ గూడ రాఁగలరు. నేనుగూడ నీతో వచ్చెదనని చెప్పి మఱియు నిట్లనియె.

రఘుకులనందనా! భరతుఁడా! సకలభూతములకును సౌఖ్యమును గలుగఁజేయునట్టి వ్యాపారములుగల రాముని విషయమయి దుష్టతలంపుతో నీవు బయలు వెడలలేదుగదా? నీ వీవిధముగఁ జతురంగబలముతోఁ గూడ బయలువెడలి వచ్చుటచేత నామనస్సునకు సందేహము గలిగియున్నదనియె. అట్లు గుహుఁడు సెప్పినమాటలను, విని యాకాశమువలె నిర్మలమైన స్వభావముగల భరతుఁడు మృదుమధురవచనములతో నిట్లనియె.

ఓ కిరాతవల్లభా! గుహుఁడా! రామునకు నేను అపకారమును జేయుదునేమో యను సందేహము నీకుఁ గలిగినదే? ఇందుకు నేను దుఃఖమును బొందెదను. ఇఁక నెన్నటికిని నా యందిట్టి సందేహమెవ్వరికిని గలుగకపోవుగాక. ఇట్టికష్టకాలము గూడ నాకెన్నటికిని రాకపోవుగాక. రఘుకులోద్భవుఁడగు రాముడు నాకు భ్రాత. అదియును గాక జ్యేష్ఠుఁడు. కావున నతఁడు నాకుఁ బితృసముఁడు. వనమునందు నివసించియున్నవాఁడును, కకుత్స్థకులమునందుఁ బుట్టినవాఁడును నగు రాముని నరణ్యమునుండి పిలుచుకొని వచ్చుటకు నేను బోవుచున్నాను. కావున నో గుహుఁడా! నీమనస్సున వేఱొకవిధముగాఁ దలవకుము. నేను సత్యముగాఁ జెప్పుచున్నాననియె. అని యిట్లు భరతుఁడు సెప్పినమాటలను విని యాగుహుఁడు పరమానందమును బొందె. అట్లు పరమానందమును బొంది భరతుని జూచి మరల నిట్లనియె.

రఘుకులోత్తమా! భరతుఁడా! నీవు ధన్యుఁడవు. అప్రయత్నముగ లభ్యమైన రాజ్యము ననుభవింపకవదలుటకిచ్ఛయించుచున్నావు. నీవు మిగుల ధర్మాత్ముఁడవు మహానుభావుఁడవు. ఇట్టి మహానుభావుఁడీలోకమునందితరుఁ డెవ్వఁడును లేఁడు. నేను జూచియునుండలేదు. భరతుఁడా! నీవు మిగుల గష్టములను బొందిన రాముని యరణ్యమునుండి బిలుచుకొనివచ్చి సుఖముగలవానినిగాఁ జేయుటకిచ్ఛయించుటవలన సకలలోకములయందును నీకీర్తి శాశ్వతముగ నుండునట్లు ప్రసిద్ధి నొందఁగలదని గుహుఁడు సెప్పె. ఇవ్విధముగఁ జెప్పుచున్న గుహుని వచనమును విని పరమానందమును బొందె. మఱియు నట్లు గుహుఁడును భరతుఁడును మాటలాడుచుండఁగా నే సూర్యుఁడు నష్టమైన కాంతిగలవాఁడయ్యె. అంతట రాత్రి వచ్చె. అప్పుడు భాగ్యవంతుఁడగు భరతుఁడు తనసేనను సర్వమును నాటిరాత్రియక్కడ నివసించునట్లు సేసె. పిదప గుహునిచేత సంతోషమును బొందింపఁబడి శత్రుఘ్నునితోఁ గూడ శయ్యయందు పరుండె. అప్పుడా మహానుభావుఁడును, దుఃఖములను బొందుటకుఁదగనివాఁడును, ధర్మబుద్ధిగలవాఁడును, నగు భరతునకు మితిలేనిదియును, రాము

నివిషయమైపడియున్నగు దుఃఖమధికముగ బాధించుచుండె. అట్లు దుఃఖాగ్నిసంతప్తుఁడగు భరతుని, " వానలము, వనములోని వృక్షమును దహింపఁజేయువిధముగ" దహింపఁజేయుచుండె. మఱియునప్పుడు సూర్యకిరణముల వేడిమిచేత హిమవత్పర్వతమునుండి మంచునీళ్లు కారువిధముగ శోకాగ్నివలనఁబుట్టిన చెమట భరతునిశరీరమునుండి యపరిమితముగ స్రవించె. మఱియును కైకేయీపుత్రుఁడగు భరతుఁడు ధ్యానమే శిలలుగా, నిట్టూర్పువాయువులే నానావిధములగు ధాతువులుగా, దైన్యమే వృక్షసమూహముగా, దుఃఖాయాసమనోవ్యధలే శిఖరములుగా, మోహమే అపరిమితమృగములుగా, సంతాపమే యోషధులును వెదురువృక్షములునుగా, గలపర్వతమునుబోలియున్న మితిలేనిదుఃఖమునుబొంది పరితాపమునుబొందుచుండె. పురుషోత్తముడగు నాభరతుఁడు దుఃఖసముద్రమునమునిగి నిట్టూర్పులునిగుడ్చుచు స్మృతిలేనివాడగుచు నివ్విధముగ మహాఆపదనుబొంది హృదయజ్వరముచే పీడింపబడుచునోర్వనేరక "సమూహమునుండితప్పిపోవు నవృషభంబువలె" పరితాపమునొందుచుండె. మఱియును, మహానుభావుఁడును, పరివారముతోఁ గూడుకొనిన వాఁడును, సమాహితుఁడును, నగుభరతుఁడు గుహునితోఁ గూడవిచారముగలవాఁడైయుండె. మఱియును వ్యసనమునొందిన మనస్సుగలవాఁడైయుండె. ఆసమయమునందుగుహుఁడన్నయగు రామునిగుఱించి దుఃఖమునుబొందుచున్నభరతుని తోడనవ్యమధురములగు మాటలనుజెప్పచునోదార్చె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనుబదైదవసర్గముగిసెను.

గుహుండు భరతునితో లక్ష్మణుడు చెప్పిపోయిన విషయమునంతయు జెప్పుట.

అటుపిమ్మట నడవులయందుసంచరించుచుండెడు గుహుడు మహానుభావుఁడగు లక్ష్మణునియొక్క మంచిస్వభావమును గుఱించి భరతునితో నిట్లని చెప్పె. భరతుఁడా! లక్ష్మణుఁడు రామునిఁ గాపాడుటకొఱకు ధనుర్ధారియై కంటిమీఁద ఱెప్పనుగూడ వేయక మేలుకొనియుండును; ఇంతయగాక మిగుల జాగరూకతతో సంచరించుచుండును. అట్లుండుటను నేను ప్రత్యక్షముగ జూచితిని గాన లక్ష్మణుఁడు రామునియందధికమైన ప్రియముగలవాఁడని తెలిసి యతనితో నిట్లని చెప్పితిని. రాఘవనందనుఁడవగు లక్ష్మణా! వత్సా! సుఖకరమైన యీశయ్యనీకొఱకుఁ గల్పింపఁబడినది. కావునఁగొంచెము నేపూరడిల్లుము. ఈపాన్పునందుఁగొంచెము నీవుసుఖముగాఁబరుండుము. ధర్మాత్ముఁడవగు నో లక్ష్మణుఁడా! మేమందఱమును దుఃఖమునుబొందఁదగినవారమే; నీవుమాత్రము సుఖమునే పొందఁదగినవాఁడవు. కాఁబట్టి కొంచెము నీవు నిద్రింపుము. రామునిరక్షించుటకు మేమందఱమును నతిజాగ్రతతో మేలుకొనియుండెదము. ఈప్రపంచమునందు రామునికంటెఁ బ్రియుఁడగు స్నేహితుఁడు నాకెవ్వఁడు లేడు. కాఁబట్టి నీవే రాముని రక్షించుకొనియుండుటకు మేలుకొనియుండ నక్కఱలేదు. సత్యముగఁజెప్పుచున్నానని దలపుము. నేనుయీభూలోకమునందు రాముని దయచేత మిగులగొప్పదగు కీర్తిని, సర్వోత్తమమగు ధర్మప్రాప్తిని, న్యాయమార్గముగ కలుగునట్టి ధనలాభమును, బొందవలయునని కోరుచున్నాను. మఱియునటువంటి నేను ధనుస్సును హస్తమునందుధరించి నా సకలబంధువులతోడను గూడి సీతతోఁగూడ శయనించియున్న పరమమిత్రుఁడగు రాముని రక్షించెదను. నేనీయరణ్యమునందే సర్వకాలములయందును సంచరించువాఁడను. కావున నాకీయరణ్యమునందుఁ దెలియని విషయమొక్కటియును లేదు. ఈయరణ్యమునందు నేను చతురంగయుతమగు సైన్యమునుగూడ యుద్ధమునందు జయింపఁగలను. ఓభరతుఁడా! ఇవ్విధముగ మేమందఱమును జెప్పినమాటలను లక్ష్మణుఁడువిని, మహానుభావుఁడును, ధర్మమునందే దృష్టిగలవాఁడును, నగు నాలక్ష్మణుఁడు మరల మాయందఱిని జూచి యిట్లనియె.

కిరాతవల్లభా! దశరథరాజనందనుఁడగు రాముఁడు సీతాదేవితోఁగూడఁ గ్రిందఁబరుండియుండఁగా నేనెట్లు సుఖముగా నిదురనుబొందఁగలను. నేనెట్లు ప్రాణములను భరింతును. నాకు సుఖమెట్లు గలుగును. యుద్ధమునందు దేవదానవులనుగూడ జయించునట్టి సామర్థ్యముగలవాఁడును, మహానుభావుఁడునునగు రాముఁడు, అయ్యో, పచ్చనిగడ్డిగల భూమియందు సీతతోఁగూడఁబరుండియున్నాఁడే! దశరథమహారాజు బహువిధములగు శ్రమలకోర్చి యధికమగు తపస్సును జేసి తనకు సమానమైన లక్షణములుగల యీపుత్రుని బొందెను. ఈరాముఁడు సకలసద్గుణములును గలవాఁడు. మఱియు నీపుత్రుఁడు దశరథునకు ముఖ్యుఁడు. ఈపుత్రునకు నరణ్యవాసము సంభవించుటచేత దశరథమహారాజు మహాదుఃఖమును బొందియున్నాఁడు. కావున నతఁడీపుత్రవియోగదుఃఖమును బట్టఁజాలక శీఘ్రకాలములోనే మరణమును బొందును. కావున నిఁకమీఁద శీఘ్రముగా భూమి విధవయైయుండఁగలదు. ఓగుహుఁడా! ఈరాముఁడు పట్టణమునందుండి బయలువెడలునపుడు పట్టణములోని స్త్రీలందఱును నతికరుణము

గాన బిగ్గరగా రోదనమును జేసి యాయాసమును బొంది యేడ్వ లేక విరామమును బొందిరి. అప్పుడు రాజగృహములో ధ్వని లేకపోవుటచేతనే రాజగృహము పాడుపడినట్లుండెను. ఈ రాత్రియందు కౌసల్యయును, దశరథుడును, నా తల్లియగు సుమిత్రయును జీవింపరని తలంచెదను. నాకీ విషయమునందు మిగుల సందేహము గలిగియున్నది. ఒకవేళ బ్రతికెనేని శత్రుఘ్నునియందలి ప్రియముచేత నా తల్లియగు సుమిత్ర బ్రదుకును. వీరమాతయగు కౌసల్య పుత్రశోకమును బట్టజాలక నిశ్చయముగా మరణమును బొందును. ఇప్పుడేమి చేయవచ్చును.

ఓ గుహుడా! యిప్పుడు సర్వమును నతిక్రమించిపోయినదతిక్రమించిపోయినదే? కావున సకల కార్యములును నిరర్థకములైపోయినది. సర్వమును వ్యర్థమైపోయినది. నా తండ్రియగు దశరథుడు రాముని కభిషేకమును జేసి తనకోరిక నెరవేర్చుకొనకయే దుఃఖముచేత మరణమును బొందుచున్నాడే? అయ్యో, నేనేమి చేయుదును. అట్లు మా తండ్రియగు దశరథమహారాజు మరణమును బొందినపుడు ధన్యులగువారు ప్రేతకార్యములను జేయుదురు. సుఖవంతులగువారందఱును, మనోహరములగు ముంగిళ్ళయొక్క సన్నివేశము గలదియును, చక్కగా నేర్పఱుపబడిన రాజమార్గములు గలదియును, మేడలచేతను, దేవాలయములచేతను, నిండినదియును, నానావిధములగు శ్రేష్ఠవస్తువులచేత నలంకరింపబడినదియును, గజములచేతను, గుఱ్ఱములచేతను, రథములచేతను, నిండియున్నదియును, వాద్యములయొక్క ధ్వనులచేత వ్యాప్తమైనదియును, సమస్తములగు మంగళములచేతను నిండినదియును, సంతుష్టులును, బలిసినవారలునునగు జనులచేత క్రిక్కిఱిసియున్నదియును, తోటలచేతను, నుద్యానవనములచేతను నిండియున్నదియును, మహోత్సవములయొక్క సమూహములతో గూడుకొనియున్నదియును, నగు నా తండ్రియొక్క రాజధానియైన యయోధ్యాపట్టణమునందు సంచరింపగలరు. మేము మా తండ్రిచేత నియమింపబడిన పదునాలుగు సంవత్సరములును గడచినపిమ్మట సత్యప్రతిజ్ఞుడును, కుశలుడును నగు రామునితోగూడ మరల నయోధ్యాపురమునందు బ్రవేశించి సుఖవంతులము కాగలమా, యని మాతో జెప్పె. అప్పుడు మహానుభావుడును, రాజపుత్రుడును, మిగుల వ్యసనమును బొందుచున్నవాడునునగు లక్ష్మణుడీవిధముగ విలపించుచుండగానే యా రాత్రియంతయును గడచిపోయెను. అంతగొంతసేపటికి నిర్మలుండగు సూర్యుండుదయించె. అట్లు సూర్యోదయము కాగానే యా రామలక్ష్మణు లిరువురును, జడలను ధరించి యా తీరమునందే గంగానదిని దాటిరి. వారలను సుఖముగానే నే నీ గంగానదిని దాటించితిని. జడలను ధరించినవారును, నారచీరలను ధరించినవారలును, మిగుల బలవంతులును, ఏనుగు సమూహములను చాలించునట్టి మదపుటేనుగులతో సమానులును, ధనుస్సులను, ఖడ్గములను, ధరించినవారలును, శత్రువులనుదపింపజేయుటయం దధిక సామర్థ్యముగలవారును, మిగుల జాగరూకతగలవారలును, నగు నా రామలక్ష్మణులు సీతామహాదేవితోగూడ బయలువెడలిపోయిరని యా గుహుడు భరతునితో జెప్పి యంతటితో నూరకుండెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యేనుబదాఱవ సర్గము గిసెను.

గుహుని దేశమునందు రాముడు నివసించియుండిన స్థలమును భరతుడు చూచుట.

అట్లు గుహుడు చెప్పిన వ్యసనకరమగు వచనమును విని రామలక్ష్మణులు జడలను ధరించి యరణ్యమునకు బోయిరనుటను గురించి యధికముగ దుఃఖమును బొందె. తనయభిప్రాయము నెఱవేరగలదో లేదోయనియును జింతించెను. మఱియును, మిగుల మృదువైనవాడును, నధికమైనబలము గలవాడును, సింహముయొక్క మూపులవంటి మూపులుగలవాడును, గొప్పదగు భుజములుగలవాడును, తెల్లదామరపువ్వువలె విశాలములగు నేత్రములుగలవాడును, మిగుల నూతనమగు యౌవనముగలవాడును, సకలజనములచేతను సంతోషయుతముగ జూడదగినవాడును, నగు నా భరతుడధికమగు దుఃఖమును బొంది కొంచెము సేపూరడిల్లి శూలములచే బొడువబడిన యేనుగు క్రిందబడినవిధముగ వ్యసనమును సహింపనేరక క్రిందబడెను. అవ్విధముగ దుఃఖముచేత దటాలున క్రిందబడియున్న భరతుని జూచి సమీపమున నున్న శత్రుఘ్నుడు, స్మృతిలేనివాడును, దుఃఖముచేత బీడితుడునై యా భరతుని నాలింగనముజేసికొని గొంతెత్తి గట్టిగా నేడ్చెను. అటుపిమ్మట నుపవాసముచే గృశించియున్నవారలును, దైన్యమును బొందినవారలును, పెనిమిటి మరణమును బొందుటవలన నధికముగ దుఃఖమును బొందియున్నవారలును నగు నా భరతుని యొక్క తల్లులందఱును శత్రుఘ్నుని రోదనధ్వనిని విని యతివేగముగా బరుగెత్తివచ్చిరి. అట్లు వచ్చి భూమియందు బడియున్న యా భరతుని జుట్టును జుట్టుకొనిరి. అప్పుడు తపస్వినియగు కౌసల్య యధికముగ దుఃఖమును బొందినదగుచు గోవు తన దూడయందు వాత్సల్యముచేత జుట్టుకొనువిధముగ జుట్టుకొని యా భరతుని నాలింగనము జేసికొని నిట్లు యె

పుత్రా! భరతుఁడా! నీశరీరమునందు వ్యాధియేమైన నువ్యాపించి బాధనుబొందించుచున్నదా యేమి? ఇప్పుడు రాజకులముయొక్క జీవనమంతయును నీయధీనమైనదిగదా మఱియునో భరతుఁడా! తమ్మునితోఁగూడ రాముఁడు యరణ్యమునకుబోయెను. దశరథుఁడుగూడ మరణమునుబొందెను. అట్లు పుత్రుఁడును, భర్తయును, బోయినప్పటికిని, నీవాధారముగనున్నాఁడవని తలఁచుకొని బ్రతికియున్నాను. నాకిప్పుడు నీవొక్కఁడవే గతివైయున్నాఁవు. సీతాలక్ష్మణులతోఁగూడ నరణ్యమునకుఁబోయిన నాపుత్రునివిషయమై యేమైనను దుఃఖవార్త వినఁబడినదా? నేనొక్కఁడే పుత్రుఁడే కలదాననని యును, దిక్కులేని దైన్యమొనేయనియును దుఃఖమును బొందుచున్నావా? యేమి? చెప్పుమని కౌసల్యాదేవి భరతునినడిగె. అంతట నధికమైనకీర్తిగల యాభరతుఁడు కొంచెముసేపూరడిల్లి రోదనమునుజేయుచునే కౌసల్యనునోదార్చె. అట్లోదార్చి గుహునిజూచి యిట్లనియె.

గుహుఁడా! నాయన్నయగు రాముఁడు రాత్రియందెక్కడనివసించె. సీతాదేవి యెక్కడుండెను. లక్ష్మణుఁడెక్కడవాసముసేసెను. రాముఁడే వస్తువులను భుజించి యెక్కడఁబరుండెననియడిగె. అట్లు భరతుఁడడిగినవాక్యములను విని నిషాదపతియగు గుహుఁడు తనకతిథియైవచ్చిన రాముఁడే విధముగఁ దనచేతఁబూజింపఁబడెనో యావిధమును సర్వమును నిట్లని జెప్పె.

భరతుఁడా! నేను రామునకు భోజనార్థముగ నానావిధములగు ఫలములును, నానావిధములైన యన్నములును, నానావిధములైన భక్ష్యములును, నధికముగా సంపాదించి తెచ్చియిచ్చితిని. అప్పుడు సత్యపరాక్రముఁడగు రాముఁడా సర్వమును నన్నే దీసికొమ్మనియె. అట్లుచెప్పి క్షత్రధర్మము నుస్మరించుచు నొక్కదానినైనను, గ్రహింపకపోయె. మఱియు నప్పుడా రాముఁడు నన్నుజూచి యిట్లనియె.

చెలికాఁడా! గుహుఁడా! మేము క్షత్రియులము కావునఁ బ్రతిగ్రహమునకుఁ బాత్రులముగాము. దానమునిచ్చుటకే సర్వకాలములయందును దగినవారమని మహానుభావుఁడైన యా రాముఁడు మమ్మలనోదార్చె. మఱియు నధికమైనకీర్తిగల యా రాముఁడప్పుడు సీతాదేవితోఁగూడ లక్ష్మణునిచేతఁ దేఁబడిన యుదకమును బానముసేసి యుపవాసవ్రతమునాచరించె. అటుపిమ్మట నాసమయమునందు లక్ష్మణుఁడుగూడ సీతారాములుపానముచేయఁగా మిగిలినయుదకమును నాహారముగాఁబుచ్చుకొనియె. అటుపిమ్మట లక్ష్మణుఁడతిత్వరగా దర్భలనుదీసికొనివచ్చి రామునికొఱకు శుభమైనపాన్పునునిర్మించె. అంతట రాముఁడు సీతాదేవితోఁగూడ నాశయ్యయందు బవ్వళించె. అప్పుడు గంగానదియందలిబురదచేత మలినమైన రామలక్ష్మణులపాదములను గడిగి లక్ష్మణుఁడు కొంచెము దూరముగ వేఱొకచోటునకుఁబోయె. సీతారాములయందే దృష్టిగలవాఁడై కావలికాచియుండె. అంత నారాత్రియంతయును సీతారాములీయింగుదీవృక్షముక్రిందఁ బవ్వళించిరి. వారుపవ్వళించిన దర్భశయ్య యిదియే. మఱియు నట్లు సీతారాములిరువురును బవ్వళించియున్నసమయమునందు, శత్రువులను దపింపఁజేయువాఁడగు లక్ష్మణుఁడల్లెత్రాటిదెబ్బతగులకుండునట్లు చేతికిఁ దొడుగుకొనఁదగిన యొత్తైమును, హస్తకవచమునుగలవాఁడై వివిధబాణములచేతనిండియున్న యంబులపొదులనుధరించి యల్లెత్రాడుతోఁగూడిన ధనుస్సునవలంబించి సీతారాములచుట్టును సంరక్షణార్థముగఁ దిరుగుచుండె. అంతట నేనుగూడ నాసమయమునందు సర్వోత్తమములగు ధనుర్బాణములనుధరించి లక్ష్మణుఁడున్నస్థలమునందే, మిగులజాగరూకతగలవారును, ధనుర్ధారులును నగు జ్ఞాతులతోఁగూడఁగూడుకొని నింద్రతుల్యుఁడగు రామునిరక్షింపుచుంటిని.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనుబదేడవ సర్గముగిసెను.

రామునికిసంభవించినకష్టములనుగుఱించిభరతుఁడువ్యసనముబొందుట.

ఇట్లు గుహుఁడుచెప్పిన వచనమును భరతుఁడువిని మంత్రులతోఁడ గారచెట్టుక్రిందికిఁ బోయి రాముఁడుశయనించిన శయ్యనుజూచె. అట్లుచూచి తనతల్లులనందఱతోడను నిట్లనియె.

తల్లులారా! మహానుభావుఁడగు రాముఁడీశయ్యయందు శయనించె. కావుననే యీశయ్య మిక్కిలిమర్దనచేయఁబడియున్నది. చూడుఁడు. మఱియు నో తల్లులారా! మిగుల బూజ్యుఁడగు నిక్ష్వాకుమహారాజుయొక్క సత్కులమునందు జన్మించినవాఁడును, మహానుభావుఁడును, బూజింపఁదగినవాఁడును, మిక్కిలిబుద్ధిమంతుఁడును, నగు దశరథమహారాజునకుఁ బుత్రుఁడైన రాముఁడు భూమియందుఁ బరుండుటకుఁదగినవాఁడు గాఁడు. మఱియు పురుషోత్తముఁడగు రాముఁడు శ్రేష్ఠమైనచర్మాకారముగు వస్త్రముచే బరుపబడినదియును, మిగులమృదువులగు పరచెడువస్త్రములు గలదియును, మృదుస్పర్శగలదియును నగు శయ్యయందుఁ బరుండియున్నవాఁడుగదా? అట్టి రాముఁడిప్పుడెట్లు భూమియందుఁ బరుండెనో. శత్రువులను దపింపఁజేయునట్టి రాముఁడు, సర్వదా, విమానాకారములగు ప్రాసాదములయొ

కట్టయగ్రభాగములయందును, మేడలమీఁదిగృహములయందును, సువర్ణమయములును, రజతవికారములును, నగు నేలలుగలవియును, శ్రేష్ఠములగు నాస్తరణలచేత నొప్పుచున్నవియును, నానావిధములగు పుష్పములయొక్క సముదాయములచేతఁ జిత్రములైనవియును, చందనములయొక్కయు, అగరుయొక్కయు, పరిమళములుగలవియును, తెల్లనిమేఘములతో సమానములైనవియును, చిలుకలగుంపుయొక్కధ్వనులుగలవియును, మేరుపర్వతముతో సమానములైనవియును, సువర్ణమయములగు గోడలుగలవియును, చల్లనైనవియును, పరిమళముగలవియును, నగు శ్రేష్ఠములగు మేడలయందు నివసించుచుండును. మఱియు వీణావేణుపణవాది వాద్యములయొక్కధ్వనులచేతను, శ్రేష్ఠములగు భూషణములయొక్కశబ్దములచేతను, నిదుర మేలుకొని సూతమాగధులచే నానావిధములుగ బొగడఁబడుచుండు రాముఁడీచట యెట్లు నివసించెనో; ఈవిషయము నామనస్సునకు నమ్మఁదగినదిగా నుండలేదు. సత్యమనియును నాకుఁదోఁచడములేదు. నామనస్సు మోహమును జెందుచున్నది. ఇది స్వప్నమా యేమి? వాస్తవమేమైనయెడల నాకీవిధముగాఁదోఁచుటకుఁ గారణమేమి? దశరథరాజనందనుఁడగు రాముఁడు నేలయందే పరుండుటనుజూడఁగా దైవముకంటెఁ గాలమధికమైనదని తలఁచుచున్నాను. ఆహా, దైవము రాముని నేలయందుఁబరుండి నిదురనుబొందునట్లు చేయుచున్నదే! ఆహా దశరథమహారాజునకుఁ గోడలును, విదేహరాజగు జనకచక్రవర్తికిఁ బుత్రికయును, చూచుటకు మిక్కిలి మనోహరమైనదియును, రామునకు భార్యయును, నగు సీతాదేవి, అయ్యో, భూమియందుఁబరుండి నిద్రనుబొందుచున్నదే! ఓతల్లులారా! ఇది నాయన్నయగు రాముని శయ్య. ఈశయ్యయందు నాయన్నయగు రాముఁడు శయనించెను. కావున నేకరినమైన నేలయందుఁబరుపఁబడిన పచ్చికయంతయును, రాముడు శ్రమనివారణ జేసికొనుటచే మర్దింపఁబడినది. (అనఁగా నలిగిపోయినది) శ్రేష్ఠమైన యీశయ్యయందు సీతాదేవి మార్గాయాసముచేత నాభరణములను వీడక యాభరణములతోఁగూడఁ బరుండినట్లు తోఁచుచున్నది. కావున నీయీశయ్యయందక్కడక్కడ కనకాభరణములయొక్క పొడుపు గనఁబడుచున్నవి అప్పుడు సీతాదేవియొక్కయుత్తరీయమిక్కడఁ దగులుకొనినదని స్పష్టముగాఁ దెలియుచున్నది. ఈపాన్పునందుఁ బట్టువస్త్రముయొక్క పోగులక్కడక్కడ నంటుకొనినవి. స్పష్టముగాఁ గనఁబడుచున్నవి. చూడుడు. చిన్నదియును, కరుణింపఁదగినదియును, కోమలములైన యవయవములుగలదియును, పతివ్రతయును, మిథిలాధిపతియగు జనకచక్రవర్తికిఁ బుత్రికయును, పతివ్రతయును నగు సీతాదేవికి భర్తయొక్కశయ్య సుఖముగా నుండుట చూడఁగాఁ బతివ్రతలకు భర్తయొక్కడనుండునో యక్కడ సుఖముగలిగియుండునను సామెత వాస్తవమేయని తలఁచుచున్నాను. అయ్యో, రాముఁడు నానిమిత్తముగ దిక్కులేనివానివలె భార్యతోఁగూడ నిటువంటి కఠినమగు శయ్యయందు పరుండి నిద్రించెను. అయ్యో, నేను ఘాతకుఁడనైతిని. అయ్యయో, అన్యాయముగఁ జంపఁబడితిని. సార్వభౌములవంశమునందు బుట్టినవాఁడును, సర్వలోకములకును సమ్మతమైనవాఁడును, ఎల్లలోకములవారికిని ప్రియమైనవాఁడును, నల్లగలువవలె శ్యామలవర్ణమైన శరీరముగలవాఁడును, నెఱ్ఱని నేత్రములుగలవాఁడును, సకలలోకములవారిచేతను ప్రియముగఁ జూడఁదగినవాఁడును, సుఖమును బొందఁదగినవాఁడును, నగు రాముఁడెవ్విధముగ నీకఠినశయ్యయందుఁ బరుండెనో గదా! మహానుభావుఁడును, శుభలక్షణములుగలవాఁడును నగు లక్ష్మణుఁడు కష్టకాలమునందన్నయగు రాముని సేవించుటచేత ధన్యుఁడని తలఁచుచున్నాను. పెనిమిటియగు రామునితోఁగూడ నరణ్యమునకుఁ బోవుటవలన సీతాదేవి ధన్యురాలయ్యెనని తలఁచుచున్నాను. మహానుభావుఁడగు రాముని వదలిన మనమందఱము హీనులమైతిమి. ఇప్పుడు మనము సేవకులమై యుండుటకు రాముఁడంగీకారమును బొందునో పొందఁడో యని నామనసునందు సందేహముగలిగియున్నది. దశరథమహారాజు మరణమును బొందుటచేతను, రాముఁడరణ్యమునకుఁ బోవుటచేతను, నోడనడుపువాఁడు లేనియోడవలె భూమియంతయును దిక్కులేనిదయ్యెనని తోఁచుచున్నది. ఈలోకమున రాముఁడరణ్యమునందు నివసించియుండఁగా నతని భుజబలముచే రక్షింపఁబడిన యీభూమి నాకుఁగావలయునని మనస్సునందుగూడ కోరువాఁడెవ్వఁడును లేఁడు. ప్రాకారములను గాపాడువారు లేనిదియును, సన్నద్ధములుగాని గుఱ్ఱములును, ఏనుఁగులుఁగలదియును, తెరవఁబడిన ద్వారములుగలదియును, రక్షకులు లేనిదియును, సంతోషములేని సైన్యముగలదియును, దుర్దశను బొందియున్నదియును, బాహ్యసంరక్షకులు లేనిదియును, తక్కువస్థితిని బొందినదియును, మనకు, రాజధానియును నగు నయోధ్యాపట్టణమును, నీకమీఁద మనశత్రువులు, "విషముతోఁగూడిన పిండివంటలను లోకులంగీకరింపనివిధముగ" నంగీకరింపరు. ఓతల్లులారా! నేనీదినము మొదలుకొని భూమియందైనను, తృణములయందైనను బరుండెదను. జడలను నారచీరలను ధరించి కందమూలఫలములను భుజింపుచు నెప్పుడును దపోవృ

త్రితోనుండెదను. నేను రాముని ప్రతిజ్ఞ వ్యర్థము కాకుండుటకు నతనికొఱకు తేఁడరణ్యమునందుండఁదగిన పదునాలుగు సంవత్సరములును నరణ్యమునందుండెదను. అతనికి బదులుగా నేనరణ్యమునందుంటినేని యతఁడు ప్రతిజ్ఞ నెరవేర్చినట్లే లోకులందఱును భావింతురు. దైవముగూడ సంతసించును. అన్నయగు రామునికొఱకు నేనరణ్యమునందుండునపుడు శత్రుఘ్నుడు నాతోఁగూడ నరణ్యమునందు సంచరించును. పూజ్యుఁడగు రాముఁడు లక్ష్మణునితోఁగూడ నయోధ్యాపట్టణమును బాలించును. వసిష్ఠాది మునివరులందఱును, కకుత్స్థకుల సంభవుఁడగు రామునకుఁ బట్టాభిషేకమును జేయఁగలరు. దేవతలందఱును నామనోరథమును సత్యమైనదానినిగాఁ జేయుదురుగాక. నేను నానావిధములగు ప్రార్థనలతో సాష్టాంగనమస్కారములను జేయుటచేత రాముఁడు ప్రసన్నుఁడై నామనవి నంగీకరింపకపోయెనేని రాముఁడెంతకాలమరణ్యమునందుండునో యంతకాలము నేనుగూడ నరణ్యమునందుండెదను. నేనతనితోఁగూడ నరణ్యమునందుండుట కతఁడంగీకారమును బొందకపోఁడు. ఇంతమాత్రమునకైన నంగీకారమును బొందఁడా? అంగీకారమును బొందుననియే తోఁచుచున్నది.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనుబదెనిమిద సర్గముగిసెను.

—{ గుహుఁడు భరతుని నతని సైన్యమును గంగానదిని దాటించుట. }—

అట్లు రఘుకులోద్భవుఁడగు భరతుఁడు రాముని గుఱించి దుఃఖమును బొందుచు నారాత్రియంతయును నక్కడనే వసించె. అంతఁ బ్రాతఃకాలమునకు ముందుగ నిదుర మేలుకొని శత్రుఘ్నునితో నిట్లనియె.

తమ్ముఁడా! శత్రుఘ్నా! నిద్రను వదలుము. ఇంకను నెందుకు నిద్రించెదవు? నిషాదపతియగు గుహుని శీఘ్రముగఁ దీసికొనిరమ్ము. ఇఁకను మనము శీఘ్రముగ నీగంగానదిని దాటుదమనియె. అవ్విధముగ భరతుఁడు చెప్పిన మాటలను విని శత్రుఘ్నుఁడిట్లనియె.

అన్నా! రఘుకులోత్తమా! నేను బూజ్యుఁడగు రాముని స్మరించుచు మేలుకొనియున్నానే గాని కొంచెమైనను నిద్రను బొందలేదనియె. ఇట్లు మానవోత్తములగు భరతశత్రుఘ్నులిరువురును సంభాషించుచున్న సమయమునందు గుహుఁడు వచ్చి చేతులను ముకుళించుకొని భరతునితో నిట్లనియె.

కకుత్స్థవంశోద్భవుఁడగు భరతుఁడా! ఈ రాత్రియందు యీగంగానదీతీరమున సుఖముగా నిద్రించితివా? నీ సైన్యమంతయును సుఖముగా నున్నదా? అని యిట్లు గుహుఁడు స్నేహమువలనఁ జెప్పిన మాటలను విని రాముని ధ్యానించుచున్న భరతుఁడిట్లనియె.

నిషాదరాజా! గుహుఁడా! మాకు రాత్రియంతయును సుఖముగాఁ గడచినది. మాకు నానావిధములగు పూజలను జేసితివి. నీబంధువులగు బోయలతోఁగూడ నీవనేకములగు నోడలను దెచ్చి నేను సైన్యసమేతముగ నీగంగానదిని దాటునట్లు చేయుమని భరతుఁడు చెప్పె. అంత గుహుఁడు, మిక్కిలి త్వరగా బోవలయునని చెప్పుచున్న భరతాజ్ఞను విని, మరలఁ దనపట్టణమునకు వచ్చి తనవారలనందఱఁ జూచి యిట్లనియెను.

ఓ బంధువులారా! శీఘ్రముగ లెండు. మీకు సర్వకాలములయందును మంగళములు గలుగుఁగాక. భరతుని సేనతోఁగూడ నతని సైన్యమును సర్వమును గంగానదిని దాటింతము. ఓడలను రేవులోనికిఁ దెచ్చికొనిరండనియె. అవ్విధముగ గుహుఁడు చెప్పిన వాక్యములను విని బోయవారలందఱును, రాజాజ్ఞానుసారముగ (౫౦౦) నైదునూరుల యోడలను రేవులోనికిఁ దీసికొనివచ్చిరి. మఱియును గొప్ప గొప్ప ఘంటలను ధరించినవియును, సర్వోత్తమములైనవియును, టెక్కెములతోఁగూడుకొనినవియును, అనుకూలవాయువుతోఁగూడినవియును, చక్కనిసంధిబంధములు గలవియును, నితరములైనవియును, స్వస్తికములనఁదగినవియును నగు మఱికొన్ని యోడలను గూడఁ దీసికొనివచ్చిరి. కిరాతరాజగు గుహుఁడు, స్వస్తికమని తెలిసికొనఁదగినదియును, తెల్లని కంబళిచేతఁ గప్పఁబడినవియును, మిగుల నాహ్లాదమును గలుగఁజేయునట్టి ఘంటాధ్వనులు గలదియును, మంగళకరమైనదియును నగు నోడను దీసికొనివచ్చెను. అప్పుడు మహాబలులగు భరతశత్రుఘ్నులిరువురును నాయోడలో నెక్కిరి. పిమ్మట కౌసల్యాసుమిత్రలను, మఱియు నితరులగు రాజభార్యలను, పురోహితులను, వసిష్ఠాదిగురువులను, మఱియు నితరులగు బ్రాహ్మణులను, రథగజతురంగశకటపదాతులను, వారివారికిఁదగిన యోడలయందెక్కించిరి. అప్పుడు నివాసస్థానమును బ్రకాశింపఁ జేయుచున్నవారలును, రేవులయందు దిగుచున్నవారలును, తమతమ సాధనములను గైకొనుచున్నవారలును నగు మానవుల యొక్క ధ్వని స్వర్గలోకమునందు గూడ వ్యాపించె. మఱియు నప్పుడు ధ్వజములతోఁ గూడిన పడవలమీఁదఁ జెంబడివారల సహాయముచేత నెక్కిరి. అంతట మంచిగాలి వీచుటవలన బోయవారలచేత నడుపఁబడకయే యాయోడలన్నియును నతిశీఘ్రముగఁ బోయినవన్యే. ఆ యోడలలోఁ గొన్ని యోడలు స్త్రీలచేతఁ

నిండియుండెను. కొన్నిగుల్మములచేత నిండియుండెను. మరి కొన్నియోడలు మిగులవెలగలయెద్దులు మొదలగువానిచేత నిండియుండెను. అటువంటియోడలన్నియును మిగులవేగముగ నవతలితీరమునకుఁబోయెను. అంతనాచెంబడివారలునోడలోనివారలనందఱనుగట్టునదించిరి. పిమ్మటనాపోయువారలు మరలివచ్చుచుగంగోదకమునందు నానావిధములగుచిత్రగతులనుజరిపిరి. అప్పుడు టెక్కెములతోఁగూడినయేనుఁగులు మావటివారిచేతనడుపఁబడినవై దాటుచు టెక్కెములతోఁగూడిన పర్వతములవలెఁ బ్రకాశించుచుండెను.

మఱియు నాభరతునిసేనలోఁ గొందఱునోడలనధిష్ఠించి గంగానదినిదాటిరి. మఱికొందఱు తెప్పలచేత దాటిరి. కొందఱు ఘటములసహాయముచేత దాటిరి. కొందఱుబాహువులచేత నాగంగానదిని నీదుచుదాటిరి. పావనమైన యాసైన్యమంతయును, చెంబడివారలచేత దాటింపఁబడెను. మఱియును మైత్రవనుక్షేరుగల ముహూర్తమునందు శ్రేష్ఠమగు ప్రయాగవనమునకుఁబోయెను. అప్పుడుమహానుభావుఁడైనభరతుఁడు సైన్యమునుసర్వమును నూరడించి వారివారికిఁ దగినస్థానములయందుండ నియమించెను. అట్లు నియమించి మునికులోత్తముఁడగు భరద్వాజమహామునిని జూచుటకొఱకు ఋత్విక్కులగు వసిష్ఠాదిమునివరులతోఁ గూడబయలువెడలెను. మఱియునాభరతుఁడు వేదాధ్యయనమునుజేసినవాఁడును, మహానుభావుఁడును. దేవతలకుఁ బురోహితుఁడును, నగుభరద్వాజమునివరుని యాశ్రమమునకుఁబోయెను. అట్లుపోయి మనోహరములైన గిరివల్లికావృక్షములయొక్క సముదాయము గలదియును, మనోరమ్యమైనదియును, నగు భరద్వాజమునివరుని వనమునుజూచెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి యెనుబదితొమ్మిదవసర్గముగిసెను.

భరతుఁడుభరద్వాజమహాముని ఆశ్రమమునకుఁబోవుట.

అట్లు పురుషోత్తముఁడును, ధర్మములనుజక్కఁగఁదెలిసినవాడును, నగునాభరతుఁడు భరద్వాజమహాముని నాశ్రమమునుజూచి సకలసైన్యమును, నిలిపి, విడువఁబడిన యాయుధములును, నాభరణములునుగలవాఁడై పరిశుద్ధములగువస్త్రములంగట్టుకొని తనదుసైన్యమునుసర్వమును క్రోసెడుదూరముననిలిపి పురోహితునిముందునిడుకొని మంత్రులతోఁగూడఁ బాదచారియైపోయెను. అటుపిమ్మటరఘుకులోద్భవుఁడగు రాముఁడా భరద్వాజమునివరునిఁ జూచుటకొఱకు మంత్రులనుగొంచెముదూరముగానిలిపి పురోహితునితోఁగూడ నాశ్రమములోనికిఁబోయెను. అంతటఁదపోవంతులలో నుత్తముఁడయిన భరద్వాజమహాముని, తనయాశ్రమమునకువచ్చుచున్న వసిష్ఠమహామునినిజూచి శిష్యులతో శీఘ్రముగ నర్ఘ్యమును దీసికొనిరండనిచెప్పుచుఁ దనయాసనమునుండిలేచెను. అట్లుతనయాసనమునువదలిలేచి నిలుచుకొని భరతునితోఁగలిసికొనినవాఁడయ్యెను. పిమ్మటభరతుఁడు తేజోవంతులలోనుత్తముఁడగు నాభరద్వాజమహామునికి నమస్కారమును జేసెను. అట్లునమస్కారమును జేసినభరతుని దశరథమహారాజునకుఁ బుత్రునిగాఁ దెలిసికొనెను. అంతటనాభరద్వాజమహాముని భరతునికినివసిష్ఠమహామునికిని నర్ఘ్యమునిచ్చి ఫలములనుసమర్పించెను. పిదప సర్వవేత్తయగు నాభరద్వాజమహాముని పౌర్వాపర్యక్రమముననుసరించి యెల్లవారునుకుశలముగానున్నారా, యని క్షేమవార్తనడిగెను. మఱియునయోధ్యాపట్టణము నందలి బలకోశమిత్రులకు కుశలమా? యనికూడనడిగెను. ఇవ్విధముగసర్వవిషయములనునడుగుచు దశరథుఁడుమరణమును బొందిన సంగతినిదెలిసినవాఁడగుటచేత దశరథమహారాజు కుశలముగనున్నాఁడా? యనియడుగకయూరకుండెను. అంతటవసిష్ఠుఁడును, భరతుఁడును, భరద్వాజమహామునివరునితోనిట్లనిరి.

మునిశ్రేష్ఠుఁడా! మీశరీరమునందు రోగాదులేమియును లేక సుఖముగలిగియున్నదా? మీయగ్నిహోత్రములును, మీతపోవనమునందలి వృక్షములును, శిష్యులును, మృగములును, పక్షులును, సుఖముగనున్నవా? అనిరి అంతటఁదపోవంతులలో నుత్తముఁడగు భరద్వాజమహాముని నాకు సర్వవిషయములయందును సౌఖ్యముగలిగియున్నదియనిచెప్పి రామునియందలిస్నేహమువలన భరతునితోనిట్లనియెను.

భరతుఁడా! రాజ్యమునుబరిపాలించుచున్న నీవిక్కడకువచ్చుటకుఁ గారణమేమి? ఈవిషయమును సర్వమును నాకుఁజక్కఁగఁజెప్పుము. ఈవిషయమంతయును దెలిసినయెడల నామనస్సునిర్మలమగును. ఓభరతుఁడా! శత్రువులనునశింపఁజేయువాఁడును, సంతోషమును వృద్ధినిబొందించువాఁడునునగురాముని, కౌసల్యాదేవిపుత్రునిగాఁగనెను. అటువంటిరాముని, దశరథమహారాజుభార్యయగు కైకేయియొక్క మాయావచనములకులోబడి పదునాలుగుసంవత్సరము లరణ్యమునందుండునట్లుగా నియమించెను. అందువలనఁ గీర్తివంతులలోనుత్తముఁడగు రాముఁడుభార్యయగుసీతతోడను, సోదరుఁడగులక్ష్మణునితోడనుగూడి పదునాలుగుసంవత్సరములును నరణ్యమునందు నివసించుట

కుఁబోయె. అవ్విధముగ నరణ్యమునకుఁ బోయినవాఁడును, నిష్కల్మషుఁడునునగు రామునకపకారమును జేసి యతని రాజ్యము నెప్పటికిని నిష్కంటకముగా ననుభవింపఁదలఁచి నీవు చతురంగబలముతో గూడ బయలువెడలితివా, యేమి? నీ యభిప్రాయమును జెప్పుమనియడిగె. అవ్విధముగ భరద్వాజమునివరుఁడు పలికిన పలుకులనువిని భరతుఁడు మహాదుఃఖముచేఁ గన్నీళ్లుగలవాఁడై గద్గదస్వరముతో నిట్లనియె.

మహాత్ముఁడవగు నోభరద్వాజమునిశ్రేష్ఠుడా! నీవున న్నుగురించి నీవిధముగాఁ దలఁచుటచేత నేను హతుఁడనైతిని. నేను క్రూరకృత్యమును జేయుటకు బయలువెడలినవాఁడను గాను. బయలువెడలుటచేత నేదో దుష్కృత్యమునకుఁ బాలుపడితినని తలవవలవదు. మఱియు నో మునికులోత్తమా! నేను లేనిసమయమునందు నాతల్లియగు కైకేయి చెప్పిన దుర్వచనము నాకు సమ్మతమైనదిగాదు. నాతల్లిమాటకు నేను సంతోషమును బొందినవాఁడను గాను. నాతల్లి చెప్పినమాటను నేను స్వీకరింపలేదు. నేను పురుషోత్తముఁడైన యా రాముని పాదములకు నమస్కారమును జేసి మరల నయోధ్యాపట్టణమునకుఁ దీసికొనిపోవలయునని తలఁచివచ్చినాను. రాముని మరలఁదీసికొనిపోవుటకు వచ్చిన నాయందనుగ్రహమును జూపుము. ఓభరద్వాజమునివర్యా! నాయందనుగ్రహముగలవాఁడవై భూపాలుఁడగు రాముఁ డెక్కడనున్నాడియును జెప్పుమనియె. అంతట వసిష్ఠాది మునిశ్రేష్ఠులుగూడ నాభరద్వాజమహామునిని బహువిధములఁ బ్రార్థించిరి. అప్పుడు భరద్వాజమునివరుఁడు ప్రసన్నుఁడై యాభరతునిఁజూచి యిట్లనియె.

పురుషోత్తముఁడవైన యోభరతుఁడా! రఘుకులమునందుఁబుట్టిననీకు, గురువగునన్నకు శుశ్రూషను జేయుట, యింద్రియములను జయించుట, పెద్దలననుసరించుట మొదలగు సత్కార్యములుదగియున్నవి. భరతుఁడా! నీయభిప్రాయమును నే నెఱుఁగుదును. అయినను నీయభిప్రాయమును నీ వేదృఢముగాఁ దెలుపుటకుగా నేనిట్లు పలికితిని. నీవన్నయగు రామునియందుఁ బ్రేమగలవాఁడవని యెడు కీర్తిని బ్రకటన సేయుటకుగా నడిగితినిగాని వేరొకటిగాదు. సీతాలక్ష్మణులతోఁ గూడినవాఁడును, ధర్మము నెఱిఁగినవాఁడును, నగు రాముఁ డెచటనుండునదియును నే నెఱుఁగుదును. నీకన్నయగు రాముఁడు సీతాలక్ష్మణసహితుఁడై చిత్రకూటమను పేరుగల మహాపర్వతమునందు నివసించియున్నాఁడు. నేటిదినము మాయాశ్రమమునందు నివసించి రేపటిదినము మంత్రులు మొదలగువారితోఁగూడ నక్కడకుఁబొమ్ము. కామార్థములను దెలిసినవాఁడవును, మిగులఁ బండితుఁడవును నైన యోభరతుఁడా! నాయభిప్రాయమును సఫలముగఁ జేయుమనియె. అటుపిమ్మట బుద్ధిమంతులలోనుత్తముఁడును, రాజపుత్రుఁడునునగు భరతుఁడధికముగ సంతోషమును బొంది భరద్వాజమునినిఁజూచి భరద్వాజమునివర్యా! మీయిష్టానుసారముగ సంచరించెదననియె. అట్లు చెప్పి పిమ్మట నాభరతుఁడా రాత్రియంతయును నయ్యాశ్రమమునందు నివసించుటకు మనస్సునందు నిశ్చయించె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొంబదవసర్గ ముగిసెను.

{భరద్వాజమహాముని భరతునకు విందుసేయుటకు దేవలోకమునుండు ఘృతాచి మొదలగు సకలమయిన వారిని రప్పించుట.}

అట్లు తనయాశ్రమమునందు నివసించుటకు నిశ్చయించినవాఁడును, కైకపుత్రుఁడును, నగు భరతుని నతిథిసత్కారముచే బూజగైకొనవలయునని ప్రార్థించిన భరతుఁడిట్లనియె.

భరద్వాజుఁడా! వనమునందు దొరకునట్టి ద్రవ్యముల చేతఁబాద్యార్ఘ్యములనిచ్చితిరి. మీరు సర్వవిధముల చేతను నన్ను గౌరవించినట్లయ్యెననియె. ఆమాటలను విని భరద్వాజమహాముని నవ్వుచు భరతునితో నిట్లనియె.

భరతుఁడా! నీవు సంతోషించితివని నే నెఱుంగుదును. నీవు కొంచెమగు పూజచేతనే సంతోషమును బొందువాఁడవనియును నెఱుఁగుదును. మఱియు నో భరతుఁడా! నీసేనకును, నీకును, భోజనంబిడుటకుఁ బ్రయత్నమును జేయవలయునని తలఁచుచున్నాను. నాకుఁ బ్రీతి యేవిధముగానున్నదో యావిధముగాఁ జేసెదను. కావున నాపూజను సంగీకరింపవలయుననియె. అవ్విధముగ భరద్వాజమహాముని చెప్పినమాటనువిని భరతుఁడు చేతులను ముకుళించుకొని యిట్లనియె.

షడ్గుణైశ్వర్యసంపన్నుఁడవగు నో భరద్వాజుఁడా! భగవంతుఁడవగు నీభయమువలన సేనలతోగూడ నేనిచటికి రాలేదు. శ్లో॥ రాజ్ఞా చ భగవన్నిత్యం రాజపుత్రేణ వా సదా। యత్నతః పరిహర్తవ్యా విషయేషు తపస్వినః॥ షడ్గుణైశ్వర్యసంపన్నుఁడవగు నో భరద్వాజమునివర్యా! రాజులును, రాజపుత్రులును, ప్రయాణసమయములయందుఁ దమరాజ్యమునందు మునులుండు మార్గములను వదలి యామునులకు బాధగలుగకుండునట్లు సేనతోఁగూడఁ బోవలయును. (అనఁగా రాజులు చతురంగబలముతో బయలువెడలినపుడు మునులుండు మార్గమును వదలి వేరొకమార్గమును బట్టి పోవల

యును) భరద్వాజముని శ్రేష్ఠుఁడా! శ్రేష్ఠములైనగుఱ్ఱములును, మనుష్యులును, మదపుటేనుఁగులును, మొదలుగాఁగలచతురంగబలమును నాతోఁగూడ నపరిమితముగ వచ్చుచున్నది. కావున నాసైన్యమంతయును దమయాశ్రమమునందలివృక్షములకును, నుదకములకును, రమ్యములగుప్రదేశములకును, నాశ్రమస్థలములకును, గిరిమల్లికావృక్షములకును, మఱియునితరములకును, బాధనుగలిగించునేమోయనితలఁచి దూరముగానుంచునట్లుచేసి వసిష్ఠమహాముని మొదలగువారితో నిక్కడకువచ్చితినని యె. అంతట నాభరద్వాజమునివరుఁడు ఓభరతుఁడా! నీసైన్యమునుసర్వమును నిక్కడకురప్పింపుమనియె. ఆమాటనువిని తనసేనను సర్వమును నయ్యాశ్రమమునకురప్పించెను. అటుపిమ్మట నాభరద్వాజమహాముని అగ్నిహోత్రశాలయందుఁబ్రవేశించి యుదకపానమును జేసి తుడుచుకొని (అనగా నాచమనము జేసి) యాతిథ్యమును జేయుటకొఱకు విశ్వకర్మను బిలిచె అట్లుపిలుచుచు నిట్లనియె.

నేను గృహాదులను నిర్మించునట్టి విశ్వకర్మను బిలుచుచున్నాను. కావున విశ్వకర్మ యిక్కడకువచ్చి భరతునకుఁ దగిన యాతిథ్యమును సర్వమును నెరవేర్చుఁగాత. మఱియు యమవరుణకుబేరులని యెడు ముగ్గురు దిక్పాలురను, దేవేంద్రుఁడు మొదలుగాఁగల దేవతలను, బిలుచుచున్నాను వీరందఱును, నిచ్చోటునకువచ్చి భరతున కాతిథ్యమును జేయుటకుఁదగిన సామగ్రులను సంపాదింతురుగాత. తూర్పుముఖముగాఁబ్రవహించు నదులును, పశ్చిమాభిముఖముగఁబ్రవహించు నదులును, మఱియు భూమ్యాకాశములయందుఁ బ్రవహించునట్టి నదులును, నిచ్చోటునకువచ్చి సహాయమును జేయుదురుగాత. మఱియు నితరములగు నదులు మైరాదేశమునందుఁబుట్టిన మైరేయమను మద్యమును స్రవింపఁజేయుఁగాక. ఇతరములగు నదులుగూడ మనోహరముగాఁజేయఁదగిన మద్యమును స్రవించుఁగాత. ఇంకను నితరములగు నదులు చెఱకురసముతోఁ జేయఁబడినదియును, చల్లనిదియును నగు నుదకమును బ్రవహించుగాత. ఇంతియగాక దేవగంధర్వులయిన హాహాహూహూ నామక గంధర్వులను, దేవగంధర్వజాతులయందుఁబుట్టిన యప్సరసలను స్త్రీలను, బిలిచెదను. మఱియును, ఘృతాచి, విశ్వాచి, మిశ్రకేశి, అలంబుస నాగదంత, హేమ, హిమాద్రియందుఁ జేయఁబడిన నివాసముగల హేమ, మొదలుగాఁగల యప్సరస్త్రీలను గూడఁ బిలుచుచున్నాను. ఇంతియగాక దేవేంద్రుని నాశ్రయించుచున్న స్త్రీలను, బ్రహ్మదేవుని సేవించుచున్న స్త్రీలను, తమతమ యాయుధములతోడను, తుంబురుఁడు మొదలుగాఁగలవారలతోడను, చేరివచ్చునట్లుగాఁ బిలుచుచున్నాను. శ్రేష్ఠములగు వస్త్రములును, నాభరణములును, పత్రములుగాను, స్త్రీ లేఫలములుగాను, గల దైయుత్తర కురుభూములయందుఁ బ్రకాశించుచున్నదియును, దేవతలు నివసించుటకుఁదగినదియును, నగు కుబేరుని చైత్రరథమను పేరుగల వనము యిక్కడకువచ్చుఁగాక. షడ్గుణైశ్వర్యసంపన్నుఁడగు చంద్రుఁడు వచ్చి సర్వోత్తమమగు నన్నమును, భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములను, మఱియు నానావిధములగు కలమాన్నములను సంపాదించుగాత. మఱియును, చంద్రుఁడు, విచిత్రములును, వృక్షములనుండి జారినవియును, నగు పుష్పమాలికలు మొదలగువాని, నమృతము మొదలుగాఁగల పేయద్రవ్యములను, నానావిధములగు మాంసద్రవ్యములను, సిద్ధపఱచుగాకయనియె. యోగమహిమతోడను, అపరిమితమగు తేజస్సుతోడను, తపస్సుతోడనుగూడుకొనిన నాభరద్వాజమునిశ్రేష్ఠుఁడు శిక్షలయందుఁ జెప్పఁబడిన స్వరములతోఁగూడినట్లుగా నిట్లుజెప్పె. ఇవ్విధముగా నాభరద్వాజమునివరుఁడు ప్రాఙ్ముఖుఁడును కృతాంజలియును నై ధ్యానము జేయుచుండఁగా నా దేవతలందఱును వచ్చిరి. అప్పుడు వాయువు మలయదుర్దుర పర్వతములమీదుఁగా బయలువెడలి వచ్చినవాఁడగుట చేత మిగుల నధికమగు పరిమళముగలవాఁడై భరతాదులకు మార్గాయాసమువలనఁ గలిగిన చెమటను బోఁగొట్టుచు వీచుచుండె. మఱియును ఉత్తమములును, శైత్యమాంద్యసౌరభ్యములుగలవియునునగు వాయువులు వీచుచుండె. అప్సరోగణములు నాట్యమును జేసిరి. దేవతలును, గంధర్వులును, పాడిరి. వీణాగానములను జేసిరి. వీణాదులవలనఁ బుట్టినదియును, శ్రుతిసామ్యముగలదియును, లయయను గుణముతోఁగూడినదియును, నగు నాశబ్దము భూమ్యాకాశములయందు సంచరించుచున్న ప్రాణులయొక్క చెవులకుఁ బరమానందమును గలిగించె సకలజంతువులయొక్కయు చెవులకు మనోహరమైనదియును, సర్వోత్తమమైనదియును, నగు వాద్యనినిలువుదలకాగానే భరతునియొక్క సైన్యమంతయును విశ్వకర్మయొక్క నిర్మాణమును జూడఁదొడంగిరి. అట్లు విశ్వకర్మచే నిర్మింపఁబడిన చిత్రవస్తువులనన్నింటిని జూచి యాసేనలోనివారందఱును బరమాశ్చర్యమును బొందిరి అప్పుడయిదు యోజనములవఱకును గల భూమియంతయును మెరకయు, పల్లము లేక సమభూమియయ్యె. మఱియు నాభూమి యంతయును, నీలవైడూర్యమణులయొక్క కాంతివంటి కాంతిగలవియును, నానావిధములైనవియునునగు పచ్చికలచేత వ్యాప్తమైయుండె. ఇంతియగాక యాప్రదేశమునందు ఫలములే యాభరణములు

గాఁగలమారేడుచెట్లును, వెలగచెట్లును, పనసచెట్లును, మాదీఫలపుచెట్లును, ఉసిరికచెట్లును, మామిడిచెట్లును, మండినవన్యే. మఱియునప్పుడుత్తరకురుభూములయందలిదివ్యోపభోగములుగల చైత్రరథమనువనమువచ్చె. ఇంతయగాకతీరమునందుమొలిచిన నానావిధవృక్షములతోఁగూడిపయేరులనేకములువచ్చె. నిర్మలములగునాలుగిండ్లభవంతులును, మేడలు, రాజభవనములు మొదలగువానిచే తెల్లగిట్టిగిసినయేనుఁగులయొక్కయు, గుఱ్ఱములయొక్కయుశాలలును, మంగళకరములగుద్వారములనుగలరమ్యమగు పట్టణంబొక్కటయొక్కడఁగనుపడె. మఱియునాస్థలమునందు శరత్కాలమునందలి తెల్లనిమేఘములతోసమానమైనదియును, మిగులమనోహరములైన తోరణములుగలదియును, తెల్లనిపూలమాలికలచేఁ జేయఁబడినయాకారముగలదియును, శ్రేష్ఠమగుగంధముచేతఁ బూర్ణమైనదియును, చదరమైనదియును, ఇఱుకులేనిదియును, శయనాసనములుగలదియును, సర్వోత్తమములగు నానావిధములగురసములతోడనుగూడుకొనియున్నదియును, సర్వోత్తమములగు భోజనవస్త్రములుగలదియును, చిత్రాన్నములుగలదియును, చక్కగానుతకఁబడినవియును, నిర్మలములైనవియును, నగుభోజనపాత్రలుగలదియును, నేర్పరుపఁబడిననానావిధములగుసింహాసనములుగలదియును, పరవఁబడినయుత్తమమగు శయ్యగలదియును, సర్వసంపదలతోడను గూడుకొనినదియును, నగురాజమందిరమొక్కటియక్కడనిర్మింపఁబడియుండె. అంతటఁ గైకేయికిఁబుత్రుఁడును, మహాబాహుఁడును, నగుభరతుఁడు, ఋషులలోనుత్తముఁడైన భరద్వాజమహామునియొక్కయాజ్ఞనుబొందిరత్నాదిద్రవ్యములచేత సంపూర్ణమగురాజమందిరమునందుఁబ్రవేశించె. అట్లుభరతుఁడాగృహమునందుఁబ్రవేశించునపుడు, సుమంత్రాదిమంత్రులును, వసిష్ఠాదిపురోహితులునునాభరతునితోఁగూడఁ బ్రవేశించిరి. అవ్విధముగఁబ్రవేశించి యాపట్టణాలంకారమును, రాజమందిరాలంకారమునుజూచి మహదాశ్చర్యమునుబొందిరి. భరతుఁడుసపరివారముగనామందిరములోపలఁబ్రవేశించి శ్రేష్ఠమగు సింహాసనమునకును, వింజామరకును, గొడుగునకును, మంత్రులతోఁగూడరాజువలెఁ బ్రదక్షిణముగాఁదిరిగె. పిమ్మటనాభరతుఁడురామునికొఱకు నమస్కారమునుజేసియాసింహాసనమునకుఁ బూజనుజేసి వాలవ్యజనములనుచేతఁదీసికొనిమంత్రికూర్చుండఁదగినసింహాసనమునందుఁగూర్చుండె. అంతటమంత్రులును, పురోహితులును, దామకూర్చుండఁదగినప్రదేశములయందుఁ గూర్చుండిరి. పిమ్మటసేనాపతికూర్చుండె. అతనికివెనుకశిబిరాధిపతియునుగూర్చుండె. పిదపనక్కడకు భరద్వాజమహామునియాజ్ఞవలననిగులశీఘ్రముగాక్షీరాన్నమే బురదగాఁగలనదులు, వచ్చిభరతునిముందరబ్రవహింపుచు సేవించె. ఆనదులయొక్క రెండుగట్లయందును, తెల్లనిసన్నగారెయొక్క పూతలు, గలవియును, మనోహరములైనవియును, సర్వోత్తమములైనవియును, నగుగృహములుభరద్వాజమునివరునియాజ్ఞవలన నుద్భవించి ప్రకాశించుచుండె. మఱియునాసమయమునందే బ్రహ్మదేవునిచేతఁబంపఁబడినయిరువదివేలమందిస్త్రీలుసకలాభరణములచేతనునలంకరింపఁబడినవారైవచ్చిరి. ఇంతయగాకకుబేరునిచేఁబంపఁబడినయిరువదివేలమందిస్త్రీలు, సువర్ణాభరణములచేతను, మణిమయములగు నాభరణములచేతను, ప్రవాళాభరణములచేతను, నలంకరింపఁ బడినవారైవచ్చిరి. లోకములోనిపురుషులనందఱను గౌగిలించుకొనినతోడనేపిచ్చివారలనుగాఁజేయఁదగిన దేవవేశ్యలిరువదివేలమందినందనవనమునుండి బయలువెడలివచ్చిరి. సూర్యునియొక్క తేజస్సువంటి తేజస్సుచేతఁబ్రకాశించుచున్న నారదతుంబురుగోపులును, మఱియునితరులగుగంధర్వరాజులునువచ్చిభరతునిముందటమనోహరముగఁబాడిరి. భరద్వాజమహామునియొక్క యాజ్ఞవలన నలంబుస, మిశ్రకేశి, పుండరీక, వామన, యనుస్త్రీలుభరతునిముందరనృత్యమునుజేసిరి. భరద్వాజమునివరునియొక్కయాజ్ఞవలన దేవతలుధరించునట్టి పుష్పమాలికలును, చైత్రరథమునందలిపుష్పమాలికలును, నాప్రయాగక్షేత్రమునందుఁ గనఁబడెను. మఱియునాభరద్వాజమునివరునియొక్కయాజ్ఞవలనమారేడుచెట్లు మృదంగములనువాయింపఁదొడంగె. తాండ్రచెట్లుతాళమునుబట్టుకొని మ్రోయించుటకారంభించె. అశ్వత్థవృక్షములునృత్యమునుజేయుచుండె (అనఁగానీవృక్షములుమానవరూపమనుధరించి మృదంగాదులనువాయించెను) ఇంతయగాకభరద్వాజ మునివరునియాజ్ఞవలనసరళవృక్షములును, దాటిచెట్లును, బొట్టుగుచెట్లును, కానుఁగుచెట్లును, కుబ్జవామనాకారములనుధరించిపరిహాసమునుజేయఁదగినవారలవలె సంచరించుచుండె. మఱియు నయ్యాశ్రమమునందలి శింశుపావృక్షములును, ఉసిరికచెట్లును, నేరేడుచెట్లును, సన్నజాజిలతలును, మల్లెతీగలును, మఱియునితరములగులతలును, వృక్షములును, స్త్రీరూపములనుధరించి విచిత్రములగు మాటలనుబలికెట్లుపలికియాభరతునియొక్కసైన్యములతోనిట్లనియె

సారాయినిద్రాగునట్టి యోసైనికులారా! మనోహర

ములగు మద్యములను ద్రాగుఁడు. భుజింపవలయునని యెడు నభిలాషలుగల యోసైనికులారా! పరమాన్నమును ద్రాగుఁడు. మఱియును మిక్కిలి పరిశుద్ధములగు మాంసములను వలయునంత భక్షింపుఁడని పలికె. మఱియు భరద్వాజ మునివరునాజ్ఞవలన నొక్కొక్క పురుషునివద్దకు నేడెనిమిదిమంది స్త్రీలువచ్చి మనోహరములగు నదీతీరములయందు నలుగులను బెట్టి స్నానములను జేయించిరి. ఇంతయగాక సుందరములగు నేత్రములుగలవారలును, శ్రేష్ఠలునునగు స్త్రీలు వారలశరీరములయందలి తడినిదుడిచి యాపురుషులచేత నొకరితోనొకరికి సురాపానమును జేయించిరి అంతట వాహనములను భరద్వాజాజ్ఞవలన విచారించుకొనువారలు, గుఱ్ఱములు, గజములు, ఒంటెలు, గోవులు, ఎద్దులు, మొదలగువానికి దాణాలను శాస్త్రోక్త ప్రకారముగ సమర్పించిరి. మఱియును, మహాబలులగు వాహనపాలకులు, రఘుకులమునందుఁబుట్టిన వారలయొక్క వాహనములను బ్రేరేపించుచుఁ జెఱకుగడలను, తేనెగలసిన పేలాలను భుజింపఁజేసిరి. ఆసైన్యమునందలివారందఱును మద్యపానముచేత మదించినవారును, సంతోషించినవారును, నగుటచేత మైమఱచియుండిరి. కావున నేగుఱ్ఱములను రక్షించువాఁడు గుఱ్ఱములసంగతినే మఱచియుండె మావటివారలు గజముల వార్తను మఱచిపోయిరి. మఱియు నితరులగు వారందఱును స్రక్చందనాది భోగములచేత మైమఱచి తాముచేయవలసిన పనులను మఱచియుండిరి. మఱియు నాభరతుని సేనలోని వారందఱును, సకలవిధములగు నభిలాషలను నెఱవేర్చుకొనినవారైరి మఱియును రక్తచందనమును శరీరమునందంతటను నలఁదుకొనిరి. ఇంతయగాక దేవవేశ్యలగు నప్సరస్త్రీలతోఁగూడినవారలై యిచ్ఛానుసారముగ సంభాషించుచుండిరి. అట్లుసంభాషించుచుఁ బరమసంతోషంబున గొందఱిట్లనిరి.

మేమయోధ్యాపట్టణమునకుఁ బోవుటలేదు. భరతునకుఁగుశలమగుఁగాక. రామునకెప్పుడును సుఖముగలిగియుండుఁగాకయనిరి ఇవ్విధముగాఁబదాతులును, గుఱ్ఱపురౌతులును, మావటివారలును, భరద్వాజమునివరునివలనఁగలిగిన సౌఖ్యమును బొంది మిగులస్వాతంత్ర్యముగలవారైయిట్లనిరి

భరతుని పరిచారకులగువారందఱును, మిగులసంతోషముగలవారై యిదిస్వర్గపట్టణముగానున్నదని పలికిరి. మఱియు నాసైనికులలోఁ గొందఱు పరిమళించుచున్న పూలమాలలతోఁగూడినవారలై వేలవేలుగాఁజేరి నృత్యమును జేసిరి. కొందఱు పకపకనవ్విరి. మఱికొందఱు మనోహరముగా గానము నేసిరి. మఱికొందఱిచ్ఛానుసారముగ నిటునటుతిరుగులాడుచుండిరి. అటుపిమ్మట నాసైనికులందఱును నమృతముతోసమానమైన యన్నమును భుజించిరి. పిదపదివ్యములగుభక్ష్యములను జూచి యనుభవింపవలయునని కోరికగలవారైరి. అట్లభిలాషగలవారలై యాభక్ష్యములను భుజించియునుదృప్తితీరనివారైరి. మఱియును బరిచారకులును, దాసీజనమును, స్త్రీలును, సైన్యమునందున్న మఱికొందఱును, నూతనములగువస్త్రాద్యాభరణములుగలవారై యధికముగగర్వమునొందిరి. మఱియు నాసైన్యమునందలి యేనుఁగులును, గుఱ్ఱములును, గాడిదెలును, ఒంటెలును, గోవులును, మృగములును, పక్షులును, భరద్వాజమునివరుని ప్రభావముచేతఁ గల్పింపఁబడినపదార్థములచేతనే తృప్తిబొందెనుగాని మఱియొకఁడు తెచ్చిపెట్టినపదార్థములచేతఁ దృప్తినిబొందినవిగావు. ఆభరతునిసేనలో నొక్కఁడును మలినమైన వస్త్రముగలవాఁడు లేఁడు. ఆకలిగలవాఁడును, మాలిన్యముబొందినవాఁడును, దుమ్ముచేగప్పఁబడినశరీరముగలవాఁడును నెవ్వఁడును లేఁడును. ఇంతయగాక యాసేనలోనివారందఱును, మేకమాంసములు, పందిమాంసములు, సర్వోత్తమములగువ్యంజనములు, చక్కరతోఁగలిసిన ఫలరసములును, సుగంధరసములతోఁగూడిన వండినపప్పుదినుసులు, స్వచ్ఛమైనదియును, తెల్లనిదియును, నగునన్నము, మొదలగువానితోఁ గూడుకొనినవియును, నసంఖ్యములయినవియును, నగులోహపాత్రలనుజూచి మహాశ్చర్యమునుబొందిరి. ఆసమయమునం దయ్యాశ్రమమునకు సమీపమునందున్న బావులన్నియును, పరమాన్నములచేత నిండినవయ్యె. అందలిగోవులన్నియును గామధేనువులయ్యె. వృక్షములన్నియును మకరందము నిచ్చునవియయ్యె. మఱియునందలి నడబావులన్నియును, మైరేయమనుపేరుగల మద్యముచేతనిండినవియును, సర్వోత్తమములగుమాంససమూహములతోఁగూడినవియును, కుండలయందువండఁబడిన మృగములయొక్కయు, నెమళ్లయొక్కయు మాంసములతోనిండినవియును, నయ్యె. అనేకవేలయున్నపుపాత్రలును, కూరగాయలుంచుపాత్రలనేకలక్షలును, భోజనార్హములును, బంగారముచేత నిర్మింపఁబడినవియునునగు భోజనపాత్రలుపదికోట్లును, చక్కగాశుద్ధిచేయఁబడినవియును, పెరుగుచేత నిండియున్నవియును, నగుస్థాలీపాత్రలనేకకోట్లును, మూతియందువెడల్పుగల పాత్రలనేకలక్షలును, నచ్చోటనిండియుండె. మఱియునయ్యాశ్రమమునందలి మడుగులన్నియును, మిక్కిలిపాతదియును, మిక్కిలిక్రొత్తదియును, గాక తెల్లఁదనముగలిగి మంచివాసనతో గూడిన వెలగపండుతోఁబోల్పఁదగిన మజ్జిగచేతనిండి

యుండె. మఱికొన్నిమడుగులు తెల్లనిపెరుగుతో నిండియుండె. కొన్నిపరమాన్నములచేతనిండియుండె. కొన్ని చక్కెర యవలు మొదలగువానిచేతఁ జేయఁబడినపిండివంటలచేతనిండియుండె. మఱియునయ్యాశ్రమమునందు ఉసిరికఫలములు మొదలగువానిచేతఁ జేయఁబడినకల్కములును, గంధపుపొడులును, మఱియును స్నానయోగ్యములగుద్రవ్యములతోఁగూడిన పాత్రలనునిండియుండె వానినన్నింటినిజూచి భరతునిసేనలోనివారందఱును బరమానందమునుబొందిరి. మఱియునాసైనికులు స్వచ్ఛములైనవియును, కూర్చలతోఁగూడినవియును, నగుదంతధావనయోగ్యములగు కాష్ఠములసమూహమును, గొప్పవగుదొప్పలయందున్నవియును, తెల్లనివియును, నగుమంచిగంధపుముద్దలను, చక్కగాశుద్ధిచేయఁబడినయద్దములను, వస్త్రములయొక్క సముదాయములను, ననేకవేలపాదుకలను, కాటుకనుబెట్టియుంచి భరిణలను, దువ్వెనలను, మీసములనుదువ్వుటకుఁ దగినకూర్చలను, నానావిధములగునాయుధములను, కవచములను, ధనుస్సులను, నానావిధములగు పాన్పులను, చిత్రములగుపీఠములను, గాడిదెలు, గుఱ్ఱములు, మొదలగుజంతువులునీళ్ళను ద్రాగునట్టిగుంటలను, స్నానమును జేయుటకుఁ దగినరేవులుగలవియును, నిర్మలములైనయుదకములుగలవియును, సుఖముగస్నానమును జేయుటకుఁదగినవియును, నల్లగలువలతోఁగూడినవియును, యాకాశమువంటి చాయగలవియును, నగుమడుగులను, పశువులకిచ్చుటయే ప్రయోజనముగాఁగలవియును, నీపవృక్షములయొక్కయు, వైడూర్యరత్నములయొక్కయు వన్నెవంటివన్నెగలవియును, మెత్తనివియును, నగుపచ్చికలను జూచి పరమానందమును బొందిరి. మఱియు వామనుష్యులందఱును భరద్వాజమునివరుఁడు భరతునకు సమర్పించినయాతిథ్యమును సర్వమునుజూచి యవియన్నియును గలలోఁగన్నసంపదలవలె నాశ్చర్యకరములై యున్నవనితలఁచిరి. ఇంతయగాక యీవిందు సకలజనులకును నాశ్చర్యమును గలిగించె. ఇవ్విధముగా నాభరతుని పరిచారకులు మొదలగువారందఱు నందనవనమునందు దేవతలుసంచరించుచున్నవిధముగా నయ్యాశ్రమమునం దానందముతోఁదిరుగుచు నారాత్రిని సర్వమునుగడపిరి. అంతటనయ్యాశ్రమమునం దలినదులును, గంధర్వులును, దేవాంగనలును, మఱియు నితరమగుసర్వమును, భరద్వాజమునివరుని యాజ్ఞనుబొంది తమతమనివాసస్థానములకుఁబోయిరి. ప్రాతఃకాలమైనపిమ్మట నాసైనికులందఱును నాప్రకారముగానే మద్యపానముచేత మైమరచినవారై పూర్వప్రకారమే దివ్యాగరు చందనాలంకారములచేత నలంకరింపఁబడినవారైయుండిరి. మఱియునక్కడక్కడ దివ్యములగు పూలమాలికలును జల్లఁబడినవై నలిగియుండె

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొంబదొకటవసర్గ ముగిసెను.

భరతుఁడు భరద్వాజమహామునితోఁ బోయివచ్చెదనని చెప్పుట.

అవ్విధముగ నాభరతుఁడు పరివారజనముతోఁగూడ భరద్వాజమునివరుఁడిచ్చిన యాతిథ్యమును గైకొనియె. అట్లు గైకొని యారాత్రియంతయునుగడచినపిమ్మట నాభరతుఁడు రాముని జూడవలయునని మెదు కోరికచేత భరద్వాజమునివరునొద్దకుఁబోయె. పోయినపిమ్మటసర్వజ్ఞుఁడగు నాభరద్వాజమునివరుఁడు, పురుషోత్తముఁడును, దోసిలియొగ్గియున్నవాఁడును, తననుజూచుటకు వచ్చియున్నవాఁడును, నగుభరతునిజూచి యగ్నిహోత్రాది కృత్యముల నన్నింటిని జేసికొని పిమ్మట నాభరతునితో నిట్లనియె.

నిష్కల్మషుఁడా! భరతుఁడా! నీకు నాయాశ్రమమునందీ రాత్రియంతయును సుఖముగాఁగడచినదా? నీవారలకందఱకును నాతిథ్యము సంపూర్ణముగ నివ్వఁబడినదా? ఏవిధమైన కష్టమును గలుగలేదుగదా? ఈవిషయమును సర్వమును నాకుఁ జెప్పుమనియె. అంతట నాభరతుఁడు భరద్వాజమునివరునకు నమస్కారమును జేసి చేతులనుముకళించుకొని నవారైయాశ్రమమునుండి బయలువెడలినమునిశ్రేష్ఠుఁడగు నాభరద్వాజమునివరునితో నిట్లనియె

షడ్గుణైశ్వర్యసంపన్నుఁడవైన యోభరద్వాజమునివర్యా! నేనుమంత్రులతోడను, చతురంగబలముతోడను గూడుకొనిన వాఁడనై నానావిధమును, కోరఁదగినవియునునగు పదార్థములచేతఁ దృప్తినిబొందితిని. విశేషముగఁ జెప్పనేల నీచేతఁ జేయఁబడిన యాతిథ్యమును గైకొని మేమందఱమును నీరాత్రియందుసుఖముగా నిద్రించితిమి. మఱియును బరిచారకుఁడు మొదలుకొని నావఱకునుగలమేమందఱమును, నీచేతనివ్వఁబడిన యాతిథ్యమును గైకొని మార్గాయాసమును బోఁగొట్టుకొనినవారలమైతిమి మఱియును మధురములగు భక్ష్యములను భుజించితిమి మిగుల రమ్యములగు గృహములయందునివసించితిమి. ఇట్లు మేమందఱమును యీగతించిన రాత్రియందు సుఖముగా నిద్రించితిమి. కావున మహాత్ముఁడవగు నో భరద్వాజుఁడా! నేను నాయన్నయగు రామునిసమీపమునకుఁ బోవలయునని మెదుకోరికచేత బయలువెడలినాను. కావున నా

యన్నయొద్దకుఁ బోవుటకునీయాజ్ఞనుగోరుచున్నాను. కాఁబట్టి నన్నుఁబరమదయాళుఁడవైచూడుము. మునిశ్రేష్ఠుఁడా! మహానుభావుఁడును, ధార్మికుఁడును, నగురాముని యాశ్రమమునకు ఏమార్గమునుబట్టిపోవలయునో చెప్పుమనియె. అనియిట్లు రాముఁడునివసించియున్నవనమిక్కడకెంతదూరముననున్నదియును జెప్పుమనియడుగుచున్నవాఁడును, జ్యేష్ఠుఁడగు రామునిఁజూడవలయునని యెడు కోరికగలవాఁడును, నగుభరతునిఁజూచి తేజోవంతుఁడును, తపోవంతులలోనుత్తముఁడునునగు భరద్వాజమహాముని యిట్లనియె.

భరతుఁడా! ఇక్కడకు రెండున్నరయామడకుదూరమునందునిర్జనమయినయరణ్యముగలదు. ఆయరణ్యమునందు రమ్యములగుచరియలును, సరణ్యమునుగలదియును, నగు చిత్రకూటపర్వతమనునొకపర్వతముగలదు. ఆచిత్రకూట పర్వతముయొక్క యుత్తరపుదిక్కునందొకవైపున మనోహరములైనపువ్వులతోఁగూడినవృక్షములుగలదియును, చుట్టును మనోహరమగు సరణ్యముగలదియును, నగుమందాకినీనదియొకటిగలదు. వత్సా! భరతుఁడా! ఆ మందాకినీనదికవ్వలనే ఆచిత్రకూటమనుపేరుగల పర్వతమున్నది. ఆచిత్రకూటపర్వతమునందొకపర్ణశాలనిర్మింపఁబడియె. ఆపర్ణశాలయందురామలక్ష్మణులు నివసించుచుందురు. మహానుభావుఁడవైనయోభరతుఁడా! ఇక్కడనుండి దక్షిణపుమార్గముగానైనను, నిఋఋతిమార్గముగానైనను, చతురంగబలములతోఁగూడిన నీసైన్యమునుదోడ్కొనిపొమ్ము. ఆచిత్రకూటపర్వతమునందు రఘుకులోత్తముఁడగు రామునిఁజూడఁగలవని భరద్వాజమునివరుఁడుచెప్పె. ఇవ్విధముగనాభరద్వాజమునివరుఁడు చెప్పిన ప్రయాణస్థానమునువినిదశరథమహారాజుయొక్కభార్యలందఱునువాహనములనెక్కుటకుఁదగినవారలయ్యును, తమ వాహనములనువదలి పాదచారులై యాభరద్వాజమునివరునొద్దకుఁబోయి యతనిచుట్టునునిలిచిరి. అప్పుడుసుమిత్రాదేవితోఁగూడఁ గూడుకొనినదియును, పుత్రదుఃఖముచేతఁగృశించినదియును, కావుననేవణఁకుచున్నదియును, నగుకౌసల్యాదేవి యాభరద్వాజమునివరునియొక్క పాదములనుబట్టుకొని నమస్కారమును జేసె. మఱియునాసమయమునందుసఫలముగానికోరికచేతనిందితురాలై నయాకైకేయియును తానుజేసియుండు క్రూరకార్యమునుగుఱించిసిగ్గుతోఁగూడినదై యాభరద్వాజ మునివరునియొక్కపాదములనుబట్టుకొని నమస్కారమును జేసె. మఱియునాకైకేయియప్పుడుదీనమైనమనస్సుగలదై మహాత్ముఁడైనయాభరద్వాజమునివరునకుఁ బ్రదక్షిణనమస్కారమును జేసిభరతునిసమీపమునందుఁ గొంచెముదూరముగనిలిచియుండె. అటుపిమ్మటనిశ్చలమైన తపోవ్రతముగల భరద్వాజమహామునిభరతునితోనిట్లనియె.

రఘువంశోద్భవుఁడా! భరతుఁడా! నీతల్లులందఱును వీరలేయనితోచుచున్నది. కావునవీరినామములను వేరువేరుగాఁదెలిసికొనవలయునని యభిలాషగలిగియున్నది. కావునవీరివృత్తాంతమును జెప్పుమనియె. ఇవ్విధముగబుద్ధిమంతుఁడగు భరద్వాజమహామునియడుగఁగానే మాటలాడుటయందు మిగులనేర్పుగలభరతుఁడుచేతులను ముకుళించుకొనియాభరద్వాజమహామునినిఁజూచియిట్లనియె.

మహాత్ముఁడవగునో భరద్వాజమునివర్యా! ఈనా తల్లులలోపలదీనురాలును, దుఃఖముచేతను, భోజనమును జేయకపోవుటచేతను, కృశించినదియును, దేవతవలెఁబ్రకాశించుచున్నదియును, నగునీమహానుభావురాలునాతండ్రియగు దశరథమహారాజునకుఁ బెద్దభార్యయగు కౌసల్యాదేవి. పురుషోత్తముఁడును, సింహముయొక్కగంభీరమైననడకవంటినడకగలవాఁడును, నగురామునినీమహానుభావురాలు" బ్రహ్మదేవునినదితిపుత్రునిగాఁగనినట్లు పుత్రునిగాఁగనియె. అడవియందురాలినపువ్వులుగలకొండగోగుకొమ్మవలెఁగాంతివిహీనమైయున్నదియును, కౌసల్యాదేవికి వామభాగమునందు నిలుచుకొనియున్నదియును, వ్యసనమునుబొందుచున్నదియునగు నీమహానుభావురాలుసుమిత్రాదేవి. అశ్వినీదేవతలతోసమానులును, వీరులును, విఫలముగానిపరాక్రమముగలవారును, నగులక్ష్మణశత్రుఘ్నులిరువురును, నీమహానుభావురాలికిఁ బుత్రులు. మఱియునోమునిశ్రేష్ఠుఁడా! దేనినిమిత్తముగఁ బురుషోత్తములగురామలక్ష్మణులిక్కడనుండి జీవనాశమునుబొందిరో? దశరథమహారాజుదేనినిమిత్తముగఁ బుత్రహీనుఁడైమరణమునుబొందెనో? యట్టిపాపాత్మురాలును, సర్వకాలములయందునుగోపముగలదియును, సఫలముగానిబుద్ధివృత్తులుగలదియును, సౌందర్యవతిననిగర్వమునుబొందునదియును, నైశ్వర్యముగావలయునని యెడు సంకల్పముగలదియును, దుష్టప్రవర్తన గలదియును, పూజ్యురాలియొక్కరూపమువంటి రూపముగలదియును, ఘాతకురాలును, పాపమునేజేయవలయుననెడు నిశ్చయము గలదియును, మదించినస్వభావముగలదియునునగు నీస్త్రీ కైకేయియనిచెప్పఁబడును. ఈకైకేయినాతల్లి. మఱియునీకైకేయియిప్పుడుమాకుఁగలిగిన యీకష్టములకన్నిటికిని మూలహేతురాలనిభరతుఁడా వృత్తాంతమునుసర్వ

మనుభరద్వాజమహామునికి సవినయముగాఁ జెప్పెను. ఇవ్విధముగాఁ బుద్ధిమంతుఁడగు నా భరతుఁడు గన్నీళ్లు విడుచుచు గద్గదమైన వాక్కుచేఁ బలికెను. ఇట్లు పలికి యెఱ్ఱని నేత్రములు గలవాఁడై కోపమును బొందిన యేనుఁగువలె నిట్టూర్పుల నిడదొడఁగె. అవ్విధముగా సంభాషించుచున్న భరతుని జూచి బుద్ధిమంతులలో నుత్తముఁడగు నా భరద్వాజమహాముని మృదుమధురవచనముల నిట్లనియె.

“శ్లో॥ న దోషేణావగంతవ్యా కైకేయీ భరత త్వయా। రామప్రవ్రాజనం హ్యేతత్సుఖోదర్కం భవిష్యతి॥ దేవానాం దానవానాం చ ఋషీణాం భావితాత్మనామ్। హితమేవ భవిష్యద్ధి రామప్రవ్రాజనాదిహ॥ ”భరతుఁడా! నీవు కైకను దోషవంతురాలిఁగా నెన్నకుము. ఈ కైకేయి రాముని నరణ్యమునకుఁ బంపి లోకమునకు మిక్కిలి యుపకారమును జేసినదయ్యె. ఆ యుపకారమంతయును నికమీఁదట నెల్లవారలకును బాగుగఁ దెలియఁగలదు. రాముఁడు దండకారణ్యమునకుఁ బోవుట దేవతలకును, రాక్షసులకును, మహానుభావులును, పరమాత్మను ధ్యానము సేయువారలును నగు ఋషులకును, మిక్కిలి మేలును గలుగఁ జేయఁగలదని చెప్పె. ఆ మాటను విని భరతుఁడు భరద్వాజమునివరునకు నమస్కారమును జేసి యా మునివరునివలన నాశీర్వదింపఁబడినవాఁడై మరల నమ్మునివరునకుఁ బ్రదక్షిణనమస్కారమును జేసి యచ్చోటనుండి బయలువెడలిపోవుటకుఁ దన సైన్యమును సర్వమును బిలిచి ప్రయాణసన్నాహమును జేయుఁడని యాజ్ఞాపించెను. అంతట నాజనమంతయును, ప్రయాణమునఁ గోరినదై బంగారముచే నలంకరింపఁబడినవియును, శ్రేష్ఠములైనవియును, సన్నద్ధములైనవియును, నగు గుఱ్ఱపురథములనెక్కె. ఆ సమయమునందాఁడయేనుఁగులును, మగయేనుఁగులును, సువర్ణమయములగు మొలనూళ్లుగలవియును, టెక్కెములుగలవియునునై, వర్షాకాలమునందు ఉఱుములతోఁగూడిన మేఘములు బయలువెడలిన విధముగ బయలువెడలె. మఱియు నానావిధములును, గొప్పవియును, కొద్దివియును, మిగుల శ్రేష్ఠములైనవియును, నగు వాహనములన్నియును బయలువెడలె. మఱియుఁ బదాతులందఱును పాదములచేత బయలువెడలిపోయిరి. అంతటనప్పుడు కౌసల్య మొదలుగాఁగల స్త్రీలందఱును రాముని జూడవలయునని యెడుకోరిక గలవారై శ్రేష్ఠములగు వాహనములనెక్కిపోయిరి. అంతట శ్రీమంతుఁడగు నా భరతుఁడు పరివారముతోఁ గూడి “తరుణులగు సూర్యచంద్రులవలెఁ” బ్రకాశించుచున్నదియును, సన్నద్ధమైనదియును, మంగళకరమైనదియునునగు పల్లకియందెక్కి బయలువెడలె. అవ్విధముగ నేనుఁగులు, గుఱ్ఱములు, రథములు, మొదలగువానిచేత నిండినదియును, సర్వోత్తమమైనదియును, మిగులఁగొప్పదియును, నగు నా భరతుని సైన్యము, గంగానదియొక్క దక్షిణపుగట్టునుబట్టి “ గొప్పదగు మేఘమువలె” బయలువెడలి మృగములతోడను, పక్షులతోడను, వృక్షములతోడను, గూడుకొనిన పర్వతములను నదులను దాఁటె. మఱియు నప్పుడు మిక్కిలి సంతోషమును బొందిన యేనుఁగులును, గుఱ్ఱములును, భటులును, గల భరతునియొక్క యా సైన్యమంతయును, గొప్పదగు నరణ్యమునందుఁ బ్రవేశించి మృగములయొక్కయు, పక్షులయొక్కయు సముదాయములను భయపెట్టుచుఁ బోవుచుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొంబదిరెండవ సర్గము ముగిసెను.

{ భరతుఁడు చిత్రకూటపర్వతమునందు సీతారామలక్ష్మణులు నివసించుచోటును తెలిసికొనియెననుట }

అవ్విధముగ బయలువెడలినదియును, గొప్పదియును నగు నా భరతుని సైన్యముచేత వనమునందు సంచరించుచున్న మదపుటేనుఁగులు భయపెట్టఁబడినవై తమతమజాతిసమూహములతోఁ గూడ బరుగిడిపోయినవయ్యె. అట్లు పోవుచున్న యా మృగములను, సైనికులు, పర్వతములయందును, నదులయందును, మఱియు నితరములగు నదులయందును, ఎలుగుబంట్లను, చుక్కలుగల జింకసమూహములను, చుక్కలు లేనివియును, పెద్దవియును, కొమ్ములుగలవియును నగు జింకలను, మఱియు నితరములగు మృగములను జూచి మిగుల నాశ్చర్యమును బొందిరి. ధర్మాత్ముఁడును, దశరథమహారాజునకుఁ బుత్రుఁడును, నగు నా భరతుఁడు, పరమసంతోషమును బొంది యధికమగు సైన్యముతోడఁ గూడి బయలువెడలిపోయె. మహానుభావుఁడైన భరతునియొక్క సముద్రమువంటి సైన్యమంతయును, వర్షాకాలమునందు మేఘములాకాశమును గప్పిపోవుచున్న విధముగ భూమిని సర్వమును గప్పుకొనిపోవుచుండె. ఆ సమయమునందు మిగుల వేగముగల గుఱ్ఱములచేతను, మిక్కిలి వేగముగల యేనుఁగులచేత మఱియు నితరమగు సైన్యముచేతను వ్యాప్తమైన యా యరణ్యభూమి చిరకాలము కనఁబడకయుండె. అట్లు బహుదూరము సేనతోఁగూడ శ్రీమంతుఁడగు భరతుఁడు పోయి మార్గాయాసముచేత నలసిన వాహనాదికముగలవాఁడై మంత్రులలోను త్తముఁడగు వసిష్ఠమహామునిని జూచి యిట్లనియె.

వసిష్ఠమునివర్యా! మనచేత మొదటఁ దలఁపఁబడినదియుం

ను, భరద్వాజమునివరునిచే జెప్పబడిన రూపముగలదియును, మఱియునితరులగువారివలన వినఁబడినదియును నగు ప్రదేశమునకువచ్చితిమి. ఇదిగో యీపర్వతమే చిత్రకూటపర్వతము. ఈపర్వతమునకు సమీపమునందుఁ బ్రవహించుచున్న నదియే మందాకినీనది యనితోఁచుచున్నది. మఱియు నీపర్వతప్రాంతమునందు నల్లనిమేఘమువలెఁ బ్రకాశించుచున్నవనమే దండకావనము. ఇందుకు సందేహమేమియును లేదు. ఇప్పుడు పర్వతముతో సమానములైనవియును నాసంబంధమైనవియును, నగు నేనుఁగలచేతఁ జిత్రకూటపర్వతముయొక్క రమ్యములగు సానువులు పీడింపఁబడుచున్నవి. (అనఁగా నేనుఁగులు దంతములచేత, చిత్రకూటపర్వతముయొక్క చరియలను బొడుచుచున్నవనుట.) మఱియు నీవృక్షములు, వర్షాకాలమునందు నల్లనివియును, గొప్పవియును, నగు మేఘములుదకములనువదలువిధముగాఁ బర్వతపు చరియలయందుఁ బుష్పములను విడుచుచున్నవని వసిష్ఠ మునివరునితోఁ జెప్పి శత్రుఘ్ను జూచి యిట్లనియె.

శత్రుఘ్నా! మొసళ్ళచేత సముద్రము వ్యాపింపఁబడియుండునట్లు దండకారణ్యమంతయును గ్రూరమృగములచేత వ్యాప్తమైయున్నది. ఈచిత్రకూటమునందుఁ గిన్నరులు సంచరింపుదురు. ఇట్టిదండకారణ్యమును, చిత్రకూటపర్వతమును జూడుము. శరత్కాలమున నాకాశమునందు గాలిచేతఁ బ్రేరేపింపఁబడిన మేఘసముదాయమువలె నీవృక్షములన్నియును, మనసైన్యముచేతఁ బ్రేరేపింపఁబడినవై యధికమైన వేగముగలిగి మిగుల మనోహరముగాఁ బ్రకాశించుచున్నవి. చూడుము. మఱియు నోశత్రుఘ్నా! ఈవృక్షములన్నియును, దక్షిణదేశమునందుండు జనులు మేఘములవలెనల్లనివియగు తలవెండ్రుకలను పలకములనుగాఁ జేసి పూలనుధరించువిధముగాఁ బుష్పములను శిరస్సులయందుధరించుచున్నది. మఱియునో శత్రుఘ్నుఁడా! చూచుటకుమిగులభయంకరమైన యీవనమంతయును బూర్వమునందు నిశ్శబ్దముగానుండును. అటువంటి యీయరణ్యమిప్పుడుజనులచే నిండింపబడి యయోధ్యాపట్టణమువలెఁ బ్రకాశించుచున్నది. మఱియునోశత్రుఘ్నుఁడా! మనగుఱ్ఱములగిట్టలచేత నెగరఁగొట్టఁబడిన దుమ్ము యీయరణ్యమునందంతటను వ్యాపించియున్నది. ఈదుమ్మును సర్వమును వాయువు నాకుఁ బ్రియమును జేయువానివలె నతివేగముగాఁ గొనిపోవుచున్నాఁడు. శత్రుఘ్నుఁడా! గుఱ్ఱములతోఁ గూడుకొనినవియును, శ్రేష్ఠములగు సారథులచే నధిష్ఠింపఁబడినవియును, నగు నీరథములన్నియును నీదండకారణ్యమునందు మిగులవేగముగాఁ బోవుచున్నవి. చూడుము. మఱియునో శత్రుఘ్నుఁడా! మనసైన్యముచే భయపరుపఁబడినవియును, చూచుటకుమనోహరములైయున్నవియును, నగు నీనెమళ్ళులను జూడుము. ఇవియన్నియును మిగులశీఘ్రముగాఁ దమతమనివాసస్థానములకుఁ బోవుచున్నవి. శత్రుఘ్నుఁడా! ఈమార్గము మిక్కిలిమనోహరమైనదై ప్రకాశించుచున్నది. మఱియుఁ దపోవంతులుండుటకుఁదగిన నీయరణ్యప్రదేశము స్వర్గపట్టణముతో సమానముగనున్నట్లు కనఁబడుచున్నది. చూడుము. మఱియునో శత్రుఘ్నుఁడా! ఈదండకారణ్యమునందుఁ దెల్లనిచుక్కలుగల జింకలు స్త్రీమృగములతోఁ గూడినవియును, మనోహరములైన యాకారములుగలవియును నై పుష్పములచేతనలంకరింపఁబడినవానివలెఁ గనఁబడుచున్నవి. చూడుము. తమ్ముఁడా! శత్రుఘ్నా! పురుషోత్తములగు రామలక్ష్మణు లెక్కడనున్నారో యాచోటును వెదకివచ్చుటకు సైనికులనందఱనుబంపుము. ఎల్లవారునుబోయి యీయరణ్యమునందు రామలక్ష్మణులున్నచోటును దెలిసికొనివచ్చుట యుచితమనితోఁచుచున్నదని చెప్పె. ఇవ్విధముగ భరతుఁడు సెప్పిన మాటలను విని యాయుధపాణులగు వీరపురుషులందఱును తత్క్షణము నబోయి యాదండకారణ్యమునందుఁ బ్రవేశించి వెదకి వెదకి కొంతసేపటికొక్కచోటఁ బొగవచ్చుటను జూచిరి. అట్లు చూచి భరతునొద్దకువచ్చి యీయరణ్యమునం దొక్కచోట పొగ గనఁబడుచున్నదని యాభరతునితోఁ జెప్పి మఱియు నిట్లనిరి.

భరతుఁడా! మనుష్యులు లేనిప్రదేశమునందగ్ని యుండదు. అగ్నిలేనిచోఁ బొగబయలు వెడలదు. కావున నిక్కడ రామలక్ష్మణులుందురని స్పష్టముగాఁ దోఁచుచున్నది. ఒకవేళ శత్రువులను హింసించువారలును, పురుషోత్తములును నగు రామలక్ష్మణులు లేనియెడల రామలక్ష్మణులతో సమానులగు తపోవంతులైన నుందురని తలఁచుచున్నామని చెప్పిరి. అంతట శత్రువులను మర్దించుటయందుఁ దగిన సామర్థ్యముగల భరతుఁడు సైనికులు చెప్పిన యామంచిమాటలను విని యాసైనికులనందఱను జూచి యిట్లనియె.

ఓసైనికులారా! మీరందఱును నిక్కడ నిశ్శబ్దముగా నుండుఁడు. నేను వసిష్ఠసుమంత్రులతోఁ గూడినవాఁడనై ముందుగాఁ బోయెదనని చెప్పె. ఆవచనమును విని సైనికులందఱును భరతుఁడు సెప్పినప్రకారముగా నక్కడనే యుండిరి. ఎమ్మట భరతుఁడు పొగయొక్క కొన నెచట గనుబడుచున్నదో యాప్రదేశము నులక్షించి చూచెను. అంతట భరతునిచే నియమింపఁబడిన యీసైన్యమంతయు సుశీఘ్రముగా సం

నిం జూడఁగలమని యెడు తలంపుచే మిగుల సంతోషమును బొందియాపొగయొక్కకొననే నిదానించిచూచుచుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొంబదిమూఁడవసర్గముగిసెను.

రాముఁడు చిత్రకూటపర్వతముయొక్క వినోదమును సీతకుఁ జూపుట.

అటుపిమ్మట నక్కడ దేవతలతో సమానుఁడును, పర్వతములయందును వనములందును బ్రియముగలవాఁడును, నగు రాముఁడొకమాసము దినములు ఆచిత్రకూటపర్వతమునందు నివసించి" శచీదేవికి దేవేంద్రుఁడు చిత్రములగు వస్తువులను జూపియానందింపఁ జేయునట్లు, సీతాదేవికి ఆచిత్రకూటపర్వతమును జూపియానందింపఁ జేయుచుఁ దానును నానందమును బొందుచు సీతతో నిట్లనియె.

మంగళస్వరూపురాలవైనయో సీతా! నేను రాజ్యభ్రష్టుఁడనైతినే యనియును, స్నేహితులను వదలుకొంటినే యనియును, కొంచెమైనవ్యసనమును బొందడము లేదు. మిగులరమ్యమగు నీచిత్రకూటపర్వతమును జూచుటచేత నాచిత్తము సర్వమును మఱచియధికమైన యానందమును బొందుచున్నది. మంగళకరురాలవైనయో సీతా! నానావిధములగు పక్షుల సమూహముతోఁ గూడుకొనినదియును, గైరికాదిధాతువులుగలవియును, నంతరిక్షమును నొరయుచున్నవియు నునగు శిఖరములచేఁ జక్కగా నలంకరింపఁబడినదియును, నైననీచిత్రకూటపర్వతమును బాడుము. మఱియునో సీతా! ఈచిత్రకూటపర్వతమునందుఁ గొన్ని ప్రదేశములు వెండితో సమానములై యున్నవి. మఱికొన్ని ప్రదేశములు నెత్తురువర్ణము గలిగియున్నవి. కొన్ని ప్రదేశములు పసపువన్నె గలవిగాను, చిత్రవర్ణములు గలవిగాను నున్నవి. మఱికొన్ని ప్రదేశములు రత్నశ్రేష్ఠములగు నింద్రనీలమణులయొక్క కాంతులు గలవియై యున్నవి. కొన్నిచోట్లు పుష్యరాగమణులయొక్కయు, స్ఫటికమణులయొక్కయు కాంతులు గలిగియున్నవి. కొన్ని ప్రదేశములు నక్షత్రములయొక్కయు, పాదరసముయొక్కయుఁ గాంతివంటి కాంతిగలవియును నై యున్నవి. ఇంకను గొన్ని ప్రదేశములు మిగుల మనోహరములైన కాంతులు గలవియై యున్నవి. మఱియునో సీతా! నానావిధములగు పక్షులయొక్క సముదాయముతోఁ గూడుకొనిన యీచిత్రకూటపర్వతమునందుఁ బలువిధములగు మృగములయొక్కయు, పెద్దపులులయొక్కయు, చిఱుతపులులయొక్కయు, సముదాయములు మెండుగా సంచరించుచున్నవి. మఱియును గ్రూరములుగాని సాధువులగు మృగములు కొన్ని సంచరించుచున్నవి. వీటినన్నిటిని చూడుము. ఓసీతా! మఱియు నీచిత్రకూటపర్వతము, మిగులఁ జక్కగాఁ బుష్పించినవియును, ఫలవంతములును, నైమనోహరములైన మామిడి, నేరేడు, వేగి, లొద్దుగు, మోరటి, పనస, చంద్ర, ఊడుగు, శ్రేష్ఠమగు తినాసము, మారేడు, తుమ్మి, వెదుళ్లు, గుమ్ముడు, లేప, ఉలిమిరి, ఇప్ప, రేగు, ఉసిరిక, మంకెన, పేము, ఏఱుమద్ది, దాడిమి, మొదలగు వృక్షములయొక్కయు సమూహముచేత మిగుల మనోహరముగాఁ బ్రకాశించుచున్నది. చూడుము. మంగళస్వరూపురాలవగునో సీతా! మిగుల మనోహరములైన కొండనెత్తములయందు కిన్నరులయొక్క మిథునములు చూచువారలకు గగుర్పాటును గలుగఁజేయుచున్నారు. మఱియు మిగుల మనోహరములగు క్రీడలను సల్పుచున్నారు. ఇట్టి కిన్నరులను జూడుము. మఱియునో సీతా! విద్యాధరులు చెట్లకొమ్మలయందు తికినవస్త్రముల నెండఁగట్టియున్నారు. కొన్నివృక్షములయొక్క కొమ్మలయందు దివ్యములగు నాయుధములను బెట్టియున్నారు. విచిత్రములగు క్రీడలను సలుపుచున్నారు. ఇట్టి విద్యాధరమిథునములను జూడుము. మఱియునో సీతా! ఈచిత్రకూటపర్వత మొకచోటఁ బ్రవహించుచున్న సెలయేఱుల చేతను, భూమిని భేదించుకొని వచ్చుచున్న యూటలచేతను, మదోదకమును స్రవించుచున్న యేనుఁగువలెఁ బ్రకాశించుచున్నది. చూడుము. మఱియునో సీతా! నానావిధములగు పుష్పములయందలి పరిమళమును గైకొని వచ్చుచున్నదియును, గుహలోనుండి వచ్చుచున్నదియును, ముక్కులకుఁ దృప్తిని బొందించుచున్నదియును, నగు వాయువు వచ్చి మనకు మిగుల సౌఖ్యమును గలుగఁ జేయుచున్నది, పూజ్యురాలవైనయో సీతా! ఇక్కడ ననేక సంవత్సరములు నీవును నేనును, లక్ష్మణుఁడును, నుంటిమేని నాకు రాజ్యభ్రష్టతవలనఁ గలిగిన దుఃఖము నన్నుఁ గొంచెమైనను బాధింపఁజాలదు. ఓసీతా! నానావిధములగు పుష్పములును, ఫలములును, గలదియును, మనోహరమైనదియును, నానావిధములగు పక్షులయొక్క సముదాయముతోఁ గూడినదియును, విచిత్రములగు శిఖరములు గలదియు నునగు నీపర్వతమునందు సర్వకాలములయందును నుండవలయునని యభిలాష గలిగియున్నది. ఓసీతా! నేను మిగుల సంతోషముతో వనవాసము చేయుటవలనఁ బితృవాక్యపరిపాలనవలనఁ గలిగెడు ఫలమును, తమ్ముఁడగు భరతునకుఁ బ్రియమును గలుగఁజేయుటయు నని రెండు ఫలములను గలిగినవి. జనకమహారాజపుత్రికవైనయో సీతా! నీవు మనోవాక్కాయముల

కులానందమును గలుగఁజేయునవియును, నానావిధము లైనవియును, నగుమలయానిలాదిభావములనుజూచుచునీ చిత్రకూటపర్వతమునందు నాతోఁగూడ విహరించుచుండుటనీకుసంతోషముగనున్నదిగదా? నీయభిప్రాయమును జెప్పుము.

రాణివైనయోసీతా! నాముత్తాతలు మొదలుగాఁగల రాజర్షులు దేహమునువదలినపిమ్మట మోక్షముగలుగుటకొఱకు వనవాసమునే కారణమునుగాఁజెప్పిరి. ఓసీతా! ఈ చిత్రకూటపర్వతముయొక్క సమీపమునందు నానావిధములును, ననేకములును, విశాలములును నగుశిలలునలుపు, తెలుపు, ఎఱుపు, మొదలుగాఁగలవర్ణములచేత మిగులమనోహరములుగాఁ బ్రకాశించుచున్నవి. చూడుము. మఱియునోసీతా! రాత్రులయం దీచిత్రకూటపర్వతమునం దనేకములగు తృణజ్యోతిస్సులనియెడు ఓషధులుతమకాంతులచే దీపములుప్రకాశించినవిధముగఁ బ్రకాశించుచున్నవి. మఱియునోసీతా! ఈచిత్రకూటపర్వతమునందలి కొన్నిప్రదేశములు గృహములతో సమానములై యున్నవి. మఱికొన్నిప్రదేశములుఉద్యానవనములతో సమానములై యున్నవి. కొన్నిప్రదేశములయం దొకొక్కశిలయే, మిగులవెడల్పును నిడుపునుగలదై కూర్చుండుటకును పరుండుటకును ఉపయుక్తమైనదై ప్రకాశించుచున్నది. మఱియు నోసీతా! ఈచిత్రకూటపర్వతము భూమినిభేదించుకొని వచ్చినదానివలెఁ గనఁబడుచున్నది. ఈచిత్రకూటపర్వతముయొక్కశిఖరము మిగులరమ్యమైనదై ప్రకాశించుచున్నది. సీతా! ఈచిత్రకూటపర్వతమునందుఁ గాముకులగువారు, నల్లకలువలరేకులను, పుత్రజీవియను పేరుగలచెట్లయొక్క పూలను, భుజపత్రములను, పఱపుమీఁదఁబరచెడు వస్త్రములనుగాను, తామరాకులను పరపులనుగాను నిర్మించుకొని శయనించుచున్నారు. ఈశయ్యలనుజూడుము. మఱియునోసీతా! ఈపరపులయందుశయనించునట్టి కాముకులచేననుభవింపఁబడి పాఱవేయఁబడిన పూలమాలికలును, నానావిధములగుఫలములను గ్రిందఁబడియున్నవి. చూడుము అనేకవిధములగుగడ్డదినుసులును, ఫలములును, ఉదకములునుగల యీచిత్రకూటపర్వతము, సకలధనములకునునాధారమైన యలకాపట్టణముకంటెను, సౌగంధికమనుపేరుగలసరస్సుకంటెను, ఉత్తరకురుదేశములకంటెను నధికమనోహరముగఁ బ్రకాశించుచున్నది. ఓసీతా! నేనుసర్వోత్తమములగు నియమములచేఁ బెద్దలమార్గమునందు సంచరించుచున్నవాఁడనై నీతోడను, లక్ష్మణునితోడనుగూడుకొని యీపదునాలుగుసంవత్సరములును నీయరణ్యమునందుసంచరించెదను. మఱియును గులమునకభివృద్ధినిగలుగఁజేయునట్టిసంతోషమునుబొందెదనని రాముఁడుచిత్రకూటపర్వతమునందలి చిత్రములను సీతాదేవికి జూపుచుఁజెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొంబదినాలుగవసర్గముగిసెను.

రాముడుసీతకుమందాకినీనదియొక్క వినోదమునుజూపించుట.

అవ్విధముగఁ గోసలదేశాధీశ్వరుఁడగు రాముఁడుసీతాదేవి కనేకవిచిత్రములనుజూపుచుఁ గొంతసేపుసంచరించినపిమ్మట నాచిత్రకూటపర్వతమునుండి క్రిందికిదిగి పావనములగు నుదకములుగలదియును, మిగులమనోహరమైనదియును, నగుమందాకినీనదినినాసీతకుఁజూపించె. తామరపుష్పములవంటి నేత్రములుగలరాముఁడు, మనోహరుఁడగు పూర్ణచంద్రునితో సమానమగు ముఖముగలదియును, విదేహదేశాధిపతియగు జనకమహారాజునకుఁబుత్రికయునునగు సీతాదేవితోనిట్లనియె.

ఓసీతా! ఈమందాకినీనది మిగులఁజిత్రములగు నిసుకదిన్నెలుగలదియును, మిగులమనోహరమైనదియును, హంసలు, సారసములు మొదలగుపక్షులచే సేవింపఁబడుచున్నదియును, కమలములతోఁగూడుకొన్నదియును, నైయున్నది. చూడుము. ఈనదినీవలె నాకుసంతోషమును గలిగించుచున్నది. మఱియునీగంగానది, నానావిధములును, తీరమునందుఁబుట్టినవియును, పుష్పములతోడను, ఫలములతోడను గూడుకొన్నవియునునగు వృక్షములచేనావరింపఁబడినదై కుబేరునియొక్కమనోహరముగాఁ బ్రకాశించుచున్న సౌగంధికమనుపేరుగల మడుగువలెఁ బ్రకాశించుచున్నది. ఇప్పుడేయీమందాకినీనదియొక్క యీతీరములయందు జింకలగుంపులుఉదకమును ద్రాగుటచేఁగలుషోదకములులైయున్నవి కావుననేమిగులమనోహరములగు నిరేవులునాకు మిగులఁ బ్రీతినిబుట్టించుచున్నవి. మఱియుఁ, బ్రియురాలవైనయోసీతా! ఈమందాకినీనదియందు జటాజూటములను ధరించినవారలును, నారచీరలనుఉత్తరీయములనుగాధరించినవారును, నగుఋషులు యుక్తకాలమునందు స్నానమునుజేయుచున్నారు. చూడుము విశాలములగునేత్రములుగలయోసీతా! మఱికొందఱుఋషులు నియమముగాబాహువులను మీఁదికెత్తినవారును, తీక్ష్ణములగునియమములుగలవారును నై సూర్యునకభిముఖముగా నిలుచుండి స్తోత్రమును జేయుచున్నారు. చూడుము. మఱియునోసీ

తా! ఈచిత్రకూటపర్వతము నాట్యమును జేయఁబోవువాఁడు చేతులచేతఁ బువ్వములనుజల్లుచున్నవిధముగ వాయువుచేతఁగదల్పఁబడిన శిరస్సులుగలవృక్షములచేఁ బత్రములను బువ్వములనుజల్లుచున్నది. మఱియు నోసీతా! ఈమందాకినీనదికొన్నిస్థలములయందు ముత్యములతోసమానమగు జలముగలదైయున్నది. మఱికొన్నిదేశములయందు మనోహరములగు నిసుకతిన్నెలచే నొప్పుచున్నవి. కొన్నిస్థలములయందు సిద్ధజనులయొక్క సంచారముగలదైయున్నది. చూడుము. మఱియు నోసీతా కొన్నిపువ్వములు గాలికిరాలి క్రిందఁబడియున్నవి. కొన్నిపువ్వములుఉదకములయందుఁబడిచలించుచున్నవి. మఱికొన్నిపూలరాసులు ప్రవాహముయొక్కనడుమ మనోహరముగాఁగదలుచున్నవి. ఈవిచిత్రములనుజూడుము. మంగళప్రదురాలవైన యోసీతా! మిక్కిలి మనోహరములగు ధ్వనులుగల చక్రవాకపక్షులుమనోహరములగుపలుకులఁబలుకుచు పూలరాసులమీఁదనెక్కి సంచరించుచున్నవి. చూడుము శుభప్రదురాలవైన యోసీతా! చిత్రకూటపర్వత మందాకినీనదులు, పట్టణమునందుండుటకంటెను, నిన్నుఁజూచుటకంటెను నధికమగుసంతోషమును, గలుగఁజేయుచున్నవి. తమమాహాత్మ్యముచే బాపములను బోఁగొట్టుకొనినవారును, తపస్సు, బాహ్యేంద్రియనిగ్రహ అంతరింద్రియ నిగ్రహములుగలవారును, నగుసిద్ధులచేఁబ్రతిదినమునందును స్నానకాలమునందు గలుషపెట్టఁబడిన యుదకములుగలదియగు నీమందాకినీనదియొక్కయుదకమునందు నాతోఁగూడ స్నానమును జేయుము. ఓసీతా! నీవునాతోఁగూడఁ జెలికత్తెలతోవలెనే, కమలములను, తెల్లదామరపూలను, ముంచుచునీమందాకినీనదియొక్క యుదకమునందుమునుఁగుము. మఱియు నోసీతా! నీవీయడవిలోనిమృగములను పురజనులనుగాను, చిత్రకూటపర్వతమును అయోధ్యాపట్టణముగాను, మందాకినీనదిని సరయూనదినిగాను నెంచుము. జనకమహారాజపుత్రికయగు నోసీతా! ధర్మాత్ముఁడగులక్ష్మణుఁడు, నాయొద్దనున్నాఁడు. నీవునాకనుకూలురాలవైయున్నావు. కావున మీరిద్దఱును నాకుఁబ్రియమునుగలుగఁజేయుచున్నారు కాఁబట్టి నేనునీతోడను, లక్ష్మణునితోడనుగూడుకొని మూడుపూటలయందును నీమందాకినీనదియందు స్నానమును జేయుచుఁ గందమూలఫలాదులను భుజించుచు అయోధ్యాపట్టణమును గుఱించియును, రాజ్యమునుగుఱించియును దుఃఖమును బొందను. మిక్కిలిమనోహరమైనదియును, జంకలయొక్క సమూహముచేఁ బ్రకాశించుచున్నదియును, ఏనుఁగులు, సింహములు, వానరములు, మొదలగుజంతువులచేఁ బానముసేయఁబడిన యుదకముగలదియును, చక్కఁగాఁబుష్పించి వృక్షములచే నలంకరింపఁబడినదియును నగు నీమందాకినీనది సకలజనులకును మార్గాయాసమును బోఁగొట్టును. కావున మనకుఁగలిగియున్న యాయాసమును నీమందాకినీనది పోఁగొట్టఁగలదనియె. ఇవ్విధముగ రాముఁడ నేకవిధములుగ మందాకినీనదీవిషయముగా యుక్తములగు వచనములను బలికి యాసీతాదేవితోఁగూడ మందాకినీనదీతీరమునందు సంచరించుచుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొంబదైదవసర్గముగిసెను.

భరతుఁడువచ్చుటను లక్ష్మణుఁడుచూచిభరతుని జంపవలయునని రామునితోఁ జెప్పుట.

అట్లు రాముఁడు మిథిలానగరాధిపతియగు జనకమహారాజునకుఁబుత్రికయైన సీతాదేవికి మందాకినీనది మొదలగువానిని జూపి చిత్రకూటపర్వతముయొక్క యుపరిభాగమునందుఁ గూర్చుండి రుచిగలమాంసమును బెట్టి సీతాదేవికిమహాసంతోషమును గలిగించుచుండె. మఱియు ధర్మాత్ముఁడైన యారాముఁ డిట్లనియె.

ఓసీతా! ఈమాంసము మిగులఁబావనమైనదనియును, మిక్కిలిరుచిగలదియనియును, ఈమాంసమగ్నిచేతఁ బక్వముచేయఁబడినదనియును జెప్పుచు నాచిత్రకూటపర్వతమునందుఁ గూర్చుండె. అవ్విధముగఁ గూర్చున్న రాముఁడు, తనవద్దకువచ్చుచున్న భరతునియొక్క సేనలోని కలకలధ్వనిని వినియె. మఱియు సైన్యముయొక్క త్రొక్కుడుచే లేచిన దుమ్మును జూచె. అప్పుడాపరాగధ్వనులుఆకాశమునందుఁ గూడవ్యాపించియుండె. ఆసమయమునందు ఆగొప్పధ్వనిచే భయపఱుపఁబడినవియును, తఱుమఁబడినవియును నై మదపుటేనుఁగుల గుంపుతోఁగూడ మదించినమగయేనుఁగులు నానాదిక్కులకుఁ బరుగిడుచుండె. అట్టియెడ రాముఁడు ఆసేనలోనుండివచ్చుచున్నదియును, గొప్పదియును నగు కలకలధ్వనిని వినియె. మఱియు నానాదిక్కులకు భయపడి పరుగెత్తుచున్న మదపుటేనుఁగులగుంపులనున్నుజూచె. అవ్విధముగఁ బరుగెత్తుచున్న యేనుఁగులసముదాయమును జూచియును, సైన్యముయొక్క ధ్వనిని వినియును మహాశ్చర్యమును బొందుచు నధికమగు తేజస్సుచేఁ బ్రకాశించుచున్న సుమిత్రాదేవిపుత్రుఁడగు లక్ష్మణునిజూచి యిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! ఇదేమియాశ్చర్యము. ఇక్కడఁ జూడుము. నీమహాలకముగ సుమిత్రాదేవిచక్కని సంతానముగలదయ్యె. భయంకరమగు ఉరుముతో సమానమైన

దియును, జనసంకులమువలన గలుగునట్టిదియునునగు నోకధ్వనివినఁబడుచున్నది. చక్కఁగావినుము. మఱియునో లక్ష్మణా! మిగులగొప్పదగు నీయరణ్యమునందు నేనుఁగులగుంపును, మహిషములును, సింహములును, మఱియునితరములగు మృగములును, తరముఁబడిమిగులవేగముగాఁ బరుగెత్తుచున్నవి. ఇదియంతయును జూడగా, రాజో, లేకరాజసమానుడగు వాడెవ్వడో వేటకొఱకుయీవనమునకువచ్చియుండునని తోఁచుచున్నది. లక్ష్మణా! అట్లుగాదేనిగొప్పదగు క్రూరమృగమేదైనను సంచరించుచున్నది. ఈ విషయమును సర్వమును దెలిసికొనుటకుఁ బ్రయత్నముసేయుము. తమ్ముడా! లక్ష్మణుఁడా! ఈచిత్రకూటపర్వతము పక్షులకుఁగూడఁ బ్రవేశింపసలవిగానిదైయున్నది. కావుననిది యేమియో విచారించి సర్వమును నతిశీఘ్రముగఁ జక్కఁగాఁదెలిసికొనుము. అనిచెప్పె. అంతటనాలక్ష్మణుఁడు మిగులఁద్వరతోఁగూడి చక్కఁగాఁబుష్పించినయేపిచెట్టుమీదనెక్కి సకలదిక్కులనుజూచి పిమ్మటఁదూర్పుదిక్కునుజూచె. అంతటనాదిక్కును వదలియుత్తరాభిముఖుఁడైరథములు, గుఱ్ఱములు, ఏనుఁగులు, పదాతులు, మొదలగువానిచే నిండియున్నభరతుని సైన్యమునుసర్వమునుజూచె. గుఱ్ఱములు, ఏనుగులు, మొదలగువానిచే బూర్ణమైనదియును, రథములు, ధ్వజములు, మొదలగువానిచే నలంకరింపఁబడినదియును, నగునాసైన్యమును సర్వమునుజూచి రామునితోనిట్లనియె.

అన్నా, రాముఁడా! ఇఁకనగ్నిహోత్రము నార్పివేయుము సీతాదేవినిగుహలోనికిఁబంపుము. ధనుస్సునకునారిని గట్టిబాణములను సంధానముసేయుము. ఆలస్యమునుజేయకుమనినవిని పురుషోత్తముఁడగు నా రాముఁడు లక్ష్మణునితోనిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! ఈసైన్యమెవ్వనిదో చక్కఁగ నాలోచింపుము. నీకిసైన్యమెవనిదని తోఁచుచున్నదనియె. అంతటనాలక్ష్మణుఁడు మిగులఁగోపముగలవాఁడై, యగ్నిహోత్రునివలె నాసైన్యమును గాల్చవలయునను సంకల్పముతోనిట్లనియె.

అన్నా! రాముఁడా! కైకేయికిఁబుత్రుఁడగు భరతుఁడు పట్టాభిషిక్తుఁడై యికమీదటగూడనెన్నటికి నిరాటంకముగ రాజ్యమునుభుజింప వలయుననియెడు తలంపుగలవాఁడై మనలనుజంపుటకొఱకుఁ జతురంగసైన్యముతోఁగూడవచ్చుచున్నాఁడు. మఱియునో రాముఁడా! చూడుము. మిగులగొప్పదియును, కాంతిగలదియును, కొమ్మలుగలదియును, మిగులఁబెద్దదియగు బోదెగలదియును, నగు కోవిదారధ్వజము రథమునందిదుగో ప్రకాశించుచున్నది. మఱియునధికమగు నీసైన్యమునందు గొప్పదైనబోదెగలదియును, కొమ్మలుగలదియును, నగుకాంచనపుచెట్టు ధ్వజాకారముబొంది రథమునందుఁ బ్రకాశించుచున్నది. మఱియును గుఱ్ఱపురౌతులు గొందఱుమిగుల వేగముగల గుఱ్ఱములనెక్కి వచ్చుచున్నారు. మఱియునిదిగోచూడుము. మావటివారలు మదపుటేనుఁగుల నెక్కివచ్చుచున్నారు. కావుననీరుఁడవైన రాముఁడా! మనమిరువురమును ధనుర్బాణములనుధరించి యీచిత్రకూటపర్వతమును నాశ్రయింతము. అట్లుగాదేని యాయుధములనుధరించి సన్నద్ధులమై యీపర్వతమును నెక్కుదము. ఇవ్విధముగమనముంటిమేని యుద్ధమునందుఁ గోవిదారధ్వజముగల భరతుఁడు మనచేతియందుఁ జిక్కఁగలడు. సీతయును, నీవును, నేనును, ఎవ్వనినిమిత్తముగ మిగులగొప్పదియును, భయంకరమైనదియును, నగువ్యసనమును బొందుచున్నామో యట్టిభరతుని నిప్పుడుయుద్ధమునందుఁ జూతుముగదా? యని సంతోషము గలుగుచున్నది. రఘుకులోద్భవుఁడవైన యో రాముఁడా! నీవెవ్వనిమూలకముగ శాశ్వతమగు రాజ్యమునుండి భ్రష్టుఁడవైతివో యటువంటి పరమశత్రువుఁడును, వీరుఁడును, నగుభరతుఁడుయిప్పుడిక్కడకువచ్చుచున్నాఁడు. కావునవీఁడవశ్యముగనాచే జంపఁదగినవాఁడు. మఱియును భరతునిజంపుటవలన దోషమేమియును, గలుగనేరదు. "శ్లో॥ పూర్వాపకారిణాంత్యాగే నహ్యధర్మోవిధీయతే,, ముందుగానపకారమును జేసినవారలనువిడిచినను, చంపినను దోషములేదని శాస్త్రమువిధించుచుండుటచే దోషములేదని తోఁచుచున్నది. అదియునుగాక రఘుకులోద్భవుఁడవైన యో రాముఁడా! భరతుఁడు ధర్మమునువదలి ముందుగా మనకపకారమునుజేసె. కావునవీఁడువధ్యుఁడనుట కించుకైనను సందేహములేదు. వీనినిజంపిభూమిని సర్వమును నిష్కంటకముగఁ బాలింపుము. నేనిప్పుడుభరతునిజంపితినేని యట్టిభరతుని, తల్లియగు కైకేయి" యేనుఁగుచేత విరువఁబడిన వృక్షమునజూచినట్లుచూచి,, యధికమగుదుఃఖమును బొందఁగలదు. అట్లుకొంత సేపు దుఃఖమునుబొందినపిమ్మట బంధుమిత్రులు మొదలగువారలతోఁగూడఁ గైకేయినిజంపెదను. అంతటితో నీభూమియందుండు పాపాత్ములందఱును జచ్చినట్లగును. పాపులుచచ్చుటచే భూమియంతయును బాపరహితమైనదియగును మానదుఁడవగునో రాముఁడా! ఇప్పుడు నాకుఁ గలిగియున్న యీయధికమగు గోపమునీశత్రుసైన్యమును, నెండినవాముల యందగ్నినివైచిన విధముగఁబడ వేయుదు

ను, ఇప్పుడు తీక్ష్ణములగు నాబాణములచేత శత్రువులశరీరములననరికి చిత్రకూటపర్వతముయొక్క వనమునుసర్వమును నెత్తురుతోఁదడుపుదును. మఱియును దీక్ష్ణములగు బాణములచే నేనుఁగులయొక్కయు, గుఱ్ఱములయొక్కయు, మానవులయొక్కయు, హృదయములను భేదింతును. అట్లు చేసితినేని యామాంసమును సర్వమును క్రూరజంతువులుదిని పరమానందమునుబొందును. నేనుధనుర్బాణములను ధరించినందుకు సఫలమగును, భరతునిసేనతోఁగూడ వధించితినేని నాధనుర్బాణములు తృప్తిని బొందినవగునని లక్ష్మణుఁడు మిగులఁగోపముతోఁ జెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొంబదాఱవసర్గముగిసెను.

రాముఁడులక్ష్మణునకు భరతునిజంపఁగూడదని ధర్మమునుపదేశించుట.

అట్లుచెప్పినమాటనువిని రాముఁడు, యుద్ధమునకు సన్నద్ధుఁడైనవాఁడును, క్రోధోద్రిక్తుఁడునునగు లక్ష్మణునిమంచిమాటలచే నూరడించిమృదు మధురవచనములతో నిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! ధనుర్ధారులలో నుత్తముఁడును, పండితులలో నుత్తముఁడును, నగుభరతుఁడు స్వయముగానే యిక్కడకు వచ్చియున్నాఁడు. భరతుఁడేయిక్కడకు వచ్చియుండఁగా, ధనుస్సుతోఁ బ్రయోజనమేమి? డారువారుతోఁ గూడినకత్తివలనఁ బ్రయోజనమేమిగలదు. నేనుతండ్రియగు దశరథమహారాజుయొక్క సత్యమునుబాలించెదనని ప్రతిజ్ఞనుజేసితిని. ఇటువంటినేను భరతునిజంపితినేని లోకులందఱును నన్నునిందింతురు. అట్టిలోకనిందకోర్చి యీరాజ్యమువలననే నేమిలాభమును బొందుదును. బంధువులను, మిత్రులను, చంపివారిద్రవ్యమును భుజించుటకు నాకిష్టములేదు. బంధువులును, మిత్రులును, నశించుటవలనఁ గలిగెడుద్రవ్యమును విషముతోఁగూడిన యన్నమునుగాఁదలఁచెదను. తమ్ముఁడా! లక్ష్మణా! నేను ప్రతిజ్ఞనుజేసి సత్యముగాఁ జెప్పెదను, ధర్మార్థములను, భూమిని, మీకొఱకుఁ గోరుచున్నానుగాని నాకొఱకుఁ గాను. మఱియునో లక్ష్మణా! యీయాయుధసాక్షిగాఁ దమ్ములగు మీకుధనమును జేర్చుటకొఱకును, మిమ్ములసుఖపెట్టుటకొఱకును నేనురాజ్యమును గోరుచున్నాను. నానిమిత్తముగఁ గోరడములేదు. కావుననావచనమును సత్యముగానమ్ముము. మంచిస్వభావముగల యోలక్ష్మణా! నాలు ౪ సముద్రములవఱకునుగల యీభూమియంతయును నన్యాయముగ లభించినయెడల నేనంగీకరించువాఁడనుగాను. మఱియునో లక్ష్మణా! యన్యాయముచే దొరికెనేని యింద్రత్వమునుగూడ గోరువాఁడనుగాను. మానదుఁడవగువో లక్ష్మణుఁడా! నీకును, భరతునకును, శత్రుఘ్నునకును లేక, నాకుమాత్రము సుఖముగలిగెనేని నేనుసంతోషమును బొందువాఁడనుగాను. మఱియునట్టి సుఖము తగులబడిపోవుగాక. అన్నదమ్ములందు వాత్సల్యముగలవాఁడును, నాప్రాణములకంటె నాకుఁబ్రియమైనవాఁడును, నగుభరతుఁడు, జడలనునారచీరలనుధరించి సీతాలక్ష్మణులతోఁగూడ నరణ్యమునకువచ్చుటనువిని కులధర్మమునుదలఁచికొనుచు నాయందలిస్నేహముచే నాక్రమింపఁబడిన హృదయముగలవాఁడును, వ్యాకులమైన యింద్రియములుగలవాఁడునైనన్నుఁ జూచుటకిక్కడకు వచ్చెనని నేనుతలఁచుచున్నాను. ఇంతయగాక భరతుఁడుమఱియొక యభిప్రాయముతో వచ్చెనని నాకుఁదోచదు. లక్ష్మణా! శ్రీమంతుఁడగు భరతుఁడుతల్లియగు కైకేయిమీఁద నధికముగాఁగోపమునుబొంది కఠినవచనములను బలుకుచు (అనఁగాఁదిట్టుచు) తండ్రియగుదశరథునిసమాధానపఱచి నాకుమరల రాజ్యమునిచ్చుటకు వచ్చియున్నాఁడని నేనుదలఁచుచున్నాను ఇప్పుడుమనము రాజ్యభ్రష్టులమై యరణ్యమునకు వచ్చియుండుటచే మనయొద్దకువచ్చి మనలనోదార్చుటకుఁ దగినకాలమైయున్నది. కాఁబట్టిభరతుఁడు మనలనూరార్చుటకై యిక్కడకువచ్చుచున్నాఁడు. ఈభరతుఁడు మనవిషయమై మనస్సునందుఁగూడఁ గొంచెమైననపకారమును జేయువాఁడుగాఁడు. లక్ష్మణా! భరతుఁడిదివఱకెప్పుడైనను నిన్నుఁగుఱించితిట్టెనా? లేకనీకేమైననపకారమును జేసెనా? నీవేమినిమిత్తముగ భరతునివిషయమై యివ్విధముగా సందేహించుచున్నావు. నీవుభరతునిగుఱించి యప్రియమయిన వాక్యమునుకఠినముగా మాట్లాడఁదగినవాఁడవుగావు. భరతునకేమైన నపకారమును జేసితివేని నాకపకారమును జేసినవాఁడవగుదువు. లక్ష్మణా! ఎట్టియాపదవచ్చినను, తండ్రులుపుత్రులను జంపుదురా? లేక ప్రాణభూతుఁడగు తమ్మునిఁజంపువాఁడెవ్వఁడైనఁ గలఁడా? ఒకవేళనీకు రాజ్యముగావలయునని నీవివ్విధముగాఁ బలికినయెడల రాజ్యమునునీకివ్వుమని నేనుభరతునితోఁ జెప్పెదను. నీవిఁకమీఁదఁగోపమును బొందకుము. మఱియునో లక్ష్మణా! నేనురూఢిగా రాజ్యముమలక్ష్మణునకివ్వుమనిభరతునితోఁ జెప్పితినేని భరతుఁడవశ్యముగా నంగీకరించి లక్ష్మణునకు రాజ్యమునిచ్చెదనని చెప్పఁగలఁడని రాముఁడులక్ష్మణునితోఁ జెప్పె. ధర్మస్వ

భావముగలవాఁడును, నగ్రజుఁడును, నగు రాముఁడవ్విధముగాఁ జెప్పినమాటలనువిని లక్ష్మణుఁడపరిమితమగుసిగ్గునుబొందెను. మఱియునావాక్యములనువినియధికముగాలజ్జనుబొందితలవంచుకొనిరామునిజూచియిట్లనియె.

పూజ్యుఁడవైనరాముఁడా! మనతండ్రియగు దశరథుఁడేస్వయముగానిన్నుఁజూచుటకువచ్చుచున్నాఁడనితలఁ చెదననియె. అవ్విధముగాసిగ్గుచేతఁ దలఁవంచుకొనిచెప్పుచున్నలక్ష్మణునిఁజూచిరఘుకులోద్భవుఁడగురాముఁడిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! మహాబాహుఁడగు దశరథమహారాజేమనలఁ జూచుటకిక్కడకువచ్చుచున్నాడని నాకుఁగూడఁదోఁచుచున్నది. మఱియు సుఖమునుబొందుటకుఁ దగినమనము దండకారణ్యమునకువచ్చి దుఃఖమునుబొందుచున్నామనితలఁచిమనలను మరల నయోధ్యాపట్టణమునకుఁ దీసికొనిపోవుటకుమనతండ్రియగు దశరథుఁడేవచ్చెనని తోచుచున్నది. అట్లుగాకేనియోలక్ష్మణా! రఘుకులోద్భవుఁడును, శ్రీమంతుఁడును, మనకుఁదండ్రియునునగు దశరథమహారాజుసర్వకాలములయందు మిగులసుఖమునుబొందఁదగినయీసీతనైనను దీసికొనిపోఁగలఁడని తోఁచుచున్నది. పరాక్రమవంతుఁడవైనయోలక్ష్మణా! సత్కులమునందుఁ బుట్టినవియును. మనోహరములును, వాయువేగమువంటివేగముగలవియునునగు రెండుడత్తమాశ్వములు ప్రకాశించుచున్నవి. చూడుము. లక్ష్మణా! మిక్కిలిబుద్ధిమంతుఁడును, ముసలివాఁడును, మనకుఁదండ్రియును, నగుదశరథమహారాజుయొక్క, గొప్పశరీరముగల శత్రుంజయమనే పేరుగలఏనుగు మనకభిముఖముగా వచ్చుచున్న సేనయొక్కయగ్రభాగమునందుఁబ్రకాశించుచున్నది చూడుము. మహాబాహుఁడవైనయోలక్ష్మణా! లోకమునందు గౌరవింపఁబడినదియును, మిక్కిలితెల్లనిదియును, శ్రేష్ఠమైనదియును, నగుమనతండ్రియొక్కగొడుగు నీసేనాగ్రమునందుఁ బ్రకాశించడములేదు. ఇందువలననామనస్సునందుసందేహముగలుగుచున్నది. కాఁబట్టిలక్ష్మణా! నీవుశీఘ్రముగవృక్షాగ్రమునుండి నామాటనువినిదిగుమనియె. అంతటయుద్ధములయందుజయమునుబొందునట్టి లక్ష్మణుఁడుధర్మాత్ముఁడగు రామునిమాటనువిని చెట్టుయొక్కయుపరినుండిదిగిచేతులనుముకుళించుకొని రామునియొక్కప్రక్కకువచ్చినిలిచియుండె. అంతనక్కడభరతుఁడు, రామునియొక్కయాశ్రమమునకుబాధలేకుండునట్లు చిత్రకూటపర్వతమునకుఁజుట్టునునిలుచునట్లు తనసైన్యమున కాజ్ఞయిచ్చె. ఏనుఁగులచేతను, గుఱ్ఱములచేతను, నిండియున్నయాభరతునిసైన్యము, చిత్రకూటపర్వతమునకుఁ జుట్టునువాఱుక్రోసులదూరమువఱకును వ్యాపించియుండె. నీతిమంతులలోనుత్తముఁడగు భరతునియొక్కసైన్యమంతయునునతనియాజ్ఞనుబొందిధర్మమునసుసరించి తనదర్పమునుసర్వమునువదలి రామునియనుగ్రహమును సంపాదించుకొనుటకుఁజిత్రకూటపర్వతముచుట్టునుబ్రకాశించుచుండె

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి డెబ్బదితొమ్మిదవసర్గముముగిసెను.

భరతుడు మొదలగువారుచిత్రకూటపర్వతమునందు రామునియొక్క ఆశ్రమమును వెదకుట.

అంతటఁబురుషశ్రేష్ఠుఁడగు భరతుఁడావిధముగఁ దనసైన్యమునునివసింపఁజేసి గురువాక్యానుసారముగఁ బ్రకాశించుచున్నవాఁడును, కకుత్స్థుని కులమునందుఁబుట్టినవాఁడునునగు రామునియొద్దకుఁ బాదచారియైపోవుటకు యత్నించె. అట్లుతనయాజ్ఞాప్రకారము సైన్యమంతయునుతగినప్రదేశములయందు విడిదలను జేర్పఱచుకొనినపిమ్మట నాభరతుఁడుతనకుఁ దమ్ముఁడగుశత్రుఘ్నునితోనిట్లనియె.

సత్స్వభావముగల తమ్ముఁడా! శత్రుఘ్నా! నీవు బోయవారలతోడను, మఱియునితరులగు నీమానవులతోడను గూడుకొనియతిశీఘ్రముగ నీవనమునుసర్వమును వెదకుటకుఁ బ్రయత్నమును జేయుము. గుహుఁడుధనుర్బాణములనుధరించినయనేకవేలబంధుజనులతోఁగూడ నీయరణ్యమునందుఁ గకుత్స్థునివంశమునందుఁ బుట్టిన రామలక్ష్మణులను వెదకును. నేనుపురజనులతోడను, మంత్రులతోడను, గురువులతోడను, బ్రాహ్మణులతోడను గూడుకొనిపాదచారినై యీవనమునందుసంచరించుచు రామలక్ష్మణులను వెదకెదను. తమ్ముడా! శత్రుఘ్నా! మహాబలులగు రామలక్ష్మణులనైనను, మహానుభావురాలగుసీతనైనను, చూచితేనేగాని నాకుశాంతిగలుగదు. చంద్రునితోసమానమైనదియును, శుభకరమైనదియును, పద్మపత్రములవంటినేత్రములుగలదియునునగు రామునియొక్కముఖమునుజూచితేనేగాని నాకుశాంతిగలుగనేరదు. రాజచిహ్నములుగల వింజామరలతోఁగూడిన రామునియొక్క పాదములనునాశిరస్సుమీఁదధరించితినేగాని నాకుశాంతిగలుగనేరదు. తాతముత్తాతలనాటనుండి సంప్రదాయక్రమముగవచ్చుచున్నరాజ్యమును బాలించుటకుఁదగినరాముఁడు పట్టాభిషేకోదకముచేఁదడుపఁబడితేనేగాని నాకుశాంతిగలుగనేరదు. అధికమైనకాంతిగలదియును, పద్మపత్రములవంటినేత్రములతోఁగూడుకొనినదియును, చంద్రునితోసమానమైనదియును, నగు రామునిముఖమునుసర్వకాలములయందును జూచు

చుండుటచేలక్ష్మణుఁడుకృతార్థుఁడయ్యెనని తలఁచెదను. జనకమహారాజునకుఁబుత్రికయును, మహానుభావురాలును నగుసీతాదేవిసముద్రమువఱకునుగల భూమికిభర్తయగు రామునితోఁగూడసర్వకాలములయందును నెడఁబాయక సంచరించుచుండుటచేఁ గృతార్థురాలయ్యెనని తలఁచెదను. హిమాలయపర్వతముతో సమానమైనదియును, మిగులసుందరమైనదియును, నగునీచిత్రకూటపర్వతమునందు కకుత్థ్సవంశమునందుఁ బుట్టినరాముఁడు నందనవనమునందుఁగుబేరుఁడు సంచరించినవిధముగా సంచరించుచున్నాఁడు. శస్త్రవంతులలోనుత్తముఁడును, తేజోవంతులలోనధికుఁడునునగు రాముఁడు సంచారమును జేయుటచేతను సర్పములు మొదలగు క్రూరజంతువులచేతను సేవింపఁబడుచున్నదిగనుకనే మిగులగహనమగు యరణ్యము ధన్యమైనదయ్యెనని తలఁచెదననియె. పురుషోత్తముఁడును, గొప్పవగుభుజములుగలవాఁడును తేజోవంతులలో నుత్తముఁడును, నగుభరతుఁడీవిధముగాఁ జెప్పి పాదచారియైగొప్పదయినయాదండకారణ్యమునందుఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించికొండదరియలయందుఁబుట్టినవియును, మిగులమనోహరముగాఁ బుష్పించియున్నవియునునగు వృక్షములయొక్క మధ్యమార్గమునననుసరించి మనోహరముగమాటలాడునట్టియాభరతుఁడుపోయె. అట్లుపోయిపోయియాచిత్రకూటపర్వతమునెక్కియందలియేపిచెట్టువద్దికిబోగానేరామాశ్రమమునందలి యగ్నివలనబయలువెడలుచున్న పొగను జూచె. అట్లుచూచినపిమ్మటనాభరతుఁడు సకలబంధువులతోఁగూడ రాముఁడిక్కడనున్నాఁడని తెలిసికొని సముద్రముయొక్కయవతలిగట్టును జూచి సంతోషమును బొందువానివిధముగఁ బరమానందమును బొందె. పిమ్మట రామునివెదకుటకువచ్చిన సైనికులనందఱ నక్కడనే నిలిపి పుణ్యాత్ములతోఁగూడన యారామునియొక్క యాశ్రమమునకు మహాత్ముఁడగు నాభరతుఁడు గుహునితోఁగూడఁ బాదచారియైపోయె.

అట్లు శ్రీమదయోధ్యాకాండమునందలితొంబదెనిమిదవ సర్గముగిసెను.

భరతుఁడు మొదలగువారు రాముని దర్శించుట.

అవ్విధముగా సైన్యమంతయును విడిసినతోడనే యప్పుడు భరతుఁడు మిక్కిలికుతూహలముగలవాఁడై ముందుగా శత్రుఘ్నుఁడు చూచునట్లు నియమించుచు సన్నయగు రామునిఁజూచుటకు బయలువెడలిపోయె. అట్లుబయలువెడలిపోవుచు వసిష్ఠమహామునినిబిలిచి గురువులయందు వాత్సల్యముగలయాభరతుఁడిట్లనియె.

అయ్యా వసిష్ఠమునివర్యా! నాతల్లులనందఱనుశీఘ్రముగఁదీసికొనిరమ్మని చెప్పి తానతివేగముగనడచిపోయె. అప్పుడు సుమంత్రుఁడు శత్రుఘ్నునివెంబడించె. అట్లుపోవుచు నాసుమంత్రుఁడు రామునిఁజూతునుగదాయని భరతుఁడుపొంగినవిధముగాఁ దానుగూడమహానందమును బొందె. అవ్విధముగా శ్రీమంతుఁడగుభరతుఁడుపోవుచుఁ దపోవంతుల గృహముతో సమానముగనున్నదియును, ఆకులచేతనిర్మింపఁబడినదియునునగు రామునిపర్ణశాలను జూచె. పిమ్మట నాపర్ణశాలయొక్క సమీపమునందు, రాత్రికాలమునఁ జలిమంటను వేసికొనుటకు గావిరిచికట్టెలుకట్టియుంచఁబడిన కట్టెలమోపులను, దేవపూజార్థముగఁ గోయఁబడి రాసులురాసులుగానుంచఁబడిన పుష్పరాసులనుచూచె. మఱియు నాభరతుఁడు, తపోవనమునుబొందినట్టి రామలక్ష్మణులయొక్క వృక్షములకొమ్మలయందారుటకుఁగట్టిననారచీరలను జూచె. ఇంతయగాక చలిమంటను వేసికొనుటకు సంపాదింపఁబడినజింకలయొక్కయు, మహిషములయొక్కయు, నేరుపిడకలయొక్కగొప్పగొప్పరాసులను నయ్యరణ్యమునందుఁ జూచె. అంతటమహాబాహుఁడును, కాంతిమంతుఁడును, నగునాభరతుఁడుపోవుచుఁబరమానందమును బొంది శత్రుఘ్నునితోడను, మంత్రులతోడను, మఱియునితరులతోడను నిట్లనియె.

మానవశ్రేష్ఠులారా! భరద్వాజమహామునిప్రదేశమును మనకుఁజెప్పెనో యాప్రదేశమునకుమనము వచ్చితిమని తలఁచుచున్నాను. మఱియుమందాకినీనదియిక్కడకు సమీపముననున్నదని తలఁచుచున్నాను. ఇదిగో చూడుఁడు. లక్ష్మణునిచే సంధ్యాకాలాదికాలములయందుఁబోవుటకువచ్చుటకును గుర్తుగానుండుటకువృక్షాగ్రములయందుఁ జీరెగుడ్డలుకట్టఁబడియున్నవి. ఇవిలక్ష్మణునిచేత కట్టఁబడినవని యెంచెదను. మఱియులక్ష్మణుఁడు, ఉదకములు మొదలగునవి రాత్రులయందుఁ దేవలసివచ్చెనేని యీగుర్తులనుబట్టి మార్గమునుగనుగొనుచుండునని తెలుపుచున్నది, పెద్దపెద్దవగు దంతములుగలవియును, మిగులబలముగలవియును, నగు నేనుఁగులు పరస్పరమును గర్జించుచు నీచిత్రకూటపర్వతముయొక్కపార్శ్వమునందుసంచరించుచుండునని తెలుపుచున్నది. మఱియునో మానవోత్తములారా! తపోవంతులగుమునులందఱును, వనములయందుసర్వకాలములయందును, ఏయగ్నిహోత్రమును సేవించుచుందురో యట్టియగ్నిహోత్రునియొక్క ధూమముదట్టముగాఁ గనఁబడు

చున్నది చూడుడు. మఱియు నో మానవశ్రేష్ఠులారా! నేను మిగుల సంతోషముగలవాఁడనై పురుషోత్తముఁడును, సర్వోత్తమమగు నుపదేశమును జేయువాఁడును, మహర్షివలె నున్నవాఁడును, పూజ్యుఁడును, నగు రాముని నికట జూడఁగలను. ఇఁక బిన్న బటుఁనమాత్రములోఁ జిత్రకూటపర్వతమునకుఁ బోఁగలవు. పోయి మందాకినీనదిని బొందఁగలమని భరతుడు జెప్పి మఱియు నిట్లని యె.

జనులకుఁ బ్రభువైనవాఁడును, పురుషోత్తముఁడును నగు రాముఁడు భూమియందు వీరాసనము నవలంబించి కూర్చున్నాఁడు. ఛీ నాజన్మము కాల్పనా? అయ్యో, లోకములకుఁ బ్రభుఁడును, గొప్పదగు తేజస్సుగలవాఁడును, రఘుకులోద్భవుఁడును నగు రాముఁడు నా నిమిత్తముగ వ్యసనమును బొందినవాఁడయ్యె. ఇంతియగాక సకలకామములను వదలిపెట్టి వనమునందుండుచున్నాఁడు. ఇందువలన లోకులందఱును నన్ను నిందించుచున్నారు. ఇవ్విధముగ లోకనిందకుఁ బాత్రుఁడనైన నేను సీతారామలక్ష్మణులయొక్క పాదములయందుఁబడి వారలయనుగ్రహము సంపాదించుకొనియెదను. రాముఁడు ప్రసన్నుఁడగుటకుఁ బాదాభివందనమును జేసెదనని యె. ఇట్లు దశరథరాజనందనుఁడగు భరతుఁడయ్యరణ్యమునందు విలపించుచు ఏపిచెట్లయొక్కయు, తాటిచెట్లయొక్కయు, ఇనుమద్దిచెట్లయొక్కయు నాకులచే తేఁకప్పఁబడినదియును, మిగుల విపులమైనదియును, మెత్తని దర్భలచే బఱుపఁబడినదియును, యజ్ఞములయందలి యగ్నివేదికవలె నున్నదియును, దేవేన్ద్రుని యాయుధముతో సమానములైనవియును, నూరుపలముల భారముగలవియును, మిగుల బలముగలవియును, బంగారముచేఁ బూతపూయఁబడిన వెనుకటి భాగములుగలవియును, శత్రువులను బాధించుటయందు మిగుల సామర్థ్యముగలవియును, నగు ధనుస్సులచేఁ బ్రకాశింపఁబడుచున్నదియును, సూర్యకిరణములతో సమానమైన కాంతిగలవియును, మిగుల భయంకరములైనవియును, అంబులపొదియందుఁ బ్రవేశపెట్టఁబడినవియును నగు బాణములచేఁ బ్రజ్వలించుచున్న నోళ్లుగల సర్పములచేఁ బ్రకాశించుచున్న భోగవతీపట్టణమువలెఁ బ్రకాశించుచున్నదియును, బంగారముచే నిర్మింపఁబడిన యొరలుగల ఖడ్గములచేఁ బ్రకాశించుచున్నదియును, బంగారపు చుక్కలచే మిగుల విచిత్రముగఁ జేయఁబడిన డాలువారులచేఁ బ్రకాశించుచున్నదియును, "వింటినారియొక్క దెబ్బ తగులకుండునట్లు నిర్మింపఁబడిన హస్తకవచములచేఁ బ్రకాశించుచున్నదియును, వ్రేళ్లకు వేసికొను కవచములతోఁ గూడినదియును "సింహములుండునట్టి గుహయందుఁ బ్రవేశించుటకు నితరమృగములకలవి కానివిధముగ" నలవిగానిదై ప్రకాశించుచున్నదియును, మిగులఁ బూజ్యమైనదియును, పుణ్యకరమైనదియును, మనోహరమైనదియును, నగు పర్ణశాలను జూచె. అంతట నాభరతుఁడు రామాశ్రమమునందలి యాపర్ణశాలయందు మిగుల పవిత్రమైనదియును, మండుచున్న యగ్నిహోత్రముగలదియును, పావనమైనదియును, ఈశాన్యభాగమునందుఁ బల్లముగానున్నదియును, నగు నగ్నివేదికను జూచె. చూచినపిమ్మట నాభరతుఁడు, పర్ణశాలయందుఁ గూర్చున్నవాఁడును, జడలసముదాయమును ధరించినవాఁడును, గురుఁడును నగు నారాముని యాక్షణమునఁ జూచెను. మఱియు నుగ్ర కృష్ణమృగచర్మమును ధరించినవాఁడును, నారచీరలే వస్త్రములు గాఁగలవాఁడును, నగ్నిహోత్రమువలె నంతటను బ్రకాశించుచున్నవాఁడును, సింహముయొక్క మూపురమువంటి భుజశిరస్సులుగలవాఁడును, గొప్పవగు భుజములుగలవాఁడును, తెల్లతామరలతో సమానములగు నేత్రములుగలవాఁడును, సముద్రము వఱకుగల భూమికి భర్తయును, ధర్మాచరణను జేయుచున్నవాఁడును, గొప్పవగు భుజములుగలవాఁడును, స్థిరముగానున్నవాఁడును, నగు బ్రహ్మదేవునివలె దర్భలచే నిర్మింపఁబడిన స్థండిలమునందు సీతాలక్ష్మణులతోఁ గూడ గూర్చున్నవాఁడును నగు రామునిఁ జూచె. ధర్మాత్ముఁడును, శ్రీమంతుఁడును, దుఃఖశోకములుగలవాఁడును నగు నాభరతుఁడు రామునిఁ జూచి మిగుల వేగము గాఁ బరుగెత్తె. అవ్విధముగ నైకేయికొడుకుఁడగు భరతుఁడు పరుగెత్తి మిగుల దుఃఖముచేఁ బీడింపఁబడినవాఁడై రామునిఁ జూచి కన్నీళ్ళతో మిక్కిలి దీనమైన మాటలుగలవాఁడై దుఃఖమును సణఁచుకొనఁజాలనివాఁడయ్యెను, ధైర్యము నవలంబించి యిట్లని యె.

అయ్యా; సర్వోత్తమమగు సభయందు సకలజనులచేతను మిగుల మర్యాదలతో సేవింపఁదగినవాఁడును, నా కన్నయును నగు రాముఁడు, వనమునందుఁ బుట్టిన జింకలు మొదలగువానిచే సేవింపఁబడుచున్నాఁడే? మఱియును బూజ్యుఁడగు నీరాముఁడు పూర్వము మిగుల వెలగలవియును, ననేకవేల ద్రవ్యసంఖ్యగలవియును నగు వస్త్రములచే నిర్మింపఁబడిన శయ్యలయందు నివసించుటకుఁ దగినవాఁడైయుండె. అట్టి రాముఁడిప్పుడు ధర్మమునాచరించుచు మృగచర్మమునందు నివసించుచున్నాఁడు గదా? అయ్యో, రాముఁడివ్విధము కష్టమును నానిమిత్తముగఁ బొందుచున్నాఁడే? నేనేమి చేయుదునని వ్యసనమును బొందె. అట్లు వ్యసనమును బొంది మఱియు నిట్లని యె.

మానవశ్రేష్ఠులారా! ఈరాముఁడు పూర్వమునందు

నానావిధములైనవియును, మిగులఁబరిమళముగలవియును, చిత్రములైనవియునునగు పుష్పములమాలికలను శిరస్సునందుధరించుచుండును. అటువంటిమహానుభావుఁడిప్పుడీ జడలనుఏవిధముగా ధరించుచున్నాఁడోగదా? అనేకవిధములగుయజ్ఞములను శాస్త్రోక్తప్రకారముగఁజేయుటచే ధర్మమును సంపాదింపఁదగినరాముఁడిప్పుడువానప్రస్థునివలెశరీరాయాసముచే ధర్మమునుసంపాదించుచున్నాఁడు. సర్వోత్తమమయినమంచిగంధమును బూసికొనుటకుఁదగిన రామునిశరీరమునం దిప్పుడుపరాగము కప్పుకొనియున్నది. అయ్యో, యెంతకష్టము ననుభవించుచున్నాఁడు. సుఖము ననుభవించుటకుఁదగిన రాముఁడు నానిమిత్తముగదుఃఖము ననుభవించుచున్నాఁడు. పరమఘాతకుఁడనైన నాయొక్క నిందితమైన యీజన్మముకాల్పనా, యనియధికముగవ్యసనమును బొందె. మఱియుదీనుఁడును, చెమటతోఁగూడినపద్మమువంటి ముఖముగలవాఁడును, నైయాభరతుఁడు రాముని పాదమునుబట్టుకొనఁబోయి యంతదగ్గరకుఁబోఁజాలక యేడ్చుచుఁగ్రిందఁబడియె. మఱియురాజపుత్రుఁడును, గొప్పబలముగలవాఁడును, నగునాభరతుఁడుదుఃఖముచే నధికముగాఁబీడింపఁబడినవాఁడై అన్నా! ఆర్యా! యనిపలికియంతటితో దుఃఖముప్పొంగివచ్చుచుండుటచే నేమియున బలుకనేరక యూరకుండె. మఱియునాభరతుఁడు గన్నీటచే వ్యాప్తమైనకంఠధ్వనిగలవాఁడై కీర్తివంతుఁడగు రామునిజూచి పూజనీయుఁడా! యనిపిలిచి మిగిలినవిషయమును జెప్పుటకు శక్తిలేనివాఁడయ్యె. ఆసమయమునందుశత్రుఘ్నుఁడుగూడ రోదనమును జేయుచు రాముని పాదములయందుఁబడి నమస్కారమును జేసె. అప్పుడు రాముఁడు వారలనిరువురను నాలింగనమును జేసికొని కన్నీళ్లనువదలె. మఱియు నాసమయమునందు రాజనందనులగు నారామలక్ష్మణులు దండకారణ్యమునందు సుమంత్రునితోడను, గుహునితోడను జేరికొనినవారలై శుక్రబృహస్పతులతోఁ గలిసికొనిన సూర్యచంద్రులవలెఁ బ్రకాశించిరి. మదించినమగయేనుఁగులతో సమానులగు నారాజులందఱును గొప్పదగుదండకారణ్యమునందుఁ జేరికొనిన నప్పుడవ్వనమునందు సంచరించువారందఱునుజూచి సంతోషహీనులైయపరిమితముగఁ గన్నీళ్లనువదలిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి తొంబదితొమ్మిదవసర్గ ముగిసెను.

—{ రాముడు దశరథుడు మొదలగువారియొక్క క్షేమంబడుగుట. }—

ఆసమయమునందు జడలనుధరించినవాఁడును, నారచీరలను ధరించినవాఁడును, చేమోడ్పుసుధరించియున్నవాఁడును, ప్రళయకాలమునందు గ్రిందఁబడిన సూర్యునివలెనున్నవాడును, చూచుటకునలవిగానివాఁడును, భూమియందుఁ బడియున్నవాఁడునునగు భరతునిరాముఁడుచూచె. అట్లుచూచి యారాముడు వెలవెలఁబోవుచున్నముఖముగలవాఁడును, దీనుఁడును, తోఁబుట్టువునునగు భరతుని, కొంతసేపటికిభరతునిగా దెలిసికొని యత్యాదరముతో బాహువులచేత నాభరతుని నాలింగనము సేసికొనియె. అంతట రఘుకులోద్భవుఁడగురాముడు భరతునిశిరస్సును ముద్దుపెట్టుకొని తొడమీఁదఁగూర్చుండబెట్టుకొని సమాహితుఁడైయిట్లనియె.

నాయనా! భరతుఁడా! నీవరణ్యమునకువచ్చితివే? మనకుదండ్రియగు దశరథమహారాజుఏమయ్యె. నీవువనమునకువచ్చుచుండుటను జూచినయెడల దశరథమహారాజు జీవింపఁడే? ఆమహానుభావుఁడుజీవించియుండఁగా నీవురాఁగూడదే? ఎట్లువచ్చితివి? ఆహా, చిరకాలమున కీయరణ్యమునందు చాలాదూరమునుండివచ్చిన నిన్నుఁజూచితిని. నాయనా! నీవేమికారణముగ నీయరణ్యమునకువచ్చితివి? నీవిక్రీడకువచ్చితివిగదా? దశరథమహారాజు బ్రతికియుండఁగా నిన్నువదలఁడే? అటువంటి దశరథమహారాజు బ్రతికియుండఁగానీవెట్లువచ్చితివి? మనకుఁదండ్రియగుదశరథమహారాజుబ్రతికియున్నాఁడా? నాయనా! దశరథమహారాజుదీనుఁడై దుఃఖముచేమరణమును బొందలేదుగదా? మంచిస్వభావముగలభరతుఁడా! బాలుడవైననీయొక్క శాశ్వతమైనరాజ్యము భ్రష్టముగాలేదుగదా? (అనగానీవుపసివాఁడవనితలఁచిశత్రురాజులువచ్చి నీరాజ్యమునపహరించినిన్నురాజ్యపదభ్రష్టునిగఁజేయలేదుగదా) నాయనా! భరతుఁడా! సత్యమైనపరాక్రమముగల తండ్రికిఁజక్కగాశుశ్రూషను జేయుచున్నావుగదా? సత్యముగాయుద్ధమును జేయువాఁడును, అనేకములగు రాజసూయయాగములను, అశ్వమేధయాగములను జేసినవాఁడును, ధర్మకార్యములయందు నిశ్చయముగలవాఁడునునగు దశరథమహారాజు క్షేమముగనున్నాఁడా? నాయనా! భరతుఁడా! బ్రాహ్మణులలో నుత్తముఁడును, విద్వాంసుఁడును, సర్వకాలములయందును ధర్మమునందేబుద్ధిగలవాఁడును, గొప్పదగుకాంతిగలవాఁడును, నిక్ష్వాకువంశపురాజుల కుపాధ్యాయుఁడునునగు వసిష్ఠమహామునిని మనపూర్వులందఱును, బూజించినవిధముగాఁ బూజించుచున్నావుగదా! నాయనా! ప్రసిద్ధురాలగు కౌసల్యాదేవియును, చక్కనిబిడ్డలనుగనిన సుమిత్రాదేవియును, పూజ్యురాలును, పట్టపు

దేవియునగు కైకేయియు, సుఖముగా నున్నారా? సంతోషమును బొందుచున్నారుగదా? వినయసంపదగలవాఁడును, సత్కులమునఁ బుత్త్రుఁడై పుట్టినవాఁడును, నానావిధములగు విద్యలను జదివినవాఁడును, కోపము లేనివాఁడును, సకలకార్యములను జక్కఁగఁ జూచి చేయించువాఁడు నునగు నీపురోహితుని నీవు చక్కఁగాఁ బూజించుచున్నావుగదా? భరతుఁడా! అగ్నిహోత్రకర్మలయందు నియోగింపఁబడినవాఁడును, శాస్త్రమునందుఁ జెప్పఁబడిన విధులను జక్కఁగఁ దెలిసినవాఁడును, మిగుల బుద్ధిమంతుఁడును, సరళమైన స్వభావము గలవాఁడును, నగు పురోహితుఁడు తగిన సమయములయందు హోమము చేయఁబడినదానిని, హోమము చేయఁదగినదానిని జక్కఁగఁ దెలుపుచున్నాఁడుగదా? నాయనా! దేవతలను, పితృదేవతలను, తల్లులను, పితృసమానులైన గురువులను, ముసలివారలగు వైద్యులను, బ్రాహ్మణులను చక్కఁగాఁ బూజించుచున్నావుగదా? నాయనా! శ్రేష్ఠములగు బాణములయందును, అస్త్రములయందును, మిక్కిలి సామర్థ్యము గలవాఁడును, రాజనీతి తెలుపునట్టి శాస్త్రమునందు మిగుల నేర్పుగలవాఁడును, శ్రేష్ఠమగు ధనుస్సును ధరించినవాఁడును, నగు ధనుర్వేదాచార్యునిఁ జక్కఁగా గౌరవించుచున్నావుగదా? నాయనా! భరతా! నీతో సమానులును, యుద్ధములయందధికమైన సామర్థ్యము గలవారును, నీతిశాస్త్రాదిశాస్త్రములను జక్కఁగఁ జదివినవారును, ఇంద్రియములమదమును నణఁచినవారును, సత్కులమునందుఁ బుట్టినవారును, పరుల యభిప్రాయములను చేష్టలచేతనే తెలిసికొనుటకుఁ దగిన సామర్థ్యము గలవారును, నగు బుద్ధిమంతులను మంత్రులనుగాఁ జేసికొంటివా? రఘుకులోద్భవుఁడవైన ఓ భరతుఁడా! రాజులకాలోచనమే గదా జయమును గలుఁగఁజేయునది. కావున రాజ్యము మంత్రమూలము గదా? అటువంటి యాలోచన శాస్త్రవేత్తలగు నీమంత్రులచేఁ జక్కఁగఁ దాఁచఁబడియున్నది గదా? నాయనా! భరతా! సర్వకాలములయందును నియమము లేక నీవు నిద్రను బొందడము లేదుగదా? నాయనా! భరతా, తగినకాలములయందు మేలుకొనుచున్నావా? నాయనా! అర్ధరాత్రులయందుఁ జేయఁదగిన కార్యములను మిగుల నేర్పుతో నాలోచించుచున్నావుగదా? భరతుఁడా! వొక్కఁడవే కార్యములను గురించి యాలోచనను జేయడము లేదుగదా? ఒక కార్యమును గురించి యనేకులతో నాలోచనను జేయుచుండుట లేదుగదా? నీవును నీమంత్రులును జేసిన యాలోచన నీ రాజ్యమును వగలి యితరరాజ్యములకుఁ బోవడము లేదుగదా? రఘుకులోద్భవుఁడవైన భరతుఁడా మొదట స్వల్పముగా నుండునదియును, తుదకు గొప్పదగు ఫలము నిచ్చునట్టిదియును, నగు కార్యమును జక్కఁగా నాలోచించి శీఘ్రముగా నారంభించుచున్నావుగదా? అట్టి కార్యమునందాలస్యమును జేయడము లేదుగదా? భరతుఁడా! సామంతరాజులు మొదలగు గొప్పవారలు నీకార్యములన్నియును జక్కఁగా నెరవేర్చినపిమ్మటను గాని, లేక ఫలోన్ముఖమైనపిదప గాని తెలిసికొనుచున్నారుగదా? ఆరంభమునందే నీవు చేయఁబోవుకార్యమును సామంతరాజులు తెలిసికొనడము లేదుగదా? భరతుఁడా! నీవును, నీమంత్రులును, జేరి యాలోచించిన కార్యమును నితరులు యుక్తిచేతఁగాని యూహించిగాని తెలిసికొనడము లేదుగదా? భరతుఁడా! అనేకవేలమంది మూర్ఖులలో నొక్క పండితుండుండునని తెలిసికొనుచున్నావా? (అనఁగా మూర్ఖులనేకులును బండితుఁడొక్కఁడును నుండునని తెలిసికొనుచున్నావా?) కష్టతరములగు కార్యములు వచ్చినపుడు పండితుఁడగువాఁడు మిగుల నేర్పుతో కార్యములను సఫలములుగాఁ జేయునని తెలిసికొనుచున్నావుగదా? భరతుఁడా! మూర్ఖులనేకవేలమందిగాని, అనేకలక్షలమందిగాని రాజునాశ్రయించుటచేతఁ బ్రయోజనము లేదని తెలిసికొనుచున్నావుగదా? ఒక్కఁడైనను, మిక్కిలి బుద్ధిమంతుఁడును, పరాక్రమము గలవాఁడును, మిగుల సమర్థుండును, మిక్కిలి నేర్పు గలవాఁడును, నగు మంత్రి రాజును గాని, రాజుతో సమానుఁడగువానిని గాని యాశ్రయించెనేని యతనికి గొప్పదగు సంపద వచ్చునట్లు చేయునని తెలిసికొనుచున్నావుగదా?

నాయనా! భరతుఁడా! గొప్పకార్యములయందు ముఖ్యులగువారలనే నియమించుచున్నావుగదా? మధ్యములగువారిని మధ్యకార్యములయందే నియమించుచున్నావుగదా? తక్కువవారలను తక్కువకార్యములయందే నియమించుచున్నావుగదా? నాయనా! పరీక్షకతిక్రమించినవారలును, తండ్రితాతలనాటనుండి వచ్చుచున్నవారలును, మిగులఁబరిశుద్ధులును, సర్వోత్తములును నగు మంత్రులను సర్వోత్తములగు కార్యములయందే నియమించుచున్నావుగదా? కైకేయీపుత్త్రుఁడవైన ఓ భరతుఁడా! నీవు తీవ్రమగు దండనచేత లోకులందఱును భయమును బొందునట్లు శిక్షించుచుండుటను, జూచి మంత్రులు సమాధానమును బొందడము లేదుగదా? మంత్రులు నీదుష్కార్యమున కంగీకారమును బొందుచుండుట లేదుగదా? నాయనా! భరతుఁడా! తీక్ష్ణమగు దండనచేత కఠినముగా శిక్షించుచున్న నిన్నుఁ బ్రజలందఱును, భయంకరమైన నుగ్రదానములచేత ద్రవ్యమును సంపాదించి యజ్ఞమును జేయఁదలఁచిన పతితునియా

జనులవలెను, మిగులభయముగలుగునట్లు ప్రవర్తించుచున్న కాముకుని, స్త్రీలునిందించునట్లును నిందించడము లేదుగదా? (అనఁగా లోకులు నిందించునట్లు నీవు దండనను జేయడము లేదుగదా యనుట.) నాయనా! సామదానాద్యుపాయములయందు మిక్కిలి నేర్పుగలవాఁడును, రాజనీతిశాస్త్రమును జక్కఁగాఁ జదివినవాఁడును, భృత్యులనుదూషించుటయందు మిగుల నాశగలవాఁడును, పరాక్రమముగలవాఁడును, ప్రభుత్వము తనకు రావలయునని కోరుచున్న వాఁడును, నగువాఁడు రాజును జంపును. అట్టివానిని జంపితివా? అట్టివానిని జంపని రాజునకు హానిగలుగునని యెఱుఁగుదువా? నాయనా! సంతోషముగలవాఁడును, చేయఁదగిన కార్యములయందు సామర్థ్యముగలవాఁడును, యుద్ధములయందు మిగులఁ బరాక్రమముగలవాఁడును, సర్వోత్తమమగు బుద్ధిగలవాఁడును, ధైర్యముగలవాఁడును, పరిశుద్ధుఁడును, కులవంతుఁడును, అనురాగముగలవాఁడును, చేయఁదగిన కార్యములయందు మిగులసమర్థుఁడును, నగువానిని సేనాపతినిగా నియమించితివా? నాయనా! మిగులబలముగలవారును, సర్వోత్తములును, యుద్ధమునందధికమైనబలముగలవారును, ముందుగాఁ జూడఁబడినపరాక్రమవృత్తాంతముగలవారును, నగువారలను నీవు చక్కఁగా గౌరవించి పూజించుచున్నావుగదా? నాయనా! నీసైన్యమునకును, మఱియు నితరులకును నియమితకాలము రాఁగానే యాలస్యమును జేయక జీతమును నన్నమును నిచ్చుచున్నావుగదా? ఆలస్యమును జేయడము లేదుగదా? నాయనా! జీతమును బుచ్చుకొని జీవింపఁదగిన పరిచారకులు జీతమునకును, అన్నమునకును దగినకాలమతిక్రమించెనేని యజమానుని నిందింతురు. ఇంతయగాక యజమానునియందు మిగులఁ గోపముగలవారగుదురు. అట్లగుటచేత మిగులగొప్పదగు ననర్థము సంప్రాప్తమగును. నాయనా! ప్రధానులును, మనకులమునందుఁ బుట్టినవారును నగు రాజపుత్రులందఱును నీనిమిత్తము నేకీభవించి నీయందనురాగముగలవారై తగినసమయము వచ్చినపుడు ప్రాణములనుగూడ వదలుటకు సిద్ధముగనున్నారుగదా? మఱియు నో భరతుఁడా! స్వదేశమునందుఁ బుట్టినవాఁడును, పరులబుద్ధులను, పరులకార్యములను జక్కఁగఁ దెలిసినవాఁడును, సమర్థుఁడును, మిగుల నూతనములగు యుక్తులుగలవాఁడును, చెప్పినకార్యము నసంబద్ధము లేక చేయువాఁడును, నగు మానవుని దూతనుగా నియమించితివా? నాయనా! నీవు నీశత్రుజనులకు మంత్రులు, పురోహితులు, యువరాజు, సేనాపతి, దౌవారికులు, అంతర్వంశికులు, కారాగృహములయం దధికారమును బొందినవారలు, ధనాగారాధిపతులు, కార్యనియోజకులు, ప్రాడ్వివాకులు, సేనానాయకులు, నగరాధ్యక్షులు, కర్మాంతికులు, సభాధికృతులు, ధర్మాధికారులు, దండపాలురు, దుర్గపాలురు, రాష్ట్రాంతపాలకులు, ననని యెడు పదునెనిమిదిమందియును తీర్థములని చెప్పఁబడును. ఈపదునెనిమిదిమందియందును ముగ్గురుముగ్గురు దూతలను నియమించితివా? వారలు చేయుకృత్యములను నీచారులవలనఁ జక్కఁగాఁ దెలిసికొనుచున్నావా? ఆప్రకారముగా నేనీరాజ్యమునందుఁగూడ సర్వకాలములయందును నీసమీపమునందుండునట్టి మంత్రిపురోహిత యువరాజులు దప్పఁదక్కిన పదునైదుమందియును జేయునట్టి కార్యములను దెలిసికొనుటకు ముగ్గురేసిదూతలను నియమించి వారలవలన నెల్లవారికార్యములను దెలిసికొనుచున్నావుగదా? శత్రువులను నాశము సేయుటయందు సమర్థుఁడవగునో భరతుఁడా! తొలుత నీరాజ్యమునందుండి తఱుమఁబడినవారును, మరల నేదోయొకకారణముచేత దేశములోనికి వచ్చినవారును, నీకు శత్రువులగువారును నగు జనులను దుర్బలులనుగాఁ దలఁచి యవమానింపక సర్వకాలములయందును జాగరూకుఁడవై వర్తించుచున్నావుగదా? నాయనా, నాస్తికులగు బ్రాహ్మణులను సేవింపడము లేదుగదా? నాస్తికులగు బ్రాహ్మణులనవివేకులనుగాను తామే పండితులమని తలఁచువారలనుగాను తలఁచుచున్నావా? ఇట్టివారల సేవించుటవలన పెక్కులయిన యనర్థములు వచ్చునని తలఁచుచున్నావుగదా? నాస్తికులగువారలు దుర్బోధలు సేసి బుద్ధిని జెఱుతురని యెఱుఁగుదువుగదా? నాయనా, దుర్బుద్ధులగు నాస్తికులు ముఖ్యములగు ధర్మశాస్త్రములుండియుండఁగా వానియందనేకములగు నిందలను గల్పింతురు. మఱియును వారు దండనీతిశాస్త్రమునే శాస్త్రముగా నెంచి శుష్కతర్కబుద్ధి నవలంబించి ధర్మశాస్త్రాదులు నిష్ప్రయోజనశాస్త్రములని చెప్పి యనేకములగు ననర్థములను సంపాదింతురు.

కావున నట్టిదుర్మార్గులతో సహవాసమును జేయడము లేదుగదా? నాయనా, పరాక్రమవంతులును మనకుఁ బూర్వులును నగు రాజోత్తములచేతఁ బరిపాలింపఁబడినదియును శత్రువులచేత జయింపనలవిగానిదియని సార్థకనామమును బొందినదియును దృఢమైనద్వారములు గలదియును ఏనుఁగులు గుఱ్ఱములు రథములు మొదలగువానిచేత నిండియున్నదియును తమతమకర్మయందు మిగులవాసక్తిగలవారలగు బ్రహ్మక్షత్రియ వైశ్యులచేతను జితేంద్రియులును, గొప్పయుత్సాహముగలవారును, నగుపూజ్యుల

చేతను సర్వకాలములయందును వ్యాప్తమైనదియును నానావిధములైన యాకారములుగల మేడలు మొదలగువాని చేతఁ బ్రకాశించుచున్నదియును చక్కఁగఁ బ్రకాశించుచున్నదియును నగు నయోధ్యాపట్టణమును జక్కఁగఁ బాలించుచున్నావుగదా? రఘుకులోద్భవుఁడవైన యోభరతుఁడా! అశ్వమేధాది యాగములను జేసిన యనేకమూరుల ప్రదేశముతోఁ గూడినదియును, మిగులఁ జక్కఁగాను బాధారహితులుగానున్న జనుల చేత నిండియున్నదియును దేవాలయముల చేతను చలిపందిళ్ళ చేతను తటాకముల చేతను బ్రకాశించుచున్నదియును మిగుల సంతోషముతోఁ గూడిన స్త్రీపురుషులు గలదియును అనేకులగు జనులొక్కచోట జేరిచేసెడు నుత్సవముల (సంతల) చేతను చక్కఁగాఁ బ్రకాశించుచున్నదియును చక్కఁగాఁ దున్నఁబడిన భూమి కలదియును పశువులు గలదియును హింసాకృత్యములు లేనిదియును కేవలముగ వర్షము కురియుటచేతనే గాక నదీప్రవాహముల చేతఁ గూడ ఫలించునవియును ఘాతకమృగములు లేనిదియును భయశూన్యమైనదియును సకలమైన గనుల చేతను బ్రకాశించుచున్నదియును పాపాత్ములగు మానవులు లేనిదియును నా పూర్వుల చేతఁ జక్కఁగాఁ బాలింపఁబడినదియును నైన దేశమంతయును సురక్షితముగా నున్నది గదా? నాయనా, దున్నుకొనియును గోరక్షణను జేసియును జీవించునట్టి కోమట్లందఱును నీకిష్టులైయున్నారు గదా? భరతుఁడా, లోకమంతయును వర్తకము చేత సకలసుఖముల నుబొందును.

కావున వర్తకము నీ దేశమునందుఁ జక్కఁగా జరుగుచున్నది గదా? నాయనా! వర్తకులకుఁ గలిగెడు ననిష్టములను దొలఁగించి సంతోషమును గల్పించి చక్కఁగఁ బరిపాలనను జేయుచున్నావు గదా? మఱియు నో తమ్ముఁడా! భరతా! రాజగువాఁడు తన దేశమునందుండునట్టి సకలజనులను బోషింపవలసియున్నది. అట్టివారలనందఱుఁ జక్కఁగఁ బోషించుచున్నావు గదా? నాయనా! స్త్రీలను జక్కఁగ నూరడించుచున్నావు గదా? స్త్రీలనందఱును అపవాదము గలుగకుండునట్లు జాగ్రతతో జక్కఁగాఁ బాలించుచున్నావు గదా? స్త్రీల మాటలను నమ్మడము లేదుగదా? స్త్రీలతో రహస్యవృత్తాంతములను జెప్పవు గదా? నాయనా! ఏనుఁగులుండు వనములను జక్కఁగఁ గాపాడుచున్నావు గదా? ఆ యేనుఁగులు నీ యొద్ద మెండుగా నున్నవి గదా? ఆ యేనుఁగులకును, నాడుగుఱ్ఱములకును దృప్తి గలుగునట్టుల నాహారాదికము నిచ్చుచున్నావు గదా? రాజపుత్రుఁడవైన యో భరతుఁడా! ప్రతిదినమందును బ్రాతఃకాలమునందు నిద్ర లేచి రాజమ[illegible]దు అలంకరితుఁడవైన నీ దర్శనము సకలజనులకును గలుగునట్లు సంచరించుచున్నావు గదా? మఱియు జక్కఁగా రాజచిహ్నములగు నాభరణాదులను ధరించుకొని సభకుఁ బోయి యెల్లవారికిని దర్శనమిచ్చుచున్నావు గదా? నాయనా! నీ పనివారలందఱును, నీ యెదుట పిచ్చలవిడిగా సంచరించుటకు భయమును బొందుచున్నారు గదా? సర్వకాలములయందును నీవు పనివారలకు గనఁబడుచుంటివేని వారు నిర్భయులగుదురు. అట్లగుట చేత సకలకార్యములును జక్కఁగ జరుగనేరవు. కావున వారలకుఁ దగిన కాలములయందే దర్శనమిచ్చుచున్నావు గదా? పనివారలకెప్పటికిని దర్శనమివ్వక సంచరించుట చేఁ గూడఁ గార్యహానిగలుగును. కావున గనఁబడియుఁ గనఁబడకయునుండవలెను. అవ్విధముగ నీవు ప్రవర్తించుచున్నావు గదా? నాయనా! నీ దుర్గములన్నియును, ధనధాన్యముల చేతను, నుదకముల చేతను, నిండియున్నవి గదా? ఇంతియగాక దుర్గములన్నియును, యంత్రముల చేతను, శిల్పుల చేతను, ధనుస్సును ధరించిన వీరభటుల చేతను నిండియున్నవి గదా? రఘుకులోద్భవుఁడవైన యో భరతుఁడా! నీకు లాభ మధికముగా నున్నది గదా? ఆదాయముకంటె వ్యయము తక్కువగా నున్నది గదా? నీ ధనము లపాత్రులయందు వినియోగము గాలేదు గదా? నీవు, దేవతలకొఱకును, పితృదేవతలకొఱకును, బ్రాహ్మణులకొఱకును, అభ్యాగతులకొఱకును, సైనికులకొఱకును, స్నేహితుల సమూహముకొఱకును, ధనమును వ్యయపఱచుచున్నావు గదా? నాయనా! పరిశుద్ధమైన మనస్సు గలవాఁడును, మనోవాక్కాయకర్మముల చేతఁ బరిశుద్ధుఁడును, నగు మానవుని మీఁద లేని దొంగతనమును మోపి నీ యొద్దకు దుర్మార్గులగువారు దోడ్కొనివచ్చినపుడు శాస్త్రములను జక్కఁగాఁ దెలిసినవారి చేతఁ బరీక్షింపక లంచమునందాశ చేతఁ మరణదండనాదికమును జేయడము లేదు గదా? మానవోత్తముఁడవైన యో భరతుఁడా! పట్టుకొనఁబడినవాఁడును, దొంగతనమును జేయుచున్న కాలమునందే చూడఁబడినవాఁడును, దొంగతనమును జేసితివా యని యడిగినపుడు చేసితినని చెప్పినవాఁడును, సాక్ష్యము మొదలగువాని చేత దొంగతనము చేసినట్లు నిశ్చయింపఁబడిన దొంగవానిని లంచమును దీసికొనవలయునని తలంపు చేత శిక్షింపక వదలడము లేదుగదా?

రఘుకులోద్భవుఁడవైన యో భరతుఁడా! దరిద్రునకును ధనికునకును, వివాదగలిగి నీ సభకు వచ్చినపుడు సకలశాస్త్రవేత్తలగు నీ మంత్రులు ధనవంతుని ధనమునందాశ లేనివారై యిరువురిని సమముగాఁ జూచి వారియొక్క వివాదమును దీర్చుచున్నారు గదా? రఘువంశోద్భవుఁడవైన యో

భరతుఁడా! లేనితప్పు మోపఁబడిన నిరపరాధులయొక్క కన్నీటిబిందువులెన్ని భూమియందుఁబడునో యందరు పుత్రులును, పశువులును, రాజుకు నశించిపోవును కావున నట్టి విషయమునందుఁ జక్కఁగ నాలోచించి నిరపరాధులను దండింపక వదలుచున్నావుగదా? రఘుకులోద్భవుఁడవైన యోభరతుఁడా! వృద్ధులను, బాలురను, శ్రేష్ఠులగు వైద్యులను, ద్రవ్యాదికమునిచ్చుటచేతను, మనస్సుచేతను, మంచిమాటలచేతను, వశముగాఁ జేసికొని సంతోషమును బొందించుచున్నావుగదా? నాయనా! గురువులకును, వృద్ధులకును, తపోవంతులకును, దేవతలకును, అతిధులకును, నాలుగుత్రోవలుగలిసిన స్థలములయందు మొలిచినవృక్షములకును, కృతార్థులయిన బ్రాహ్మణులకందఱకును నమస్కారములను జేయుచున్నావుగదా? నాయనా! అర్థముచేతధర్మమును, ధర్మముచేతనర్థమును, ధర్మాధర్మములను రెంటిని లంచమునందాశచేతను, కామముచేతను, బాధింపడములేదుగదా? జయముగలవారలలోనుత్తముఁడవును, కోరినకోరికలనిచ్చునట్టివాఁడవును, తగినకాలమును గుర్తెఱిఁగినవాఁడవును నైనయోభరతుఁడా! ధర్మార్థకామములను విభజించి తగినకాలమునందే భుజించుచున్నావుగదా? ప్రాజ్ఞులలో నుత్తముఁడవైన యోభరతుఁడా! సకలశాస్త్రార్థములయందును పండితులగు బ్రాహ్మణోత్తములు సర్వకాలములయందును, పురజనులతోడను, పల్లెటూరివారితోడను గూడుకొనినవారునునై నీకుసుఖము నేగోరుచున్నారుగదా? దేవుఁడు లేదనియెడుతలంపు, సత్యమునుదప్పుట, కోపము, పొరపాటు, దీర్ఘాలోచనను జేయుట, జ్ఞానవంతులను జూడకుండుట, ఆలస్యము, పంచేంద్రియములయొక్క వ్యాపారమునందే ప్రవర్తించుట, కార్యములనొక్కఁడే యాలోచించుట కార్యమును దెలియనివారలతోఁ గూడ నాలోచించుట, చేయవలసినదని నిశ్చయింపఁబడిన కార్యమును నారంభింపకపోవుట, ఆలోచనను, దాచకపోవుట, ప్రాతఃకాలాది కాలములయందు మంగళవస్తువులగు నద్దములు మొదలగువానిని జూడకుండుట, బహుమందితో నొక్కపర్యాయము యుద్ధమును జేయుటకుఁ బ్రవర్తించుట, యనియెడుపదునాలుగును రాజదోషములనఁబడును. ఈపదునాలుగుదోషములనువదలి సంచరించుచున్నావుగదా?

పండితులలో నుత్తముఁడవైన యోభరతుఁడా! వేటాడుట, జూదమాడుట, పగటియందు నిదురను బొందుట, పరులనునిందించుట, స్త్రీలయందధికాశను బొందియుండుట, మదము, నాట్యము, గానము, వాద్యము, నిష్ప్రయోజనముగాఁ దిరుగుట, యనుపదియును గామమువలనఁ బుట్టినగుణములని చెప్పఁబడును. మఱియును, లోభగుణములు గలవాఁడును, క్రూరుఁడును, మందుఁడును, అసత్యముగ మాటలాడువాఁడును, నేమఱుపాటును బొందియున్నవాఁడును, భయమును బొందెడు స్వభావముగలవాఁడును, స్థిరత్వములేనివాఁడును, మూర్ఖుఁడును, న్యాయమునువదలినవాఁడును, పరులనవమానించువాఁడును, నగుశత్రువు ముఖ్యముగా జయింపఁదగినవాఁడు లోభము, శౌర్యము ఆలస్యము, నసత్యముగ మాటలాడుట, పొరపాటును బొందియుండుట, భయమును బొందియుండుట, స్థిరత్వములేకయుండుట, మూఢత్వము, నీతివదలుట, పూజ్యులగువారలనవమానించుట, యనుపదియును దశవర్గములని చెప్పఁబడును. ఈపదింటిని దెలిసియున్నావుగదా? నాయనా! భరతుడా! వైరము, సవతితల్లివలనను, ద్రవ్యమువలనను, స్త్రీలవలనను, మాటలవలనను, నపరాధమువలనను సంభవించునని యార్యులువలుకుదురు. ఈయైదువిధములచేతను వైరముగలుగునని యెఱిఁగి సంచరించుచున్నావుగదా? నాయనా! సామదానభేదదండములనియెడు నాల్గింటిని జక్కఁగాఁ దెలిసి ప్రవర్తించుచున్నావుగదా. నాయనా న్యాయముగాధనమును సంపాదించుట, న్యాయముగ నార్జింపఁబడిన ధనమును జక్కఁగఁగాపాడుట, దానినివృద్ధినొందించుట, ఆ ధనమును సత్పాత్రమునందువినియోగించుట, యనునాలుగును రాజవృత్తములనఁబడును. ఈనాల్గింటిని శాస్త్రోక్తప్రకారముగ జరుపుచున్నావుగదా?

నాయనా! రాజు, మంత్రులు, రాజ్యము, స్నేహితులు, ధనాగారము, దుర్గము, రాజ్యము, సైన్యములను నేడును రాజ్యాంగములనఁబడును. ఈయేడువిధములగు నంగములును నీరాజ్యమునందుఁ జక్కగా నున్నవిగదా? నాయనా, కృషి, వర్తకము సేతువు గజములను బంధించుట గనులను సంపాదించుట పన్నును దీయుట శూన్యములగునిండ్లయందుఁ గాపురములుంచుట యను నెనిమిదింటిని రాజగువాఁడు విడువఁదగినవాఁడు గాఁడని యెఱుగుదువుగదా? పిశునత్వము సాహసము ద్రోహచింత ఓర్పులేకయుండుట, గుణములున్నచోట దోషములను గనఁబరచుట (లేక గుణములను దోషములనుగాఁ జేయుట) అర్థమునునిందించుట కఠినముగా మాటలాడుట కఠినముగా శిక్షించుట యను నెనిమిదియును క్రోధమువలనఁ గలిగెడి గుణములని పెద్దలువలుకుదురు. ఈయెనిమిదింటిని వదలి సంచరించుచున్నావుగదా? ధర్మార్థకామములను జక్కగా నెఱిఁగి సంచరించుచున్నావుగదా? నాయనా ప్రభుమంత్రోత్సాహశక్తులను, శత్రువులయొక్క వృద్ధిక్షయస్థానములను గనిపెట్టిసంచరిం

చుచున్నావుగదా? నాయనా! శక్యముగానికార్యములను జేయవలయునని యత్నించుట, చేయదగినకార్యమ్ములయం దుఁబ్రవర్తింపకుండుట, చేయఁదగినకార్యములనుగూడ అకాలమునందుఁజేయుట అనుమూఁడును దుర్వ్యసనములనబడును. ఈమూఁడువిధములగు కార్యవ్యసనములనువదలివర్తించుచున్నావుగదా? నాయనా! వార్తాదండనీతులనుమూఁటినిజక్కఁగఁజరుపుచున్నావుగదా? నాయనా! జితేంద్రియుఁడవై ప్రవర్తించుచున్నావుగదా? సంధివిగ్రహయానాసనద్వైధీభావసమాశ్రయములనియెడు నాఱువిధములగు చింతను దెలిసియున్నావుగదా? నాయనా! అగ్ని, ఉదకము, రోగము, అనావృష్టి, మృతి, రాజువలన నధికారమునుబొందినవారలవలనఁ గలిగెడుదుఃఖము, చోరులవలనఁగలిగెడుబాధ, శత్రుబాధ, రాజులపరిమితమగువాశగలిగియుండుట, యనుపదివిధములగు దైవమానుషబాధలునీరాజ్యమునందు లేకయున్నవిగదా? జీతమునుబొందనిలుబ్ధుఁడును, నవమానమును బొందింపఁబడినమానియును, కోపమునుబొందింపఁబడినకోపనుఁడును, భయపరుపఁబడినభయశీలుఁడును, ననునల్వురునుశత్రుపక్షమునందుఁజేరినయెడల నేవిధముగనైనద్రవ్యమునునిచ్చి మరలదనయొద్దకురప్పించుకొనవలయునని యెఱుఁగుదువుగదా? ఈనల్వురునుశత్రువులవలనఁదరుమఁబడివచ్చిరేని వారలుగోరిన పదార్థములనిచ్చి మరలశత్రువులయొద్దకుఁ బోకుండునట్లు చేసికొనవలయును. ఈవిషయములను జక్కఁగ నెఱుఁగుదువుగదా? నాయనా! బాలుఁడును, ముసలివాఁడును, చిరకాలరోగముగలవాఁడును, బంధుజనులచేతబహిష్కారముచేయఁబడినవాఁడును, భయపడుచున్నస్వభావముగలవాఁడును, భయగ్రస్తులగుజనులుగలవాఁడును, లోభులగుజనులుగలవాఁడును, వైరాగ్యప్రకృతిగలవాఁడును, శబ్దాదివిషయములయందధికమైనయాశగలవాఁడును, నానావిధములైనయాలోచనలుగలవాఁడును, దేవబ్రాహ్మణులనునిందించువాఁడును, దైవబలములేనివాఁడును, దేవు నేనమ్మి పురుషప్రయత్నమును జేయనివాఁడును, దుర్భిక్షముచేతఁబీడింపఁబడినవాఁడును, సేనాదుఃఖముచేత బాధింపఁబడుచున్నవాఁడును, పరదేశమునున్నవాఁడును, బహుమందిశత్రువులుగలవాఁడును, తగనికాలమునందుఁబ్రయత్నమును జేయనివాఁడును, నగుమానవులతో నెప్పటికిని సంధిని జేయఁగూడదని యెఱుఁగుదువుగదా? నాయనా! రాజ్యమునపహరించుట, స్త్రీలనపహరించుట, స్థానమును దొంగలించుట, దేశము నెత్తికొనుట, జ్ఞాతిజనమునపహరించుట, ధనాపహారమును జేయుట, మదమానములు గలిగియుండుట, విషయపీడగలిగించుట, జ్ఞానహీనుఁడై యుండుట, శక్తిలేకపోవుట, ధర్మహీనత, దేవతలయందుద్వేషముగలిగియుండుట, స్నేహితులనపహరించుట, స్నేహితుల ధనమునపహరించుట, బంధుజనులసంహరించుట, భూతదయలేకపోవుట, మంత్రులతోఁగూడఁ జేరికొనితనమిత్రులు మొదలగు వారల భేదించుట, తనకిష్టమైనకార్యమే కావలయుననియపేక్షించుట, యనుయిరువదికార్యములను రాజగువాఁడు చేయఁగూడదని యెఱుఁగుదువుగదా? నాయనా! ప్రధానులు, రాజ్యము, కోటలు, ధనాగారము, సైన్యము, అనియెడునైదువిధములగు ప్రకృతులును రాజునకుముఖ్యముగాబాగుసేయఁదగినవని యెఱుఁగుదువుగదా? నాయనా! జయేచ్ఛచేతవచ్చుచున్నశత్రురాజునకు ముందఱను వెనుకనునుండునట్టి పన్నిద్దరగురాజులను దెలిసి సంచరించుచున్నావుగదా? నాయనా! ఆపన్నిద్దఱనువివరించిచెప్పెదను వినుము. జయింపవలయునని యెడు కోరికగలవానికి ముందుభాగమునందున్నవాఁడు, శత్రువు. ఆశత్రువునకు ముందటిభాగమునన్నున్నవాఁడు తనకుమిత్రుఁడగును. వానికిముందఱనున్నవాఁడు శత్రువగును. వానికి ముందటిభాగమున నున్నవాఁడు స్నేహితునకు స్నేహితుఁడు. వానికిముందఱనున్నవాఁడు శత్రుని స్నేహితునకు స్నేహితుఁడు. ఇటుల నేజయింపవలయునని యెడు కోరికగలవానికి వెనుకటిభాగమునన్నుండువారలుగూడ శత్రుమిత్రత్వములను బొందినవారగుదురు. పార్శ్వభాగములయందున్నవారలిరువురును శత్రుమిత్రత్వములను గాలగతిచేతఁబొందుచుందురు. కావున నోభరతుఁడా! ఈపన్నిద్దఱిని దెలిసి సంచరింపవలయును ఈవిషయమును నీవుచక్కఁగ నెరిఁగి సంచరించుచున్నావుగదా? ఇప్పుడు నాచేఁజెప్పఁబడిన వారందఱును బరస్పరానురాగంబుగలవారైయుందురేని రాజ్యములుస్థిరముగనుండుననుటకు సందియములేదు. మఱియు నోభరతుఁడా! సంధివిగ్రహము మొదలగువాటిని తగినకాలమునందుయుక్తియుక్తముగ జరుపువాని కేమియు నాపదగలుగదు. ఈవిషయమును దెలిసిసంచరించుచున్నావుగదా? నాయనా! శాస్త్రోక్తలక్షణములుగల మంత్రులనలుగురినైనను, ముగ్గురినైనను నేర్పరచుకొని యామంత్రులందఱితోడను నొక్కొక్కనితోడను గూడఁ జేయఁదగినకార్యములనుగురించి యాలోచించుచున్నావుగదా? నీవుచదివినవేదములన్నియు హోమాదికర్మలయందుపయోగమును బొందినఫలములైనవా? నీధనార్జనాదిక్రియలన్నియును దానభోగములచేత సఫలములగుచున్నవిగదా? నీభార్యలందఱును రతికేళులను, పుత్రులనుబొందిసఫలులైయున్నారుగ

దా? నీవు చదివిన విద్య యంతయును, మంచి స్వభావముచే తన, మంచి యాచారముచేతను సఫలమైయున్నది గదా? రఘుకులోద్భవుఁడవై యో భరతుఁడా! ఆయుర్దాయమునభివృద్ధిగాఁ గలుగఁజేయునదియును, ధర్మార్థకామములను వృద్ధినొందించుచున్నదియును, నగు బుద్ధిని నాకుఁ దెలిసినవఱకుఁ జెప్పితిని. ఈ విషయములన్నియును, నీ బుద్ధియందు దగిలియున్నవి గదా? నాయనా! మన తండ్రియును, తాతయును నే విధముగాఁ బ్రవర్తించిరో యా విధముగా సన్మార్గమును బొందినదియును, శుభకరమైనదియును నగు ప్రవర్తన నవలంబించియున్నావు గదా? రఘుకులోద్భవుఁడవైన యో భరతుఁడా! రుచిగల పదార్థములను నీ వొక్కఁడవే భుజించుటలేదు గదా? యాచించుచున్నవారల కోరికలను దీర్చుచున్నావు గదా? రాజగువాఁడు, మతిమంతులలో నుత్తముఁడును, ప్రజలకు న్యాయముగ దండనను విధించువాఁడును, నైన ధర్మయుతముగ రాజ్యమును బాలించెనేని సకల భూమండలాధిపత్యమును బొందుటయే గాక మరణానంతరమందు స్వర్గలోకమును బొందును.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండయందలి నూరవ సర్గము ముగిసెను.

రాముఁడు భరతునితో నయోధ్యకు వచ్చుట లేదని చెప్పుట.

రాముఁ డివ్విధముగా భరతుని నూరడించియున్న యగ్రజునయం దధికమైన ప్రేమగలవానిని గాఁ దెలిసికొని లక్ష్మణునితోఁ గూడఁ గూడుకొనినవాఁడై యిట్లనియె.

నాయనా! భరతుఁడా! నీ వేమినిమిత్తముగ నారచీరలను, జడలను, ఇట్టి చర్మమును ధరించినవాఁడవై యీ దేశమునకు వచ్చితివి? నీ విక్కడకు వచ్చుటకుఁ దగిన కారణము వినవలయునని మాకిరువురకును నభిలాషగలిగియున్నది. నాయనా! నీవు నారచీరలను, కృష్ణమృగచర్మమును, జడలను, ధరించినవాఁడవై రాజ్యమును వదలి యిక్కడ కేమినిమిత్తముగ వచ్చితివి? ఈ విషయమును సర్వమును వివరించి చెప్పుమని రామలక్ష్మణు లిరువురును నడిగిరి. ఇవ్విధముగా, మహానుభావుఁడును, కకుత్స్థునికులమునందుఁ బుట్టినవాఁడును, నగు రాముఁడు కైకేయికిఁ బుత్రుఁడైన యా భరతుని మఱలఁ గట్టిగా నాలింగనము జేసికొని యడుగగా నే యా భరతుఁడు దోసిలియొగ్గి యిట్లనియె.

అన్నా! రామచన్ద్రా! మనకుఁ దండ్రియగు దశరథమహారాజు పూజ్యుఁడవగు నిన్నుఁ బరిత్యజించి మిగులఁ గఠినమగు కార్యమును జేసి పుత్రశోకముచేఁ బీడింపఁబడి స్వర్గలోకమును బొందెను. శత్రువులను దపింపఁజేయునట్టి యో రామచన్ద్రా! నాకుఁ దల్లియును, నాశుదియును, నగు కైకేయిచేత దుష్కార్యమునందుఁ బ్రవేశపెట్టఁబడిన దశరథమహారాజు మిగుల నధికమైన యపకీర్తిని గలుగఁజేయునట్టి పాపకార్యమును జేసె. అట్టి దుష్కార్యమును జేయుమని బోధించిన కైకేయి, విధవయును, దుఃఖముచేఁ బీడింపఁబడినదియునై రాజ్యఫలమును బొందలేనిదయ్యె. ఇంతియగాక మరణానంతరమందు ఘోరనరకమునందుఁ బడఁగలదు. అన్నా! రామచంద్రా! నీకు దాసుఁడనైన నాయందనుగ్రహమును జేయుము. మఱియు నో రాముఁడా, నీ విప్పుడే లేచి వచ్చి యింద్రుఁడు స్వర్గపట్టణమునకభిషిక్తుఁడైన విధముగ రాజ్యమునందుఁ బట్టాభిషిక్తుఁడవగుము. ఈ మంత్రులు మొదలగు ప్రకృతిజనులును మన తల్లులును దిక్కులేనివారై నీ యొద్దకు వచ్చిరి. కావున వీరియందనుగ్రహమును జేయుటకు నీవు తగినవాఁడవు. మఱియు మానదుఁడవగు నో రాముఁడా, కావునఁ బూర్వమునుండి జ్యేష్ఠపుత్రుల ననుసరించి వచ్చుచున్నదియును నీచేఁ బరిపాలించుటకుఁ దగినదియును నగు నీ రాజ్యమును ధర్మముచేతఁ బొందుము. మఱియు నీ స్నేహితుల కోరికలను సఫలములనుగాఁ జేయుము. అన్నా, రాముఁడా, నిర్మలుఁడైన చంద్రుని చేత శరత్కాలమునందలి రాత్రి మనోహరముగఁ బ్రకాశించు విధముగ భర్తవగు నిన్నుఁ బొంది సంపూర్ణమయిన యీ భూమి యంతయును దిక్కుగలదియగుగాక. నేనీ మంత్రులతో నందఱితోడను గూడుకొనినవాఁడనై యాచించుచున్నాను. కాఁబట్టి తమ్ముఁడను శిష్యుఁడను దాసుఁడను నైన నాయందనుగ్రహమును జేయుము. కావున పురుషోత్తముఁడవైన యో రాముఁడా, శాశ్వతమైనదియును పితృపితామహాది క్రమముగ వచ్చినదియును మంత్రులు మొదలగువారితోఁ గూడినదియును సకలలోకములవారిచేతను బూజింపఁబడినదియును నగు నీ రాజ్యమును సర్వమును బొంది పరిపాలింపుమనియె. ఇట్లు మహాబాహుఁడును కైకకుఁ బుత్రుఁడును నగు భరతుఁడు కన్నీళ్ళతోఁ గూడుకొనినవాఁడై పలికి శాస్త్రోక్తప్రకారముగ రాముని పాదములను బట్టుకొని మరలమరల నమస్కారమును జేసె. అప్పుడు రాముఁడు మాటిమాటికిని మదపుటేనుఁగువలె నిట్టూర్పులను విడుచుచున్నవాఁడును తనకుఁ దమ్ముఁడును నగు భరతుని జక్కఁగాఁ గౌఁగిలించుకొని యిట్లనియె.

నాయనా! భరతుఁడా! సత్కులమునందుఁ బుట్టినవాఁడును, సర్వోత్తమమగు బలముగలవాఁడును, తేజోవంతుఁడును, సచ్చరిత్రలుగలవాఁడును, నగు నీవంటి బుద్ధిమంతుఁడు రాజ్యముకొఱకుఁ బాపము నెట్లాచరించును. అవరింపఁ

ముగదా? శత్రుసంహారకుఁడవగు నోభరతుఁడా! నీయందు దోషమేమియును లేదు. నీవుబాల్యముచేఁ దెలియక తల్లిని నిందించుచున్నావు. ఇట్లునిందించుటతగదు. "శ్లో॥ కామకారోమహాప్రాజ్ఞ గురూణాంసర్వదానఘ। ఉపపన్నేషు దారేషు పుత్రేషుచవిధీయతే,, నిష్కల్మషుఁడవును, పండితులలోనుత్తముఁడవునునైన యోభరతుఁడా! గురువులగువారు, సర్వకాలములయందు యుక్తమైనదవడికలుగల భార్యాపుత్రులవిషయమై తమయిష్టానుసారముగ సంచరించుటకుఁదగినవారు. (అనఁగా భార్యాపుత్రులను దమయిష్టమువచ్చినట్లు నడిపింపవచ్చుననుట) సత్పురుషుఁడవైనయో భరతుఁడా! లోకమునందు సత్పురుషులచేత భార్యాపుత్రాదులేవిధముగా నెన్నఁబడుదురో యావిధముగా నేమనముగూడ దశరథమహారాజుచే నెన్నఁబడితిమని తలఁచుకొనుము తమ్ముఁడా! భరతా! దశరథమహారాజు, నన్ను నారచీరలను, జడలనుధరింపఁజేసి యడవికిఁబంపుటకును, రాజ్యాభిషిక్తునిగాఁ జేయుటకును దగినసామర్థ్యముగలవాఁడు. "శ్లో॥ యావత్పితరిధర్మజ్ఞే గౌరవంలోకసత్కృతం। తావద్ధర్మభృతాంశ్రేష్ఠ జనన్యామపిగౌరవమ్,, ధర్మవేత్తలలో శ్రేష్ఠుఁడవగు నోభరతుఁడా! ధర్మజ్ఞుఁడగుతండ్రియందేవిధముగా సర్వలోకోత్తరమగు గౌరవమునుంచుదురో యావిధముగానే తల్లియందుఁగూడ సర్వలోకోత్తరమగుగౌరవమును బెట్టవలయును. మఱియుధర్మస్వభావముగల యీతల్లిదండ్రులచేత వనమునకుఁబొమ్మని నాకాజ్ఞయివ్వఁబడెను. అవ్విధముగ నాజ్ఞాపింపఁబడిన నేను వేరొక కార్యమునెట్లు సేయుదును. నాయనా! భరతుఁడా! సకలజనులచేతను శ్లాఘింపఁబడిన రాజ్యమును బొంది యయోధ్యాపట్టణమును నీవుబాలింపవలయును. జడలను, నారచీరలను ధరించి నేను దండకారణ్యమునందు నివసింపవలయును. అనియిట్లు సకలజనులసమీపమునందు తేజోవంతులలోనుత్తముఁడగు దశరథమహారాజు విభాగమును జేసిమనకిరువురకును నాజ్ఞయిచ్చి స్వర్గలోకమునకుఁబోయె. ధర్మాత్ముఁడును, లోకాచారములకు గురువువంటివాఁడును, నగుదశరథమహారాజు నీకుఁ బ్రమాణము. తండ్రియగుదశరథమహారాజు విభాగించియిచ్చిన రాజ్యమును నీవువదలక యనుభవింపుము. తండ్రియొక్కయాజ్ఞ నతిక్రమించుటయెవ్వరికిని దగదు. నేను, తండ్రియగు దశరథమహారాజుయొక్కయాజ్ఞానుసారముగఁ బదునాలుగుసంవత్సరములను దండకారణ్యమునందుండి పిమ్మటమహాత్ముఁడును, తండ్రియునునగు దశరథమహారాజు చెప్పనొప్పిన రాజ్యమును బాలింపఁగలననియె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటయొక్కటవసర్గముగిసెను.

—{ భరతుడు రామునితో దశరథునకు తానుదిలోదకాదులఁ జేసితినని చెప్పుట. }—

అవ్విధముగ రాముఁడు చెప్పినమాటలనువిని భరతుఁడిట్లనియె.

అన్నా రామచంద్రా! నిన్ను సేవించుటయనియేడు ధర్మముచేతవిహీనుఁడనైన నాకీరాజ్యమువలనఁ బ్రయోజనమేమి? నేనీరాజ్యముతో నేమిచేయఁగలను. పురుషోత్తముఁడవగునో రాముఁడా! పెద్దవాఁడుండఁగాఁ జిన్నవాఁడు రాజ్యార్హుఁడు గాఁడనియును, పెద్దవాఁడే రాజ్యమును బాలింపవలయుననియును, మనపెద్దలునిర్ణయించిరి. మఱియునీధర్మము శాశ్వతముగా ననాదిగమనవంశము వారుఆచరించుచున్నారు. కావుననిది సనాతనధర్మమైయున్నది. కాఁబట్టియిట్టిధర్మమును నేనువదలఁదగినవాఁడను గాను. రఘుకులోద్భవుఁడవైన యోరాముఁడా! నన్ను వెంటఁబెట్టుకొని సకలసమృద్ధులచేతను నిండిన యయోధ్యాపట్టణమునకుఁ బొమ్ము. పోయిమనకులమునకు మేలుగలుగుటకొఱకుఁ బట్టాభిషిక్తుఁడవగుము. అన్నా, రామా, లోకులు రాజును మానవునిగాఁ బలుకుదురు. నేనుమాత్రము రాజును దేవునిగాఁ దలఁతును. ధర్మార్థములతోఁగూడ రాజ్యమునుచాలించు రాజు సకలైశ్వర్యములను నీలోకమునందనుభవించి పరలోకమునందు దేవత్వమును బొందును. తపోవంతులగువారు కృచ్ఛ్రచాంద్రాయణాదులచేతఁ గృశించి పరలోకమునందు దేవత్వమును బొందుచున్నారు. కావుననీవు తాపసులవృత్తినవలంబించి యధికకష్టములను బొందుటకంటె ధర్మార్థయుతముగ రాజ్యమును బాలించి సకలభోగములననుభవించి దేవత్వమును బొందుము. నీవరణ్యమునకువచ్చినపిదప నేను గేకయభూపాలుని రాజ్యమునందుండఁగానే పూజ్యుఁడును, యజ్ఞమును జేసినవాఁడును, సత్పురుషులకు సమ్మతిమైనవాఁడునునగు దశరథమహారాజు స్వర్గలోకమును బొందె. మఱియునో రామచంద్రా! నీవుసీతారాను లక్ష్మణులతోఁగూడ నరణ్యమునకు రాఁగానే దశరథమహారాజు దుఃఖశోకములచేఁ బీడింపఁబడి స్వర్గమునకుఁబోయె. తండ్రియగుదశరథమహారాజునకుఁ దిలోదకదానమును సేయుము. నేనీశత్రుఘ్నునితోఁగూడ నిదివఱకుమునుపే తిలోదకాది పైతృకకృత్యములనన్నిఁటిని జేసితిని. రఘుకులోద్భవుఁడవైనయో రాముఁడా! పితృలోకమునందున్నవారలకుఁ బ్రియుఁడగు పుత్రుఁడిలోకమునందు తిలోదకాదులి

చ్చినయెడలనవి యక్షయములై యుండునని పెద్దలువలుకుదురు. నీవుతండ్రికిఁ బ్రియుఁడవైనపుత్రుఁడవు. కావుననీవుతిలోకదానమును జేయుము అన్నా రామా నీతండ్రియగు దశరథమహారాజునిన్నుగుఱించి దుఃఖమునుబొందుచున్నవాఁడును, నిన్నుఁజూడవలయునని యెడు కోరికగలవాఁడును, నీయందునాటుకొన్నబుద్ధిని ద్రిప్పఁజాలనివాఁడును నైనీవులేకపోయినందువలనఁ గలిగినదుఃఖముచేనధికముగ బీడనుబొంది నిన్నుస్మరించుచు మరణమునుబొందెనని భరతుఁడు చెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటరెండవసర్గముగిసెను.

దశరథునిమరణమునుగుఱించి సీతారామలక్ష్మణులుదుఃఖించుట

అంత రఘుకులమునందుఁ బుట్టిన రాముఁడు, భరతునిచేఁ జెప్పఁబడినదియును తండ్రియొక్క మరణమును బోధించుచున్నదియును మిగులదైన్యమును గలుగఁజేయునదియునునగు "దశరథమహారాజుమృతుండయ్యె" అనుమాటను విని నిశ్చేష్టుఁడయ్యె. మఱియును యుద్ధమునందు దేవేన్ద్రునిచేఁ బ్రయోగింపఁబడిన వజ్రాయుధమువలె భయంకరమైనదియును మనస్సునకుదుఃఖమును గలుగఁజేయునదియును నగు భరతునియొక్క మాటనువిని శత్రుమర్దనుఁడగు రాముఁడు చేతులను బైకెత్తికొని పుష్పములచేత నిండినదియును గండ్రగొడ్డలిచేత నరకఁబడినదియును నగుపూచినవృక్షమువలెఁ గ్రిందఁబడియె. ఆసమయమున రామునితమ్ములందఱును సీతాదేవితోఁగూడనవ్విధముగా భూమియందు బడినవాఁడును "ఏటియొడ్డుననుండు యిసుకదిబ్బనుబొడిచియలసి క్రిందఁబడినిద్రించియున్నయేనుఁగువలె" క్రిందఁబడియున్నవాఁడును గొప్పదగుధనుస్సుగలవాఁడును మిగులగొప్పదగుదుఃఖముచేతఁ గృశించినవాఁడును నగు రామునిపైఁ జల్లనియుదకములను జల్లిరి. అంతఁగొంతసేపటికిఁ గకుత్స్థునివంశమునందుఁబుట్టిన యారాముఁడు తెలివినిదెచ్చుకొని నేత్రములచేత బాష్పోదకము నపరిమితముగ ధారధారగ వదలుచు దీనస్వరముతో నిట్లనిచెప్పుటకు నారంభించె. మఱియుధర్మస్వభావముగల యారాముఁడు, భూమికధిపతియును తనకుఁదండ్రియునునగు దశరథమహారాజు మరణమునుబొందెనని తెలిసికొని ధర్మయుక్తమైనమాటలను జెప్పఁదలఁచి యాభరతునితోనిట్లనియె

తమ్ముఁడా భరతుఁడా! మనకుఁదండ్రియగు దశరథమహారాజు మరణమునుబొందె. రాజహీనమైన యయోధ్యాపట్టణమునకిఁకనెవ్వఁడు పరిపాలింపఁగలఁడు. అయ్యో, నేనెంతదుష్టుఁడనైతిని. మహానుభావుఁడగు దశరథమహారాజు నన్నుగుఱించి యధికముగదుఃఖించుచు మరణమునుబొందె. అట్లునన్నుగుఱించి దుఃఖించుచుమరణమునుబొందిన దశరథమహారాజునకు సమీపమునందుండి నేను ప్రేతకృత్యములను జేయనైతిని. కావున నేనుదుష్టపుత్రుఁడనై తినని తలఁచెదను. తమ్ముఁడా, భరతుఁడా, నీవుశత్రుఘ్నునితోఁగూడఁదండ్రియగు దశరథమహారాజునకు సకలప్రేతకృత్యములను జేసితివి. కావుననీవును శత్రుఘ్నుఁడును ధన్యులయితిరనియెంచెదను. తమ్ముఁడా, భరతుఁడా, ప్రధానుఁడులేనిదియును మిగులవ్యాకులమైనదియును దశరథమహారాజులేక శూన్యమైనదియును నగునయోధ్యాపట్టణమునకు నేనుబదునాలుగుసంవత్సరములును గడచినపిమ్మటకూడ రాజాలను. నేనుబదునాలుగుసంవత్సరములును నరణ్యమునందుండి తండ్రియాజ్ఞను నెరవేర్చి యయోధ్యాపట్టమునకెట్లుపోదును. ఒకవేళఁ బోతినేని యిఁకనాపట్టణమునందు నాకెవ్వఁడుబుద్ధులనుగరపును తండ్రిలేనిపట్టణమునకు నేనెట్లువత్తును. నేనువచ్చితినని సంతోషమునుబొందువాఁడిఁకనెవ్వఁడుగలఁడు. నాయనా భరతుఁడా, పూర్వమునందు నామంచినడవడికలనుజూచి తండ్రియగుదశరథమహారాజు నన్నుబహువిధములశ్లాఘించుచు నాచెవులకింపైనమాటలను జెప్పుచుండును. ఇప్పుడట్టితండ్రిమరణమునుబొందెను. ఇఁకమీఁద నేనెవనివలనఁ జెవులకింపైనమాటలనువిందునని రాముఁడుభరతునితోఁ జెప్పె. రఘుకులమునందుఁ బుట్టిన రాముఁడీవిధముగా భరతునితోఁ జెప్పిపిమ్మట శోకసంతప్తుఁడై పూర్ణచంద్రునితో సమమైన మోముగల సీతాదేవినుద్దేశించి యిట్లనియె.

ఓసీతా, నీకుమామయగు దశరథమహారాజు మరణమునుబొందెను. లక్ష్మణా, నీవుతండ్రిలేనివాఁడవైతివి. ఈ భరతుఁడు మనతండ్రియగు దశరథమహారాజు మరణమునుబొందెననియీదుఃఖవర్తమానమును జెప్పుచున్నాఁడని రాముఁడుచెప్పె. ఇవ్విధముగ నా రాముఁడు చెప్పుచుండఁగా నధికమైనకీర్తిగలవారును చిన్నవారలునునగు నా సీతాభరతలక్ష్మణశత్రుఘ్నులయొక్క నేత్రములనుండి మహాదుఃఖమువలన బాష్పోదకమధికముగస్రవించుచుండె. అటుపిమ్మటఁ దోఁబుట్టువులగు భరతలక్ష్మణశత్రుఘ్నులు అన్నయగు రామునిబహువిధములనూరడించి భూపతియును తండ్రియునునగు దశరథమహారాజునకుఁ దిలోదకదానమును జేయుమని చెప్పిరి. అప్పుడుపావనురాలగు సీతాదేవిమామయగు దశరథమహారాజుమరణమునుబొందెననువార్తనువి

నినతోడనేయపరిమితముగఁ గన్నులనీరు గారఁగా రోదనమును జేయుచుండె. మఱియు గన్నులనీటచేతనిండియుండుటవలన భర్తయగు రామునిఁజూడఁజాలనిదయ్యె. అప్పుడు రాముఁడు, జనకమహారాజపుత్రికయును, మామయగుదశరథమహారాజుమరణమునుబొందినందుకు అధికముగదుఃఖమునుబొందుచున్నదియును, నగుసీతను బహువిధముల నూరడించి తానుదుఃఖమునుబొందినవాఁడగుచు లక్ష్మణునితోనిట్లనియె.

తమ్ముఁడా లక్ష్మణా! గారచెట్టువలనఁబుట్టిన గానుగపిండినిదీసికొనిరమ్ము. ఉత్తరీయమునుదీసికొనిరమ్ము. నేనుమహానుభావుఁడగు తండ్రికిఁదిలోదకములనిచ్చుటకుబోవుచున్నాను. ఈపదార్థములనవశ్యముగఁ దీసికొనిరమ్ము. మఱియునో తమ్ముఁడా! లక్ష్మణా! సీతనుముందునడిపింపుము సీతను వెంబడించి నీవునడువుము. నేనునీవెంబడిమిమ్ములనిరువురనురక్షించుచువచ్చెదనని రాముఁడు లక్ష్మణునితోఁ జెప్పె. అటుపిమ్మటసర్వకాలములయందును వారల వెంబడించితిరుగువాఁడును, పరమాత్మతత్త్వమును దెలిసినవాఁడును, బుద్ధిమంతులలోనుత్తముఁడును, మృదువైనస్వభావముగలవాఁడును, జితేంద్రియుఁడును, శాంతుఁడును, రామునియందుదృఢమైనభక్తిగలవాఁడును, నగుసుమంత్రుఁడమ్యెమంత్రులతోఁగూడఁగూడుకొని రామునూరడించి రామునిబట్టుకొనిమంగళకరమగు మందాకినీనదియందలిమంచిరేవునందుదించె. అంతటనధికమైనకీర్తిగల యా రాముఁడు మొదలగువారందఱును, మిగులఁగష్టముగా, చక్కనిరేవుగలదియును, మనోహరమైనదియును, సర్వకాలములయందునుబుష్పించిన యరణ్యముగలదియును, మిగులవేగముగాఁ బ్రవహించునట్టిప్రవాహముగలదియును, మంగళకరమైనదియును, బురదలేనిదియును, నగుమందాకినీనదియందలి రేవులో దిగిపోయిరి. అప్పుడు రాముఁడిట్లనియె.

ఓ తండ్రీ! ఓ అయోధ్యాధిపతీ! ఓ దశరథమహారాజా! నేనిచ్చుచున్నయీతిలోదకము నీకుపయోగించుగాకయని తిలోదకాంజలులనిచ్చె. మఱియునుమహీపాలుఁడగు నా రాముఁడు దోసిలినిండ నువ్వులతోఁగూడిన గంగోదకమును గ్రహించి దక్షిణపుదిక్కుతట్టుతిరిగియధికముగ రోదనమును జేయుచుమఱలనిట్లనియె.

ఓ రాజశ్రేష్ఠుఁడా! దశరథమహారాజా! తండ్రీ! నాచేనివ్వఁబడుచున్న యీతిలోదకము, పితృలోకమునందున్ననీకునక్షయమైయుండుగాకని చెప్పె. అటుపిమ్మట తేజోవంతుఁడగు నా రాముఁడుతమ్ములతోఁగూడ మందాకినీనదియొక్కతీరమునువదలి కొంచెముదూరముగఁబోయి మృతుఁడైనతండ్రినుద్దేశించి సపిండీకరణమునుజేసె. ఆసమయమున రాముఁడు దుఃఖముచేఁబీడింపఁబడినవాఁడై రేగుబండ్లతోఁగూడఁజేర్చి గారచెట్టుయొక్కపిండినిముద్దలుగాఁ జేసిదర్భలయందుఁబెట్టియధికముగనేడ్చుచునిట్లనియె.

ఓ దశరథభూవల్లభా! ఓ మహారాజా! ఓ తండ్రీ! నీవీయన్నమునుభుజింపుము. మేమున్ను యీ గారిచెట్టుయొక్కపిండినే యన్నముగ భుజింపుచున్నాము. కావుననీకున్ను యీయన్నమునే సమర్పించితిని. "శ్లో॥ యదన్నః పురుషో భవతి తదన్నాస్తస్య దేవతాః,, లోకములో మానవుఁడేమియన్నమునుభుజించునో యాయన్నమునుసమర్పించుటచేనతని దేవతలుగూడఁదృప్తినొందుదురని శాస్త్రములు చెప్పుచున్నవి. కావుననేనుభుజించుచున్నయన్నము చేత నీకుఁబిండదానమును జేసితిని. ఈపిండములనుభుజించినీవుతృప్తుఁడవగుమని చెప్పిపిండదానమును సేసె. అట్లు ప్రేతకృత్యములనన్నిఁటినిదీర్చినపిమ్మట మానవశ్రేష్ఠుఁడైనయా రాముఁడు మందాకినీనదీతీరమునువదలి మనోహరమైనచరియలుగల చిత్రకూటపర్వతమునకుఁబోయె. పిమ్మట రాజశ్రేష్ఠుఁడగు రాముఁడు పర్ణశాలయొక్క ద్వారమునొద్దకుఁబోయి బాహువులచేత భరతలక్ష్మణుల నిరువురనుగౌగిలించుకొనియె. అట్లుకౌగిలించుకొని యాభరతలక్ష్మణ శత్రుఘ్నులతోడను సీతాదేవితోడనుగూడనధికముగరోదనమును జేసె. అట్లేడ్చుచున్నయా సీతా రామలక్ష్మణ భరతశత్రుఘ్నులయొక్క రోదనధ్వని సింహములధ్వనివలె నాచిత్రకూట పర్వతమునందంతటను బ్రతిధ్వనినిచ్చె. సర్వోత్తమమగు బలముగలవారును, నధికముగరోదనమును జేయుచున్నవారును, తండ్రికిఅపరక్రియలను జేయుచున్నవారలునునగు నా రాముఁడు మొదలగువారియొక్క రోదనధ్వనినివిని భరతునిసైనికులందఱును మిగులభయమును బొందిరి. మఱియునా సైనికులు, భరతుఁడు రామునొద్దఁజేరినాఁడనియును, వారందఱును తండ్రియగుదశరథమహారాజును గుఱించి యధికముగనేడ్చుచున్నారనియును, కావుననిట్టిరోదనధ్వని వినఁబడుచున్నదనియును దమలోఁదాము చెప్పుకొనుచుండిరి. అంతట నాభరతునిసైనికులందఱును, భరతాదులరోదనధ్వనిననుసరించిపోఁదలఁచినవారై తమనివాసస్థానములనువదలి యొక్కవిధమైనతలంపుగలవారై యాధ్వని వచ్చుచున్నదిక్కునుబట్టిపోవుటకుబయలువెడలిరి. ఆసైనికులలోఁగొందఱు రాజపుత్రులు గుఱ్ఱములనెక్కిబయలువెడలిరి. మఱికొందఱేనుఁగులనెక్కిపోయిరి. కొందఱురథములనెక్కిపోయిరి మఱికొందఱుసర్వాలంకారములచే నలంకరితులయ్యు పాదచారులైపోయిరి. మఱియునా సేనలోని జనమంత

యును, రాముఁడువనమునకుఁబోయి పెక్కుదినములుగాకపోయిననునసేకసంవత్సరములనాఁడుపోయినవారివలెనున్నాఁడనితలఁచుచుఁజూడవలయునని కోరికగలవారైరామాశ్రమమునకు మిగులవేగముగబయలువెడలిపోయిరి. మఱియు నాచిత్రకూటపర్వతమునందు భరతశత్రుఘ్నులు, రామలక్ష్మణులతోఁగలిసియుండుటను జూడవలయుననిమొదటికోరికగలవారైగొరిసెలయొక్కయు, అంచులయొక్కయుధ్వనులతోఁగూడినవియును, నానావిధములైనవియును, నగువాహనములనేకము యాసైనికులందఱును నతివేగముగాఁబోయిరి. ఆసమయమునందుభూమియంతయును, గుఱ్ఱములగొరిసెలచేతను, రథచక్రములయంచులచేతను గొట్టఁబడినదై వర్షాకాలమునందుమేఘములచే నాకాశముఅపరిమితమగుధ్వనిగలదియగువిధముగ సంకులమైనధ్వనిగలదియయ్యె. ఆధ్వనిచేతఆడఏనుగులతోఁ గూడినవియును, వదించినవియునునగు మగయేనుఁగులుమిక్కిలిభయమునుబొందినవైతమయొక్కమదగంధముచేత వనమునుసర్వమునుబరిమళింపఁజేయుచుమఱియొకవనమునకుఁ బరుగిడిపోను మఱియునాసమయమునందడవిపందులు, తోడేళ్లు, ఎనుములు, సర్పములు, వానరములు, పెద్దపులులు, గోవులచెవులవంటిచెవులుగలజింకలు, దుప్పులు, మొదలుగాఁగలమృగములుగూడమిగులభయమునుబొందిపరుగిడిపోయె. మఱియునప్పుడుచక్రవాకపుపక్షులు, నీటికోళ్లు, హంసలు, బెగ్గురుపక్షులు, కొంగలు, మగకోయిలలు, క్రౌంచపక్షులు, మొదలుగాఁగలపక్షులన్నియును భయముచేత[illegible]రమునుమఱచినవై యాకాశమునకుఁ బరుగిడిపోయె. అవ్విధముగాఁబరుగిడిపోవుచున్నపక్షులకూతచే నాకాశమును, భరతునిసైన్యముచేనిండియున్నభూమియును, మిగులమనోహరముగఁబ్రకాశించె. ఆసమయమునందాజనమంతయును, మిగులవేగముగఁబోయి పురుషోత్తముఁడును, కీర్తిగలవాఁడును, శత్రువులనునశింపఁజేయువాఁడును, స్థండిలమునందుఁగూర్చున్నవాఁడును, నగురామునిఁజూచె మఱియునాజనమంతయును వాకిటిగాఁజేరి రామునొద్దకువచ్చికైకేయిని, మంథరను, బహువిధములనిందించిరి మఱియుసైనికులందఱును, నారామునిఁజూచినతోడనే కన్నీళ్లచేతవ్యాప్తమైనముఖములుగలవారై యపరిమితముగరోదనమునుజేసిరి. అప్పుడుకన్నీళ్లచేతవ్యాప్తమైనముఖములుగలవారును, మితిలేనిదుఃఖముచేరోదనమునుజేయుచున్నవారునునగు మానవులనందఱ రాముడు చూచె అట్లుచూచియందఱిస్త్రీలను, దల్లులనుగౌగిలించుకొనిసవిధముగాను, పురుషులను, తండ్రులనుగౌగలించుకొనిసవిధముగానుగౌగిలించుకొనియె. మఱియునప్పుడారాముఁడందుఁగొందఱినధికప్రేమచేఁ గౌగిలించుకొనియె. అందుఁగొందఱురామునకునమస్కారమునుజేసిరి. ఆసమయమునందుఁదన్నుజూడవచ్చినస్నేహితులకును, బంధువులకును, రాముఁడుతగినవిధముగసత్కారమునుజేసె. అప్పుడెల్లవారునునపరిమితముగ గన్నీరొలకనేడ్చిరి ఆమహాధ్వనిభూమ్యాకాశములయందువ్యాపించిప్రతిధ్వనిగలదయ్యె. మఱియుఁబర్వతగుహాలయందామహాధ్వనివ్యాపించి మద్దెలధ్వనివంటిధ్వనిగలదయ్యె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలినూటమూడవసర్గముగిసెను.

కౌసల్యాదేవి మొదలగువారు రామునిజూడబోవుచు రామునికష్టములనుజూచిదుఃఖించుట.

ఆసమయమునందు వసిష్ఠమహాముని దశరధునిభార్యలనందఱముందునిడుకొని రామునిఁజూడవలయుననిమొదటికోరికగలవాఁడై రాముఁడున్నచోటునకుబయలువెడలె అప్పుడు రాజభార్యలందఱునువచ్చుచు మందాకినీనదియొద్దకువచ్చి రామలక్ష్మణులస్నానపానాదులనుజేయునట్టిరేవునుజూచిరి. ఆసమయమునందుఁగన్నీళ్లచే నిండినమోముగలదియును, దుఃఖమునుబొందుచున్నదియునునగు కౌసల్యాదేవిదీనురాలై సుమిత్రాదేవితోడను, మఱియునితరులగురాజభార్యలతోడనునిట్లనియె.

ఓచెల్లెండ్రా! చూడుఁడుఇదివఱకు మునుపురాజ్యమునుండితఱుమఁబడినవారును, దిక్కులేనివారివలె నడవులయందు సంచరించుచున్నవారును, దుఃఖమునుబొందుటకుఁదగనివారును, పరులకుదుఃఖమునుగలిగింపనికార్యములనుజేయనివారును, నగుసీతారామలక్ష్మణులుయీవనమునందుస్నానమునుజేయునట్టి రేవుయిదియేయని నిస్సందేహముగా నాకుఁదోచుచున్నదనిచెప్పి సుమిత్రాదేవినిజూచియిట్లనియె.

ఓచెల్లెలా! సుమిత్రా! యీతట్టుతిరిగిచూడుము. నీపుత్రుఁడగులక్ష్మణుడుగొంచెమైననాలస్యమునుజేయనివాఁడైయీరేవులోనుండినాపుత్రుఁడగు రామునికొఱకు జలమునుదీసికొనిపోవుచుండును నీపుత్రుఁడగులక్ష్మణుఁడుగొంచెమైననసహ్యమునుబొందక నీచకృత్యమునుగూడఁజేయుచున్నాఁడు. అన్నయగురామునకు శుశ్రూషనుజేయుటయందు నీచకృత్యములుగూడనుత్తమకార్యములేయగుననిదలఁచుచున్నాను. మఱియునెప్పటికినిదుఃఖములనుబొందుటకుఁదగనివాఁడును, నీకుఁబుత్రుఁడును, నగులక్ష్మణుఁ

డు, నీచమైనదియును, దుఃఖకరమయినదియునగుపనిని వదలి రాజ్యసౌఖ్యములను బొందుఁగాకయనిసుమిత్రాదేవితోఁ జెప్పె.

అవ్విధముగాఁజెప్పి విశాలములైననేత్రములుగల యాకౌసల్యాదేవి భూమియందుదర్భలనుపఱచి వానియందుఁ రాముఁడుదండ్రికొఱకుఁ గానుగపిండిని ముద్దలనుగాఁజేసిపెట్టినచోటునుజూచె. మఱియునురాణియగు నాకౌసల్యాదేవి దుఃఖవంతుఁడగురామునిచేత నుంచఁబడినయాకానుగపిండి ముద్దలనుజూచి దశరథునిభార్యలనందఱతోడనునిట్లనియె.

ఓచెల్లెండ్రారా! మనరాముఁడు, ఇక్ష్వాకువంశమునకధిపతియును, మహానుభావుఁడును, తనకుఁదండ్రియునునగు దశరథమహారాజునకుఁ దృప్తికలుగుటకొఱకుఁ గానుగపిండిముద్దలను, శాస్త్రోక్తప్రకారముగ దర్భలయందుఁ బెట్టెను. ఈపిండములనుజూడుఁడు. మఱియునోచెల్లెండ్రారా! దేవతలతోసమానుడును, సకలభోగములననుభవించినవాఁడును, నగుదశరథమహారాజునకుయీకాకానుగుపిండిముద్దలుఎంతమాత్రమునుదినఁదగినవికావు. నాలుగుసముద్రములవఱకునుగల భూమినిబాలించినవాఁడును, దేవేన్ద్రునితోసమానుఁడును, భూమీపతియును, నగుదశరథమహారాజు యీగారచెట్టుయొక్కపిండిని నెట్లుభుజించునో గదా? రాముఁడుసకలసంపదలును గలవాఁడయ్యునుబీదవానివలెఁ గారచెట్టుయొక్కపిండిముద్దలనుబెట్టె. ఇంతకంటెదుఃఖకరమైన విషయమేమిగలదు? రాముఁడుతండ్రికిసమర్పించిన కానుగపిండిముద్దలను జూచినప్పుడుగూడ నాహృదయము వేయిపరియలుగాకయున్నదే? అయ్యో నేనెంతకఠినురాలనవచ్చును. "శ్లో॥ యదన్నఃపురుషోభవతి తదన్నాస్తస్య దేవతాః,, పురుషుఁడేమియన్నమునుభుజించునోయాయన్నముచేతనే యతనిదేవతలుగూడసంతోషమునుబొందుదురనియెడు లోకవార్త వాస్తవమేయనితోఁచుచున్నదనిచెప్పి యపరిమితముగనేడ్చుచుండె. అట్లురోదనమునుజేయుచున్న యాకౌసల్యాదేవిని యాస్త్రీలందఱునుబహువిధములనూరడించి యాయాశ్రమమునందు, "స్వర్గలోకమునుండి జారిపడినదేవునివలెనున్న రామునిజూచిరి" అప్పుడాతల్లులందఱును, సర్వభోగశూన్యుఁడైన రామునిజూచి దుఃఖముచేఁబీడింపఁబడినవారై గొంతెత్తిపెద్దధ్వనిగలుగునటులనేడ్చిరి. అప్పుడుమానవోత్తముఁడును, యుద్ధములయందుఁ దప్పకజయమునుబొందువాఁడును, నగురాముఁడుఅతిశీఘ్రముగలేచి మంగళకరములగుతల్లులపాదములకు నమస్కారమునుజేసె. అంతటనాతల్లులందఱును, సుఖస్పర్శగలవియును, మెత్తనివ్రేళ్లుగలవియును, పావనములైనవియును హస్తములచేతఁ దమకునమస్కారమును జేయుచున్న రామునివీపునందలి దుమ్మునుదుడిచిరి. ఆసమయమునందు లక్ష్మణుఁడుగూడ నాతల్లులనందఱఁజూచి యధికమైనదుఃఖముగలవాఁడై రాముఁడునమస్కారమును జేయఁగానే మెల్లగాఁబోయి తానునునమస్కారమునుజేసె. అప్పుడాస్త్రీలందఱును రామునియందేవిధముగాఁబ్రవర్తించిరో యటులనే శుభలక్షణములుగలవాఁడును, దశరథునకుఁబుత్రుఁడునునగు లక్ష్మణునియందుఁగూడఁబ్రవర్తించిరి. ఆసమయమునందు సీతాదేవిగూడ మితిలేనిదుఃఖముగలదైయాయత్తగార్లపాదములకునమస్కారమునుజేసి వారలదగ్గరఁగన్నీళ్లనుబెట్టుకొని వెక్కివెక్కియేడ్చుచునిలిచియుండె. అవ్విధముగా నేడ్చుచున్నదియును, ఉపవాసములచేఁగృశించినదియును, దీనురాలును, దుఃఖముచేఁ బీడింపఁబడినదియును, నగుసీతాదేవినితల్లి కుమార్తెను కౌగలించుకొనినవిధముగఁ గౌసల్యాదేవికౌగలించికొని యిట్లనియె.

అయ్యో, జనకమహారాజునకుఁ బుత్రికయును, దశరథమహారాజునకుఁగోడలును, రామునకుభార్యయును, నగుసీతాదేవి నిర్జనమైనవనమునందిట్లు దుఃఖమునుబొందవలసివచ్చెనుగదా. ఓసీతా! ఎండదెబ్బచేత వాఁడినపద్మమువలెను, నలిగినకలువవలెను, దుమ్ముచేతవ్యాప్తమైనబంగారమువలెను, మేఘములచేత వ్యాప్తమైన చంద్రునివలెను, నున్ననీముఖమునుజూచుటవలనఁ గలిగినదియును, వ్యసనమనియెడు నరణియందుఁబుట్టినదియును నగుశోకము "నిప్పుతనకాధారమైన కట్టెనుదగులఁబెట్టువిధముగ" నన్నుదహింపకున్నదే? నేనేమిచేయుదును. ఈదుఃఖమును నేనెట్లుభరింతునని యధికముగనేడ్చె. ఇవ్విధముగరోదనమునుజేయుచు వ్యసనమునుబొందుచున్న సమయమునందు భరతునకన్నయును, రఘుకులమునందుఁ బుట్టినవాఁడును నగురాముఁడు, తల్లియొక్కయు, వసిష్ఠమహామునియొక్కయు, పాదములకునమస్కారమునుజేసె. అప్పుడురాముఁడు, నిప్పుతోసమానుఁడును, సర్వోత్తమమగుసమృద్ధియును, ప్రభావముగలవాఁడును, పురోహితుఁడునునగు వసిష్ఠమహామునియొక్కపాదములకు, "దేవేన్ద్రుఁడుబృహస్పతియొక్కపాదములకు నమస్కారమునుజేసినవిధముగ" నమస్కారమునుజేసి యావసిష్ఠమునితోఁగూడఁ గూర్చుండె. అటుపిమ్మట ధర్మవంతుడైనభరతుఁడు, మంత్రులతోడను, పౌరజనులతోడను, సైనికులతోడను, ధర్మమునుజక్కఁగాగుర్తెఱిఁగినజనముతోడను, గూడుకొనినవాఁడై రాము

నకుసమీపమునందుఁ గూర్చుండె. పరాక్రమవంతుఁడును, సమీపమునందుఁ గూర్చున్నవాఁడును, నగుభరతుఁడు, తపోవంతులవేషమును ధరించియున్నవాఁడును, కాంతిచేత నధికముగఁ బ్రకాశించుచున్నవాఁడునునగు రామునిజూచి "దేవేన్ద్రుఁడు బ్రహ్మదేవునిసమీపమునందుఁగూర్చుండి చేతులనుముకుళించుకొనినవిధముగఁ" జేతులనుజోడించుకొనియుండె. ఆసమయమునందుభరతుఁడు రామునకునమస్కారమునుజేసి సత్కరించి యేవిషయమును గుఱించి యేమాటలాడుననని భరతునితోఁగూడ వచ్చినవారును, పూజ్యులును, నగువారందఱును నధికమయిన కుతూహలముగలవారైయుండిరి. సత్యమైనధైర్యముగల రాముఁడును, మహానుభావుఁడగులక్ష్మణుఁడును, ధర్మాత్ముఁడగుభరతుఁడును, స్నేహితులతోఁగూడఁ గూడుకొనినవారైయజ్ఞశాలయందు సభికులతోఁగూడుకొనిన గార్హపత్యాహవనీయదక్షిణాగ్నులవలెఁ బ్రజ్వరిల్లుచుండిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటనాల్గవసర్గముగిసెను.

—✽ భరతుఁడు రామునినయోధ్యకురమ్మనిప్రార్థించుట. ✽—

అటుపిమ్మట సింహములవంటి రామలక్ష్మణభరతశత్రుఘ్నులు తమస్నేహితులు మొదలగువారితోఁ గూడుకొనివ్యసనమును బొందుచుండఁగానే యారాత్రియంతయునుగడచిపోయె. అంతఁ గొంతసేపటికిఁ దెల్లవారె. అప్పుడు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు స్నేహితులతోఁ గూడుకొనినవారై మందాకినీనదికిఁబోయి జపహోమాది కృత్యములనుజేసికొనిరి. అంతటభరతుఁడు మొదలగువారందఱును మరల రామునియొద్దకువచ్చి కూర్చుండిరి. ఆసమయమున నక్కడఁగూర్చున్నవారిలలో నొక్కఁడును నేమియునుమాట్లాడక యూరకుండిరి. అప్పుడు స్నేహితులమధ్యమందుఁగూర్చున్న భరతుఁడు రామునితోనిట్లనియె.

అన్నా! రామచంద్రా! నాకీరాజ్యము నాతల్లియగు కైకేయిచేతనివ్వఁబడినది ఈరాజ్యమునునీకు నేనిచ్చెదను. వర్షాకాలమునందు గొప్పదగు నుదకప్రవాహముచేఁ దెగినకట్టను మరలఁగట్టుటకుశక్యముగానివిధముగ నీగొప్పదగు రాజ్యభారమును నేనువహింపసమర్థుఁడను గాను మఱియునునీకంటె నితరుఁడెవ్వఁడును నీరాజ్యమునుభరింపఁదగినవాఁడు లేఁడు. రాజశ్రేష్ఠుఁడా! అన్నా! రాముఁడా! గుఱ్ఱముతోసమానముగ గాడిదెనడవలేనివిధముగను, గరుత్మంతునితోసమానముగ సాధారణమగు పక్షిపరుగెత్తలేనివిధముగను నీతోసమానముగ రాజ్యపాలనాదికమునుజేయుటకు నేను సమర్థుఁడను గాను. "శ్లో॥ సుజీవంనిత్యశస్తస్య యఃపరైరుపజీవ్యతే। రామతేనతుదుర్జీవంయః పరానుపజీవతి,, అన్నా! రామచంద్రా! పరులనుజీవింపఁజేయువాని జన్మముసఫలమైనదగును. పరులమూలకముగజీవించువానిజన్మము నిష్ఫలమగును. నేనుపరులమూలకముగ జీవింపఁదగినవాఁడనగుటచేత నాజన్మమువ్యర్థమైనది. నీవలననితరులనేకులు జీవించుచుందురుగనుక నీజన్మముసఫలమైనది. కాఁబట్టియో అన్నా! రామా! నీవురాజ్యమునుబాలింపఁదగినవాఁడవు. మఱియులోకములో నొకానొకపురుషుఁడువిత్తనమునుబెట్టి నీళ్లుపోసివృద్ధినొందించిన వృక్షముకొన్నిదినములకు, పొట్టివారలెక్కుటకు వీలుగానిదియగును. మఱియునధికములగు కొమ్మలుగలదియును, గొప్పదగుమొదటిభాగము గలదియునునగును. అట్టివృక్షముపుష్పించి ఫలములనివ్వకపోయెనేని దానినిబెంచినవానికష్టమంతయును వ్యర్థమగునుగదా? నిన్నుఁగనుటకనేకవిధములగు తపస్సులను జేసి మిగులఁగష్టములనుజెంది దశరథమహారాజు పోషింపఁదగినవారలనందఱను బోషించుటకుఁదగినసామర్థ్యముగల నిన్నుఁగనెను. ఇప్పుడునీవివ్విధముగ బోషింపఁదగినమమ్ములఁ బోషింపకయరణ్యమునందుంటివేని దశరథమహారాజుయొక్కయు, కౌసల్యాదేవియొక్కయు, కష్టమంతయును వృక్షమునుబెట్టిపెంచి దానిఫలము ననుభవింపనివాని కష్టమువలె నిష్ఫలమగును. కావున నీతల్లిదండ్రులకష్టమును వ్యర్థమునుగాఁజేయకుము.

రాజశ్రేష్ఠుఁడా! రామచంద్రా! ప్రధానులగుప్రజోత్తములును, మఱియునితరులగుమంత్రులు మొదలగువారును, నీవురాజ్యమునుబాలించుచు, "లోకములనుదపింపఁజేయుచున్నసూర్యునివలె శత్రువులనుదపింపఁజేయుచుండుటనుజూడవలయునని,, కోరికగలవారైయున్నారు- కావునవారల కోరికలనుదీర్పుము. కకుత్స్థవంశోద్భవా! మదపుటేనుఁగులునీవెంటనంటివచ్చుచుసంతోషముచేత ఘీంకారమును జేయునట్లుచేయుము. మఱియు నీవు రాజ్యపాలనను జేయుటనువిని యంతఃపురమునందలి స్త్రీలందఱును బరమానందమునుబొందునట్లుసేయుమనిభరతుఁడు చెప్పె. అప్పుడుపట్టణమునందుండునట్టిజనులందఱును రామునిబహువిధములఁబ్రార్థించుచున్న భరతునిమాటలనువినియనేకవిధములశ్లాఘించిరి. ఆసమయమునందుబుద్ధిమంతులలోనుత్తముఁడును, ధైర్యముగలవాఁడును, నగురాముఁడు; అనేకవిధములఁ దన్నుబ్రార్థించుచున్నవాఁడును, నధికమగువ్యసనముచేనేడ్చుచున్నవాఁడునునగుభరతునిజూచి య

నేకవిధముల నూరడించియిట్లనియె.

"శ్లో॥ నాత్మనః కామకారో౽స్తి పురుషో౽యమనీశ్వరః। ఇతశ్చేతరతశ్చైవ కృతాంతః పరికర్షతి,, తమ్ముఁడా! భరతా! ఏకార్యమునందును పురుషుఁడు స్వతంత్రుఁడుగాఁడు సర్వవిషయములయందును పురుషుఁడు దైవాధీనుఁడై యుండును. దైవము పురుషుని నిటునటుత్రిప్పుచుండునని యెఱుంగుము. మఱియు నో భరతుఁడా! ధనమెంతయధికముగాఁ జేర్చినను తుదకు నశించును గాని స్థిరముగా నుండనేరదు. ఎంతగొప్పపదవిని బొందినను, ఎన్నటికో యొకనాటికిఁ దక్కువస్థితిని బొందవలసినదేగాని వేరుగాదు. భార్యాపుత్రులు మొదలగువారలతో నెంతటిసంబంధము గలిగియున్నను గొన్నిదినములకు వియోగము గలుగును గాని మఱియొకటిగాదు. ఎన్నిదినములు జీవించినను నొక్కనాటికి మరణమును బొందవలసినదే గాని స్థిరముగా నుండుటకు వీలులేదు. చక్కగా ఫలించిన ఫలము కొన్నిదినములకుఁ జెట్టునుండి జాఱి క్రిందఁబడు విధముగాఁ బుట్టిననాఁడు మొదలుకొని వృద్ధిని బొందింపఁబడిన శరీరమెప్పుడో యొకప్పుడు ప్రాణహీనమై క్రిందఁబడును. కావున ఫలమునకుఁ గ్రిందఁబడుటకంటెను, శరీరమునకు మరణము గలుగుటకంటెను నితరమైన భయమేమియు లేదు. మఱియు తమ్ముఁడా! భరతా! "శ్లో॥ యథాగారం దృఢస్థూణం జీర్ణం భూత్వావసీదతి। తథైవ సీదంతి నరాజరామృత్యువశంగతాః,, ఎంత దృఢమైన స్తంభములును, దూలములును గలదైనను, గృహము కొన్నిదినములకు జీర్ణమై క్రిందఁగూలు విధముగా, మానవులెంత దృఢమైన శరీరములు గలవారైనను గొన్నిదినములకు మరణమును బొందుదురు. కావున మనము స్థిరముగా నుందుమని తలఁపఁగూడదు. మఱియు నో భరతుఁడా! పోయిన రాత్రి మరలనెన్నటికిని రాదు. సముద్రములోనికి బోయిన యమునానదీప్రవాహము మరలనెప్పటికిని దిరిగి రానేరదు. కడచిపోవుచున్న రాత్రింబగళ్లు గ్రీష్మకాలమునందు సూర్యునికిరణములు భూమిలోనియుదకమును సర్వమును నపహరించు విధముగ మానవుల ప్రాణమును నపహరించుకొనిపోవుచున్నవి. కావున నో భరతుఁడా! పరులను గురించి వ్యసనమును బొందుటవలనఁ బ్రయోజనమేమి? నిన్ను గుఱించియే నీవు వ్యసనమును బొందుము. నీవు లేచినపుడును వంగినపుడును, నడచినపుడును నీయాయుర్దాయము నశించిపోవుచున్నది. మఱియు నో భరతుఁడా! "శ్లో॥ సహైవ మృత్యుర్వ్రజతి సహమృత్యుర్నిషీదతి। గత్వా సుదీర్ఘమధ్వానం సహమృత్యుర్నివర్తతే,, మానవులు నడుచునపుడు మృత్యుదేవత వెంటనంటి నడుచుచుండును. మానవులు గూర్చున్న సమయమునందు మృత్యుదేవత వారలతోఁ గూడఁ గూర్చుండును. మానవులెంత దూరము పోయివచ్చినను, మృత్యువు వారలతోఁ గూడనే పోయివచ్చుచుండును. కావున మనము స్థిరముగ నుందుమని యెంచకుము. తమ్ముఁడా! భరతుఁడా! నీశరీరము ముడతలుపడుచున్నవి. వెంట్రుకలు నెరిసిపోవుచున్నవి. శరీరమునందు ముసలితనము ప్రవేశించి బాధించుచున్నది. కాఁబట్టి నీవు మిక్కిలిగా ముసలితనమును బొందినపిమ్మట నేమి చేయఁగలవు. కావున నిప్పుడే బ్రహ్మవిచారమును జేయుము. లోకములో పురుషుఁడు యౌవనకాలమునందే బ్రహ్మవిచారమును జేయవలసినదని నీవెఱుఁగుదువు గదా? మఱియు నో భరతుఁడా! "శ్లో॥ నందంత్యుదిత ఆదిత్యే నందంత్యస్తమితే రవౌ। ఆత్మనో నావబుధ్యంతే మనుష్యా జీవితక్షయమ్,, లోకములోని మానవులందఱును సూర్యోదయమైనదనియును, సూర్యుఁడస్తమించెననియును, సంతోషమును బొందుదురు గాని తమయాయుష్యము నశించిపోవుచున్నదని యెన్నడము లేదు. (అనఁగా నొక్కొక్కదినము గడచినకొలఁది తన జీవితకాలమునం దొక్కొక్కదినము తగ్గిపోవుచున్నదనుట) మఱియు నో భరతుఁడా! లోకములోని మానవులందఱును క్రొత్తక్రొత్తవియగు ఋతువులను జూచి సంతోషమును బొందుచున్నారే గాని ఋతువులు మారిపోవుచుండుటచేత నాయుష్యము తగ్గిపోవుచున్నదని యెంచడము లేదు. ఒక్కొక్కఋతువు వచ్చినప్పుడు వ్యసనమును బొందుటను మాని సంతోషమును బొందుట యెంతయవివేకమన వచ్చును. మఱియు నో తమ్ముఁడా! భరతా! మహాసముద్రమునందు రెండుకొయ్యలొకటిగాఁ జేరి మగులఁ గాలవశము చేత నా రెండును భిన్నమైపోవు విధముగా భార్యాపుత్రులు మొదలగువారును, జ్ఞాతులును, ధనములును నొకప్పుడు వచ్చి తనతోఁ జేరియుండును. మరల నొకప్పుడవియన్నియును గాలవశముచేత వియోగమును బొందిపోవును. కావున భార్యాపుత్రాదుల సంబంధము శాశ్వతమని యెన్నఁగూడదు. మఱియు నో భరతుఁడా! ఈలోకమునందు ఏప్రాణియును మరణమును బొందినపిదప మరల జీవించుట లేదు. కాఁబట్టి చచ్చిపోయినవారలను గుఱించి యెంత యేడ్చినను బ్రతికింపఁ జేయుట శక్యము గాదు. లోకమునందు మార్గమున నడచుచున్నవాఁడు తనతో సమముగ నడచుచున్న బాటసారులను జూచి యిట్లని చెప్పును.

ఓ బాటసారులారా! మీరు ముందరఁ బొండు. నేను గొంచెము సేపు కూర్చుండి యాయాసమును దీర్చుకొని మీమార్గము ననుసరించి వచ్చెదనని చెప్పును పిమ్మటఁ గొంతసేపటికి దానును గూడ నామార్గము నే పట్టిపోవును. అటుల నేమనతం

డ్రియగు దశరథమహారాజుగూడ మనపూర్వులందఱును
బోయినమార్గము ననుసరించిపోయె. రేపుమనముగూడను
నతండ్రిపోయినమార్గమును బట్టిపోవుటకుసిద్ధముగనున్నా
ము. ఇట్లుండగనీవుమూఢునివలె వ్యసనమునుబొందుట
యుచితముగనుండలేదు. మఱియునోభరతుఁడా! ఏదిమర
లరాదో దానినిగుఱించివ్యసనమునుబొందనేల? తెలియక
వ్యసనమునుబొందినను బ్రయోజనమేమి? పోయినప్రవా
హముమరలరానివిధముగ గతించినవయస్సు మరలరానేర
దు. కాఁబట్టిమానవులందఱును బరలోకమునందు సుఖము
నుగలుగఁజేయునట్టి ధర్మమార్గమునందుసంచరింపవలయు
నని వేదవేత్తలుపలుకుదురు. మఱియునోతమ్ముఁడా! ధ
ర్మాత్ముఁడును, పృథివీపతియును, మనకుఁదండ్రియునున
గుదశరథమహారాజు, శుభకరములైనవియును, భూరిద
క్షిణలుగలవియును, నానావిధములును, నగుయజ్ఞములను
జేసిస్వర్గలోకమునకుఁబోయె. మఱియునిష్పక్షపాతము
గఁ బ్రజలనుబాలించుటవలనను, చక్కఁగాభృత్యులనుబో
షించుటవలనను, ధర్మమార్గమునువదలక ద్రవ్యమునుసం
పాదించుటవలనను నధికమైనపుణ్యముగలవాఁడై స్వర్గలో
కమునకుఁబోయె. మఱియునోభరతుఁడా! మనకుఁదండ్రి
యును, భూమికిభర్తయునునగు దశరథమహారాజు, మం
గళకరములగు కర్మలనుజేయుటచేతను, శాస్త్రోక్తదక్షిణ
లుగల యజ్ఞములనుజేయుటచేతను నధికమగుపుణ్యముగల
వాఁడై స్వర్గలోకమునకుఁబోయె. మఱియునోభరతుఁ
డా! మనకుదండ్రియగుదశరథమహారాజు నానావిధముల
గుయజ్ఞములనుజేసె. చిరకాలము సకలైశ్వర్యములనను
భవించె. పూర్ణాయుర్దాయముగలవాఁడైజీవించె. ఇట్లు
అనేకదినములుజీవించి తుదకుఁబుట్టినవారందఱును బోవున
ట్టిమార్గమునుబట్టిపోయె. రఘుకులోద్భవుఁడగు దశరథమ
హారాజు సకలభోగములననుభవించి పూర్ణాయుర్దాయ
మునుబొంది పిదపస్వర్గలోకమునకుఁబోయె. కావుననో
నాయనా! తమ్ముఁడా! భరతా! సత్పురుషులచేతసత్క
రింపఁబడినవాఁడును, స్వర్గలోకము బొందినవాఁడును
నగు దశరథమహారాజునుగురించి మనముదుఃఖమునుబొం
దుటయుచితముగాదు. మనకుఁదండ్రియగుదశరథమహారా
జుశిథిలమగునట్టి మానుషదేహమునువదలి బ్రహ్మలోకము
నందు సంచరించుటకుఁదగినదియును, దివ్యమైనదియును,
సకలసమృద్ధులునుగలదియును నగుశరీరమును బొందియు
న్నాఁడు. కావునమనముమనతండ్రినిగురించి దుఃఖమును
బొందుటయుచితముగాదు. సకలవిద్యలనుచదివినవాఁడవు
ను, బుద్ధిమంతులలోనుత్తముఁడవును, నైనయోభరతుఁ
డా! నీవుచ ఋఁడైనదశరథమహారాజునుగుఱించి దుఃఖిం
పఁదగదు. నీయట్టిబుద్ధిమంతుఁడు లోకమునందెవ్వఁడును
మృతినొందినవారలనుగురించి వ్యసనమునుబొందఁడు. కా
వునమిగులబుద్ధిమంతుఁడవును, ధీరుఁడవునునగునీవిట్లువ్యస
నమునుబొందుటయును, కన్నీళ్ళనువిడుచుటయునుదగియుం
డలేదు. కాబట్టిసకలావస్థలయందును వీనినివదలిపెట్టుము.
మాటలాడువారలలో నుత్తముఁడవగు నోభరతుఁడా!
నీవుస్వస్థచిత్తుఁడవగుము. దుఃఖమునుబొందకుము. నీవుపో
యి యయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశింపుము. జితేన్ద్రి
యుఁడును, తండ్రియును, నగుదశరథమహారాజు నిన్ను
రాజ్యమునుబాలింపుమని యాజ్ఞయిచ్చె. కావునఁదండ్రి
యొక్కయాజ్ఞను నెరవేర్పకపోవుట యుచితమైనకార్య
ముగాదు. పావనమైనపనులనుజేసినట్టి దశరథమహారాజు
నన్నువనవాసమును జేయుమనియాజ్ఞాపించె. కావుననేను
దండ్రయగు దశరథమహారాజుచెప్పినచొప్పున వనవాసము
నుజేసెదను. శత్రుమర్దనుడవగునోభరతుఁడా! నేనుదం
డ్రియగుదశరథమహారాజుయొక్క యాజ్ఞనువదలుటకుఁద
గినవాఁడనుగాను. నీవుగూడఁదండ్రిమాటలయందు గౌరవ
మునుంచుము. మనకుఁదండ్రియును, బంధువును దశరథుఁ
డేగాని యతనికంటెవేరొక్కఁడులేడు. కాఁబట్టిధర్మమును
దప్పకసంచరించిన తండ్రియొక్కయాజ్ఞను శిరస్సునందుఁ
బెట్టుకొనియెదను. నేనువనవాసమునుజేయుచుఁ దండ్రి
యొక్కయాజ్ఞను నెరవేర్చెదను. మానవశ్రేష్ఠుఁడవగునో
భరతుఁడా! పరలోకమునందు సకలసౌఖ్యములనుబొంద
వలయుననితలఁచువాఁడు, ధర్మాత్ముఁడును, హింసాకృ
త్యములనుజేయనివాఁడును, గురుశుశ్రూషనుజేయువాఁడు
నుగానుండవలయును. మఱియుమనకుఁదండ్రియగు దశరథ
మహారాజుయొక్క శుభకరమైననడవడినిచూచి రాజభావ
మునవలంబింపుమని మహాత్ముఁడగురాముఁడుచెప్పె. ఇవ్విధ
ముగాఁదమ్ముఁడగు భరతునితోఁ దండ్రియొక్కయాజ్ఞనుబ
రిపాలింపుమని యనేకవిధములఁజెప్పి ప్రభువగురాముఁ
డు స్వల్పకాలమునందేవిరమించి యూరకుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటయైదవస
ర్గముగిసెను.

—{ భరతుడు రాముని బట్టాభిషిక్తుఁడవు గమ్మనియనేకవిధములఁబ్రార్థించుట. }—

ఇవ్విధముగా మిగులగంభీరమైన యర్థముగలవచనము
లనుజెప్పి రాముఁడూరకుండఁగానే ధర్మవంతులలోను
త్తముఁడగు భరతుఁడుమందాకినీతీరమందు నివసించిన



రాముని అయోధ్యకు రమ్మని భరతుడు ప్రాదేయపడుట

వాఁడును, స్వభావముచేతనే దయగలవాఁడునునగు రామునితో ధర్మయుక్తములగు మాటలను జెప్పఁదలఁచి యిట్లనియె.

శత్రుమర్దనుఁడవగు రామచంద్రా! అన్నా! దుఃఖము వచ్చినపుడు వ్యసనమునుబొందనివాఁడును, సంతోషమువచ్చినపుడు సంతోషింపనివాఁడును, సర్వకాలములయందును సమభావముతోనుండువాఁడునునగు మానవుఁడు యీలోకమునందు నీకంటెమఱియింకొకని నెవ్వనింగానము. నీవువృద్ధులకుమిగులనిష్టుఁడవై సర్వకాలములయందునునీసంశయములను వృద్ధులనడిగి తీర్చుకొనుచుందువు. "చచ్చినవాఁడెట్లు నిర్వ్యాపారుఁడైయుండునో యటులనే బ్రతికియుండియును నిర్వ్యాపారముగనుండువాఁడును, "సకలపదార్థములును లేనివాఁడెట్లు దేనినిభుజింపకయుండునో యటులనే సకలపదార్థములును గలిగియుండియును నపేక్షింపనివాఁడును, లాభాలాభములయందు సమమైనబుద్ధిగలవాఁడును నీకంటెనితరుఁడెవ్వఁడును లేఁడు. రాజశ్రేష్ఠుఁడవగునో రామచంద్రా! నీవు, ఆత్మానాత్మవివేకముగలవాఁడవగుటచే వ్యసనకారణముగలవాఁడవయ్యును వ్యసనమునుబొందకయున్నావు. కావుననీవంటిమహానుభావుఁడెందునులేఁడనియెంచెదను. నీవుదేవసమానుఁడవు. ఇంతయగాకమహాత్ముఁడవు. మఱియు సకలయుద్ధములయందునుజయముగలవాఁడవు. ఇంతియగాక సర్వమునుదెలిసినవాఁడవు. సర్వశాస్త్రములను జదివినవాఁడవు. సర్వమునుజూచువాఁడవు. బుద్ధిమంతులలో మిగులను త్తముఁడవు. కావుననీయట్టిమహానుభావుఁడు ముల్లోకములయందును లేఁడు. అన్నా! రామచంద్రా! ఇవ్విధముగా సకలగుణములతోఁడనుగూడినవాఁడవును, ఉత్పత్తివినాశములను జక్కఁగఁదెలిసినవాఁడవునునగునీవు, లోకములోనివారలకందఱకును దుఃఖమునుగలుగఁజేయునట్టి కార్యమునుజేయుటకు దగినవాఁడవుగావు. నేనుదూరదేశమునకుఁ బోయియున్న సమయమునందు నీచస్వభావముగలదియును, నాకుఁదల్లియునునగుకైకేయి నానిమిత్తముగఁ బాపకార్యమునుజేసె. ఈపనినాకెంతమాత్రమును సమ్మతమైనదిగాదు. కావుననీవు నాయందుఁ బ్రసన్నుఁడవగుము. అన్నా! రామా! నేనుధర్మపాశముచేబద్ధుఁడనైతిని. అట్లుకాకపోతినేని పాపకృత్యమునుజేసినదియును, కావుననేదండించుటకుఁ దగినదియునునగునాతల్లికి మిగులఁగఠినమైనదండనమునువిధించియుందును. ధర్మపాశబద్ధుఁడనగుటచేనవదలితిని. పరిశుద్ధమైనకులమునందుఁ బుట్టినవాఁడును, నిర్మలమగు పుణ్యకార్యములనుజేసినవాఁడును, నగుదశరథునకుఁబుత్రుఁడనైయట్టి సకల ధర్మములను దెలిసికొని యధర్మమును గలిగించునదియును, లోకనింద్యమునునగు కర్మను నేనెట్లుచేయుదును. గురువనియును, యాగముమొదలగు సత్క్రియలను జేసినవాఁడనియును, ముసలివాఁడనియును, తండ్రియనియును, చచ్చిపోయినాఁడే, యనియును, దేవతయనియును, తలఁచిసభయందు. మనకుదండ్రియైనదశరథమహారాజును నిందింపకయూరకుంటిని. సకలధర్మములను దెలిసినయోఅన్నా! రామా! ధర్మములన్నింటిని దెలిసినమానవుఁడెవ్వఁడైనను, అదుదానికిఁ బ్రియమును జేయుటకొఱకుఁగా ధర్మార్థహీనమైనదియును, ఘోరమగుపాపమును గలిగించునదియును నగుకార్యమును జేయునా? దశరథునికంటెనితరుఁడెవ్వఁడును నిటిపాపకృత్యమును జేయఁడు. పూజ్యుఁడవైనయో రామా! అంత్యకాలమునందు సకలభూతములకును బుద్ధిమాంద్యముగలుగునని లోకులందఱును జెప్పుకొనుచున్నవిషయము, పాపకృత్యమును మరణకాలమునందు మనతండ్రి చేయడముచే నదివాస్తవమని తోఁచుచున్నది, మఱియు కైకేయి విషమునుద్రావిచచ్చెదనని కోపమునుగనపరుచుటవలనను, దానుకైకేయియందు మోహముగలవాఁడైయుండుటవలనను, వృద్ధుఁడగుటవలనను, మనతండ్రియగు దశరథమహారాజు ధర్మమునువదలి యధర్మకార్యమును జేసె. మనతండ్రిచేసినయధర్మమును జక్కఁపరచి లోకమునందు మనతండ్రికిఁ గీర్తివచ్చునట్లు చేయుము. లోకములోనే పుత్రుఁడు తండ్రియాచరించినయధర్మమును ధర్మమగునట్లు జేయునో యటువంటివాఁడే పుత్రుఁడుగాని యన్యుఁడు పుత్రుఁడుగాఁడు. అవ్విధముగానీవుతండ్రికి సరియగుపుత్రుఁడవగుము. తండ్రిచేఁ జేయఁబడినదియును, లోకులచేనిందింపఁబడినదియునునగు కర్మనుగొంచెమైనను పేక్షను జేయకుము. నీయట్టిసత్పుత్రుఁ డెంతమాత్రమును దండ్రియొక్క యధర్మమునుజక్కపఱుపక యూరకుండుటతగదు. అన్నా! రామా! నీవు కైకేయిని, నన్నును, తండ్రిని, స్నేహితులను, బంధువులను, పట్టణమునందుండువారలను, పల్లెటూరివారలను, మఱియునితరులగువారలను, నీరాజ్యమును సర్వమును, గాపాడుటకుఁదగినవాఁడవు, మఱియుఅరణ్యమెక్కడ? క్షత్రియత్వమెక్కడ? జడలనుధరించుటయెక్కడ? రాజ్యమునుబాలించుటయెక్కడ? నీయట్టిమహానుభావుఁడిట్టివిధముగా విరుద్ధమైనకార్యమును జేయుటతగదు. పండితులలో శ్రేష్ఠుఁడవగునో రాముఁడా! ప్రజాపరిపాలనమును జేయుటకు మూలభూతమైనపట్టాభిషేకమే క్షత్రియునకు ముఖ్యమైనటిధర్మమైయున్నది. లోకములో నెవ్వఁడైనను, ప్రత్యక్షమునువదలి సంశయము నందున్నదియును,

లక్షణములేనిదియును, వేరొకకాలమునందు ఫలమునిచ్చునదియును, నిశ్చయములేనిదియునునగు ధర్మమునునాచరించునా? క్షత్రియుఁడగువాఁడు ప్రత్యక్షమునువదలి యెన్నటికోరాఁబోవునట్టి ఫలమునుగుఱించి యోచించుటతగదు. మిగులశ్రమపడియే ధర్మమునాచరింపవలయునని తలఁచెదవేని బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులను మఱియునితరులనుజక్కఁగాఁబరిపాలించి యధికశ్రమనుబొందిధర్మవంతుఁడవగుము. సకలధర్మములనుదెలిసిన యోరామా ధర్మవేత్తలగువారు బ్రహ్మచర్యగార్హస్థ్య వానప్రస్థయత్యాశ్రమములలోగృహస్థాశ్రమముత్తమమైనదనిచెప్పుదురు. కావుననీవుగృహస్థధర్మము నాచరించుటయుచితము నేను నీకంటె విద్యచేతను, స్థానముచేతను, పుట్టువుచేతనుజిన్నవాఁడను. ఇట్లుసర్వాత్మనా చిన్నవాఁడనైన నేనునీవుండగ నేనెట్లురాజ్యమును బాలింపఁగలను తక్కువదగుబుద్ధిగలవాఁడను, తక్కువదగు గుణముగలవాఁడను, స్థానముచేతంగూడఁజిన్నవాఁడను, నైననేనునిన్నువదలిపెట్టియుండుట కెట్లుసంతోషముగలవాఁడనగుదును. సకలధర్మములనుదెలిసినయోరామా! తండ్రివలనవచ్చినదియును, శత్రురహితమైనదియును, నగునీరాజ్యమునుసర్వమును, బంధువులతోఁగూడినవాఁడవై యేవిధమైనయధర్మమును రాకుండునట్లుపాలింపుము. సకలజనులును, వసిష్ఠుఁడు మొదలగుమహాత్ములతోఁ గూడినమంత్రులును, మఱియునితరులును వొక్కటిగాఁజేరి యిక్కడనేనిన్నుఁబట్టాభిషిక్తునిఁగాఁ జేయుదురుగాక శత్రువులనందఱజయించిన యిన్ద్రుఁడుస్వర్గమునందు దేవతలచేఁబట్టాభిషిక్తుఁడైనవిధముగ నీవుగూడనిందలిజనులచేత నభిషేకింపఁబడినవాఁడవై యయోధ్యాపట్టణమును బాలించుటకుఁబొమ్ము మఱియునోరాముఁడా! నీవయోధ్యాపట్టణమునకుఁబ్రభుఁడవై దేవర్షిపితృఋణములను మూఁటినిదీర్చుచు దుష్టులగువారలనందఱను వహించుచు స్నేహితులకోరికలనన్నిఁటినిదీర్చుచు మిగులమనోహరముగఁ బ్రజాపరిపాలనను జేయుము. అన్నా! రామా! నీవిప్పుడుపట్టాభిషిక్తుడవగుటచేత నీస్నేహితులందఱును బరమానందమును బొందుదురుగాక. నీవుపట్టాభిషిక్తుఁడవైనవృత్తాంతమును విని నీశత్రువులందఱునుభీతినొందినవారై పదిదిక్కులకును బరుగెత్తుదురుగాక. పురుషోత్తముఁడవైన యోరామా! నాతల్లియగు కైకేయిచేసినదుష్కార్యమును మనస్సునందుఁబెట్టక మిగులఁబూజ్యుఁడైనతండ్రికిఁ బాపమురాకుండునట్లుసేయుము. నేనునీకుసాష్టాంగ నమస్కారమును జేసియాచించెదను. నాయందుఁగరుణింపుము. మఱియును సకలభూతములయందును, బంధువులయందును దయగలవాఁడవగుము. నాప్రార్థననంగీకరింపక నామాటలనుబృష్ఠభాగమునందుఁబెట్టి పడియుండనిమ్మనియంటివేనినేనుగూడనరణ్యమునందు సంచరించెదననిభరతుఁడుచెప్పె. సర్వోత్తమమైనధైర్యముగలరాముఁడుఅవ్విధముగా,తహతహపడుచున్న భరతుఁడుచెప్పినమాటలనువినియును, రాముఁడయోధ్యాపట్టణమునకుఁ బోవుటకుయత్నింపకయూరకుండె. మఱియునుదండ్రియొక్కయాజ్ఞను బరిపాలించుటయందే యిష్టముగలవాఁడైయుండె. అవ్విధముగా రాముఁడుమిగులనాశ్చర్యకరమగు ధైర్యమునవలంబించియుండుటనుజూచి యందలివారందఱును రాముఁడయోధ్యాపట్టణమునకురాఁడేయను, దుఃఖమును, రాముఁడుమిగులస్థిరమయినప్రతిజ్ఞగలవాఁడును, మిక్కిలిగొప్పదగు ధైర్యముగలవాఁడనియెడు సంతోషమునుబొందినవారైరి. ఆసమయమునందుఋత్విక్కులును, పురజనులలోనుత్తములగువారలును, రాముఁడుమరలరాఁడని దృఢముగాఁదెలిసికొనినతోడనే మూర్ఛనుబొందినవారై యపరిమితముగఁగన్నీళ్ళనువిడిచిరి. మఱియునాసమయమునందు రామునితల్లులందఱును, రామునిరమ్మనియాచించుచున్న భరతునిసుగుణముల ననేకవిధములఁబొగడిరి. మఱియుఁదాముగూడ రామునకువినయపూర్వకముగజెప్పిరి మఱికొందఱునమస్కారమును జేసి యాచించిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటఆరవసర్గ ముగిసెను.

—✵ రాముఁడుభరతునకుసమాధానముజెప్పుట. ✵—

అటుపిమ్మట నధికమయినకాంతిగలవాఁడును, సకలబంధుజనులచేతను బూజింపఁబడినవాఁడును, లక్ష్మణునకన్నయునునగు రాముఁడవ్విధముగ మాటలాడుచున్నభరతునితోనిట్లనియె.

తమ్ముఁడా! భరతా! రాజోత్తముఁడగు దశరథమహారాజువలనఁ గైకేయియందుఁబుట్టినసత్పుత్రుఁడవగు నీవచనము మిగులమనోహరముగనున్నది ఈవచనమునీకుఁ దగియేయున్నది. తమ్ముఁడా! పూర్వమునందు మనకుదండ్రియగుదశరథమహారాజు కైకేయినిఁబెండ్లియాడునపుడు నీకుమాతామహుఁడగు కేకయమహారాజుతో నీకుమాతకుబుట్టినపుత్రునకే రాజ్యమునిచ్చెదననియె. మఱియు దేవాసురయుద్ధమునందు నీతల్లియగుకైకేయిచేసిన యుపచారములకుసంతోషించినవాఁడై రెండువరములనిచ్చెదననినీతల్లి

యగుకైకేయితోఁ జెప్పె అంతటఁ గీర్తివంతురాలగు నీత ల్లికైకేయి ముందుగా బట్టును బెట్టించి నా రెండువరముల ను నాకివ్వుమని దశరథమహారాజు నడిగె ఆ రెండువరముల లో నొకటి తనపుత్రునకు రాజ్యమునిచ్చుటయును, రెండ వది రాముఁడరణ్యమునకుఁ బోవలయుననిచెప్పె అంతట దశరథమహారాజు ఆ రెండువరములను నిచ్చెదననియె. కా వునఁ బురుషులలో శ్రేష్ఠుఁడవైనయో భరతుఁడా! మా కుఁ దండ్రియగు దశరథమహారాజు నన్ను అరణ్యమునకుఁ బోయి పదునాలుగుసంవత్సరములు నివసింపుమనియె అదికారణ ముగ నేను సీతాలక్ష్మణులతోఁ గూడి యీనిర్జనారణ్య మునకువచ్చితిని. మఱియు నెదురులేనివాఁడ నయ్యును తం డ్రిగారివచనము అసత్యము కాఁగూడదని నేనువనమునకు వచ్చితిని. రాజేన్ద్రుఁడవైనయో భరతుఁడా! నీవు గూడ తం డ్రిగారివచనమును సత్యమునుగాఁ జేయుటకు శీఘ్రముగా బట్టాభిషిక్తుఁడవగుము. ఇట్లు సేయుటకు నీవు తగినవాఁడవు కావున నీవు తండ్రిగారివచనమును అసత్యమునుగాఁ జేయకు ము. తమ్ముఁడా! భరతుఁడా! ప్రభువగు దశరథమహారా జును, నానిమిత్తముగ సత్యవంతునిగాఁ జేసి కైకేయీఋణ మునుండి తొలిగింపుము. తల్లియగు కైకేయియందుఁ గోప మును బొందక సత్కరింపుము. ఇవ్విధముగఁ బ్రవర్తించి తల్లి యగు కైకేయికిని, తండ్రియగు దశరథమహారాజునకును, సంతోషమును గలిగింపుము. మఱియు నాయనా! భరతుఁ డా! పూర్వము గయాక్షేత్రములయందుఁ గీర్తివంతుఁడు ను, యజ్ఞములను జేయుచున్నవాఁడును, నగు గయుఁడు పితృ దేవతలను దేశించి చెప్పిన చరిత్రమును వినియున్నావు గ దా! అయినను నేను సంగ్రహముగ వివరించి చెప్పెదను. సావధానుఁ డవై వినుము. తండ్రికి, పుత్, అను నరకము రాకుండునట్లు సేయువాఁడు పుత్రుఁడనియె. అట్లుగా జేసి తండ్రుల సెవ్వఁ డుగాపాడునో యతఁడు పుత్రుఁడగునని చెప్పె మఱియు నుగుణవంతులును, సకలశాస్త్రములను జదివినవారునున గు పుత్రుల ననేకులఁ గోరవలయుననియె. అదృష్టవశమువ లన గుణవంతులును విద్యావంతులును నగు పుత్రుల నేకులు పు ట్టిన యెడల నొక్కఁడైనను గయాక్షేత్రమునకుఁ బోయి య క్కడ శ్రాద్ధము నాచరించి పితృదేవతలకుఁ బ్రహ్మలోకము నుగలుగఁ జేయవలయుననియె. ఇవ్విధముగా గయుఁడు చె ప్పిన చరిత్రమును విని పూర్వరాజులందఱును ప్రవర్తించి రి. కావున రాజపుత్రుఁడవును, ప్రభుపుఁడవును, పురు షోత్తముఁడవును నైనయో భరతుఁడా! నీవు గూడఁ బూర్వ పు రాజులవలెనే మనతండ్రియగు దశరథమహారాజునకు న రకలోకనివాసము రాకుండునట్లు చేసి కాపాడుము. పరా క్రమవంతుఁడవైనయో భరతుఁడా! శత్రుఘ్నునితోఁ గూడఁ గూడుకొనినవాఁడవై బ్రాహ్మణులు మొదలగు సకలజనుల నుగాపాడుటకొఱ కయోధ్యాపట్టణమునకుఁ బొమ్ము. పో యి యెల్లవారలను జక్కఁగఁ బాలింపుము. రాజశ్రేష్ఠుఁడవగు నో భరతుఁడా! నేను సీతాలక్ష్మణులతోఁ గూడఁ గూడుకొ నిమిగుల శీఘ్రముగా దండకారణ్యమునకుఁ బోయెదను. త మ్ముఁడా! భరతా! నీవు పోయి స్వయముగానే సకలమాన వులకును బ్రభుఁడవగుము. నేను వనమునందలి మృగములక న్నిఁటికిని రాజరాజునగుదును. భరతుఁడా! నీవు మిగుల సం తోషముతోఁ గూడినవాఁడవై పట్టణములలోపల మిగుల ను త్తమమగు నయోధ్యాపట్టణమునకుఁ బొమ్ము. నేను గూడఁ బరమసంతోషముగలవాఁడనై దండకారణ్యమునందుఁ బ్ర వేశించెదను. భరతుఁడా! గొడుగు నీకెండతగులకుండునట్లు సూర్యకిరణములను బాధించునట్టి నీడను గలుగఁ జేయుఁగాత నేనుగూడ నీవనమునందలి వృక్షములయొక్క చల్లనినీడ నా శ్రయించి సుఖముగా నుండెదను. మిగుల నిపుణమైనబుద్ధిగల శత్రుఘ్నుఁడు నీకు సహాయుఁడై యుండుగాక. ముఖ్యస్నే హితుఁడు లక్ష్మణుండని మీకందఱకును దెలిసినవిషయమే గ దా? దశరథమహారాజునకుఁ బుత్రులమైన మనము నల్వుర మును దశరథమహారాజును సత్యవంతునిగాఁ జేయుదము. త మ్ముఁడా! భరతుఁడా! నీవీవిషయమునందుఁ గొంచెమైన నువ్యసనమును బొందకుము.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటయేడవస ర్గము ముగిసెను.

జాబాలిమహర్షి రామునకు, నాస్తికమతము నుబోధించుట.

అప్పుడివ్విధముగా భరతుని నూరడించుచున్నవాఁడు ను, ధర్మమును దెలిసినవాఁడునునగు రామునితో బ్రాహ్మ ణోత్తముఁడగు జాబాలిమహర్షి అధర్మమైనమాటను జెప్పఁద లఁచి యిట్లనియె.

రఘువంశోద్భవుఁడా! రామచంద్రా! మిగులఁ బూజ్య మైనబుద్ధిగలవాఁడవును, తేజోవంతుఁడవును నగు నీకు మూ ఢునకువలె నిష్ప్రయోజనమైనబుద్ధి పుట్టుటకుఁ గారణమేమి? ఇటువంటిబుద్ధి నీకుఁ గలుగకపోవుగాక. రాముఁడా! "శ్లో॥ కఃకస్య పురుషో బంధుః కిమాప్యం కస్య కేనచిత్। యదేకో జాయతే జంతు రేక ఏవ వినశ్యతి,, ఈలోకమునందుఁ బుట్టు నట్టిజంతువులన్నియు నొంటరిగానే పుట్టుచున్నవి. మరణ మును బొందునపుడు గూడ నొంటరిగానే చచ్చిపోతున్నవి. కావున లోకములో నెవ్వని కెవ్వఁడు బంధుఁడు. దేని చేత నె

వ్వఁడేమిలాభమును బొందును వెఱ్ఱితనముచేతలోకమంతయు ప్రవర్తించుచున్నది. కావున నో రాముఁడా! ఈలోకమునం దెవ్వఁడు తండ్రి యనియును, తల్లియనియును, పిచ్చితలంపును బెట్టుకొని భక్తిశ్రద్ధలతోఁ దల్లిదండ్రులను బూజించుచున్నాఁడో వాఁడు పిచ్చివాఁడే గాని మరియొకఁడు గాఁడు. ఈలోకమునం దొకరికొకరి కెంతమాత్రమును సంబంధము లేదు. మఱియు నో రాముఁడా! లోకములో నిమానవుఁ డొకగ్రామమునుండి వేరొకగ్రామమునకుఁ బోవునపుడు మార్గమునం దెక్కడనైనను గొంచెము సేపు నివసించి మఱుదినమచ్చోటునుండి బయలువెడలి తాను బోఁదలఁచిన చోటునకుఁ బోవుటయెట్లో యావిధముగానే మానవులకుఁ దల్లిదండ్రులును, గృహములు, ధనములు మొదలగునవియును నైయున్నవి కావున నే సజ్జనులగువారు యీ భార్యాపుత్రాదిపదార్థములయందుఁ బ్రియమును వదలి సంచరింతురు. మానవోత్తముఁడవగు నో రాముఁడా! తండ్రి తాతలనాటనుండి వచ్చుచున్న రాజ్యమును వదలిపెట్టి మిగుల వ్యసనమును గలుగఁజేయునట్టిదియును, మిక్కిలి బాధను గలుగఁజేయునదియును, మిగుల నసహ్యకరమైనదియును, నగు మార్గమునందు సంచరించుట యుచితము గాదు. సకలజనులచేతను సంపదలచేతను నిండియున్న యయోధ్యాపట్టణమునకుఁ బోయి పట్టాభిషిక్తుఁడవగుము. అయోధ్యాపట్టణము నిన్ను వదలినది మొదలుకొని భర్తను వదలిన పతివ్రత ఒక్కజడ నే ధరించి కృశించు విధముగఁ గృశించుచున్నది. కావున రాజపుత్రుఁడవగు నో రాముఁడా! సర్వోత్తమములైన రాజధర్మముల ననుభవించుచు స్వర్గపట్టణమును దేవేంద్రుఁడు పాలించు విధముగ నయోధ్యాపట్టణమును బాలింపుము. నీకు దశరథుఁ డేమియును గాఁడు. నీవు దశరథున కేమియును గావు అతఁ డొకప్రభువు. నీవొకప్రభువు (అనఁగా దశరథునకును నీకును నేమియును సంబంధము లేదనుట) కాఁబట్టి నా మాటను విని యీ యడవిలో నుండుటను వదలి యయోధ్యాపట్టణమునకు రాజవగుము. తండ్రియనేవాఁడు సకలజంతువులకు స్వల్పకారణము (అనఁగా బీజమువంటివాఁడనుట) మాతాపితృవుల రేతస్సును, రక్తమును, రెండును ఋతుమతియగు తల్లియొక్క కుక్షియందుఁ బ్రవేశించుటచేతఁ బుట్టువు గలుగుచున్నది. మనపుట్టువు లేగావు. సకలజంతువులయొక్క పుట్టుకలును నీరీతిగా నేయున్నవి. కావునఁ దండ్రియే ప్రధానుఁ డనియును, నతఁడు చెప్పినట్లు సంచరింపవలయు ననిదలఁచుటయును వెఱ్ఱితనమే గాని వేరొకటి గాదు. ఆదశరథమహారాజు ఏస్థలమునకుఁ బోవలయునో యక్కడకుఁ బోయెను. లోకములో నిమానవులందఱును నిటులనే పుట్టుచు జచ్చుచున్నారు. నీవుమాత్రము వ్యర్థమైన సంబంధమును గల్పించుకొని వ్యసనమును బొందుచున్నావు. ఇది యెంతమాత్రమును బాగుగ నుండలేదు. మఱియు నో రాముఁడా! ఈలోకములోఁ గేవలధర్మాచరణయందును, గేవల ధనార్జనమునందును బ్రవర్తించువారలను గురించి నేను వ్యసనమును బొందెదను. కారణమేమనఁగా నీలోకమునందుండు సుఖములలో నేసుఖమును బొందుటలేదు. అయ్యో పాపము. పరలోకమన్ననో, ఆపరలోకమొకటి లేనందున నదియును నబద్ధమయ్యె. ఇవ్విధముగాఁ దెలియక మోసపోవుచున్నారే, యని నేను జింతించెదను. ఈలోకములో నిజనమంతయును నష్టకాశ్రాద్ధమనియును, ప్రత్యాబ్దికశ్రాద్ధమనియును దలఁచి తాము సుఖముగ భుజింపక తమ యన్నమును నితరులకుఁ బెట్టి చెడిపోవుచున్నారు. చచ్చిపోయినవానికేమి పెట్టినను దినువా? తిననివాని పేరుపెట్టి యితరులకుఁ బెట్టుట యెంత వెఱ్ఱితనమనవచ్చును. మఱియు నో రాముఁడా! "శ్లో॥ యది భుక్తమిహాన్యేన దేహమన్యస్యగచ్ఛతి। దద్యాత్ప్రవసత శ్శ్రాద్ధం నతత్పథ్యశనంభవేత్,, ఇక్కడ నితరునిచేత భుజింపఁబడిన యన్నము, పితృలోకమునందున్న తల్లిదండ్రులకు నాకలిదీర్చు నేని గ్రామాంతరమునకు బోయినవాని కాకలి తీరుటకొఱకిక్కడ నితరులకన్నమును బెట్టవచ్చును గదా? మనమిక్కడ నితరులకన్నమును బెట్టినయెడల నాయన్నము దూరదేశమునకుఁ బోయినవానిదారి భత్యమగునా? (కానేరదు) మఱియు నో రాముఁడా! "శ్లో॥ దానసంవసనా హ్యేతె గ్రంథా మేధావిభిః కృతాః। యజస్వ దేహి దీక్షస్వ తపస్తప్యస్వ సంత్యజ,, దేవతలఁ బూజింపుము. ధనమునితరులకిమ్ము యజ్ఞదీక్షను వహింపుము. తపసును జేయుము. దానమును జేయుము. మఱియు నితరములగు ధర్మకార్యములను జేయుమని యనేకములగు హేతువులను గల్పించి బుద్ధిమంతులగువారు, మిగుల నిపుణ్యముతో దానములను జేయవలసినదను విషయములను బోధించునట్టి గ్రంథములను జేసిరి. ఈ గ్రంథములన్నియును నితరులు ద్రవ్యమును సంపాదించుకొనుటకుఁ దగిన యుపాయములను బోధించుచున్నవి గాని వాస్తవవిషయమును బోధించుటలేదు. బుద్ధిమంతులలోనుత్తముఁడవైన యో రామా! నీవు పరలోకము లేదనియే యెంచుము. అప్రత్యక్షమైన సమాచారమును వెనుకభాగమునందుఁ బెట్టుకొని ప్రత్యక్షముగనున్న దానినే వాస్తవమని యెంచుము. కావునఁ బరలోకమొకటియున్నదనియును, పితృవాక్యమును బరిపాలించుటవలనఁ బరలోకమునందు మేలుగలుగుననియును పిచ్చితలంపును బెట్టికొనకుము. సర్వజనులకు సమ్మతమై ప్రత్యక్షబుద్ధిని మనస్సునందుఁ బెట్టు

కొని ప్రత్యక్షముకంటె నితరమైనదియేదియును లేదని తలంచి భరతునివాక్యములనంగీకరించి రాజ్యపరిపాలనమును జేయుట కంగీకారమునుబొందుమని జాబాలి మునివరుండు చెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటయెనిమిదవసర్గముగిసెను

నాస్తికమతమును బోధించిన జాబాలిమహర్షి నిరాముడు నిందించుట.

ఇట్లు జాబాలిమునివరుండు చెప్పినవచనములనువిని సత్యవంతులలో నుత్తముండైనరాముండు మిగులభక్తిగలవాడై కొంచెమైనను బుద్ధిని చలింపజేయక నిశ్చలమయినబుద్ధితో నిట్లనియె.

ఓజాబాలీ! నీవు నాకుం బ్రియమును జేయవలయునని యెడుకోరికగలవాండవై యిప్పుడీమాటను జెప్పితివి నీమాటయిప్పుడు వినువారికి యుచితముగనున్నదేగాని విచారింపంగా మిగులనయుక్తముగనున్నది. హితవచనమువలెందోచుచున్నదేగాని యాలోచింపంగా మిగులంగీడును అపర్గమును దెచ్చునదియైయున్నది. "శ్లో॥ నిర్మర్యాదస్తుపురుష పాపాచారసమన్వితః। మానంసలభతేసత్సుభిన్నచారిత్రదర్శనః,, మర్యాదలేనివాండును, పాపాచారములుగలవాండును, విరుద్ధమైనయాచారములుగలవాండును, నగుమానవుడు సజ్జనులయొద్దకుంబోయినపుడు, గౌరవమునుబొందంజాలండు. మఱియునుసడవడికలలో, వీడుకులవంతుండనియును, వీండుగులహీనుండనియును, వీండుపురుషుండనుసహంకారముగలవాండనియును, వీండుపరిశుద్ధుండనియును, వీండు అపరిశుద్ధుండనియును, దెలుపును. కావునసోజాబాలీ! నేనుదుష్టుండనైసత్పురుషునివలెను, అపరిశుద్ధుండనైపరిశుద్ధునివలెను, దుర్లక్షణములుగలవాండనై మంచిలక్షణములుగలవానివలెను, దుస్స్వభావముగలవాండనై మంచిస్వభావముగలవానివలెను, అధర్మమునవలంబించినవాండనై ధర్మివంతునివలెనుసంచరించుచు లోకమునందుసంకరమునుగలుగంజేయునదియును, వేదోక్తములగు యాగాదిక్రియలతో శూన్యమైనదియును, నగుఅమంగళకృత్యమునెట్లుచేయుదును మంగళకరములగుయాగాదిక్రియల నెట్లువదలిపెట్టుదును. సకలజనులచేతనునిందింపంబడినదియును, దుష్టమయినదియును నగుకార్యమును జేయుచున్న నన్నుంజూచికార్యాకార్యములను జక్కంగందెలిసినవాండును, బుద్ధిమంతుడును నగు నేమానవుండు గౌరవించును. లోకములో నెవ్వండును నన్ను గౌరవింపండు. ఓజాబాలీ! నేను బ్రతిజ్ఞనువదలినవాండనై యిట్టినీచవృత్తితో సంచరించుచు నెవ్వనికిసదాచారమునుపదేశింతును. నాయుపదేశమును లోకములో నెవ్వండునువినండు. ప్రతిజ్ఞాహీనుండనైన నాకుస్వర్గలోకమెట్లుగలుగును స్వర్గఫలమునాకుం గలుగనేగలుగదు. మఱియునోజాబాలీ! ఈలోకమంతయును స్వయముగా నేయిష్టమువచ్చినట్లు సంచరించుచున్నది. రాజులెట్లుసంచరించుదురో ప్రజలునావిధముగానే సంచరించుదురు (అనంగా నేనుధర్మమునుదప్పి వర్తించినయెడల స్వయముగానే యన్యాయముగం బ్రవర్తించునట్టి లోకులందఱునుమఱింతయధికముగా నన్యాయమును జేయుదురనుట) "శ్లో॥ సత్యమేవానృశంసంచ రాజవృత్తంసనాతనమ్। తస్మాత్సత్యాత్మకంరాజ్యంసత్యేలోకప్రతిష్ఠితః॥ ఋషయశ్చైవదేవాశ్చసత్యమేవహిమేనిరే। సత్యవాదీహిలోకేస్మిన్ పరమంగచ్ఛతిక్షయమ్॥ దయయేప్రధానముగాంగలదియును, శాశ్వతముగానుండునదియును, నగురాజధర్మము సత్యరూపమైనది. కావునరాజ్యమంతయును సత్యస్వరూపమయినదనియెల్లవారిచేతను బ్రసిద్ధముగంగొనియాడంబడినది, సత్యమునందులోకమంతయును బ్రతిష్ఠింపంబడియున్నది. అటువంటిసత్యమును నేనెట్లువిడిచిపెట్టుదును. మఱియునోజాబాలీ! ఋషులుదేవతలును, సత్యమును సర్వోత్తమమయినదానినిగాందలంచిరి. ఈలోకమునందుసత్యవాదియగువాడుత్తమలోకమునుబొందును. మఱియు "ఉద్విజంతేయథాసర్పాన్నరాదనృతవాదినః। ధర్మస్సత్యంపరోలోకే మూలంస్వర్గస్యచోచ్యతే,, లోకములోజనులందఱునుసర్పమునుజూచిభయమునుబొందువిధముగ అసత్యముబలుకువానినిజూచినపుడుగూడ భయమునుబొందుదురు. మఱియు, సత్యమేయీశ్వరుండు. లక్ష్మీదేవిసత్యమునాశ్రయించియున్నది. సర్వకార్యములును సత్యమేకారణముగాంగలవైయున్నవి. కావునసత్యముకంటె నధికమయినధర్మమేదియునులేదు. కావున, దానము, యాగము, హోమము, తపస్సులు, వేదములు, మఱియునితరములగుధర్మకార్యములన్నియును, సత్యమునందునిలిచియున్నవి. అందువలనసత్యవంతుండుగావలయునని పెద్దలుచెప్పుదురు. మఱియునోజాబాలీ, లోకమునందుసత్యవంతుండగు మానవుండుఒక్కండే లోకమునుసర్వమునుబాలించుచున్నాండు సత్యవంతుండొక్కండేకులమును గాపాడుచుండును. సత్యహీనుండునరకలోకమునుబొందును. సత్యవంతుండొక్కండేస్వర్గలోకమునందు శాశ్వతమగుసుఖమునుబొందుచుండును. సత్యమునుదప్పనని ప్రతిజ్ఞను జేసినవాండను, సత్యమును బాలించెదననియొట్టును బెట్టుకొన్నవాండనునైననేను మాతండ్రియొక్క సత్య

వాక్యమును నెట్లు పరిపాలింపకుందును. సత్యప్రతిజ్ఞుఁడనైన నేను రాజ్యమునందలి యాశచేతను గాని, మోహముచేతఁ గాని, అవివేకముచేతఁ గాని, మఱియేకారణముచేతను, నాతండ్రియగు దశరథమహారాజు చెప్పినవిధముగ సంచరింపక యసత్యప్రవర్తనను జేయను. మఱియు సత్యమనే ప్రవాహముయొక్క కట్టను ద్రెంపఁజాలను. అసత్యముగఁ బ్రవర్తించుచున్నవాఁడును, చపలుఁడును, స్థిరచిత్తత లేనివాఁడును నగు మానవుఁడిచ్చిన హవ్యకవ్యములను, దేవతలును, పితృదేవతలును నంగీకరింపరు. కావున సత్యమును వదలినవాఁడు సేసిన పుణ్యకర్మలన్నియును వ్యర్థముగాఁ బోవును. మఱియు నోజాబాలీ, నేను సత్యమని యెడు ధర్మమును బరబ్రహ్మమునుగాఁ దలఁచుచున్నాను కాఁబట్టియే సత్పురుషులాచరించినవిధముగ నీజటావల్కలాదిధారమునంగీకరించియున్నాను ఘాతకులును, లుబ్ధస్వభావముగలవారును, పాపకృత్యములను జేయువారును, నగు మానవులచేత నాచరింపఁబడినదియును, ధర్మముతోఁ గూడనదియును, నధర్మమయమైనదియును, ధర్మము వలెఁ దోఁచుచున్నదియును, నగు క్షత్రధర్మమును నేను విడిచిపెట్టవలయునని తలఁచుచున్నాను ఓజాబాలీ! లోకములోని మానవుడు ముందుగా మనస్సునందు నిశ్చయించి పిమ్మట శరీరముచేత బాపమును జేయును. పాపమును జేసితిననియును, చేయఁబోవుచున్నాననియును, చేయుచున్నాననియును నోటితోఁ జెప్పును కావునఁ బాపము మూఁడు విధములైయున్నది. భూమియును, కీర్తియును, లక్ష్మీదేవియును, సర్వకాలములయందును సత్యవంతుఁడగు పురుషుని గోరుచుండును. ఇంతయగాక భూమియు, గీర్తియు లక్ష్మియును, సత్యవంతుఁడగు పురుషుఁడు స్వర్గలోకమునకుఁ బోయినను నతని నే గోరుచుండును కావున నేను సత్యము నే యవలంబింతును గాని సత్యమును వదలి వేఱొకదానిని గోరను. ఓజాబాలీ! నీవు మిగులయుక్తికములగు వాక్యములచేత నాకు మేలును జేయవలయునని తలఁచి యీపనిని జేయుమని యుక్తియుక్తముగాఁ జెప్పితివి. అయినను నావిషయము మంచిదని నాకెంతమాత్రమును దోఁచడము లేదు. నాకు గురువగు దశరథమహారాజుతో సకలజనులును వినుచుండగ నేను సత్యముగ వనవాసమును జేయుదునని చెప్పితిని. అట్లు చెప్పిన నేను నాతండ్రియాజ్ఞను వదలి భరతుని వచనానుసారముగ నెట్లు ప్రవర్తింతును. ఓజాబాలీ! తండ్రియగు దశరథమహారాజు దగ్గర నేను స్థిరమైన ప్రతిజ్ఞను జేసితిని. అందువలనఁ బట్టపుదేవియగు కైకేయి మిగుల సంతోషమును బొందెను. అట్టి ప్రతిజ్ఞను వదలి నే నెట్లు ప్రవర్తింతును. ఇవ్విధముగా నేను వనవాసమును జేయుచు నియమితమయిన యాహారముగలవాఁడనై మిగులఁ బవిత్రములగు కందమూలఫలములచేఁ బితృదేవతలను, దేవతలను, దృప్తినొందించుచుందును. నేను కార్యాకార్యములను జక్కఁగఁ దెలిసికొనుచున్నవాఁడనై కందమూలఫలాదులచే జీవించుచుఁ బంచేన్ద్రియములకును దృప్తిని జేయుచు జీవించెదను. ఇంతయగాక కపటవ్యాపారమును వదలి గురువులు మొదలగువారియందును, దేవతలయందును భక్తిగలవాఁడనునై ప్రవర్తించుచుందును. ఓజాబాలీ! ఈకర్మభూమియందుఁ బుట్టినవాఁడు శుభకర్మలనన్నింటిని జేసియే తీరవలయును. సూర్యాగ్నిచంద్రులు మువ్వురును గర్మఫలమును బొందుదురు. దేవేన్ద్రుఁడను వాఁడీలోకమునందు నూరుయజ్ఞములను జేసియే గదా యిన్ద్రత్వమును బొందెను. మహర్షులందఱును నీలోకమునందు ఘోరములగు తపస్సులను జేసియే గదా స్వర్గలోకమునకుఁ బోయిరి. కావున నీలోకమునందుఁ బుట్టినవారందఱును గర్మలను జేసియే తీరవలయుననఁ జెప్పె. అవ్విధముగఁ జెప్పియును భయంకరమయిన తేజస్సుగలవాఁడును, రాజనందనుఁడును నగు రాముఁడు నాస్తికత్వమును యుక్తియుక్తముగ బోధించుచున్న జాబాలియొక్క మాటలను మరలఁ దలఁచుకొని యావచనములను గుఱించి మిగుల యసహ్యమును బొందుచు మరల నిట్లనియె.

జాబాలిమునివర్యా! సత్యవంతులగు మానవులు, సత్యము, ధర్మము, పరాక్రమము, భూతదయ, ప్రియముగ మాటలాడుట, దేవబ్రాహ్మణులను, అతిథులను, బూజించుట, మొదలగునవి స్వర్గలోకమునకుఁ బోవుటకుఁ దగిన మార్గములని చెప్పుదురు అందువలన నే వేదవేదాంగవేత్తలగు బ్రాహ్మణులందఱును, నీవిషయమును సర్వమును దెలిసికొని యైకమత్యమును బొంది సకలధర్మములను నాచరించి కొంచెమైనను ప్రమాదము లేనివారై కోరినలోకములకు సుఖముగాఁ బోవుచున్నారు. మఱియు లోకవిరుద్ధమగు నాస్తికబుద్ధిగలవాఁడవును, నాస్తికబుద్ధితో సంచరించుచున్నవాఁడవును, ధర్మమార్గమును దప్పినవాఁడవును నైన నిన్ను దగ్గర నుంచుకొనిన నాతండ్రియొక్క వ్యాపారమును నిందింపవలసినదే గాని మఱియొకవిషయమును నిందించుటవలనఁ బ్రయోజనము లేదు. బౌద్ధమతమునవలంబించినవాఁడు దొంగయనఁబడును. నాస్తికుఁడును నావిధముగా నే దొంగయని చెప్పఁబడును. కావున మానవులకందఱకును సందేహింపఁదగినవాఁడును, దొంగబుద్ధిగలవాఁడును నగు నాస్తికునకు నభిముఖముగా సత్పురుషుఁడు పోఁగూడదు. మఱియు నీకంటెఁ బూర్వులును, శ్రేష్ఠులును నగు మానవులు నానావిధములగు శుభకర్మలను జేసిరి. మఱియు సజ్జనులందఱును సర్వకాలములయం

దును, ఇహలోకపరలోకములనుదమపుణ్యకర్మలచేతజయించిప్రవర్తించుచున్నారు. కావున నేశుభకర్మలను, హోమములను, యజ్ఞములను, జేయుచున్నారు ధర్మకార్యములయందభిలాషగలవారును, సత్పురుషులతోఁగూడినవారును, తేజోవంతులును, దానిగుణమేప్రధానముగాఁగలవారును, హింసాకృత్యమునువదలినవారును, నిర్మలమైనస్వభావముగలవారును, నగుమునులు సర్వలోకములయందునుబూజింపఁబడుచుండుటయెల్లవారలకును దెలిసినవిషయమేగదా? యనియిట్లుయధికమగు కోపముతోమాటలాడుచున్నవాఁడును, మహానుభావుఁడును, నగురామునితోనాజాబాలిమునివాస్తవమైనవిషయమును బోధించునదియును, నూరడింపునుసూచించునదియునునగు మాటనుజెప్పఁదలఁచియిట్లనియె.

రాముఁడా! నేనునాస్తికుఁడను గాను. నేనునాస్తికవచనములనుజెప్పువాఁడను గాను. నాయభిప్రాయముపరలోకములేదని గాదు. నాస్తికవచనములను నేనుసర్వకాలములయందును ఖండించుచుందును. తగినకాలమునుజూచి నేను వేదోక్తమతమునంగీకరించితిని. ఇప్పుడు నాస్తికమతమునవలంబించి నిన్ను నయోధ్యాపట్టణమునకుఁ దీసికొనిపోఁదలఁచియివ్విధముగా మాటలాడితినే గాని వేఱు కాదు. మహాత్ముఁడవగునో రామచంద్రా! నాస్తికవచనములను జెప్పుటకిదితగినకాలమగుటచేతఁ జెప్పితిని. నీవుమరలనయోధ్యాపురమునకువచ్చుటకును, నిన్నుఁ బ్రసన్నునిగాఁ జేయవలయుననితలఁచియును జెప్పితినేగాని వేరొకకారణముచేతఁ గాదనియెన్నము.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలినూటతొమ్మిదవ సర్గముగిసెను.

వసిష్ఠమహర్షి రామునకు లోకముయొక్కయుత్పత్తిఁ
బోధించిఅయోధ్యకు రమ్మని పిలుచుట

ఆసమయమునందు వసిష్ఠమహాముని కోపమునుబొందియున్న రామునితోనిట్లనియె.

రాముఁడా! ఈజాబాలిమునివరుఁడు, పుణ్యవంతులు పుణ్యలోకమునకుఁబోదురనియును, పాపవంతులు పాపలోకమునకుఁబోదురనియును, పుణ్యపాపావసానమునందుమరలభూలోకమునకువత్తురనియును నెఱుగును. అయినను నాస్తికవచనములను జెప్పినయెడల నీవు నాలింతువనెడు సంకల్పమునుచేతఁ జెప్పినవాఁడుగాని వేఱొకటిగాదు. లోకములకు బ్రభుఁడవైన ఓ రామచంద్రా! నేను లోకముయొక్కయుత్పత్తిని జెప్పెదను. సావధానుఁడవై వినుము.

ఏభగవంతునియందుముందుగా నీభూమియంతయును సృజింపఁబడెనో యాభూమియందంతటను మొదటనుదకము నిండియుండెను. అట్టిజలమునందు బ్రహ్మదేవుఁడును దేవతలును బుట్టిరి. అటుపిమ్మట నారాయణుఁడు వరాహావతారమును ధరించినీటియందు మునిఁగియున్నభూమిని లేవనెత్తె. అటుపిమ్మట బ్రహ్మదేవుఁడు మిగులఁజక్కగా శిక్షింపఁబడిన బుద్ధిగలపుత్రులతోఁగూడి లోకమును సర్వమును సృజించెను. మొట్టమొదట శాశ్వతుఁడును, నిత్యుఁడును, నాశములేనివాఁడునునగు బ్రహ్మదేవుఁడు పరమాత్మవలనఁ బుట్టె. ఆ బ్రహ్మదేవునివలన మరీచి పుట్టె. ఆమరీచివలనఁ గశ్యపప్రజాపతి పుట్టె, ఆకశ్యపునివలన సూర్యుఁడు పుట్టె. సూర్యునివలన మనువు పుట్టె ఆమనువు రాజులలో మొట్టమొదటివాఁడయ్యె. ఆమనువునకు నిక్ష్వాకువు పుట్టె. ఆయిక్ష్వాకుమహారాజునకుఁ దండ్రియగు మనువు అయోధ్యాపట్టణమునిచ్చె. ఆయిక్ష్వాకుమహారాజు మనయయోధ్యాపట్టణమునకుఁ బూర్వము మొదటిరాజై యుండెను. ఆయిక్ష్వాకుమహారాజునకు శ్రీమంతుఁడును, ప్రసిద్ధమైనకీర్తిగలవాఁడును, నగుకుక్షియనువాఁడు పుట్టె. అటుపిమ్మట నాకుక్షియనుమహారాజునకు, పరాక్రమవంతుఁడగు వికుక్షియనువాఁడు పుట్టె. ఆవికుక్షికిఁ దేజోవంతులలో నుత్తముఁడును, ప్రతాపవంతుఁడును నగుబాణుఁడనుపుత్రుఁడు పుట్టె ఆబాణుఁడనుమహారాజునకు, గొప్పదగుభుజబలముగలవాఁడును, గొప్పదగు కీర్తిగలవాఁడును నగు ననరణ్యుఁడనుపుత్రుఁడు పుట్టె. ఈయనరణ్యభూపాలుఁడు రాజ్యమును బాలించుచున్న సమయమందు లోకమునందొకఁడును నావృష్టిదోషముగలుగలేదు. లోకములో దొంగయగువాఁడొక్కఁడును లేఁడయ్యె. ఆయనరణ్యభూపాలునివలనఁ బృథువను రాజేంద్రుఁడు పుట్టె. ఆపృథుమహారాజునకుఁ ద్రిశంకుమహారాజు పుత్రుఁడై పుట్టె. పరాక్రమవంతులలో నుత్తముఁడగు నాత్రిశంకుమహారాజు సత్యమైనమాటలుగలవిశ్వామిత్రునివలన శరీరముతోఁగూడ స్వర్గలోకమునకుఁ బోయె. ఆత్రిశంకుభూపాలునకు గొప్పకీర్తిగలయువనాశ్వుఁడు పుట్టె. ఆయువనాశ్వుఁడు తేజోవంతులలో నధికుఁడై దుందువను రాక్షసునిఁ జంపుటవలన దుందుమారుఁడనఁబడును. ఆయువనాశ్వభూపాలునకు శ్రీమంతుఁడగు మాంధాత పుట్టెను. ఆమాంధాతకు మహాతేజుఁడగు సుసంధియనువాఁడు పుట్టె ఆసుసంధియనువానికి ధ్రువసంధియు, ప్రసేనజిత్తునను వాఁడు జన్మించె ధ్రువసంధియనువానికిఁ గీర్తివంతుఁడును, శత్రుమర్దనుఁడును, నగు భరతుఁడనువాఁడు పుట్టె భుజబలముగలవారిలో నధికుఁడగు నాభరతునికి నసితుఁడనువాఁడు పుట్టె. ఆయసితున

కు హైహయులును, తాలజంఘులును పరాక్రమవంతులగు శశిబిందువులును బరమశత్రువులైయుండిరి. అట్టిశత్రువులతో నతఁడు గొన్నిదినములు యుద్ధమును జేసి పిదప నోడిపోయి యరణ్యమునకుఁ బారిపోయె. అట్లుపోయి యాయసితుఁడను వాఁడు మిగుల మనోహరమగు హిమవత్పర్వతమునందు నివాసమును జేసె. అంతఁ గొన్నిదినములకతనిభార్య లిరువురును గర్భవతులైయుండిరి. ఆసమయమునందయ్యిరువురిలో నొకతె తనకు సవతియగు నొకతెకు రహస్యముగ విషమును బెట్టె. అప్పుడు భృగువంశమునందుఁ బుట్టిన చ్యవనుఁడనువాఁడు హిమవత్పర్వతమునందు నివసించియుండె ఆసమయమునందు జెలియక సవతి పెట్టినవిషమును దిన్న కాళిందియను నాయసితునిభార్య చ్యవనమహామునికి నమస్కారమును జేసి యచ్చట నేనిలుచుకొనియుండె. అప్పు డాచ్యవనమహాముని పుత్రునిఁ గనవలయునని యెడు నభిలాషతో నమస్కరించియున్న యాకాళిందిని జూచి యిట్లనియె.

దేవీ! రాణీ! నీకుఁ బుత్రుఁడు జన్మింపఁగలఁడు. ఆపుత్రుఁడు మహానుభావుఁడును, లోకమునందుఁ బ్రసిద్ధమైనవాఁడును, ధర్మస్వభావముగలవాఁడును, మంచిస్వభావముగలవాఁడును, శత్రువులను నశింపఁ జేయువాఁడును, వంశాభివృద్ధికిఁ గారణమైనవాఁడును గానుండగలఁడనియె. అంతట నాకాళింది పరమానందమును బొంది యామునివరుని యాజ్ఞను దీసికొని యింటికిఁ బోయె పిమ్మటఁ గొన్నిదినములకు బద్మములవంటి నేత్రములుగలవాఁడును, బ్రహ్మదేవుని యొక్క కాంతివంటి కాంతిగలవాఁడును, నగుపుత్రునిఁ గనియెను. గర్భమును బోఁగొట్టవలయునని యెడు కోరికచేత సవతి దానికి విషమును బెట్టె. అట్లు పెట్టినవిషముతోఁ గూడఁ బుట్టుటవలన నాపుత్రునకు సగరుఁడను నామధేయము గలిగె ఆసగరుఁడు భూమండలమునకు సర్వమునకును రాజయ్యె. పిమ్మట నతఁడశ్వమేధయాగమును జేసె అయ్యశ్వమేధయాగమునందు యజ్ఞాశ్వము గనబడక పోవుటవలన నదనపుత్రులచేతఁ బర్వదినములయందు బ్రజలకు భయమును గలుగఁజేయునట్టి సముద్రమును ద్రవ్వించెను. ఆసగరచక్రవర్తికి నసమంజసుఁడను పుత్రుఁడు పుట్టె. ఆయసమంజసుఁడు పాపకర్మలను జేయుటవలనఁ దండ్రియగు సగరునిచే నడవులకుఁ బంపఁబడియె. ఆయసమంజసునకుఁ బరాక్రమవంతుఁడగు నంశుమంతుఁడు పుట్టె. ఆయంశుమంతునకు దిలీపమహారాజు పుత్రుఁడై పుట్టె. ఆదిలీపునకు భగీరథుఁడు పుత్రుఁడై పుట్టె భగీరథునకుఁ గకుత్స్థుఁడు పుట్టె అతనివలన మీవంశమువారలందఱును గాకుత్స్థులైరి. ఆకకుత్స్థునకు రఘువను వాఁడు పుట్టె అది మొదలుకొని మీవంశమువారికి రాఘువులని పేరుగలిగె. ఆరఘుమహారాజునకుఁ దేజోవంతుఁడగు పుత్రుఁడు గలిగె అతఁడు మిగుల వృద్ధిని బొందినవాఁడై పురుషాదకుఁడనియును, కల్మాషపాదుఁడనియును, సౌదాసుఁడనియును, లోకమునందుఁ బ్రసిద్ధి నవహించె. ఆకల్మాషపాదునకు శంఖణుఁడను పేరుగల పుత్రుఁడు పుట్టె. ఆశంఖణుఁడు సేనాసమేతముగఁ దండ్రిచేత నేచంపఁబడియె. మఱియు నాశంఖణునకు శూరుఁడును, శ్రీమంతుఁడును, నగు సుదర్శనుఁడనువాఁడు పుత్రుఁడై పుట్టె. ఆసుదర్శనునకు నగ్నివర్ణుఁడను పుత్రుఁడు జన్మించె. ఆయగ్నివర్ణునకు శీఘ్రగుఁడనువాఁడు పుట్టె. ఆశీఘ్రగునకు మరువను పుత్రుఁడు పుట్టె. ఆమరువునకుఁ బ్రశుశ్రుకుఁడు పుట్టె. ఆప్రశుశ్రునకుఁ దేజోవంతులలో నధికుఁడగు నంబరీషచక్రవర్తి పుట్టె ఆయంబరీషునకు సత్యపరాక్రమముగల నహుషుఁడను వాఁడు పుట్టె. ఆనహుషునకు ధార్మికులలో నుత్తముఁడగు నాభాగుఁడు పుట్టె ఆనాభాగునకు నజుఁడును, సువ్రతుఁడును, ననునిరువురు పుట్టిరి. ఆయజమహారాజునకు ధర్మాత్ముఁడగు దశరథమహారాజు పుత్రుఁడయ్యె. ఆదశరథమహారాజునకు రాముఁడను నామధేయముగల నీవు పెద్దకుమారుఁడవై పుట్టితివి. కావున నీవీ రాజ్యమును బొంది నీవారలగు సకలమానవులను గాపాడుము. ఇక్ష్వాకువంశమునందుఁ బుట్టినవారలలోఁ బెద్దకుమారుఁడు వాఁడుకగా రాజగుటకలదు. జ్యేష్ఠపుత్రుఁడుండగాఁ గనిష్ఠపుత్రుఁడు మీకులమునందు రాజగుట లేదు ఇది రఘువంశమునందుఁ బుట్టినవారలకు అనాదియగు ధర్మమైయున్నది. ఇటువంటిధర్మమును నీవు పాడుసేయుటతగదు. కాఁబట్టి యో రామచంద్రా! నీవు మీతండ్రియగు దశరథునివలెనే యధికమైనకీర్తిగలవాఁడవై బహువిధములగు శ్రేష్ఠవస్తువులుగలదియును, అనేకములగు నవాంతరరాజ్యములుగలదియును, నగుభూమిని బరిపాలింపుము.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటపదియవసర్గముగిసెను.

భరతుఁడు రాముఁడయోధ్యకు రానియడల దర్భశయ్యయందు బరుండియుండెదనని చెప్పుట.

అంతట నాప్రకారముగాఁ జెప్పి రాజపురోహితుఁడైన వసిష్ఠమహాముని తానుఅంతసేపు చెప్పినను రాముని మనస్సు నందెక్క లేదని తలఁచి మరల ధర్మయుక్తములగు మాటలను జెప్పఁదలఁచి యిట్లనియె.

రఘుకులోద్భవుఁడవైనయో రాముఁడా! లోకములో నిప్రతిమనుష్యునకును తల్లిదండ్రులును, ఆచార్యుఁడును, అని

యెడు ముగ్గురును గురువులగుదురని పెద్దలు చెప్పుదురు. పురుషోత్తముఁడవైనయో రామా! తండ్రియగువాఁడు పురుషుని పుట్టించుచున్నాఁడు. దేహమును గలుగఁజేయుటవలనఁ దండ్రి గురువయ్యె. ఆచార్యుఁడు పునర్జన్మము లేకుండునట్లు జ్ఞానము నుపదేశించుచున్నాఁడు. కావున నాచార్యుఁడు గురువని చెప్పఁబడియె. నేను మీతండ్రికిని నీకును నాచార్యుఁడను. కావున నా మాటను విని సత్పురుషులు పోయిన మార్గమునందుఁ బ్రవర్తింపుము. నాయనా! రామా! ఈబ్రాహ్మణులును, పురజనులును, క్షత్రియులును, వైశ్యులును, నీవారలు. కావున వీరలనందఱఁ బరిపాలించుచు సన్మార్గము నవలంబింపుము. మఱియునో రామా! మిగుల ముసలిదియును, చక్కని స్వభావము గలదియును, నీకుఁ దల్లియును నగు కౌసల్యాదేవి చెప్పినట్లు నీవు చేయక పోవుటయుచితము గాదు. కావునఁ బుణ్యురాలగు నీకౌసల్యాదేవి యొక్క మాటను విని సన్మార్గము నవలంబింపుము. మఱియు ననేకవిధముల యాచించుచున్న యీ భరతుని కోరికను దీర్పుము. ఈభరతుఁడు నీ కాత్మవంటివాఁడు గదా? కావున నితని ప్రార్థన నంగీకరించి మీ పెద్దల మార్గము నవలంబింపుమని వసిష్ఠమహాముని చెప్పె. ఇట్లు మిక్కిలి మనోహరముగా మాటలను జెప్పుచున్నవాఁడును, తమకులగురువునునగు వసిష్ఠ మహామునియొక్క మాటలను విని రఘుకులమునందుఁ బుట్టినవాఁడును, పురుషోత్తముఁడును నగు రాముఁ డట్లు చెప్పి కూర్చున్న వసిష్ఠమహామునిని జూచి యిట్లనియె.

గురురాయా! తల్లిదండ్రులు పుత్రుఁడు పుట్టకమునుపు పుత్రుని కొఱకనేకములగు నుపవాసవ్రతాదులను జేయుదురు. పిమ్మటఁ బుత్రుఁడు దైవానుగ్రహముచేతఁ బుట్టినేని యతని కనేకవిధముల సంరక్షణను జేయుదురు. కావున నట్టి తల్లిదండ్రులకు సరియగు ప్రత్యుపకారమును నెవ్వఁడు చేయఁగలఁడు. మఱియునో వసిష్ఠుఁడా! సంతానము గలిగినది మొదలుకొని తల్లిదండ్రులు తమశక్త్యనుసారముగాఁ బాలు మొదలగువానిని నిచ్చి పోషింతురు. మఱియుఁ దగిన సమయమునందు స్నానమును జేయించుదురు. చలిబాధగలుగు కాలమునందుఁ దామే తెలిసికొని వస్త్రములు మొదలగువానిని గప్పుదురు. ఏడ్వకుండునట్లు ప్రియవచనములను జెప్పుదురు. ఇట్లు నానావిధములగు నుపాయముల చేతఁ బెద్దవానిని గాఁ జేయుదురు. ఇవ్విధముగా ననేకశ్రమలు పడి కాపాడిన తల్లిదండ్రులకుఁ బుత్రులు ఏమియుపకారమును జేసినను వారి ఋణమును దీర్పఁజాలరు. అట్లు తల్లిదండ్రులు పెంచిన పిమ్మటఁ గదా గురువు చదువును జెప్పును. తొలుతఁ బెంచిన తల్లిదండ్రులకంటె గురువులకు నవాఁడని నెట్లు చెప్పవచ్చును. కావున నే వేదమునందుఁ గూడ "శ్రుతిః॥ మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అని తల్లిదండ్రులును, గురువును దేవతలు గాఁగల వాఁడవగుమని చెప్పఁబడియున్నది. అట్లు వేదమునందు మొదటఁ దల్లిదండ్రులను జెప్పి పిమ్మట గురువును జెప్పుటవలనఁ దల్లిదండ్రులే గురువుకంటె నెక్కువ వారని యెంచవలయును. కాఁబట్టి యో వసిష్ఠుఁడా! నేను మా తండ్రి మాటను నెట్లు జరపకుందును. దశరథమహారాజు నాకుఁ దండ్రియై యున్నవాఁడు. అట్టి తండ్రితో నేను ముందుగా నరణ్యమునకుఁ బోయెదనని ప్రతిజ్ఞను జేసితిని. అట్లు చేసిన ప్రతిజ్ఞను నేనిప్పు డెట్లు విడిచిపెట్టుదునని యె. అట్లు రాముఁడు సెప్పిన పిమ్మటఁ దనకు లభించిన రాజ్యమక్కర లేదని గంభీరస్వభావముతోఁ జెప్పుచున్న రాముని మాటలను విని భరతుఁడు మహావ్యసనము గలవాఁడై తన యొద్దనున్న సూతుని జూచి యిట్లనియె.

సారథీ! ఈ పట్టినేలయందు దర్భలను బరపుము. రాముఁడు ప్రసన్నుఁడగువఱకు నే నీదర్భశయ్యయందుఁ బరుండెదను. మఱియునో సారథీ! నిరాహారుఁడనై యుండెదను. ఇంతయ గాక వడ్డికొఱకు ఋణము నిచ్చిన బ్రాహ్మణుఁడు ఋణమును దీర్పఁదగినవాఁడు ఋణమును దీర్పక పోయినప్పుడు వాని వాకిలిముందరఁ బరుండు విధముగఁ బరుండెదను. మఱియు ముఖము నెత్తి యితరులను జూడకుందును. రాముఁడు నా ప్రార్థన నంగీకరించి యయోధ్యాపట్టణమునకు వచ్చువఱకును గూడ స్థండిలశాయినైయుండెదను. అప్పుడు భరతుని మాటలను విని యాజ్ఞకొఱకుఁ జూచుచున్న సుమంత్రునిఁ జూచి భరతుఁడు కటకటఁ బడుచు దర్భశయ్యను దానే భూమియందుఁ బఱచె. అట్లు శయ్యను బఱచుకొని పరుండుటకు ద్యుక్తుఁడైన భరతుని జూచి తేజోవంతులలో గొప్పవాఁడును, రాజర్షియును నగు రాముఁ డిట్లనియె

నాయనా! భరతుఁడా! నీకు నే నేమియపకారమును జేసితిని. ఎందునిమిత్తముగ నీవు నాయెదుట నభోజనములను జేయుచుఁ బరుండెదవు? లోకములో వడ్డికి అప్పునిచ్చిన బ్రాహ్మణుఁడు పడుకొన్నప్రక్కను మార్పక యుపవాసములను జేయుచుఁ బరుండి మనుష్యులను నిర్బంధింపఁదగినవాఁడు గాని పట్టాభిషేకమును బొందఁదగిన రాజులీవిధముగా నభోజనములను జేయుటకుఁ దగినవారు గారు. కావున నీవిట్టి క్రూరకృత్యమును జేయుట యుచితము గాదు. తమ్ముఁడా! భరతా! నీకిక్కడఁ బరుండవలదు లెమ్ము. ఇటువంటి దారుణవ్రతమును వదలిపెట్టుము. రఘుకులమునందుఁ బుట్టిన యో భరతుఁడా! నీవిచ్చోటును వదలి యతిశీఘ్రముగా నయోధ్యాపట్టణమునకుఁ బొమ్ము. నా మాటను వినుమని రాముఁడు చె

ప్పె. అప్పుడుభరతుఁడుమిక్కిలివ్యసనముగలవాఁడై పరుండియుండియే తనతోఁగూడవచ్చినపురజనులను బల్లెటూరివారినిఁజూచియిట్లనియె.

ఓజనులారా! మీరందఱును రామునిరమ్మని నిర్బంధించి చెప్పకుండుటకుఁ గారణమేమి? మీరుగూడ రామునిఁబ్రార్థింపుఁడనిన వినివారందఱునునిట్లనిరి. మహానుభావుఁడవైన యోభరతుఁడా! ఈరాముఁడు సత్యసంధుఁడని మాకుఁ దెలిసియున్నది. అదియునుగాక రఘుకులమునందుఁబుట్టిన యీరాముఁడు చెప్పినట్టిమాటలుమిగులమనోహరముగనున్నవి. మఱియునుయుక్తియుక్తముగనున్నవి. మహానుభావుఁడైనయీరాముఁడు తండ్రిమాటను నబద్ధమును గాఁజేయుటకిష్టములేక చెప్పుచున్నాఁడు. కాఁబట్టియే మేమెవ్వరమును నీరాముని నయోధ్యాపట్టణమునకు శీఘ్రముగావచ్చునట్లు చేయుటకు సమర్థులముగాము. కావునమమ్ములనిప్పుడేమిచేయమనియెదవనిరి. అట్లుపురజనులును, పల్లెటూరివారలును జెప్పుచున్నమాటలనువిని రాముఁడుభరతునితోనిట్లనియె.

నాయనా! తమ్ముఁడా! భరతుఁడా! ధర్మమునుజక్కఁగా నాలోచించిచెప్పుచున్నయీమనుష్యులమాటలనువిని వీరు చెప్పినప్రకారముగాఁజేయుము. రఘుకులమునందుఁ బుట్టినయోభరతుఁడా! నామాటలను, ఈమనుష్యులమాటలనువినిచక్కఁగానాలోచింపుము. ఆలోచించియీశయ్యను వదలిపెట్టిలెమ్ము. మహాబాహుఁడవైనయోభరతుఁడా! నీవులేచిక్షత్రియులకుఁదగనికార్యము నవలంబించినందుకుఁ బ్రాయశ్చిత్తార్థముగనుదకమును స్పృశింపుము. అట్లుచేసి పిమ్మటనన్నుఁదాఁకుము. ఇట్లుగాదేని నేనయోధ్యాపట్టణమునకుఁబోయెదనని యుదకమునుబట్టుకొనియొట్టును పెట్టుకొనిపిమ్మటనన్నుస్పృశించియొట్టును బెట్టుకొనుమనియె. ఆ మాటనువినిభరతుఁడు లేచి నీళ్ళనుముట్టుకొని యిట్లనియె.

ఓబ్రాహ్మణోత్తములారా! ఓమంత్రులారా! ఓపురజనులారా! ఓపల్లెటూరియందునివసించుజనులారా! నా మాటనుమీరందఱునువినుఁడు. నేనురాజ్యముగావలయునని మాతండ్రియగుదశరథునియాచింపలేదు. ఇట్టియుపకారమునుజేయుమని తల్లియగుకైకేయిని బ్రార్థింపలేదు. సర్వోత్తములగుధర్మములను దెలిసినవాఁడును, పూజ్యుఁడును, రఘుకులమునందుఁబుట్టినవాఁడునునగురాముఁడు వనవాసమునకువచ్చునపుడు నేనెఱుఁగను. కావుననీవిషయమును నేనంగీకరించినవాఁడనుగాను. ఇప్పుడుతండ్రిమాటనుజరుపవలసినదనియును, వనమునందుండవలసినదియును, ముఖ్యమైయుండెనేని రామునకుఁబ్రతినిధిగా నేనరణ్యమునందునివసించెదను. నాకుఁబదులుగా రాముని నయోధ్యాపట్టణమునకుఁ బొమ్మనిచెప్పుడు. ఇట్లయ్యెనేని మాతండ్రివచనమునకునుహానిలేదు. వనవాసమునకునుభంగమురాదనిభరతుఁడుసెప్పె. అప్పుడుధర్మాత్ముఁడగు రాముఁడు, తమ్ముఁడగుభరతునిచేజెప్పఁబడినదియును, సత్యమైనదియునునగుమాటలనువినిమిక్కిలియాశ్చర్యమును బొందినవాఁడైపురజనులు, పల్లెటూరివారుమొదలగువారలనుజూచి యిట్లనియె.

ఓజనులారా! భరతునిమాటన్యాయముగానే యున్నది. అయినను నాకుఁదోచినవిషయమును జెప్పెదను. మీరందఱును సావధానులరై వినుఁడు. మాతండ్రియగుదశరథమహారాజు నాకువనవాసమునువిక్రయించి వనవాసమునకుఁబదులుగా నావలనరాజ్యమును గైకొని ధనక్షేత్రాదులనుదాచిపెట్టినవిధముగాను, లేకకుదువపెట్టుకొనినద్రవ్యమును దాచినవిధముగాను, ఉంచెను. అట్టిద్రవ్యమునుభరతునకియ్యవలసినదిగానిర్ణయించె. కావుననీవిషయమునందు భరతుఁడుగాని నేనుగానిభిన్నముగాఁబ్రవర్తించుటతగదు. మఱియునోజనులారా! మాతండ్రియగుదశరథమహారాజు వనవాసమును నాకమ్మిరాజ్యమునుకొనెను. ఇప్పుడు నేను నాకమ్మినదానినిచ్చి నేనమ్మినదానినితీసికొనుటయుచితముగనుండునా? అదియునుగాక నేనువనవాసమును జేయుటకుఁదగిన సామర్థ్యముగలవాఁడను. కాఁబట్టిభరతునినాకుబదులుగావనవాసమును జేయించుటయుచితముగాదు. లోకములోశక్తిలేనివాఁడుప్రత్యామ్నాయమును జేయవలసినదిగాని శక్తిగలవాఁడుచేయఁగూడదని పెద్దలుచెప్పుదురు. కాఁబట్టి నేనువనవాసమునువదలి మరలరాజ్యమునునంగీకరించితినేనినిందితమైనకార్యమును జేసినవాఁడవగుదును. కైకేయిచెప్పినమాటయుచితముగానే యున్నదిగాని యనుచితముగానుండలేదు. నాతండ్రియగుదశరథమహారాజుచేసినకార్యముగూడ యుచితముగానేయున్నది. మఱియునోజనులారా! ఈభరతుఁడుమిక్కిలియోర్పుగలవాఁడనియును గురువునకుసత్కారమును జేయువాఁడనియును, నేనుదలఁచుచున్నాను. మఱియునీభరతుఁడుసత్యసంధుఁడు. కావున నీమహాత్మునకుసర్వమునుశుభకరమైయుండుఁగాక. నేనీవిధముగానే, ధర్మమునవలంబించి పదునాలుగుసంవత్సరములును వనవాసమును జేసిమరలవచ్చినపిమ్మటఁ దమ్ముఁడగుభరతునితోఁగూడ భూమికిభర్తనయ్యెదను. కైకేయిమాతండ్రియగుదశరథమహారాజునుతనవరములను దనకిమ్మనియాచించె. ఆసమయమునందుమాతండ్రియగు దశరథమహారాజునన్ను అరణ్యమునకుఁబొమ్మనుటకును, కైకేయికివరముల

నివ్వకయూరకుండుటకునుశక్తిలేకయుండె. అప్పుడునేను మాతండ్రియొక్క ఋణమునుదీర్పందలంచి నేనువనవాసమునకుంబోయెదననియును, కైకేయికి వరములనివ్వుమనియును జెప్పి నేనివ్విధముగావనవాసమునకువచ్చితిని. కావునభరతుండు రాజ్యమునకుంబోవుటయుచితముగ నున్నదని రాముండుజెప్పె

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలినూటపదునొకండవసర్గ ముగిసెను.

రాముడు భరతునిసమాధానపరచి బంగారు పాదుకలనెక్కి యాపాదుకలనిచ్చి పంపుట.

అవ్విధముగా, నధికమైనతేజస్సుగలరాముండును, భరతుండును, సంభాషించుకొనుచున్నమాటలనువినిరి. అంతట "వీరిసంభాషణమిగుల నాశ్చర్యమునుగలుగఁ జేయుచున్నదని చెప్పుచు నదివఱకేయంతర్ధానమును బొందియున్నఋషులును, సిద్ధులును, ఋషులలోనుత్తములగువారును, నచ్చోటనొక్కటిగాఁ జేరి, మహాత్ములును, కకుత్థ్సునివంశమునందుఁ బుట్టినవారలునునగు రామునిభరతునిననేకవిధములఁ బొగడిరి. అట్లుపొగడితమలో దామిట్లనిరి.

ఓమునిశ్రేష్ఠులారా! మనమెవ్వరిసంభాషణనువినిబాగుగనున్నదనిపొగడుదునున్నామో, యటువంటిపొగడ్తకుంగారణమైనవారును, ధర్మమునుజక్కఁగాఁ దెలిసినవారును, ధర్మమునుదప్పనిపరాక్రమముగలవారును, నగునీయిరువురుపుత్రులనుగనినతండ్రిధన్యుండనవచ్చుననిరి. అవ్విధముగాఁదమలోఁదాముమాట్లాడుకొనినపిమ్మట రావణాసురుఁడిప్పుడుచచ్చునా? అనిగోరుచున్నఋషులు మొదలగు వారలందఱునునక్కడకువచ్చి యొక్కటిగాగూడుకొని రాజోత్తముండగుభరతునిజూచియిట్లనిరి.

సత్కులమునందుఁబుట్టినవాండవును, బుద్ధిమంతులలోనుత్తముండవును, సచ్చరిత్రలుగలవాండవును, గొప్పకీర్తిగలవాండవును నైనయోభరతుండా! నీవునీతండ్రియగుదశరథమహారాజు చిరకాలముస్వర్గమునందుండవలయునని తలంచితివేని రామునిమాటనువినుము మఱియునోభరతుండా మేమందఱమునునీరాముండుతండ్రియొక్క ఋణమునుదీర్చుటమిక్కిలియుత్తమమనిసర్వకాలములయందునుదలంచుచున్నాము. దశరథమహారాజుకైకేయియొక్కఋణమునుదీర్చుటవలననే స్వర్గమునుబొందియున్నాడుఅని చెప్పి ఇవ్విధముగాఁజెప్పియాఋషిశ్రేష్ఠులును, గంధర్వులును, రాజర్షులును, మఱియునితరులగువిద్యాధరులు మొదలగువారును దమతమనివాసస్థానములకుఁబోయిరి. అట్లు దేవర్షులుమొదలగువారుచెప్పినమాటలనువినిచూచుటకు మిగులమనోహరుండైనరాముండుపరమానందమునుబొంది సంతుష్టమైనముఖముగలవాండై యాఋషులుమొదలగువారలనందఱునుబూజించెను. ఆసమయమునందుభరతుండు తనమనోరథమెట్లును, దీరలేదేయనియెడువ్యసనముచేత వణకుచున్నశరీరముగలవాండును, గద్గదస్వరముతోఁగూడినమాటగలవాండును, చేమోడ్పుగలవాండును నైరఘుకులమునందుఁబుట్టినరామునిజూచియిట్లనియె.

పూజ్యుండవైనయోరాముండా! నీవు రాజధర్మమునాలోచింపుము. మఱియుమనకులమునందలి వారందఱును నాచరించినవిధమునుదలంచి పెద్దవాండే రాజ్యమునుజేయవలసినదను మర్యాదనువిడిచిపెట్టకుము. పూజ్యుండవైనయోరాముండా! నేనొక్కండనేగొప్పదగునీరాజ్యమునుసర్వమునుగాపాడంజాలను. ఇంతయగాకమిగులఁబ్రియముగలపురజనులను, పల్లెటూరివారలను, మఱియునితరులను, సంతోషపెట్టంజాలను. అన్నా! యోరామా! మనయొక్కజ్ఞాతిజనులును, యుద్ధములయందుమిగులఁబ్రసిద్ధులగుభటులును, స్నేహితులును, మిత్రులును, మఱియునితరులగువారందఱును, "దున్నెడువారలుమేఘమును, గోరుచుండువిధముగ" నిన్నేకోరుచున్నారు. మనతల్లియగుకౌసల్యాదేవియునునిన్నుఁబ్రార్థించుచున్నది మాప్రార్థనసంగీకరింపుము. ఇందఱిప్రార్థననువ్యర్థముగఁ జేయకుము. బుద్ధిమంతులలోనుత్తముండవైనయోరామా! ఈరాజ్యమునుబొంది స్థాపనచేయుము. నీవీలోకమునుబరిపాలించుటయందుఁదగినసామర్థ్యముగలవాండవు. నాకీరాజ్యమునుబాలించునట్టిశక్తిలేదు. కాంబట్టినాయందీభారమునుదశరథమహారాజుపెట్టినవిధముగఁబెట్టకుమని చెప్పి యారామునియొక్కపాదములయందుఁబడెను. అట్లుపాదములయందుఁబడి ప్రియముగమాటలాడుటయందుఁదగినసామర్థ్యముగల యాభరతుండుమఱియుననేకవిధములఁబ్రార్థించె. ఆసమయమునందు రాముండుశరణాగతులనుతత్క్షణమేకాపాడువాడైనప్పటికినిదివఱకు రావణాసురునివధించెదనని వైకుంఠమునందుదేవతలతోఁ జేసినప్రతిజ్ఞనునెరవేర్చుటకుగాఁ గల్పింపఁబడినపితృవాక్యపరిపాలనను జేసెదనని ప్రతిజ్ఞను జేయుటవలనమొదటిప్రతిజ్ఞ వదలుట న్యాయముగాకుండుటచేతను, కొంచెమాలస్యముగాభరతునిప్రార్థననంగీకరింపవలసివచ్చినందువలనను, భరతునినోదార్చుటకుఁదనతొడమీఁదనెక్కించుకొనియె. అట్లుతొడమీదనెక్కించుకొని తనదేహకాంతివ్యాపించుటచేనల్లనిదైన దేహకాంతిగలవాండును, పద్మపత్రములవంటినేత్రములుగలవాండును, మదించి

సహంసయొక్క కంఠధ్వనివంటి కంఠధ్వనిగలవాఁడును నగు భరతునిజూచి స్వయముగా నిట్లనియె.

తమ్ముఁడా! భరతా! నీవు స్వయముగానే వినయసంపదగలవాఁడవు. అంతియే గురువులవలనఁగూడ వినయమును దెలిసికొంటివి. కావున నీకీయుత్తమబుద్ధి యధికమై యున్నది. కాఁబట్టి యో తమ్ముఁడా! ఈభూమినిసర్వమును బాలించునట్టి సామర్థ్యమును నీకిప్పుడుండు బుద్ధియే యిప్పుఁగలదు నీ వీభూమినిసర్వమును బాలింపఁగలవు. తమ్ముఁడా! బుద్ధిమంతులగు ప్రధానమంత్రులు, ఉపమంత్రులు, స్నేహితులు, మొదలగువారితో నాలోచించి గొప్ప గొప్ప కార్యములను జేయుము. తమ్ముఁడా! భరతా! చంద్రుఁడు రాత్రులయందుఁ గళాహీనుఁడైనను, హిమవంతుఁడు తనకు సహజమైన మంచును వదలినను, సముద్రుఁడు మేరమీరి వచ్చినను నేను నాప్రతిజ్ఞను వదలను. కావున నీవు నామాటనువిని యయోధ్యాపట్టణమునకుఁ బొమ్ము. కైకేయి, విషయములయందలి కోరికచేతనో, రాజ్యమును జేయవలయునని యెడు కోరికచేతనో, లేక యితరుల దుర్బోధనచేతనో, యీకార్యమును జేసినది. ఏవిధముగాఁ జేసిన నేమి? ఆవిషయమును నీ మనస్సునందు బెట్టికొనక తల్లియందుఁ బెట్టఁదగిన గౌరవమును బెట్టుకొని శుశ్రూషను జేయుచుండుమనియె. ఇవ్విధముగాఁ జెప్పుచున్నవాఁడును, కౌసల్యాదేవికిఁ బుత్రుఁడును, సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవాఁడును, విదియనాటిచంద్రునివలె నెల్లవారిచేతను మనోహరముగాఁ జూడఁదగినవాఁడును, నగు రామునితో భరతుఁ డిట్లనియె.

మహానుభావా! అన్నా! రామచంద్రా! నేను బంగారముచేత నలంకరింపఁబడిన చెప్పులను నీనిమిత్తముగఁ దీసికొని వచ్చితిని. ఈపాదుకల నెక్కి నాకిమ్ము ఈపాదుకలు సర్వలోకమునకు యోగక్షేమములను జేయుచుండఁగలవు. నామనవి నంగీకరించి యిప్పటికి యీకార్యమునైనను జేయుమనియె. అంతటఁ బురుషోత్తముఁడును, గొప్పదగు తేజస్సుగలవాఁడును, నగు నా రాముఁడు భరతుఁడు తెచ్చిన పాదుకలమీఁద నెక్కి దిగి యాపాదుకలను మహానుభావుఁడగు భరతునకిచ్చె. అంతట భరతుఁడు ఆపాదుకలకు నమస్కారమును జేసి రామునితో నిట్లనియె.

పరాక్రమవంతుఁడవును రఘుకులమునకు సంతోషమును గలుగఁజేయువాఁడవును, నైన యో అన్నా! రాముఁడా! నీ వెప్పుడు వత్తువో యని నీరాకను ఎదురుచూచుచు నయోధ్యాపట్టణమునకు బయట పదునాలుగు సంవత్సరములును, జడలను నారచీరలను ధరించి కందమూలఫలములను భుజించుచునుండెదను. మఱియు శత్రువులను దపింపఁజేయునట్టి యో రామా! ఈపదునాలుగు సంవత్సరములును రాజ్యభారమును వహించియుండెదను. పదునాలుగు సంవత్సరములును గడచిన మరుదినముయొక్క ప్రాతఃకాలమునందు నిన్నుఁ జూడకపోతినేని యగ్నిప్రవేశమయ్యెదనని చెప్పి యాభరతుఁడు కన్నీళ్ళచేత వ్యాప్తమైన శరీరముగలవాఁడై యన్నయగు రామునివదలె. అంతట ధర్మవేత్తయును, ప్రతాపముగలవాఁడును, నగు నాభరతుఁడు, బంగారముచేతఁ జక్కగా నలంకరింపఁబడిన యాపాదుకలను జక్కగాఁ బూజించి రామునకుఁ బ్రదక్షిణనమస్కారమును జేసి యాపాదుకలను తనయొక్క శత్రుంజయమను నేనుఁగుయొక్క శిరస్సునందుఁ బెట్టె. అంతట తనకు సహజమైన ధర్మమునందు హిమవంతునివలె నిశ్చయుఁడును, రఘుకులముయొక్క వృద్ధికిఁ గారణమైనవాఁడును, నగు రాముఁడు, తనయొద్దకు వచ్చిన జనమును, గురువులగు వసిష్ఠుఁడు మొదలగు ఋషులను, మంత్రులను, పురజనులను, తమ్ములగు భరతశత్రుఘ్నులను క్రమముగాఁ దగిన మర్యాదలతో సత్కరించి పంపెను. ఆసమయమునందు రాముని తల్లులందఱును, కన్నీళ్ళచేత వ్యాప్తమైన కంఠధ్వనిగలవారై (అనఁగా గద్గదస్వరముగలవారై) రామునితోఁ బోయివచ్చెదమని చెప్పుటకు శక్తిలేనివారైరి. అంతట నా రాముఁడు తనతల్లులకందఱకును నమస్కారమును జేసి తన దుపర్ణశాలలోనికిఁ బోయె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటఁబదిరెండవసర్గము ముగిసెను.

భరతుఁడు మొదలగువారు బంగారుపాదుకలను దీసికొని మఱల అయోధ్యకు వచ్చుట.

అటుపిమ్మట భరతుఁడదివఱకు సర్వోత్తమమయినదియును, శత్రుంజయమను పేరుగలదియును నగు నేనుఁగుయొక్క శిరస్సునందుంచి పాదుకలను దనశిరస్సునందుఁ బెట్టుకొని పరమానందమును బొందినవాఁడగుచు శత్రుఘ్నునితోఁ గూడ రథము నెక్కె. అంతట దృఢమైన వ్రతముగల వసిష్ఠుఁడును, వామదేవుఁడును, జాబాలియును, కార్యాకార్యములయందు మిగుల నిపుణమైన యాలోచనగలవారును, మఱియు నితరులగు జనులును బయలువెడలి సీతారాముల క్రీడలచేత మనోహరమైన మందాకినీనదికి అభిముఖముగా ముందర నడచిరి. మఱియు నట్లు పోవునపుడు మిగుల గొప్పదియగు చిత్రకూటపర్వతమునకుఁ గూడఁ బ్రదక్షిణమును జేయుచుఁ బోయిరి. అంతట నా భరతుఁడు సేనతోఁ గూడ మిగుల మనోహరములును, నానావిధములును, గైరికాదిధాతువిశేషములను జూచుచు నాచిత్రకూటపర్వతముయొక్క పార్శ్వభాగ



బరతుడు రామపాదుకలను అబిషేకించుట

మునను సరించిపోయె. అట్లు చిత్రకూట పర్వతముయొక్క
సౌందర్యమును జూచుచుఁబోవుచుండుటవలన భరద్వాజము
నిచేత నిర్మింపఁబడిన యాశ్రమమును, సమీపమునందున్న
దానిని బూచినవిధముగాఁ జూచె. (అనఁగా చిత్రకూటపర్వ
తమునందలి విచిత్రములను జూచుచుఁ బోవుచుండుటవలన భ
రద్వాజమునివరుని యాశ్రమము మిగుల దూరమునందున్న
ప్పటికిని సమీపమునందున్నదానివలెఁ గనఁబడియె) అంతట
బుద్ధిమంతులలో నుత్తముఁడగు భరతుఁడు భరద్వాజమహా
మునియొక్క యాశ్రమమునకుఁ బోయె. అట్లు పోయి రథ
ముమీఁదనుండి దిగి యామహామునిపాదములకు నమస్కార
ము జేసె. అంతట భరద్వాజమహాముని మిగుల నానంద
మును బొందినవాఁడై యాభరతునితో నిట్లనియె.

నాయనా! భరతుఁడా! నీవుపోయి రామునిఁ జూచితి
వా? రాముఁడు నీకోరికను దీర్చెనా? యనిన విని యన్న దమ్ము
లయందు మిగుల దయగలవాఁడగు భరతుఁడు బుద్ధిమంతు
లలో నుత్తముఁడగు భరద్వాజమునితో నిట్లనియె.

మునిశ్రేష్ఠుఁడా! నీయాజ్ఞను బొందిపోయిన పిమ్మట నేను
రామునిఁ జూచితిని. పిమ్మట నేనును, వసిష్ఠమహామునియు
ను, దృఢమైన పరాక్రమముగల యా రాముని ననేకవిధము
లఁ బ్రార్థించితిమి. అంతట రాముఁడు పరమానందమును
బొంది వసిష్ఠమహామునితో నిట్లనియె.

వసిష్ఠుఁడా! మా తండ్రియగు దశరథమహారాజుతోఁ బదు
నాలుగు సంవత్సరములరణ్యమునందు నివసించెదనని ప్రతిజ్ఞను
జేసితిని. ఇందుకు దశరథమహారాజు సంతోషించె. కావున
నేను మా తండ్రియొక్క యాజ్ఞానుసారముగఁ బదునాలుగు
సంవత్సరములును నరణ్యమునం జేయుండెదననియె. ఇవ్వి
ధముగా రాముఁడు చెప్పిన మాటను విని మిక్కిలి యధికమైన
ప్రజ్ఞగలవాఁడును, చక్కగా మాటలాడువాఁడునునగు వసి
ష్ఠమహాముని మిగులఁ జిత్రములగు మాటలయొక్క యర్థము
ను దెలిసికొనుటకుఁ దగినవాఁడును, మిగులఁ జక్కగ మాట
లాడ నేర్చినవాఁడునునగు రామునితో నొక్క గొప్పమాటను
జెప్పఁదలఁచి యిట్లనియె.

మిగుల బుద్ధిమంతుఁడవైన యో రాముఁడా! ఈ భరతుఁ
డునికు సమర్పింపవలయునని మెడబుద్ధితో బంగారముచేత న
లంకరింపఁబడిన పాదుకలను దెచ్చియున్నాఁడు. ఈ పాదు
కలను నీవు తొడుగుకొని సంతోషించినవాఁడవై మరల నీపాదు
కలను నిమ్ము. అంతట భరతుఁడీ పాదుకలను తీసికొనిపోయి
యయోధ్యాపట్టణమునందుఁ బట్టాభిషేకమును జేయును.
అట్లు సేసినయెడల నీపాదుకలె ప్రజలయొక్క యోగక్షేమ
ములను గనిపెట్టి పరిపాలనను జేయవలయుననియె. ఇవ్విధ
ముగా వసిష్ఠమహాముని చెప్పినపిమ్మట రాముఁడు తూర్పుది
క్కునకభిముఖముగా నా పాదుకలనెక్కి రాజ్యమును జే
యుటకొఱకు నాకిచ్చెను అంతట నేను అమ్మహాత్ముఁడగు రా
మునియొక్క యాజ్ఞను బొంది యాపాదుకలను శిరస్సునం
దుఁ బెట్టుకొని మరల నయోధ్యాపట్టణమునకుఁ బోవుచున్నా
నని జెప్పె. అంత మహానుభావుఁడగు భరతుఁడు సెప్పినయీ
మాటలనన్నింటిని విని భరద్వాజమునివరుఁడు శుభకరమైన
మాటను జెప్పఁదలఁచి యాభరతునితో నిట్లనియె.

మానవోత్తముఁడవును, సదాచారములుగలవారలలో
నుత్తముఁడవును నైన యో భరతుఁడా! నీవివ్విధముగాఁ జే
యుట యాశ్చర్యముగాదు. "చెరువునందు నీళ్లు నిలుచుట యా
శ్చర్యమగునా' అటులనే సత్పురుషుఁడవగు నీయందు జ్యే
ష్ఠభ్రాతయగు రాముని ననుసరించిపోవుట యను పుణ్యకార్య
మున్నది. కాఁబట్టి నీయట్టి సత్పురుషులకిది యొక గొప్ప కా
దు. ఇది సహజమే యని నేను దలఁచెదను. సకలధర్మములను
జక్కగఁ దెలిసినవాఁడవును, ధర్మమునందుఁ బ్రియముగల
వాఁడవును నైన నీయట్టి పుత్రునిఁ గనుటచేత మహాబాహుఁడు
ను నీకుఁ దండ్రియునునగు దశరథమహారాజు చచ్చిపోయిన
ప్పటికిని బ్రతికియున్నవాఁడే యని నేను తలఁచుచున్నాను. మం
చి పుత్రులను గనిన తండ్రి చచ్చియును బ్రతికియున్నవాఁడే య
గునని వేదమునందుఁ గూడఁ జెప్పఁబడియున్నదని భరద్వాజ
మహాముని చెప్పె. అంతట నా భరతుఁడు చేతులను జోడించు
కొని యివ్విధముగాఁ జెప్పుచున్నవాఁడును, మహానుభావుఁ
డును, నగు భరద్వాజమునివరుని యాజ్ఞను బొందిపోఁదలఁ
చి యా మునివరుని పాదములను బట్టుకొని పోయివచ్చెదనని చె
ప్పుటకు యత్నించె. అట్లు యత్నించి యా భరద్వాజమునివ
రునకు మూఁడుమారులు ప్రదక్షిణమును జేసి యా మునివరుని
యాజ్ఞను బొంది శ్రీమంతుఁడగు నా భరతుఁడు తన మంత్రు
లు మొదలగువారలతోఁ గూడ నయోధ్యాపట్టణమునకు బ
యలువెడలిపోయె. అప్పుడు భరతునియొక్క సైన్యమంతయు
ను పల్లకీలు మొదలగు యానములను, ఎద్దుబండ్లను, గుఱ్ఱముల
ను, ఏనుగులను నెక్కి భరతునకు ముందఱను వెనుకను బోవు
చుండె. అంతట భరతుఁడు మొదలగువారందఱును నలల
యొక్క పంక్తులచేత మిగుల మనోహరముగాఁ బ్రకాశిం
చుచున్న యమునానదిని దాటి పావనమైన యుదకముగల గం
గానదిని జూచిరి. అప్పుడా భరతుఁడు సకలబంధుజనులతో
డను గూడినవాఁడై మనోహరమైన యుదకముచేత నిండియు
న్న గంగానదిని దాటె. అట్లు గంగానదిని దాటి తన సైన్యము
తోఁ గూడ శృంగిబేరపట్టణమునకుఁ బోయె. పోయి యక్క
డ కొంతసేపు నివసించె. పిమ్మట నా పట్టణమునుండి బయలు

వెడలిపోయి యయోధ్యాపట్టణమునుజూచె. తండ్రియగు దశరథమహారాజును, అన్నయగురాముఁడును లేనిదైయున్నయాపట్టణమునుజూచి భరతుఁడధికమైనదుఃఖముచేఁబీడింపఁబడి తనసారథితో నిట్లనియె.

సారథీ! చూడుము. మనయయోధ్యాపట్టణ మిప్పుడు రామునియొక్క వియోగమువలనఁ గలిగినవ్యసనముచేఁ బీడింపఁబడినదగుటవలనఁ గొంచెమయినను శోభలేనిదైయున్నది. మఱియునుమంగళకరమయిన యాకారములేనిదియును, సంతోషములేనిదియును, దీనత్వమునుబొందినదియును, నైనిశ్శబ్దముగానున్నది? చూడుమని భరతుఁడు చెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటపదిమూఁడవసర్గ ముగిసెను.

భరతుడు మొదలగువారు అయోధ్య పాడు వేసినట్లుండుటను జూచుట.

అంతటఁ బ్రభువును, గొప్పదగు కీర్తిగలవాఁడునునగు నాభరతుఁడు మిగులమనోహరముగా ధ్వనిచేయుచున్నరథముతోఁగూడనతిశీఘ్రముగ నయోధ్యాపట్టణముయొక్క సమీపమునకుఁబోయె. ఆసమయమునందా యయోధ్యాపట్టణము, పిల్లులయొక్కయు, గుడ్లగూబలయొక్కయు సంచారముగలదియును, చీకటిచేతదట్టముగానంతటనువ్యాప్తమయినదియును, కాంతిహీనమయినదియును, నగుకృష్ణపక్షరాత్రివలెనుండె. మఱియుఁజంద్రునకుఁ బ్రియభార్యయును, మిగులగొప్పదగుకాంతిచేతఁ బ్రజ్వలించుచున్నప్రకాశముగలదియునునగు రోహిణీనక్షత్రము మిగులవేగముగాబయలువెడలినక్రూరగ్రహముచేత (అనఁగాసూర్యునిచేతననుట) పీడింపఁబడుటవలన నెట్లుకాంతిహీనమైయుండునోయావిధముగా నాయయోధ్యాపట్టణముకాంతిలేనిదైయుండె. మఱియునెండవేడిమిచేతఁ దపింపఁజేయబడినదియును, కొంచెముగానీళ్లుగలదియును, ఎండవేడిమిచేతమిగులఁదపించుచున్నపక్షులుగలదియును, లోపలనణఁగియున్నచేపలును, మత్స్యములును, మొసళ్లునుగలదియును, మిగులఁగృశించినదియును, నగుకొండకాలువవలెనాయయోధ్యాపట్టణము కాంతిలేనిదైయుండె. మరియును, బాగలేకపోవుటవలన బంగారముయొక్క కాంతివంటికాంతిగలదియును, యజ్ఞములయందలి యగ్నివలనఁబుట్టినదియును, దధిమొదలుగాఁగలహవిస్సుచేత వృద్ధినిబొందింపబడినదియును, పిమ్మటమంటనాశమును బొందినదియునునగునగ్నిజ్వాలవలె నయోధ్యాపట్టణము కాంతిలేనిదైయుండె. మఱియు, గొప్పదగుయుద్ధమునందు, పాడుచేయఁబడినకవచములుగలదియును, మిగులబాధనుబొందింపఁబడినయేనుఁగులను, గుఱ్ఱములును, రథములును, టెక్కెములును, గలదియును, చచ్చిపోయినవీరులుగలదియును, మిగులబాధనుబొందియున్నదియును, నగుసేనవలెనయోధ్యాపట్టణము మిగులదీనమైయున్నది. మఱియునుమిక్కిలియధికమగునురుగుతోఁ గూడుకొన్నదియును, గొప్పదగుధ్వనిగలదియును, సముద్రమువలనఁ బుట్టినదియును, నగుఅలలు వాయువణఁగిపోయినపిమ్మట నణఁగినదియును, నిశ్శబ్దమైనదియునునైయుండువిధముగ నయోధ్యాపట్టణమునిశ్శబ్దముగనున్నది. మఱియును, యజ్ఞాయుధములగు స్రుక్స్రువాదులులేనిదియును, అధ్వర్యులుమొదలగువారులేనిదియును, నగుయజ్ఞవేదికకడపటిదినమునం దేవిధముగానుండునోయయోధ్యాపట్టణమావిధముగానుండె. మఱియునుమందలోనేయున్నదియును, మిగులనధికముగా వ్యసనమును బొందుచున్నదియును, క్రొత్తగడ్డినిగూడఁదిననిదియును, ఆబోతులేనిదియును, సంతోషహీనమైనదియును, నగుఆవులగుంపువలెనయోధ్యాపట్టణము మిగులదీనత్వమునుబొందియుండె. బ్రహ్మజాతియందుఁబుట్టినవియును, సర్వోత్తమములైనవియును, మిగులఁగాంతిగలవియునునగు పద్మరాగము మొదలుగాఁగలమణులు నాయకమణిగాలేనిదియును, క్రొత్తదియునునగుముత్యాలహారమువలె నయోధ్యాపట్టణముకాంతిహీనమైయుండె మఱియునుదనయొక్క స్థానమునుండి శీఘ్రముగాజలించినదియును, పుణ్యమునశించిపోవుటవలనభూలోకమునకువచ్చినదియును, కాంతివిహీనమైనదియును, ఆకాశమునుండి (లేకస్వర్గలోకమునుండి) జారినదియునునగునక్షత్రములవలెనయోధ్యాపట్టణముకొంచెమైనను గాంతిలేనిదైయుండె. మఱియును, వసంతకాలమునందుఁ బుష్పములతోఁగూడినదియును, మదించినతుమ్మెదలయొక్క ధ్వనిగలదియును, మిగులఁదీవ్రమగునెండవేడిమిచేత వాడినదియును, నగువసమునందలి తీగవలెనయోధ్యాపట్టణము శోషించియుండె. మఱియునయ్యయోధ్యాపట్టణము జనరహితమైన మార్గముగలదియును, మూయఁబడినయంగళ్లుగలదియునునైమరగిపోయిననక్షత్రములుగలదియును, నల్లనిమేఘములచేఁ గప్పఁబడినదియును నగునాకాశమువలెఁ బ్రకాశింపకయుండె. కల్లునంతయును దాగినపిమ్మట విసరివేయుటవలనఁ బగిలిపోయినమూకుళ్లుమొదలుగాఁగల పాత్రలుగలదియును, కల్లునుదాగిమదించిన జనులులేనిదియును, ఒట్టిబయలుగానున్నదియును, (అనఁగాఁ గల్లుదాగినవారులేనిదియును) చక్కచేయఁబ

జనదియునవగుభూమివలె అయోధ్యాపట్టణముకొంచెమైనను శోభలేనిదైయుండె. మఱియును బ్రద్దలైన భూమిభాగముగలదియును, బ్రద్దలైనపాత్రలుగలదియును, నీళ్లు డ్రైగడమైనపిమ్మట భగ్నమైనదియునునగు చలిపందిరివలెన యోధ్యాపట్టణము పాడుపడియుండె. మఱియును మిగుల విశాలమైనదియును, అంచులయందుఁ గట్టఁబడినదియును, తగిన త్రాడుతోఁ గూడుకొనినదియునునగు శూరులగువారిచేత ఛేదింపఁబడినదియును, ఆయుధమునుండి జారినదియును, నగునల్లెత్రాడువలె నయోధ్యాపట్టణము ప్రకాశము లేనిదైయుండె. మఱియును యుద్ధమును జేయుటయందు మిగులసమర్థుఁడగు గుఱ్ఱపురౌతుచేత నెక్కఁబడినదియును, తగినయాభరణములు లేనిదియును, ఎక్కియుద్ధమును జేయుటకుఁ దగనిదియును, విడువఁబడినదియును ఈడుచాలనిదియునునగు నాడుగుఱ్ఱమువలె నయోధ్యాపట్టణముకొంచెమైనను ప్రకాశము లేనిదైయుండె మఱియును, ఎండిపోయినయుదకముగలదియును, గొప్పవగుచేపలచేతను, తాబేళ్ళచేతను, మఱియునితరములగు జలజంతువులచేతను, వ్యాప్తమైనదియును, బ్రద్దలైపోయిన యొడ్డులుగలదియును, మిగులవిశాలమైనదియును, అపహరింపఁబడినకలువలుగలదియును, నగుదిగుడుబావివలె నయోధ్యాపట్టణము కాంతిలేనిదైయుండె. నిషిద్ధములగు మైపూతలుగలదియును, దుఃఖముచేతఁ దపింపఁ జేయఁబడినదియును, ఆభరణములేమియును లేనిదియును, నగు, దుఃఖముగలమానవునియొక్క శరీరమువలె నయోధ్యాపట్టణము కాంతిలేనిదైయుండె. మఱియును, వర్షాకాలము మిగులవృద్ధిని బొందినదగుచునుండఁగా మేఘమండలమునందుఁ బ్రవేశించినవాఁడును, నల్లని మేఘములచేతఁ గప్పఁబడినవాఁడునునగు సూర్యునియొక్క కాంతితగ్గియున్న విధముగ నయోధ్యాపట్టణము కాంతి శూన్యమైయుండె. ఇవ్విధముగఁ గాంతివిహీనమైన యయోధ్యా పట్టణమునందుఁ బ్రవేశించినపిమ్మట రధమునందేయున్నవాఁడును, శ్రీమంతుఁడును, దశరథమహారాజునకుఁ బుత్రుఁడునునగు భరతుఁడు రధమును దోలుచున్నవాఁడును, తనకు సారథియునగు సుమంత్రునితో నిట్లనియె.

ఓసారథీ! ఇప్పుడీయయోధ్యాపట్టణమునందు మునుపటివలెఁ గంభీరమైనగీతవాద్రిత్రములయొక్క ధ్వనివినఁబడడములేదు. మద్యగంధము, పుష్పములయొక్క పరిమళమును, అగురుమొదలగువానియొక్క గంధమును మునుపటివలెఁ బరిమళించడములేదు. ఉత్తమములగు వాహనములయొక్క ధ్వనివినఁబడడములేదు. మిగులమనోహరములగు గుఱ్ఱములయొక్క సకిలింపులవలనఁ గలిగినధ్వని వినఁబడడములేదు. మిక్కిలిమదించిన యేనుఁగులయొక్క ఘీంకారము వినఁబడడములేదు. గొప్పవగురధములయొక్క ధ్వనివినఁబడడములేదు. రాముఁడీపట్టణమును వదలిపోయినది మొదలుకొని యీయయోధ్యాపట్టణమునకు సంతోషములేకపోవుటవలన మనోహరమైన శబ్దమేదియును వినఁబడడములేదు. రాముఁడు వనవాసమునకుఁ బోవుటవలనఁ గలిగినదుఃఖముచేత వయోవంతులందఱును, వ్యసనముగలవారై చందనాగరుగంధములను, మిగులమనోహరములును, నధికముగు వెలగలవియునునగు పూలమాలికలను, ననుభవించడములేదు. రాముఁడు దూరదేశమునకుఁ బోవుటవలన నీపట్టణమునందలిజనులలో నెవ్వరును, నానావిధములగు వర్ణములుగల పూలమాలికలను ధరించినవారై విలాసార్థముగ బయలుదేరివచ్చి సంచరించడములేదు. మఱియు నీపట్టణమంతయును రామునివియోగమువలన మిక్కిలి వ్యసనముగలదైయుండుటచేత నుత్సవములేమియును లేనిదైయున్నది. మఱియు నాయన్నయగు రామునితోఁగూడ నీపట్టణముయొక్క సంపదయంతయును బోయినదని తలఁచుచున్నాను. మఱియు నీయయోధ్యాపట్టణమంతయును ధారావర్షముతోఁ గూడిన శుక్లపక్షరాత్రివలెఁ గాంతిహీనమైయున్నది. మఱియు నోసారథీ! మహోత్సవములవలెను, వేసవికాలమునందలి మేఘమువలెను నాయన్నయగు రాముఁడు వచ్చి నా కెప్పుడు సంతోషమును గలుగఁ జేయునో గదా? మఱియు నోసారథీ! వయోవంతులును, సుందరములగు వేషములుగలవారును, మిగులగర్వముతో నడుచువారును, సర్వస్థలములయందును విహారార్థముగ సంచరించువారును, నగుమానవులు యీయయోధ్యాపట్టణమునందలి రాజవీధులయందు సంచరించడములేదు. ఇదియంతయును రాముఁడు దూరదేశమునకుఁ బోవుటవలనఁ గలిగినవ్యసనమును సూచనచేయుచున్నదని చెప్పుచు నాభరతుఁడు, తండ్రియగుదశరథమహారాజును, అన్నయగురాముఁడును, లేకపోవుటవలన సింహములేనిగుహవలెనున్నదియును, తనతండ్రియగు దశరథమహారాజుచేతఁ బరిపాలింపఁబడినదియునునగు నయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించె. ఆసమయమునందంతఃపురమంతయును గొంచెమైనను గాంతిలేనిదై దేవతలులేనిదియును, సూర్యహీనమైనదియును, నగుదినమువలెఁ గొంచెమైనను గాంతిలేనిదైయుండె. (పూర్వమునందొకతూరి దేవాసురయుద్ధమునందు దేవతలు రాక్షసులచేతఁ దరుమఁబడిరనియును, అప్పుడు రాహువు సూర్యుని మ్రింగెననియును, కాఁబట్టి యేడుదినములు సూర్యుఁడును దేవతలును లేక యుండిరనియును, అ

ట్లు దేవతలును సూర్యుఁడును లేక పోవుటవలనఁ బ్రపంచమంతయును బ్రకాశము లేనిదై గాఢాంధకారముచే వ్యాప్తమయియుండెననియును, ఆసమయమునందత్రిమహాముని తపఃప్రభావముచేత సూర్యునివలెఁ బ్రకాశించి యంధకారమును బోఁగొట్టెననియును, పురాణములయందు జెప్పబడియున్నది. కావున నయోధ్యాపట్టణమునందలి యంతఃపురము దేవతలును, సూర్యుఁడును లేనిదినమువలెఁ గాంతిహీనమైయున్నదని చెప్పఁబడెను) అట్లు కొంచెమైనను బ్రకాశింపనిదై పాడుపడిన దానివలెనున్నదియును, జనులు లేనిదియును, నగు నంతఃపురమును జూచి మిగుల బుద్ధిమంతుఁడగు భరతుఁడు మిక్కిలి వ్యసనముగలవాఁడై కన్నీళ్లను విడుచుచుండెను.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటపదునాల్గవసర్గము ముగిసెను.

భరతుఁడు నందిగ్రామమునకుఁ బోయి శ్రీరాముని పాదుకలకు బట్టాభిషేకము సేయుట.

అట్లయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించిన పిమ్మట నిశ్చయమైన వ్రతముగల (అనఁగాఁ దానుబట్టిన వ్రతమును వదలనివాఁడు) భరతుఁడు తల్లులనందఱను నాయయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశపెట్టి రాముఁడరణ్యమునకుఁ బోవుటవలనఁ గలిగిన దుఃఖముచేత మిగులఁ బరితాపమును బొంది కులగురువులగు వసిష్ఠాదిమహామునులతో నిట్లనియె.

ఓ ఋషిశ్రేష్ఠులారా! మీయందఱయొక్క యనుజ్ఞను గొని నేను నందిగ్రామమునకుఁ బోయెదను. పోయి యక్కడ నివసించి రాముఁడు లేనందువలనఁ గలిగిన దుఃఖమును సహించెదను. దశరథమహారాజు చచ్చిపోయెను. అన్నయును, గురువును, నగు రాముఁడరణ్యమునకుఁ బోయెను. కావున నేనొంటరిగా నీపట్టణమునందుండఁజాలను. కాఁబట్టి నేను బోయి నందిగ్రామమునందుండి రాముని రాకఁ గోరుచుండెదను. అధికమయిన కీర్తిగల రాముఁడే యీ రాజ్యమును బాలించుటకుఁ దగినవాఁడు గాని యితరుఁడు పాలింపఁదగినవాఁడు గాదనియె. మహానుభావుఁడగు భరతుని చేత నివ్విధముగాఁ జెప్పఁబడినదియును, మిగులఁ బావనమైనదియును నగుమాటను విని పురోహితుఁడగు వసిష్ఠమునియును, మంత్రులందఱును నొకటిగాఁ జేరి యిట్లనిరి.

భరతుఁడా! నీవన్నయగు రామునియందు దయగలవాఁడగుటవలనఁ బలికినమాట మిగులఁ గొనియాడఁదగియున్నది. మఱియు నీకులమునకుఁ గూడఁ దగియున్నది. మిగుల బుద్ధిమంతుఁడవగు నీకీమాట తగియున్నది. మఱియు నో భరతుఁడా! సర్వకాలములయందును బంధువులయందుం బ్రేమగలవాఁడవును, అన్నయగు రామునియందుఁ బ్రేమగలవాఁడవును, పూజ్యులగువారియొక్క పద్ధతి నవలంబించినవాఁడవును, నగు నీమాటల కంగీకారమును బొందనివాఁ డెవ్వఁడు గలఁడు. సర్వజనులకును నంగీకరింపఁదగినదై యున్నదని మంత్రులు మొదలగువారందఱును జెప్పిరి. ఆసమయమునందు భరతుఁడు తనయభీష్టానుసారముగ మంత్రులు మొదలగువారందఱును జెప్పినమాటను విని సంతోషమును బొందినవాఁడై తన సారథితో రథమును సిద్ధపరుపుమనియె. పిమ్మట మిగుల సంతోషముతో నవ్వుచున్న ముఖముగలవాఁడై యాభరతుఁడు తల్లులకందఱకును నమస్కారమును జేసె. అంతట శ్రీమంతుఁడగు నాభరతుఁడు శత్రుఘ్నునితోఁ గూడుకొనినవాఁడై రథము నెక్కె. అట్లు భరతశత్రుఘ్నులిరువురును శీఘ్రముగ రథము నెక్కి పరమసంతోషముగలవారును, మంత్రులతోడను, పురోహితులతోడను గూడుకొనినవారును, నై పోయిరి. అప్పుడు వసిష్ఠుఁడు మొదలుగాఁగల బ్రాహ్మణశ్రేష్ఠులందఱును దూర్పుదిక్కునకభిముఖులై భరతునకంటె ముందుగా నందిగ్రామపట్టణమునకు బయలువెడలిపోయిరి. మఱియు నాసమయమునందు గుఱ్ఱములు, ఏనుఁగులు మొదలగువానితోఁ గూడుకొని సైన్యమంతయును, రమ్మని చెప్పకమునుపే బయలువెడలిపోయె. మఱియు నట్లు భరతుఁడు బయలువెడలఁగానే పట్టణములోని జనులందఱును భరతునితోఁ గూడ బయలువెడలిపోయిరి. ధర్మాత్ముఁడును, అన్నయగు రామునియందుఁ బ్రేమగలవాఁడును, నగు భరతుఁడు రథము నెక్కి రామునిపాదుకలను నెత్తిని బెట్టుకొని మిగుల శీఘ్రముగ నందిగ్రామమునకుఁ బోయెను. అంతట నాభరతుఁడు మిగుల శీఘ్రముగా నందిగ్రామమునందుఁ బ్రవేశించె. పిమ్మట రథమునుండి దిగి వసిష్ఠమహాముని మొదలుగాఁగల గురువులతో నిట్లనియె.

ఓ గురువులారా! నాయన్నయగు రాముఁడు ఈ రాజ్యమును సర్వమును ధనమును దాచుటకిచ్చిన విధముగ నిచ్చెను. ఈ రాజ్యమును సర్వమును బాలించుటకుఁ దనకు మాఱుగా బంగారముచేత నలంకరింపఁబడిన పాదుకల నిచ్చె. ఈ పాదుకలు రాజ్యమునందలి యోగక్షేమములను గనిపెట్టి పాలింపఁగలవని చెప్పి యాభరతుఁడు రామునకు బదులుగా నివ్వఁబడిన పాదుకలను శిరస్సునందుఁ బెట్టుకొనియె. అంతట రాముఁడరణ్యమునకుఁ బోయెనే యనువ్యసనముచేత నధికమయిన దుఃఖముగలవాఁడై మంత్రులు గురువులు, పురజనులు మొదలుగాఁగలవారలందఱితోడను నిట్లనియె.

ఓమానవోత్తములారా! ఈపాదుకలకు గొడుగుబట్టునట్లు సేయుఁడు. వింజామరల చేతవీచునట్లు సేయుఁడు. నాయన్నయగు రామునియొక్క పాదుకలిక్కడనుండుటచేత రాజ్యమునందు ధర్మము చెడిపోక నిలిచియున్నది. మఱియు నాయన్నయగు రాముఁడీపాదుకలను నిక్షేపముగ తమ్ముఁడనను మిక్కిలి ప్రేమచేత నాయందు నిలిపెను. ఇవి రామునకు బదులుగా రాజ్యమును జేయుచుండును. రాముఁడు వచ్చువఱకును నేనీపాదుకలయాజ్ఞను బొందియుండెదను. శీఘ్రముగా నేయీపాదుకలను రాముని పాదములకు సమర్పించి యీరాముని పాదములచేత నలంకరింపఁబడి యుండుటను జూడఁగలను. మఱియు నోగురువులారా! అట్లు రాముఁడు వచ్చి యీపాదుకలను ధరించినపిమ్మట రాజ్యభారమును సర్వమును రామునియందుఁ బెట్టి రాజ్యవృత్తాంతమును సర్వమును రామునకుఁ దెలిపి నేను మహానుభావునకుఁ దండ్రికిని శుశ్రూషను జేయువిధముగ శుశ్రూషను జేయుచు నతనితోఁ గూడుకొనియుండెదను. మఱియు నోగురువులారా! రాముఁడు నాదగ్గర దాచిపెట్టిన రాజ్యరూపధనమును, తనకు బదులుగా రాజ్యమును బాలించుటకిచ్చిన పాదుకలను, ఈయయోధ్యాపట్టణమును, మఱియు నితరమగు ధనము మొదలగువాటిని సమర్పించి పాపరహితుఁడను కాఁగలను. కకుత్స్థనికులమునందుఁ బుట్టిన రాముఁడు మరల నయోధ్యాపట్టణమునందుఁ బట్టాభిషిక్తుఁడైనపిమ్మట సకలజనము సంతోషముతోఁ గూడిన మనస్సు గలదియగును. ఇవ్విధము జరిగెనేని నాకు రాజ్యలాభముకంటె నాలుగురెట్లధికమయిన కీర్తియును, సంతోషమును నాకుఁ గలుగును. గొప్ప దగు కీర్తి గల భరతుఁడు దీనుఁడై యీవిధము గా వ్యసనముతో మాటలాడుచు మఱియు నధికముగా దుఃఖమును బొందినవాఁడగుచు మంత్రులతోఁ గూడ నందిగ్రామమునందు రాజ్యమును జేసె. పరాక్రమవంతుఁడగు భరతుఁడు, నారచీరలను, జడలను ధరించినవాఁడును, మునివేషమును ధరించినవాఁడును, సకలసైన్యములతోఁ గూడుకొనినవాఁడును, ప్రభుత్వమును బొందినవాఁడును నగుచు నందిగ్రామమునందు నివసించె. అన్నదమ్ములయం దధికమైన ప్రీతి గలవాఁడును, రాముని రాకను గోరుచున్నవాఁడును, అన్నయగు రామునియొక్క యాజ్ఞననుసరించి సంచరించువాఁడును, నగు భరతుఁడప్పుడు పాదుకలకుఁ బట్టాభిషేకమును జేసి నందిగ్రామమునందు నివసించె. అటుపిమ్మట భరతుఁడు సకలములగు రాజ్యకృత్యములను పాదుకలకొఱకుఁ దెలుపుచు రాజ్యమును బాలించుచుండెను. శ్రీమంతుఁడగు భరతుఁడాపాదుకలను ... రాజ్యమున కధికారిని ... మునియొక్క పాదుకలకు పట్టాభిషేకము ... రాజ్యపాలనము ... ను, పాదుకలయొక్క యాజ్ఞను బొందినవాఁడగుచు రాజ్యమును జేసె మఱియు నా భరతుఁడు రాజ్యము యొక్క క్షేమముకొఱకుఁ జేయఁదగిన కార్యమును, రాజ్యమునందు వచ్చుచున్న పన్ను మొదలగువానిని, మిగుల వెలగల వస్తువులను ముందుగా రాముని పాదుకలకు నివేదించి పిమ్మటఁ జేయఁదగినవి మంత్రులతో నాలోచించి చేయుచుండె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటపదునాఱవసర్గము ముగిసెను.

చిత్రకూటపర్వతమునందు రామునితోఁ గూడ ఆశ్రమములయందు నివసించుచుండిన మునులందఱు రాక్షసుల బాధచే రాముని వదలిపెట్టి పోవుట.

అట్లు భరతుఁడు అయోధ్యాపట్టణమునకుఁ బోయినపిమ్మట రాముఁడా చిత్రకూటపర్వతముయొక్క సమీపమునందలి తపోవనమునందే నివసించియుండెను. అంతట గొన్ని దినములకు అచట నివసించుచుండు మునులకందఱకును మఱియొక యాశ్రమమునకుఁ బోవలయునని యొకతలంపు గలిగి అట్టి సంకల్పముగలవారయ్యెను, రాక్షసులెక్కడఁ బోయినను బాధింతురేమోనియును, రామునకేమికీడు వచ్చునోయనియును, తలఁచి భయమును బొందుచుండిరి. ఆసంగతిని వారియొక్క చేష్టలచేత రాముఁడు తెలిసికొనియె. మఱియు నా చిత్రకూటపర్వతమునందుఁ దనతోఁ గూడ నివసించియున్న మును లందఱును, తనను వదలిపోవలయునని దృఢనిశ్చయముగలవారైయుండుటను భయముగలవారైయుండుటను జక్క(గఁ) దెలిసికొనియె. ఆసమయమునం దక్కడనున్న మునులందఱును భయముగలవారై తమయభిప్రాయమును రాముఁడు తెలిసికొనెనను సంకల్పముగలవారై తమలోఁ దాము కనుసన్నలచేత మాటలాడుచు రహస్యముగాఁ గొన్నికథలను మెల్లగాఁ జెప్పుకొనుచుండిరి. మఱియు రాముఁడేమి చేసెనోయని గుసగుసలాడుచుండిరి. అవ్విధముగా ఋషులందఱును మఱియొకయాశ్రమమునకుఁ బోవలయునని సంకల్పించియుండుటను రాముఁడు తెలిసికొని తనవలన నేమిటైన అపకారము గలిగెనేమోయను సందేహముగలవాఁడై చేతులను ముకుళించుకొని కులపతియగు మునిశ్రేష్ఠునితో నిట్లనియె.

పూజ్యుఁడవైనయో మునిశ్రేష్ఠుఁడా! పూర్వులైన రాజులయందుండినట్లు నాయందును ... వృత్తాంతమేమియు నెట్టిభేదముగాని కనిపించుటలేదు. ఇట్లుండఁగ పోవుటకు కారణమేమి? ఏ హేతువచేతనైనను తపోవనమునందు ... సునిశ్చయముగా ... యనునో ... మునిశ్రేష్ఠుఁడా! ...

దవశమువలన నేమయిన మునులయెడల నపకారమును జేసెనా? అట్లుగాఁ జేసి లక్ష్మణుఁడు బుద్ధిపూర్వకముగ నేతన కుఁదగని దుష్కృత్యము నేమయినఁ జేసెనా? మీకు శుశ్రూషను జేయుచున్నదియును, మీకు సర్వకాలములయందును శుశ్రూషను జేయవలయునని సంకల్పముగలదియును, నగు సీతాదేవి పొరబాటునఁ దనయోగ్యతకుఁ దగని కృత్యము నేమయినఁ దలఁచెనా? ఇవ్విధముగా మీరు భయమును బొందుటకుఁ గారణమేమియో చెప్పవలయునని యడిగె. అటు పిమ్మట ముసలితనముచేత వృద్ధుఁడును, తపస్సుచేతఁ గూడ ముసలితనమును బొందినవాఁడును, నగు నా మునివరుఁడు గడగడవణఁకుచు సకలభూతముల యందును దయగలవాఁడగు రామునితో నిట్లనియె.

నాయనా! రాముఁడా! మంగళకరమయిన బుద్ధిగలదియును, మంగళకృత్యములయం దభిలాషగలదియును, నగు సీతాదేవి తపోవంతులయందు మిగులభక్తితోడను, శ్రద్ధతోడను, గూడుకొనినదై వర్తించుచుండును. ఇట్టిసద్గుణములుగల సీతాదేవి యపకారము నెట్లు చేయును. నాయనా! రాముఁడా! రాక్షసులవలన నీనిమిత్తముగఁ గలిగిన బాధలు తపోవంతులకు నీయాశ్రమమునుండి పోవలయునని మెదుతలంపును గలిగించుచున్నవి. కావున నో రామచంద్రా! తపోవంతులందఱును నా రాక్షసబాధతోఁ గూడినవారై తమలోఁ దాము కథలను జెప్పుకొనుచున్నారు. మఱియు నో రాముఁడా! రావణునకుఁ దమ్ముఁడును, ఖరుఁడని యెడు నామముగలవాఁడును నగు నొక్క రాక్షసుఁడు యీజనస్థానమునందు నివాసముల నేర్పఱచుకొనియున్న మునులనందఱను బాధించుచున్నాఁడు. మఱియును మునులయొక్క యీకుటెండ్లను బాడు సేయుచున్నాఁడు. వాఁడు పరమదుర్మార్గుఁడు. ఇంతియగాక యుద్ధములయందు జయముగలవాఁడు. సకలప్రాణులను జంపునట్టివాఁడు. మఱియుఁ బురుషులను భక్షించును. సకలఅమంగళపు పనులను జేయువాఁడు. ఇంతియగాక పాపాత్ములలో మొదటివాఁడు. ఇటువంటివాఁడు నీకుఁ గూడ నపకారమును జేయఁదలఁచియున్నాఁడు. ఇందువలన నీఋషులందఱును భయమును బొందుచున్నారు. నాయనా! రాముఁడా! నీవీయాశ్రమమునందుఁ బ్రవేశించినది మొదలుకొని రాక్షసులు వచ్చి తపోవంతులను ననేకవిధములచేత బాధించుచున్నారు. మఱియు నా రాక్షసులు, మిగులఁ గ్రూరములైనవియును, నసహ్యాకరములైనవియును, నానావిధములయినవియును, వికారముగలవియును, చూచుటకు వికారముగనున్నవియును, అమంగళకరములైనవియును, అప్రశస్తములైనవియును, నగు వస్తువులను దీసికొనివచ్చి మునులమీఁద వైచి యనేకవిధముల బాధించుచున్నారు. మఱికొందఱగు మునులను గూడ జంపుచున్నారు. ఆదుర్మార్గులు సర్వకాలములయందును నెదుటనే సంచరించుచున్నారు. మఱియు నవ్వైయాశ్రమములయందుఁ దెలియకుండఁగ సంచరించుచున్నారు. మఱియు నీయాశ్రమములయందు దుర్బుద్ధిగల యారాక్షసులు తపోవంతులను నానావిధముల బాధించుచున్నారు. నెత్తురుకుండలను దీసికొనివచ్చి యందలి నెత్తురును ఆశ్రమమునందంతటను జల్లుచున్నారు. నీళ్లు చల్లి మాయగ్నిహోత్రముల నార్పుచున్నారు. ఇవ్విధముగా నా దుర్మార్గులచేతఁ బీడింపఁబడుచున్న యాశ్రమములను వదలిపోవలయుననియును, మఱియొక యాశ్రమమునందుఁ బ్రవేశింపవలయుననియును, ఋషులందఱును నిప్పుడు నన్నుఁ బ్రేరణ చేయుచున్నారు. మఱియు నో రాముఁడా! దుర్మార్గులగు నా రాక్షసులు తపోవంతులగు మునులయొక్క శరీరములకుఁ గూడ బాధను గలిగించుచున్నారు. కావున మేమందఱమును నీయాశ్రమమును వదలిపోవలయునని తలఁచుచున్నాము. రాముఁడా! ఈయరణ్యమునందుఁ గందమూలఫలములు సులభముగాను విశేషముగాను, దొరుకునని వచ్చితిమి. వచ్చినందుకిటువంటి యాపద వచ్చినది. కాఁబట్టి యిఁకమీఁద నీయాశ్రమమును వదలిపోయెదము. నాయనా! రాముఁడా! ఖరుఁడనే రాక్షసుఁడు నీకుఁ గూడ నపకారమును జేయవలయునని తలఁచి యనుచితముగాఁ బ్రవర్తించుచున్నాఁడు. కావున నీకు సమ్మతమయ్యేనేని మాతోఁ గూడ రమ్ము. నీవు భార్యతోఁ గూడ నిక్కడ నుండుట యుచితముగాదు. ఎంత సమర్థుఁడవైనను నీవు భార్యతోఁ గూడ నిక్కడనుంటివేని యీచోటున నిర్భయముగా నుండుటకు వీలుపడదు. కావున నీచోటు దుఃఖమును గలుగఁ జేయునని తోఁచుచున్నది. మఱి యవశ్యముగా నీవిక్కడనుంటివేని నీకు దుఃఖము గలుగునని యాకులపతియగు మునిశ్రేష్ఠుఁడు చెప్పె. ఇవ్విధముగాఁ జెప్పుచున్న మునిశ్రేష్ఠునకుఁ బదులు జెప్పె. అట్లు బదులుజెప్పి రాజపుత్రుఁడగు రాముఁడు భయమును బొందుచున్న మునిశ్రేష్ఠు నిలుపుటకు సామర్థ్యము లేనివాఁడయ్యె. అంతట నా మునిశ్రేష్ఠుఁడు రాముని సంతోషపఱచి పోయి వచ్చెదనని చెప్పి సమాధానపఱచి మునులతోఁ గూడ నాయాశ్రమమును విడిచిపెట్టిపోయె. అప్పుడు రాముఁడు పోవుచున్న మునీశ్వరులకును, కులపతికి నమస్కారమును జేసి యచ్చోటనుండి పోవుటకు సమాధానపడి తన యందధికమయిన ప్రియముగల మునులయొక్క యాజ్ఞను బొంది మఱియు వారిచేత దెలుపఁబడిన ప్రయోజనముగలవాఁడై పావనమగు తననివా

సస్థానమునకువచ్చె. ప్రభువగు నా రాముఁడు క్షణము సేపు మును లెవ్వరును లేని యాయాశ్రమమును విడువఁజాలకయుండె. అదివఱకు సర్వకాలములయందును రామునితోఁగూడ సంచరించుచున్న తపోవంతులందఱును రామునియొక్క సచ్చరిత్రచేత సంపాదింపఁబడిన సద్గుణములుగలవారై రామునివదలిపోలేక కొంచెము సేపు సంకటమును బొందిరి.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటపదునాలవసర్గము ముగిసెను.

సీతారామలక్ష్మణులు చిత్రకూటపర్వతమును వదలిపెట్టి అత్రిమహాముని ఆశ్రమమునకు బోవుట

ఆవిధముగా మునులందఱును బోయినపిమ్మట రాముఁడు యోచించుచు నానావిధములగు కారణములచేత నక్కడ నివసించుటకిష్టము లేనివాఁడయ్యె. అట్లు సమ్మతము లేనివాఁడై యా రాముఁడు తన బంధువులగు భరతుఁడు మొదలగువారిలనదలితి నేయని దుఃఖమును బొందుచున్నవాఁడగుటవలన నిక్కడ భరతునిఁ జూచితిననియును, ఇక్కడఁ దల్లులను జూచితిననియును, ఇక్కడ పురజనులను జూచితిననియును, జరిగిపోయిన వృత్తాంతమును జ్ఞప్తికిఁ దెచ్చుకొనియె. అట్లుతలఁచి మఱియు నిట్లని యోచించె. మహానుభావుఁడగు భరతుఁడిక్కడకు సైన్యముతోఁగూడ వచ్చినప్పుడు గుఱ్ఱములు, ఏనుగులు మొదలగువాని పెంటికలచేత నీయాశ్రమమంతయు నసహ్యముగాఁ జేయఁబడియె. కాఁబట్టి యిక్కడనుండుట కువిలుగా నుండ లేదని తలఁచె. ఈ కారణముచేత నేయిక్కడనుండుట యుచితముగా నుండ లేదని తలఁచె. మఱియు నిక్కడనుండి వేరొక్క చోటునకుఁ బోవుదమని తలఁచె అంతట సీతాలక్ష్మణులతోఁగూడ నక్కడనుండి బయలువెడలె. అట్లు బయలువెడలి కీర్తిమంతులలోనుత్తముఁడగు రాముడు అత్రిమహామునియొక్క యాశ్రమమునకుఁబోయి యామునికి నమస్కారమును జేసె. అప్పుడు షడ్గుణైశ్వర్య సంపన్నుఁడగు నా యత్రిమహామునియు రామునిఁ జూచి పుత్రునిఁ జూచినపు డానందమును బొందినవిధముగ నానందమును బొందె. అంతట వా రామునకు నాతిథ్యమునిచ్చి సర్వవిధములచేతను జక్కఁగ బూజించి గౌరవించె. పిమ్మట మహానుభావురాలగు సీతాదేవిని, లక్ష్మణునిఁగూడ సత్కరించె. మఱియు నా సమయమునందు అత్రిమహామునితో నరుగుచు వచ్చినదియును, మిగుల వృద్ధురాలును, తనకు భార్యయు నగు అనసూయాదేవిని నిట్లని పిలిచె వీనిని సకలభూతములయందును దయగలవాఁడును, సకలధర్మములను దెలిసినవాఁడును నగు నా యత్రిమహాముని సకలలోకములయందును గౌరవింపఁబడిన యా యనసూయాదేవిని నూరడించి పిమ్మట సీతతో నిట్లనియె.

అమ్మా! జనక రాజపుత్రికా! సీతా! మహానుభావురాలును, తపస్సును జేయుచుండునదియును, నాకు ధర్మపత్నియు నగు నీయనసూయకు నమస్కారమును జేయుము. మఱియు నీయనసూయ నీకాధారముగా నుండునని గ్రహింపుమనియె. మఱియు ఋషులలో నుత్తముఁడగు నత్రిమహాముని యావిధముగాఁ జెప్పి తపోవంతురాలును, ధర్మమును దప్పక సంచరించుచున్నదియు నగు అనసూయయొక్క వృత్తాంతమును జెప్పఁదలఁచి రామునితో నిట్లనియె.

పూజ్యుఁడవగు నో రాముఁడా! పూర్వము పదిసంవత్సరములు అనావృష్టిదోషముచేత లోకమంతయును నాశనమయ్యె. అప్పుడీ యనసూయయొక్క మహాత్మ్యముచేతఁ గందమూలఫలములు సృజింపఁబడియె. మఱియు గంగానది కూడ విశేషముగఁ బ్రవాహముగలదై చేయఁబడియె. ఓ రాముఁడా! మిగుల ఘోరమైన తపస్సును జేయుచుండె. నానావిధములగు నియమములచే నలంకరింపఁబడియె మఱియు నీయనసూయ పదివేలసంవత్సరములు ఘోరమగు తపస్సును జేసె. అట్లు ఘోరమైన తపస్సును జేసి యీ పూజ్యురాలు కలవులు మొదలగు గాఁగల ఉపద్రవములను బోఁగొట్టె. మఱియు నో రాముఁడా! ఈ మహానుభావురాలు పూర్వమొకపర్యాయము దేవతలకొఱకు మిగుల వేగిరపాటుగలదై పది రాత్రులను దనతపోమాహాత్మ్యముచేత నొక్కరాత్రిని గాఁ జేసె. రాముఁడా! ఈ మహానుభావురాలు నీకుఁ దల్లివలెఁ బూజింపఁదగినదై యున్నది. మఱియు సకలభూతములకును బూజింపఁదగినదియును, నమస్కరింపఁదగినదియును, కీర్తిగలదియును, వృద్ధురాలును, సర్వకాలములయందును గోపము లేనిదియును నగు నీయనసూయకు సీతాదేవి నమస్కారములు మొదలగువానిని జేయుట యుచితమని తోఁచుచున్నది. మఱియు నీమహానుభావురాలు గోపము లేనిదగుటవలనను, సర్వకాలములయందును బుణ్యకర్మలనే చేయుటవలనను, కొంచెమైనను అసూయ లేనిదగుటవలనను అనసూయయని యెల్లవారిచేతను బిలువఁబడుచుఁ బ్రసిద్ధిఁ బొందెనని చెప్పుచున్న అత్రిముని మాటలను విని రాముఁడాలాగే చేయించెదనని చెప్పి ధర్మములను గుర్తెఱిఁగిన సీతతో శ్రేష్ఠమగు మాటను జెప్పఁదలఁచి యిట్లనియెను.

రాజపుత్రీ! సీతా! ఈ మహాముని చెప్పినమాటను వింటివి కదా? నీకు శ్రేయస్సు గలుగుటకొఱకుఁ దపోవంతురాలగు అనసూయను శీఘ్రముగఁ బొమ్మనియె. ఇట్లు తన ముక్కిహితమును గోరుచున్న రాముఁడు నీవముగాఁ జెప్పినమా

టనువినిమిథిలాపట్టణమునకధిపతిపుత్రికయగు సీతాదేవిసకలధర్మములను దెలిసినదియును, నత్రిమహామునికిభార్యయునునగు ననసూయాదేవియొద్దకుఁబోయె. పోయినపిమ్మటమహానుభావురాలగునాసీతాదేవి, శిథిలమైనయవయవములుగలదియును, పండిపోయినశరీరముగలదియును, ముసలితనమునుబొందినదియును, ముదిమిచేత నెరిసినతలవెండ్రుకలుగలదియును, సర్వకాలములయందును గడగడవణఁకుచున్నయవయవములుగలదియును, పెద్దగాలికిఁ అరటిచెట్లూగుచున్నవిధముగ నూగుచున్నదియును, పతివ్రతలలోనుత్తమురాలునునగు ననసూయాదేవికిఁ దనగోత్రనామములను జెప్పుచు నమస్కరించె. పూజ్యురాలును, తపోవంతురాలునునగు నా యనసూయాదేవికిట్టి నమస్కారమును జేసినపిమ్మట సీతాదేవి చేతులను ముకుళించుకొని పరమసంతోషముతో నిలుచున్నదె క్షేమమా? యని కుశలప్రశ్ననడిగె. అట్లు నమస్కారమును జేసి కుశలప్రశ్న నడుగుచున్నదియును, మహానుభావురాలును, ధర్మమును దప్పక సంచరించునదియును, నగు సీతాదేవినిఁ జూచి యనసూయాదేవి పరమానందమును బొందియిట్లనియె.

అమ్మా సీతా! నీభాగ్యముచేత నీవుధర్మమును దప్పక సంచరించుచున్నావుగదా? యని యూరడించి మఱియు నిట్లనియె. అమ్మా సీతాదేవీ! నీవు నీబంధువులనందఱను వదలి, దురహంకారమును వదలి, సౌఖ్యమును విడిచిపెట్టి, పదునాలుగుసంవత్సరములు తండ్రియొక్క యాజ్ఞచేత వనవాసమును జేయుటకు వచ్చినభర్తను నిందింపక నీవు భర్తతోఁ గూడ నరణ్యమునకు వచ్చుటను జూడఁగా నాకుఁగూడ మిగుల నాశ్చర్యముగ నున్నది. ఆహా నీవు మంచియదృష్టముగలదానవనియును, పతివ్రతలలోనుత్తమురాలవనియును నెంచెదనని చెప్ప మఱియు నిట్లనియె.

ఓసీతా! "శ్లో॥ నగరస్థో వనస్థో వా పాపో వా యది వాశుభః। యాసాం స్త్రీణాం ప్రియో భర్తా తాసాం లోకా మహోదయాః॥ దుశ్శీలః కామవృత్తో వా ధనైర్వా పరివర్జితః। స్త్రీణామార్యస్వభావానాం పరమం దైవతం పతిః॥ నాతో విశిష్టం పశ్యామి బాంధవం విమృశంత్యహమ్,,॥ లోకములో స్త్రీలకుఁ దమభర్త, యడవియందున్నను, పట్టణమునందున్నను, పాపాత్ముఁడైనను, పుణ్యాత్ముఁడైనను, దుష్టస్వభావముగలవాఁడైనను, ఇష్టమువచ్చినట్లు సంచరించువాఁడైనను, ధనవంతుఁడైనను, దరిద్రుఁడైనను, ప్రియమైనవాఁడే యను సంకల్పముండునో, మఱియు భర్తయే దేవుఁడని తలఁచుచుందురో, యట్టిస్త్రీలు గొప్పసంపదలుగల పుణ్యలోకములకుఁ బోదురు. లోకములో మంచిస్వభావముగల యాఁడువారలకు భర్తయే దైవమనియును, భర్తకంటె దైవము వేరొకఁడు లేదనియును, భర్తకంటె నధికులగు బంధువులుగూడ లేదనియును నాకు సర్వకాలములయందును దోఁచుచున్నదని చెప్పి మఱియు నిట్లనియె.

ఓసీతా! సర్వావస్థలయందును, సర్వకాలములయందును గాపాడుటకుఁ దగినవాఁడును, పూర్వజన్మమునందుఁ జేయఁబడిన తపస్సునకు శాశ్వతమైన ఫలస్వరూపుఁడును నగు పెనిమిటియందలిగుణదోషములను దెలిసికొనఁజాలనివారును, ఇష్టమువచ్చినట్లు యుక్తాయుక్తములను దెలియక పదార్థములను గోరువారును, పరపురుషుల గోరువారును నగు స్త్రీలు గొప్పదగు నపకీర్తిని బొందుదురు. ఇంతియగాక ధర్మభ్రష్టతగలవారై పరలోకమునందు ఘోరనరకముల ననుభవింతురు. మఱియు దుష్కార్యములయందుఁ బ్రవర్తించునట్టి యాఁడువారలుగూడ నుభయలోకములయందును గష్టములను బొందుదురు. అట్లుగాక సకలసద్గుణముల నవలంబించి సంచరించునట్టివారును, పతివ్రతలునునగు స్త్రీలు స్వర్గలోకమునందు సకలసౌఖ్యములను అనుభవించుదురు. ఈలోకమునందు సర్వకాలములయందును సంతోషమును గలుగఁజేయునట్టి కీర్తిప్రతిష్ఠలను బొందుదురు. కాఁబట్టి యో సీతా! నీవు నీభర్తయగు రాముని యాజ్ఞానుసారముగ సర్వకాలములయందును సంచరించుచుండుము మఱియును బతివ్రతలయొక్క నియమములేవిగలవో వానినన్నింటిని దెలిసికొని చక్కఁగాఁ బ్రవర్తింపుము. మఱియు నీభర్తయగు రాముఁడు చేయు ధర్మకార్యములయందు ధర్మముగ సంచరించుదానవగుము. ఇట్లు సంచరించితివేని గొప్పదగు కీర్తిని, ధర్మమును బొందఁగలవు. దానిచే నిహపరలోకములయందు సకలసౌఖ్యములను బొందఁగలవని యా యనసూయాదేవి చెప్పె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటపదియేడవసర్గము ముగిసెను.

సీతాదేవి అత్రిమహామునిభార్యయగు అనసూయాదేవితోఁ దనవివాహవృత్తాంతమును జెప్పుట.

ఇవ్విధముగా ననసూయాదేవి చెప్పినమాటలనన్నింటిని మిగులభక్తిశ్రద్ధలతో విని కొంచమైనను అసూయలేని యాసీతాదేవి యామహానుభావురాలిని బూజించి యేదోవిషయమునడుగఁదలఁచి మెల్లగా మృదుమధురవచనముల నిట్లనియె.

పూజ్యురాలవైన యో యనసూయాదేవీ! స్త్రీలకు భర్తయే గురువని నాకుఁగూడఁ దెలిసియున్నది. కావున నీవు చె

ప్పినసంగతులు నాకుమిగులనాశ్చర్యమును గలిగించుటలేదు. అయినప్పటికినినీయట్టిమహానుభావురాలు నాతోఁబ్రియముగామాటలాడుట చేత నాకుమిక్కిలియాశ్చర్యమును గలిగించుచున్నది. పూజ్యురాలవైనయోయనసూయాదేవీ! నాకుభర్తయగురాముఁడు సన్మార్గమునువదలి దుర్మార్గమునందుసంచరించుచున్నపటికిని భేదబుద్ధినివదలిపూజింపఁదగినవాఁడనుటకు సందేహములేదు. కావుననేనుగాని లేకయితరస్త్రీలుగాని పెనిమిటియందు గుణాగుణవిచారణను జేయఁగూడదు. ఇఁకనుసకలసద్గుణములచేతను గొనియాడఁదగినవాఁడును, మిగులభూతదయయును, పశ్చాత్తాపమునుగలవాఁడును, ఇంద్రియములనుజయించినవాఁడును, దృఢమైనప్రేమగలవాఁడును, ధర్మాత్ముఁడును, తల్లివలెఁబ్రియముగ సంచరించువాఁడును, తండ్రివలెహితమును బోధించువాఁడునునగు రాముఁడు నాకుఁబూజింపఁదగినవాఁడనుటకుసందేహమేమైనఁగలదా? మఱియునీరాముఁడుతనతల్లియగు కౌసల్యాదేవియందుఎటువంటియభిప్రాయముగలవాఁడగునో యటువంటియభిప్రాయముతోడనేయితరులగు సవతితల్లులయందుఁగూడఁబ్రవర్తించును. ఇంతయగాకతనచెంద్రియగు దశరథమహారాజుచేత నెప్పుడో యొక్కమాటు చూడఁబడినస్త్రీలయందుఁగూడఁదల్లులయందువర్తించు విధముగానే ధర్మాత్ముఁడగుసీరాముఁడు దురహంకారమునువదలిసంచరించును. ఓయనసూయాదేవీ! నేనునాపెనిమిటియగుసీరామునితోఁగూడ జనులులేనిదియును, మిగులభయంకరమైనదియునునగు నీయరణ్యమునకువచ్చునప్పుడు మాయత్తయగుకౌసల్యాదేవి చెప్పినపతివ్రతాధర్మములను మరవకసర్వకాలములయందును దలఁచుకొనుచున్నాను. మఱియును బూర్వమగ్నిసాక్షిగావివాహమును జేసికొనుచున్నసమయమునందు మాతల్లి చెప్పిన పతివ్రతాధర్మములను గూడనామనస్సునందునిల్పుకొనియున్నాను. ధర్మముగసంచరించునట్టియోయనసూయాదేవీ! యిప్పుడుఆధర్మములన్నియునీవాక్యములచేతఁగ్రొత్తగాఁజేయఁబడినవి. భర్తకు శుశ్రూషను జేయుటకంటెస్త్రీలకుయితరమగుధర్మకార్యమేదియును లేదు. సావిత్రీదేవిభర్తకుశుశ్రూషనుమిగులభక్తితోఁజేయుటవలననిప్పటికిని స్వర్గలోకమునందుఁగొనియాడఁబడుచుసుఖములననుభవించుచున్నది. అటుల నేనీవునుభర్తృశుశ్రూషయందలి ప్రియముచేత సర్వమునందునివసించుమిగులమహిమగలదానవై తివి. ఇంతయగాకనీవుస్వర్గమునందుఁగూడఁగొనియాడఁదగినదానవును, లోకములోనిస్త్రీలయందరిలోపలనుగొనియాడఁదగినదానవును నైతివి. "రోహిణీదేవి ముహూర్తమాత్రమునను భర్తనువదలియుండలేనివిధముగఁ" పూజ్యురాలవైననీవుగూడభర్తను వదలకసంచరించుచున్నావు. ఇవ్విధముగానే, యనేకమందిస్త్రీలుభర్తయందుదృఢమైన ప్రియముగలవారును, మిగుల భక్తితో శుశ్రూషను జేసినవారును, నైతమపుణ్యావశముచేత దేవలోకమునందుఁ బూజ్యులైయున్నారని సీతాదేవిచెప్పె. ఇవ్విధముగాసీతాదేవిచెప్పినమాటనువిని అనసూయాదేవిసంతోషమునుబొందినదై సీతనుమిక్కిలిసంతోషపఱచుచు శిరస్సునందు ముద్దునుబెట్టుకొని యాసీతతోనిట్లనియె.

అమ్మా, సీతా! నానావిధములగు నియమములచేతనాకుగొప్పదగుతపోమాహాత్మ్యముగలదు. కావుననోసీతా! నేనాతపోబలమునాశ్రయించియుండుటవలననీకిష్టమైనవరములనుగోరుమయిచ్చుచున్నాను. కాఁబట్టిచిరునగవును జూపుచుండెడిమోముగలయోసీతా! నీమాటమిక్కిలియుచితముగానున్నవి. నీమాటకుమిక్కిలిసంతోషమునుబొందితిని. కావుననీకేమిప్రియమును జేయవలయునో చెప్పుమనియె. ఆప్రకారముగాఁజెప్పుచున్న యనసూయాదేవియొక్కమాటలనువిని యాసీతాదేవి చిరునగవుచేతనవ్వి తపస్సుయొక్కబలముతోఁగూడుకొనిన యాయనసూయాదేవితో, ఓతల్లీనీమాటచేతనే సంతోషముగలుగుచున్నది. ఇంతటిమాట చెప్పుటయేచాలును. మఱియేమియునక్కరలేదనియె. అవ్విధముగాసీతాదేవిచెప్పినమాటనువినిసకలధర్మములను దెలిసినయాయనసూయాదేవి పరమానందమునుబొందినదై యిట్లనియె.

బిడ్డా! సీతా! నీసంతోషమును సఫలమునుగానేనుజేయుచున్నాను ఓసీతా! దివ్యమైనదియును, శ్రేష్ఠమైనదియును, నగనీపూలమాలికను, వస్త్రమును, ఆభరణములను, మిగులవెలగలదియును, శరీరమునందుఁబూసికొనుటకుఁదగినదియును, నగునంగరాగమును, నిచ్చెదను. వీనినిదీసికొనుము. ఓసీతా! నాచేతనివ్వఁబడిన యీయాభరణములు మొదలగునవియన్నియునునీయవయములకు నధికముగుకాంతినిగలిగింపఁగలవు. మఱియునీయాభరణములుమొదలగునవి నీశరీరమునకుఁదగియున్నవి. ఇంతయగాకయివియెప్పటికిని చెక్కు చెదరకయుండఁగలవు కావునజనకచక్రవర్తికిఁగుమార్తెవైనయోసీతా! సర్వోత్తమమైనయీలేపనద్రవ్యమును నీశరీరమునందుఁ బూసికొనినదానవై "లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువుయొక్క యవయములకుశోభను, మనస్సునకుసంతోషమునుగలుగఁజేసినవిధముగ" నీవుగూడనీభర్తయొక్కశరీరమునకుశోభను, మనస్సునకుసంతోషమునుగలుగఁజేయఁగలవు. కావునవీనినిగ్రహింపుమనియె అంతటనాసీతాదేవియనసూయాదేవిచేత ప్రీతితోనివ్వఁబడినవి

యును, మిగుల శ్రేష్ఠములైనవియునగు వస్త్రమును, మైపూతను, ఆభరణములను, పూలమాలికలను, మిగుల వినయముతోఁ దీసికొనియె. అట్టి కీర్తివంతురాలగు సీతాదేవి యాయనసూయాదేవి చేతఁ బ్రీతితో నివ్వఁబడిన పూలమాలికలు మొదలగువానిని దీసికొని శరీరమునందలంకరించుకొని చేతులను ముకుళించుకొని తపస్సే ధనముగాఁ గల యాయనసూయాదేవి యొక్క సమీపమునందు వినయముతోఁ గూర్చుండె. అట్లు తన సమీపమునందుఁ గూర్చున్న సీతాదేవిని జూచి దృఢమైన వ్రతముగల యాయనసూయాదేవి యొకానొక కథను నడుగఁదలఁచినదై యిట్లనియె.

బిడ్డా! సీతా! మిగులఁ గీర్తివంతుఁడును, రఘుకులమునందుఁ బుట్టినవాఁడునునగు రాముఁడు నిన్ను స్వయంవరము చేత వివాహమును జేసికొనెనని నేను లోకులు చెప్పుకొనుట వలన వినియుంటిని. ఆ కథను సంపూర్ణముగా నీవలన వినవలయునని కోరిక గలిగియున్నది. కాఁబట్టి మిథిలానగరమునకధిపతియగు జనకచక్రవర్తికిఁ గూతురవైనయో సీతా! నీవివాహమునందు జరిగిన సంగతిని సర్వమును నాకుఁ జక్కఁగాఁ దెలుపుమనియె. ఇవ్విధముగా అనసూయాదేవి యడిగిన మాటను విని యా సీతాదేవి, ధర్మయుతముగ సంచరించుచున్న యాయనసూయాదేవిని వినుమని సర్వమును సంపూర్ణముగాఁ జెప్పఁదలఁచి యిట్లనియె.

తల్లీ! అనసూయాదేవీ! సకలధర్మములను జక్కఁగాఁ దెలిసిన జనకమహారాజు మిథిలాపట్టణమునకధిపతియైయుండె. ఆ జనకచక్రవర్తి క్షత్రియకులమునకుఁ దగిన ధర్మమును దప్పక న్యాయముగా భూమండలమును సర్వమును బాలించుచుండె. అట్లు ధర్మయుతముగఁ బాలించుచు నొకనాఁడు యజ్ఞమును జేయఁదలఁచినవాఁడై యజ్ఞమును జేయుటకుఁ దగినట్లు మండలాకారముగా నొక్క చోట భూమిని దున్నుచుండె. అప్పుడు నేను భూమిని బ్రద్దలు సేసికొని పుట్టి యా జనకచక్రవర్తికిఁ గూతురనైతిని. అప్పుడు భూమియందుఁ జల్లుచున్న విత్తనములను పిడికిలియందుఁ బెట్టుకొనిన యా జనకచక్రవర్తి దుమ్ము చేత వ్యాప్తమైన సర్వావయవములు గల నన్నుఁ జూచి మిగుల నాశ్చర్యమును బొందె. అంతనతఁడు సంతానము లేనివాఁడగుట చేత మిగులఁ బ్రియముతో నన్నుఁ గ్రహించి నన్నుఁ దొడమీఁదఁ గూర్చుండఁ బెట్టుకొని యీ చిన్నది నాకుఁ గూతురని యనియె. అట్లు చెప్పిన పిమ్మట నాయందధికముగు ప్రేమనుంచె. ఆ సమయమునందు నన్నుద్దేశించి యాకాశమునుండి యొక మాట వినఁబడియె. ఏమనిన, ఓ జనకచక్రవర్తీ! యీ చిన్నది నీకు ధర్మపుత్రికయైనది సామ్యము లేనిది, దేవసంబంధమైనది. అని నాకవాక్యము వినఁబడియె. ఆమాటను వినిన పిమ్మట ధర్మాత్ముఁడును, నాకుఁ దండ్రియును, మిథిలానగరమునకధిపతియునునగు జనకచక్రవర్తి యధికము సంతోషించినవాఁడై నన్నుఁ గుమార్తెనుగా గ్రహించి నిగు విస్తారమైన యభివృద్ధిని బొందెను. పిమ్మట నన్నుఁ దనకు మిగుల యిష్టమైన గుణములు గలదియును, భార్యలలో జ్యేష్ఠురాలును, పుణ్యకర్మ చేతఁ గూడఁ బెద్దదియునునగు భార్య చేతికిచ్చె. అంతట నా మహనీయురాలు అధికమైన సంతోషముగలదై నన్ను బహువిధముల "గారాబుబిడ్డను బెంచినవిధముగ" బెంచె. అవ్విధముగ మా యమ్మ చేత మిగులఁ బ్రియముతో బెంపబడినదాననై వృద్ధినిఁ బొందితిని. అంతటఁ గొంతకాలమునకుఁ బురుషుని యొక్క సంయోగము లేనిది భరించుటకు నలవిగానిదగు యుక్తవయస్సుగలదాననైతిని. అట్లు నిండు యౌవనముగల నన్నుఁ జూచి మా తండ్రియగు జనకచక్రవర్తి "ధనము నశించిపోవుట వలన నిర్ధనుఁడగు పురుషుఁడు వ్యసనమును బొందెడు విధముగ" వ్యసనమును బొందె. (అనఁగా నేనీ పుత్రికకుఁ దగిన భర్తను నెక్కడకుఁ బోయి తెత్తునని విచారమును బొందెనుట) మఱియు నో తల్లీ! అనసూయాదేవీ! "శ్లో॥ సదృశాచ్చాపకృష్టాచ్చ లోకే కన్యాపితా జనాత్। ప్రధర్షణామవాప్నోతి శక్రేణాపి సమోభువి,, లోకములో ఆడుబిడ్డలుగలవాఁడు దేవేంద్రునితో సమానుఁడైనప్పటికిని తన కుమార్తెను వివాహమును జేసికొనినవాఁడు తనతో సమానుఁడైనను, తనకంటెఁ దక్కువవాఁడైనను, నతని వలనఁ దిరస్కరింపఁబడును. మఱియు అల్లుని యొక్క బంధువులు గూడఁ దిరస్కరించుదురు. ఇటువంటి పరిభవకాలము దగ్గరికు వచ్చినదని తెలిసికొనియును నా జనకచక్రవర్తి "ఓడ లేనిది సముద్రములోనివాఁడు గట్టుకు రాఁజాలక విచారమును బొందువిధముగఁ" దగిన యల్లుఁడు నిమిడు వడవ దొరకకపోవుట వలన విచారసముద్రమున మునిగియుండినవాఁడయ్యె. మఱియు నేను అయోనిజురాలనని తెలిసికొనినవాఁడగుట వలన నా సత్కులమునందలి పుట్టువు మొదలగువాని చేతను, వయస్సు సౌందర్యము మొదలగువాని చేతను దగినవాఁడగు భర్త నాకెక్కడ దొరకునో, యని మిగుల విచారమును బొందియును, తగిన భర్తను గానఁడయ్యె. ఇవ్విధముగా విచారించుచున్న వాఁడును, మిగుల బుద్ధిమంతుఁడును, నగు జనకచక్రవర్తికిఁ దన కుమార్తెను స్వయంవరమును జేయవలయునని యడు బుద్ధి పుట్టె. అంతట నా జనకచక్రవర్తి గొప్పదగు యజ్ఞమునందు మహాత్ముఁడగు వరుణదేవుని చేత దేవతల ప్రేరేపణ వలనని వ్వఁబడినదియును, శ్రేష్ఠమయినదియును, నాశము లేని బాణములుగల యంబులపొదులు గలదియును నగు ధనుస్సును, మనుష్యుల చేత నెవ్వరి చేతను, నధికమయిన ప్రయత్నము చే

తేఁగూడఁ గదలించుటకు శక్యముగాదనితలఁచె. మఱియు నీధనుస్సు స్వప్నమునందుఁగూడ మానవులచేత గదలించుటకు శక్యముగాదనియెంచె. ఇవ్విధముగా నెంచి నాకుఁదండ్రియును, సత్యముగమాటలాడువాఁడును, నగు జనకచక్రవర్తి ముందుగా రాజులనందఱను బిలిచి యారాజులందఱును వినుచుండఁగనిట్లనియె, ఓరాజశ్రేష్ఠులారా! ఈధనుస్సును ఏమానవుఁడెత్తినారినమర్చి బాణము నెక్కునుబెట్టఁగలఁడో యట్టివాఁడు నాకుమార్తెయగుసీతకు పెనిమిటి గాఁగలఁడనియె, ఇందుకేమియును సందేహములేదనియునుగూడఁబలికె. అంతటననేకులగు రాజులువచ్చి పర్వతమువలెనున్నదియును సర్వోత్తమమైనదియును,నగు నాధనస్సునుజూచి దానినిగదలించుటయందుఁ గొంచెమైనను సామర్థ్యములేనివారై నమస్కారమును జేసి తమనివాసములకుఁ బోయిరి. అటుపిమ్మటఁ జిరకాలమునకు గొప్పదగు తేజస్సుగలవాఁడును, రఘుకులమునందుఁబుట్టినవాఁడును,నగు నీరాముఁడు విశ్వామిత్రునితోఁగూడ యజ్ఞమునుజూచుటకువచ్చె, అట్లువచ్చి సత్యమైనపరాక్రమముగలవాఁడును, తమ్ముఁడగు లక్ష్మణునితోఁగూడుకొనినవాఁడును,నగునీరాముఁడును, ధర్మాత్ముఁడగు విశ్వామిత్రమహర్షియును, నాతండ్రియగు జనకచక్రవర్తిచేఁ జక్కఁగాఁబూజింపఁబడిరి. అంతట విశ్వామిత్రమహర్షి మాతండ్రియగు జనకచక్రవర్తితోనిట్లనియె, ఓజనకమహారాజా! రామలక్ష్మణులనియెడు పేరులుగల యీబాలురిరువురును, దశరథమహారాజునకుఁబుత్రులు. కావున వీరిద్దఱును నన్నదమ్ములు ఈయిద్దఱును నీయొద్దనున్నధనుస్సును జూడవలయునని యెడుకోరికతో నాతోఁగూడవచ్చియున్నారు. కాఁబట్టి రాజపుత్రుఁడగునీ రామునికొఱకు దేవసంబంధమైననీ ధనుస్సును జూపుమనియె. ఇవ్విధముగా బ్రాహ్మణోత్తముఁడగు నావిశ్వామిత్రమహర్షి చెప్పిన వాక్యమునువిని యాధనుస్సును దీసికొనివచ్చె. అంతటఁబరాక్రమవంతులలో నుత్తముఁడగు రాముఁడు క్షణమాత్రములో నాధనుస్సు నెత్తియల్లె త్రాడునమర్చి యతిశీఘ్రముగ నాకర్షించె. అట్లు మిగులవేగముతో నాధనుస్సును లాగుచుండగా అదినడిమికి రెండుతునుకలై క్రిందపడియె. అప్పుడుపిడుగుపడినప్పుడుగలిగెడు ధ్వనివలె నెల్లవారలకును భయమునుగలిగించెడు నొకగొప్పధ్వనిగలిగె. అటుపిమ్మట సత్యమునందభిప్రాయము గలవాఁడును, నాకుఁదండ్రియును, నగు జనకచక్రవర్తి నన్నురామునికివ్వవలయునని నిశ్చయించినవాఁడై సర్వోత్తమమగు జలపాత్రను దెప్పించి దానమును జేయుటకుయత్నించె. అప్పుడు రాముఁడునన్ను బరిగ్రహించుటకిష్టపడనివాఁడయుటనియె, రాజేనా?! ఈవిషయమును ముందుగా మాతండ్రియగుదశరథమహారాజునకుఁ దెలియఁజేయక నేనుబరిగ్రహింపను కాఁబట్టి మాతండ్రియగు దశరథమహారాజునకుఁ దెలిపినపిమ్మట నేను నీకుమార్తెను బరిగ్రహించెదననియె, అంతటను తండ్రియగు జనకుఁడు ముసలివాఁడును, మాకు మామగారును, నగుదశరథమహారాజును బిలిపించి యీవిషయమును సర్వమును దెలిపి యాత్మతత్వమును జక్కఁగా నెఱిఁగిన యీ రామునకునిచ్చె. పిమ్మట నాకుఁ జెలియలును, చూచుటకుమిగులనిష్టపడదగినదియునునగునూర్మిళను, లక్ష్మణునకు భార్యనుగానిచ్చె. అప్పుడు లక్ష్మణుఁడుగూడ నూర్మిళను బెండ్లియాడె. ఇవ్విధముగా నేను స్వయంవరమునందు మాతండ్రియగుజనకుని చేత రామునకివ్వఁబడితిని. అది మొదలుకొని పరాక్రమవంతులలో నుత్తముఁడగు నీరామునకుధర్మమునుదప్పక శుశ్రూషను జేయుచున్నాననియె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటపదునెనిమిదవసర్గము ముగిసెను.

సీతారామలక్ష్మణులు మునులచేనాజ్ఞ దీసికొనిదండకారణ్యమున బ్రవేశించుట.

సకలధర్మములను జక్కఁగాఁదెలిసిన యనసూయాదేవి సీతచేతఁ జెప్పఁబడినదియును, మంగళకరమైనదియును నగుకథనువిని పరమానందమునుబొందినదై యాసీతాదేవిని బాహువులచేత నాలింగనమును జేసికొని శిరస్సును ముద్దుపెట్టుకొనియిట్లనియె, ఓసీతా! నీవునీస్వయంవరవృత్తాంతమును సర్వమును, మిగుల మృదువులగునక్షరములుగలపదములతో బహువిచిత్రముగాఁ జెప్పితివి, కావునజరిగినదిజరిగినట్లు నీచేతఁ జెప్పఁబడిన స్వయంవరవృత్తాంతము నాచేతఁజక్కఁగా వినఁబడినది, మనోహరముగ మాటలాడునట్టి యోసీతా! నీచేతఁ జెప్పఁబడిన యీకథచేత నేనునిశ్చయముగా సంతోషమును బొందుచున్నానని చెప్పి మఱియునిట్లనియె ఓసీతా! యిప్పుడు అధికమగు కాంతిగల సూర్యుఁడు మంగళకరమగు రాత్రినిసమీపమునకుఁదెచ్చి యస్తమయమును బొందె. మఱియునోసీతా! పక్షులన్నియును బగలంతయును, భోజనముకొఱకుఁదిరిగి దిరిగి యీసంధ్యాకాలమునందువచ్చి తమతమగూండ్లయందుఁబ్రవేశించి నిద్రకొఱకు ధ్వనిచేయుచున్నవి. మఱియునిందలిమునులందఱును స్నానమును జేసి యుండుట చేతఁదడసిన శరీరములుగలవారును, నీళ్లచేతనిండింపఁబడిన కుండలను భుజములమీఁద బెట్టుకొనినవారును, ఉదకముచేతఁదడపఁబడినఁ నారచీరలుగలవారును, నయొక్కటిగాఁ జేరి సంచరించుచున్నారు, మఱియు మునులందఱును అగ్నిహోత్రములయందు హోమములను జేయుచుండఁగా వాయువుచేత నెగురఁగొట్టఁబడిన పొగ,

పావురపు పిట్టలయొక్క శరీరమునందలి కాంతివంటి కాంతి గలదై కనఁబడుచున్నది. పావనమగు నీధూమమును జూడుము. ఇదివఱకిక్కడనుండు వృక్షములు పలుచని యాకులుగలవైనప్పటికిని యిది సంధ్యాకాలమగుటచేత దట్టముగానున్న యాకులుగల వానివలెఁ గనబడుచున్నవి. మఱియును జెట్లు మొదలగునవి లేక బయలుగానున్న ప్రదేశమునందుఁగూడ దిక్కులు తెలియడములేదు. మఱియునో సీతా! రాత్రులయందు సంచరించునట్టి జంతువులు సర్వస్థలములయందును సంచరించుచున్నవి. తపోవనమునందలి మృగములన్నియును వచ్చి తిన్నెలయొక్క సమీపమునందు పండుకొనుచున్నవి ఓ సీతా! నక్షత్రములచేతఁ జక్కగా నలంకరింపఁబడినదై రాత్రివచ్చినది. చంద్రుఁడుదయించి యంతరిక్షమునందుఁ గనఁబడుచున్నాఁడు. చూడుము వెన్నెలయిగుల మనోహరముగా వచ్చియున్నది. నీకాజ్ఞనిచ్చెదను నీవు రామునితోఁ గూడ సంచరించుదానవగుము నీవు నీస్వయంవర మహోత్సవమును రమ్యముగాఁ జెప్పుచుండుటచేతనింత సేపు వినోదముగాఁ గాలమును గడిపితిని. ఓసీతా నేనిచ్చిన యాభరణములు మొదలగువానిని నాయెదుటనే యలంకరింపుము. ఓబిడ్డా! నీవీదివ్యములగు సొమ్ములనుధరించి నాకుఁ బ్రియమును జేయుమనియె. అంతట దేవతాస్త్రీతో సమానురాలైనయా సీతాదేవి పూలమాలికలు మొదలగువానిని ధరించి యాయనసూయాదేవికి నమస్కారమును జేసి యామెయాజ్ఞను బొంది రామునకభిముఖముగాఁ బోయె. ఆప్రకారము దివ్యములగు పూలమాలికలు మొదలగువానిచేత నలంకరింపఁబడి తనయొద్దకువచ్చుచున్న సీతను చక్కగా మాటలాడువారలలోనుత్తముఁడగు రాముఁడు చూచె, చూచి తపోవంతురాలగు ననసూయాదేవిచేత మిగులఁ బ్రియముతోఁ నివ్వఁబడినవని తెలిసికొని పరమానందమును బొందె. అంతట నాసీతాదేవి రామునియొద్దకుఁ బోయి తపోవంతురాలగు అనసూయాదేవిచేత మిగులఁ బ్రియముతో నీపూలమాలికలు మొదలగునవి యివ్వఁబడెనని తెలిపె. ఆవృత్తాంతమును మహారథులగు రామలక్ష్మణులిరువురును, మానవులయందు లేనటువంటి సుగుణజాలములుగల సీతనుజూచి పరమానందమును బొందిరి. అంతటఁ జంద్రునివంటి మోముగల రాముఁడు ఆవనమునందలి మునులచేతఁ జక్కగాఁ బూజింపఁబడినవాఁడై యా రాత్రియంతయును నక్కడనే నివసించె. అవ్విధముగ నా రాత్రియంతయును గడచిపోయినపిమ్మట మానవోత్తములగు రామలక్ష్మణులిరువురును, స్నానమును జేసి యగ్నికార్యములు మొదలగు నిత్యకర్మలను దీర్చికొనియున్నవారును, వనములయందు సంచరించుచున్నవారునునగు మునులను నీవనమునందలి విశేషములేమియనియును, మేముపోయి వత్తుమాయనియును నడిగిరి. అంతట నాయరణ్యమునందు సంచరించుచున్నవారలును, తపోవంతులును, ధర్మముగ సంచరించువారలునునగు మునులిట్లనిరి. ఓరాముఁడా! ఈవనమంతయును క్రూరులగు రాక్షసులు సర్వకాలములయందును సంచరించుచుందురు, మఱియును, రఘుకులమునందుఁ బుట్టినయో రామచంద్రా! ఈవనమునందెప్పుడును బురుషులను దినువారును, నానావిధములగు రూపములుగలవారును, నగు రాక్షసులు తిరుగుచుందురు, మఱియునో రామా! రక్తమే యాహార పదార్థముగాఁగల క్రూరమృగములుగూడ ననేకములీయరణ్యమునందు సంచరించుచుండును, రఘుకులోద్భవుఁడవైన యో రాముఁడా! ఈవనమునందలి రాక్షసులును, క్రూరమృగములును, ఉచ్ఛిష్టపదార్థము దొరికినను, మదించిన మానవుఁడు లభించినను, తపోవంతుఁడు దొరికినను, ధర్మమార్గమును దప్పక సంచరించువాఁడు లభించినను భక్షింతురు. కావున నీరాక్షసులను క్రూరమృగములను సంహరించి మమ్ముల నందఱను గాపాడుము, రాముఁడా! ఈమార్గము ఋషులందఱును ఫలమూలములు మొదలగు పదార్థములను దెచ్చికొనియెడు మార్గము. నీవీమార్గమునుబట్టిపోయి మిగుల భయంకరమైనదియును, సామాన్యజనులచేతఁ బ్రవేశించుటకుఁ దలవిగానిదియును, నగు వనమునందుఁ బ్రవేశింపుము. ప్రవేశించి మమ్ములఁ గాపాడుమని చెప్పి తపోవంతులగు నాబ్రాహ్మణులందఱును జేతులను ముకుళించుకొని రామునకు మేలుగలుగునని యాశీర్వచనాదులను జేయుచుఁ బ్రార్థించిరి. అట్లు మునులచేత నాశీర్వదింపఁబడినవాఁడును, శత్రువులను దపింపఁజేయువాఁడునునగు రాముఁడు సీతాలక్ష్మణులతోఁ గూడ "సూర్యుఁడు మేఘమండలమునందుఁ బ్రవేశించినవిధముగ" నా యరణ్యమునందుఁ బ్రవేశించె.

ఇట్లు శ్రీమదయోధ్యాకాండమునందలి నూటపందొమ్మిదవ సర్గము ముగిసెను

ఇట్లు సకలకళాకలాప దురంధరుఁడును- బరూరు - సీతారామశాస్త్రితనూభవుఁడునునగు
బరూరు - త్యాగరాయశాస్త్రిచే రచియింపఁబడిన యాంధ్రవచనకావ్య
శ్రీమద్వాల్మీకిరామాయణమునందు అయోధ్యాకాండము-ముగిసెను.

శ్రీ రామచంద్రార్పణమస్తు.



DIGITAL LIBRARY OF INDIA

Hosted by
International Institute of Information Technology, Hyderabad

Declaration to be given by the Author/Publisher to D
In-copyright books.

To
The Digital Library of India,
IIIT, Hyderabad

Name of the Author/Publisher: S.B.P.B.K.Sat

Address: Kapileswarapuram
E.G. Dist

City:
State: A.P.
Phone no:
Email:

We are happy to grant permission to Digital Librar
scan all the books published by our organization / writter
permission in this letter also authorizes and grants an N
right to the Digital Library of India to scan, digitize and c
books published by the said publisher / Author in the DLI/
with out any financial implications from DLI

We will continue to retain the copyright for the bo
can make it free to the read for the general public.
provide the above contact information for anyone wishin
the physical book from us.

SL.NO	TITLE	LANGUAGI
1	శ్రీమద్వాల్మీకి రామాయణం ఉత్తరకాండం	TELUGU
2	" " అయోధ్యాకాండం, బాలకాండం	"
3	" " అరణ్య, కిష్కింధ, సుందరకాండం	"
4	" " సుందరకాండం	"
5	" " యుద్ధకాండం	"
6	కబీరుదాసు చరిత్రము	"
7	తిరుప్పావు	"

PS: please add separate sheet for all your titles.

Sincerely,

Signature: [signature] 8/9/08

Name: S.B.P.B.K.SATYANARAYA

Designation: KAPILESWARAPURA

Company: E.G.Dist. A.P.

Date: 8.9.2008